# చరిత్ర

## ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర

ఖండాలు : I – III

BRAOU

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

**2004**

# రచయితల బృందం

**సంపాదకుడు**

ఆచార్య వి. రామకృష్ణ

**సహ సంపాదకులు**

ఆచార్య వి. రామకృష్ణారెడ్డి

కుమారి ఇ. సుధారాణి

**రచయితలు**

ఆచార్య బి. కేశవనారాయణ

ఆచార్య పి. రామలక్ష్మి

శ్రీ ఎ.వి. కోటిరెడ్డి

115060
27-4-05

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No... 115060
Date..... 27.4.2005
Call No ..... 954

**ముఖచిత్రం**

చంద్ర

954 CHE

BRAOU

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్.

ప్రథమ ముద్రణ : 1997 2004

© 1997 డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్నైనా ఉపయోగించదల్చుకొంటే, విశ్వవిద్యాలయ అనుమతిని పొందాలి. ఈ పుస్తకం విశ్వవిద్యాలయ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ఒక భాగం.

పాఠ్య ప్రణాళిక మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో ఉన్నాయి.

ఇతర వివరాలకు : డైరక్టర్ (అకడమిక్) డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం, రోడ్ నెం. 46, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500 33. ఆం. ప్ర.

Lr. No. 454/Dr.BRAOU/DMP/PTG/F.No.28/J.No. 267/07-01-04 Qty. : 200 Books

Printed at Kesava Art Printers, Red Hills, Lakdi-ka-pool, Hyd-4. Ph : 23325404 (Book

# పరిచయం

మానవుని నిరంతరాభ్యుదయాన్వేషణ కృషిలోని అనుభవాల సంపుటీకరణమే చరిత్ర. ఇటీవలి కాలంలో, చరిత్ర పరిశోధనలో సాంప్రదాయబద్ధమైన రాజకీయ చరిత్ర నుండి సామాజిక చరిత్ర వైపు దృష్టి మరలుతూ వచ్చింది. భారతదేశ సామాజిక చరిత్ర మానవ జాతి చరిత్రలో అత్యంతాకర్షణీయమైన ఘట్టం. బ్రిటిష్ పాలనలో భారతదేశ సమాజంలో కల్గిన మార్పులవల్ల, భారతదేశం ఆధునీకరణకు నాంది పలకడం జరిగింది. ప్రాక్ పశ్చిమ పరస్పర ప్రభావ సమ్మేళనానికి భారతదేశం కేంద్రమైంది. పాశ్చాత్య విధానాలు భారతదేశ ఆశయ సిద్ధాంత, దృక్పథాలకు భిన్నమైన దృక్పథాల్ని సవాలుగా తెచ్చాయి. శతాబ్దాల కాల గమనంలో రూపు దిద్దుకొని, భారతదేశ సామాజిక వ్యవస్థలో అంతర్లీనమైన బలహీనతల్ని గుర్తించి, నూతన దృక్పథాల నుండి సమాజాన్ని పరీక్షించి, వలస సంస్కృతి నెదిరించడానికి, సమకాలీన సమాజాన్ని సంస్కరించడానికి సాంఘిక సంస్కరణోద్యమం ఆవశ్యకమైంది. భారతదేశ చరిత్రను సమగ్రంగా అర్థంచేసుకోవాలంటే, సామాజిక చరిత్ర అధ్యయనం అవసరం.

చరిత్రలో ద్వితీయ సంవత్సర స్నాతకోత్తర పాఠ్యాంశాలను అధ్యయనం చేసే, డా. బి. ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ విద్యార్థులకు ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర కోర్స్‌గా రూపొందించబడింది. ఆంగ్లేయుల పాలన నాటి సామాజిక వ్యవస్థ రూపురేఖలు, మతం, విద్య, సామాజిక ఆచారాలు, ఆధునిక పాశ్చాత్య భావజాల ప్రభావం వైజ్ఞానిక మేల్కొల్పుగా మొదలై, నైతిక శక్తిగా మారి జాతీయ జాగృతి కల్గించిన సాంస్కృతిక పునరుజ్జీవనం, సామాజిక వ్యవస్థను, మతాన్ని, దురాచారాల నుండి ప్రక్షాళనం చేసిన సంస్కరోణద్యమాలు, సామాజిక మార్పును విశ్లేషించడమైంది.

ఈ కోర్స్‌లో మొత్తం ఆరు ఖండాలు, ఇరవై మూడు భాగాలున్నాయి. పఠనా సౌలభ్యం కోసం దీన్ని రెండు పుస్తకాలుగా ముద్రించడమౌతూంది. మొదటి పుస్తకంలో మొదటి మూడు ఖండాలకు సంబంధించిన పదమూడు భాగాలను చేర్చడం జరిగింది. వీటిలో 18వ శతాబ్దపు సామాజిక, మత, విద్యా వ్యవస్థ తీరుతెన్నులు, పశ్చిమ దేశాల నూతన భావనల సైద్ధాంతిక ప్రభావం, ఆధునీకరణను సుగమం చేసిన పాశాత్య విద్య, నూతన సంస్థలావిర్భావం, కరడుగట్టిన దురాచారాల్ని రూపుమాపడాన్కై చేసిన సామాజిక చట్టాలు, ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించి, జాతీయ స్ఫూర్తి నిచ్చిన పత్రికా రంగ అభివృద్ధి , భారతదేశ సాంస్కృతిక, వైజ్ఞానిక అంతర్లీనతలు, నూతన 'స్వేచ్ఛాపిపాసిత భావాలైన హేతు వాదం, మానవతా వాదం, ప్రత్యక్ష జ్ఞాన వాదం, సార్వత్రిక వాదాల నేపథ్యం, విశ్లేషణలు సమగ్రంగా చర్చించడమైంది.

రెండో పుస్తకంలో చివరి మూడు ఖండాలకు చెందిన పది భాగాలున్నాయి. తరతరాలుగా మతాలలో పేరుకు పోయిన దురాచారాలు, కర్మకాండలు, మూఢ నమ్మకాలను నిర్మూలించి, వ్యక్తి స్వేచ్ఛకు, ఆధునిక లౌకిక దృక్పథానికి దారిచూపిన మత సంస్కరణోద్యమాలు, సంస్కర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులు, ప్రజల్లో పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనాలైన సంఘ సంస్కరణోద్యమాలు, పితృస్వామ్య వ్యవస్థలో అనేక దురాచారాలకు లోనై అణచివేయబడి, సంస్కరణోద్యమాలకు కేంద్ర బిందువైన మహిళా విమోచనోద్యమాలు, సాంఘిక పీడనకు పర్యాయ పదమైన కుల వ్యవస్థ, కులం పేరిట యుగయుగాలుగా బడుగు వర్గాల వారిని బానిసత్వపు కోరలకు బలి చేసిన అస్పృశ్యతా విధానం, వారి అభ్యున్నతికై పాటుపడిన సంస్కర్తల కృషి, ఆధునిక కాలంలో మారుతున్న సామాజిక దృష్టి ఫలితంగా సామాజిక సంస్థలు, వ్యవస్థల్లో కల్గిన సామాజిక మార్పు, చైతన్యం వివరించబడ్డాయి. వీటి ద్వారా, ఆధునిక పాశ్చాత్య భావ జాలం ప్రభావంగా భారతీయ సామాజిక చట్రంలో వచ్చిన మౌలిక మార్పులు, నవీన దృష్టి, పునరుద్ధరణ, పురోగమనం లక్ష్యాలుగా సాగిన సంస్కరణోద్యమాలు, తత్ఫలితంగా జరిగిన సామాజిక మార్పుపై విద్యార్థులు సరైన అవగాహన పొందగలరని ఆశిస్తున్నాం.

ఆధునిక భారతదేశ సామాజిక చరిత్రలోని వైరుధ్యాలు, సంక్లిష్టతలను వాస్తవిక, శాస్త్రీయ దృష్టితో విశ్లేషించిన ఈ పాఠ్య భాగాలను చదివి, విద్యార్థులు ప్రయోజనాన్ని పొందగలరని విశ్వవిద్యాలయం ఆశిస్తోంది.

BRAOU

BRAOU

# విషయ సూచిక


పుట నెం.

**ఖండం - I : 18వ శతాబ్దంలో భారతదేశ సామాజిక చరిత్ర**

భాగం - 1 : సామాజిక వ్యవస్థ 3

భాగం - 2 : మత వ్యవస్థ 14

భాగం - 3 : విద్యా వ్యవస్థ 25

**ఖండం - II : సైద్ధాంతిక ప్రభావం**

భాగం - 4 : ప్రాచ్య వాదం (Orientalism) ఇవాంజిలిజం (Evangelism) ఉపయోగితా వాదం (Utilitarianism) 37

భాగం - 5 : సామాజిక చట్టాలు 52

భాగం - 6 : విద్యాభివృద్ధి 64

భాగం - 7 : పత్రికారంగ ప్రగతి 76

భాగం - 8 : సాంస్కృతిక, వైజ్ఞానిక అంతర్లీనతలు 89

**ఖండం - III : నూతన భావజాలం**

భాగం - 9 : హేతు వాదం (Rationalism) 101

భాగం - 10 : మానవతా వాదం (Humanism) 110

భాగం - 11 : ఉదార వాదం (Liberalism) 121

భాగం - 12 : ప్రత్యక్ష జ్ఞాన వాదం (Positivism) 135

భాగం - 13 : సార్వత్రిక వాదం (Universalism) 142

పాఠ్య ప్రణాళిక

మాదిరి పరీక్షా పత్రం

అభ్యాసాలు


BRAOU

BRAOU

# ఖండం - I

# 18వ శతాబ్దంలో భారతదేశ సామాజిక వ్యవస్థ

భారతదేశ సామాజిక, రాజకీయ చరిత్రలో 18,19 శతాబ్దాలు ఒక ముఖ్య ప్రస్థానం. 19వ శతాబ్దంలో అన్ని రంగాల్లో మౌలికమైన వచ్చిన మార్పుల వల్ల భారతదేశం ఆధునీకరణకు నాంది పలకడం జరిగింది. ఈ ఖండంలో ఆంగ్లేయ సార్వభౌమాధికారం స్థాపన నాటికి సామాజిక వ్యవస్థ రూపురేఖలు వివరింపబడ్డాయి. ఈసంధి యుగంలోని మార్పులను మనం అర్థం చేసుకోవాలంటే, 18వ శతాబ్దంలో మతం, విద్య, సామాజిక ఆచారాలు, అలవాట్లను తెలుసుకోవాలి. ఈ ఖండంలో వాటి వివరణ కన్పిస్తుంది.

BRAOU

# భాగం - 1 : సామాజిక వ్యవస్థ

విషయ క్రమం

1.0 లక్ష్యాలు
1.1 పరిచయం
1.2 సామాజిక వ్యవస్థ - రూపం
1.3 వర్గ విభజన
1.4 కుల వ్యవస్థ, ప్రభావం
    1.4.1 కులం - వివాహ వ్యవస్థ
    1.4.2 కుల వ్యవస్థ - భోజన నిబంధనలు
    1.4.3 కులం - వృత్తి
    1.4.4 కులం - సామాజిక ఆధిక్యత
    1.4.5 కులం - స్వాధికారాలు
1.5 పీడిత వర్గాలు
    1.5.1 సాంఘిక అనర్హతలు
1.6 కుల వ్యవస్థలో అభివృద్ధి ధోరణులు
1.7 సంగ్రహంగా
1.8 పరీక్ష నమూనా ప్రశ్నలు
1.9 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 1.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగల్గాలి.

- 18వ శతాబ్దంలో సామాజిక వ్యవస్థలో కుల వ్యవస్థ ఆవిర్భావం
- 18వ శతాబ్దంలో సామాజిక వ్యవస్థలో వర్గ విభజన రూపాంతరం
- కుల సంబంధమైన ఆచారాలు, అర్హతలు, అనర్హతలు
- కుల వ్యవస్థలో అభివృద్ధి ధోరణుల విశ్లేషణ.

## 1.1 పరిచయం

18వ శతాబ్దపు భారతదేశాన్ని అంతకు ముందున్న భారతదేశంతో కాని, లేదా నేటి ఆధునిక భారతదేశంతో కాని పోల్చడానికి వీలులేదు. ఆ శతాబ్దపు తొలి దశాబ్దంలోనే మొగల్ సామ్రాజ్యం బీటలు వారగా, ఈ శతాబ్ది మధ్యలో మొగల్ సామ్రాజ్యం స్థానే స్థానిక రాజ్యాలు, ఆంగ్లేయాధిపత్యం ఏర్పడ్డాయి. 18వ శతాబ్దపు సాంఘిక, ఆర్థిక విషయాలను క్షుణ్ణంగా పరిశీలించడానికి కావలసిన సాక్ష్యాధారాలు, గణాంకాలు అంతగా లభ్యం కాలేదు.

1880లో మొదటిసారిగా ఆంగ్లేయ పాలనలో జనాభా లెక్కలు జరిగాయి. నాటినుండే, కొంత వరకు నమ్మదగిన గణాంకాలు, ఆధారాలు లభించాయి. అంతకు ముందు రాజ దర్బారుల్లోని చరిత్రకారుల కథనాలు స్పష్టంగా లేవు. అనేక చోట్ల వివరాల్లో వైరుధ్యం కన్పిస్తుంది. దీనికి నాటి ఆంగ్లేయుల వ్యాఖ్యానాలను జతపరిస్తే, మరింత గందరగోళం ఏర్పడుతుంది. ఐరోపా చరిత్రకారుల విమర్శలను యధాతథంగా ఆమోదించడానికి వీలులేదు. వారు కేవలం కొలువులకు మాత్రమే పరిమితమయ్యారు. వారికి స్థానిక భాషల అవగాహన లేదు. పైగా వారి సాంఘిక వ్యవస్థ పూర్తిగా భిన్నమైంది. కొందరు విదేశీ చరిత్రకారులు ఎంతో కృషిచేసి స్థానిక ఆధారాలను అధ్యయనం చేసి రచన చేసినా, వారి విశ్లేషణలో స్థానిక పరిస్థితుల పట్ల న్యూన్యతా భావం ద్యోతకమౌతుంది. పైగా, భారత సామాజిక వ్యవస్థను నాటి రాజకీయ మార్పుల, చేర్పుల ఆధారంగా అర్థం చేసుకోడానికి వీలుపడదు. మౌర్య సామ్రాజ్య పతనానంతరం, అక్బర్ పాలనా కాలంలో ఏర్పడిన రాజకీయ సమైక్యత అంతకు ముందెన్నడూ లేదు. అయితే, ఈమధ్య కాలంలో రాజకీయ అస్థిరత ఉన్నా, సామాజిక వ్యవస్థ చాల వరకు యధాతథంగానే కొనసాగింది. అంటే, సామాజిక వ్యవస్థలోని మార్పులపై రాజకీయ పరిణామాల ప్రభావం అంతంతమాత్రంగానే ఉందని గ్రహించాలి. 18వ శతాబ్దపు భారతదేశ పరిస్థితులను గూర్చి తెలుసుకోడానికి రఘువంశి (Raghuvamsi) రాసిన 'ఇండియన్ సొసైటీ ఇన్ ది ఎయిటీన్త్ సెంచరీ' **(Indian Society in the Eighteenth Century)** సతీష్ చంద్ర (Satishchandra), ఆర్. సి. దత్ (R.C Dutt) మొదలైన దేశీయ రచయితల గ్రంథాలు ఎంతగానో ఉపకరిస్తాయి. అంతేగాక 'డుబాయిస్' **(Dubois)**. బుకానన్ (Buchanan) రచనలు, ఆసియాటిక్ రీసెర్చెస్ **(Asiatic researches)**ఈకాల పరిస్థితులను గురించి సమాచారమిస్తాయి.

## 1.2 సామాజిక వ్యవస్థ రూపం

18వ శతాబ్దంలో భారత సామాజిక వ్యవస్థలో వర్ణ విభజన అతిముఖ్యమైన లక్షణం. ఈసామాజిక వర్ణ విభజన ఆర్థిక, విద్య, తదితర విషయాలపైకాక పుట్టుకపై ఆధారపడడం మరో విలక్షణం. కుల పద్ధతిపై జరిగిన ఈ వర్ణ విభజన, నాటి వ్యవస్థ పనితీరును నిర్దేశించింది. వీని మధ్య దూరాన్ని, తారతమ్యాన్ని మత పరంగా అంగీకరింపచేసి, అంగీకరింపబడటం మరో ప్రధాన లక్షణం. ఈ కుల వ్యవస్థ సార్వజనీకం కావడమే కాక, సామాజిక వ్యవస్థపై నిరపేక్ష శాశ్వతాధికారాన్ని సంపాదించింది. ఈ సాంఘిక చేతనారహితాలు, దానిలోని వ్యక్తులు మార్పు కోరడానికి వీలులేదు. కులాల మధ్య వివాహ సంబంధాలు అనూహ్యాలు. భారత సామాజిక వ్యవస్థలో హిందువు, తన కులంతోనే వ్యక్తిగా గుర్తింపబడుతాడు. కులం, గోత్రం లేని వానిగా పిలువబడడం ఒక సామాజిక అనర్హత, పరాభవం. హిందూ తత్వంలో కుల ప్రస్తావన గౌరవప్రదం. ఐరోపాలోని ప్రభువులకు హోదాపట్ల ఉన్న తృప్తికన్నా, హిందువులకు కులం పట్ల ఉన్న అభిమానం మిన్న ! చిన్న, పెద్ద అనే తేడా లేకుండా హిందువులు తమ కులంపట్ల చూపిన స్వాభిమానం వారిని క్రైస్తవ మతంలోనికి మార్చడానికి గట్టి అవరోధమైందని విల్సన్ (Wilson) అభిప్రాయబడ్డాడు. "భారతదేశంలోని కులాల పెంపు ఎట్టి శాసనం వల్లా రాలేదు. అది ప్రజల వల్లనే జరిగింది. వారిలో అట్టడుగు వర్గం వారు కూడా కులాన్ని అవమానంగా భావించక, గర్వంతో చెప్పుకొనేవారు. అట్టడుగునున్న స్థానికుడు కూడా వ్యవస్థ నుండి వెలివేయబడిన వాడు లేడు. ఆ వ్యవస్థలో అతనికి ఒక నిర్ణీత స్థానముంది. ఆవర్గంలో ఒక సభ్యుడిగా కొనసాగడానికి, నిలవడానికి ప్రయత్నిస్తాడు. ...". అని. ఈ వ్యవస్థను దుయ్యబట్టిన ఐరోపా చరిత్రకారులు వ్యవస్థలోని లోపాలను బహిర్గత పర్చినారే కాని, దానివల్ల వచ్చిన లాభాలను గణనలోనికి తీసుకోలేదు. ఆ సాంఘిక వ్యవస్థలో అట్టడుగునున్న 'చండాలుని' జీవితం దుర్భరమైందే. కాని వారి పరిస్థితి ఐరోపాలోని నాగరికత సమాజాల్లోని పేదలకన్నా ఉచితంగా ఉన్నదని కూడా విల్సన్ అభిప్రాయపడ్డాడు.

## 1.3 వర్గ విభజన

భారతీయ సమాజంలోని ప్రజలు కులపరంగా, స్థూలంగా మూడు సాంఘిక వర్గాలుగా విభజింపబడ్డారు. (1) స్వాధికార వర్గం. (2) అస్వాధికార వర్గం. (3) అంటరానివారు. లేదా అస్పృశ్యులు. బ్రాహ్మణ, క్షత్రియులు, వైశ్యులు స్వాధికార వర్గంగా, ద్విజులుగా వ్యవహరింపబడేవారు. బ్రాహ్మణ పూజారి వారిని రెండో జన్మలోనికి ప్రవేశించేటట్లుగా చేసే పూజలకు వారు మాత్రమే అర్హులు. దీనికి గుర్తుగా వారు 'పవిత్ర దారాన్ని' (జంధ్యాన్ని) ధరిస్తారు. ఇది వారి ప్రత్యేకతకు గుర్తు. రెండవ వర్గానికి చెందిన శూద్రులు ఈ ప్రత్యేక పూజకు అనర్హులు. మత గ్రంథాలను చదవడంగాని, వల్లె వేయడం గాని వారు చేయరాదు. అయితే, వారిలో కొందరికి బ్రాహ్మణులు కుటుంబ పూజారులుగా, విషయాలను బోధించే ఆచార్యులుగా ఉండవచ్చును. సాంఘిక వ్యవస్థలో అట్టడుగునున్న అస్పృశ్యులను అపవిత్రమైన పుట్టుక గల శూద్రులుగా భావిస్తారు. వారిని నీచంగా చూస్తారు. వారు తరచూ వేధింపులకు గురిచేయబడేవారు. వారికి కనీసపు పౌరహక్కులుండేవికావు. బహిరంగ ప్రదేశాలనుండేకాక, ఉన్నత వర్గ హిందువుల పరిసరాల నుండి కూడా వారు నిషిద్ధులు.

ఈ కుల విభజన నాటి సాంఘిక వ్యవస్థను ఎంతగానో ప్రభావితం చేసింది. 18వ శతాబ్దంలో ఈ కుల వ్యవస్థ సిద్ధాంతరీత్యా వర్గ విభజన ఎరుగని ఇస్లాం మతాన్ని కూడ ప్రభావితం చేసింది. హిందూ మత వాతావరణ ప్రభావంలో ముసల్మానుల సామాజిక వ్యవస్థ కూడా కొంతవరకు కుల వ్యవస్థ రూపాన్ని సంతరించుకొంది. కుల విభజనను ఒక పద్ధతి ప్రకారం అధ్యయనం చేయడం చాల కష్టమైన పని. విశాలమైన భారతావనిలో దానికి ఏకరూపత లేదు. అలాగే, కులమంటే ఇది అని నిర్దిష్ట నిర్వచనం కూడా కష్ట సాధ్యమే ! ఒక కుల ప్రజలు అంతకుముందున్న అదే కుల ప్రజలనుండి ఉద్భవించినారని చెప్పడం సులభంకాదు. తరాల మధ్య ఎన్నోరకాల పరిస్థితులు మారుతూ ఉంటాయి. అయితే, ఈ కుల వ్యవస్థ వల్ల ఏర్పడిన సామాజిక పొరపొచ్చాలు, అవి వ్యక్తి జీవితం మీద, ఆలోచన సరళిపైన ఎట్టి ప్రభావాన్ని చూపాయనే దాన్ని మనం విశ్లేషింపవచ్చు.

BRAOU

## 1.4 కుల వ్యవస్థ ప్రభావం

హిందూ మతంలో వర్ణ వ్యవస్థ ఒక సామాజిక విభజనయే కాదు. అది ఆయా వ్యక్తుల్లో సృష్టించిన బలమైన సాంఘిక అలవాట్లకు, ఆలోచనలకు, అంతరాలకు, వర్ణ విభేదాలకు మూలమైన సామాజిక స్పృహ. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే పదాలు వారి కుల విభజనను సూచిస్తాయి. దానికి అంతగా పుట్టుకను గూర్చిన ప్రాధాన్యం లేదు. వర్ణ వ్యవస్థను స్థూలంగా నాలుగుగా చెప్పినా కొన్ని వందల కులాలు, వాటిలో మరలా శాఖోపశాఖలుగా వచ్చిన ఉపకులాలెన్నో ఉన్నాయి. సామాజిక వ్యవస్థలో ఈ బహుళ కులాలు, ఉపకులాలు, ఒక ముఖ్యమైన లక్షణం. ఇవి ప్రముఖంగా బహు భర్తృత్వం, వివాహ సంబంధాల వల్లనే కాక, జాతి, తెగ, ఆచారం, స్థల నిర్దేశనం, వృత్తిపరంగా కూడా ఏర్పడ్డాయి. ఈకులాల్లో ఒకరితో ఒకరు కలవడం కుదరదు. ముఖ్యంగా, నిమ్న కులాల వారు అగ్రకులాల వారితో ఎలాంటి సామాజిక సంబంధాలను ఏర్పరుచుకోవడం నిషిద్ధం. ఇది నాటి సామాజిక వ్యవస్థలోని మరో ముఖ్య లక్షణం.

### 1.4.1 కులం, వివాహ వ్యవస్థ

నాటి హిందూ సామాజిక వ్యవస్థలోని వివాహ సంబంధాలకు కులపరమైన ఆచారాలు, నియమాలుండేవి. అంతర్‌కుల వివాహాలు వారికి తెలియదు. ఎక్కడైనా పొరపాటున జరిగితే, కుల

బహిష్కరణయే శిక్ష. కులాచారాల్లో ఎక్కడన్నా పొరపాట్లు జరిగితే, కొంతవరకు క్షమింపబడేవి. కాని, వివాహ విషయాల్లో, లైంగిక వ్యవహారాల్లో క్షమార్హత లేదు. పశ్చిమ కోస్తాలో పీష్వాల పరిపాలనలో ఒక బ్రాహ్మణ వర్గం తమ కుమార్తెలను వీరి సోదరిమణుల కుమార్తెలతో వివాహం చేయగా, వారిని బహిష్కరించారు. ఉన్నత కులాలకు చెందిన ఏ అమ్మాయి అయినా వ్యభిచరిస్తే, ఆ అమ్మాయిని బానిసగా అమ్మేవారు. ఈ ఉదాహరణను గమనిస్తే, కుటుంబాలు వంశపారంపర్యంగానే వృద్ధి చెందాలిగాని, విస్తారమైన పరిధిలో సంబంధాలు నెలకొల్పడం అక్షేపణీయంగా తోస్తుంది. హిందువుల్లో కులంలోనే వివాహం చేసుకొనడం సార్వజనీకంగా వచ్చింది. ఒక్క 'మలబారు'లో మాత్రమే బ్రాహ్మణులు 'నాయర్' అమ్మాయిలను వివాహమాడేవారు. దీనికి 'మను' అంగీకారం ఉందని చెప్పేవారు.

ఒకే కుల వివాహాల్లో కూడ హోదా, ఆస్తి తారతమ్యాలు వివాహ సంబంధాలను నిర్దేశించేవి. వీటి అంతరాలు వివాహ ప్రతిబంధకాలు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు కానివారిని శూద్రులుగా వ్యవహరించారు. కాని 18వ శతాబ్దాంతానికి వీరు అనేక వృత్తిపరమైన కులాలుగా విడిపోయి, ఒక్కొక్క ఉపకులం ఒక్కొ ప్రత్యేకతను సంతరించుకొని, ఉపకులాలు స్పష్టమైన కులాలుగా మారాయి. దీనితో 'శూద్ర' కులానికి వ్యక్తిత్వం పోయింది. శూద్రుల నుండి ఉద్భవించిన ఈ నూతన కులాలు కూడా, ఒకరితో ఒకరు వివాహ సంబంధాలు పెట్టుకొనేవారు కాదు. వీరిలో ఒక కులంవారు, మరో కులం వ్యక్తితో లైంగిక సంబంధం పెట్టుకుంటే, కుల బహిష్కరణ శిక్ష విధింపబడేది.

కుల వ్యవస్థలో వివాహ సంబంధాలు ఒక ముఖ్యమైన పరీక్షగా భావించబడ్డాయి. అయితే, దీనిలో కూడా మార్పులు వచ్చాయి. ఉత్తర భారతంలో కాయస్తులు ఒక కులంగా భావింపబడేవారు. కాని 18వ శతాబ్ది చివరకు ఆ కులం అనేక ఉపకులాలుగా విడిపోయింది. శ్రీవాస్తవులు, భట్నగరులు, మాథుర్‌లు, సక్సేనాలు. మొదలైన వారుగా విడిపోయి, వివాహాలు ఉపకులాలకు పరిమితమై, ఉపకులాలే కొన్నేళ్ళకు కులాలుగా రూపుదిద్దుకున్నాయి. అదేవిధంగా దక్షిణ భారతంలో బంగారం పనివారు, కమ్మరి పనివారు, వడ్రంగం చేసేవారు, ఇల్లు కట్టేవారు అందరూ ముందుగా ఒకే కులంలో ఉన్నా విడిపోయి, ప్రత్యేక కులాలుగా ఏర్పడి, కులాంతర వివాహాలను నిషేధించారు. ఉత్తర భారతంలో వైశ్యులు కూడా ఎన్నో ఉపకులాలుగా విడిపోయి, ప్రత్యేకతను కాపాడుకొనే వివాహ సంబంధాలనే ఎన్నుకొనేవారు.

ఈ రీతిగా నాలుగు కులాలుగా చెప్పబడిన వర్ణ వ్యవస్థలో ఎన్నో ఉపకులాలు వచ్చి, అవి కాలక్రమేణా కులాలుగా మారి, వివాహ సంబంధాలు ఆ కులాలకే పరిమితమైనవి.

### 1.4.2 కుల వ్యవస్థ - భోజన నిబంధనలు

భిన్న కులాల మధ్య ఒకరింట మరొకరు భోజనం చేయడం నిషిద్ధమని ఐరోపా రచయితలు పేర్కొన్నారు. తక్కువ కులాల వారు తయారుచేసిన, ముట్టుకున్న ఆహార పదార్థాలను అగ్రకులాల వారు స్వీకరించేవారు కాదు. అలా ఎవరైనా స్వీకరిస్తే, వారిని తక్కువ కులాల వారి జాబితాలో చేరుస్తారని ఒక 'డచ్' రచయిత రాసాడు. అగ్రకులాలవారు ఆకలితో చావడానికైనా సిద్ధమవుతారు గాని, తక్కువ కులాల వారి చేతిమీదుగా ఆహారం తీసుకోరు. కాలానుగుణంగా మిగతా ఆచారాల్లో కొంత మార్పు వచ్చినా, భోజన విషయంలో పట్టింపు 19వ శతాబ్దపు ప్రథమ భాగం వరకు అలాగే కొనసాగిందని 'బుకానన్ (Buchanan) వ్యాఖ్యానించారు. ఆహార పానీయాల విషయాల్లో ఎలాంటి సంకరం జరుగకుండా, కుల సూత్రాలను పటిష్టంగా అమలు చేసేవారు. వివిధ కులాలకు చెందిన వారు ఒకే రకమైన పూజలు చేయవచ్చు. ఒకే దేవుళ్ళను ప్రార్థించవచ్చు.

BRAOU

కాని ఒకచోట భోజనం చేయరాదు. సామూహిక భోజనాలు లేవు. ఒక కులంవారు వంట చేసే సమయంలో మరొక కులం వారు వారి బట్టలను కాని, పాత్రలను కాని తాకకూడదు. ఏ వస్తువులను ముట్టరాదు. ఆ ప్రదేశంలో వారు సంచరించినా, ఆ పాత్రతో సహా ఆహారాన్ని పారవేసేవారు.

ఈ భోజన నిబంధన వల్ల హిందువుల మధ్య అంతరాలు మరింత పెరిగి, కుల ప్రాతిపదికపై విభజన ధోరణులు వెర్రితలలు వేసాయి. 1770 బెంగాల్ కరువులో ఆకలికి తట్టుకోలేని కొందరు హిందువులు నిమ్నకులాల వారి చేతుల మీదుగా ఆహారాన్ని స్వీకరించారు. ఉత్తర ప్రదేశ్‌లోని తూర్పు భాగాల్లోని బ్రాహ్మణులు, ఆహార పదార్థాలను నేయితో తయారుచేస్తే తక్కువ కులాల వారినుండి స్వీకరించడానికి అభ్యంతరం లేదని భావించేవారు. బెంగాల్‌లో దీనిని అంగీకరించక, చివరకు పెరుగు కూడా తక్కువ కులాల వారినుండి తీసుకొనేవారు కాదు. ఈ రీతిగా భిన్నభిన్న ప్రాంతాల్లో అవసరాలను బట్టి కొన్ని రాయితీలున్నా, మొత్తంమీద కుల వ్యవస్థ ఆహార విషయాల్లో కూడా కఠిన నిబంధనలను అమలుపర్చి, కులాల అంతరాలను వృద్ధి చేసింది.

పరిశుభ్రత, దేహారోగ్యం, మొదలైన విషయాల్లో కూడా కులం పట్టింపులుండేవి. ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఏవస్తువులు నిషిద్ధం అనేది కూడ ఒక్కొక్క కులంలో ఒక్కొక్క రీతిగా ఉండేది. ఏమి తినాలో, ఏమి తినకూడదో చెప్పడం కులనియమాల్లోనొకటి. మాంసాహారం, మత్తు పానీయాలు తాగని బెంగాల్ రైతులు ఈ అలవాట్లున్న పనివాళ్ళకన్నా సామాజిక వ్యవస్థలో పెద్దవారిగా పరిగణింపబడేవారు. బ్రాహ్మణులు మాంసాహారం, మత్తుపానీయాలను ముట్టుకొనే వారు కాదు. వారికి దక్షిణ భారతంలో మాంసాహారం పూర్తిగా నిషిద్ధంకాగా, ఒరిస్సా, బెంగాల్‌లో చేపలు తినడం నిషిద్ధం కాదు. బ్రాహ్మణులను, వైశ్యులను మినహాయిస్తే, మిగతా వారందరు ఇష్టానుసారంగా మాంసాహారాన్ని భుజించేవారు. ఈ భోజన విషయంలో పట్టింపులు గమనించిన ఆంగ్లేయులు ఓడలో ప్రయాణించే హిందూ సిపాయిలను, తదితరులను తమ తమ నీరు ఆహార సామాగ్రి తెచ్చుకొనటానికి అంగీకరించారు. "ప్రపంచంలో సహనానికి పేరుపడ్డ భారతదేశంలో, సామాజిక సంబంధాల్లో హిందువులు ఇంత అసహనం చూపడం విచిత్రం" అని నీబ్యులర్ (Neibuler)వ్యాఖ్యానించారు.

### 1.4.3 కులం - వృత్తి

కులం నాటి సమాజంలోని వ్యక్తుల వృత్తులను నిర్దేశించడంలో కూడా ప్రముఖ పాత్ర వహించింది. వృత్తిపరమైన శ్రేణుల నుండి కులాలుద్భవించాయని, అవి కాలక్రమేణా ఒకే రక్తసంబంధం గల తరగతులుగా (endogamous) మారాయని 'బ్లంట్' (Blunt) వ్యాఖ్యానించగా, కుల వ్యవస్థకు 'ఏక రక్త సంబంధం' 'ఏక వృత్తి' (community of blood and community of profession) ప్రాథమిక లక్షణమైందని 'ఇబెట్‌సన్' (Ibbetson) అభిప్రాయపడ్డాడు. కాని, హిందూ సామాజిక వ్యవస్థను పరిశీలిస్తే, అది చాలావరకు కులం, ఆచారాలనే గొడుగు క్రిందే తలదాచుకుంది.

వ్యక్తి యొక్క వృత్తి ధర్మం, చేయవలసిన పనులు, అతని తెలివితేటలు ఇష్టాయిష్టాలు, అభిరుచులపై కాక, పుట్టుకపై, కులంపై ఎక్కువగా ఆధారపడేవి. మామూలు పరిస్థితుల్లో బ్రాహ్మణుని కుమారుడు మతకర్మలు జరిపితే, కమ్మరి వాని కొడుకు కమ్మరి పని చేసేవాడు. సమాజంలో వ్యక్తుల వృత్తులు, పనిపాట్లు వారసత్వపు ఇరుసుపైననే పరిభ్రమించేవి. పనుల్లో భిన్నత్వం, వృత్తి వ్యాపారాల్లో పెంపు కులాలు, ఉపకులాలు విపరీతంగా పెరగడానికి కారణమయ్యాయి. ముఖ్యంగా దిగువ కులాల్లో కులం, వృత్తి ఒక్కటయ్యాయి.

వృత్తి, వారి సామాజిక హోదాను నిర్దేశించింది. వృత్తిపరమైన పెద్ద, చిన్న అనే తేడాలు వచ్చాయి. ఒక్కొక్కసారి తమ చేతిలో పనిలేకపోయినా, మరో పని చేయగోరి తమ కుల హోదా అడ్డు వస్తుందని వస్తులుండేవారు. సామాన్యంగా ఒక కులం ఒకే వృత్తిని కొనసాగించేది. ఇది వంశపారంపర్యంగా, ఎన్నో దశాబ్దాలుగా కొనసాగడంతో, ఆపనిలో అసాధారణమైన ప్రతిభా పాటవాలను సంతరించుకొనేవారు. వృత్తుల్లో ఈనాడు మనం చెప్పుకొనే "స్పెషలైజేషన్" (Specilization) ను కుల వ్యవస్థ వృద్ధి చేసింది.

వృత్తిపరంగా కుల విభజన భారతదేశమంతటా ఒకేవిధంగా సాగలేదు. అస్సాంలో వడ్రంగులు, కమ్మరులు, నేత పని వారు, పూల దండలు చేసేవారందరూ ఒకే కులంగా పరిగణింపబడితే, బెంగాల్‌లో వారు భిన్న కులాలకు చెందేవారు. మిగతా ప్రాంతాల్లో వృత్తిపరమైన వికేంద్రీకరణ జరిగి, ఆర్థిక ప్రయోజనాలు కుల వృత్తులను భంగపరిచాయి. కులపరమైన వృత్తుల్లో బీటలు వారాయి. బ్రాహ్మణులు ఒక్కొక్కచోట ఆయుధాలు చేపడితే, క్షత్రియులు వ్యాపారంలోకి దిగారు. నిమ్నకులాల అధిపతులు అక్కడక్కడ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అయితే, వృత్తి మారడంలో కూడా కొన్ని పరిమితులుండేవి. శూద్రుల్లోని తక్కువ కులాల పనులు అగ్రకులాల వారు చేపట్టరాదనే నియమాలుండేవి. మొత్తం మీద 18వ శతాబ్దపు అంతానికి కుల పద్ధతిపై నిర్ణయింపబడిన వృత్తి ధర్మాల్లో మార్పులు, చేర్పులు వచ్చాయి. ఈ మార్పులను ఛాందసులైన హిందువులు గర్హించారు. కాని బ్రాహ్మణుల్లో కూడ ఐహిక సుఖాల పట్ల వ్యామోహం పెరిగింది. వారు తమ అధికారాన్ని, సంపదను పెంచుకొనసాగారు. సుఖసంతోషాలతో జీవనం గడపడానికి ప్రభుత్వంలో, ఉద్యోగాల్లో చేరారు. వారి తెలివి తేటలను, ప్రజల్లో వారికి గల పలుకుబడిని చూసి, విదేశీయులు కూడా వారిని చేరదీశారు. కొద్దికాలంలోనే. దక్షిణ భారతదేశంలోని పాలనా వ్యవస్థలో వారికి పోటీ లేకపోయింది. ఉత్తర భారతంలో ఉన్న ఉద్యోగాల్లో వారు కాయస్తులతో పోటీబడ్డారు. అక్కడ బ్రాహ్మణుల్లో కేవలం పది శాతం మాత్రమే విద్యా వ్యాసంగంలో ఉండగా, డెబ్బై శాతం మంది జమిందారులుగా మారారు. మరో పది శాతం వర్తకం చేయగా, మిగిలిన పది శాతం పూజారులుగా ఉన్నారు. అంటే, ప్రథమంలో కులం వృత్తిని నిర్దేశించి, తరువాత వృత్తి కులం ఒకటిగా మారినా, కాలక్రమేణా కులాలు వృత్తులను అంతగా నియంత్రించ లేకపోయాయి. మారుతున్న ఆర్థిక పరిస్థితులు, వ్యక్తుల ఆలోచనలు దీనికి కారణం. ఈకాలంలో ఉన్నత కులాలవారు, నిమ్న కులాలవారి వృత్తుల ప్రయోజనాలపై కన్నువేసి, కొంత వరకు అధీనంలోకి తీసుకొనగా, దిగువ కులాలవారు ఉన్నత వృత్తులపై దృష్టిసారించి, కొంత వరకు సాధించగలిగారు.

**1.4.4 కులం - సామాజిక ఆధిక్యత**

కుల వ్యవస్థ నాటి కొన్ని కులాల సామాజిక ఆధిక్యతను నిర్దేశించింది. బ్రహ్మ శిరస్సు నుండి బ్రాహ్మణులు, హస్తముల నుండి క్షత్రియులు, కటిభాగం నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు జన్మించారనే కథానుగుణంగా, వారి సామాజిక హోదాలు నిర్ణయింపబడ్డాయి. 18వ శతాబ్దంలో మలబార్‌లో ఈ సామాజిక అంతరాలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. ఒక నంబూద్రి బ్రాహ్మణుని నాయర్ చూడవచ్చు, కాని ముట్టుకోరాదు. మిగతా కులాల వారు ఎంతెంత దూరంలో నిలబడవలెనో చెప్పబడింది. ఆయా కులాల మధ్యకూడా ఈ అంతరాలుండేవి. అయితే, దేశమంతటా బ్రాహ్మణుల సామాజిక ఆధిక్యత స్పష్టంగా అంగీకరింపబడింది. ముఖ్యంగా, బెంగాల్, దక్షిణ భారతంలో వారి ఆధిక్యత అపూర్వమైనది, అనన్యమైనది. అయితే, బ్రాహ్మణుల్లో కూడా భిన్న ఉపకులాలున్నాయి. వారి పలుకుబడి, హోదాల్లో అంతరాలున్నాయి. వారిలో అతి పవిత్రులైన వారి పాదాలను కడిగి, ఆ నీటిని నెత్తిపైన చల్లుకోవడమేకాక, త్రాగడం కూడా గొప్ప పవిత్ర కార్యంగా భావింపబడేది. దక్షిణ భారతంలో క్షత్రియుల ఆధిపత్యం కన్పించదు.

BRAOU

అక్కడ బ్రాహ్మణులే దైవ స్వరూపులుగా పూజింపబడేవారు. వారి కటాక్ష వీక్షణాలే ఆశీర్వచనాలు. మధ్య భారతంలో, పశ్చిమోత్తర భారతంలో రాజపుత్రులు, వైశ్యులు కూడా ముఖ్యులే. అక్కడ బ్రాహ్మణులకు పెద్ద ఆధిక్యత లేదు. రాజపుత్రులు వారిని పెద్దగా గౌరవించలేదు.

సామాజిక వ్యవస్థలో కులం పలుకుబడిని, హోదాను కల్పించింది. బెంగాల్‌లో నిమ్న కులాలను నాలుగు వర్గాలుగా విభజించారు. సత్ శూద్రుల్లో వైద్యులు, కాయస్థులు ముఖ్యులు. వీరు కాక తొమ్మిది వృత్తిపరమైన కులాలుండేవి. పొలం పనిచేసేవారు, గోవులను కాసేవారు శూద్రులని, వడ్రంగులు, ధాన్యపు వర్తకులు, నగలుచేసేవారు, మొదలైన వారిని మహాశూద్రులని పిలిచేవారు. అంత్యజులనే ఆ చివరి వర్గంలో చెప్పులు కుట్టేవారు, తాళ్ళు తయారు చేసేవారు, పాకీ పనివారు నికృష్ట జీవనం సాగిస్తూ, సామాజిక వ్యవస్థనుండి వెలివేయబడిన వారిగా జీవనం సాగించేవారు.

### 1.4.5 కులం - సామాజిక స్వాధికారాలు

కుల వ్యవస్థపరంగా ఏర్పడిన వర్గాల్లో అగ్ర కులాల వారు ఎన్నో స్వాధికారాలను, రాయితీలను కలిగి ఉండేవారు. వేదాలను, శ్రుతులను, వేదాంత ధర్మాలను అధ్యయనం చేసే హక్కు ఒక్క బ్రాహ్మణులకే ఇవ్వబడింది. రాజపుత్రులు, వైశ్యులు వాటిని చదువవచ్చును. కాని వ్యాఖ్యానించ వీలు లేదు. ఈ హక్కును బ్రాహ్మణులు అతి పవిత్రంగా కాపాడుకొనేవారు. ఎవరైనా పొరబాటున వేదాలను మరొక కులంవారికి వినిపిస్తే, వారిని కుల బహిష్కరణ చేసేవారు. అతి ప్రాచీనమైన, సంస్కృత భాష ఒక బ్రాహ్మణులకే పరిమితం. మిగతావారికి అది విగత భాష. వేద రహస్యాలు శ్రుతుల శ్లోకాలు పామరులను చేరరాదు. అయితే, బ్రాహ్మణులు సామాన్య ప్రజలకు అంతుపట్టని రీతిలో వేదాంత చర్చలు జరిపేవారు. హిందూ ధర్మశాస్త్రాల్లోని తత్త్వవిచారం సామాన్యులకు మాయగానే మిగిలి పోయేది. ఉన్నత మత విద్యపై బ్రాహ్మణుల గుత్తాధిపత్యం సామాజిక ప్రయోజనాలను బలిపెట్టిందని, ఐరోపా రచయితలు విమర్శించారు. సమాజంలో తమ ఆధిక్యతను స్వాధికారాలను పరిరక్షించుకొనడానికి, పూజారి వర్గంగా మత విధుల నిర్వహణలో మత విషయాల వ్యాఖ్యానంలో తమ గుత్తాధిపత్యాన్ని నిలబెట్టుకొనడానికి, మతం పేరుతో దానధర్మాలు, శిక్షల నుండి మన్నింపులు పొందడానికి బ్రాహ్మణులు తెలివిగా చేసిన ప్రయత్నం అని వ్యాఖ్యానించారు.

బ్రాహ్మణులకు దానాలివ్వడం మతవిధుల్లో ఒకటి అని జేమ్స్ మిల్స్ (James Mills) రాసారు. బ్రాహ్మణ హత్య నేరాలన్నింటిలోనికి పెద్దది. దానిని క్షమింప వీలు కాదు. బ్రాహ్మణులు పన్నులుగాని మరి ఏ ఇతర రుసుములు గాని చెల్లింపనవసరంలేదు. కొన్ని శిక్షలు వారిపై విధింపరాదు. తక్కువ కులాల వారు వారికి ఉచితంగా సేవలు చెయ్యాలి. బ్రాహ్మణుల పట్ల ఎలాంటి అవిధేయత, అపనమ్మకం చూపిన దేవుడు కూడా క్షమించడు. అంటే సామాన్య న్యాయ శాస్త్ర సూత్రాలకు వారతీతులు. ఒక్క రాజద్రోహం తప్ప, మిగతా ఏ నేరానికి కూడ వారికి మరణ శిక్ష లేదు. రాజద్రోహానికి మరణ శిక్ష విధించినా, బహిరంగంగా ఉరితీయకూడదు. విషమిచ్చి చంపవలెను. మొత్తంమీద హిందూ నేర న్యాయసూత్రాలు ఉన్నత కులాల పట్ల ఉదారంగా ఉండేవి.

ఇదే కాలంలో దక్షిణ భారతంలో బ్రాహ్మణేతర కులాల్లో 'బల్లగై' (Ballagai) 'ఎద్దగై' (Eddagai) అనే రెండు విభాగాలు వచ్చాయి. కుడిచేయి, ఎడమచేయి అని చెప్పబడే ఈ రెండు వర్గాల పుట్టుక స్పష్టంగా తెలియరాదు. కాని ఈ రెండు వర్గాలు తమకు ప్రత్యేక స్వాధికారాలున్నాయని ఒకరిలోనొకరు కలహించు కొనేవారు. ఎన్నో హింసాత్మక సంఘటనలు ముఖ్యంగా మైసూర్, తూర్పు దక్షిణ ప్రాంతాల్లో జరిగినట్లు, వారి మధ్య వివాదాలు న్యాయస్థానాలకు ఎక్కినట్లు ఆధారాలున్నాయి. కొన్ని నగరాల్లో ప్రాంతాలను ఒక్కొక్క

BRAOU

ఈ కుల విభాగాలకు ప్రత్యేకించి, వారి సాంఘిక మతకార్యక్రమాలను అక్కడే జరుపుకొనేటట్లుగా చేసి, సంఘర్షణలను నివారించినట్లుగా తెలుస్తుంది.

## 1.5 పీడిత వర్గాలు

కుల వ్యవస్థలో అత్యంత దారుణమైన, అసమర్థనీయమైన లక్షణం, నాటి అస్పృశ్యతా విధానం. అబు డుబాయిస్ (Abbedubois) లెక్కల ప్రకారం దక్షిణ భారతంలో ఈఅంటరానివారి జనాభా సుమారు నాలుగో వంతుండేది. అన్ని సామాజిక వ్యవస్థల్లో బడుగువర్గాలవారు ఎన్నో సామాజిక అనర్హతలకు గురికావడం సహజమే. కాని భారతదేశంలో కుల వ్యవస్థ బడుగు వర్గాల వారిని పైకి ఎదగడానికి అడ్డుగా నిలిచింది. ధర్మ శాస్త్రాల పేరుతో పుట్టుక పైననే ఒక సాంఘిక దుష్ప్రచారం కొనసాగింది. ఆకళంకం వారిని పీడించింది. కులం న్యాయసూత్రాలు కూడపలుకుకొని వారిని బానిసలుగా మార్చాయి. సాంఘిక వ్యవస్థలో వారిపట్ల జరిగిన అన్యాయం, పీడన, అత్యాచారం, అత్యంత దయనీయం. దాని నుండి విముక్తి పొందడానికి కూడ వీలు లేకుండా పోయింది.

ఈ అంటరానికులాల వారు లేదా తెగలు అస్థిర నివాసులు, మానవ జీవిత విధానంలో, అశుభ్రమైన, కళంకమైన పనులన్నీ చేయాలి. దొడ్లు ఊడ్వడం, తోళ్ళు శుభ్రం చేయడం, మొదలైన పనుల్లో వారు జీవితాంతం గడపాలి. వీరి పరిస్థితి ముఖ్యంగా బెంగాల్, దక్షిణ భారతంలో కడు నికృష్టంగా ఉండేది. వీరు ఊరికి దూరంగా నివసించాలి. అయితే, ఉత్తర ప్రదేశ్, బీహార్ మధ్య భారతంలో అంటరాని వారిపై ఆంక్షలు అంత కఠినంగా లేవు. సంఘ బహిష్కరణ దక్షిణ భారతమంత మొరటుగా, నికృష్టంగా ఉండేది కాదు. మలబార్‌లో పులియా అనే అంటరాని కులముండేది. వారు పశువులతో సమానం. పులియా కులంవారు పొరబాటున నాయర్‌కు రోడ్డుపై తారసపడితే, అతనిని అక్కడనే పొడిచి చంపవచ్చు. అందువల్ల ఈ అంటరానివారు ముఖ్య రహదారులపై నడిచేవారు కాదు. ఈదుర్మార్గమైన కుల విభజన మలబార్‌లో పతాక స్థాయి చేరిందని, కుల వ్యవస్థ మనిషికి మనిషికి మధ్య దూరం పెంచి, మానవతా భావాన్ని, కనికరాన్ని దూరం చేసిందని ఫోర్బ్స్ (Forbes) వ్యాఖ్యానించారు. ఈ అస్పృశ్యులకు సాంఘిక హోదా, సామాజిక హక్కులు లేవు. మనుష్యులందరూ ఒక్కటే కాదని, భిన్నంగా సృష్టించబడ్డారని, వారి కర్మను మార్చడానికి వీలులేదనే మెట్ట వేదాంతం వారికి నూరిపోయబడింది. సమాజంలో వారికి గుర్తింపు లేదు. వారి పరిస్థితిని మెరుగుపర్చుకొనే అవకాశంగాని, ఆశగాని లేదు. బెంగాల్‌లోని హలాచరులు, చండాలురు, మలబారు లోని పులియాలు నాయడీలు దక్షిణ భారతంలోని పరియాలు, ఛండాలురు, చెప్పులు కుట్టేవారు, తదితర అంటరాని వర్గాల వారి జీవితం నరకప్రాయం. 'సాంఘిక వ్యవస్థలో గజ్జి కుక్కలుగా వారు హిందూస్థానమంతటా ఈసడింప బడ్డారని' బేకన్ (Bacon) విమర్శించారు.

### 1.5.1 సాంఘిక అనర్హతలు

ఈ అంటరాని పీడిత వర్గాలకు పౌర హక్కులు లేవు. వీరు రోమన్ సామ్రాజ్య కాలంనాటి బానిసల కన్నా హీన స్థితిలో ఉండేవారు. బానిస స్వేచ్ఛాజీవిగా మారడానికి రోమన్ న్యాయసూత్రాలు అభ్యంతరం చెప్పలేదు. కాని భారతదేశంలో కుల వ్యవస్థ అట్టి అవరోధాలు సృష్టించి, వారి స్వేచ్ఛాగమనాన్ని, పౌర సత్వాన్ని నిరోధించింది. వారికి స్వతంత్ర ఆస్తి హక్కులేదు. మలబారులో తాము పనిచేస్తున్న భూస్వామి వద్ద బానిసల

వలె ఉండేవారు. ఇతర కులాలవారి ఊరేగింపులో పాల్గొనరాదు. వారి పాద ఛాయలు బ్రాహ్మణుల నివాస ప్రాంతాలను కళంకం చేస్తాయి. వారు హిందూ దేవాలయాల్లో ప్రవేశింపరాదు. అంతేగాక మిగతా ప్రజలు వాడుకొనే నూతులనుండి నీరు తీసుకోకూడదు. చివరకు వారకాంతలు కూడా వారిని తాకరాదు. సమాజం నుండి ఈ రీతిగా వెలివేయబడి, హీనపర్చబడినవారు, సమాజంలోని మంచికి, ఆదరణకు దూరమయ్యారు. అయితే, భారతదేశంలో ప్రవేశించిన ఐరోపా వారు మాత్రం వీరిని తమ వ్యక్తిగత పనులు చేయడానికి నియమించుకొనేవారు. ఈ అంటరాని వారిని వర్గీకరణ చేయడం కష్టమైన పని. వివిధ ప్రాంతాల్లో వీరి పరిస్థితుల్లో, పనుల్లో కొంత వైవిధ్యం కన్పిస్తుంది. మొత్తం మీద వారు శూద్ర కులంలోని అధములు. వారికి సామాజిక వ్యవస్థలో అతి నికృష్టమైన పనులను మాత్రమే అప్పగించేవారు.

## 1.6 కుల వ్యవస్థలో అభివృద్ధి ధోరణులు

నాటి సామాజిక వ్యవస్థ కుల పద్ధతిని కాదనలేకపోయినా, కుల పద్ధతిలోని కాఠిన్యత తగ్గించే ధోరణులు 18 శతాబ్దంలో కన్పిస్తాయి. పీష్వాల పరిపాలనలో కుల నియమాలు ఉల్లంఘింపబడినా, శిక్షల అమల్లో ఉదారత ద్యోతకమయ్యేది. వివాహం, స్త్రీలతో లైంగిక కార్యకలాపాలకు సంబంధించిన శిక్షల్లో మాత్రం ఎలాంటి ఉదారత చూపేవారు కాదు. ఎవరైనా కులం నుండి కొన్ని కారణాల వల్ల బహిష్కరింపబడితే, వారు చేసిన నేరాలు తీవ్రమైనవి కాకపోతే, వారిని తిరిగి కులంలోనికి తీసుకొనేవారు. పాప పరిహారార్థం కొన్ని పనులు చేయాలి. అంతేకాక, కులాల మధ్య భోజనాలు చేసే విషయంలో కూడ పట్టింపులు కొంత వరకు తగ్గినట్లుగా, నాటి ప్రభుత్వ రికార్డులు తెలియజేస్తున్నాయి.

వైశ్యులకు దిగువగా ఉన్న వ్యవసాయం చేసే కులాలు, ఉత్పత్తులకు తోడ్పడే కులాలన్ని అధమమని, వారిని జంతువుల కన్నా హీనంగా చూసేవారని జేమ్స్ మిల్ (James Mill) చెప్పారు. వారి అభిప్రాయం సమంజసం కాదు. వారిలో చాలమంది స్వతంత్రమైన, గౌరవమైన జీవనమే గడిపారని, వారి జీవన సరళి సమకాలీన ఐరోపాలోని ఆ వర్గాల జీవన సరళికి ఏమాత్రం తీసిపోలేదని విల్సన్ (Wilson) అభిప్రాయపడ్డారు. బడుగు కులాల వారు కూడా సమాజంలో వారి సేవలు ఎంత ఆవశ్యమో గమనించి తమ ఉనికిని, హోదాను పెంచుకోవడానికి, వ్యక్తిత్వాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నాలను మొదలు పెట్టారు. వారు ఉన్నత వంశాల నుండి వచ్చినట్లుగా ప్రకటించి, పైకి ఎదగడానికి కృషి చేసారు. ఈ కృషిలో వివిధ కులాల మధ్య తీవ్రమైన పోటీ ఉండేది. ఉత్తర సర్కారు జిల్లాల్లో వెలమలు, క్షత్రియులుగా గుర్తింపబడాలని, చేనేత పనివారు వృత్తి పనివారలు, వైశ్యులతో సమానమని పోటీ పడటం దీనికి చక్కని ఉదాహరణం. మైసూర్‌లోని లింగాయతులు తాము శూద్రులం కామని, పై కులాలకు చెందిన వారమని, కోమట్లు తామే నిజమైన వైశ్యులమని, బ్రాహ్మణుల తరువాత తామే ముఖ్యులమని చెప్పుకొన్నారు. కంసాలి వారు చేనేత వారు కొన్నిచోట్ల మిగతా కులాల వారు జంధ్యం వేసుకొని తాముకూడా ద్విజులమే అని చెప్పసాగారు. కొందరు సంస్కృత భాషను అధ్యయనం చేసి, బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని సవాలు చేసారు.

ఉత్తర భారతంలో కూడా ఈ పోకడలు కన్పిస్తాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లోని ఖతేరి అనే కొండతెగ బీహార్‌లో వ్యవసాయం చేసుకొంటున్న 'క్షేతరిస్' (Kshetauris) అనే కులం సైనిక వర్గానికి చెందిన వారమని చెప్పడమేకాక, దానికాధారంగాఎన్నో కథలను సృష్టించారు. బీహార్‌లోని 'భర' (Bhars) అనే వృత్తిపరమైన కులం 'ప్రతిహార రాజపుత్రులనే బిరుదును తీసుకొన్నారు. 'భుమిరా' (Bhumiras) అనే దిగువ స్థాయి తెగ బ్రాహ్మణులమని చెప్పుకొన్నారు.

బడుగు కులాలు ఒకవైపు పైకి ఎదగాలని ప్రయత్నిస్తూ, మరోవైపున తమకులాల సామాజిక అలవాట్లలో కూడ మార్పులు చేసుకొన్నారు. వితంతు వివాహాలు, మత్తుపానీయాల వాడకం, వ్యభిచారం, మాంసాహారం మొదలైన వాటిని, జంతు బలులను మానివేసారు. వీరి సామాజిక ఎదుగుదల నాటి మత జీవనాన్ని కూడా ప్రభావితం చేసింది. 18వ శతాబ్దాంతానికి ఎన్నో పాత కులాలు సంలీనమై, కొత్త కులాలుగా ఆవిర్భవించాయి. అయితే కులాలు, వాటి నుండి ఉపకులాలు రావటం హిందూ జీవనంలో అంతర్భాగమయ్యాయి. అతి చిన్న విషయంపై విభేదించి, ఒక ఉపకులంగా మారటం హిందూ నైజంగా మారిందని 'రాబర్ట్ ఓర్మ్' (Robert Orme) వ్యాఖ్యానించారు. సామాజిక అసమానతవల్ల వచ్చిన అవమానం, హిందూ మతంలోనికి కొన్ని ఆదిమ తెగలు ప్రవేశించడం, నూతన కులాల ఆవిర్భావానికి కొంత వరకు కారణమయ్యాయి. 1770లో వచ్చిన కరువు సందర్భంగా ఆకలికి తట్టుకోలేక అగ్రకులాల్లో కొందరు నిమ్న కులాల నుండి ఆహారాన్ని స్వీకరించి, కులభ్రష్టులై, ప్రత్యేక కులంగా గుర్తింపబడ్డారు. ఈ రీతిగా కుల పద్ధతిలో 18వ శతాబ్దంలో ఎంతో అంతర్మథనం జరిగింది.

## 1.7 సంగ్రహంగా

కుల వ్యవస్థ, దాని రూపురేఖలు, నియమాలను చదివి ఉన్నాం. ఈ భాగంలో సామాజిక వ్యవస్థలో కులం ఎంతటి ముఖ్యమైన, గణనీయమైన పాత్రను నిర్వహించిందో, కుల ప్రాధాన్యత సామాన్య జీవనాన్ని ఎట్లా నిర్దేశించిందో చర్చించడమైంది. 18వ శతాబ్దంలో ఈ వ్యవస్థ వ్యక్తిపై సామాజిక అదుపును నిర్దేశించింది. అతిభయంకరమైన ఆచారాలు సాంప్రదాయాలు, పద్ధతుల ద్వారా నాటి సాంఘిక జీవితాన్ని నడిపింది. ఈరోజున న్యాయస్థానాలు సుదీర్ఘమైన న్యాయ సూత్రాలను నిర్దేశించే విధానాన్ని నాటి కులం నిర్వర్తించింది. అది హిందూ ప్రజల్లో వర్గాలను సృష్టించి, వర్గ విభేదాలను కల్పించి, కులం పేరుతో కొన్ని వర్గాలను అవమానించి పీడించింది. సంకుచిత దృష్టిని కల్పించింది. మరోవైపున సామాజిక వ్యవస్థలో క్రమశిక్షణను, పద్ధతిని, సాంప్రదాయాల పరిరక్షణను కూడా సాధించింది. కాలానుగుణంగా కుల వ్యవస్థ పరివర్తన కూడా చెందింది. 18వ శతాబ్దాంతానికి కుల సంఘాలు చేసిన నిర్ణయాలను మార్చే అధికారాన్ని చాల వరకు, చాల ప్రదేశాల్లో ప్రభుత్వం స్వీకరించడం ఒక ముఖ్యమైన పరివర్తన.

ఈ రీతిగా కుల వ్యవస్థ నాటి సామాజిక జీవితాన్ని ప్రభావితం చేసింది, నిర్దేశించింది. ఈకుల వర్గీకరణ హిందువులనే కాక, ముసల్మానులను కూడ ప్రభావితం చేయడం ఆశ్చర్యకరమైన విశేషం.

## 1.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. 18వ శతాబ్దపు భారతదేశ సామాజిక వ్యవస్థలో కుల వ్యవస్థ రూపు రేఖల్ని వివరించి, వృత్తి వివాహ వ్యవస్థలో కుల ప్రభావాన్ని విశ్లేషించండి.
2. 18వ శతాబ్దంలో కులపరమైన వర్గ విభజన ఎలా రూపాంతరం చెందిందో వివరించి, వివిధ కులాలకు కుల వ్యవస్థ నిర్దేశించిన ఆధిక్యతానర్హతలను విశ్లేషించండి.

II. **క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలు రాయండి.**

1. కులం - వృత్తి 2. కులం - వివాహ వ్యవస్థ 3. కుల వ్యవస్థలో అభివృద్ధి ధోరణులు

## 1.9 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Raghuvamsi | : | **Indian society during the 18th century** |
| Datta K. K. | : | **Survey of Social life and economic condition of 18th century** |
| Majumdar | : | **History of India Social and political Ideas** |
| Natarajan | : | **Century of Social Reform in India** |
| Srinivas | : | **Social change in Modern India** |


రచయిత : శ్రీ ఎ. వి. కోటిరెడ్డి

BRAOU

# భాగం - 2 మత వ్యవస్థ

విషయ క్రమం

2.1 లక్ష్యాలు
2.2 పరిచయం
2.3 మతాంతర భేదాలు
2.4 మత శాఖల వైవిధ్యత
2.5 సన్యాసత్వం
2.6 కర్మకాండ - ఆచారకాండ
2.7 మత శాఖల మధ్య సంబంధాలు
2.8 మత సహనం
2.9 మత సమన్వయం
2.10 మతాచారాలపై విమర్శ - సంస్కరణలు
2.11 భారతీయ సమాజంపై మత ప్రభావం
2.12 మతం – సామాజిక వ్యవస్థ
2.13 సంగ్రహంగా
2.14 పరీక్ష నమూనా ప్రశ్నలు
2.15 ఉపయుక్త గ్రంథాలు

## 2.1 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగల్గాలి.

- సామాజిక వ్యవస్థపై మత ప్రభావం
- మతంలోని భిన్న శాఖల వివరణ
- వివిధ మతాల మధ్య నెలకొన్న సమన్వయ వాతావరణ విశ్లేషణ

## 2.2 పరిచయం

18వ శతాబ్దంలో భారతీయ సాంఘిక వ్యవస్థపై మత ప్రాబల్యం తీవ్రంగా ఉండేది. దేశమంతటా ఎక్కడ చూసినా ఎన్నో దేవాలయాలు, ఎందరో దేవుళ్ళు, కొన్ని దేవాలయాలు పురాతన చిహ్నాలు కాగా, మరికొన్ని అఖండ మానవ సంకేతాలు.భారతీయులకు తమ దేశం యావత్తూ పవిత్రమైన స్థలిగా కన్పించిందని రాబర్టు ఓర్మ్ (Robert Orme) ప్రశంసించాడు. దక్షిణ భారతంలో, నగరాల్లో, గృహాల్లో, బహిరంగ ప్రదేశాల్లో, కొండల్లో, కోనల్లో, నదీతీరాల్లో ఎక్కడ చూసినా, గుళ్ళు, గోపురాలు ప్రత్యక్షమవుతాయి. వారి మత భావన, మతంపట్ల ఆసక్తి నిష్కళంకం. దక్షిణ దేశంలో హిందువుల మత దృక్పథం చూసి డుబాయిస్ (Dubois) ఆశ్చర్యపడగా, బెంగాల్‌లో మత పవిత్రత కోసం ప్రజలు ప్రాణాలను సైతం లెక్కచేయరని స్క్రీఫ్టన్ (Screfton)



BRAOU

ప్రశంసించాడు. "శాంతికాముకులైన హిందువులు తమ మతవిధుల నిర్వహణలో పొందే ఆనందాన్ని, సామాజిక ప్రార్థనల ఉత్సాహాన్ని చూస్తే నాకు తరచూ అసూయ కల్గేదని" ఫోర్బ్స్ (Forbes) రాసాడు. అదే రీతిలో ముసల్మానులు మహమ్మద్ ప్రవక్త బోధనలను ఎంతో భక్తి శ్రద్ధలతో అనుసరించేవారు. మత గ్రంథాలపట్ల, మహిమలపట్ల విశ్వాసం చూపేవారు. మతపరమైన ఉపవాసాలను, మత పండుగలను, క్రమం తప్పకుండా పాటించేవారు. స్త్రీ పురుష భేదం లేకుండా, 'రంజాన్'ను మత విధిగా అనుసరించేవారు. మక్కా యాత్ర ఎంత కష్టభూయిష్టమైనా మత విధిగా నిర్వర్తించడానికి, అలసట, ఆకలి దప్పులను మరచి, ఈ పవిత్ర యాత్రకు సిద్ధమయ్యేవారు. పారశీకులు కూడా తమ మతం పట్ల ఎంతో విశ్వాసాన్ని చూపేవారు. మతం నాటి ప్రజలపై ఎనలేని ప్రభావాన్ని చూపి, వారి ఆలోచనలను, గుణగణాలను ప్రవర్తనను నిర్దేశించింది.

## 2.3 మతాంతర భేదాలు

నాటి మత జీవనంలో మతాంతర భేదాలు ఒక ప్రముఖ లక్షణం. ప్రతి మతంలో ఎన్నో శాఖలు, ఉప శాఖలుద్భవించాయి. హిందువుల్లో సాంప్రదాయ బద్ధమైన శైవ, వైష్ణవ తెగల్లో ఎన్నో శాఖలు ఉప శాఖలు వచ్చాయి. మొత్తంమీద హిందూ మతం విస్తృత పరిధిలో ఒకటిగా కన్పించినా, ప్రజల మతాలోచనలు వాస్తవాన్ని ప్రతిబింబించినా, మత ప్రార్థనలు, అనేకంగా కన్పించినా వివిధ ప్రాంతాల్లో భిన్నమైన మత శాఖల ప్రాబల్యం కన్పిస్తుంది. బెంగాల్‌కు పశ్చిమోత్తరంగానున్న ప్రాంతంలో వైష్ణవిజం ప్రబలంగా ఉండగా, రాముడు, సీత వారి ఆరాధ్య దైవాలు. బెంగాల్‌లో శైవ మతం ఎక్కువ. శైవ మత శాఖల్లో 'ఆగమ' (Agama) అని చెప్పబడే తాంత్రిక విద్యలు తోడ్పడేవి. ఉత్తర ప్రదేశ్‌కు తూర్పుగా ఉన్న ప్రాంతాల్లో కాళీ మాత ఆరాధన ఆంగ్లేయ సామ్రాజ్య స్థాపనకు ముందుగా లేదని 'బుకానన్' (Buchanan) రాసాడు. దక్షిణ భారతదేశంలో వైష్ణవ, శైవ సాంప్రదాయాలు రెండూ ప్రబలంగా ఉండేవి. బ్రాహ్మణులు ఎక్కువగా వైష్ణవులు కాగా, శూద్రుల్లో అత్యధికులు శైవులు.

ఉత్తర భారతంలో వైష్ణవులు నాలుగు సాంప్రదాయాలుగా విభజింపబడ్డారు. (1) రుద్ర, (2) శ్రీ, (3) బ్రహ్మ (4) సనక్, వారు శంకర, రామానుజానంద గురువుల శిష్యులు. శ్రీ సాంప్రదాయమనుసరించిన వారిని 'రామయత్ (Ramayut) లని 'సనక్' (Sanak) సాంప్రదాయం వారిని 'నిమాయత్' (Nimayat) లని పిలిచేవారు. విష్ణు భక్తులు ముఖ్యంగా ఉత్తర భారతంలో రాముని, కృష్ణుని ఆరాధించగా, దక్షిణ భారతంలో నారాయణుని పూజిస్తారు. బెంగాల్‌లో శైవులు మూడు రకాలు. (1) దయాభవ (2) పోసుభవ (3) వీరభవ, వీరు కాళి, దుర్గ ఆరాధకులు. వీరుకాక కబీర్ పంక్తి, నానక్ పంక్తి, రాధ వల్లభి, రామానంది, మొదలైన మత శాఖలుండేవి. బెంగాల్‌లో చైతన్య శిష్యులు ఒక ప్రత్యేక వైష్ణవ శాఖగానుండేవారు. వీరు భక్తికి మొదట ప్రాధాన్యత ఇస్తారు. వారు మిత్రులతో, బంధువులతో కలిసి తమ ఆరాధ్య దేవతను ఉద్దేశించి ప్రార్థనలు, గీతాలను ఆలాపిస్తారు. దేవతా విగ్రహం ముందు మోకరిల్లి, దేవత పేరును వల్లిస్తూ, పాదాలను కడుగుతూ, దేవతా లక్షణాలను స్తుతిస్తూ పరవశం చెందుతారు. 'గౌర్' ప్రాంతంలో 'శకీభవ' అనే వైష్ణవ శాఖ ఉండేది. దాని సభ్యులు ఆడ పేర్లు పెట్టుకొని, ఆడ వేషం వేసుకొని, కృష్ణుడిని ఆరాధిస్తూ నాట్యం చేసేవారు. బీహార్‌లో సూర్యదేవుని ఆరాధకులెంతో మంది ఉండేవారు.

దక్షిణ భారతదేశంలో బ్రాహ్మణుల్లో నాలుగు ముఖ్య శాఖలుండేవి. (1) వైష్ణవులు (2) స్మార్తులు (3) తత్వవాదులు (4) ఉతరామహులు. అత్యధికులు స్మార్తులు. వీరు శివుని, విష్ణువుని ఆరాధించేవారు. శివ పూజలో శూద్రులవలె బలులు ఇచ్చేవారు కాదు. మైసూర్‌లోని శృంగేరిగిరి వీరి మతాధిపతి స్థానం. శంకరాచార్యుడు ఇక్కడ మతాన్ని నెలకొల్పినట్లు చెప్పబడింది. బ్రహ్మణేతర్లలో లింగాయతులు శివభక్తుల్లో ప్రముఖులు. జీవిత చక్రంలో జన్మ, గమన, మరణ అనే మూడు ఘట్టాలున్నాయని, మత విధులను సక్రమంగా నిర్వహిస్తే, వారు ఈ జీవిత

BRAOU
Dr. BRAOU LIBRARY Acc. No: 115060 Class No: 954 CHE

చక్రాన్ని అధిగమించి దైవ శక్తిలో సంలీనం కావచ్చునని వీరి నమ్మకం. బ్రాహ్మణుల్లోని అన్ని వర్గాల వారు ఎంతో కాలాన్ని వినియోగిస్తూ చేసే విస్తృత పూజాపునస్కారాల తతంగం బాహ్యంగా చేసే మత సంబంధ కర్మ కాండను వారు తీవ్రంగా గర్హిస్తారు. లింగాయతులు తమ శాఖ చిహ్నాన్ని వెండి పెట్టెలో భద్రపర్చి, నిరంతరం మెడలో ధరిస్తారు. వారి పూజారులు కూడా బడుగు కులాల నుండి వచ్చిన వారే. ఈ శాఖలు దక్షిణ భారతమంతా విస్తారంగా ఉండేవని, వారు ఒక సంస్కరణ ఆగమనానికి ప్రతీకయని విల్క్స్ (Wilks) అభిప్రాయపడ్డాడు.

ముసల్మానుల్లో షియా, సున్నీలు, సాంప్రదాయకంగా వచ్చిన ప్రముఖ శాఖలు. వారు కాక ఎన్నో మత శాఖలు వచ్చాయి. ఉత్తరప్రదేశ్, బీహార్‌లోని, ముసల్మాన్ నేతపని వారు ఒక ప్రత్యేక శాఖగా రూపొంది, కబీర్ శిష్యులయ్యారు. వారు ప్రవక్తల్లో నమ్మకం కలిగినవారైనా, ప్రార్థనలో పెద్దపూసల దండలు వాడేవారు. 'బొహ్రా' లనే (Bohras) మరో వర్తక బృందం ఒక ప్రత్యే శాఖగా ప్రత్యేక పూజారులతో ఏర్పడింది. మధ్యభారతంలో ఉజ్జయినీ ఈ శాఖకు కేంద్రంగా ఉండేది. వారి ముఖ్య మతగురువు ఏడాది అంతట అనుసరించవలసిన నియమాలు ప్రకటించేవాడు.

## 2.4 మత శాఖల వైవిధ్యత

ఈమత శాఖల రూపులో భిన్న ప్రాంతాల్లో వైవిధ్యం కన్పిస్తుంది. బెంగాల్, దక్షిణ భారతంలో భిన్న శాఖలవారు తమ శాఖను తెలిపే సంకేతాలను ధరించేవారు. వైష్ణవులు 'నామం' అంటే మూడు నిలువు గీతలు, ఒక అడ్డగీతను అడుగున కలుపుతూండేది (Ψ) ధరించగా, శైవులు ముఖాన బూడిద పూనుకొని, చేతికి లింగాన్ని ధరించేవారు. 19వ శతాబ్దానికి ఈ శాఖ భేదాలు పశ్చిమ బెంగాల్, ఉత్తర భారతంలో బాగా తగ్గిపోయాయి. బీహార్ లోని హిందువులు, ఏశాఖను ప్రత్యేకంగా అనుసరించ లేదు. వారిష్టమైన దైవాన్ని ఆరాధించారు. హిందు మతంలో ప్రతి శాఖకు ఒక ప్రత్యేకమైన పూజారి వర్గం ఉంటుంది. ముఖ్య పూజారిని 'గురు' లేదా 'మహంత్' అని పిలిచేవారు. గురు ఆసనాన్ని సింహాసనం అని, అతని క్రింద ఉన్న విభాగాలను 'మారా'లని పిలిచేవారు. మఠాలకు కూడా అధిపతులుండేవారు. వారు మత సిద్ధాంతాలను ప్రచారం చేయడమేకాక, ఆశాఖ మత సూత్రాలను, ఉల్లంఘించిన వారిని శిక్షించేవారు. పూజారులు బ్రహ్మచారులుగా ఉండే పనిలేదు. శ్రీవైష్ణవుల స్మార్త బ్రాహ్మణుల్లో మఠాధిపత్యం కాలక్రమేణా వంశపారంపర్యంగా మారింది. వీరు కొన్ని సందర్భాల్లో మత సంబంధం కాని విషయాల్లో జోక్యం చేసుకొని, మార్పులు చెపుతూ, కుల మండలుల పాత్రను నిర్వహించేవారు. ఈమఠాధిపతులు వైభవాన్ని, దర్పాన్ని వారికున్న భోగభాగ్యాలను గూర్చి, బ్రహ్మాండమైన నివాసాలను గూర్చి ఎందరో ఐరోపా చరిత్రకారులు రాశారు. వీరు సన్యాసుల వలెకాక రాజఠీవితో ప్రజల ముందు తమప్రాభవాన్ని చూపేవారు. వారు భూమి మీద సంచరిస్తున్న దైవ ప్రతినిధులుగా చలామణి కాగా, వారి భక్తులు వారి పాదాలను కడిగిన నీటిని సేవిస్తూ, తరించామని భ్రమించేవారు.

## 2.5 సన్యాసత్వం (Asceticism)

ప్రతి మతంలోను వైరాగ్యాన్ని ఒక ఉన్నత ఆదర్శంగా పరిగణిస్తారు. అదేవిధంగా భారతదేశంలో కూడా ఇహ లేదా ఐహిక సౌఖ్యాలను జయించి, భవ బంధాలకతీతమైన వారిని మతపరంగా ఎంతో గౌరవించేవారు. విరాగులు, యోగులు, సన్యాసులను, హిందూ మత ప్రజలు ఎంతో ఆదరించి, ఆరాధించేవారు. వారి జపతపాలు, కోరికలపై అదుపు, తపస్సు, పాప పరిహారార్థం, పరాకాయ క్లేశం, పలువురి మెప్పు పొందేది. ముసల్మానుల్లో 'దర్వేష్' (Darvesh) మానవ ప్రకృతిలోని అత్యున్నత ఆదర్శంగా భాసిస్తుంది. దైవ ప్రార్థనల్లో ఇహ విషయాలను సర్వం త్యజించిన సూఫీలు ఇస్లాంలో ఆరాధింపబడేవారు. సూఫీల్లో, ఫకీర్లలో ఎన్నో రకాలుండేవారు. వారు కూడ దైవ

చింతనలో కాయక్లేశాన్ని అనుభవించేవారు. వారి ప్రార్థనలు, పూజలు, కొంతవరకు హిందూ సన్యాసులను పోలియుండేవి. పరమానందం కొరకై భారతీయ యోగులు తమ దేహాలను ఎన్ని బాధలకు గురిచేసుకొనేవారో, వీటిని గూర్చిన వివరణలు ఎన్నో వారి రాతల్లో కన్పిస్తాయి. కొందరు దేహాలు కృశించగా, మరికొందరు దుమ్ము, ఆవుపేడ, బూడిద ఒంటినిండా పూసుకొని, ఏకాంతంగా ఏళ్ళతరబడి నివసించేవారు. ఇట్టి సాధువుల, సన్యాసుల దర్శనానికై ఉన్నత రాజోద్యోగులు, పెద్దలు స్వయంగా వెళ్ళేవారు. 18 రకాల తపస్సులున్నాయని చెప్పబడింది. ఇనుప ముళ్ళతో చేయబడిన మంచంపై పరుండే సన్యాసులను, చేతులు పైకెత్తి అలాగే రోజుల తరబడి నిలుచునే సాధువులను గూర్చి ఎన్నో విశేషాలు నాటి ఐరోపా వారి రచనల్లో కన్పిస్తాయి. వీరు పూర్తిగా భిక్షపై ఆధారపడి, విస్తృతంగా దేశాటన చేస్తూ, తాము నమ్మిన ధర్మం కోసం ఎన్ని బాధలనైనా స్వచ్ఛందంగా, ఆనందంగా అనుభవించేవారు.

హిందూ కుటుంబాల్లో జరిగే వేడుకలకు, మత కార్యక్రమాలకు పూజారులు సామాన్యంగా వివాహితులుగా ఉండేవారు. శిక్కులు, జైనుల్లో ఐహిక సుఖాలను వదలుకొని సన్యసించినవారే ఎక్కువగా పూజారులుగా గౌరవింపబడేవారు. హిందూ మతంలోని విరాగులను 'షేర్ ఆలీ జఫారీ' (Sher Ali Jafari) ఐదు వర్గాలుగా విభజించాడు.

1. సన్యాసులు : అన్ని భౌతిక వాంఛలను జయించి, జుట్టును పెంచుకొని, నిరంతర ప్రార్థనతో, మట్టి, బూడిదలను పూసుకొని జీవించేవారు. వారు బాహ్యంగా అనాగరికంగా కన్పించినా, ఆంతరంగికంగా భాగ్యశీలురు.
2. యోగులు : వీరు మత ప్రార్థనలు చేయడమేకాక, ఎన్నో యోగాసనాలను ప్రదర్శించేవారు. ఊపిరి బిగపట్టి ఎంతో కాలం నిలువగలిగేవారు. వారు దీర్ఘాయువులు. వారికి మహిమలుండేవి.
3. విరాగులు : భక్తి మాత్రమే వారికి ముఖ్యం. దేవుని పేరు తలచుకొని, ఆనంద పారవశ్యంలో నాట్యం చేస్తుండేవారు.
4. ఉదాశీలురు లేదా నానక్ పంక్తులు : వీరు నింతరం పాటలు గీతాలను ఆలాపిస్తూ, దైవ నామస్మరణ చేసేవారు.
5. జాతిస్ పిరాలు : చిరుగుపాతలతో ఒళ్ళు కప్పుకొని, ఉపవాసాలు చేస్తూ తమను తామే శిక్షించుకుంటూ బ్రతికేవారు. వీటిలో నాలుగు ఐదు వర్గాలు సిక్కులకు, జైన మతానికి సంబంధించినవి. ఆలీ జఫారీ (Ali Jafari) ఈ రెండు మతాలను కూడా హిందూ మతంలో భాగంగానే పరిగణించాడు.

అయితే ఈ సన్యాసి వర్గం ఎక్కువగా బ్రాహ్మణేతరులల్లోనే కన్పిస్తుంది. బ్రాహ్మణులు దిగంబరులుగా వెళ్ళినట్లుగాని, సన్యాసుల అతిక్లిష్టమైన నియమాలను పాటించినట్లుగా కన్పించదు. ఆడ సన్యాసులు (సన్యాసినుల) గూర్చి చెప్పబడినా, అంతగా ప్రాచుర్యాన్ని పొందలేదు. దక్షిణ భారతంలో విష్ణు, శివ సంబంధమైన 'గరుడ బసవినులు', 'లింగ బసివినులు' దేవాలయాలకు అనుబంధంగా ఉండేవారు. అయితే, మతం పేరుతో కొంతమంది దొంగ సన్యాసులు కూడా తయారై, సామాజిక వ్యవస్థను కళంకితం చేశారు. దానధర్మాలను దుర్వినియోగం చేశారు.

## 2.6 కర్మకాండ, ఆచారకాండ (Ceremonies and Rituals)

నాటి ప్రజా జీవనంలో మత సంబంధమైన కర్మకాండకు, ఆచారకాండకు ఎంతో ప్రాధాన్యముండేది. ఆత్మ పరిశుద్ధతకు, పాప పరిహారానికి, ఇవి ఆవశ్యకాలని హిందువుల నమ్మకం. అందువల్ల వీటిని ఖచ్చితంగా

BRAOU

పాటించాలని విశ్వసించేవారు. అయితే ఈ కాండలు ఎంతో ఖర్చుతో కూడుకున్నవి. అందరికి అందుబాటులో లేనివి. హేతు వాదం లోపించి, విద్యావంతులైన వారు కూడా ఈ కర్మాకాండలను తు.చ. తప్పకుండా అనుసరించారు. దీనితో మతం పూర్తిగా కర్మకాండలకు, ఆచారకాండలకు నిలయమైంది. వీటిపై సమయాన్ని, ధనాన్ని వెచ్చించారు. అంతేకాక కుటుంబ వ్యవస్థలో పుట్టుకకు, వివాహానికి, చావుకు కూడా ఈ కర్మకాండ అనివార్యమని భావింపబడింది. ఉన్నత కుటుంబాలవారు ఈ కర్మకాండను నిర్వహించడానికి ప్రత్యేక పూజారులను కలిగి ఉండేవారు.

దీనితో పూజారి వర్గం సాంఘిక వ్యవస్థలో ఎంతో ముఖ్యులయ్యారు. కుటుంబ లేదా సామాజికోత్సవాల్లో వారే సారధులు. వారు చెప్పిన వ్యాఖ్యానమే మతం.వారు హిందూ కుటుంబాల్లోని పిల్లలకు 'దీక్ష' నిచ్చి, మత ప్రవేశాన్ని కల్పిస్తారు. పారశీకుల్లో కూడా ఈ పద్ధతి ఉంది. వారి మత పూజారులను 'దస్తూరు' (Dastur) అంటారు. వారికి ఎంతో అధికారం, పలుకుబడి ఉండేది. హిందూ మత ప్రభావంలో 'ఇస్లాం'లో కూడా 'క్వాజీలు' అనేవారు మత కర్మకాండను జరిపి, రుసుములు వసూలు చేసేవారు. అయితే వారి ఆచారకాండ హిందూ మతాచారకాండ అంత సంక్లిష్టం, విస్తృతం కాదు. మొత్తం మీద ఈ కాండల పేరుతో పూజారి వర్గం బాగా డబ్బు చేసుకొనేవారు. దానాలను విరివిగా స్వీకరించేవారు. దేవాలయాలకు, మసీదులకు అనుబంధం చేయబడిన ఆస్తులుండేవి పూజలకు కానుకలను స్వీకరిస్తారు. పూజారులు, ముల్లాలు సామాన్య ప్రజల తరపున పూజలు, ప్రార్థనలు నిర్వహించి, వారి పాపప్రక్షాళన పేరున రుసుములు స్వీకరించి, భోగభాగ్యాలను సంతరించుకున్నారు. మతం వాస్తవానికి భూస్వామ్య వ్యవస్థగా మారింది. దక్షిణ భారతంలో దేవాలయాలకు పెద్ద ఎత్తున మడి, మాన్యాలు దత్తత చేయబడ్డాయి. వందలకొద్దీ పూజారులు, నాట్యాంగనలు, సేవకులు, దేవాలయాలచే పోషింపబడేవారు. ఇక్కడ పూజాది కార్యక్రమాలు వైభవోపేతాలు, అలంకారప్రాయాలు కళాత్మకాలు. అన్నింటినీ మించి, అధిక వ్యయ జనితాలు. ఇక్కడి పూజారులు సనాతన సాంప్రదాయబద్ధులు.

## 2.7 మత శాఖల మధ్య సంబంధాలు

హిందూ మతంలో ఎన్నో శాఖలు, ఉపశాఖలుండడమే కాక, ఆ భిన్నత్వానికి ఉదారత తోడుకావడం విశేష లక్షణం. భిన్నత్వంవల్ల శాఖల మధ్య అగాధాలు సృష్టింపబడలేదు. పైగా అందరి హిందువుల్లోను మత సంబంధమైన ఏకీకృత దృక్పథం గోచరిస్తుంది. వారు పూజించే వివిధ దేవుళ్ళ మధ్య పోటీ లేదు. ఆధిక్యతను గూర్చిన ఆరాటం లేదు. రాముని పూజించేవారు శివుడిని కూడా ఆరాధిస్తారు. మత అసహనం, ఇతర మతాల వారిని దూరంగా ఉంచడం హిందువులకు తెలియదు. సామాన్య ప్రజలకు ఈ మత శాఖలను గూర్చి ఏమీ తెలియదు. వాటిని గూర్చి అసలు పట్టింపు లేదు. మత విషయాలు కుల భేదాలకు అతీతం. శైవుని కుమారుడు వైష్ణవునిగా మారడానికి ఎట్టి అభ్యంతరం లేదు. భిన్న శాఖల మధ్య వివాహాలు జరిగేవి. సామాన్యంగా భార్య, భర్త శాఖను స్వీకరించేది. ఐరోపాలో మత శాఖల పేరున శతాబ్దాలుగా జరిగిన నేరాలు హిందు మతంలో లేవని 'దుబాయ్‌స్' (Dubais) ఫోర్బ్స్ (Forbes) మొదలైన విదేశీ రచయితలు ప్రశంసించారు. అంతేకాక విద్యావంతులైన హిందువులు మూఢనమ్మకాలను విమర్శించి, మత విషయాల్లో ప్రాజ్ఞత ప్రదర్శించేవారు. మతం పేరుతో కలహాలకు దిగేవారు కాదు. బ్రాహ్మణుల్లో కూడా విద్యావంతులు ఎంతో ఉదారంగా ఉండి, బ్రాహ్మణ పూజారులను నిశితంగా విమర్శించేవారు. మతంలోని అవినీతిని, లంచగొండితనాన్ని ఈసడించారు.

ఈ ఉదారత క్రైస్తవ మతంపట్ల కూడా చూపినట్లు నాటి ఐరోపా రచయితలు పేర్కొన్నారు. క్రైస్తవ మతం లోని పరిశుద్ధ ఆత్మ సిద్ధాంతం హిందువులకు నచ్చింది. క్రైస్తవ మతంవల్ల తమ ఉన్నతమైన హిందూ మతానికి

BRAOU

ఎలాంటి హాని జరుగదని వారు భావించారు. హిందూ దేవాలయాల్లోనికి, హిందూ ఉత్సవాల్లో కొన్ని సందర్భాల్లో విదేశీయులు కూడా అనుమతింపబడ్డారు. "హిందువులకు తమ ఆచారాలపట్ల, మతంపట్ల ఉన్న అమిత స్వాభిమానం గమనించితే, అదే సమయంలో మానవత్వంపట్ల, తమ మతం అంగీకరించని వారిపట్ల వారు చూపే సహనం పరిశీలిస్తే ఈ భిన్నత్వంపట్ల ఆశ్చర్యం కలుగుతుందని" గ్రోజ్ (Grose) హర్షం వెలిబుచ్చారు.

## 2.8 మత సహనం

18వ శతాబ్దంలో మత సంబంధమైన ఘర్షణలు కానరావు. దాదాపు అన్ని మతాలు ఈ విషయంలో అపూర్వమైన మత సహనాన్ని చూపాయి. మతంలోని భిన్న శాఖల మధ్య ఎలాంటి వైరం పొడసూపలేదు. పైగా ఒకరినొకరు అర్థం చేసుకొని, సామరస్యాన్ని సాధించారు. 1765-76 మధ్య భారతదేశాన్ని సందర్శించిన డచ్ యాత్రికుడు 'స్టవరోనిస్' (Stavorinus) ఇలా రాశాడు. "ముసల్మానులు, హిందువులు, పారశీకులు అనబడే వీరి మతాలు ప్రత్యేకమైనవి. ఒకదాని నుండి మరొకటి ఎంతో భిన్నత్వాన్ని కలిగి ఉన్నాయి. వారు మత సహనం, ఇతరులపట్ల గౌరవం ప్రదర్శించారు. మతం పేరున ఎవరిని బాధించలేదు. వారందరూ ఒక నదీ ప్రవాహంలో, లేదా నది దగ్గర తమ ఇష్టదైవాలను ప్రార్థిస్తూ, ఇతరులపట్ల ఎలాంటి వ్యతిరేకతను, అసహ్య భావాన్ని ప్రదర్శించక, గౌరవ మర్యాదలతో ప్రవర్తించేవారు." హిందూ సాంప్రదాయానికి కంచుకోటగా చెప్పబడిన మలబార్‌లో కూడ కొంతమంది యూదులు (Jews) తమ మత సిద్ధాంతాలను యధేచ్ఛగా జరుపుకొనేవారు. ముసల్మానులు కూడా మత మార్పిడి సిద్ధాంతాన్ని వదలుకొన్నారు. మొగల్ నవాబ్ పాలనలో సూరత్‌లో అన్ని మతాలు సమానంగానే చూడబడ్డాయి. అదేరీతిగా మహారాష్ట్ర పాలనలో ఎక్కడ మత సంఘర్షణలు లేవు. మరాఠా సామ్రాజ్య ముఖ్య నగరమైన పూనా బ్రాహ్మణుల అధికార పీఠమైనా, అక్కడ ఎన్నో మసీదులు, చర్చిలు వెలిశాయి. వారెట్టి భయాందోళనలు లేకుండా తమ మతాన్ని అనుసరించే వారని, 1799లో విలియం హెన్రీటోన్ (William Henry Tone) రాశాడు.

ఉత్తర భారతంలో సామాన్య ప్రజల జీవనంలో మతపరంగా పెద్ద భేదాలు కన్పించేవికావు. రెండు మతాలకు చెందిన సామాన్య ప్రజల ఆచారాలు, అలవాట్లు, పండుగలు జరుపుకోవడంలో సాన్నిహిత్యం, సహనం కన్పిస్తుంది. పల్లెల్లో ఆడవాళ్ళు ఎలాంటి తారతమ్యాలు లేకుండా కలిసిపోయేవారు. వారణాసి వంటి హిందూ పవిత్ర స్థలిలో కూడా ముసల్మానుల, హిందువుల మధ్య సయోధ్య ఉండేది. ఉత్తర భారతంలో ఎట్టి వైషమ్యాలను తాను గమనించలేదని ట్వైనింగ్ (Twining) చెప్పగా, మధ్య భారతంలో చాలావరకు మత సంస్థలు, పండుగలు మూఢనమ్మకాలు, ఆచారాలు, రెండు మతాల మధ్యనొకటిగానే ఉండేవని మాల్కోలమ్ (Malcolm) తెలియచేశాడు. ఇతర దేశాలకు తెలియని ఈ మత సహనం భారతదేశ విశేషమని ఫోర్బ్స్ (Forbes) ప్రశంసించారు. హిందువు పుట్టుకతోనే అవుతాడు కాని మత మార్పిడివల్ల కాదన్న సిద్ధాంతం ఈ సహనానికి కొంత కారణం కావచ్చును. ఇస్లాం, సిక్కు మతవ్యాప్తికి కృషి జరిగినా, అది సామాజిక ప్రయోజనాలకు విఘాతమైనట్లుగా ఆధారాలు కన్పించవు. 18వ శతాబ్దంలో మతమనేది చాలవరకు వ్యక్తిగతమైన విషయంగానే ఉండిపోయి, సామాజిక ఘర్షణను నివారించిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

## 2.9 మత సమన్వయం (Religious Synthesis)

భారతదేశంలో మతం ఐహిక సుఖాలకన్నా పరమార్థానికి విలువనిచ్చింది. ప్రజల జీవితాలపై సన్యాసుల, సాధువుల ప్రభావం అమోఘం. 18వ శతాబ్దంలో ఈ సాధువులను పూజించడం హిందూ, ముసల్మాన్ సామాన్య ప్రజల మధ్య ఐక్యతా భావాన్ని నెలకొల్పింది. ఈ యోగుల సంస్మరణార్థం ఎన్నో సంస్థలు వెలిశాయి. స్వచ్ఛంద

BRAOU

విరాళాలతో వారి స్మృతి చిహ్నాలు నెలకొల్పబడి, మతసంబంధమైన సంగమ స్థలాలుగా విలసిల్లాయి. పంజాబ్‌లోని 'పాటియాల' (Patiala) దగ్గర ఉన్న 'దపాల్‌దల్' (Dapaldal) 'జలంధర్' దగ్గర ఉన్న 'సుల్తాన్ నజిరుద్దీన్' సమాధి 'పాట్నా' (Patna) వద్ద ఉన్న 'షా అరజాని' (Shah Arazani) స్మృతి చిహ్నం దీనికి ఉదాహరణలు. హిందూ, ముసల్మాన్ అనేభేదం లేకుండా, ఈ సాధువుల ఆశీర్వచనం కోసం అందరూ మొకరిల్లేవారు. అజ్మీర్‌లోని 'చిస్టీ' (Chistic) సమాధిని వేలాదిమంది దర్శించేవారు. మహరాజ సింధియా ఈ ముసల్మాన్ సాధువులపట్ల ఎంతో భక్తి, శ్రద్ధలు ప్రదర్శించేవాడు. మత ప్రమేయం లేకుండా విరాళాలను ఇచ్చేవారు. హిందూ, ఇస్లాం మతాల మధ్య సన్నిహితత్వం పెరగడానికి ఈ సాధువులు చాలావరకు కారణం. గురునానక్ కబీర్‌ల మత శాఖలు కూడా రెండు మతాల నుండి శిష్యులను ఆకర్షించి, మత సహనానికి కారణభూతమైనాయి. బీహార్ పరిసర ప్రాంతాల్లో రెండు మతాల సిద్ధాంతాలను సమన్వయపర్చిన కొన్ని మత శాఖలు వెలిసాయి. ఇలాంటి మత శాఖను గూర్చి బుకానన్‌కు (Buchanan) తెలియజేసిన ముగ్గురి పూజారుల్లో ఒకరు రాజపుట్, మరొకరు కాయస్థ, మూడోవారు కూర్మి.

హిందువులు ముసల్మాన్ సాధువుల స్మృతి చిహ్నాలకు మోకరిల్లినట్లే, ముసల్మానులు కూడా హిందూ దేవతలకు మొక్కుబడులిచ్చే వారు. ఇస్లాం మతంలో ఏకేశ్వరోపాసన (Monothesis) ముఖ్య సిద్ధాంతమైనా, భారతదేశంలో మాత్రం వారిపై హిందూ మత ప్రభావంవల్ల సూర్యుడు, చంద్రుడు మొదలైన ప్రకృతి దేవతలను కూడా ఆరాధించేవారు. బెంగాల్‌లో ముసల్మానులు 'కాళి'ని పూజించేవారు. హిందూ దేవతలకు కానుకలను సమర్పించేవారు. ముసల్మానులు హిందూ దేవాలయాల్లో పూజలు చేయగా, హిందువులు మసీదుల్లో ప్రార్థనలు జరిపేవారు. బ్రాహ్మణులు కొన్ని సమయాల్లో ఖురాన్ సంప్రదించగా, ముసల్మానులు సప్తఋషుల ఆశీర్వచనాన్ని ఆకాంక్షించేవారు. 18వ శతాబ్దంలో బెంగాల్‌లో ఈ రెండు మతాల మధ్య సమన్వయం వల్ల, 'సత్యపీర్' (Satyapeer) అనే దేవత వెలిసింది. ఆ దేవతను ప్రస్తుతిస్తూ హిందువులు ముస్లింలు బెంగాలీ భాషలో ఎన్నో ప్రార్థనా గీతాలను రచించారు. పూజలు జరిపి కానుకలిచ్చారు. సత్యపీర్ ఆవిర్భావం, ఆరాధన, నాటి హిందూ-ఇస్లాం మతాల సఖ్యతకు, మత సహనానికి పతాక స్థాయిగా చెప్పవచ్చు. లక్నోలో కొత్తగా 'బాదుషా బేగం' పద్ధతి హిందూ దేవదాసి పద్ధతి నుండి వచ్చిందే.

ఈ హిందు ముస్లింల సఖ్యత పండుగల్లో కూడా కన్పిస్తుంది. భారతదేశంలోని ముసల్మాన్‌లు తమ పూర్వీకుల సాంప్రదాయాలనుండి ఎంతగానో విడిపోయారని, హిందువుల ఆచార సంప్రదాయాలననుసరించారని బ్రాటన్ (Broughton) వ్యాఖ్యానించారు. మొహరం పండుగ సందర్భంలో మరాఠా రాజు మహాదాజీ (Mahadaji) స్వయంగా ఫకీరుగా మారేవాడని, హిందువులు కూడ పూసలను ధరించి, ప్రత్యేక దుస్తులతో పాల్గొనే వారని చెప్పబడింది. మొహరం కాలంలో హిందువులు వేడుకలు జరుపుకొనేవారు కాదు. ముస్లిం సోదరులతో కలిసి విచారం పంచుకొనేవారు. హోలీ, వసంత పంచమి మొదలైన పండుగలు జాతీయ పండుగలుగా జరిగేవి. లక్నోలోని నవాబ్ కొలువులో ఈ పండుగలు ఉత్సాహంగా జరుపుకోవటమే కాక, విందులు, వినోదాల్లో ప్రజలందరు పాల్గొనేవారు. అంతేకాక దయ్యాల్లో, మంత్ర మహిమల్లో, దుష్టశక్తుల ఆరాధనలో, తాయెత్తులు ధరించడంలో, జోతిష్కులను సంప్రదించడం మొదలగు మూఢనమ్మకాల్లో రెండు మతాల వారు ఒకే రకంగా ఉండేవారు.

## 2.10 మతాచారాలపై విమర్శ – సంస్కరణలు

భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో మతాచారాలు, నమ్మకాలు, పూజల్లో భిన్నత్వం గోచరిస్తుంది. అంతేకాక ఈ భిన్నత్వం సమాజంలోని భిన్న వర్గాల మధ్య కూడా కొనసాగింది. కాబట్టి సర్వజనామోదమైన మత

నియమాలను గూర్చి విచారించడం వీలుకాని పని. నాటి సామాన్య ప్రజల మతజీవన సరళికి, నేటి మత జీవన సరళికి పెద్దగా భేదం లేదు. 19వ శతాబ్దంలో మతంలో వచ్చిన కొన్ని ధోరణులు 18వ శతాబ్దం నాటికే సజీవంగా ఉన్నాయి. కొందరు ఐరోపా రచయితలు ముఖ్యంగా మిషనరీలు నాటి భారతీయ మత జీవనంపై ఎన్నో విమర్శలను గుప్పించారు. హిందువుల విగ్రహారాధన, కర్మకాండ, ఆచారకాండ, మూఢనమ్మకాలు, మత సిద్ధాంతాలు, ప్రజల నైతిక ధర్మాన్ని దారుణంగా దెబ్బతీశాయని, భారతీయుల అధోగతికి కారణమని గ్రాంట్ (grant) విమర్శించాడు. హెన్రీ మార్టిన్, (Henry Martyn) అనే మహాశయుడు మరికొంత ముందుకువెళ్ళి, హిందూ దేవాలయాల్లోని గంటలు, ఢమరుక్కుల మోత, భూతాల ధ్వని, దేవాలయ ప్రాకారాలు నరకానికి దగ్గరని, ఖురాన్‌లోని ఆగంబర సిద్ధాంతాలు దేవుని పేరుకే అవమానమని నిందలను కురిపించాడు. వార్డ్ (Ward) బ్రౌన్ (Brown) మొదలైన మిషనరీలు హిందూ దేవుళ్ళు నిజంగా భూతాలని, హిందువులంతా విగ్రహారాధన చేసి, నరకంలోని మంటల్లోనే పునీతులు కాగలరని ప్రచారం చేశారు. భారతీయులు మతంలో ఎంత దిగజారారంటే, వారు నాగరికులని చెప్పుకోవడానికి కూడా వీలులేదని 'డఫ్' (Duff) రాశాడు. ఈ మిషనరీల రాతల్లో కొంత సత్యమున్నా, ఈ రాతలు వారు తమ వ్యాప్తికోసం, హిందూ మతం పట్ల అవగాహన లేనందువల్ల రాయబడినవే.

అంతమాత్రాన హిందూ మతంలో లోపాలు లేవని చెప్పలేం. విగ్రహారాధన పూజారుల్లో అవినీతిని, మోసాన్ని పెంచింది. ప్రకృతి ఆరాధన మరుగున పడింది. మతం కుల పద్ధతిని ఆమోదించడంతో ఉన్నత, హీన అనే వర్గాలు ఏర్పడి, ప్రజల సాంస్కృతిక పునరుజ్జీవనానికి అవరోధమేర్పడింది. తాంత్రిక విద్యలు, శక్తి పూజలు, బలులు మత జీవితాన్ని కళంకితం చేశాయి. కొన్ని తెగల్లో మత పూజల పేరున విపరీతంగా తాగి తందనాలాడడం, ఆడ, మగ భేదం లేకుండ సంచరించడం, అన్ని రకాల మాంసాహారాన్ని సేవించడం, తాంత్రిక విద్యల పేరున కామ విషయకరమైన కార్యక్రమాలను కొనసాగించడం జరిగింది. అంతేకాక సాధువుల, సన్యాసుల ప్రవర్తన కూడా పెక్కు సందర్భాల్లో మోస, మోహపూరితంగా మారింది. పెద్ద పెద్ద దేవాలయాల్లో దేవదాసీ విధానం జుగుప్సాకరమైంది. హిందూ పూజలు ఎంతో వ్యయంతో కూడినవి. అంతేకాక, పూజారులు సామాన్య ప్రజల అజ్ఞానాన్ని అవకాశంగా తీసికొని, మూఢనమ్మకాలను వ్యాప్తం చేశారు. ఏ నది ఒడ్డున చూచినా ఎన్నో విగ్రహాలు కనిపిస్తాయి. ప్రతి విగ్రహం వద్ద ఒక పూజారి ప్రజలను మోసగిస్తూ, కానుకలను వసూలు చేస్తూ ఉంటాడు. పూజారులకు సంపదపట్ల వ్యామోహం పెరిగి, మత సిద్ధాంతాల పట్ల విశ్వాసం సన్నగిల్లింది. మోసం, అబద్ధాలు, చెడు అలవాట్లతో భ్రష్టులయ్యారు.

పైన చెప్పబడిన విషయాలను గమనిస్తే, మత సంస్కరణావశ్యకతను గుర్తింపవచ్చును. విగ్రహారాధనలోని లోపాలు, దిగువ వర్గాల వారి ఆదిమ మత సంస్కారాలు, తదితర మత దురాచారాలు 18వ శతాబ్దంలోనే సంస్కరణాభిలాషను, ఉద్యమాలను ప్రేరణ చేశాయి. దేశమంతటా సంస్కరణ శాఖలు స్థాపించబడ్డాయి. వ్యవస్థల రూపు, సిద్ధాంతాలను గమనిస్తే, అవి బ్రాహ్మణ పూజారుల మతాధిక్యతను ప్రశ్నించినట్లుగా తోస్తుంది ఉత్తర్ ప్రదేశ్‌లో దులాన్ దాస్ (Dulan Das) అనే రాజపుత్రుడు 'సత్యస్వామి' శాఖను ప్రారంభించాడు. అందులో ముసల్మానులతో సహా అన్ని కులాలవారు చేరవచ్చును. 'శౌసన' (Sousana) అనే మరో రాజపుత్రుడు 'శివనారాయణ' అనే శాఖను ప్రారంభించాడు. అతని శిష్యులను 'సంతా'లని పిలుస్తారు. అయోధ్యలోని మున్నాదాస్ అనే కంసాలి 'అపపంతీస్' (Apapanthis) అనే శాఖను స్థాపించాడు. బెంగాల్‌లో 'కత్ర-భజనలు', (Katra-Bajans) 'బలరామిలు' (Balaramis) అనే శాఖలు స్థాపించబడ్డాయి. చమార్ కులానికి చెందిన 'ఘసీదాస్' 'సతనామీ' (Satnami) శాఖను పునరుద్ధరించాడు. దేవుడు ఒక్కడేనని, అన్ని కులాలు సమానమేనని ప్రబోధించాడు ఇలాంటి శాఖలెన్నో దేశమంతటా విస్తృతంగా స్థాపించాడు.

ఈ మత సంస్కరణ శాఖలన్నీ విగ్రహారాధనను, హిందూ మతంలోని కర్మకాండలను గర్హించాయి. మూలవైష్ణవ మతంలోని సిద్ధాంతాలను ఆదర్శంగా దైవ ప్రార్థన నిరాడంబరంగా ఉండాలని, మత జీవనంలోని నైతిక ప్రవర్తన అంతర్భాగమని ప్రబోధించారు. 1758లో స్థాపించిన 'చరణాదాసీ' (Charan dasi) శాఖ విగ్రహారాధననే గాక తులసీ పూజ, సాలగ్రామ పూజను కూడా మాని, నైతిక ప్రవర్తనకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. నైతిక ప్రవర్తనకై పది సూత్రాల నియమావళిని కూడా రూపొందించారు. 'సత్యసాములు' భౌతిక సుఖాలకు దూరంగా ఉండాలని, యోగం ద్వారా బ్రహ్మానందాన్ని పొందవచ్చునని చెప్పారు. మంచి పనుల ద్వారానే సత్పురుషుల ధామం చేరవచ్చునని 'శివనారాయణులు' నమ్మగా, బెంగాల్‌లోని కార్తభజాలు సత్ప్రవర్తనకు సంబంధించి, కొన్ని సూత్రాలను ప్రకటించారు. వీటిలో కొన్ని శాఖలు హిందూ, ముసల్మానుల మతాలను సంయోగం చేయ ప్రయత్నాలను చేశారు. మత ప్రయోగాల్లో, సంస్కరణాభిలాషలో భారతదేశం ఎల్లప్పుడూ ఉత్సాహాన్ని చూపింది. అలాంటి ఉత్సాహ ప్రయత్నాలు 18వ శతాబ్దంలో కన్పిస్తాయి.

## 2.11 భారతీయ సమాజంపై మత ప్రభావం

మతం వ్యక్తి జీవనంపైన, గుణశీలాలపైన ఎంతో ప్రభావాన్ని చూపుతుంది. అయితే ఈ ప్రభావం దేశమంతటా ప్రజలను ఒకేరీతిలో నడిచేటట్లుగా చేయలేదు. భౌగోళిక, వాతావరణ, చారిత్రక భిన్నత్వం ఈ వైవిధ్యానికి కారణం. వివిధ ప్రాంతాల్లోని ప్రజల ఆచారాల్లో భిన్నత్వం కనిపిస్తుంది. మొత్తంమీద మతం మనిషి వ్యక్తిత్వాన్ని, గుణశీలాలను ప్రభావితం చేయడంలో ముఖ్య పాత్రను నిర్వహిస్తుంది. ప్రతి మతం కొన్ని సత్కర్మలను ప్రబోధిస్తుంది. హిందూ మతంలో, మతాచారాలను నిర్వహించడం, ఉపవాసాలు, బ్రాహ్మణులకు దానాలు, అతిథి మర్యాదలు, తటాకాల, రహదారుల నిర్మాణం మొదలైన ధర్మకార్యాలు, పుణ్యస్థలాల సందర్శన పూర్వీకులకు శ్రద్ధకర్మలు జరపడం, పవిత్ర గ్రంథాలను పఠించడం సత్కర్మలుగా నిర్వహించారు. దీనికనుగుణంగా, ఆ కాలంలో ఎన్నో ధర్మశాలలు వెలిసాయి. దానధర్మాలు జరిగాయి. హరిద్వార్, మధుర, వారణాసి, ఉజ్జయినీ, గయ, జగన్నాథం, శ్రీరంగం హిందువులకు పవిత్ర స్థలాలుగా సందర్శింపబడ్డాయి. మత కేంద్రంగా వారణాసి ప్రాశస్త్యం పొంది, విదేశీయులను కూడా ఆకర్షించింది. గంగానది స్నానం అతి పవిత్రమైందిగా, అతి పాప పంకిలమైన జీవితాన్ని ప్రక్షాళనం చేసే అద్భుతంగా పలువురు తలచారు. కాశీలో పరమపదించడమే పుణ్యమని హిందువుల భావన.

ఇస్లాం మతం ఉపవాసాలకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చింది. ప్రార్థనల్లో మక్కా యాత్రల్లో వారికి అపారమైన విశ్వాసం. దానధర్మాల్లో ముసల్మానులు అభినందనీయులు. పారశీకులు సూర్యుడిని, అగ్నిని ఆరాధించేవారు. మంచి చెడుల విచక్షణ చేసి, మంచివైపే నడిచేవారు. 'జోరాస్టర్' (Zoraster) లు నైతిక సూత్రాలైన క్షమ, పెద్దల పట్ల గౌరవం, దానధర్మాలు చేయడం అనుసరించేవారు. ఈ రీతిగా మతం ప్రజల్లో దానశీలత, అతిథి మర్యాదలను నేర్పింది. హిందువుల మానవత, నమ్రత, అన్యులపట్ల ఆదరణ 'ఔర్మ్' (Orme) ప్రశంసలనందుకొనగా, వారి సామాజిక స్పృహ, బావులు, చెరువులు, సత్రాలు, రహదారుల నిర్మాణంలో వారి ఔదార్యాన్ని ఫోర్బ్స్ (Forbes) మెచ్చుకున్నారు. మతం వారిలో దయ, ప్రేమ ఆపేక్షలతో కూడిన మానవత్వాన్ని పెంచి పోషించిందని ఫోర్బ్స్ (Forbes) వ్యాఖ్యానించాడు. హిందువుల నైతిక సూత్రాలు ఎంతో దయతో కూడినవని, వారి అతిథి మర్యాద, దానశీలత, ఈ సూత్రాల ద్వారా బోధింపబడటమే కాక, ప్రపంచంలో మరెక్కడా లేనంతగా అనుసరింపబడ్డాయని క్రాఫర్డ్ (Craford) ప్రశంసించాడు. న్యాయం, మానవత, దయ, నిష్కాపట్యత హిందువుల ప్రముఖ నైజాలని డుబాయిస్ (Dubois) రాయగా, ఈ మౌలిక లక్షణాల్లో ఎలాంటి మార్పు లేకుండానే హిందూ జీవన స్రవంతి సాగిందని పలువురంగీకరించారు.

హిందూ మత సిద్ధాంతాల్లో ఆత్మకు చావులేదని, మనం చేసే పనులు ఆత్మ మీద ప్రభావం చూపుతాయనే భావన కూడా ప్రజల దృక్పథాన్ని నిర్దేశించింది. జంతువుల పట్ల జాలి, హింసపట్ల విముఖతతోపాటు, ప్రతి జంతువులోను ఏదో ఒక దైవిక శక్తిని ఊహించారు. ముఖ్యంగా గోవులపట్ల వారి భక్తికి కారణం. అది అమాయక జీవి. వ్యవసాయంలో పశుసందపకు మూలం. పాలు, పెరుగు, నెయ్యి ఇస్తుంది. గోవధను మలబారువారు నిషేధించారు. గుజరాత్, దక్షిణ భారతంలో బ్రాహ్మణులు, వైశ్యులు మాంసాహారం తీసుకోరు. జైన మతం కూడా ఈ అహింసా విధానానికి ఎంతో తోడ్పడింది. 18వ శతాబ్దపు మధ్య భాగంలో కాంచీలో పక్షులకు, గొర్రెలకు, గేదెలకు ప్రత్యేక ఆస్పత్రులు నిర్మించారు. సూరత్‌లోని ఆస్పత్రిలో పక్షులకు ఎంతో ప్రేమతో చికిత్స చేసేవారు. చిన్నచిన్న కీటకాలను కూడా చంపేవారు కాదు.

## 2.12 మతం - సామాజిక వ్యవస్థ

18వ శతాబ్దంలో మతం, సామాజిక వ్యవస్థ ఎంతో సన్నిహితంగా ఉన్నాయంటే, సామాజిక సూత్రాలు, పద్ధతులుకూడా ఎంతో పవిత్రంగా భావింపబడ్డాయి. మతం సామాజిక వ్యవస్థలోని కులం, కుటుంబం, వివాహం మొదలైన ఏర్పాట్లు అన్నీ ఒకటిగానే పరిగణింపబడ్డాయి. హిందూ మత సిద్ధాంతాలు సామాజిక నైతిక, పౌరధర్మాలతో కలిసిపోయాయి. సామాజిక సిద్ధాంతాలను ఉల్లంఘించటం మత సూత్రాలను ఉల్లంఘించినట్లుగా భావింపబడుతుంది. మత ప్రభావంలో సామాజిక వ్యవస్థకూడా సాంప్రదాయబద్ధంగా నడిచింది. ఆచార వ్యవహారాల్లో పెద్దగా మార్పులు లేవు. కొంతవరకు ఈ మత ప్రభావం సామాజిక వ్యవస్థలో అభివృద్ధి నిరోధంగా మారింది. సముద్ర ప్రయాణంవల్ల మతం పోయిందనే భావన దీనికొక ఉదాహరణ. దీనివల్ల భారతదేశం సముద్ర వ్యాపారం ఇతర దేశాలకు అప్పగించినట్లయింది. అంతేకాక హిందూ మత కర్మ సిద్ధాంతం వారిలో నిర్లిప్తత, నైరాశ్యాన్ని జరిగేదేదో జరుగకపోదు అనే వేదాంత ధోరణిని కల్పించింది.

మతంలోని నమ్మకాల్లో జ్యోతిష్యం ఒకటి. పూజారులు జ్యోతిష్య శాస్త్రంలో ప్రజలకు నమ్మకం కల్గించి, బాగా డబ్బు చేసుకొన్నారు. శుభకార్యాలన్నింటికీ ముహూర్తాలు, చివరకు ప్రయాణం చేయడానికి కూడా సమయం నిర్ణయించడం మొదలైన విషయాలన్నీ, హిందూ పంచాంగంలో చోటు చేసుకున్నాయి. ముసల్మానులకు కూడా జ్యోతిషంపై నమ్మకం అపారంగా ఉండేది. నక్షత్రరాశి మానవుల జీవనాన్ని నిర్దేశిస్తుందనే నమ్మకం, నక్షత్రాల నడక విశ్వానికి మంచి చెడులను కల్గిస్తుందనే విశ్వాసం ప్రగాఢంగా ఉండేది. పంచాంగంలో సంవత్సరమంతటా ఏమి జరుగుతుందో చెప్పబడేది. జాతకాలు రాయటం, పంచాగ రచన పూజారుల ప్రత్యేక హక్కు. తక్కువ కులాల్లో దయ్యాల భయం ఎక్కువ. భూత మాంత్రికులు ప్రజల భయాన్ని, అజ్ఞానాన్ని ఆసరాగా తీసుకొని బాగుపడేవారు. కలరా, మశూచి మొదలైన జబ్బులు, అమ్మవారు సోకిందని, భూత తృప్తి చేయాలని, స్థానిక క్షుద్ర దేవతల పూజలు చేసేవారు. కొన్ని పూజలు అమానుషంగా, క్రూరంగా ఉండేవి. మంత్రాల విద్యలో స్త్రీలు కూడా పాలుపంచుకొనేవారు. ఈ మాంత్రిక విద్యలు, చేతబడులకు ప్రజలు భయపడేవారు. మాంత్రిక విద్యల గ్రంథాలు కూడా ఉండేవి. ఇట్టి మూఢనమ్మకాలతో తాయత్తులు చేసేవారు, దయ్యాలను వదిలించేవారు, చేతబడులకు విరుగుడు చేసేవారు, అనే పేరుతో ఎంతో మంది పేదలను దోచుకొనేవారు. మరణించినవారు దయ్యాలుగా మారి వేధిస్తారనే నమ్మకం ప్రబలంగా ఉండేది. చిల్లంగి విద్యలు సర్వసామాన్యమైనవి.

ఇదిగాక శకునాలు అనే మూఢనమ్మకం కూడా ప్రబలంగా కన్పిస్తుంది. కొన్ని శుభశకునాలను మరికొన్ని అశుభాలనే ఈ నమ్మకం నేడు కూడా కొనసాగుతూనే ఉంది. పిల్లి ఎదురొస్తే అశుభమని, కుక్కలు అరిస్తే ఏదో దుర్ఘటన జరుగుతుందని, గుడ్లగూబకూస్తే ఆ ఇంటిని ఖాళీ చేయాలనే మొదలైన ఎన్నో నమ్మకాలుండేవి.

తెల్లవారుజామున కలలు వస్తే నిజమవుతాయని, కల వచ్చిన దానిని బట్టి శుభం, అశుభం, చెప్పవచ్చునని మరో శాస్త్రం వచ్చింది. ఈ నమ్మకాలన్నింటినీ మతం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆమోదించింది. అంతేకాక సన్యాసుల మహిమలను గూర్చి కూడా విస్తృతం ప్రచారాన్ని చేసింది. ఈ మహిమలను, మాయలను, శకునాలను, జ్యోతిష్యాన్ని ఈనాటికి కూడా మనం నమ్ముతున్నామంటే, మతానికి సమాజం పైనున్న పట్టు ప్రభావం మనకు తెలియగలదు.

## 2.13 సంగ్రహంగా

ఈ భాగాన్ని చదివిన తరువాత 18వ శతాబ్దంలో మతానికి, నేటికి పెద్దగా భేదంలేదని గమనించగలరు. సామాజిక వ్యవస్థపై మతానికి కల పట్టు, అధికారం తెలియవస్తాయి. మతంలో భిన్నత్వం, భిన్న మతాల మధ్య సామరస్య ధోరణులు నాటి నుండి మత సహనానికి భారతదేశం ఎలా కేంద్ర బిందువైందీ వివరింపగలదు.

## 2.14 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. 18వ శతాబ్దం నాటి మత పరిస్థితులను వివరించి సమాజంపై దాని ప్రభావాన్ని విశ్లేషించండి.
2. భారతదేశంలో భిన్న మతాల మధ్య సంబంధాన్ని తెలిపి, వాటి మధ్య నెలకొన్న సహనశీలతను వివరించండి.

II. **క్రింది వాటిపై లఘువ్యాఖ్యలు రాయండి**

(ఎ) మతాంతర భేదాలు

(బి) మతం – సామాజిక వ్యవస్థ

## 2.15 ఉపయుక్త గ్రంథాలు


Bharatiya Vidya Bhavan — **British Paramountacy and Indian Renaissance**

Datta — **Dawn of Renaissance in India**

Raghuvamsi — **Indian Society during the 19th Century**

Richard Laneay — **The speaking Tree**

Srinivas — **Social change in Modern India**


**రచయిత - శ్రీ ఎ.వి. కోటిరెడ్డి**

# భాగం - 3 : విద్యా వ్యవస్థ

విషయ క్రమం


3.0 లక్ష్యాలు

3.1 పరిచయం

3.2 కళా సాహిత్య పోషణ

3.3 సాంస్కృతిక విద్యా కేంద్రాలు

3.4 సంస్కృత విద్య

3.5 పర్షియన్, అరబిక్ విద్యలు

3.6 పర్షియన్ పాఠశాలలు

3.7 ప్రాంతీయ భాషా బోధన

3.8 ఉన్నత విద్యా కేంద్రాలు

3.9 విద్యా వ్యవస్థ ఏర్పాటు

3.10 స్త్రీ విద్య

3.11 నాటి విద్యా విధానంలోని కొన్ని లోపాలు

3.12 సంగ్రహంగా

3.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

3.14 ఉపయుక్త గ్రంథాలు


## 3.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల కింది విషయాలు తెలుసుకోగలగాలి.

- 18వ శతాబ్దం నాటి విద్యా వ్యవస్థలో భాగంగా ఏర్పడిన విద్యా కేంద్రాలు, వాటిలో బోధింపబడిన భాషల వివరణ
- విద్యా కేంద్రాల్లో సంస్కృత, పర్షియన్ భాషల ప్రాధాన్యత
- విద్యా విధానంలోని లోపాలు, స్త్రీ విద్యపట్ల వ్యతిరేకతల వివరణ.

## 3.1 పరిచయం

వ్యక్తి జీవనంలో, సామాజికాభివృద్ధిలో విద్య ప్రాధాన్యతను భారత సామాజిక వ్యవస్థ గుర్తించింది. బెర్నియర్ (Bernier) మరికొంతమంది మిషనరీలు భారతదేశంలో అకాడమీలు, కళాశాలలు స్థాపించబడలేదని, ప్రజలు ఎంతో అజ్ఞానాంధకారంలో మునిగి ఉన్నారని పేర్కొన్నారు. ఇవి పూర్తి సత్యాలు కావు. 18వ శతాబ్దంలో రాజకీయ అస్థిరత చోటు చేసుకున్నా, విద్య విస్మరింపబడలేదు. మత ఆదర్శాలు విద్య, విజ్ఞానం పట్ల ఆదరణను పెంచాయి. సామాన్య ప్రజలననుసరించిన హిందూ మతం విద్యను అభివృద్ధి చేసిందని వార్డ్ (Ward) అభిప్రాయపడ్డాడు. శాస్త్రాధ్యయనం పండితులకు, ఉపాధ్యాయులకు ఆర్థిక సాయం చేయడం మత ధర్మాల్లో, సత్కర్మల్లో

B R A O U

ముఖ్యమైనదిగా భావింపబడింది. విలియం ఆడమ్స్ (Willian Adams) 'రిపోర్ట్ అండ్ ది స్టేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్ బెంగాల్' (Report on the State of Education in Bengal) పరిశీలిస్తే, మత ప్రభావం వల్లనే సంక్లిష్టమైన విద్యార్జనను కొనసాగించారని, ఉపాధ్యాయులుచితంగా విద్యా దానం చేసారని, కులీన వర్గాలు విద్యాభివృద్ధికి సంస్థలను స్థాపించి, చదువు సంధ్యలను పోషించారని తెలుస్తున్నది. బుకానన్ (Buchanan) కూడా విద్యా సంస్థలకివ్వబడిన దానాలను గూర్చి శ్రద్ధ, చిత్తశుద్ధిగల ఉపాధ్యాయులచే స్థాపించబడిన పాఠశాలలను గూర్చి, ఎన్నో ఉదంతాలను ఉదాహరించాడు.

## 3.2 కళా సాహిత్య పోషణ

కులీన వర్గాలు కళా సాహిత్య పోషణకై చేసిన కృషిని గూర్చిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. తంజావూర్ పరిసర ప్రాంతాల్లో హిందూ రాజులు విద్యను పరిరక్షించారని క్రాఫర్డ్ (Craford) రాశారు. మహారాష్ట్ర పాలకులు రాజకీయ సమస్యలతో సతమతమవుతూనే, కళా సాహిత్య పోషణను కొనసాగించారు. మత ప్రమేయం లేకుండా కవులను, రచయితలను బిరుదులతో, సత్కారాలతో, విరాళాలతో పోషించారు. మత, విద్యా సంస్థలకు పెద్దెత్తున నిధులు మంజూరు చేశారు. కులీనులు దానాలు కాక, పీష్వాల ప్రభుత్వమే 15 లక్షల రూపాయలు విద్యాభివృద్ధికి విరాళంగా ఇచ్చేదని ఎలిఫిన్‌స్టోన్ (Elphinstone) రాశాడు. బ్రాహ్మణులకు వారి పాండిత్య ప్రతిభకు, వారి విజ్ఞానానికి కొలమానంగా దక్షిణలివ్వబడేవి. ఇది ప్రాచీన సాహిత్య అభివృద్ధికి దోహదం చేసింది. 1811లో లార్డ్ మింటో (Lord Minto) రాస్తూ, అంతకుముందు రాకుమారులు, ప్రభుత్వాధినేతలు, జమీందారులు విద్యకు, సాహిత్యానికి ఉదారంగా విరాళాలిచ్చేవారిని ప్రశంసించారు. ధర్భంగా (Dharbhanga) రాజు పండితులను సగౌరవంగా పోషించేవాడని బుకానన్ చెప్పాడు.

## 3.3 సాంస్కృతిక విద్యా కేంద్రాలు

బెంగాల్‌లో నడియా, రాజషాయీ జిల్లాలు సంస్కృత విద్యా కేంద్రాలు. రాజకృష్ణ చంద్ర, రాణి భభాని సుదూర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులకు రెండు వందల రూపాయలు స్టైఫండ్‌గా ఇచ్చేవారు. రాజషాయి జిల్లాలో ఒక్క ప్రాంతంలోనే, సంస్కృత భాషాధ్యయనానికి కావలసిన శాఖలన్నీ ఉన్నాయని ఒక హిందూ విశ్వవిద్యాలయానికి సరిపోయే భాషా సామగ్రి కలదని ఆడమ్' (Adam) రాశాడు. ముస్లిం పాలకులు కూడా విద్య, విజ్ఞాన వికాసానికి ప్రోత్సాహమిచ్చారు. వారి దర్బారుల్లో సుదూర ప్రాంతాలనుండి వచ్చిన సాహితీవేత్తలు, మత పండితులుండేవారు. పైన చెప్పబడిన ప్రస్తావనలను గమనిస్తే, నాటి విద్య ఉన్నత వర్గాల చేతనే పోషింపబడేదనే వాస్తవం తెలియగలదు. సార్వజనీనమైన, ప్రగతిశీలమైన విద్యా విధానం కొరవడిందని చెప్పక తప్పదు. విద్య పూర్తిగా మేధావులచే ప్రభావితమై, ఆయా మార్గాల సామాజికావసరాలను తీర్చడానికి మాత్రమే ఉద్దేశింపబడింది. అది పూర్తిగా ప్రైవేట్ సంస్థలకే పరిమితమైంది. అయితే విద్య నాటి సామాజిక, సాంస్కృతిక జీవనంపై ప్రభావాన్ని నెరపిన మాట సత్యం. ముస్లింల్లో ఉన్నత వర్గాలు మాత్రం తమ పిల్లలకు కొంత ఉదార విద్యా విధానంలో ప్రవేశాన్ని కల్పించారు. పర్షియన్, అరబిక్ భాషలను నేర్పడంతోపాటు చక్కని హావభావాలు, నడవడికలో శిక్షణ ఇచ్చేవారు. అంతేకాక గుర్రపుస్వారి, ఆయుధాల వాడకం కూడా నేర్పేవారు. కులీన వర్గాల్లో ప్రాచీన కావ్య సాహిత్యాలపట్ల, గీత - పద్య రచనల పట్ల మక్కువెక్కువ. వారి సంభాషణల్లో ఎన్నో నీతి వాక్యాలు దొర్లేవి. హిందువుల్లో బ్రాహ్మణులే విద్యాధికులు. వారు సంస్కృత భాష పరిరక్షకులు. వారి తెలివితేటలు అమోఘం. అవలక్షణాలు తక్కువ. వారు ఉన్నత కులాలవారికి గురువులు. వారణాసిలో విద్యనభ్యసించిన ఎందరో బ్రాహ్మణులను పోర్బ్స్ (Forbes) కలిసి, వారి పాండిత్యానికి ముగ్ధుడయ్యాడు. నర్మదా నది ఒడ్డున ఎన్నో ప్రసిద్ధమైన బ్రాహ్మణ పాఠశాలలున్నాయని,

వారణాసి తదితర ప్రాంతాల్లో నున్న బ్రాహ్మణ కళాశాలలు కేవలం కొన్ని కులాల వారికే పరిమితమైనా, సాహిత్యం, కళలు, వైద్య, విజ్ఞాన శాస్త్రం పురోగతికి దోహదం చేశాయని వ్యాఖ్యానించాడు. కర్నాటకలో ఎన్నో హిందూ విద్యాలయాలుండేవని జెసూట్ మిషనరీ ఫాదర్ పోన్స్ (Father Pons) రాశారు. అక్కడి విద్యా విధానాన్ని, బోధనా పద్ధతులను, ప్రశంసించాడు వేదాల పరిజ్ఞానం విద్యాధిక్యతకు చిహ్నం. శ్రుతుల పారాయణమే దేవుని కృపకు, ప్రజల ఆరాధనకు మూలం. ఈ ఉన్నత మత విజ్ఞానంవల్ల వారు చెప్పిందే వేదం.

మధ్యతరగతి వారిలో, కొంతవరకు క్రింది కులాల వారిలో కూడా పూర్తిగా విద్యాగంధం లేకపోలేదు. చదవడం, రాయడం, లెక్కలు, వృత్తి పనులను నేర్చుకొనేవారు. అయితే వారి విద్య ప్రాంతీయ భాషలకే పరిమితం. 1756-57 మధ్య బెంగాల్ ప్రాంతీయ భాషా బోధనా పాఠశాలలు ఎన్నో ఉన్నాయనీ ఇవోస్' (Ivos) పేర్కొన్నాడు. పట్టణాల్లో బాలుర విద్యకై పెక్కు పాఠశాలలుండేవని, అవి సామాన్యంగా బహిరంగ ప్రదేశాల్లోకాని, ప్రాకారాల నీడల్లో కాని పనిచేసేవని, చాపలపైన కూర్చొని, విద్యార్థులు కులానికి పరిమితమైన మత విజ్ఞానంతో పాటు చదవడం, రాయడం, గణితం నేర్చుకొనేవారని ఫోర్బ్స్ (Forbes), రాశాడు. ఈ హిందూ పాఠశాలలు చాల నిరాడంబంగా ఉండేవని ప్రశంసించాడు. అయితే తక్కువ కులాలవారికి ఉన్నత మత విషయాలు కాని, కళలు, శాస్త్ర విజ్ఞానాల్లో బోధన కాని జరిగేది కాదు. వారికి కేవలం చదవడం, రాయటం మాత్రం నేర్పేవారు. మధ్య భారతంలో ప్రభుత్వ నిర్వహణలో ఎలాంటి పాఠశాలలు లేవు. కాని ప్రైవేట్ పాఠశాలలు పల్లెల్లో, పట్టణాల్లో ఇలాంటి పాఠశాలలు ఉండేవని, ప్రతి వంద కుటుంబాలున్న గ్రామంలో వైశ్యుల, శూద్రుల బాలురకు పాఠలు చెప్పేందుకు ఒక ఉపాధ్యాయడుండేవాడని మాల్కోలమ్ (Malcolm) రాశాడు. పీష్వానుండి ఆంగ్లేయులు గైకొన్న ప్రాంతాల్లో పాఠశాలలున్నాయని, కాని అవి కేవలం బ్రాహ్మణులకు పరిమితమయ్యాయని, వర్తకుల కర్షకుల పిల్లలు లెక్కలు మాత్రమే నేర్చుకొనేవారనీ ఎలిఫిన్‌స్టన్ (Elphinstone) రాస్తూ, విద్య లేనిదే ప్రజల నైతిక ప్రవర్తన అభివృద్ధి చేయడం సాధ్యపడదని వ్యాఖ్యానించాడు. దక్షిణ భారతంలో పాఠశాలలున్నా, విజ్ఞాన వ్యాప్తి కొందరికే పరిమితమైందని, పెద్ద పట్టణాల్లో దేవాలయాల్లో బ్రాహ్మణులు బోధన చేసేవారని డుబాయస్ (Dubois) రాశాడు.

పైన చెప్పబడిన కథనాలననుసరించి ఆంగ్లేయ పాలనకు ముందు భారతదేశంలో విద్యా వ్యవస్థ ఉందని చెప్పొచ్చు. విద్య యొక్క ప్రాధాన్యం కూడా గుర్తింపబడింది. విద్యా పోషకులు, విద్యా బోధకులు సమాజంలో గుర్తింపు పొందారు. పాండిత్యం గలవారు గౌరవింపబడ్డారు. నగరంలోని ఉపాధ్యాయుడు ఆదరింపబడేవాడు. ఏడాదికొకసారి అతని గౌరవార్థం ఉత్సవం జరిపి, విరాళాలను సేకరించేవారు. ముసల్మానులు తమ మత కార్యక్రమాల్లో ఉపాధ్యాయునికి ఆదరణను, విరాళాలనిచ్చేవారు. విద్యార్థులు ఉపాధ్యాయుని తండ్రిగా గౌరవించేవారు. కానూన్ - ఇ - ఇస్లామ్ (quanoon - i - Islam) లో జన్మనిచ్చిన తండ్రి, గురువు, మామ, మతాచార్యులు, నలుగురు తండ్రులుగా చెప్పబడ్డారు. గురు పూజ ఇస్లామ్‌లో ముఖ్యమైంది. గురు ఆశీర్వచనం వంద పుస్తకాలకు సమానం అని చెప్పబడింది. నాటి విద్యా విధానాన్ని మూడు భాగాలుగా చదువ వచ్చును. 1. సంస్కృత బోధన, 2. పర్షియన్, అరబిక్ విద్య, 3. ప్రాంతీయ విద్య.

## 3.4 సంస్కృత విద్య

18వ శతాబ్దంలో ప్రాచీన భాషలైన సంస్కృతం, అరబిక్, పర్షియన్, అధ్యయనం ఉన్నత విద్యా ప్రణాళికలో ముఖ్యాంశం. ఈ భాషలనభ్యసించిన వారినే పండితులుగా పరిగణించే వారు. హిందూ సామాజిక వ్యవస్థలో సంస్కృతం ప్రాధాన్యాన్ని విదేశీయ రచయితలెందరో ప్రముఖంగా పేర్కొన్నారు. సంస్కృత భాష గ్రీక్, లాటిన్, భాషలకన్నా పద ప్రయోగంలో ఉన్నతమైందని, ధారాళమైందని, నాజుకైందని విలియం జోన్స్ (William Jones) ప్రశంసించారు. హిందువుల మతం, వేదాంతం, చరిత్రల సంస్కృతంలో నిక్షిప్తమయ్యాయని, అలెగ్జాండర్ డో

BRAOU

(Alexander Dow) అభిప్రాయబడ్డాడు. ఈనాడు సంస్కృతం విగత భాష అయినా, కొద్దిమందిచే ముఖ్యంగా బ్రాహ్మణులచే అభ్యసించబడుతున్నది. సంస్కృత భాష విలువ హిందూ సమాజంలో అగ్రకులాలకే పరిమితమైంది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలన్నీ సంస్కృతంలోనే రాయబడి, నిమ్నకులాల వారు చదువకూడదని దైవ శాసనంగా చెప్పబడింది. 19వ శతాబ్దంలో సంస్కృత సాహిత్యం మీద బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని బుకానన్ (Buchanan) పరిశీలించాడు. బెంగాల్‌లో కులీనులైన కాయస్తులు, వైద్యులు, సంస్కృత గ్రంథాలను చదువవచ్చును, కాని పవిత్ర గ్రంథాల జోలికి పోరాదు.

సంస్కృత విద్య అనంతమైంది. వేదాలు, ఉపనిషత్తులు, వేదాంతంలోని, న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, వేదాంత, మీమాంసలు, ఉన్నత మేధస్సుకు చెందినవి. నైతిక, మత సూత్రాలైన ధర్మశాస్త్రాలు, సంస్కృత విద్య నేర్పటానికవసరమైన వ్యాకరణం, చారిత్రక సంబంధమైన పురాణాలు, గణితం, వైద్యం, ఖగోళ శాస్త్రం, జ్యోతిష్యం, హస్త సాముద్రికం, విలు విద్య, వాస్తు శాస్త్రం, సంగీతం, పశుపోషణ మొదలైన గ్రంధాలన్నీ సంస్కృతంలోనే రాయబడ్డాయి. ఈ అపార, అసాధరణ, విద్యా, విజ్ఞాన భాండాగారంగా ఆ భాష విలసిల్లింది.

బెంగాల్‌లో సంస్కృత భాషాధ్యయనంలో బోధనాంశాలు ప్రత్యేకమైనవి. 1818లో కలకత్తాలో సంస్కృత భాష నేర్పే 28 కళాశాలలు, 173 మంది ఆచార్యులున్నారని వార్డ్ (ward) తెలియజేసారు. 24 పరిగణాల జిల్లాలో మత సంస్థలచే, కులీనులచే స్థాపింపబడిన 190 సంస్కృత పాఠశాలలుండేవి. భిన్న ప్రాంతాల్లో బోధనాంశాలు మారుతూ ఉండేవి. కలకత్తాలో న్యాయ స్మృతి శాస్త్రాలపై బోధన జరుగగా, నడియాలో ఖగోళ శాస్త్రం, వ్యాకరణం, న్యాయ శాస్త్రం, సాహిత్యం, ప్రముఖంగా చెప్పబడేవి. ఈ జిల్లాల్లో అయిదారు వందలమంది విద్యార్థులు కళాశాలకు ఇరవై రెండు మంది దాకా ఉండేవారు. మొత్తం బెంగాల్‌లో సంస్కృతం చదివేవారు పదమూడు వేలదాకా ఉన్నారని చెప్పబడింది.

ఈ హిందూ కళాకారులు మట్టిగోడలతో, 3,5,9, లేదా 11 గదులతో ఉండేవి. ఇవెక్కువగా దానధర్మాలచే నడుపబడేవి. అక్కడ ఉచిత విద్యా బోధన జరిగేది. ఈ కళాశాలను గూర్చిన వివరాలు, బోధనాంశాలను, వార్డ్, బుకానన్ ఆడమ్ సవిస్తరంగా తెలియజేసారు. భావాలను తెలియజేయడానికి భాష అవసరం. ఆభావాలను స్పష్టంగా తెలియచేసే రీతిలో భాషపై ఆధిపత్యాన్ని సంపాదించడానికి విద్య అవసరం. భాషతోపాటు వ్యాకరణం ఆవశ్యకత గుర్తింపబడింది. పాణిని 'కలాప' రత్నావళి' గ్రంథాలపై వ్యాఖ్యలు వెలిసాయి. సాహిత్యం, నాటకాలు, శబ్దోత్పత్తి శాస్త్రం, తర్క శాస్త్రం అభ్యసింపబడేవి. దక్షిణ భారతదేశానికి సంబంధించి పెద్దగా ప్రస్తావన లేకపోయినా, బ్రాహ్మణులు వేద విద్య నభ్యసించేవారని, నగరాల్లో వేద పాఠశాలలుండేవని, కొంచెమించుమించుగా, బెంగాల్‌లోని బోధనాంశాలు ఇక్కడ కూడా నేర్పేవారని తెలుస్తుంది. జ్యోతిష శాస్త్ర గ్రంథాలు పెక్కు దక్షిణ భారతంలో లభ్యమయ్యాయి.

పైన చెప్పబడిన విషయాలను పరిశీలిస్తే, సంస్కృత విద్యకు రాజ్యపోషణ లేకపోయినా, వ్యాప్తిచెందిందని తెలియగలదు. విద్యా ప్రమాణాలు కూడా ఉన్నతంగా ఉండేవి. చదవడం, రాయడం, లెక్కలు చేయడం సామాన్య విద్యగా పరిగణింపబడేది. గద్య రచన కన్నా పద్య రచనలో అందెవేసిన వారికి అధిక గౌరవం లభించేది. ఆధునిక సమాజావసరాలను దృష్టిలో ఉంచుకొంటే, ఈ సంస్కృత భాష బోధనాంశాలు అంత ఉపయుక్తం కావు. భాషా పాండిత్యమంతా కుయుక్తుల మయం. ఈ విద్యవల్ల ప్రజానీకానికెట్టి లాభం చేకూరలేదని ఆంగ్లేయులు అభిప్రాయబడ్డారు. సంస్కృత విద్య చారిత్రక విషయాలను విస్మరించి, కేవలం ప్రాచీన గాథలకు, మతాచారాలకు మాత్రమే పరిమితమైందని మాల్కోలమ్ (Malcolum) విమర్శించారు. అయితే, హిందువులకు సంస్కృత భాష సమకాలానికి, పూర్వీకతకు ప్రశస్తమైన వారధి. ప్రాచీన సంస్కృతి, ఆదర్శాలు ఆలోచలు, ఈ భాషలో నిక్షిప్తం చేయబడ్డాయి. నాటి విజ్ఞానాన్ని సరిగ్గా అనుసంధానం చేస్తే, ఆధునిక కళలకు, వైజ్ఞానిక ప్రగతికి తోడ్పడగలదు.

కాని దశాబ్దాలుగా నిద్రాణమైన భారతీయ ఆలోచనలు, ఊహా లోకం నుండి మేల్కొలుపు పలికే ఉద్యమం ఆవశ్యకం. సంస్కృత విద్య చాలవరకు మతపరమైందే. అయినా అందులో సామాజిక వ్యవస్థను గూర్చి, రాజనీతిని గూర్చి, గణితం, ఖగోళ శాస్త్రం, వైద్యం గూర్చి ఉన్న సమాచారం ఎంతో ఉపయుక్తమైనది. గాథలు, పురాణాల పేర చెప్పబడిన సాహిత్యంలో ఎన్నో వేదాంత చర్చలు, మనిషి ఆచరించవలసిన ధర్మాలు, నీతులు, తర్కం, వైజ్ఞానిక విశేషాలు కోకొల్లలు. సంస్కృత భాషలోని వ్యాకరణం, సాంప్రదాయ సాహిత్యం, అందమైన అల్లికలతో కూడిన సాహిత్య ప్రక్రియలు, భావాలను భాషలో అందంగా, ఆకర్షణీయంగా చెప్పాలనే ఆకాంక్ష ఉన్నంత కాలం చిరస్మరణీయాలు.

## 3.5 పర్షియన్, అరబిక్ విద్యలు

ఆంగ్లేయులు రాకముందు భారతదేశంలోని అత్యధిక భాగంలో పర్షియన్ భాష రాజ్య భాషగా అధికారాన్ని చెలాయించింది. ఈ భాషను ముసల్మానులే కాక, రాజోద్యోగాలు చేయదలచిన హిందువులు కూడా అభ్యసించేవారు. ఉత్తర భారతంలో పర్షియన్ భాష నేర్చుకోవటం నాగరికతగా, ప్రతిభా విశేషంగా గుర్తింపబడింది. బెంగాల్, బీహార్‌ల్లో పర్షియన్ పాఠశాలల్లో హిందూ, ముసల్మానులు విద్యనభ్యసించేవారని, ఆ భాషను నేర్చుకోవడం మర్యాదస్తుల లక్షణంగా భావించేవారని బుకానన్ (Buchanan) రాశాడు. అంతేకాక, న్యాయస్థానాల్లో డబ్బు చేసుకోవాలంటే, ఈ భాష తప్పక తెలిసి ఉండాలి. బీహార్‌లో పర్షియన్ నేర్చుకొన్న హిందువులను కూడా 'మున్షీ' (Munshi) లని పిలిచేవారు.

పర్షియన్, అరబిక్ భాషల వ్యాప్తికి రాజాదరణ విస్తారంగా లభించింది. అయోధ్యలోని నవాబ్ సఫ్దర్‌జంగ్, బెంగాల్ నవాబ్ అలీవర్ది ఖాన్ కొలువులో నాటి ప్రఖ్యాత పండితులెందరో ఉండేవారు. మత శాస్త్రం, న్యాయ శాస్త్రం, శృంగారాత్మక కావ్య సాహిత్యంలో దిగ్గజాలైన ఎందరినో అలీవర్ది ఖాన్ పోషించారు. మౌల్వీ నసర్, మీర్ మహమ్మద్ ఆలీమ్, షాఖిజార్, సయద్ మీర్ మహమ్మద్ నదజార్ వంటి ఎందరో మహానుభావులు ఈకాలానికి చెందినవారే, నీతి, నిజాయితీ కలిగి, మత విజ్ఞానం, సాహిత్యం, న్యాయసూత్రాల్లో విశేష ప్రతిభ కనపర్చిన వారిని దేవతలతో సమానంగా చెప్పేవారు. రంగాపూర్‌లోని మౌల్వీలు పర్షియన్ సాహిత్యంలో అందె వేసిన వారని బుకానన్ చెప్పాడు. పాట్నావాసి మహమ్మద్ అల్ మిదుబేడ్ ఆలీ వైజ్ఞానిక శాస్త్రంలో నిష్ణాతుడు. ఖగోళ శాస్త్రంలో లోతులు తరచినవాడు.

18వ శతాబ్దంలో ముసల్మానుల పాలన తొలగింప బడడంతో, పర్షియన్, అరబిక్ భాషాధ్యయనం బాగా కుంటుపడింది. ఉన్నత విద్యలో అరబిక్ భాష పూర్తిగా విస్మరింపబడింది. అరబిక్ ఉపాధ్యాయులకు చిత్తశుద్ధి లోపించింది. కేవలం భాషను మాత్రమే నేర్పేవారు. అరబిక్ శాస్త్ర విజ్ఞాన పరిచయం అసలే లేదు. న్యాయ సూత్రాలు, వ్యాకరణం, తత్వ విచారం మొదలైనవాటి అవగాహన ఖాజీలకే లేదు. ముల్లాలు అర్థం చేసుకోకుండానే 'ఖురాన్' పఠన చేసేవారు. అయితే, పర్షియన్ భాష అధ్యయనం హిందు, ముసల్మానుల ఉన్నత వర్గాల్లో కొనసాగింది. హిందువుల్లో కాయస్థులు పర్షియన్ భాషలో బాగా కృషి చేశారు. బీహార్‌లోని షాబాద్ జిల్లాలోని ప్రతి కాయస్థునికి పర్షియన్ భాష తెలుసునని బుకానన్ రాశాడు. మధ్య భారతంలో కాయస్థులంతా చదువుకొన్నవారేనని మాల్కోలం చెప్పారు.

## 3.6 పర్షియన్ పాఠశాలలు

పర్షియన్ భాష బోధించే విద్యాలయాలన్నీ ప్రాథమిక పాఠశాలలే. వాటిని 'మదరసా' (Madarsa) లేదా 'మకతాబ్' (Maktab) అని పిలుస్తారు. మొగల్ రాజులు, ప్రభువులు, వాటి నిర్వహణకై నిధులు లేదా ఆస్తులను

సమకూర్చేవారు. పాట్నాలోని మదారాసాను బెంగాల్ నవాబ్ స్థాపించగా, 'షాజహాన్' 'కుషీబ్ బాగ్' మదర్సాకు ఆస్తులను సమకూర్చాడు. ముషీరాబాద్‌లో ముసల్మాన్ పండితులకై నిర్మించిన కట్టడం ప్రసిద్ధమైంది. మౌల్వీలు నడిపే పాఠశాలకు ప్రభుత్వం నుండి, ప్రజల నుండి విరాళాలు వచ్చేవి. ఈ పాఠశాలల్లో అరబిక్ భాష కూడా నేర్పబడేది. ఉత్తర భాతంలో పర్షియన్, అరబిక్ భాషల్లో ఉన్నత విద్యను నేర్పేవారిని మౌల్వీలు మియాంజులని పిలువగా, ప్రాథమిక పాఠశాల గురువులను 'కులీఫా'లని వ్యవహరించేవారు. చాలామంది విద్యార్థులు ప్రాథమిక విద్యతోనే విద్యా వ్యాసంగాన్ని ముగించేవారు. అరబిక్ విద్యలో భాష, వ్యాకరణాలకు ప్రాధాన్యమివ్వబడేది. బుకానన్ (Buchanan) చెప్పిన దాన్నిబట్టి, 'అరబిక్' భాషకు అంత విలువ లేదు. ముస్లిం వ్యవస్థలోని మతాచార్యులు, ఫిరజాదాలు, ముల్లాలు, ఖ్వాజీల భాషా పాండిత్యం కూడా అంతంత మాత్రమే, కొందరు చదువగలరు. కాని వ్యాఖ్యానించలేరు. 'హఫీజు'లని పిలువబడ్డ పండితులు కూడా 'ఖురాన్' చదువగలరు. కాని దాన్ని సరిగా అర్థం చేసుకోలేరు. కొన్ని అరబిక్ పాఠశాలల్లో మాత్రం ఇస్లాం మత సిద్ధాంతాలను క్షుణ్ణంగా చెప్పడమే గాక, ఖగోళ శాస్త్రం, రేఖా గణితం, తర్కం, న్యాయ సూత్రాలు అత్యున్నత స్థాయిలో బోధింపబడేవి. అచ్చుయంత్రం కనిపెట్టక ముందు, ఐరోపాలో జరిగిన విద్యా వ్యాసంగాన్ని వారి పర్షియన్, అరబిక్ విద్యా వ్యాసంగం కొనసాగిందని ఆడమ్ అభిప్రాయపడ్డాడు. నాటి అరబిక్, పర్షియన్, విద్యా వ్యాసంగంలో, శాస్త్ర విజ్ఞానం ఒకే మూసలో నడిచింది. అయితే చరిత్ర అధ్యయనం మాత్రం ప్రముఖంగా ఉండేది. హిందూ సాహిత్యంలో చారిత్రక గ్రంథాలు చాల తక్కువ. ఈ విషయంలో ఎన్నో గ్రంథాలు ఇస్లామ్ సాహిత్యంలో వెలువడ్డాయి. వాటిలో ఆధునిక విశ్లేషణ అంతగా కన్పించక పోవచ్చును. అక్బర్ పాలనా కాలం నుండి వైద్య విజ్ఞానం పట్ల ఆసక్తి పెరిగింది. ఈనాటి ముసల్మాన్ హకీములు నాటి వైద్య విజ్ఞానాన్ని అనుసరిస్తున్నారు. న్యాయ సూత్రాలు చాలవరకు ఖురాన్ పై ఆధారపడి రూపొందింపబడేవి. ముసల్మాన్ విద్యా సంస్థలతో అందరికి ప్రవేశముండేది. ఇది కొంతవరకు విద్యలో కుల విభజనను అరికట్ట కల్గింది.

## 3.7 ప్రాంతీయ భాషా బోధన

ప్రజాబాహుళ్యంలో విద్యను వ్యాప్తి చేయడంలో, ప్రాంతీయ భాషా పాఠశాలలు ప్రముఖ పాత్రను నిర్వహించాయి. ఈ పాఠశాలల్లోని విద్య అందికీ అందుబాటులో ఉండేది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, అన్నికులాల నుండి, వర్గాల నుండి ఎన్నుకోబడి, సర్వసమభావంతో పనిచేయడమేగాక హిందు, ముసల్మానుల మధ్య సామరస్య సంధానకర్తగా ఉపయోగపడ్డాయి. వీటిని గూర్చి బుకానన్ పాఠశాలలుగా చెప్పబడే ఈ చిన్న విద్యాలయాల్లో కుల, మత, ప్రసక్తి లేని గురువులు, హిందూ, ముసల్మాను విద్యార్థులకు ప్రాథమిక విద్యను నేర్పే వారని రాశాడు. బీహార్, బెంగాల్‌లో పట్టణాల్లో, పల్లెల్లో కూడా ఎన్నో పాఠశాలలుండేవి. ఈ ప్రాథమిక విద్య కొంతవరకు ప్రజల దృక్పథాన్ని ప్రభావితం చేసింది. అయితే వీటికి చాలా కొరతలుండేవి. సరైన ప్రభుత్వ ఆదరణ, విద్యార్థుల పేదరికం, ప్రచురితమైన పుస్తకాలు లేకపోవడం బోధనకు ఆటంకాలుగా ఉండేవి.

అయితే ఈ ప్రాంతీయ భాషా పాఠశాలల్లోని విద్య చాలా ఉపయుక్తంగా, ప్రయోజనకారిగా పనిచేసింది. సామాజిక వ్యవస్థలోని దిగువ వర్గాల వారికి కూడా అందుబాటులోని వచ్చింది. వ్యాపార, వ్యవసాయ సంబంధమైన లెక్కలు, ప్రాంతీయ భాషల్లోని ప్రాథమిక విషయాలు తెలుసుకోవటం, చదవడం, రాయడం వంటివి నాటి సామాజిక అవసరాలకు ఉపయుక్తంగా ఉండేవి. బెంగాల్‌లోని కొన్ని పాఠశాలల్లో ఈ విద్య ఉన్నత విద్యాభ్యాసానికి దోహదకారిగా రూపొందింపబడిందని ఆడమ్ రాశాడు. ఉత్తర ప్రదేశ్‌లోని చిన్నారి బాలురు తులసీదాస్ బెహారి రచనల నుండి కొన్ని భాగాలను వల్లె వేసేవారు. ఈవిద్యవల్ల పరిశ్రమల్లో చిన్న చిన్న

B R A O U

ఉద్యోగాలు కూడా దొరికేవి. లెక్కలు సరిగా రాయడం, వ్యాపార లావాదేవీల సంబంధిత ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపడం మొదలైన విషయాలు నేర్పబడేవని మాల్కోలమ్ (Malcolom) రాశాడు. గణితతంలో చక్కని బోధన ఉండేది.

నేటి పరిమితులతో ఆలోచిస్తే, ఈ ప్రాథమిక ప్రాంతీయ విద్యా బోధన సంతృప్తికరమే. ఐదారేళ్ళకే పిల్లలకు చదవడం, రాయడం ఒకేసారిగా నేర్పించడం అద్భుతమైన పద్ధతి అని బుకానన్ ప్రశంసించాడు. నేలమీద అక్షరాలు రాస్తూ, ఐదారు నెలల్లోనే చదువడం, రాయడం నేర్చుకొనేవారు. ఆ తరువాత అరటి ఆకుల మీద గంటంతో రాస్తూ తూకాలు, కొలతలు నేర్చుకొనేవారు. కొలమానం, లెక్కలు నేర్చుకోడానికి 18నెలలు పట్టేది. ఆ తరువాత కాగితాల మీద కూడికలు, తీసివేతలు, హెచ్చవేతలు, భాగాహారాలు నేర్చుకొని, లెక్కలు రాయడం అభ్యసించేవారు. విద్యతో సామాన్య జనులు సంతృప్తి చెందేవారు. ఈ పాఠశాలల్లోకూడా రకాలుండేవి. కొన్ని పాఠశాలల్లో ప్రాంతీయ భాష నేర్పగా, మరికొన్ని పాఠశాలల్లో వ్యవసాయం, లెక్కలు, మరికొన్ని చోట్ల వ్యాపారపు లెక్కలను నేర్పేవారు. ఈ పాఠశాలల్లో బోధన ఆయా తరగతుల ప్రజల ప్రయోజనాలకుపయుక్తంగా ఉండేదని, వృత్తి విద్యలు కూడా ఉండేవని, విద్యా బోధన ఆచార్య వ్యవహారాలతో ముడిపడి ఉండేవని ఆడమ్ (Adam) రాశాడు. దక్షిణ భారతంలో భిన్న చేనేత కులాలవారు రాయడం, చదువడమేకాక, వ్యాపార ఉత్తర ప్రత్యుత్తరాలు చక్కగా రాసేవారని, దిగువ కులాలుగా చెప్పబడిన వారు కూడా తమ ప్రాంతీయ భాషను నేర్చుకొనేవారని ఆధారాలు తెలుపుతున్నాయి.

## 3.8 ఉన్నత విద్యా కేంద్రాలు

భారతదేశంలో గురు శిష్యులొక్కచోట చేరి, విద్యా వ్యాసంగాన్ని కొనసాగించే ఉన్నత విద్యా కేంద్రాలకు కొదువ లేదు. ప్రాచీన సంస్కృతి, సాహిత్యాలను నిరంతర దీక్షతో అధ్యయనం చేసే తక్షశిల, నలందా, విశ్వవిద్యాలయాలు 18వ శతాబ్దంలో కూడా కొనసాగాయి. హిందూ ధర్మ బోధనలకు గంగానది ఒడ్డున అందంగా అమరిన వారణాసి కేంద్రంగా భాసిల్లింది. వారణాసిని బెర్నియర్ 'ఏథెన్స్' (Athens) తో పోల్చాడు. దేశ వివిధ ప్రాంతాలనుండి బ్రాహ్మణులు వేదాలు, శాస్త్రాలు, ఖగోళ శాస్త్ర రహస్యాలను, మెలుకువలను తెలుసుకోడానికి ఇక్కడకు చేరేవారు. ముఖ్యంగా ఖగోళ శాస్త్రంపై ఉన్నత స్థాయిలో పరిశోధనలు జరిగేవి. వారణాసిని దర్శించిన ఫార్‌స్టర్ (Forster) ఆప్రాంత ప్రశాంతతకు ముగ్ధుడై, ప్రపంచ దేశాల్లో హిందువులు అత్యంత ప్రజ్ఞా ప్రాభవాలు కల జాతిగా కీర్తించాడు. వారి ఖగోళ శాస్త్ర పరిజ్ఞానంపట్ల ఆశ్చర్యపడ్డాడు. మధ్య భారతంలో ఉజ్జయినీ సంస్కృత భాషాధ్యయానికి కేంద్రం. బీహార్‌లోని తిర్హుట్ (Tirhut) లో మిథిల బ్రాహ్మణులు గొప్ప ఉపాధ్యాయులుగా కీర్తి గడించారు. బెంగాల్‌లోని నదయాను ఆంగ్లేయులు రాక ముందు' ఆక్స్‌ఫర్డ్' (Oxford)తో పోల్చాడు. ఇది మేధావి వర్గాల చర్చలకు కేంద్రంగా విరాజిల్లింది.

ఇస్లాం విద్యా కేంద్రాలు కూడా విస్తృతంగానే ఉన్నాయి. జాన్‌పూర్ పర్షియన్ భాషా కేంద్రం. ఆ తరువాత లక్నో పర్షియన్ సంస్కృతీ కేంద్రంగా భాసించింది. ఢిల్లీలోని రాజకీయ అస్థిరత వల్ల ఎందరో మేధావులు, పండితులు, లక్నో చేరి, తమ భాషా పాండిత్యాన్ని, విజ్ఞానాన్ని ప్రదర్శించారు. పర్షియన్, అరబిక్, భాషల్లో కృషి చేసిన మేధావుల్లో అత్యధికులు ఈ నగారానికి చెందినవారే. అంతకు ముందు రోజుల్లో పాట్నా కూడా పర్షియన్ విద్యా కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఎందరో పండితులు పర్షియానుండి వచ్చి, భారతదేశంలో స్థిరపడ్డారు. మొత్తం మీద పాండిత్య ప్రాభవం ఒక గొప్ప సాంస్కృతిక లక్షణంగా రెండు మతాల్లోను అంగీకరింపబడింది.

BRAOU

## 3.10 విద్యా వ్యవస్థ ఏర్పాటు

18వ శతాబ్దంలో విద్యా విధానం ప్రభుత్వంలో ఒక భాగంగా గాని లేదా ప్రభుత్వ అజమాయిషీలో గాని ఉండేది కాదు. దానికి ప్రభుత్వపరంగా ఒక లక్ష్యం, నిర్దేశం కూడా లేదు. సంస్కృత అకాడమీలు, పర్షియన్ స్వాదేశిక, ప్రాంతీయ భాషలకు ప్రత్యేకమైన విద్యా సంస్థలుండేవి. వీటి నిర్వహణకై సామాన్యంగా కొంత భూమి లేదా కులీనుల విరాళాలుండేవి. ఉన్నత సంస్కృత పాఠశాలలు బ్రాహ్మణ పండితులు లేదా అధ్యాపకులచే నిర్వహింపబడి, మన ప్రైవేట్ బోధనా సంస్థలవలె పనిచేసేవి. అక్కడ బోధనాంశాలను కూడా అధ్యాపకులే నిర్ణయించేవారు. బీహార్‌లో వాటిని ధర్మశాలలని, బెంగాల్‌లో 'చేబరి' (Chaberi) అని పిలిచేవారు. భూదానాలు విరివిగా ఉన్న ఈ విద్యాలయాల్లో ఉచిత విద్యను గరపడమేకాక, విద్యార్థులకుచిత భోజన వసతులు కూడా కల్పించేవారు. ఇట్టి బ్రాహ్మణ కుటుంబాల ఔదార్యాన్ని బుకానన్ ప్రశంసిస్తూ, బ్రిటిష్ పాలనలో ఈ భూములు అన్యాక్రాంతాలు కాగా, సంస్కృత విద్యాలయాలెన్నో మూసివేయబడినాయని వాపోయారు. ఈ భూదానాలు కాక కులీన వర్గాల వారు విద్యకై విరాళాలనిచ్చేవారు. దానాలు ధన, వస్తు రూపేణా ఉండేవి. అయితే విద్య నేర్పే బ్రాహ్మణునికి పౌరోహిత్య బ్రాహ్మణునికన్నా ఆదాయం తక్కువ, ఈకారణంగా కొన్నాళ్ళకు విద్య విస్మరింపబడింది. విద్యార్జనలో భిక్ష ఎత్తడం కూడా తప్పుకాదనే ఆదర్శం గొప్పది. స్వాదేశిక ప్రాంతీయ విద్యాలయాల్లో విద్యార్థులు పాటలు పాడుతూ, ఇంటింటికిపోయి, గురుదక్షిణను వసూలు చేయడం ఆనవాయితీ. పర్షియన్ విద్యాలయాలు కూడా దానధర్మాల చేతనే నిర్వహింపబడేవి. కొందరు మౌల్వీలు ఉచితంగా విద్య నేర్పి, ఎలాంటి ప్రతిఫలాన్ని కోరేవారు కారు. గౌరవప్రపత్తులే వారి జీవితం. ఉన్నత వర్గాల వారు తమ పిల్లలకు ఇంటివద్దే అధ్యాపకులను పిలిపించి, చదువు చెప్పించుకొనే పద్ధతి కూడా ఉండేది.

సంస్కృత, పారశీక పాఠశాలలకు శాశ్వత ప్రాతపదికపై ఆధారదానాలు (Endowments) ఉండగా, స్వాదేశిక ప్రాంతీయ పాఠశాలలకట్టి వనరుల్లేవు. నగరాల్లో ఒక కులీనుని ఇంట ఉపాధ్యాయుడు బోధించడానికి వస్తే, ఇరుగు పొరుగు వారు కూడా కూర్చొని చదువుకొనడానికి అనుమతించేవారు. గ్రామాల్లో గ్రామీణ వ్యవస్థ లేదా భూస్వాముల దానాలచే పాఠశాలలు నిర్వహించబడేవి. గ్రామానికి వెలుపల పాఠశాలలకు కుటీరాలను నిర్మించేవారు. ఇక్కడ విద్యార్థులనుండి వసూలుచేసే ఫీజులనుబట్టి, ఉపాధ్యాయుల జీతాలు నిర్ణయింపబడేవి. ఆ వసూళ్ళు తక్కువైనందున ఉపాధ్యాయ వృత్తిలో ప్రతిభావంతుల కొరత ఏర్పడింది. బెంగాల్, బీహారుల్లో ఈ పాఠశాలల్లో పనిచేసే గురువులకు ఫలం, గౌరవం, సంస్కృత, పారశీక ఉపాధ్యాయులకన్న బాగా తక్కువగా ఉండదని బుకానన్ రాశాడు. సామాజిక వ్యవస్థలో అతికీలకమైన ఈ ఉపాధ్యాయులు నిరాదరణకు లోనయ్యారు. ఉపాధ్యాయుల జీతాలపై చేసిన ఒక గణాంక పరిశోధన ప్రకారం, ప్రాంతీయ పాఠశాల ఉపాధ్యాయుని ప్రతిఫలం రెండు రూపాయలైతే, బ్రాహ్మణ గురువుకు 53 రూపాయలు లభ్యమయ్యేవి. అంతేకాక నాడు జరిపిన సర్వేలనుబట్టి, జనాభాలో అక్షరాస్యతా శాతం 13%గా చెప్పబడింది. ఎట్లాంటి ప్రభుత్వ సాయం లేకుండా, ఎన్నో పరిమితుల్లో విద్యా విధానం కొనసాగినా, ఆమాత్రం అక్షరాస్యత సాధింపబడటం అభినందనీయమే. ఆమూలాగ్రంగా చూస్తే, 18వ శతాబ్దపు విద్యా విధానం మధ్య యుగ పోకడలనే కొనసాగింది.

## 3.11 స్త్రీ విద్య

నాడు స్త్రీ విద్యకెట్టి ఏర్పాట్లు చేయడానికి భారతీయ సమాజ వ్యవస్థ ప్రయత్నించ లేదు. మధ్య భారతంలో స్త్రీ విద్యకై ఎలాంటి పాఠశాలలు లేవని, వారి ఆచార సాంప్రదాయాలు స్త్రీ విద్యపట్ల విముఖతను చూపిందని

BRAOU

మాల్కోలం రాశాడు. సామాన్య స్త్రీ విద్య దరిదాపుగా శూన్యం. అయితే రాజపుత్ర కులీన వర్గాల్లో స్త్రీలు ప్రైవేట్ బోధనద్వారా ఉత్తరాలు రాసే జ్ఞానాన్ని పొందేవారు. నాట్యాంగనలు కూడా కొంతవరకు విద్యనేర్చేవారు. స్త్రీ విద్య ఒక అపురూపమైన విశేషం. ఉన్నత వర్గాల్లో ఇళ్ళవద్దే వారు విద్యాభ్యాసం చేసేవారు. అదీ తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే. వారికి బోధించే విద్యకూడా, మతపరంగా వారు చేయవలసిన విధులకే పరిమితమయ్యేది. అందువల్ల సార్వజనీన స్త్రీ విద్య అనే అభిప్రాయమెక్కడా కన్పించదు. స్త్రీ విద్యపట్ల సాంప్రదాయ ధోరణుల వ్యతిరేకత బలీయంగా ఉండేది. మహా ఘనంగా చదివితే వారి చదువు రాయడం, మాట్లాడం వరకే పరిమితం. ఇన్ని అడ్డంకులున్నా హోల్కార్ కుటుంబానికి చెందిన అహల్యాబాయి, రాణి భభాని, ఆలివర్ఖాన్ బేగం, బేగం సమ్రా వంటి మహిళామణులు తమ విద్యా ప్రతిభను, పాలనా ప్రతిభను చాటిచెప్పారు. అయితే స్త్రీ విద్యకు అనర్హులని భావింపబడే సామాజిక వ్యవస్థలో అలాంటివారు అరుదైన ఆణిముత్యాలు.

ప్రాచీన కాలమంతటా ఎంతో ఉన్నతంగా సాగిన విద్యా వ్యాసంగం 18వ శతాబ్దంలో దిగజారినట్లుగా కన్పిస్తుంది. ముస్లిం పాలన అంతం కావటంతో పర్షియన్ భాషా వ్యాప్తి కూడా కుంటుపడింది. అయినా విద్యకు విలువ, పండితులకు గౌరవం యదాతధంగానే నిలిచాయి.

## 3.12 నాటి విద్యా విధానంలోని కొన్ని లోపాలు

నాటి విద్యా వ్యాసంగం జనాభాలో అతి కొద్దిమందికి మాత్రమే అందుబాటులో ఉండేది. బడికి వెళ్ళే వయసులోనున్న పిల్లల్లో 6,7 శాతం మంది మాత్రమే ప్రాథమిక విద్యకు నోచుకొనేవారు. బళ్ళారి ప్రాంతంలో వేయిమందికి 7గురు మాత్రమే బడికి వెళ్ళేవారని కేంప్‌బెల్ (Campbell) రాశాడు. ఆడపిల్లలు చదవటం అనేది పూర్తిగా లేనట్లే భావించవచ్చు. ఆ విద్య కూడా కేవలం అగ్రకులాలకే పరిమితమయ్యేది. చదవటం, రాయటం, విద్యయని భావించేవారు. విజ్ఞానానికి పెద్దగా ఆస్కారముండేదికాదు.

ఈ సాంప్రదాయ విద్యా విధానంలో ఉపాధ్యాయులు కూడా పెద్దగా అర్హతలున్నవారు కాదు. చదువు చెప్పటంతోపాటు ఆదాయం కోసం వేరే పనులుకూడా చేసేవారు. వీరికి దేశ చరిత్ర, భౌగోళిక పరిస్థితులను గూర్చి అంతగా పరిజ్ఞానముండేదికాదు. పదాలను వల్లె వేయించటం చేసేవారు. ముసల్మాన్ పాఠశాలల్లో 'ఖురాన్' వల్లె వేయించేవారు. ఈ విద్యా విధానంలో ముఖ్యంగా విశ్లేషణ, ఆలోచన, సృజనాత్మక శక్తి లోపించింది. నేర్చుకొన్నది యదాతధంగా ఒప్పచెప్పటం జరిగేది. అంతేకాని చదివిన దాని సారాంశం గూర్చి పట్టించుకొనేవారు కాదు. పాండిత్య ప్రకర్షలో భాషాజ్ఞానం పెరిగినా, విజ్ఞానం పెరిగేది కాదు. నాటి విద్యా విధానంలో సామాజిక వ్యవస్థ, దానిలో మానవుడు పోషింపవలసిన పాత్ర, బాధ్యతలను గూర్చిన పరిజ్ఞానం కన్పించేది కాదు. ప్రాచీన గ్రంథాలను యదాతధంగా పునశ్చరణ చేయడం జరిగేది. ఆధునిక విజ్ఞాన శాస్త్రం, తర్కం, హేతు వాదం, నాటి విద్యా విధానంలో చోటు చేసుకొనలేదు. సాహిత్యానికి, భాషా పాండిత్యానికి విద్యా విధానంలో పెద్ద పీట వేయబడింది. 18వ శతాబ్దం ఆఖరు వరకు భారతీయ విద్యా విధానంలో ఆధునికత చోటు చేసుకోలేదు.

## 3.13 సంగ్రహంగా

ఈ భాగాన్ని చదివిన తరువాత 18వ శతాబ్దంలోని విద్యా విధానం ఏవిధంగా కేవలం భాషా పాండిత్యానికి మాత్రమే పరిమితమైందో, ఆధునిక విజ్ఞాన శాస్త్రం ఎలా విస్మరింపబడిందో కొంతవరకు అర్థంచేసుకోగలరు. అయితే సంస్కృతం, పర్షియన్ భాషల అభివృద్ధి విద్యా సంస్థలు స్వచ్ఛందంగా నిర్వహింపబడడం విశేషం.

BRAOU

## 3.14 పరీక్ష నమూనా ప్రశ్నలు

I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. 18వ శతాబ్దంనాటి విద్యా వ్యవస్థ రూపురేఖలను పరిశీలించండి.

II క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. 18వ శతాబ్దంలో సంస్కృత విద్యా వ్యాప్తి
2. 18వ శతాబ్దంలో పర్షియన్ భాష ప్రాముఖ్యత.

## 3.15 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Bipin Chandra | – | **History of Education in India** |
| Datta | – | **Down of Renaissance in India** |
| Datta R. R | – | **Survey of Social life and Economic conditions of 18th Century** |
| Ishwara Datta | – | **A street of Ink** |
| Klay F.F, Sukumarmitra | – | **History of Education in India** |
| Raghuvamsi | – | **Indian society cluning the 19th century** |


*రచయిత : శ్రీ ఎ. వి. కోటిరెడ్డి*

BRAOU

# ఖండం : II

# సైద్ధాంతిక ప్రభావం

19వ శతాబ్దంలో భారతదేశ చరిత్రలో, సామాజిక వ్యవస్థలో మతంలో, విద్యా విధానంలో మార్పులు వచ్చాయి. అంతేకాక, ప్రప్రథమంగా పత్రికా రంగం ప్రాముఖ్యత సంతరించుకుంది. విద్యా విధానంలో ఎన్నో మార్పులు వచ్చి, ఆంగ్లేయ విద్యా విధానం ప్రవేశ పెట్టబడింది. ఇది ఎన్నో సామాజిక, మత పరమైన మార్పులకు కారణభూతమైంది. ఈ మార్పులన్నింటికీ ఏదో ఒక సిద్ధాంత ప్రేరణ ఉండాలి. ఈ ఖండం ప్రథమ భాగంలో సిద్ధాంత చర్చ జరిగింది. ఆ తరువాత సామాజిక వ్యవస్థలో వచ్చిన సంస్కరణలు, విద్యా విధానంలోని మార్పులు, పత్రికా రంగం ఆగమనం, ఈ మార్పుల వల్ల అంతర్లీనంగా నడచిన సాంస్కృతిక, వైజ్ఞానిక ప్రయోగాలు చర్చించడమైంది.

BRAOU

BRAOU

# భాగం - 4 : ప్రాచ్య వాదం (Orientalism) ఎవాంజిలిజం (Evangelism) ఉపయోగితా వాదం (Utilitarionism)

విషయ క్రమం


4.0 లక్ష్యాలు

4.1 పరిచయం

4.2 ప్రాచ్య వాదం (Orientalism)

4.2.1 ఆంగ్లేయ పాలనలో ప్రాచ్య వాద ఆవిర్భావం

4.2.2 వారన్ హేస్టింగ్స్ (Warran Hastings)

4.2.3 ప్రాచ్య వాద ప్రాబల్యం

4.2.4 చార్లెస్ విల్కిన్స్ (Charles Wilkins)

4.2.5 కోల్‌బ్రూక్ (Colebrooke)

4.2.6 విలియమ్ జోన్స్ (William Jones)

4.2.7 పురావస్తు పరిశోధనలు

4.3 ఎవాంజలిజమ్ (Evangelism)

4.3.1 భారతదేశంలో ఎవాంజలిస్టు కార్యకలాపాలు

4.3.2 చార్లెస్ గ్రాంట్ (Charles Grant)

4.3.3 భారతీయ వ్యతిరేకత

4.4 ఉపయోగితా సిద్ధాంత (Utilitarionism) ఆవిర్భావం

4.4.1 సిద్ధాంత రూపకల్పన

4.4.2 బెంథామ్ (Bentham)

4.4.3 హబ్స్ (Hobbs)

4.4.4 లాక్ (Locke)

4.4.5 ఉపయోగితా సిద్ధాంత మూలాంశాలు

4.4.6 ఉపయోగితా సిద్ధాంతం – భారతదేశ చరిత్రపై ప్రభావం

4.4.7 జేమ్స్ మిల్ (James Mill)

4.5 సంగ్రహంగా

4.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

4.7 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 4.0 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగల్గాలి.

- 18వ శతాబ్దంలో భారతదేశంలో సామాజిక, మత, రాజకీయ వ్యవస్థలో వచ్చిన పరిణామాలు, వాటికి మూలమైన సిద్ధాంతాల విశ్లేషణ
- ప్రాచ్య వాదం ఏ రీతిగా భారతీయ సంస్కృతిపట్ల గౌరవాన్ని కల్గించిందో పరిశీలన
- ఎలాంజలిజం సిద్ధాంతం, కార్యకలాపాల వివరణ
- భారతీయ వ్యవస్థల రూపకల్పనలో ఉపయోగితా వాద ప్రభావం, పాత్ర

## 4.2 పరిచయం

ప్రాచ్య వాదం లేదా ఓరియంటలిజమ్ (Orientalism)అనే పదాన్ని ప్రప్రథమంగా ఐరోపా వారే వాడుకలోకి తెచ్చారు. ప్రాచ్య సంస్కృతి, ప్రాచ్యంగా చెప్పబడే దేశాల ఉనికి, అద్భుత దృశ్యాలు, విచిత్ర కథనాలు, సంఘటనలు పశ్చిమ దేశాల వారికి ఎంతో ఆసక్తిని కలిగించాయి. ప్రాచ్య విశేషాల విశ్లేషణ పశ్చిమ దేశస్తులకు ఒక అనుభూతిగా మారింది. ప్రాచ్యంగా చెప్పబడే ఈ ప్రాంతం ఐరోపా పొరుగున ఉండడం, భాషా సంస్కృతుల్లో ఐరోపాను ప్రభావితం చేయడం జరిగింది. అంతేకాక ఐరోపా రాజ్యాల తొలి వలసలు ప్రాచ్యంలోనే ఉన్నాయి. భాగ్యవంతమైన ఈ వలసలు కొంత వరకు ఐరోపాను పోషించాయి. ఐరోపా నాగరికతా అభివృద్ధిలో ప్రాచ్య సంపద వినియోగింపబడింది.

ప్రాచ్య వాదం అనే పదం సామాన్యంగా ఈ ప్రాంతాన్ని గూర్చి పరిశోధన చేయడం, ప్రాచ్య విషయాల విశ్లేషణకు పర్యాయపదంగా వాడబడింది. 19, 20 శతాబ్దాల్లో ఐరోపా ముఖ్య నగరాల్లో ప్రాచ్య విషయాలపై ఎన్నో సదస్సులు జరిగాయి. ప్రాక్, పశ్చిమ రాజ్యాలను మధ్య కొన్ని మౌలిక భేదాలున్నాయనే సిద్ధాంత ప్రాతిపదికపై ఎందరో కవులు, రచయితలు, వేదాంతులు, రాజకీయ పండితులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ప్రాచ్య సంప్రదాయాలు, ఆలోచనలు, విశ్వాసాలు కొంతవరకు పశ్చిమ దేశాలకు భిన్నమైనా, ప్రాచ్య ఆర్థిక, భౌతిక నగరికతాభివృద్ధి పశ్చిమాభివృద్ధిలో అంతర్భాగమైంది.

ఆధునిక కాలంలో పాశ్చాత్య నాగరికత ప్రపంచ వ్యాప్తమైంది. ఆ నాగరికతా ప్రభావంలో ప్రాచీన కాలంలో ప్రభవించిన అద్భుతమైన ఆసియా, ఆఫ్రికా నాగరికతలు మరుగునపడ్డాయి. వలస విధానం, సామ్రాజ్య వాదం ప్రాచ్యాన్ని పశ్చిమ దేశాలను రాజకీయ, ఆర్థిక ఆధిపత్యానికి లోనుచేయగా, ప్రాచ్య చరిత్ర, సంస్కృతి విస్మరింపబడ్డాయి. భారతదేశంలో ఆంగ్ల సామ్రాజ్యాధికారం స్థిరపడిన తరువాత ఆంగ్ల పాలకుల కాలంలో తిరిగి మన చరిత్ర, నాగరికతల అధ్యయనంపై ఆసక్తి అభిలాష చిగురించింది. ఈ కృషిలో ఎందరో ఆంగ్లేయాధికారులు, పురాతత్వ శాస్త్రజ్ఞులు, చరిత్రకారులు భాగస్వాములయ్యారు. ప్రాచీన భారత చరిత్ర, సంస్కృతుల విశ్లేషణ వాటి ప్రాభవాన్ని, దేశీయ భాషల సంస్కృతుల ఔన్నత్యాన్ని, సామాజిక మతిరుగ్మతల విశ్లేషణ కార్యక్రమాన్ని స్థూలంగా 'ప్రాచ్య వాదం'గా వ్యవహరించడం జరిగింది.

### 4.2.1 ఆంగ్లేయ పాలనలో ప్రాచ్య వాద ఆవిర్భావం

18వ శతాబ్దపు ఉత్తరార్ధం వరకు భారతదేశ ప్రాచీన చరిత్ర అధ్యయన కృషి పెద్దగా కనిపించదు. గ్రీక్, లాటిన్ భాషలలో ఉన్న ప్రస్తావనలే, ప్రాచీన చరిత్ర ఆధారాలుగా నిలిచాయి. సమకాలీన భారతీయ జీవన

B P A O U

విధానాన్ని ఆకళింపు చేసుకొన్న క్రైస్తవ మిషనరీలు దేశీయ భాషలను అధ్యయనం చేశారు. కాని సంస్కృతిని గూర్చి తెలుసుకోవడానికి ఉత్సాహం చూపలేదు. 1699–1732 మధ్య కేరళలో పనిచేసిన జెసూట్ ఫాదర్ (Jesuit Father) హేన్క్‌లెడెన్ (Hankoleden) ఐరోపా లిపిలో సంస్కృత వ్యాకరణాన్ని రూపొందించాడు. ఇదే సందర్భంగా సంస్కృతానికి, ఐరోపా భాషలకు మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తించడం జరిగింది. అయితే ప్రాచీన భారతదేశ చరిత్ర అధ్యయనం 'ఇండాలజీ' (Indology) 18వ శతాబ్దపు మలి భాగంలోనే ప్రారంభమైంది.

### 4.2.2 వారన్ హేస్టింగ్స్ ప్రాచ్య వాద ప్రారంభం

1772 లో వారన్ హేస్టింగ్స్ బెంగాల్ వచ్చేసరికి కంపెనీ పాలనలో జరిగిన అన్యాయాలపై, అకృత్యాలపై పార్లమెంటరీ సంఘ విచారణ సాగుతుంది. హేస్టింగ్స్‌కు ముందు పనిచేసిన కంపెనీ అధికారులు పోర్చుగీస్ భాషను మాత్రమే నేర్చుకొని, భారతీయ భాషలను విస్మరించారు. హేస్టింగ్స్ ఒక విధంగా భారతదేశాభిమాని. ప్రజల ఆదరాభిమానాలను చూరగొనవలెనన్న వారి భాషలోనే మాట్లాడడం ఉచితమని భావించి, బెంగాలీ, ఉర్దూ భాషలను అధ్యయనం చేశాడు. అలెగ్జాండర్ డో (Alexander Dow), హల్‌వెల్ (Holwell) వంటి కొద్ది మంది అధికారులు హేస్టింగ్స్ భావనతో ఏకీభవించారు. మిగతా అధికారుల దృష్టిలో ఈ దేశ పాలన ఒక వ్యాపారం మాత్రమే. 1772 లో ద్వంద పాలన రద్దయింది. ఆంగ్లేయ పాలనా విధాన రూపకల్పన ఆవశ్యకమైంది. కలకత్తా ఆంగ్లేయ సామ్రాజ్య ప్రధాన నగరమైంది. పశ్చిమ దేశాల నుండి వచ్చిన నిర్మాణాత్మకమైన ఆలోచనలు, ఆశయాలు ఒక వ్యవస్థాపర రూపాన్ని సంతరించుకొని, ప్రాక్ పశ్చిమ సంస్కృతులు సంగమ స్థానంగా, చర్చా వేదికగా మారడానికి దారితీసింది. సమర్థ పాలనకు భారతీయ సంస్కృతి అవగాహన ఆవశ్యకతలను హేస్టింగ్స్ గుర్తించాడు. ఐరోపా వ్యవస్థలను భారతదేశంపై బలవంతంగా రుద్దడం ఒక మార్గం. కాని, హేస్టింగ్స్ ఈ విధానాన్ని అనుసరించలేదు. స్థానికంగా ఉన్న భారతీయ వ్యవస్థలను కొనసాగిస్తూ, ప్రజాభిమానం పొంది, వారి సహకారంతో తనకు కావలసిన మార్పులను తీసుకురావచ్చునని విశ్వసించాడు. దేశీయ ఆచారాల అవగాహన, భాషలపై పరిపూర్ణతకల భారతీయ మేధావి వర్గం (Elite) రూపొందించడం ద్వారా, ఒక నూతన సాంస్కృతిక విధానానికి అంకురార్పణ చేసాడు. భారతీయ, ఆంగ్లేయాధికారుల మధ్య సమన్వయ భావం పాలనా సామర్థ్యానికి, గీటురాయి అని భావించాడు. ఆక్స్‌ఫర్డ్ (Oxford) విశ్వవిద్యాలయంలో పర్షియన్ భాషకు ఆచార్య పదవి కల్పించడానికి ప్రతిపాదనలను పంపాడు. నాడు న్యాయస్థానాల్లో రాజకీయ వ్యవహారాల్లో, పాలనలో పర్షియా భాషకు ప్రత్యేక స్థానముండేది. పర్షియన్ భాషను నేర్చుకొమ్మని హేస్టింగ్స్ కంపెనీ అధికారాలను ఆదేశించాడు. అయితే హిందుస్థాన్ ప్రజల భాష నేర్చే ప్రయత్నాలు 1790 ప్రాంతాల్లో మొదలయ్యాయి. హేస్టింగ్స్, ఆతని సన్నిహిత అధికారులైన ఛార్లస్ విల్కిన్స్ (Charles Wilkins); జోనాథన్ డంకన్ (Jonathan Dancan) వంటి యువకులు ప్రాచ్య భాషలు, సాహిత్యం పట్ల ఆసక్తిచూపి, ప్రచారం కల్పించారు. భారతదేశ చరిత్ర అధ్యయానికి, సంస్కృత విశ్లేషణకు ఎనలేని సేవచేసిన సర్ విలియమ్ జోన్స్ (Sir Wiliam Jones) 1783లో భారతదేశానికి వచ్చారు.

హేస్టింగ్స్ నూతన విధానంలో భాగంగా కంపెనీ నియమనిబంధనలు భారతీయ భాషల్లోకి అనువదింపబడ్డాయి. హిందూ, ముసల్మాన్ న్యాయసూత్రాలు ఆంగ్లంలోనికి అనువదింపబడ్డాయి. ఆంగ్లేయాధికారులు బెంగాలీ భాషను నేర్చుకోవడానికి ప్రయత్నించారు. బెంగాలీ బాషా వ్యాకరణాన్న 'నథానియోల్ హల్లెద్' (Natheneel Halhed) రూపొందించాడు. అధికార పత్రాలను బెంగాలీ భాషలో ప్రచురించడానికి వీలుగా, ముద్రణాలయాలు స్థాపించారు. దీనితో బెంగాలీ భాషకు విస్తృత ప్రచారం లభించింది. 1780 లో 'హికీస్ గజెట్' (Hickeys Gazette) అనే ప్రథమ ఆంగ్ల వార్తాపత్రిక ప్రచురింపబడింది.. ఈ చర్యలు కలకత్తాలోని భారతీయ

BRAOU

మేధావి వర్గాన్ని ప్రభావితం చేయగా, క్రమేణా ఆంగ్లేయుల్లో దక్షిణాసియా పట్ల, భారతీయ సంస్కృతి పట్ల ఆసక్తి పెరిగింది. 1784 లో హేస్టింగ్స్ స్థాపించిన 'ది ఆసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్' (The Asiatic society of Bengal) ఈ నూతన విధాన సమగ్ర ఫలమని చెప్పవచ్చు. కంపెనీ పాలనలో హేస్టింగ్స్ బ్రిటిష్ ఆధిక్యతకై ఎన్ని రాజకీయ ప్రయోగాలు చేసినా, మౌలికంగా ఆతడు భారతీయులను అభిమానించాడు. వారి సంస్కృతిపట్ల గౌరవం చూపాడు. పాలనా సామర్థ్యం మెరుగుపడాలంటే, ప్రజలను అభిమానించి వారితో వారి భాషలోనే సంభాషించాలనేది హేస్టింగ్స్ నమ్మకం. అయితే ఈ విధానాలన్నీ వారి వలస విధానాన్ని బలపరచడానికి దోహదం చేసాయి. ప్రాచీన గ్రంథాల పునరుద్ధరణ, భాషల అన్వయం, నిఘంటువులు, వ్యాకరణాల తయారు మొదలైన కార్యక్రమాలన్నీ, భారతదేశంపై ఆంగ్లేయ వలసాధికారాన్ని పటిష్ఠ పరచే ఆశయంతోనే జరిగాయి.

### 4.2.3 ప్రాచ్య వాద ప్రాబల్యం

ప్రాచ్య వాద ఆవిర్భావానికి హేస్టింగ్స్ మూలపురుషుడు. ఆ వాద ప్రాబల్యానికి 18వ శతాబ్దపు ప్రాజ్ఞ ఆలోచనలు, ఆశయాలు, విలువలు (Enlightenment) ముఖ్య కారణం. ఈ నూతన ఆలోచనా స్రవంతి ఉదార వాద అధికారులు మేధావుల ద్వారా, భారతదేశంలో ప్రవేశించగా, కలకత్తా నగరం దానికి ముఖ్య కేంద్రమైంది. ప్రాచ్య సంస్కృతి పునర్వికాసంలో రెండు దశలు కన్పిస్తాయి. హేస్టింగ్స్ కాలంనాటి ప్రాచ్య కృషిలో ప్రాచీనతపట్ల ఆకర్షణ, అభిమానం కన్పిస్తాయి. కాని అభ్యుదయ వాదం అంతగా ప్రచారానికి నోచుకోలేదు. అది ఉదారతను సూచిస్తుందే కాని జాతీయ వాదాన్ని ప్రేరణ చేయలేదు. 18వ శతాబ్దపు నూతన సిద్ధాంత ప్రచారంలో ప్రాచ్య వాదం భిన్నత్వంలో ఏకత్వాన్ని, ఆచరణ, ఆమోదాలను సాధించింది. సహనం, సభ్యత హేతు వాద దృష్టి ఆంగ్ల ప్రాచ్య వాదులను ప్రభావితం చేశాయి.

### 4.2.4 ఛార్లెస్ విల్కిన్స్ (Charles Wilkins)

హేస్టింగ్స్ పాలనా కాలంలో ప్రాచ్య భాషలపట్ల ఆసక్తి గల ఎందరో అధికారులు వచ్చారు. ప్రాచ్య నాగరికతలోని అమూల్య సాహితీ సంచయాన్ని ఆకళింపు చేసుకోవడానికి భారతీయ భాషలను నేర్చుకున్నారు. చార్లెస్ విల్కిన్స్ ప్రథమంగా భాషలను నేర్చుకోవడానికి ఇష్టపడకపోయినా, అకస్మాత్తుగా సంస్కృత అధ్యయనం పట్టుదలతో మొదలు పెట్టాడు. అతనిని సంస్కృత పాటవాన్ని తెలుసుకున్న హేస్టింగ్స్ కలకత్తాకు రప్పించి, ప్రభుత్వ ముద్రణాలయాన్ని అప్పగించాడు. 1783 లో భగవద్గీతను అనువదించాడు. రాయిల్ ఆసియాటిక్ సంఘ వ్యవస్థాపకుల్లో ఒక్కడయ్యాడు. పాలక రాజుల కాలంనాటి బెంగాల్ చంద్ర పునర్నిర్మాణంలో శాసనాధారాలను పరిశీలించాడు. ఆతని సంస్కృత భాష పాండిత్యానికి మెచ్చి, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం గౌరవ పట్టా ప్రదానం చేసింది.

### 4.2.5 కోల్‌బ్రూక్ (Colebroke)

నాటి ప్రాచ్య వాదుల్లో కోల్‌బ్రూక్ ప్రముఖుడు. 18వ ఏట మద్రాస్ వచ్చి కంపెనీ సర్వీసులో చేరాడు. గ్రీక్, రోమన్ సంస్కృతీయుల పట్ల ఎంతో వ్యామోహంకల కోల్‌బ్రూక్ అనతికాలంలోనే హేస్టింగ్ ప్రాచ్య వాద ఉద్యమం చే ప్రభావితుడైనాడు. జీవితంలో ఎన్నో ఒడుదుకులను ఎదుర్కొంటూ, బెనారస్‌లో ఉద్యోగం చేస్తూ, సంస్కృత భాషాధ్యయానాన్ని పట్టుదలతో ప్రారంభించి పండితుడయ్యాడు. అనువాదాలను అపహాస్యం చేసి, సంస్కృతంలో అద్భుతమైన మూల పరిశోధనలు చేసాడు. కోల్‌బ్రూక్ రచనలు ఐరోపా అంతటా విస్తృతంగా చదువబడ్డాయి. ఆతని పాండిత్యం ఉన్నతోగ్యాన్ని ఇప్పించింది.

ఇదే రీతిలో జోనాదన్ డంకన్ (Jonathan Duncan) 'ఆసియాటిక్ రిసెర్చర్' (Assiatic Researcher) పేరున బెంగాలీ పర్షియన్ అనువాదాలు చేశాడు. భారతీయ విజ్ఞానంపట్ల అభిమానాన్ని ప్రదర్శించడమేగాక, సామాజిక

పరివర్తనకై కొన్ని పథకాలకు కార్యాచరణ కల్పించాడు. బెనారస్‌లో ఉద్యోగం చేస్తూ, భారతదేశ న్యాయసూత్రాలను సాహిత్యాన్ని పరిరక్షించడానికి హిందూ కళాశాలను స్థాపించవలెనని ప్రతిపాదన చేశాడు.

### 4.2.6 సర్ విలియమ్ జోన్స్ (Sir william Jones)

వారన్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా పనిచేస్తున్న కాలంలో సర్ విలియమ్ జోన్స్ సుప్రీంకోర్టు జడ్జిగా కలకత్తా వచ్చారు. 'ఆసియాటిక్ సొసైటీ' ప్రథమ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆ సంఘంలో సుమారు వందమంది సభ్యులుండేవారు. వారు సుప్రీంకోర్ట్ ఆవరణలో లేదా వ్యక్తుల నివాస గృహంలో సమావేశమయ్యేవారు. 1783లో కలకత్తా వచ్చిన జోన్స్ 18 వ శతాబ్దపు ప్రాచ్య ఆలోచనలను భాతదేశంలో ప్రవేశపెట్టాలని, తద్వారా ప్రాక్, పశ్చిమాల సంస్కృతులను సమన్వయం చేసి ఒక నూతన భావసంచయాన్ని రూపొందించాలని ఆకాంక్షించాడు. 'ఆసియాటిక్ రిసెర్చర్ (AsiaticResearcher) అనే పత్రికను ప్రాంభించారు. భారతదేశ సంబంధిత పరిశోధనలను ఐరోపాలోని మేధావులు ఆసక్తిగా చదివారు.

సర్ విలియమ్ జోన్స్ బహుభాషాకోవిదుడు. ఐరోపా లోని ముఖ్య భాషలేకాక, హీబ్రూ, అరబిక్, పర్షియన్ భాషలను నేర్చుకున్నాడు. కొద్ది కొద్దిగా చైనా భాష కూడా తెలుసు. భాషలన్నింటికీ హీబ్రూ భాష మూలమనే నాటి వాదనను జోన్స్ నిరాకరించాడు. చార్లెస్ విల్కిన్స్, మరికొందరు కంపెనీ అధికారుల సాయంతో సంస్కృత భాష ను నేర్చుకొని కాళిదాస శాకుంతలాన్ని ఆంగ్లంలోనికి అనువదించాడు. ఈ అనువాదం బహుముఖ ప్రశంసలనందుకుంది. సునిశితమైన వ్యాఖ్యలతో ఆసియా ప్రాచీనతను గూర్చి రాసిన పరిశోధనా వ్యాసాలు జోన్స్ పాండిత్యానికి, మేదస్సుకు ప్రతీకలు. మానవ చరిత్ర అధ్యయనంలో ఆసియా చరిత్రకు ప్రముఖ స్థానముందని విశ్వసించిన జోన్స్ హేతు వాది. సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ఆకాంక్షించిన ఆదర్శప్రాయుడు. సంస్కృత భాష మిగతా భాషలకు మూలమని విశ్వసించాడు. సంస్కృత భాష, సాహిత్యం, వేదాంతం, న్యాయసూత్రాలు మత విశ్వాసాలు, వాస్తు, శిల్పరీతులు భారతీయ మేధస్సుకు, పరిశీలనా దృష్టికి నిదర్శనమని జోన్స్ ప్రకటించాడు. ప్రాచీన భారత చరిత్ర అధ్యయనానికి (Indology) జోన్స్ పితామహుడు ఈకృషిలో హేన్రీమార్ బోర్ జోన్స్‌కు దీటుగా నిలిచాడు.

BRAOU

ఈ ఆంగ్ల పండితుల కృషికి కొంత ఫ్రెంచ్ మేధావుల తోడ్పాటు లభించింది. ఫలితంగా ఐరోపాలో సంస్కృత భాష అధ్యయనంపట్ల ఆదరణ పెరిగింది. 1814 లో ఫ్రాన్సులో 'కాలేజి డి ఫ్రాన్' (College de france) అనే పేరున సంస్కృత పీఠం నెలకొల్పబడింది. 1816లో ఫ్రాంజ్ బోప్ (Frange Bopp) ఐరోపా భాషలు, సంస్కృతం ఒక మూలం నుండి ఉద్భవించాయని ప్రకటించి, ఆ భాషల మధ్యగల పోలికలను గుర్తించాడు. జర్మనీలోని పెక్కు విశ్వవిద్యాలయాల్లో సంస్కృత ఆచార్య పీఠాలు నెలకొల్పబడ్డాయి. సంస్కృత జర్మనీ భాషల నిఘంటువు తయారైంది. జర్మనీలో మాక్స్ ముల్లర్ (Max Muller) పండితుడు సంస్కృత భాషపట్ల ఎంతో ఆసక్తి, అభిమానం చూపాడు. 'సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ది ఈస్ట్' (Sacred Books of the East) అనే పేరున ఎన్నో ప్రాచీన గ్రంథాలు అనువదింపబడ్డాయి. ఋగ్వేదం ఆంగ్లంలోనికి అనువదింపబడింది. మాక్స్ ముల్లర్ ఈ గ్రంథాలకు సంపాదకుడుగా పని చేశాడు.

### 4.2.7 పురావస్తు పరిశోధనలు (Archeolgical discoveries)

భారతదేశ ప్రాచీన చరిత్ర అధ్యయనంలో భాష, వాఙ్మయంలోనే కాక పురావస్తు పరిశోధనలకు కూడా ఎంతగానో తోడ్పడ్డాయి. కంపెనీ అధికారులు, సర్వేయర్లు, దేవాలయాల, గృహాల, ఆదాయాల విశేషాలను, శిలాశాసనాలను సేకరించి కలకత్తా తీసుకువచ్చారు. నాటి బ్రాహ్మి లిపిని కనుగొనడంలో, జేమ్స్ ప్రిన్సెప్ (James Princep) విశేషమైన కృషి చేశాడు. టంకశాల అధికారిగా ఉంటూ 'ఆసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్'

(Asiatic Society of Bengal) కార్యదర్శిగా పనిచేసాడు. అశోకుని తొలి శాసనాలను చదవడంలో విజయం సాధించాడు. ఈ కృషిలో ప్రిన్సెప్‌కు తోడ్పడిన కన్నింగ్‌హాం (Cunningham) భారతదేశ పురావస్తు పరిశోధనలకు ఆద్యుడని చెప్పవచ్చు. తన విరామకాలంలో ప్రతిక్షణాన్ని మనదేశ పురాతన చరిత్ర పునర్నిర్మాణ కృషిలో వెచ్చించాడు. అయితే అప్పటికీ పెద్దగా శాస్త్రీయ పద్ధతులు లేనందున, నిధుల కొరత వల్ల పెద్దగా పరిశోధనలు జరుగలేదు.

1901 కర్జన్ (Curzon) పాలనా కాలంలో 'ఆర్కియాలాజికల్ సర్వే' (Archeological survey) శాఖ ఏర్పడింది. దానికి డైరెక్టర్ జనరల్‌గా వచ్చిన జాన్ మార్షల్ (John Marshall) మన దేశ చరిత్ర పరిశోధనలో చిరస్మరణీయుడు. ఎందరో నిపుణులను రప్పించి పెద్ద ఎత్తున త్రవ్వకాలు ప్రారంభించాడు. ఫలితంగా 1922లో సింధు నదీ నాగరికత బయల్పడి, భారతదేశ ప్రాచీనత సంస్కృత వైభవం ప్రపంచం తెలుసుకున్నది. నాటి వైజ్ఞానిక ప్రగతి పలువురిని ఆశ్చర్యచకితులను చేసింది.

ఈ కృషిలో భాగంగా 20వ శతాబ్దంలో ఎందరో భారతీయ పండితులు, పరిశోధకులు మన ప్రాచీన చరిత్రను వెలుగులోనికి తీసుకురావడానికి నిర్విరామ కృషి సలిపారు. భగవాన్‌లాల్ ఇంద్రాజీ. రాజేంద్రలాల్ మిత్రా భండార్కర్ వారిలో ప్రముఖులు. సంస్కృత భాష ప్రాచీనత, భారతీయుల ప్రాచీన సంస్కృతి వెలుగులోనికి రావడమేగాక భారతీయుల్లో ఒక ఆత్మ విశ్వాసం, తమ ప్రాచీనత పట్ల గౌరవాభిమానాలు, ఆకర్షణ పెరిగాయి. ఈ పురాతన వైభవాన్ని పునర్జీవితం చేయాలన్న తపన, ఆసక్తి కన్పిస్తుంది. కొన్ని సందర్భాల్లో ఈ పురాతన వైభవంపట్ల కలిగిన నూతన ఆకర్షణలో ఆత్మస్తుతి, పరనిందలు చోటుచేసుకున్నాయి. ప్రాచీన కాలంలో సామాజిక వ్యవస్థ మతంలోని అక్రమాలు, అనాచారాలు వీలుగా విస్మరింపబడ్డాయి. ఇది సహజమే అయినా, చరిత్ర రచనలో సరిదిద్దుకొనవలసిన పొరపాటు.

ఏ దేశ చరిత్ర, జీవిత చరిత్ర లోనైనా సామూహిక మార్పులు రావాలంటే, ప్రతి రంగంలోను సంస్కరణ అవసరం. ఏ అభ్యుదయానికైనా ప్రేరణ అవశ్యకం. ప్రతి విప్లవానికి సిద్ధాంత ప్రేరణ ఉంటుంది. అదే రకంగా ఆధునిక కాలంలో వచ్చిన జాతీయతా భావం అభివృద్ధి చెందడానికి ప్రాచ్య వాదం దోహదం చేసింది. అంతేకాక 18వ శతాబ్దపు ఉదార వాద ఆదర్శాలు ప్రాక్ పశ్చిమాల మధ్య భావ సమన్వయం, భాషలపట్ల అభిమానం, గౌరవాలను పెంపొందించాయి. తార్కిక వాదం, హేతు వాదం ఇందుకు అంతరార్థాలయ్యాయి. ప్రాచ్య వాదం జాతీయ వాదాన్ని మేల్కొలిపింది.

## 4.3 'ఎవాంజలిజమ్' (Evangelism)

'ఎవాంజలిజం' (Evangelism) అనే కొత్త మత శాఖ క్రైస్తవ మతంలో ఒక భాగంగా హాలెండ్‌లో ప్రారంభమైంది. బైబిల్‌లో చెప్పబడిన మత సిద్ధాంతాలను యధాతథంగా నమ్మి, జీసస్ క్రీస్తును దేవునిగా, పరిరక్షకునిగా అంగీకరించాలనేది ఈ శాఖ సిద్ధాంతం. జీసస్‌పై పూర్తి విశ్వాసముంచి, ఆయనకు పూర్తిగా అర్పించుకోవడం ద్వారాను మోక్షం లభించగలదని వారి ప్రగాఢ విశ్వాసం. చారిత్రకంగా ఈ మత శాఖ రెండు విషయాలను మాత్రమే స్పష్టంగా విశ్వసించింది.

(1) గోస్పెల్ వాస్తవమైంది. అది ఒక్కటే మనిషిని రక్షిస్తుంది.

(2) గోస్పెల్ బోధనల మూలంగా జీసస్‌పై నమ్మకంచే తను రక్షణ పొందుతున్నట్లుగా ప్రతి మనిషి తెలుసుకోవాలి.

మోక్ష సాధనకై నాటి కాథలిక్ చర్చి. చర్చి సంబంధిత మతాధికారులు చెప్పిన సత్కర్మలను (good works)

మత సిద్ధాంతాలను ఎవాంజలిస్టులు వ్యతిరేకించారు. మోక్ష సాధనలో మతాధికారుల పాత్రను విమర్శించారు. కేవలం జీసస్‌ను నమ్ముకొని ఆత్మార్పణ చేసుకోవడమే మోక్ష మార్గమని, పాప పూరితమైన జీవితానికి జీసస్ క్షమాగుణం ఒక్కటే మార్గమని వారు భావిస్తారు. దీనికారణంగా వారు కాథలిక్ చర్చిలోని కర్మకాండలను (Sacraments), ఉద్యోగి బృందాన్ని (Clergy) నిరసించారు. గోస్పెల్స్ ప్రాధాన్యత ఎన్నో మత సంస్కరణలకు, ప్రొటెస్టంట్ ఉద్యమంకు దోహదం చేసింది. ముఖ్యంగా లూథర్ తిరుగుబాటు తరవాత ఆ మతప్రాశస్త్యం పెరిగి కొత్త చర్చులు మొదలయ్యాయి.

ఆంగ్ల భాష మాట్లాడే దేశాల్లో మత అనుభవాలకు ఈ ఎవాంజలిజం విశేష ప్రాధాన్యతను కల్పించింది. ఇది ప్యూరిటన్ (Puritan) సిద్ధాంతాలకు రూపకల్పన చేయగా, జాన్ కాల్విన్ ఆధ్వర్యంలో దీనిని కాల్వినిస్ట్ చర్చి అని కూడా వ్యవహరిస్తారు. ఈ సిద్ధాంతంలో దేవుని దయకు పాత్రులై, ఆయన అనుభూతిని అంతరంగికంగా దర్శించడం ముఖ్యమైన విషయం. జీసస్‌తో కలిగే అనుభూతి సాన్నిహిత్యం మత స్థిరత్వానికి అనుబంధం కాగలదు. అంటే ఈ అనుభూతి పెరిగినకొద్దీ, మతం పట్ల నమ్మకం వృద్ధి చెందుతుంది. ఎవాంజలిజం అన్ని దేశాలకు వ్యాప్తిచెందగా, జర్మనీలో 'పయిటిజమ్' (Pietisam) ఇంగ్లాండ్‌లో 'మెథడిజం' (Methodism) గా రూపొందాయి.

18వ శతాబ్దంలో వచ్చిన ప్రాచ్య ఆలోచనలు మతాన్ని కూడా ప్రభావితం చేశాయి. అమెరికా వలసలకు చేరిన వారు క్రైస్తవ మతాన్ని అనుసరించినా, మత కర్మకాండలకు విలువనివ్వలేదు. మత సహనం, హేతు వాదం, ప్రబలడంతో క్రమేణా మత ఛాందసం తగ్గి, కర్మకాండ ఆదరణ కోల్పోయింది. 19వ శతాబ్దంలో ఎవాంజలిజం ప్రపంచ వ్యాప్తమైంది. ఇంగ్లాండ్‌లో మెథడిస్ట్ చర్చి త్వరితగతిని అభివృద్ధి సాధించింది. ఆ చర్చి కార్యకలాపాలు ఆంగ్లేయాధికారంలోని భారత దేశంలో కూడా విస్తరించి, నాటి రాజకీయ, మత సామాజిక జీవనాన్ని ప్రభావితం చేసాయి.

BRAOU

### 4.3.1 భారత దేశంలో 'ఎవాంజెలిస్ట్' కార్యకలాపాలు

వెలస్లీ కలకత్తాలో ఫోర్ట్ విలియమ్ కళాశాల (Fort William College) స్థాపించాలని, ఆ కళాశాలద్వారా పాలనా వ్యవస్థకు కావలసిన సివిల్ సర్వీసును తయారుచేయాలని ప్రతిపాదించాడు. వెలస్లీ భారతీయ ఎగుమతులకు దేశీయ నౌకలనే వినియోగించాలని చెప్పాడు. ఇది ఆంగ్లేయ కంపెనీలకు కోపం తెప్పించింది. వారు వెలస్లీ విద్యా విధానానికి ఆటంకాలను సృష్టించారు. కళాశాల స్థాపన వల్ల భారతదేశంలో మేధావులు, సాహితీప్రియులు ఒక్కచోటచేరి, జాకొబిన్ (Jacobius) వలె విప్లవ సిద్ధాంతాలకు ప్రేరణ చేయగలవని వాదించారు. అయితే ఈ వాదనలేవి వెలస్లీ కళాశాల ప్రతిపాదనకు నిజమైన సమాధానం కాదు.

### 4.3.2 ఛార్లెస్ గ్రాంట్ (Charles Grant)

ఈ పరిస్థితులలో సమస్య పరిష్కారానికై ఛార్లెస్ గ్రాంట్ ఒక ప్రతిపాదన చేశాడు. 1794లో ఇంగ్లాండ్‌కు తిరిగివచ్చి కోర్టు ఆఫ్ డైరెక్టర్లలో ఒకడయ్యాడు. భారతదేశంలో క్రైస్తవ మత పలుకుబడిని పెంచి, మిషనరీల ద్వారా విద్యాబోధన చేయాలని సూచించాడు. మిషనరీల విద్యా బోధన ద్వారా భారతీయుల మూఢనమ్మకాలను దూరం చేయాలని ప్రతిపాదించాడు. అంటే భారతీయులను క్రైస్తవులుగా మార్చి, పరోక్షంగా ఆంగ్లపాలనకు సుస్థిరత కల్పించాలని వారి ఉద్దేశం. దీనికనుగుణంగా విల్బర్ ఫోర్స్ (Wilber Force), షోర్ (Shore), జకేరీ మకౌలీ (Zachary Macauly), హెన్రీ థోరటన్ (Hency Thornton) మొదలైన సభ్యులతో గ్రాంట్ ఒక 'ఎవాంజలికల్ మిషన్' (Evangelical Mission) స్థాపించాడు. నాగరికతను ప్రపంచవ్యాప్తం చేయడం లక్ష్యమని ప్రకటించాడు. ఈ

ఎవాంజలికల్ సంస్థ, భారతీయ సంస్కృతంలో సమన్వయం సాధించాలని చెప్పిన హేస్టింగ్స్, వెలస్లీ విధానాలకు సవాలు. భారతదేశంలో ప్రభుత్వ సాయంతో విద్యాసంస్థలను స్థాపించాలని గ్రాంట్ ప్రతిపాదించాడు.

గ్రాంట్, (Grant) కోర్టు ఆఫ్ డైరెక్టర్లలో ఒకడైనందున వెలస్లీ అతని సహకారం పొందడానికి రాజీ పడవలసి వచ్చింది. కళాశాల స్థాపనలో, నిర్వహణలో ఎవాంజలికల్ మిషనరీలైన బ్రౌన్ (Brown), బుకానన్ (Bucanan) నియమించాడు. పాలనా సామర్థ్యాన్ని పెంచడానికి ప్రత్యేకమైన భారత సివిల్ సర్వీస్ అవసరమని వెలస్లీ, గ్రాంట్ ఉభయులు అంగీకరించారు. కాని మత భావనలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. భారతీయ విద్య, సివిల్ సర్వీస్‌లో భారతీయ సంస్కృతికి, ప్రాచ్య వాదానికి చోటివ్వాలని వెలస్లీ భావన.

కాని గ్రాంట్ కరడుగట్టిన ఎవాంజలిస్ట్. సంస్కృతిలో భిన్నత్వం పనికిరాదనే మూఢ నమ్మకం కలవాడు. భారతీయ మతం హీనమైనదని, వారి నాగరికత ఆటవికమని తలచాడు. అట్టి సంస్కృతిని సహించడం క్రైస్తవ మతానికి, సిద్ధాంతాలకు వ్యతిరేకమనుకొని బ్రిటిష్ సివిల్ అధికారులు హిందూ సాంప్రదాయాలను నిరాకరించి, క్రైస్తవ పద్ధతిలో సాంస్కృతిక మార్పులకు సారథ్యం వహించాలని భావించారు. ఫలితంగా ఫోర్ట్ విలియమ్‌లో కళాశాల స్థాపించబడినా, అందులో ప్రాచ్య వాదులకు ఎట్టి స్థానం ఇవ్వకుండా కేంబ్రిడ్జ్‌లో తర్ఫీదు పొందిన మతాచార్యులను నియమించి, బోధనాంశాలను తయారు చేసే స్వేచ్ఛ వారికివ్వబడింది.

### 4.3.3 భారతీయ వ్యతిరేకత

**1806** లో వెల్లూరులో సిపాయిల తిరుగుబాటు చేసారు. ఈ తిరుగుబాటులో ఎందరో చంపబడ్డారు. దీనిపై విచారణ జరిగిన ఎలిఫిన్‌స్టన్ (Elphinston) "భారతీయ ఆచారాలను, మత వ్యవస్థలను మార్చడానికి జరిగిన ప్రయత్నాలకు, బలవంతంగా క్రైస్తవులుగా మార్చుతున్నారనే వదంతులకు" వ్యతిరేకంగా ఈ తిరుగుబాటు వచ్చిందని బోర్డు ఆఫ్ డైరెక్టర్ల అధ్యక్షుడు డుండాస్ (Dundas) కు నివేదించాడు. **1792-1805** మధ్య బెంగాల్ సివిల్ సర్వీస్‌లో పనిచేసిన థామస్ ట్వినింగ్ (Thomas Twining) మిషనరీల కార్యకలాపాలవల్ల భారతదేశంలో విప్లవం వచ్చే ప్రమాదముందని హెచ్చరించాడు. ఈ వాదనను బలపరుస్తూ ఎందరో రచయితలు, మేధావులు కరపత్రాలను ప్రచురించారు. దీనితో 'ఆసియాటిక్ సొసైటీ' ప్రాచ్యవాదులకు, గ్రాంట్ అనుయాయులైన ఎవాంజలిస్టుల మధ్య తీవ్రస్థాయిలో వాద వివాదాలు జరిగాయి. గ్రాంట్ చివరకు కోర్టు ఆఫ్ డైరెక్టర్ల (Court of Directors) లో మెజారిటీ సాధించి, భారతదేశంలో యధాతధస్థితి కొనసాగింపబడాలనే తీర్మానాన్ని నెగ్గించాడు. "మనం ఓడిపోయాం. మతాచార్యులు ఉత్తములయ్యారు. వారంటే నాకు ప్రేమ లేదు. కాని ఇప్పుడు వారంటే అసహ్యం" అని టూన్ (Toone) రాసాడు.

మిషనరీ కార్యకలాపాల సమస్యకు తాత్కాలికంగా తెరపడినా ప్రాచ్య వాదులు రెట్టించిన పట్టుదలతో తమ ప్రచారాన్ని ఉధృతం చేసారు. మేజర్ స్కాట్ వారింగ్ (Major Scot waring) ప్రాచ్య వాదాన్ని బహిరంగంగా సమర్థించి, భారతీయ మతం, న్యాయసూత్రాలు, స్థానిక ఆచారాల్లో జోక్యం చేసుకుంటే, ఆంగ్లాధికారం సర్వనాశనం కాగలదని, వెల్లూరు తిరుగుబాటుకు మిషనరీలు కారణమని, వారే బ్రిటీష్ పాలనకు వినాశకారులు కాగలరని హెచ్చరించాడు. ఆండ్రూ ఫుల్లర్ (Andrew Fuller) ఎవాంజలికల్ కార్యకలాపాలను సమర్థించాడు. ప్రాచ్య వాదులకు ఎవాంజిలికన్లకున్నటువంటి సమర్థవంతమైన వ్యవస్థ లేదు. ఫలితంగా పార్లమెంట్ గ్రాంట్, విలియం విల్బర్ ఫోర్స్ (William Wilber Force) ల వాదనలు విని, ఎవాంజలికన్లకు గట్టి మద్దతు నిచ్చింది. ఫలితంగా, భారతదేశంలో 'మిషనరీల' స్థాపనకు, మిషనరీలు భారతదేశానికి స్వేచ్ఛగా వెళ్ళడానికి అనుమతి ఇవ్వబడింది.

BRAOU

ఎవాంజలికల్ చర్చి కార్యకలాపాల మూలంగా భారతదేశంలో ప్రాచ్య వాదుల్లో పట్టుదల పెరిగింది. హిందూ మత పునరుద్ధరణకై సంస్కృతం తదితర భారతీయ భాషల అధ్యయనం ముమ్మరంగా సాగింది. భారతదేశ పూర్వ వైభవాన్ని బహిర్గతపరచే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. భారతీయ భాషల పునర్విజ్ఞాపనం ప్రారంభమైంది. భారతీయ సాంస్కృతిక వికాసం, మేధవుల్లో చైతన్యం, భారతీయ భాషలపట్ల ఆదరణ మొదలైన కార్యక్రమాలకు ఎవాంజలికన్ల కార్యకలాపాలే ప్రేరణ అయ్యాయి. బెంగాల్‌లో మొదలైన ఈ సాంస్కృతిక పునరుజ్జీవనం క్రమంగా మిగతా ప్రాంతాలకు విస్తరించింది. ఇదే జాతీయతా భావాన్ని ప్రేరణ చేసింది.

మార్క్విస్ హేస్టింగ్స్ కాలంలో భారతీయ మేధావి వర్గాన్ని ప్రాచ్య సంస్కృతిపట్ల ఆకర్షింపచేయడానికి, సామాజిక పరివర్తనకు ఎన్నో సంస్థలు వెలిశాయి. వాటిలో హిందూ కళాశాల స్థాపన ఒకటి. ఐరోపా సంస్కృతి పట్ల అవగాహన ఉన్న భారతీయ కులీన కుటుంబాలు ఈ కళాశాలకు ఆర్థిక సాయం చేశారు. కళాశాల లౌకిక విధానాన్ని అనుసరించి, ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రచారం చేసింది. జాతీయ భాషలలో చౌకగా గ్రంథాలు ప్రచురింపబడ్డాయి. భారతీయ ప్రముఖ గ్రంథాలు ఆంగ్లంలోనికి అనువదింపబడ్డాయి. ఈ సాంస్కృతిక వికాసానికి మరెన్నో కారణాలున్నాయి. ఫలితంగా ఎవాంజలిజమ్ పలుకుబడి క్షీణించింది. కాని మాలీ రాకతో, ఆంగ్ల భాష బోధనా భాషగా గుర్తింపబడటంతో ప్రాచ్య వాదులు ఓడిపోయారు. ఎవాంజలిజమ్ పరోక్షంగా భారతీయులలో పట్టుదల, తమ మతం పట్ల గౌరవాన్ని వృద్ధి చేయడంలో కారకమైంది. అంతేకాక తమ మతంలోని, సామాజిక వ్యవస్థలోని లోపాలను గుర్తించి, సరిదిద్దుకోవడానికి దోహదం చేసింది.

## 4.4 ఉపయోగితా సిద్ధాంతం (Utilitarianism)

ఉపయోగితా సిద్ధాంతం 17వ శతాబ్దంలో ఇంగ్లాండ్ దేశం కేంద్రంగా ప్రారంభమైంది. ఈ సిద్ధాంతాన్ని ఏ ఒక్కరూ ప్రతిపాదించలేదు. ఇది సిద్ధాంతంగా ఎందరో రచనల నుండి రూపొంది, అనతికాలంలో ఉద్యమంగా మారింది. ఉపయోగితా వాదం 18వ శతాబ్దంలోని 'ఆదర్శ వాదానికి' (Idealism)కు ప్రతిచర్యగా ఆవిర్భవించింది. ఈ ఉపయోగితా సిద్ధాంతాన్ని హబ్స్ (Hobbes) లాక్ (Locke) వంటి మహాశయులు వేర్వేరు ప్రయోజనాలకై ప్రతిపాదించగా, ఆడమ్ స్మిత్ (Adam Smith), బెంథామ్ (Bentham), ఆస్టిన్ (Austin), మాల్థస్ (Malthus), రికార్డో (Ricardo), జాన్ స్టువార్ట్ మిల్ (John Stuart Mill), జేమ్స్ మిల్ (James Mill), హెర్బర్ట్ స్పెన్సర్ (Herbert spencer) వంటి మేధావుల రచనల్లో నిర్దిష్ట రూపం సంతరించుకున్నది. 18వ శతాబ్దపు ప్రాజ్ఞ ఆలోచనలు (Enlightenment) ఈ ఉపయోగితా సిద్ధాంత రూపకల్పనలో, ఎనలేని ప్రభావాన్ని చూపాయి.

### 4.4.1 సిద్ధాంత రూపకల్పన

ఒక వ్యక్తి యొక్క 'చేతనం' (Consciousness) ఆధారంగా చేసుకొని, సామాజిక వ్యవస్థలోని వివిధ వ్యక్తుల మధ్య, పద్ధతుల మధ్య జరిగే, జరుగవలసిన పరస్పర సంబంధాలను నిర్వచించడం ఈ సిద్ధాంత, మూల లక్ష్యం. ఉపయోగితా సిద్ధాంతంలో వ్యక్తి కేవలం ఒక పాత్ర (actor) మాత్రమే. అతని జ్ఞానం అసంపూర్ణం. అతనికి కొన్ని లక్ష్యాలుంటాయి. వాటిని హబ్స్ (Hobbes) కోరికలుగా (Passions) చెబితే, ఆర్థికవేత్తలు వాటిని 'అవసరాలుగా' (Wants) చిత్రీకరించారు. వ్యక్తికి కోరికలు కలిగి ఉండటం సహజ మౌలిక లక్షణం. ఈ కోరికల మధ్య గల సంబంధాలు, కోరికలు జనించడానికి కారణాలను తొలి ఉపయోగిత సిద్ధాంతకారులు పెద్దగా చర్చించలేదు. లాక్ (Locke) ఆలోచనలను ఆధారంగా చేసుకొని, వీటికి మనస్తత్వ వేత్తలు ఒక ప్రాథమిక సిద్ధాంతానికి రూపకల్పన చేశారు. ఆధునిక కాలంలో మానవ ప్రవర్తనా రీతుల మీద ఈ సిద్ధాంత ప్రభావం నిరవధికంగా కన్పిస్తుంది. అయితే ఈ ప్రవర్తన ఒక వ్యవస్థ రూపకల్పనను గట్టిగా సమర్థించలేదు. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా

BRAOU

వ్యక్తిత్వ పునాదుల మీద వ్యవస్థ రూపకల్పన విఫలం కావడంతో, సామాజిక సిద్ధాంతాలపై అంత ప్రభావాన్ని చూపలేకపోయింది.

వ్యక్తులకు అవసరాలుంటాయి. వాటిని తీర్చడానికి అమలు జరుగవలసిన కార్యచరణ ప్రణాళికను రూపొందించడం ప్రథమ లక్ష్యంగా ఉపయోగితా వాదులు భావిస్తారు. ఈ కార్యసాధనకు తలపెట్టవలసిన పద్ధతులను ఎంపిక చేయాలి. అయితే కలిగిన కోరికలను లేదా అవసరాలను తీర్చుకొనే ప్రయత్నంలో యుక్తాయుక్త విచక్షణను, హేతు వాద వైఖరిని ప్రదర్శించాలి. అంతేకాక వివిధ కోర్కెల లేదా అవసరాల మధ్య గల సంబంధాలను సాధనా లక్ష్యాలను విశ్లేషించాలి. అలాంటి విశ్లేషణలో, ఉన్న వనరులను, అవసరాల సంఖ్యతో బేరీజు వేసుకోవాలి. అంటే ఒక వ్యక్తి కోరిక లేదా అవసరం తీర్చడంలో భారమెంత, దానివల్ల సామూహికంగా మేలు జరుగుతుందా అనే ఆలోచన అవసరం. అవసరాలను తీర్చడానికి ఉన్న భిన్న రీతులను పరిశీలించి, వాటిలో ఏది ఉచితం, ఉన్నతమైందో తెలుసుకోవాలి. అంటే ఆ రీతి లక్ష్య సాధనకు, అందరి మంచికి లేదా తృప్తికి తోడ్పడాలి. అట్టి అన్వేషణలో కొన్ని సందర్భాల్లో ఒక వ్యక్తికి నచ్చని విషయాలను చేయవలసి రావచ్చును.

### 4.4.2 బెంథామ్ (Bentham)

ఈ విషయాలను పరిగణనలోనికి తీసుకున్న బెంథామ్ (Bentham) ఈ సిద్ధాంతానికి ఒక రూపం ఇచ్చాడు. వ్యక్తిగత అవసరాలను తీర్చడంలో జరిగే కార్యాచరణ పథకం సంతోషాన్ని కల్గిస్తే, అది హేతుబద్ధమైనది. అదికాక మనం ఎన్నుకున్న రీతుల్లో బాధ కల్గితే, దానిని మాని మరో రీతిని అన్వేషించాలి. హేతుబద్ధమైన అవసరాలను తీర్చడంలో మంచిచెడులను, లాభనష్టాలను సరిగా అంచనా వేయాలి. ఉపయోగితా సిద్ధాంతాన్ని అమలుపరచడంలో ఎన్నో ఆర్థిక, సామాజిక సమస్యలు తలెత్తవచ్చు. ఉదాహరణకు మద్యపాన నిషేధం తీసుకుందాం. మద్యపానం ఆరోగ్యానికి హానికరం కాబట్టి దానిని నిషేధించడం సబబే. అయితే దానివల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోయి సంక్షేమ కార్యక్రమాలు కుంటుపడవచ్చు. మద్యం తయారీలో, అమ్మకంలో నిమగ్నమైన ఎన్నో వేలాదిమంది ఉపాధిని కోల్పోవచ్చు. ఈ సమస్యల హేతుబద్ధతను మానసికతత్వం మీదగాక, ఈ సంస్కరణ వలన వచ్చే విలువలపై అంచనా వేయాలి.

### 4.4.3 హబ్స్ (Habbes)

ఉపయోగితా సిద్ధాంతానికి ఒక కార్యాచరణ ప్రణాళిక ఆవశ్యకం. వ్యక్తి ప్రయోజనాల సాధనకు హేతుబద్ధమైన ఈ కార్యక్రమం సులభమైన పద్ధతే. వ్యక్తిగత ప్రయోజనాలతోపాటు, సామాజిక అవసరాలను కూడా గుర్తుంచుకోవాలి. అంటే ఈ సిద్ధాంతం ఒక నిర్దిష్టమైన సామాజిక వ్యవస్థ ఏర్పాటును వాంఛిస్తుంది. పరస్పర వైరం, నాశనం, లొంగతీసుకోవడం, వ్యక్తుల ప్రాథమిక లక్షణమని హబ్స్ (Hobbes) అభిప్రాయం. స్వీయ రక్షణకై వ్యక్తిపడే ఆరాటం, జరిపే పోరాటం సంఘర్షణకు దారితీస్తుంది. కాబట్టి సామూహిక రక్షణకు వ్యక్తిగత ప్రయోజనాలపై ఆంక్ష; సామూహిక ప్రయోజనాల పరిరక్షణకు ఒక సామాజిక వ్యవస్థ అవసరం. దీనికోసమై ఒక సర్వసత్తాక ప్రతిపత్తి గల అధికారం ఉండాలని, దానికై వ్యక్తులు తమ తమ సహజ హక్కులను ధారాదత్తం చేయాలని హబ్స్ ప్రతిపాదించగా, దీనిని ఆధారంగా చేసుకొని, ఆస్టిన్ (Austin) సర్వసత్తాక అధికార' (Sovernity) సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

### 4.4.4 లాక్ (Locke)

ఉపయోగితా సిద్ధాంతాన్ని లాక్ మరో కోణంలో పరిశీలించాడు. వ్యక్తులు తమ తమ ప్రయోజనాలను సాధించుకోవడానికి, పరస్పర సహాయ, సహకారాలను అందించుకోవడం ద్వారా సామాజిక అవసరాలను, వ్యక్తిగత ప్రయోజనాలకు సమన్వయం చేసి ఉదాత్తంగా జీవించ వచ్చునని లాక్ అభిప్రాయపడ్డాడు. హబ్స్ వ్యక్తులు తమ,

తమ హక్కులను సర్వసత్తాక అధికారానికి దారాదత్తం చేయమని చెప్పగా, లాక్ ప్రాణం (Life), స్వేచ్ఛ (Liberty), ఆస్తి (Property) మొదలైన హక్కులను పరిరక్షించుకోవడానికి వ్యక్తులు ఒక అంగీకారాన్ని కుదుర్చుకోవచ్చునని, దానివల్ల ఏర్పడే ఉమ్మడి అధికారం వీలున్నంత తక్కువగా ఉండటం మంచిదని భావించాడు.

లాక్ అభిప్రాయం ఎందరినో ప్రభావితం చేసింది. శ్రమ విభజన ద్వారా ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలో స్వీయ ప్రయోజనాలను, సమిష్టి ప్రయోజనాలను కూడా సాధించవచ్చునన్న లాక్ వాదాన్ని డేవిడ్ రికార్డో (David Ricardo) ఆర్థిక కార్యాచరణకు అనువదించి, చక్కని సిద్ధాంతాన్ని రూపొందించాడు. ఇది ఉదార వాద ఆర్థిక సిద్ధాంతాలకు దోహదం చేసింది. ఆడమ్ స్మిత్ (Adam Smith) ఆలోచనల్లో కూడా ఇది ప్రతిబింబిస్తుంది. లాక్ ఆలోచనలు ప్రజాస్వామ్య సిద్ధాంతానికి బలాన్నిచ్చాయి. అయితే దీనికి రూసో (Rouseeau) చెప్పిన 'సోషల్ కాంట్రాక్ట్' (Social contract) కు, జనరల్ విల్ (General will) కు వ్యత్యాసం ఉంది.

హబ్స్ లాక్‌ల ఆలోచనలను మాల్థస్(Malthus) సమన్వయం చేసాడు. అతడు రాజకీయాధికారం జోలికి వెళ్ళకుండా, ఆర్థిక ప్రయోజనాల్ని అన్వయించి జనాభా సిద్ధాంతాన్ని రూపొందించాడు. వనరులను మించి జనాభా పెరుగుతుంది. వనరులు క్రమంగా 1, 2, 3, 4, 5గా పెరిగితే, జనాభా 1, 2, 4, 8, 16గా (Geometrical progression) పెరుగుతుంది. దీని మూలంగా సంఘర్షణ, చంపుకోవడం, ఆస్తులు దోచుకోవడం మొదలైన సామాజిక అనర్థాలు తలెత్తగలవు. కనుక పదుగురి సంక్షేమం కోసం జనాభా నియంత్రణ అవసరమని, దీనివల్ల సామాజిక భద్రత ప్రయోజనాలు పరిరక్షింపబడగలవని మాల్థస్ సిద్ధాంతీకరించాడు.

ఉపయోగితా సిద్ధాంతానికి బెంథామ్ (Bentham) పితామహుడు. ఇతడు రాజ్యాధికారం ద్వారా సాంఘిక సంస్కరణలను, సామాజిక పురోభివృద్ధిని కాంక్షించాడు. "అత్యధికుల అత్యధిక మేలును సాధించడం" (Greatest Happiness of Greatest numbers) ప్రభుత్వ లక్ష్యమని చెప్పడంతో, ప్రజాస్వామ్య వర్గం బలపడింది. ఈ సిద్ధాంతంలో అత్యధికులు అన్న పదంలో, ఉన్న వారందరూ సమానమే అన్న నిగూఢ సత్యముంది. రాజకీయ సంస్కరణల్లో ఆర్థిక సిద్ధాంతాల్లో ఇది ఒక కొత్త ఒరవడి.

ఈ నూతన ఒరవడి ప్రచారం కల్పించిన వారిలో జాన్ స్టువర్ట్ మిల్ (John Stuart Mill) అద్వితీయుడు. ఆర్థిక, రాజకీయ సిద్ధాంతాల్లోనే కాక, నైతిక ప్రవర్తనలో కూడా ఉపయోగితా సిద్ధాంతాన్ని సమన్వయ పరచడంలో, సామాజిక ప్రయోజనం అనే భావాన్ని ప్రచారం చేయడంలో స్టువార్ట్ మిల్ కృషి శ్లాఘనీయం. స్టువార్ట్ మిల్ విశ్లేషణ వల్ల తరువాత కాలంలో వచ్చిన ఆలోచనల్లో, ఆశయాల్లో రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థల్లో ఏదో ఒక చోట ఉపయోగిత సిద్ధాంతం ఏదో ఒక రూపంలో కన్పిస్తుంది. జేమ్స్ మిల్, స్పెన్సర్ (Spencer) రచనల్లో ఈ ప్రభావం కన్పిస్తుంది. వీటిని ఆర్థిక సిద్ధాంతాల్లోనే కాక, అన్ని రంగాల్లో చివరకు మనస్తత్వ శాస్త్రంలో కూడా ఉపయోగితా సిద్ధాంత ఛాయలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి.

### 4.4.5 ఉపయోగితా సిద్ధాంత మూలాంశాలు

ఉపయోగితా వాదాన్ని నిర్దుష్టంగా నిర్వచించడం కష్టం. దీనిని ఎవరూ ప్రతిపాదించలేదు. వివిధ రచనల్లో ఆలోచనలుగా ప్రారంభమై, అన్ని వాదాల వలెనే కాలానుగుణంగా పరివర్తన చెందుతూ, ఒక ఉద్యమంగా సాక్షాత్కరించింది. ఇది 'వాస్తవికతను' (realism) ప్రతిబింబిస్తుంది. సంతోషం, బాధలు అనే రెండు ప్రక్రియలు ఈ వాదానికి మూలం. ప్రతి వ్యక్తి సంతోషాన్ని కోరుతూ, బాధలనుండి విముక్తి పొందాలని ఆకాంక్షిస్తాడు. జీవితానందమే మానవ జన్మ సాఫల్యతకు ముఖ్య సాధనమని ఈ సిద్ధాంతం చెబుతుంది. అంత మాత్రాన అది స్వార్థపూరిత, స్వప్రయోజన సిద్ధాంతం కాదు. అత్యధిక ప్రజలు అత్యధిక సుఖం పొందడంలోనే వ్యక్తి తనను

సుఖజీవనాన్ని పొందాలని ఈ సిద్ధాంతం చెబుతుంది. వ్యక్తి తన ఆనందం కోసం ఆలోచించే సమయంలో, ఇతరుల ఆనందాన్ని కూడా పరిగణించాలి. సామూహిక క్షేమం, కోరికలు, ఆనందం, ఆశల్లో భాగంగానే వ్యక్తి తన స్వీయ ఆనందాన్ని ప్రయోజనాల్ని అంచనావేయాలి. వ్యక్తిగత, సామాజిక సంక్షేమాలను సమన్వయపరచాలి.

ఉపయోగితా వాదం అమూర్త (abstract) భావనలతో కూడినది కాదు. మానవ జీవనంలోని కఠిన వాస్తవాలను ఆకళింపు చేసుకొని, అగమన (inductive) పద్ధతిలో రూపొందిన సిద్ధాంతం. వ్యక్తిగత, సామాజిక ఆనందాన్ని, సంక్షేమాన్ని సమన్వయపరచడంలో, వ్యక్తుల మధ్య సంబంధాలను నిర్వచించడంలో, చట్టాల (legislative acts) ప్రాధ్యానతను గుర్తించింది. ఈ సిద్ధాంతంలో నైతిక సూత్రాలు, రాజకీయ సూత్రాలు, ఆర్థిక ఆలోచనలు, సామాజిక ప్రవర్తన ముడిపడి ఉన్నాయి. ఇది ఒక ప్రయోగాత్మక వాదం. వ్యక్తిగత స్వేచ్ఛకు, సుఖానికి విధానాలు ఎలా పనిచేస్తాయో చూసే కొలమానం. ఈ సిద్ధాంతం సాంప్రదాయక బద్ధమైంది కాదు. కాలానుగుణంగా పరిణామం చెందే ప్రయోగం.

ఒక సంస్థను, వ్యవస్థను దాని వయస్సును బట్టిగాక, సామాజిక ఉపయోగాన్ని, వ్యక్తిగత సంక్షేమాన్ని బట్టి బేరీజు వేయాలి. ఆ సంస్థలు లేదా వ్యవస్థలు మానవాభ్యుదయానికి, సుఖ సంతోషాలకు తోడ్పడగలవా లేదా అని పరీక్ష చేయాలి. ఈ ఉపయోగితా వాదంలో మానవ సంక్షేమం కోసం ఆరాటం, పోరాటం కన్పిస్తాయి. ఇది పలాయన సిద్ధాంతాన్ని (escapism) అంగీకరించదు. అత్యధిక ప్రజల అత్యున్నత ఆనంద సాధనకు, పరిరక్షణకు చట్టాలను, రాజ్యాధికారాలను ఉపయోగితా వాదం ఆమోదిస్తుంది. వ్యక్తిగత స్వేచ్ఛకు, సుఖానికి పెద్దపీట వేసి, నిరంకుశత్వాన్ని, అన్యాయాన్ని ఎదిరించవలెననే ఈ సిద్ధాంతం ప్రకారం, మానవ ప్రయోజనాలను, సుఖాలను పరిరక్షించలేని సంస్థలు, వ్యవస్థలు అవి ఎంత పురాతనమైనవైనా రద్దుకావలెనని చెబుతుంది. మనిషిని ఏకాంతవాసిగా కాక, సమాజంలో ఒక భాగంగా గుర్తించడం ఈ సిద్ధాంత వాస్తవికతకు ప్రతిబింబం.

### 4.4.6 ఉపయోగితా సిద్ధాంతం - భారతదేశ చరిత్రపై ప్రభావం

18వ శతాబ్దపు మలి భాగంలో ప్రారంభమైన సామాజిక, సాంస్కృతిక ఉద్యమాల మానవతా వాద, ఉదార వాద ధోరణులు భారతదేశ చరిత్రను ప్రభావితం చేస్తాయి. వీటికి ఆంగ్లేయ ప్రభుత్వం సామ్రాజ్య వాదాన్ని, మిత వాదాన్ని మిశ్రమం చేసి దేశాన్ని పాలిస్తుంది. ఇంగ్లాండ్‌లో తదితర ఐరోపా రాజ్యాల్లో, ఆలోచనల్లో, ఆశయాలో, సామాజిక ఆచారాల్లో, వ్యవస్థల్లో, ఉదార వాద, మానవతా ధోరణుల మూలంగా ఎన్నో మార్పులు, చేర్పులు ప్రారంభమయ్యాయి. ఇంగ్లాండ్‌లో పారిశ్రామిక విప్లవం మొదలై, బృహత్తర ఆర్థిక ప్రగతికి దారితీసింది. దీని ఫలితంగా ఆర్థిక రంగంలో వ్యక్తిత్వ వాదం (Lassezfaire) అంటే ప్రభుత్వ నిబంధనలు లేని ఉదార వాద సిద్ధాంతం ప్రచారం పొందింది. బెంథామ్, థామస్ పెయిన్ (Thomes paine) వంటి మేధావులు సమూల రాజకీయ, న్యాయ సంస్కరణల ఆవశ్యకతను ఉద్ఘాటించారు. నీగ్రో బానిసలను, పేదలను, నేరస్తులను మరింత మానవతా దృక్పథంతో చూసి, దళిత పీడిత వర్గాలకు న్యాయం చేకూర్చాలని వాదించారు. క్రైస్తవ మతాచార్యులు కూడా పేద వర్గాలకు సాయం చేయాలని భావించారు. ఈ ఉద్యమాల ఫలితంగా, భారతదేశంలో ఆంగ్లేయ సామ్రాజ్య వాద పాలనలో ఆర్థిక, రాజకీయ, మత, మానవతా రంగాల్లో నూతన ధోరణులు, ఉదార వాద వైఖరులు ప్రవేశించాయి.

### 4.4.7 జేమ్స్ మిల్ (James Mill)

భారతదేశానికి సంబంధించి ఈ ఉదార వాద, ఉపయోగితా సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, బలపరచి, విస్తృతంగా ప్రచారం కల్పించిన మహోన్నత వ్యక్తి జేమ్స్ మిల్ (James Mill). 1806లో భారతదేశ చరిత్రపట్ల ఆసక్తి ప్రదర్శించిన జేమ్స్ మిల్ 1817లో 'ది హిస్టరీ ఆఫ్ బ్రిటీష్ ఇండియా' (The History of British India) అనే గ్రంథాన్ని ప్రచురించాడు. జేమ్స్ మిల్ నాటికే ఉపయోగితా సిద్ధాంత ఉద్యమంలో ప్రముఖుడు. బెంథామ్ ఆలోచనలచే ప్రభావితుడై, ఆ ఆలోచనలకు కార్య రూపం ఇచ్చి, విద్యా రంగంలో, శాసనసభల్లో, న్యాయసూత్రాల్లో, వర్తక విధానంలో సమూలమైన

మార్పులను తీసుకురావలెనని ప్రజా ఉద్యమాలను, ప్రచారాలను నిర్వహించాడు. ఇంగ్లాండ్ దేశంలో ఉదార వాద ధోరణులు ప్రబలడానికి, స్వేచ్ఛా వ్యాపార సిద్ధాంతం అమలు పరచడానికి మిల్, అతని అనుచరులు కృషి చేసి, విజయం సాధించారు. ఆ విధానాన్నే భారతదేశం పట్ల కూడా అనువర్తించాలని జేమ్స్ మిల్ ఆశించాడు.

1819లో జేమ్స్ మిల్ లండన్‌లోని ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యవహారాల పర్యవేక్షకుడుగా నియమింపబడ్డాడు. 1836 వరకు ఈ పదవిలో కొనసాగిన జేమ్స్ మిల్ ఒకవైపున తనకున్న పదవితో, మరోవైపున వ్యాసాలు, చరిత్రలు రాయడం ద్వారా, భారతదేశ పాలనలో ఉదార వాద ధోరణులను ప్రవేశపెట్టాలని వాదించాడు. చాలావరకు సఫలీకృతుడైనాడు. 1813లో కంపెనీ చార్టర్ మరోసారి మంజూరు చేసే సమయానికి ఉదార వాదం, సంస్కరణలు బహుళ ప్రచారం పొందాయి. ఫ్రెంచి విప్లవం మూలంగా మూడు దశాబ్దాలు యధాతథస్థితిని కొనసాగించిన ఆంగ్ల ప్రభుత్వం ప్రప్రథమంగా మార్పుల ప్రతిపాదనలను వినడం ప్రారంభించింది. అంతేకాక ఉదార వాదాన్ని సమర్థించే మధ్యతరగతి వర్తకులు, ఉద్యోగస్వామ్యం ఆర్థికంగా బలపడ్డారు. వారి సంఖ్యతోపాటు, ఆత్మ విశ్వాసం కూడా పెరిగింది. కంపెనీ పాలనకు వ్యతిరేకంగా మానవతా వాదులు, ఉదార వాదులు సమైక్యమై, 1813 చార్టర్ మంజూరు సమయానికి తమ ఆలోచనలను, సంస్కరణల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా భారతదేశంలో ప్రవేశపెట్టవలసిన మార్పులను గూర్చి విస్తృతంగా చర్చలు జరిగాయి. భారతదేశం సైనికంగా ఇంగ్లాండ్‌కు ఉపయోగకారికాదు. కేవలం వర్తక వ్యాపారాలకే ఇంగ్లాండ్ ప్రయోజనాలు పరిమితమయ్యాయి. భారతదేశంలో ఆంగ్లేయ సార్వభౌమాధికారం అవసరం లేదు. కంపెనీ గుత్తాధిపత్యం సరైనదికాదు. భారతదేశానికి కావలసినది మంచి ప్రభుత్వం. అక్కడ పశ్చిమ రాజ్యాల పార్లమెంటరీ వ్యవస్థలను స్థాపించాలనుకోవడం ఆచరణ యోగ్యం కాదు. వారికి న్యాయం చేకూర్చే పాలన కావలెననే జేమ్స్ మిల్ వాదనల సారాంశం 1813 చార్టర్ ఆక్ట్ లోని ఆంగ్లేయ విధానాన్ని ప్రభావితం చేసింది.

జేమ్స్ మిల్ రాసిన "హిస్టరీ ఆఫ్ బ్రిటిష్ ఇండియా" (The History of British India) ఉపయోగితా వాద దృక్పథానికి అద్దం పడుతుంది. భారతదేశ చరిత్ర అవగాహనకై ఎంతో కృషి చేసిన మిల్ దేశ పాలనకై ఎన్నో ప్రతిపాదనలను చేసాడు. మిల్ దృష్టిలో మధ్యతరగతి ప్రజలే సంస్కరణాభిలాషులు. వారే మానవతా దృష్టిలో సంస్కరణలను బలపరచగలరు. నాగరికత పురోగమనానికి మానవ నైతిక ప్రవర్తన, మేధస్సులు అభివృద్ధి చెందాలని భావించాడు. నిరంకుశ పాలన భారతదేశంలో అనాదిగా వస్తున్న వ్యవస్థ అని, ప్రాచీన నాగరికతలన్నింటిలో ఇది సర్వసామాన్యమైందని, ఫలితంగా, న్యాయ సూత్రాల్లో అక్రమాలు, అన్యాయాలు చోటు చేసుకున్నాయని, వాటిని సంస్కరించాలని మిల్ అభిప్రాయ పడ్డాడు. అదే రీతిలో భారతదేశంలోని మతం, సామాజిక వ్యవస్థల్లోని అన్యాయాలను, దురాచారాలను హేతు వాద దృష్టిలోనే విమర్శించాడు. కుల పద్ధతి ఒకప్పుడు ఉపయోగమైన వ్యవస్థయే కాని నాగరికమైందికాదని భావించాడు. హిందూ వ్యవస్థలో మహిళలను పూర్తిగా విస్మరించడం జరిగిందని, భారతీయుల్లో సృజనాత్మక శక్తి, మేధస్సు అధికమే కాని, సమతుల్యంగా ఆలోచించడం జరగలేదని, వారి సామాజిక వ్యవస్థ అజ్ఞానాన్ని, సోమరితనాన్ని, దురాశను పెంచిందని మిల్ అభిప్రాయం. హిందూ విద్యా వ్యవస్థ అసంగత విషయాల పరిశోధనలతో, నిరుపయోగంగా నిల్చిపోయిందని విమర్శించాడు.

అంతేకాక భారతదేశంలో ఆంగ్ల పాలనను కూడా తీవ్రంగా గర్హించాడు. భారతదేశాన్ని గూర్చి ఎట్టి అవగాహన లేని వారు ఉన్నత అధికారులుగా ఆ దేశాన్ని పరిపాలిస్తున్నారని, ఎన్నో అనవసర యుద్ధాలు చేశారని, దేశ ముఖ్య సమస్యలైన పేదరికం, అజ్ఞానం తొలగించడానికి ఎట్టి ప్రయత్నాలను చేయలేదని విమర్శించాడు. ఉచిత న్యాయసూత్రాలు, తక్కువ మోతాదులో పన్నులు విధించి, దేశ పాలనలో మార్పులు తీసుకురావలెనని, భారతీయ వ్యవస్థలకు ప్రజావసరాలకు అనుగుణంగా, నూతన ఆలోచనలను ప్రవేశపెట్టి సంస్కరించాలని మిల్

BRAOU

అభిప్రాయపడ్డాడు. మిల్ తన చరిత్ర గ్రంథంలో 'ది హిస్టరీ ఆఫ్ బ్రిటిష్ ఇండియా' ను మూడు భాగాలుగా విభజించి, మొదటి భాగాన్ని హిందూ యుగం. రెండో భాగాన్ని మహమ్మదీయ యుగంగా పిలిచాడు. మూడో భాగాన్ని బ్రిటిష్ యుగంగా చెప్పాడు. అంటే ప్రథమంగా భారతదేశ చరిత్రలో మతతత్వ ధోరణిలో విభజన చేసి, ఒకరకంగా మతపరంగా ప్రజల్లో విభజనా ఆలోచనలను రేకెత్తించాడు. ఈ విభజన అశాస్త్రీయం, అపాయకరం. ఈ విభజననే తరవాత ఆంగ్ల చరిత్రకారులు అనుసరించారు. అయితే మిల్ ఆంగ్లేయ పాలనలోని అన్నిరంగాల్లో మార్పులు రావలెనని వాదించాడు. ఉదార వాదాన్ని, ఉపయోగితా సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేసినవారిలో మిల్‌ను అగ్రగణ్యుడిగా చెప్పవచ్చును.

ఉపయోగితా సిద్ధాంతం మొదటిగా సాగిన సంస్కరణోద్యమం, ఆంగ్ల విద్యా విధానం, పాశ్చాత్య నూతన ఆర్థిక, రాజకీయ ఆలోచనలు భారతదేశ చరిత్రను ఆధునిక కాలంలో ఎంతగానో ప్రభావితం చేసాయి. అయితే ఈ సిద్ధాంతాన్ని భారతదేశంలో ప్రచారం చేయడానికి ఆంగ్లేయుల్లో కొంత స్వార్థ చింతన లేకపోలేదు. భారతదేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థను ఆధునికీకరణ చేయడం ద్వారా, మతపరంగా, సాంస్కృతిక పరంగా వారిలో ఉన్న భావాలు, ఆలోచనలు తొలగిపోయి, విదేశీ సంస్కృతిని, ఆర్థిక ఆలోచనలను ఆహ్వానించగలరని, తద్వారా తమ వర్తక, వ్యాపారాలకు వృద్ధి చేసుకోవడం, వీలైతే మత సిద్ధాంతాలను ప్రవేశపెట్టడం సులభతరం కాగలదని ఆలోచించారు. ఇవి వలస రాజ్య పాలన లాభసాటిగా పరిణమించగలదని వారి భావన.

ఏమైనా, సాంప్రదాయబద్ధంగా వస్తున్న భారతీయ ఆలోచనలను ప్రతిబింబించే ప్రతి వ్యవస్థను ఈ సిద్ధాంతం కొలమానంగా విశ్లేషించడం, నాటి విద్యాధికుల లక్షణంగా మారింది. వ్యవస్థ వయస్సుకన్నా దాని ఉపయోగం, ప్రజల సుఖానికి, సంక్షేమానికి దాని ఆవశ్యకతను గూర్చి చర్చించడం జరిగింది. ఈ చర్చల సందర్భంగా సతీ సహగమనం, దేవదాసీ పద్ధతి, పరదా పద్ధతి, బానిసత్వం మొదలైన సామాజిక రుగ్మతలన్నీ తీవ్ర విమర్శలకు గురయ్యాయి. 19వ శతాబ్దపు సంస్కరణోద్యమానికి ఈ చర్చలు బలం చేకూర్చాయి. మతం, విద్య, సామాజిక వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థలు చివరకు నీతి శాస్త్రం మొదలైన అన్ని రంగాల్లో సాంప్రదాయక కట్టుబాట్లు, ఆచారం పేర వున్న అనాచారాల శృంఖలాలను కొంతవరకు తొలగించి, వీటి స్థానంలో ఉపయోగితా వాదం, ప్రజా సౌఖ్యం, పదుగురి ఆనందం కొలబద్దలుగా నిలిచాయి. హేతు వాదానికి, తార్కిక ఆలోచనకు, న్యాయ సూత్రాలకు ఈ సిద్ధాంతం ప్రాతిపదికగా మారి, నాటి సామాజిక, మత, ఆర్థిక, రాజకీయ ఆలోచనలను ప్రభావితం చేసింది. సాంప్రదాయకంగా సాగిన సామాజిక అన్యాయాలను, ఆర్థిక దోపిడిని ఎదిరించే శక్తులకు చేయూత వచ్చింది. అంతేకాక చరిత్ర రచనలో, సంస్థల, వ్యవస్థల రూపురేఖలను చెప్పడంలో కాక, వాటి అవసరాన్ని, ఉపయోగాన్ని విశ్లేషించడంలో తోడ్పడింది. ఆధునిక కాలంలో భారతదేశంలో వచ్చిన బహుముఖ మార్పులకు, సంస్కరణలకు ఉపయోగితా సిద్ధాంతంతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధమున్నదనేది నిర్వివాదాంశం.

## 4.5 సంగ్రహంగా

ఈ భాగం కేవలం కొన్ని సిద్ధాంతాలను మాత్రమే తెలియజేసి, అవి భారతదేశ చరిత్రలో 19వ శతాబ్దం నుండి వచ్చిన మార్పులకు కారణభూతమైన రీతిని వివరించడం జరిగింది. ప్రాక్ పశ్చిమ సంస్కృతుల సమన్వయం, ప్రాచ్య వాదం మూలంగా బహిర్గతమైన భారతీయ ప్రాచీన సంస్కృతి, ఎవాంజలిజమ్ మూలంగా భారతీయుల్లో వచ్చిన పట్టుదల, ఉపయోగితా సిద్ధాంతం ద్వారా నాటి వ్యవస్థల, సంస్థల విశ్లేషణ జరుగగా, ఈ వాదాలన్నీ ఆధునిక భారతదేశ చరిత్ర పరిణామంలో ఎలాంటి ప్రభావాన్ని కలిగి ఉన్నాయో వివరించడమైంది.

BRAOU

## 4.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ప్రాచ్య వాదాన్ని వివరించి, భారతదేశ చరిత్ర పునర్నిర్మాణంలో దాని ప్రాధాన్యతను విశ్లేషించండి.
2. ఉపయోగితా సిద్ధాంతాన్ని వివరించి, ఆధునిక భారతదేశ చరిత్రపై దాని ప్రభావాన్ని అంచనా వేయండి.

II. **క్రింది వాటిపై లఘువ్యాఖ్యలు రాయండి**

1. సర్ విలియం జోన్స్
2. చార్లెస్ గ్రాంట్
3. ఉపయోగితా సిద్ధాంత మూలాంశాలు
4. జేమ్స్ మిల్.

## 4.7 ఉపయుక్త గ్రంథాలు

Majumdar B. B. — **History of Indian Social and Political Ideas**

రచయిత – శ్రీ ఎ.వి. కోటిరెడ్డి

BRAOU

# భాగం - 5 : సామాజిక చట్టాలు

విషయ క్రమం

5. 0 లక్ష్యాలు

5.1 పరిచయం

5.2 మహిళా సంస్కరణల ప్రాధాన్యత

5.3 తొలి సంస్కరణా ప్రయత్నాలు

5.4 సాంఘిక శాసనాలు

5.4.1 సతీ సహగమనం

5.4.2 శిశు హత్యా దురాచారం

5.4.3 వితంతు వివాహాలు

5.4.4 తదితర మహిళాభ్యుదయ సంస్కరణలు

5.4.5 బానిసత్వ నిర్మూలన

5.4.6 దళిత వర్గాల ఉద్ధరణ

5.5 శాసనపరమైన భద్రతలు

5.6 సంగ్రహంగా

5.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

5.8 ఉపయుక్త గ్రంథాలు

## 5.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగల్గాలి

- 18వ శతాబ్దంలో వచ్చిన సాంఘిక సంస్కరణలు ఏరీతిగా భారతదేశ సామాజిక వ్యవస్థను ప్రభావితం చేసిన విషయం.
- సాంఘిక సంస్కరణలకు దోహదం చేసిన కారణాలు, వ్యక్తుల వివరాలు

## 5.1 పరిచయం

భారతదేశంలో మతానికి, సామాజిక వ్యవస్థకున్న సాన్నిహిత్యం ప్రపంచంలో మరెక్కడా కన్పించదు. ఇక్కడ సామాజిక మార్పులకు, మతపరమైన సిద్ధాంతాల్లో మార్పు కూడా తోడైంది. 19వ శతాబ్ద ప్రారంభం నాటికి, సామాజిక వ్యవస్థలోనున్న దురాచారాలు నేటి చదువరులకు ఆశ్చర్యాన్ని కల్గించవచ్చు. సాంప్రదాయం పేరున, నిర్లక్ష్యం మూలంగా ఈ దురాచారాలు కొనసాగాయి. మత మూఢనమ్మకాలపై నాటి హేతు వాదం యుద్ధం ప్రకటించింది. అదే పోరాటం సామాజిక దురాచారాలపై కూడా కొనసాగింది. బెంగాల్‌లో కేశవ చంద్ర నాయకత్వంలో బ్రహ్మసమాజం సాంఘిక సంస్కరణను, మతసంస్కరణలో భాగంగా పరిగణించింది. సంఘసంస్కరణాభిలాష బ్రహ్మసమాజంలో అభిప్రాయ భేదాలకు, సమాజం విడిపోవడానికొక కారణమైంది.

B R A O U

బొంబాయి రాష్ట్రంలోని 'ప్రార్థన సమాజం' మహదేవ గోవింద రెనడే నాయకత్వంలో కొత్త దారిన నడిచింది. 19వ శతాబ్దపు సంస్కరణల్లో రెనడే అగ్రగణ్యుడు, ఆలోచనాపరుడు. బెంగాల్‌లో బ్రహ్మసమాజం విడిపోవడం గమనించి, అట్టిది పునరావృతం కాకుండా, బొంబాయిలో తన ఉద్యమాన్ని నడిపాడు. "గతంతో పూర్తిగా విడిపోవలెనని, సమాజంలో పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలని కోరడం లేదు. ప్రాచీన స్థాపిత వ్యవస్థలపై అధికారం వదలుకోవాలని అనుకోవడం లేదు." అని చెప్పి రెనడే తన సంస్కరణను బలపర్చేవాడు. తమ వర్గ సాంప్రదాయాలను విడిచి రావలసిన అవసరం లేదన్నాడు. ప్రాచీన భారతదేశంలో ఆదర్శప్రాయమైన హిందూ వ్యవస్థ ఉండేదని, తరువాత కాలాల్లో దుష్ట సాంప్రదాయాలన్నీ చేరాయని, ప్రజ్ఞానం వల్ల, మూఢనమ్మకాల వల్ల ఈదురాచారాలు కొనసాగాయని రెనడే వాదించాడు. కావున సంస్కరణ హిందూ మతంలో మధ్యలో వచ్చిన దుర్మార్గ నిబంధనలను, ఆచారాలను తొలగించడమేనని భావించాడు. ప్రాచీన కాలంలో బాల్య వివాహాలు లేవని, వితంతు వివాహాలపై నిషేధం మధ్య కాలంలోనే వచ్చిందని, స్త్రీలు, సామాజిక వ్యవస్థలో గౌరవింపబడ్డారని, కులాంతర వివాహాలు కూడా జరిగేవని, అస్పృశ్యత వంటి దురాచారం ఎక్కడా కన్పించదని దృష్టాంతాలు చూపారు. ఈదురాచాలన్నింటికి వేదాల్లో ఆధారాలు లేవని ప్రకటించాడు. రెనడే చూపిన ఈ సాంప్రదాయ గౌరవం సంస్కరణాభిలాషను ఆటంక పర్చింది. ప్రాచీనమైనవి కదా అని నాటి సాంప్రదాయాలన్నిటిని పునరిద్ధరించడం హానికరమని రెనడే గుర్తించాడు. అతనిలో సాంప్రదాయ గౌరవంపై హేతు వాదం విజయం సాధించింది. ప్రాచీనతను పునరిద్ధరించడం సాధ్యంకాని పని అని, కాలానుగుణంగా సామాజిక పరివర్తన రావాలని, ప్రతి సంస్కరణను సమకాలీన పరిస్థితుల్లో బేరీజు వేయాలని రెనడే తన అభిప్రాయాలను మార్చుకొన్నాడు. సంస్కరణలను తీసుకువచ్చే విధానంలో అభిప్రాయ భేదాలున్నా, సంస్కరణల ఆవశ్యకతపై అందరూ ఏకాభిప్రాయంతోనే ఉన్నారు.

19వ శతాబ్దంలో సంఘ సంస్కరణ దేశ వ్యాప్త ఉద్యమం. దీనిపై భారతదేశమంతటా సంఘోద్ధారకులు ప్రచారం చేశారు. అయితే, ఈ ఉద్యమ తీవ్రత బెంగాల్‌లో, బొంబాయిలో కన్పించింది. భారతీయ కాంగ్రెస్ - రాజకీయ, సామాజిక, సమస్యలను చర్చించాలని ప్రతిపాదన తెచ్చింది. కాని, కాంగ్రెస్ ఒక్క రాజకీయ విషయాలకే పరిమితం కాగా, రెనడే 1887లో 'భారత జాతీయ సాంఘిక సమావేశం (Indian National Social conference) ను స్థాపించాడు. సతీ సహగమన నిషేధం, బాల్య వివాహాల నిషేధం, వితంతు వివాహం, పరదా పద్ధతి రద్దు, పసిపాపలుగానే ఆడపిల్లలను చంపివేసే దురాగతం రద్దు మొదలైన సాంఘిక సంస్కరణలు ప్రముఖంగా చర్చింపబడ్డాయి. ఇవేకాక, దేవదాసీ పద్ధతి, స్త్రీ విద్య, బహుభార్యాత్వం, బానిసత్వం, వివాహాలపై దురాచారం మొదలైన విషయాలపై సంస్కర్తలు మార్పులు కోరారు.

19వ శతాబ్దంలో సంస్కరణద్యమ నాయకులు సాధించిన ఫలితాలను సమీక్షించే ముందు, వారు ఆనాడు ఎలాంటి వ్యతిరేకతలను, అవమానాలను, భయాలను ఎదుర్కొని, నిలిచిపోరాడినారో, ఎంత చిత్తశుద్ధితో, పట్టుదలతో తాము నమ్మిన ఉద్యమ సిద్ధాంతాలను ప్రచారం చేశారో గమనిస్తే, వారికి శిరస్సు వంచి ప్రణామం చేయక తప్పదు. ఈసంస్కరణలన్నింటినీ, సాంప్రదాయ వాదులు, ఛాందసులు వ్యతిరేకించారు. చదువు, జ్ఞానం లేని ప్రజానీకం మతం చెప్పిన మాటలనే నమ్మి, వానిని సమర్థించారు. పైగా, పలుకుబడి, ధనంకల వర్గాలు కూడా సంస్కరణలకు సుముఖులు కాలేదు. ఇటువంటి వ్యతిరేకతకు ఎదురు నిలిచి పోరాడిన కొద్దిమంది సంస్కరణ వాదులు అభినందనీయులు. సంస్కరణకు ఒక సాంప్రదాయమే అడ్డంకి కాదు. సంస్కరణవాదుల్లో కొందరు సామాజిక వ్యవస్థ రుగ్మతలను శస్త్రచికిత్సచేసి, వెంటనే పూర్తిగా రూపుమాపవలెనని కోరితే, మరికొందరు నెమ్మదిగా, నింపాదిగా, ఈ రుగ్మతలను ప్రకృతి చికిత్స ద్వారా నయం చేయవచ్చునని తలచారు. 1855లో బర్ద్వాన్ మహారాజులు శాసన మండలిలో బహుభార్యత్వాన్ని

రద్దుచేయాలని కోరుతూ ప్రతిపాదన చేశారు. 1857లో ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి అనుమతి లభించినా, సిపాయిల తిరుగుబాటు వల్ల ఆగిపోయింది. 1863లో దీనిపై ఎన్నో నివేదనలు రాగా, భారతీయులు, ఐరోపా సభ్యులతో ఒక సంఘాన్ని నియమించారు. అందులోని భారత సభ్యులు రామనాథ టాగూర్, దిగంబర మిత్రులు "బహుభార్యాత్వమనే దురాచారం మరీ అతిశయోక్తులతో చెప్పబడిందని, ఇది తగ్గుముఖం పట్టిందని, శాసనం ద్వారా కాక, ప్రజల అభిప్రాయానికే వదలడం మంచిదని" అభిప్రాయపడ్డారు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఈ దురాచారం విస్తృతంగా కొనసాగుతుందని, శాసనం ద్వారానే దీనిని నిషేధించాలని కోరాడు. సంస్కరణల వేగంపై ఉద్యమనాయకుల్లోనే భేదాలున్నాయని చెప్పడానికిది ఒక ఉదాహరణ మాత్రమే. ఒకవైపున విదేశీ ప్రభుత్వం సంఘసంస్కరణ చేయడంలో ఔచిత్యమేమిటని తిలక్, బంకిం చంద్ర చటర్జీ ప్రశ్నించగా, మరోవైపున రెనడే శాసనం ద్వారా సాంఘిక దురాచారాలను రూపు మాపడంలోని లాభాలను సమర్థించాడు.

## 5.2 మహిళా సంస్కరణల ప్రాధాన్యత

19వ శతాబ్దపు సామాజిక సంస్కరణలన్నింటికీ స్త్రీ కేంద్ర బిందువుగా నిలవడంలో ఆశ్చర్యమేమి లేదు. సమాజంలో స్త్రీ గౌరవం, దిగువ కులాల వారిని ముఖ్యంగా, అంటరానివారిని హీనంగా చూడడం, హైందవ సామాజిక పతనానికి, ప్రముఖ లక్షణాలుగా చెప్పదగును. ఈ రెండు రుగ్మతలు సామాజిక వ్యవస్థను దుర్బలం చేయడమే కాక, రాజకీయ వ్యవస్థను కూడా కొంత వరకు దెబ్బతీసాయి. పాశ్చాత్య ప్రభావంతో సమాజంలో స్త్రీ స్థానం, అస్పృశ్యతపై సంస్కరణ వాదులు ఆసక్తి చూపారు. అయితే, 19వ శతాబ్దంలో సంస్కరణ చాల వరకు స్త్రీ సమస్యలపైనే కేంద్రీకరిపంబడింది. అస్పృశ్యత 20వ శతాబ్దంలో ముఖ్యాంగమైంది.

19వ శతాబ్దంలో హిందూ మతంలో స్త్రీల పరిస్థితి అతిదారుణంగానుండేది. పుట్టుక నుండి చావు వరకు అవమానాలు, బాధలు పడవలసిందే. ఆడ బిడ్డ జన్మ పాపమని కొన్నితెగల నమ్మకం. రజస్వల కాకముందే, వారి వివాహాలు జరిపేవారు. స్త్రీ విద్య పాపమని తలచేవారు. భర్త చనిపోతే, అతనితోపాటు సహగమనం చేయడమో, లేదా జీవితాంతం దుర్భర పరిస్థితుల్లో మగ్గిపోవడమో జరిగేది. కుటుంబ జీవనంలో ఆమెకు ఎట్టి హక్కులు లేవు. ఆస్తి వారసత్వం రాదు. భర్త చనిపోయినా మరల వివాహం చేసుకోకూడదు. మగవాడు మాత్రం భార్య బ్రతికి ఉన్నా ఎందరినైనా వివాహం చేసుకోవచ్చు. బెంగాల్‌లోని కులీన కుటుంబాలలో కొందరికి 50 మందికి పైగా భార్యలుండేవారు. స్త్రీల బాధలు, ప్రతి ఇంటా ప్రతినిత్యం జరిగేవి. కావున పదిమందిని త్వరితగతిని ఆకర్షించాయి. చదువుకొనే అవకాశాలు వచ్చిన బహుకొద్దిమంది స్త్రీలు తమకు జరుగుతున్న అన్యాయాలను పత్రికలద్వారా తెలియజేసి, ప్రజాభిప్రాయాన్ని కొంత వరకు ప్రభావితం చేసారు. ఆంగ్ల విద్యను నేర్చిన కొందరు భారతీయులు స్త్రీవిద్య ప్రాముఖ్యతను గుర్తించారు. వారిపట్ల జరుగుతున్న అన్యాయాలకు సానుభూతి చూపారు. ఆకారణంగానే, 19వశతాబ్దంలో సంస్కరణలెక్కువగా మహిళా సమస్యలపైననే కేంద్రీకరింపబడ్డాయి.

## 5.3 తొలి సంస్కరణ ప్రయత్నాలు

సంఘ సంస్కరణోద్యమంలో బెంగాల్ ప్రధాన పాత్ర వహించింది. సంఘసంస్కరణలు రూపుదాల్చక ముందే, బ్రహ్మసమాజ చాలావరకు బలహీనపడింది. కాని, దాని ప్రభావంలో నాటికీ కుల వ్యవస్థలోని పటుత్వం దెబ్బతిన్నది. తక్కువ కులాలవారికి కొంత పరిగణన లభించింది. ఆహార, విహార నియమాల్లో కొంత సడలింపు వచ్చింది. బెంగాల్‌లోని విద్యాధికుల్లో స్త్రీల పట్ల సానుభూతి పెరిగి, వారి స్థితిని మెరుగు పరిచేందుకై

సంస్కరణలు అవసరమని భావించారు. అయితే, కొందరు రాజ్య శాసనాల ద్వారా కాక, ప్రజలను విద్యావంతులను చేయడం ద్వారా, దురాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం ద్వారా, సంఘ సంస్కరణ తీసుకురావచ్చునని తలపోశారు. కాని, అది కాలయాపనలో కూడిన పని. పైగా, ఇంత విశాల దేశంలో, అక్షరాస్యత లేని ప్రజల్లో నైతిక ప్రచారం ద్వారా, సంస్కరణలు ప్రవేశపెట్టడం సులభం కాదు. బహుభార్యత్వం, లేత వయస్సులోనే పెళ్ళిళ్ళు, పర్దా పద్ధతి వంటి దురాచారాలు 20వ శతాబ్దంలో కూడా కొనసాగాయి. స్వతంత్ర భారతంలో వీటిని రూపుమాపాలని చేసిన శాసనాలు కూడా పటిష్ఠంగా అమలు కాలేదు. అందువల్ల సాంఘిక దురాచారాలను అరికట్టడానికి శాసనాలు తప్పనిసరి, త్రాగుడు, మతం పేరుతో జరుగుతున్న బలులు, మరికొన్ని క్రూరమైన ఆచారాలకు విరుద్ధంగా కూడ ప్రచారం జరిగింది.

సాంఘిక సంస్కరణోద్యమం బెంగాల్‌కన్న బొంబాయిలోనే ముందుగా ప్రారంభమైంది. 18వ శతాబ్దంలోనే మహారాష్ట్ర పాలకులు సామాజిక వ్యవస్థలో సంస్కరణలను అభిలషించిన ఉదారులు. వారి కాలంలో ప్రారంభమైన ఉదార వాదం ఆంగ్లేయుల ఆధిపత్యం కాలంలో కూడా కొనసాగింది. 'ప్రార్థనా సమాజం' స్థాపనతో సంస్కరణోద్యమం ఊపునందుకొంది. మహాదేవ గోవింద రెనడే ఈ ఉద్యమ సారధి. జ్యోతిబా పూలే 1851లో పూనాలో బాలికల పాఠశాల స్థాపించాడు. సంఘ బహిష్కరణకు కూడా వెరవక అంటరానివారి పాఠశాలను స్థాపించాడు. విధవ వివాహాలను జరిపాడు. బ్రాహ్మణుల ఆధిక్యతను సవాల్ చేసాడు. 'సత్యశోధక సమాజ్' (Satya Shodhak Samaj) ను స్థాపించాడు. కర్సోన్‌దాస్ మూల్జీ, పండిత రమాబాయి మొదలైన ఎందరో సంస్కర్తలు మహారాష్ట్రలో ఈ ఉద్యమాన్ని నడిపారు.

ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజ నాయకుల బోధనలచే ఆకర్షితులైన కొంతమంది విద్యార్థులు సంఘసంస్కరణను చేపట్టారు. కోమలేశ్వరం శ్రీనివాస పిళ్ళై బాలికల పాఠశాలకు 70 వేలు విరాళం ఇవ్వగా, సామినేని ముద్దు నరసింహం నిర్బంధ వైధవ్యాన్ని దుయ్యబట్టి, బాల్య వివాహాలను గర్హించి, కులాచారాలను విమర్శించాడు. ఆంధ్రదేశంలో వీరేశలింగం (Veerasalingam) సంస్కరణ యుగానికి మూలపురుషుడు. ఉపాధ్యాయ వృత్తి చేస్తూ, హేతు వాదం, బ్రహ్మసమాజ సిద్ధాంతాలచే ప్రభావితుడై, మూఢనమ్మకాలపై యుద్ధం ప్రకటించాడు. మంత్రతంత్రాలు, జ్యోతిషం, శకునాలు, ముహూర్తాలు మొదలైన వాటిని గర్హించాడు. 'వివేక వర్ధని' అనే పత్రికను స్థాపించి, అవినీతిని, వ్యభిచారాన్ని, లంచగొండితనాన్ని ఎండగట్టినాడు. స్త్రీల పరిస్థితి మెరుగు పర్చడానికి నిర్విరామ కృషి చేశాడు. బాల్య వివాహాలపై ధ్వజమెత్తాడు. వితంతు వివాహాలపై విస్తృత ప్రచారం చేయడమే కాక, వాటికి కార్యరూపం కల్పించాడు. వితంతు శరణాలయాన్ని స్థాపించాడు. వితంతు వివాహం స్వయంగా జరిపించి సంఘసంస్కరణకు కారకుడయ్యాడు. తన ఆస్తిని మొత్తం 'హితకారిణీ సమాజానికి' దానం చేసిన 'నవ్యాంధ్రారామమునకు దోహదం చేసిన వనమాలి' వీరేశలింగం గారి బ్రహ్మ సమాజ ప్రభావంతో రఘుపతి వెంకట రత్నం నాయుడుగారు సంఘశుద్ధి, అనాదోద్ధరణ, వితంతు పునర్వివాహం, అస్పృశ్యతా నివారణలకై కృషి చేసినాడు. దేవదాసీ పద్ధతిపై అతను జరిపిన పోరాటం చిరస్మరణీయం. 'కన్యాశుల్కం' నాటకం ద్వారా, అజరామర కీర్తిని పొందిన గురజాడ అప్పారావు సాహిత్యం ద్వారా, సాంఘిక సంస్కరణ, దేశభక్తి, మానవతా వాదం, హేతు వాదం ప్రబోధించిన యుగకర్త. వీరుకాక గిడుగు రామమూర్తి, చిలకమర్తి లక్ష్మీనరసింహం, ఉన్నవ లక్ష్మీనారాయణ, త్రిపురనేని రామస్వామి చౌదరి, గోరా వంటి ఎందరో మహానుభావులు ఆంధ్రదేశంలో సంస్కరణోద్యమాన్ని నడపారు.

19వ శతాబ్దంలో మిగతా రాష్ట్రాల్లో కూడా సంస్కరణాభిలాష వ్యక్తమైంది. మైసూర్, బరోడా, ట్రావన్కూర్, సంస్థాధిపతులు ఉదార వాదులు. 12 ఏళ్ళలోపు బాలికలకు వివాహం చేయరాదని మైసూర్ ప్రభుత్వం శాసనం చేసింది. మలబార్‌లోని నాయర్ కుటుంబాల్లోని బహుభర్తృత్వం కూడా విమర్శింపబడింది. 20వ శతాబ్దపు

B R A O U

ప్రారంభం నాటికి సాంఘిక దురాచారాలు చాల వరకు తగ్గిపోయాయి. కొన్ని సామాజిక పరివర్తనవల్ల జరిగినా, ముఖ్య దురాచాలు శాసనాల ద్వారా నిషేధింపబడినాయి. అట్టి సాంఘిక శాసనాలను క్లుప్తంగా పరిశీలిద్దాం.

## 5.4 సాంఘిక శాసనాలు

### 5.4.1 సతీ సహగమనం

19వ శతాబ్దంలో 'సతీ సహగమన' నిషేధం ప్రముఖమైన రాజ్యశాసనంగా చెప్పవచ్చును. భర్త చితిపైననే సజీవమైన అతని భార్యను కూడా అగ్నికి ఆహుతినిచ్చే ఈ దురాచారం అనాదిగా వచ్చింది. పైగా, దానికి ప్రాతివ్రత్యమనే మతం ముసుగు వేయబడింది. ఈ క్రూర సాంప్రదాయం ముసల్మానుల పాలనా కాలంలోనే చర్చనీయాంశమైంది. 15వ శతాబ్దంలో కాశ్మీర్ పాలకుడైన సికందర్ సతీ సహగమనాన్ని నిషేధించినట్లు ఫెరిష్టా (Ferishta) రాసాడు. కాని అతని కుమారుడు ఈ హిందూ ఆచారాన్ని పునరుద్ధరించాడు. 1510లో గోవాలో పోర్చుగీస్ గవర్నర్ 'అల్‌బుకార్కే' (Albuqerque) సతీ సహగమనాన్ని నిషేధించాడు. మొగల్ చక్రవర్తులు అక్బర్, జహంగర్‌లు కూడా 'సతీ సహగమనాన్ని' నిషేధించారు కాని వారి సంస్కరణ ఢిల్లీ పరిసరాలకే పరిమితమైంది. పీష్వా బాజీరావు ఈ దురాచారాన్ని విమర్శించాడు. కాని రెండు వేల సంవత్సరాలుగా వచ్చిన ఈ సాంఘిక దురాచారాన్ని రూపుమాపడం అంత సులభమైన పని కాదు.

ఆంగ్ల ప్రభుత్వం హిందూ, ముసల్మానుల మత ఆచారాల్లో, శాసనాల్లో జోక్యం చెసుకోనని స్పష్టంగా చెప్పింది. అందువల్ల, బెంగాల్ ప్రభుత్వం 'సతీ సహగమన' నిషేధానికి అధికారులు సూచనలు చేసినా, జోక్యం చేసుకొనలేదు. బొంబాయి, మద్రాసుల్లో కూడా ఆంగ్ల ప్రభుత్వం ఈదురాచారాన్ని వ్యతిరేకించలేదు. 1789లోనే ఆంగ్ల అధికారులు కొందరు ఈ క్రూర విధానాన్ని అరికట్టడానికి అనుమతివ్వమని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. మత విషయంలో తటస్థంగా ఉంటామని చెప్పిన ప్రభుత్వం, ఈ విషయంలో ఎటువంటి నిషేధ చర్యలను తీసుకోవద్దని, దురాచారానికి విరుద్ధంగా ప్రచారం మాత్రమే చేయాలని అధికారులను ఆదేశించింది. 1804లో ఆరు నెలల్లో కలకత్తా పరిసరాల్లో సుమారు మూడువందల మంది దురాచారానికి బలయ్యారు. కొందరు స్వచ్ఛందంగా సహగమనానికి అంగీకరించినా, అత్యధికులు చితిపై కాల్చబడ్డారు. 1805లో వెల్లస్లీ (Wellesley) ఈ విషయాన్ని నిజాం అదాలత్‌కు నివేదించాడు. దానిపై పండితులు సతీ సహగమనాన్ని ఒక పవిత్ర కార్యంగా చెబుతూ, బలవంతపు సహగమనం మతవిరుద్ధమని సిఫారస్ చేసారు. దానిపై అదాలత్ సతీ సహగమనం పెద్దగా అమలు లేని ప్రాంతాల్లోన్ని నిషేధిస్తూ, అమలున్న ప్రాంతాల్లో క్రమబద్ధం చేయాలని, పూర్తిగా నిషేధించడం హిందువుల మత విశ్వాసాలను దెబ్బతీయగలవని సూచించారు. 1812లో మత్తు మందు ఇచ్చి వితంతువును సహగమనం చేయించడం నిషేధిస్తూ, నిజాం అదాలత్ ద్వారా ప్రభుత్వ అధికారులకు ఆదేశాలిచ్చారు.

ఈ ఆదేశాలవల్ల పెద్ద మార్పు రాలేదు. సతీ సహగమనం నిరాఘాటంగా సాగింది. దీనిని విమర్శిస్తూ, కంపెనీ డైరక్టర్లకు కూడా తమ అభిప్రాయాలను తెలియచేశారు. లార్డ్ అమెహెరెస్ట్‌లు (Lord Amhorest) మార్క్విన్ హేస్టింగ్స్ (Marquins Hastings), సతీ సహగమన నిషేధం బెంగాల్ సైన్యంలో అసంతృప్తికి, తిరుగుబాటుకు దారితీయగలదని భయపడ్డారు. ఈదురాచారాన్ని ప్రజలను విద్యావంతులుగా చేయడం ద్వారా రూపుమాపాలని వారు తలపోసారు. ఛాందసులైన బ్రాహ్మణులు 1812లో సతీ సహగమనంపై ప్రభుత్వపుట్టుత్తర్వులను రద్దు చేయమని వినతి పత్రం సమర్పించారు. దీనికి ప్రతిగా, రాజా రామ్‌మోహన్ రాయ్, ఆతని అనుచరులు 1818లో సతీ సహగమనం ఎందట దుర్మార్గమైన, క్రూరమైన విధానమో తెలియబరుస్తూ, అది అశాస్త్రీయమని, మానవతకే మాయని మచ్చ అని దాన్ని నిషేధించాలని మరో వినతి పత్రం సమర్పించారు.

BRAOU

ఈ పరిస్థితుల్లో లార్డ్ విలియం బెంటిక్ (Lord Willian Bentink) గవర్నర్ జనరల్‌గా వచ్చారు. సతీ సహగమన నిషేధాన్ని పరిశీలించమని డైరక్టర్లకు ఆదేశాలిచ్చాడు. లార్డ్ బెంటింగ్ స్వతహాగా సంస్కరణాభిలాషి. వెంటనే ఈ విషయంపై దృష్టి సారించాడు. విద్య విజ్ఞానాభివృద్ధితో సతీ సహగమనం తగ్గుముఖం పట్టినా, అది ఉన్నత వర్గాలకే పరిమితమైంది. నిర్దిష్టచర్య తీసుకొనేముందు పౌర, సైనికాధికారుల అభిప్రాయాలను సేకరించడానికి రహస్య విచారణ జరిపాడు. అత్యధికులు సతీ సహగమన నిషేధాన్ని బలపర్చారు. అయితే, వ్యతిరేకత విల్సన్, రామ్‌మోహన్ రాయ్‌ల నుండి రావడం విచిత్రం. రామ్‌మోహన్ రాయ్‌కు చట్టపరమైన నిర్బంధం ఇష్టం కాకపోగా, దీనివల్ల ప్రజల్లో ఆంగ్ల ప్రభుత్వంపై నమ్మకం సడలగలదని విల్సన్ భావించాడు. అయినా, బెంటింక్ తన ప్రయత్నం కొనసాగించాడు. 1829 నవంబర్ 8న సతీ సహగమనంపై మండలికొక విస్తృతమైన వివరణ ఇస్తూ, నిషేధం వల్ల తిరుగుబాటు రాగలదనే అంశంపై తన అభిప్రాయాలను తెలియచేసాడు. ఈదురాచారం బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో ఎక్కువగా ఉందని, ఈ ప్రాంత ప్రజలు శతాబ్దాలుగా అధికారానికి దాసోహమవడం జరుగుతున్నదని, అట్టివారు తిరుగుబాటు చేసే అవకాశం లేదని అభిప్రాయపడ్డాడు. కాన 'సతీ' నిషేధంలో మండలి తనను బలపర్చగలదని ఆశాభావం వెలిబుచ్చాడు. దీనివల్ల కొందరు ఛాందసులు మతపరంగా ప్రజలను రెచ్చగొట్టగలరేమోననే భయాన్ని మెట్‌కాఫ్ (Metcalf) వెలిబుచ్చాడు. అలాంటి వ్యతిరేకత వస్తే వెంటనే వస్తుందని, కొంతకాలం గడిస్తే, ఏ ప్రమాదముండదని నమ్మిన మెట్‌కాఫ్ మంచి చెడులను బేరీజు వేసి నిషేధాన్ని బలపరిచాడు. కౌన్సిల్ సతీ సహగమన నిషేధాన్ని బహిరంగంగా, స్పష్టంగా బలపరుస్తున్నామని, ఈచట్టం జరిగే మంచిని, దానిని అమలు చేయగల తమశక్తిని గమనించిన దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకొన్నామని ప్రకటించారు.

1829 డిసెంబర్ 4వ తేదీన (XVII) నిబంధనల ప్రకారం బెంగాల్ రాష్ట్రంలో సతీ సహగమనాన్ని నిషేధిస్తూ, దానిని అనుసరించినవారు శిక్షార్హులని ప్రకటించారు. స్వచ్ఛందంగా సహగమనం చేసేవారికి సాయపడిన వారిని హత్యానేరం క్రింద శిక్షించగలమని, బల ప్రయోగం, హింసా పద్ధతులననుసరించి హిందూ వితంతువును చితిపై కాల్చిన వారు, అందుకు తోడ్పడిన వారికి మరణ శిక్ష విధింపబడునని చెప్పబడింది. బొంబాయిలో సర్ మాల్కొమ్ (Sir Malcom) ప్రభుత్వం, స్వచ్ఛందంగా అగ్నిలో దూకే వారిని హత్యా నేరం శిక్షించే క్లాజును మాత్రం తొలగించాడు. శాసన విరుద్ధంగా చెప్పుకోదగిన ఎటువంటి ప్రతిఘటన రాలేదు. ఈ శాసనాన్ని రద్దు చేయమని ఎనిమిది వందల మంది కలకత్తావాసులు ఒక అభ్యర్థన చేసారు. అందులో, జమిందార్లు, హిందూ మత నాయకులు కలరు. ఈ శాసనం హిందూ ధర్మ సూత్రాలకు విరుద్ధమని భావిస్తే రాజుకు అప్పీలు చేసుకొమ్మని బెంటింక్ తనని కలిసిన ప్రతినిధి బృందానికి చెప్పాడు. మరోవైపున రాజా రామ్‌మోహన్ రాయ్ మూడువందల మంది సంతకాలతో ప్రభుత్వం చేసిన శాసనం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ, ఒక నివేదన పంపారు. సతీ సహగమనం అశాస్త్రీయమైందని మతంలో ఎక్కడా చెప్పబడలేదని కొందరు పండితులు ప్రసంగించారు. ఛాందసులు ఇంగ్లాండ్ రాజుకు అప్పీలు చేయగా, రాజా రామ్‌మోహన్ రాయ్ దానికి బదులుగా, స్వయంగా ఇంగ్లాండ్ వెళ్ళి తమ ప్రతివాదనను హౌస్ ఆఫ్ కామన్స్ (House of common's) లో వినిపించాడు. ప్రీవికౌన్సిల్ ఛాందసుల అప్పీలును కొట్టి వేసింది. దీనితో వందలాది సంవత్సరాలుగా కొనసాగి, ఎందరో అభాగినులను మతం పేరుతో చితిపై కాల్చి చంపే దురాచారానికి తెరపడింది. అక్కడక్కడా సతీ సహగమన ఉదంతాలు జరిగినా క్రమేణా, ఆ పద్ధతికి స్వస్తి చెప్పిబడింది. హేతు వాదం, మానవతా వాదం, సంస్కరణాభిలాషలు సమన్వయంగా సాధించిన ప్రథమ విజయమిది.

### 5.4.2 శిశు హత్య దురాచారం (Infantieide)

నాడు మరో అతి దారుణమైన దురాచారం శిశు హత్య. వాస్తవానికి సతీ సహగమనం కన్నా ఈ దురాచారంవల్ల ఎక్కువమంది చంపబడ్డారు. అమానుషత్వం, క్రూరత్వంలో ఈ దురాచారం దేనికి తీసిపోదు.

అయితే ఈ నేరం రహస్యంగా జరిగేది. కొన్ని తెగలకే పరిమితమైంది. అందువల్ల, సతీ సహగమనం వలె పదుగురి దృష్టికి రాలేదు. ఈ దురాచారానికి కూడా మతపరమైన ఎటువంటి ఆమోదం లేదు. రాజపుత్ర తెగల్లో తెగల అంతర్గత వివాహాలు నిషేధం. కొన్ని వివాహాలు విపరీతమైన ఖర్చుతో కూడిన పని, అందువల్ల, ఆడపిల్లల పెళ్ళిళ్ళు జరపడం కష్టమైంది. అలా పెళ్ళిళ్ళు చేయలేని వారిని సామాజికంగా హీనంగా చూసేవారు. మతపరంగా శిక్షలు వేసేవారు. ఈ దుస్థితినుండి తమను రక్షించుకోడానికి అమ్మాయి పుట్టగానే పురిటిలోనే చంపివేయడం కొన్ని తెగల్లో ప్రారంభమైంది. పాలివ్వకుండా లేదా విషం పెట్టి చంపడమో చేసేవారు. లాహోర్‌లో ఒక బిడ్డను గోనెసంచిలో బంధించి నదిలో పారవేయడం చూసానని మహారాజ దిలీప్ సింగ్ (Maharja Dilip Singh) చెప్పారు. బెంగాల్‌లో మతకర్మలో భాగంగా మగ, ఆడ శిశువులను గంగలో కలపడం కూడా జరిగేది. దీనిని బెంగాల్‌లో బ్రిటిష్ ప్రభుత్వం 1802 VI నిబంధన క్రింద నిషేదించింది.

ఈ శిశు హత్య దురాచారం 1789లోనే రాజకుమార్, రాజబస్సీ అనే రాజపుత్ర తెగల్లో వారణాసి రాష్ట్రంలో ఉండేది. 1795లో బెంగాల్ నిబంధన XXI ద్వారా 1804 నిబంధన III ద్వారా శిశుహత్య, హత్యానేరం క్రింద పరిగణింపబడుతుందని చెప్పిన ఈ దురాచారం నిరాటంకంగా సాగింది. గుజరాత్ లోని జరీజా (Jharija) కుటుంబాల్లో ఏడాదికి 20వేల శిశుహత్యలు జరిగేవని అంచనా వేశాయి. జైపూర్ జోధ్‌పూర్ రథోర్ రాజపుత్రులు, కొంతమంది జాట్లు, మేవాతీలు కూడా, ఈ దురాచారాన్ని కొనసాగించారు. ఎందరో బ్రిటిష్ అధికారులు ప్రముఖంగా డంకన్ (Duncan) వాకర్ (Walker) లాంటివాళ్ళు ఈ దురాచారాన్ని రూపుమాపడానికి అనునయ విధానాలను, నచ్చచెప్పే ప్రయత్నాలు చేసారు. భారతదేశ ప్రభుత్వపు డైరక్టర్లు ఈ దురాచారాన్ని తీవ్రంగా పరిగణించారు. లార్డ్ హర్డింజ్ (Lord Hardinge) దీనిని రూపుమాపడానికి కఠిన చర్యలను తీసుకొన్నాడు. సంస్థానాల్లో కూడా, ఈ దురాచారాన్ని నిలిపివేయమని ఆంగ్లేయ ప్రతినిధులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఈప్రయత్నాలు, పాశ్చాత్య విద్యా ప్రభావం, సంస్కరణ వాదుల కార్యక్రమాల ద్వారా, 19వశతాబ్దం మలి భాగంలో దురాచారం చాలావరకు తగ్గింది. అయినా, ముందు జాగ్రత్త చర్యగా, 1870లో పుట్టిన ప్రతి శిశువునుగూర్చి నమోదు చేయవలెనని శాసనం చేయడమే కాక, కొన్నేళ్ళు తరువాత ఆడశిశువు సజీవంగా ఉందా లేదా అని ఈ దురాచారం ఉన్న ప్రాంతాల్లో పర్యవేక్షించారు.

BRAOU

### 5.4.3 వితంతు వివాహాలు (Remarriages of widows)

నాటి సామాజిక పునరుజ్జీవనంలో వితంతు వివాహాలకు చట్టబద్ధత కల్పించడం, స్త్రీలకు మరో అమూల్యమైన వరం. హిందూ ధర్మ శాస్త్రాల్లో కొన్ని షరతులకు లోబడి వితంతు పునర్వివాహం చేసుకోడానికి, ఆమె సంతానం అన్ని హక్కులు పొందడానికి అనుమతి ఉంది. కాని, ఈ వాస్తవం పూర్తిగా విస్మరింపబడి, మధ్య యుగ కాలంలో ముఖ్యంగా, వితంతు వివాహాలు పూర్తిగా నిషేధింపబడ్డాయి. సిరాజుద్దీన్ పాలనా కాలంలో ఢక్కాకు చెందిన 'రాజరాజ వల్లభ్' అనే ప్రముఖుడు వితంతువైన తన కుమార్తెకు వివాహం జరపడానికి దేశంలోని పండితుల ఆమోదం కోరాడు. మొదటి భర్తను మరణంవల్ల లేదా, సన్యాసిగా మారినందున లేదా, కులబహిష్కరణవల్ల పోగొట్టుకున్న స్త్రీ పునర్వివాహానికి అర్హురాలని స్మృతుల్లో చెప్పబడిందని, అట్లాంటి వివాహం శాస్త్ర సమ్మతమేనని వారు అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కాని, క్రిష్ణానగర్ మహారాజు, అక్కడి ఛాందస పండితుల వ్యతిరేకత వల్ల కూతుర్ని వివాహాన్ని జరిపించేలేకపోయాడు.

పాశ్చాత్య విద్యా ప్రభావం, హేతు వాదం, ప్రభావంతో వితంతు వివాహాల సమస్య చర్చనీయాంశమైంది. బ్రహ్మ సమాజంలోని కొన్ని వర్గాలు వితంతు వివాహాలను జరిపించారు. ఛాందసులు మండి పడ్డారు. 1829లో సతీ సహగమన నిషేధనంతో సంస్కరణ వాదులకు బలం చేకూరింది. 1837కు ముందు తరువాత కలకత్తాలో

పెక్కుసభలు జరిగి, స్త్రీవిద్య, వితంతు పునర్వివాహ ఆవశ్యకతలను వెలిబుచ్చారు. బొంబాయిలో కూడా ఇదే సంస్కరాణాభిలాష వ్యక్తమైంది. పత్రికలు కూడా వీరిని సమర్ధించాయి. బెంగాల్‌లో 'బాబు నీలకమల బందోపాధ్యాయ' మహరాజశ్రీ శుచంద మొదలైనవారు, వితంతు వివాహాల్కై ప్రచారం చేసారు. బాబు శ్యామ చరణదాస్ బాల్యంలోనే భర్తపోగొట్టుకున్న కూతురి దుస్థితిని చూచి, "భర్త మొఖమే తెలియని శూద్రుని కూతురు అగ్రకులాల వలె సతీ సహగమనం చేయక, దుర్భర జీవితం గడుపవలసిందేనా ?" అని పండితులనడిగితే, పునర్వివాహం సమ్మతమే గాని అది శూద్రులకు వర్తిస్తుందని వారు అభిప్రాయం వెలిబుచ్చారు. అయనా, వాస్తవంలో అట్లాంటి వివాహం జరుగలేదు.

హిందూ పునర్వివాహోద్యమంలో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ప్రముఖ సంస్కర్త. రాజా రాధాకాంత నాయకత్వంలో ఛాందసులు బ్రహ్మాండమైన వ్యతిరేకతను చూసినా, ధైర్యంతో, పట్టుదలతో, చంపుతామని బెదిరించినా, తన ఉపన్యాసాలు, వ్యాసాల ద్వారా వితంతు వివాహాలు ధర్మబద్ధమని, ఆవశ్యకమని, మానవతా దర్శమని ప్రబోధించాడు. అంతేకాక, సుమారు వేయి సంతకాలతో వితంతు వివాహాలు చట్టబద్ధం చేయమని ప్రభుత్వాన్ని కోరాడు. అప్పటికే కొందరు భారతీయులు వితంతువులను వివాహమాడి, ఆదర్శ దంపతులయ్యారు. ఈ నిరంతర కృషి వల్ల 1856 జూలై 26వ తేదీన (1856 XV చట్టం) వితంతు పునర్వివాహ చట్టం చేయబడింది. ఈ వివాహాలు చట్టసమ్మతమని, వారి సంతానానికి సర్వహక్కులు వస్తాయని చెప్పబడింది. ఈ చట్టంవల్ల, వితంతు వివాహాలు శాసనబద్ధమైన వాస్తవంలో పెద్దగా ప్రగతి కన్పించలేదు. అటాంటి వివాహాల సంఖ్య తక్కువగానే ఉండిపోయింది. బారానగర్‌కు చెందిన బాబు శశిపాద బెనర్జీ 1884లో హిందూ వితంతువుల గృహం స్థాపించి, వారికి విద్య నేర్పి, పునర్వివాహాల్కై ప్రచారం చేసాడు. బొంబాయిలో బాబా పద్మానంద్‌శ్రీ, మహారాష్ట్రంలో పండిట్ విష్ణు శాస్త్రి, గుజరాత్‌లో 'మలబారీ' (Malbari). ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం మొదలైన మహనీయులు వితంతు వివాహాలను ప్రోత్సహించి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని, సంస్కరణకు దోహదం చేసారు. కార్వే (Karvey ) ఒక బ్రాహ్మణ వితంతువును వివాహమాడాడు. 1899 పూనాలో 'హిందూ విడోస్ హోమ్ (Hindu widows Home) ను స్థాపించి ఆదర్శప్రాయుడైనాడు. రాష్ట్ర ప్రభుత్వాల వితంతు వివాహాలకు, వారి విద్యాభివృద్ధికి ఇతోధిక ధన సహాయం చేసాయి. బొంబాయిలోని శారద సదన్, మైసూర్‌లోని మహారాణి పాఠశాల, పంజాబ్‌లోని ఆర్యసమాజం, ఆంధ్రలోని 'హితకారిణి సమాజం, లక్నోలోని 'హిందూ విధవ సంస్కరణ మండలి' ఈ రంగంలో చేసిన కృషి అభినందనీయం.

### 5.4.4 ఇతర మహిళాభ్యుదయ సంస్కరణలు

ఈ సంస్కరణలో భాగంగా, స్త్రీ విద్య ప్రోత్సహింపబడింది. పర్దా పద్ధతికి చాలా వరకు స్వస్తి చెప్పబడింది. మహిళలు సామాజిక రాజకీయ రంగంలో శ్రద్ధచూపడం ఒక పురోగమన చర్య. 1926లో అఖిల భారత మహిళా సమావేశం జరిగింది. స్త్రీల సమస్యలు సామాజిక, విద్యారంగంలో అభివృద్ధి సమన్వయ ప్రణాళికలు చర్చించారు. స్త్రీలు ముఖ్యంగా వైద్య, విద్యారంగాల్లో రాణించడం ముదావహం. డాక్టర్లుగా, నర్సులుగా వారి సేవ శ్లాఘనీయం. 1914లో ప్రత్యేక మహిళా మెడికల్ సర్వీస్ ప్రారంభింపబడింది. ఢిల్లీలోని లేడి హార్డింగ్ మెడికల్ కళాశాలలో మహిళలకు యం. బి. బి. యస్ విద్యాబోధన జరిగేది. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు బహుముఖ స్త్రీ విద్యాభ్యుదయానికి చేయూతనిచ్చాయి. స్త్రీలకు వోటింగ్ హక్కు ఇవ్వాలనే ఉద్యమం కూడా రూపుదాల్చింది. 1917లో స్త్రీలకు వోటింగ్ హక్కును కోరుతూ, అఖిల భారత మహిళా ప్రతినిధి వర్గం మాంటేగ్‌కు మద్రాస్‌లో ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. నాటి నుండి రాజకీయరంగంలో స్త్రీలు కూడా ప్రముఖ పాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ సంస్థలోనే కాక, ముస్లింలీగ్‌లో కూడా ఎందరో మహిళలు ప్రాతినిధ్యం వహించారు. 1929లో బాల్య వివాహాలను నిరోధిస్తూ

1929 XIX చట్టం వచ్చింది. 1930లో 'శారదా చట్టం' (Sarda Act)చేయబడింది, దీనిలో 18ఏళ్ళలోపు బాలికలకు వివాహం చేయరాదని చెప్పబడింది. 1937లో XVIII చట్టం ద్వారా స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించబడింది.

### 5.4.5 బానిసత్వ నిర్మూలన (Abolition of slavery)

అనాది కాలం నుండీ బానిసత్వం భారతదేశంలో ఒక వ్యవస్థ. కాని ఇక్కడ వారిపట్ల అనుసరించే విధానానికి తేడా ఉంది. ప్రాచీన గ్రీక్, రోమ్‌లలో బానిసత్వానికి, ఇటీవలి కాలంలో నీగ్రో బానిసత్వానికి ఎంతో తేడా ఉంది. అందువల్లనే చంద్ర గుప్త మౌర్యుని కాలంలో వచ్చిన గ్రీక్ రాయబారి బానిసత్వ వ్యవస్థ హిందూ దేశంలో లేదని రాసాడు. ముసల్మానుల కాలంలో కొనుగోలు చేసిన వ్యక్తిని బానిసగా చెప్పేవారు. బానిస వంశరాజుల పాలన కూడా మనకు తెలుసు.

కాని, ఆధునిక కాలంలో మనదేశంలో కొత్తరకం బానిసలు వచ్చినట్లు, వారు వివిధ బాధలకు గురైనట్లు తెలుస్తుంది. శిక్షపడిన దొంగలకు, బందిపోటుల కుటుంబాలకు వ్యక్తులను బానిసలుగా అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ, 1772లో ప్రభుత్వ కమిటీ సిఫారసు చేసింది. అమెరికా వలసల్లో బానిసత్వం గమనించిన మనకు భారతదేశంలో బానిసల జీవితం అదేరీతిలో దుర్భరంగా ఉంటుందనే భావన రావచ్చు. కాని న్యాయానికి వారు కుటుంబంలో సభ్యునిగా, స్వేచ్ఛగా సుఖమయమైన జీవనమే గడిపేవారని, కుటుంబ సభ్యులు కూడా వారిని ఇంట్లో వారిలాగానే పరిగణించేవారిని కొందరు ఆంగ్లేయ రచయితలు రాశారు. ఈ అభిప్రాయం కొంత వరకు నిజమే అయినా, చాల మంది బానిసల జీవితం దుర్భరంగా ఉండేది. భారతదేశంలోని ఐరోపావారు తమ బానిసలను నికృష్టంగా చూచేవారని, కొందరు ఆంగ్లేయ వనితలు ఇంట్లో పనిచేసే బానిసలపై తరచూ చేయి చేసుకొనేవారని, పెక్కు సమకాలీన కథలున్నవి. వారికి కొరడా దెబ్బలు శిక్షగా విధింపబడేవి. తరచూ వారు దెబ్బలకు స్పృహ తప్పేవారు. పారిపోయిన బానిసలకు శిక్షలు మరీ కఠినంగా ఉండేవి.

1823 జనవరి 18వ తేదీన 'స్టాన్‌హోప్' (Stanhope) గ్లోస్టర్ (Gloster) ప్రభువులకొక నివేదక పంపుతూ భారతదేశంలో వెంటనే బానిసత్వ నిర్మూలన శాసనం చేయవలెనని కోరినారు. ఉత్తర భారతంలో బానసలు పెద్దల ఇంట్లో పనివారిగా, ఉంపుడుగత్తెలుగా బాధలు పడుచున్నారని, దక్షిణ భారతంలో వ్యవసాయపు పనులకు నిర్దాక్షిణ్యంగా వాడుకొంటున్నారని చెప్పాడు. కెనరాలోనే పదహారు వేలమంది బానిసలున్నారని, వారిలో ఆడ, మగ పిల్లలకు కొనుగోలు రేట్లున్నాయనే ఆధారాలున్నాయి. యుక్తవయస్సు వచ్చిన ఆడపిల్లలను కూడా బానిసలుగా అమ్మివేస్తే, కలకత్తాలోని కులీనులు ఐరోపా జాతివారు వారిని ఇంట్లోపనికి, పడుపు వృత్తికి వాడుకొనేవారు. కొంతమంది పిల్లలను అపహరించి అమ్మేవారు. మరికొన్ని సందర్భాల్లో యుక్తవయస్సు వచ్చిన ఆడపిల్లలను బలవంతంగా ఎత్తుకుపోయి విక్రయించేవారు. బాల బానిసలతో నిండిన పడవలు ఆంగ్ల, ఫ్రెంచ్ వలసలకు కూడా పయనించేవి.

ఈ దుర్మార్గపు బానిసత్వాన్ని రద్దు చేయమని భారత ప్రభుత్వాన్ని ముక్తకంఠంతో కోరారు. ఈబానిసత్వపు వ్యాపారాన్ని నిరోధించడానికి అర్థ శతాబ్దం పట్టింది. 1789లో వ్యక్తులను బానిసలుగా అమ్మేందుకు ఒక చోట చేర్చడం నేరమని ప్రకటించారు. 1807లో బానిస వ్యాపారాన్ని నిషేధిస్తూ, ఇంగ్లాండ్‌లోనేకాక, వారిసామ్రాజ్యంలో కూడా శాసనం చేశారు. 1811లో భారతదేశంలోనికి బానిసల దిగుమతిని నిషేధించారు. బానిసల కొనుగోలు, అమ్మకం శిక్షార్హమైన నేరంగా ప్రకటించబడింది. 1833లో బానిసత్వాన్ని ఇంగ్లాండ్‌లో రద్దు చేస్తూ పార్లమెంటు శాసనం చేసింది. 1833 చార్టర్ ఆక్ట్ (Charter Act) లో భారతదేశంలో కూడా బానిసత్వపు వ్యవస్థను వీలున్నంత త్వరలో రద్దు చేయమని సిఫారసు చేసారు. ఫలితంగా, మనదేశంలో 1843లో బానిసత్వపు వ్యవస్థను రద్దు చేస్తూ, '1843 Act V' శాసనం వచ్చింది. బానిసలను తరచు ఉంచుకోవడం. వారితో వ్యాపారం చేయడం శిక్షార్హమైన నేరంగా 1860లో శాసనం వచ్చింది.

### 5.4.6 దళిత వర్గాల ఉద్ధరణ

భారతదేశంలో జనాభాలో దళిత వర్గాలు 20శాతం పైగానే ఉన్నాయి. వారి సామాజిక స్థితి దయనీయం. సంస్కరణ వాదులు వారి పరిస్థితిని గమనించి, వారిని కూడా సమాజంలో గుర్తింపబడిన వ్యక్తులుగా రూపొందించాలని ఆశించారు. రామకృష్ణ మిషన్, బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం, క్రైస్తవ మిషనరీలు వారిని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చేయాలని కృషిసల్పారు. ఆర్య సమాజం ముఖ్యంగా అంటరానివారు అని చెప్పబడిన దళిత వర్గాన్ని సమాజంలో గుర్తింపబడే వ్యక్తులుగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నించింది. హిందూ మతంలో నిరాదరణకు గురై, ఇతర మతాలలో చేరినవారిని తిరిగి హిందూ మతంలోనికి తీసుకురావడానికి ప్రయత్నించారు. 1906లో బొంబాయిలో 'డిప్రెస్‌డ్ క్లాసెస్ మిషన్ సొసైటీ' (Depressed classes Mission Society) స్థాపించబడింది. దళిత కులాలైన మహార్‌లు, చమార్‌లు, పరయాలు, తదితరుల సామాజిక, నైతిక, విలులను వృద్ధిపరచాలనే ఆశయంతో వారికి విద్య, పని కల్పించడం, సామాజిక అనర్హతల నిర్మూలన, ఉదార వాద మత ప్రచారం మొదలైన కార్యక్రమాలను చేపట్టారు. అంతేగాక, వారికి సామాజిక హక్కుల్లో, వ్యక్తిగత వ్యవహార శైలిలో కూడా శిక్షణ ఇవ్వాలని తలచారు. 1923లో బెనారస్‌లో జరిగిన హిందూ మహాసభలో హిందూ మతంలోని అన్ని హక్కులను అస్పృశ్యులన్న వారికి కూడా ఇవ్వాలని తీర్మానించారు. వారిని 'హరిజనులు' అని పిల్చిన గాంధీజీ తన నిర్మాణ కార్యక్రమంలో అస్పృశ్యత నిర్మూలనకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారు. స్వచ్ఛంద సంస్థలు తలపెట్టిన దళిత వర్గాల ఉద్ధరణ కార్యక్రమంతో పాటు, దళితులే స్వయంగా సంస్థలను స్థాపించి, తమ హక్కుల పరిరక్షణకై పోరాడాలని సంకల్పించారు. తరతరాలుగా నికృష్ట జీవనం గడుపుతూ, హీనంగా చూడబడిన వారు నాడు వీస్తున్న సంస్కరణ వాయులను పీల్చి, స్వయం కృషితో పైకిరావాలని, అందరివలె సమానంగా స్వేచ్ఛగా బ్రతకాలని నిశ్చయించారు.

ప్రభుత్వం కూడా దళిత వర్గాలకు చేయూతనిచ్చింది. వారి విద్యకు ప్రత్యేక స్కాలర్‌షిప్పులు, ఉద్యోగాలకు ప్రత్యేక అర్హతలు, వసతులు కల్పించి ప్రోత్సహించింది. 20వ శతాబ్దపు ప్రారంభం నాటికి, కుల వ్యవస్థలోని పటుత్వం నశించింది. దళిత వర్గాలకు శాసనసభల్లో తదితర ప్రాతినిధ్యసభల్లో ప్రత్యేక ప్రాతినిధ్యమిచ్చారు. దేశవ్యాప్తంగా కులాంతర భోజనాలు, కులాంతర వివాహాలు కూడా జరిగాయి. జాతీయోద్యమంలో దళిత వర్గాల ఉద్ధరణ, అస్పృశ్యత నిర్మూలన ఒక ముఖ్య సామాజిక కార్యక్రమంగా కొనసాగింది. గాంధీజీ, అంబేద్కర్ వంటి దేశనాయకులే గాక, ప్రతిరాష్ట్రంలో, జిల్లాల్లో, గ్రామాల్లో హరిజనోద్ధరణకై ఎందరో పాటుపడ్డారు. హరిజన దేవాలయ ప్రవేశం ఒక కార్యక్రమంగా రూపొందింది. "మంచియున్నది మాల అయితే నేను మాలనవుతాను". అని పల్కిన గురజాడ పలుకులు నాటి సంస్కరణాభిలాషకు మచ్చుతునక. నాటకాల్లో, కళల్లో, సినిమాల్లో కూడా ఈ సంస్కరణాభిలాష వ్యక్తమైంది. ఆంధ్రదేశంలో ఉన్నవ లక్ష్మీనారాయణగారి నవల 'మాలపల్లి' పదుగురు చదివి హర్షించారు. ఈ ఉత్సాహం, ఉత్తేజం, జాతి విమోచన వరకు నిరాటంకంగా సాగింది.

స్వాతంత్ర్య భారతదేశంలో రాజ్యాంగపరంగా దళిత వర్గాల ఉద్ధరణకు ప్రత్యేక సదుపాయాలు, రాయితీలు, రాజ్యాంగ భద్రతలు కల్పించబడ్డాయి. శాసనసభల్లో, ఉద్యోగ నియామకాల్లో వారికి ప్రత్యేక హక్కులు కల్పింపబడ్డాయి.

## 5.5 శాసనపరమైన భద్రతలు

1850 'కాస్ట్ డిసెబిలిటిస్ రిమూవల్ ఏక్ట్ (Caste Disabilities Removal Act 1850) కులప్రాతిపదికపై దళిత వర్గాలను వేరుపర్చి, హీనపర్చడం గమనించిన ఆంగ్లేయ ప్రభుత్వం 1850 లో కులంపేరుతో ఎటువంటి అనర్హతలను సృష్టించరాదని ఒక శాసనం చేసింది. ఈ చట్టం ప్రకారం కులం మార్పిడివల్ల హిందూ మత

బహిష్కరణకు గురైనవారు అన్ని హక్కులను కలిగి ఉంటారు. వారి ఆస్తి హక్కులను రద్దు చేయటానికి వీలులేదు. హిందూ వారసత్వ చట్టం దీనికనుగుణంగా మార్చబడింది. హిందూ వితంతువు ఇస్లాం మతం స్వీకరించి, మహ్మదీయుడిని పెళ్ళాడినా, ఆమెకు హిందూ సాంప్రదాయ ప్రకారం వచ్చిన ఆస్తిని పోగొట్టుకోదు.

'అన్టచబిలిటీ అఫెన్సెస్ యాక్టు' 1955 (Untouchability offences Act 1955) ఈ చట్టాన్ని నేడు 'ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్సు యాక్టు' (Protection of civil Rights Act) 1955గా, 1976లో పేరు మార్చారు. మన రాజ్యాంగం 17వ ఆర్టికల్ ప్రకారం అస్పృశ్యత నిషేధింపబడింది. ఎవరైనా అస్పృశ్యతా విధానాన్ని కొనసాగిస్తే, చట్ట ప్రకారం వారు శిక్షార్హులు. దీనికనుబంధంగా ఒక కేంద్ర శాసనం లేనందున ఒక చట్టం చేయవలసివచ్చింది. ఈచట్టం ఒక హిందువులకేకాక, అన్నిమతాల వారికి వర్తింపబడుతుంది. 1976లో వచ్చిన సవరణ ప్రకారం, అస్పృశ్యతను పాటించడం ఒక గుర్తింపు పొందిన నేరం. ప్రతి ఒక్కరికి పౌరహక్కులు సమానమని చెప్పబడింది. ప్రార్థనా మందిరాల్లో, మత సంబంధమైన సంస్థల్లో, హోటళ్ళలో, నివాస స్థలాల్లో, వాహనాల్లో, క్రీడారంగ స్థలాల్లో, వినోద కార్యక్రమాలు జరిగేచోట్ల కులం పేరుతో ఎటువంటి ఆటంకాలు కల్పించినా, అది నేరమౌతుంది వృత్తి పరంగా కాని, వ్యాపారం చేయడంలో, పరిశ్రమలు స్థాపించడంలో, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం నడిపే సంస్థల్లో వారి ఆర్థిక సాయంతో పనిచేసే సంస్థల్లో, నివాస స్థలాల నిర్మాణంలో, ధర్మశాలల ఉపయోగంలో, ప్రజాహితమైన సేవల వినియోగంలో ఎట్లాంటి అనర్హతలు పాటించినా శిక్షార్హమే. అస్పృశ్యులనే పేరున వారికి వస్తువుల అమ్మకంలో, సేవల వినియోగంలో ఆటంకాలు కల్పించిన అది నేరం. అస్పృశ్యత పేరున వెలివేస్తే, సామాజిక జరిమానాలు, శిక్షలు కూడా విధింపవచ్చును.

ఈరెండు చట్టాల ద్వారా నేడు భారతదేశంలో అంటరానితనం పూర్తిగా రూపుమాపబడిందని, ఎక్కడైనా అట్టి సంఘటనలు జరిగితే, ప్రభుత్వం కఠిన శిక్షలను విధిస్తుందని చెప్పవచ్చును. 19,20 వ శతాబ్దంలో అస్పృశ్యతా నివారణ సాంఘిక సంస్కరణల్లో ప్రముఖమైందిగా చెప్పవచ్చును.

భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనంలో సాంఘికపరమైన సంస్కరణలు, వాటికనుబంధంగా వచ్చిన శాసనాలు, రాజ్యాంగ గుర్తింపు అభినందనీయాలు. కొన్ని శతాబ్దాలుగా ఉన్న ఆచారాలు, నమ్మకాలు, సమకాలీన పరిస్థితుల్లో, అవసరాలను బట్టి మార్పు చెందడం, హిందూ జీవన విధాన ఉదారతకు నిదర్శనంగా చెప్పుకోవచ్చును. ఇట్టి మార్పులు ఇతర ఖండాల్లో, దేశాల్లో రావటానికి ఎక్కువ కాలం పట్టడమే కాక, ఎన్నో హింసాత్మక సంఘటనలక దారితీసింది. 18,19శతాబ్దాల్లో వచ్చిన రాజకీయ ఆర్థిక మార్పులకన్నా, సామాజిక మార్పులు భారతదేశ ఆధునికతకు ఎక్కువ తోడ్పడ్డాయని చెప్పటంలో ఎట్టి సందేహం లేదు.

BRAOU

## 5.6 సంగ్రహంగా

ఈ భాగంలో భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనంలో సాంఘిక శాసనాల పాత్ర వివరింపబడింది. ప్రముఖంగా ఈ సాంఘిక సంస్కరణలన్నీ మహిళాభ్యుదయానికి, తదితర పీడితవర్గాల పునరుద్ధరణకు నిర్దేశంపబడం అభ్యుదయకరమైన విషయంగా అర్థంచేసుకోగలం.

## 5.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. 18వ శతాబ్దంలో వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవన కారణాలను, నేపథ్యాన్ని వివరించండి.
2. 18వ శతాబ్దంలో మహిళోద్ధరణనుద్దేశించి వచ్చిన సాంఘిక శాసనాలను విశ్లేషించండి.

II క్రింది వాటికి లఘువ్యాఖ్యలను రాయండి.

1. సతీ సహగమన నిషేధం

2. బానిసత్వ నిర్మూలనం

3. దళిత వర్గాల ఉద్ధరణ

## 5.8 ఉపయుక్త గ్రంథాలు


Baratiya Vidya Bhavan — **British Paramountacy and Indian Renaissance**

Bipin Chandra — **Modern India**

Datta — **Dawn of Renaissance in India**

Natarajan — **Century of social Reform in India**

Raghuvamsi — **Indian Society during the 19th century**

Srinivas — **Social change in Modern Indian**



రచయిత : శ్రీ ఎ. వి. కోటిరెడ్డి



BRAOU

# భాగం - 6 : సామాజిక విధానం - వలసాధిపత్యం

విషయ క్రమం


6.0 లక్ష్యాలు

6.1 పరిచయం

6.2 ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన - విద్యా విధానం

6.3 బోధన భాష వివాదం

6.3.1 తీర్మాన ముఖ్యాంశాలు

6.3.2 మిషనరీ పాఠశాలలు

6.4 ఆంగ్ల భాష - ఉద్యోగాలు, వృత్తి విద్య,ప్రైవేట్ రంగం.

6.5 ఉడ్స్ డిస్పాచ్ (Woods Despatch)

6.5.1 ముఖ్యాంశాలు

6.6 విశ్వ విద్యాలయాల ఏర్పాటు

6.7 హంటర్ కమీషన్ 1882 (Hunter Commission)

6.8 లార్డ్ కర్జన్ కాలంలోని విద్య ప్రగతి

6.9 సాడ్లర్ కమీషన్ (Sadler commission)

6.10 వార్దా విద్యా విధాన ప్రణాళిక

6.11 సార్జెంట్ నివేదిక

6.12 సంగ్రహంగా

6.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

6.14 ఉపయుక్త గ్రంథాలు


## 6.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు క్రింది విషయాల్ని తెలుసుకోగలగాలి

- ఆంగ్లేయుల రాకతో భారతదేశ విద్యా విధానంలో వచ్చిన మార్పులు
- విద్యా విధానంలో సాధించిన ప్రగతి
- విద్యా విధానం మార్పు కొరకై వివిధ సంఘాలు చేసిన సిఫారసులు, వాటి ఆచరణ
- ఆధునిక విద్యా విధానం ప్రవేశ పెట్టబడిన విధానం

## 6.1 పరిచయం

ఖండం 1 భాగం 3 లో 18వ శతాబ్దంలో ఉన్న విద్యా వ్యవస్థ తీరు తెన్నులను వివరించడమైంది. ఈభాగంలో నాటి నుండి జరిగిన విద్యాభివృద్ధి, బోధనాంశాల్లోని మార్పులు, ముఖ్య విద్యా ప్రణాళికలు సంక్షిప్తంగా తెలయచేయడమైంది.

B R A O U

భారతదేశం ఆంగ్లేయుల వలసగా మారటంలో అందుకు ముందున్న విద్యా వ్యవస్థ, విద్యా విధానం కూడా విప్లవాత్మక మార్పులకు లోనైంది. పాత విద్యా విధానం నిరుపయోగకరమనే అభిప్రాయమేర్పడింది. ఆధునిక అవసరాలకు అది ఉపయుక్తం కాదనే భావనతో, వ్యవస్థను, విధానాన్ని రద్దుచేయకుండానే నెమ్మదిగా దాన్ని భూస్థాపితం చేసారు. దాని స్థానంలో ఆధునిక సమాజ పరిపాలనా వ్యవస్థలకు సంయుక్తమైన విద్యా విధానం కోసం కొత్త కళాశాలలు, విశ్వవిద్యాలయాలను స్థాపించారు. ఈ ఆంగ్లేయ విద్యా విధానం అప్పటికి అమల్లో ఉన్న దేశీయ విద్యా విధానాన్ని చాలవరకు మార్చివేసింది.

18వ శతాబ్దంలో ఉన్న సంస్కృత, పర్షియన్, ప్రాంతీయ భాషా విద్యా విధానాన్ని గూర్చి విని ఉన్నాం. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనా తొలి రోజుల్లో హిందూ పాఠశాలలు, ముసల్మాన్ మదరస్సాలు యధావిధిగనే కొనసాగాయి. స్థానిక పాలకులు వీటికిచ్చిన ఆధారదానాలు యధాతథంగా కొనసాగాయి. ఆంగ్లేయ వ్యాపార, పాలనా వ్యవస్థల్లో ఉద్యోగావకాశాలు వచ్చాయి. దానికై ఆంగ్ల భాష నేర్చుకోవడం ఆవశ్యకమైంది. దీనితో అప్పటికి నడుపబడుతున్న కొన్ని పాఠశాలల్లో ఆంగ్ల భాష నేర్పటం మొదలుపెట్టారు. ఇదే సమయంలో స్థానిక పాలకుల రాజ్య, ఆర్థికాధికారాలు క్షీణించాయి. దీనితో పాత విద్యాలయాలకు నిధుల కోత ఏర్పడింది. వారన్ హేస్టింగ్స్ 'కలకత్తా మదారస్సాను స్థాపించాడు. మహమ్మదీయుల ఉన్నత వర్గాల్లోని వారి కుమారులు రాజ్యపాలనా ఉద్యోగాల్లో చేరడానికవకాశాన్ని కల్పించారు. జాన్ ఒవెన్ (John Owne) ఆంగ్లేయ ఆధిపత్యంలోని రాష్ట్రాల్లో ఇంగ్లీష్ భాషను ప్రవేశపెట్టాలని సూచించాడు. ఈ సూచనను పెద్దగా ఎవరు పట్టించుకోలేదు.

## 6.2 ఈస్టిండియా కంపెనీ పాలన - విద్యా విధానం

1792-93లో ఈస్టిండియా కంపెనీ చార్టరును రెన్యూ (Renew) చేయవలసిన సందర్భంగా, 'హౌస్ ఆఫ్ కామన్స్' (House of Commons) లో జరిగిన చర్చలో భారతీయుల పురోభివృద్ధికి తోడ్పడే విద్యను బోధించడానికి చర్యలను తీసుకొనవలెననే తీర్మానం ప్రవేశ పెట్టబడింది. ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన 'విల్బర్ ఫోర్స్' (Wilber Force) భారతదేశానికి పాఠశాల అధ్యాపకులను, మిషనరీలను పంపాలని కోరాడు. విల్బర్ ఫోర్స్ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ, హిందువుల నమ్మకాలు, ఆచారాలు ఇతరుల కన్నా మంచివని, వాటిని మార్చవలసిన అవసరం లేదని వాదించడమైనది. వారికి అప్పటికున్న చదువుకన్నా, మరోకటి నేర్పడం వెర్రికాగలదని భావించారు.

ఈస్టిండియా కంపెనీ రాజకీయాధికారం స్వీకరించకముందు వారి ఫ్యాక్టరీల్లో విద్యా బోధనకు కొన్ని ఏర్పాట్లను చేసింది. విద్యా బోధన కన్నా మతంమార్పిడికి ప్రాముఖ్యమిచ్చిన క్రైస్తవులనే ఉద్యోగాల్లో నియమించారు. వారు స్థాపించిన పాఠశాలలు విరాళాల ద్వారా నడిచాయి. స్పష్టమైన గ్రాంట్లు ఏమీ లేవు. ఆ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఆంగ్ల భాష నేర్వటమే కాక, కంపెనీకి రాజకీయాధికారం రాగానే మంచి ఉద్యోగాలను సంపాదించారు. వలసాధిపత్యం సంపాదించిన పిదప, ఆంగ్లేయ పాలకులు భారతీయుల సామాజిక, మత వ్యవస్థలో జోక్యం చేసుకొనడానికి కొంత భయపడ్డారు. హిందువులకు, ముసల్మానులకు విద్య సామాజిక వ్యవస్థతో ముడిపడినందువలన విద్య జోలికి పోరాదని అనుకున్నారు. ఇంకా వీలైతే, నాటికి నడుస్తున్న విద్యా సంస్థలకు సాయం చేయడం ద్వారా, కొన్ని సంక్షేమ కార్యక్రమాల ద్వారా, స్థానిక ప్రజాభిమానం చూరగొనాలని భావించారు. అంతేకాక ఐరోపా న్యాయమూర్తులకు సాయపడటానికి హిందూ, ముస్లింల న్యాయ సూత్రాలు తెలిసిన వారవసరమయ్యారు. అందువల్ల ప్రథమంలో కంపెనీ పాలన పాఠశాలలకు, మదరస్సాలకు సాయం చేస్తూ వచ్చింది. అంతకు ముందున్న బోధనా భాష, బోధనాంశాలు కొనసాగింపబడ్డాయి. 1791లో బెనారస్ సంస్కృత కళాశాలను స్థాపించిన జోనాథన్ డంకన్ (Jonathan Duncan) ఈ విధానంవల్ల స్థానిక హిందువుల ఆదరాభిమానాలను చూరగొనడమే గాక, ఐరోపా న్యాయమూర్తులకు, పాలకులకు, దేశీయాచారాలు, న్యాయసూత్రాలు

తెలియపర్చే వ్యవస్థ ఏర్పడగలదని, ఇది ఉభయతారకమని భావించాడు. ఈ ఆలోచనవల్ల 'ఓరియంటల్ (Oriental) భాషలు పరిరక్షింపబడ్డాయి. దీనితో ఆంగ్ల భాషా వ్యాప్తి ఆగిపోయింది. కారన్‌వాలిస్ (Cornwalis) పాలనలో భారతీయులకు ప్రవేశం పూర్తిగా నిలిచిపోయింది. దానితో ఆంగ్ల భాషా వ్యామోహం సన్నగిల్లింది.

కంపెనీ కాలంలో ఒక చర్చి మాత్రమే ఆంగ్ల భాషా బోధనను బలపరిచింది. చర్చి కార్యకలాపాలు, మిషనరీల విద్యకు దేశీయుల నుండి వ్యతిరేకత రాగలదని కంపెనీ భయపడింది. అంతేకాక కొత్తగా క్రైస్తవ మతం స్వీకరించినవారు ఆంగ్లేయ క్రైస్తవులతో సమానత్వం కోరి, తమ రాజకీయ ప్రయోజనాలు దెబ్బతినగలవని ఆందోళన చెందారు. అందువల్ల కంపెనీ, మిషనరీల విద్యా విధానాన్ని వ్యతిరేకించింది. పైగా సంస్కృత, పర్షియన్, అరబిక్ భాషలను ప్రోత్సహించింది. దీంతో మిషనరీలు కంపెనీ పాలనను, విధానాన్ని దుయ్యబట్టారు. తమ 'నాగరికతా' కార్యక్రమాన్ని కంపెనీ అడ్డుకుంటుందని ఇంగ్లాండ్‌లో ప్రచారం చేసి, అక్కడ మతాభిమానాన్ని రెచ్చగొట్టారు. మిషనరీలు భారతీయులను క్రైస్తవులుగా మార్చే విధానం రాజకీయంగా ఆత్మహత్యా సదృశమని భావించిన కంపెనీ వారిలో కొందరిని దేశం నుండి పంపివేసింది. దీనికి ప్రతిగా మిషనరీలు కంపెనీ పాలనపై దండెత్తారు. ఈ వివాదం ఇంగ్లాండ్ ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా పరిణమించింది. చివరకు మతమే గెలిచి, 1818 ఛార్టర్ యాక్టు' (Charter Act) తో భారతదేశ సాహిత్య పునరుద్ధరణ, అభివృద్ధికి, చదువుకొన్న భారతీయులను ప్రోత్సహించడానికి, బ్రిటిష్ పాలనా ప్రాంతాల్లో విజ్ఞాన శాస్త్రం ప్రవేశపెట్టి పురోభివృద్ధి చేయడానికి కనీసం ఏడాదికి లక్ష రూపాయలు కేటాయించాలని శాసనం చేసారు. భారతదేశ ఆధునిక విద్యావిధాన ప్రగతిలో ఇది తొలి మెట్టు. ఆంగ్ల విద్యాభివృద్ధికిది నాంది.

నాటి సంస్కరణకర్తల్లో ముఖ్యులైన రాజా రామ్‌మోహన్ రాయ్ హిందువులకు ఐరోపా భాషలు, విజ్ఞాన శాస్త్రావగాహన ఆవశ్యకమని భావించి, ఒక సంఘాన్ని స్థాపించాడు. దాని ఆధ్వర్యంలో, 1817లో హిందూ కళాశాల స్థాపించబడింది. 1818లో కలకత్తా మిషన్ స్థాపించిన కళాశాల్లో క్రైస్తవులకు ప్రచారకులుగా శిక్షణనిస్తూ, మరోవైపున హిందూ, ముసల్మానులకు ఆంగ్ల విద్యను బోధించారు. ఆంగ్ల విద్య నేర్చిన భారతీయులు ఆంగ్లేయ పాలన వ్యవస్థకు సహాయకారులుగా ఉండగలరని కంపెనీ సంతోషపడింది. 1823లో ఎలిఫిన్‌స్టన్ (Elphinstone) ఆంగ్లం, ఐరోపా విజ్ఞాన శాస్త్రాలు బోధించడానికి పాఠశాలలు నెలకొల్పామని సూచించాడు. భారతీయ సంబంధాలను పర్యవేక్షించే కమీషనర్లనుద్దేశించి ఆయన పంపిన లేఖలో, సామాన్య ప్రజలకు మామూలు విద్యను నేర్పే బదులు ఉన్నత వర్గాలవారికి ఉన్నత ప్రమాణంలో విద్యనేర్పితే మంచిదని అభిప్రాయపడ్డాడు. అంతేకాక స్థానికులను ప్రభుత్వ ఉద్యోగాలను నిర్వహించే రీతిగా ఈ విధానం రూపొందింపబడాలని, ఒక ఆంగ్ల భాష తెలిసిన వానికి విజ్ఞాన శాస్త్రం ప్రబోధిస్తే, అతడు తన భాషలో పదిమందికి తెలియచేయగలడని విశదీకరించాడు. అట్టి ఆంగ్ల పాఠశాలను బొంబాయిలో స్థాపించి, ఆంగ్ల భాష, చరిత్ర, భౌగోళికశాస్త్రం, విజ్ఞాన శాస్త్రం ప్రవేశపెట్టారు. 1833లో పూనాలో అలాంటి పాఠశాల స్థాపించబడింది. మరుసటి సంవత్సరమే బొంబాయిలో 'ఎలిఫిన్‌స్టన్' (Elphinsotne) కళాశాల స్థాపించబడింది. మేధస్సు, నిజాయితీగల వ్యక్తులను తయారుచేసి భారతదేశ పాలనా వ్యవస్థలో ఉన్నతోద్యోగాలకు వారిని తగినట్లుగా రూపొందించాలనే భావనతో ఈ కళాశాల ఏర్పాటైంది.

## 6.3 బోధనా భాష వాదం

అప్పటికే ఆంగ్ల భాష పట్ల వ్యామోహం పెరిగింది. వందలు వేల సంఖ్యలో ఆంగ్ల గ్రంథాలు ప్రచురింపబడినాయి. సంస్కృత, పారశీక, అరబిక్ భాషలపై ఆసక్తి పూర్తిగా తగ్గింది. ఓరియంటల్ కళాశాలల్లో కూడా ఆంగ్ల విభాగాలు వచ్చాయి. దీనితో బోధనా భాషపై తీవ్రమైన వివాదమేర్పడింది. ఒక వర్గం బోధన

సంస్కృతం, పారశీకంలో సాగాలని, మరొక వర్గం ఆధునిక భారతీయ భాషల్లో ఉండాలని వాదిస్తుంటే, మిషనరీలు ఆంగ్లం బోధనా భాషగా ప్రవేశ పెట్టాలని ఒత్తిడి చేసాయి. ప్రభుత్వం వేచి చూద్దాం అని కాలయాపన చేయగా, ఈ వర్గాలు మరింత పటిష్టమై వాదులాడుకున్నాయి. ఎవరికి బలమున్నచోట వారి వాదన కార్య రూపం దాల్చి, బెంగాల్‌లో ఆంగ్లం, బొంబాయిలో వారి మాతృభాష మరాఠీ, తదితర ప్రాంతాల్లో వేర్వేరు భాషల్లో బోధన జరిగింది. అయితే బ్రిటిష్ పాలనా ప్రాంతాల్లో ఆంగ్ల భాషా సాహిత్యాలపట్ల ఆదరణ పెరిగింది.

ఈ పరిస్థితుల్లో బెంగాల్ ప్రెసిడెన్సీ విద్యా విధానంపై సిఫారసులు చేయటానికి గవర్నర్ జనరల్ ఒక సాధారణ సంఘాన్ని నియమించాడు. ఈసంఘం ఓరియంటల్ భాషలను అభివృద్ధి చేయాలని కోరింది. రాజా రామ్‌మోహన్ రాయ్ ఆంగ్ల విద్య, పాశ్చాత్య విజ్ఞానం ప్రవేశపెట్టాలని వాదించినా, ఫలితం చేకూరలేదు. అయితే వారి ప్రచారం ఆంగ్ల భాష పట్ల అభిమానాన్ని పెంచింది. అప్పటికి ఆంగ్ల భాష మంచి ఉద్యోగాన్వేషణకు, ఆదాయానికి, సామాజిక హోదాకు దోహదకారి అనే భావన ఏర్పడింది. కలకత్తా, బనారస్, ఆగ్రా, ఢిల్లీలల్లో ఆంగ్ల విద్యనభ్యసించిన వారు అధిక సంఖ్యలో ఉండేవారు. అయితే సాధారణ సంఘం రెండు వర్గాలుగా సమసంఖ్యలో విడిపోయి, బెంగాల్ విద్యాశాఖ కార్యదర్శి విద్యను ప్రాచీన భాషల్లోనే బోధించాలనే వర్గానికి నాయకత్వం వహించగా, సంఘంలోని యువ సభ్యులు ఈ ప్రాచ్య భాషా విద్యాలయాలకు నిధులను మంజూరు చేయరాదని, ఆంగ్లం బోధనా భాషగా ఉండాలని పట్టుబట్టారు. వారి సంఘాధ్యక్షుడు మెకాలె (Macaulay). మెకాలె భారతదేశానికి రాకముందు బ్రిటిష్ పార్లమెంట్‌లో కూడా ఆంగ్ల విద్యను భారతదేశంలో బోధనా భాషగా ప్రవేశపెట్టాలని వాదించాడు. ఈవిద్యా సంఘాధ్యక్షునిగా 'మెకాలె' చేసిన వాదనలు సామ్రాజ్యవాద ధోరణిలో సాగినా, చివరకు నెగ్గాయి. "పాలకులుగా భారతీయులకు ఏది మంచిదో అదే నేర్పాలి గాని. వారు కోరారు కదా అని సంస్కృతం, పారశీకం కొనసాగింపనవసరం లేదు. సాహితీ పరంగా అరబిక్, సంస్కృతం గొప్ప భాషలైనా, వైజ్ఞానిక పరంగా ఆ సాహిత్యమంతా ఐరోపాలోని ఒక గ్రంథాలయంలోని పుస్తకాల వరుసకు సరికాదు. పైగా ఆంగ్లం పాలకుల భాష. అంతేగాక తూర్పు దేశాలల్లో అది వ్యాపార భాషకానున్నది. భారతీయులకు ఆంగ్లం నేర్పకుండా వారిని అజ్ఞానులుగా ఉంచి పాలించవలెనని తలచుట ఉచితము కాదు. మన విద్యా విధానం వల్ల భారతీయుల ఆలోచనలు మంచి ప్రభుత్వ స్థాపన వైపు మొగ్గిన వారుకూడా ఐరోపా వ్యవస్థలు రావలెనని కోరవచ్చు. అలాంటి రోజు వస్తుందో లేదో తెలియదు. అలాంటి రోజు వస్తే, అది ఇంగ్లీష్ చరిత్రలో గర్వించదగిన క్షణం. మన నుండి అధికార దండం కూడా పోవచ్చు. సాయుధ విజయాలు నిలకడైనవి కావు. కొన్ని విజయాలకు తిరోగమనమే లేదు. సహజ కారణాలచే క్షీణించని సామ్రాజ్యం చరిత్రలోనే లేదు. ఆటవికతపై ఆలోచన, వివేచనా జ్ఞానం. మన కళలు, సాహిత్యం, నైతిక సూత్రాలు, న్యాయసూత్రాలు, అజరామరమైన సామ్రాజ్యంలోని అంతర్భాగాలని" మెకాలె సుదీర్ఘమైన వ్యాఖ్యానం చేసాడు. అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ విలియం బెంటిక్, లార్డు మెకాలె నోటును ఆమోదించడంతో, 1835 మార్చి 7వ తీర్మానం చేయబడింది.

BRAOU

### 6.3.1 తీర్మానం ముఖ్యాంశాలు

1. ఐరోపా సాహిత్య, విజ్ఞాన శాస్త్రాలను భారతీయుల్లో వ్యాప్తి చేయడం బ్రిటిష్ ప్రభుత్వ లక్ష్యం. దానికై విద్య కొరకు కేటాయించిన నిధులను ఆంగ్ల విద్యా వ్యాప్తికి వినియోగించడం ఉచితం.

2. ప్రాచ్య కళాశాలను మూసివేయడం జరుగదు. కాని అక్కడ చదువుతున్న విద్యార్థులకు ఇస్తున్న ఆర్థిక సహాయం ఆపివేయబడుతుంది. అంతేకాక ప్రాచ్య గ్రంథాల ప్రచురణకు ప్రభుత్వ నిధులను వాడరాదు.

3. ప్రభుత్వం వద్ద మిగిలి ఉన్న నిధులన్నీ ఆంగ్ల విద్య, విజ్ఞాన శాస్త్రాలను భారతీయులకు నేర్పే పనిలోనే వినియోగించాలి. ఈతీర్మానంపై కలకత్తాలోని ముఖ్య మౌల్వీలు, తదితర పెద్దలు సుమారు ఎనిమిది వేలమంది అభ్యంతరం తెలుపుతూ, తీర్మానాంశాలు చేసి, మహమ్మదీయ - హిందూ భాషలను విస్మరించి, ఆంగ్లానికి నిధులన్నీ దత్తత చేయడం, వారిని క్రైస్తవులుగా మార్చే ప్రయత్నంలో ఒక భాగంగా కన్పిస్తుందని ఆరోపణ చేసారు. బెంటింక్ దీనికి సమాధానంగా ఒక ప్రకటన చేస్తూ, మత విషయాల్లో ప్రభుత్వం పూర్తి తటస్థ విధానం అవలంబించగలదని చెప్పి, పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థుల మతనమ్మకాలపై ఎట్లాంటి ప్రభావిత చర్యలను తీసుకొనరాదని, క్రైస్తవ మతాన్ని పరోక్షంగా గాని, ప్రత్యక్షంగా గాని బోధనలో చేర్చరాదని ఆదేశించాడు.

### 6.3.2 మిషనరీ పాఠశాలలు

1835 తీర్మానికి ముందే ఎన్నో మిషనరీ పాఠశాలలు దేశవ్యాప్తంగా వచ్చాయి. 1716లో డేనిష్ మిషనరీలు ఉపాధ్యాయుల శిక్షణకై ఒక విద్యా సంస్థను నెలకొల్పారు. 1717లో మద్రాస్‌లో రెండు ఉచిత పాఠశాలలను నెలకొల్పి ఆంగ్ల బోధన చేసారు. 1820 నాటికి మిషనరీ పాఠశాలలు ఆంగ్ల భాషా వ్యాప్తితోబాటు, మత ప్రచారాన్ని కూడా విస్తారంగా చేసాయి. బొంబాయిలో విల్సన్ కళాశాల, మద్రాస్‌లో క్రిష్టియన్ కళాశాల మొదలైనవి వచ్చాయి. మిషనరీ కళాశాలలు నాగపూర్, మచిలీపట్నాల్లో కూడా నెలకొల్పారు. ఇక్కడ నిర్బంధ బైబిల్ బోధన ఉండేది.

పై తీర్మానం జరిగిన తరువాత ఆంగ్ల భాషా ఉద్యమకారులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసారు. బెంగాల్‌లో కొత్తగా 12 పాఠశాలలను నెలకొల్పారు. 1838 నాటికి వీటి సంఖ్య 40కి పెరిగి, విద్యార్థుల సంఖ్య ఆరువేలకు పెరిగింది. ఆంగ్ల విద్య ఒక్కసారిగా వచ్చిన ఒత్తిడిని తట్టుకోవటం కష్టమైంది. విద్యార్థులందరికి సరిపోయే పాఠశాలలు లేవు. 1836లో 'హుగ్లీ' కళాశాలను స్థాపించితే, మూడు రోజుల్లో ప్రవేశానికి 12వందల మంది దరఖాస్తు చేసారు. అందరికి ప్రవేశం దొరకలేదు. ఈ ఆంగ్ల భాషా వ్యాప్తికి మెకాలే ప్రగతిబాటకు 'చుక్కాని' అని ప్రశంసించాడు. నిజానికతడు కొత్తగా చేసిందేమీలేదు. నీటివాలు చూసి ఈదాడు. పైగా తీర్మానంపై తుది అధికారం అతనిది కాదు గదా! ప్రాచ్య భాషా వాదుల బలాన్ని కూడ తక్కువగా చెప్పడానికి వీలులేదు. వారి ప్రచార మూలంగా "ప్రాంతీయ స్వదేశీ భాషల అభివృద్ధి ప్రాధాన్యతను మేము విస్మరింపలేదు. 1835 తీర్మానం దీనికి విరుద్ధం కాదు ... ప్రాంతీయ భాషా సాహిత్యాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు నిర్దేశింపబడుతాయి" అని మరో తీర్మానాన్ని విద్యా సంఘం చేసింది.

1839లో ప్రాచ్య భాషా వాదులు, ఆంగ్ల భాషావాదుల మధ్య వివాదాన్ని ముగిస్తూ, నాటి గవర్నర్ జనరల్ ఆక్‌లాండ్ (Auckland) ఒక విధాన ప్రకటన చేసాడు. ప్రాచ్య భాషలు కొనసాగింపబడునని, ప్రాచ్య గ్రంథాలు కూడా ప్రచురించాలని, అక్కడ కూడా నిధులుంటే ఆంగ్ల విద్యనేర్పాలని ప్రకటిస్తూ, వారికి, ముప్పై వేల రూపాయలు వార్షిక నిధిగా ఇచ్చాడు. దీనితో ఆంగ్ల విద్య వ్యతిరేకత తొలగిపోవడమేకాక, ఉన్నత విద్య సామాజిక వ్యవస్థలోని విద్యార్జనకు సమయం ఉన్న ఉన్నత వర్గాలకు పరిమితమై, ఆ సంస్కృతి వడపోత వారినుండి సామాన్య జనులకందగలిగింది. దీనిని 'డౌన్‌వర్డు ఫిల్టరేషన్ (Downward Filteration) అని పిలిచారు. సెకండరీ పాఠశాలల్లో ప్రాంతీయ బోధన భాషకు సంబంధించిన పాఠ్యగ్రంథాలు సరిగాలేవని అక్కడ ఆంగ్లంలోనే బోధించే ప్రయోగం చేయాలని ఆక్‌లాండ్ అభిప్రాయపడ్డాడు. బెంగాల్‌లో మాధ్యమిక విద్యకు ఆంగ్లం బోధనా భాషగా బొంబాయిలో ప్రాంతీయ భాష బోధనా భాషగా ఉండేది. ఈవివాదం వల్ల కళాశాల స్థాయిలో ఆంగ్లం మాత్రమే బోధనా భాషగా గుర్తింపబడింది.

BRAOU

## 6.4 ఆంగ్ల భాష; ఉద్యోగాలు, వృత్తి విద్య, ప్రైవేట్ రంగం

1844 అక్టోబర్‌లో గవర్నర్ జనరల్ లార్డ్ హార్డింజ్ (Lord Harding) ఒక తీర్మానాన్ని చేస్తూ, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఒక డిగ్రీనే పరిగణాంశంగా తీసికోకుండా, ఆంగ్ల భాషా బోధన ఉన్నవారికి అలాంటి సంస్థలనుండి వచ్చినవారికి ప్రాధాన్యమియ్యవలెనని ప్రకటించాడు. దీనితో పాలనా వ్యవస్థలో మంచి ఉద్యోగం లభించడానికి ఆంగ్ల విద్య ఆవశ్యకమైంది. అంతేకాక భారతదేశ ఉన్నత వర్గాలు ఈ ఉద్యోగాలకు పోటీ పడ్డారు. బొంబాయిలో చదివిన వారికన్నా, బెంగాల్ వారికి ప్రాధాన్యం వచ్చింది. ఎవరైతే ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించి, అభ్యంతరం చెప్పగలరో, ఆ వర్గమే పాలనా వ్యవస్థ ఉద్యోగాలకు అభ్యర్థులు కావడంతో, ఆంగ్ల భాష అధ్యయనం, హోదా, లాభం సమకూర్చింది.

ఆంగ్ల విద్యా విధానంలో వృత్తి విద్యకు ప్రోత్సాహం లభించింది. వృత్తి విద్యవల్ల ఆంగ్ల భాషా వ్యాప్తి జరిగింది. ప్రభుత్వ నిర్వహణకు, వివిధ విషయాల్లో అనుభవమున్నవారు ఆవశ్యకం. అట్టి విద్య నేర్పడంలో రాజకీయ ప్రమాదం కూడా లేదు. బొంబాయిలో స్థాపించబడిన విద్యా సంస్థ 1824 నుండి ఇంజనీరింగ్ క్లాసులు నిర్వహించగా, 1845లో మెడికల్ కళాశాలలను స్థాపించారు. 1844లో కలకత్తా మెడికల్ కళాశాల నుండి నలుగురు విద్యార్థులు ఐరోపా పంపబడ్డారు. అయితే వృత్తి విద్య సామాన్య జనాన్ని చేరలేదు. కంపెనీ వారు తమ లాభాల్లోనే నిమగ్నమయ్యారు. కాని, ఈ సంస్థలకు కావలసిన నిధులు చేకూర్చలేదు. 1855 నాటికి కంపెనీ ఆధ్వర్యంలో సుమారు 1500 విద్యా సంస్థల్లో 70 వేల మంది విద్యార్థులున్నారు. ఆదాయంలో విద్యపై ఖర్చు ఒక శాతానికి మించలేదు.

వాస్తవానికి ఆంగ్ల విద్యా వ్యాప్తికి, కంపెనీ కన్నా మిషనరీలు, బ్రిటిష్ అధికారులు, అనధికారులు, భారతీయుల్లో కొందరు ఎక్కువగా తోడ్పడినారు. క్రైస్తవ మిషనరీలు మత మార్పిడి ముఖ్య కార్యక్రమంగా పెట్టుకున్నా, సామాన్య ప్రజల్లో, మహిళలల్లో విద్యా వ్యాప్తికి గణనీయమైన కృషి చేసారు. పైగా బెంటింక్ సంస్కరణలు జనామోదాన్ని పొందాయి. మిషనరీల ఆధ్వర్యంలో సుమారు 3500 పాఠశాలల్లో లక్షా ఇరవై వేలమంది విద్యార్థులు చదివేవారు. అంతేకాక ఆంగ్లేయాధికారులు, అనధికారులు, కూడా ఎన్నో విద్యా సంస్థలను ప్రోత్సాహించారు. డేవిడ్ హేర్ (David Hare) ఈ రంగంలో మార్గదర్శిగా చెప్పవచ్చును. "చదువంటే ఇష్టముండి అంతగా చదువురానివాడననీ' చెప్పుకున్న హేర్ 1815 నుండి తన జీవిత కాలాన్ని భారతదేశంలో విద్యా వ్యాప్తికై వినియోగించాడు. భారతదేశం వనరులు అపారమని, ఉత్పత్తులు విస్తారమని, భారతీయులు తెలివిగలవారు, కష్టపడగలరు, ప్రపంచ నాగరికతల్లోని ఏ ప్రజలకు విజ్ఞానంలో తీసిపోరని హేర్ ప్రకటించాడు. అంతేకాక వారి వేదాంతం, పాండిత్యం తరతరాల పీడన వల్ల, దుష్పాలన వల్ల క్షీణించదని, వారిని తిరిగి అభివృద్ధి చేయడానికి ఆంగ్ల విద్య, విజ్ఞానం తప్పనిసరి అని భావించాడు. ఆర్ఫూలీలో ప్రాథమిక పాఠశాల స్థాపన మొదలుకొని, నేటి కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాల స్థాపన వరకు అతని కృషి శ్లాఘనీయం. అలాగే బెథూన్ (Bethane) వారన్ హేస్టింగ్స్, ఎలిఫిన్‌స్టన్, డల్‌హౌసీ, మొదలైనవారు తమ ఆదాయం నుండి నిధులు ఖర్చుపెట్టి కళాశాలను స్థాపించారు. దాన్ని ఆదర్శంగా తీసుకొని కొందరు స్వదేశీయులు, కొన్ని స్వదేశీ సంస్థలు విద్యా వ్యాప్తికి కృషి చేసారు. వారికి రాజా రామ్‌మోహన్ రాయ్ ఆధ్యుడు.

## 6.5 1854 ఉడ్స్ డిశ్పాచ్ (1854 Woods Despatch)

పైన చెప్పబడిన సంస్థల ఇతోధిక కృషివల్ల భారతీయ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులకు రంగం సిద్ధమైంది. అయితే ఆంగ్ల భాషా వాదులకు, ప్రాచ్య భాషా వాదులకు మధ్య వివాదాలకు పూర్తిగా తెరపడలేదు.

ప్రాచ్య భాషల పట్ల మెకాలె కున్న నిరసన భావం ఉన్నత కులాలకు నచ్చలేదు. ఐరోపా విజ్ఞాన గ్రంథాల అనువాదంతో, ప్రాంతీయ భాషలు కూడ వృద్ధి చెందాయి. చాలమంది విద్యార్థులకు ఆంగ్ల భాషలో విద్యనభ్యసించడానికి వలసిన వనరులు, ప్రతిభ కొరవడ్డాయి. ఈ పరిస్థితుల్లో భిన్న దృక్పథాలను సమన్వయ పరుస్తూ, లక్ష్యాలను నిర్దేశిస్తూ, ఒక విద్యా విధానాన్ని రూపకల్పన చేయవలసిన అవసరమేర్పడింది. విద్యలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పడం, ఆ విద్యనభ్యసించి, దానివల్ల ప్రయోజనం పొందుతున్న వారిలో నీతితో కూడిన పరిణితిని సాధించడం, పెరుగుతున్న పాలనా వ్యవస్థ అవసరాలకు పనికివచ్చే వారిని తయారు చేయడం లక్ష్యాలుగా చెప్పబడ్డాయి. భారతదేశంలో ఐరోపా విద్యా విధానం వల్ల ఆంగ్లేయుల ఆర్థిక ప్రయోజనాలకెట్టి విఘాతం రాకూడదు. ఆ విద్య భారతీయులకు శ్రమ, పెట్టుబడి, వినియోగంవల్ల వచ్చే ఫలితాలను తెలియపర్చి, తమ దేశ వనరుల అభివృద్ధి కృషిలో ఆంగ్లేయులను ఆదర్శంగా తీసుకొనేటట్లు, క్రమేణా అభివృద్ధి చెందే సంపద వ్యాపారాల్లో భాగస్వామ్యం పొందునట్లుగా ఉండాలి. అంతేగాక ఆంగ్లేయులకవసరమైన ఉత్పత్తులకు కావలసిన వనరులను, వస్తువులను, పెద్ద యెత్తున సమకూర్చడానికి తోడ్పడాలి. ఈ లక్ష్యాలను సాధించడానికి 1854లో ప్రభుత్వం 'ఉడ్స్ ఎడ్యుకేషన్ డిశ్పాచ్ (Wood Education Despatch) అనే అధికార ప్రకటన చేసింది. ఇది ఒక సమగ్రమైన విధాన ప్రకటన. భారతదేశంలో ఆంగ్ల విద్యా వ్యాప్తికి, నూతన విద్యా విధానానికి పునాది రాయిగా భావింపబడింది. దీనిని "భారతీయ నూతన విద్యా విధాన మాగ్నకార్టా'' (Magnacarta of Modern Indian Education) అని పిలిచారు.

## 6.5.1 ముఖ్యాంశాలు

"పాలిత ప్రజలకు చదువుకొనే హక్కు కల్పించడం మన పవిత్ర ధర్మం" అని ఇందులో ప్రకటించడమైనది. ఒకవైపు ప్రాచ్య విద్యా బోధనను ప్రశంసిస్తూ, మరోవైపున బోధనా భాషగా ఇంగ్లీష్ మాత్రమే ఉండితీరాలని స్పష్టం చేయబడింది. నూతన విద్యా విధానంలో ఐరోపా విజ్ఞాన శాస్త్రం, కళలు, సాహిత్యం, వేదాంతం, అభివృద్ధి తప్పనిసరి. కాబట్టి వాటిని ఆంగ్లం నేర్చుకొన్నవారికి మాత్రమే చెప్పటానికి వీలౌతుంది. ఈ విజ్ఞానాన్ని ఉన్నత స్థాయిలో ఆంగ్లంలో, సామాన్య ప్రజలకు ప్రాంతీయ భాషలో అందుబాటులోనికి తీసుకురావాలి. దీని కొరకు ఒక సాధారణ పర్యవేక్షక వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పాలి. పనిలో సమర్థతకు, సమరూపతకిది అవసరం. ఈ లక్ష్య సాధనకై విద్యను బోధించే అన్ని సంస్థలతో ఒక సమగ్రమైన వ్యవస్థను రూపొందించారు. ఉన్నత విద్యలో బోధనా భాష ఆంగ్లం కావడం, ఉద్యోగాలకు ఆ భాషావగాహన తప్పనిసరి కావటం, విద్య పెరిగిన కొద్దీ ఆంగ్ల భాషావసరం మరింత పెరగటంతో, ఆ భాషాభివృద్ధి నిరాటంకంగా, నిరంతరంగా సాగింది.

'ఉడ్స్ డిశ్పాచ్'లో మరో ముఖ్యాంశం. విద్యా వ్యవస్థను స్పష్టంగా ప్రభుత్వ శాఖలుగా రూపొందించడం. బెంగాల్, మద్రాస్, బొంబాయి, పశ్చిమోత్తర రాష్ట్రాలు, పంజాబ్‌లకు విడివిడిగా విద్యా శాఖలు నెలకొల్పబడ్డాయి. ప్రతి విద్యాశాఖకు ఒక డైరక్టరుంటాడు. ఆ శాఖను 'డిపార్టుమెంట్ ఆఫ్ పబ్లిక్ ఇనస్ట్రక్షన్' (Department of Public Instruction) అని పిలుస్తారు. ఈ శాఖలకు రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వాలు నిధులను కేటాయిస్తాయి. ఈ శాఖ ప్రభుత్వ సాయం కోరిన ప్రైవేట్ విద్యా సంస్థలను కూడ పర్యవేక్షించగలదు. విద్యాభివృద్ధికి సంబంధించిన వార్షిక నివేదికలను, ప్రణాళికలను ఈశాఖ తయారుచేస్తుంది. ప్రస్తుతమున్న విద్యా సంస్థల సంఖ్యను పెంచాలి. మత ప్రమేయంలేని సంస్థలకే ప్రభుత్వం సాయం చేయాలి. విద్యార్థులకు సకార వేతనాలు ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టాలి. స్త్రీ విద్యను ప్రభుత్వం ప్రోత్సహించాలి అని కూడా చెప్పబడింది.

ఈ 'డిశ్పాచ్'లోని మరో ముఖ్యాంశం విశ్వ విద్యాలయాల స్థాపన. లండన్ విశ్వ విద్యాలయాల నమూనాలో కలకత్తా, బొంబాయి మద్రాస్‌లో విశ్వవిద్యాలయాలు స్థాపించాలని సిఫారస్ చేసారు. ప్రతి విశ్వ విద్యాలయానికి ఒక ఛాన్స్‌లర్, వైస్ ఛాన్స్‌లర్, సెనేట్ ఉండాలి. సెనేట్ విశ్వవిద్యాలయ నిబంధనలను

BRAOU

రూపొందించడం, నిధులను సక్రమంగా వినియోగించడం, పరీక్షలు జరుపడం మొదలైన విధులను నిర్వహించాలి. ముఖ్యమైన శాఖల్లో ఆచార్య పదవులుండాలి. అనుబంధ కళాశాలల మధ్య విద్యా పోటీ ఉండాలని, వాటిపై పర్యవేక్షణ ఉండాలని చెప్పారు.

## 6.6 విశ్వవిద్యాలయాల ఏర్పాటు

ఉడ్స్ డిస్పాచ్ కనుగుణంగా, 1857 కలకత్తా, బొంబాయి, మద్రాస్ నగరాల్లో విశ్వ విద్యాలయాలు నెలకొల్పబడ్డాయి. స్థానిక అవసరాల కనుగుణంగా చిన్న మార్పులున్నా, అవి అన్నీ ఒకే తీరులో పనిచేసేవి. ఇక్కడ బోధనా శాఖలుండేవి కావు. విశ్వవిద్యాలయాలకనుబంధంగా ఉన్న కళాశాల్లోనే బోధన జరిగేది. కళాశాలల పర్యవేక్షణ, పరీక్షల నిర్వహణ, డిగ్రీల ప్రధానం. విశ్వవిద్యాలయాలు చేసేవి. ఆర్ట్సు, సైన్సు, లా, మెడిసన్, ఇంజనీరింగ్, నాలుగు ప్రత్యేక బోధన శాఖలుండేవి. కొంతకాలం తరువాత ఆర్ట్సు, సైన్సును వేరుచేసారు. సాంకేతిక కళాశాలలు తక్కువగా ఉండేవి. 1857 నాటికి రూర్కీ ఇంజనీరింగ్ కళాశాల, కలకత్తా సివిల్ ఇంజనీరింగ్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. 1858లో పూనా ఇంజనీరింగ్ కళాశాల, గిండీ ఇంజనీరింగ్ కళాశాలలేర్పడ్డాయి. కలకాత్తా, బొంబాయి, మద్రాస్, లాహోరుల్లో వైద్య కళాశాలున్నాయి. ఆతరువాత కాలంలో కళాశాల సంఖ్య బాగా పెరిగి, 1882లో పంజాబ్ విశ్వవిద్యాలయం, 1887లో అలహాబాద్ విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి.

## 6.7 హంటర్ కమీషన్ 1882 (Hunter Commission 1882)

1854 తరువాత కళాశాల స్థాపన ముమ్మరంగా సాగినా, కొద్దికాలం తరువాత అభివృద్ధి కుంటుపడింది. దీనిని సరి చేసి, విద్యాభివృద్ధిని త్వరితగతిని సాధించడానికి 1882లో రిప్పన్, హంటర్ అధ్యక్షతన ఒక విద్యా సంఘాన్ని నియమించాడు. ఎన్నో చర్చలు, సమావేశాలు జరిపిన ఈ సంఘం పెక్కు సిఫారసులను చేసింది. వాటిలో ముఖ్యమైనవి

...తీసుకోవాలి. విద్యకు భంగం రాదని

...ంచాలి.

BRAOU

## 6.8 లార్డ్ కర్జన్ కాలంలో విద్యా ప్రగతి

విద్యా విధానంలో మార్పులు తీసుకురావటానికి కర్జన్ (curzon) శ్రద్ధ చూపించాడు. విద్య నిర్వహణను కేంద్రీకృతం చేయాలని తలచి, విద్యా శాఖను పూర్తిగా రాజ్య పర్యవేక్షణ క్రిందకు తీసుకువచ్చి, విద్యా విధానాన్ని క్రమబద్ధీకరించాలని ఆశించాడు. ఉన్నత విద్య సమస్యలను చర్చించేందుకు 1901లో కర్జన్ భారతీయ విద్యా వేత్తల పరిపాలన ఉద్యోగుల సమావేశాన్ని ఏర్పాటు చేసాడు. 1902లో విశ్వ విద్యాలయాల పరిస్థితిని భవిష్యత్తు అవకాశాలను పరిశీలించడానికి 'రాలీ' (Raleigh) అధ్యక్షతన సంఘాన్ని నియమించాడు. ఆ సంఘం కింది సిఫారసులను చేసింది.

1. విశ్వ విద్యాలయాలకు లీగల్ అధికారాలను పెంచాలి, వాటిని బోధనా వ్యవస్థలుగా గుర్తించాలి.
2. విశ్వ విద్యాలయాల అధికారాలను, అవధులను నిర్దిష్టంగా నిర్వచించాలి.
3. సెనేట్‌లు, సిండికేట్లు, ఫాకల్టీలకు గుర్తింపు ఇచ్చి, వాటికి విస్తృత ప్రాతినిధ్యం కల్పించాలి.
4. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు నిర్దేశించిన ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలి. అపుడు మాత్రం అవి అనుబంధ కళాశాలలుగా గుర్తింపబడతాయి. వాటి పనితీరు విద్యా ప్రమాణాలను సిండికేట్ తరుచూ పర్యవేక్షించి తృప్తి చెందాలి.
5. ప్రతి కళాశాలకు పద్ధతి ప్రకారం ఏర్పర్చిన యాజమాన్యముండాలి.
6. విద్యార్థుల క్రమశిక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
7. బోధనాంశాలను, పరీక్షల పద్దతిని ఈ రిపోర్టు సిఫారసుల మేరకే మార్పు చేయాలి.

ఈ సిఫారసులను ప్రభుత్వం ఆమోదించి 190

ఈ చట్టంలో

BRAOU

...లి ముఖ్యమైన...

1. ఉన్నత విద్యా సంస్థల ప్రత్యక్ష నిర్వహణనుండి ప్రభుత్వం క్రమేణా ... తోచిన చోట, సెకండరీ పాఠశాల లేదా కళాశాల యాజమాన్యాన్ని భారతీయులకే అప్పగించా...

2. కళాశాలలకు మామూలు గ్రాంట్లతోపాటు, ప్రత్యేక గ్రాంట్లు మంజూరు చేయాలి. వసూలు చేసే ఫీజులను క్రమబద్ధం చేయాలి. రాయితీలకు కూడా పద్ధతి ఉండాలి.

3. ఎక్కువ కళాశాలల్లో భిన్నమైన కోర్సులు ప్రవేశపెట్టాలి. స్కాలర్‌షిప్పులకు కొత్త నిబంధనలు రూపొందించాలి.

4. ప్రతి కళాశాల ప్రిన్సిపాల్ లేదా ప్రొఫెసర్ ప్రతి క్లాస్‌లోను వ్యక్తిగ, పౌరునిగా నిర్వహించవలసిన విధులపై ఉపన్యాసమివ్వాలి.

5. ముసల్మానుల్లో విద్యా వ్యాప్తికి ప్రత్యేక కృషి జరగాలి.

6. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన శిక్షణపై శ్రద్ధ వహించాలి.

7. ప్రాథమిక విద్యకు మరింత ప్రాధాన్యమివ్వాలి. రాష్ట్ర ఆదాయంలో కొంత శాతం దానికి కేటాయించి, విద్యా శాఖాధికారులచే తనిఖీ చేయించాలి.

8. సెకండరీ పాఠశాలల యాజమాన్యాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలి. ప్రైమరీ విద్య నిర్వహణను రాష్ట్రం, జిల్లాబోర్డులు, పురపాలక సంఘాలు చేపట్టాలి.

ఈ సూచనలను ప్రభుత్వం ఆమోదించింది. విద్యాభివృద్ధి వార్షిక నివేదికలను రూపొందించాలని సంకల్పించారు. 1882 నుండి విశ్వ విద్యాలయాలపై శ్రద్ధ ఎక్కువై, సెకండరీ విద్య సన్నగిల్లింది.

BRAOU

..., 1904 యూనివర్సిటీ చట్టంలో పొందుపరచారు.

...ట్టం విశ్వ విద్యాలయ యాజమాన్య సంస్థల్లో కొన్ని మార్పులను చేసారు. విద్యాలయ సెనేట్ సభ్యుల సంఖ్య 20 నుండి 100 మధ్యనుండాలని, ఎన్నికయ్యే సభ్యులు కనీసం 20 మంది ఉండాలి. సెనేట్, సిండికేట్లలో విద్యాలయ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయుడు ప్రాతినిధ్యముండాలని చెప్పబడింది. కళాశాలలను అనుబంధం చేసే షరతులను నిర్దిష్టంగా రూపొందించారు. ఆచార్యులు, అధ్యాపకుల నియమాకాలు చేసి బోధన, పరిశోధనా రంగాలను నడపడానికి విద్యాలయాలనుమతింపబడ్డాయి. వివిధ విశ్వవిద్యాలయాల అధికార పరిధిని నిర్ణయించే హక్కు గవర్నర్ జనరల్‌కు, అతని కౌన్సిలర్లకు ఇవ్వబడింది.

1904 చట్టం ద్వారా కర్జన్ విశ్వవిద్యాలయాలను ప్రభుత్వ పాలన క్రిందకు తీసుకవచ్చాడని. ఈ ఉన్నత విద్యా సంస్థల్లో వికసిస్తున్న జాతీయ వాదాన్ని ఇదొక ప్రయత్నమని గోపాలకృష్ణ గోఖలే, మరికొందరు జాతీయ నాయకులు విమర్శించారు. ఈచట్టంవల్ల విశ్వ విద్యాలయాల సెనేట్లు, సిండికేట్లు, ఐరోపావారిచే నింపబడి, విద్యాలయాలు ప్రభుత్వ సంస్థలకు మారాయని, ఇది 'కర్జన్' చేసిన నీతిబాహ్యమైన చర్య అని దుయ్యబట్టారు. "ప్రభుత్వ యంత్రాంగంపై ఎనలేని విశ్వాసం కల్గిన గొప్ప నియంత అయిన వైస్రాయి విశ్వవిద్యాలయాలపై నియంత్రణను పటిష్ట పరచడం ఊహించదగినదే. ప్రభుత్వ అనుమతి లేనిదే వాటినుండి ఏమి జరగదు" అని వి. ఛరోల్ (V. Chirol) వ్యాఖ్యానించాడు. ఈ విధానానికి వ్యతిరేకంగా, 1905 నుండి ఉద్యమాలు జరిగాయి. ఫలితంగా 1910లో అంతవరకు హోం శాఖలో భాగంగా ఉన్న విద్యను ప్రత్యేక శాఖగా చేసి, గవర్నర్ జనరల్ కౌన్సిల్ ప్రధమంగా శాఖను చూచుటకు హార్‌కోర్ట్ బట్లర్ (Harcourt Butler) ను నియమించారు.

BRAOU

1913లో బట్లర్ ఉన్నత విద్యను గూర్చి ప్రభుత్వ విధానాన్ని ప్రకటించాడు. విశ్వ విద్యాలయ పరిధి రాష్ట్రానికి పరిమితం కాగలదని చెప్పడంతో, ప్రతి ముఖ్య రాష్ట్రంలోను, విశ్వవిద్యాలయాలు వెలిసాయి. పాట్నా, నాగపూర్, రంగూన్‌లలో అనుబంధ ప్రతిపత్తిగల విశ్వవిద్యాలయాలు, ఆలీగర్, ఢాకా, బెనారస్‌ల్లో బోధనా విశ్వవిద్యాలయాలు, వాగ్దానం చేయబడ్డాయి. మొదటి ప్రపంచ యుద్ధం వల్ల విద్యా ప్రగతికి ఆటంకం కల్గింది. అయినా విద్యపై ఖర్చు పెరిగింది. 1916 - 22 మధ్య ఏడు విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. 1918లో స్థాపించబడిన ఉస్మానియా విశ్వవిద్యాలయం వాటిలో ఒకటి.

## 6.9 1917 సాడ్లర్ కమీషన్ (Sadler commission 1917)

1917లో లార్డు చెల్మ్స్‌ఫోర్డు (Chelmsford) కలకత్తా విశ్వవిద్యాలయ సమస్యలపై ఒక విచారణ సంఘాన్ని 'సాడ్లర్' అధ్యక్షతన నియమించాడు. అయితే ఈ సంఘం ఆ విశ్వవిద్యాలయం విషయాలను పరిశీలించడమేకాక, తదితర విశ్వవిద్యాలయాల ఉన్నత విద్యను కూడా సమీక్షించింది. వాటిమధ్యగల తారతమ్యాలను విశ్లేషించి, కలకత్తా విశ్వ విద్యాలయాభివృద్ధికి చేపట్టదగిన చర్యలను సూచించాలని తలచారు. 1919లో సాడ్లర్ సంఘ నివేదిక విశ్వ విద్యాలయాలిలకే పరిమితం కాక, సెకండరీ విద్యపైకూడా సిఫారసులను చేసింది. వాటిలో ముఖ్యమైనవి.

1. విశ్వవిద్యాలయాల పరిధిలో ఉన్న ఇంటర్మీడియెట్ విద్యను సెకండరీ పాఠశాలలకు బదలాయించాలి. ఈ పరీక్షలో ఉత్తీర్ణత చెందినవారే, విశ్వవిద్యాలయం చేరడానికర్హులు.
2. డిగ్రీ కోర్సు మూడు సంవత్సరాలుండాలి. దీనికి వెంటనే ఆనర్సు కూడా జతపర్చి, మామూలు డిగ్రీకి తరువాత అమలు చేయాలి.
3. కలకత్తాలోని విద్యా వనరులన్నింటినీ సమన్వయపర్చి, కలకత్తా విశ్వవిద్యాలయాన్ని ఉన్నత బోధనా సంస్థగా దిద్దాలి. కళాశాలలనుండి సమర్థులైన అధ్యాపకులను ఎంపిక చేసి, ఇక్కడ బోధించడానికి పంపడమే కాక, విశ్వవిద్యాలయం స్వయంగా ఆచార్యులను, ఉపన్యాసకులను పూర్తి శ్రేణిలో నియమించాలి.
4. కలకత్తా విశ్వవిద్యాలయంతో భారత ప్రభుత్వం ఎట్లాంటి సంబంధం పెట్టుకోరాదు. దాని బదులుగా బెంగాల్ ప్రభుత్వం విశ్వవిద్యాలయంతో సంబంధాలను నెరపాలి.
5. విశ్వవిద్యాలయం వృత్తిపరమైన (ఉపాధ్యాయ శిక్షణ, ఇంజనీరింగ్) విద్యలకు ప్రాధాన్యమివ్వాలి.
6. సెకండరీ, ఇంటర్మీడియెట్ విద్య, బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కింద నిర్వహింపబడాలి.
7. హైస్కూళ్ళ స్థాయి వరకు బోధనా భాషగా ప్రాంతీయ భాష, ఆపైన ఆంగ్ల భాషుండాలి.
8. పరీక్ష విధానం లోపభూయిష్టమైనందున దానిని పూర్తిగా సంస్కరించాలి.
9. విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వ ఉద్యోగ నియామక విధానం సరిపోదు. కాబట్టి వారి ప్రత్యేక సర్వీసును వ్యవస్థీకరించాలి.

ఈ సిఫారసులు ప్రభుత్వంచే ఆమోదింపబడి, చట్టరూపం పొందినా, నిధుల కొరతవల్ల ముందుకు సాగలేదు. 1919లో జాతీయోద్యమ ప్రభావంతో విద్యను 'ట్రాన్స్‌ఫర్డ్ సబ్జక్ట్సు' (Transfered subjects) గా మార్చారు. అంటే విద్య రాష్ట్ర శాసనసభల్లో స్వదేశీ మంత్రుల నిర్వహణలోనికి వచ్చింది. వారు ఎంతో ఉత్సాహంతో ప్రాథమిక విద్యను నిర్బంధం చేసినా, వనరులు లేనందున గవర్నర్లు, రిజర్వుడ్ శాఖలను నిర్వహించే కౌన్సిలర్ల వ్యతిరేకతవల్ల పెద్దగా ఏమి సాధింపలేకపోయారు. అయితేనేమి విద్యా సంస్కరణలు చేయాలనే తలంపుతో ఎన్నో సంఘాలు నియమింపబడ్డాయి. 1924లో జరిగిన సిమ్లా సమావేశంలో 'ఇంటర్ - యూనివర్సిటీ బోర్డును (Inter

University Board) స్థాపించి, దేశమంతటా ఒకే విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రసిద్ధ విద్యావేత్తలు సూచించారు. అంతేకాక విశ్వవిద్యాలయాల మధ్య ఆచార్యుల మార్పిడి, బోధనలో సమన్వయం, డిగ్రీలను ఇతర దేశాల్లో ఆమోదించేటట్లుగా కృషి చేయాలని సిఫారసు చేసారు. 1927లో నియమింపబడిన 'హర్టోగ్' (Hartog) సంఘం పాఠశాలల్లో, కళాశాలల్లో వాడవలసిన పాఠ్య పుస్తకాలపై సూచన చేసింది. విద్యా ప్రమాణాలు తగ్గిపోతున్నాయని, విద్యలో వృద్ధాప్యం జరుగుతుందని ప్రమాణాలులేని పాఠశాలలను మూసివేసి, మంచి పాఠశాలలను ప్రోత్సహించాలని చెప్పారు. వారి సూచనల మేరకు 1935లో 'సెంట్రల్ ఎడ్యుకేషన్ ఎడ్వైజరీ బోర్డు' (Central Educational advisory Board) స్థాపించబడింది. మన దేశంలోని విద్యా సమస్యలను అధ్యయనం చేయడానికి ఇంగ్లాండ్ నుండి 'అబ్బట్' (Abbot) 'ఉడ్' (Wood) లను పిలిచింది. వీరుచేసిన సిఫారసులు అమలుకాకముందే, రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. వారి సిఫారసులు చాలవరకు తరువాత వచ్చిన 'సార్జంట్' (Sargent) నివేదికలో చోటుచేసుకున్నాయి. 1935లో "గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టం' (Gogernment of India Act) ప్రకారం విద్య పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాధీనం చేయబడింది.

## 6.10 వార్ధా విద్యా విధాన ప్రణాళిక

నాటి విద్యా విధానం లోపభూయిష్టమైందని మహాత్మా గాంధీ భావించాడు. విద్యాసాధన వ్యయంతో కూడినదే కాక, బాలబాలికలు నివసిస్తున్న వాస్తవిక వాతావరణానికి దూరమైంది. దీన్ని సరిదిద్దటానికి మహాత్మా గాంధీ వార్ధాలో 1937 అక్టోబర్ నెలలో సమావేశం ఏర్పర్చాడు. దానిలో సుప్రసిద్ధ విద్యావేత్తలు, సాంఘిక సంస్కర్తలు, జాతీయ నాయకులు, రాష్ట్ర విద్యామంత్రులు పాల్గొన్నారు. విద్యా విషయాలను ఆమూలాగ్రంగా పరిశీలించి, భారతీయుల ప్రయోజనాలకనుగుణమైన ఒక విద్యా విధానాన్ని ప్రకటించారు. దీనికి వార్ధా విద్యా విధానమని, బేసిక్ విద్యా పద్ధతి అని వ్యవహరిస్తారు. ఈ విద్యా విధానంలో విద్యార్థి మానసిక విజ్ఞానాభివృద్ధితోపాటు, నైతిక ప్రవర్తనకు, విద్యార్జనతోపాటు బ్రతుకు తెరువు చూసుకోటానికి అవకాశాన్ని కల్పిస్తుంది. చదువుకొనే సమయంలోనే ఏదో ఒక వృత్తి విద్య ద్వారా జీవన భృతి సంపాదించుకొనవచ్చు. ఆర్థికంగా స్వయం పోషణ కల్గిన ఈ విద్యా విధానంలో, ప్రాథమిక విద్య ఏడేళ్ళపాటు నిర్బంధంగా ప్రవేశపెట్టాలని సూచించారు. అయితే రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో, రాష్ట్రంలో ఎన్నుకోబడిన కాంగ్రెస్ మంత్రులు రాజీనామా చేయడంతో, ఈ ప్రణాళిక ముందుకు సాగలేదు.

## 6.11 సార్జెంట్ నివేదిక (Sargent Scheme of Education)

భారతదేశ ప్రభుత్వ విద్యా సలహాదారుడైన 'సార్జంట్' అధ్యక్షతన నియమింపబడిన సంఘం 1944లో తన నివేదికను ప్రకటించింది. ఈ విధానం యుద్ధానంతరం ప్రవేశపెట్టాలని ఆలోచించారు. సార్జంట్ సంఘం ప్రాథమిక, సెకండరీ, ఉన్నత విద్య పైననే కాక, సాంకేతిక, వ్యాయామ విద్యలపై కూడా సూచనలను చేసింది.

1. 6-14 ఏండ్ల మధ్య బాలబాలికలకు ఉచిత నిర్బంద విద్య నేర్పాలి. దీనివల్ల 200 కోట్లు రూపాయలు ఖర్చుకాగలవు.

2. బేసిక్ విద్యా విధానాన్ని రెండు భాగాలుగా చేసి, 6-11 ఏండ్ల మధ్య మొదటి భాగాన్ని నేర్పాలి. అందరు విద్యార్థులు హైస్కూల్ ప్రవేశానికర్హులు కారు. బేసిక్ విద్యలో ప్రతిభ చూపి, చదువువల్ల లాభం పొందగలరని భావించిన వారికి అర్హత కల్పించాలి.

3. కళాశాల ప్రవేశం హైస్కూలు విద్యార్థుల్లో ప్రతిభ కల్గిన పది శాతానికే పరిమితం చేయాలి. 'ఇంటర్మీడియట్' విద్యను హైస్కూల్ విద్యతో జత పరిచారు. డిగ్రీ కనీసం మూడేళ్ళ పాటుండాలి. అత్యంత ప్రతిభ కల్గిన విద్యార్థులను మాత్రమే పరిశోధనా వ్యాసంగానికి అనుమతించాలి.

BRAOU

4. యువకులకు వ్యాయామ విద్య ప్రాధాన్యతను తెలియచేసే ఉద్యమాన్ని ప్రారంభించాలి.

5. బోధనలో, పరీక్షా పద్ధతిలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడానికి విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘాన్ని నియమించి, అధ్యాపకుల జీతాలను పెంచి, ప్రతిభగలవారిని ఆకర్షించేటట్లుగా చర్యలను తీసుకోవాలి.

ఈ సంఘ సూచనలు ప్రభుత్వం ఆమోదించి ఆచరింక ముందే, 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆ తరువాత స్వేచ్ఛా భారతం విద్యా విధానంపై డా॥ రాధకృష్ణన్, కొఠారి వంటి ప్రసిద్ధ విద్యావేత్తలతో సంఘాలను నియమించడం జరిగింది. ఈ సంఘాల నివేదికలకనుగుణంగా, విద్యావిధానంలో పెక్కు మార్పులను చేయడం జరిగింది. 1953లో విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం (Univesity Grants Commission) ను నెలకొల్పారు. 1955లో ఈ సంఘానికి చట్టబద్ధత ఏర్పడింది. స్వతంత్ర భారతంలో విశ్వ విద్యాలయాల సంఖ్య, విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. సాంకేతిక, శాస్త్ర విజ్ఞానంలో భారతదేశం అభివృద్ధి చెందిన దేశాలకు గట్టి పోటీనిస్తుంది. అయినా ఇంకా వనరుల లోపం, ప్రమాణాల క్షీణత, విద్యార్థుల అధ్యాపకుల అశాంతి ఈ రంగాన్ని కలవరపరుస్తోంది. విద్యారంగంలో ఇంకా ఎంతో కృషి సలపవలసిన అవసరముంది.

## 6.12 సంగ్రహంగా

ఖండం II మూడో భాగంలో 18వ శతాబ్దపు విద్యా వ్యవస్థ వివరింపబడగా, ఈ భాగంలో ఆంగ్లేయుల రాకవల్ల విద్యా విధానంలో వచ్చిన మార్పులు, ప్రముఖంగా ఆంగ్ల భాష బోధనా భాషగా మారడం, నూతన విద్యా విధానానికి కావలసిన వనరులు, తదితర విషయాలపై నియమింపబడిన కమిటీల సిఫారసులు వివరించడమైనది. అంతేకాక విద్యా వ్యవస్థలో మౌలికమైన మార్పులు రావడం కూడా విశేషం. ఆధునిక విద్యకు అంకురార్పణ జరగడం వివరించడమైంది.

B R A O U

## 6.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి

1. బోధనా భాష వివాదాన్ని చర్చించి, ఆంగ్ల భాష బోధనా భాషగా ఏ మార్పులు తీసుకువచ్చిందో వివరించండి.
2. ఆంగ్లేయ పాలనలో విద్యా విధానం మార్పులకై నియమింపబడిన ప్రముఖ సంఘాలను, వాటి సిఫారసులను వివరించండి

II క్రింది వాటిపై లఘువ్యాఖ్యలు రాయండి

1. ఉడ్స్ డిస్పాచ్ 2. హంటర్ కమీషన్ 3. సాడ్లర్ కమీషన్ 4. వార్ధా విద్యా ప్రణాళిక.

## 6.14 ఉపయుక్త గ్రంథాలు


Bharatiya Vidya Bhavan — **British Paramountacy and Indian Renaissance**

Bipin Chandra — **Modern India**

Keay F.E., Sukumar Mitra — **A History of Education in India**

Naik J.P. — **Education in India**


రచయిత : శ్రీ ఎ.వి. కోటిరెడ్డి

Dr. BRAOU LIBRARY Acc. No. 115060 Class No. 954 CHE

# భాగం - 7 : పత్రికా రంగం ప్రగతి

విషయ క్రమం


7.0 లక్ష్యాలు
7.1 పరిచయం
7.2 వార్తా పత్రికలు, ఆవిర్భావం
7.3 భారతదేశంలో ఆంగ్లేయ పత్రికలు
7.3.1 హికీ ఉదంతం
7.4 తొలి వార్తా పత్రికలు
7.5 సెన్సార్‌షిప్ ప్రవేశం
7.6 పత్రికలు – భారతదేశ ప్రయోజనాలు
7.6.1 పత్రికా స్వేచ్ఛ
7.6.2 దేశీయ పత్రికా రంగ ఆవిర్భావం
7.6.3 పత్రికలపై ఆంక్షలు
7.7 వర్నాక్యులర్ ప్రెస్ ఆక్టు (Vermacular Press Act)
7.7.1 1908 పత్రికా చట్టం
7.7.2 1910 చట్టం
7.7.3 ది ఇండియా ప్రెస్ ఏక్ట్ (The India Press Act)
7.8 స్వాతంత్ర్యానంతర సమీక్ష
7.8.1 ప్రెస్ లాస్ ఎంక్వైరీ కమిటీ (Press Laws Enquiry Committee)
7.8.2 ప్రెస్ కమీషన్ (Press Commission)
7.9 సంగ్రహంగా
7.10 పరీక్ష నమూనా ప్రశ్నలు
7.11 ఉపయుక్త గ్రంథాలు


## 7.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగల్గాలి.

- భారతదేశంలో వార్తా పత్రికల ఆవిర్భావం, పరిణామం
- భారతదేశ వార్తా పత్రికలపై ఆంగ్లేయులు విధించిన నిబంధనలు
- దేశీయ పత్రికల ఆవిర్భావంతో వచ్చిన మార్పులు
- భారతదేశంలో పత్రిక స్వేచ్ఛకై పోరాటం
- పత్రికలకు సంబంధించిన వివిధ శాసనాలు

## 7.1 పరిచయం

వార్తలు తెలుసుకోవడం అనాదిగా మానవ సంస్కృతిలో ఒక భాగం. 'న్యూస్' 'News' అనే ఆంగ్ల పదం మన దేశంలో ప్రతివారు, ప్రతిచోట వాడుతూనే ఉంటారు. North, East, West, South లలో మొదటి అక్షరాలను

BRAOU

కలిపి News అనే పదం ఏర్పడిందని కొందరు చెబితే, మరి కొందరు New (కొత్త) అనే పదానికి 'S' చేర్చితే News అయిందని అంటారు. మధ్య యుగం నాటి 'నోవా' ('Nova') నుండి ఈ ఆంగ్ల పదం వచ్చిందని భావిస్తారు. 'వార్తలు' పురాతనమైనవే అయినా, వార్తా పత్రికలు మాత్రం ఆధునిక యుగంలో ఆవిర్భవించినవే. ప్రాచీన రోమన్ సామ్రాజ్య కాలంలో రాజధానికి దూరంగా ఉన్న రాజ ప్రతినిధులకు కబుర్లు పంపటానికి వార్తలు రాసేవారు ప్రత్యేకంగా ఉండేవారు. అచ్చు యంత్రం వచ్చిన తరువాత, తమ శాసనాలను కరపత్రాల ద్వారా తెలియజేసేవారు. 17వ శతాబ్దపు ప్రారంభంలో, ఐరోపాలో ముఖ్యంగా జర్మనీ, ఆస్ట్రియా, ఇటలీ, నెదర్లాండ్ రాజ్యాల్లో ఇంచుమించు వార్తా పత్రికలనదగినవి ప్రచారంలోనికి వచ్చాయి.

భారతదేశంలో వార్తలను వేగులు, రహస్య సమాచారాన్ని, పన్నుల వసూళ్ళను మొదలైన వివరాలను తమ తమ శాఖలకు ప్రత్యేక లేఖల ద్వారా తెలియ జేసేవారు. మొగలుల కాలంలో వార్తలు లేఖల ద్వారా తెలియజేయడం బాగా అభివృద్ధి చెందింది. వార్తలు రాసేవారి ఒక ప్రత్యేక పాలనా వ్యవస్థ ఏర్పడింది. ఈ వ్యవస్థను రాజు స్వయంగా పర్యవేక్షించి, వార్తా లేఖకుల సమాచారాన్ని పరిశీలించేవాడు. మొగలుల కొలువుకు చెందిన లిఖిత వార్తా పత్రికలను 1828లో 'జేమ్స్ టాడ్' (James Todd) లండన్‌లోని 'రాయల్ ఏషియాటిక్ సొసైటీ' (Royal Asiatic Society) కు పంపాడు. ఈస్టిండియా కంపెనీ స్థాపించబడిన పిదప వారుకూడా తమ కష్టాలను స్థానిక రాజులకు ఈ వార్తా లేఖకుల ద్వారా తెలియజేసి, దేశ సమాచారాన్ని కూడా ఆ లేఖల ద్వారా రాబట్టుకొనేవారు. 17వ శతాబ్దపు ఈ వార్తా లేఖనాలు 18వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో వార్తా పత్రికలుగా రూపొందాయి.

## 7.2 వార్తా పత్రికల ఆవిర్భావం

ఈ రోజు మనం చెప్పుకొంటున్న వార్తా పత్రికలు ఐరోపా వారు రాకముందు మనదేశంలో లేవని చెప్పవచ్చును. 'వకియా' (Waquiah) అనే వార్తా మాధ్యమం మాత్రం ఉండేది. ఇది నాటి ముఖ్యమైన చారిత్రక విశేషాలను నమోదు చేసేది. వార్తా పత్రికలు కాని, విలేఖరులుగాని లేరు. ప్లాసీ యుద్ధం, మూడో పానిపట్టు యుద్ధం మొదలైన ముఖ్య ఘట్టాలు కూడా అవి ముగిసిన తరువాతనే తెలియ వచ్చాయి. వార్తలు సామాన్య ప్రజలకందుబాటులో లేవు. ప్రజలకు వాస్తవాలను వివరించే వార్తా పత్రికలుంటే, ఆంగ్లేయ పాలనవల్ల ఆర్థిక మార్పులు వచ్చి పెట్టుబడిదారీ విధానంలో తమ ప్రయోజనాలు దెబ్బతినగలవని, గ్రామీణ రైతులు కొంతవరకైనా ఆంగ్లేయ సామ్రాజ్యవాదాన్ని ఎదురించి ఉండేవారని 'మోహిత్ మిత్రా' (Mohit Mitra) అభిప్రాయపడ్డాడు. వార్తలు చేరవేసే మీడియం లేనందువల్ల, భిన్న ప్రాంతాల్లో వేరువేరు సమయాల్లో తిరుగుబాట్లు వచ్చాయి కాని సంయుక్తంగా ఎట్లాంటి ప్రతిఘటనా రాలేదు. ఈ పరిస్థితులు ఐరోపావారి రాకవరకు కొనసాగి, నేడు మనం చెప్పుకుంటున్న పత్రికా రంగం పాశ్చాత్య ప్రభావంతోనే అంకురించింది.

1550లో భారతదేశానికి వచ్చిన పోర్చుగీస్ వారు రెండు అచ్చు యంత్రాలను తీసుకువచ్చారు. వాటిని పుస్తకాల ముద్రణకే వినియోగించేవారు. వార్తలను ప్రచురిస్తే, తమ ప్రయోజనాలు దెబ్బతినగలవని భావించారు. అయితే భారతదేశం, పాశ్చాత్య దేశాల మధ్య వర్తక వ్యాపారాలు ముమ్మరంగా పెరగడంతో, వర్తక, వాణిజ్య వార్తలు ప్రాధాన్యం పొందాయి. ఇంగ్లాండ్‌లో మరికొన్నిచోట్ల "ఈ వారపు వార్తలు"అనే పేరున వచ్చిన పత్రికల్లో రాజకీయ వార్తల కన్న వ్యాపార వార్తలు ఉండేవి. ఆ రోజుల్లో ఇంగ్లాండ్‌లో రాజుకు, పార్లమెంట్‌కు మధ్య అధికార పోరాటం సాగింది. ఈ సంఘర్షణ కారణంగా, రాజకీయ వార్తలు తెలిపే పత్రికా రంగం సిద్ధమైంది. అది ఆధునిక వార్తా పత్రికలకు మార్గదర్శకమైంది. ఇంగ్లాండ్‌లోని అంతర్యుద్ధ కాలంలో పత్రికా స్వేచ్ఛ విజయం పొందింది. "మిగతా స్వేచ్ఛల కన్నా ముందుగా నాకు విషయాలనే తెలుసుకొని, వాటిని చెప్పడం, అంతరాత్మ సాక్షిగా వాదించే హక్కులివ్వమని" జాన్ మిల్టన్ (John Milton) ఉద్ఘాటించాడు. స్వేచ్ఛ ఆంగ్లేయ ప్రజల విశేషాధికారం అని డ్రైడన్

BRAOU

(Dryden) చెప్పిన మాటలను పార్లమెంట్‌లో 'విల్క్స్ (Wilkes)గర్జించగా, అతనిని పార్లమెంట్ నుండి బర్తరఫ్ చేశారు. ప్రజలు తిరిగి అతన్నే ఎన్నుకొని, ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు. నాటినుండి ఇంగ్లాండ్‌లో వార్తా పత్రికలు, పత్రికా స్వేచ్ఛ మొదలైన విషయాలు ప్రాముఖ్యతను సంతరించుకొన్నాయి. ఈ భావం క్రమేణా ప్రపంచ వ్యాప్తమైంది.

## 7.3 భారతదేశంలో ఆంగ్లేయ పత్రికలు

1784 'పిట్స్ ఇండియా' (Pitts India) చట్టం ఈస్టిండియా కంపెనీ వ్యవహారాలపై ప్రథమంగా బ్రిటిష్ 'పార్లమెంట్ అజమాయిషీని' ప్రవేశపెట్టింది. ఈ చట్టం ప్రకారం ఒక అధ్యక్షుడు, అయిదుగురు ప్రీవీ కౌన్సిలర్లతో (Privy Counsellor)'బోర్డు ఆఫ్ కంట్రోల్' (Board of Control) ఏర్పడింది. దీనిలో ఆర్థిక శాఖ, విదేశాంగ మంత్రులు కూడా సభ్యులు. అంతవరకు ఈస్టిండియా కంపెనీ భారతదేశ వర్తకంలో గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తూ ఉన్నది. దీనిని నిరసించిన కొందరు బ్రిటిష్ వర్తకులు భారతదేశంలో వ్యాపారావకాశాలు అందిరికీ ఉండాలని తలచి, ఈ ప్రచారానికి, బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావటానికి ఒక పత్రిక అవసరమని భావించారు. కంపెనీ అధికారులు గుత్త వ్యాపారం ద్వారా బాగా బలపడ్డారు. వారి సంపద ఆంగ్లేయ ప్రభుత్వ అధికారులకు కూడా అసూయను కల్గించింది. వారు కూడా కంపెనీ వ్యాపారంలో ఆంగ్లేయులందరికీ అవకాశం ఉండాలని వాదించారు.

### 7.3.1 హికీ (Hickey) ఉదంతం

1766లో కంపెనీచే బర్తరఫ్ చేయబడిన 'విలియం బోల్ట్స్' (William Bolts) కలకత్తాలో ఒక అచ్చు యంత్రం స్థాపన ఆవశ్యకమని భావించాడు. కాని అతని ప్రయత్నం ఫలించ లేదు. 1780లో 'జేమ్స్ ఆగస్టస్ హికీ' (James Augustus Hickey) అనే ఆంగ్లేయుడు ఆస్తి సంపాదించాలని భారతదేశం వస్తే అదృష్టం కలిసి రాలేదు. దానితో 'ది బెంగాల్ గెజిట్' (The Bengal Gazette) అనే వారపత్రికను ప్రారంభించి "... ... కష్టపడి పనిచేసే బానిసత్వ జీవితానికి నేను పెరగలేదు. కాని నా ఆలోచనకు, ఆత్మ స్వేచ్ఛను సంపాదించడం కోసం దేహాన్ని బానినగా మార్చగలను" అని పలికిన 'హికీ అధికారంలో ఉన్న వారికి వ్యతిరేకంగా వార్తలు ప్రచురించాడు. ఈ పత్రిక నాటి గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్‌ను, అతని విధానాలను తీవ్రంగా విమర్శించింది. హేస్టింగ్స్ అతన్ని జైలులో నిర్బంధించటంతో, 1782లో పత్రికా ప్రచురణ నిలిచిపోయింది. "పత్రికా స్వేచ్ఛ, ఇంగ్లీష్‌వారి మనుగడకు, స్వేచ్ఛా ప్రభుత్వానికి ముఖ్యమని, ప్రజలకు తమ సిద్ధాంతాల, అభిప్రాయాల ప్రకటనకు పూర్తి స్వేచ్ఛ ఉండాలని, అటువంటి స్వేచ్ఛను అణచడం నిరంకుశత్వం, సామాజిక వ్యవస్థకు అపకారి కాగలదని" ప్రకటించిన హికీ పత్రికా స్వేచ్ఛ ప్రభుత్వ అధికార సంఘర్షణకు ఆద్యుడైనాడు. సుప్రీంకోర్టు హికీకి రెండేండ్లు కారాగార శిక్షను విధిస్తూ, పరువు నష్టం క్రింద హేస్టింగ్స్‌కు అయిదువేల రూపాయలు చెల్లించవలెనని తీర్పునిచ్చింది. ఎన్నో కష్టనష్టాలకు గురై, ఆరోగ్యం కోల్పోయి దుర్భర జీవితం గడిపిన హికీ భారతీయ వార్తా పత్రికల పితామహునిగా పత్రికా స్వేచ్ఛ ప్రచారక మార్గదర్శిగా నిలిచిపోయాడు.

## 7.4 తొలి వార్తా పత్రికలు

హికీ ఉదంతానంతరం, ఎందరో వార్తా పత్రికలు స్థాపించి, డబ్బు చేసుకొనవలెననీ ఆశించారు. హికీకి పోటీగా 'మెసింక్ (Messink) 'ఇండియా గెజిట్' అనే వార్తా పత్రికను స్థాపించి, హేస్టింగ్స్ మెప్పును పొందాడు. 1784లో ప్రభుత్వమే 'కలకత్తా గెజిట్' (Calcutta Gazette) ప్రచురణను ప్రారంభించింది. 1785లో 'ఓరియంటల్

B R A O U

మేగజైన్' (Oriental Magazine) 1786లో 'కలకత్తా క్రానికల్' (Calcutta Chronical) ప్రారంభమయ్యాయి. 1785లో మద్రాస్‌లో 'రిచర్డ్ జాన్‌సన్' (Richard Jhonson) అనే ప్రభుత్వ ముద్రణోద్యోగి ప్రయత్న ఫలితంగా, 'మద్రాస్ కొరియర్' (Madras Courier) అనే పత్రిక వచ్చింది. అయితే ఈ దినపత్రికలు తరచూ ప్రభుత్వ వేధింపులకు గురి అయ్యాయి. 1791లో పోలీసులను విమర్శించిన "బొంబాయి గెజిట్" (Bombay Gazette) ను భవిష్యత్తులో తాము ప్రచురించబోయే విషయాలను ప్రభుత్వ పరిశీలనకు పంపాలని సంపాదకుని ఆదేశించారు. అంతేగాక విమర్శించిన పత్రికాధిపతులను ఏదో ఒక కేసులో ఇరికించి, బాధించారు. వారికెట్టి ప్రకటనలు రాకుండా నిరోధించారు. హికీ దుర్భర జీవనాన్ని చూసిన పత్రికాధిపతులు ప్రభుత్వానికి లోబడి, ప్రభుత్వ ప్రకటనలచే బాగుపడ్డారు. ముఖ్యంగా ఈ వార్తా పత్రికలు ఐరోపా వార్తలు, ఇంగ్లాండ్ పార్లమెంట్ చర్చలు, సాంఘిక, వ్యాపార విషయాలను ప్రచురించేవారు. భారతదేశ వార్తలు అసలుండేవికావు. అందువల్ల భారతదేశంలో ఆంగ్లేయ వార్తా పత్రికలు కంపెనీ ప్రయోజనాలకై లేదా దానికి విరుద్ధంగా ప్రచారం చేసే వారి వాదనలను వినిపించడానికి మాత్రమే పరిమితమైనవి. కంపెనీ గుత్తాధిపత్య విరుద్ధ వాదనలకు కొంత బలం చేకూరింది.

## 7.5 సెన్సార్‌షిప్ ప్రవేశం

వెల్లస్లీ భారతదేశ గవర్నర్ జనరల్‌గా నియమింపబడ్డారు. అప్పుడే ఐరోపాలో నెపోలియన్ విజయపరంపర, రాజకీయ సంక్షోభం తలెత్తింది. టిప్పుసుల్తాన్ మరాఠాలు, నెపోలియన్‌తో చేతులు కలిపి, బ్రిటిష్ సామ్రాజ్యాధికారాన్ని భారతదేశం నుండి గెంటివేయగలరనే భయమేర్పడింది. దీనిని అవకాశంగా తీసికొని, వెల్లస్లీ 1799లో సంపాదకులందరిపైన అంక్షలను విధిస్తూ ఉత్తర్వులిచ్చాడు. ప్రతి సంపాదకుడు, ముద్రణకర్త విధిగా తమ పేర్లు, చిరునామాలు పత్రికలో ప్రకటించాలి. అన్ని పత్రికల వార్తలు ముందస్తుగా ప్రభుత్వ కార్యదర్శి లేదా అతడు నియమించిన అధికారిచే పరిశీలింపబడిన తరువాతనే ముద్రించాలి. ఈ నిబంధనలను అతిక్రమించిన వారికి కఠిన శిక్షలు నిర్దేశింపబడ్డాయి. తమ దేశంలో పత్రికలకిచ్చిన స్వేచ్ఛను ఆంగ్లేయులు భారతదేశంలో ఇవ్వకపోవడం, పైగా పత్రికలు ప్రభుత్వాన్ని పడగొట్టడానికి పనిచేసే దుష్టశక్తులుగా చిత్రించడం ఒక విడ్డూరం. అయితే వలస పాలనలో అది సహజం.

పత్రికలకు, ప్రభుత్వ సెన్సార్ పద్ధతిపై వివాదం కొనసాగింది. లార్డ్ మింటో (Lord Minto) కాలంలో కూడా సంపాదకులకు హెచ్చరికలు వెళ్తూనే ఉండేవి. ఆ తరువాత హేస్టింగ్స్ గవర్నర్ జనరల్ అయ్యాడు. 1814లో 'ఏసియాటిక్ మిర్రర్' (Asiatic mirror) పత్రిక యాజమాన్యాన్ని తీసుకొన్న జేమ్స్ బ్రైస్ (James Bryes) రాసిన కొన్ని వ్యాసాలు నాటి ముఖ్య కార్యదర్శి 'జాన్ ఆడమ్' (John Adam) కు కోపం తెప్పించాయి. 1818లో గంగాధర భట్టాచార్య భారతీయ వార్తాపత్రిక 'బెంగాల్ గెజిట్' ఒక ఏడాది మాత్రమే నడిచింది. 'మిషనరీలు', 'సమాచార దర్పణ్' (Bengal Darpan) అనే బెంగాలీ వారపత్రికను, 'ఫ్రెండ్ ఆఫ్ ఇండియా' (Friend of India) అనే ఇంగ్లీష్ మాసపత్రిక, 'దిగ్ దర్శన్' (Dig Darshan) అనే బెంగాలీ మాసపత్రికను ప్రారంభించారు. జేమ్స్ మెకంజీ, 'గార్డియన్' (Guardian) పేరుతో ఆదివారం పత్రికను ప్రారంభించారు. 'మార్నింగ్ పోస్ట్' (Monring Post) సంపాదక, యజమాని హట్లీ (Heatly) రాసిన కొంత సమాచారాన్ని మార్చమని కంపెనీ కార్యదర్శిని కోరాడు. హట్లీ తల్లి భారతీయ వనిత. భారతదేశంలో పుట్టిన తనపై కంపెనీ అధికారం చెల్లనేరదని వాదించి నెగ్గడంతో, హేస్టింగ్స్, సెన్సార్‌షిప్‌ను రద్దుచేస్తూ ప్రకటన చేశాడు. పత్రికలు తమ వ్యాసాలను ముందుగా చూపించనవసరం లేదని ప్రచురించిన పత్రికల కాపీలను మాత్రం పంపాలి అని కోరాడు. పత్రికలకు, కంపెనీకి మధ్య వివాదం మంచిది కాదని, దీనివల్ల స్థానికుల్లో క్రమశిక్షణ లోపిస్తుందని భావించాడు. బ్రిటిష్ ప్రయోజనాలకు, శాంతి భద్రతలకు, వ్యక్తులపై కక్షలకు చోటివ్వని వార్తలను ప్రచురించమని సంపాదకులను కోరాడు. అంతేకాక ఇంగ్లాండ్‌లో

BRAOU

భారతదేశ అధికారుల చర్చలను, స్థానిక పాలకులతో చేసుకొనే లావాదేవీలను, న్యాయమూర్తులపై, బిషప్పులపై విమర్శలు చేయవద్దని, ఆంగ్లేయుల పేరు ప్రతిష్టలు దెబ్బతినే ఏ విషయాన్ని అయినా, భారతదేశ వార్తా పత్రికల్లో ప్రచురించవద్దని కోరాడు. అధికారంలో ఉన్నవారికి విరుద్ధంగా భారతీయులకు ఎటువంటి సమాచారమివ్వకూడదని దీని సారాంశం. అప్పటికి పూర్తిగా వార్తపత్రికలు ఐరోపావారి సంపాదకత్వంలో నడచినా, ఇన్ని జాగ్రత్తలు తీసుకొన్నారు. కంపెనీ డైరెక్టర్లు భారతదేశంలో పత్రికా స్వేచ్ఛకు పూర్తిగా విముఖులు.

## 7.6 పత్రికలు - భారతదేశ ప్రయోజనాలు

ఆంగ్లేయ పత్రిక యాజమాన్యం, సంపాదకులు, పత్రికా స్వేచ్ఛకు పోరాటం సల్పుతున్న కాలంలోనే, భారతీయ పత్రికా రంగం మొగ్గతొడిగింది. 1815లో భారతీయ సామాజిక వ్యవస్థను ప్రక్షాళనం చేయాలని, వ్యవస్థలోని మూఢ నమ్మకాలను తొలగించాలని సంకల్పించిన రాజారామ్‌మోహన్ రాయ్ మిత్రుడు గంగా కిషోర్ భట్టాచార్యతో కలిసి బెంగాలీలో 'వంగల్ గజట్' (Vangal Gazette) పత్రికను స్థాపించాడు. వారి చర్యలను నిరోధించడానికి, మిషనరీలు క్రైస్తవ మత ప్రచారానికై 'దిగ్‌దర్శన్' (Digdarshan) అనే బెంగాలీ మాసపత్రికను స్థాపించి, ప్రభుత్వ విధానాన్ని కనిపెట్టడానికి అందులో కొన్ని చారిత్రక మాస పత్రికను 'సమాచార దర్పన్' (Samachar Darpan) అనే పేరున వారపత్రికగా మార్చి, మత ప్రచారం చేశారు. ఈ రీతిగా ప్రాంతీయ పత్రికలు వెలుగులోనికి వచ్చి, మతంలో భిన్న దృక్పథాలను ప్రచారం చేశాయి. రాజకీయాల జోలికి పోకుండా, 'సమాచార దర్పన్' భారతీయ మత విశ్వాసాలను తీవ్రంగా విమర్శిస్తూ, క్రైస్తవ మత ప్రచారం చేసింది. ఈ పత్రికను హేస్టింగ్స్, అతని తరువాత వచ్చిన గవర్నర్ జనరల్ ఎమ్హెరెస్ట్ (Amherest) ఆర్థికంగా బలపర్చటంతో, పత్రికలకు సాయం చేయడం ద్వారా, అనుకూలం చేసుకొనవచ్చుననే దుష్ట సాంప్రదాయం వచ్చింది. ఇదే కాలంలో స్వతంత్రంగా ఉన్న పత్రికలకు ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ప్రభుత్వానుకూల పత్రికల ప్రచురణ మాత్రమే నిరాటంకంగా సాగింది.

### 7.6.1 పత్రికా స్వేచ్ఛ

ఇట్లాంటి పరిస్థితుల్లో కంపెనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎటువంటి ఒత్తిడికి లొంగకుండా పత్రికా స్వేచ్ఛకై పోరాడి నిలిచిన మహనీయుల్లో బకింగ్‌హామ్ (Bukingham) ప్రముఖులు. భారతదేశానికి వచ్చిన బకింగ్‌హామ్ నాటి పత్రికలకు ఒక ఆశయంకాని, చిత్తశుద్ధికాని, ప్రజాప్రయోజన దృష్టికాని లేదని గమనించాడు. స్వంతగా పత్రిక స్థాపించాలని తలచి, 'కలకత్తా జర్నల్' (Calcutta Journal) ను స్థాపించి, దినపత్రికగా మార్చాడు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకై ప్రజల విరాళాల పైననే నడిపాడు. గవర్నర్ల విధులపై వారిని హెచ్చరించడం, వారి తప్పులను వెలికితీసి, ఇష్టంలేని నిజాలను బహిర్గత పర్చటం తన విధిని చెప్పిన బకింగ్‌మ్ తన పత్రికలో ప్రభుత్వం వల్ల ఇబ్బందులకు గురైన వారి నివేదనలకు చోటు కల్పించాడు. ఇది ఒక విప్లవాత్మక ముందడుగు. ఇంగ్లాండ్ లో 'ఓరియంటల్ హెరాల్డ్' (Oriental Herald) అనే పత్రికను స్థాపించి, అక్కడకూడా భారతదేశంలో కంపెనీ ప్రభుత్వ దుశ్చర్యలను బహిర్గత పర్చాడు. 1832లో పార్లమెంట్‌కు ఎన్నికైన బకింగ్‌హామ్ కంపెనీ ఛార్టర్‌ను పొడిగించవద్దని, భారతదేశాన్ని విక్టోరియా రాణి ప్రత్యక్ష పాలనలోనికి తీసుకువచ్చి, భారతదేశ పాలనకు ఎన్నుకొన్న పార్లమెంట్ అందులో సగం మంది భారతీయులుండాలని వాదించారు. అదే కాలంలో భారత సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమ సంధాత రాజా రామ్‌మోహన్ రాయ్ 'సంబంధ కౌముది' (Samband Koumudi) అనే బెంగాలీ పత్రికను, 'మిరాత్-ఉల్-అక్బర్' (Mirat - ul - Akabar) అనే పర్షియన్ పత్రికను స్థాపించి, సంఘ సంస్కరణకు నిరంతర కృషి సల్పారు.

బకింగ్‌హామ్ తన పత్రికలో ప్రభుత్వ విధానాన్ని, మతాధికారులను భయం లేకుండా విమర్శించాడు. అధికారంలో ఉన్న వారికిది ఆగ్రహకారణమైంది. వారెంత బెదిరించినా, బకింగ్‌హామ్ లొంగలేదు. అతనిపైన



B R A O U

నేరారోపణ, పరువునష్టం దావాలు స్వయంగా ప్రభుత్వ కార్యదర్శియే నడిపాడు. చివరకు బకింగ్‌హామ్ భారతదేశం నుండి పంపివేయబడ్డాడు. కాని పత్రికా స్వేచ్ఛకై అతని పోరాటం ముందు తరాలకు ఆదర్శప్రాయమైంది.

## 7.6.2 దేశీయ పత్రికా రంగ ఆవిర్భావం

బ్రిటిష్ పత్రికలు పరస్పర విరుద్ధ ప్రయోజనాలకై పోరాటం జరుపుతున్న రోజుల్లో బకింగ్‌హామ్ ఆదర్శం, రాజా రామ్‌మోహన్ రాయ్ సంస్కరణాభిలాష, దేశీయ పత్రికల ఆవిర్భావానికి దోహదం చేసింది. బ్రిటిష్‌వారు కంపెనీ పాలనను విమర్శించినా, భారతదేశంలో ఆంగ్లేయార్థిక ప్రయోజనాలను పరిరక్షించాలనే ఆలోచించారు. ఐరోపా దేశాల్లో ఆర్థిక సామ్రాజ్యవాదం మధ్యతరగతి ఆవిర్భావానికి కారణంకాగా, ఆ వర్గం రాజరికంతో హక్కులకై పోరాటాన్ని సల్పింది. వలసల్లో వచ్చిన మధ్యతరగతి వర్గం తమ మనుగడకు, ఆర్థిక ప్రగతికి పత్రికా స్వేచ్ఛ ఆవశ్యకతను గుర్తించారు. భారతదేశ మధ్యతరగతి ఇంగ్లాండ్‌లోని మధ్యతరగతి ఆదర్శాలను, ఆశయాలను పుణికిపుచ్చుకొని, అదే దారిలో నడవాలనే ప్రయత్నంలో, బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని ఎదిరించవలసి వచ్చింది.

భారతదేశంలో మధ్యతరగతి రెండు వర్గాలుగా విభజింపబడింది. సాంప్రదాయ వర్గం యదాస్థితిని కోరగా, ప్రగతిశీలురు సామాజిక వ్యవస్థలో మార్పులు రావాలని, పాశ్చ్యాతీకరణ సాగాలని పట్టుబట్టారు. సామాజిక మార్పులకు పత్రికారంగం ఆవశ్యకత గుర్తింపబడింది. అప్పటికే రాజా రామ్‌మోహన్ రాయ్ బెంగాలీ, పర్షియన్ భాషల్లో ప్రారంభించిన పత్రికలు ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి. ఈ పత్రికల్లో భారతీయ సామాజిక వ్యవస్థలోని మూఢనమ్మకాలను విమర్శిస్తూనే, పశ్చిమదేశాల విషయాలను, సంస్కృతులను గూర్చి చదువరులకు తెలియజేసారు. ఈ పత్రికలు ప్రజలకు, పాలక వర్గానికి వాస్తవాలను చెప్పడంలో విజయం సాధించాయి. క్రైస్తవ మిషనీల దుష్ప్రచారాన్ని ఖండించాయి. వివిధ పట్టణాల్లో స్థానిక వార్తలు తెలిపే పత్రికలు ప్రాంతీయ భాషల్లో ప్రారంభింపబడ్డాయి. రాజా రామ్‌మోహన్ రాయ్ బ్రహ్మ సమాజ వ్యాప్తికి వెరచి, నిరోధించడానికి 'ధర్మ సభ', 'సమాచార చంద్రిక' మొదలైన పత్రికలు సాంప్రదాయ పరిరక్షణకు పూనుకొన్నాయి. మొత్తంమీద ఈ పత్రికల్లో వాదవివాదాలు, చర్చలు, సామాన్య ప్రజల్లో ఆసక్తిని, ప్రజాస్వామిక విలువలను కల్పించాయి. అంతేకాక స్వదేశీ పత్రికలు హిందూ మతంపై క్రైస్తవ మిషనరీలు సాగిస్తున్న ప్రచార తీవ్రతను ఎదుర్కొనడానికి ఉమ్మడి ఆలోచనలు చేశాయి.

స్వదేశీ పత్రికలు ఆగమనం ఒక్క సామాజిక వ్యవస్థలకే పరిమితం కాలేదు. రాజ్యాంగ విషయాల్లో కూడా ప్రజలకు ఆసక్తి కల్పించారు. కంపెనీ ఆర్థిక విధానంవల్ల కొద్దిమంది మధ్యతరగతివారు బాగుపడినా, దేశ ఆర్థికస్థితి దిగజారిపోతుందనే వాస్తవం పరోక్షంగా చెప్పబడింది. "స్వేచ్ఛా రాజ్యంలో పత్రికా స్వేచ్ఛ ప్రజలకు ఆవశ్యకమైనా, ఈ దేశంలో వ్యవస్థలకు, ప్రయోజనాలకు అవసరమని" చెప్పిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బేలీ (Bayley) వారి కలవరపాటుకు ప్రత్యక్ష సాక్ష్యం. స్వదేశీ పత్రికల ఆగమనాన్ని, అభివృద్ధిని చూసి భయపడి, కంపెనీ ప్రభుత్వానికి పత్రికలకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పే సూచనలు చేయమని ప్రభుత్వం థామస్ మన్రోనుకోరింది. ఆంగ్లేయ పత్రికలవల్ల ఉపయోగంకానీ, హానికానీ పెద్దగా జరిగేది ఏమి లేదని చెబుతూ, స్వదేశీ పత్రికా రంగం వల్లనే ప్రమాదం రాగలదని హెచ్చరించాడు. ఐరోపా పత్రికలచే ఉత్సాహం పొందిన స్వదేశీ పత్రికల రాతల వల్ల ప్రమాదం వెంటనే లేకపోయినా, కాలక్రమేణా భారతీయ సైన్యం వారిచే ప్రభావితమై, ఆంగ్లేయాధికారాన్ని కూలగొట్టవచ్చునని, భారతీయుల్లో స్వేచ్ఛా సిద్ధాంతాన్ని వ్యాప్తిచేసి, విదేశీయులను పారద్రోలి, జాతీయ ప్రభుత్వమేర్పాటుకు వారిని పురిగొల్పవచ్చునని సూచించాడు. అంతేకాక "పత్రికా స్వేచ్ఛ, పరాయి పాలన పరస్పర విరుద్ధాలు. రెండు కలిసి ఎక్కువ కాలం జీవించలేవు" అనే నగ్న సత్యాన్ని ప్రకటించాడు.

## 7.6.3 పత్రికలపై ఆంక్షలు

బకింగ్‌హామ్ ఉదంతం, స్వదేశీ పత్రికల ఆవిర్భావం గమనించిన కంపెనీ పత్రికా స్వేచ్ఛలను హరిస్తూ చేసిన శాసనాన్ని, 'ఆడమ్' అంక్షలుగా చెప్పబడ్డాయి. ఈ నాటి నుండి ఏ పత్రికలు గవర్నర్ జనరల్-కౌన్సిల్ అనుమతి లేకుండా ప్రచురించడానికి వీలులేదు. వారు ముఖ్య కార్యదర్శి సంతకం చేసిన 'లైసెన్స్' (Licence) కలిగి ఉండాలి. 'లైసెన్స్' కావలసిన వారు సంపాదకుని, ముద్రాపకుని, యాజమాన్యపు పేర్లు, నివాస స్థలాలు, పత్రిక పేరు, ముద్రించే స్థలం, వివరాలు ఇవ్వాలి. ఈ లైసెన్స్ పొంది ముద్రించిన అన్ని పత్రికలు, పుస్తకాలు, ప్రభుత్వ పరిశీలనకు పంపాలి. ఈ ప్రచురణలను నిలుపుచేసే అధికారం ప్రభుత్వానికుంది. ఈ అంక్షలకు రాజా రామ్‌మోహన్ రాయ్, ద్వారకనాథ్ టాగూర్ వంటివారు అభ్యంతరాలు తెలిపినా, 1823 ఏప్రిల్ 15వ తేదీనుండి అమలు చేయబడ్డాయి. దానిపై ప్రీవీ కౌన్సిల్ (Privy Council) కు అప్పీలు చేయగా, అంక్షలు సముచితమే అని వారు తీర్పునిచ్చారు. పత్రికల అంక్షలపై రాజుకు కూడా నివేదించారు. ఇంగ్లాండ్ రాజు వారి నివేదనను తిరస్కరించాడు.

ఆడమ్స్ ఆంక్షలు పత్రికా రంగాన్ని కుదిపివేశాయి. 1828లో విలియం బెంటింగ్ గవర్నర్ జనరలయ్యాడు. మద్రాస్ గవర్నర్‌గా ఆయన ఆంక్షలను కఠినంగా అమలుపర్చాడు. కాని కలకత్తా చేరిన బెంటింగ్ భారత మధ్యతరగతి వర్గం ఆంగ్లేయ పాలన హర్షిస్తున్నారని, వారిని మంచిచేసుకోవడం బ్రిటిష్ ప్రయోజనాలకు ఉపకరించగలదని భావించి, సతీ సహగమనం నిషేధం లాంటి సాంఘిక సంస్కరణలతోపాటు, కొంతవరకు పత్రికలపై ఆంక్షలను సడలించాడు. బెంటింగ్ చాలా జాగ్రత్తగా పత్రికా రంగంతో స్నేహం నెరపాడు. దీనితో పత్రికా రంగం మరలా పుంజుకున్నది. 1830లో బెంగాల్‌లో 16 పత్రికలు వచ్చాయి. 1830-33 మధ్యలో 19 స్వదేశీ భాషల పత్రికలు రాగా, ఆంగ్లేయ పత్రికల సంఖ్య 33కు పెరిగింది. బొంబాయి సమాచార్ (గుజరాతీ) 'టైమ్స్ ఆఫ్ ఇండియా' (Times of India) (ఇంగ్లీషు) 'కలకత్తా రివ్యూ' (Calcutta Review) (ఇంగ్లీష్) మొదలైన ప్రచార పత్రికలు ఆ కాలంలోనే వచ్చినవి. స్థానిక పత్రికలు సతీ సహగమన నిషేధాన్ని బలపర్చాయి. వివిధ వర్గాల వాదనలు వాటి విలువను, వ్యాప్తిని పెంచాయి.

ఈ ఆంక్షలు 1835 వరకు కొనసాగాయి. కాని ఆ సంవత్సరంలో గవర్నర్ జనరల్‌గా తాత్కాలికంగా పనిచేసిన 'మెట్‌కాఫ్' (Metcalf) ఆంక్షలను తొలగిస్తూ శాసనం చేశాడు. దీనికి మెకాలె సమర్థన ఉంది. భారతీయ పత్రికలు స్వేచ్ఛను పొందాయి. ఫలితంగా కంపెనీ 'మెట్‌కాఫ్' ను ఇంగ్లాండ్‌కు పిలిపించగా, భారతీయులు అతనికి కలకత్తాలో సన్మానం చేసారు.

పత్రికలపై అంక్షలు తొలగినా, పాలనా చర్యలు, ఒత్తిడుల ద్వారా పూర్తి స్వేచ్ఛ లభించలేదు. అయితే న్యాయబద్ధంగా ఆంక్షలు లేనందున పత్రికల సంఖ్యతోబాటు, విజ్ఞత కూడా పెరిగింది. ఇంతలో 1857 తిరుగుబాటు సంభవించింది. ఈ తిరుగుబాటు కారణాలు వేరైనా, దీనిలో పత్రికల పాత్రకూడా కొంతమేరకున్నదని' పత్రికా స్వేచ్ఛ, దీనికి దోహదం చేసిందని భావించి, తిరిగి 1859లో ఆంక్షలు విధించారు. లాంగ్ (Long) పత్రికా స్వేచ్ఛ అవసరమని, దాని ద్వారా ప్రజలు తమ అసంతృప్తిని తెలియజేయగలరని, ఆ అవకాశం వారికివ్వకపోతే, వారిలో నిక్షిప్తమైన ఆగ్రహం తిరుగుబాటుకు దారితీయగలదని, పత్రికల వల్లనే తిరుగుబాటు విషయాలు తెలియవచ్చాయని వాదించాడు. కాని ఆంగ్లేయ ప్రభుత్వం తన నిరంకుశాధికారం, పత్రికా స్వేచ్ఛ పరస్పర విరుద్ధాలని భావించింది. దేశీయ పత్రికల దుష్ప్రచారం వల్లనే తిరుగుబాటు వచ్చిందని భావించిన గవర్నర్ జనరల్ కానింగ్ (Caning) 1857లో ఒక పత్రికా చట్టాన్ని ప్రకటించాడు. దీని ప్రకారం మరలా పత్రికలు ప్రభుత్వం నుండి లైసెన్స్‌ను పొందాలి. ఆ లైసెన్స్ ఇవ్వటానికి నిబంధనలు విధించే అధికారం ప్రభుత్వానికి కలదు. ఈ చట్టం ఒక

BRAOU

ఏడాదిలో అమల్లో ఉంటుందని చెప్పినా, ప్రతి ఏడు పొడిగింపబడి, 1865 వరకు అమలులో ఉంది. ఈ చట్టం తిరిగి పత్రికా రంగ వ్యాప్తికి ఆటంకం కల్పించింది. ఎన్నో పత్రికల సంపాదకులు యాజమాన్యం వారు శిక్షింపబడ్డారు. కొందరిని తొలగించారు.

## 7.7 'వర్నాకులర్ ప్రెస్ ఏక్టు', 1878 (Vernacular Press Act 1878)

1858లో కంపెనీలో ప్రభుత్వం స్థానే భారతదేశంలో ఆంగ్లేయ సార్వభౌమాధికారం ఏర్పడింది. ప్రజల అభిమానం పొందటానికి విక్టోరియా రాణి కొన్ని చర్యలు ప్రకటించింది. వాటిలో పత్రికలపై 'దేశద్రోహ నేరం'పై చెప్పబడిన నిబంధనలను తొలగించారు. నాలుగు పత్రికల యాజమాన్యాలు కలిసిపోయి, 'టైమ్స్ ఆఫ్ ఇండియా' గా రూపొందాయి. అంతేకాక అలహాబాద్ నుండి 'పయనీర్' (Pioneer), కలకత్తా నుండి స్టేట్స్‌మన్ (Statesman), మద్రాసు నుండి 'మద్రాస్ మెయిల్' (Madras Mail), హిందూ (Hindu)పత్రికలు ఈ కాలంలోనే ఆవిర్భవించాయి. ఈ నాటికీ బహు జనామోదం పొందిన పత్రికలన్నీ, 1858-70 మధ్య వచ్చినవే. బెంగాలీ భాషలో 'అమృత బజార్' పత్రిక 1860లో వచ్చింది.

1871 నుండి తిరిగి పత్రికలకు గడ్డుకాలం వచ్చింది. ప్రష్యా, జర్మనీ మహా సామ్రాజ్యంగా మారి, ఆంగ్లేయాధిపత్యాన్ని సవాలు చేసింది. రష్యా ఆసియా వైపు విస్తరించే ప్రయత్నంలో ఉంది. ఇంగ్లాండ్ ఏకాకిగా మిగిలింది. భారతదేశంలో నీలిమందు (Opium)రైతుల పోరాటానికి జాతీయ పత్రికలు మద్దతు పలికాయి. ఈ పరిస్థితుల్లో కరడు గట్టిన సామ్రాజ్యవాది 'లిట్టన్' వైస్రాయి (Litton) గా వచ్చాడు. పత్రికలపట్ల ఉదారంగా ఉండవలెనని ప్రభుత్వంలో ఒక వర్గం వాదించగా, అట్లాంటి ఉదారత వల్లనే సమస్యలు వస్తున్నాయని మరో వర్గం చెప్పింది. రెండవ వర్గాభిప్రాయంతో ఏకీభవించిన 'లిట్టన్' 1878లో దేశీయ పత్రికలపై అదుపుకై 'వర్నాక్యులర్ ప్రెస్ యాక్టు' (Vernacular Press Act) తీసుకువచ్చాడు. 'మాట దిగ్బంధన చట్టం' అని అపహాస్యం చేయబడిన దీని ప్రకారం. (1) ప్రభుత్వంపట్ల, వివిధ జాతుల పట్ల వైరం కల్పించే ఎటువంటి సమాచారాన్ని ప్రచురించమని పత్రికల నుండి హామీ, ధరావత్తును కోరే అధికారం మెజిస్ట్రేటులకు ఇవ్వబడింది. (2) అట్లాంటి సమాచారం ప్రకటించినట్లయితే, ఆ పత్రిక ముద్రణాలయాన్ని, ధరావత్తును ప్రభుత్వం కైవశం చేసుకొనవచ్చును. (3) పత్రికలు ఇట్లాంటి శిక్షలు తప్పించుకోవటానికి ముందుగానే సమాచారాన్ని సెన్సార్ ప్రభుత్వాధికారికి చూపించి, ముద్రించవచ్చు. సెన్సార్ అధికారి అభ్యంతర సమాచారాన్ని తీసివేయగలడు.

ఆంగ్లేయాధికారులు ఈ చట్టాన్ని సమర్థించగా, జాతీయ నాయకులు తీవ్రంగా విమర్శించారు. చట్టం వచ్చిన 15 నెలల్లోనే "ఒక మద్రాస్‌లో తప్ప, మిగతా భారతదేశమంతటా స్వదేశీ పత్రికా రంగం నోరు నొక్కి వేసినారని" బెనర్జీ రాశాడు. కలకత్తా టౌన్‌హాల్‌లో ఈ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన సభ విజయాన్ని చూసి, వారు చట్టం ఎక్కువ రోజులు బ్రతుకలేదని భావించారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో ఫిరోజ్‌షా మెహతా చట్టాన్ని విమర్శిస్తూ, వివరణాత్మక వ్యాసం రాశాడు. ఈ చట్టం 'అనవసరం, అసంగతం, దురుద్దేశాల పూరితం' అని మోడీ (Mody), 'చట్టం తిరోగామి, భారతదేశ భవిష్యత్తుకు అపకారి' అని పెర్రీ (Perry) వ్యాఖ్యానించారు. పైగా, ఈ చట్టం దేశీయ పత్రికలపైననే ఆంక్షలను విధించడం చెడ్డ లక్షణమని, న్యాయానికి ప్రభుత్వాన్ని నిరంతరం తిట్టింది ఆంగ్లేయులు నడిపిన పత్రికలేనని ఆర్థర్ హాబ్ హౌస్ (Arthur Hob House) అభిప్రాయపడ్డాడు.

1880లో బ్రిటన్ కన్సర్వేటివ్ ప్రభుత్వం కూలిపోయి, గ్లాడ్‌స్టన్ (Gladstone) నాయకత్వంలో 'లిబరల్' (Liberal) ప్రభుత్వమేర్పడింది. లార్డు లిట్టన్ స్థానంలో ఉదారుడైన లార్డ్ రిప్పన్ (Lord Rippon) వైస్రాయిగా వచ్చాడు. 1882లో ఈ చట్టాన్ని రద్దు చేశారు. రిప్పన్ చర్యకు భారతీయులు హర్షించగా, ఆంగ్లేయులు

విమర్శించారు. ఈ చట్టంపై జరిగిన చర్చలు, సభలు జాతీయ తత్వ ప్రచారానికి దోహదం చేసాయి. 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడింది.

## 7.7.1 1908 పత్రికా చట్టం

అనతి కాలంలో దేశీయ పత్రికారంగం చాలా వరకు జాతీయ తత్వ ప్రచారం చేసింది. దీన్ని ఆంగ్లేయులు అసహనంగా గ్రహించారు. వైస్రాయి కర్జన్ బెంగాల్ విభజన ప్రకటన దేశవ్యాప్త ఆందోళనకు దారితీసింది. ఆంగ్లేయుల పాలనను దేశం నుండి తరిమి కొట్టవలెనని కొందరు ఉద్వేగంతో ప్రకటించారు. ఈ ఆందోళనలో దేశీయ పత్రికలు పాలుపంచుకున్నాయి. దీనితో 1908లో 'రెచ్చగొట్టే నేరాలు' (Incitement to offences) అదుపు చేయటానికని ఒక పత్రికా చట్టాన్ని ప్రకటించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్రేకపర్చే, రెచ్చగొట్టే సమాచారాన్ని ప్రకటించిన పత్రికను మేజిస్ట్రేట్ స్వాధీనం చేసుకొనవచ్చు. అనుమానంపై కూడా సంపాదకుని పిలిపించి, అతని వివరణ కోరి అతని పత్రికను మూసివేయవచ్చు. వారి ఆస్తులను జప్తు చేయవచ్చును. అత్యవసర పరిస్థితుల్లో వివరణ కోరకుండానే ఈ చర్యలను తలపెట్టవచ్చు. ఈ చట్ట ఫలితంగా జాతీయ పత్రికలైన 'యుగంధర్', 'సంధ్య', 'వందేమాతరం' ప్రచురణ ఆగిపోయింది.

## 7.7.2 1910 చట్టం

1908 చట్టం జాతీయోద్యమాన్ని నిరోధించలేకపోయింది. 1909 మింటో మార్లే (Minto Morley) సంస్కరణలు దేశీయులకు ఎట్లాంటి తృప్తిని కల్గించలేదు. పైగా మత విచక్షణ ద్వారా ప్రజలను విభజించాలనే ప్రయత్నం జరిగింది. జాతీయ నాయకుల విమర్శలు తీవ్రతరమైనవి. ప్రభుత్వం అణచివేత విధానాన్నే ఎన్నుకొని, 1910లో మరికొన్ని ఆంక్షలను పత్రికలపై విధిస్తూ, 1908 చట్టాన్ని మరింత కఠినం చేశారు. ముద్రాపకులు ధరావత్తు చెల్లించాలని చెప్పి, దానిని పెంచే అధికారం ఎటువంటి కారణం చూపకుండానే ధరావత్తును రద్దు చేసే అధికారం స్థానికాధికారులకు ఇవ్వడమైంది. 'అభ్యంతరకర సమాచార' నిర్వచనంలో మరికొన్ని అంశాలను చేర్చారు. విద్రోహక ప్రచురణల్లో భారతీయ రాకుమారులు, న్యాయమూర్తులు, ఉద్యోగుల రాతలను కూడా పరిగణనలోనికి తీసుకోవాలని చెప్పబడింది. సమాచారం అభ్యంతరకరమైందా, విద్రోహకరమైందా అనే విచారణ అధికారం న్యాయస్థానాలనుండి తీసివేసి, స్థానిక అధికారులకివ్వడం జరిగింది. అంతేకాక అనుమానంపై పోస్టాఫీసుల్లో, కస్టమ్స్ ఆఫీసుల్లో ఉత్తరాలను, బంగీలను తెరచి, పరిశీలించే అధికారమిచ్చారు.

ఈ చట్టం ద్వారా పత్రికా స్వేచ్ఛ పూర్తిగా మూగపోయింది. చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బ్రహ్మాండమైన ఆందోళనలు జరిగాయి. ఈ చట్టాన్ని మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో కఠినంగా అమలు పరిచారు. ఈ చట్టం ప్రకారం 350 పత్రికాలయాలు శిక్షింపబడ్డాయి. 40వేల పౌండ్ల ధరావత్తులు వసూలయ్యాయి. ప్రముఖ పత్రికలు కూడా ఎన్నో నిర్బంధాల మధ్య పనిచేసాయి. ముద్రణాలయాల స్థాపన, పత్రికా ప్రచురణ దేశంలోని అతి ప్రమాదకరమైన విషయాలుగా మారాయి. ఎన్నో కేసులు హైకోర్టుల్లో విచారింపబడ్డాయి. కొన్ని తీర్పుల్లో చట్ట నిబంధనలు అనుచితమని కూడా చెప్పబడింది.

1919 మాంటేగ్ చేమ్స్‌ఫర్డ్ (Montague Chemsford) సంస్కరణలు వచ్చాయి. సర్ తేజ్ బహదూర్ సప్రూ (Sir Tej Bahadur Sapru) ప్రప్రథమ భారతీయ 'లా' సభ్యుడయ్యాడు. 1910 చట్ట పరిశీలన సంఘాధ్యక్షుడయ్యాడు. అతని నివేదిక ఆధారంగా, 1910 చట్టం రద్దు చేయబడింది. 1920-30 మధ్య పత్రికారంగానికి సంబంధించి చెప్పుకోదగిన మార్పులేమీ జరుగలేదు.

BRAOU

## 7.7.3 ది ఇండియా ప్రెస్ ఏక్ట్ (The India Press Act or Emergency Powers Act 1931)

1929లో లాహోర్ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య తీర్మానం చేసింది. 1930లో ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా, శాసనోల్లంఘనోద్యమం తీవ్ర రూపం దాల్చింది. జాతీయ పత్రికారంగం ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించింది. జాతీయోద్యమానికి వెన్నుముకగా నిల్చింది. జాతీయ నాయకులు నిర్బంధించబడ్డారు. ఎన్నో చోట్ల లాఠీ చార్జీలు జరిగాయి. ఈ నేపథ్యంలో, 1931 పత్రికా చట్టంలో ప్రభుత్వ అత్యవసరాధికారాలను ప్రకటించారు. హింస, హత్య విషయాలను ప్రేరణ చేసే సమాచారాన్ని ప్రచురించకూడదని చెప్పబడింది. తిరిగి పత్రికలు, ముద్రణాలయాలు ధరావత్తు చెల్లించే పద్ధతి, ప్రభుత్వం దానిని నిర్ణయించే అధికారం వచ్చాయి. అభ్యంతకర సమాచారం ప్రచురిస్తే, పత్రికను, ధరావత్తును కోల్పోగలరు. వారి లైసెన్సులు రద్దు చేయబడతాయి. ఏ పత్రికైనా అనుమతి లేకుండా సమాచారాన్ని ప్రచురిస్తే, సర్చ్ వారంట్ (Search Warant) ఇచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు, పత్రికను స్వాధీనం చేసుకొనే అధికారం పోలీస్ అధికారులకు ఇవ్వబడింది. కస్టమ్స్ అధికారులు, పోస్టల్ అధికారులు బంగీలను, ఉత్తరాలను స్వాధీనం చేసుకొనవచ్చును. జాతీయ నాయకుల ఫొటోలు, పేర్లు కూడా ప్రచురింపరాదని చెప్పారు. నాయకుల నిర్బంధం, వారి సందేశాలు, కాంగ్రెస్ ప్రచార వార్తలు నిషేధింపబడ్డాయి. నాటి ప్రముఖ పత్రికల్నీ ఏదో ఒక రకంగా వేధింపబడ్డాయి. పత్రికా రంగంలో భీభత్సం సృష్టించటానికి ప్రభుత్వం ప్రయత్నం చేసింది.

1932లో 'విదేశీ సంబంధాల చట్టం' (Foreign Relations Act) ప్రవేశపెట్టబడింది. దీని ప్రకారం ఇంగ్లాండ్ దాని మిత్ర రాజ్యాల మధ్యగల సంబంధాలకు హాని కల్గించే ఎటువంటి సమాచారాన్ని ముద్రించరాదు. సరిహద్దు రాజ్యాల్లో బ్రిటీష్ విధానాన్ని కొన్ని పత్రికలు విమర్శించాయి. దాని ఫలితంగా వచ్చిన ఈ చట్టంలో బ్రిటన్‌కు, మిత్ర రాజ్యాలకు అభిప్రాయ భేదాలను కల్పించే ఎటువంటి సమాచారమైనా, విద్రోహక చర్యగా భావింపబడుతుందని, చెపుతూ, 1933లో ఈ చట్ట విశేషాలను అమలుపర్చటానికి అధికారాలిస్తూ, నాలుగు అత్యవసర శాసనాలను చేశారు. 1934లో మరో చట్టం ద్వారా, ఆంగ్లేయాధికారంలో ఉన్న భారతదేశ పత్రికలు దేశంలోని స్వతంత్ర రాజ్యాలపై విమర్శలు చేయరాదని, ఆ రాజ్యాల్లో అసంతృప్తికి, తిరుగుబాటుకు కారణమయ్యే ఎట్లాంటి సమాచారాన్ని ప్రకటించరాదని శాసింపబడింది. అయితే, ఈ చట్టాలన్నీ రెండవ ప్రపంచ యుద్ధం ముగియగానే రద్దయ్యాయి.

## 7.8 స్వాతంత్ర్యానంతర సమీక్ష

భారతదేశ పత్రికా రంగంలో 1948లో 'ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా లిమిటెడ్' (Press Trust of India Ltd.) స్థాపన అతి ముఖ్య సంఘటన. 'రాయిటర్' (Rauter) తో అంగీకారం కుదుర్చుకుని, భారతదేశం నుండి, భారతదేశానికి తదితర దేశాల నుండి వార్తలను సేకరిస్తుంది. అన్ని వార్తల సేకరణ అధికారమున్న ఈ సంస్థలో ఏ వార్తా పత్రికైనా సభ్యులు కావచ్చు. ప్రస్తుతం ఈ సంస్థ రాయిటర్ నుండి కూడా స్వతంత్రమైంది.

## 7.8.1 ప్రెస్ లాస్ ఎంక్వైరీ కమిటీ (Press Laws Enquiry Committee)

1948లో భారత ప్రభుత్వం 'జగన్నాధ ఝా' (Jaganatu Jha) అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించి, అప్పటికున్న పత్రికా రంగ శాసనాలన్నింటినీ సమీక్షించి, సమన్వయపర్చే సిఫారసులను చేయమని కోరింది. దీనిలో కేంద్ర శాసన సభ్యులు, పత్రికా సంపాదకులు కూడా సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘం చేసిన సూచనలు :

1. 1932, 1934 పత్రికా చట్టాలను రద్దుచేయాలి.

2. ఇండియన్ పీనల్ కోడ్ 153-ఎ (Indian Penal Code 153-A) సవరణ చేస్తూ, సాంఘికార్థిక వ్యవస్థ మార్పులను కోరడం నేరంగా పరిగణించకూడదు. అయితే మార్పులు హింసకు దారితీయరాదు.

3. అత్యవసర శాసనాల ద్వారా పత్రికలపై చర్య తీసుకొనే ముందు పత్రికా సలహా సంఘాన్ని సంప్రదించాలి.

4. చట్టాన్ని పదేపదే అతిక్రమించే పత్రికలను నియమిత కాలానికి మూసివేసే అధికారాన్ని న్యాయస్థానాలకిస్తూ ఉత్తర్వులుండాలి.

5. ఇవికాక ఇండియన్ పీనల్ కోడ్ (Indian Penal Code) లోని 144-ఎ కు సవరణలను ప్రతిపాదించారు.

1950 జనవరి 26న అమలైన భారత రాజ్యాంగంలో 19వ ఆర్టికల్ ప్రకటనా స్వాతంత్ర్యాన్ని కల్పించింది. రాజ్యాంగంపై జరిగిన చర్చల ఫలితంగా, 1951 ఆగస్ట్ 21న ప్రెస్ ఆక్ట్ (Press Act) అనే పేరుతో ఒక బిల్లు రూపొందింపబడి ఆమోదింపబడింది. దీని ప్రకారం పత్రికలపై ఫ్రీ సెన్సార్ (Freecensor)పద్ధతి తీసివేయబడింది. పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగ పర్చారనే నిర్ధారణ జరిగినపుడే, ఏదైనా చర్య తీసుకోవాలి. ఆ అధికారం కూడా న్యాయస్థానాలకే ఉంటుంది. ఆ తీర్పులపై అప్పీలు చేసుకొనే అవకాశం ఉంటుంది. హింసాకాండ, దౌర్జన్యం మొదలైన తీవ్రమైన నేరాలను ప్రోత్సహించే సమాచారాన్ని పత్రికలు వ్యాప్తి చేయకుండా ఉండటానికి చట్టం నిర్దేశింపబడింది.

## 7.8.2 ప్రెస్ కమీషన్ (Press Commission)

1952 సెప్టెంబర్ నెలలో జస్టిస్ రాజా అధ్యక్షతన 11 మంది సభ్యులతో ప్రెస్ కమీషన్ ఏర్పాటైంది. ఈ సంఘ నివేదికను 1954లో సమర్పించారు. ఈ సంఘం 25 మంది సభ్యులతో "ప్రెస్ కౌన్సిల్" (Press Council) ఏర్పాటు చేయాలని, అందులో కనీసం 13 మంది సభ్యులు పత్రికా రంగానికి సంబంధిత వ్యక్తులుండాలి అని పేర్కొంది. హైకోర్టు ప్రస్తుత, లేదా పదవీ విరమణ చేసిన జడ్జీ దీనికి అధ్యక్షుడుగా ఉంటాడు. అధ్యక్షుణ్ణి భారతదేశ చీఫ్ జస్టిస్ నియమిస్తారు. ప్రెస్ కౌన్సిల్ బాధ్యతల్లో ముఖ్యమైనవి.

1. పత్రికా రంగ స్వేచ్ఛ

2. వృత్తిపరమైన ప్రమాణాలను నిర్ణయించి, పత్రికా రంగంలో పనిచేసేవారు ఒక ప్రవర్తనా నియమావళిని అనుసరించేటట్లుగా చూడటం.

3. సమాచారాన్ని అణచివేసే కార్యక్రమాలపై నిఘా.

4. పత్రికా రంగంలో బాధ్యత, సమాజం పట్ల అవగాహన పెంపొందించటం.

5. పత్రికా రంగంలో గుత్తాధిపత్యం ఏర్పడకుండా చర్యలను తీసుకోవడం.

6. పత్రికారంగానికి కావలసిన వ్యక్తులను ఎన్నుకోవడం, శిక్షణ ఇవ్వడం, దానికి కావలసిన వ్యవస్థలను ఏర్పర్చడం. ప్రెస్ కౌన్సిల్ తమ కార్యకలాపాలను తెలుపుతూ, ప్రతిఏడాది నివేదికను ప్రచురించాలి. ప్రెస్ కౌన్సిల్ రిజిస్ట్రార్ పత్రికలు ఎక్కడైనా గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తుంటే, పరిశీలించి, నివేదిక ఇస్తాడు. పత్రికలు ప్రజా ప్రయోజనాలను పరిరక్షించాలి. అంతేకాక పత్రికల పేజీలు, వెల, ప్రమాణాలు, ప్రకటనలకు సంబంధించిన పెక్కు సూచనలను చేశారు. పత్రికా రంగం కొందరి చేతుల్లోనే ఉండటం కూడా తగదని చెప్పారు.

ఇటీవలి కాలంలో పార్లమెంట్ పత్రికా రంగానికి సంబంధించి మరికొన్ని శాసనాలను చేసింది. 1954 పబ్లిక్ లైబ్రరీల చట్టం, 1955 వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, 1956 న్యూస్ పేపర్ (ధర, పేజీలు) చట్టం, 1960 పార్లమెంటరీ



BRAOU

ప్రొసీడింగ్స్ చట్టం, 1965 ప్రెస్ కౌన్సిల్ చట్టం, 1968 కంటెంప్ట్ ఆఫ్ కోర్స్ ఆక్ట్ (Contempt of Course Act) ముఖ్యమైనవి. 1970లో వచ్చిన ప్రెస్ కౌన్సిల్ చట్టంలో 1965 చట్టానికి సవరణలు చేస్తూ ప్రెస్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి, పత్రికారంగంలో ఉన్నత ప్రమాణాలు, స్వేచ్ఛ ఉండాలని, వాటిని పరిరక్షించే విధి ప్రెస్ కౌన్సిల్‌కు ఉందని చెప్పారు.

ఈనాడు మన దేశంలో అన్ని భాషల్లో వేలాది పత్రికలు వచ్చాయి. వార్తలు, వ్యాఖ్యలు, వ్యాసాలు, కార్టూన్లు, ప్రకటనలు, సమీక్షలతో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. ఎందరో మేధావులు సంపాదకులుగా ఆయా పత్రికలకు పేరు ప్రతిష్ట తెచ్చి, ఉన్నత ప్రమాణాలను సృష్టించారు. ఈనాడు పట్టణాల్లోనే కాక, పల్లెల్లో కూడా ప్రజలు ఉదయం కాఫీతోపాటు పత్రికా వార్తలను కూడా సేవిస్తున్నారు. అంటే నేటి రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలపై పత్రికల ప్రభావాన్ని ఊహించవచ్చును. స్వేచ్ఛా దేశాలుగా చెప్పబడే ఏ దేశానికి తీసిపోని స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు మన పత్రికలకున్నాయి. పత్రికారంగ ప్రాముఖ్యత పెరగడంతో, వాటి బాధ్యతలు కూడా పెరిగాయి. కొన్ని సందర్భాల్లో వ్యాపార ప్రయోజనాలు, స్వార్థ ప్రయోజనాలు, ఈ రంగాన్ని కొంత కలుషితం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో సంస్థల విలువలు, ప్రమాణాలు, ఆయా ప్రజల చైతన్యం, విద్య, నైతిక నియమాల మీద ఆధారపడి ఉంటుంది. అదే రీతిగా మన పత్రికా రంగ విలువ పరిరక్షణలో, సామాన్య చదువరుల బాధ్యత ఎంతో ఉంది.

## 19వ శతాబ్ది ద్వితీయార్థంలో వచ్చిన పత్రికలు

| పత్రిక పేరు | సంపాదకుడు |
|---|---|
| 1. ది స్కాట్‌మన్ ఇన్ ది ఈస్ట్ (The Scottman in the East) | డా. మస్టన్ (Dr. Muston) |
| 2. వీక్లీ గ్లీనర్ (Weekly Gleaner) | పాట్రిక్ క్రిచ్‌టన్ (Patrick Krichton) |
| 3. కొలంబియన్ ప్రెస్ గెజిట్ (Columbion Press Gazette) | మాంట్ డి రోజారియో (Mant 'D' Rajario) |
| 4. క్వార్టర్లీ ఓరియంటల్ మేగజైన్ (Quarterly Oriental Magagine) | డా. బ్రైస్ (Dr. Bryes) |
| 5. బెంగాల్ క్రానికల్ (Bengal Chronicle) | జేమ్స్ సుదర్‌లాండ్ (James Suderland) |
| 6. కలైడ్ స్కోప్ (Kalaid Scope) | డేవిడ్ డ్రమాండ్, హెచ్.ఐ.వి. డి రోజేరియో (David Dramond H. I. V. D. Rajario) |
| 7. ఉదంత్ మార్తండ్ (Udant Martand) | జుగల్ కిషోర్ ఒకాల్ (Jugal Kishore Okal) |
| 8. కలకత్తా క్రానికల్ (Calcutta Chronicle) | విలియం ఆడమ్ (William Adam) |
| 9. కలకత్తా గెజిట్ అండ్ కమర్షియల్ ఎడ్వర్టైజర్ (Calcutta Gazette and Commercial Advertiser) | విలరీస్ హాల్ క్రాఫ్ట్ (Willaries Hall craft) |
| 10. గాస్పెల్ ఇన్వెస్టిగేటర్ (Gospel Investigater) | ఎమాన్యుల్ రోబామ్ (Emmanuel Robolm) |

**1799 మే నెల పత్రికా నిబంధనల శాసనం ప్రకారం రిజిస్టర్ చేయబడిన పత్రికల వివరాలు**

| పత్రిక | ప్రొప్రయిటర్ | సంపాదకుడు |
|---|---|---|
| 1. బెంగాల్ హర్కారు (Bengal.Harakar) | విలియం హంటర్ (William Hunter) | విలియం హంటర్ (William Hunter) |

BRAOU

| | | |
|---|---|---|
| 2. మార్నింగ్ పోస్ట్ (Morning Post) | ఆర్కి బాల్క్ థామ్సన్ (Arch Bolk Thomson) | ఆర్కి బాల్క్ థామ్సన్ (Arch Bolk Thomson) |
| 3. టెలిగ్రాఫ్ (Telegraph) | హల్ట్ మాకిన్లీ (Halt Macanly) | హల్ట్ మాకిన్లీ (Halt Macanly) |
| 4. కలకత్తా కొరియర్ (Calcutta Courier) | థామస్ హాలింగ్ బెరీ (Thamas Halling Berry) | – |
| 5. ఓరియంటల్ స్టార్ (Oriental Star) | రిచర్డ్ ఫ్లెమింగ్ (Richard Flemming) | రిచర్డ్ ఫ్లెమింగ్ (Richard Flemming) |
| 6. ఇండియా గెజిట్ (India Gazette) | విలియం మోరిస్, విలియం ఫార్లీ, జె.డి. విలియమ్స్ (William Moris, Willam Farly J.D. Williams | |
| 7. ఆసియాటిక్ మిర్రర్ (Asiatic Mirror) | చార్లెస్ కె. బ్రూస్ (Charles K. Bruce) | చార్లెస్ కె. బ్రూస్ (Charles K. Bruce) |

## 7.10 సంగ్రహంగా

ఈ భాగంలో భారతదేశంలో తొలిసారిగా పత్రికలు ఎలా వచ్చింది, అవి ఎట్టి నిర్బంధాలకు లోనైంది తెలుసుకున్నాం. అంతేకాక పత్రికా స్వేచ్ఛకై దేశీయ పత్రికా రంగం కోరికలు, పత్రికలపై నిర్దేశాలను జారీ చేస్తూ వచ్చిన చట్టాలను సక్షిప్తంగా వివరించడం జరిగింది.

BRAOU

## 7.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. భారతదేశంలో ఆంగ్లేయ, దేశీయ పత్రికల ఆవిర్భావం, వాటి ప్రభావాన్ని వివరించండి.
2. పత్రికా రంగంలో 'వర్నాక్యులర్ ప్రెస్ ఆక్టు' (Vernacular Press Act) నుండి 'ప్రెస్ కమీషన్' (Press Commission) వరకు వచ్చిన వివిధ సంఘాల సిఫారసులను క్లుప్తంగా వివరించండి.

**II. క్రింది వాటిపై లఘువ్యాఖ్యలు రాయండి**

1. హికీ ఉదంతం. 2. వర్నాక్యులర్ ప్రెస్ ఆక్ట్ 3. ప్రెస్ కమీషన్

## 7.12 ఉపయుక్త గ్రంథాలు


Chalapati Rao, M. — **The Press**

Datta — **Dawn of Renaissance in India**

Ishwara Datta — **A street of Ink**

Natarajan — **Journalism in India**

Raghuvamsi — **Indian Society**


*రచయిత – శ్రీ ఎ.వి. కోటిరెడ్డి*

# భాగం - 8 : సాంస్కృతిక - వైజ్ఞానిక అంతర్లీనతలు

విషయ క్రమం


8.0 లక్ష్యాలు

8.1 పరిచయం

8.2 సాంస్కృతిక ప్రభావం

8.2.1 విద్య

8.2.2 మత సంస్కరణ

8.2.3 సాంఘిక ఆలోచనలు

8.3 సాంస్కృతిక పునరుజ్జీవనం

8.4 జాతీయతా భావ ఆవిష్కరణ

8.5 జాతీయ భావ పెంపుదల ఘట్టాలు

8.6 సంగ్రహంగా

8.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

8.8 ఉపయుక్త గ్రంథాలు


## 8.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు క్రింది విషయాలను తెలుసుకోగలగాలి

- 18వ శతాబ్దంనాటి సామాజిక వ్యవస్థలో మతం, విద్యలో వచ్చిన మార్పులు సాంస్కృతిక పునరుజ్జీవనానికి దోహదం చేసిన తీరు.
- సాంస్కృతిక పునరుజ్జీవనం మూలంగా వచ్చిన జాతీయ జాగృతి, జాతీయ భావాల అభివృద్ధి క్రమం

## 8.1 పరిచయం

భారతదేశ చరిత్రలో 18వ శతాబ్దం రెండవ భాగం, 19వ శతాబ్దాలను స్థూలంగా సంధి యుగంగా పేర్కొనవచ్చు. ముఖ్యంగా 19వ శతాబ్దం మనదేశ చరిత్రను మలుపు త్రిప్పింది. భారతదేశం ఈ శతాబ్దంలోనే మధ్య యుగం నుండి ఆధునిక యుగంలో అడుగిడిందని చెప్పవచ్చును. ఐరోపాలో 15,16 శతాబ్దాలలో వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవనం, మత మార్పులు, జాతీయతా రాజ్యాలు ఎలా ఆధునిక యుగారంభానికి తోడ్పడ్డయో, అదే రీతిలో 19వ శతాబ్దంల్లో భారతదేశంలో మతంలో, విద్యలో సామాజిక వ్యవస్థలో, రాజకీయ సిద్ధాంతాల్లో ప్రముఖమైన మార్పులకు రంగం సిద్ధమైంది. ఎంతో సంప్రదాయబద్ధమైన వ్యవస్థగా చెప్పుకొన్న ఈ దేశంలో ప్రజలు మార్పును హర్షించారు. ఆదరించారు. ఆధునిక ఆలోచనలకు ఆవిష్కరణ జరిగింది. 19వ శతాబ్దం మనదేశ చరిత్రలో ఒక విభజనగా భావింపవచ్చును. అంతకుమందు ఎనిమిది శతాబ్దాలుగా జరుగని మార్పులు ఈ ఒక్క శతాబ్దంలో వచ్చి, అన్ని రంగాలను ప్రభావితం చేసింది. సంప్రదాయానికీ, ఆధునికతకు

జరిగిన మధనం ఎన్నో నూతన ఆలోచనలకు, వ్యవస్థలకూ దోహదం చేయగా, సంప్రదాయం సమూలంగా క్షీణించకుండానే ఆధునికత ఆవిష్కరింపబడింది.

## 8.2 సాంస్కృతిక ప్రభావం

### 8.2.1 విద్య

కొన్ని వందల సంవత్సరాలుగా భారతదేశం మిగతా ప్రపంచంలో సంబంధాలు లేకుండా ఉంది. ఆంగ్ల విద్య ఈ అడ్డుగోడలను పగులగొట్టింది. క్రీ.శ. 1000 ప్రాంతంలో ముస్లిం మేధావి అయిన ఆల్‌బెరూని (Alberuni) హిందువులు మిగతా ప్రపంచంతో వేరుపడి, పశ్చిమ దేశాల కళలు, విజ్ఞాన శాస్త్రం తెలియక వెనుకబడి ఉన్నారని వ్యాఖ్యానించాడు. ఇదే పరిస్థితి మనకు 18వ శతాబ్దం వరకు కొనసాగింది. 19వ శతాబ్దపు తొలి దశాబ్దంలోనే మార్పులు ప్రారంభమైనవి. ఆంగ్ల విద్యతో వచ్చిన పశ్చిమ దేశాల రాజకీయ, సామాజిక ఆశయాలు, భారతదేశాన్ని వెల్లువలా ముంచెత్తాయి. అర్ధ శతాబ్దపు ఆంగ్ల విద్య బెంగాల్‌లోని హిందువులను, వారి ఆలోచనలను మార్చినంతగా, వెయ్యేళ్ళ చరిత్ర కూడా మార్చలేదన్నది నిర్వివాదాంశం. ఈ పశ్చిమ దేశ సిద్ధాంతాలు సరైన, అనువైన సమయంలో భారతదేశంలో మొలకెత్తాయి. హేతు వాదం, వ్యక్తిత్వ వాదం, ఫ్రెంచ్ విప్లవ సిద్ధాంత జ్యోతులు నాటి ఐరోపా మేధావులను ఆకట్టుకున్నాయి. మూఢ విశ్వాసాలపై ఆలోచనా శక్తి, అధికార శృంఖలాలపై వ్యక్తిగత శ్రేయస్సు, అజ్ఞానంపై సామాన్య ప్రజల విద్యా వివేకం జయభేరి మ్రోగించిన కాలమది. నూతన మత, సామాజిక ఆలోచనలతోబాటు రాజ్యంపట్ల, సంఘ కార్యకలాపాలపట్ల, ఆలోచన, వివేచన ఉదయించిన రోజులవి. మత విషయంలో ఒక విమర్శనా దృష్టి, రాజ్యం, సాంఘిక వ్యవస్థల ఆవిర్భావం, పరిధి, విధులను గూర్చి నిర్ణయం చేసిన యుగమది.

ఈ ఆధునిక యుగాశయాలు భారతదేశంలో సరైన సమయంలో ప్రవేశించాయి. ఈ పశ్చిమ సంస్కృతి ప్రభావంతో, మధ్య యుగ లక్షణాలైన నాటి ఆచారాలు, నమ్మకాలు ఆలోచనలపై గల గుడ్డి విశ్వాసం తొలగిపోయింది. ఏ విషయాన్నైనా అంగీకరించే ముందు ఆలోచించటం, తర్కించటం, మొదలైన హేతు వాద లక్షణాలు, ప్రస్ఫుటంగా కన్పించాయి. మూఢనమ్మకాలు, సంప్రదాయం, ఆచారాలు, మొదలైన శక్తులపై ఆలోచనలు, తిరుగుబాటు చేస్తేనే కాని సాంఘిక, మత రాజకీయ రంగాల్లో పురోగమనం, ప్రగతి సాధ్యం కాదు. అంతేకాక ఈ రంగాల్లోని మార్పులు ఒకదానిపై మరొకటి ఆధారపడి ప్రభావితమైతాయి. ఉదాహరణకు, బెంగాల్‌లో ఆంగ్ల విద్య ప్రభావం ప్రథమంగా, మతంలో హేతు వాదానికి, పిదప సామాజిక వ్యవస్థలో మార్పులకు, చివరగా, రాజకీయ రంగంలో జాతీయ తత్వ ప్రేరణకు, దోహదం చేసింది. బ్రహ్మ సమాజం, మతాలోచనల మార్పుతో ప్రారంభమై, క్రమేణా చాలావరకు ఒకదానితొకటి ముడిపడి మార్పులు చెందితే, ఆ మార్పులు కాలక్రమేణా నూతన రాజకీయ సిద్ధాంతాల రూపకల్పనకు దోహదం చేశాయి.

ఆంగ్ల విద్య బెంగాల్‌లో యువకులను విశేషంగా ఆకర్షించింది. ఆ సాహిత్యాన్ని, ఆలోచనలను ఒక్కసారిగా చవిచూసిన విద్యార్థిలోకంలో రాజిల్లిన స్వేచ్ఛాలోచనలు ప్రథమంలో నిర్మాణాత్మకంగాక, విశృంఖలంగా, విధ్వంసపు దారిలో పయనించడం సామాన్యమైన చారిత్రక పరిణామమే. అర్థంలేని ఆచారాలు, తర్కానికి నిలువని సంప్రదాయాలపై ఆంగ్ల విద్యా ప్రభావితులైన విద్యార్థులు హేతు వాద కత్తిని ఝుళిపించడం, వారి తిరుగుబాటును గూర్చి కథలుగా చెప్పుకోవడం, సాంప్రదాయ బద్ధులైన పెద్దలను కలవరపరిచింది. ఎన్నో వందల సంవత్సరాలుగా పవిత్రంగా పరిరక్షించుకొన్న హిందూ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని భయాందోళనలు చెందారు. బెంగాలీ పత్రికల్లో వారి భయాలను తెలియజేసే ఉత్తరాలు ప్రచురింపబడ్డాయి. "హిందూ కళాశాల్లో చదువుతున్న మా

అబ్బాయి పాత దుస్తులు, ఆచారాలు మానాడు. స్నానం చేయకుండానే భోజనం చేస్తాడు. ఎట్టి సంప్రదాయాలు పాటించడు". అని ఒకరు చెపితే, తాను తన కుమారుని కాళిమాత దేవాలయానికి తీసుకువెళ్ళితే, సాష్టాంగ దండ ప్రమాణం చేయక, మాతకు 'శుభోదయం' మాత్రమే చెప్పాడని మరో తండ్రి బాధ పడ్డాడు. వారి మాటల్లో, చేతల్లో, రాతల్లో మార్పులు వచ్చాయని, చివరకు చార్వాకుని నాస్తిక సిద్ధాంతాలను కూడా అంగీకరిస్తున్నారని ఎందరో పెద్దలు వాపోయారు. అంతేకాక, హిందూ కళాశాల విద్యార్థుల్లో కొందరు పూర్తిగా పాత సంప్రదాయాలను, మతాచారాలను వదలివేసి, హిందూ మత భావాలను దెబ్బతీసే అలవాటైన ఎద్దు మాంసం తిన్నట్లు ఆధారాలున్నాయి. చరిత్రలో ఇట్లాంటి సంఘటనలను గమనిస్తే, ఒక్కొక్కసారి సంప్రదాయిక విముఖత వెర్రితలలు వేయటం, క్రమేణా తీవ్రత తగ్గి, మామూలు స్థాయిలో సంస్కరణలను అభిలషించడం గమనించగలం. హిందూ కళాశాల సంఘటనలను సమర్థించినవారు, విమర్శించినవారు లేకపోలేదు. ఈ పోకడలన్నీ నాటి వ్యవస్థలో వస్తున్న మార్పుల ఫలితంగా ఉత్పన్నమైన మంచి చెడులే.

### 8.2.2 మత సంస్కరణ

ఆంగ్ల విద్యాభ్యాసం ఎంతవరకు భారత జాతిని ఉత్తేజ పరచింది, ఉపయోగపడింది లేదా ఎంతవరకు వారిని చెడగొట్టింది, అనే విషయంపై ఎన్నో వాద వివాదాలున్నవి. ఈ వాద వివాదాల్లో అది జాతీయ సంక్షేమం కోసం తోడ్పడిన విషయాన్ని విస్మరించరాదు. ప్రప్రథమంగా భారతీయుల్లో విచక్షణను, వివేచనను, ఆలోచనను ఆంగ్ల విద్య ప్రవేశపెట్టింది. ఈ హేతు వాద ధోరణి రాజా రామ్‌మోహన్ రాయ్, అతని బ్రహ్మ సమాజం ప్రతీకలు. నాటి హిందూ ఆచారాలను వేదానుగుణమైనవి కావని, బహు విగ్రహారాధనను వేదాలు చెప్పలేదని రామ్‌మోహన్ రాయ్ వాదించాడు. ఈ వాదన నిజానిజాలను వదలి వేద్దాం. రామమోహన్ రాయ్ ప్రచారం నాడు ఎటువంటి ఆలోచనలేకుండా గుడ్డిగా మతాచార్యులు చేసే మత గ్రంథాల, వేదాల, వ్యాఖ్యానంపై తిరుగుబాటును సూచిస్తుంది. మధ్య యుగ మత ఛాందసంలో మ్రగ్గుతున్న అమాయక జనులకు రామ్‌మోహన్ రాయ్ ఒక ఆధునిక భారతదేశ నిర్దేశకుడు. సంస్కరణ విషయంలో ఆయనను 'బేకన్', (Bacon) 'లూథర్' (Luther) తో పోల్చవచ్చును. ప్రకృతిలో సామాజిక వ్యవస్థలో విశ్వవ్యాప్తమైన ఆలోచన శక్తి యొక్క స్వచ్ఛమైన, పురాతనమైన, వైభవాలు. ఈ మతం చుట్టూ కాలక్రమేణా ఆచారాల సాలెగూడేర్పడింది. వాటి నుండి శాశ్వతమైన విశ్వవ్యాప్తమైన మతాన్ని వేర్వేరు మత జీవనానికి మూలంగా పొందుపర్చడమే. నేడు ఆలోచింపవలసిన విషయం అని రామ్ మోహన్ రాయ్ భావించాడు. సతీ సహగమనం లాంటి దురాచారం నాటి మూఢ నమ్మకాల నిరంకుశత్వానికి ప్రతీక. రామ్‌మోహన్ రాయ్ ఈ దురాచారాన్ని దుయ్యబట్టగా, ఎందరో అతని సమర్థించారు. దేవేంద్రనాథ్ టాగూర్, కేశవ చంద్రసేన్ మొదలైనవారు ప్రాచీన సంప్రదాయ సంకెళ్ళను ఆలోచనలతో, ఆత్మపరిశోధనతో తొలగించాలని వాదించారు. బ్రహ్మ సమాజం ఒక మత సాంఘిక ఆచారాలను అభ్యంతరం చెప్పిన వ్యతిరేకతయే కాని, తిరుగుబాటు కాదని కొందరి అభిప్రాయం. రాజా రామమోహన్ రాయ్ కాలంలో అది ఒక తిరుగుబాటు ఉద్యమం కాపోయినా, దేవంద్రనాథ్ ఠాగూర్ కాలంలో అది ఒక మత తిరుగుబాటు. కేశవ చంద్రసేన్ కాలంలో అది ఒక సామాజిక తిరుగుబాటు. అడుగడుగు వేస్తూ ఈ తిరుగుబాటు ఆధునిక భారతంలో ఒక జాతీయ తిరుగుబాటుగా పరివర్తన చెందింది. పాశ్చాత్య విద్య హిందూ మతంలోని భ్రష్టాచారాలను, దుర్నీతిని ప్రక్షాళనం చేయటానికి తోడ్పడింది. కాని మౌలికమైన హిందూ మతాన్ని మార్చలేదు. హిందూ మతం ఒక జీవన విధానమే గాని, స్పష్టమైన నిర్దిష్టమైన మతం కాలేదు.

### 8.2.3 సాంఘిక ఆలోచనలు

సాంఘిక, మత ఆలోచల్లో హేతు వాదాన్ని జ్ఞాన వివేచనాన్ని రామ్‌మోహన్ రాయ్ ప్రవేశపెట్టగా, అది ఆధునిక భారతదేశంలో రాజకీయ సంస్కరణలకు దారి తీయటం యాదృచ్ఛికం కాదు. ఒక రంగంలో

ఉదరాలోచనలు, తార్కిక జ్ఞానం మరో రంగాన్ని చేరవని తలవటం మూర్ఖత్వం. పూజారుల నిరంకుశత్వాన్ని ప్రశ్నించిన వారు రాజ్య నిరంకుశత్వాన్ని కూడా సవాలు చేయటం సహజం. సామాజిక మత వ్యవస్థలోని సాంప్రదాయాలకు భిన్నంగా మార్పులు కోరినవారు, విదేశీ పాలన రాజకీయ వ్యవస్థల మార్పులు కోరటం విచిత్రమేమి కాదు. కాని భారతదేశంలో ఒక ఉదార వాతావరణం, హేతు వాద దృష్టి, జ్ఞాన వివేచన అన్ని రంగాలను తట్టిలేపింది. అదే జాతీయ తత్వానికి ప్రేరణ కల్పించింది. భారత రాజకీయాంశాలను, కార్యక్రమాలను, ఆ జాతి సత్యం, న్యాయం, ప్రేమ అనే విషయాలపై కొత్తగా ఆవిర్భవించిన నైతిక వాంఛనుండి నేర్పి చదవటం దుస్సాధ్యమని జకారియస్ (Zacharias) వ్యాఖ్యానించాడు. భారత జాతీయావిర్భావంలో రామ్‌మోహన్ రాయ్, దయానంద సరస్వతి, వివేకానంద, మహాత్మా గాంధీల పాత్రను అధ్యయనం చేస్తే, పై వాఖ్యానం వాస్తవమని తెలియగలదు.

భారతీయ జీవనం మత, నైతిక శక్తులచే ఎంతో ప్రభావితమైంది. భారతీయతత్వం రాజకీయ సిద్ధాంతాలపై వీటి ప్రభావం లేకపోలేదు. ప్రథమంలో పాశ్చాత్య ప్రభావంతో భారత సామాజిక వ్యవస్థలు, మత సిద్ధాంతాలు, పనికిరానివని, నూతన పునాదులపై జాతీయ జీవనాన్ని పునిర్మించాలనే అతివాదం బయలుదేరింది. మొగల్ కాలంలో పర్షియన్ భాషను నేర్చుకున్నంత మాత్రాన, పాలకుల మతాన్ని భారతీయులు స్వీకరించ లేదు. అలాగే అంగ్లం నేర్చుకొన్న భారతీయులు కూడా సంప్రదాయాలను వదలుకొనలేదు. పాశ్చాత్య జ్ఞానాన్ని మేళవించి, దురాచారాలను, మూఢనమ్మకాలను దూరంచేసి, తమ సంస్కృతిని మరింత సుసంపన్నం చేయగలిగారు. పాశ్చాత్య ప్రభావంతో సాంఘిక, సంస్కరణకు ప్రోత్సాహం లభించింది. ఛాందస మతంపై పోరాటం సాగింది. విద్యలో విద్యా విధానంలో మార్పులు వచ్చాయి. సాహిత్య ప్రక్రియలు ఆధునిక స్వదేశీ భాషలు అభివృద్ధి చెందాయి. పత్రికలు వార్తలను, వ్యాసాలను, విమర్శలను, వ్యాఖ్యలను ప్రచురించి, ప్రజల్లో ఇంతకు ముందు ఎన్నడూలేని రీతిగా జాతీయ తత్వాన్ని, దేశభక్తిని పురికొల్పాయి.

## 8.3 సాంస్కృతిక పునరుజ్జీవనం

19వ శతాబ్దంలో భారతదేశమంతటా సాహితీపరమైన ఆధునికాలోచనలు కన్పిస్తాయి. అన్ని భాషల్లో అది పునరుజ్జీవన కాలం. హిందీ, ఉర్దూ, సాహిత్యంలో ఎందరో కవులు, రచయితలు వివిధ సాహిత్య ప్రక్రియలను చేపట్టారు. బెంగాలీ, మరాఠీ, గుజరాతీ తెలుగు, ఒరియా భాషల్లో ఎన్నో గ్రంథాలు వెలువడ్డాయి. అవి నూతన ఆలోచనలను, సాహితీ ప్రక్రియలను ప్రవేశపెట్టాయి. ఇదే కాలంలో ప్రాచీన సాహిత్య పద్ధతులు పునరుజ్జీవనాన్ని పొంది, పాత, కొత్తల మేలుకలయిక సాగింది. ఆధునికత, ప్రాచీనతల సమన్వయం, మేళవింపు, క్రొత్త ప్రక్రియలకు, ఆలోచనలకు దారితీసింది.

ఈ సాంస్కృతిక పునరుజ్జీవనం, ఆధునిక భారతదేశంలో గత చరిత్ర వైభవాలవైపు, పరిశోధనపై ఆసక్తిని రేకెత్తించినది. 1784లో బెంగాల్‌లో స్థాపించబడిన 'ఆసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్' (Asiatic society of Bengal ప్రాక్ పశ్చిమాల కలయికకు సంగమ స్థానమైంది. ప్రపంచ చరిత్రలో పశ్చిమాల సంస్కృతి సమ్మేళనానికి నాంది పలికింది. నాటినుండి చార్లస్ విల్కిన్స్ (Charles Wilkins) సర్ విలియం జోన్స్ (Sir William Jones) అలెగ్జాండర్ హేమిల్టన్ (Alexander Hamilton) మాక్స్ ముల్లర్ (Max Muller) రైస్ డేవిస్ (Rhys Devis) కీత్ (Keith) వింటర్ నిట్జ్ (Winter nitz) లాంటి ప్రతిభాశాలురు భారతదేశ పురాతన చరిత్రను, మేధస్సును ఎన్నో రకాలుగా బహిర్గతం చేయడంలో కృతకృత్యులయ్యారు. అదే రీతిలో భారతీయ పండితులైన రాజా రామ్‌మోహన్ రాయ్, బెనర్జీ, భండార్కర్, రనడే, దత్‌లు ఎంతో కృషిసల్పారు. కలకత్తా విశ్వ విద్యాలయం పూనాలోని భండార్కర్, ఓరియంటల్ ఇన్స్టిట్యూట్, (Oriental Institute) ఆసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్, (Asiatic society of Bangal)

ప్రభుత్వ పురావస్తు శాఖలుకూడా ప్రాచీన చరిత్ర పరిశోధనలో బహుముఖ సేవ చేశాయి. భారతదేశ చరిత్ర అధ్యయనంలో కొత్త శకం ప్రారంభమైంది. సింధూ నది నాగరికత, తక్షశిల, నలందా, నాగార్జున కొండల్లోని పురావస్తు విశేషాలు, భారతదేశ పురాతన చరిత్రను తిరిగి రాయడానికి దోహదం చేశాయి.

ఈ పునరుజ్జీవనం భారతీయ వేదాంతం. విజ్ఞాన శాస్త్రాల్లో కూడా ప్రభావాన్ని చూపింది. రవీంద్రనాథ్ టాగూర్, దేవేంద్రనాథ్ టాగూర్, సర్వేపల్లి రాధకృష్ణన్, దాస్ గుప్త వంటి మేధావులు హిందూ వేదాంతాన్ని తిరిగి రాయడమే కాక, సరికొత్త వ్యాఖ్యానాలను జత చేశారు. విజ్ఞాన శాస్త్రంలో సర్. జె. సి. బోస్, పి. సి. రే, సర్ సి. వి. రామన్, డా. మేఘనంద్ షా లాంటి వారు అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. బెంగుళూర్‌లో 1934లో స్థాపించబడిన 'ఏకాడమీ ఆఫ్ సైన్స్' (Academy of Science) పరిశోధనా కేంద్రమైంది.

భారతీయ కళలు రాజకీయ అస్థిరత మూలంగా, క్షీణ దశను చేరాయి. మొగల్ సామ్రాజ్య పతనం, 18వ శతాబ్ద పరిస్థితులు సృజనాత్మక శక్తిని, కళల ప్రమాణాలను, మరింత దిగజార్చాయి. ఢిల్లీ, జయపూర్, లక్నో, హైదరాబాద్, మైసూర్‌ల్లో మాత్రమే, ఈ కళలు ఇంకా చావకుండా కొన ఊపిరితో ఉన్నాయి. 19వ ప్రథమార్ధంలో భారతీయ వాస్తు శిల్పులు పశ్చిమ పద్ధతులను అనుకరించారు. కాని అవి అందహీనంగా రూపొందాయి. ఆ తరువాత ప్రాక్పశ్చిమ నమూనాలను సమ్మేళనం చేసిన వాస్తు శిల్పం, వైజ్ఞానిక ప్రగతితో కలిసి, ముఖ్య పట్టణాల్లో అందమైన భవనాల నిర్మాణానికి దారితీసింది. చిత్రకళ, ముఖ్యంగా బెంగాల్‌లో పునర్వికాసాన్ని సంతరించుకుంది. అవానీంద్ర టాగూర్, నందలాల్ బోస్, అబ్దుల్ రహిమాన్ వంటి చిత్రకారులు, గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, కలకత్తా, లాహోర్, జైపూర్‌ల్లోని ఆర్టు కళాశాలలు తిరిగి చిత్రలేఖనాన్ని, శిల్పకళను ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళారు. భారతీయ సంగీతం కూడా 19వ శతాబ్దంలో మంచి ఆదరణ పొందింది. సంగీత మూలమైన శ్రావ్యతను పోగొట్టకుండా, పశ్చిమ సంగీత ధోరణులు కూడా మేళవింపబడ్డాయి. ఈ పునర్వికాసమంతా భారతీయ కళా చైతన్యాన్ని ప్రతిఫలించింది.

18,19వ శతాబ్దాల సాంస్కృతిక విషయాలకు జాతీయ ప్రేరణ లేదు. మత సంబంధం కాని, లౌకిక కళలు కూడా జాతీయతను ప్రతిబింబించ లేదు. అవి కేవలం రాజుల, పాలకుల ఘనతనే చాటి చెప్పాయి. అవి నాటి, కులీన వర్గాల లేదా మత సంస్థల కళలుగానే పరిగణింపబడ్డాయి. కాని జాతీయ కళలుగా చెప్పబడ లేదు. ఆంగ్లేయులు భారతదేశ పాలనను స్వీకరించకముందు, జాతీయ సంస్కృతి అనేది కన్పించదు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సమగ్రత, సమైక్యత సాధింపబడ్డాకనే జాతీయం చేకూరింది. జాతి పటిష్టత వివిధ ఘట్టాల్లో వారి ఆర్థిక సారూప్యత, ప్రత్యేక రాజ్య ఆకాంక్ష ఆవశ్యకం. జాతీయత రూపొందే దశలో సాహిత్యంలో, కళల్లో కూడా స్వరూప భేదాలకన్నా, సారూప్యత ద్యోతకమవుతుంది. ఆ దేశ సామాజిక వ్యవస్థలో వివిధ వర్గాల, వ్యక్తుల, సంస్థల, ఆలోచనలు ఆశయాలు ఒక దారిలో ప్రయాణిస్తాయి.

## 8.4 జాతీయతా భావ ఆవిష్కరణ

భూస్వామ్య వ్యవస్థగా కొనసాగిన భారతదేశంలో ఆధునిక పెట్టబడిదారీ, ఆర్థిక సిద్ధాంతాలను రాకుమారుల, జమిందారుల సామాజిక పెత్తనానికి కొంతవరకు స్వస్తి చెప్పాయి. నూతనంగా ఆవిర్భవించిన మధ్యతరగతి, ఉద్యోగ శ్రామిక వర్గాలు, పెట్టుబడిదారి. ఆర్థిక విధాన జనితాలే, వీరు నూతన జాతీయ రాజ్య భాగస్వాములయ్యారు. వీరి వర్గ ప్రయోజనాలు కొంతవరకు సామ్య వాదం వైపు పయనించాయి. జాతీయ శ్రామిక వర్గం, జాతీయ మధ్యతరగతి జాతీయ రైతు వర్గం ఒక జాతీయ దృక్పథాన్ని, సంస్కృతిని, కల్పించి పోషించాయి. ఈ జాగృతి మనకు బెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక మద్రాస్ మొదలైన భిన్న ప్రాదేశిక విభాగాల్లో, ఒకే పద్ధతిలో కన్పిస్తుంది. జాగృతమైన సామాజిక వర్గాలు, భిన్న ప్రాంతాల జాతీయతలు ఒకే జాతీయతగా రూపొందడం ఆధునిక పరిణామమే.

భారతదేశాన్ని ఆంగ్లేయులు జయించి, వారి పారిశ్రామిక వర్తక, బ్యాంకింగ్ ప్రయోజనాలకై ఒకే ఆర్థిక పరిధిలోనికి తీసుకువచ్చారు. భారతదేశ భిన్న సామాజిక వర్గాలు, ప్రజలు స్వేచ్ఛగా రూపాంతరం చెందడంపై ఆంగ్లేయులు తమ ప్రయోజనాలకై విధించిన నిబంధనలు కల్పించిన అడ్డంకులే, భారత జాతీయ తత్వాన్ని ప్రేరణ చేసింది. భారతదేశ పరిశ్రమలపై ఆంక్షలు, ముడిసరుకులకై భారతదేశ వ్యవసాయంపై నిర్బంధాలను విధించి, ఈ దేశాన్ని ఒక బ్రిటిష్ వలసగా, ఆ దేశ ఆర్థిక ప్రయోజనాలకు ఉపయోగకారిగా ఉంచాలని ఆంగ్లేయ ప్రభుత్వం ప్రయత్నించింది. ఆంగ్లేయుల పురోగమన విధానాలను ప్రథమంలో సమర్థించిన భారతీయ వర్గాలు ఈ ఆర్థిక విధానం దేశ ఆర్థిక, సామాజిక సంస్కృతి పెరుగుదలను పూర్తిగా హరించివేస్తుందని గమనించి, ఆంగ్లేయాధికారాన్ని ఎదిరించారు. దేశ ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణలో భిన్న వర్గాలు సమైక్యమైనవి. ఇదే జాతీయ తత్వానికి, జాతీయోద్యమానికి దోహదం చేసింది. నూతన ఆర్థిక వర్గాల ఆవిర్భావం, విద్య, పత్రికా రంగాల ప్రభావం, నూతన సామాజిక, మత ఉద్యమాలు సిద్ధాంతాలు, ప్రజాస్వామ్యం, వ్యక్తిత్వ వాదం, జాతీయ రాజ్యం, మొదలైన నూతన అభిప్రాయల అలజడి భారతదేశంలో జాతీయతా భావాన్ని కల్పించింది. ఈ జాతీయతా భావం జాతీయ జీవనాన్ని అన్ని రంగాల్లో ప్రభావితం చేసింది.

## 8.5 జాతీయతా భావ పెంపుదల ఘట్టాలు

ప్రథమంలో జాతీయతా భావానికి విస్తృతమైన సామాజిక ప్రాతిపదిక కొరవడింది. నూతనంగా స్థాపించబడిన విద్యాలయాల్లో చదువుకొన్న విద్యార్థులు మాత్రమే, పశ్చిమ సంస్కృతిని, ప్రజాస్వామ్య, జాతీయ భావాలను ఆకళింపు చేసుకున్నారు. రాజా రామ్‌మోహన్ రాయ్ లాంటి కొద్దిమంది మేధావులు భారత జాతి అనే రాజకీయ ఆదర్శాన్ని ప్రచారం చేశారు. హేతు వాదం, ప్రజాస్వామ్యం, ఉదార వాద సిద్ధాంతాలు వారి సాంఘిక, మత సంస్కరణోద్యమాల్లో ప్రముఖమైనవి. పత్రికా రంగ స్వేచ్ఛ, పాలనా రంగంలో భారతీయుల భాగస్వామ్యం వంటి హక్కులను కోరడం జరిగింది.

B R A O U

1885లో భారత జాతీయ కాంగ్రెస్ అనే సంస్థ ఏర్పడడం ఒక ప్రముఖ చారిత్రక సంఘటన, ఉదార వాదులు, మేధావులు ఈ సంస్థ తొలి దశలో కార్యక్రమాలను నిర్వహించారు. వారి ఆలోచనలు, పనులు నాడు కొత్తగా ఉద్భవించిన మధ్యతరగతి ప్రయోజనాలను, హక్కులను ప్రతిబింబించేవి. ఆనాటి ఆధునిక విద్య మరింత అభివృద్ధిచెందింది. పారిశ్రామికత మొదలైంది. కాంగ్రెస్ భారతదేశంలో పరిశ్రమలు స్థాపించాలని కోరింది. 1905లో స్వదేశీ ఉద్యమం దీనికి తార్కాణం. ఉదార నాయకత్వంగా గల కాంగ్రెస్, విద్యావంతులైన మధ్యతరగతికి, వర్తక వర్గానికి ప్రాతినిధ్యం వహించి, ఆర్థిక దోపిడీ విధానం ఆగిపోవాలని, రాజ్య పాలనలో భారతీయులకు ఎక్కువగా ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేసింది. పౌరహక్కులు, ప్రాతినిధ్య సంస్థలు, రాజ్యాంగబద్ధ ప్రభుత్వం మొదలైన విషయాలపై ఆందోళన చేపట్టింది. ఆంగ్లేయ ప్రభుత్వం వీరి కోరికలను మన్నించలేదు. ఫలితంగా కొందరు జాతీయవాదులు అసంతృప్తి చెంది, కొత్త సిద్ధాంతాలు, కార్యాచరణ పథకాలతో పోరాటాన్ని సాగించాలని వాదించారు. వారు అతివాదులని పిలువబడ్డారు.

చదువుకొన్న మధ్యతరగతిలో నిరుద్యోగ సమస్య తలెత్తింది. కరువు, కాటకాలు సంభవించి, ఆర్థిక దుస్థితి మరింతగా ప్రజలను కలవర పెట్టింది. అతవాదుల బలం పెరిగింది. బెంగాల్ విభజన, పత్రికలపై ఆంక్షలు, యూనివర్శిటీ చట్టం లాంటి చర్యలతో ప్రభుత్వం ప్రజలను మరింత అసంతృప్తులను చేసింది. సమర్థవంతమైన నాయకత్వంలో అతివాదుల ప్రచారం ముమ్మరంగా సాగింది. ఉదార వాదులు పశ్చిమ సంస్కృతిని గొప్పగా తలచితే, అతివాదులు ప్రాచీన వైభవాన్ని, హిందూ సంస్కృతిని ప్రశంసించి, ప్రజల్లో ఆంగ్లేయ వ్యతిరేక ధోరణిని ప్రచారం చేశారు. పరిపాలన సంస్కరణల వల్ల జరిగేది ఏమీలేదని, స్వయం

పాలన కావలెనని ఉద్ఘాటించారు. ఇదే కాలంలో కొద్దిమంది విప్లవకారులుగామారి, భీతావహ పద్ధతుల్లో రాజకీయ స్వేచ్ఛను సాధించాలని తలచారు.

ఈ ఉద్యమాన్ని అణచటానికి ఎన్ని దమన చర్యలను తలపెట్టినా, జాతీయ తత్వం మరింత విస్తరించడం జరిగింది. హోమ్ రూల్ ఉద్యమం ప్రజల రాజకీయ చైతన్యాన్ని మరింత వృద్ధి చేసింది. ఆ తరువాత కాలంలో అంటే, 1918-1930 మధ్య జాతీయోద్యమం మరింతగా సామాన్య ప్రజలకు కూడ చేరింది. యుద్ధానంతర ఆర్థిక దుస్థితి ప్రభుత్వంపట్ల ఆశాభంగం, రాజ్య దమన నీతి, రైతులను శ్రామిక వర్గాన్ని కూడా బోధించింది. వారు జాతీయోద్యమ సానుభూతిపరులయ్యారు. ఐరోపా రాజ్యాల్లోని ప్రజాస్వామ్య విప్లవాలు, రష్యా కమ్యూనిస్ట్ విప్లవం వారిని ఆకర్షించింది. యుద్ధ కాలంలో బలపడిన భారతీయ పెట్టుబడిదారీ వర్గం కూడా ఈ ఉద్యమాన్ని బలపర్చింది. అంటే రాజకీయోద్యమానికి సాంఘిక పునాది మరింత విస్తృతం, పటిష్టం అయిందన్నమాట. ఆ కారణంగానే సహాయ నిరాకరణోద్యమం, శాసనోలంఘనోద్యమాలు విజయవంతమై, ఆంగ్లేయ ప్రభుత్వాన్ని కలవరపర్చాయి. సంపూర్ణ స్వరాజ్యం తమ ధ్యేయమని కాంగ్రెస్ ప్రకటించింది. జాతీయోద్యమం సామాన్య ప్రజల ఉద్యమంగా పరివర్తన చెందింది. కార్మిక, కర్షక వర్గాల భాగస్వామ్యం విధానాల నిర్ణయంలో ప్రధాన పాత్ర వహించాయి. ఇదే కాలంలో కొన్ని స్వార్థ శక్తులు, మత శక్తులు తలెత్తినా, జాతీయోద్యమ ప్రవాహంలో కొట్టుకపోయాయి, మహాత్మా గాంధీ నాయకత్వంలో స్వాతంత్ర్యోద్యమం ప్రజా ఉద్యమంగా మారింది.

ఆఖరి దశలో రైతుల, కర్షకుల ప్రయోజనాల సిద్ధికై కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఏర్పడింది. దళిత వర్గాలు తమ హక్కులకై ప్రత్యేక ఉద్యమాలను తలపెట్టారు. న్యాయవాదుల ప్రభావం మరింతగా పెరిగింది. కార్మికుల్లో, కర్షకుల్లో వర్గ చైతన్యం వృద్ధి చెందింది. వారు ప్రత్యేక సంస్థలను స్థాపించుకొని, ఆందోళన చేపట్టారు. భూస్వామ్య వ్యవస్థ రద్దును కోరారు. అఖిల భారత ట్రేడ్ యూనియన్లు, కిసాన్ మహాసభలు వచ్చాయి. అంతేకాక స్థానిక రాజుల ఆధీనంలోని ప్రాంతాల్లోకూడా జాతీయోద్యమం బలపడింది. మైసూర్, హైదరాబాద్, తిరువాన్కూర్, కొచ్చిన్, సంస్థాన ప్రజలు కూడా ప్రజాస్వామక హక్కులకై పోరాటాన్ని ప్రారంభించారు. ఒకవైపున జాతీయోద్యమం నడుస్తుండగానే, భాషాపరంగా తమకు రాష్ట్రాలు కావాలని, అటువంటి రాష్ట్రాలలోనే, తమ ప్రగతి సాధ్యమనే ఉద్యమాలు తలెత్తాయి. ఈ ఉద్యమాలు జరుగుతున్నా, భారత జాతీయ కాంగ్రెస్ ప్రభావం, పలుకుబడి స్థిరంగానే ఉన్నాయి. అంతేకాక జాగృతమైన భిన్న ప్రజల భాషా, సాంస్కృతిక వైవిధ్యాన్ని గుర్తించింది. అన్ని వర్గాల ఆలోచనలను, జాతీయ ప్రయోజనాలను, సమన్వయం చేయ ప్రయత్నించారు. వారి ప్రణాళికలో పౌర హక్కులతో పాటు ఆర్థిక హక్కులు కూడా చోటు చేసుకున్నాయి. స్వాతంత్ర పోరాటం ముమ్మరం అయినకొద్దీ, దేశ ప్రజల్లో జాతీయతా భావం మరింతగా పెరిగింది. అంతేకాక, రైతులు, కార్మికుల భాగస్వామ్యం కాంగ్రెస్, విధానాలను, వ్యవస్థను మరింత పటిష్టపర్చాయి. పై విషయాలన్నింటిని విశ్లేషిస్తే, మనం కొన్ని స్థూలమైన అభిప్రాయాలకు రావచ్చు.

1. ఆంగ్ల విద్యను భారతదేశంలో ప్రవేశ పెట్టడంతో, పాశ్చాత్య భావాలకు, ఆధునిక సిద్ధాంతాలకు, ప్రవేశం కల్పించబడింది. సాంప్రదాయబద్ధమైన హిందూ వ్యవస్థ ఈ నూతన సిద్ధాంతాలచే ప్రభావితమైంది.
2. ఇదే కాలంలో మత సంస్కరణ, సామాజిక దురాచారాలపై పోరాటం నెరపిన విద్యాధిక వర్గమే, రాజకీయ మార్పులకు కూడా కారణభూతమైంది.
3. సామాజిక, మత వ్యవస్థలపై, ఉదార వాద, వ్యక్తిత్వ ప్రభావాలు, ప్రజాస్వామిక ఆలోచనలు, రాజకీయాలు కూడా అన్వయించగా, జాతీయోద్యమం ప్రారంభమైంది.
4. పరిమిత సామాజిక ప్రాతిపదికపై వచ్చిన జాతీయోద్యమం, వివిధ వర్గాల చైతన్యం వల్ల, అర్థ శతాబ్ది కాలంలో ప్రజా ఉద్యమంగా మారింది. దేశ స్వాతంత్ర్యం ధ్యేయంగా పనిచేసింది.

BRAOU

5. రాజకీయ ఉద్యమ చరిత్రలో సామాన్యులు, కార్మికులు, కర్షకులు, పాలుపంచుకొని, స్వేచ్ఛ, సమానత్వం, ఆర్థిక హక్కులు పౌరహక్కులు, బాధ్యతాయుత ప్రభుత్వం, దళిత వర్గాలభివృద్ధి, సామ్య వాదం మొదలైన రాజకీయ, సాంఘిక ఆర్థిక, సిద్ధాంతాలకు రూపకల్పన, సాఫల్యం సాధించడానికి ప్రయత్నాలు జరిగాయి. జరుగుతున్నవి.

భారతదేశపు సాంస్కృతిక పునరుజ్జీవనం ఐరోపాలో వలె ప్రాచీనతను తిరిగి ప్రవేశపెట్టడం కాదు. మతం, సమాజం, సంస్కృతిలో బృహత్తర మార్పులకు కారణమై, జాతీయ జీవనాన్ని నిద్రావస్థ నుండి మేల్కొల్పింది. జదునాథ్ సర్కార్ విశ్లేషణ ప్రకారం ఈ పునరుజ్జీవనం మూడు దశలుగా సాగింది. ప్రథమంలో అది ఒక వైజ్ఞానిక మేల్కొలుపుగా ప్రారంభమై, సాహిత్యాన్ని, విద్యను, ఆలోచనలను, కళలను, ప్రభావితం చేసింది. రెండోతరంలో ఒక నైతిక శక్తిగా మారి, సామాజిక వ్యవస్థను, మతాన్ని, దురాచారాలనుండి ప్రక్షాళనం చేసింది. ఆతరువాత తరంలో ఆధునిక పద్ధతిలో భారతదేశ ఆర్థిక విధానాన్ని నిర్దేశించి రాజకీయ స్వేచ్ఛకు, దేశ స్వాతంత్ర్యోద్యమానికి దారితీసింది. అరబిందో విశ్లేషణ ప్రకారం, భారత సాంస్కృతిక పునరుజ్జీవనంలో మూడు ఘట్టాలున్నాయి. ప్రథమంలో ప్రాచీన నైతిక సిద్ధాంతాలు, పవిత్ర గ్రంథాలు వెలికి తీయబడ్డాయి. ఈ కృషిలో భారతదేశ చరిత్రను అధ్యయనం చేసిన ఐరోపావారి పాత్ర ప్రశంసనీయం. స్కోపన్ హోవర్ (Scopenhover) ఎమర్సన్ (Emersen) థోరో (Thorean) లాంటివారు. ప్రాచీన భారతీయ విజ్ఞతపట్ల ముగ్ధులయ్యారు. ఈకృషిలో భారతీయ వేదాంతులు, సన్యాసులు తోడ్పడినారు. రెండోదశలో ఈ పునరుజ్జీవన నైతిక శక్తి మన వేదాంతాన్ని, మతాన్ని, సాహిత్యాన్ని ప్రభావితం చేసింది. మూడో దశలో ఈ ప్రాచీన విజ్ఞాన సంచయాన్ని, ఆధునిక విజ్ఞానంతో మేళవించి, సమకాలీన సమస్యల పరిష్కారానికి నవీన ప్రయత్నాలు జరిగాయి. అరబిందో, భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని 15వ శతాబ్దపు ఐరోపా సాంస్కృతిక పునరుజ్జీవనంతో, ఐర్లాండ్‌తో పోల్చాడు. ఆంగ్లేయాధిపత్యం క్రింద శతాబ్దాలుగా అణచివేయబడిన ఐర్లాండ్ తన పురాతన సంస్కృతివైపు దృష్టి సారించింది. అదే రీతిగా 19వ శతాబ్దంలో వచ్చిన నూతన మత శాఖలన్నీ ప్రాచీన కాలంనాటి వారసత్వాన్ని, నైతిక సిద్ధాంతాలను హర్షించి, మధ్య కాలంలో వచ్చిన మూఢనమ్మకాలను, సామాజిక ఆచారాలను కుల భేదాలను, తీవ్రంగా గర్హించాయి. భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనం ఆధునిక ప్రపంచ చరిత్రలోనే ఒక మహత్తర ఘట్టం.

BRAOU

## 8.6 సంగ్రహంగా

ఇంతకుముందు మనం చదివిన ఏడు భాగాల్లోని విశేషాలు ఏ రీతిగా భారతదేశ చరిత్రను ప్రభావితం చేసింది. ఈ భాగంలో విశ్లేషించాం. మతంలో, విద్యలో, సామాజిక వ్యవస్థలో వచ్చిన సంస్కరణలు, ఆంగ్లేయ ప్రభావంతో వచ్చిన పత్రికా రంగం భారతదేశ వ్యవస్థలన్నింటినీ విశేషంగా ప్రభావితం చేయగా, ఆ మార్పులు ఏరీతిగా రాజకీయ రంగంలో జాతీయ భావాన్ని ప్రేరణ చేసిందో ఈ భాగంలో చర్చించడమైంది.

## 8.7 పరీక్షా నమూనా ప్రశ్నలు

**I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.**

1. ఆధునిక భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవన ఆవిర్భావాన్ని తెల్పి, మత, సాంఘిక, సాంస్కృతిక రంగాలపై దాని ప్రభావాన్ని వివరించండి.

2. భారతదేశ వ్యవస్థలో వచ్చిన మార్పుల ఫలితంగా జాతీయ భావాల ఆవిర్భావాన్ని తెల్పి, జాతీయ భావ పరిణామ ఘట్టాల్ని వివరించండి.

II క్రింద వాటిపై లఘువ్యాఖ్యలను రాయండి.

1. విద్యా రంగంలో వచ్చిన మార్పులు

2. సాంఘిక ఆలోచనలు

## 8.8 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Bharatya Vidya Bhavan | - | **British Paramountacy and Indian Renaissanice** |
| Datta | - | **Dawn of Renaissance in India** |
| Mazumdar B P. | - | **Social Backgound of Indian Nationalism** |
| Raghuvamsi | - | **Century of Social Reform in India** |
| Richard Lannoy | - | **The speaking Tree** |
| Srinivas m. N. | – | **Social Change in India** |


*రచయిత : శ్రీ ఎ. వి. కోటిరెడ్డి*

BRAOU

# ఖండం : III నూతన భావజాలం

ఈ ఖండంలో ఐదు భాగాలున్నాయి. అవి : హేతు వాదం మానవతా వాదం, ఉదార వాదం, ప్రత్యక్ష జ్ఞాన వాదం, సార్వత్రిక వాదం, ప్రత్యక్ష జ్ఞాన వాదం, సార్వత్రిక వాదం. ఆధునిక యుగారంభాన ప్రబలిన ఈ భావాలన్నీ విజ్ఞాన యుగానికి (Age of Englightenment) సంకేతాలయ్యాయి

ఈ యుగానికి నాలుగు లక్షణాలున్నాయి. అవి : (1) అతీత శక్తికి బదులు ప్రకృతికి, మతానికి బదులు విజ్ఞాన శాస్త్రాలకు ప్రాముఖ్యత కలిగింది. ప్రాకృతిక చట్టానికి అనుగుణంగానే ప్రకృతి, బుద్ధి కూడా ఉంటాయనే భావం ప్రబలింది. (2) హేతువును కీర్తిస్తూ, దాని ద్వారా ప్రకృతి రహస్యాలను శోధిస్తూ, మానవ జీవతాన్ని కూడా హేతుబద్ధం చేసుకోమనే అభిప్రాయం ఆదరణీయమైంది. (3) మానవ పరిపూర్ణత్వాన్ని విశ్వసిస్తూ, ఆశాభావంతో అభ్యుదయం వైపు సాగమనే ఉద్బోధన ఈ యుగంలో ప్రధానమైంది. (4) వ్యక్తికి ఉండే సహజ హక్కుల పట్ల గౌరవాన్ని ఈ యుగం చూపింది.

ఆధునిక యుగ లక్షణాలు, భావాలు భారతదేశంలో ప్రభవించిన అన్ని మేధోపరమైన ఉద్యమాలకు ఊపిరి పోశాయి. సంఘ సంస్కరణోద్యమం, స్వాతంత్రోద్యమం ఈ నేపథ్యంలో వచ్చినవే.

ఉదార వాదం, ఉపయోగితా వాదాలతో ప్రభావితమైన వలస పాలన భారతదేశంలో సంస్కరణలను చట్టాల ద్వారా ప్రవేశపెట్టే విధానాన్ని ఆరంభించారు. పాశ్చాత్య విద్య ద్వారా, నూతన భావ జాలం భారతదేశానికి అందింది. రాజా రామ్‌మోహన్ రాయ్ ఆధునిక భారతదేశానికి ప్రతీక అయ్యాడు. హేతు వాదానికి, మానవతా వాదానికి, ఉదార దృక్పథానికి, సార్వత్రిక వాదానికి అతడే ఆద్యుడయ్యాడు.

వలస పాలకులు ప్రవేశపెట్టిన పాశ్చాత్య విద్య, నూతన సంస్థలు, నూతన చట్టాలు, న్యాయ వ్యవస్థ మొదలైనవి భారతదేశాన్ని ఆధునికం చేశాయి. దీనివలన సాంప్రదాయ పండితులతోపాటు, స్థానిక వర్తకులు, రైతులు చైతన్యవంతులై భారతదేశంలోని మేధావి వర్గంలో సహ భాగమయ్యారు. ప్రపంచాన్నంతా 'నాగరికం' చేయాలనే బ్రిటిష్ లక్ష్యం భారతీయ మేధావులను ఆలోచింపజేసింది. వలస సంస్కృతిని ఎదిరించడం కోసం, భారతదేశం తన సాంస్కృతిక పునాదిని (Cultural base) ఏర్పాటు చేసికోవలసి వచ్చింది. ఈ ఎదిరింపుకోసం, సమకాలీన భారతీయ సమాజంలోగల దుష్టసాంప్రదాయాలను తొలగించడం కోసం, సంఘ సంస్కరణ ఉద్యమం ఆవశ్యకమైంది. భారతీయులు సంస్కృతీ మూలాలకు వెళ్ళి, తమ శాస్త్రాలను విమర్శనాత్మకంగా పరిశీలించారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ధర్మశాస్త్రాలు - వీనిపై సాంప్రదాయ వాదులకు, ఆధునిక సంస్కర్తలకు చర్చలు తీవ్ర స్థాయిలో జరిగాయి. ఆధునిక సంస్కర్తల వాదానికి ప్రజామోదం లభించడంతో, ప్రాచీన వర్ణ సంస్కృతి ఆధునీకరించబడింది.

ఈ విధంగా వలస సంస్కృతిని ఎదరించడానికి, సమకాలీన సమాజాన్ని సంస్కరించుకోడానికి భారతదేశం తన సంస్కృతిని మూలాలతో శోధించి, ఆధునీకరించుకుంది. ఈ విధానమంతా, ఆధునిక భావాలైన హేతు వాదం , మానవతా వాదం, ఉదార వాదం, ప్రత్యక్ష జ్ఞాన వాదం, సార్వత్రిక వాదాల నేపథ్యంలో జరిగింది.

BRAOU

BRAOU

# భాగం - 9 : హేతు వాదం

విషయ క్రమం


9.0 లక్ష్యాలు
9.1 పరిచయం
9.2 ప్రధాన రంగాలు
9.3 హేతు వాదం - పాశ్చాత్య తత్త్వవేత్తల కృషి
9.3.1 జ్ఞాన శాస్త్రం - హేతు వాదం
9.3.2 నైతిక హేతు వాదం
9.3.3 మత హేతు వాదం
9.4 జాతీయ రాజ్యాలు
9.5 మతం - సాహిత్యం
9.6 కళ
9.7 భారతదేశంపై ప్రభావం
9.8 సంగ్రహంగా
9.9 పరీక్ష నమూనా ప్రశ్నలు
9.10 ఉపయుక్త గ్రంథాలు


## 9.0 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

- పద వివరణ
- హేతు వాదం ప్రబలడానికి పాశ్చాత్య తత్త్వవేత్తల కృషి
- హేతుబద్ధం కాని మత సాంప్రదాయాలపై జరిగిన తిరుగుబాట్లు, మత సంస్కరణోద్యమ ఘట్టాలు.

## 9.1 పరిచయం

సాంస్కృతిక పునరుజ్జీవన యుగంలో ఐరోపాలో హేతు వాద ప్రాబల్యం మొదలైంది. ఖచ్చితమైన సత్యాన్ని తెలుసుకోడానికి మానవులకు హేతువు ఒక్కటే తోడ్పడుతుందనే నమ్మకం, హేతు వాదం జనరంజకం కావడానికి కారణమైంది. జ్ఞానానికి హేతువు మాత్రమే పునాదిగా ఉండాలని తత్త్వవేత్తలు తీర్మానించారు. లౌకిక విషయాల్లో ఏవిధంగా అయితే హేతువు మాత్రమే తిరుగులేని అధికారాన్ని కలిగి ఉంటుందో, అదేవిధంగా మత విషయాల్లో సహితం హేతువు ప్రధానంగా ఉండాలని గుర్తించడం జరిగింది. ప్రతీ విషయాన్ని హేతుబద్ధంగా తర్కించి, వివరించే విధానాన్ని హేతు వాదమని వ్యవహరించవచ్చును. చివరగా, హేతు వాద ఉద్యమమంటే మత మూఢాచారాలకు వ్యతిరేకంగా ఆరంభమైన ఉద్యమమని, అనుభవాత్మక సిద్ధాంతంతో (Empiricism) పాటు భౌతిక వాదంతోనూ (Materialism) సంబంధం కలిగిన ఉద్యమమని, నిరీశ్వర వాదం (Atheism) వరకు సాగిన ఉద్యమమని దీనిని భావించవచ్చు. ఈ ఉద్యమం గణిత శాస్త్రం నుండి స్ఫూర్తిని పొందింది. రెండో అభిప్రాయానికి తావులేని ఖచ్చితమైన సత్యాన్ని తెలిపి, జ్ఞానాన్ని పెంచే గణితమే, హేతు వాదులకు ఆదర్శమైంది.

BRAOU

## 9.2 ప్రధాన రంగాలు

హేతు వాదం మత, నైతిక తత్వ రంగాల్లో తన ప్రభావాన్ని ఐరోపా అంతటా ప్రసరింపచేసింది. అవి :

1. మత రంగంలో హేతు వాద ప్రభావం రెండు విధాలుగా ఉంది.

   (ఎ) దైవ ప్రవచనాలను కాదని, హేతువును మాత్రమే విశ్వాసానికి ఆధ్యాత్మిక సత్యానికి పునాది అనే నమ్మకాన్ని కలిగి ఉండడం, దాన్ని ప్రచారం చేయడం.

   (బి) మతాచారాలు, సాంప్రదాయాలు హేతుబద్ధంగా లేవని, తార్కిక పునాదిపై నిర్మింపబడలేదని, మతాన్ని సంపూర్ణంగా ఖండించి, నిరీశ్వర వాదాన్ని ప్రతిపాదించడం.

2. మానవ ప్రవర్తనా నియమావళికి, నైతిక నమ్మకాలకు హేతువు మాత్రమే ఆధారమై ఉండాలని, నీతి శాస్త్ర రంగంలో హేతువు పాత్ర నిర్దేశించబడింది. మంచి, విధి మొదలైన ప్రధాన నైతిక భావనలు అంతర్గత (innate) భావనలని, అందుచేత హేతువును అనుభూతినుండి, నైతిక భావం నుండి వేరుచేయాలని, హేతువును పెంపొందించుకొనేట్లైతే నైతిక ప్రవర్తన సరిగానే ఉంటుందని హేతు వాదులు భావిస్తారు.

3. తాత్విక రంగంలో డేకార్ట్, స్పినోజాలు జ్ఞానానికి ఆధారం హేతువు మాత్రమే అని, అనుభవాత్మక వాదం కాదని తెలిపి, ఈ రంగంలో హేతువు పాత్రను తెలియజేశారు. జ్ఞానాన్ని పొందడానికి ఇంద్రియాలకంటే మిన్నగా హేతువే సహాయపడుతుందని హేతు వాదుల అభిప్రాయం. అంతర్‌దృష్టితో పరికించి, వివిధ భావాల మధ్యగల సంబంధాన్ని కనుగొనడమే జ్ఞానమని, హేతువు చేసే పని ఇదేనని వారు పేర్కొంటారు. జ్ఞానానికి అవసరమైన వస్తు సముదాయమంతా అనుభవం నుండి గాక, హేతువు నుండే లభ్యమౌతుందని, ఎందుకంటే, అవన్నీ అంతర్గత భావనలే అని వారు తెలుపుతారు. ఇంద్రియ జ్ఞానం అవసరం లేకపోగా, అది ఒక ఆటంకంగా కూడా వీరు భావిస్తారు. ఇంద్రియ జ్ఞానం చలించే యాదృచ్ఛిక, పరిమిత వస్తువులను గురించి మాత్రమే జ్ఞానాన్ని ఇస్తుంది. కనుక అది యదార్థ జ్ఞానం కాదు. భావ జ్ఞానం మాత్రమే శాశ్వతమైన, సార్వత్రికమైన అంశాలను అందిస్తుంది కనుక అదే యదార్థ జ్ఞానం. తత్వ శాస్త్రం గమ్యం ఏమిటంటే, మార్పు చెందే వస్తువులను గమనించి, వానిలోని సార్వత్రిక సత్యాలను కనుగొనడం.

BRAOU

## 9.3 హేతు వాదం - పాశ్చాత్య తత్త్వవేత్తల కృషి

### 9.3.1 జ్ఞాన శాస్త్రం - హేతు వాదం

మొదటిసారిగా హేతువును గురించి గ్రీక్ తత్త్వవేత్త అయిన ప్లేటో ప్రస్తావించాడు. ఇంద్రియానుభవానికి అతీతమైన నిత్య సత్యాలు కొన్ని ఉంటాయని, అవి మానవ హేతువుకు మాత్రమే అందుబాటులో ఉంటాయని ప్లేటో తెలిపాడు. అంతర్గతంగా ఉన్న భావాలను పునశ్చరణ చేసికోవడం ద్వారా, జ్ఞానాన్ని పెంపొందించుకుంటామని అంటాడు. ఇతడు 'ద్వంద్వ తర్కాన్ని' (Theory of knowledge Dialectical argument) ప్రతిపాదించాడు. ప్రత్యక్ష జ్ఞానం నుండి ప్రత్యయాలు (concepts) లేదా భావాల వైపు మరలించి, సార్వత్రిక సత్యాలను కనుగొనమని హేతు వాదం ఉద్బోధిస్తుంది.

"రిపబ్లిక్' (Republic) గ్రంథంలో ప్లేటో జ్ఞానాన్ని నాలుగు విధాలుగా తెలిపాడు. అవి : ఊహా జ్ఞానం, ఇంద్రియ జ్ఞానం, ప్రాక్కల్పనా జ్ఞానం (postulates), వివేచనాత్మక జ్ఞానం, వీనిలో ఆఖరి జ్ఞానం విడివిడిగా ఉన్న అంశాల్లోని ఏకత్వాన్ని చాటడం ద్వారా ఉన్నతమైంది. "ఆత్మ" ను అంగీకరించిన ప్లేటో దానిలోని మూడు భాగాలను వివేచన, ఉల్లాసం లేదా ధైర్యం, కోరికలుగా ప్రస్తావించాడు. ప్లేటో మరొక ముఖ్య సాదృశ్యాన్ని

తెలిపాడు. ఆత్మలో మూడు భాగాలను రథంతో పోల్చాడు. వివేచన లేదా హేతువును సారథి అని, ఉద్వేగం, కోరికలు జోడు గుర్రాలని తెలిపాడు.

మధ్య యుగంలో సెయింట్ అగస్టీన్, సెయింట్ అన్సీమ్ ప్లేటో భావాలను ప్రచారం చేసినా, అవి మత, నైతిక ప్రయోజనాలకు లోబడిపోయాయి. అయితే, మధ్య యుగ ప్రత్యేకత ఏమిటంటే, అంతర్గత భావాలను, వాస్తవిక ప్రపంచానికి అనుసంధించడం, భగవంతుని ఉనికిని అంగీకరిస్తూ, అంతర్గత భావాలను వాస్తవిక ప్రపంచాన్ని కలపడం జరిగింది.

పదిహేడో శతాబ్దంలో, జ్ఞాన, దర్శన హేతు వాదం మరింతగా వృద్ధి చెందింది. ప్లేటో భావాలు తిరిగి ఆదరణను పొందాయి. అవే మౌలికాంశాలుగా గ్రహించి, డేకార్ట్ నుండి లైబ్నిట్స్ వరకు భావ ప్రచారాలన్నీ చేశారు. శాస్త్ర విజ్ఞానం ప్రజలకు చేరువ కావడం వలన, తిరిగి హేతువు సహాయాన, సర్వత్రా వర్తించే సత్యాలను శోధించే యత్నాలు జరిగాయి. గెలీలియో ఈ విధంగా చెప్పాడు. "సత్యం అనేది ప్రకృతి అనబడే గొప్ప పుస్తకంలో రాయబడి ఉన్నప్పటికీ, దాని అక్షరాలను గుర్తించే వ్యక్తి మాత్రమే దాన్ని చదవగలుగుతాడు" (Truth is written in the great book of Nature, but only he can read it who can decipher the letters in which it is written) ఈ అక్షరాలు గణిత శాస్త్ర సంకేతాల రూపంలో ఉంటాయి.

**డేకార్ట్ రెనె (Descartes Rene) (1596 - 1650)**

ఫ్రెంచ్ దేశీయుడైన డేకార్ట్ రెనె గణిత శాస్త్రంలో భౌతిక శాస్త్రంలోనూ, తత్త్వ శాస్త్రంలోనూ గణనీయమైన పరిశోధనలను చేశాడు. ఖచ్చితమైన సత్య నిర్ణయం చేయడంలోనూ, హేతుబద్ధమైన విధాన ప్రక్రియను కలిగిన గణిత శాస్త్రం ఇతడిని ఆకర్షించింది. నెదర్లాండ్స్, బల్గేరియా, హంగరీ, హాలెండ్, స్వీడన్ మొదలైన దేశాలు పర్యటించాడు.

డేకార్ట్ ప్రతిపాదనల్లో 'మానవుడు ఆలోచనాపరుడు' అనేది అతి ముఖ్యమైన అంశం: ఎవరూ కాదనలేని నిజం. ఆలోచించడం అంటే జీవిస్తున్నట్లు కనుక, అతడీ విధంగా అన్నాడు. "నేను ఆలోచిస్తున్నాను. కనుక నేనున్నాను". ( I think, therefore I am)

డేకార్ట్ ద్వంద్వాన్ని (Dualism) ప్రతిపాదించాడు ఇతడు ఆత్మ, శరీరాలను, (Soul and Body), మనస్సు, ద్రవ్యాన్ని. (Mind and Matter) ప్రస్తావించాడు. వీనిలో ఆత్మ, మనస్సు కనపడవు. శరీరాన్ని, ద్రవ్యాన్ని మాత్రమే శాస్త్రీయ పరిశోధనకు గురిచేయవచ్చు. ఎందుకంటే, ఈ రెండు ప్రాకృతిక చట్ట పరిధిలోకి వస్తాయి కనుక, డేకార్ట్ మనస్సు, శరీరాన్ని మూల సూత్రాలుగా అంగీకరించి, వాటికిగల లక్షణాలు ఎంత వ్యతిరేకమో తెలిపాడు. శరీర లక్షణం నిశ్చలం, విస్తరణ కాగా, మనస్సు ఆలోచనాత్మకంగానూ ఉంటుంది. శరీరాన్ని యంత్రంతో పోల్చి, దానికి మనస్సుకు గల తేడాను తెలియజేసాడు.

జ్ఞాన సముపార్జనకు కావలసిన సూత్రాలుంటాయి కనుక, అధి భౌతిక శాస్త్రానికి డేకార్ట్ ప్రాముఖ్యాన్ని ఇచ్చాడు. వీనిలో దైవం, ఆత్మల గురించి చర్చించాడు. భౌతక శాస్త్రానికి కూడా ప్రాముఖ్యతనిచ్చాడు. ఎందుకంటే, ఏసూత్రాలపై భౌతిక పదార్థాలు ఆధారపడతాయో ఇది వివరిస్తుంది. ఇతడు జ్ఞానాన్ని వృక్షంతో పోల్చి, అధి భౌతిక శాస్త్రం వేళ్ల వంటిదని, భౌతిక శాస్త్రం చెట్టు మాను వంటిదని, ఇతర శాస్త్రాలు కొమ్మలని తెలిపాడు.

మనస్సులో ఉండే స్వయం వ్యక్తం, స్పష్టం, ఖచ్చితం అయిన భావాలను హేతువు ద్వారా కనుగొనాలని డేకార్ట్ ఉద్దేశ్యం. నూతన పునాదిపై శాస్త్రాన్ని నిర్మించుకోవాలని, పాండిత్యం వలన పూర్వీకుల భావాలు తెలుస్తాయి తప్ప, స్వంత ఆలోచన పెరగదని, అందుచేత స్పష్టమైన జ్ఞానం కోసం, గణితంలో ఉండే ప్రతిజ్ఞా వాక్యాల వంటివి

ఏర్పర్చుకోవాలని భావించాడు. రెండు రెళ్ల నాలుగును ఏవిధంగా ఎవరూ కాదనలేరో, ఆవిధమైన సూత్రాలను తత్త్వంలోకూడా ఏర్పరచుకోవాలని ఇతడు అన్నాడు. వాటి ద్వారా దైవ అస్తిత్వాన్ని, ఆత్మ అమరత్వాన్ని, ప్రపంచ వాస్తవికతను నిరూపించి, తత్త్వం ఒక కాదనలేని శాస్త్రంగా భాసిల్లుతుందని భావించాడు. అంతర్గత భావాలను అంగీకరిస్తూనే, ఇతడు అనుభవ జ్ఞానాన్ని నిర్లక్ష్యం చేయలేదు. కాని హేతువు ద్వారా మాత్రమే ఖచ్చితమైన జ్ఞానం కలుగుతుందని తెలిపాడు.

## స్పినోజా (1632 - 77)

హాలెండ్ దేశీయుడైన స్పినోజా ఫ్రెంచ్ తత్త్వవేత్త అయిన డేకార్ట్ అభిప్రాయాలతో ప్రభావితుడయ్యాడు. ఇతడుకూడా గణితం ద్వారా తన సిద్ధాంతాన్ని వివరించాడు. స్పష్టమైన, రెండో అభిప్రాయానికి తావివ్వని విధంగా తత్త్వశాస్త్రం ఉండాలని భావించాడు.

డేకార్ట్ ప్రతిపాదించిన ద్వంద్వ భావాన్ని తిరస్కరించి, ఏకసత్తా వాదాన్ని ప్రతిపాదించాడు. దైవానికి భిన్నంగా మనస్సు, శరీరం లేవని, అవన్నీ ద్రవ్యం లేదా దైవానికి గుణాలు (attributes) మాత్రమేనని, ప్రపంచంలోనివన్నీ, మానవులతో సహా దైవంపైనే ఆధారపడతాయనీ తెలిపాడు. శరీరం, మనస్సులు సమాంతరమైనవనీ (Parallel), అవి ఒకదాన్నొకటి ఖండించుకోవని తెలిపాడు.

జ్ఞాన సిద్ధాంతాన్ని తెలుపుతూ, గ్రహణ శక్తిని మూడు దశలుగా వర్ణించాడు.

1. భావాలు (ideas), సంవేదనలు (Sensations), ఊహల నుండి వచ్చే జ్ఞానం పరిమితమైంది; అస్పష్టమైంది. ఇది విమర్శనాత్మకంగా ఉండదు.

2. వస్తువులను యదాతథంగా, వివేచన ద్వారా తెలుసుకోవడం. ఈ జ్ఞానం స్వయం వ్యక్తమయ్యేదే. వెలుగునుబట్టి, చీకటిని గుర్తించడం ఒక ఉదాహరణ.

3. ఆఖరిదీ, ఉన్నతమైంది అంతర్ జ్ఞానం. (Intuitive knowledge) దీని వలన జ్ఞానం సిద్ధిస్తుంది.

వస్తువుల వాస్తవ కారణాలు తెలిసిన వ్యక్తి వాటికీ, దైవానికి గల సంబంధాన్ని అర్థం చేసుకొని, దైవాన్ని ప్రతిఫలం కోరకుండా ప్రేమిస్తాడని స్పినోజా తెలిపాడు. జ్ఞానాన్ని పొందడం ద్వారా, భగవంతుని ప్రేమించే లక్షణాన్ని ఇతడు ప్రతిపాదించాడు.

## లైబ్నిట్స్ (Leibnits) (1646 - 1716)

జర్మనీ దేశీయుడైన ఇతడు గణిత శాస్త్రంలో ప్రావీణ్యాన్ని సంపాదించాడు. దైవ శాస్త్ర (Theology) ప్రభావంలో పెరిగిన ఇతడు తత్త్వ శాస్త్రాన్ని, దైవ శాస్త్రాన్ని సమన్వయ పర్చే యత్నం చేశాడు. విశ్వమంతా సామరస్యకంగా ఉంటుందని, అది తర్క, గణిత సూత్రాలపై ఆధారపడి ఉంటుందని భావించాడు. ఆ సామరస్యాన్ని భగవంతుడే ఇస్తాడని తెలుపుతాడు.

ఇతడు శక్తి సిద్ధాంతాన్ని (Doctrine of Force) ప్రతిపాదించాడు. వస్తువుల్లో ఉండే చలనాన్ని విశదీకరించాడు. చిదంశల సిద్ధాంతాన్ని (Doctrine of Monads) తెలుపుతూ, చిదంశలు శక్తిపూరితమైన అణువులని, అవి శక్తి కేంద్రాలని తెలుపుతూ, మానవ శరీరం కూడా చిదంశల సమిశ్రితం అంటాడు. ఈ చిదంశలను అతిక్రమించే శక్తిగల భగవంతుడు కూడా ఒక చిదంశమేనని ఇతడు అంటాడు. (Monad of Monads)

హేతువు పాత్రనంగీకరిస్తూ, ఇతడు ఏదైనా సంఘటన జరగాలంటే, దానికి తగినంత హేతువు ఉండాలంటాడు. విశ్వం గణితాత్మకం గనుక, తార్కిక క్రమం ద్వారా జ్ఞానాన్ని పొందవచ్చు. అనుభవం నుండి మాత్రమే జ్ఞానం కలుగుతుందని భావిస్తే, సార్వత్రిక జ్ఞానం అసంభవమౌతుంది. అనుభవంలో జ్ఞానం బహిర్గతమౌతుంది.

దైవం ఉన్నాడనడానికి బాహ్యంగా ఉన్న విశ్వమే ఆధారం. విశ్వంలో క్రమం ఉందని, హేతువును ఉపయోగించడం ద్వారా అది బోధపడుతుందని అతడు తెలిపాడు.

'అనుభవిక వాదాన్ని (Empiricism) హేతు వాదానికంటే దిగువగా వీరందరూ నిలిపారు.

ఇతర తత్త్వవేత్తల్లో స్కాట్లాండ్‌కు చెందిన డేవిడ్ హ్యూం (1711 - 1776), జర్మనీకి చెందిన ఇమ్మాన్యుయల్ కాంట్ (1724 - 1804) ఉన్నారు. వీరిలో కాంట్ "క్రిటిక్ ఆఫ్ ప్యూర్ రీజన్" (Critique of pure Reason), "క్రిటిక్ ఆఫ్ ట్రాన్సెండెంటల్ ఐడియలిజం" (Critique of Transcendental Idealism) అనే గ్రంథాల్ని రచించాడు. ఇతడు ప్రధానంగా హేతు వాదాన్ని, అనుభవ వాదాన్ని సమన్వయపర్చే యత్నాన్ని చేశాడు. ఇంద్రియ సంవేదనలతో అవగాహన పదార్థాలను సమన్వయిస్తే, జ్ఞానం ఉత్పన్నమౌతుందని ఇతడి సిద్ధాంతం. ఇంద్రియాతీతాలైన అవగాహన పదార్థాలు ముఖ్య ఉపాధులు కనుక, ఇతడ సిద్ధాంతాన్ని అతీంద్రియ వాదమని అన్నారు. భావ రూపంగా జ్ఞానం సిద్ధిస్తుంది కనుక, దీనిని 'భావ వాదం లేదా 'ఆదర్శ వాదం' (idealism) అని కూడా అంటారు మొత్తంగా దీన్ని 'అతీంద్రియ భావ వాదం' (transeendental idealism) అని పిలుస్తారు.

చివరగా హెగెల్ అభిప్రాయాన్ని కూడా తెలియజేయాలి. "సత్యమే హేతుబద్ధమని హేతుబద్ధమైందే సత్యమ"ని అతడు తెలిపాడు. (The Real is the Rational and the Rational is the Real)

ఈ విధమైన హేతు వాద దృక్పథం విజ్ఞాన శాస్త్రం నుండి ఉత్తేజాన్ని పొంది, ప్రకృతిని విధేయులుగా గాక, అధికారులుగా పరికించి, తన జ్ఞాన సంపదతో నూతన సిద్ధాంతాలను ఏర్పర్చి, అవి ఎంతవరకు సత్యానికి చేరువగా ఉన్నాయో పరీక్షకు నిలుపుతుంది.

### 9.3.2 నైతిక హేతు వాదం

"సుగుణమే జ్ఞానం" అనే సోక్రటీస్ సూక్తితో ఉత్తేజితుడైన ప్లేటో దీన్ని ప్రథమంగా అభివృద్ధి చేశాడు. మానవునిలోని ఆత్మ హేతువును ఉపయోగించి, మంచిచెడులను గ్రహించగలదని, నైతిక ప్రవర్తనకు ఆరంభం అదేనని తెలిపాడు స్టొయక్ తత్త్వవేత్తలు అంతర్గత భావనలను కాదన్నప్పటికీ, ప్రతివ్యక్తిలోనూ, భగవద్దత్తమైన హేతువు ఉంటుందని, దాన్ని సరిగా ఉపయోగించుకోవలసిన బాధ్యత అతనిదని తెలిపాడు. వీరి సిద్ధాంతం ప్రాకృతిక చట్టాన్ని, ప్రాకృతిక హక్కులను బలపరుస్తుంది. సిసిరో దీన్ని ప్రజారంజకం చేశాడు.

సాంస్కృతిక పునరుజ్జీవన యుగంలో ఈ భావం తిరిగి ఆదరించబడింది. హేతువు నిర్దేశించే ప్రవర్తనా నియమావళి భగవంతుని ఆజ్ఞల కంటే స్వతంత్రమైనవనే అభిప్రాయాన్ని హ్యూగో గ్రోషియస్ తెలిపాడు. ఇంగ్లాండ్‌లో పదిహేడు, పద్దెనిమిదవ శతాబ్దాల్లో నైతిక హేతు వాదం ఆదరణ పొందింది. లార్డ్ హెర్బర్ట్, సామ్యూల్ క్లార్క్, విలియం వాలెస్టీన్, రిచర్డ్ ప్రైస్ దీన్ని పెంపొందించారు. స్పినోజా, కాంట్‌లు కూడా దీన్ని వృద్ధి చేశారు.

### 9.3.3 మత హేతు వాదం

మధ్య యుగాల్లో మత సత్యాన్ని హేతువు ద్వారా తెలియవచ్చునా, లేక దైవ ప్రవచనాల ద్వారానా అనేది చర్చనీయాంశమైంది. సెయింట్ అన్‌సెల్మ్ (Saint Anselm) రెంటిని సమన్వయపరుస్తూ, "నేను అర్థం చేసుకోడానికని నమ్ముతున్నాను." అన్నాడు. (I believe in order that I may understand)

## మత సంస్కరణ ఉద్యమాలు

పదహారో శతాబ్దినాటికి కాథలిక్ చర్చి విమర్శలకు తావిచ్చింది. అవినీతి, అధికార దుర్వినియోగం, అధికమయ్యాయి. దురాచారాలు, ధన వ్యామోహం, పదవీలాలస అధికమయ్యాయి. సామాన్య ప్రజలపై ఆర్థిక భారం అధికమైంది. పోప్ ఆరవ అలెగ్జాండర్, రెండో జూలియస్, పదవ లియోల కొలువుల్లో జరిగిన దురాచారాలు వెల్లడయ్యాయి.

జర్మనీకి చెందిన మార్టన్ లూథర్ (1483 - 1546) కాథలిక్ చర్చి ఆచారాలతోనూ, భావాలతోనూ విభేదించి, క్రీ.శ 1517లో చర్చిపై తిరుగుబాటు చేశాడు. లూథర్ కాథలిక్ మతంలోని లోపాలను, వివాదాంశాలను తొంభై ఐదింటిని ఎంచి, విటెన్‌బర్గ్ చర్చి ద్వారంపై అంటించాడు. ఆ అంశాలపై ఎవరైనా తనతో చర్చించవచ్చని రాశాడు. తరవాత 1520లో కాథలిక్ చర్చితో పూర్తి తెగతెంపులు చేసికొని, మూడు కరపత్రాలను ప్రకటించాడు. లూథర్‌ను చర్చి నుండి బహిష్కరించగా, అతడు ఆ పత్రాన్ని అందరి ఎదుటా కాల్చివేసి, అవిధేయత చూపాడు. నిర్బంధించమని 'చక్రవర్తి' ఆదేశించినప్పుడు, సాక్సన్ ఎలక్టార్ ఇతడిని కోటలో దాచాడు. అప్పుడే అతడు బైబిల్‌ను జర్మనీ భాషలోకి అనువదించాడు. అతని తిరుగుబాటుకు ప్రజామద్దతు లభించింది. "లూథర్‌నిజం" (Luthernism) చట్ట సమ్మతమైన మతంగా క్రీ.శ. 1555 నాటకి గుర్తింపు పొందింది.

జాన్ కాల్విన్ (1509 - 1564) ఫ్రాన్స్ దేశానికి చెందిన వాడు. కాథలిక్ చర్చితో విభేదించి, నీతి నియమాలకు ప్రాముఖ్యతనిస్తూ, వేరొక శాఖను ఆరంభించాడు.

ఇంగ్లాండ్‌లో రాజ్యానికి, మతాధికారానికి ఘర్షణ ఏర్పడినప్పుడు ఎనిమిదవ హెన్రీ (1509 - 1547) నాయకత్వాన సాంప్రదాయక చర్చిపై తిరుగుబాటు జరిగింది. హెన్రీ వివాహ సమస్య వలన పోప్ ఏడో క్లిమెంట్‌తో విభేదించి, క్రీ.శ. 1534లో చర్చితో, ఇంగ్లాండ్ తెగతెంపులు చేసుకొంది. రాజే మత విషయంలో కూడా అధినేత అని బ్రిటిష్ పార్లమెంట్ తీర్మానించడంతో, హెన్రీ చర్చి ఆస్తులను సహితం జప్తు చేశాడు.

చర్చిపై తిరుగుబాట్లు ప్రతిసంస్కరణోద్యమానికి (Counter Reformation) దారితీసాయి. కాథలిక్ చర్చి తనను తాను సంస్కరించుకోనారంభించింది.

ఈ తిరుగుబాటు ఫలితాల్లో జాతీయతా భావం పెంపొందడం ప్రధానమైంది.

మత రంగాన మరికొన్ని శాఖలు ప్రబలడం ఆరంభమైంది. "పయటిజం" (Pietism) ప్రధానంగా ప్రొటెస్టటంట్ దేశాల్లో ప్రబలింది. భక్తి ప్రధానంగా ఉండాలని, మతాచారాలు సామాన్యమైనవిగా ఉండాలని వీరు కోరారు. ఇతర శాఖల్లో క్వేకర్స్ (Quackers), మెథడిస్ట్‌లు (Methodists) ప్రధానులు. వీరికంటే భిన్నమైంది. ప్రాకృతిక మతం. హేతు వాదులైన మత నమ్మకస్థులందరూ భగవంతునియందు, అమరత్వంనందు, రాబోయే పురస్కారాలు, శిక్షలయందు సమాన నమ్మకాన్ని కలిగి ఉంటారని, అందుచేత అన్ని మతాల వెనుక ఉండేది ఒకానొక ప్రాకృతిక మతమని వీరు విశ్వసిస్తారు. ఇంగ్లాండ్‌లో ప్రబలిన 'డీఇజం' (Deism) మరొక ప్రధాన శాఖ ఇది ప్రాకృతిక మతమే. ప్రాకృతిక చట్టాన్ని. హేతువును, ప్రాకృతిక హక్కులను, అభివృద్ధివైపు పురోగమించే కోరికను ఇచ్చేది భగవంతుడని వీరు నమ్ముతారు. 'డీఇజం' త్వరలోనే ఫ్రాన్స్ చేరింది. వోల్టేర్ (Voltare) దీని ప్రధాన ప్రచారకుడయ్యాడు.

వీటికి భిన్నమైన నాస్తిక శాఖకూడా ఐరోపాలో ప్రబలింది. విజ్ఞాన సర్వస్వాలకు వ్యాసాలను పంపే హాల్‌బక్ డీఇజంతో ఆగక, మానవ చెడులకు మూలం మతమేనని, "క్రిష్టియానిటీ అన్‌వెయిల్డ్" (Christianity Unveiled) అనే గ్రంథంలో (1767) లో రాశాడు. ఇతడే "సిస్టం ఆఫ్ నేచర్" (System of Nature) అనే మరో వ్యాసంలో ఏ

దేవుడూ, చివరకు ప్రకృతి దేవుడు కూడా లేడని, విశ్వమంతా చైతన్యంతోకూడిన ద్రవ్యమేనని, ఆత్మ అని మానవుడు అనుకునేది కూడా శరీరం నశించడంతోనే అదీ నశిస్తుందని, మానవుని లక్ష్యం తృప్తిగల జీవితం గడపడమేనని ఇతడు తెలిపాడు.

ఈ విధంగా, మత సంస్కరణ, మతమన్నది అంతరంగిక అనుభూతి తప్ప, బాహ్య ప్రదర్శన కాదని తెలియజేసింది. ఈవిధంగా మతం ఆధిక్యత, ఆ రంగంలోనే, ఆధునిక యుగంలో తగ్గింది.

## 9.4 జాతీయ రాజ్యాలు

పవిత్ర రోమన్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన అనేక రాజ్యాలు, ఆధునిక యుగం నాటికి, జాతీయ రాజ్యాలుగా మారాయి. ఆ రాజ్యాల్లో ఒకే జాతికి చెందిన ప్రజ ఒకే భాష మాట్లాడుతూ, సాంస్కృతిక సమైక్యతను కలిగి ఉండేవారు. ఇవి సమర్ధవంతమై, ఆధునికమయ్యాయి. మతాధికారం నుండి విడివడ్డాయి. వీనిలో ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ మొదలైనవి ప్రధానమైనవి.

## 9.5 మతం - సాహిత్యం

సాంస్కృతిక పునరుజ్జీవనం వలన సాహిత్యం కూడా ఆధునీకరించబడింది. గ్రీక్, రోమన్ సాహిత్యాలు, క్లాసిజం ప్రభావంతో, ఆదరణీయమయ్యాయి. గ్రీక్, రోమన్ నమూనాలతోబాటు, దేశీయ భాషల్లోకూడా, సాహిత్య సృష్టి సాగింది. చరిత్రలు, యాత్రలను వర్ణించే గ్రంథాలు, తత్వ శాస్త్ర గ్రంథాలు, శాస్త్ర గ్రంథాలు అధికమయ్యాయి.

## 9.6 కళ

పదునాలుగు, పదహారు శతాబ్దాల మధ్య కళాకారులు కూడా, మతేతర కళాఖండాలను సృజించారు. నిరాడంబరమైన గోథిక్ వాస్తుకళ ఆదరణ పొందింది. రోమ్‌లోని సెయింట్ పీటర్స్ చర్చ్ నూతన కళకు ఉదాహరణమైంది. ఇటలీ కళాకారులను ఫ్రాన్స్ రాజైన మొదటి ఫ్రాన్సిస్ తన దేశానికి తీసికొని వెళ్ళి, లావరే (Loure) రాజ ప్రాసాదంతోపాటు, అనేక నిర్మాణాలను చేయించాడు.

శిల్ప కళకు లోరెంజో గిబర్టీ (Loenzo Ghiberti) నిర్మించిన ఫ్లారెన్స్‌లోని చర్చి ద్వారాలు, డోనటెల్లా (Donatelle) వెన్నిస్‌లో చెక్కిన సెయింట్ మార్క్ విగ్రహం, మైకలేంజలో (Michael Angelo) ఫ్లారెన్స్‌లో చేసిన డేవిడ్ విగ్రహం ఉదాహరణలు.

పదహారో శతాబ్దంలో చిత్రాలను ప్రత్యేకంగా కేన్వాస్‌పైగాని, చెక్కలపై గాని చిత్రించేవారు. అంతకు పూర్వం చిత్రాలను ఎక్కువగా చర్చిగోడలపై చిత్రించేవారు. లియోనార్డో డవెన్సీ (Leonardo Davinci) చిత్రాల్లో 'మోనోలిసా', 'లాస్ట్ సప్పర్' పేరొందాయి. మైకలేంజిలో చిత్రాల్లో 'లాస్ట్ జడ్జిమెంట్' చిత్రం ప్రముఖమైంది. రఫేల్ (Raphael), టిషన్ (Titian) ఇతర ప్రసిద్ధ చిత్రకారులు. ఇటలీలో ప్రారంభమైన పునరుజ్జీవన యుగపు చిత్రకళ త్వరలోనే ఇతర పాశ్చాత్య దేశాల్లో కూడా ఆదరణను పొందింది.

పదహారో శతాబ్దంలో సంగీతం శృతి, లయ, తాళాలతో క్రమబద్ధమైన కొత్త బాణీలతో, అనేక వాద్య సహకారాలతో ఆదరణను పొందింది.

విజ్ఞాన శాస్త్రాల్లోనూ, మానవీయ శాస్త్రాల్లోనూ నూతన విషయాలు కనుగొనబడి, విప్లవాత్మక మార్పులు సంభవించాయి. మధ్య యుగం నాటి అపోహలను అధిగమించడం జరిగింది. ముఖ్యంగా, ఖగోళ శాస్త్రంలో నూతన విషయాలు ఆదరణ పొందాయి. ప్రకృతిలో మానవుడు కూడా విధేయుడైన భాగస్వామే కనుక, అతడు కూడా ప్రాకృతిక చట్టానికి బద్ధుడే అని నిర్ణయించారు.

## 9.7 భారతదేశంపై ప్రభావం

సాంప్రదాయకంగా వస్తున్న అనేక ఆచారాలను, అసమానతలను, పాశ్చాత్య విద్య నేర్చిన మధ్యతరగతి వర్గం, హేతుబద్ధంగా ప్రశ్నించి, అసమంజసమని భావించిన వానిని తీవ్రంగా ఖండించారు. ఆచారాలను నిర్ణయించడంలో శాస్త్రాలకంటే కులమే ప్రధానమైన పాత్రను వహించిందని తెలుసుకొన్న మేధావి వర్గం హేతు వాదాన్ని మరింత త్వరితగతిన అభివృద్ధి చేశారు.

భారతదేశపు మొట్టమొదటి ఆధునిక యుగ సంస్కర్త అయిన రాజా రామ్‌మోహన్ రాయ్ హేతు వాద దృక్పథం నుండి సమకాలీన సమాజంలోని మత, సాంఘిక సాంప్రదాయాలను ప్రశ్నించాడు. రాధాకాంత్ రాయ్ ఆధ్వర్యాన సాంప్రదాయవాదులు చూపే వాదనలను, పటిష్టంగా ఎదుర్కొని, సంస్కరణల ఆవశ్యకతను తెలియజేశాడు. దుష్ట సాంప్రదాయాలను తొలగించడానికి అవసరమైన నూతన మార్పులను చట్టబద్ధం చేయడానికి కృషి చేశాడు. హేతువుకు భంగం కలిగించే దాన్ని దేన్నీ నమ్మనని ఇతడు ప్రకటించాడు. బహుదేవతారాధనను, విగ్రహ పూజను, కుల వ్యవస్థను ఇతడు ఖండించాడు. మతప్రవక్త వలె బోధించడం గాక, ఇతడు న్యాయవాది వలె కారణాలను చూపుతూ, బ్రహ్మసమాజాన్ని ఆదరణీయం చేశాడు.

ఇతర సంస్కర్తలందరూ ఇదేవిధంగా తగిన కారణాలను చూపి, ప్రజలను సంఘ సంస్కరణకు ఒప్పించే ప్రయత్నాలను చేశారు. ఆంధ్రలో సామనేని ముద్దు నరసింహానాయుడు "హితసూచని" అనే గ్రంథంలో అనేక మూఢాచారాలపై ధ్వజమెత్తాడు. శుభ్రత గురించి, మంత్రాల గురించి, శాస్త్రీయ వైద్య ఆవశ్యకత గురించి, స్త్రీల విద్యావసతులను గురించి తన అభిప్రాయాలను హేతుబద్ధంగా వివరించాడు. కందుకూరి వీరేశలింగారికి పూర్వమే, రాజమండ్రి ప్రాంతంలోనే, ఇటువంటి శాస్త్రీయ విశ్లేషణ అనేక అంశాలపై జరిగింది. వీరేశలింగం, తన హేతు వాద పటిమతో సాంప్రదాయకులనెదిరించి, సంస్కరణలను చేపట్టాడు. నారాయణ చందావర్కర్ తన గురించి "శాస్త్రాలను చలింపని హేతు వాది అయిన సంస్కర్త" అనిపించుకోవాలని కోరుకున్నాడు.

బాల్య వివాహాలను అరికట్టే ప్రయత్నంలో, మలబారి (Malabari) వివిధ కారణాలను హేతుబద్ధంగా చూపి, ప్రజలను అంగీకరింపజేసే యత్నం చేశాడు. "ఏజ్ ఆఫ్ కన్సెంట్" బిల్లు (Age of Consent Bill) 1891లో అంగీకరించబడినప్పుడు గవర్నర్-జనరల్ మార్క్విస్ ఆఫ్ లాన్స్‌డౌన్ చేసిన ఈ క్రింది ప్రకటన ప్రజాభిప్రాయాన్ని సూచిస్తుంది. "వ్యక్తిగత క్షేమానికి ప్రజాశాంతికి భంగం కలిగే పద్ధతులు మతం పేరుతో జరుగుతున్నప్పుడు, అవి ప్రపంచ చట్టాలకు, నీతికి భంగకరమైనప్పుడు, నైతికత్వం గాక, మతం మాత్రమే ఓటమిని అంగీకరించవలసి ఉంటుంది."

మతం నుండి సాంఘిక ఆచారాలను విడదీసే ప్రయత్నంలో భాగంగా, సంస్కర్తలు శాస్త్రమూలాలను పరిశోధించి, మార్పులకు అనుగుణమైన శాస్త్రభాగాలను సాంప్రదాయ వాదులకు చూపి, వారిని ఒప్పించే ప్రయత్నాన్ని చేసేవారు. అంతటితో ఆగక, ప్రభుత్వం నుండి చట్ట భద్రతను కోరేవారు, సంస్కరణలకు అనువైన చట్టాలను పొందేవారు. అమానుషమైన సతీ సహగమనాన్ని మానిపించడంలో, రాజా రామ్‌మోహన్ రాయ్ వితంతు వివాహాలు చేయడంలో ఈశ్వర చంద్ర విద్యాసాగరుడు, స్త్రీ విద్యావ్యాప్తిలో దేవేంద్రనాథ్ టాగూర్, బాల్య వివాహ నిషేధంలో మలబారి, హేతు దృష్టినే చూపారు. జస్టిస్ రనడే సామాజిక మార్పును విశదీకరిస్తూ, ఈ విధంగా చెప్పాడు. "మనం అందరూ ఆశించే మార్పు పరిధుల నుండి నమ్మికకు, ఉన్న స్థితినుండి ఒప్పందానికి, అధికారాన్నుండి హేతువుకు, అసంఘటితాన్నుండి సంఘటిత జీవితానికి, గుడ్డిగా నమ్మిన విధినుండి గౌరవప్రదమైన మానవ జీవితానికి" జరగాలని ఆశించేదిగా పేర్కొన్నాడు.

BRAOU

## 9.8 సంగ్రహంగా

హేతు వాదం ఒక భావంగానూ, ఒక తత్త్వంగానూ, ఒక ఉద్యమంగానూ ఐరోపాను ప్రభావితం చేసింది. కాథలిక్ చర్చిపై తిరుగుబాట్లను ప్రోత్సహించి, నూతన శాఖల పెరుగుదలకు దోహదం చేసింది. రాజ్యాలను, సాహిత్యాన్ని, కళలను హేతు వాదం మత ప్రభావంనుండి విముక్తి చేసి ఆధునికం చేసింది. తార్కిక విధానానికి అగ్ర తాంబూలం ఇవ్వడం ద్వారా, హేతు వాదం విమర్శనాత్మక పరిశోధనా దృక్పథాన్ని పెంచింది. భారతదేశంపై దీని ప్రభావం వలన నూతన ఉద్యమాలు సంభవించాయి.

## 9.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

I **ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.**

1. హేతు వాదం అంటే ఏమిటో వివరించి, ఆ భావ విస్తరణకు పాశ్చాత్య తత్త్వవేత్తల కృషిని తెలియజేయండి.
2. డేకార్ట్, స్పినోజా, లైబ్నిట్స్‌లు హేతు వాద అభివృద్ధికి చేసిన కృషిని తెల్పండి.
3. ఐరోపాలో ప్రబలిన మత సంస్కరణోద్యమాలను గూర్చి తెలియజేయండి.

II **ఈ క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. ప్లేటో భావాల్లో హేతు వాదం
2. మార్టిన్ లూథర్
3. హాల్‌బక్
4. భారతదేశంపై హేతు వాద ప్రభావం.

## 9.10 ఉపయుక్త గ్రంథాలు

Hayes – **Modern Europe**

K. K. Datta – **A Social History of Modern Europe**

William Embenstein-**Great Political thinkers**

**Encyclopaedia Britannica Vols, 7,13,18, & 21**

| | | |
|---|---|---|
| సి. దేవదానం | : | **ఆధునిక ఐరోపా చరిత్ర** తెలుగు అకాడమీ, హైదరాబాద్ |
| ఆర్. వెంకటరెడ్డి & కె. పి. బాబూరావు | : | **పాశ్చాత్య తత్త్వ శాస్త్రం** తెలుగు అకాడమీ, హైదరాబాద్ |
| కోటిరెడ్డి | : | **ఆధునిక యుగారంభం** తెలుగు అకాడమీ, హైదరాబాద్ |


**- రచయిత్రి : ఆచార్య పి. రామలక్ష్మి**

BRAOU

# భాగం - 10 : మానవతా వాదం

విషయ క్రమం

10.0 లక్ష్యాలు

10.1 పరిచయం

10.2 పునరుజ్జీవన ఉద్యమం

10.3 మానవతా వాద ఉద్యమం

10.4 మానవతా వాద ప్రచారకులు

10.5 నూతన విజ్ఞానం

10.5.1 విజ్ఞాన శాస్త్రాలు

10.5.2 మానవీయ శాస్త్రాలు

10.5.3 జాతీయ భాషల్లో సాహిత్యాభివృద్ధి

10.5.4 నూతన విజ్ఞాన లక్షణాలు

10.6 భారతదేశంపై ప్రభావం

10.7 సంగ్రహంగా

10.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

10.9 ఉపయుక్త గ్రంథాలు

## 10.0 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

- అర్థం తెలుసుకోవడం
- ఈ వాదం అభివృద్ధి చెందడానికి దోహదపడిన కారణాలను, వ్యక్తులను తెలుసుకోవడం
- ఈ సిద్ధాంత ప్రభావంతో ఐరోపాలో వచ్చిన మార్పులను తెలుసుకోవడం
- భారతీయ సమాజంపై మానవతా వాద ప్రభావాన్ని అంచనా వేయడం.

## 10.1 పరిచయం

మానవతా వాదం అంటే మానవునికి లేదా ప్రపంచానికి సంబంధించిన అంశాలకు ప్రాముఖ్యతనిస్తూ, మానవ కౌశల్యాలకు, దైనందిన జీవింతంలో సంభవించే అంశాలకు, జీవితాదర్శాలకు, మానవ సంక్షేమ కార్యకలాపాలకు ఎక్కువ కాలాన్ని, శక్తిని వెచ్చించడం. ఐరోపాలో సంభవించిన నూతన పునరుజ్జీవనంతోనే మానవతా వాదం కూడా ఉదయించింది. ప్రాచీన గ్రీక్, రోమ్‌లకు చెందిన ప్రామాణిక రచయితలందరు మానవుని ఒకవైపు జంతు ప్రపంచం నుండి, మరోవైపు దైవం నుండి వేరుచేసి, ఈరెంటికి మధ్యనున్న జాతిగా నిర్ధారించారు. అయితే దైవ జాతినుండి మానవ జాతి ఏవిధంగా తేడాగా ఉంటుంది అని చెప్పేటప్పుడు మానవుల పాప స్వభావాన్ని, వారికి గల మరణాన్ని గురించి తెలిపారు. మరణం తరవాత ఆత్మ భగవంతుని నుండి పొందే అనుభూతికి సిద్ధం కావడమే, మానవ జీవిత లక్ష్యమని మధ్య యుగ క్రైస్తవ మతం తెలిపింది. ఈవిధంగా భూమిపై

మానవ జీవిత ప్రాముఖ్యాన్ని తగ్గించడాన్ని పునరుజ్జీవన యుగంలోని మానవతా వాదులు వ్యతిరేకించారు. మరణం వరకు సాగే మానవ జీవిత ప్రాముఖ్యాన్ని వారు కొనియాడారు. మానవ శక్తి యుక్తులను, అభ్యుదయంవైపు పయనించగల మానవ శక్తులను వారు గుర్తించారు. మత ప్రభావం క్షీణించిన తరువాత మానవతా వాదులు మానవుని ప్రాముఖ్యతను తగ్గించే రాజకీయ సిద్ధాంతాల్ని జీవశాస్త్ర సిద్ధాంతాలను వ్యతిరేకించారు.

మానవుని ప్రాపంచిక విషయాల ఆసక్తిని పెంచడం ద్వారా, మానవాళిలో స్నేహం. ఆదరం, అర్థం చేసుకోవడం, సానుభూతి చేయూతనివ్వడం వంటి గుణాలు వృద్ధి అవుతాయి. దీని ప్రభావంచేత సంఘంలోని ఆచార సంప్రదాయాలపై సంస్కరణల దాడి మొదలై, సంస్కరణల యుగం ఆరంభమౌతుంది. జీవిత ప్రాధాన్యం పెరగడంతో, జీవన శైలి కూడా పెరిగే ప్రయత్నాలు మొదలౌతాయి.

## 10.2 పునరుజ్జీవన ఉద్యమం

సాంస్కృతిక పునరుజ్జీవనంతో పదునాల్గో శతాబ్ది ఆరంభం నుండి ఐరోపాలో ఆధునిక యుగం ఆరంభమైంది. ఇది పదహారో శతాబ్ది చివర వరకూ సాగింది. అనాగరిక జాతుల దండయాత్రలతో అణగారిన ప్రాచీన ఐరోపా సంస్కృతి, తిరిగి ఆదరణను పొందసాగింది. ప్రాచీన గ్రీక్ రోమన్ సంస్కృతులు ఐరోపా సంస్కృతి ప్రతీకలుగా భావించబడి, క్రీ. శ 14 - 16 శతాబ్దాల మధ్య సాంస్కృతిక వికాసానికి, పునరుజ్జీవనానికి దారితీశాయి.

ఈ పునరుజ్జీవన ఉద్యమానికి ఇటలీ నగర రాజ్యాలు కేంద్రాలయ్యాయి. టర్కులు క్రీ.శ. 1453లో కాన్‌స్టాంట్‌నోపుల్ నగరాన్ని స్వాధీన పర్చుకున్నప్పుడు, అక్కడున్న క్రైస్తవ పండితులు తమ వద్దనున్న విలువైన గ్రంథాలతో సహా, ఇటలీ రాజ్యాలకు తరలి వెళ్ళారు. వర్తక వాణిజ్య రంగాల్లో రాణిస్తున్న ఇటలీ రాజ్యాలు పోటీలుపడి వారికి ఆశ్రయం కల్పించాయి. అప్పుడు ఆపండితులు ఐరోపావాసులకు ప్రాచీన గ్రంథాలగురించి, వానిలోని సంస్కృతులను గురించి తెలియజేయసాగారు. వర్తకులు, మేధావులు, మధ్యతరగతి వారు మాత్రమే సాంస్కృతిక పునరుజ్జీవన ప్రభావానికి లోనయ్యారు. త్వరలోనే ఇతర ఐరోపా రాజ్యాలు కూడా, ఈ ప్రభావంలోకి వచ్చాయి.

సంస్కృతి వికాసానికి గ్రంథ పఠనం ఆస్కారం కలిగిస్తుంది. జాన్ గూటిన్ బర్గ్ క్రీ.శ. 1453లో అచ్చుయంత్రాన్ని కనుగొనడంతో, త్వరలోనే వార్తలు, ప్రజల భావాలు సామాన్యులకు తెలియడం ఆరంభమైంది. విద్య, విజ్ఞానం పెరగడంతో, కరపత్రాల వాడుక అధికమైంది. అన్నిరంగాల్లో సామాన్యుని పాత్ర పెరిగింది.

పునరుజ్జీవన యుగానికి క్లాసిజం లేక ప్రామాణికత మొదటి లక్షణం. ప్రాచీన గ్రీక్ రోమన్‌ల సంస్కృతుల అధ్యయనం, ఆదరం 14 - 17 శతాబ్దాల మధ్య ఐరోపా అంతటా జరిగాయి. మత ప్రసక్తిలేని ఆదరణను చూపడంలోనూ, నిజాయితీతో కూడిన గౌరవాన్ని చూపడంలోను ఇవి మధ్య యుగం కంటే భిన్నమైనవి. మధ్య యుగంలో మత ప్రభావం వలన ప్రాచీన సంస్కృతి నుండి, నైతిక సూత్రాలని మాత్రమే గ్రహించారు. వాటినే ప్రచారం చేసేవారు. అయితే ఆధునిక యుగంలో వాటిని లౌకిక దృష్టితో మాత్రమే పరికించి, వాటిని అనుకరించడం కూడా చేశారు. ప్రాచీన గ్రంథాల్లోను, సంస్కృతిలోను ఉండే "మానవీయ" గుణాల చర్చలు అధికమయ్యాయి. వీనితోబాటు మధ్య యుగంలో వచ్చిన కళలను, సాహిత్యాన్ని, సారస్వతాన్ని అనాగరకమైనవని, సృజనాత్మకత లేనివని, అజ్ఞానానికి మూఢనమ్మకాలకు అవి ప్రతీకలని నిరసించారు. సిసిరో, పెట్రార్క్‌ల మధ్య కాలాన్ని అంధకార యుగంగా పేర్కొనడం కూడా జరిగింది.

గ్రీక్, రోమన్ ప్రాచీన సంస్కృతిని పునరుజ్జీవింప జేసిన వారిలో ఇటలీకి చెందిన పెట్రార్క్ (Petrarch) (1304 – 1374) మొదటి వ్యక్తి. ఇతడు న్యాయ శాస్త్రాన్ని, తత్త్వ శాస్త్రాన్ని, సాహిత్య రీతులను అభ్యసించాడు.



BRAOU

లాటిన్ భాషను పరిపుష్టం చేశాడు. విశ్వవిద్యాలయాలు, చర్చి, రాజులు ఇతనికి సహాయం చేశారు. ప్రాచీన రాత ప్రతులను వెలికి తియ్యడంలోనూ, వానిని ప్రచారం చెయ్యడంలోనూ, గ్రంథాలయాల స్థాపనలోనూ ఇతడు కృషి చేశాడు. పెట్రార్క్ వలెనే ప్రసిద్ధి పొందిన మరొక వ్యక్తి బొకాషియో (1314 - 1375) ఇతను కవి, పండితుడు, సంగీతకారుడు, చిత్రకళారాధకుడు. ఇతని గ్రంథాల్లో "డికామెరాన్" (Decameran) అనే కథల గ్రంథం సుప్రసిద్ధమైంది. వీరిద్దరు నాటి మూఢనమ్మకాలను, మతాధిక్యతను విమర్శించారు. ఈవిధంగా ప్రాచీన సాహిత్య గ్రంథాలపై పెరిగిన మోజు లక్షణాలు : సాహిత్య గ్రంథాల అన్వేషణ, కళల్లో నూతన పోకడలను అనుసరించడం, ప్రామాణిక గ్రంథాల నుండి భాగాలను వల్లించడం, ప్రామాణిక వ్యక్తుల, సంస్థల పేర్లను ప్రాచుర్యంలోనికి తీయడం మొదలైనవి. ఈవిధమైన పాత సంస్కృతి మోజు వలన మానవతా వాదం వచ్చింది.

## 10.3 మానవతా వాద ఉద్యమం

ప్రాచీన గ్రంథాల్లో ఉన్న మానవతా విలువలకు ఆదరం, ప్రచారం, ఐరోపా అంతటా అధికమయ్యాయి. మధ్య యుగాల్లో ఆగ్రంథాలను మత దృక్పథం నుండి పరికించి, వానిలోని భక్తిని, త్యాగాన్ని, మానవ జీవతం పట్ల నిరాసక్తతను, దైవ నిర్ణయ ప్రాముఖ్యాన్ని మాత్రమే విలువలుగా భావించి ఆదరించారు. దానికి భిన్నంగా పునరుజ్జీవన కాలంలో మానవుడు కేంద్ర స్థానమై, మానవ జీవితంపట్ల అనురక్తి , అతని సుఖ సంతోషాలు, సామాజిక విలువలు, సామాజిక సంస్థలు ప్రాముఖ్యత వహించసాగాయి. మానవ హక్కులు, ప్రయోజనాలు, సంక్షేమ దిశగా కృషి చేసే సంస్థల ఆవశ్యకత, సమాజంలోని సాంప్రదాయాలు, వాని మంచిచెడ్డలు, సంస్కరణల ఆవశ్యకత ప్రాముఖ్యం పొందసాగాయి.

మానవ ఆదర్శాలను, లక్ష్యాలను బోధించే శాస్త్రాలను "హ్యుమానిటీస్" (Humanities) లేదా మానవీయ శాస్త్రాలుగా మలచి, వాని అధ్యయనాన్ని పండితులు ప్రోత్సహించసాగారు. ప్రతి నగరంలోనూ ఈ శాస్త్రాల అధ్యయనాలకై 'అకాడమీ' (Academy) లనే పేరుతో స్వచ్ఛంద సంస్థలు ఏర్పడ్డాయి. ప్లేటో కాలంనాటి మాటైన అకాడమి అనే పదం పునరుద్ధరించబడింది. ఈ అకాడమీలు మానవతా వాద ప్రచారానికి కృషి చేసాయి.

BRAOU

## 10.4 మానవతా వాద ప్రచారకులు

మానవతా వాదాన్ని ఉద్యమంగా నడిపిన వారిలో పదహారవ శతాబ్దపు జర్మనీ దేశీయుడైన జాన్ రికులన్ (John Reuchlin) ప్రముఖుడు. ఈయన గ్రీక్ సాహిత్యాన్ని, హిబ్రూ వ్యాకరణాన్ని బోధించేవాడు. ఇతడు రాజకుమారులకు గురువుగా ఉండేవాడు.

ఫిలిప్ మెలాంకేథన్ (Philip Melanchthon) విట్టిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో గ్రీక్ భాషాచార్యుడు. ఇతడు మార్టిన్ లూథర్‌కు మిత్రుడు.

జాన్ కోలెట్ (John Colet) లండన్‌లోని సెయింట్ పాల్ కెథెడ్రల్‌లో అధ్యాపకుడుగానూ, మత ప్రచారకుడుగాను, ఉండేవాడు.

గ్రీక్, లాటిన్ భాషల్లో పండితుడైన విలియం బుడ్ (William Bude) ఫ్రాన్స్‌లో "కాలేజ్ ది ఫ్రాన్స్" (College de France) ని స్థాపించి, నూతన విజ్ఞాన వ్యాప్తికి కృషిచేశాడు.

ఎనిమిదో హెన్రీ కాలంలో 'ఉటోపియా (Utopia)ను' రచించిన ఇంగ్లాండ్ నివాసి అయిన సర్ థామస్ మోర్ (Sir Thomas More) కోపెన్‌హగన్ విశ్వవిద్యాలయంలోని చరిత్రకారుడు అయిన హెలిగ్‌సన్ ఇతర ప్రముఖుల్లో పేర్కొనవలసినవారు.

## డెసి డేరయస్ ఎరాస్మస్ (Desi derius Erasmus) (1466 – 1536)

ఎరాస్మస్ పదహారో శతాబ్దంలో 'ఐరోపా పండితునిగా' ఖ్యాతి పొందాడు. నెదర్లాండ్‌లోని రోటర్‌డామ్‌కు చెందిన ఎరాస్మస్ లాటిన్ భాషపై అధికారాన్ని సాధించి, ఐరోపాలోని ప్రముఖ రాజ్యాలైన జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్‌ల్లో పర్యటించి, సమకాలీన పండితులతో ఉత్తర ప్రత్యుత్తరాలను జరిపి, ప్రథమ శ్రేణికి చెందిన పండితునిగా గౌరవించబడినాడు. లాటిన్ భాష మధ్య యుగంలో కృతకంగా మారిందని భావించిన ఇతను, సిసిరో వాడిన భాషను పునరుద్ధరించే ప్రయత్నం చేశాడు. ఇంగ్లండ్, ఫ్రాన్స్ రాజులతోను పోప్ పదవ లియోతోను, స్నేహం చేశాడు. కొంతకాలం "కాలేజ్ ది ఫ్రాన్స్" (College de France) లో పనిచేశాడు. "కొత్త నిబంధనలు" (New Testament) గ్రంథాన్ని గ్రీక్ భాషలో రాసి, దానికి లాటిన్ అనువాదాన్ని కూడా రచించాడు. వీనిలో చర్చిలోను, మతాధికారుల్లోను వచ్చిన ఆడంబరాన్ని అపహాస్యం చేశాడు. వారిలో అజ్ఞానాన్ని, మూఢనమ్మకాలను,ఆడంబరాలను తన "ప్రెయిజ్ ఆఫ్ ఫాలి" (Paise of folly) అనే గ్రంథంలో వ్యంగ్యంగా ఎత్తి చూపాడు. హాస్య ప్రియత్వంగల ఈయన, తనతో సహా, అందరిపై చమత్కారంతో కూడిన వ్యాఖ్యలు చేస్తూండేవాడు. ఒక మానవతా వాదిగా ఇతను మూఢనమ్మకాలను, మతఛాందసాలను, అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని అవహేళన చేశాడు. కాని చర్చిని, మతాధికారుల ఆధిక్యతను, అంగీకరించాడు. సాహితీపరులను గురించి తెలుపుతూ, వారు దూరపు కొండలవలె దూరం నుండి మాత్రమే ప్రభావితం చేస్తారని అంటాడు.

మేధావులు సాగించే దీర్ఘకాలిక చర్చలపైనా, చర్చి సాంప్రదాయాలపైనా, మతాధికారుల ఆస్తి పైనా, సాధువుల జీవనం పైనా ఎరాస్మస్ ధ్వజమెత్తాడు. పాపం నుండి, చావు నుండి విముక్తినిచ్చేది మాత్రమే అని జీవితాన్ని చూడ్డంగాక, క్రైస్తవ మతంలోని నైతిక సూత్రాలగు ప్రేమ, దయ, ఆత్మనిగ్రహం హేతుబద్ధమైన ఆలోచన కావాలని ఇతడు అన్నాడు.

"ది ఎడ్యుకేషన్ ఆఫ్ ది క్రిస్టియన్ ప్రిన్స్" (The Education of the Christian prince) అనే గ్రంథాన్ని ఎరాస్మస్ ఐదవ చార్లెస్‌కి అంకితమిచ్చాడు. దీనిలో అతడు విద్య, హేతు వాదం మాత్రమే బాహ్యజీవనంలో పేరుతెచ్చేవని పేర్కొన్నాడు.

మార్టిన్ లూథర్ (Martin Luther) ప్రారంభించిన "ప్రొటెస్టాంట్" ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ, "డిస్కోర్స్ ఆన్ ఫ్రీ వల్" (Discourse on Free wheel) ను రాశాడు. లూథర్ తెలిపిన మానవ దిగజారుడుతనాన్ని ఎరాస్మస్ అంగీకరించలేదు. మానవ హుందాతనాన్ని, స్వేచ్ఛాపూరితమైన నిర్ణయాధికారాన్ని చేసే శక్తిని ప్రశంసించాడు. ఎరాస్మస్ రాసిన ఈ గ్రంథం కాథలిక్కులను - ప్రొటెస్టాంట్‌లను ఇద్దరినీ తృప్తిపర్చలేదు. మృత్యువు సమీపించేంతవరకు, ఇతడు చర్చిని తన అభిప్రాయాలకు అనుగుణంగా మార్చే ప్రయత్నాలనే చేశాడు. చర్చిలో అంతర్గత మార్పు రావాలని కోరాడే తప్ప, కాథలిక్ చర్చికి వ్యతిరేకంగా తిరుగుబాటును ప్రోత్సహించలేదు.

మానవతా వాదులందరిలో ఒక్క మేలాంక్‌థన్ (Melanchthon) మాత్రమే కాథలిక్ చర్చి నుండి విడిపోయాడు. మిగిలిన వారంతా అందులో సభ్యులుగానే కొనసాగారు. సర్ థామస్ మోర్ (Sir Thomas More) ని ముఖ్య సభ్యునిగా కాథలిక్ చర్చి పరిగణించింది. హెల్గెసన్ (Helgesen) చర్చి అధికాం స్తూ రచన చేశాడు. ఎరాస్మస్, లుథర్‌ను విమర్శించాడు.

క్లాసిజంను ఐరోపాలోని మేధావులు 16,17,18 శతాబ్దాల్లో సహితం ఆదరిస్తూనే వచ్చారు. సాహిత్యం, కళ, ఆధునిక శాస్త్ర సిద్ధాంతాలను క్లాసిజం ప్రభావితం చేస్తూనే వచ్చింది.

## 10.5 నూతన విజ్ఞానం

జ్ఞానాన్వేషణ, సత్యశోధన, తత్త్వచింతన పదహారో శతాబ్దంలో అధికమయ్యాయి. వీటి ప్రభావం వల్ల, విజ్ఞాన శాస్త్రాలు, సాంఘిక శాస్త్రాల్లో శాస్త్రీయ అధ్యయనం పరిశోధన అభివృద్ధి పొందాయి.

### 10.5.1 విజ్ఞాన శాస్త్రాలు

**ఖగోళ శాస్త్రం**

పోలెండ్ నివాసైన కొపెర్నికస్ (Copernicus) ప్రాచీన గ్రీక్ శాస్త్రజ్ఞుడైన పైథాగరస్ (Pythagorus) సిద్ధాంతానికి జీవం పోశాడు. క్రైస్తవ ప్రపంచమంతా ఏకగ్రీవంగా అంగీకరించే టాలెమీ (Ptolemy) సిద్ధాంతమైన భూమి విశ్వానికి కేంద్రమనే వాదనను ఇతడు కాదన్నాడు. భూమి సూర్యుని చుట్టూ తిరిగే ఒక గ్రహం మాత్రమే అని కోపర్నికస్ తెలిపాడు. తన ఖగోళ పరిశోధనలను "ఆన్ ది రివల్యూషన్ ఆఫ్ సెలస్టియల్ బాడీస్" (On the Revolution of celestial Bodies) అనే గ్రంథంలో క్రీ.శ. 1543లో పదిలపర్చి, దాన్ని పోప్‌కు అంకితమిచ్చాడు. ఇది క్రైస్తవ మత సిద్ధాంతాలకు వ్యతిరేకమవడంతో, తీవ్ర వివాదాలకు దారితీసింది. జర్మనీకి చెందిన కెప్లర్ (Kepler) ఇటలీకి చెందిన గెలీలియో (Galileo) లు కొపెర్నికస్ సిద్ధాంతాన్ని బలపర్చి, మతాధికారుల ఆగ్రహానికి గురయ్యారు.

డెన్మార్క్ రాజైన రెండో ఫ్రెడరిక్ ఆర్థిక సహాయంతో, టైకో బ్రాహి (Tyco Brahe) బాల్టిక్ సముద్రంలో ఒక ప్రయోగశాలను నిర్మించుకొని, పరిశోధనలను చేశాడు.

భూమి గుండ్రంగా ఉన్నదని, పడమటి దిక్కుగా సముద్ర ప్రయాణం చేసి, చైనా - భారతదేశాలను చేరవచ్చని జాతీయ రాజ్యాలు నావికులను ప్రోత్సహించసాగాయి. దిక్సూచి, అక్షాంశ రేఖలను తెలియజేసే ఆస్ట్రలోబ్, సముద్ర ప్రయాణ పటాలు, జాతీయ రాజ్యాల ఆర్థిక సహాయం, వర్తకావసరాలు, మత ప్రేరణ నావికులను నూతన సముద్ర మార్గాల అన్వేషణకై ప్రోత్సహించాయి.

భౌగోళిక పరిశోధనల్లో పోర్చుగల్ మార్గదర్శకత్వం వహించింది. ప్రిన్స్ హెన్రి ఒక నావికా శిక్షణాలయాన్ని స్థాపించాడు. ఈదేశానికి చెందిన బార్తలోమియా డయాజ్ దక్షిణ ఆఫ్రికా అగ్రాన్ని చేరి, దానిని తుఫానుల అగ్రం (Cape of Storms) అని పేరుపెట్టాడు. వాస్కోడగామా 1498లో భారతదేశంలోని కాలికట్ చేరాడు. దీనితో పోర్చుగీస్ వారు భారతదేశంలో స్థావరాల ఏర్పాటు చేయడం జరిగింది.

ఇటలీకి చెందిన కొలంబస్ స్పెయిన్ రాజ్య సహాయంతో క్రీ. శ 1492లో కొత్త ఖండాన్ని కనుక్కున్నప్పటికీ, దానిని భారతదేశమని భావించాడు. ఇటలీకి చెందిన అమెరిగో క్రీ. శ. 1503లో దాన్ని నూతన ఖండంగా గుర్తించడంతో, 'అమెరికా' అని వ్యవహరించసాగారు.

అలాగే జాన్ కాబెట్ అనే ఇటలీ నావికుడు ఉత్తర అమెరికాని, పోర్చుగీస్ నావికుడైన కాబ్రెల్ బ్రెజిల్‌ను, ఫెర్డినాండ్ మాజిలాన్ అనే పోర్చుగీస్ నావికుడు ఫిలిప్పైన్స్‌ను కనుగొన్నారు. స్పెయిన్ నావికుడు అయన బాల్బోవా క్రీ.శ. 1513లో పసిఫిక్ మహాసముద్రాన్ని కనుగొన్నాడు.

పదహారో శతాబ్దానికి ప్రపంచంలోని అనేక ప్రదేశాలు తెలియడమేకాక, వలస రాజ్య స్థాపనలు, పెట్టుబడిదారీ వ్యవస్థ పెరుగుదల, వర్తక వ్యాపారాల పెంపు, నగరీకరణ, అన్ని రంగాల్లో మధ్యతరగతి ప్రజల చురుకైన పాత్ర వహించటం మొదలగు మార్పులు సంభవించాయి.

BRAOU

**గణితం**

ఈ శాస్త్రం బాగా అభివృద్ధి చెందింది. ప్రాచీన గ్రీక్ రోమన్ల నుండి లెక్కలు, రేఖాగణితం, ముస్లింలనుండి ఆల్జీబ్రాను, అరబిక్ సంఖ్యలను నేర్చుకున్న ఐరోపావాసులు వాటిని ఆధారం చేసుకొని, నూతన విషయాలను తెలుసుకున్నారు. తార్టాగ్లియా (Tartaglia), కార్డన్ (Cardan) లు ఇద్దరూ ఇటలీ దేశస్థులు. పరిశోధనల్లో పోటీపడి, నూతన అంశాలను కనుకున్నారు. నెదర్లాండ్స్ చెందిన స్టెవినీస్ (Stevinees) గణిత విజ్ఞానాన్ని సైనిక విజ్ఞానానికి ఉపయోగించడానికి గణాంక పద్ధతిని, నాణేలు, తూకాలు, కొలతల్లో ప్రవేశపెట్టడానికి కృషి చేశాడు.

గణిత శాస్త్రజ్ఞుల కృషివల్ల ఆశాస్త్రం ఆధునీకరించబడింది. గణిత సంకేతాలైన +, -, ×, ÷, మున్నగునవి, లాగర్ థమ్స్, డెసిమల్ స్థానాలు ఉపయోగంలోకి వచ్చాయి.

**భౌతిక శాస్త్రం**

నూతన పరికరాలను రూపొందించుకోవడం ద్వారా, భౌతిక శాస్త్రం అభివృద్ధి పొందింది. ఇటలీకి చెందిన పోర్టా (Porta) మ్యాజిక్ లాంతర్‌ను, డచ్చి దేశస్థుడైన జాన్‌సేన్ (Jan Sen) మొదటి కాంపౌండ్ మైక్రోస్కోప్‌ను కనిపెట్టారు. ఇంగ్లీష్ శాస్త్రజ్ఞుడైన విలియం గిల్బర్ట్ (William Gilbert) అయస్కాంత పరిశోధనలను చేశాడు. నాటి భౌతిక శాస్త్రజ్ఞులందరిలోకి గెలీలియో అగ్రగణ్యుడు. ఇతడు ఎలుర్ థర్మామీటర్‌ను, హైడ్రోస్టాటిక్ బాలన్స్, ఎస్ట్రనామికల్ క్లాక్‌ను తయారుచేశాడు. ధ్వని తరంగాలకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేశాడు. డైనమిక్స్‌ని మెకానిక్స్‌ను వివరిస్తూ, ఆధునిక భౌతిక శాస్త్ర పునాదులను వేశాడు.

**లోహ శాస్త్రం**

జర్మనీ దేశీయుడైన అగ్రికోలా (Agricola) లోహ శాస్త్ర పరిశోధనలో నిమగ్నుడై, 12 పుస్తకాలను రచించాడు. ఉక్కు తయారీ పద్ధతిని, ముడిపదార్థాల్లో ఖనిజాన్ని లెక్కించే విధానాలను వివరించాడు.

**రసాయన శాస్త్రం**

ఈరంగంలో నెదర్లాండ్‌కు చెందిన వాన్ హెల్మోంట్ (Van Helmont) చేసిన పరిశోధనలు ప్రముఖమైనవి. అతడు, గాలి, వాయువులు వేర్వేరని నిరూపించాడు. గాలి నుండి బొగ్గుపులుసు వాయువును వేరుపర్చాడు

**వైద్యం**

ప్రాచీన గ్రీక్ వైద్య శాస్త్రజ్ఞులైన హిపోక్రేటిస్ (Hippocrates) గాలెన్ (Galen) రచనలనాధారం చేసుకొని, నూతన పరిశోధనలు సాగాయి. పదహారో శతాబ్దపు వైద్య పరిశోధకుల్లో ఇటలీలోని యుస్టేషియా (Eustochia) ఫెలోపియా (Fallopia) లు స్పెయిన్‌లో సెర్విటస్ (Cervetas) లు ప్రముఖులు. ఇటలీ దేశస్థుడైన ఫ్రాస్కేటర్ (Fascator) తన పరిశోధనల ద్వారా క్రిములు అనారోగ్యాన్ని కలిగిస్తాయని తెలిపాడు. పెరాసెల్సస్ (Paracelsus) వైద్యానికి రసాయన శాస్త్రంతో సన్నిహిత సంబంధం ఉందని నిరూపించాడు. నెదర్లాండ్స్‌కు చెందిన వెసాలియస్ (Vesaliuos) శరీర శాస్త్రాలపై (anatomy) గ్రంథాన్ని రచించి, శరీరభాగాలైన వెన్నెముక, కండరాలు, నరాలు, ఊపిరితిత్తులు, మెదడుల పనితీరును వివరించాడు. ఇంగ్లాండ్‌కు చెందిన విలియం హార్వే (William Harvey) రక్త ప్రసరణ విధానాన్ని వివరించాడు.

## 10.5.2 మానవీయ శాస్త్రాలు (Humanities)

నూతన విజ్ఞాన విధానం మానవీయ శాస్త్రాల్లో కూడా ప్రవేశించింది. శాస్త్రీయ పరిశీలన, పరిశోధన, మూల విషయాలతో తర్కించడం అందరూ అనుశృతంగా అంగీకరించే విషయాలను సహితం పరీక్షకు నిలిపి,

సత్యమైతేనే అంగీకరించడం మొదలయ్యాయి. వస్తుసేకరణ, అంతర్గత - బాహ్య విమర్శలు, సమన్వయం, వ్యక్తీకరణలలోని అనేక ప్రాథమికాంశాలపై చర్చలు ఆరంభమయ్యాయి.

### భౌగోళిక శాస్త్రం

నూతన సముద్ర మార్గాల అన్వేషణ వలన ఈ శాస్త్రం అమితంగా అభివృద్ధి చెందింది. దీనికి కృషి చేసిన వారిలో నెదర్లాండ్స్‌కు చెందిన గెర్హార్డ్ క్రెమర్ (Gerhard Kremer) ప్రముఖుడు. ఇతడు రేఖలతో కూడిన భౌగోళిక పటాలను, గ్లోబ్‌ను తయారుచేశాడు.

### తత్త్వ శాస్త్రం

మత శాస్త్రాల నుండి విడిపడి, ఆధునిక తత్త్వ శాస్త్రం ఆవిర్భవించింది. ఆధునిక తత్త్వవేత్తల్లో ఇటలీ దేశస్థుడైన బ్రూనో (Bruno) మొదటివాడు. ఇతడు మత సన్యాసిగా జీవితం ప్రారంభించినా, రోమ్ నుండి పారిపోయిన తరువాత, మతాచారాలను, మత మహిమలను, మత గ్రంథాలను తీవ్రంగా విమర్శించాడు. దైవత్వాన్ని దైవ శాసనాల్ని అంగీకరించాడు. అతని తాత్త్విక భావాలకు ఇంగ్లండ్, ఫ్రాన్స్‌ల్లో తాత్కాలిక ఆదరణ లభించినా, రోమ్ మత న్యాయస్థానంలో ఇతడు శిక్షించబడ్డాడు. బ్రిటన్‌కు చెందిన ఫ్రాన్సిస్ బేకన్ (Francis Bacon) మరో ఆధునిక తత్త్వవేత్త. ఈశాస్త్రం, తర్కానికి అనుగుణంగాను, ప్రయోగాత్మకంగాను, ప్రజోపయోగకరంగాను ఉండాలని బేకన్ అభిప్రాయం. ఇతను రచించిన అనేక గ్రంథాల్లో "ఎస్సేస్" (Essays) "ఎడ్వాన్స్‌మెంట్ ఆఫ్ లర్నింగ్ (Advancement of Learning) "నోవం ఆర్గనం" (Novam Organum) "న్యూ అట్లాంటిస్" (New Attlantis) ప్రసిద్ధి చెందాయి.

### చరిత్ర

చరిత్ర రచనలకు ఆధారాలైన పురాతన గ్రంథాల సేకరణ, వాని బాహ్య, అంతర్గత విమర్శలు శాస్త్రీయ చరిత్ర రచనకు దారితీసాయి. ఆధార గ్రంథాలను, పాత ప్రతులను ముద్రించడంలో శాస్త్రీయ పరిశీలన జరిపారు. పదహేడు పద్దెనిమిది శతాబ్దాల్లో చరిత్రను ఊహలనుండి, వింత సంఘటనల నుండి తార్కికంగా వివరించగలిగే శాస్త్రీయ స్థితికి మార్చాయి. గ్రీక్, రోమన్‌ల చరిత్రలకు సంబంధించిన అనేక ఆధారాలను విమర్శకు గురిచేసి, చాలావాటిని విశ్వసించదగినవిగావని ఇటలీకి చెందిన వికో తెలిపాడు. రాజకీయ సంస్థలను, కళావస్తువులను కాలానుగుణంగా, పరిస్థితుల ప్రభావాల వలన మారుతాయని ఇతడు తెలిపాడు. విమర్శనాత్మకంగా చరిత్రను తెలిపినవారిలో "వికో" యే ప్రథముడని భావంచవచ్చు. చరిత్రలో వచ్చిన ఈ భావాలను, హేర్డర్ మరింత ముందుకు తీసుకెళ్ళాడు "ఐడియాస్ ఆన్ ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ" (Ideas on the philosophy of History) అనే పుస్తకంలో ఇతడు చరిత్రను ఈ విధంగా నిర్వచించాడు. "కాలాన్నిబట్టి, ప్రదేశాన్నిబట్టి, మార్పుచెందే మానవ శక్తులకు, క్రియలకు, అభిలాషలకు సంబంధించిన పూర్తి ప్రాకృతిక చరిత్ర". ("a pure natural history of human powers, actions, and propensities as modified by time and place) అలాగే హెర్డర్ చరిత్ర పరిధిని తెలుపుతూ, అది జాతులను గురించి, జాతీయతా భావం గురించి, సంస్కృతి గురించి, మానవత గురించి, తెలియజేయాలన్నాడు. మధ్య యుగాన్ని చరిత్రల్లో నమ్మకం, మూఢ సంప్రదాయ యుగంగా చిత్రీకరించి, ప్రాచీన సంస్కృతిని కీర్తించారు. దీనికి ముఖ్యమైన ఉదాహరణ ఆంగ్లేయ చరిత్రకారుడు ఎడ్వర్డ్ గిబ్బన్ రచించిన "డిక్లైన్ అండ్ ఫాల్ ఆఫ్ రోమన్ ఎంపైర్" (Decline and fall of Roman Empire) క్రైస్తవ అనాగరకతను రోమన్ నాగరకతతో పోల్చి, రోమ్ నాగరకత క్షీణతకు క్రైస్తవ మత విజృంభణే కారణమని ఇతడు పేర్కొన్నాడు. గిబ్బన్ చరిత్రను ప్రజలు ఆదరించారు. వోల్టేర్ రచంచిన "ఏజ్ ఆఫ్ లూయిస్ ఫోర్టీన్ (Age of Louis XIV) "లైఫ్ ఆఫ్ చార్లెస్ ది ట్వల్త్" (Life of charles the XII)

BRAOU

ఫ్రాన్స్‌కు చెందిన రేనాల్ (Raynal) డిడిరోకు, హోల్‌బాక్‌కు స్నేహితుడు. ఇతని చరిత్ర రచనల్లో పాండిత్య ప్రతిభ లేకపోయినా, తత్వ భాగం అధికంగా ఉండడంతో ప్రజాదరణ పొందాయి. ఇతడు హాలండ్ చరిత్రపైనా, ఇంగ్లాండ్ చరిత్రపైనా వ్యాసాలు రాశాడు. హెగెల్ "ఫిలసఫీ ఆఫ్ హిస్టరీ" (Philosophy of History) అనే గ్రంథంలో మానవుని ఆధ్యాత్మిక, నైతిక పురోభివృద్ధిని వర్ణించేదే చరిత్ర అని తెలిపాడు. ఈవిధంగా చరిత్ర రచనల్లో తత్వ విచారం అధికమై, దాని పరిధి విస్తృతమైంది. స్పెయిన్‌కు చెందిన మెరియానా (Mariana) రచించిన "హిస్టరీ ఆఫ్ స్పెయిన్, (History of Spain) "ఆదేశానికి చెందిన బార్తలోమి దలంకసా (Bartalome dalacasas) రచించిన "హిస్టరీ ఆఫ్ ది ఇండేన్" (History of Indane) ఇటలీకి చెందిన కృకార్థనీ (Cruicciardinne) రచించిన "హిస్టరీ ఆఫ్ ఇటలీ" (History of Italy) మరికొన్ని ఉదాహరణలు.

**ఇతరాలు**

రాజనీతి శాస్త్ర రచనల్లో ఇటలీ దేశస్థుడైన మాకీయవిల్లి (Machiavelli) రచించిన "ది ప్రిన్స్" (The Prince), ఫ్రెంచ్ దేశీయుడైన జీన్ బోడీన్ (Jean Bodin) రచించిన రాజకీయ తత్వ శాస్త్రం 'సాంస్కృతిక పునరుజ్జీవనంలో ఉద్భవించి, నూతన ఒరవడిని ఆరంభించిన రచనలే, హాబ్స్ రచించిన "లెవియథాన్" (Leviathan) రాజ్యాన్ని గురించిన హేతుబద్ధ చర్చలను ఆరంభించింది. లాక్, రూసో, మాంటిస్క్యూలు తమ భావాలతో ఈశాస్త్రాన్ని పరిపుష్టం చేశారు. ఆడం స్మిత్ "ది వెల్త్ ఆఫ్ నేషన్స్" (The wealth of Nations) గ్రంథ రచన ద్వారా ఆర్థిక శాస్త్రంలో విప్లవాత్మక దృక్పథానికి కారకుడయ్యాడు. పద్దెనిమిదో శతాబ్దపు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, రాజ్య అదుపులేని ఆర్థిక విధానాలను అతడు ప్రతిబింబించాడు. న్యాయ శాస్త్రాన్ని నూతన సిద్ధాంతాలను బ్లాక్‌స్టోన్, బెక్కారియా, జెరిమి బెంథాం ప్రముఖులు ప్రతిపాదించారు.

### 10.5.3 జాతీయ భాషల్లో సాహిత్యాభివృద్ధి

సాంస్కృతిక పునరుజ్జీవన ఫలితంగా గ్రీక్, లాటిన్ భాషల్లో ఎంత ఆదరణ, గౌరవం పెరిగినప్పటికీ, జాతీయ భాషల్లో గ్రంథాల ప్రచురణ కూడా అంతకంతకు ఎక్కువైంది. దీనికి కారణాలనేకం. రాజ్యాల స్థాపనతో బలపడిన జాతీయ భావం, భౌగోళిక అన్వేషణ రీతుల సమాచారం, ఆర్థికరంగాన వస్తున్న మార్పులు, వలసలను గురించిన సమాచారం, మత సంస్కరణ విషయంలో జరుగుతున్న చర్చలు, సామాన్య ప్రజానీకానికి సహితం తెలియవలసిన ఆవశ్యకత ఉండడంతోను అచ్చు యంత్రం వాడుకలోకి రావడం వలన, జాతీయ భాషా గ్రంథాల సంఖ్య పెరగసాగింది. స్థానిక భాషపై ఆశక్తి పెరగడం వలన ఆయా భాషల్లో నిఘంటువులు, వ్యాకరణ గ్రంథాలు ప్రచురణ పొందసాగాయి.

పదహారో శతాబ్దంలో వెలువడిన జాతీయ సాహిత్యంలో ఎక్కువ పుస్తకాలు మత గ్రంథాలు లేక అనువాదాలు. మార్టిన్ లూథర్ బైబిల్‌ను జర్మన్‌లోకి అనువదించాడు. ఆంగ్లోకన్ చర్చికై క్రీమర్ (Gemmer) బుక్ ఆఫ్ కామన్ ప్రేయర్‌ను (Book of Common Prayer) రచించాడు. ఫ్రెంచ్ భాషలో కాల్విన్ "ఇన్‌స్టట్యూట్స్ ఆఫ్ ది క్రిస్టియన్ రెలిజియన్" (institutes of the Christian Religion) గ్రంథాన్ని రచించాడు. స్పానిష్ భాషలో సెయింట్ థెరసా జీవిత కథ వచ్చింది. మత సంస్కరణ కాలంలో అనేక వివాదాస్పద గ్రంథాలు, కరపత్రాలు వచ్చాయి. పదహారో శతాబ్దంలో ఇటాలియన్లు మాకియవిల్లిని, పోర్చుగీస్ వారు కామోన్స్‌ను (Comoens) జర్మన్లు లూథర్‌ను, స్పానిష్‌లు సర్వెంటిస్ (Cervantes) ను, ఆంగ్లేయులు షేక్స్పియర్‌ను, తమదేశ సాహిత్యమూర్తులుగా భావించి, గౌరవించారు. షేక్స్పియర్ తన నాటకాల్లో ఆధునికతను, మానవతను సమ్మిశ్రితం చేసి, మానవతా విలువలను తెలియజేసాడు.

BRAOU

పదహారో శతాబ్దంలో అనేక దేశ చరిత్రలు, సముద్రయానంపై రచనలు వెలువడ్డాయి. వాటిలో మాకియ విల్లి ఇటాలియన్‌లో రచించిన "ఫ్లోరంటైన్ హిస్టరీ" (Florentine History) ఇటాలియన్‌లో రచించిన "లైఫ్స్ ఆఫ్ ఇటాలియన్ ఆర్టిస్ట్స్" (Lives of Italian Artists) ఇంగ్లీష్ భాషలో థామస్ మోర్ (Thomas more) రచించిన 'ఉటోపియా' (Utopia) ఆంగ్లేయుడైన రిచర్డ్ హెక్లిత్ (Richard Hayklut) రచించిన "ప్రిన్స్‌పల్ నావిగేషన్స్, వాయేజస్, అండ్ డిస్కవరీస్ ఆఫ్ ది ఇంగ్లీష్ నేషన్" (Principal Navigations, Voyages and discoveries of the English nation ) ప్రసిద్ధ గ్రంథాలు.

పదహారో శతాబ్దంనాటి జాతీయ సాహిత్యం మానవతా వాదాన్ని ప్రబోధించింది. నాటకాలు, ఇతిహాసాల్లో మరింతగా ఈ దృక్పథాన్ని చాటారు. ఇటలీ దేశస్థుడైన అరిస్టో రచించిన (Aristo) "ఆర్లాండ్ ఫ్యూరిసో' (Orlando Furiso), టాసో (Tasso) రచించిన "జెరూసలేమ్ డెలివర్డ్" (Jerusaiam Delivered) ఇతిహాస రీతిలో సాగిన రచనలు 'కామోన్స్' (Comoens) పోర్చుగీస్ భాషల్లో రాసిన "లూసియాడ్" (Lusiad) అనే గ్రంథంలో వాస్కోడగామా భారతదేశ యాత్రను వర్ణించాడు.

సమకాలీన సమాజంపై నిశిత విమర్శలు సెర్వంటీస్ (Cervantes) రాసిన "డాన్ క్వకోట్స్" (Don Quicotes) అనే స్పానిష్ గ్రంథంలో కనిపిస్తాయి. మధ్య యుగపు సాహసకృత్యాలపైనా, ఉన్నత వర్గాల్లో పుట్టుకపైనా, వ్యంగ్యోక్తులు కనిపిస్తాయి. ఫ్రాన్స్‌కు చెందన రబే ల (Rabe lais) రాజకీయ, సాంఘిక మతరంగాలపై విమర్శలు సాగించాడు.

### 10.5.4 నూతన విజ్ఞాన లక్షణాలు

1. నూతన విజ్ఞానం క్లాసిజంచే ప్రభావితమైంది. మానవతా వాదం దీని ముఖ్య లక్షణం.

2. అన్నిరంగాల్లోను పరిశోధన అభివృద్ధి పొందింది. అనేక ప్రాచీన గ్రంథాలు వెలుగులోకి వచ్చాయి. సిసిరో ఉపన్యాసాలు, లివీ - టాసిటస్‌లు రచంచిన చరిత్ర గ్రంథాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాచీన గ్రంథాలపై చర్చలు, వ్యాఖ్యానాలు కొనసాగాయి. ప్రాచీన సాహిత్య వెలుగులో ఆధునిక విజ్ఞానం పురోగమించసాగింది. గ్రీక్, లాటిన్ సాహిత్య జిజ్ఞాస త్వరలో దేశ చరిత్రలపై మరలి, దేశ చరిత్ర రచన శాస్త్రీయ పద్ధతుల్లో మొదలైంది.

3. నూతన విజ్ఞానం ప్రజల్లో వ్యక్తిత్వ భావనను పెంపొందించింది. మానవతా వాద ప్రభావంతో మానవుడు సాంఘిక ఆర్థిక సంస్థలన్నీ తన ప్రయోజనానికే ఉన్నాయని ప్రకటించి, తన ప్రయోజనాలకు భిన్నంగా వర్తించే సంస్థలపై చర్య తీసుకోవడం ఆరంభించాడు.

4. నూతన విజ్ఞానం ఐరోపాలో ఆధునిక యుగాన్ని ఆవిష్కరించింది. హేతు వాదం, తార్కిక దృష్టి శాస్త్రీయ పరిశోధనా విధానం ఆధునిక విజ్ఞాన లక్షణాలుగా కొనియాడబడ్డాయి.

5. విజ్ఞానం ఎక్కువమందికి అందుబాటులోకి వచ్చింది విశ్వవిద్యాలయాల సంఖ్య పెరిగింది. నెదర్లాండ్స్‌లోని తావన్, స్కాట్లాండ్‌లోని సెయింట్ ఆండ్రూస్, స్వీడన్‌లోని ఉప్సల, జర్మనీలోని ఫ్రీబర్గ్, టుబిన్‌జన్, విట్టెన్‌బర్గ్ విశ్వవిద్యాలయాలు కొత్తగా స్థాపించబడ్డాయి. ధనికులైన వ్యాపారులు, బ్యాంకర్లు వీనికి కావలసిన ఆర్థిక సహాయాన్ని చేసేవారు. బ్యాంకింగ్ వృత్తిలో ఉన్న 'లొరంజో ది మాగ్నిఫిసెంట్' (Loranji he Magnificien) గ్రీక్ రోమన్ సాహిత్య పఠనానికి ఫ్లోరెంటైన్ గ్రంథాలయాన్ని స్థాపించాడు. ఫ్రెంచ్ రాజైన మొదటి ఫ్రాన్సిస్ (1515 - 1547) ఇటలీ నుండి పండితులను తను స్థాపించిన 'కాలేజ్ ది ఫ్రాన్స్'కి (College the France) రప్పించి, ఫ్రాన్స్‌లో నూతన విజ్ఞానాభివృద్ధికి కృషిచేశాడు. ఇంగ్లాండ్‌రాజు ఎనిమిదవ

హెన్రీ, డెన్మార్క్ రాజు రెండవ క్రిస్టియన్, జర్మనీ - స్పెయిన్ రాజైన ఐదవ ఛార్లెస్, నూతన విజ్ఞానాన్ని తమ దేశాల్లో పెంపొందించారు, సామాన్యులు కూడా తమ పిల్లలకు, మతభక్తుల పేర్లను గాక, ప్రాచీన సంస్కృతిని పెంపొందించిన, సీజర్, వర్జిల్, ప్లూటార్క్, హోమర్, పెరిక్లస్, డయానా, జూలియ మొదలైన పేర్లతో పిలవనారంభించారు. దేశీయ భాషల్లో ప్రచురణలు పెరిగాయి. మానవతా వాదం, వ్యక్తిత్వ వాదం పరిచయమై, మతం పట్ల అనాసక్తత, నిర్లిప్తత పెరిగాయి.

## 10.6 భారతదేశంపై ప్రభావం

ఐరోపాలోలాగే భారతదేశంలో కూడా మానవతా వాదం సాంస్కృతిక పునరుజ్జీవన లక్షణంగానే, ఆధునిక యుగారంభ లక్షణంగానే వచ్చింది. సంఘ సంస్కరణ చేపట్టే సంస్కర్తలందరూ, ప్రాచీన భారత గ్రంథాలను ఆకళింపు చేసుకొని, అవి ఎంతవరకు సమకాలీన ఆచారాలకు అనుమతినిస్తున్నాయని ప్రశ్నించడం ఆరంభించారు. రాజా రామ్‌మోహన్ రాయ్ ఉపనిషత్తులు భారత సంస్కృతికి పరాకాష్ట అని భావించి, బ్రహ్మసమాజాన్ని ఆ పునాదిపై నిర్మించగా, దయానంద సరస్వతి వేదాలే సంస్కృతీ మూలమని భావించి, వాటికి ప్రాధాన్యతనిచ్చారు. ఉపనిషత్తులు, వేదాలతోబాటు, పురాణాలు, ఇతిహాసాలను పఠించడం ఆధునిక యుగాన జరిగింది. సాంఘిక దురాచారాలను ఖండించటానికి, తిరిగి మూలాన్ని శాస్త్రీయ రీతిలో పఠించి, ప్రశ్నించడం ఆరంభమైంది. అవే శాస్త్ర మూలాలను చూపి, దురాచారాలైన సతీ సహగమనం, బాల్య వివాహాలను ఖండించడం మొదలైంది. అలాగే స్త్రీ పునర్వివాహం, స్త్రీ విద్య, శాస్త్ర సమ్మతమేనని నిరూపించారు.

వలస సంస్కృతిని నిరోధించటానికి, సమకాలీన సమాజాన్ని సంస్కరించుకోవడానికి 'క్లాసిజం' (Classism) లేక మూలానికి వెళ్లవలసిన ఆవశ్యకత మొదటి మెట్టు . వివేకానందుడు చికాగోలోని అంతర్జాతీయ వేదిక మీద నిలిచి, భారతీయ మత సంస్కృతిని గురించి ఉపన్యసించాడు.

ప్రాచీన సాహిత్యాన్ని, సమకాలీన సమాజావసరాల నుండి పరిశీలించడమేగాక, నూతన విజ్ఞానాన్ని పాశ్చాత్య దేశాలనుండి భారతీయులు అందుకున్నారు. స్వేచ్ఛ, సమానావకాశాలు, ప్రాథమిక మానవ హక్కులు, స్వతంత్ర పోరాటాలు రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వాలు వారి దృష్టికి వచ్చి, ఆదిశగా వారు ప్రయాణించడం మొదలైంది. సంఘసంస్కరణ యుగం నుండి స్వాతంత్రోద్యమ రంగంలో భారతీయులు ప్రవేశించారు. నాటి భారతీయ సంస్కర్తలు, నాయకులు తూర్పు - పశ్చిమ సంస్కృతులను సమిశ్రితం చేసే ప్రయత్నాలను చేశారు.

## 10.8 సంగ్రహంగా

ఈ విధంగా మానవతా వాదం ఆధునిక లక్షణంగా ఈ యుగారంభాన పాశ్చాత్య సాంస్కృతిక పునరుజ్జీవనానికి లక్షణంగా ఆరంభమై, ప్రజల అభిరుచిని, కృషిని మతం నుండి ప్రపంచం వైపుకు మళ్లించింది. ప్రాచీన గ్రీక్ రోమన్ గ్రంథాల్లో ప్రభావతమైన ఐరోపావాసులు సమకాలీన సమాజ ఆవశ్యకతలకు అనుగుణంగా తమకు తాము తీర్చిదిద్దుకున్నారు. అదేవిధంగా భారతదేశంలో సైతం, పద్దెనిమిదవ శతాబ్దం నుండి సంఘ సంస్కర్తలు నూతన శకాన్ని మానవతా వాదంతో ఆవిష్కరించారు.

## 10.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.**

1. మానవతా వాదమంటే ఏమిటో తెలిపి, ఆ ఉద్యమం ఎలా అభివృద్ధి చెందిందో తెలియజేయండి.
2. పునరుజ్జీవన యుగంలో నూతన విజ్ఞానాభివృద్ధి, ఎలా జరిగిందో దాని లక్షణాలు ఏమిటో

BRAOU

వివరించండి.

3. మానవతా వాద ఉద్యమానికి దోహదపడిన వ్యక్తుల గురించి, వారి కృషిని గురించి తెలియజేయండి.

II **ఈ క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. ఎరాస్మస్
2. విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధి
3. సాంఘిక శాస్త్రాల అభివృద్ధి
4. నూతన విజ్ఞాన లక్షణాలు

## 10.10 ఉపయుక్త గ్రంథాలు


**Hayes – History of Europe**

**Encyclopaedia Britannica Vols, 8 & 11**

ఎమ్.ఎస్.ఆర్. ఆంజనేయులు : **ఆధునిక ఐరోపా చరిత్ర 1789 - 1878**

కోటిరెడ్డి : **ఆధునిక యుగారంభం తెలుగు అకాడమీ, హైదరాబాద్**

సి. దేవదానం : **ఆధునిక ఐరోపా చరిత్ర తెలుగు అకాడమీ, హైదరాబాద్.**



**– రచయిత్రి : ఆచార్య పి. రామలక్ష్మి**


BRAOU

# భాగం - 11 : ఉదార వాదం (Liberalism)

విషయ క్రమం


11.0 లక్ష్యాలు

11.1 పరిచయం

11.2 పద వివరణ

11.3 సహజ హక్కులు

11.4 ప్రాథమిక హక్కులు

11.5 ఉదార వాద ప్రముఖులు

- 11.5.1 జాన్ లాక్
- 11.5.2 మాంటెస్క్యూ
- 11.5.3 జాన్ జాక్విన్ రూసో
- 11.5.4 ఆడం స్మిత్
- 11.5.5 జాన్ స్టువర్ట్ మిల్

11.6 ప్రధాన రంగాలు

- 11.6.1 అమెరికా
- 11.6.2 బ్రిటన్
- 11.6.3 ఫ్రాన్స్
- 11.6.4 ఇటలీ
- 11.6.5 జర్మనీ

11.7 ఉదార వాద ప్రాబల్యానికై సాగిన విప్లవాలు

- 11.7.1 1830 విప్లవాలు
- 11.7.2 1848 విప్లవాలు

11.8 భారతదేశంపై ప్రభావం

11.9 సంగ్రహంగా

11.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

11.11 ఉపయుక్త గ్రంథాలు


## 11.0 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగల్గాలి.

- పద వివరణ
- ఏఏ స్థాయిల్లో వ్యాప్తి చెందిందో తెలుసుకోవడం
- ఏఏ దేశాలపై దీని ప్రభావం ఉందో తెలుసుకోవడం
- ఎవరెవరు ఈ భావ వ్యాప్తికి కృషి చేశారో తెలుసుకోవడం

B R A O U

## 11.1 పరిచయం

ఉదారత అనే పదాన్ని ఒక ఆలోచనా విధానానికి, ఒక తాత్విక సిద్ధాంతానికి, ఒక ఉద్యమ స్వరూపానికి ఉపయోగిస్తారు. ప్రధానంగా ఇది పశ్చిమ దేశాల మేధస్సు నుండి, ఆ దేశాల సామాజిక సంబంధాల మార్పుల నుండి ఉదయించింది. నిరంకుశ అధికారాన్ని వ్యతిరేకిస్తూ, స్వేచ్ఛాపూరితమైన జీవనం వ్యక్తికి, సంఘానికి అవసరమని ఈ సిద్ధాంతం తెలుపుతుంది. ఈ సిద్ధాంతం ప్రభుత్వం నుండి అతి తక్కువ జోక్యాన్ని మాత్రమే కోరుతుంది. స్వేచ్ఛ ప్రధాన లక్షణంగా గల ఉదార వాదం ఒక భావంగాను, ఒక సిద్ధాంతంగాను, గ్రీక్ మేధావుల కాలం నుండి పరిచయమైన పదమైనప్పటికీ, అంతర్జాతీయ తాత్విక సిద్ధాంతంగా 19వ శతాబ్దం నుండీ గుర్తింపు పొందింది. 19వ శతాబ్దపు నాటి స్పెయిన్ రాజకీయ పార్టీ పేరైన 'లిబరలెస్' (Liberales) అనే పదం నుండి 'లిబరలిజం' (Liberalism) అనే శబ్దం పుట్టినప్పటికీ, ఇది ఆంగ్ల భాషలోనే అధిక ప్రాచుర్యాన్ని పొందింది.

## 11.2 పద వివరణ

శతాబ్దాలతోపాటు ఉదార వాద అర్థం విస్తరిస్తూ వచ్చింది. దీన్ని మొదట లౌకికతత్వానికి బదులుగా వాడారు. ఐరోపాలో సంభవించిన పునరుజ్జీవనం, వైజ్ఞానిక పురోగతి, భౌగోళిక పరిశోధనలు, జీవన శైలి పెరుగుదల లౌకికతను పెంచాయి. ప్రకృతి రహస్యాలను కొన్ని శాస్త్ర సిద్ధాంతాల ద్వారా వివరించవచ్చని తెలయడంతో, మతప్రసక్తి లేని హేతుబద్ధమైన వివరణలు అధికమయ్యాయి. దీని వల్ల భగవంతుడు కూడా ప్రకృతిలో భాగమయ్యాడు. మతం విశ్వవ్యాపితమైన 'డీయిజం' (Deism) అయింది. 'ప్రకృతి దేవుని' ఆరాధించే మార్గాలు చాలా ఉన్నాయని గుర్తించడంతో, మత భావనల్లో సరళత వచ్చింది. మరణం తరువాత సంభవించే లోకాన్నుండి ఈ లోకంలో జరిగే సంఘటనలకు, గతం ఏర్పర్చిన సాంప్రదాయల నుండి ప్రజలు సాధించవలసిన అభివృద్ధి వైపు సంఘం దృష్టి మళ్ళింది. మతానికి చెందిన పాపం, విధి అనే భావనల నుండి వెలువడి, ఆత్మవిశ్వాసంతో పురోగతిని ఆకాంక్షిస్తూ ముందుకు సాగడం మొదలైంది. అందుచేత లౌకికత, పురోగతి ప్రవేశించడంతో, ఉదారతను తొలుతగా "విముక్తి" కి పర్యాయపదంగా వాడారు. మత, సాంప్రదాయ కట్టుబాట్ల నుండి మానవులకు విముక్తి అవసరమని ఉదార వాదులు భావించేవారు. తాను కనుగొన్న సత్యాన్ని స్వేచ్ఛగా ప్రకటించడానికై, మత ఛాందసాన్ని వ్యతిరేకించి, జీవితాన్ని సైతం త్యాగం చేయడానికి సిద్ధపడిన సోక్రటీస్ కాలాన్ని ఉదార వాద భావ ప్రారంభంగా భావించవచ్చు.

పదిహేడో శతాబ్దిలో ఐరోపాలోని డేకార్ట్ (Descarte), మిల్టన్ (Milton), స్పినోజా (Spinoza) లు ఉదార వాదాన్ని పెంపొందించారు. డేకార్ట్ హేతువుకు ప్రాధాన్యతనిచ్చాడు. స్పినోజా హేతుబద్ధమైన జీవితానికి, అప్పుడే విస్తరిస్తున్న ఉదార వాద విలువలకు అనుసంధానం చేశాడు. అజ్ఞానం నుండి విముక్తిని కలిగించే సత్యానికి, దూరం చేస్తున్న నిషేధాజ్ఞల (ఇంజిన్స్ ఆఫ్ సెన్సార్‌షిప్)పై మిల్టన్ ధ్వజమెత్తాడు.

పద్దెనిమిదవ శతాబ్దంలో ఐరోపా అంతా ఉదార వాదం ప్రజ్వరిల్లింది. వోల్టేర్, (Voltaire) జాన్ లాక్, (John Loke) గోథ్ (Goath) థామస్ జఫర్సన్, (Thomas Jofferson) ఆడం స్మిత్, (Adam Smith) వికో, (Vico) మాంటిస్క్యూ, (Montesque) బెంజిమిన్ ఫ్రాంక్లిన్‌లు (Benjamin Franklin) ఆ వాదాన్ని ప్రతిబింబించారు. భూ స్వామ్య విధానాలను, నియంతృత్వ రాజ్యాధికారాన్ని, విస్తృత మతాధికారాన్ని, ఉన్నత వర్గాలకుండే ప్రత్యేక రాయితీలను, ఉదార వాదులు ప్రశ్నించారు. వ్యక్తిగత స్వేచ్ఛకు, సహజ హక్కులకు, జనేచ్ఛకు ప్రభుత్వాన్ని మార్చ గల ప్రజాహక్కుకు వారు ప్రాధాన్యత నిచ్చారు. నూతన సంఘ నిర్మాణాన్ని గురించిన ఆలోచనలు వారికి ఉన్నప్పటికీ, దానికి కావలసిన ముడిపదార్థం ఇంకా రావలసి వుంది. ఆ ముడి పదార్థం బ్రిటన్ రక్తరహిత విప్లవం, అమెరికా విప్లవం, ఫ్రెంచ్ విప్లవాల ద్వారా లభ్యమైంది. ఈ విప్లవాలను ఆధారం చేసుకొని కొత్తగా ఉద్భవించిన మధ్యతరగతి,

BRAOU

వ్యాపార వర్గాలు తమ స్థానాలను, ప్రాముఖ్యతను సుస్థిరం చేసికొన్నారు. ప్రకృతికి ఒక సహజ గతి ఉంటుందని, దానిలో మానవులు కలుగజేసుకోకుండా ఉన్నట్లయితే, ఆ గమనం లోప రహితంగా ఉంటుందని ఉదార వాదులు విశ్వసిస్తారు. అప్పుడే పైకి వస్తున్న వ్యాపార వర్గాలకు ఈ అంశం నచ్చింది. వారు స్వేచ్ఛా విపణులను, ప్రభుత్వ అదుపులేని ఆర్థిక విధానాన్ని కోరుతున్నారు. అందుచేత వారు స్వేచ్ఛా విఫణి విధానాన్ని కోరుతూ, ఉదార వాదాన్ని బలపరిచారు. అధికారాన్ని చేజిక్కించుకునే యత్నంలో మధ్యతరగతివారు మేధావుల సహాయాన్ని పొందారు. మేధావులందరూ నిరంకుశ పోకడలను విమర్శించారు. వారు రాజకీయ స్వేచ్ఛకు ప్రాముఖ్యతనిచ్చారు. అందుచేత 18, 19వ శతాబ్దాల్లో ఉదార వాదానికి అర్థం ప్రజలు రాజకీయ హక్కులు కలిగి ఉండటం. ఈ భావం ప్రధానంగా నాటి ప్రపంచ విప్లవాల ఫలితంగా వచ్చింది తప్ప, ఏదో ఒక ఆర్థిక ప్రణాళికనుండి గాని, ఏదో ఒక వర్గం సాంఘిక అధికారాన్ని చేజిక్కించుకోవడం వల్లగాని కాదు.

19, 20వ శతాబ్దాల్లో ఉదార వాదానికి అర్థం ఉదార పెట్టుబడిదారీ విధానంగా (Liberal Capitalism) అన్వయించబడింది. ఎందుకంటే ఈ కాలంలో ఆర్థిక ప్రణాళికకు, విధానానికి ప్రాముఖ్యత ఏర్పడి, ప్రభుత్వ ప్రమేయం ఆయా అంశాల్లో అతి తక్కువగా ఉండాలని ఉదార వాదులు కోరేవారు, ఈ ఉదార పెట్టుబడిదారీ విధానం ఒకవంక సోషలిస్టులకు మధ్యస్థంగా ఉండేది.

20 శతాబ్దం ద్వితీయార్థంలో బ్రిటన్, ఇటలీ, జర్మనీ మొదలైన అనేక దేశాల్లో 'లిబరల్ పార్టీ' (Liberal Party) అనే పేరుతోగాని, దీనికి సామీప్యత గల ఇతర పేర్లతోగాని గల రాజకీయ పార్టీలు వెలిశాయి. వీరు కూడా ఉదార దృక్పథాన్నే తెలియజేసినా, అప్పటికి సోషలిస్టులు ప్రాబల్యంలోకి రావడంతో, ఉదార దృక్పథ ప్రాముఖ్యం తగ్గింది,

ఉదార వాద ప్రాముఖ్యం సుమారు 1750 నుండి అంటే ఫ్రెంచ్ తత్వవేత్తల కాలంనుండి 1914 వరకూ, మొదటి ప్రపంచ యుద్ధకాలం వరకు ప్రపంచ ప్రఖ్యాతిని పొందింది.

## 11.3 సహజ హక్కులు

18వ శతాబ్దంలోని ఉదార వాదులందరు ప్రకృతిని కీర్తించారు. మతానికి, చట్టానికి, రాజకీయాలకు విశ్వాస సిద్ధాంతాలకు, చిత్రలేఖనానికి అన్నింటికి ప్రకృతే మూలమని వారు భావించారు. పుష్కలమైన స్వేచ్ఛకు మూలం ఏదన్న ప్రశ్నకు ఉదార వాదులు ప్రకృతినే సమాధానంగా ఇస్తారు. మానవులకు ప్రకృతి జీవితాన్ని మాత్రమే గాక, పుష్కలమైన స్వేచ్ఛను ఇస్తుందని వారు నమ్ముతారు. జీవిత హక్కు, స్వేచ్ఛ హక్కు ఆనందమయ జీవితాన్ని గడిపే హక్కు ప్రజలకు స్వతః సిద్ధమైన హక్కులని, ఆ హక్కులను ప్రభుత్వాలు రక్షించాలని, అవసరమైతే ప్రభుత్వాలను ఎదిరించైనా, ఆ సహజ హక్కులను ప్రజలు రక్షించుకోవాలని ఉదార వాదులు కోరతారు.

మానవులందరూ ప్రాథమికంగా వివేచనాపరులని, మంచివారని ఉదార వాదులు నమ్ముతారు. వారి చుట్టూ ఉండే వ్యవస్థలే వారిని బానిసలుగా గాని, చెడుమార్గంలో వర్తించే వారిగా గాని చేస్తాయని వీరు నమ్ముతారు. నియంతృత్వ పోకడల్ని, చెడును ప్రోత్సహించే ఆచారాలను, సాంప్రదాయాలను సంస్థలను సాంఘిక అలవాట్లను వారు వ్యతిరేకిస్తారు. ఫ్రెంచ్ తత్వవేత్తలు, ఆంగ్లేయ ఉపయోగితా వాదులు ఇటలీలో దేశభక్తి ప్రబోధించిన మేధావులు సమకాలీన వ్యవస్థను విమర్శించారు. అనువంశిక రాజ్య పాలనను, భూస్వామ్య వ్యవస్థను, ఉన్నత వర్గాల ప్రయోజనాలను, చర్చి అధికారాన్ని వారు వ్యతిరేకించారు.

ఉదార వాదంలో ప్రాథమికంగా గల లౌకికత, అభివృద్ధి, ఆనందం అంశాలకు తరువాత కాలంలో స్వేచ్ఛాపూరితమైన ఆర్థిక విధానం. ప్రజాసార్వభౌమత్వం, విద్య అనే అంశాలు జతపరచబడ్డాయి. హేతుబద్ధమైన ఆలోచనకు దారితీసే విద్యకు ప్రాధాన్యత పెరిగింది. ఉదార వాదులు మానవుని మంచితనంలో నమ్మిక కలవారు

BRAOU

కనుక, అతడు పరిపూర్ణ పురుషుడుగా రూపొందాలంటే, విద్య అవసరమని గ్రహించాడు. వివేచనకు అవసరమైన సాధనాల్లో విద్య ప్రధానమైంది. అధికార దుర్వినియోగాన్ని అరికట్టడానికై అధికార వికేంద్రీకరణను ప్రతిపాదించారు.

ఈ విధంగా ఉదార వాదం మానవుని ప్రగతిని తెలుపుతోంది. స్వప్రయోజనాన్ని ఆధారంగా చేసుకొని, హేతువును సాధనంగా చేసుకొని పురోగతి, ఆనందంవైపుగా వ్యక్తి పయనిస్తాడని ఉదార వాదం తెలుపుతుంది.

## 11.4 ప్రాథమిక హక్కులు (Fundamental Rights)

ప్రకృతి నుండి పొందిన సహజ హక్కులకు రాజ్యాంగబద్ధమైన రక్షణ ఏర్పడినప్పుడు, వాటిని ప్రాథమిక హక్కులుగా పేర్కొంటారు. జీవిత హక్కు, స్వేచ్ఛా హక్కు, ఆనందంపొందే హక్కులను అమెరికా స్వాతంత్ర్య ప్రకటన పేర్కొంది. అమెరికా రాజ్యాంగం వానికి రక్షణలను కల్పించింది. అమెరికా నెలకొల్పిన సాంప్రదాయాన్ని అనుసరించి, ఇతర ప్రభుత్వాలు కూడా ఈ హక్కులకు రాజ్యాంగ భద్రతను కల్పించ సాగాయి.

## 11.5 ఉదార వాద ప్రముఖులు

బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలకు చెందిన కొందరు తత్త్వవేత్తలు ఉదార వాద స్వభావాన్ని తెలిపారు. వీరిలో జాన్ లాక్, మాంటెస్క్యూ, రూసో, ఆడం స్మిత్, జాన్ స్టువర్ట్ మిల్ ప్రముఖులు.

### 11.5.1 జాన్ లాక్ (1632-1704)

ఉదార వాదాన్ని సిద్ధాంత రూపంలో బ్రిటన్‌కు చెందిన జాన్ లాక్ అభివృద్ధి పరచాడు. రాజు దైవాంశ సంభూతుడనే నమ్మకను, వారసత్వ రాజరిక వ్యవస్థను ఇతడు ప్రశ్నించాడు. "పౌర ప్రభుత్వంపై రాసిన రెండు వ్యాసాలు"లో ఇతను వ్యక్తీకరించిన విశాల భావాలు ప్రపంచ ఖ్యాతిని ఆర్జించాయి. సమకాలీన రాజకీయ సంఘటనలను, ముఖ్యంగా రక్తరహిత విప్లవాన్ని, లాక్ విశ్లేషించి, తన సిద్ధాంతాన్ని నిర్ధారించుకున్నాడు. అమెరికా వలసలపై లాక్ తన ప్రభావాన్ని ప్రసరింపజేసి, అక్కడ స్వాతంత్ర్య పోరాటానికి కారకుడయ్యాడు. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనలోను, ఫ్రెంచ్ మానవహక్కుల ప్రకటనలోను, లాక్ ఉదార భావాలు ప్రకటితమయ్యాయి. బిషప్ వార్బర్టన్ (Bishap Varbarten) జాన్ లాక్‌ను వర్ణిస్తూ ఆ యుగానికి చెందిన గౌరవనీయుడుగాను, భవిష్యత్ నిర్ణేతగాను శ్లాఘించాడు. (Honour of his age and the instructor of future) లాక్ సిద్ధాంతంలో ఈ కింది లక్షణాలు కనిపిస్తాయి.

**మానవ స్వభావం (Human Nature)**

మానవులు స్వతహాగా మంచివారని, సంఘ జీవనాన్ని కోరతారని, హేతుబద్ధంగా ఆలోచిస్తారని లాక్ తెలుపుతాడు. అన్ని మానవ కార్యకలాపాలకు కోరిక మూలమని, సంతోషాన్ని కలిగించే చర్యలను మంచివని, దుఃఖాన్ని కలిగించే వానిని చెడు అని భావిస్తారని తెలుపుతాడు. అధిక సంఖ్యాకుల సంతోషానికే ప్రయత్నాలు జరుగుతాయని తెలుపుతూ, లాక్ మానవ చర్యలను హేతువు నిర్దేశిస్తుందని తెలియజేస్తాడు,

**ప్రాకృతిక వ్యవస్థ (State of Nature)**

లాక్ పేర్కొన్న ఈ స్థితిలో ప్రజలందరూ సమానులే. వీరు మంచితనంతోను, పరస్పర సహకారంతోను, శాంతియుతంగా జీవించేవారు. ప్రత్యేకాధికారాలు గల వర్గంగాని, ప్రభుత్వం గాని లేని ఆ దశలో, వారు న్యాయాధికారి సైతం లేకుండానే న్యాయబద్ధంగా జీవించేవారు. హాబ్స్ పేర్కొన్న ప్రాకృతిక వ్యవస్థ యుద్ధమయం కాగా, లాక్ వర్ణించిన వ్యవస్థ శాంతిమయంగా ఉండి, సహజ న్యాయంతో కూడినది. ప్రతీవారికీ ఆస్తి హక్కు ఉండడమే కాక, ప్రాకృతిక వ్యవస్థను ఉల్లంఘించిన వారిని శిక్షించే హక్కు కూడా ఉండేది.

BRAOU

**సహజ న్యాయం (Natural Justice)**

పైన పేర్కొన్న వ్యవస్థలో స్వేచ్ఛ ఉన్నప్పటికీ, ఇతరుల స్వేచ్ఛను నాశనం చేయడానికి ఎవరికి వీలులేదు. సహజ న్యాయమే వారిని సరైన రీతిలో నడుపుతుంది. అయినప్పటికీ, ఎవరైనా అటువంటి ప్రయత్నం చేస్తే అతడినిని శిక్షించే హక్కు అందరికి ఉంటుంది. అయితే, పక్షపాతం లేని తీర్పు ఇవ్వడానికి న్యాయస్థానం, ఆ తీర్పును అమలు చేయడానికి కార్యనిర్వాహక వర్గం, సరైన శాసనాలను చేయడానికి శాసనసభ అవసరం. ఈ మూడు అంగాలతో కూడిన పౌర ప్రభుత్వం ప్రాకృతిక వ్యవస్థలోని ఇబ్బందులను తొలగిస్తుంది. సహజ న్యాయాన్ని ఉల్లంఘించనంతవరకు ప్రజలు స్వేచ్ఛగా జీవించవచ్చు. ఇతరుల హక్కులను గౌరవిస్తూ, తమ స్వంత ఆస్థిని జాగ్రత్త చేసుకోవచ్చు.

**సహజ హక్కులు (Natural Rights)**

ప్రాకృతిక వ్యవస్థలో సహజ హక్కులున్నట్లే, నాగరిక సంఘంలో కూడా అవి ఉంటాయని లాక్ అభిప్రాయం. హాబ్స్ ఒడంబడికలో ఆత్మ సంరక్షణ హక్కు ఒక్కటే మానవులకు మిగలగా, లాక్ ఒడంబడికలో ఆత్మ సంరక్షణతోబాటు స్వేచ్ఛ హక్కు, ఆస్థి హక్కు కూడా ఉన్నాయి. లైఫ్, లిబర్టి ఎస్టేట్ హక్కులు పుట్టుకతో వచ్చాయని లాక్ తెలిపాడు.

**సామాజిక ఒడంబడిక (Social Contract)**

పౌర ప్రభుత్వ ఏర్పాటుకై ప్రతి మానవుడు తన సహజ హక్కులను కొన్నింటిని వదులుకొని, వాటిని సమాజానికి అప్పగించాలి. ఏ ఒక్క వ్యక్తికిగాని, సమూహానికిగాని వారు తమ హక్కులను ధారపోయక, మొత్తం సమాజానికి మాత్రమే అప్పగిస్తారు. ప్రజల శ్రేయస్సుకై ప్రభుత్వానికి కొన్ని రాజకీయ హక్కులు ఉంటాయి. సామాజిక ఒడంబడికకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా, ప్రభుత్వానికి పునాది శక్తి (force) గాక, ప్రజాంగీకారమని స్పష్టం చేస్తూ, దైవదత్తమైన వంశపారంపర్య హక్కుగల వ్యవస్థను వ్యతిరేకించాడు.

**ప్రభుత్వ ఒడంబడిక**

సామాజిక ఒడంబడికతోపాటు, లాక్ ప్రభుత్వ ఒడంబడికను కూడా పేర్కొన్నాడు. మొదటి ఒడంబడిక ప్రాకృతిక వ్యవస్థ నుండి విడిపడి, నాగరిక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం కోసం జరిగేది. రెండోది ప్రజలు పాలకునితో చేసుకొనే ఒడంబడిక. దీనిలో ప్రజలందరూ సమష్టిగా కొన్ని నిర్దుష్టమైన పనులు జరగడానికి సార్వభౌమునితో ఒప్పందం చేసుకొంటారు. ఈ పనులలో దేన్నయినా పాలకుడు బాధ్యతాయుతంగా చేయకపోయినట్లయితే, తిరుగుబాటు చేసి అతడిని తొలగించే అధికారం ప్రజలకు ఉంటుంది. నిర్ద్వంద్వంగా ఈ విషయాన్ని తెలిపిన లాక్ ముఖ్యంగా మూడు అంశాలను చాటాడు.

1. ప్రజల మంచికొరకే ప్రభుత్వం ఉంది.
2. ప్రభుత్వం ప్రజల అంగీకారంపై ఆధారపడి ఉంది.
3. ప్రభుత్వాధికారం పరిమితమైంది.

**రాజ్యం, సంఘం (State and Society)**

హాబ్స్ రాజ్యానికి, సంఘానికిగల తేడాను గుర్తించలేదు. కాని లాక్ ఈ రెంటికిగల తేడాను ప్రస్ఫుటంగా తెలిపాడు. రాజ్యంలో ప్రజా వ్యతిరేక మార్పు వచ్చినట్లయితే, మరిన్ని అధికారాలు గల సంఘం ఇంకో రాజ్యాన్ని

BRAOU

ఏర్పాటుచేసుకొంటుందని తెలిపాడు. చట్టాలు చేసే అధికారంగల శాసనసభ ఇతర శాఖలైన కార్యనిర్వాహక వర్గం, న్యాయాధికార వర్గాలకంటే కూడా ఉన్నతమైంది. సమాజం ఏర్పడటానికి ఒడంబడిక ఆధారమైనట్లే, ప్రభుత్వానికి ధర్మకర్తృత్వ విధులుంటాయని లాక్ భావించాడు. ప్రజల ప్రాణ, స్వేచ్ఛ, ఆస్తి హక్కులను కాపాడుతూ, ప్రజా శ్రేయస్సునుద్దేశించి, శాసనాలను చేయాలి. శాసనసభ కంటే ఎక్కువ అధికారాలు ప్రజలకు మాత్రమే ఉన్నాయని లాక్ విశ్వాసం.

**సమ్మతి : తిరుగుబాటు (Consent : Rebellion)**

ప్రజల అంగీకారం లేక సమ్మతి మాత్రమే ప్రభుత్వానికి పునాది అని విశ్వసించి, శాసనసభ సక్రమంగా ఉన్నంత కాలం ప్రజలు ప్రభుత్వానికి విధేయులుగా ఉండాలని లాక్ ప్రతిపాదించాడు. శాసనసభ తన హద్దులను అతిక్రమించినప్పుడు ప్రజలకు తిరుగుబాటు హక్కు ఉంటుందని కూడా అతడే తెలియజేసాడు. సమకాలీన రక్తరహిత విప్లవాన్ని లాక్ సమర్థించడమే గాక, ప్రజలకు ఉండే తిరుగుబాటు హక్కు సహజ హక్కని నిష్కర్షగా తెలిపాడు.

**ప్రాముఖ్యత**

జాన్ లాక్ సిద్ధాంతం వ్యక్తి స్వేచ్ఛా వాదాన్ని ప్రబోధిస్తుంది. సహజ హక్కులు ఒడంబడికల ఏర్పాటు, ప్రజా సమ్మతి ప్రభుత్వ మనుగడకు ఆధారమని భావించడం, అధికార దుర్వినియోగం జరిగినప్పుడు ప్రజలకు తిరుగుబాటు హక్కు ఉందని ప్రకటించడం ద్వారా, ప్రజల హక్కులకు జాన్‌లాక్ సిద్ధాంతం ఊపిరిపోసింది.

## మాంటెస్క్యూ (Montesque (1689-1755)

ఫ్రెంచ్ తత్వవేత్త అయిన మాంటెస్క్యూ తన అభిప్రాయాలను 'స్పిరిట్ ఆఫ్ లాస్' (Spirit of Laws) అనే గ్రంథం ద్వారా తెలిపాడు.

**శాసనం (Law)**

మాంటెస్క్యూ గ్రంథంలో శాసనానికి ప్రముఖ స్థానముంది. శాసనం అనేది సామాజిక యదార్థం నుండి వచ్చేది కనుక అది ఆ ప్రదేశంపైనా, సమకాలీన ఆర్థిక పరిస్థితిపైనా ఆధారపడి ఉంటుంది. అందుచేత అన్ని దేశాలకు, అన్ని కాలాలకు అన్వయించబడే శాసనాలు ఉండవు. శాసనాలన్నీ ఒకదానినొకటి అనుసరించి ఉంటాయి. కనుకనే ఈ సంబంధాల సముదాయాన్ని శాసనతత్వమని (Spirit of Laws) మాంటెస్క్యూ వ్యవహరించాడు.

మానవుడే శాసనాలకంటే పూర్వుడని, ప్రపంచమంతా శాసనాలవలనె కట్టుబాట్లలో ఉందని మాంటెస్క్యూ తెలియచేశాడు. ఇతడు మూడు విధాలైన శాసనాల గురించి పేర్కొన్నాడు. అవి 1. ప్రకృతి శాసనం 2. రాజకీయ శాసనం 3. అంతర్జాతీయ శాసనం. హేతువు మాత్రమే శాసనాలన్నింటికి పునాదిగా ఉండాలన్నది మాంటెస్క్యూ ప్రతిపాదించిన వాటిలో అతిముఖ్యమైన అంశం.

**ప్రజాస్వామ్యం (Democracy)**

రాజరికం, కులీనుల పాలన, ప్రజాస్వామ్య రాజ్యాలను గూర్చి మాంటెస్క్యూ చర్చించాడు. నిరంకుశ ప్రభుత్వాల్లో శాసనాలకు బదులు, మతాచార సంప్రదాయాలకు స్థానముంటుందని భావించాడు. ప్రజాస్వామ్యంలో ప్రజలందరూ సమానులమనే భావన బలంగా ఉంటుందని, ఈ సమానత్వాన్ని నిలిపి ఉంచేందుకు శాసనాలు అవసరమని అతడు భావించాడు.

BRAOU

బానిసత్వం (Slavery)

ఉష్ణ దేశాల ప్రజలకు నిరంకుశ పాలన, శీతల దేశాల ప్రజలకు గణతంత్ర పాలన సరిపడుతుందని భావించిన మాంటెస్క్యూ, బానిసత్వ వ్యవస్థ వాతావరణ పరిస్థితినిబట్టి ఏర్పడుతుందని తలచాడు. స్వేచ్ఛలేని మానవుడు ఎటువంటి అభివృద్ధి పొందలేడు కనుక మాంటెస్క్యూ దీనిని ఖండించాడు.

ఓటు హక్కు

ప్రజలందరూ ప్రభుత్వంలో భాగస్తులు కావాలని మాంటెస్క్యూ కోరాడు. శాసనాలను చూసే ప్రతినిధులను ఎన్నుకొనే అర్హత ప్రజలకుందని అతడు భావించాడు. విస్తృతమైన ఓటు హక్కు పురుషులందరికి ఉండాలని అతడు అభిలషించాడు. భౌగోళికంగా విభజించబడిన నియోజక వర్గాలకు ప్రాతినిధ్య ఎన్నికలు జరగాలని సూచించాడు. జాతి ప్రాతినిధ్యాన్ని తిరస్కరించడం ద్వారాను, భౌగోళిక నియోజక వర్గాలను సూచించడం ద్వారాను, విస్తృత బహిరంగ ఓటింగ్ విధానాన్ని కోరడం ద్వారాను ఆధునికతను చాటాడు.

అధికార పృథక్కరణ (Separation of Powers)

అధికారం దుర్వినియోగం జరగకుండా ఉండటానికి మాంటెస్క్యూ అధికార విభజనను ప్రతిపాదించాడు. శాసనాధికారం, కార్యనిర్వహణాధికారం, న్యాయ నిర్ణయాధికారం వేర్వేరు వ్యక్తులకు లేక వేర్వేరు శాఖలకు చెందాలని, అప్పుడే వ్యక్తి హక్కులకు రక్షణ ఉంటుందని అతను భావించాడు.

మాంటెస్క్యూ ప్రాకృతిక హక్కులను నమ్మకపోయినా, వ్యక్తులకు సర్వోన్నత హక్కులుండాలని భావించాడు. రాజకీయ హక్కులు వ్యక్తులకు కావాలని కోరడం ద్వారా, ఆధునిక వ్యక్తి శ్రేయో వాదాన్ని బలపర్చాడు.

## 11.5.3 జీన్ జాక్విస్ రూసో (Jean Jacques Rousseu) (1712-1778)

స్విట్జర్లాండ్‌లోని జెనీవాకు చెందిన రూసో ఫ్రాన్స్, ఇంగ్లాండ్ మొదలైన దేశాల్లో విస్తృతంగా పర్యటించి, పారిస్‌లో వ్యాసకర్తగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ వ్యాసాల్లో అతడు తన ఉదార భావాలను వెల్లడించాడు. ఇతని రచనల్లో 'సోషల్ కాంట్రాక్ట్' (Social Contract) అన్నింటికంటె ముఖ్యమైనది.

మానవ స్వభావం (Human Nature)

రూసో తన 'సోషల్ కంట్రాక్ట్' ను (Social Contract) ఒక ఉదాత్త వాక్యంతో ఆరంభించాడు. "మానవుడు పుట్టుకతో స్వేచ్ఛా జీవి అయినప్పటికీ, ప్రతిచోట సంకెళ్ళలోనే ఉన్నాడు'. (Man is born free but everywhere he is in shackles) అంటే అతని ఉద్దేశ్యంలో మానవుని సహజమైన మంచితనాన్ని, సమాజంలోని సాంప్రదాయాలు, సంస్థలు నాశనం చేస్తున్నాయని భావించాడు. నాగరిక ప్రభావంచే సహజ మంచితనాన్ని, మానవతను మర్చి, ఉత్తమ జీవితాన్ని కోల్పోతాడని అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. నాగరిక సంఘంలోని కృత్రిమత్వం వల్ల మానవుని సహజ నిరాడంబరత, హాని తలపెట్టని అమాయక జీవనంపోయి, అనేక కష్టాలకు దారితీస్తుంది.

ప్రాకృతిక వ్యవస్థ (State of Nature)

నిరాడంబరమైన సాధారణ జీవనాన్ని సాగించడం, దయ, మానవత్వాలను కలిగి ఉండటం, ఉదారత్వం - సంతృప్తులు అధికంగా ఉండటం ఈ ప్రాకృతిక వ్యవస్థ లక్షణాలు. అయితే, జనాభా పెరుగదల వలన, సంపద,

BRAOU

వనరులు పరిమితుల్లోనే ఉండటం వలన, స్వార్థం విజృంభించి, కుతంత్రాలకు దారితీసింది. పూర్వపు ప్రశాంతతను కోల్పోయి, ఇతర మానవులతో సంఘర్షణలు పెరిగాయి. నాగరికత స్వార్థాన్ని పెంచడంతో, కుట్ర కుతంత్రాలు అధికమై, మానవ జీవితంలో శాంతి రక్షణలు లోపించాయి. అందుచేత రూసో మానవులను నాగరిక వ్యవస్థను వీడి, తిరిగి ప్రాకృతిక వ్యవస్థకు వెళ్ళమని కోరాడు.

**సామాజిక ఒడంబడిక (Social Contract)**

రూసో భావనలో ప్రతి వ్యక్తి అందరితోను, అందరూ ప్రతి వ్యక్తితోను ఒడంబడిక చేసుకుంటారు. ఇలా అందరూ సామూహికంగా వ్యక్తి స్వేచ్ఛను తప్ప ఇతరమైన ఇచ్ఛలను సంఘపరం చేయగా, జనేచ్ఛ (General will) ఏర్పడుతుంది. సమాజపరమైన జనేచ్ఛకు ప్రతి ఒక్కరు తమ స్వేచ్ఛను లోబర్చాలని, దీని వలన అందరికీ సమాన హక్కులు ఉంటాయని రూసో తెలిపాడు. ఏదో ఒక నిరంకుశ ప్రభువుకు గాక, సంఘటిత వ్యవస్థ అయిన సమాజానికి తన హక్కులను ఇవ్వడం ద్వారా, మానవుడు సమాజంలోని సభ్యుడుగా తిరిగి రక్షణలాంటి కొన్ని ఉమ్మడి ప్రయోజనాలను పొందగలుగుతున్నాడు. దీనివలన వ్యక్తిగతంగా కోల్పోయిన కొంత స్వేచ్ఛను సామూహిక ప్రయోజనాల ద్వారా వ్యక్తి పొందగలుగుతాడు. ప్రాకృతిక వ్యవస్థ నాగరిక వ్యవస్థగా మారడాన్ని, సామాజిక ఒడంబడిక సూచిస్తుంది.

**జనేచ్ఛ (General will)**

రూసో సిద్ధాంతంలోని అతి ముఖ్యమైన అంశం జనేచ్ఛ. ఇది పరిమితమైన స్వార్థ పరిధులనుదాటి, అందరి శ్రేయస్సును కోరుతుంది. దీని న్యాయానికి అందరూ బద్ధులై ఉండాలి; లేనివారు శిక్షార్హులు. జనేచ్ఛకు సంపూర్ణ సార్వభౌమాధికారం ఉంటుందని, ఈ అధికారం అపరిమితం, అవిభాజ్యం, అనన్య సంక్రమం అని రూసో అభిప్రాయం. ఎల్లప్పుడు ప్రజాహితాన్ని కోరే జనేచ్ఛ సామూహిక మనోభావాన్ని ప్రతిబింబిస్తుంది.

**ప్రత్యక్ష ప్రజాస్వామ్యం (Direct Democracy)**

స్విట్జర్లాండ్ ప్రజాస్వామ్య వ్యవస్థచే ప్రభావితుడైన ఇతడు ప్రజలు చురుకుగా రాజకీయ కలాపాల్లో పాల్గొనాలని కోరాడు. ప్రాతినిధ్య ప్రభుత్వాలు ప్రజలను మందకొడిగా మారుస్తాయని, అందుచేత ప్రత్యక్ష జోక్యం ఉండాలని భావించాడు.

ప్రజా సార్వభౌమాధికారాన్ని, ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ప్రాధాన్యతను విశదీకరించడం ద్వారా రూసో భావాలు విశ్వవ్యాపితమైనవి. అమెరికా, ఫ్రెంచ్, విప్లవాలపై రూసో భావాల ప్రభావం అమితంగా ఉంది.

## 11.5.4 ఆడం స్మిత్ (1723-1790)

రాజకీయ, ఆర్థిక తత్వవేత్త అయిన ఆడం స్మిత్ తన 'వెల్త్ ఆఫ్ నేషన్స్' (Wealth of Nations) అనే పుస్తక రచన ద్వారా, ప్రపంచ ఖ్యాతిని గడించాడు. ప్రాకృతిక స్వేచ్ఛ (Natural liberty) వలననే సంపద పెరుగుతుందని ఇతడు భావించాడు. ఆర్థిక శాస్త్రానికి ఒక స్వతంత్ర రూపాన్ని ఇతడు కలిగించాడు. వర్తక వ్యవస్థను, గుత్తాధికార ప్రయోజనాలను, ప్రభుత్వ ఆంక్షలను ఇతడు వ్యతిరేకించాడు. ప్రకృతి న్యాయాన్ని అంగీకరించిన ఇతడు స్వేచ్ఛా విధానాన్ని అభిలషించాడు. స్వేచ్ఛా విధానంలో ప్రాకృతిక స్వేచ్ఛ ఉంటుందని ఇతడు నమ్మాడు. పరిమిత అధికారాలు గల శ్రేయో రాజ్యాన్ని (Welfare State) ఇతడు అభిలషించాడు. రక్షణ కల్పించడం, నిజమైన పౌర ప్రభుత్వంగా ఉండటం, ప్రజోపయోగ సంస్థలను స్థాపించడం, రాజ్య బాధ్యతలుగా స్మిత్ భావించాడు.

ఈ విధంగా పరిమిత అధికారాలను గలిగి ప్రజా శ్రేయస్సుకై పాటుపడే రాజ్యాన్ని, ఆంక్షలు లేని స్వేచ్ఛా విపణిని ప్రతిపాదించడం ద్వారా, స్మిత్ ఉదార భావాలను వ్యాప్తి చేశాడు.

BRAOU

## 11.5.5 జాన్ స్టువర్ట్ మిల్ (1806-1873)

ఉపయోగితా వాదుల్లో ప్రముఖుడైన జాన్ స్టువర్ట్ మిల్ ఉదార వాద వ్యాప్తికి కూడా కృషి చేశాడు. పదహారేళ్ళ వయస్సులోనే ఇతడు బెంథాం (Bentham) భావాలను చర్చించే నిమిత్తం ఉపయోగితా సంఘాన్ని స్థాపించాడు. 'ఎస్సే ఆన్ లిబర్టీ" (Essay on Liberty) ఇతనికి అంతర్జాతీయ ఖ్యాతి నార్జించింది. ఇతని ఇతర రచనల్లో ప్రముఖమైనవి. 'కన్సిడరేషన్ ఆఫ్ రిప్రజెంటేటివ్ గవర్నమెంట్' (Consideration of Representative Government), 'యుటిలిటేరియనిజం' (Utilitarionism), 'సబ్జక్షన్ ఆఫ్ ఉమన్' (Subjuction of Women) మొదలైనవి.

జాన్ స్టువర్ట్ మిల్ భావాల్లో ప్రధానమైనవి చూద్దాం.

**సంతోషం :** ఉపయోగితా వాదం ప్రజలు కోరే సంతోషాన్ని విశ్లేషించే ప్రయత్నం చేసింది. సంతోషం అనేది పరిమాణం (Quantity) లో మాత్రమే మారుతుందని బెంథాం భావించగా, గుణ భేదాల వల్ల (Quality) కూడా వేర్వేరుగా ఉంటుందని మిల్ తెలిపాడు. పరిమాణ విభేదాల కంటే గుణబేధమే ముఖ్యమైనదని మిల్ భావించాడు. సంతృప్తిని చెందే జంతు జన్మకంటే, అసంతృప్తితో కూడిన మానవ జన్మమేలని, సంతృప్తితో చరించే మూర్ఖుని కంటే అసంతృప్తి చెందిన సోక్రటీస్‌గా ఉండటం మేలని భావించాడు.

**వ్యక్తి శ్రేయో వాదం :** సమాజ అభివృద్ధికి వ్యక్తి శ్రేయస్సు ప్రధానమని మిల్ భావించాడు. వ్యక్తి వికాసానికి కృషి జరగడం ద్వారానే అతడిని సమాజ పురోగతిలో భాగస్వామిగా చేయవచ్చు. శాసనాల ద్వారా సమాజ మార్పును, వ్యక్తి ప్రవర్తనను మంచివైపు మరల్చడం ద్వారా, సంఘ మార్పును ఉపయోగితా వాదులు కోరతారు.

**ప్రభుత్వం :** ఆర్థిక రంగంలో ప్రభుత్వం పూర్తి జోక్యం చేసుకోవాలని మిల్ కోరాడు. సమాజ శ్రేయస్సును ఉన్నతంగా తీర్చిదిద్దటంతో పాటు, వ్యక్తిత్వ వాదాన్ని పరిరక్షించాలని మిల్ రాజనీతి ఉదార వాదాన్ని ఆర్థిక సామ్య వాదాన్ని కలిపి, శ్రేయో వాద రాజ్యాన్ని (Welfare State) ప్రతిపాదించాడు. విద్య నేర్పే విషయంలో మాత్రం ప్రభుత్వం ప్రత్యక్ష జోక్యం ఉండకూడదని, అవసరమైన ఆర్థిక సహాయం అందజేయాలని, అప్పుడే స్వతంత్ర భావాల అభివృద్ధి ఉంటుందని భావించాడు.

**స్వేచ్ఛ :** ప్రతి వ్యక్తికి సంపూర్ణ స్వేచ్ఛ ఉండాలని భావించిన మిల్, ఆనందమే లక్ష్యంగా మానవ జీవితం సాగుతుందని తెలిపాడు. అందరికి భావ స్వేచ్ఛ, స్వేచ్ఛా నడవడిక ఉండాలని కోరాడు. ఎవరైనా వీటిని ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ఉపయోగించేనట్లయితే, సమాజం కలగజేసుకొని, ఆ వ్యక్తిని నిరోధించవచ్చు. తన సంతోషాన్ని పెంచుకోవడం మాత్రమే గాక, సమాజ సంతోషానికి వ్యక్తి తోడ్పడతాడని కూడా మిల్ భావించాడు. బెంథాం వలె వ్యక్తిని ప్రత్యేకంగా చూడక, జాన్ స్టువర్ట్ మిల్ వ్యక్తిని సమాజంలోని సభ్యునిగా భావించాడు.

మిల్ అల్పసంఖ్యాకుల హక్కులను గుర్తించి, ఆ వర్గానికి అధిక సంఖ్యాకుల నుండి రక్షణ కావాలని కోరాడు.

---

## 11.6 ప్రధాన రంగాలు

---

ఉదార వాదం ప్రధానంగా 5 దేశాల్లో రాజకీయ సాంఘిక పోరాటాలను నిర్వహించింది. ఆ దేశాలు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీలు.

### 11.6.1 అమెరికా

ఐరోపాలోగల నిరంకుశ రాజరికం, శక్తివంతమైన భూస్వామ్య వర్గం, పటిష్టమైన సంప్రదాయాలు, అణచివేసే మత వర్గం అమెరికాలో లేకపోవడంతో, ఉదార వాదం ప్రబలడానికి ఆటంకాలు ఎదురు కాలేదు.

ఐరోపాలో ఉదార వాదం ప్రబలిన తొలి శతాబ్దాల్లోనే, వలసలు ఆరంభమవడం వలన అమెరికా స్వతంత్రమైన సంప్రదాయాలను, సంస్థలను ఏర్పర్చుకొని ఉదార ప్రభుత్వానికి, సంఘానికి ఉదాహరణగా నిలిచింది. ఉదార వాదం మధ్యతరగతి నుండి వచ్చిన ఉద్యమం. అమెరికా సంఘంలో చాలావరకు మధ్యతరగతి సంఘమే కనుక, ఉదార వాదం ఆదరణను పొందింది.

బ్రిటిష్ సామ్రాజ్యతత్వాన్ని ఎదిరించడం ద్వారా, ప్రాతినిధ్యంలేని పన్నుల విధానం నేరమని ప్రకటించడం ద్వారా, సహజ హక్కుల రక్షణకై యుద్ధం ప్రకటించడం ద్వారా, తమ స్వేచ్ఛా ప్రవృత్తిని స్వాతంత్ర్య ప్రకటన ద్వారా ప్రపంచానికి చాటడం ద్వారా, అమెరికా ఉదార వాదాన్ని బలపరిచింది. ఐరోపాలోని ఉదార వాద తాత్విక సిద్ధాంతానికి అమెరికా స్వాతంత్ర్య సంపాదన ఘనవిజయమైంది. అమెరికా విజయం తిరిగి ఐరోపాలోని ఉదార భావజాలాన్ని బలపర్చింది. స్వాతంత్ర్యం పొందిన అమెరికా లిఖిత రాజ్యాంగాన్ని ఏర్పరచుకొని, నూతన పరిపాలనా వ్యవస్థను ఆరంభించి, ప్రజాస్వామ్య రీతిలో అభివృద్ధి పథంలోకి అడుగిడింది.

## 11.6.2 బ్రిటన్

ఉదార వాదానికి జన్మ స్థలమైన బ్రిటన్‌లో క్రీ.శ. 1688 నాటి రక్తరహిత విప్లవం నుండి 20వ శతాబ్దం నాటి సంక్షేమ రాజ్య (Welfare State) దశ వరకు పరిణతి కనిపిస్తుంది. ఈ దేశంలో ఉదార వాదం అతి తక్కువ హింసతోను ఎటువంటి అంతరాయాలు లేకుండా విడివిడిగా జరిగిన సంఘటనలతోను పెంపొందింది. ఒక తరం సాధించిన విజయాలను మరొక తరం పటిష్టపరచుతూ, ఉదార వాదాన్ని ముందుకు నడిపింది.

ఫ్రాన్స్‌లో ధనిక వర్గం తన ప్రయోజనాలకై ప్రత్యక్ష యుద్ధాన్ని సలిపి, తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోగా, ఇంగ్లండ్‌లో మాత్రం ధనికవర్గం మేగ్నా కార్టా (Magna Carta) కాలం నుండి తన ప్రయోజనాలను అన్ని వర్గాలకు చెందిన మానవ హక్కులుగా రూపాంతరం చెందించింది. దీనివలన వారికి ప్రతిఘటన తీవ్రం కాలేదు. ప్రారంభం నుండి వీరికి నూతన వ్యాపార వర్గాలు, ఉద్యోగస్థులు, కార్మిక నాయకులు మద్దతునిచ్చారు. రాజరిక పటిష్టతకు ట్యూడర్, (Tuder)స్టువర్ట్ (Stuart)రాజులు కృషి చేసినా, పార్లమెంట్ హక్కుల పోరాటం ఉధృతమై, వారు రాజ్యాంగ బద్ధమైన పార్లమెంట్ ఆధిక్యతను అంగీకరించక తప్పలేదు. ఎప్పుడైతే వారు ఈ స్థితిని అంగీకరించారో, అప్పుడే వారు సంస్కరణ చట్టాలను, మత సహన చట్టాలను, ఫ్యాక్టరీ చట్టాలను, స్వేచ్ఛా విపణిని, విద్యా సంస్కరణలను అంగీకరించారు. అధికమైన సంస్కరణలను విగ్‌లు (Wigs) ప్రవేశపెట్టారు.

బ్రిటిష్ చరిత్రలో ఉదార వాదంలోని ప్రధాన స్థాయిలన్నీ కనిపిస్తాయి. అవి :

1. సహజ హక్కుల ప్రాధాన్యతతోపాటు, విప్లవాన్ని కూడా సహజ హక్కుగా భావించడం. ఇది బ్రిటన్‌లో కంటే, ఫ్రాన్స్‌లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

2. మధ్యతరగతి కోరిన రాజ్యాంగ బద్ధత, ప్రతినిధులతో కూడిన ప్రభుత్వ ఏర్పాటు, వ్యాపార వర్గాల ప్రాధాన్యత రెండో స్థాయిని తెలుపుతుంది.

3. ప్రభుత్వం జోక్యం ఏ మాత్రం లేని వర్తక వ్యాపార రంగాలను, స్వేచ్ఛా విపణిని, బలహీన రాజ్యాన్ని ఈ స్థాయిలో కోరారు.

4. కొంత కాలానికి ఉదార వాదమే బలమైన రాజ్యాన్ని కోరింది. ప్రజా శ్రేయస్సుకై కార్యక్రమాలను చేపట్టే నిమిత్తం, రాజ్యాన్ని బలోపేతం చేయవలసిన అవసరాన్ని గుర్తించారు. విద్యకు ప్రాధాన్యత పెరిగి, సామాన్యులకు సైతం అందుబాట్లోకి వచ్చింది. ఇదే సంక్షేమ రాజ్యం (Welfare State) గా మార్పు చెందింది.

### 11.6.3 ఫ్రాన్స్

మాంటెస్క్యూ, వోల్టేర్, రూసో, డిడిరో మొదలైన తత్వవేత్తల సిద్ధాంతాలచే ప్రభావితమై, ఫ్రాన్స్ ప్రపంచానికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నినాదాలను అందించింది. పాత ధోరణులను నిరసిస్తూ అందించిన ఈ నినాదాలే, నూతన వ్యవస్థకు పునాది వేశాయి. నిరంకుశ వారసత్వ రాజ్యాధికారానికి బదులు, రాజ్యాంగబద్ధమైన పరిమిత రాజరిక వ్యవస్థ వచ్చింది. ప్రాతినిధ్య ప్రభుత్వ విధానం, నూతన రాజ్యాంగ రచనలు, వయోజనులైన పురుషులందరికీ వోటింగ్ హక్కు, సామర్థ్య (Serfdom) ప్రాతిపదిక పై ఉద్యోగాలు, భూస్వామ్య వ్యవస్థ రద్దు, అర్థ బానిసత్వం నిర్మూలన, స్వేచ్ఛా వ్యాపార పద్ధతులు మొదలైన మార్పులు ప్రవేశించసాగాయి. విప్లవ కాలంలో ఉద్భవించిన పబ్లిక్ విద్యా విధానం స్థిరపడి, ఇతర దేశాలకు కూడా ఆదర్శమైంది.

"మానవ హక్కుల ప్రకటన" (Declaration of Human Rights) 1791లో వచ్చిన నూతన రాజ్యాంగానికి పీఠిక అయ్యింది. సహజ హక్కుల ప్రాధాన్యత అందులో ప్రస్తావించబడింది. ప్రజలే ప్రభుత్వం కంటే సార్వభౌమత్వం కలవారని, ప్రభుత్వ కర్తవ్యం ప్రజల సహజ హక్కుల రక్షణ అని, జనేచ్ఛ చట్టం ద్వారా వ్యక్తమౌతుందని, పన్నులు అందరూ చెల్లించాలని, ప్రభుత్వోద్యోగులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలని, ఆ ప్రకటన తెలుపుతుంది.

### 11.6.4 ఇటలీ

ఉదార వాదం ఈ దేశంలో విముక్తి పోరాటంతో మిళితమైంది. జాతీయ ఐక్యత ప్రాతిపదికగా సాగిన ఈ ఉద్యమానికి మాజినీ, (Majjini) కౌంట్ కావూర్, (Count Cavour) గారీబాల్డీ (Garibaldi) నాయకులు. మాజిని ఉద్దేశ్యంలో, సార్వత్రిక ఓటు హక్కు (Universal Sufferage) ఉచిత విద్య, పనిద్వారా రక్షణ, అనే మూడు ఉదార వాదానికి మూడు స్తంభాలు. ఇటలీ దేశంలో ఉదార వాదం ఎక్కువగా జనాదరణ పొందకపోవడానికి కారణం, దీని విస్తరణకు మేధావి వర్గం అక్కడ కృషి చేయకపోవడమే.

### 11.6.5 జర్మనీ

ఇక్కడ మధ్యతరగతి వర్గాలు, అధికారయుతమైన రాజ్యాన్ని బలపరిచాయి. సైన్యం, పెద్ద భూస్వాములు ఉదారవాదాన్ని వ్యతిరేకించారు. సోషలిస్టుల ప్రభావాన్ని బలహీనపరచడానికి బిస్మార్క్ (Bismark) సంక్షేమ చట్టాలను ప్రవేశపెట్టాడు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన వైమార్ రిపబ్లిక్ (Weimer Republic) రాజ్యాంగ బద్ధమైన ఉదార వాదాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నం చేసినప్పటికీ, సరైన నాయకత్వం లేకపోవడంతో, నాజీలు అధికారంలోకి వచ్చారు.

## 11.7 ఉదార వాద ప్రాబల్యానికై సాగిన విప్లవాలు

మెటర్నిక్ నాయకత్వాన ఐరోపాలో 1814 నుండి పునరుద్దరణ వాదం బలపడింది. రాజరికాలను పునరుద్ధరించడం, ఉదార భావ వ్యాప్తిని అరికట్టడం, మెటర్నిక్ విధానం. అందుచేత, ఐరోపాలో ప్రధానంగా 1830లోను 1848లోను విప్లవాలు చెలరేగాయి.

### 11.7.1 1830 నాటి విప్లవం

ఫ్రాన్స్‌లో పద్దెనిమిదవ లూయి (Louis the XVIII) తరువాత రాజ్యానికి వచ్చిన పదో ఛార్లెస్ (Charles X) (1824-1830) పాలనలో ప్రజలకూ, పత్రికలకు స్వేచ్ఛ తగ్గింది. విభేదాలు అధికమై, 1830లో పదో ఛార్లెస్

BRAOU

పార్లమెంట్‌ను రద్దుచేశాడు. ప్రజా హక్కులను కుదిస్తూ, నాలుగు చట్టాలను చేశాడు. ఆ రోజునే (జూలై 26, 1830) పారిస్‌లో విప్లవం చెలరేగి, ఫ్రాన్స్ తిరుగుబాటుదారుల వశమైంది. విప్లవానికి కృషి చేసిన రిపబ్లికన్లు, థియర్స్ (Theors) నాయకత్వంలో రాజ్యాంగబద్ధమైన రాజరికరాన్ని కోరి, లూయీ ఫిలిప్ (Louis Phillip) ను రాజుగా ఆహ్వానించడం జరిగింది.

ఫ్రాన్స్‌లో పొందిన విజయం బెల్జియంవారిని ఉత్తేజపరిచింది. వారి ఆకాంక్షలకు విరుద్ధంగా, ఐరోపా కూటమి వారిని హాలెండ్ దేశంతో కలిపింది. బెల్జియన్లు నవంబర్ 18, 1830న స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని, నూతన రాజ్యాంగాన్ని రచించుకొని, జర్మన్ దేశీయుడగు ఒకటో లియోపోల్డ్ (Leopold I) ను రాజుగా ఎన్నుకొన్నారు. ఐరోపా దేశాలన్నీ బెల్జియం స్వాతంత్ర్యాన్ని గుర్తించాయి.

జర్మనీలోని చిన్న రాజ్యాలైన బ్రన్స్‌విక్, (Brunswic) సాక్సనీ, (Saxany) హనోవర్ (Hannover)ల్లో ప్రజలు రాజునెదిరించి, రాజ్యాంగాలను పొందగలిగారు.

పోలెండ్‌లో రష్యా ప్రాబల్యాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన పోరాటం (1830) విజయవంతం కాలేదు.

పాత భావాలను, పాత సంస్థలను బలవంతంగా ఇతర దేశాలపై ప్రయోగించే విధానానికి ప్రతిఘటన ఆరంభమైంది. నిరంకుశత్వానికి, అభివృద్ధి నిరోధక చర్యలకు వ్యతిరేకత అధికమైంది.

### 11.7.2 1848 విప్లవాలు

ఐరోపాలోని మధ్యతరగతి వారు ఉదార వాద సంస్కరణలకై విప్లవాలను తిరిగి ఆరంభించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో అసంతృప్తిని ప్రకటించి, రాజకీయ సంస్కరణలను కోరారు.

సిసిలీలోని పాలెర్మోలో, జనవరి 12, 1848లో ప్రారంభమైన రాజ వ్యతిరేక బహిరంగ తిరుగుబాటు నెల లోపే ఇటలీలోని అన్ని నగరాలకు విస్తరించింది.

ఫ్రాన్స్‌లోని సనాతన పక్షానికి గిజో, (Gizo) ఉదార వర్గానికి థియర్స్ నాయకత్వం వహించారు. వోటింగ్ హక్కును విస్తరించమని కోరుతూ, ఫ్రాన్స్ అంతటా బహిరంగ విందులు, సమావేశాలు ఆరంభమయ్యాయి. పారిశ్రామిక విప్లవ ఫలితంగా పెరిగిన ఫ్యాక్టరీ కార్మికుల స్థితిగతులను మెరుగుచేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. పారిస్‌లో ఒక విందును ఫిబ్రవరి 22, 1848న ఏర్పాటు చేసినప్పుడు, ప్రభుత్వం దాన్ని నిషేధించింది. విందులో పాల్గొనవలసిన డిప్యూటీలు తమ స్వేచ్ఛా సమావేశ హక్కుకు భంగం కలిగించినందుకు నిరసన తెలిపారు. విద్యార్థులు, శ్రామికులు సమావేశమై, సంస్కరణల ఆవశ్యకతకై పోరాడాలని నిర్ణయించుకున్నారు. ఈ పోరాటాన్ని ఆపమని సైనికులను రాజు ఆజ్ఞాపించగా, వారు నిరాకరించారు. ఉద్యమ తీవ్రతను గమనించి లూయీ ఫిలిప్, గిజోలు పారిపోయారు. ఫ్రాన్స్‌లో ఒక తాత్కాలిక ప్రభుత్వం బాధ్యతలను స్వీకరించింది. ఆ మండలిలో సోషలిస్టు నాయకుడగు లూయీ బ్లాంక్ (Louis Blank) కూడా ఒకరు. వోటింగ్ పద్ధతిని విస్తృత పరచడం, జాతీయ కార్ఖానాలను స్థాపించడం మొదలైన సంస్కరణలను చేపట్టడం జరిగింది. మే నెల 1848లో నిరంకుశ రాజరిక స్థానంలో రెండో ఫ్రెంచ్ రిపబ్లిక్ ఏర్పడింది.

సమకాలీన ఐరోపా దేశాలన్నీ 1848 తిరుగుబాటు వలన ప్రభావితమయ్యాయి. డచ్ రాజ్యాంగం నిరంకుశత్వం నుండి పరిమిత రాజరికానికి వచ్చింది. స్విట్జర్లాండ్‌లో ఉదార వాదులు జయించారు. డెన్మార్క్‌లో రాజు అధికారాలు తగ్గాయి. ఫ్రాన్స్, ప్రష్యా, పీడ్మంట్, హాలెండ్, డెన్మార్క్, స్విట్జర్లాండ్‌లు నూతన రాజ్యాంగాలను పొందాయి. మధ్యతరగతివారు అధికారం ఎక్కువగా పొందారు. జాతీయతా భావం సర్వత్రా వ్యాపించింది.

BRAOU

కోపెన్ హాగెన్ (Copen Hagun) నుండి పాలెర్మో వరకు, పారిస్ నుండి బుడాపెస్ట్ వరకు 1848లో సాగిన విప్లవాలన్ని స్థానిక పరిస్థితులను వ్యతిరేకిస్తూ సాగినవే; సంస్కరణల దిశగా సాగినవే; విప్లవం తరువాత రెండేళ్ళవరకే నూతన మార్పులు కొనసాగాయి. దీనికి కారణం మార్పుకోరే వర్గం బహుస్వల్ప సంఖ్యలో ఉండటమే. మార్పు కోరే వారిలో ఎక్కువమంది మేధావులు. విద్యార్థులు, విశ్వవిద్యాలయాలు ప్రముఖ పాత్ర వహించాయి. ఈ విప్లవాలన్నీ స్వచ్ఛందంగా సాగిన యాదృచ్ఛిక సంఘటనలు.

ఈ విప్లవాల అతిపెద్ద విజయం ఏమిటంటే, పాత సంప్రదాయాల ముఖ్య మద్దతుదారుడైన మెటర్నిక్ మార్చి 13, 1848న రాజీనామా చేయడం. నూతన భావజాల వ్యాప్తిని, ఇకమీదట ఉదార సంస్కరణలకై వచ్చే విప్లవాలను ఆపజాలక మెటర్నిక్ ఓటమిని అంగీకరించి, లూయీ ఫిలిప్ వలె ప్రవాసానికి వెళ్ళాడు. అతని పతనం ఐరోపా చరిత్రలో అభివృద్ధి నిరోధక శక్తుల కూటమి ఓటమిగా గుర్తించబడింది. విప్లవాల్లో సామాన్య జన పాత్రను ఈ సంఘటనలు రుజువు చేశాయి. దీనితో జన యుగం ఆరంభమైంది.

## 11.8 భారతదేశంపై ప్రభావం

ఉదార వాదం భారతదేశంపై తన ప్రభావాన్ని ప్రసరించింది. ముఖ్యంగా భారతీయ సంఘసంస్కరణోద్యమాన్ని, స్వాతంత్రోద్యమాన్ని ప్రభావితం చేసింది. పాశ్చాత్య విద్య విస్తరించటం, పత్రికా రంగం జనరంజకం కావడం, చైతన్యవంతులైన ప్రజలు సంఘటితమై, సంస్థలుగా ఏర్పడి, ఆందోళన చేయడం ఈ రెండు ఉద్యమాల్లోని లక్షణాలు.

సాంఘిక సంస్కర్తలందరూ రాజా రామ్మోహన్ రాయ్ నుండి సాంఘిక దురాచారాలకు మత శాస్త్రాల అంగీకారంలేదని తీవ్రంగాను, నిరంతరంగాను తెలుపుతూ వచ్చారు. సతీ సహగమనాన్ని, బాల్య వివాహాలను నిషేధించటానికి వితంతు వివాహాలను ప్రోత్సహించటానికి స్త్రీ విద్యను పెంపొందించటానికి, కుల వ్యవస్థలోని కాఠిన్యాన్ని సడలించటానికి, సర్వసమానత్వాన్ని చాటడానికి నిరంతరం శ్రమించారు. స్త్రీ పరిస్థితిని మెరుగుచేయడానికి, అస్పృశ్యతను అధిగమించటానికి, కుల నిబంధనలను సడలించటానికి, తీవ్ర యత్నాలు జరిగాయి. ఇవన్ని ఉదార వాద దిశలో సాంఘిక సమానత్వం కోసం, పురోగతి వైపుగా సమాన అవకాశాల కోసం సాగిన ప్రయత్నాలు, మత అదుపు నుండి సమాజాన్ని విడదీసి, లౌకిక దిశగా తీసుకొని వెళ్ళే యత్నాలే.

జాతీయ స్వాతంత్ర్యోద్యమాన్ని ఉదార వాదం ప్రభావితం చేసింది. జాతి విచక్షణను జాతీయ నాయకులందరూ వ్యతిరేకించారు. వలస పాలనలోని దోపిడిని జాతీయ నాయకులు గుర్తించి, గ్రంథస్థం చేసారు. రాజకీయ సంఘాలుగా ఏర్పడి, ఎన్నికల ద్వారా భారతీయ ప్రాతినిధ్య పెంపును, సివిల్ ఉద్యోగాలను, భారతీయులకు మెరుగైన అవకాశాలను, పన్నుల తగ్గింపును, ఖర్చుల కుదింపును కోరారు.

తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఆటంకం కలిగినప్పుడు భారతీయులు స్పందిస్తునే వచ్చారు. పత్రికా స్వేచ్ఛపై అదుపును వ్యతిరేకిస్తూ, రామ్మోహన్ రాయ్ గవర్నర్ జనరల్‌కు అర్జీ అందజేసాడు. బెంగాల్ విభజన హిందూ ముస్లింలను విడదీయడానికి జరిగిందని, దాన్ని ప్రతిఘటించడానికి వందేమాతరం ఉద్యమాన్ని నాయకులు చేపట్టడం జరిగింది. పత్రికా స్వేచ్ఛ, సమావేశ హక్కు, వాక్స్వాతంత్ర్యం మున్నగువాని పరిరక్షణకు పదే పదే ఉద్యమాలు నిర్వహించారు. రౌలట్ చట్టాలకు వ్యతిరేకంగా సహాయ నిరాకరణోద్యమం సాగింది. డొమినియన్ ప్రతిపత్తిని ముందు కోరినప్పటికీ, సంపూర్ణ స్వరాజ్యమే భారతీయ నినాదమైంది. సురేంద్రనాథ్ బెనర్జీ, దాదాభాయ్ నౌరోజి, బాల గంగాధర్ తిలక్, మహాత్మా గాంధి, జవహర్‌లాల్ నెహ్రూ మొదలైన నాయకులు

BRAOU

ప్రజలను ఉత్తేజితులను చేసి, ఉద్యమాన్ని విస్తరింపజేసారు. భారతీయులు కోరిన జాతి విచక్షణ లేని సమానత్వం, రాజకీయ సాంఘిక స్వేచ్ఛ, రాజ్యాంగబద్ధమైన ప్రాతినిధ్య ప్రభుత్వం, వయోజన ఓటింగ్ హక్కు, స్వాతంత్ర్యం ఇవన్నీ అంతర్జాతీయ విలువల సముదాయంలోనివే. ఈ విధంగా ఉదార వాదం భారతదేశంలోని సంస్కరణలతో ఆరంభమై, హక్కుల పరిరక్షణ వరకు సాగింది.

## 11.9 సంగ్రహంగా

ఉదార వాదానికి ప్రపంచ చరిత్రలో ప్రముఖమైన స్థానముంది. వ్యక్తికి, సంఘానికి ఉండాల్సిన స్వేచ్ఛ, హక్కులను విశదీకరించే ఈ సిద్ధాంతం, ఐరోపా దేశాల్లోని ప్రజలను నిరంకుశ రాజరిక వ్యవస్థ నుండి, ప్రజా ప్రభుత్వ దిశగా నడిపించింది. ప్రభుత్వానికిగాక ప్రజలకే సార్వభౌమాధికారం ఉంటుందని, తిరుగుబాటు ద్వారా ప్రభుత్వాన్ని మార్చే హక్కువారికి ఉంటుందని నాటి తత్వవేత్తలు తెలిపారు.

## 11.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ఉదార వాదం అంటే ఏమిటో తెల్పి, దాని అర్థం ఎలా మారుతూ వచ్చిందో తెలియజేయండి.
2. ఉదార వాదాన్ని ప్రబోధించిన ప్రముఖులను, వారి సిద్ధాంతాలను తెలియజేయండి.
3. ఉదార వాదానికి ప్రధాన రంగాలైన దేశాలేవి? అక్కడ ఎటువంటి మార్పులు సంభవించాయి?

II. **క్రింది వాటిపై లఘువ్యాఖ్యలు రాయండి**

1. సహజ హక్కులు సిద్ధాంతం
2. జాన్ లాక్
3. జాన్ జాక్విస్ రూసో
4. అమెరికా స్వాతంత్ర్య సంగ్రామ ప్రాముఖ్యత
5. 1848 విప్లవాలు

## 11.11 ఉపయుక్త గ్రంథాలు


Ebenstein William — **Great Political Thinkers**

Hayes — **Europe Since 1870.**

Ketleby — **A History of Modern Times**

Wayper, C.L. — **Political Thought**

Coker W. Francis — **Recent Political thought**

Encyclopaedia Britannica **Vols. 13, 14, 19 & 20.**

ఎమ్. ఎస్. ఆర్ ఆంజనేయులు — **ఆధునిక ఐరోపా చరిత్ర 1780-1878, తెలుగు అకాడమి, హైదరాబాద్**


రచయిత్రి – ఆచార్య పి. రామలక్ష్మి

BRAOU

# భాగం - 12 : ప్రత్యక్ష జ్ఞాన వాదం (Positivism)

విషయ క్రమం


12. 0 లక్ష్యాలు

12.1 పరిచయం

12.2 అర్థం

12.3 పూర్వ రంగం

12.4 అగస్ట్ కాంట్

12.4.1 రచనలు

12.4.2 కాంట్ సిద్ధాంతం

12.4.3 కాంట్‌ను ప్రభావితం చేసిన వ్యక్తులు; భావాలు

12.4.4 కాంట్ సిద్ధాంత ప్రభావం

12.5 తార్కిక ప్రత్యక్ష జ్ఞాన వాదం

12.6 సంగ్రహంగా

12.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

12.8 ఉపయుక్త గ్రంథాలు


## 12.0 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

- ప్రత్యక్ష జ్ఞాన వాదానికి అర్థం
- సిద్ధాంత నిర్మాత అయిన అగస్ట్ కాంట్ (August Comte) జీవితం, సిద్ధాంతం.
- తార్కిక ప్రత్యక్ష వాదం.

## 12.1 పరిచయం

ప్రత్యక్ష జ్ఞాన వాదమనేది పందొమ్మిదో శతాబ్దపు సిద్ధాంతం. ఏవిషయాన్ని అయిన వెంటనే అంగీకరించక, అనుభవపూర్వకంగా తెలుసుకునే జ్ఞానాన్ని మాత్రమే ప్రత్యక్ష జ్ఞాన వాదులు అంగీకరిస్తారు. మత, అధి భౌతిక, సౌందర్య శాస్త్ర విషయాలు అనుభవయోగ్యం కాని విషయాలు కనుక, వానిని వీరు అంగీకరించరు. సూక్ష్మంగా చెప్పాలంటే ఫ్రెంచ్ తత్త్వవేత్త అయిన అగస్ట్ కాంట్ (1798-1857) వివరించిన సిద్ధాంతమే ప్రత్యక్ష జ్ఞాన వాదమని పిలువబడుతోంది. ఇది బ్రిటిష్ అనుభవాత్మక సిద్ధాంతానికి (Empiricism) అమెరికా వ్యావహారిక సిద్ధాంతానికి (Pragmatism) సన్నిహితంగా ఉంటుంది.

## 12.2 అర్థం

జ్ఞానానికి, ఆలోచనకు మూలం ఇంద్రియాల ద్వారా తెలుసుకునే అనుభవమే అని ఈ సిద్ధాంతం తెలుపుతుంది. శాస్త్రాల వరకే పరిమితమైన ప్రత్యక్ష జ్ఞాన వాదాన్ని ఈ సిద్ధాంతకారులు తర్కానికి, నీతి శాస్త్రానికి, మత శాస్త్రానికి అన్వయించారు. సామాజిక సంఘటనలను మత, అధి భౌతక వాదాల నుండి వేరుచేసి, వాటిని

BRAOU

శాస్త్రీయ పరిశీలనకు గురిచేయడమే ప్రత్యక్ష జ్ఞాన వాదం ప్రధాన లక్షణం. నిజాన్ని అంచనా వేయడానికి అనుభవపూర్వకమైన జ్ఞానం అవసరమని, అనుభవానికి అందని జ్ఞానం అర్థరహితమని వీరు భావిస్తారు.

## 12.3 పూర్వ రంగం

ప్రత్యక్ష జ్ఞాన వాదానికి వ్యవస్థ రూపం 1928లో 'వియన్నా సర్కిల్' (Viennna Circle) ద్వారా లభించింది. ఎర్నెస్ట్ మాఖ్ స్మారక చిహ్నంగా ఏర్పడిన 'ఎర్నెస్ట్ మాఖ్ సంఘం నివేదికల' ద్వారా, ఈవాదానికి ప్రచారం లభించింది. రుడోల్ఫ్, కార్నాప్, ఎఫ్. వైజామన్ మొదలగు దార్శనికులు, హెచ్. హన్, రాడ్‌కోవిక్, గీడెల్ మొదలగు గణిత శాస్త్రవేత్తలు, ఆట్టోన్యూరాత్, ఫెలిక్స్ కాప్ మొదలగు సాంఘిక శాస్త్రవేత్తలు ఈసిద్ధాంత ప్రచారానికి సహకరించారు.

హ్యూమ్, మాష్‌ల అనుభవ వాదం, యు.ఫెగే, రసెల్‌ల నవీన తార్కిక సిద్ధాంతాలు ప్రత్యక్ష జ్ఞాన వాదానికి మూల భావాలనందించాయి. డేకార్ట్ హేతు వాదం (Rationalism) లాకియన్ సంవేదనా వాదం (Sensationalism) బ్రిటిష్ అనుభవాత్మక సిద్ధాంతం ప్రత్యక్ష జ్ఞాన వాదాన్ని ప్రభావితం చేశాయి.

## 12.4 అగస్ట్ కాంట్ (1798 - 1857)

ప్రత్యక్ష జ్ఞాన వాదాన్ని సిద్ధాంత రూపాన తెలిపిన అగస్ట్ కాంట్ ఫ్రెంచ్ దేశస్థుడు. ఇతడు మాంట్ పెల్లియర్ అను ప్రదేశంలో జన్మించాడు. పారిస్‌లో గణిత శాస్త్ర అధ్యాపకుడుగా కొంతకాలం, ఇకోల్ పాలిటెక్నిక్‌లో కొంతకాలం పనిచేశాడు. తనని అభిమానించే ఫ్రెంచ్, ఆంగ్లేయ అనుయాయులపై కొంతకాలం ఆధారపడ్డాడు. తన భావాలను అభివృద్ధి చేసికోడానికి, వానిని అనుసంధానించుకోడానికి మానవ పురోభివృద్ధికి కృషిచేయడానికి కాంట్ తన సర్వశక్తులను వినియోగించాడు.

B R A O U

### 12.4.1 రచనలు

**కాంట్ రచనల్లో ప్రముఖమైనవి.**

1. 'ఎ ప్లాన్ ఫర్ ది సైంటిఫిక్ వర్క్స్ నెసిసరీ టు రీ ఆర్గనైజ్ సొసైటీ' (A Plan for the scientific works Necessary to reorganise society) దీనిలో సమకాలీన దృక్పథాలను వివరిస్తూ, ఆ తీర్మానాల్లోనూ, సాంఘిక ప్రణాళికలోనూ రావలసిన మార్పులను తెలియజేశాడు..

2. కాంట్ 1826లో 'కన్సిడరేషన్స్ ఆన్ ది స్పిరిట్యుయల్ పవర్' (Considerations on the spiritual power) అనే రచన చేశాడు. ఇందులో తెలిపిన అభిప్రాయాలనే, అతడు తరవాత కాలంలో మానవ మతం (Religion of humanity) లో విశదీకరించాడు.

3. 'కోర్స్ ఆఫ్ పాజిటివ్ ఫిలాసఫీ (Course of positive philosophy) ని ఆరు సంపుటాలుగా క్రీ.శ 1830 - 1842 మధ్యలో రచించాడు.

4. 'సిస్టం ఆఫ్ పాజిటివ్ పాలిటీ' (System of positive polity) ను 1851 - 1854 మధ్యలో నాలుగు సంపుటాలుగా ప్రచురిచాడు.

విశేష ప్రాచుర్యాన్ని పొందిన పై రచనలే గాక, కాంట్ 'డిస్కోర్స్ ఆన్ పాజిటివ్ స్పిరిట్' (Discourse on positive spirit) 'పాజిటవిస్ట్ కేలండర్, (Positivist calendar), 'పాజిటివిస్ట్ లైబ్రరి' (Positivist Library) 'అప్పీల్ టు కన్సర్వేటివ్స్' (Appeal to conservatives), 'సబ్జక్టివ్ సింథసిస్' (Subjective Synthesis) 'సిస్టం ఆఫ్ పాజిటివ్ లాజిక్' (system of positive logic) రచించాడు.

## 12.4.2 కాంట్ సిద్ధాంతం

కాంట్ తెలియజేసిన అంశాలు

1. ప్రత్యక్ష విషయాలపై జ్ఞానం ఆధారపడి ఉండాలని కాంట్ సిద్ధాంతం తెలియజేస్తుంది. ప్రకృతి రహస్యాలను అన్వేషించే కంటే, ప్రకృతిని స్వాధీనం చేసికొనే మార్గం ఆలోచించడం ప్రధానమని తెలుపుతుంది. అందుచేత ప్రత్యక్ష జ్ఞాన వాదాన్ని కఠినంగా వర్తింప జేయడం ఈయన సిద్ధాంతంలో ముఖ్యం.

2. కాంట్ సిద్ధాంతంలో 'త్రిదశా విధానం', ఒక ప్రముఖ విషయం, మానవ ఆలోచన, జ్ఞానం మూడు ముఖ్యమైన దశల్లో ప్రయాణిస్తాయని ఈవాదం తెలుపుతుంది. అవి మత, అధి భౌతిక, శాస్త్రీయ స్థాయిలు, ప్రాథమికమగు మత స్థాయిలో ఆలోచనలన్నిటినీ, మతమే ప్రభావితం చేస్తుంది. ఇందులో తిరిగి మంత్ర తంత్రాలు (fetishism) బహుదేవతారాధన అను అంతర్గత స్థాయిలను దాటి, చివరకు ఏకశ్వరోపాసనకు చేరతారని కాంట్ తెలుపుతాడు. ప్రపంచ నడత సాగడానికి శక్తి, ఇచ్ఛ (will) గల అనేక శక్తులుంటాయిని మానవుడు భావిస్తాడు. అదిభౌతిక స్థితిలో ప్రపంచ నడక అనేక ఊహాజనిత శక్తుల ద్వారా సాగుతుందని భావిస్తారు. మూడో స్థాయి అయిన ప్రత్యక్ష జ్ఞాన వాదంలో మానవుని మేధా శక్తి పరిపూర్ణత చెందడం వల్ల, శాస్త్రీయమైన సిద్ధాంతీకరణల ద్వారా ప్రపంచ గతిని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాడు. పరస్పర సంబంధం గల అంశాలను కనుగొనడం ద్వారా, వాటిని సూత్రీకరించుట ద్వారాను ప్రకృతి రహస్యాలను ఛేదించడం మాత్రమే గాక, సామాజిక జీవనాన్ని సైతం శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకోవచ్చు. అది భౌతిక శాస్త్రాన్ని సామాజిక పరిధినుండి తొలగించి, సామాజిక శాస్త్రాన్ని ఒక పూర్తి స్థాయి శాస్త్రంగా కాంట్ మార్చాడు.

3. శాస్త్రాల వర్గీకరణ కాంట్ సిద్ధాంతంలో మరొక ఘట్టం. సామాన్యీకరణాలను తగ్గించే శాస్త్రాల వరుసక్రమాన్ని అతడు ఈవిధంగా పేర్కొన్నాడు. గణిత శాస్త్రం, ఖగోళ శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం జీవ శాస్త్రం సామాజిక శాస్త్రం. ఇవన్నీ తమముందు వరసలోగల శాస్త్రంపై ఆధారపడుతూ ఉంటాయి. సామాజిక శాస్త్రం ఈ క్రమాన్ని పూరించి, సామాజిక వాస్తవాలను సిద్ధాంతీకరించి, మానవ జ్ఞానాన్నంతా సమన్వయిస్తుంది. ఈవిధంగా చేయడం ద్వారా, సామాజిక శాస్త్రం సమాజ పునర్నిర్మాణానికి తోడ్పడుతుంది. సామాజిక శాస్త్రానికి ముందుగల ఐదు శాస్త్రాల్లోని సాంఘికతత్త్వాన్ని కాంట్ విశదీకరించాడు. కాని ఈ కృషి ఎక్కువ మెప్పును పొందలేదు.

4. సామాజిక శాస్త్రాన్ని కాంట్ అభివృద్ధి చేసి, ఒక ప్రత్యేక శాస్త్ర స్థాయిని కల్పించాడు. సమాజాన్ని శాస్త్రీయ సిద్ధాంతాలపై పునర్నిర్మించాలని కోరే కాంట్ సామాజిక శాస్త్రాన్ని రెండుగా విభజించాడు. అవి : సంఘాన్ని కలిపి ఉంచే శక్తులుగల భాగం స్థితి శాస్త్రం (Statics), సామాజిక మార్పుకు, కారణాలను వెదికే భాగం గతి శాస్త్రం (Dynamics), వ్యక్తిగత అహంకారం సంఘంలోని ఐక్యతకు భంగం కలిగించగలదని, దీన్ని అదుపు చేయడానికి ప్రాథమిక వ్యవస్థ అయిన కుటుంబాన్ని పటిష్ఠపర్చాలని భావించాడు. కుటుంబ పటిష్ఠతకు సమాజానికి సంబంధించిన శాస్త్రీయ అవగాహన అవసరమని భావించాడు. మానవ పరిణామ దశలో ప్రత్యక్ష జ్ఞాన వాద దశకు చేరినప్పుడే, అటువంటి శాస్త్రీయ జ్ఞానం కలుగుతుంది. ఇటువంటి దశలో ఆధ్యాత్మిక. మేధా శక్తి గల తత్త్వవేత్తల కూటమి సంఘాన్ని

BRAOU

నడిపిస్తూ, దానికి కావలసిన జ్ఞానాన్ని నీతిగల్గిన క్రమశిక్షణను, ఐక్యతను ఇస్తుంది. ఇతర ఆర్థిక రాజకీయ అంశాలను ధనిక వర్గాలు నిర్వర్తిస్తాయి.

5. కాంట్ నూతన సామాజిక ప్రణాళికను తయారుచేశాడు. మత ప్రసక్తిలేని సామాజిక శాస్త్రవేత్తలు నూతన ప్రణాళిక ద్వారా సలహాలను ఇస్తూ, తగవులను తీరుస్తూ, సమాజాన్ని మంచిదారిలో నడుపుతారు. పారిశ్రామిక వేత్తలు, వ్యాపారవేత్తలకు పాలనాధికారాన్ని అప్పగించాలని కాంట్ కోరాడు. సాంఘిక అదుపును ఏర్పర్చడం, రాజకీయ, సాంఘిక , ఆర్థిక న్యాయాన్ని సుస్థిరం చేయడం, బాహ్య ప్రపంచంలో నీతిని కాపాడడం వీరి వంతు. అంతరంగ నీతిని కాపాడడం స్త్రీల బాధ్యతని ఇతని ఉద్దేశ్యం. పవిత్రమైన వివాహ పద్ధతిని, దంపతి వ్యవస్థను ఇతడు సమర్థించాడు. బాహ్య ప్రపంచం నుండి, రాజకీయ జీవితాన్నుండి స్త్రీలను ఇతడు వేరుచేశాడు. స్త్రీలకై ప్రత్యేక విద్యావకాశాలను కోరినప్పటికీ, వారిని బాహ్య ప్రపంచానికి దూరం చేశాడు. నూతన సంఘ జీవనంలో విశ్వ విద్యకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా, ప్రత్యక్ష జ్ఞాన వాదాన్ని బలపర్చాడు.

6. సంఘంలో వచ్చే ఎటువంటి శాశ్వత మార్పుకైనా పూర్వం నీతి నియమావళిలో పురోగతి ఉంటుందనేది కాంట్ భావం. కాథలిక్ దేవుని స్థానంలో మానవత్వాన్ని ఇతడు ప్రతిష్టించాడు. ఈ మానవత్వం కూడ గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును కలిగినది. దీన్ని 'మానవత్వ మతం (religion of humanity) గా అతడు భావించాడు. మత పద్ధతి వలెనే, దీనిలో గూడా అతడు మత వర్గాన్ని (Priesthood) నమ్మికలను, ఆచారాలను, మహాత్ములను (Saints) ఏర్పర్చాడు. అయితే ఇవన్నీ ప్రత్యక్ష జ్ఞాన వాదం దృక్పథం నుండి ఏర్పర్చినవే.

7. సామాజిక శాస్త్రానికి కాంట్ విశేష సేవలను అందించాడు. ఆ శాస్త్రానికి పేరుపెట్టడం, పరిధిని విస్తృతపర్చటం చేశాడు. సంఘాన్ని ఒక "సమిష్ఠి జీవి" (collective organism) గా భావించాడు. నిర్వర్తించవలసిన విధులను నిపుణతగల్గిన వారితో చేయించుటవల్లనే సాంఘిక పురోగతి జరుగుతుందని భావించాడు. వ్యక్తి ఆలోచనలు, చర్యలు ఏవిధంగా సాంఘిక వ్యవస్థలచే నిర్ణయించబడతాయో స్పష్టం చేయడం ద్వారా, సాంఘిక కారణతత్త్వ సిద్ధాంతాన్ని ఏర్పర్చాడు. సామాజిక శాస్త్రాన్ని సాంఘిక వ్యవస్థ అని, సాంఘిక పురోగతి అనే రెండుగా విభజించాడు. మొదటిదానిలో, శ్రమను సాంఘికంగా పంచుకోవడం జరగుతుంది. రెండో దాన్ని ప్రభుత్వం సాధించగలగాలి. దీనిలో కూడా మూడు స్థాయిలు ఉంటాయి. అవి సైనిక మతపరమైన స్థితి, విమర్శనాత్మక అధిభౌతిక స్థితి, పారిశ్రామిక - శాస్త్రీయ స్థితి. ఈవిధంగా సాంఘిక మార్పుని, మేధోపరమైన స్థితులను సమన్వయం చేయగలిగాడు. భౌతిక పురోగతి కూడా మూడు స్థాయిల్లోనే విస్తరిస్తుందని తెలుపుతూ, ఆమూడు దశల్లో వరుస క్రమానగల యుద్ధ, రక్షణ, పరిశ్రమ రంగాలపై దృష్టి కేంద్రీకృతమౌతుందని తెలిపాడు. నీతి, పురోగతి అనే అంశాల్లో కూడ వ్యక్తి తన సాంఘిక సంతృప్తిని కుటుంబం (Family) రాజ్యం (State) తెగ (race) అందు పొందుతాడని తెలిపాడు. సాంఘిక ప్రణాళికా రచనలో, సామాజిక శాస్త్ర ప్రాముఖ్యాన్ని ఇతడు చాటాడు.

### 12.4.3 కాంట్‌ను ప్రభావితం చేసిన వ్యక్తులు, భావాలు

పద్దెనిమిది, పందొమ్మిదవ శతాబ్దపు తత్త్వవేత్తలు కాంట్‌ను ప్రభావితం చేశారు. డేవిడ్ హ్యూమ్, ఇమ్మాన్యువల్ కాంట్, ఎఫ్. జె. గాల్‌ల నుండి ప్రత్యక్ష జ్ఞాన వాద భావాలను మనోవిజ్ఞాన వాద భావాలను, మనోవిజ్ఞాన శాస్త్ర భావాలను పొందాడు. సాంఘిక నిర్మాణానికి అన్వయించిన వ్యవస్థ మత వ్యవస్థలోని

B R A O U

వరుసక్రమాన్ని పోలి ఉండడానికి కారణం కాథలిక్ రచయితలైన, డోనాల్డ్ మొదలగువారి రచనా ప్రభావమే ఫ్రెంచ్ విప్లవ సమయంలో క్రైస్తవ మతాన్ని కాదని, హేతువునే దేవతగా ఆరాధించడం గమనించిన కాంట్ లౌకిక వ్యవస్థను ఏర్పర్చాడు. హ్యూమ్, కాంట్, టర్గోల నుండి కాంట్ 'చారిత్రక నియతి (historical determinism) సిద్ధాంతాన్ని స్వీకరించాడు. మానవ మేధో పురోగతియందు గల మూడు స్థితుల గూర్చిన మత, అధి భౌతిక శాస్త్రీయ విషయం టర్గో, బర్డిన్, సెయింట్ సైమన్‌ల నుండి స్వీకరించాడు. మెంటెస్క్యూ, సెయింట్ నుండి ప్రస్తుత సమాజాన్ని వివరించేదీ, మంచి భవిష్యత్తుకై ప్రణాళికను సూచించగలిగే శాస్త్రీయమైన సమాజ శాస్త్ర ఆవశ్యకతను గ్రహించాడు. అటువంటి శాస్త్రానికి కాంట్ సామాజిక శాస్త్రమని పేరుపెట్టాడు. సమాజం శాస్త్రీయమైన గతిలో సాగుతుందనే భావాన్ని సెయింట్ సైమన్‌నుండి స్వీకరించాడు. పద్దెనిమిదవ శతాబ్దపు తత్త్వవేత్తల నుండి చారిత్రక పురోగతి భావాన్ని, మతాధికారుల నుండి వరుసక్రమంలో గల విధేయులైన సంఘ వర్గాలను స్వీకరించాడు.

### 12.4.4 కాంట్ సిద్ధాంత ప్రభావం

అగస్ట్ కాంట్ సిద్ధాంతం వివిధ దేశాల్లోని శాస్త్రజ్ఞులపై విశేషమైన ప్రభావాన్ని చూపింది. ఫ్రాన్స్‌లోని హెచ్. ఎ. టెయిన్, ఎర్నెస్ట్ రీనన్, మార్సలిన్ బెర్త్‌లో, ఇంగ్లాండ్‌లోని సర్ ఎడ్వర్డ్ బర్నెట్ టైలర్, హెర్బర్ట్ స్పెన్సర్, జె.ఎస్.మిల్, జర్మనీలోని థియోడార్ గోంపెర్జ్ మొదలగు ప్రముఖులు ప్రత్యక్ష జ్ఞాన వాదంచే ప్రభావితులైనవారే. ఎమిలి దుర్కీహామ్ వంటి సామాజిక శాస్త్రవేత్తలందరూ ఆగస్ట్ కాంట్ కృషిని గుర్తించి. అంగీకరించినవారే. మానవ భావాలపైనా, చర్యలపైనా, సాంఘికమైన అదుపు (Social conditioning) ఉంటుందని తెలిపిన సిద్ధాంతం సాంఘిక చరిత్ర రచనకు మూలమైంది. రాజనీతి శాస్త్రాన్ని సాంఘికమైన వివరణతో తెలుపడం కాంట్ ప్రభావమే. దీనిని హబ్‌హౌస్, రాబర్ట్ మైఖేల్స్, గ్రహంవాలాస్ అభివృద్ధి చేశారు. వ్యవస్థాగత ఆర్థిక శాస్త్రం (Institutional economics) వృద్ధిపొందింది.

కాంట్ ప్రభావం ప్రధానంగా ఇంగ్లాండ్‌లో సాగిన సాంఘిక సంస్కరణోద్యమాలపై ఉంది. అతడు వివరించిన 'మానవతా మతం' (Religion of humanity) మానవతావాద వ్యాప్తికి దారితీసింది. ఆదర్శపూరితమైన ప్రభుత్వం అంటే, 'మేధోపరమైన శిష్ట వర్గం' (intellectually elite) అధికారయుతం కావాలనే అతడి ఆదర్శానికి సర్వత్రా ఆనాడు గౌరవం లభించింది. విద్య అందరికీ లభ్యమవాలనే అతడి ఆకాంక్ష విద్యా సంస్కర్తలకు ఊతమిచ్చింది.

## 12.5 తార్కిక ప్రత్యక్ష జ్ఞాన వాదం

పందొమ్మిదవ శతాబ్దం మూడో దశాబ్దంలో తార్కిక ప్రత్యక్ష జ్ఞాన వాదం ఐరోపా, అమెరికా ఖండాల్లో ఆదరణను పొందింది. అధి భౌతిక శాస్త్ర విషయాలను విశ్లేషించి, అవి అర్థరహితాలని తేల్చింది. విశ్లేషణే ఆధారంగా, నీతి శాస్త్రాన్ని, సౌందర్య శాస్త్రాన్ని కూడా తార్కిక ప్రత్యక్ష జ్ఞాన వాదం నిరసించింది. దర్శనాల్లో పేర్కొనిన సమస్యలు నిజమైనవికావని వీరి భావం. స్వీయ అనుభవానికి తార్కిక విశ్లేషణను వీరు చేరుస్తారు. తర్కమన్నా, విజ్ఞాన శాస్త్రమన్నా అమిత అభిమానాన్ని చూపే వీరు ఈ రెంటిని ఆత్మాశ్రయానుభవానికి చేర్చి, ఈమూడింటికి ప్రాముఖ్యతనిచ్చారు.

**తార్కిక ప్రత్యక్ష జ్ఞాన వాదం లక్షణాలు**

(1) అనుభవాతీతమైన విషయాలను ప్రస్తావించే అధి భౌతిక శాస్త్రాన్ని తిరస్కరిస్తుంది. అధి భౌతిక వాదులు అంధ విశ్వాసంతో అనుభవాతీతమైన ప్రపంచాన్ని నిర్మించుకొని, అర్థరహితమైన వాక్యాలను నిర్మించుకొని, వాటి సత్యాసత్యాలను గురించి వాదోపవాదాలు మొదలు పెడతారని భావిస్తుంది. అందుకనే ప్రపంచాన్ని

యదార్థమని భావించే యదార్థ వాదం, ప్రపంచాన్ని భావంలో దర్శించే భావ వాదం. ప్రపంచాన్ని ఆలోచనలకే పరిమితం చేసే ఆత్మ పరిమితి వాదం వివాదస్పద శాఖలుగా బయలుదేరాయి. నీతి శాస్త్రంలోని వాక్యాలు, సౌందర్య శాస్త్రంలోని వాక్యాలు, వర్ణనలు, అవి మనోభావాలను అందజేసేవి తప్ప, వాటి సత్యాసత్యాలను, యదార్థమిథ్యలను నిర్ణయించలేమని ఈవాదం తెలియజేస్తుంది. మత శాస్త్రం (theology) లో కనిపించే దేవునికి సంబంధించిన అధి భౌతిక వాక్యాలు ఉత్తేజపూరితమైనవి కావచ్చుగాని, జ్ఞానాన్ని అందించవని వీరు అంటారు. అలాగే కవిత్వం ద్వారా అందించే భావాలు కూడా జ్ఞానం గాక, ఉత్తేజం మాత్రమేనని వీరు పేర్కొంటారు. తార్కిక ప్రత్యక్ష వాదుల దృష్టిలో దర్శనాల కర్తవ్యం తార్కిక విశ్లేషణ ద్వారా స్వభావాలను నిర్ణయించడం. దీని వల్ల అధి భౌతిక శాస్త్రాల్లో శబ్దాడంబరం తొలగి, స్పష్టత ఏర్పడింది.

(2) ప్రాచీన దార్శనికులు మనస్సుకు ప్రాధాన్యత నివ్వడం ద్వారా, అనుభవంతో సంబంధంలేని ప్రాగనుభవ భావాలను గుర్తించారు. కాని తార్కిక ప్రత్యక్ష జ్ఞాన వాదులు దీనినంగీకరించక, అనుభవమే ప్రయాణమంటారు. అనుభవాలను వ్యక్తం చేసే సంకేతాలు వాక్యాలు కనుక, అవి నిరూపణకు నిలవాలని వీరు భావిస్తారు. అర్థవంతంగా ఉండాలి అంటే, ఈ పరీక్షకు నిలవాలి. తార్కిక యధార్థతలేని వాక్యాలను, అనుభవిక యదార్థ వాక్యాలను, అవిలేని వాక్యాలను, ఉద్వేగ వాక్యాలను వారు అంగీకరిస్తారు. భాషాపరమైన అస్పష్టత ఉన్న సాంప్రదాయక దర్శనాన్ని అంగీకరించక, తార్కిక ప్రత్యక్ష జ్ఞాన వాద లక్ష్యాన్ని నిర్దేశించారు. సాంకేతిక తర్కాన్ని అభివృద్ధిచేసి, గణిత శాస్త్ర విషయమంతటికి ప్రాధాన్యతనిచ్చారు. అందుచేత గణితం, తర్కం రెండూ కలిసాయి.

## 12.6 సంగ్రహంగా

ఈ విధంగా ప్రత్యక్ష జ్ఞాన వాదం అనుభవానికి ప్రాధాన్యతనిస్తుంది. జ్ఞానం అనేది అనుభవానికి, నిరూపణకు వీలుగా ఉండాలని వీరు భావిస్తారు. చివరకు ఉపయోగించే భాషకూడా అర్థవంతమై ఉండాలని వీరు కోరుతారు. శాస్త్రాల వరకే పరిమితమైన పద్ధతులను సమాజాన్ని అధ్యయనం చేసే శాస్త్రాలకు ప్రయోగించడం ద్వారా, శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి పొందింది. ప్రత్యక్ష జ్ఞాన వాదాన్ని ప్రబోధించిన వ్యక్తుల్లో అగస్ట్ కాంట్ అగ్రగణ్యుడు. శాస్త్రీయ సమాజ పరిశీలనకు మార్గాన్ని ఏర్పర్చడం ద్వారా, సామాజిక శాస్త్రాన్ని పెంపొందించాడు.

## 12.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి**

1. ప్రత్యక్ష జ్ఞాన వాదాన్ని అభివృద్ధి పర్చడానికై అగస్ట్ కాంట్ చేసిన కృషిని వివరించండి.
2. తార్కిక ప్రత్యక్ష జ్ఞాన వాదమంటే ఏమిటో తెలియజేయండి
3. అగస్ట్ కాంట్ సిద్ధాంతాన్ని, ఆ సిద్ధాంత ప్రభావాన్ని గురించి తెలియచేయండి.

**II ఈ క్రింది ప్రశ్నలకు లఘువ్యాఖ్యలను రాయండి**

4. అగస్ట్ కాంట్ రచనలను, వాటి ప్రాశస్త్యాన్ని పేర్కొనండి.
5. కాంట్‌ను ప్రభావితం చేసిన వ్యక్తులను భావాలను తెలియజేయండి.
6. కాంట్ సిద్ధాంత ప్రభావాన్ని తెలియజేయండి.
7. అగస్ట్ కాంట్ సామాజిక శాస్త్రాభివృద్ధికి ఏవిధంగా కృషి చేశాడు ?

BRAOU

## 12.8 ఉపయుక్త గ్రంథాలు


1. **Encyclopaedia Britanica Vols, 6 & 18**
2. **Encyclopaedia Americana Vols, 7**
3. **Intenational Encyclopaedia of social sciences Vol. 3**
4. జె. దుర్గాప్రసాద్ – **చరిత్ర రచనా శాస్త్రం**
5. ఆర్. వెంకటరెడ్డి – **పాశ్చాత్య తత్వశాస్త్రం**

కె. సి. బాబూరావు


**రచయిత్రి : ఆచార్య పి. రామలక్ష్మి**

BRAOU

# భాగం - 13 : సార్వత్రిక వాదం

విషయ క్రమం


13.0 లక్ష్యాలు

13.1 పరిచయం

13.2 లక్ష్య దిశగా సాగే అంశాలు

13.3 సార్వత్రిక భావనను పెంపొందించిన పాశ్చాత్య తత్త్వవేత్తలు

- 13.3.1 సిసిరో
- 13.3.2 స్టొయిక్ తత్త్వవేత్తలు
- 13.3.3 డాంటే

13.4 మానవ హక్కుల ప్రకటనలు

- 13.4.1 అమెరికా స్వాతంత్ర్య ప్రకటన
- 13.4.2 ఫ్రాన్స్

13.5 అంతర్జాతీయ సంస్థలు

- 13.5.1 నానాజాతి సమితి
- 13.5.2 ఐక్య రాజ్య సమితి

13.6 సార్వత్రిక భావానికి భారతదేశ కృషి

- 13.6.1 రాజా రామ్‌మోహన్ రాయ్ (1772 - 1833)
- 13.6.2 రవీంద్రనాథ్ ఠాగూర్ (1861 - 1941)
- 13.6.3 వివేకానందుడు (1863 - 1902)
- 13.6.4 అరవింద యోగి (1872 - 1950)
- 13.6.5 జవహర్‌లాల్ నెహ్రూ (1889 - 1964)

13.7 సంగ్రహంగా

13.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

13.9 ఉపయుక్త గ్రంథాలు


## 13.0 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగల్గాలి.

- సార్వత్రిక వాదం అంటే అర్థం తెలుసుకోవడం
- సార్వత్రిక భావనా వాదం ఎన్ని విధాలుగా విస్తరించగలదో తెలుసుకోవడం
- భారతదేశం ఏ విధంగా సార్వత్రిక వ్యాప్తికి కృషి చేసిందో తెలుసుకోవడం

## 13.1 పరిచయం

దేశ, భాష, జాతి వర్ణ, మత, కుల విభేదాలకు అతీతంగా ప్రపంచమంతా ఒకే కుటుంబంగా భావించగలిగే భావాన్ని సార్వత్రిక వాదమని పిలుస్తారు. విశ్వ దృక్పథం నుండి మానవుల భావాలను, చర్యలను, విలువలను పరిశీలించి, సర్వత్ర ఉత్తమమైనవిగా పరిగణింపబడిన వానిని ఆదరిస్తారు. అంతర్జాతీయ మానవాళి బలపర్చే ఈ ఏకత్వతా విలువలు రాజకీయ రంగానికే కాక, కళాత్మక రంగానికి కూడా చెంది ఉంటాయి. పరిస్థితుల్లోనూ, సంఘటనల్లోనూ, భావాల్లోనూ గల సారూప్యతను ఆధారం చేసుకొని, సర్వత్రా ఉన్న సామాన్య లక్షణాలను గమనించడమే సార్వత్రిక వాదం. ప్రాంతీయ విభేదాల వలన అమెరికా, ఫ్రాన్స్, రష్యా విప్లవాల ఆరంభం, కొనసాగింపు, ముగింపుల్లో తేడాలు ఉన్నప్పటికే, విప్లవం అనే మాటకు సార్వత్రికత గల అర్థం ఒక్కటి స్ఫురించక మానదు. మానవ హక్కులకు సంబంధించిన అంశాలతోపాటు, అంతర్జాతీయ సమైక్యత, పరస్పర సహకారం మొదలైన అంశాలు కూడా ఈ విలువల్లో ఉంటాయి. సూక్ష్మంగా చెప్పాలంటే, మానవాళిలో సహజంగా ఉంటే అవిశ్వాసం, అనుమానం, భయాల స్థాయి నుండి విముక్తి పొంది, అంతర్జాతీయ విలువలను పరిరక్షించుకునే దిశలో ఏకం కావడం అనేదే, సార్వత్రిక వాదానికి అర్థం.

సార్వత్రిక వాదం ప్రధానంగా రెండు విధాలుగా సాగుతూ ఉంటుంది. మత దృక్పథం నుండి చూసినప్పుడు విశ్వకర్తయగు భగవంతుని పితృత్వాన్ని అంగీకరించి, ఆయన సంతానమగు ప్రపంచ ప్రజలందరూ ఒక్కరే అని భావించి, విశ్వవిలువలను గుర్తించి గౌరవించడం ఒక విధానం. రెండో విధానంలో, ప్రపంచ ప్రజలందరూ తార్కిక శక్తి ఉన్న మానవులు కనుక, వారందరూ ఒక అంతార్జతీయ అధికారానికి, అంతర్జాతీయ చట్టానికి లోబడి ఉండాలని, ఆ విధంగా యుద్ధాలులేని సామరస్య వాతావరణంలో, మానవ హక్కులను, ఉమ్మడి ప్రయోజనాలను పదిలపర్చుకోవాలనే విధానం. ఈ విధంగా మత దృక్పథం నుండి, అంతర్జాతీయ దృక్పథం నుండి మానవ చరిత్రను విశ్లేషించి, ఉమ్మడి విలువలను గ్రహించడం జరిగింది. సార్వత్రిక భావం మానవాళిని వివిధ దేశాల్లో, వివిధ కాలాల్లో సాధించదగిన ఆదర్శంగా ఉత్తేజపరుస్తూనే వచ్చింది.

## 13.2 లక్ష్య దిశగా సాగే అంశాలు

ప్రాచీన, మధ్య యుగాల్లో విశ్వవిజేతగా గుర్తింపు పొందాలనే ప్రయత్నాలు అలెగ్జాండర్ నుండి అనేకం జరిగాయి. రాజకీయ ఐక్యత లక్ష్యంగా సాగిన ఈ ప్రయత్నాల్లో పవిత్ర రోమన్ సామ్రాజ్య స్థాపన ఒకటి. ఆస్ట్రియాకు చెందిన హాప్స్‌బర్గ్ (Hapsburg) అధికారానికి లోబడి, జర్మనీ ప్రాంతాన సుమారు 360 చిన్న పెద్ద రాజ్యాలు ఉండేవి. తొమ్మిది మంది ఎలక్టరులు ఆస్ట్రియన్ చక్రవర్తిని సమాఖ్య అధికారిగా ఎన్నుకున్నారు. సుమారు 50 స్వతంత్ర నగరాలు చక్రవర్తికి లోబడి, స్వతంత్ర పాలనను కలిగి ఉండేవి. సామ్రాజ్య ప్రతినిధి సభ, (Imperial Diet) సామ్రాజ్య న్యాయస్థానం, (Imperial Tribunad) సమావేశాలు కొనసాగించినప్పటికి, పద్దెనిమిదవ శతాబ్దంలో ఈ వ్యవస్థ బలహీనమైంది. రాజులందరూ సర్వాధికారాలను కైవసం చేసుకొని, నిరంకుశ జాతీయ ప్రభుత్వాలను ఏర్పాటు చేసికొని, తమ తమ ప్రయోజనాలకై ఇతర రాజ్యాలతో, శత్రు, మిత్ర సంబంధాలను ఏర్పాటు చేసికొని, సమాఖ్యను బలహీన పర్చారు. విస్తీర్ణ ప్రదేశాన్ని అదుపు చేయడం ద్వారా, రాజకీయ ఐక్యత సాధించడమనేది ఒక నెరవేరని ఆశయమే అయింది. ఆధునిక యుగాన అటువంటి ప్రయత్నం నెపోలియన్ తరువాత ఎవరూ చేయలేదు.

ఆధునిక యుగారంభాన జరిగిన శాస్త్రసాంకేతిక అభివృద్ధి ప్రజల ఆలోచనా సరళిలో మార్పులను తీసికొని వచ్చింది. ఫ్రాన్సిస్ బేకన్, (Francis Bacon) డేకార్ట్ (Descarters) సర్ ఐజాక్ న్యూటన్ (Sir Issac Newton)

గెలీలియో (Galilio) కోపర్నికస్ (Copernicus) పరిశోధనా ఫలితాలు నూతన భావాల వ్యాప్తికి కారణమయ్యాయి. ప్రపంచాన్ని పీడిస్తున్న అజ్ఞానాన్ని, మూఢ విశ్వాసాలను, అనారోగ్యాన్ని నిర్మూలించి, శాస్త్రీయ భావాలను హేతు వాద దృక్పథంతో వ్యాప్తి చేయనారంభించారు. అందుచేత పద్దెనిమిదవ శతాబ్దంలో తత్వవేత్తలు, స్వేచ్ఛను, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని ప్రజా సార్వభౌమత్వాన్ని, సర్వ మానవ హక్కులను, మానవతా దృక్పథాన్ని మానవులందరికీ అందించాలని విశ్వసించి, ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. తత్వవేత్తలందరూ రాజ్య వ్యవస్థ ఏవిధంగా ఉండాలి అనే దాన్ని విపులీకరిస్తూ, నూతన ప్రపంచ వ్యవస్థకు రూపకల్పన చేశారు.

## 13.3 సార్వత్రిక భావనను పెంపొందించిన పాశ్చాత్య తత్వవేత్తలు

ప్రపంచమంతా ఒకటని, ప్రపంచ ప్రజలందరూ సమానులే అనే భావం ప్రాచీన మధ్య యుగాల్లో కూడా అమలులో ఉండేది. గ్రీక్ తత్వవేత్తలు తమ ఆలోచనలను నగర రాజ్యాల వరకే పరిమితం చేశారు. వారి దృష్టిలో ప్రపంచమంటే నాగరికులైన గ్రీక్‌లు, అనాగరికులైన ఇతరులు, అనాగరిక జాతులను గ్రీక్‌లు బానిసలుగా మార్చవచ్చని గ్రీక్ తత్వవేత్తలు భావించారు. సిసిరో ఇటువంటి సామాన్యీకరణాన్ని అధిగమించాడు. రోమ్ సామ్రాజ్య విస్తరణవలన, అనేక నాగరిక జాతులు కూడా వారి ఆధిక్యతకు లోనయ్యారు. అందుచేత సిసిరో పరిపాలనావసరాల దృష్ట్యా, ఉమ్మడి చట్టావశ్యకతను గూర్చి భాషించాడు. సిసిరో ప్రధానంగా 'విశ్వవ్యాపితమైన మానవ జాతి' భావనచే ప్రభావితుడయ్యాడు.

### 13.3.1 సిసిరో (Cicerro) క్రీ.పూ. 106-43

రోమ్ నగరానికి చెందిన పరిపాలకుడు, తత్వవేత్త, న్యాయవాది అయిన సిసిరో మొట్టమొదటిసారిగా ఉమ్మడి చట్ట ఆవశ్యకతను గుర్తించి, దానిని కీర్తించాడు. రోమన్ సామ్రాజ్య పరిధిలో గల వివిధ మతాలకు చెందినవారు, వివిధ భాషలు మాట్లాడేవారు కూడా రోమన్ చట్టాల పరిధిలోకి వస్తారని సిసిరో నిర్ణయించాడు. ఉమ్మడి చట్టం ద్వారా విశ్వ సమాజ భావనను సిసిరో వ్యాపింపజేసాడు. ఇతడు న్యాయ శాస్త్రాన్ని రోమ్‌లోను, తత్వ శాస్త్రాన్ని ఏథెన్స్ మొదలగు గ్రీక్ కేంద్రాల్లోనూ చదివాడు. అత్యున్నత అధికార పదవిని చేపట్టడమేగాక, న్యాయవాదిగా కూడా కొనసాగాడు. ప్లేటో గ్రంథాల పేర్లు అయిన 'రిపబ్లిక్'' (Republic), "లాస్'' (Laws) అనే పేర్లతోనే, సిసిరో కూడా రెండు గ్రంథాలను రచించాడు.

**భావాలు :**

(1) విశ్వాన్ని దేవతలు, మానవులు సభ్యులైన ఒక కామన్వెల్త్‌గా సిసిరో భావించాడు,

(2) అన్ని దేశాలకు, అన్ని కాలాలకు వర్తించే ఉమ్మడి చట్టం ఉంటుందని, ప్రజలందరూ ఆ చట్టం ముందు సమానులే అని అతడు చాటాడు. సంపదను, ఆంతరంగిక శక్తియుక్తులను సమానంగా పంచుకోలేకపోయినప్పటికీ, కనీసం రాజ్యంలోని పౌరులందరికీ చట్టహక్కులైనా సమానంగా ఉండాలని సిసిరో భావించాడు. చట్ట సమానత్వాన్ని ప్రతిపాదించాడు. ఏ జాతికి చెందిన మనిషి అయినా, సరైన మార్గదర్శకుని శిక్షణలో మంచి వ్యక్తిగా మారతారని అతడి అభిప్రాయం దీనికి కారణమై ఉండవచ్చు.

(3) ఇతడు రాజ్యం గురించి చెప్పే ప్రతిసారి చట్టం గురించి కూడా చెపుతాడు. ఎందుకంటే, న్యాయం చేకూర్చడానికే, రాజ్యం ఉందని ఇతని అభిప్రాయం. నిజమైన చట్టమెప్పుడు ప్రకృతికి అనువుగా, హేతుబద్ధమైందిగా ఉంటుందని తెల్పుతాడు. (True Law is right reason in agreement with nature).

(4) విశ్వం భగవంతుడికి, భూసముద్రాలు విశ్వానికి విధేయత చూపుతాయి. అలాగే అధికారయుతమైన చట్టానికి మానవులంతా లోబడి ఉండాలి. హేతుబద్ధంగా ఆలోచించే శక్తి ఒక్క మానవులకే ఉండడం వల్ల,

BRAOU

మానవులందరూ ఒక్కటే అనే విషయాన్ని ఇతడు నొక్కి చెప్పాడు. అందరు వ్యక్తులకు ఇది ఒక సామాన్య లక్షణం కనుక, అందరూ సామాన్యంగా సరైన రీతిలోనే ఆలోచిస్తారని అంటాడు. అందుచేత చట్టం, న్యాయం అనేవి అందరికీ వర్తించేవని తెలియజేస్తాడు. చట్టాలు మాజిస్ట్రేట్‌ను, ప్రజలను మాజిస్ట్రేట్ పాలిస్తారని, అందుచేత మాజిస్ట్రేట్ మాట్లాడే చట్టంకాగా, చట్టం ఒక మౌన ముద్రలో ఉన్న మాజిస్ట్రేట్ అని తెలియజేస్తాడు.

(5) రోమన్ సామ్రాజ్య లక్ష్య సాధనలో ఇతడికి నమ్మకం ఉన్నప్పటికీ, సామ్రాజ్య ఏకీకరణ స్వేచ్ఛ ద్వారా, స్వయం పాలన ద్వారా జరగాలని భావించాడు.

(6) విశ్వంలోని అన్ని భాగాలను ప్రకృతి ఏ విధంగా అయితే సమన్వయంలో కొనసాగిస్తుందో, అదే విధంగా ప్రకృతి మానవులందరిని కూడా కలిపి ఉంచుతుందని, దుర్నీతివల్ల మానవులు వారిలోవారు కలహిస్తున్నారని, వారంతా ఒకే రక్తాన్ని పంచుకొని, ఒకే రక్షకుని రక్షణలో ఉన్నట్లు తెలియక చేస్తున్నారని సిసిరో అంటాడు. దీనిలో అతని మత రక్తి తెలుస్తోంది.

ఈ విధంగా ఉమ్మడి చట్టాన్ని, చట్ట సమానత్వాన్ని ప్రతిపాదించడం ద్వారా, సిసిరో విశ్వజనీన సార్వత్రిక భావాన్ని చాటాడు.

## 13.3.2 స్టాయిక్ తత్వవేత్తలు (Stoic Philosophers)

గ్రీక్ సంస్కృతి రెండు విధాలుగా తన ప్రభావాన్ని విస్తరించింది. గ్రీక్ దేశస్థులు తమ భావాలను చాటి, ఇతరులను తమ భావ పరిధిలోనికి మార్చుట ఒక విధానం. రెండవది ఇతర దేశస్తులు గ్రీక్ సంస్కృతితో ప్రభావితులై, గ్రీక్ భాషను, కళను, తత్వాన్ని, శాస్త్రాన్ని, భావాలను పెంపొందించి ప్రచారం చేశారు. సుమారు ఐదు శతాబ్దాలు (క్రీ.పూ. 300 నుండి క్రీ.శ. 200) స్టాయిక్ తత్వం (Stoic Philosophy) ఆదరణ పొందింది. ఈ తత్వవేత్తలు విశ్వ భావనను గూర్చి తెలియజేసారు. ఏథెన్స్ నగరంలో రంగులు వేయబడిన వరండా (Painted Porch called 'stow')లో జినో నేర్పిన సిద్ధాంతం 'స్టాయిజం' (Stoism) గా పేరు పొందింది. జినో తరువాత, పేర్కొనవలసిన తత్వవేత్తల్లో ఎపిక్టెటస్ (Epictetus) (సుమారు క్రీ.శ. 50-120) ముఖ్యులు. ఆసియా మైనర్‌కు చెందిన బానిస అయిన ఎపక్టెటస్ రోమ్, గ్రీస్ నగరాల్లో విద్యాలయాలను స్థాపించి, తత్వ శాస్త్రాన్ని బోధించాడు. మార్కస్ ఔరెలియస్ (Marcus Aurelius) (121 - 180AD) రోమ్ నగరాన్ని క్రీ.శ. 161-180 వరకు పాలించిన చక్రవర్తి. స్పెయిన్‌కు చెంది, రోమ్‌కి వలస వచ్చిన కుటుంబంలో జన్మించాడు. ఎపిక్టెటస్ సూక్తులను పదే పదే తెలిపేవాడు. జాతి, హోదాలకు అతీతంగా వ్యవహరించేవాడు.

### సిద్ధాంతాలు :

1. ప్రాథమిక సిద్ధాంతం ప్రపంచమంతా ఒక్కటనేది. విశ్వమే భగవంతుడని, భగవంతుడే హేతువని తెలుపుతూ, హేతువు భగవంతుని మానవులను కలుపుతుందని తెలుపుతాడు. ఎపిక్టెటస్ దృష్టిలో మానవులు మాత్రమే తార్కిక శక్తి ద్వారా భగవంతుని చేరగలిగినవారని, అందుచేత అతిశయంతో విశ్వ పౌరునిగాను, భగవంతుని బిడ్డగాను ఎందుకు ప్రకటించుకోరని ప్రశ్నిస్తాడు. (For these alone are by nature fitted to share in the society of God, being connected with him by the bond of reason. Why should he not call himself a citizen of the universe and a son of God?)

(2) ప్రపంచమంతా ఒక్కటే రాజ్యమని, రాజకీయమైన చట్టపరమైన ఐక్యత విశ్వవ్యాపితంగా ఉందని ఔరెలియస్ తార్కికంగా నిరూపించాడు. మానవులందరికీ చిత్తమనేది ఉందని, అందుకని వారు

BRAOU

తార్కికంగా ఆలోచిస్తారని, అందుకని ఏది చేయాలో, ఏది చేయకూడదో వారికి తెలుస్తుందని, అందరికీ వర్తించే ఉమ్మడి చట్టం అందుకనే కావాలని, అప్పుడు అందరు పౌరులే అవుతారని, అప్పుడు అందరు ఏదో ఒక రాజకీయ సమూహానికి (Political Community) చెందిన వారవుతారని, అదే కనుక నిజమైతే, ప్రపంచమే ఒక రాజ్యమని తెలిపాడు. జెరెలియన్ తనను తాను ఒక చక్రవర్తిగా, వ్యక్తిగా, పౌరునిగా భావించుకొన్నట్లు తెలిపాడు. విశ్వవ్యాపితంగా అంగీకరించబడిన ఉమ్మడి చట్టం, పురుషులందరకూ పౌరసత్వం ఉంటాయి, తప్ప స్థానిక ఆచార వ్యవహారాలకు తావుండదు. కృతకంగా కనపడిన ప్రతి సంస్థను, ఆచారాన్నీ జెనో ఖండించాడు. వానిలో ఆలయాలు, న్యాయస్థానాలు, వివాహ వ్యవస్థ, స్త్రీ అసమానత్వం కూడా ఉన్నాయి. స్థానికంగా ఉన్న అనేక చట్టాలను, న్యాయ శాస్త్రాలను త్రోసివేస్తూ జెనో ప్రపంచ రాజ్యాన్ని తన రిపబ్లిక్‌లో ప్రతిపాదించాడు.

(3) స్టొయిక్స్ తత్వవేత్తలు మానవులందరిని కలిపి ఉంచే వాటికి ప్రాధాన్యత ఇచ్చారు. స్త్రీలకు, బానిసలకు ఎక్కువ వాటికి ప్రాధాన్యత ఇచ్చారు. సాంప్రదాయానికి భిన్నంగా స్త్రీలకు, బానిసలకు ఎక్కువ సమానత్వం కావాలని, నాటి సమాజ  కోరారు. తెగ, ఆధిక్యత భావాల పరిధి నుండి ప్రజలను తప్పించే ప్రయత్నం చేసారు. ప్రాకృతిక చట్టం బానిసత్వాన్ని అంగీకరించదని వీరు తెలిపారు.

(4) ప్రకృతితో అనుసంధించుకొని, పనులను జీవనాన్ని సాగించుతూ, వానిని ఎంతవరకు పరిపూర్ణం చేయగలమో, అంత వరకు ప్రయత్నం చేయాలని వీరు తెలుపుతారు.

(5) ఏ వ్యక్తి కూడా స్వేచ్ఛను హరించలేడని, ఏ నియంత యొక్క అధికారమైనా, ఇతరుల మనస్సుపైనే తప్ప, శరీరంపై కాదని వీరు నమ్ముతారు.

(6) చివరదీ ప్రధానమైందీ అయిన లక్షణం ఏమిటంటే, మానవుని తార్కిక తత్వమే అతని నిజ ప్రకృతి అని తెలుసుకోవడం; తన జీవితాన్ని తార్కికంగా నడుపుకోగల వ్యక్తి ఎటువంటి సంఘటనలకు చలించడని వీరి దృఢమైన అభిప్రాయం.

స్టొయిక్స్ తత్వంలో ప్రధానమైనవి ఒకే రాజ్యం ఒకే ఉమ్మడి చట్టం అనే విధానాలు. ఆధునిక కాలంలో స్టొయిక్ సిద్ధాంతం మూడుసార్లు పైకుబికింది.

(1) మతంపై ఆధారపడిగాని, మతేతర సిద్ధాంతం ప్రాతిపదికగా గాని పదహారవ శతాబ్దం నుండి తిరిగి ప్రాకృతిక లేదా సహజ చట్టం ప్రాధాన్యత వహించింది. అందుచేత అంతర్జాతీయ సంబంధాలలో ఉమ్మడి చట్టం గూర్చి చర్చలు అధికమయ్యాయి.

(2) పద్దెనిమిదవ శతాబ్దంలో ఫ్రాన్స్ నూతన ప్రపంచాన్ని కొత్త సిద్ధాంతాలపై నిర్మించే ప్రయత్నం చేసింది.

(3) స్టొయిక్ సిద్ధాంతమైన 'చట్టం పై చట్టం' (Law above Law) అమెరికా రాజ్యాంగంలో అంతర్భాగమై, న్యాయ వ్యవస్థచే కాపాడబడుతోంది.

### 13.3.3 డాంటే (Dante Alighieri) క్రీ.శ. 1265-1321

ఇటలీకి చెందిన డాంటే ఆలిఘిరి కవి మాత్రమే గాక సైనికుడు, రాజనీతిజ్ఞుడు, తత్వికుడు మత నమ్మిక కలవాడు కూడా. 'డివైన్ కామెడి' (Divine Comedy) అనే గ్రంథాన్ని రచించాడు. మధ్య యుగాల సాహితీ రీతులకు భిన్నంగా ఇతడు జాతి, మత, వర్గ, కుల భేదాలకు అతీతమైన సార్వత్రిక లక్షణాలను ప్రతిపాదించాడు. స్థానిక ఇటాలియన్ భాషను ఉపయోగించి, లాటిన్‌లో మాత్రమే సాహిత్య గ్రంథాలను రచించాలనే సాంప్రదాయాన్ని

ఎదిరించాడు. విశ్వజనీనత, తదితర అంశాలను తాను రాసిన 'ఆన్ మొనార్కీ' (on Monarchy) అనే గ్రంథంలో పేర్కొన్నాడు. దీనిలో అతినికి గల మత విషయ పరిజ్ఞతతో పాటు, మతాధికారుల పట్ల గల వ్యతిరేకత కూడా తెలుస్తోంది.

ఈ గ్రంథంలో డాంటే ప్రధానంగా కొన్ని అంశాలను ప్రస్తావించాడు. మానవాళి శ్రేయస్సుకోసం ప్రపంచ ప్రభుత్వం ఒకటి ఉండాలని, అది చక్రవర్తి పాలించే రాజరిక వ్యవస్థగా ఉండాలని అన్నాడు.

ప్రపంచ ప్రభుత్వ ఆవశ్యకతను తెలియజేస్తూ, డాంటే కారణాలను పేర్కొన్నాడు.

(ఎ) తత్వపరంగా చూసినట్లైతే, ఐక్యతలోనే సారం (essence), సత్యం (reality) ఉన్నాయని, అతి గొప్ప ఐక్యత ద్వారానే భగవంతుడు స్పష్టంగా తెలియపడతాడని అంటాడు.

(బి) మానవునికి గల ప్రత్యేకమైన తార్కిక బుద్ధి, అర్థం చేసుకొనే శక్తి పూర్తిగా వికసించాలంటే, ఐక్యతలోనే సిద్ధిస్తుంది తప్ప, ఏకాంతంలో కాదని అంటాడు. ఏ విధంగా అయితే ఒక మానవుడు తన జ్ఞానాన్ని, వివేకాన్ని శాంతిపూర్వక వాతావరణంలో పెంపొందించుకుంటాడో, అలాగే మొత్తం మానవాళి కూడా తన శక్తియుక్తులను శాంతియుత స్థితిలో పెంపొందించుకునేందుకు విశ్వ ప్రభుత్వం అవసరం అవుతుంది. అప్పుడే అది భగవంతుని ప్రణాళికకు దగ్గరగా ఉంటుంది.

(సి) ఆధునిక కారణాన్ని కూడా డాంటే తెలియజేసాడు. ప్రపంచ రాజ్యాలు యుద్ధాలు చేయకుండా, విభేదాలను పరిష్కరించుకోవాలంటే, ప్రపంచ ప్రభుత్వం కావాలని అంటాడు. ఎక్కడ విభేదం ఉంటుందో అక్కడ తీర్పు ఉండాలని, ఆ తీర్పు అందరూ శిరసావహించే అధికారి నుండి రావాలని అంటాడు. ఆరు శతాబ్దాల క్రితం డాంటే తెలిపినట్లే, మొదటి అంతర్జాతీయ సంస్థ న్యాయరంగాన ప్రవేశించింది.

రాజరిక ప్రపంచ ప్రభుత్వం కావాలని అతడు ఆశించాడు. అందరి మేలుకోసం ఐక్యతను, శాంతిని రక్షించడానికి ఒక్క వ్యక్తి మార్గదర్శకత్వం వహించాలని, ప్రజల శక్తియుక్తులు పరిపూర్ణంగా అభివృద్ధి చెందేటట్లు అతడు బాధ్యత వహిస్తాడని, అతనికి ఇవ్వవలసిన హోదా కూడా చక్రవర్తి పదవి మాత్రమే అని అంటాడు. ప్రపంచ శ్రేయోరాజ్యానికి అవసరమైంది రాజరికమనే తెలుపుతాడు. విశ్వ రాజ్యానికి అధిపతి భగవంతుడని, మానవాళి కూడా విశ్వంలో భాగమని, వీరంతా ఐక్యతగా ఉంటే భగవంతుని తలపిస్తారని, ఈ విధంగా జరగాలంటే, ఒక రాజుకు లోబడక తప్పదని అంటాడు. రాజు ప్రపంచ రాజ్యానికి సేవకుడని, అటువంటి రాజ్యంలోనే ప్రజలకు శ్రేయస్సు కలుగుతుందని అంటాడు.

(2) ప్రపంచ ఆధిపత్యానికి రోమన్ ప్రజలు తగినవారని అతడి భావం. రోమన్లు విశ్వ శాంతిని కోరేవారని, స్వార్థాన్ని విడిచినవారని, అందుకే ప్రపంచ విజేతలయ్యారని అంటాడు. బాబిలోనియన్లు, అస్సీరియన్లు, పర్షియన్లు, ఈజిప్ట్ వాసులు ప్రపంచాన్ని జయించే యత్నాలను చేశారని, అలెగ్జాండర్ చాలా వరకు సఫలీకృతుడైనా, భగవంతుని తీర్పు ప్రకారం ఒక్క రోమన్లు మాత్రమే విశాల సామ్రాజ్యాన్ని పాలించగలిగారని అంటాడు. మధ్య యుగాల్లోని చట్టప్రకారం యుద్ధంలో గెలిచింది హక్కుఅని, దానిని రోమన్లు పొందారని అంటాడు. ఇతడి ఉద్దేశంలో రోమన్ సామ్రాజ్యమనేది ఎటువంటి ఆటంకం లేక కొనసాగుతున్న రోమన్ సామ్రాజ్యమే. పూర్వపు రోమన్ సామ్రాజ్యానికి, జర్మన్ రాజులు పాలించిన పవిత్ర రోమన్ సామ్రాజ్యానికి ఇతడు తేడా చూపలేదు.

(3) చక్రవర్తి అధికారాన్ని ఎవరి నుండి పొందుతాడని డాంటే చర్చించాడు. ప్రత్యక్షంగా భగవంతుడా లేక మతాధికారుల ద్వారానా అని చర్చించి, చివరకు మానవ ప్రకృతిని గురించి వివరిస్తాడు. మానవ ప్రకృతిలో రెండు భాగాలుంటాయనీ, అవి శరీరం, ఆత్మ అని తెలుపుతూ, ఈ రెండింటికీ లక్ష్యాలు వేరని అంటాడు. భూమిపై

BRAOU

లభించే ఆనందమయ జీవితాన్ని, స్వర్గంలో లభించే సుఖాలను పొందడం వాటి లక్ష్యాలను. వీటి కొరకు కావలసిన సాధనాలు వేర్వేరుగానే ఉంటాయని తెలుపుతాడు. తర్కం, తత్వాల (Reason and Philosophy) ద్వారా భూమిపై పొందే సుఖాలను, తర్కానికి అతీతమైన స్వర్గసుఖాలను మతం, నమ్మకం, ఆశ, దయల ద్వారా పొందవచ్చని తెలుపుతాడు. తత్వంలోని సత్యాలు తర్కం ద్వారాను, తత్వవేత్తల రచనల ద్వారానూ తెలుసుకోవచ్చని, మత గ్రంథాల ద్వారా మతంలోని అత్యద్భుతమైన సత్యాలను తెలుసుకోవచ్చని అంటాడు. చివరకు డాంటే ఈ విధంగా తీర్మానిస్తాడు. మనిషికి జీవితంలో రెండు లక్ష్యాలున్నాయి కనుక ఇద్దరు మార్గదర్శకుల ఆవశ్యకత ఉందని, మానవాళిని దైవం తెలిపిన మార్గం ద్వారా, శాశ్వతమైన ఆనందం వైపుకు నడపడానికి ఒక ఉన్నత మతాధికారి (Pontiff), తత్వానుగుణంగా భూమిపై పొందే ఆనందం వైపు ప్రపంచాన్ని నడపడానికి ఒక చక్రవర్తి కావాలని అంటాడు.

(4) సామ్రాజ్యానికి అధికారాన్నిచ్చేది చర్చి కాదని, ఎందుకంటే చర్చి ఆవిర్భావానికి ముందునుండి రోమన్ రాజ్యం ఉందని అంటాడు. అందుచేత చక్రవర్తికి అధికారం మతాధికారుల నుండి గాక, ప్రత్యక్షంగా విశ్వాధికారి అయిన భగవంతుని నుండే వస్తుందని ఇతని నమ్మకం.

(5) డాంటే రాజకీయ సార్వభౌమత్వాన్ని, సాంస్కృతిక స్వయం ప్రతిపత్తిని విడివిడిగా చూడగలిగాడు. ప్రభుత్వం, చట్టం విషయాల్లో మానవాళి అంతా ఏకమైనా, భాష, సంస్కృతి, తెగల విషయాల్లో వైవిధ్యం ఉంటుందని, చిన్న చిన్న విషయాలు ప్రపంచ రాజ్యదృష్టికి రానక్కరలేదని, జాతీయ నేతలు వానిని పరిష్కరించుకోవచ్చని, మానవాళినంతా ప్రభావితం చేసే విషయాల్లో మాత్రమే, ప్రపంచ ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని అంటాడు.

(6) న్యాయాన్ని, స్వేచ్ఛను గుర్తించి, డాంటే ప్రాధాన్యత ఇచ్చాడు. న్యాయ నిర్ణయంలో నిష్పక్షపాత వైఖరిని గూర్చి, చట్ట సమానత్వాన్ని గూర్చి తెలుపుతాడు. భగవంతుడు మానవాళికి ఇచ్చిన అతి గొప్ప బహుమతుల్లో స్వాతంత్ర్యం ఒకటి అని డాంటే అంటాడు.

## ప్రాధాన్యత

(1) డాంటే జాతీయత పరిధి నుండి బయటపడి మొదటిసారిగా ప్రపంచ రాజ్య వ్యవస్థను ఊహించగలిగాడు. "చేపకు సముద్రంలాగే నాకు ప్రపంచమే నా దేశం" అన్నాడు. (To me, the world is my country as the sea is to the fish)

(2) విశ్వ మానవాళిని, విశ్వ ప్రభుత్వాన్ని, దాన్ని నడిపే ప్రపంచ చక్రవర్తికి అధికారంలేక పాలించే హక్కు మతాధికారుల ప్రమేయం లేకుండానే దైవం నుండే ప్రత్యక్షంగా పొందుతాడని డాంటే చెప్పి, రాజ్యానికి సమాన ప్రతిపత్తిని కల్పించాడు. పోప్‌కు, చక్రవర్తికి వేర్వేరు రంగాల్లో సమాన అధికారాలను ఇచ్చాడు. ఈ రెండు రంగాలకు అధినేత అయిన భగవంతుని ఆధిక్యతను, అందరినీ ఏకంచేసే గుణాన్ని తెలిపాడు. రెండింటి సమాన ప్రతిపత్తి తెలుపడం ద్వారా, చర్చి ప్రాముఖ్యాన్ని తగ్గించాడు.

(3) మొదటిసారిగా డాంటే క్రైస్తవంలోని రెండు సిద్ధాంతాలను సమ్మిళితం చేసే ప్రయత్నాన్ని చేశాడు. మొదటిది, సెయింట్ అగస్టీన్ చర్చి ఫాదర్లు ప్రతిపాదించారు. దీని ప్రకారం మానవుని బలహీనతల నుండి, పాపదృష్టినుండి మరల్చడం కోసం, దేవుడు రాజ్యాన్ని సృష్టించాడని సిద్ధాంతం. రెండో దాన్ని అరిస్టాటిల్, సెయింట్ థామస్ ఎక్వినాస్ ప్రతిపాదించారు. దాని ప్రకారం రాజ్యం మానవుని సాంఘిక అవసరాల కోసం ఏర్పడిన సంస్థ. డాంటే అభిప్రాయంలో ప్రభుత్వ సంస్థలు, రాజ్యం – ఇవన్నీ మానవుల్లో స్వతహాగా ఉండే

B R A O U

గుణాలను అభివృద్ధి చేసుకోడానికి అవసరమని, అయినప్పటికి ఇవి మాత్రమే చాలవని, ఎందుకంటే దురాశ, పాప దృష్టి మానవ అభివృద్ధికి అవరోధమని, అందుచేత భగవంతుని ఆశీర్వాదంతో విశ్వ ప్రభుత్వం కావాలని, దాని ద్వారానే మానవుడు శాంతిని, న్యాయాన్ని, స్వేచ్ఛను పొందగలడని తెలుపుతాడు.

(4) తత్వాన్ని, మతం నుండి సమాన ప్రతిపత్తిగల అంశంగా విడగొట్టాడు. తర్కం (Reason), తత్వం (Philosophy) ప్రపంచ సుఖాలకు సాధనాలు కాగా, మతం, నమ్మకం, ప్రవచనాలు (Revelation) స్వర్గసుఖాలను పొందడానికి సాధనాలు. సాంస్కృతిక పునరుజ్జీవనంలో మతం తత్వానికి దాసోహమనే స్థితికి రావడానికి డాంటే నాంది పలికాడు.

కాని మధ్య యుగాల్లో మతమే ప్రాధన్యత వహించడంతో, సెయింట్ అగస్టీన్ (Saint Augustin) వంటి వ్యక్తులు మత దృక్పథం నుండే విశ్వ భావనను పెంచే ప్రయత్నం చేశారు. ఆయన రచించిన 'సిటీ ఆఫ్ గాడ్' (City of God) గ్రంథంలో విశ్వచరిత్ర అంతా భగవత్ప్రణాళిక ప్రకారమే జరుగుతుందని తెలిపాడు. అయితే ఈ మధ్య యుగాల అవగాహన ఆధునిక యుగారంభంతో వెనక్కి మళ్ళింది. తిరిగి విశ్వ మానవ హక్కులు, వానిని పదిలపరచుకునే సాధనాలు ప్రాముఖ్యం వహించసాగాయి.

## 13.4 మానవ హక్కుల ప్రకటనలు

ఆధునిక యుగంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సహజ చట్టాలు, సహజ న్యాయం అనే అంశాలు ప్రాధాన్యత పొందసాగాయి. నిరంకుశ రాజరిక వ్యవస్థ సర్వత్రా స్థిరపడి, ప్రజల హక్కులను హరించడమే దీనికి కారణం. సామాజిక ఆర్థిక రంగాల్లో వస్తున్న మార్పులను లెక్కించక, రాజులు తమ ఆధిపత్యాన్ని కొనసాగించే యత్నాలు చేసినప్పుడు, ప్రజలకు ఎదిరించక తప్పలేదు. ఈ ప్రతిఘటనకు అవసరమైన భావ పునాదిని తత్వవేత్తలు సిద్ధాంతాల రూపంగా అందజేసారు. రాజరిక వ్యవస్థ నెదిరించిన తరువాత కొన్ని దేశాలు విశ్వ మానవ హక్కుల ప్రకటనలను చేయడం ద్వారా, వాని ప్రాధాన్యతను మరెవ్వరూ, ఎక్కడ కాదనలేని స్థిరత్వాన్ని చేకూర్చారు. సర్వమానవ సహోదరత్వాన్ని ఇవి తెలియజేస్తాయి. అటువంటి వానిలో ప్రముఖమైనవి అమెరికా, ఫ్రాన్స్‌లు చేసిన ప్రకటనలు.

BRAOU

### 13.4.1 అమెరికా స్వాతంత్ర్య ప్రకటన

థామస్ జఫర్సన్ (Thomas Jefferson) ఆధ్వర్యంలో గల సంఘం అమెరికా వలసల స్వాతంత్ర్య ప్రకటనను రచించింది. దీనిని కాంగ్రెస్ 1776 జులై 4న ఆమోదించింది. నాటి అమెరికా వాసుల రాజకీయ భావాలను జఫర్సన్ తన పదునైన భాషలో వ్యక్తీకరించాడు.

ప్రజలందరూ పుట్టుక నుండి సహజ హక్కులను కలిగి ఉంటారని, వీనిని ఎవరూ తొలగించలేరని, ఏ ప్రభుత్వమైనా, అటువంటి ప్రయత్నంచేస్తే, దాన్ని మార్చడానికి ప్రజలకు హక్కు ఉంటుందని, ప్రజా హక్కులను హరించే ఏ ప్రభుత్వమూ అధికారంలో కొనసాగలేదని ఈ ప్రకటన తెలియజేస్తుంది. లాక్ తెలిపిన సహజ హక్కుల్లో జీవిత హక్కును, స్వేచ్ఛా హక్కును అలాగే ఉంచి, జఫర్సన్ ఆస్తి హక్కుకు బదులు సౌఖ్యాన్వేషణ హక్కు అని వాడాడు. ఆస్తి అనే మాటకు బదులు సౌఖ్యాన్వేషణ అనడం వలన ఆ హక్కు పరిధి విస్తృతమైంది. ఈ ప్రకటనలోని మరో అంశం, వలస ప్రజలు వారి బాధలను బ్రిటిష్ రాజుకు ప్రత్యక్షంగా విన్నవించుకోవడం. వలస ప్రజలు బ్రిటన్‌తో తమకున్న ఏకైక బంధం రాజుతో మాత్రమే అని భావించి, అతడికి మాత్రమే తమ కష్టాలను వెల్లడించుకున్నారు. పార్లమెంట్‌లో ఉన్నవారంతా బ్రిటిష్ ప్రతినిధులు తప్ప తమ ప్రతినిధులు కారు. కనుక వారితో ఎటువంటి సంబంధం లేదని భావించారు. తమ ప్రాతినిధ్యం లేకుండానే, తమపై విపరీతపు పన్నులను విధించి, వసూలు చేయడం అన్యాయమని తెలిపారు.

ఈ విధంగా మానవ హక్కుల్లో తనకుగల నమ్మకాన్ని ప్రకటించడం ద్వారా, అమెరికా నూతన మనుగడను ఆరంభించింది. అధికారయుతమైన వలస ప్రభుత్వం పైనా, అసమానతలపైనా తన విముఖతను తెలియజేసింది. స్వేచ్ఛ, సమానత్వం, అభివృద్ధికి సమాన అవకాశాల్లో తన గాఢ నమ్మకాన్ని తెలియజేసింది. రాజరిక వ్యవస్థను, అధికార కేంద్రీకరణను వ్యతిరేకించింది. వలసలకు, బ్రిటిష్ రాజరికానికి ఎటువంటి సంబంధంలేదని, అందుచేత యుద్ధం చేయడానికి, సంధి చేసికోడానికి, ఒప్పందాలు రాసుకోడానికి, వర్తక వ్యాపారాలు పెంచుకోడానికి స్వతంత్ర హక్కులు గలిగి ఉంటాయని తెలియజేసింది.

## 13.4.2 ఫ్రాన్స్

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలతో ప్రారంభమైన ఫ్రెంచ్ విప్లవం విశ్వమానవ సమైక్యతకు కూడా నాంది పలికింది. ఈ నినాదాల ద్వారా, రాజకీయ స్వేచ్ఛ, సాంఘిక సమానత్వం, జాతీయత భావం, అంతర్జాతీయ అవగాహనలు పెరిగాయి. ఆదర్శప్రాయమైన సోదర భావం సౌభ్రాతృత్వం నినాదంలో ఉంది. అందరూ సోదరులే అనే భావం వల్ల ఉత్తేజితులై, ప్రపంచాన్ని సౌఖ్యతరం చేసికొనాలని అందరి మేలు కోరుతూ అభ్యుదయం వైపు సాగాలని యత్నాలు మొదలయ్యాయి. నిరంకుశ రాజరిక వ్యవస్థ ఫ్రాన్స్‌లో ముగిసినందుకు సంస్కరణల యుగం ఆరంభమైనందుకు బ్రిటన్, అమెరికా దేశాలు ఆనందించాయి. తీవ్ర సంఘటనలు జరిగిన భయంకర పాలన వరకు ఫ్రెంచ్ విప్లవానికి మద్దతు సర్వత్ర వ్యక్తమైంది.

ఫ్రెంచ్ వారు కూడా తాము విప్లవాన్ని మానవాళి అందరి తరపున జరుపుతున్నట్లు తమ భావాలతో, ఆశయాలతో ఆంగీకరించే ఇతర దేశస్థులైనా తమతో చేరవచ్చని ఆహ్వానించారు. బాస్టిల్ కోట (Bastil fort) తాళంచెవిని జార్జి వాషింగ్‌టన్ (Washington) కు ఇమ్మని లఫాయెత్ (Laffayatte) టామ్ పెయిన్ (Ton Payne) కు అందజేయడం, జాతీయ పరిషత్తు అతనిని 'ఫ్రెంచ్ పౌరుడు' అని గౌరవించడం, అతడిని పరిషత్తు ప్రతినిధిగా ఎన్నుకోవడం, జెరిమి బెంథామ్‌ను ఫ్రెంచ్ పౌరునిగా అంగీకరించడం ప్రజాస్వామ్య అంతర్జాతీయతను చాటుతాయి.

జాతీయ మహా సభ, జాతీయ రాజ్యార్ల పరిషత్తుగా మార్పు చెంది, జులై 8, 1789న ఒక కమిటీని రాజ్యాంగ రచనకు ఏర్పరచింది. ఆ కమిటీ తమ ముసాయిదాను 'మానవ, పౌరహక్కుల ప్రకటన' (Declaration of human rights) తో ఆరంభించారు. రాజు అంగీకారం దీనికి లభిచింది. రాజ్యాంగబద్ధమైన రాజరిక వ్యవస్థను సూచించిన 1791 నాటి కొత్త రాజ్యాంగానికి ఈ హక్కుల పత్రం పీఠిక అయింది. బ్రిటిష్, అమెరికా భావాలతో బాటు, రూసో తత్వాన్ని ఈ ప్రకటన వ్యక్తం చేస్తోంది. మానవులందరూ పుట్టుకచేత సర్వస్వతంత్రులని, సమాన హక్కులు కలవారని, సహజ హక్కులగు స్వేచ్ఛ, ఆస్తి, భద్రతలకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ కర్తవ్యమని, ప్రజల అభిప్రాయ ప్రకటనయే చట్టమని, ప్రభుత్వాలు ప్రజలకు బాధ్యత వహించాలని స్వేచ్ఛ అంటే ఇతరులకు హాని కలిగించని ఏ పని చేయడానికైనా ఉండే అధికారమని, దేశ ప్రజలే సార్వభౌములని, పన్నులను అందరూ శక్తికొలది చెల్లించాలని, జనేచ్ఛ వ్యక్తపరచినదే చట్టమని, ప్రతి వ్యక్తి దోషిగా రుజువయ్యేంత వరకు నిర్దోషిగానే పరిగణింపబడతాడని ఈ ప్రకటన పేర్కొంది. దీనికనుగుణంగానే ఫ్రెంచ్ విప్లవం కొనసాగింది.

## 13.5 అంతర్జాతీయ సంస్థలు

తాత్వికుల మనసుల్లో కదలాడిన విశ్వ భావన, అమెరికా, ఫ్రెంచ్ విప్లవాలనంతరం అంతర్జాతీయ ఆదర్శంగా మారి, సామాన్య ప్రజలను సహితం ఉత్తేజపరచి, అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుకు దారితీసింది. 'విశ్వ రాజ్య స్థాపన', 'ప్రపంచ చక్రవర్తి' భావాలు వెనుకబడి, ఆధునిక యుగావసరాలైన యుద్ధ నివారణ, అంతర్జాతీయ

శాంతి పెంపుదల, మానవ హక్కుల రక్షణ, అంతర్జాతీయ సహాయ సహకారాల వృద్ధి ధ్యేయాలై, అంతర్జాతీయ సంస్థ ఆవశ్యకతను తెలియజేసాయి.

రష్యా చక్రవర్తి రెండవ నికోలస్ (Nicolos II) కృషి ఫలితంగా, 1899లో హేగ్ నగరంలో ఏర్పాటైన సమావేశం ఈ దిశగా జరిగిన యత్నాల్లో మొదటిది. ఇరవై ఆరు దేశాల ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో నిరాయుధీకరణ, సామరస్య ధోరణిలో సమస్యా పరిష్కారం మున్నగు అంశాలు ప్రస్తావించబడినా, చెప్పుకోదగిన మార్పులేమీ జరగలేదు. ఒక దేశాన్ని మరో దేశం అనుమానించే విధానం వల్ల, స్పష్టమైన ఒడంబడికలేమీ జరగనూ లేదు. రెండో అంతర్జాతీయ శాంతి సమావేశాన్ని అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్, (Theodre Roosewelt) రష్యా చక్రవర్తి రెండో నికోలస్ 1907లో హేగ్ (Hague) లో జరిపారు. ఇందులో 44 దేశాలు పాల్గొన్నప్పటికీ, నిరాయుధీకరణకు, సైనిక పరిమితులకు ఏ దేశమూ సిద్ధంగా లేకపోవడంతో, ఎటువంటి ప్రగతి సాధించలేదు.

### 13.5.1 నానాజాతి సమితి (League of Nations)

అమెరికా అధ్యక్షుడు అయిన ఉడ్రో విల్సన్, (Woodrow Wilson) కృషి ఫలితంగా నానాజాతి సమితి 1920లో ఏర్పడింది. మొదటి ప్రపంచ యుద్ధం ద్వారా జరిగిన భారీ నష్టాలు, ప్రపంచ శాంతిని పెంపొందించాల్సిన ఆవశ్యకతను చాటాయి. జనవరి 1918లో విల్సన్ ప్రకటించిన 14 సూత్రాల్లోని ఆఖరి సూత్రం నానాజాతి సమితి స్థాపనకు ప్రాతిపదిక అయింది. దీనికి సంబంధించిన చర్చను విల్సన్ జనవరి 1919న ప్రారంభించాడు. మానవ జాతినంతా ఏ కొద్దిమందో ఇక పాలించే ప్రసక్తి లేదని, మానవజాతి మంచిచెడులు, మనుగడ ప్రపంచ ప్రజలందరి బాధ్యతను, యుద్ధాన్ని అంతం చేయాలని అతడు తెలిపాడు. పాలకుల అభిరుచులు, పెద్ద రాజ్యాల దురాక్రమణలు, ఆయుధ నిల్వలు, వర్గాలుగా ఏర్పడి, చిన్న రాజ్యాలను బలవంతంగా ఆధీనంలోకి తెచ్చుకోవడం మొదలైనవి యుద్ధ పునాదులని విల్సన్ తెలిపాడు.

ప్రపంచ శాంతి పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా నానాజాతి సమితి ఏర్పడింది. సభ్య దేశాల మధ్య అంతర్జాతీయ సహకారాభివృద్ధి, శాంతియుతంగా వివాదాల పరిష్కారం ఆశయ సిద్ధికి సాధనాలు. గౌరవప్రదమైన పరస్పర సంబంధాలు, బహిరంగ రాజకీయ సంబంధాలు ఉండాలి. సమితి నియమాలను పాటించని దేశాలపై చర్యలు తీసుకోవాలి. ఆదిష్ట రాజ్యాల పాలనను సమితి చూడాలి.

ప్రపంచ ఆరోగ్యాన్ని పెంచడానికి కార్మికులకు వెసులుబాటు చేయడానికి, అంతర్జాతీయ న్యాయ శాస్త్రాన్ని క్రోడీకరించడానికి, అల్పసంఖ్యాక వర్గాల శ్రేయస్సుకు, శరణార్థులను ఆదుకోడానికి సమితి కృషి చేసింది. అయినప్పటికి రెండో ప్రపంచ యుద్ధాన్ని నివారించలేకపోవడంతో, ప్రధాన ఆశయంలోనే విఫలమైంది.

### 13.5.2 ఐక్య రాజ్య సమితి (United Nations Organisation)

నానాజాతి సమితి వైఫల్యాలను గుర్తించి, ఆ పొరబాట్లను సరిదిద్దుకునే ప్రయత్నంలో ఐక్యరాజ్య సమితి స్థాపన జరిగింది. దీని ఏర్పాటుకు తగిన ప్రాతిపదికను అట్లాంటిక్ ఒడంబడిక (1941), యాల్టా సమావేశం (1945), శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశాలను (1945) ఏర్పాటు చేశాయి. అంతర్జాతీయ శాంతిభద్రతలు కాపాడడం ద్వారా ప్రజలకు యుద్ధ భయం లేకుండా చేయడం, ప్రాథమిక మానవ హక్కులకు రక్షణ కల్పించడం అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం ద్వారా సభ్యదేశాల ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక అభివృద్ధికి కృషి చేయడం దీని లక్ష్యాలు. రెండో ప్రపంచ యుద్ధంలో జరిగిన విషాద సంఘటనలు మానవాళిని కలత పరచడంతో, మానవ హక్కులను పునరుద్ఘాటించవలసిన ఆవశ్యకత తిరిగి ఏర్పడింది. అందుచేత సభ్య దేశాలు 1945 నాటి శాన్‌ఫ్రాన్సిస్కో ఛార్టర్ ద్వారా, ప్రాథమిక మానవ హక్కుల్లో తమ నమ్మకాన్ని ప్రకటించాయి. ఆ హక్కులన్నింటినీ విశదీకరించపోయినా, జాతి, మత, భాషా, లింగ వివక్షతను విడనాడాలని తెలిపాయి.

ఐక్య రాజ్య సమితి 1948లో తన సాధారణ సభ ద్వారా ఒక అధికార హక్కుల పత్రాన్ని ప్రకటించింది. దీనిని సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనగా పేర్కొంటారు. దీనిలో సాంప్రదాయకమైన రాజకీయ పౌరహక్కులతోపాటు, ఇతర ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కులను సైతం పేర్కొంది. ఈ విధంగా పరిధి విస్తరించడానికి కారణం, 1917లో వచ్చిన రష్యా విప్లవం. రాజకీయ హక్కులతో సమానమైన ప్రతిపత్తిని ఈ విప్లవం ఆర్థిక, సాంఘిక హక్కులకు కలిగించింది. సాధారణ సభ, భద్రతా సమితి, ఆర్థిక, సాంఘిక మండలి, ధర్మకర్తృత్వ సంఘం, అంతర్జాతీయ న్యాయస్థానం, సచివాలయం ఐక్య రాజ్య సమితి ప్రధాన అంగాలు. వీనిలో ప్రత్యేకించి ఆర్థిక, సాంఘిక మండలి నిర్వర్తించే విధుల్లో జాతి, భాషా, మత, లింగ వివక్షణలేక ప్రపంచ ప్రజలందరికీ మానవ హక్కులు అనుభవించేట్లు చేయడం, రాజకీయేతర రంగాల్లో అభివృద్ధికి కృషిచేయడం, నివేదికలను తయారుచేయడం, అంతర్జాతీయ సమావేశాలను జరపడం. సమితి ప్రత్యేక అనుబంధ సంస్థలు చేస్తున్న కృషిని సమన్వయ పరచడం చేస్తుంది. ప్రత్యేక అనుబంధ సంస్థల్లో అంతర్జాతీయ కార్మిక సంఘం, అంతర్జాతీయ ద్రవ్య నిధి, అంతర్జాతీయ పునర్నిర్మాణ అభివృద్ధి బ్యాంక్, ఆహార వ్యవసాయ సంఘం, ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ విద్యా, వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ, అంతర్జాతీయ శిశు సంక్షేమ నిధి, అంతర్జాతీయ పౌర ఉపరితల వ్యవస్థ మొదలైనవి ప్రధానమైనవి.

లక్ష్యాలన్నింటిని సాధించడంలో పూర్తిగా విజయం సాధించకపోయినా, కొన్ని రంగాల్లో, ప్రత్యేకించి ఆరోగ్య, విద్యా రంగాల్లో ఐక్య రాజ్య సమితి ప్రముఖ పాత్ర వహిస్తోంది.

## 13.6 సార్వత్రిక భావాభివృద్ధికి భారతదేశ కృషి

భారతదేశ ప్రాచీన సంస్కృతిలో సార్వత్రిక భావం వేద కాలం నుండి ఆదర్శంగా వస్తోంది. ఉపనిషత్ వాక్యమైన "ఆత్మవత్ సర్వ భూతాని", వేద సూక్తులైన "సర్వేభద్రాణి పశ్యంతు మా కశ్చిత్ దుఃఖ భాక్ భవేత్": సుభాషిత వాక్యాలైన "అయం నిజః పరోవేత్తి", "గణనాలఘుచేతసాం", "ఉదార చరితా నాంతు", "వసుధైక కుటుంబకమ్" మొదలైనవన్నీ విశ్వ శ్రేయో భావాలను ప్రకటిస్తాయి. అందరిలో ఉండే ఆత్మ ఒకటేనని, అందరూ సుఖంగా ఉండాలని, దుఃఖం ఎవరికీ కలుగకూడదని, ఇతరులను చులకన చేయరాదని, ఉదార చరితులకు ప్రపంచమంతా కుటుంబమేనని ఇవి తెలుపుతున్నాయి. ఇవి విశ్వ భావనను ఒక ఆదర్శంగా చూపిన్పటికి, మధ్య యుగాల్లో మతం, కులం ప్రాధాన్యత పెరిగి, అంతరాలు అధికమయ్యాయి. ఆధునిక యుగ ఆరంభంలోనే, తిరిగి సంస్కరణ వాదం తలెత్తింది.

### 13.6.1 రాజా రామ్‌మోహన్ రాయ్ (1772 - 1833)

రాజా రామమోహన్ రాయ్‌ను సార్వత్రిక భావన కలిగిన మొట్టమొదటి ఆధునిక భారతీయునిగా ఎంచవచ్చును,

1. ఇతడు బహు భాషా ప్రవీణుడు, అరబిక్, పర్షియన్, సంస్కృతం, ఇంగ్లీష్, బెంగాలి, హిబ్రూ, గ్రీక్, లాటిన్, ఫ్రెంచ్ భాషలను అభ్యసించాడు. సంస్కృత పరిజ్ఞానం వల్ల భారతీయ సంఘంలోని మంచిచెడులను శాస్త్రరీత్యా పరిశీలించి, శాస్త్ర సమ్మతం కాని వాటిని మానిపించడానికి, నూతన మార్పులు తేవడానికి కృషి చేశాడు. ప్రపంచంలో వస్తున్న నూతన మార్పులను ఆమోదించి, స్వాగతం పలికాడు. పాశ్చాత్య దేశ భావాలకు, భారతీయ సంస్కృతిని సమన్వయం చేసి, ఆధునిక యుగారంభకుడయ్యాడు.

2. రామ్‌మోహన్ సమకాలీన సంప్రదాయాలను క్షుణ్ణంగా పరిశీలించి, వానిలోని సామాన్య లక్షణాలను గమనించి, 1828లో బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. ఉపనిషత్తులను ఆధారంగా చేసికొని, హిందూ

BRAOU

మతంలోని విగ్రహారాధనను, కుల వ్యవస్థను కాదన్నాడు. భగవంతుని పితృత్వాన్ని అంగీకరించే అందరూ, మానవాళి సౌభ్రాతృత్వాన్ని అంగీకరించక తప్పదని తెలిపాడు. ఈ విధంగా మానసికారాధనను ప్రబోధించడం ద్వారా, ఇతర మతాలతో సమన్వయం చేయగలిగాడు. తులనాత్మకంగా హిందూ, ఇస్లామిక్, బౌద్ధ, క్రైస్తవ మతాలను పరికించి, వానిలోని సామాన్య లక్షణాలను క్రోడీకరించి బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు.

3. రాజకీయ అవగాహనను, నూతన మత దృక్పథాన్ని పెంచుకోవడంతోబాటు, సంఘసంస్కరణలో ముందంజ వేశాడు. ఆంగ్ల విద్య ప్రవేశాన్ని, సతీసహగమన నిషేధాన్ని బలపరచడం ద్వారా, భారతదేశంలో ఉదార వాదానికి స్వాగతం పలికి, పాశ్చాత్యుల మన్ననలను సైతం పొందాడు. విలియం రథ్ బోన్, (William Rath bone), విలియం రస్కో (William Roscoe), సప్‌ఝెయిం (Supzhaim) లతో మాత్రమేగాక, ఎస్టిన్ (Estin), కార్పెంటర్స్ (Carpentors), ఫాక్సెన్ (Faksen) కుటుంబాలతో స్నేహం చేశాడు. మాంచెస్టర్ వెళ్ళినప్పుడు అక్కడ ఫ్యాక్టరీల్లో పనిచేసే స్త్రీలు, పురుషులు, పిల్లలతో సంభాషించి, సంస్కరణ ఆవశ్యకతను తెలియజేశాడు. జెరిమి బెంథామ్‌ను (Jereme Benthalm) కలిసినప్పుడు, అతడు రామ్ మోహన్‌కు పార్లమెంట్‌కి పోటీ చేయవలసిందని పేర్కొన్నాడు. దీనివల్ల భారతీయ స్థితిగతులు మెరుగుపడతాయని అతడు ఆశించాడు. ఇటువంటి గౌరవం రామమోహన్‌కు దక్కింది. టోరీలు, విగ్గులతో పరిచయం పెంచుకున్న రామ్‌మోహన్ సంస్కరణ బిల్లును వ్యతిరేకిస్తున్న టోరీలను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని సూటిగానే ప్రశ్నించాడు. లార్డ్ బ్రోఘుం (Lord Brougham) బానిసత్వ వ్యతిరేకి, విద్యావ్యాప్తి యందు ఆసక్తి గలవాడు. అతడు త్వరలోనే రామ్‌మోహన్ స్నేహితుడయ్యాడు.

4. ఐరోపా పర్యటనకు, సముద్రయానం చేయ తలపెట్టిన ఆధునిక యుగ తొలి భారతీయుడు రామ్ మోహనే. ఢిల్లీ రాజైన రెండో అక్బర్‌కు ఇచ్చే ధనాన్ని పెంచమని బ్రిటిష్ రాజును అడిగే నిమిత్తం, అక్బర్ "రాజా" బిరుదాన్ని రామ్‌మోహన్‌కు ఇచ్చి, నవంబర్ 19, 1830న స్టీమర్‌లో పయనం చేయించాడు. ఈ లక్ష్యంతో బాటే, రామ్‌మోహన్‌కు ఇతర ధ్యేయాలు కూడా ఉన్నాయి. కామన్స్ సభ వారికి సతీ సహగమన నిషేధంపై అర్జీ ఒకటి ఇవ్వాలని, 1832లో పార్లమెంట్‌కు వస్తున్న సంస్కరణ బిల్లు కాలానికి అక్కడే ఉండాలని, తూర్పు ఇండియా వర్తక సంఘం వారి ఛార్టర్‌ని పొడిగించే అంశంపై సాగే చర్చలను గమనించాలని అతడు భావించాడు.

ఇంగ్లాడ్ పార్లమెంట్‌లోని లార్డ్స్ సభకు రామ్‌మోహన్ వెళ్ళినప్పుడు, సభా పరిచయం కింబర్లాండ్ డ్యూక్ (Kimberland Duke) చేశాడు. లండన్‌లో ఇతడు పొందిన మరో గౌరవం ఏమిటంటే, నాలుగో విలియం సింహాసనం అధిష్టించే సమయాన ఐరోపాలోని రాయబారుల సరసన కూర్చోవడం; ఆ తరువాత ఆ రాజుతో సమావేశం కావడం; వలస పాలనలో ఉన్న భారతదేశపు సాంస్కృతిక రాయబారిగా మన్నన పొందడమే గాక, వారి కష్టాలను నివేదించాడు. మొగలాయీ చక్రవర్తికిచ్చే మనోవర్తిని పెంచమని మాత్రమేగాక, భారతీయ రైతుల బాధలను సైతం తెలియజేసాడు.

ఇతర దేశాల్లో వస్తున్న మార్పులను అధ్యయనం చేయడం, విశ్వ స్వేచ్ఛను కోరడం, మార్పులకు అనుగుణంగా స్పందించడం రాజా రామ్‌మోహన్‌లోని మరో లక్షణం. లండన్ ప్రయాణ మధ్యలో ఒక ఫ్రెంచ్ ఓడ తన మూడు వన్నెల జండాతో వస్తుండగా చూసిన రామ్‌మోహన్ ఉత్సాహంతో ఆ ఓడలోనికి వెళ్ళి, వారిని పలుకరించి, స్వతంత్ర ఫ్రాన్స్ దేశం వర్ధిల్లాలని ఆకాంక్షించాడు. ఫ్రెంచ్ విప్లవం గురించి అతడు తెలుసుకొని ఉండడం, వారి ఆదర్శాలను అతడు ఆమోదించడం దీనికి కారణం. ఇంగ్లాండ్‌లో సంస్కరణ బిల్లులు రెండుసార్లు తిరస్కరించబడ్డాయి. రాజా రామ్‌మోహన్ రాయ్ అక్కడికి వెళ్ళినప్పుడు సంస్కరణ బిల్లు మూడవసారి

పార్లమెంట్‌లో చర్చించబడుతోంది. జూన్ 1832లో అది చట్టమైనప్పుడు, రాజా రామమోహన్ రాయ్ తన సంతోషాన్ని విలియం రథ్ బోన్‌కు, ఈ విధంగా తెలియజేసాడు. ప్రజా నాశనం కోరే కొద్దిమంది స్వార్థపరులకు జాతి బలికాకూడదని, జాతి మాత్రమే గాక, మొత్తం ప్రపంచ అమితమైన ఆనందాన్ని పొందే ఈ సమయాన తాను హృదయపూర్వకంగా ఆనందిస్తున్నట్లు తెలిపాడు. వర్తక సంస్థకు పరిపాలనాధికారాలు ఉండరాదని, విదేశీ అయినా, ఒక ఉన్నతమైన ప్రభుత్వంలో ప్రజలు, వారి ప్రతినిధులు సంప్రదించే ప్రభుత్వం కావాలనే అతడు ఆకాంక్షించాడు. దక్షిణ అమెరికాలోని స్పెయిన్ వలసలు విముక్తి పొందినపుడు రాజా రామ్‌మోహన్ తన స్నేహితులకు భారతదేశంలో విందు చేశాడు. ఆ సందర్భంగా మాట్లాడుతూ, అతడు మతం, భాష, ఆసక్తిలు వేరే అయినా, తోటి ప్రజల కష్టాలకు స్పందిస్తున్నట్లు తెలిపాడు. (What? aught I to be insensible to the sufferings of my fellow creatures, where ever they are, or howsoever unconnected by interests, religion or language?) ఎడిన్‌బరో మాగజైన్ 1823లో వ్యాఖ్యానిస్తూ, దక్షిణ అమెరికా విముక్తి పోరాటంలో అతడు చూపిన ఉత్సాహం, ఆసక్తి అతడి మానసిక గొప్పతనాన్ని, వైశాల్యాన్ని చాటుతుందని తెలియజేసింది.

టర్కులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యానికై పోరాడుతున్న గ్రీక్‌లకు అతడు తన మద్దతును తెలియజేశాడు. పోర్చుగల్‌లో, రాజ్యాంగ ప్రభుత్వ ఏర్పాటుకు సంతసించాడు. నేపుల్స్ నగరంలో ప్రజానురంజకమైన రాజ్యాంగ ప్రభుత్వం కావాలని, 1820-21 మధ్య జరిగిన విప్లవంపట్ల ఆసక్తిని చూపాడు. కాని అది విఫలమై, మోరెల్లి, సిల్వటి అనే ఇరువురు నాయకులు ఉరి తీయబడినప్పుడు రామ్‌మోహన్ వ్యధ చెందాడు. బకింగ్‌హాం ఇస్తున్న విందుకు అతడు వెళ్ళలేదు. కారణాన్ని తెలియజేస్తూ తన మనస్సు, అప్పుడే విన్న ఐరోపా వార్తవల్ల విచలితమైనదని, నేపుల్స్ వారి ధ్యేయాన్ని తన ధ్యేయంగాను, వారి శత్రువులను తన శత్రువులుగాను భావిస్తున్నానని తెలుపుతూ, చిరవగా స్వేచ్ఛకు శత్రువులు, నియంతృత్వానికి మిత్రులు ఎప్పటికీ విజయులు కాలేరని తెలిపాడు. (My mind is depressed by the late news from Europe ... under these circumstances, I consider the cause of the Neopolitans as my own the their enemies as ours. Enemies to liberty and friends of despotism have never been and never will be ultimately successful)

ఐర్లాండ్‌లోని విప్లవంపట్ల కూడా రామమోహన్ ఆసక్తి చూపాడు. అక్కడ కరువు ఏర్పడినప్పుడు సహాయాన్ని అందజేసాడు. ఐర్లాండ్‌లోని కాథలిక్కుల పట్ల బ్రిటిష్ వైఖరిని 1822 నాటి 'మిరట్' పత్రికలో నిశితంగా విమర్శించాడు.

రాజా రామ్‌మోహన్ రాయ్ ఫ్రాన్స్‌లోని టాలీరాండ్ (Tallyard) కు డిసెంబర్ 26, 1831న జాబు రాస్తూ, దేశాల మధ్య పాస్‌పోర్టులు ఇవ్వడంలో అనుమానాలు ఉండరాదని, వ్యక్తి స్వాతంత్ర్యాన్ని గౌరవించాలని తెలియజేసాడు. ఆసియా దేశాల్లో అటువంటి నిబంధన లేదని, మర్యాదకు, ఉదారతకు పేరొందిన ఫ్రెంచ్‌వారు ఇటువంటి నిబంధనలను ఎందుకు పాటించాలని, మానవులందరూ ఒకే కుటుంబానికి చెందినవారని తెలిపాడు. అదే జాబులో అన్ని దేశాలు కనుక ఒక సభ అధికారానికి లోబడి ఉన్నట్లైతే, సమస్యలను తేలికగా పరిష్కరించుకోవచ్చని, ఆ సభలో అన్ని దేశాలు సమాన సంఖ్యలో సభ్యులను పంపవచ్చని, ప్రతి సంవత్సరం ఆ సభకు అధ్యక్షునిగా ఒక్కొక్క దేశం ఉండవచ్చని సూచించాడు. ఈ విధంగా ఒక అంతర్జాతీయ సంస్థను ఊహించగలిగాడు.

ఈ విధంగా రాజా రామ్‌మోహన్ రాయ్ విశ్వ భావనలను కలిగి, సమకాలీనులచే ప్రపంచ పౌరునిగా పరిగణించబడినాడు. ఏకేశ్వరోపాసన ద్వారా సమైక్యతను, సాంస్కృతిక సంబంధమైన సమన్వయం ద్వారా అంతర్గత ఐక్యతను సాధించవచ్చని ఆయన భావించాడు. వ్యక్తి స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, స్త్రీల హక్కులకై పోరాడాడు.

మూఢ సాంప్రదాయాలనుండి విముక్తి పొందిన సంస్కర్తగాను, అపార విజ్ఞానాన్ని ఆర్జించిన జిజ్ఞాసువుగాను ఖ్యాతి గడించాడు.

### 13.6.2 రవీంద్రనాథ్ ఠాగూర్ (1861-1941)

రాజా రామ్‌మోహన్ రాయ్ తరువాత విశ్వ భావనను అద్భుతంగా సృజనాత్మక రీతిలో వ్యక్తం చేసిన వ్యక్తి రవీంద్రనాథ్ ఠాగూర్. ఏకేశ్వరారాధనలో నమ్మికగల రవీంద్రుడు సాహిత్య, సంస్కరణ రంగాల్లో విశ్వ భావనను పెంపొందించాడు. అనేక బ్రహ్మ గీతాలను రచించి, బ్రహ్మ సమాజాన్ని పరిపుష్టం చేశాడు. రామ్ మోహన్‌రాయ్‌కు భిన్నంగా రవీంద్రుడు జాతియోద్యమంలో ప్రభావితుడై, తన కవితలతో ఆ ఉద్యమాన్ని ఉత్తేజపరిచాడు. విశ్వకవిగా, ప్రముఖ విద్యావేత్తగా పేరొందిన ఇతడు అంతర్జాతీయ సమైక్యతలో అచంచల విశ్వాసాన్ని చూపాడు. వివిధ జాతుల మధ్య దురాక్రమణలను ఖండించాడు. భారత సందేశాన్ని, ప్రాచీన భారత సాంస్కృతిక వైభవాన్ని ఆయన ఇతర దేశాలకు వినిపించాడు. ఆయన కవితలోని సార్వత్రిక విలువలు ఆయనను ప్రపంచ కవిగా మార్చాయి.

రవీంద్రుడు సత్యం, శివం, సుందరం అనే భావాన్ని నమ్మినవాడు. ప్రపంచ మనస్సును మంత్రముగ్ధం చేసినదానిగా భారతదేశాన్ని ఠాగూర్ భావించాడు. విశ్వ సౌందర్యం, ఆధ్యాత్మిక సమైక్యతలను ప్రబోధించాడు. భగవంతుని పురుషోత్తమునిగా భావించినవాడు. భగవత్ ప్రేమతత్వాన్ని గీతాంజలి ద్వారా ప్రబోధించాడు. భగవంతుని ఉనికిని, దివ్యానందాన్ని ప్రకటించే సాధనాలుగా ప్రకృతిని ఇతడు భావించాడు. జీవిత ప్రారంభంలో పాశ్చాత్య కవులైన షెల్లి, కీట్స్, బ్రౌనింగ్‌ల వల్ల ఉత్తేజితుడైనప్పటికీ, ఆయన భావోద్వేగపు వ్రేళ్ళు భారతీయ సంస్కృతిలోనే ఉన్నాయి. మానవ ప్రయత్నంతో సమాజాన్ని మెరుగుపర్చవచ్చని ఆయన భావించాడు. వ్యక్తి వాదానికి ప్రాముఖ్యతనిచ్చాడు. న్యాయం స్వేచ్ఛల విలువలను ఆచరించినప్పుడే, జాతులు బలపడగలవని విశ్వసించాడు. నైతిక విలువలను నిర్లక్ష్యం చేయరాదని తెలిపాడు.

మానవ జాతి సమైక్యతలోనే "మానవ మతం" ఉంటుందని ఆయన భావించాడు. అన్ని జాతుల హృదయాల కలయికను ఆయన కోరాడు. జాతుల మధ్య వైషమ్యాల వల్ల మానవజాతికి ఉపద్రవం సంభవిస్తుందని, అందుచేత సామాజిక సహకారం, అంతర్జాతీయ పరస్పరత, ఆధ్యాత్మిక ఆదర్శవాదాలు ఉండాలని అభిలషించాడు. జాతీయ రాజ్యాల పరిధిని దాటి, ఆధ్యాత్మిక సౌభ్రాతృత్వాన్ని చాటే "మహామానవ సమాఖ్య" (Great Federation of Men) ను ఊహించాడు. పాశ్చాత్య ఉదార భావాలను అభినందించినప్పటికీ, వారు ఆసియా, ఆఫ్రికా దేశాల్లో సాగిస్తున్న దోపిడి విధానాన్ని, జాతి వైషమ్యాలను విమర్శించాడు. టోక్యో విశ్వవిద్యాలయంలో 1916లో మాట్లాడుతూ, ఆయన చైనా, సయాం, భారతదేశాలు స్వాతంత్ర్యం పొందవలసిన ఆవశ్యకతను గురించి ఉపన్యసించాడు. ప్రేమ, శాంతిని ప్రబోధిస్తూ, పాశ్చాత్య, భారతదేశ మిత్రత్వాన్ని అభిలషించాడు. విశ్వమానవ మనస్సుకు, వ్యక్తి మనస్సులో ఉన్న అదే మనస్సుకు గల శాశ్వత సంఘర్షణను శాస్త్రీయ విజ్ఞానం, తత్వ శాస్త్రం నిరంతరం సమన్వయం చేసే ప్రయత్నం చేస్తాయని అంటాడు. గీతాంజలిలో ఒక చోట తన దేశాన్ని ప్రపంచ అడ్డుగోడలులేని విశాల ప్రదేశంలో మేలుకొమని ఉద్బోధించాడు. ఆధ్యాత్మిక మానవతా వాదం పునాదిపై అతడు అంతర్జాతీయ పరస్పరత, సామాజిక సహకారం, ఆధ్యాత్మిక ఆదర్శ విలువలు ఉండాలని ఆశించాడు.

### 13.6.3 వివేకానందుడు (1893-1903)

పూర్వాశ్రమంలో నరేంద్రనాథ దత్త పేరుగల స్వామి వివేకానంద ప్రధానంగా ఆధ్యాత్మికవాది అయినప్పటికీ, అతడు సెప్టెంబర్ 1893లో చికాగోలో జరిగిన సర్వ మత మహా సభలో పాల్గొని, హిందూ మత ఔన్నత్యాన్ని గూర్చి

ప్రసంగించి, పాశ్చాత్య ఆధికత్యపై ఎదురుదాడి చేసి, విశ్వమానవ దృష్టిని ఆకర్షించాడు. నైతిక, సాంఘిక అభ్యున్నతిని ఆకాంక్షించాడు. భారతదేశ ఆధ్యాత్మిక ధ్యేయంలో విశ్వాసం ఉంచవలసిందిగా యువతకు ఇతడు ప్రబోధించడంతో, మానవేంద్ర రాయ్ "వివేకానందుని జాతీయ వాదం, ఆధ్యాత్మిక సామ్రాజ్య వాదమని" పేర్కొన్నాడు. సాహిత్యం, తత్వాలపై స్పష్టమైన అవగాహన కలిగిన ఇతడు భారతీయులు ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఇతరులకు పంచాలని, పాశ్చాత్య దేశాల భౌతిక వనరులను భారతదేశ అభివృద్ధికి ఇవ్వాలని కోరాడు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, వాటిని పదిలపర్చుకోవలసిన ఆవశ్యకత గురించి అతడు అనేకసార్లు తెలిపాడు. బలం, భయంలపై యుద్ధాన్ని ప్రకటించి, ప్రజలను ధైర్యవంతులుగాను, శ్రమజీవులుగాను, మలిచే ప్రయత్నం చేశాడు. భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాన్ని చేరువయే దశలోనూ, ఆ ప్రయత్నంలో ఉన్న ఇతరులకు సహాయం చేయడం ఉత్తమ అవకాశంగా భావించి, ఈ ప్రయత్నంలో అడ్డువచ్చే అవరోధాలను అధిగమించి, స్వేచ్ఛా పథంలో మానవులు పురోగమించడానికి అవసరమయ్యే వ్యవస్థలను ప్రోత్సహించాలని అన్నాడు. ధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని, మంచితనాన్ని మేలుకొలిపిన వివేకానందుడు ఆధ్యాత్మిక, ఆధిక్య భావాన్ని ప్రబోధించాడు. హిందూ మతాన్ని విశ్వజనీన సందేశంగా ప్రచారం చేశాడు. క్రైస్తవ మత ప్రచారాన్ని, పాశ్చాత్య సామ్రాజ్య వాదాన్ని తీవ్రస్థాయిలో ఎదిరించి, భయరహిత, సమాన అవకాశాలు గల సమాజాన్ని కోరాడు.

### 13.6.4 అరవింద యోగి (1872 - 1950)

అరవిందుడు జాతీయోద్యమంలో అతివాదిగా ఉండి, యోగసాధన చేసి, భారతదేశ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రచారం చేశాడు. ఆయన రచించిన 'ది లైఫ్ డివైన్' (The Life Divine), 'సావిత్రి' (Savithri) మేధావులను ఆకర్షించాయి. మానవ ఉత్తమ లక్షణాలను ప్రబోధించి, విశ్వమానవ కళ్యాణానికి భారతజాతి తోడ్పడాలని తెలిపాడు. 'ది ఐడియల్ ఆఫ్ హ్యూమన్ యూనిటీ' (The Ideal of Human Unity) అనే గ్రంథంలో ప్రపంచ సమాఖ్య ద్వారా, మానవ జాతి సమైక్యం కావలనీ, అటువంటి మార్పుకు ఆధ్యాత్మిక పునాదులు కలిగిన మతం, అంతర్గత ఐక్య భావమూ కావాలని అన్నాడు. అసాధారణ మేధా శక్తి కలిగిన ఆధ్యాత్మిక యోగిగా ఆయన ప్రపంచ వ్యాప్తంగా పేరుపొందాడు. భారతీయ పారలౌకిక తత్వాన్ని, పాశ్చాత్య భౌతిక వాదాన్ని సమన్వయం చేసే యత్నం చేశాడు.

### 13.6.5 జవహర్‌లాల్ నెహ్రూ (1889-1964)

అగ్రశ్రేణి జాతీయ వాదిగా, ప్రజాస్వామ్యవాదిగా, లౌకికవాదిగా, ఆదర్శవాదిగా జవహర్‌లాల్ ప్రపంచంలోనే ప్రముఖ భావుకత కలిగిన నాయకుల్లో ఒకరు. పాశ్చాత్య ప్రభావం ఈయన పై అధికంగా ఉన్నప్పటికి, గాంధీ మహాత్మునితో గల సన్నిహిత సంబంధం భారతీయ ప్రభావాన్ని ప్రసరించింది. ఆయన రష్యా పర్యటనలు, సామ్యవాద సిద్ధాంతం వైపు ఆకర్షింపబడడం జరిగినా, ప్రధానంగా వ్యక్తి స్వేచ్ఛపట్ల మొగ్గుచూపాడు. దయానందుడు, వివేకానందుడు, అరవిందుడు ప్రవచించిన మత, జాతీయ వాదాన్ని ఆయన అంగీకరించలేదు. బ్రస్సెల్స్‌లో 1927లో సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా జరిగిన సదస్సులో ప్రముఖ పాత్ర వహించాడు. ప్రపంచ జాతులన్నీ ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయని నమ్ముతూ, జాతి విచక్షణా భావాన్ని ఖండించాడు. అలీన విధానానికి పునాదివేసి, మూడో ప్రపంచ దేశాల నాయకత్వానికి భారతదేశాన్ని మలచాడు.

## 13.7 సంగ్రహంగా

విశ్వమంతటిని ఒక కుటుంబంగా భావించగలగడం, జాతి, దేశం, మత విభేదాలనుండి ఎదగడం; ఉదాత్త మానవ విలువలను సార్వత్రిక విలువలుగా ఎంచి గౌరవించడం, సార్వత్రిక వాదానికి అర్థం. అనాది నుండి పాశ్చాత్య, భారతదేశాల్లో ఈ భావం ఎలా ఉందో, ఎలా కాలానుగుణంగా మార్పు చెందుతూ వచ్చిందో గమనించాం. ఆధునిక భారతదేశ విశ్వ భావనకు ప్రతీకలుగా ఉన్న రాజా రామ్‌మోహన్ రాయ్, రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి వివేకానంద, అరవింద యోగి, జవహర్‌లాల్‌లను గూర్చి తెలుసుకున్నారు.

BRAOU

## 13.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. సార్వత్రిక వాదం అనే పదానికి అర్థం తెలిపి, పాశ్చాత్య దేశాల్లో ఏ విధంగా విస్తరించిందో తెలియజేయండి.
2. భారతదేశంలో సార్వత్రిక వాదం ఏ విధంగా అభివృద్ధి చెందిందో తెలియజేయండి.
3. ఐరోపాలో జరిగిన మానవ హక్కుల ప్రకటనలను, వాని ప్రాముఖ్యతను తెల్పండి.

II. క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలు రాయండి

1. ఏఏ అంశాలు విశ్వ భావనను ప్రోత్సహిస్తాయి?
2. ఐరోపా తత్వవేత్తలగు సిసిరో, డాంటేల కృషిని తెల్పండి.
3. రాజా రామ్‌మోహన్ రాయ్ ఏ విధంగా సార్వత్రిక భావనకు ప్రతీకగా నిలుస్తాడు.
4. అమెరికా ప్రకటించిన స్వాతంత్ర్య ప్రకటన ప్రాముఖ్యతను తెల్పండి.

## 13.9 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Ebenstein William | — | **Great Political Thinkers** |
| Jamuna Nag | — | **Raja Rammohan Roy** |
| Natarajan S. | — | **A century of Social Reform in India** |
| Sarma G.N. & Dr. Moin Shakir | — | **Politics and Society from Rammohan to Nehru** |
| Parkes H.B. | — | **History of U.S.A.** |
| Encyclopaedia Britannica | — | **Vols. 5, 7 & 21.** |
| Encyclopaedia of Social Sciences | — | **Vol. 6** |
| యం.ఎస్.ఆర్ ఆంజనేయులు (సం. వై. శ్రీరామమూర్తి) | - | **ఆధునిక ఐరోపా చరిత్ర 1789-1878** |
| యం.వి. సుబ్బారావు (సం. కె. కమలనాథన్) | - | **ఆధునిక పాశ్చాత్య రాజనీతి తత్వ విచారం** |
| సీతారామశర్మ | - | **ఆధునిక భారత రాజకీయ సామాజిక తత్వ విచారం** |


**రచయిత్రి – ఆచార్య పి. రామలక్ష్మి**

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం – సామాజిక శాస్త్రాల విభాగం

## రెండవ సంవత్సరం

### పాఠ్య ప్రణాళిక

### కోర్స్ - 2 ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర

| | | |
|---|---|---|
| **ఖండం - I** | **:** | **18వ శతాబ్దంలో భారతదేశ సామాజిక చరిత్ర** |
| భాగం - 1 | : | సామాజిక వ్యవస్థ |
| భాగం - 2 | : | మత వ్యవస్థ |
| భాగం - 3 | : | విద్యా వ్యవస్థ |
| **ఖండం - II** | **:** | **సైద్ధాంతిక ప్రభావం** |
| భాగం - 4 | : | ప్రాచ్య వాదం (Orientalism) ఇవాంజిలిజం (Evangelism) ఉపయోగితా వాదం (Utilitarianism) |
| భాగం - 5 | : | సామాజిక చట్టాలు |
| భాగం - 6 | : | విద్యాభివృద్ధి |
| భాగం - 7 | : | పత్రికారంగ ప్రగతి |
| భాగం - 8 | : | సాంస్కృతిక, వైజ్ఞానిక అంతర్లీనతలు |
| **ఖండం - III** | **:** | **నూతన భావజాలం** |
| భాగం - 9 | : | హేతు వాదం (Rationalism) |
| భాగం - 10 | : | మానవతా వాదం (Humanism) |
| భాగం - 11 | : | ఉదార వాదం (Liberalism) |
| భాగం - 12 | : | ప్రత్యక్ష జ్ఞాన వాదం (Positivism) |
| భాగం - 13 | : | సార్వత్రిక వాదం (Universalism) |
| **ఖండం - IV** | **:** | **మత సంస్కరణలు** |
| భాగం - 14 | : | కార్యక్రమం, ప్రభావం, భావాలు |
| భాగం - 15 | : | ప్రాంతీయ భేదాలు, ఉద్యమాల సామాజిక పునాది |
| భాగం - 16 | : | సామాజిక ఇబ్బందులు, పునరుద్ధరణ, లౌకికత్వం |
| **ఖండం - V** | **:** | **సంఘ సంస్కరణలు** |
| భాగం - 17 | : | మహిళా విమోచన |
| భాగం - 18 | : | కుల ఉద్యమాలు |
| భాగం - 19 | : | అస్పృశ్యత |
| భాగం - 20 | : | సామాజిక దృష్టి |
| **ఖండం - VI** | **:** | **సామాజిక మార్పు** |
| భాగం - 21 | : | వ్యవస్థాగత మార్పులు |
| భాగం - 22 | : | సామాజిక సంస్థల మార్పులు |
| భాగం - 23 | : | భావజాలంలోని మార్పులు |

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కార్యక్రమం

### మాదిరి పరీక్షా పత్రం

### కోర్స్ - 2 ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర

సమయం : 3 గంటలు మార్కులు : 100

**భాగం - ఎ ( మార్కులు 4 × 15 = 60)**

**ఈ క్రింది ఎనిమిది ప్రశ్నల్లో ఏ నాలిగింటికైనా వ్యాసరూప సమాధానాలు రాయండి. ప్రతి ప్రశ్నకు 15 మార్కులు**

1. 18వ శతాబ్దంనాటి భారతదేశ మత పరిస్థితులను తెల్పి, భిన్న మతాల మధ్య నెలకొన్న సహనశీలతను పరిశీలించండి.
2. ప్రాచ్య వాదాన్ని వివరించి, భారతదేశ పునర్నిర్మాణంలో దాని ప్రభావాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించండి.
3. భారతదేశంలో దేశీయ పత్రికల ఆవిర్భావాన్ని తెల్పి, పత్రికారంగంలో ఏర్పడిన వివిధ సంఘాల సిఫారసులను క్లుప్తంగా వివరించండి.
4. హేతు వాదం అంటే ఏమిటో పేర్కొని, ఆ భావ విస్తరణకు పాశ్చాత్య తత్వవేత్తల కృషిని అంచనా వేయండి.
5. ఉదార వాదం అంటే ఏమిటి ? దాన్ని ప్రభోదించిన ప్రముఖులు, వారి సిద్ధాంతాలను గూర్చి కూలంకషంగా చర్చించండి.
6. 19వ శతాబ్దంలో వివిధ మతాల్లో వచ్చిన సంఘ సంస్కరణ కార్యక్రమాలను పేర్కొని, దాని పర్యవసానంగా కలిగిన ఇబ్బందులను విమర్శనాత్మకంగా విశ్లేషించండి.
7. బ్రిటిష్ పాలన ఫలితంగా భారతదేశంలో ఏర్పడ్డ నూతన సామాజిక వర్గాలను గూర్చి తెలియచేయండి.
8. ఆధునిక భారతదేశ సమాజంలో కుటుంబ, వివాహ వ్యవస్థల్లో వచ్చిన మార్పులను విమర్శనాత్మకంగా పరిశీలించండి.

**భాగం - బి (మార్కులు 5 × 8 40)**

**ఈ క్రింది ప్రశ్నల్లో ఏ ఐదింటికైనా లఘువ్యాఖ్యలను రాయండి. ప్రతి ప్రశ్నకు 8 మార్కులు**

9. భారతదేశంలో 18వ శతాబ్దం నాటి విద్యా వ్యవస్థ రూపురేఖలను వర్ణించండి.
10. 18వ శతాబ్దంలో మహిళోద్ధరణను ఉద్దేశించి చేసిన సామాజిక శాసనాలేవి ?
11. సామాజిక భాషా ప్రయుక్త చట్టం (Veruaculas Press Act)
12. ఆగస్ట్ కాంట్ సామాజిక శాస్త్రాల అభివృద్ధికై ఏవిధంగా కృషి చేశాడు?
13. సాంస్కృతిక పునరుజ్జీవనం ఫలితంగా 19వ శతాబ్దపు భారత మేధావుల్లో కలిన సాంఘిక ఆలోచనలను పరిశీలించండి.
14. 'రాజా రామ్‌మోహన్ రాయ్ సార్వత్రిక విశ్వ భావనకు ప్రతీక' వివరించండి.
15. నిరంకారీ, నామ్‌ధారీ ఉద్యమాలను గూర్చి మీకు తెలిసిందేమిటి ?
16. సత్యశోధక మండలి లక్ష్యాలు, కార్యక్రమాలను గూర్చి రాయండి.
17. ఆధునిక యుగంలో స్త్రీలలో వచ్చిన చైతన్యం, స్త్రీల ఉద్యమాలను సంగ్రహంగా సమీక్షించండి.
18. ఆధునిక భారతదేశంలో పాశ్చాత్యీకరణ గూర్చి చర్చించండి.

BRAOU

## డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కార్యక్రమం

## కోర్స్ - 2 ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర

### అభ్యాసం - 1

గమనికలు :
- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబునకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

### భాగం - ఏ

**I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. 18వ శతాబ్దం నాటి భారతదేశ సామాజిక వ్యవస్థలో కుల వ్యవస్థ పరిణామ క్రమాన్ని తెల్పి, సామాజిక వ్యవస్థపై దాని ప్రభావాన్ని అంచనా వేయండి.
2. ఆంగ్లేయ పాలన ప్రభావంగా భారతదేశ విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులేట్టివి ? ఈ మార్పులకై ఆంగ్లేయులు నియమించిన ప్రముఖ సంఘాలను, వాటి సిఫారసులను సంగ్రహంగా సమీక్షించండి.

### భాగం - బి

**II క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ఉపయోగితా వాదం అంటే ఏమిటి ? భారతదేశ చరిత్రపై దాని ప్రభావాన్ని చర్చించండి.
2. 18వ శతాబ్దంలో మహిళోద్ధరణనుద్దేశించి చేయబడిన సామాజిక శాసనాలను పరిశీలించండి.

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కార్యక్రమం

కోర్స్ - 2 ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర

## అభ్యాసం - 2

గమనికలు :
- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబునకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

### భాగం - ఎ

I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. 19వ శతాబ్దంలో ఆధునిక భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవన ఆవిర్భావాన్ని తెల్పి, మత, సాంఘిక, సాంస్కృతిక రంగాలపై దాని ప్రభావాన్ని పరిశీలించండి.
2. ప్రత్యక్ష జ్ఞాన వాదమంటే ఏమిటి ? దీని అభివృద్ధి క్రమంలో ఆగస్ట్ కాంట్ చేసిన కృషిని అంచనా వేయండి.

### భాగం - బి

II క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. హేతు వాదం అంటే ఏమిటో తెల్పి, దీనిపై పాశ్చాత్య తత్వవేత్తలు చేసిన వివరణలను క్లుప్తంగా విశ్లేషించండి.
2. 19వ శతాబ్దంలో వచ్చిన భారతీయ పునరుజ్జీవన వైఖరులను సమీక్షించండి.

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కార్యక్రమం

## కోర్స్ - 2 ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర

### అభ్యాసం - 3

*గమనికలు :*

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబునకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తక తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

### భాగం - ఎ

I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. దక్షిణ భారతదేశంలో కుల వ్యతిరేక ఉద్యమాల ప్రగతి, పరిణామ క్రమాన్ని సమీక్షించండి.
2. బ్రిటిష్ పాలనలో భారతదేశ సామాజిక వ్యవస్థలో నూతన సామాజిక వర్గాల ఆవిర్భావాన్ని, మారు విశ్లేషించండి.

### భాగం - బి

II క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. దళిత వర్గాలకు డా. బి. ఆర్. అంబేద్కర్ చేసిన సేవలను వర్ణించండి.
2. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారతీయుల్లో ప్రబలిన జాతీయ భావాల పెంపుదలను పరిశీలించండి.

BRAOU

# అందరికీ అందుబాటులో
# ఉన్నత విద్య




డా॥ బి.ఆర్. అంబేద్కర్

## సార్వత్రిక విశ్వవిద్యాలయం

రోడ్ నెం : 46

జూబ్లి హిల్స్, హైదరాబాద్ - 500 033

M.A.H(F)B-2

# చరిత్ర

## 2



Dr.B.R.Ambedkar Open University, Hyderabad

BRAOU

# చరిత్ర

## ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర

ఖండాలు : IV – VI

BRAOU

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

**2004**

# రచయితల బృందం

**సంపాదకుడు**

ఆచార్య వి. రామకృష్ణ

**సహ సంపాదకులు**

ఆచార్య వి. రామకృష్ణారెడ్డి

కుమారి ఇ. సుధారాణి

**రచయితలు**

ఆచార్య బి. కేశవనారాయణ

ఆచార్య పి. రామలక్ష్మి

శ్రీ ఎ.వి. కోటిరెడ్డి

**ముఖచిత్రం**

చంద్ర

B R A O U

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్.

ప్రథమ ముద్రణ : 1997 **2002** 2004

© 1997 డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. పుస్తకంలోని ఏ భాగాన్నైనా ఉపయోగించదల్చుకొంటే, విశ్వవిద్యాలయ అనుమతిని పొందాలి. ఈ పు విశ్వవిద్యాలయ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ఒక భాగం.

ఇతర వివరాలకు : డైరక్టర్ (అకడమిక్) డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రోడ్ నెం జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500 33. ఆం. ప్ర.

Printed by : Siddeshwar Printers, Market Street, Secunderabad - 500 003.

Lr. No.965/Dr.BRAOU/DMP/PTG/F.No.38/J.O.276/Dt: 07-09-2004 - 200 Co

# పరిచయం

మానవుని నిరంతరాభ్యుదయాన్వేషణ కృషిలోని అనుభవాల సంపుటీకరణమే చరిత్ర. ఇటీవలి కాలంలో, చరిత్ర పరిశోధనలో సాంప్రదాయబద్ధమైన రాజకీయ చరిత్ర నుండి సామాజిక చరిత్ర వైపు దృష్టి మరలుతూ వచ్చింది. భారతదేశ సామాజిక చరిత్ర మానవ జాతి చరిత్రలో అత్యంతాకర్షణీయమైన ఘట్టం. బ్రిటిష్ పాలనలో భారతదేశ సమాజంలో కల్గిన మార్పులవల్ల, భారతదేశం ఆధునీకరణకు నాంది పలకడం జరిగింది. ప్రాక్ పశ్చిమ పరస్పర ప్రభావ సమ్మేళనానికి భారతదేశం కేంద్రమైంది. పాశ్చాత్య విధానాలు భారతదేశ ఆశయ సిద్ధాంత, దృక్పథాలకు భిన్నమైన దృక్పథాల్ని సవాలుగా తెచ్చాయి. శతాబ్దాల కాల గమనంలో రూపు దిద్దుకొని, భారతదేశ సామాజిక వ్యవస్థలో అంతర్లీనమైన బలహీనతల్ని గుర్తించి, నూతన దృక్పథాల నుండి సమాజాన్ని పరీక్షించి, వలస సంస్కృతి నెదిరించడానికి, సమకాలీన సమాజాన్ని సంస్కరించడానికి సాంఘిక సంస్కరణోద్యమం ఆవశ్యకమైంది. భారతదేశ చరిత్రను సమగ్రంగా అర్థంచేసుకోవాలంటే, సామాజిక చరిత్ర అధ్యయనం అవసరం.

చరిత్రలో ద్వితీయ సంవత్సర స్నాతకోత్తర పాఠ్యాంశాలను అధ్యయనం చేసే, డా. బి. ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థులకు 'ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర' కోర్స్‌గా రూపొందించబడింది. ఆంగ్లేయుల పాలన నాటి సామాజిక వ్యవస్థ రూపురేఖలు, మతం, విద్య, సామాజిక ఆచారాలు, ఆధునిక పాశ్చాత్య భావజాల ప్రభావం వైజ్ఞానిక మేల్కొల్పుగా మొదలై, నైతిక శక్తిగా మారి జాతీయ జాగృతి కల్గించిన సాంస్కృతిక పునరుజ్జీవనం, సామాజిక వ్యవస్థను, మతాన్ని, దురాచారాల నుండి ప్రక్షాళనం చేసిన సంస్కరణోద్యమాలు, సామాజిక మార్పును విశ్లేషించడమైంది.

ఈ కోర్స్‌లో మొత్తం ఆరు ఖండాలు, ఇరవై మూడు భాగాలున్నాయి. పఠనా సౌలభ్యం కోసం దీన్ని రెండు పుస్తకాలుగా ముద్రించడమౌతూంది. మొదటి పుస్తకంలో మొదటి మూడు ఖండాలకు సంబంధించిన పదమూడు భాగాలను చేర్చడం జరిగింది. వీటిలో 18వ శతాబ్దపు సామాజిక, మత, విద్యా వ్యవస్థ తీరుతెన్నులు, పశ్చిమ దేశాల నూతన భావనల సైద్ధాంతిక ప్రభావం, ఆధునీకరణను సుగమం చేసిన పాశాత్య విద్య, నూతన సంస్థలావిర్భావం, కరడుగట్టిన దురాచారాల్ని రూపుమాపడానికై చేసిన సామాజిక చట్టాలు, ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించి, జాతీయ స్ఫూర్తి నిచ్చిన పత్రికా రంగ అభివృద్ధి , భారతదేశ సాంస్కృతిక, వైజ్ఞానిక అంతర్లీనతలు, నూతన స్వేచ్ఛాపిపాసిత భావాలైన హేతు వాదం, మానవతా వాదం, ప్రత్యక్ష జ్ఞాన వాదం, సార్వత్రిక వాదాల నేపధ్యం, విశ్లేషణలు సమగ్రంగా చర్చించడమైంది.

రెండో పుస్తకంలో చివరి మూడు ఖండాలకు చెందిన పది భాగాలున్నాయి. తరతరాలుగా మతాలలో పేరుకు పోయిన దురాచారాలు, కర్మకాండలు, మూఢ నమ్మకాలను నిర్మూలించి, వ్యక్తి స్వేచ్ఛకు, ఆధునిక లౌకిక దృక్పథానికి దారిచూపిన మత సంస్కరణోద్యమాలు, సంస్కర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులు, ప్రజల్లో పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనాలైన సంఘ సంస్కరణోద్యమాలు, పితృస్వామ్య వ్యవస్థలో అనేక దురాచారాలకు లోనై అణచివేయబడి, సంస్కరణోద్యమాలకు కేంద్ర బిందువైన మహిళా విమోచనోద్యమాలు, సాంఘిక పీడనకు పర్యాయ పదమైన కుల వ్యవస్థ, కులం పేరిట యుగయుగాలుగా బడుగు వర్గాల వారిని బానిసత్వపు కోరలకు బలి చేసిన అస్పృశ్యతా విధానం, వారి అభ్యున్నతికై పాటుపడిన సంస్కర్తల కృషి, ఆధునిక కాలంలో మారుతున్న సామాజిక దృష్టి ఫలితంగా సామాజిక సంస్థలు, వ్యవస్థల్లో కల్గిన సామాజిక మార్పు, చైతన్యం వివరించబడ్డాయి. వీటి ద్వారా, ఆధునిక పాశ్చాత్య భావ జాలం ప్రభావంగా భారతీయ సామాజిక చట్రంలో వచ్చిన మౌలిక మార్పులు, నవీన దృష్టి, పునరుద్ధరణ, పురోగమనం లక్ష్యాలుగా సాగిన సంస్కరణోద్యమాలు, తత్ఫలితంగా జరిగిన సామాజిక మార్పుపై విద్యార్థులు సరైన అవగాహన పొందగలరని ఆశిస్తున్నాం.

ఆధునిక భారతదేశ సామాజిక చరిత్రలోని వైరుధ్యాలు, సంక్లిష్టతలను వాస్తవిక, శాస్త్రీయ దృష్టితో విశ్లేషించిన ఈ పాఠ్య భాగాలను చదివి, విద్యార్థులు ప్రయోజనాన్ని పొందగలరని విశ్వవిద్యాలయం ఆశిస్తూంది.

BRAOU

# విషయ సూచిక


| | | | పుట నెం. |
|---|---|---|---|
| **ఖండం - IV** | **:** | **మత సంస్కరణలు** | |
| భాగం - 14 | : | కార్యక్రమం ప్రభావం, భావాలు | 3 |
| భాగం - 15 | : | ప్రాంతీయ భేదాలు, ఉద్యమాల సామాజిక పునాది | 40 |
| భాగం - 16 | : | సామాజిక ఇబ్బందులు, పునరుద్ధరణ, లౌకికత్వం | 54 |
| **ఖండం - V** | **:** | **సంఘ సంస్కరణలు** | |
| భాగం - 17 | : | మహిళా విమోచన | 71 |
| భాగం - 18 | : | కుల ఉద్యమాలు | 89 |
| భాగం - 19 | : | అస్పృశ్యత | 107 |
| భాగం - 20 | : | సామాజిక దృష్టి | 120 |
| **ఖండం - VI** | **:** | **సామాజిక మార్పు** | |
| భాగం - 21 | : | వ్యవస్థాగత మార్పులు | 139 |
| భాగం - 22 | : | సామాజిక సంస్థల మార్పులు | 152 |
| భాగం - 23 | : | భావజాలంలోని మార్పులు | 164 |
| | | పాఠ్య ప్రణాళిక | |
| | | మాదిరి పరీక్షా పత్రం | |
| | | అభ్యాసాలు | |


BRAOU

# ఖండం - IV

# మత సంస్కరణలు

మత సంస్కరణలు 19వ శతాబ్దంలో ఆవిర్భవించాయి. హిందూ, ముస్లిం, పార్సీ, సిక్కు మతాలను సంస్కరించడానికి ఉద్యమాలు నిర్వహింపబడ్డాయి. ఈ ఖండంలో ఈ ఉద్యమాల మత సంస్కరణ కార్యక్రమం ఉద్యమాలను నడిపిన నాయకులు, వారి భావాలు, ఉద్యమాల ప్రభావం, ఏఏ ప్రాంతంలో ఏఉద్యమం బలం ఉందో, వాటికి ఏఏ వర్గాల వారి సహకార, సానుభూతులు లభించినవో ఈ మత సంస్కరణల వల్ల ఉత్పన్నమైన సమస్యలు ఏమిటో వివరింపబడ్డాయి.

BRAOU

# భాగం - 14 : కార్యక్రమం, ప్రభావం, భావాలు

విషయక్రమం


14.0 లక్ష్యాలు

14.1 పరిచయం

14.2 బ్రహ్మ సమాజం

14.2.1 రాజా రామ్‌మోహన్ రాయ్ (1772 - 1833)

14.2.2 దేవేంద్రనాథ్ టాగూర్ (1817 -1905)

14.2.3 కేశవచంద్ర సేన్ (1838 - 1884)

14.2.4 సాధారణ బ్రహ్మ సమాజం

14.3 ప్రార్థనా సమాజం

14.4 మద్రాస్ రాష్ట్రంలో మత, సాంఘిక సంస్కరణల కృషి

14.5 ఆర్య సమాజం

14.6 రామకృష్ణ పరమహంస

14.7 వివేకానందుడు

14.8 దివ్యజ్ఞాన సమాజం

14.8.1 బ్లావట్స్కీ, ఓల్కాట్‌ల నాయకత్వం

14.8.2 అనీబిసెంట్

14.9 దేవ సమాజం

14.10 ముస్లిం మత సంస్కరణ

14.10.1 మదరసా-ఇ-రహిమియ

14.10.2 ఫర-ఇజీన్

14.10.3 తారిక్-ఇ-మొహమ్మదీయ

14.10.4 దారుల్-ఉలుమ్-దియోబంద్

14.10.5 సయ్యద్ అహ్మద్ ఖాన్

14.10.6 బరెల్వీ ఉలెమా

14.11 పార్సీల్లో మత సంస్కరణలు

14.12 సిక్కుల్లో మత సంస్కరణోద్యమం

14.12.1 నిరంకారీలు

14.12.2 నామ్‌ధారులు


B R A O U

14.12.3 సింగ్ సభ

14.12.4 పంజాబ్ సనాతనులు

14.13 సంగ్రహంగా

14.14 పరీక్ష నమూనా ప్రశ్నలు

14.15 ఉపయుక్త గ్రంథాలు

## 14.0 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

- ఆధునిక భారతదేశంలో మత సంస్కరణోద్యమాల ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు.
- బెంగాల్‌లో బ్రహ్మ సమాజ స్థాపన, దాని వ్యాప్తికి రాజా రామ్‌మోహన్ రాయ్, దేవేంద్రనాథ్ టాగూర్, కేశవ చంద్ర సేన్ మొదలైన వారు చేసిన కృషి.
- బొంబాయి రాష్ట్రంలో ప్రార్థనా సమాజ స్థాపన, అది చేపట్టిన మత, సాంఘిక కార్యక్రమాలు.
- పునరుజ్జీవనోద్యమమైన ఆర్య సమాజం, దాని సిద్ధాంతాల ప్రచారానికి సాధించిన అభివృద్ధికి దయానంద సరస్వతి, హన్సరాజ్, లేఖ్‌రామ్, లాలా లజపతి రాయ్ చేసిన కృషి.
- మేడమ్ బ్లావట్స్కీ, కల్నల్ ఓల్కాట్, అనీబిసెంట్‌ల నాయకత్వంలో భారతదేశంలో దివ్యజ్ఞాన సమాజ ఆశయాల ప్రచారం.
- రామకృష్ణ పరమహంస, వివేకానందుల బోధనలు, రామకృష్ణ మిషన్ స్థాపన, దాని సేవా కార్యక్రమాలు.
- ఇస్లాం మత పునరుద్ధరణోద్యమాలు, సయ్యద్ అహ్మద్ ఖాన్ నాయకత్వంలో ఇస్లాం మత సంస్కరణ.
- పార్సీ మత సంస్కరణోద్యమం.
- సిక్కు మత సంస్కరణకై నిరంకారీలు, నామధారులు చేసిన కృషి

## 14.1 పరిచయం

19వ శతాబ్దంలో ఆరంభమైన మత సంస్కరణోద్యమాల వల్ల ప్రజలు చైతన్యవంతులయ్యారు. మత సంస్కరణలు ప్రధానంగా సాంఘిక సంస్కరణలను, సామాజిక మార్పును సుగమం చేయడానికే ఉద్దేశించబడ్డాయి. నాడు సమాజంలో నెలకొన్న మతపరమైన పరిస్థితులు ఆ ఉద్యమాల ఆవిర్భావానికి దోహదం చేశాయి.

సమాజంలో కుల నిబంధనలవల్ల అసమానతలు ఏర్పడ్డాయని ముందు చదివిన భాగాల్లో తెలుసుకున్నాం. అగ్రవర్ణాలవారు ప్రత్యేక హక్కులు, సౌకర్యాలను అనుభవిస్తున్నారు. కాని ఇతర అణగారిన వర్గాలవారి బ్రతుకు తెరువులు నిరాశ, నిస్పృహలతో కూడుకొని ఉన్నాయి. సామాజిక వ్యవస్థ పూర్తిగా బలహీన పడింది. మత విషయాల్లో పురోహితులదే పైచేయి. అసత్యమూ, నిర్హేతుకమూ అయిన సంస్కార విధులతో ప్రజలు సతమతమయ్యేవారు. మూఢనమ్మకాలు, దురాచారాలు సర్వత్రా వ్యాపించాయి. జనజీవన విధానాన్ని మతం పూర్తిగా నిర్దేశించింది. విద్యా విషయంగా కూడా చెప్పుకోదగ్గ ప్రణాళిక లేక భారతీయ సంస్కృతిని ప్రోత్సహించే

BRAOU

విధానం లోపించింది. పూర్వ విద్యాబుద్ధులు గరిపే కేంద్రాలైన 'టోల్స్' క్షీణించి శిధిలావస్థలో ఉన్నాయి. ముస్లింల 'ముక్తాబ్'లు (Maktabs), మదరసా (Madresas) ల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. అవిద్యవల్ల అభివృద్ధి కుంటుపడింది.

ఆంగ్లేయుల పాలన ఆరంభమైన తర్వాత పాశ్చాత్య ఉదార భావాలవల్ల ప్రభావితులైన కొందరు హేతు వాదం వైపు ఆకర్షితులయ్యారు. భారతీయ సాంస్కృతిక విలువలను వారు సమర్థించడం ఆరంభించారు. వేదోపనిషత్తులు, వైష్ణవ తత్వం తాంత్రిక తత్వం ఆధారంగా వారు తమ ఆదర్శాలను సూత్రీకరించారు. వారిలో కొంతమంది విజ్ఞానం, భక్తి, సత్కర్మల ప్రాముఖ్యాన్ని ప్రజలకు ఉపదేశించారు. దురాచారాలనుండి విముక్తి పొందటానికి ఆ నూతన ఆదర్శాలకు పూర్తిగా జీవితాలను అంకితం చేయమని వారు తమ తోటి దేశస్థులను అర్థించారు. వారి దూరదృష్టి గొప్పది. అన్ని మతాల, జాతుల వారు వారి దృష్టిలో ఉన్నారు. ఈవిధంగా వారి ఉద్యమాలు సార్వత్రిక రూపాన్ని సంతరించుకున్నాయి.

## 14.2 బ్రహ్మ సమాజం ✓

ఆధునిక కాలంలో ఆవిర్భవించిన మత, సాంఘిక సంస్కరణోద్యమాల్లో మొదటిది, బ్రహ్మ సమాజం. బ్రహ్మ సమాజం ఆస్తిక మతం. హిందూ సమాజంలో నెలకొన్న మత, సాంఘిక దురాచారాలను నిర్మూలించడానికి పూనుకొన్నది. హేతు వాదం, వేదోపనిషత్తుల ఆధారంగా మానవత్వానికి ప్రాధాన్యతనిచ్చి, బ్రహ్మ సమాజం ఎందరినో సంస్కరణాభిలాషులుగా చేసింది. బెంగాల్‌లో నెలకొల్పబడ్డ ఆ సమాజం అక్కడ శక్తివంతమైన మత సంస్కరణోద్యమంగా బలపడి, ఇతర ప్రాంతాలకు కూడా వ్యాపించి ప్రగతి ఉద్యమాలకు గట్టి పునాదులు వేసింది. ఈసమాజ చరిత్ర రాజా రామ్‌మోహన్ రాయ్‌తో ప్రారంభమైంది.

### 14.2.1. రాజా రామ్‌మోహన్ రాయ్ (1772-1833)

జాతి పునరుజ్జీవన జనకుడు, బ్రహ్మ సమాజ స్థాపకుడు, మూలపురుషుడు రామ్‌మోహన్ రాయ్. ఆధునిక భారతదేశంలో రాయ్ నడిపిన బ్రహ్మ సమాజం సాంఘిక, మత సంస్కరణోద్యమాలకు పునాదులు వేసింది. చరిత్రలో రాయ్‌కి ప్రత్యేక స్థానం ఉంది. 19వ శతాబ్దంలో సాంఘిక, సాంస్కృతిక, విద్యారంగాల్లో వచ్చిన మార్పులకు మార్గదర్శకుడు ఆయన. ప్రాక్పశ్చిమ ఆలోచనా విధానాల సమ్మేళనానికి ఆయన ప్రతినిధి. కాల గమనంలో మత జీవన విధానంలో ప్రవేశించిన విపరీత ధోరణులను తొలగించడానికీ, పాశ్చాత్య భావాలను పరిచయం చేయడానికీ రామ్ మోహన్ రాయ్ ఉపక్రమించాడు. తన భావాలకు ఉపనిషత్తుల్లో ఆధారం కలదని గుర్తించాడు. ఏకేశ్వర వాదమందలి ఆధ్యాత్మిక ఆదర్శం రామ్‌మోహన్ రాయ్ ఆలోచనలకు స్ఫూర్తినిచ్చి, ఆయనను ముందుకు నడిపించింది. పూర్వంలాగా ఇతని కాలంలో కూడా భగవంతుడు ఒక్కడే అన్న సత్యానికి ప్రచారం లభించింది.

భారతీయ హిందూ సాంస్కృతిక జాగృతి రామ్‌మోహన్ రాయ్‌తో ప్రారంభమైంది. 1772లో హుగ్లీ మండలంలోని రాధానగర్‌లో ఒక గౌరవప్రదమైన బ్రాహ్మణ కుటుంబంలో రామ్‌మోహన్ రాయ్ జన్మించాడు. పిన్నవయస్సులోనే ఇతనికి వివాహమైంది. పాట్నాలో పర్షియన్, అరబిక్ భాషలను నేర్చుకున్నాడు. ఆ కారణంగా బాల్యంలోనే సూఫీ మత సిద్ధాంతం బాగా ఒంటబట్టింది. అరబ్బీ భాషద్వారా ఖురాన్‌కు సంబంధించిన సాహిత్యాన్ని చదివాడు. 16వ ఏటనే హిందువుల బహుదేవతారాధనను దుయ్యబడుతూ, వ్యాసాన్ని రాశాడు. ఈవిషయంలో తల్లిదండ్రులతో విభేదించాడుకూడా. కలకత్తాలో ఉన్నకాలంలో అక్కడ ఫోర్ట్ విలియం కళాశాలలో ఆంగ్లేయ

BRAOU

అధికారులతో, ముస్లిం పండితులతో పరిచయం ఏర్పడింది. జాన్ డిగ్బీ (John Digby) దగ్గర ఈస్ట్ ఇండియా కంపెనీలో తొమ్మిది సంవత్సరాలు శిరస్తదారుగా ఉద్యోగం చేశాడు. పదవీ విరమణ చేశాక పూర్తికాలాన్ని సాంఘిక ఆచారాలు, మతమౌఢ్యం వల్ల ఉత్పన్నమైన సమస్యల పరిష్కారానికై వినియోగించాడు.

1803లోనే తన తండ్రి శ్రాద్ధకర్మలను ఆచరించే విషయంలో ఇతర కుటుంబ సభ్యులతో తీవ్ర భేదాభిప్రాయాలను వ్యక్తపరిచాడు. తనకు తోచిన విధంగా కలకత్తాలో కర్మకాండలను పూర్తిచేసి, తన ఆలోచనా ధోరణిని, తనకుగల స్వతంత్ర భావాలను వ్యక్తం చేశాడు. ఏకేశ్వరోపాసకులకొక కానుకగా పర్షియన్ భాషలో రచించిన "తుహ్ఫాత్ ఉల్ ముహిద్దీన్" (Tuhfat-ul-Muwahhidin) అనే ప్రసిద్ధ గ్రంథంలో విగ్రహారాధనను, బహుదేవతారాధనను రామ్‌మోహన్ రాయ్ విమర్శించాడు. ఏకేశ్వర సిద్ధాంతాన్ని (monotheism) పరమోన్నత మతంగా సమర్థించాడు. వివిధ మతాల నమ్మకాలకు మూలం అనంత స్వరూపుడైన ఒకే దేవుడని, అతని తర్వాతే మిగిలిన ప్రపంచమని చెప్పాడు. ఈగ్రంథంలో మతం అనేది మూఢనమ్మకాలు, ఈర్ష్యలు, ఆవేశకావేశాలు, కర్మకాండలు, అధికారానికి ఆలోచించకుండా లొంగిపోవడం కాదని, ఒకే దేవునిపై ఉంచే సందేహారహితమైన నమ్మకం మాత్రమేనని, ఆ దేవుడే ప్రతి మతానికి ముఖ్యం అని రామ్‌మోహన్ తెలియపరచాడు. మత విశ్వాసాలకు ఇది మొదటి బహిరంగ మరణ శాసనంగా భావించవచ్చు. ఈగ్రంథం బెంగాల్ అంతటా కల్లోల్లాన్ని రేపింది. నాడు పాశ్చాత్య దేశాల్లో ప్రబలంగా ఉన్న హేతు వాద ప్రభావం రామ్‌మోహన్‌పై పడింది.

సంస్కృతంలో ఉన్న హిందూ శాస్త్రాలను, వేదాలను, పురాణాలను, స్మృతులను నందకుమార్ విద్యాలంకార్ సహకారంతో రామ్‌మోహన్ రాయ్ అధ్యయనం చేశాడు. వేదాంత సూత్రాలను మొదటిసారిగా బెంగాలీ భాషలోకి అనువదించాడు. భగవంతుడు ఒక్కడే అనీ, అతనిని మాత్రమే పూజించాలనీ తెల్పాడు. 1815లో ఉపనిషత్తులను అనువదించి, కలకత్తా నగరంలో ఉచితంగా వాటి ప్రతులను పంచిపెట్టాడు. స్త్రీలు, కర్షకులు, అస్పృశ్యులు, ఇతర మతస్థులు యధేచ్ఛగా వాటిని చదువుకోటానికి అవకాశాన్ని కల్పించాడు. హిందూ, జైన, ఇస్లాం, క్రైస్తవ మత ప్రతినిధులతో తరచూ మత విషయాలు రంగపూర్‌లో ఉన్నపుడు రామ్‌మోహన్ చర్చించి, వారి మద్దతును పొందాడు. మత సత్యం ఒకే దేవుని ఆరాధించటం, బహుదేవతారాధన ఆధ్యాత్మిక అభివృద్ధికి ఆటంకం, ఏకేశ్వరోపాసన ముఖ్యం అన్న రామ్‌మోహన్ రాయ్ అభిప్రాయాలను వారు సమర్థించారు. అన్ని గ్రంథాల్లో కనిపించే సత్యం ఏకేశ్వరోపాసన అని ఖురాన్, బైబిల్, హిందూ శాస్త్రాలనుండి ఉదహరించాడు.

1820లో "జీసస్ ఉపదేశాలు : శాంతి, సుఖజీవనానికి మార్గం" (The Precepts of Jesus: the guide to Peace and Happiness) అనే పుస్తకాన్ని ప్రచురించి, ఏకేశ్వర సిద్ధాంతాన్ని సమర్థించాడు. ఇందులో ఏసుక్రీస్తు ఉపదేశించిన నైతిక, ఆధ్యాత్మిక సూత్రాలు పొందుపరచబడ్డాయి. ఆ పుస్తకంలో జీసస్ దైవత్వాన్ని (divinity) క్రైస్తవ మత గొప్పతనాన్ని తిరస్కరించాడు. ఏసుక్రీస్తు గురువు మాత్రమే గాని దేవుని కుమారుడు కాదని రాశాడు. ఫలితంగా శెరంపూర్ బాప్టిస్టు మిషనరీల అధిక్షేపణలను ఎదుర్కొన్నాడు. వారితో వాద ప్రతివాదనలు చేశాడు. క్రైస్తవుల త్రిత్వ సిద్ధాంతాన్ని (Trinitarian theory) ను సవాలు చేసి, ఏకత్వ (unitarianism) సూత్రాన్ని ప్రతిపాదించాడు. ప్రాచీన క్రైస్తవ గ్రంథాలను మూలభాషలో చదవటం కోసం రామమోహన్ లాటిన్, గ్రీక్, హీబ్రూ భాషలు నేర్చుకున్నాడు.

కలకత్తాలోని బ్రిటిష్ విద్యావేత్తలతోనూ, శెరంపూర్ మిషనరీలతోనూ తనకున్న పరిచయాలవల్ల తనలో వచ్చిన భావ పరివర్తన విద్యా పునర్నిర్మాణ కృషికి అధికంగా దోహద పడింది. ఆంగ్ల భాషా బోధనా పాఠశాలలను స్థాపించి పాశ్చాత్య విజ్ఞానాన్ని, శాస్త్రాలను, చరిత్ర మొదలైన సామాజిక శాస్త్రాల అధ్యయనానికి వీలు కల్పించాడు రాయ్. సాంస్కృతిక విలువలు పెంపొందటానికి విజ్ఞాన శాస్త్రం అత్యవసరమని, అది మానవుని విజ్ఞానవంతునిగా

BRAOU

చేస్తుందని ఆయన భావించాడు. 1826లో వేదాంత కళాశాలను స్థాపించి వేదాంతం, తత్వశాస్త్రం, సంస్కృత సాహిత్యం బోధించడానికి అవసరమైన ఏర్పాట్లు చేశాడు. కాని ఆ కళాశాల ఎంతోకాలం పనిచేయలేదు.

ప్రజలను విజ్ఞానవంతులుగా చేయడానికి రామ్‌మోహన్ రాయ్ పత్రికలను ప్రారంభించాడు. 1822లో 'బ్రాహ్మణ పత్రిక' (Brahmanical Magazine) ను కొంతకాలంపాటు రెండు భాషల్లో ప్రచురించాడు. తర్వాత ఇంగ్లీష్‌లో మాత్రమే అది ముద్రితమైంది. అయితే, ఆ పత్రిక ప్రచురణ ఎన్నో సంవత్సరాలు కొనసాగలేదు. బెంగాలీ భాషలో "సంవాద కౌముది" వారపత్రికగా వెలువడింది. "మీరట్-ఉల్-అక్బర్" (Mirat-Ul-Akbar) పర్షియన్ భాషలో వచ్చిన వారపత్రిక. వీటినీ, ఇతర పుస్తకాలు, కరపత్రాలను ప్రధాన సాధనంగా ఉపయోగించి తన ఉద్యమ లక్ష్యాలను ప్రజలకు పరిచయం చేసి దేశాభివృద్ధికి కృషిచేశాడు.

రామ్‌మోహన్ రాయ్ విశ్వాసాలు అనేకమంది యువకులను ఆకర్షించాయి. వారి సహకారంతో 1815లో తన ఇంటిలోనే "ఆత్మీయ సభ" ను ఏర్పాటు చేసి బెంగాలీ హిందూ సమాజంలో ప్రబలి ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని జరిపాడు. 1821లో విలియం ఆడమ్ (William Adam) ప్రోత్సాహంతో క్రైస్తవ మత నీతి బోధనలు ఆధారంగా "ఏకీకరణ సంఘం" (Unifarian Committee) ను స్థాపించాడు. ఆ సంఘ సమావేశాలకు రామమోహన్ అనుచరులు, స్నేహితులు హాజరయ్యేవారు. అయితే, ఉత్సాహం తగ్గడం వల్ల ఆ కమిటీ ఎంతోకాలం కొనసాగలేదు. అయినప్పటికీ, ఏకేశ్వరోపాసకులు తమ భజనలకు ప్రత్యేక స్థలం అవసరమని భావించారు. దీని ఫలితంగా ద్వారకానాథ్ టాగూర్ సహకారంతో 1828లో రామ్‌మోహన్ రాయ్ అద్దె గృహంలో ఆస్తిక మత సంస్థ అయిన 'బ్రహ్మ సభ'ను స్థాపించాడు. అదే 'బ్రహ్మ సమాజం'గా ప్రాచుర్యం పొందింది. 1830 నాటికి దాని సంరక్షక పత్రాన్ని (Trust Deed) రాయ్ తయారుచేశాడు. ఈ సమాజ ఆశయాలు క్రైస్తవ మత సిద్ధాంతాలను పోలి ఉన్నాయి. ఆధునిక భారత సాంస్కృతిక పునరుజ్జీవన చరిత్రలో దాని స్థాపన ఒక మైలు రాయి. ఈ సమాజానికి హేతు వాదం, వేదోపనిషత్తులు మూలస్తంభాలు. ఏకేశ్వరోపాసన చేసే మొట్టమొదటి దేవాలయం అది. బ్రహ్మ సమాజ మందిరాన్ని అన్ని వర్గాల ప్రజలు బహిరంగ సమావేశాలకు తరతమ భేదాలు లేకుండా ఉపయోగించవచ్చు. ప్రార్థనలు జరుపుకోవచ్చు. ధార్మికత, నీతి, దయ, సహనం, సత్ప్రవర్తన మొదలైన వాటిని పెంపొందించడమే బ్రహ్మ సమాజ లక్ష్యం. వివిధ జాతులమధ్య, కులాల మధ్యగల అడ్డుగోడలను తొలగించి విశ్వమానవ సౌభ్రాతృత్వ సిద్ధాంతాన్ని పటిష్ఠం చేయడానికి కృషి చేసింది. భగవంతుడు, మానవుడి మధ్య బ్రాహ్మణ పురోహితుల మధ్యవర్తిత్వాన్ని, విగ్రహారాధనను, కుల విభేదాలను వ్యతిరేకించింది. బ్రహ్మ సమాజ సాంఘిక కార్యక్రమాల్లో స్త్రీజనోద్ధరణ ప్రముఖ స్థానం ఆక్రమించింది. స్త్రీ విద్యను సమర్థించింది. బాల్య వివాహాలు, బహుభార్యాత్వం, నిర్బంధ వైధవ్యం నుండి స్త్రీలకు విమోచన కల్పించడానికి కృషి చేసింది. విద్యా వ్యాప్తికి ప్రాధాన్యతనిచ్చి, పాఠశాలలు, కళాశాలలు, అతిథి గృహాలు, క్లబ్బులు, గ్రంథాలయాలు, ఉపన్యాస వేదికల ద్వారా విద్యావ్యాప్తికి తోడ్పడింది. మనుషుల్లోని నిర్హేతుకాభిప్రాయాలను, మూఢ విశ్వాసాలను తొలగించి వారి మనో వికాసానికి బ్రహ్మ సమాజ కార్యక్రమాలు దోహదపడ్డాయి.

బ్రహ్మ సమాజం మొదటి సమావేశానికి సుమారు ఐదు వందలమంది ప్రతినిధులు హాజరయ్యారు. వీరిలో బెంగాలీ బ్రాహ్మణులు, క్రైస్తవులు, ముస్లింలు ఉన్నారు. 'యంగ్ బెంగాలీ' (Young Bengali) సభ్యులు బ్రహ్మ సమాజంలో చేరి, అది నిర్వహించిన అభ్యుదయ ఉద్యమాలకు నాయకత్వం వహించారు.

బ్రహ్మ సమాజం హిందూ మతానికి విరుద్ధమైన కొత్త మతం కాదు. అది వేదోక్తమైన సమాజం అనవచ్చు. మానవ పురోగతికి స్వాతంత్ర్యం, సహేతుకత్వం, సార్వజనీనత, ఆధ్యాత్మికత అవసరమని అది తెలిపింది.



BRAOU

ప్రజల జీవితాలను కలుషితం చేస్తున్న దురాచారాలను ప్రతిఘటించి, సమాజ సంస్కరణకు రామ్ మోహన్ రాయ్ పునాదులు వేశాడు. చరిత్రాత్మకమైన సతీ సహగమన వ్యతిరేక ఆందోళన నిర్వహించాడు. హిందూ మత గ్రంథాల నుండి అనేక విషయాలను సేకరించి, సతీ సహగమన దురాచారానికి వ్యతిరేకంగా రెండు పరిశోధనా గ్రంథాలను రచించి ప్రకటించాడు. **1829** బెంటింక్ ప్రభువు చేసిన సతీ సహగమన నిషేధ చట్టానికి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాడు. హిందూ వితంతువుల పునర్వివాహాన్ని సమర్థించాడు. కులీన విధానాన్ని, కన్యాశుల్కాన్ని, కుల, జాతి, వర్ణ విభేదాలను వ్యతిరేకించాడు. స్త్రీల ఆస్తి హక్కును సమర్థించాడు. బ్రహ్మ మతంలోని మౌలిక అంశాలైన విగ్రహారాధన నిరసన, కర్మకాండల ఖండన, ఏకేశ్వరోపాసన, సర్వమానవ సమానతలను ప్రప్రథమంగా ప్రచారం చేయడం ఆయన హిందూ మత పునర్నిర్మాణ కార్యక్రమాన్ని వెల్లడి చేస్తుంది. పత్రికలకు స్వేచ్ఛ ఉండాలని, రైతులను అధిక పన్నుల భారం నుండి రక్షించాలని పలికాడు. హిందువులు సముద్రయానం చేయరాదని విధించిన నిషేధాన్ని ఉల్లంఘించి ఇంగ్లాండ్ వెళ్లిన మొదటి భారతీయుడు రామ్‌మోహన్ రాయ్. ఇతని మరణానంతరం బెంగాల్‌లో బ్రహ్మ సమాజ ఉద్యమం కొంత కాలం పాటు నిర్జీవంగా కొనసాగింది.

### 14.2.2 దేవేంద్రనాథ్ టాగూర్ (1817-1905)

బ్రహ్మ సమాజానికి తాత్విక పరిపుష్టిని, స్థితిగతులను కల్పించింది, ద్వారకనాథ టాగూర్ కుమారుడైన దేవేంద్రనాథ టాగూర్. ఆయన రామ్‌మోహన్ రాయ్ సన్నిహిత మిత్రుడు. బ్రహ్మ సమాజాన్ని మరింత పటిష్ఠం చేశాడు. దేశాభివృద్ధిని ఆటంక పరుస్తున్న అనేక దురాచారాలను గుర్తించాడు. కాని మతాభ్యుదయానికే అమితంగా కృషిచేశాడు. ఉపనిషత్తుల వల్ల ఉత్తేజితుడై, తన ప్రణాళికను తయారుచేసుకున్నాడు. 'తత్వబోధినీ సభ' (Tattvabodhini Sabha) అను సాంస్కృతిక సంస్థను 1839లో స్థాపించాడు. ఆంగ్ల భాష ద్వారా పాశ్చాత్య భావాలను వ్యాపింపజేయడం బెంగాలీ భాషను ప్రచారం చేయడం, ఉపనిషత్తుల్లో నిక్షిప్తమై ఉన్న విజ్ఞానాన్ని ప్రజలకు అందివ్వడం ఆ సంస్థ ఆశయాలు. దాని సభ్యులందరూ బాగా ఇంగ్లీష్ విద్యను అభ్యసించిన మేధావులు. వారు తర్వాత కాలంలో దేశ పునరుజ్జీవనానికి నాయకత్వం వహించి, అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సుమారు రెండు దశాబ్దాల పాటు ఈ సంస్థ పాశ్చాత్య నాగరకత పవనాలు దేశంలో వ్యాపించకుండా అడ్డుగోడలా నిలిచింది.

తత్వబోధినీ కార్యక్రమాలను అమలు చేయడానికి 1840లో దేవేంద్రనాథ టాగూర్ 'తత్వబోధినీ పాఠశాల' ను స్థాపించి యువకులకు భారతీయ, పాశ్చాత్య భావాలను బెంగాలీ భాష ద్వారా బోధించడానికి ఏర్పాట్లు చేశాడు. ఆ పాఠశాలల్లో ఇంగ్లీష్‌ను ఒక భాషగా బోధించారు. దానిలో ఉపాధ్యాయునిగా పనిచేసిన అక్షయ దత్తా 1843లో దేవేంద్రనాథ్ స్థాపించిన 'తత్వబోధినీ' మాసపత్రికకు సంపాదకుడుగా పనిచేశాడు. ప్రజల అభిప్రాయాలను మలచడంలోనూ, వారికి సమాచారం అందివ్వడంలోనూ, ఈ పత్రిక ప్రముఖ పాత్ర వహించింది. క్రైస్తవ మిషనరీల దాడుల నుండి హిందువులను, హిందూ మతాన్ని రక్షించడం, విద్యారంగంలో స్వయం సహాయం, స్త్రీ విద్యా వ్యాప్తి, మత్తుపానీయాలను నిషేదించడం, సాంఘిక సంస్కరణ మొదలైన విషయాలపై ఆ పత్రికలో క్రమం తప్పకుండా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. దేవేంద్రనాథుని వ్యక్తిత్వం, ఉత్సాహం కొత్తవారిని కార్యరంగంలోకి దించాయి.

వైదిక సంస్కృతిని బెంగాల్‌లో పునరుద్ధరించడానికి దేవేంద్రనాథ టాగూర్ కృషిచేశాడు. వేదాలను, ఉపనిషత్తులను కూలంకషంగా అధ్యయనం చేయడానికి నలుగురు పండితులను వారణాశికి పంపాడు. ఈ మధ్య కాలంలో హేతు వాదులైన మిత్రుల ప్రోద్బలం వల్ల వేదాల ప్రామాణికత్వాన్ని (Vedic infellibility) త్రోసి పుచ్చాడు. వారణాసి వెళ్లిన పండితులు తిరిగివచ్చాక వారిని తన మత విశ్వాసాలకు మద్దతుగా హిందూ శాస్త్రాల

BRAOU

నుండి అవసరమైన సమాచారాన్ని సేకరించమని పురమాయించాడు. టాగూర్ ఆధ్వర్యంలో రాజ్‌నారాయణ బోస్ ఉపనిషత్తులను ఇంగ్లీష్‌లోకి అనువదించాడు. ఇంగ్లీష్ మిషనరీ అలెగ్జాండర్ డఫ్ (Alexander Duff) రాసిన "ఇండియా అండ్ ఇండియా మిషన్స్" (India and India missions) గ్రంథంలో విగ్రహారాధనను విమర్శించాడు. దానికి ప్రతిగా దేవేంద్రనాథ్ 1845లో 'తత్వబోధినీ' పత్రిక సంచికల్లో సమర్థవంతమైన శీర్షకలను రాసి, డఫ్ విమర్శలను తిప్పికొట్టాడు. హిందూ బాలురను విద్యాభ్యాసానికి మిషనరీ పాఠశాలలకు పంపడాన్ని నిరోధించటానికి ఉద్యమాన్ని నడిపాడు.

దేవేంద్రనాథ టాగూర్ 1842లో, బ్రహ్మ సమాజ సభ్యుడుగా చేరాడు. బ్రహ్మ సమాజాన్ని సంస్కరించే గురుతర బాధ్యతను తనపై వేసుకొని, ఆ సంస్థకు నవచైతన్యాన్ని, ఉన్నత స్థితిని, భావ శాస్త్రీయ సమన్వయాన్ని కలగజేశాడు. అతని నాయకత్వంలో బ్రహ్మ సమాజ దృక్పథం కొత్తమలుపు తిరిగింది. బ్రహ్మ సమాజాన్ని ఒక బహుముఖ సేవాసంస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కృషి జరిగింది. ఆ సమాజంలో చేరేవారికి ఒక విశ్వాస ప్రకటన (Declaration of Faith) ను తయారు చేశాడు. గాయత్రీ మంత్రోచ్చారణ ఐచ్ఛికమైందిగా చేస్తూ, బ్రహ్మ పత్రాన్ని (Brahmo Covenant) మార్పుచేశాడు. దీనిపై తన అనుచరులైన పందొమ్మిది మందితో కలసి సంతకం చేసి, బ్రహ్మ ధర్మాన్ని స్వీకరించాడు. 1845 డిసెంబర్ నాటికి ప్రతిజ్ఞ చేసి, 500 మంది బ్రహ్మ సామాజికులుగా నమోదు అయ్యారు. ఇదే సమయంలో వేదాల ప్రామాణికత గూర్చి చర్చ జరిగింది. వేదాల్లో ఉండే ప్రతి విషయాన్ని తప్పనిసరిగా ఆమోదించాల్సిన అవసరం లేదని, వాటిలోగల హేతుబద్ధమైన భాగాలు ఆమోదయోగ్యమైనవని చెప్పాడు. బ్రహ్మ సమాజానికి తాత్విక పరిపుష్టిని కలిగించాలనే తలంపుతో, ప్రార్థనా సమయాల్లో ఉపయోగార్థమై "బ్రహ్మ ధర్మం" ను ఉపనిషత్తుల ఆధారంగా రచించి, ప్రకటించాడు. బ్రహ్మ సమాజ సహజమగు పరిశుద్ధ ఆస్తిక సిద్ధాంతాలను విశదీకరించే ప్రమాణ గ్రంథం ఇది. తర్వాత కాలంలో అనేక భారతీయ భాషల్లోకి అనువదింపబడింది.

దేవేంద్రనాథ్ బ్రహ్మ మత భావాల ప్రచారంపై తన దృష్టిని కేంద్రీకరించాడు. ఆ దిశలో అతనికి విజయం లభించింది. కలకత్తా దాని పరిసర ప్రాంతాల్లో తన కృషి ఫలితంగా అనేక సమాజాలు నెలకొల్పబడ్డాయి. బ్రహ్మ సమాజ సభ్యుల్లో యువకులైన వారికి మార్గదర్శకుడు అక్షయకుమార్ దత్తా. కొత్త సాంఘిక సంస్కరణలను సమర్థిస్తూ బ్రహ్మ సమాజాన్ని విస్తృత పరచాలని ఆయన అభిలషించాడు. ఈయువకులు తీవ్ర వాద ధోరణిని అనుసరించారు. 1854లో బ్రహ్మ సమాజంలో ప్రవేశించిన కేశవ్‌చంద్ర సేన్ సహాయంతో దేవేంద్రనాథ టాగూర్ తన యావత్ శక్తి సామర్థ్యాలను బ్రహ్మ సమాజాభివృద్ధికి సంయుక్త నాయకత్వంలో వినియోగించాడు. బ్రహ్మ సమాజం సర్వతోముఖాభివృద్ధి చెందనారంభించింది. అనేకమంది బ్రహ్మ సమాజ సేవకు అంకితమైనారు. సభ్యులుగా చేరదలచిన వారి సంఖ్య వారంవారం పెరిగిపోయింది. 1866 వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది.

పవిత్ర మత బోధనల ద్వారా సమాజాన్ని సంస్కరించవచ్చునని దేవేంద్రనాథ్ అభిప్రాయ పడ్డాడు. అయితే కేశవ్ చంద్ర సేన్, అతని అనుచరులు సాంఘిక దురాచారాల నిర్మూలనకు విప్లవాత్మక మార్గాన్ని అనుసరించడానికి సుముఖంగా ఉన్నారు. నిశితంగా పరిశీలించి సాధ్యమైనంత తొందరగా వాటిని నిర్మూలించాలని వారు తలపెట్టారు. భారతదేశ ప్రాచీన గ్రంథాల్లో అత్యున్నత ఆధ్యాత్మిక సత్యాలు ఉన్నాయని దేవేంద్రనాథ్ నమ్మాడు. అయితే, ఏ మతం, ఏ దేశం నుండి అయినా సత్యాన్ని, వెలుగును స్వీకరించడానికి సేన్ సిద్ధపడ్డాడు. ఏసుక్రీస్తును అవతార పురుషుడుగా సేన్ అభివర్ణించాడు. ఈ అభిప్రాయంతో దేవేంద్రనాథ్ ఎప్పుడూ ఏకీభవించలేదు. మానవునికంటె విశ్వం అనంతమైందనీ, మత ప్రవక్తలు దేవుని దూతలనీ, దేవేంద్రనాథ్ అన్నాడు. ఈకారణాలవల్ల కేశవ్‌చంద్ర సేన్ మాతృ సంస్థ నుండి 1865లో విడిపోయి, ఆ మరుసటి సంవత్సరమే "అఖిల భారత బ్రహ్మ సమాజం" (Brahmo Samaj of India) అనే వేరే సంస్థను ప్రారంభించాడు. దేవేంద్రనాథ్ నాయ

కత్వంలో గల సమాజం "ఆది బ్రహ్మ సమాజం" (Adi Brahmo Samaj) అనే పేరుతో కొనసాగింది. ఈ సమాజం సనాతన హైందవ ఆచారాలను పూర్తిగా విడవక హిందూ సంస్కరణోద్యమంగా రూపొందింది. భారతీయ బ్రహ్మ సమాజం విశాల, సార్వజనీన దృక్పధాన్ని పెంపొందించుకుంది.

దేవేంద్రనాథ్ టాగూర్ అనేక ప్రజా సంస్థలతో సంబంధం పెట్టుకున్నాడు. అట్టి సంస్థల్లో "సమాజోన్నతి బిధాయిని సుహృద్ సమితి" ఒకటి. సంఘాభివృద్ధిని సాధించటానికి మిత్రుల సంస్థ అది. 1854 నుండి దేవేంద్రనాథ్ దాని అధ్యక్షుడుగా పనిచేశాడు. స్త్రీ విద్యను ప్రోత్సహించడం, హిందూ వితంతువులకు పునర్వివాహాలు జరిపించడం, బాల్య వివాహాలను నిర్మూలించడం, బహుభార్యాత్వాన్ని రద్దుచేయటం దాని ముఖ్య లక్ష్యాలు. లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు సమర్పించిన ఒక విజ్ఞాపన పత్రంలో పునర్వివాహం చేసుకున్న వితంతువులకు చట్టపరంగా రక్షణ కల్పించమని, కలకత్తాలో ప్రతినాలుగు వీధులకు ఒక బాలికా పాఠశాలను స్థాపించమని దేవేంద్రనాథ్ కోరాడు. ఆయన చివరి సంవత్సరాల్లో ఆధ్యాత్మిక, మత గ్రంథాల అధ్యయనంలో నిమగ్నుడయ్యాడు.

### 14.2.3 కేశవచంద్ర సేన్ (1838 - 1884)

కేశవ చంద్ర సేన్ బ్రహ్మ సమాజాన్ని భారతదేశమంతటా వ్యాపింపచేయటానికి కృషి చేశాడు. సేన్ కలకత్తా నగర మండలి ఉన్నత వైష్ణవ కుటుంబంలో జన్మించాడు. హిందూ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసి, పాశ్చాత్య విద్య బోధించిన విలువలను అవగాహన చేసుకున్నాడు. రాజనారాయణ బాసు రచనలవల్ల ఉత్తేజం పొంది, 1859లో బ్రహ్మ సమాజ సభ్యుడై క్రియాశీల కార్యకర్తగా పనిచేశాడు. అతని చైతన్యవంతమైన నాయకత్వంలో బ్రహ్మ సమాజం కొత్త మలుపు తిరిగింది. 1859లో రెండు కొత్త కార్యక్రమాలను చేపట్టి, ప్రత్యేక గుర్తింపు పొందాడు. వాటిలో మొదటిది వితంతు పునర్వివాహం గూర్చి నాటకం ప్రదర్శించడం. ఆధునిక కాలంలో బెంగాలీ నాటకాల్లో సాంఘిక ఇతివృత్తం ఉన్న నాటకం "కులీన కుల సర్వస్వం" (Kulin - Kula Sarvaswam) తర్వాత ఇతని నాటకమే మొదటిది. రెండోది బ్రహ్మ విద్యాలయాన్ని స్థాపించడం. ఇక్కడ ప్రతి ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. బ్రహ్మ సమాజ ఆస్తికత్వాన్ని బోదించడమే కాక, ఆ పాఠశాల అంకిత భావంగల బ్రహ్మ సమాజ కార్యకర్తలను తయారుచేసింది. వారి సహాయ, సహకారాలవల్ల భవిష్యత్తులో బ్రహ్మ సమాజ ప్రగతి సాధ్యపడింది. తన రచనల్లో విశ్వాసానికి ప్రార్థన రాజమార్గమని, అన్ని మత గ్రంథాల బోధనల్లో సత్యం ఉందని సేన్ గాఢంగా విశ్వసించాడు.

1859లో 'సంగత్ సభ' (Believers Association) ను కేశవచంద్ర సేన్ ప్రారంభించాడు. దానిలో మత చర్చలు జరిగేవి. ఆ సభకు యువకులు హాజరయ్యేవారు. వారంతా సేన్ ప్రసంగాల ప్రభావంచే బ్రహ్మ సమాజ కార్యక్రమాల్లో ఉత్సాహంతో పాల్గొన్నారు. వారంతా కలసి ఒక ప్రవర్తనా నిబంధనావళి (Code of conduct) ను రూపొందించుకున్నారు. విగ్రహారాధనను, కులాన్ని, కుల చిహ్నమైన యజ్ఞోపవీతాన్ని విడిచిపెట్టడం, స్త్రీల బహిరంగ నృత్యాలను వ్యతిరేకించడం, మద్యపానం మానడం, వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించడం, మహిళలను అక్షరాస్యులుగా చేయడం, సచ్ఛీలురై పొరుగు వారితో మెలగడం ఆ నియమాల్లో ముఖ్యమైనవి. సేన్ రూపొందించిన ఈ నియమావళి సాంఘిక చైతన్యానికి, సంఘటిత కృషికి పునాది అయింది.

బ్రహ్మ సమాజ సందేశాన్ని వ్యాపింప చేయటానికి సేన్ నూతన పంథాను అనుసరించాడు. బ్రహ్మ సమాజ ఆచార్యునిగా దేశంలోని అనేక ప్రాంతాలకు వెళ్ళి, అక్కడ సాధారణ శైలిలో ఉపన్యాసాలిచ్చాడు. ఆయన ప్రసంగాలు ప్రజలను అమితంగా ఆకర్షించాయి. 1861 ఆగస్టులో దేవేంద్రనాథ్ టాగూర్, కేశవచంద్ర సేన్‌లు కలసి "ది ఇండియన్ మిర్రర్" (The Indian Mirror) అనే పక్ష పత్రికను ప్రారంభించారు. అది 1871లో భారతదేశంలో మొట్టమొదటి ఆంగ్ల దినపత్రికగా మారింది. జాతీయ పునర్నిర్మాణంలో ప్రజాభిప్రాయాన్ని చూరగొని ప్రజల్ని విద్యావంతులుగా, చైతన్యవంతులుగా మారుస్తూ, చాలాకాలం ఆ పత్రిక కొనసాగింది. 1861లో

BRAOU

బ్రహ్మ సమాజం నిర్వహించాల్సిన మూడు ప్రధాన కార్యక్రమాల్ని సేన్ సూచించాడు. అవి. ఆనాటి విద్యా విధానాన్ని సంస్కరించి, విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం, నిమ్నకులాల వారికి విద్య గరపడం, స్త్రీ విద్యను ప్రోత్సహించడం విద్యా సంస్కరణలకై జరిగిన ఉద్యమ ఫలితంగా 1862లో కలకత్తాలో కళాశాల స్థాపించబడింది. బెంగాల్‌లో అనేక బ్రహ్మ సమాజ పాఠశాలలు ప్రారంభమైనాయి. మహిళలకు ప్రత్యేకంగా "బ్రాహ్మిక సమాజ్" అనే ప్రార్థనా మందిరాన్ని సేన్ ప్రారంభించాడు. సేన్ నాయకత్వంలో బ్రహ్మ సామాజికులు అనేక వర్ణాంతర వివాహాలు, వితంతు పునర్వివాహాలు జరిపించారు. 1868 నాటికి బెంగాల్‌లో 65 బ్రహ్మ సమాజ అనుబంధ శాఖలు (branches) పనిచేస్తున్నాయి. అప్పటికి అఖిల భారత బ్రహ్మ సమాజానికి 24మంది కార్యకర్తలు (missioneries) గ్రామీణ ప్రజలను ప్రభావితం చేసే పనిలో నిమగ్నమైయున్నారు.

కలకత్తాలో "భారత సంస్కరణ సంఘం" (Indian Reform Association) ను 1870లో నెలకొల్పి భారతీయుల సాంఘిక, నైతిక అభివృద్ధికి సేన్ కృషి చేశాడు. ఆ సంఘం చౌకగా సాహిత్యాన్ని ప్రచురించింది. స్త్రీ పురుషుల్లో విద్యావ్యాప్తికి శ్రమించింది. తన ఆశయాలను ప్రచారం చేయడానికి "సలభ సమాచార్" (Sulabh Samachar) వారపత్రికను సేన్ ప్రారంభించాడు. ఇది బెంగాల్‌లో మొదటి ఒక పైసా పత్రిక అని చెప్పవచ్చు. ఈ పత్రిక ఊహించని రీతిలో విజయవంతమైంది. స్థానిక మహిళలకు ప్రత్యేకంగా ఒక 'నార్మల్ స్కూల్' (Normal School) ను స్థాపించి, హిందూ ఉన్నత కుటుంబ స్త్రీలకు ఉన్నత విద్య బోధించే ఏర్పాట్లు చేశాడు. ప్రభుత్వ మద్యపాన విధానంవల్ల జరుగుతున్న నష్టాలను, కీడులను వివరాలతో ప్రజలకు తెలియజేసి, మితపాన ఉద్యమం (temparance movement) నిర్వహించాడు. పారిశ్రామిక విద్యాలయాన్ని (Industrial school) ను స్థాపించి, సాంకేతిక శిక్షణకు అవసరమైన ఏర్పాట్లు సేన్ ఆధ్వర్యంలోనే జరిగాయి. సేన్ కృషి ఫలితంగా 1872 నాటికి బీహార్, సంయుక్త రాష్ట్రాలు, పంజాబుల్లో బ్రహ్మ సమాజ శాఖలు ఏర్పడ్డాయి. అస్సాం, ఒరిస్సా, మధ్యప్రదేశ్‌కు కూడా ఉద్యమం వ్యాపించింది. కాని దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో దాని ప్రభావం పరిమితమని చెప్పవచ్చు.

బాల్య వివాహాలు పోవాలని, స్త్రీలకు 14 ఏండ్లు, పురుషులకు 18 ఏండ్లు రానిదే వివాహం చేయకూడదని సేన్ ప్రచారం చేశాడు. చివరకు 1872లో "బ్రహ్మ వివాహ చట్టం" (Brahma Marriage Act) చేయబడింది. ఇది సేన్ సాధించిన విజయాల్లో ఒకటి. కాని పద్నాలుగు సంవత్సరాలు నిండని తన మొదటి కుమార్తెను పదహారు సంవత్సరాల వయస్సు కూడా లేని కూచ్ బిహార్ యువ రాజుకు ఇచ్చి 1878లో వివాహం జరిపించాడు. అతని చర్యకు పెక్కు బ్రహ్మ సమాజాలు తీవ్ర నిరసనను వ్యక్త పరచాయి. పర్యవసానంగా శివనాథ శాస్త్రి మొదలైన వారికి అతని నాయకత్వంపై నమ్మకం సడలి, కేశవచంద్ర సేన్‌పై తిరగబడ్డారు. మళ్లీ బ్రహ్మ సమాజం చీలిపోయింది. "సాధారణ బ్రహ్మ సమాజం" (Sadharana Brahmo Samaj) అనే కొత్త సంస్థ శివనాథ శాస్త్రి నాయకత్వంలో ఏర్పడింది. అప్పటినుండి ప్రపంచ మతాల సారాన్ని సమన్వయించే దిశలో సేన్ భావాలు వృద్ధిచెందాయి. భక్తి, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రచారం చేశాడు. తన నాయకత్వంలోని బ్రహ్మ సమాజ కార్యక్రమంలో సంకీర్తనం, భక్తిగీతాలతో భజనలు ప్రవేశపెట్టి, 1881లో "నవ విధాన్" (New Dispensation) ను రూపొందించాడు. సేన్ మరణానంతరం బ్రహ్మ సమాజ ఉద్యమ భవిష్యత్తు పూర్తిగా సాధారణ బ్రహ్మ సమాజంపై ఆధారపడింది.

### 14.2.4 సాధారణ బ్రహ్మ సమాజం

భారతదేశ ప్రగతికి, దీన జనోద్ధరణకు సాధారణ బ్రహ్మ సమాజం విశేష కృషి సల్పింది. ఈ సమాజానికి మొదటి ప్రముఖ విద్యావేత్త, నాటి సాంఘిక, రాజకీయ ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర వహిస్తున్న ఆనంద మోహనబాసు నాయకత్వం వహించాడు. చాలా సంవత్సరాలు దానికి అధ్యక్షునిగా పనిచేశాడు. బెంగాల్‌లో ఆంగ్ల విద్యనభ్యసించన మొదటి తరానికి చెందిన శివచంద్రదేబ్ కొత్త సమాజానికి మొదటి కార్యదర్శి. ఈసమాజానికి

అతని గృహామే ఒక తీర్థయాత్రా స్థలంగా మారింది. సమాజ ప్రచారం కోసం శివనాథ శాస్త్రి (1847 - 1919) బీహార్, బెంగాల్, పంజాబ్, సింధు, గుజరాత్, ఆంధ్ర మొదలైన ప్రాంతాల్లో తిరిగి, బహిరంగ సభల్లో ఉపన్యసించాడు. అతని ఉపన్యాసాలు పండితులను, విద్యార్థులను అధికంగా ఉత్తేజితుల్ని చేశాయి. సమాజ లక్ష్యాల ప్రచారార్థం 'ఇండియన్ మెసెంజర్' ("Indian messenger") అనే పత్రికను స్థాపించాడు. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన బిపిన్ చంద్ర పాల్ ఈ సమాజ క్రియాశీల సభ్యుల్లో ఒకరు.

సాధారణ బ్రహ్మ సామాజికులు కుల విభేదాలను పాటించలేదు. జాతీయ ప్రజాస్వామ్యం, విద్య, స్త్రీ జనోద్ధరణ, యువజన సంక్షేమం, సంఘసంస్కరణ, నిమ్నజాతుల అభివృద్ధి మొదలైన విషయాల్లో శ్రద్ధ వహించారు. ప్రధానంగా అణగారిన నిమ్నజాతుల్లో విద్యావ్యాప్తికి కృషిచేశారు. 1879లో "సిటీ స్కూల్" (City School)అనుపేర కలకత్తాలో ఆంగ్ల - సంస్కృత పాఠశాలను స్థాపించారు. 'బ్రహ్మ యువజన సంఘాన్ని', (Young Mens Association) ను అస్పృశ్యుల సంక్షేమం కోసం 1891లో ఒక ఆశ్రమాన్ని, కలకత్తాలో బ్రహ్మ బాలికలకు శిక్షణాలయాన్ని, వైద్యశాలలను, అనాథ శరణాలయాలను, కుష్టు వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక ఆశ్రమాన్ని వారు స్థాపించారు. సాధనాశ్రమాన్ని స్థాపించి, దానిలో బ్రహ్మ మత ప్రచారకులకు శిక్షణ సౌకర్యాలను కల్పించారు. బాధితులైన మహిళలకు ఉచిత న్యాయ సలహాలను అందించారు. వారి సేవా కార్యక్రమాల ఫలితంగా సాధారణ బ్రహ్మ సమాజం ఒక మిషనరీ సంస్థగా గుర్తింపు పొందింది. అయినప్పటికీ, ఆ సమాజం అల్పసంఖ్యాక విద్యావంతుల సంస్థగా మాత్రమే గుర్తింపు పొందింది. 20వ శతాబ్దంలో కొత్త మత, లౌకిక భావాలను ప్రచారం చేసి, ఒకప్పుడు బ్రహ్మ సమాజం ఆకర్షించిన యువకులను తన వైపుకు ఆకర్షించగలిగింది. పండిట్ శివనాథ శాస్త్రి, ఆనందమోహనబసు కృషి ఫలితంగా, అదనంగా 125 సమాజాలు ఆవిర్భవించాయి.

## 14.3 ప్రార్థనా సమాజం

పశ్చిమ భారతదేశంలో అభ్యుదయ ఉద్యమాలకు ఎలిఫిన్‌స్టన్, జాన్ విల్సన్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసినవారు శ్రీకారం చుట్టారు. వీరు ప్రార్థనలు చేయడానికి, మతసంబంధమైన చర్చల కొరకు 1840లో "పరమహంస మండలి" ని స్థాపించారు. ఇది ఒక రహస్య సంఘం. దాని సభ్యులు మత సంబంధమైన చర్చలకంటే తరచుగా సాంఘిక సంస్కరణ చర్చాగోష్ఠులను నిర్వహించేవారు. సమావేశాలు మరాఠీలో రచించబడిన "రత్నమాల" గ్రంథంలోని భక్తిగీతాలతో ప్రారంభింపబడి, భక్తి గీతాలతోనే ముగిసేవి. సభ్యులందరూ కుల కట్టుబాట్లను పూర్తిగా విడిచివేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. నిమ్నకులస్తుడు వండిన భోజనాన్ని, తెచ్చిన నీటిని స్వీకరించాలి. బ్రహ్మణాధిక్యతను, విగ్రహారాధనను, ఇతర పూజాకార్యక్రమాల్ని తిరస్కరించారు. వితంతు వివాహాలను ప్రవేశపెట్టారు. మండలి శాఖలు రత్నగిరి, పూనా, అహ్మద్‌నగర్‌లలో వెలిశాయి. దాని ప్రభావం పరిమితంగానే ఉంది. మండలి రికార్డులు దొంగిలింపబడి, బహిరంగమైన తర్వాత ప్రజలకు దాని సభ్యులపై తీవ్రమైన ఆగ్రహం కల్గింది. ఈపరిణామం వల్ల మండలి చిన్నాభిన్నమైంది.

అయితే, కొందరు విద్యావంతులు, ఔత్సాహికులు తమ విశ్వాసాలను శాశ్వతంగా విడిచిపెట్టలేదు. వారు బెంగాల్‌లోని బ్రహ్మ సమాజ ఉద్యమ వికాసాన్ని శ్రద్ధతో గమనించారు. బొంబాయికి బ్రహ్మ సమాజ ప్రముఖుడైన కేశవచంద్ర సేన్ మొదటిసారి 1864లోను, రెండోసారి 1868లోను సందర్శించాడు. ఆయన జరిపిన చర్చలు, చేసిన ప్రసంగాలు ఆంగ్ల విద్యను అభ్యసించిన మహారాష్ట్ర విద్యావంతుల్ని ఉత్తేజితుల్ని చేశాయి. ఆ సంవత్సరమే "ప్రార్థనా సమాజం" పేరుతో ఒక ఆస్తిక సమాజం అక్కడ ఆవిర్భవించింది. దాని నాయకుడు విద్యావంతుడైన డాక్టర్ ఆత్మారాం పాండురంగ్. దదోబా పాండురంగ్, భాస్కర్ పాండురంగ్, రామ్ బాలకృష్ణ, యన్. యమ్. పరమానంద్, భారే మహాజన్, డబ్ల్యూ. బి. నౌరంగి. వి.ఏ.మోదక్, డబ్ల్యూ. యమ్ వాగ్లేలు ఇతరసభ్యులు.

పాండురంగ్ సోదరులు మినహా మిగిలిన వారందరూ ఆంగ్ల విద్యాభ్యాసంచేసిన బ్రాహ్మణులు. తర్వాతికాలంలో ఆర్. జి. భండార్కర్, యం. జి. రనడే, కె.నటరాజన్, వి. ఆర్. షిండే, వి. ఎ. సుక్తాంకర్, యన్. జి. వెలిన్కర్ ప్రార్థనా సమాజంలో చేరి అమూల్యమైన సేవలందించారు.

ప్రార్థనా సామాజికులు ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకున్నారు. ప్రార్థనా సమాజ ఆశయాలను మత బోధకులు ప్రచారం చేశారు. అయినప్పటికీ, ఆ ఉద్యమం బహుముఖంగా వ్యాప్తి చెందలేదు. పూనా, కిర్కీ, కొల్హాపూర్, సతారాల్లో మాత్రమే ప్రార్థనా సమాజాలు ఏర్పాటైనాయి. అయితే, తెలుగు ప్రాంతంలోను, ఇంకా దక్షిణాన ప్రార్థనా సమాజం మంచిపేరు తెచ్చుకుంది.

ప్రార్థనా సామాజికులు ప్రతి ఆదివారం సమావేశమై ప్రార్థనలు జరిపేవారు. క్రైస్తవ, బౌద్ధ, హిందూ మత గ్రంథాలనుండి భాగాలను చదివి విన్పించేవారు. ఈకార్యక్రమమంతా ఆదివారం నాడు విధిగా జరిగేది. సమాజ సభ్యులు ఒకే దేవుని పూజిస్తామని, అన్ని మతాలనుండి సభ్యులను గ్రహిస్తామని ప్రతిజ్ఞ చేసేవారు. వారు ఆస్తికులు, వారి ఆస్తిక వాదం సనాతన హిందూ ఆలోచనలపై ప్రధానంగా ఆధారపడింది. వారిలో కొందరు కర్మ, పునర్జన్మ సిద్ధాంతాన్ని గుర్తించలేదు. సమకాలీన హిందూ మతతత్వంపై దాడిని తీవ్రతరం చేయలేదు. ఏవర్గమైన ఆరాధనకై సృష్టించుకొన్న వస్తువును ఆక్షేపించలేదు. సభ్యత్వానికి విగ్రహారాధన మానాలి, కుల వ్యవస్థను విడిచిపెట్టాలి అనే కఠిన నియమాలు లేవు.

సమాజ కార్యక్రమాల్లో రెండో స్థానాన్ని సాంఘిక సంస్కరణ ఆక్రమించింది. ప్రార్థనా సామాజికులు నాలుగు ప్రత్యేక సంస్కరణలపై దృష్టిని కేంద్రీకరించారు. అవి : కుల వ్యవస్థను నిర్మూలించటం, వితంతు వివాహాలను జరిపించటం, బాల్య వివాహాలను నిషేధించటం, స్త్రీ విద్యను ప్రోత్సహించటం. ప్రార్థనా సమాజం కార్మికులకు రాత్రి పాఠశాలలు నెలకొల్పింది. వితంతువులకు గృహాలను, ఉచిత పఠనా మందిరాన్ని, గ్రంథాలయాన్ని, పండరీపూర్‌లో అనాథ శరణాలయాన్ని, 1906 తర్వాత రాంజీ షిండే నాయకత్వంలో దళిత వర్గాల మిషన్ (Depressed classes Mission of India) ను నిర్వహించింది. క్రమంగా ప్రార్థనా సమాజ మత కార్యక్రమాలు తగ్గిపోయాయి. 20వ శతాబ్దారంభానికే ప్రాధాన్యత కోల్పోయి, ఒక ప్రార్థనల సమాజంగా మాత్రమే మిగిలిపోయింది.

బొంబాయి ప్రార్థనా సమాజ్ ప్రధాన ప్రతినిధిగా మహదేవ్ గోవింద రనడే వ్యవహరించాడు. ఆయన నాయకత్వంలో ఒక కొత్త సంప్రదాయం ఆవిర్భవించింది. సత్ సంప్రదాయ విలువలను నాశనం చేయకుండా నైతిక, వైజ్ఞానిక ప్రక్షాళన సాధ్యమని రనడే విశ్వసించాడు. హిందూ మతాన్ని అంతం చేయకుండా, దాన్ని శుద్ధిచేయాలనే లక్ష్యంతో ప్రార్థనా సమాజంలో చేరాడు. సాంఘిక సంస్కరణ సాధించటానికి మత సంస్కరణ అనివార్యమని భావించలేదు. బ్రహ్మ సమాజం, ఆర్య సమాజాలంటే గౌరవాన్ని ప్రదర్శించాడు. అయితే, ఆ ఉద్యమాల్లో గోచరించే తిరుగుబాటు ప్రవృత్తి రనడే ప్రవర్తనలో, ఆలోచనల్లో కన్పించదు. అతడు తిరుగుబాటు విధానానికి అతడు పూర్తిగా వ్యతిరేకి. తన అనుచరులను హిందూ సంప్రదాయాన్ని విడచిపెట్టవద్దనీ, ప్రతి వ్యక్తీ తన సంప్రదాయాన్ని రక్షించుకోవటమే తన ప్రధాన బాధ్యత అనీ చెప్పాడు. సంస్కరణ వాదులు కుళ్లి కృశించిపోయిన అంగాలను తొలగించి, సమాజానికి తిరిగి పరిపుష్టిని, బలాన్ని చేకూర్చాలన్నాడు.

బొంబాయి రాష్ట్రంలో మత, సాంఘిక, రాజకీయ అభివృద్ధి ప్రణాళిక ఆధారంగా ఒక ప్రత్యేక సంప్రదాయం ఆవిర్భవించింది. పూనా దానికి కేంద్రం. మేథావి వర్గం మత, సామాజిక పరిస్థితులపై తిరుగుబాటు జెండా ఎగురవేసింది. 'లోక హితవాది' గా ప్రశంసలందుకున్న సర్దార్ గోపాల్ హరి దేశముఖ్ (1823 - 1892) విద్య, మత విషయాల్లో బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని నిరసిస్తూ దాడి ప్రారంభించడంతో, ఆ రాష్ట్రంలో తిరుగుబాటు

BRAOU

ప్రారంభమైంది. ఆయన ఉద్యమం చాల సంవత్సరాలు కొనసాగింది. పత్రికా సంపాదకుడైన గోపాల్ గణేష్ అగార్కర్ (1857 - 1895) హరి దేశముఖ్ ఉద్యమాన్ని కొనసాగించాడు. తర్వాత కాలంలో మహారాష్ట్ర బ్రాహ్మణులైన మహదేవ గోవింద రనడే (1842 - 1901), కాశీనాథ్ త్రింబక్ తెలాంగ్ (1850 - 1893), రామకృష్ణ గోపాల్ భండార్కర్ (1837 - 1925) సాంఘిక సంస్కరణోద్యమ ప్రవంతి గమనాన్ని నిర్వచించారు. రనడే మిత వాదిగా గుర్తింపు పొందాడు. హరి దేశముఖ్ సమకాలీనుడు జోతిబా గోవింద్‌రావ్ పూలె (1827 - 1890). 1873లో 'సత్యశోధక్ సమాజ్'ను స్థాపించి అణగారిన వర్గాల వారు చైతన్యవంతులు కావడానికి కృషిచేశాడు. బ్రాహ్మణేతర వర్గాల అభ్యున్నతికై ప్రారంభమైన ఉద్యమానికి ఈసమాజం కేంద్ర బిందువు.

దేవేంద్రనాథ్ టాగూర్ నాయకత్వ కాలంలో బొంబాయి రాష్ట్రంలో మత, సాంఘిక సంస్కరణ సంప్రదాయం అభివృద్ధి చెందింది. దాని ప్రభావం ముఖ్యంగా పశ్చిమ భారతంలో తర్వాతి తరాల వారిపై గాఢంగా పడింది. బెంగాల్ కంటే పశ్చిమ భారతంలో మత, సాంఘిక దురాచారాల తీవ్రత తక్కువ. బొంబాయి సంస్కర్తల్లో విప్లవాత్మక ధోరణి తక్కువ. అందువల్ల అక్కడ మత, సాంఘిక తిరుగుబాట్లు తీవ్రరూపం దాల్చలేదు. ప్రార్థనా సమాజికులు హిందూ మతంలో, హిందూ సమాజంలో విశ్వాసం ప్రకటించారు. వారు బ్రహ్మ సామాజికులలాగే హిందూ సమాజానికి దూరం కాలేదు. నిరసన మాత్రమే ప్రకటించారు. మత ప్రమేయం లేకుండా ఆచార కర్మలను అనుసరించారు. ప్రత్యేక బొంబాయి విధానం ఫలితంగా ఎటువంటి సంక్షోభం, కలహాలు లేకుండా సంస్కరణ అభివృద్ధి చెందింది.

మత సంస్కరణ విషయంలో బెంగాల్ సంస్కర్తల మధ్య, బొంబాయి సంస్కర్తలమధ్య అభిప్రాయ భేదాలు స్పష్టంగా బయట పడ్డాయి. మత విశ్వాసాలు, మత ప్రవర్తన మార్పు చెందందే సాంఘిక సంస్కరణ దుస్సాధ్యమని బెంగాల్ నాయకుల ప్రగాఢ విశ్వాసం. పాశ్చాత్య భావాలకు వ్యతిరేకంగాగాని, అనుకూలంగా గాని వారు స్పందించారు. పాశ్చాత్య భావాలవల్ల ప్రభావితులైన బెంగాలీయుల నమ్మకాలు, అలవాట్లు మారాయి. వారు బ్రహ్మ సమాజ సభ్యులయ్యారు.

మత సంస్కరణోద్యమం బొంబాయి రాష్ట్రంతో పోలిస్తే, బెంగాల్‌లోనే ఎక్కువగా విజయవంతమైందని స్పష్టపడుతుంది. ఫలితంగా బెంగాల్‌లో మత సంస్కరణ, సాంఘిక సంస్కరణతో సమానంగా ముందుకు సాగింది. అయితే, బొంబాయి రాష్ట్రంలో మత సంస్కరణ నాస్తికతకు దారితీసింది. బెంగాల్‌లో సంస్కర్తల మతం బ్రహ్మ మతం. అందువల్ల అక్కడి సంస్కర్తలు బ్రహ్మ మత సిద్ధాంతాలకు అనుగుణంగా నడచుకున్నారు. ఈ పరిస్థితి సాంఘిక సంస్కరణ వ్యాప్తికి అవరోధంగా పరిణమించింది. బొంబాయిలో సంస్కర్తలు వారి పూర్వీకుల మతాన్ని కొనసాగించడం ద్వారా సామాన్య ప్రజలకు దూరం కాలేదు. బెంగాల్‌లో సాంఘిక సంస్కరణ కుల సమస్యగా మారింది. బొంబాయిలో సంస్కర్తలు తాము ఏదో ఒక ప్రత్యేక కులానికి చెందిన వారుగా భావించలేదు. సంస్కరణ బొంబాయిలో సర్వసామాన్యమైంది. బెంగాల్‌లో సంస్కరణ కృషి బ్రహ్మ సమాజేతరులతో సంబంధం లేకుండా పోయింది.

బొంబాయి రాష్ట్ర మత, సాంఘిక తిరుగుబాటుదార్లు హేతు వాదం, క్రొత్త సంస్కరణ ప్రతిపాదనల ద్వారా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడంలో ఆసక్తిని ప్రదర్శించారు. బెంగాల్ బ్రహ్మ సామాజికులలాగే వారు కొత్త మత సంప్రదాయాన్ని అనుసరిస్తూ, సమాజం నుండి దూరం కాలేదు. వారు నాటి సామాజిక వ్యవస్థలో నమ్మకం ప్రదర్శించారు. పాశ్చాత్య భావనలను, పాశ్చాత్య సంస్థలను ప్రవేశపెట్టడం ద్వారా భారతీయ సంప్రదాయాన్ని మార్చడానికి ప్రయత్నించారు. సాంప్రదాయ సమాజంతో పూర్తిగా తెగతెంపులు చేసుకోడానికి అంగీకరించక సనాతనుల అభిప్రాయాలను అనుగుణంగా తమ నమ్మకాలను, ప్రవర్తనను మార్చుకున్నారు. కుల నియమాలను

ఉల్లంఘించినందుకు బొంబాయి సంస్కర్తల్లో కొందరు బహిష్కరణకు గురయ్యారు. కాని వారు మాత్రం కుల సంఘాల నాయకులను ఏవిధంగానూ అవమానపర్చడానికి ప్రయత్నించలేదు. పాత ఆచారాలను ఉపన్యాసాలు, వ్యాస రచనల ద్వారా తీవ్రంగా ఖండించారు. వారి సంస్కరణ భావాలను ప్రజలు వెంటనే ఆమోదించడంగానీ, సహించడం గానీ చేశారు. బెంగాల్‌లో పరిస్థితి వేరు. ప్రచారం, సామాజిక సేవ, విద్యా వ్యాప్తి బొంబాయి వాళ్ల ప్రధాన సాధనాలు. మత సంస్కరణ, విద్యావ్యాప్తి, విగ్రహారాధన వ్యతిరేకత బెంగాల్ సంస్కర్తల సాధనాలు. బొంబాయి ప్రార్థనా సమాజం సిద్ధాంతపరంగా సేన్ నాయకత్వంలోని బ్రహ్మ సమాజాన్ని పోలింది. విగ్రహారాధనను, పురోహితుల పాత్రను వ్యతిరేకించింది. విగ్రహారాధన విషయంలో అఖిల భారత బ్రహ్మ సమాజంలాగే ప్రార్థనా సమాజం కఠిన వైఖరి అవలంబించలేదు. కుల వ్యవస్థ, విగ్రహారాధన విషయాల్లో సరళ విధానాన్ని అవలంబించింది. వైష్ణవ భక్తి సారస్వతం బెంగాల్ నాయకులను ప్రభావితం చేసింది. బొంబాయిలో మరాఠీ, గుజరాత్ సాధువులు (Saints) రాసిన కథలు, గీతాలు సంస్కరణ వాదులను ఉత్తేజపరచాయి.

## 14.4 మద్రాస్ రాష్ట్రంలో మత, సాంఘిక సంస్కరణల కృషి

బెంగాల్, బొంబాయి రాష్ట్రాల్లో ప్రగతి సాధించిన తర్వాతే సంస్కరణోద్యం మద్రాస్ రాష్ట్రంల వారి దృష్టిని ఆకర్షించింది. 1864లో బ్రహ్మ సమాజ నాయకుడైన కేశవచంద్ర సేన్ మద్రాస్ సందర్శించి, బ్రహ్మ సమాజ సిద్ధాంతాలను వివరిస్తూ చేసిన ప్రసంగాలు మేధావులను ఆకర్షించాయి. వారు మద్రాస్ నగరంలో 'వేద సమాజం'' ను స్థాపించి బ్రహ్మ సమాజ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రచారం చేశారు. వేద సమాజమే 1871 నుండి "దక్షిణ భారత బ్రహ్మ సమాజం'' అనే పేరుతో పిలువబడేది. దానిలో చేరిన సభ్యులు మానసికోపాసన, దైవారాధనను జరిపే వారు. కుల, మత, జాతి భేదాలను పాటించలేదు. మూఢాచారాలను, విగ్రహారాధనను వ్యతిరేకించారు. శ్రీధరులు నాయుడు, దొరైస్వామి అయ్యంగార్ల కృషి ఫలితంగా తంజావూరు, కోయంబత్తూరు, తిరుచనాపల్లి, బెంగుళూరులలో బ్రహ్మ సమాజాల స్థాపన జరిగింది. రఘుపతి వెంకటరత్నం, కందుకూరి వీరేశలింగం దక్షిణ భారత బ్రహ్మ సమాజ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. జయంతి వెంకట నారాయణ, కోటంరాజు పున్నయ్య, బడుగు జాతి సముద్ధరణ సంఘ నాయకుడైన స్వామి బ్రహ్మానంద మద్రాస్ నగరంలో బ్రహ్మ సమాజ ప్రచారం కొనసాగించారు. కాలికట్‌లో సమాజావిర్భావానికి కారకుడు ఎ. గోపాలన్.

బెంగాల్ నుండి బయలుదేరిన బ్రహ్మ సమాజ ఉద్యమం ఆంధ్రదేశంలోని యువకులను బాగా ఆకర్షించింది. 1870 నుండి 1935 వరకు ఆ ఉద్యమం ప్రచారంలో ఉంది. ఈ ప్రాంతంలో కందుకూరి వీరేశలింగం ప్రముఖ ప్రార్థనా సమాజ నాయకుడు. రాజమండ్రి కేంద్రంగా సంస్కరణ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 1878లో రాజమండ్రిలో వీరేశలింగం ప్రార్థనా సమాజం పేరుతో బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. రాజమండ్రిలో ప్రార్థనా మందిరాన్ని, బెంగుళూర్, మద్రాసుల్లో కూడా బ్రహ్మోపాసనామందిరాలను కట్టించాడు. తాయి సూర్య ప్రకాశరావు నాయుడు, దుగ్గిరాల వెంకట సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో 1888లో కాకినాడలో బ్రహ్మ సమాజ స్థాపన జరిగింది. రఘుపతి వెంకటరత్నం నేతృత్వంలో కాకినాడ ఆంధ్రదేశంలోని బ్రహ్మ సమాజాలన్నింటికీ కేంద్రంగా మారింది. ఆస్తిక భాండాగారం, ఉచిత పఠనాలయం, యువజన సంఘం ఏర్పడ్డాయి. ఆంధ్రలో ఏకైక అనాధ శరణాలయం పిఠాపురం రాజాగారి ఆర్థిక సహాయంతో నెలకొల్పబడింది.

బెంగాల్ బ్రహ్మ సమాజ ప్రముఖులైన హేమచంద్ర సర్కార్, పండిట్ శివనాథ శాస్త్రి ఎన్నోసార్లు ఆంధ్రదేశానికి విచ్చేసి బహిరంగ సభల్లో ఉపన్యసించారు. చంద్ర పాల్, రామానంద చటర్జీ, రవీంద్రనాథ టాగూర్, సీతానాథ తత్వభూషణ్ మొదలైన ప్రముఖులు కూడా ఆంధ్రలో బ్రహ్మ సమాజ ప్రచారం చేశారు. వారు ఎందరినో ఉత్తేజపరచడంలో కృతకృత్యులయ్యారు. క్రమంగా మచిలీపట్నం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, చీరాల,

BRAOU

బాపట్ల, విశాఖపట్నం బ్రహ్మ సమాజ మందిరాలు నిర్మించబడ్డాయి. 1917 నాటికే కాకినాడ, విజయనగరం, గుంటూరు మొదలైన పురములందు యువజన ప్రార్థనా సమాజాలు ఆవిర్భవించాయి. ప్రత్యేకంగా విద్యార్థులకొరకు ఈసమాజాలు ఏర్పాటు చేయబడినవి. విద్యార్థుల్లో పరిశుద్ధాస్తిక మతాభిప్రాయాలు వ్యాపింపజేసి, వారిని భక్తి పరులుగా, ధర్మ పరాయణులుగా చేయటానికి యువజన ప్రార్థనా సమాజాలు తోడ్పడ్డాయి. బ్రహ్మ, ప్రార్థనా సమాజాల పెద్దలు వాటి అభివృద్ధికి సాయపడ్డారు. మన్నవ బుచ్చయ్య పంతులు. శ్రీధరులు నాయుడు, ఆకురాతి చలమయ్య, కామరాజు హనుమంతరావు, కవికొండల సాంబశివరావు, పాలపర్తి నరసింహం మొదలైన బ్రహ్మ సమాజికులు కలకత్తా వెళ్ళి బెంగాలీ భాష నేర్చుకొని, వంగ భాషలో రచించబడ్డ ఎన్నో గ్రంథాలను తెలుగులోకి అనువదించి, బ్రహ్మ సమాజ సిద్ధాంతాల వ్యాప్తికి పాటుబడ్డారు. తెలుగులో మరికొన్ని స్వతంత్ర గ్రంథాలు కూడా వెలువడ్డాయి. బ్రహ్మ ధర్మ వ్యాప్తికై బహుదా ఉపయోగపడ్డ గ్రంథాల్లో ముఖ్యమైనవి, 'బ్రహ్మ మతం' 'బ్రహ్మ ధర్మ దీక్ష', 'బ్రహ్మ మత సిద్ధాంతాలు', 'బ్రహ్మ గీతోపనిషత్తు', 'జీవన వేదము' 'రామమోహన కథ', ధర్మపుత్రుడు, ఉత్తమ వివాహము. 'ఆంధ్ర బ్రహ్మ గీతాంజలి', 'తత్వబోధిని', 'వివేకవర్ధని, 'సత్యసంవర్ధని', 'ఈశ్వరవాది — (Theist), 'ధర్మ సాధని', 'ధర్మ జ్యోతి', మొదలైన తెలుగు పత్రికలు బ్రహ్మ ధర్మ వ్యాప్తిలో తమవంతు పాత్ర నిర్వహించాయి. బ్రహ్మ, ప్రార్థనా సమాజికులు తాము గ్రహించిన నూతన విశ్వాసాలకు అనుగుణంగా జీవితాలను గడపటానికి ప్రయత్నించారు. దేశిరాజు పెదబాపయ్య, పిళ్ళారిశెట్టి శీతారామయ్య మొదలైన యువకులు అనుష్టాన దీక్ష గైకొన్నారు. వారి సంఖ్య క్రమంగా పెరిగింది.

మద్రాస్ రాష్ట్రంలో బ్రహ్మ సమాజం కంటే ప్రార్థనా సమాజ ప్రభావమే ఎక్కువ. అప్పటి మద్రాస్ రాష్ట్రంలో ఉన్న 29 సమాజాల్లో 18 ప్రార్థనా సమాజాలే.

బ్రహ్మ సమాజ ఉద్యమం 20వ శతాబ్దంలో క్రమంగా బలహీనపడింది. ఆంధ్ర బ్రహ్మ సమాజకులు ఏకేశ్వరోపాసన ఆవశ్యకమని నమ్మారు. కాని వారు విగ్రహారాధనను వదలివేయలేదు. ప్రధాన సంస్కారాలన్నింటిని మామూలు హిందూ పద్ధతినే జరిపించేవారు. సమాజికులు నమ్మింది ఒకటి, ఆచరించింది వేరొకటి. బ్రహ్మ ధర్మమందు విశ్వాసం ప్రకటించికూడా, అనుష్ఠింపని వారితో ఆంధ్ర బ్రహ్మ సమాజాలు నిండిపోయాయి. బ్రహ్మ సమాజ ఉద్యమం వేరొక ముఖ్య కారణం వల్ల కూడా బలహీనపడింది. అది దేశంలో బయలుదేరిన రెండు భారీ ఉద్యమాల తాకిడి సమాజ కార్యక్రమాల్లో ఉత్సాహం చూపిస్తూ వచ్చిన సభ్యులను జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలో నిర్వహించబడ్డ స్వాతంత్ర పోరాటం, బ్రాహ్మణేతర ఉద్యమాల ఆదర్శాలు ఆకర్షించాయి.

బ్రహ్మ మతం అందించిన ఉదార ఆశయాల ప్రభావం వల్ల సంఘసంస్కరణ బలం పుంజుకుంది. 19వశతాబ్దం రెండో అర్థభాగంలో మద్రాస్ రాష్ట్ర సాంఘిక సంస్కర్తలు జాతీయ సాంఘిక సంస్కరణ ఉద్యమానికి ఎనలేని సేవచేశారు. మద్రాస్ నగరంలో సాంఘిక సంస్కరణ ప్రయత్నాలు 1892లో ప్రారంభమయ్యాయి. ఆసంవత్సరం ఎ. సుబ్బారావు, కె. సుబ్బారావు, బి. వరదాచార్యులు "మద్రాస్ హిందూ సాంఘిక సంస్కరణ సంఘాన్ని (Madras Hindu Social Reform Association) స్థాపించారు. దానిలో చేరిన సభ్యుల సంఖ్య అతిస్వల్పం. దాని సభ్యులు స్త్రీ విద్యను ప్రోత్సహించాలని, నైతిక ప్రమాణాలను నెలకొల్పాలని, మధ్యపానం విసర్జించాలని వాగ్దానాలు చేశారు. రజస్వలానంతర వివాహాలను సమర్థించారు. విదేశీయానం చేసినవారితో, వితంతువులను వివాహమాడిన వారితో కలిసి భోజనాలు చేయాలని నిర్ణయాలు చేశారు.

ఆంధ్రలో కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు సాంఘిక, మత సంస్కరణలకు మూలస్తంభాలవంటివారు. వీరిద్దరూ ఆస్తిక సమాజ సభ్యులు.

వీరేశలింగం తలపెట్టిన సంఘ సంస్కరణలకు బీజం బ్రహ్మ మతం నుండే వచ్చింది. ఆయన కార్యకలాపాలకు రాజమండ్రి కేంద్రం. దురాచారాలపై పత్రికల ద్వారా, ఉపన్యాసాల ద్వారా దాడులు చేశాడు. బాల్య వివాహాలవల్ల వచ్చిన చెడులను వివరించి, రజస్వలానంత వివాహాలను ప్రచారం చేశాడు. వితంతు వివాహాలు శాస్త్రసమ్మతమేనన్న విషయాన్ని స్పష్టంగా విశదీకరిస్తూ వ్యాసాలు రాశాడు. స్త్రీ పునర్వివాహాలు జరిపించాడు. ప్రజా సామాన్యానికి అర్థమయ్యే సరళమైన భాషలో గ్రంథాలు రాశాడు. రాజమండ్రి సాంఘిక సంస్కరణ సంఘాన్ని (1878), వితంతు వివాహ సంఘాన్ని (1891) స్థాపించాడు. రాజమండ్రి, మద్రాస్‌ల్లో వితంతు శరణాలయాలను తెరచాడు.

రఘుపతి వెంకటరత్నం నాయుడు (1862 - 1939) కార్యకలాపాలకు మచిలీపట్నం, తర్వాత కాకినాడ కేంద్రమైంది. వేశ్యా వృత్తి నిర్మూలనకై కృషిచేశాడు. మద్యపాన నిషేధం, అస్పృశ్యతా నివారణ మొదలైన సంఘ సంస్కరణోద్యమాలను గాంధికంటే ముందు ప్రారంభించాడు. కాకినాడ పి. ఆర్. కళాశాలలో హరిజన విద్యార్థులకు తొలిసారిగా నాయుడుగారు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కాలంలో (1905 - 1919) ప్రవేశం లభించింది. హరిజనులకు, బాలికలకు ఆ కళాశాలలో విద్యా బోధన ఉచితం. హరిజన బాలికలకు సవర్ణులతో వివాహాలు జరిపించారు.

## 14.5 ఆర్య సమాజం ✓

19వ శతాబ్దం ఉత్తరార్థంలో ఆవిర్భవించిన మత, సాంఘిక ఉద్యమాల్లో అతి ప్రధానమైంది ఆర్య సమాజ ఉద్యమం. హిందూ మతాన్ని సంస్కృతిని సమర్థించి, హిందూ సమాజంలోని దురాచారాలను ఖండించి, ప్రాచీన హిందూ మత పునరుద్ధరణకై కృషి చేసింది. హిందువులందరినీ సమైక్యపరచడానికి శ్రమించింది. అందువల్ల దాని ప్రభావం రాజకీయ పరిణామాలను కూడా కొంతవరకు ప్రభావితం చేసింది. ఈ ఉద్యమం 20వ శతాబ్దం తొలి రోజుల్లో కూడా అత్యధిక ప్రజాదరణను పొందింది.

హిందూ మతాన్ని సంస్కరించడానికి స్వామి దయానంద సరస్వతి (1824 - 1883) 1875లో బొంబాయిలో ఆర్య సమాజ్‌ను స్థాపించాడు. అతని నేతృత్వంలో ఉత్తర భారతంలో ఆర్య సమాజం ఒక శక్తివంతమైన ఉద్యమంగా అభివృద్ధి చెంది, భారతదేశ భవిష్యత్తును ప్రభావితం చేసింది. భారత సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమ ప్రముఖ నాయకుల్లో దయానంద సరస్వతి ఒకరు. ఆయన ప్రాచీన వేద ఆదర్శాన్ని ఆధారంగా ప్రజలకు నూతన జీవనాన్ని ప్రసాదించడంలో కృతకృత్యుడయ్యాడు. అతనికి వేదాల్లోని ఆదర్శాలు ఉన్నతమైనవి. వాటి ఆధారంగా దేశ పునర్నిర్మాణానికి సంకల్పించాడు. అసంఖ్యాక సామాన్య ప్రజానీకానికి తన సందేశాన్ని విన్పించాడు. అందుకే దయానందుని ఒక కొత్త తరహా నాయకునిగా పరిగణించవచ్చు.

గుజరాత్‌లోని కథియావార్ సంస్థానానికి చెందిన మోర్వి (Morvi) లో 1824లో దయానందుడు జన్మించాడు. ఇతని తండ్రి సనాతన బ్రాహ్మణుడు, నిత్య శివారాధకుడు కావున మూలశంకర్ (Mul Shankar) అనే పేరుపెట్టి, సంస్కృత భాషను నేర్పించాడు. నర్మదా నదీతీరానగల ఆశ్రమంలో ఉన్న విద్వాంసులైన సన్యాసుల్ని ఆశ్రయించి, వారితో కలిసి వేదాంత తత్వాన్ని అధ్యయనం చేశాడు. వారిలో ఒకరైన స్వామి పరమానంద సరస్వతి ఆధ్వర్యంలో సన్యాసం స్వీకరించి,ఆయనచేత దయానంద సరస్వతి అను పేరు పొందాడు. 1860లో దయానందుడు మధురలో (Mathure) సంస్కృత పండితుడైన స్వామి విరజానందుని శిష్యుడయ్యాడు. విగ్రహారాధన వ్యతిరేకించడం మొదలైన అతని భావాలను దయానందుడు స్వీకరించాడు. రెండున్నర

BRAOU

సంవత్సరాల తర్వాత విరజానందుడు సత్యాన్ని ప్రచారం చేయమని, వేదాలు ప్రబోధించిన సూత్రాలను పునరుద్ధరించమని తన శిష్యుని ఆజ్ఞాపించాడు.

1868 నుండి దయానందుని మత, సాంఘిక సంస్కరణ ఉద్యమం ప్రారంభమైంది. పౌరాణిక హిందూ మతం బోధించిన బహుదేవతారాధనను వేద ప్రచారానికి విరుద్ధమని ఖండించాడు. సర్వాంతర్యామి అయిన భగవంతుడు ఒకడేనని, అతనిని మాత్రమే ప్రార్థించమని ఉద్బోధించాడు. పశ్చిమ, మధ్య, ఉత్తర భారతంలోని ముఖ్యమైన పట్టణాలను దర్శించాడు. ఆగ్రా, గ్వాలియర్, జైపూర్, కాశీ, అజ్మీర్, బొంబాయి, పూనా, కలకత్తా పాట్నా, జోధ్‌పూర్‌ల్లో బహిరంగ సభల్లో ప్రసంగించి, ఆయా ప్రాంతాల్లో ప్రఖ్యాతిగాంచిన పండితులతో బహిరంగ చర్చా గోష్ఠుల్లో పాల్గొన్నాడు. దేవాలయాల్లో ప్రతి దినం ఆయన తన అసమాన మేధా సంపత్తితో కూడుకొన్న ప్రసంగాల్ని వినడానికి జనం తండోపతండాలుగా చేరేవారు. ప్రాచీన సనాతన ఛాందస వాదులు ఇతని అభిప్రాయాన్ని వ్యతిరేకించేవారు. తరచూ అష్టకష్టాలకు గురిచేశారు. ఇటువంటి హింసాత్మక ప్రతిఘటనను దయానందుడు మౌనంగా, హుందాతనంతో సహించాడు.

కలకత్తాలో దయానందుడు బ్రహ్మ సమాజ నాయకులైన దేవేంద్రనాథ టాగూర్, కేశవచంద్ర సేన్‌లను కలుసుకున్నాడు. వారు తన ప్రసంగాల్ని సంస్కృతానికి బదులు హిందీలో కొనసాగిస్తే, జనబాహుళ్యానికి అర్థమై మరింత ప్రయోజనం ఉంటుందని దయానందునికి సూచించారు. అప్పటినుండి వారి సూచన ప్రకారం నడుచుకొన్నాడు. తిరుగు ప్రయాణంలో బీహార్, సంయుక్త రాష్ట్రాలు (United Provinces) సందర్శించాడు. ఆ కాలంలోనే "సత్యార్థ ప్రకాష్" (The Light of Truth) గ్రంథాన్ని హిందీలో రాసి, 1875లో ప్రచురించాడు. ఆయన ఆశయాలు ఈ గ్రంథం ద్వారా బహిర్గతమైనాయి. ప్రపంచంలో ఉన్న అనేక గొప్ప మతాలను గూర్చి తన అభిప్రాయాన్ని వ్యక్తపరచాడు. మానవునికి, మతానికి మధ్య ఉన్న అనేక లౌకిక, తార్కిక విషయాలను వాటినుండి ఉత్పన్నమైన సమస్యలను దయానందుడు తన గ్రంథంలో విపులంగా చర్చించాడు.

100 మంది సభ్యులతో బొంబాయిలో ఆర్య సమాజాన్ని దయానందుడు 1875లో స్థాపించాడు. ఆ సమయంలో అక్కడ ప్రార్థనా సమాజంతో సంబంధాలు ఏర్పరచుకొన్నాడు. ఆర్య సమాజ కేంద్రాలయాన్ని 1877లో లాహోర్ నగరానికి మార్చాడు. అక్కడ స్థానిక కళాశాల విద్యార్థులను అమితంగా ఆకర్షించాడు. ఆర్య సమాజ సిద్ధాంతాలు ఇవి :

1. నిజమైన జ్ఞానానికి భగవంతుడే మూలం.

2. భగవంతుడు సంపూర్ణ సత్య స్వరూపుడు. అతడే సమస్త జ్ఞానం, అనంత శక్తి స్వరూపుడు, దయా స్వరూపుడు, పరిశుద్ధుడు, అనంతుడు, స్థిరుడు, ఆద్యంతాలు లేనివాడు సర్వాంతర్యామి, భూతనాథుడు, నిర్వికారుడు, సృష్టికి మూలం. అతడే ప్రార్థనలకు అర్హుడు.

3. వేదాలు నిజమైన విజ్ఞాన భాండాగారాలు. వాటిని చదవటం, చదివే వారినుండి వినడం, ఇతరులచే చదివించడం ఇతరులకు వినిపించడం ప్రతి ఆర్య సమాజికుని విద్యుక్త ధర్మం.

4. ప్రతి ఆర్య సమాజికుడు సత్యాన్ని స్వీకరించి అసత్యాన్ని విడచిపెట్టాలి.

5. మంచి, చెడులను బాగా ఆలోచించిన అనంతరమే సత్కర్మాచరణ చేయాలి.

6. ఆర్య సమాజం ప్రధాన లక్ష్యం ప్రపంచానికి మంచి మార్గంలో ఉపయోగపడటం, ప్రయోజనం చేకూర్చడం. మానవజాతిని భౌతికంగా, ఆధ్యాత్మికంగా, సాంఘికంగా ఉన్నత స్థితికి తీసుకువెళ్లడం.

7. ప్రతి మానవునీ ప్రేమతో ఆదరించాలి. అతని ప్రతిభను గుర్తించి జీవించడానికి అందరూ ప్రయత్నించాలి.

8. అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞాన సముపార్జన చేయాలి.

9. ఒకరి అంతరంగిక విషయాల్లో ఇంకొకరి ప్రమేయం ఉండరాదు. సమాజానికి కీడు కల్గించే విధంగా ఇతరులు ప్రవర్తించరాదు. ప్రతి వారికీ స్వవిషయాల్లో స్వేచ్ఛ ఉండాలి.

వేదాలు భ్రాంతి రహితం (Vedic infellibility) అని దయానందుడు విశ్వసించాడు. కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలను అంగీకరించాడు. వంశపారంపర్యంగా వస్తున్న కుల వ్యవస్థను, దుష్పలితాలకు దారితీసే ఆచారాల్ని నివారించాలనీ, జాతి అభ్యుదయానికి ఆ మార్గం అత్యవసరమని పేర్కొన్నాడు. కులానికి ప్రధాన ఆధారం తెలివితేటలేననీ, పుట్టుక ఎంతమాత్రం కాదని, వేదాలను అందరూ చదవవచ్చని సిద్ధాంతీకరించాడు. వేదాల భావం నాలుగు వర్ణాలు లేక వర్గాలు మాత్రమేనని వాదించాడు. విగ్రహారాధనను తోసిపుచ్చాడు. ఈ విధంగా దయానందుడు మత, సామాజిక, వైజ్ఞానిక స్వేచ్ఛకు అమూల్యమైన సేవ చేశాడు.

దయానందుడు సందర్శించిన అనేక నగరాల్లో ఆర్య సమాజాలను స్థాపించి, వేదాధ్యానానికి విద్యాలయాలను నెలకొల్పాడు. పంజాబ్, సంయుక్త రాష్ట్రాల్లో వేద పాఠశాలలు వెలిశాయి. ఉత్తర భారతంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన కృషి అద్భుత విజయాలను సాధించింది. జోధ్‌పూర్‌లో దయానందుడు తనువు చాలించాడు.

దయానందుడు హిందూ ఆలోచనా సరళిని, హిందూ మతాన్ని, హిందువుల జీవిత విధానాన్ని గొప్పగా మార్చాడు. వైదిక జీవితం, వైదిక ఆలోచన ఆధారంగా మౌలికమైన అంశాలతో కొత్త జీవన స్రవంతిలో జాతీయ జీవనాన్ని తీర్చిదిద్దాలని కృషి చేశాడు. భారతదేశం దాని పురాతన వైభవం తిరిగి పొందేటట్లు చేయాలని కలలు కన్నాడు. ఆర్య సమాజానికి ప్రజాస్వామిక ప్రతిపత్తిని కల్పించాడు. స్వదేశీయమైన సొంత పరిపాలన భారతదేశానికి అవసరమని, ప్రజలు ఎప్పుడూ ఒకే వ్యక్తి చేతికింద పరిపాలింపబడటం కంటే, వారు తమంతతాము సంఘాలు (Councils) గా ఏర్పడి, పరిపాలన నిర్వహించడం ఉత్తమమైందనీ పేర్కొన్నాడు. స్వేచ్ఛాయుతమైన స్వయం పాలన ఉత్తమమైందని చెప్పిన మొదటి భారతీయుడు దయానందుడు. వేదాల్లో తార్కిక వాదం, హిందూ సాంప్రదాయ భావజాలం దయానందుని బోధనల్లో కనిపిస్తాయి.

ఆర్య సమాజం ప్రారంభం నుండి శక్తివంతమైన సేవాసంస్థగా రూపుదిద్దుకొని, ప్రజలను ఆకర్షించింది. విద్యా రంగంలోనూ, ఇతర రంగాల్లోను ఆ సమాజం చేపట్టిన అభ్యుదయ కార్యక్రమాలు ఆ ఉద్యమ వ్యాప్తికి బాగా దోహదపడ్డాయి. దయానందుని మరణానంతరం ఆయన స్మృతి చిహ్నంగా ఆయన అనుచరులు ఆంగ్లో, వేదిక్ కళాశాలను స్థాపించి హిందీ, ఇంగ్లీష్, సంస్కృత సాహిత్యాలను, వేదాలను, సాంకేతిక శాస్త్రాలను విద్యార్థులకు బోధించే ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. దాని ఫలితంగా 1886లో "దయానంద ఆంగ్లో, వేదిక్", ఉన్నత పాఠశాలను లాహోర్‌లో స్థాపించారు. 10 సంవత్సరాల కాలంలో ఆ సంస్థ డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేట్ తరగతులతో అభివృద్ధి చెందింది. లాహోర్ కేంద్రంగా అనతికాలంలోనే పంజాబ్‌లోను, ఉత్తర భారతదేశంలోను డి. ఎ. వి. కళాశాలలు, ప్రాథమిక, సెకండరీ, మోడల్ పాఠశాలలు, సాంకేతిక శిక్షణా సంస్థలు, పారిశ్రామిక కేంద్రాలు ఆవిర్భవించాయి. స్త్రీలకు కూడా ప్రత్యేక పాఠశాలలను నెలకొల్పి, అందులో బాలికలకు ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేశారు.

1890 నాటికి లాలా మున్షీరామ్, లాలా దేవరాజ్, వారి అనుచరులు జలంధర్‌లో ఆర్యకన్యా పాఠశాలను స్థాపించి, బాలికలకు క్రైస్తవ మిషనరీ ప్రభావంలేని విద్యను నేర్పారు. వారు "కన్యా ఆశ్రమం" అనే పేరుతో ఒక

BRAOU

మహిళా వసతి గృహాన్ని కూడా నిర్వహించారు. 1896లో "కన్యా మహావిద్యాలయం" (Kanya Mahavidyalaya) ను స్థాపించారు. ఉన్నత విద్య మహిళలు అభ్యసించడానికి వీలుగా ఆ విద్యాలయాన్ని రూపొందించారు. అది క్రమంగా వృద్ధిచెంది, మహిళా కళాశాలగా మారింది. ఈ విద్యాలయం స్త్రీలలో విద్యావ్యాప్తికై సాహిత్యాన్ని ప్రచురించింది. 1898లో హిందీలో "పాంచాల్ పండిత" (Panchal Pandite) మాసపత్రికను ప్రచురించి, స్త్రీ విద్యా వ్యాప్తికి ఇతోధిక సేవ చేసింది. అతి వాద ధోరణిగల ఆర్య సమాజికులు వితంతు వివాహాలను సమర్థించారు. పునర్వివాహాలు చేసుకున్నవారికి అండగా ఉండటానికి సంఘాలను ఏర్పాటు చేశారు. 10 సంవత్సరాల్లోనే పంజాబ్ హిందువులు వితంతు వివాహాలను క్రమంగా ఆమోదించారు.

లాలా మున్షిరామ్ నాయకత్వంలో అతి వాదులు పంజాబ్ అంతటిని కొన్ని మండలాలుగా విభజించారు. 1895లో ఆరుగురు మిషనరీలను ప్రాంతీయ ఆర్య సమాజ శాఖలతో కలసి పనిచేయుటానికి, ఆర్య సమాజ సందేశాన్ని ప్రజలకు చేర్చడానికి నియోగించారు. స్వచ్ఛంద సేవకులు వారికి అండగా నిలిచారు. ఇంగ్లీష్, హిందీ, పంజాబీ భాషల్లో చిన్న సైజు పుస్తకాలను ప్రచురించారు. దిన పత్రికలను అచ్చు వేయించారు.

1893 నాటికి లాంఛనంగా ఆర్య సమాజం రెండుగా చీలింది. మొదటి నుండీ డి. ఎ. వి. కళాశాల నిర్వహణ, దాని స్వరూపం విషయంలో అభిప్రాయ భేదాలు సమాజికుల మధ్య వచ్చాయి. మెజారిటీ వర్గం డి. ఎ. వి. కళాశాల ఆధునిక పద్ధతిలో ఆధునిక విద్యను అందివ్వాలని సూచించారు. మైనార్టీ వర్గం వారు కళాశాలలో ప్రాచీన వైదిక పద్ధతి ప్రకారం విద్యా బోధన జరగాలని పట్టుబట్టారు. అల్పసంఖ్యాక పక్షం వారు మిగిలిన వారినుండి విడిపోయి, 1902లో హరిద్వార్ వద్ద గురుకుల విద్యాలయాన్ని స్థాపించి, సంస్కృత విద్యా ప్రణాళికకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆంగ్లాన్ని, పాశ్చాత్య సంస్కృతిని కూడా బోధించారు. దాని ఆవిర్భావంలో లాలా మున్షీరామ్ ప్రధాన పాత్ర వహించాడు. పండిట్ గురుదత్తా విద్యార్థి పండిట్ లేఖరామ్ మొదలైన ఇతర సభ్యులు లాలా మున్షీరామ్ మరణానంతరం ఆ విద్యాలయ నిర్వహణ బాధ్యతను స్వీకరించారు. మెజారిటీ బృందం సభ్యుల్లో లాలా హన్స్‌రాజ్ తన జీవితాన్ని విద్యా సంస్థలకు తర్వాత మిషనరీ పనికి అంకితం చేయాలని నిశ్చయించుకొని ఆర్య సమాజ కార్యక్రమాన్ని కొనసాగించాడు. లాలా లజపతి రాయ్ మొదట ఆర్య సమాజంకోసం, తర్వాత దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేశాడు. పంజాబ్ ప్రజల హృదయాల్లో ప్రగాఢ జాతీయ భావం, స్వాతంత్ర్యేచ్ఛ బలపడటానికి డి. ఎ. వి. కళాశాల చాలవరకు కారణం.

ఆర్య సమాజ సాంఘిక కార్యక్రమాల్లో దురాచారాలను నిర్మూలించడం, పాశ్చాత్య భావనల వ్యాప్తిని నిరోధించడం ముఖ్యమైనవి. సాంఘిక సంస్కరణ దిశలో కూడా కొంత ప్రాథమిక కృషిని ఆర్య సమాజం చేసింది. క్రైస్తవ మిషనరీలు హిందూ సమాజంలో అంతర్భాగమై నిమ్నకులస్తులను అస్పృశ్యులను క్రైస్తవులుగా మార్చడంలో విజయం సాధించారు. ఈపరిణామం అతి వాద ఆర్య సమాజికులకు బాధ కలిగించింది. హిందువుల అన్యమత ప్రవేశాన్ని అడ్డుకోడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అందుకు వారు శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. శుద్ధి ఉద్యమంలోని ప్రధాన అంశాలు : 1. ఇతర మతాల్లోకి మారిపోకుండా హిందువులను నివారించడం; 2. హిందూ మతాన్ని విడిచిపెట్టిన వారిని తిరిగి హిందూ మతంలోకి చేర్చుకోడం; 3. ఇతర మతాల వారిని హిందువులుగా మార్చడం.

హిందూ యువకులు ఇతర మతాల్లోకి ప్రవేశించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తనిఖీ చేసే కార్యక్రమాన్ని ఆర్య సమాజం సమర్థవంతంగా నిర్వహించింది. శుద్ధి ఉద్యమ నిర్వాహకులు ఇస్లాం మతంలోకి బలవంతంగా నెట్టబడ్డ మలబార్ ప్రాంతంలోని మోప్లాల తెగకు చెందిన 2500 మందిని తిరిగి హిందువులుగా మార్చారు. స్వామి శ్రద్ధానంద, హన్స్‌రాజ్‌ల నిరంతర కృషి ఫలితంగా, ఇతర మతాల్లోకి వెళ్ళిన వేలాది మల్కాన

B R A O U

రాజపుత్రులు తిరిగి హిందూ మతాన్ని స్వీకరించారు. శ్రద్ధానందుని ముస్లిం ఛాందస వాదులు తమ శత్రువుగా భావించారు. ఒక ముస్లిం తీవ్రవాది చేతుల్లో అతడు హత్యకు గురయ్యాడు.

ఆర్య సమాజానికి జాతీయ దృక్పథం ఉంది. దాని రాజకీయ కార్యక్రమం దేశాభివృద్ధిని కాంక్షించిన లాలా లజపతి రాయ్ (1865 - 1928) వంటి నాయకుల త్యాగాలవల్ల మరింత గుర్తింపు పొందింది. 1897 - 1900 మధ్యకాలంలో ఏర్పడ్డ భయంకర కరువు పరిస్థితుల నుండి ప్రజలను కాపాడే కార్యక్రమాన్ని లజపతిరాయ్ స్వయంగా చేపట్టాడు. ఇదే రాయ్ ఆర్య సమాజానికి చేసిన గొప్ప సేవ. ప్రప్రథమంగా ఒక క్రైస్తవేతర అనధికార సంస్థను ప్రారంభించి, కరువుకు గురైన అణగారిన ప్రజలకు ప్రత్యేక సహాయం అందించాడు. తిండిలేక మాడిపోతున్న అనాథ పిల్లలను ఫిరోజ్‌పూర్, మీరట్, ఇతరచోట్ల ఉన్న ఆర్య సమాజ శరణాలయాల్లో చేర్పించి ఆదరించాడు. ప్రజల్లో ఆత్మ విశ్వాసం, స్వయం సహాయం పెంపొందించడానికి ఆర్య సమాజం చేస్తున్న ప్రచారాన్ని బ్రిటిష్ ప్రభుత్వం సంతోషంతో స్వీకరించలేదు. దాని రాజకీయ కార్యకలాపాలు బ్రిటిష్‌వారి కోపాన్ని రెచ్చగొట్టాయి. అయితే నేటి వరకు భారత జాతీయ జీవనంలో ఆర్య సమాజం సాంఘిక సంస్కరణల ద్వారా గొప్ప మత శక్తిగా నిలిచింది. పవిత్ర హిందూ మతాన్ని స్థాపించాలన్నదే దాని లక్ష్యం. ఆర్య సమాజ సభ్యులుగా, నాయకులుగా, ముఖ్యంగా విద్యావంతులైన అగ్రవర్ణాల వారు పనిచేశారు. వారిలో ఆత్మ గౌరవం పెరిగింది.

కొన్ని అంశాల విషయంలో ఆర్య సమాజం నిర్వహించిన పాత్ర దేశంలో అభ్యుదయ శక్తులు బలపడటానికి తోడ్పడింది. ప్రజలందరినీ రాజకీయంగా, సాంఘికంగా, మతపరంగా సమైక్య పరచడానికి కృషిచేసింది. ఆవిర్భవించిన తొలి సంవత్సరాల్లో మతైక మూఢ విశ్వాసాలపై దాడిచేసింది. కుల, వర్గ విభేదాలను, కర్మకాండలను, బహుదేవతారాధనను ఖండించింది. పురోహితుల నియంతృత్వాన్ని, పరదా పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రజల్లో విద్యా వ్యాప్తికి విద్యా సంస్థలను స్థాపించి వాటిని నిర్వహించింది. స్త్రీలకు ఉన్నత స్థానాన్ని కల్పించడానికి కృషి చేసింది. స్త్రీ విద్యను, వితంతు వివాహాలను, విదేశీయానాన్ని సమర్థించింది. బాల్య వివాహాలను వ్యతిరేకించింది. భారత ప్రజల్లో జాతీయ భావం పెరగటానికి పాటు పడింది. అధికారికంగా రాజకీయాలకు దూరంగా ఉండడమే ఆర్య సమాజ విధానం. అయితే, సమాజ సభ్యుల్లో కొందరు వ్యక్తిగత హోదాలో బహిరంగంగా బ్రిటిష్ వ్యతిరేక రాజకీయ ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమాలన్నీ ఆర్య సమాజం నిర్వహించిన అభ్యుదయ పాత్రకు నిదర్శనాలు.

అయితే వేదాలు భ్రాంతిరహితం అనిచేసిన ప్రచారం, చాతుర్వర్ణ్య సిద్ధాంతాన్ని సమర్థించడం, దేశంలోని ఇతర మతాలను ద్వేషించడం ఆర్య సమాజం అనుసరించిన అభ్యుదయ నిరోధక విధానాన్ని సూచిస్తాయి. "సత్యార్థ ప్రకాష్" చివరి భాగాలు బైబిల్, ఖురాన్‌లను తీవ్రంగా విమర్శించాయి. ఆర్య సమాజం చేపట్టిన గోసంరక్షణ, శుద్ధి కార్యక్రమాలవల్ల మత సామరస్యానికి తీరని విఘాతం ఏర్పడింది. ఆర్య సమాజికులు, ఇస్లాం మతస్థుల మధ్య అఘాతం క్రమంగా పెరిగి, వారి మధ్య మత వైషమ్యాలు తీవ్రస్థాయికి చేరి, మత సంఘర్షణలకు దారితీసింది.

## 14.6 రామకృష్ణ పరమహంస

రామకృష్ణ పరమహంస, అతని శిష్యుడు వివేకానందుడు నిర్వహించిన మత ఉద్యమం ప్రధానంగా బెంగాలీ ఉద్యమం. గదాధర్ ఛటర్జీ ఆ ఉద్యమ వ్యవస్థాపకుడు. అతడు తర్వాత రామకృష్ణ పరమహంస (1836 - 1886) గా ప్రసిద్ధి చెందాడు. బెంగాల్‌లోని హుగ్లీజిల్లాలో అర్చకత్వమే జీవనాధారంగాగల ఒక నిరుపేద సనాతన బ్రాహ్మణ కుటుంబంలో రామకృష్ణ పరమహంస జన్మించాడు. అతనికి ప్రాథమిక విద్యాభ్యాసం కూడా లేదు. దక్షిణేశ్వరంలో కొత్తగా రాసమణిదేవి నిర్మించిన కాళికాలయంలో అర్చకుడుగా పనిచేశాడు. కాళీమాత అతని ఆరాధ్య దైవం.

ప్రతిదినం మాతను భక్తి శ్రద్ధలతో ఆరాధించేవాడు. అర్చకత్వాన్ని విరమించుకొని, గదాధరుడు పూర్తిగా ధ్యానంలో మునిగిపోయి, మతపరమైన తీవ్ర పారవశ్యానికి లోనయ్యాడు. శంకరాచార్యుని భక్తుడైన తోతాపురి వద్ద 1860 ప్రాంతంలో చేరి విద్యాభ్యాసం చేశాడు. అతని ద్వారా సన్యాసం స్వీకరించాడు. తోతాపురి అద్వైత వేదాంత తత్వాన్ని ఉపదేశించాడు.

రామకృష్ణ పరమహంస హిందూ మతాన్నేగాక ఇతర మతాలనుకూడా పరిశోధించాడు. సూఫీ మతాన్ని అధ్యయనం చేసి వస్త్రధారణలోను, ప్రార్థనలు చేయడంలోను, నడవడికలోను ముస్లిం పాత్ర నిర్వహించాడు. ఛాందస ముస్లింలాగే నమాజ్ చేసేవాడు. క్రైస్తవ మతాన్ని పరిశీలించి ఏసుక్రీస్తు భగవదవతారమని భావించాడు. చర్చికి వెళ్ళి క్రైస్తవ మత బోధనలు విన్నాడు. బుద్ధదేవుని గూర్చి ఇతర మతాచార్యులను, సంస్థాపకులను గూర్చి తెలుసుకొని, వారి విషయంలో ఒక అభిప్రాయానికి వచ్చాడు. జైన మత తీర్థంకరులను, శిక్కు మత గురువులను గూర్చి తెలుసుకొని వారిపై విశేష గౌరవం చూపాడు. 1871 నాటికి రామకృష్ణుడు అత్యున్నతమైన పరిపక్వదశకు చేరి, ఆత్మశాంతిని పొందాడు. భౌతికపర బంధాలు, ధనకాంక్ష, అగ్రకులంలో జన్మించానన్న గర్వం మొదలైన వాటిని విసర్జించి, పూర్తిగా విముక్తి పొందాడు. భగవంతుని చేరడానికి ఇవన్నీ ఆటంకాలని గుర్తించాడు.

1870 నుండి రామకృష్ణుడు భక్తులను ఆకర్షించాడు. వారంతా యువకులు, వారిలో చాలామంది ఇంగ్లీష్ బాగా అభ్యసించిన విద్యావంతులు. వారికి తన సందేశాన్ని వినిపించాడు. సర్వమతములు యదార్థమే, మత వివాదాలు విసర్జించాలి. భగవంతుని చేరడానికి మార్గాలు అనేకాలు, ప్రతి మతం వీటిలో కేవలం ఒక మార్గమే, ఇతర మతాల యెడల సహనం అవలంబించాలి, సత్యమే సర్వ మతాలకూ మూలాధారం, జాతిభేదాలను తొలగించటం అవసరం, స్వధర్మాన్ని అనుష్ఠించాలి. అన్ని మతాలు నిజమైనప్పుడు ఒకరు ఇంకొక మతాన్ని విమర్శించడంగాని, మతాంతీకరణ చెందాల్సిన అవసరంగాని లేదు అని ఉద్బోధించాడు.

రామకృష్ణునిలో మానవత్వం, ఆధ్యాత్మికత్వం మూర్తీభవించాయి. ఆధ్యాత్మిక చరిత్రలో ప్రప్రథమంగా అన్నిమతాల ఐక్యత అవసరమని ప్రకటించింది రామకృష్ణుడు మానవుడు దేవుని మూర్తి. మానవునికి చేసే సేవ దేవునికి చేసే సేవతో సమానం అని ఉపదేశించాడు.

రామకృష్ణుని బోధనల ప్రభావం ముఖ్యంగా ఆనాటి హేతు వాదులపై పడింది. హిందూ మతాన్ని, దాని సారాంశాన్ని ఆధునికకాలంలో చాటిచెప్పి, దాని శాశ్వత విలువలను పునఃప్రతిష్ఠచేసి, భౌతిక వాద ప్రభావం నుండి దాన్ని కాపాడటానికి కృషి సల్పిన వారిలో రామకృష్ణుడు మొదటివాడు. హిందూ మతతత్వం సజీవమైందని ప్రపంచానికి చాటి చెప్పాడు. అతని నోటినుండి వచ్చిన మాటలు అత్యున్నతమైన ఆధ్యాత్మిక సత్యప్రవచనాలైనాయి. జీవిత గమ్యం భగవంతునిలో విశ్వాసం ఉంచడం. అందరిలోను ఆయనను దర్శించడమేనని అన్నాడు. భౌతిక వాంఛలు తాత్కాలికమైనవని, అవి దేవుని చేరటానికి అడ్డంకులు అనీ, వాటిని విసర్జించమనీ, కోరికలను నాశనం చేయమని ప్రజలకు బోధించాడు.

రామకృష్ణునితో ప్రారంభమైన మానవతా ఉద్యమాన్ని వివేకానందుడు దీనజనోద్ధరణకు నడుంకట్టి విస్తృతపరచాడు.

---

## 14.7 వివేకానందుడు

---

రామకృష్ణ పరమహంస మేటి శిష్యుడు వివేకానందుడు (1863 - 1902). ఇతడు దేశ, విదేశాల్లో విశ్వజనీన మతమైన సనాతన ధర్మాన్ని, హైందవ జాతి సందేశాన్ని ప్రపంచానికి ప్రకటించిన మొదటి హిందూ మత

BRAOU

ప్రచారకుడు. ఆంగ్లేయ పరిపాలనవల్ల నైతికంగా పతనమైన దేశాన్ని పునర్నిర్మించడానికి పూనుకున్నాడు. భారతదేశ శక్తి మతంలో ఉందని, హైందవ జాతి పునరుద్ధరణ మతాధారంగానే జరగాలన్నాడు.

వివేకానందుని అసలు పేరు నరేంద్రనాథ్. కలకత్తా మిషన్ కళాశాలలో తత్వశాస్త్రంలో శ్రద్ధచూపి, పాశ్చాత్య తత్వజ్ఞుల గ్రంథాలను చదివాడు. స్పెన్సర్, కాంట్, జాన్ స్టూవర్ట్ మిల్, అరిస్టాటిల్ మొదలైన వారి రచనలను సమగ్రంగా చదివాడు. సాధారణ బ్రహ్మ సమాజం అతనిని ఆకర్షించింది. 1882లో నరేంద్రునికి రామకృష్ణ పరమహంసతో మొదటిసారిగా పరిచయం ఏర్పడింది. రామకృష్ణుని బోధనల ప్రభావం వల్ల, సనాతన ధర్మ సిద్ధాంతాలు నరేంద్రుని ఆకట్టుకున్నాయి. సత్యాన్వేషకులకు రామకృష్ణుడు మార్గదర్శి అనీ, తత్వజ్ఞాన సాధనలకు అతని జీవితం మహాసాగరమని నరేంద్రుడు విశ్వసించాడు. అతనిని గురువుగా అంగీకరించాడు. రామకృష్ణుని మరణానంతరం అతనికొద్దిమంది శిష్యులను మహిళా విద్యా వ్యాప్తి, గ్రామీణులకు చదువు నేర్పటం, నిరాశా నిస్పృహలకు లోనైన బీదవారిని ఆదుకోవటం , బాల్య వివాహాలను నిర్మూలించడం, మొదలైన కార్యక్రమాలు చేపట్టమని ప్రోత్సహించాడు. కాని విజయం సాధించలేక, 1890లో తన తోటి సన్యాసులను విడిచిపెట్టాడు. 1892లో భారతదేశ పశ్చిమ ప్రాంతమంతా పర్యటించాడు. ఖేత్రి మహారాజా సలహా ప్రకారం 'వివేకానందుడు' అను పేరు స్వీకరించాడు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజల దయనీయ జీవన పరిస్థితిని కళ్ళారా చూచి తెలుసుకున్నాడు.

1893 సెప్టెంబర్ 11న వివేకానందుడు చికాగోలో జరిగిన ప్రపంచ సర్వ మత మహాసభకు హాజరై, అక్కడ భారతదేశం గురించి, హిందూ మతం గురించి ప్రసంగించాడు. అతడు ప్రకటించిన మనోభావాలు, అతని సర్వ మత సమరస భావం హాజరైన వారిని సమ్మోహితులను చేసింది. అతని ప్రవచనాలు విన్న తర్వాత భారతదేశానికి క్రైస్తవ మత బోధకులను పంపటం ఎంతటి అవివేకమో గ్రహించితిమని "న్యూయార్క్ హెరాల్డ్" (Newyork Herald) రాసింది. చికాగో, బోస్టన్, కేంబ్రిడ్జ్, వాషింగ్టన్, న్యూయార్క్ మొదలైన పట్టణాల్లో సనాతన ధర్మాన్ని, హైందవ విజ్ఞానాన్ని గూర్చి చేసిన గంభీరోపన్యాసాలవల్ల ప్రభావితులై, పాశ్చాత్యులనేకులు ఇతనికి శిష్యులైనారు. న్యూయార్క్, మరికొన్ని ప్రదేశాల్లో వేదాంత సంఘాలు వెలిశాయి. అవి వివేకానందుని ఆశయాలను ప్రచారం చేశాయి.

కలకత్తాకు తిరిగివచ్చి రామకృష్ణుని జ్ఞాపకార్థం ప్రజాసేవకై, రామకృష్ణ మఠాన్ని 1896లో స్థాపించాడు. దీని ఉద్దేశాలు, కార్యక్రమాలు ఇవి : 1) సర్వ మత సామరస్య సాధనకై రామకృష్ణుడు నడపిన ఉద్యమాన్ని సక్రమ మార్గాన నడిపించటం (2) ప్రజలకు నిజ జీవితంలో ఉపయోగపడే విద్యలు నేర్పడానికి తగిన వారిని సిద్ధం చేయటం (3) కళలను, పరిశ్రమలను ప్రోత్సహించటం (4) రామకృష్ణుని వేదాంత మత అభిప్రాయాలను జన సామాన్యానికి అందజేయటం (5) సన్యాసులకు, సంఘ కార్యక్రమాల్లో పాల్గొనేవారికి అవసరమైన శిక్షణ నివ్వడానికి దేశంలోని వివిధ ప్రాంతాల్లో మఠాలను, ఆశ్రమాలను స్థాపించటం (6) విదేశాలకు, భారతదేశానికి సన్నిహిత సంబంధం ఏర్పరచి, సామరస్య భావాన్ని పెంచటానికి కృషిచేయటం, అందుకు విదేశాల్లో మఠాలను, సేవాశ్రమాలను స్థాపించి వేదాంత తత్వాన్ని ప్రచారం చేయడానికి సుశిక్షితులైన వారిని పంపటం. రాజకీయాలతో ఈ సంస్థకు ఎట్టి సంబంధం లేదు.

వివేకానందుడు పశ్చిమ దేశాల్లో ప్రజలిచ్చిన విరాళాలతో రామకృష్ణ మిషన్ ప్రధాన కేంద్రమైన బేలూరు మఠానికి ఆస్తులు కొన్నాడు. సాంఘిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మొదట కరువు నివారణ కార్యక్రమాలను చేపట్టాడు. కొద్దినెలల్లోనే భక్తులను చేరదీసి, భారత సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వ సంపదను కాపాడడం కోసం అంకితమై శ్రమించు అతిశక్తివంతమైన కార్యదీక్షాపరులుగా తీర్చి దిద్దాడు.

BRAOU

సంఘ కార్యక్రమం క్రమంగా అభివృద్ధి చెందింది. నిర్వహణ సౌలభ్యం కోసం 1909లో ఈ సంస్థ రామకృష్ణ సేవా సంఘం అనీ, రామకృష్ణ మఠం అనీ రెండుగా విభజించబడింది. మఠంలో చేరేవారికి సన్యాసి జీవితానికి కావాల్సిన శిక్షణ నివ్వటమే రామకృష్ణమఠం ముఖ్య ఉద్దేశం. వైద్యశాలలు, విద్యాలయాలు, అనాథ శరణాలయాలు, గ్రంథాలయాలు మొదలైన సేవా సంస్థల్ని నెలకొల్పి, మానవ సేవ చేయటం రామకృష్ణ సంఘ ముఖ్య ఉద్దేశం.

భారతదేశ ఉద్ధరణకు వివేకానందుడు తన ఉపన్యాసాల్లో తెలిపిన ముఖ్య విషయాల సారాంశం, "వర్ణాల్లో ఉపశాఖలను విడిచిపెట్టి, ఉపశాఖల్లో అంతర్వివాహాలు జరుపుకోవాలి. తత్వబోధకుల కంటే ముందుగా జనసామాన్యానికి అన్నపానాలను సమకూర్చి వారి దయనీయ స్థితిని బాగుచేయాలి. అందుకు వారిలో విద్యావ్యాప్తి చేయటం అత్యావశ్యకం. త్యాగం, సేవ ఉత్తమ ఆదర్శాలని భారతీయులు గుర్తించాలి. అంతఃకలహాలను విడచి, ప్రజల్లో ఐకమత్యం పెంపొందించాలి. సనాతన ధర్మతత్వాలను పాశ్చాత్యులకు బోధించటానికి, వారి పారిశ్రామిక విద్యలను నేర్చుకోటానికి యువకులకు తగిన శిక్షణ గరపాలి. వీరిలో పేరుకుపోయిన విజాతీయ భావదాస్యం తొలిగిపోయిన నాడే దేశం అభివృద్ధి చెందుతుంది. అజ్ఞానం వల్ల పాతుకుపోయిన పాత పద్ధతులు ప్రజలను కదలనివ్వడం లేదు. వేరొక వంక నవ్యతామోహంతో తెచ్చిపెట్టుకున్న భౌతిక వాదం ప్రజలకు వ్యక్తిత్వాన్ని చంపి నిర్వీర్యులను చేసేస్తోంది. ఈ రెంటినీ తొలగించుకొని ముందుకు పోవాలి. పూర్వులిచ్చిన అమూల్య సంపద అయిన ఆధ్యాత్మికత్వాన్ని వదలరాదు. అప్పుడే జాతీయ జీవనం సురక్షితంగా ఉంటుంది."

నిర్భీతి భారత జాతీయ జీవన పునర్నిర్మాణానికి అవసరమని వివేకానందుడు ధృవీకరించాడు. భారతదేశ భక్తులకూ, దేశ పునర్నిర్మాణ కర్తలకూ వివేకానందుడు మార్గదర్శకుడు. అన్న దానం. విద్యా దానం, జ్ఞాన దానాల ద్వారా దేశ సేవ, మానవ సేవ చేసే రామకృష్ణ సంఘాన్ని స్థాపించాడు. పాశ్చాత్యులను ఆకర్షించి ఆర్థికపరమైన మద్దతు పొందిన మొట్టమొదటి హిందూ ఉద్యమం ఇదే.

## 14.8 దివ్యజ్ఞాన సమాజం (Theosophical Society) ✓

దివ్యజ్ఞానం అనేది ఒక మత విధానం. మదాం బ్లావట్స్కీచేత మొదట ఉపదేశింపబడి అనిబిసెంట్ చేత కొనసాగించబడింది. ఈ దివ్యజ్ఞానం విశ్వం అంతిమ సత్యమని, అనేక దేశాల్లో అనేక సమయాల్లో, వివిధ మత వ్యవస్థాపకులచే, తాత్వికులచే బోధింపబడ్డట్లుగా భావించటం జరిగింది. అయితే, దాన్ని కొంతమంది మహాత్ములు (Masters) బ్లావట్స్కీకి కొత్తగా తెలియపర్చారు. ఈదివ్యజ్ఞాన పద్ధతి, దివ్యజ్ఞాన సమాజం ప్రజల్లో గొప్ప ఆసక్తిని కలగజేశాయి. కారణం ఆ ఉద్యమ ఫలితంగా గొప్ప సాహిత్యం ఉద్భవించింది. ఆ సమాజం అనతికాలంలోనే గొప్పగా అభివృద్ధి చెందింది. మహా ఉద్యమంగా రూపొందుతున్న కాలంలో హిందూ, బౌద్ధ, ఈజిప్టు మతాలనుండి భావాలను దివ్యజ్ఞానం సంగ్రహించింది.

### 14.8.1 బ్లావట్స్కీ, ఓల్కాట్‌ల నాయకత్వం

దివ్యజ్ఞాన సమాజాన్ని మొట్టమొదట న్యూయార్క్ నగరంలో 1875 సెప్టెంబర్‌లో మదాం బ్లావట్స్కీ (1831-1891), కల్నల్ ఓల్కాట్‌లు స్థాపించారు. వారిరువురూ ఆధ్యాత్మికత్వమందు ఆసక్తిని పెంపొందించుకున్నారు. బ్లావట్స్కీ నివాసంలోనే సమావేశాలు ఏర్పాటుచేశారు. ఒక సమావేశంలో కల్నల్ ఓల్కాట్ దివ్యజ్ఞాన సమాజాన్ని స్థాపించాలని సూచించాడు. సభ్యుల సమ్మతితో ఓల్కాట్ అధ్యక్షుడుగా తాత్కాలికంగా ఒక సమాజం ఏర్పాటైంది. ఉపనిబంధనలు తయారుచేసి చివరకు "దివ్యజ్ఞాన సమాజం"ను ప్రారంభించారు. విశ్వాసాన్ని శాసించే జ్ఞాన సూత్రాన్ని సేకరించి వ్యాప్తి చేయడం దాని లక్ష్యం.

ఈ కొత్త సమాజం క్రమంగా అభివృద్ధి చెందింది. 1877లో బ్లావట్స్కీ "ఐసిస్ అన్‌వీల్డ్ (Isis Unveiled) అనే గ్రంథాన్ని ప్రచురించింది. రెండు కారణాల వల్ల ఈ గ్రంథం చాల ముఖ్యమైందిగా పరిగణించవచ్చు. ఒకటి ప్రాచీన మతాలను నాటి ప్రజల జ్ఞానాన్ని వారు సాధించిన ఘనకార్యాలను ఆధ్యాత్మిక శక్తిని, సాహస కృత్యాలను ప్రప్రథమంగా ఈ గ్రంథం సమర్థించింది. రెండోది క్రైస్తవ మతాన్ని, ఇతర మతాలను విమర్శించింది. దాని ప్రచురణ గొప్ప తుఫాన్‌ను సృష్టించింది. సనాతన క్రైస్తవులు ఆమెను విమర్శించారు. కాని ఆమె ప్రతి విమర్శలు చేయలేదు. ఆమెరికాను విడిచిపెట్టి 1879లో బొంబాయి చేరింది. మూడేళ్ళపాటు బొంబాయి నగరాన్ని ప్రధాన కార్యాలయ కేంద్రంగా చేసుకొని సమాజ కార్యక్రమాన్ని నిర్వహించింది.

భారతదేశానికి వచ్చిన తర్వాత బ్లావట్స్కీ, ఓల్కాట్‌ల అభిప్రాయాలు, సందేశాలు పూర్తిగా మారిపోయాయి. తాము బౌద్ధులమని వారు ప్రకటించుకొన్నారు. ఓల్కాట్ బొంబాయిలో పాశ్చాత్య దేశాల సంస్కృతిని, క్రైస్తవ మతాన్ని విమర్శిస్తూ అనేక ఉపన్యాసాలు ఇచ్చాడు. ఆసియా దేశాల మతాలను పొగడాడు. వారిరువూ భారతదేశంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి సమాజ పలుకుబడిని, సభ్యుల సంఖ్యను పెంచారు. ప్రతిచోట హిందువులు స్వాగతం పలికారు. వారువెళ్లిన ప్రతిచోటా అద్భుత సంఘటలు జరిగాయి. వారు దయానంద సరస్వతిని మీరట్‌లోనూ, బెనారస్‌లోను కలుసుకొని వారిరువురు నాయకత్వం వహిస్తున్న సమాజాల మధ్య పరస్పర సహకారం గూర్చి చర్చించారు. అయితే సైద్ధాంతికపరమైన విభేదాలవల్ల వారు ఒక అంగీకారానికి రాలేకపోయారు. 1881లో చేసిన ప్రయత్నం కూడా ఫలించక పోవడంతో, దయానందుడు బహిరంగంగా దివ్యజ్ఞాన సమాజ నాయకులను విమర్శించనారంభించాడు.

బ్లావట్స్కీ, ఓల్కాట్‌లు దివ్యజ్ఞాన సమాజ లక్ష్యాలను నిర్ధారించారు. అవి :( 1) విశ్వమానవ సౌభ్రాతృత్వ మూల కేంద్రాన్ని జాతి, కుల, మత, స్త్రీ, పురుష భేదం లేకుండా ఏర్పాటు చేయటం. (2) సమకాలీన పోలికలతో మతం, తత్వ శాస్త్రం, విజ్ఞాన శాస్త్రాల తులనాత్మక అధ్యయనాన్ని ప్రోత్సహించడం. (3) మనిషిలో అంతర్ముఖంగా ఉన్న శక్తి, సామర్థ్యాలను, విశదపర్చని ప్రకృతి ధర్మసూత్రాలను పరిశోధించడం. ఈ లక్ష్యాలను బహిరంగ సభల ద్వారా "ది థియోసాఫిస్ట్" (The theosophist) పత్రిక ద్వారా ఓల్కాట్ తెలియపర్చాడు. ఆరంభంనుండి భారతీయులు, ఐరోపా దేశస్థులు దివ్యజ్ఞాన సభ్యులుగా చేరారు. అనేకమంది స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ విధంగా చేరిన వారిలో ఎ.ఓ.హ్యూమ్, గోపాలకృష్ణ గోఖలే, బ్రిటిష్ ఇండియా సైన్యానికి చెందిన మేజర్ జనరల్ మోర్గాన్ (Morgan)లు ప్రముఖులు. విద్యావంతులైన హిందువులు, పార్శీలుకూడా సభ్యులుగా చేరారు. పలు పట్టణాల్లో దాని శాఖలు స్థాపించబడ్డాయి. అందులో అలహాబాద్ శాఖ మొట్టమొదటిది. అది చాల సంవత్సరాలు చురుకుగా పనిచేసింది. 1880 నుండి బ్లావట్స్కీ, ఓల్కాట్‌లు తమ సమాజ వార్షిక సమావేశాలు ఏర్పాటుచేశారు. దేశంలోని దివ్యజ్ఞాన సమాజ సభ్యులందర్ని ఒకచోట సమావేశపర్చడానికి 1880లో ఒకసారి, మరల 1882లో మరోసారి దక్షిణ భారతంలో పర్యటించారు. ఆ సందర్భంలో మద్రాస్, నెల్లూరు, గుంటూరు పట్టణాల్లో సమాజాలను స్థాపించారు. 1886లో దివ్యజ్ఞాన సమాజ కేంద్ర కార్యాలయాన్ని మద్రాస్‌కు సమీపానగల 'అడయార్' వద్ద నెలకొల్పారు.

బ్లావట్స్కీ, ఓల్కాట్‌లు అడయార్‌లో సభ్యులను చేర్చుకొని తమ కార్యాకలాపాలను విస్తృత పర్చారు. 1883లో ఓల్కాట్ తమిళ, మళయాళ ప్రాంతాల్లో పర్యటించి, కొత్తగా సమాజ శాఖలను ప్రారంభించాడు. తన సందేశంలో హిందూ యువకులు విధిగా సంస్కృతం అభ్యసించాలని, ప్రాచీన హిందూ వారసత్వాన్ని పునరుద్ధరించాలని ఓల్కాట్ కోరాడు. మద్రాస్‌లోని ట్రిప్లికేన్, మైలాపూర్‌లలోను, మధురై, బళ్లారి, నెల్లూర్, విజయనగరం, తిరుచునాపల్లి, గుంటూర్‌లోను సంస్కృత విద్యాలయాలు వెలశాయి. 1884 నాటికి భారతదేశంలో 100 దివ్యజ్ఞాన

సమాజ శాఖలు ఉన్నాయి. బ్లావట్స్కీ ఇండియా విడిచివెళ్లిన తర్వాత ఈ సంస్థల నాయకత్వ బాధ్యత పూర్తిగా కల్నల్ ఓల్కాట్‌పై పడింది.

బ్లావట్స్కీ, కల్నల్ ఓల్కాట్‌ల సంయుక్త నాయకత్వంలో దివ్యజ్ఞాన సమాజికులు తమ భావజాలాన్ని ప్రధానంగా "ఐసిస్ అన్‌వీల్డ్", (Isis Unveiled) "ది సీక్రెట్ డాక్ట్రిన్" (The Secret Doctrine) ల నుండి స్వీకరించారు. మహాత్ములకు తెలిసిన ప్రాచీన విజ్ఞానాన్ని మానవాళికి తెలియపర్చాల్సిన బాధ్యతను వారు బ్లావట్స్కీకి అప్పగించారన్నదే వీటిలోని ఇతివృత్తం. దివ్యజ్ఞాన సమాజకులు సవరించిన పునర్జన్మ సిద్ధాంతాన్ని ఆమోదించారు. పాశ్చాత్య అధ్యాత్మిక తత్వవేత్తల సాంప్రదాయాలకు హిందూ నిబంధనలను, భావాలను జోడించాడు.

కల్నల్ ఓల్కాట్ తన ప్రసంగాల్లో ప్రాచీన హిందూ వైభవాన్ని ప్రస్తుతించాడు. సాంస్కృతిక, విజ్ఞాన శాస్త్రరంగాలందు సాధించిన అద్భుత విజయాలను కొనియాడాడు. పాశ్చాత్యులకు మూలపురుషులు ఆర్యులనీ, ఆర్యుల సాహిత్యం పాశ్చాత్య మతాలకు, తాత్విక సిద్ధాంతాలకు మూలం అన్నాడు. 1893లో అనీబిసెంట్ వచ్చేవరకూ ఓల్కాట్ తన ఉపన్యాసాలతో భారతదేశంలో విస్తృతంగా పర్యటించి, దివ్యజ్ఞాన ఉద్యమంలో కీలకమైన పాత్ర నిర్వహించాడు.

### 14.8.2 అనీబిసెంట్

లండన్ నగరంలో ఐరిష్ కుటుంబంలో జన్మించిన అనీబిసెంట్ వడివయస్సులో ఉన్నపుడే ఛాందస క్రైస్తవ మతానికి వ్యతిరేకంగా పోరాడింది. 1888లో "ది సీక్రెట్ డాక్ట్రిన్" (The secret doctrine) ను చదివి దివ్యజ్ఞాన సమాజంపై సదభిప్రాయం ఏర్పరచుకొంది. అంతవరకు నమ్మిన విశ్వాసాలను విడిచి, పట్టుదలగల దివ్యజ్ఞాన సమాజ సభ్యురాలైంది. అనతికాలంలోనే దివ్యజ్ఞాన సభ్యుల్లో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది. 1893లో అడయార్ వచ్చిన వెంటనే ఓల్కాట్‌తో కలిసి భారతదేశమంతా తిరిగింది. ప్రజాదరణగల ఉపన్యాసకురాలిగా నిరూపించుకుంది. సభల్లో, సమావేశాల్లో హిందువుల అభిమానాన్ని చూరగొంది. తాను హిందువునని, హిందూ సమాజంతో కలసిపోయినందుకు గుర్తుగా పవిత్ర సూత్రం ధరించానని ప్రకటించింది. 1893 - 97 మధ్య కాలంలో ఉపన్యాసాలిస్తూ, సమావేశాల్లో పాల్గొంటూ విస్తృతంగా పర్యటించి, దివ్యజ్ఞాన సమాజ సిద్ధాంతాలను ప్రచారం చేసింది. ఎక్కువ కాలం బెనారస్‌లో గడిపి 1898లో అక్కడ కేంద్ర హిందూ కళాశాలను నెలకొల్పి, ఆ పట్టణాన్ని తన ముఖ్య కేంద్రంగా చేసింది. ఈకేంద్రం నుండి ఆమె పనిచేస్తూ బెనారస్‌లో బాల, బాలికలకు పాఠశాలలు నెలకొల్పింది. 1907లో ఓల్కాట్ మరణం తర్వాత ఆమె తన ముఖ్య కేంద్రాన్ని అడయార్‌కు మార్చింది. 1933లో చనిపోయే వరకూ అడయార్ ఆమెకు కేంద్రాలయం.

భారతదేశంలోని ప్రతిప్రాంతంలోను అనీబిసెంట్ ప్రాచీన హిందూ దేశ వైభవం గురించి, ఆధ్యాత్మికత గురించి ఉపన్యాసాల్చింది. 1908లో దివ్యజ్ఞాన సేవా బృందాన్ని (Theosophic order of service) ఏర్పరచి, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈకార్యక్రమం సోదర భావాన్ని, జాతీయ విద్యా విధానాన్ని సమర్థించింది. బాల్య వివాహాలను వ్యతిరేకించింది. ఆ బృందం వారు మరణ శిక్షను రద్దుచేయమని కోరారు. సహకార సంస్థల్ని అభివృద్ధి చేయమన్నారు. జైలు సంస్కరణలు చేపట్టాలన్నారు. శిశు సంక్షేమాన్ని కాంక్షించారు. అంధులకు సహాయాన్ని అందించారు.

అనీబిసెంట్ ముందు వచ్చిన మత సంస్కరణోద్యమాలను, ముఖ్యంగా బ్రహ్మ సమాజం, ఆర్య సమాజాలను ఖండించింది. ఆ ఉద్యమాలు సంకుచిత స్వభావం గలవని, కటువైనవని ప్రకటించింది. బ్రహ్మ సమాజ ఉద్యమం తన నాయకత్వంలోని దివ్యజ్ఞాన ఉద్యమానికి బద్ధశత్రువుగా భావించింది. ఆనాటి సమస్యలను ప్రాచీన సంస్థలను, ఆదర్శాలను పునరుద్ధరించి, తిరిగి ప్రవేశపెట్టి, పరిష్కరించుకోవచ్చునన్న అభిప్రాయం అనీబిసెంట్‌కు ఉంది.

BRAOU

భారత సంప్రదాయాలు, ఆలోచనలు, భావాలు ప్రాతిపదికగా భారతదేశాన్ని పాలించాలని అనీబిసెంట్ విశ్వసించింది. 1910 తర్వాత ఆమె జాతీయ సమైక్యత గూర్చి మాట్లాడింది. అనేక రాజకీయ ఉపన్యాసాలిచ్చింది. 1914లో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి 1916లో హోంరూల్ ఉద్యమం నడిపింది. ఆసంవత్సరంలోనే జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షురాలుగా ఎన్నికైంది. రాజకీయ నాయకురాలిగా ఆమె జీవితం స్వల్పం. గాంధీ రాజకీయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న సమయంలో ఆమె రాజకీయ రంగం నుండి నిష్క్రమించింది.

అనీబిసెంట్ ప్రతిభావంతురాలైన రచయిత్రిగా ఖ్యాతి గడించింది. భారతదేశంలోను, విదేశాల్లోను ఆమె రచించిన వేలాది పుస్తకాలు అమ్ముడయ్యాయి. దివ్యజ్ఞాన సంబంధమైన విషయాలకు ఎక్కువ సమయాన్ని కేటాయించింది. దివ్యజ్ఞాన సమాజ అధ్యక్షురాలిగా ఆమె చేసిన అద్వితీయమైన కృషి ఫలితంగా, సమాజ సభ్యత్వం వేల సంఖ్యకు చేరింది.

విదేశాలనుండి స్వీకరించిన దివ్యజ్ఞాన సమాజ భావజాలం వివిధ ప్రాంతాల్లో ప్రజల్ని ఆకర్షించింది. క్రైస్తవ మతం గూర్చి, పాశ్చాత్య దేశాల సంస్కృతిని గూర్చి ఆమె చేసిన విమర్శలు హిందువులకు నచ్చాయి. హిందూ సంస్కృతిని, మతాన్ని ఆమె పొగిడింది. సాంప్రదాయ హిందూ మతాన్ని పునరుద్ధరించడానికి జరుగుతున్న ప్రయత్నాలను బలపరచింది. యూరప్ దేశాల్లోనూ, అమెరికాలోనూ ఉపనిషత్తులు, భగవద్గీతను ప్రచారం చేసింది. ప్రాక్ దేశాల వారిని సోదరులుగా భావించమంది. హిందూ సమాజ ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది.

దివ్య జ్ఞాన సమాజం బాల, బాలికలకు, దళితులకు పాఠశాలలు స్థాపించింది. బాల్య వివాహాలను వ్యతిరేకించింది. కుల వ్యవస్థను రద్దుచేయమని, అస్పృశ్యులను ఉద్ధరించమని, వితంతువుల స్థితిగతులను మెరుగుపర్చమని కోరింది. జాత్యహంకారాన్ని నిరసించింది.

## 14.9 దేవ సమాజం

పండిట్ శివనారాయణ్ అగ్నిహోత్రి కాన్పూర్ (సంయుక్త రాష్ట్రాలు) నివాసి. దేవ సమాజాన్ని స్థాపించాడు. మొదట లాహోర్ బ్రహ్మ సమాజంతో సంబంధాలు పెట్టుకొని వేగంగా ఆ సంస్థలో ప్రముఖ నాయకుడుగా ఎదిగాడు. అగ్నిహోత్రి అనర్గళంగా మాట్లాడగలడు. రచయిత, పాత్రికేయుడు. బ్రహ్మ సమాజిగా వివాహ సంస్కరణ, శాకాహారంను సమర్థిస్తూ ప్రసంగాలు చేశాడు. కొన్ని సంవత్సరాలు బ్రహ్మ సమాజ ప్రచారకుని (missionery) గా పనిచేశాడు. 1886లో మిగిలిన సభ్యులతో ఘర్షణ పడి, పంజాబ్ బ్రహ్మ సమాజానికి రాజీనామా చేసి, 1887లో దేవ సమాజాన్ని స్థాపించాడు.

దేవ సమాజ ఉద్యమం ఒక విలక్షణమైన ఉద్యమం. అగ్నిహోత్రి హేతు వాదాన్ని తిరస్కరించి "గురు" పూజను ప్రబోధించాడు. భూత, భవిష్యత్ కాలాల్లో తనకు సమానుడైనవాడు లేడని, ఇతరులను పూజించడం ప్రమాదమని, తాను ఒక్కడే మోక్షాన్ని ప్రసాదించగలడని సభ్యులను నమ్మమన్నాడు. ఆయన విధానంలో దేవుని పూజించే పద్ధతికి స్థానం లేకుండా పోయింది. సమాజ సభ్యులు ప్రార్థనల్లో పాల్గొనేవారు. విగ్రహ పూజ స్థానంలో అగ్నిహోత్రిని గాని లేక ఆయన చిత్రపటాన్ని గాని పూజించేవారు. సమాజ సభ్యులు వస్తువులను దొంగిలించడం, అసత్యం ఆడటం, ఇతరులను మోసగించడం, లంచాలు తీసుకోవటం మత్తుపానీయాలు, మాదక ద్రవ్యాలు సేవించడం వంటివి విసర్జించే నియమాలను పాటించేవారు. సమాజంలో వ్యభిచారం, బహుభార్యత్వం, కుల విభేదాలకు స్థానం లేదు. కులాంతర భోజనాలు, కులాంతర వివాహాలు సమర్థించాలన్న నియమం ఉంది. అగ్నిహోత్రి బాలురకు 20 సంవత్సరాలు, బాలికలకు 16 సంవత్సరాలు వివాహ వయస్సుగా నిర్ణయించి, బాల్య

వివాహాలను నిర్మూలించడానికి కృషి చేశాడు. అధిక కట్నాలను నిరుత్సాహపరచాడు. వితంతు వివాహాలు ఆమోదయోగ్యమని చెప్పి, మొదటి భార్య మరణానంతరం వితంతువును వివాహమాడాడు. స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. 1921 నాటికి దేవ సమాజం ఉన్నత స్థితికి ఎదిగింది. సభ్యత్వం 3597 కు చేరింది. అగ్నిహోత్రి మరణానంతరం దేవ సమాజం కార్యక్రమాలు తగ్గి క్రమంగా పతనమైంది.

## 14.10 ముస్లిం మత సంస్కరణ

18వ శతాబ్దంలో మొగల్ సామ్రాజ్య పతనానంతరం దాని స్థానంలో బ్రిటిష్ పాలన ఆరంభమైంది. ఈ రాజకీయ పరిణామానికి భారతదేశ ముస్లింలు దిగ్భ్రాంతి చెందారు. 1803లో ఢిల్లీని బ్రిటిష్‌వారు ఆక్రమించారు. అయినప్పటికీ, భారత ఉపఖండంలో ఢిల్లీయే ముస్లింలకు సాంస్కృతిక కేంద్రంగా కొనసాగింది. ముస్లిం సమాజపు ఆలోచనలకు విద్యకు, కవిత్వానికి, కళలకు ఢిల్లీ కేంద్రబిందువై స్ఫూర్తి నిచ్చింది. ముస్లిం మతాధిపతులు (Ulemas) ఇక్కడనే విద్యాభ్యాసం చేశారు. ముస్లిం రాజకీయ అధికారాన్ని తిరిగి సాధించుకోవచ్చని నమ్మకం వారిలో ఏర్పడింది. అయితే, ముస్లింలలో మత సంస్కరణోద్యమాలు కొంత ఆలస్యంగా ఆవిర్భవించాయి.

### 14.10.1 మదరసా-ఇ-రహిమియా (Madrassah-i-Rahimiyeh)

ఢిల్లీలో షేక్ అబ్దుర్ రహిమ్ (Shaik Abdur Rahim, 1644 - 1718) మదరసా-ఇ-రహిమియ పాఠశాలను స్థాపించాడు. ఇతడు మరణించిన తర్వాత ఇతని కుమారుడు షా వలీ ఉల్లా (Shah-Wali-Ullah) నాయకత్వంలో పాఠశాల పనిచేసింది. ఇందులో చదివిన విద్యార్థులు వలీఉల్లా ఆశయాలను, ఆలోచనలను అమలు చేశారు. ఇస్లాం మత శిథిలావస్థను ఖండించాడు. పూర్వ వైభవాన్ని, అధికారాన్ని తిరిగి పొందటానికి కొన్ని మార్గాలను సూచించాడు. ఇస్లాం మతంలోకి అనేక దోషాలు దొర్లాయని నమ్మాడు. ఇస్లామిక్ చట్టాన్ని గుడ్డిగా నమ్మడం, ఆచరణలో ఉన్న కొన్ని కర్మకాండలు, మూఢనమ్మకాలు, సందేహాత్మకమైన శాస్త్రాల అధికారాన్ని అంగీకరించడం మొదలైనవి మత ప్రవక్తకు బోధించిన సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డాడు. వలీ ఉల్లా రెండు రకాల అధికారాలను అంగీకరించాడు. అవి (1) ఖురాన్‌లో చెప్పబడ్డ ప్రవక్త సందేశం. (2) ప్రవక్త సాంప్రదాయానికి సంబంధించిన వివరాలు. ఇజిహద్ వ్యక్తిగతంగా పరిశోధించి, తర్కించి ఇస్లాం మత పండితుల దోషాలు నిర్మూలించి సమంజసమైన ప్రార్థనా విధానాన్ని, ప్రవర్తనా నియమావళిని తిరిగి ఏర్పరచి, మహమ్మద్ కాలంనాటి ఇస్లాం మత పవిత్రతతను పునరుద్ధరించవచ్చని వలీ ఉల్లా భావించాడు.

వలీ ఉల్లా 1761లో మరణించాడు. అతని కుమారుడు అబ్దుల్ అజీజ్ (1746 - 1824) పాఠశాలకు నాయకత్వం వహించాడు. 1803లో మొగలుల అధికారం అంతమైన తర్వాత అబ్దుల్ అజీజ్ ఒక డిక్రీని (Fetwe) జారీ చేశాడు. దానిలో భారతదేశం "దారుల్ ఇస్లాం" (ముస్లింల రాజకీయ అధీనంలో వున్న ప్రాంతం) కాదని, "దార్ ఉల్ వార్బ్" (ముస్లిమేతరుల పాలన కింద ఉన్న ప్రాంతం) అనీ ప్రకటించాడు. ఈ డిక్రీ ప్రకారం ప్రతి ముస్లిం క్రైస్తవ మతానికి చెందిన దురాక్రమణదారులపై పవిత్ర యుద్ధం (Jihad) ప్రకటించాలి, లేకపోతే భారతదేశం విడిచిపెట్టి ఇతర ముస్లిం దేశాలకు పోవాలి.

ఈ ఉద్యమానికి బరెలీకి చెందిన సయ్యద్ అహమ్మద్ నాయకత్వం వహించాడు. ఇతనికి అబ్దుల్ అజీజ్ దగ్గరి బంధువు. విద్యార్థుల నుండి ఈ ఉద్యమానికి ప్రోద్బలం లభించింది. ఈ వీరులకు బ్రిటిష్ వారు "వహాబీలు" అని పేరు పెట్టారు. వీరు పశ్చిమోత్తర పర్వత ప్రాంతాల నుండి పోరాటాన్ని కొనసాగించి, 1914 వరకూ

ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. 1857లో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన తిరుగుబాటులో వారిలో కొంతమంది పాల్గొన్నారు. తిరుగుబాటు విఫలం చెందిన తర్వాత 'పవిత్ర యుద్ధం' నినాదం అర్థరహితమైంది.

### 14.10.2 ఫర ఇజీస్ (Fara'izis)

ఈ తెగ వ్యవస్థాపకుడు తూర్పు బెంగాల్‌లోని ఫరీద్‌పూర్‌కు చెందిన హాజీ షరియత్ ఉల్లా (1781 - 1840). ఈ తెగవారు నిర్వహించిన బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమంలో మతాభిమానం ఎక్కువ. మతాచార్యులను సంస్కరించాలని ప్రబోధించే కార్యక్రమాన్ని షరియత్ ఉల్లా చేపట్టాడు. అతని సందేశం మత పవిత్రీకరణలో ఒక భాగం. బెంగాల్ ముస్లింల అసమంజసమైన నమ్మకాలు, ప్రవర్తన గమనించి దిగ్భ్రాంతి చెందాడు. 'ఫరఇజ్' కు (ఇస్లాం మత విధులు) పునరంకితం కావాలని పిలుపు నిచ్చాడు. మతం పట్ల నమ్మకంతో ఉండటం, ప్రతిదినం ప్రార్థనల్లో పాల్గొనడం, రంజాన్ దినాల్లో ఉపవాసం ఉండటం, పేదవారికి సహాయం చేయడం, మక్కా యాత్రకు వెళ్లడం తప్పనిసరిగా ఆచరించాల్సిన పవిత్ర మత కర్తవ్యాలుగా నిర్దేశించాడు. వీటితోపాటు ఏకేశ్వరోపాసన సిద్ధాంతాన్ని నొక్కి చెప్పాడు. ఇస్లాం మతానికి చెందిన సాధువుల మందిరాలవద్ద ప్రార్థనలు చేయడం. శిశువు జన్మించినపుడూ, సున్తీ చేసినపుడు జరుపుకొనే సంస్కారాలను ఖండించాడు. జమిందార్ల రైతాంగ దోపిడీని వ్యతిరేకించాడు. బెంగాల్‌లో బ్రిటిష్ వారిని తరిమివేసి, ముస్లిం పాలన పునరుద్ధరించమని ఆదేశించాడు.

పూర్వాచార పరాయణులైన ముస్లింలలో అధిక శాతం జమీందారీ వర్గానికి చెందినవారు. ఈ ధనిక వర్గంతో ఫరఇజీలు ప్రత్యక్షంగా తలపడ్డారు. కారణం ఈరకం ముస్లింలు అప్పుడు అమల్లో ఉన్న మతాచారాలను కొనసాగించాలని పట్టుబట్టారు. దురాచారాలను, బహుదేవతారాధనకు నిలయమైన హిందూ మతాన్ని కూడా వారు వ్యతిరేకించారు. 1831 నాటికే ఫరఇజీలు బరాసత్ నగరం కేంద్రంగా చేసుకొని, బెంగాల్‌లోని తూర్పు ప్రాంతంలో అధిక సంఖ్యలో ఉన్న హిందూ భూస్వాములకు వ్యతిరేకంగా అరాచక పరిస్థితులను సృష్టించారు. నీలిమందు ఫ్యాక్టరీలను ధ్వంసం చేశారు. ముస్లిం వ్యవసాయదారులు, హిందూ భూస్వాములు తరుచుగా అధిక శిస్తు వసూలు చేశారని వారికి భూమి శిస్తు చెల్లించడం మానివేశారు. 1840లో షరియత్ ఉల్లా మరణించే వరకూ అరాచక పరిస్థితులు కొనసాగాయి.

B R A O U

తండ్రి మరణానంతరం అతని కుమారుడు డుడూ మియాన్ (Dudue Miyan) ముస్లిం 'ఫరఇజ్', తెగకు నాయకుడైనాడు. భూమి యావత్తు భగవంతునికి చెందింది. కాబట్టి శిస్తు వసూలు చేయడం అక్రమం, అన్యాయం అని ప్రకటించాడు. ఈ ప్రకటన ముస్లిం రైతుల్లో సంతోషం కల్గించింది. 1841-42 మధ్య ముస్లిం రైతులు భూస్వాములతోను, నీలిమందు రైతులతోను, పోలీసులతోను తలపడ్డారు. వారి మధ్య హింసాత్మక సంఘర్షణలు జరిగాయి. పోలీసులు డుడూ మియాను, అతని 40 మంది అనుచరులను అరెస్ట్ చేశారు. విచారణ జరిపి, వారిని ప్రభుత్వం శిక్షించింది. 1847లో కలకత్తా హైకోర్టు ఆ శిక్షను రద్దుచేసింది. 1857 తిరుగుబాటు సందర్భంగా డుడూ మియాను ప్రభుత్వం నిర్బంధించి, 1860లో విడుదల చేసింది. 1862లో ఇతని మరణం ముస్లిం నాయకులకు తీరని లోటును కల్గించింది. ఆ లోటు వెంటనే భర్తీ కాలేదు.

1874లో నయా మియాన్ నాయకత్వంలో భూస్వాములతో పోరాటం తారాస్థాయికి చేరింది. కౌలుకు తీసుకున్న రైతులు రాత పత్రాన్ని ఇవ్వాలని పట్టుబట్టారు. కౌలు పత్రాలు జారీ చేయడానికి భూస్వాములు అంగీకరించలేదు. ఫరఇజీల అండతో రైతులు భూస్వాములతో ఘర్షణకు సిద్ధపడ్డారు. ఈ విధమైన ఘర్షణలు 1879 వరకూ కొనసాగాయి. చివరకు రైతులకే విజయం లభించింది. రైతులు బ్రిటిష్ అధికారుల సానుభూతి, సహాయంకూడా సంపాదించడంలో కృతకృత్యులయ్యారు. అప్పటినుండి వారు బ్రిటిష్ ప్రభుత్వానికి తమ

సహకారం అందిస్తూ వచ్చారు. ఇది 20వ శతాబ్దంలో కూడా కొనసాగింది. అప్పటినుండి ఫరజ్‌ల ఉద్యమం ప్రధానంగా మత ఉద్యమంగా కొనసాగింది. బెంగాల్ ముజాహిద్‌ల నాయకుడైన సయ్యద్ అహ్మద్ అనుచరుల ప్రోద్బలంతో మరింత బలపడింది. అహ్మద్ 'తార్-ఇ-మొహమ్మదీయ' అను సంస్థను స్థాపించాడు.

### 14.10.3 తారిక్-ఇ-మొహమ్మదీయ (Tariqah-i-Muhemmediyah)

ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీకి చెందిన సయ్యద్ అహ్మద్ బరేల్వీ (1786 - 1831) "తారిక్-ఇ-మొహమ్మదీయ" అనే సాంఘిక, మత ఉద్యమాన్ని నడిపాడు. మహమ్మద్ సిద్ధాంతాలకు ప్రాణ ప్రతిష్ఠ చేయడానికి వలీ ఉల్లా స్థాపించిన విద్యాలయ వాతావరణంచేత ప్రభావితుడై పూనుకొన్నాడు. అందుకు మత ప్రవక్తల మార్గాన్ని అనుసరించాడు. క్షీణ దశలో ఉన్న ముస్లిం జాతిని పునరుద్ధరించడానికి త్రివిధ కార్యక్రమాన్ని సూచించాడు. కార్యక్రమంలోని అంశాలు: 1. భగవంతుని పొగడడం 2. మనసా, వాచా మతంలో నమ్మకాన్ని పునరుద్ధరించడం. 3. మత యుద్ధాన్ని ఆచరించడం. మతానికి ప్రార్థన, దానం, ఉపవాసం, నేరాన్ని అంగీకరించడం, తీర్థయాత్రలు మూలస్తంభాల్లాంటివనీ, వాటిలో దానం, భగవదారాధనకు అత్యంత శ్రేష్ఠమైన విధానమని అన్నాడు.

ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ జిల్లాల్లో సయ్యద్ అహ్మద్ పర్యటించాడు. మీరట్, ముజఫర్ నగర్, షహరన్‌పూర్ జిల్లాల్లో పెక్కు పట్టణాలను, గ్రామాలను సందర్శించాడు. రెండోసారి తూర్పు జిల్లాలైన అలహాబాద్, బెనారస్, కాన్పూర్, లక్నోలకు వెళ్లాడు. ఆయన వెళ్లిన ప్రతి ప్రదేశంలోను ప్రజాదరణ లభించింది. చేసిన ధర్మోపదేశాలు ప్రజలను విశేషంగా ఆకర్షించాయి. ఖురాన్ బోధించిన ప్రకారం ఇస్లాం సిద్ధాంతాలను ప్రజలకు వినిపించాడు. ఆయన ప్రధానంగా రెండు విషయాలు బోధించాడు. దేవుడొక్కడేనని నొక్కి చెప్పాడు. దేవతలు, భూతాలు, ప్రవక్తలు, సాధువులు, భగవంతునికీ, మనిషికీ మధ్య మధ్యవర్తుల పాత్ర నిర్వహించగలరని నిజమైన ముస్లిం నమ్మరాదన్నాడు. ఇండియన్, రోమన్, పర్షియన్ నాగరికతల్లో కనిపించే ఆచారాలు, కర్మకాండలు, ఖురాన్‌ను అనుసరించి లేకుంటే వాటిని తిరస్కరించాడు. దోషపూరితమైన కొత్త మార్పులను, విగ్రహారాధనను, బహుదేవతారాధనను తొలగించాలని పిలుపు నిచ్చాడు. సూఫీ మతాన్ని ఆమోదించి తన శిష్యుల ఎదుట సూఫీ అధ్యాపకుడిలాగా నటించాడు. తన ఆశయాలను పుస్తకాలు, కరపత్రాల ద్వారా ప్రచారం చేశాడు.

సయ్యద్ అహ్మద్ తన ఆశయాలను జిహాద్ లాగే అమలు చేయాలని ప్రయత్నించాడు. అబ్దుల్ అజీజ్ ప్రకటించిన పత్వాను ఆమోదించాడు. బ్రిటిష్ అధీనంలో ఉన్న ప్రాంతాన్ని ఇస్లామేతరమైన ప్రాంతంగా పరిగణించి, ఇస్లాం అధీన రేఖనుండి జిహాద్‌ను నిర్వహించాలని సంకల్పించాడు. శిక్కు రాజ్యంనుండి తన పోరాటాన్ని నిర్వహించాలని పథకం వేసుకొని, అందుకు మత వీరులను చేర్చుకున్నాడు. 1826లో రాయబరేల్లీ నుండి 500-600 మంది సయ్యద్ అహ్మద్ నాయకత్వంలో బయలుదేరారు. వారు పెషావర్‌ను ఆక్రమించుకున్నారు. కాని దాన్ని వెంటనే వదలివేయాల్సి వచ్చింది. పంజాబ్‌లోని శిక్కులతో జరిగిన బాలాకోట్ యుద్ధంలో సయ్యద్ అహ్మద్, షా మహమ్మద్ ఇస్మాయిల్ మరణించారు.

సయ్యద్ అహ్మద్ మరణం తర్వాత ఉద్యమం నిర్వీర్యమైంది. దాని ప్రధాన కార్యాలయాన్ని మొదట ఢిల్లీకి, తర్వాత పాట్నాకు మార్చారు. పాట్నా బృందానికి విలాయత్ ఆలీ, ఇనాయత్ ఆలీ నాయకులు. వీరు సరిహద్దు ప్రాంతాలకు తరలివెళ్లి యుద్ధానికి సన్నద్ధమయ్యారు. 1839లో రంజిత్‌సింగ్ మరణం, 1845లో జరిగిన మొదటి ఆంగ్లో - శిక్కు యుద్ధం, పంజాబ్‌లో బ్రిటిష్‌వారి అధికారాన్ని నిలబెట్టాయి. మత వీరులు బ్రిటిష్ వారిపై యుద్ధానికి దిగారు. ఆయుద్ధంలో వారు ఓడిపోయారు. 1853లో విలాయత్, ఇనాయత్ ఆలీ చంపబడ్డారు. ముస్లిం సైనిక బలం నాశనమైంది. వారి నాయకులు బందీలయ్యారు. ఈ పరిణామాలు తర్వాత అతి వాద ముస్లింలను ఆకర్షించింది. మిత వాదులకు ఢిల్లీలో ఆశ్రయ్యం లభించింది.

BRAOU

బలప్రదర్శన ద్వారా తారిక్-ఇ-మహమ్మదీయ ఉద్యమం ఇస్లాంను తిరగి బలమైన రాజకీయ శక్తిగా మార్చాలని ప్రయత్నించింది. సయ్యద్ అహమ్మద్ సైనిక దాడి అపజయం చవి చూచిన నేపథ్యంలో చాలామంది ముస్లింలు తమ మతాన్ని పునరుద్ధరించడానికి బలప్రయోగం చేయాలన్న ఆలోచనను విరమించుకున్నారు. పునరుద్ధరణోద్యమాలు 19వ శతాబ్దం చివరి భాగంలో ఉలేమాలపై దృష్టిని కేంద్రీకరించాయి.

### 14.10.4 దారుల్ ఉలుమ్ దియోబంద్, 1867 (Darul- Ulum-Deoband)

19వ శతాబ్దం ఉత్తరార్థంలో ఉలేమాలు ప్రయోజనాలను ముస్లింలు సుఖశాంతులతో జోడించి దాని ఆధారంగా పునరుద్ధరణోద్యమాలు ఆవిర్భవించాయి. ఒక ప్రత్యేక వర్గంగా ఉలేమాలు తమ అభిప్రాయాలను, ఆంగ్ల సంస్కృతికి సమన్వయం ఏర్పరచుకోడం అనుచితమని భావించారు. వీరిలో అధిక సంఖ్యాకులు పవిత్రమైన ఇస్లాం మతం తమ వర్గ పునరుజ్జీవనం గల కొత్త ప్రపంచం కోసం అన్వేషించారు. 1857 తర్వాత ఉత్పన్నమైన సవాళ్లను ఎదుర్కోడానికి దియోబంద్ ఉద్యమం ఈమార్గాన్ని అనుసరించింది.

1857 నాటి తిరుగుబాటులో ఉలేమాల్లో ఒక వర్గం పాల్గొన్నది. వారు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్వహించారు. ముస్లిం మత నాయకులకు శిక్షణ ఇవ్వడానికి వారు సహరన్‌పూర్ జిల్లాలోని దియోబంద్ వద్ద ఒక పాఠశాలను స్థాపించారు. ఈ పాఠశాల స్థాపనలో ముహమ్మద్ ఖాసిమ్ ననౌతావి (Muhammed Qasim Nanantavi 183-77) రషీద్ అహ్మద్ గంగోహి (Rashid Ahmad Gangobi 1829 - 1905) లు ప్రముఖ పాత్ర వహించారు. ఈపాఠశాల లక్ష్యాలు ఇవి: 1. భగవంతుని మాటను ఎటువంటి దురాకర్షణకు, ప్రాపకానికి, వత్తిడికి, పక్షపాతానికి లొంగకుండా పొగడటం. 2. ప్రాచీన ఇస్లాం మత సిద్ధాంతాల ప్రకారంగా జీవితాన్ని కొనసాగించడానికై ముస్లింలను సంఘటిత పరచి, వారిమధ్య సంబంధాలు విస్తరింపచేయటం. 3. ప్రభుత్వంతోగాని, కులీనులతోగాని సహకరించడం వల్ల పాఠశాల ప్రయోజనాలకు ప్రమాదమని తలచటం. 4. షావలీ ఉల్లా బోధనలను ధైర్యంగా, దృఢచిత్తంతో ఆచరించటం. 5. నిరంకుశ విధానాలను విడనాడి, పరస్పర సహకారం, సంప్రదింపుల ద్వారా ప్రజాస్వామ్య గణతంత్ర పద్ధతులను పాలనా రంగంలో ప్రవేశపెట్టటం.

B R A O U

ఈ విద్యాలయంలో పాఠ్యాంశాలను సంప్రదాయ విజ్ఞాన శాస్త్రాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించారు. పాఠ్య ప్రణాళిక, ఆర్థిక స్థితి, పరిపాలనకు సంబంధించిన విషయాల్లో పాఠశాల స్వతంత్రంగా వ్యవహరించింది. ప్రజలిచ్చిన విరాళాలపైనే పూర్తిగా ఆధారపడింది. రాజవంశీయులు, ప్రభుత్వ ఉద్యోగులు, మతనాయకులు వ్యాపారులు, భూస్వాములు విరాళాలు ఇచ్చారు. ఈపాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్ విద్యను, పాశ్చాత్య సంస్కృతిని, ప్రాగ్దేశాల్లో పాశ్చాత్యుల అధికారాన్ని వ్యతిరేకించారు. ముస్లిం సమాజ, నైతిక, మత విలువలను పునరుద్ధరించడానికి ఆసియా దేశాలకు విముక్తి ప్రసాదించడానికి శ్రమించారు. క్రమశిక్షణగల సూఫీ తత్వాన్ని, ముస్లిం న్యాయ సూత్రాన్ని వివరించడంలో ఉలేమాల పాత్రను గుర్తించారు. నిరక్షరాస్యులైన ముస్లింలు మత విశ్వాసాల విషయంలో ఎటువంటి నిర్ణయానికి రాలేదు. అయినప్పటికీ, దియోబంద్ నాయకులు కర్మకాండలను, పీర్‌ల అధికారాన్ని నిరాకరించారు. సన్యాసుల సమాధులకు తీర్థయాత్రలు, సన్యాసుల సాంవత్సరిక కర్మకాండలు (ఉర్స్‌లు) నిర్వహించటం ఇస్లాం మతం ఆచారం కాదన్నారు. హిందూ సంస్కృతినుండి గ్రహించిన ఏ మత, సాంఘిక అలవాటు అయినా సరే, తప్పుగా పరిగణించారు.

దియోబంద్ విద్యాలయం భారతీయులను సమైక్య పరచాలన్న లక్ష్యంతో జాతీయ కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమాలను సహకరించమని ముస్లింలను కోరింది. భారతదేశం ముస్లిమేతర దేశం అనీ, అందువల్ల బ్రిటిష్ వారిని దేశం నుండి తరిమివేయాల్సిన బాధ్యత ముస్లింలకు ఉందని భావించింది. దియోబంద్ నాయకులు

ఇస్లాంను విమర్శిస్తున్న క్రైస్తవులు, హిందువులతో చర్చల్లో పాల్గొన్నారు. ముహమ్మద్ ఖాసిం క్రైస్తవ మిషనరీలనుండి, ఆర్య సమాజికులనుండి ఇస్లాంను కాపాడటానికి కృషి చేశాడు.

దియోబంద్ పాఠశాలను ఆదర్శంగా తీసుకొని అనేక విద్యాలయాలు నెలకొల్పబడ్డాయి. 1880నాటికి పట్టభద్రులు గంగా, యమున నదుల అంతర్వేది ప్రాంతం (Doab) లోను, రోహిల్ ఖండ్‌లోను 12 విద్యాలయాలకు పైగా స్థాపించారు. దియోబంద్‌లు కేవలం వలస పాలనవల్ల ఏర్పడ్డ వాతావరణంలో పెరిగిన వారుగాకాక, హిందూ-ముస్లిం భావజాలాన్ని, ఆచారాలను అలవరచుకున్న వారుగా ప్రవర్తించారు.

దియోబంద్ పాఠశాల విధానాన్ని బలపరచిన వారిలో షిబ్లి నుమానీ (Shibli Numani, 1857-1914) ఒకడు. ఇతడు పర్షియన్ అరబిక్ భాషల్లో పండితుడు ఉర్దూలో అనేక గ్రంథాలను రాశాడు. ఇతనికి సంప్రదాయ ఇస్లామిక్ విద్యా విధానాన్ని సంస్కరించాలనే తలంపు ఉంది. లక్నోలో 'దారుల్ ఉలుమ్' (Darul - Ulum) అనే విద్యా సంస్థను ప్రారంభించి, పాత పాఠ్యాంశాలను మార్చి, ఇంగ్లీష్‌ను ప్రవేశపెట్టాడు. ఇస్లాం మతం ఉదారవంతమైందని, అది అభ్యుదయాన్ని, నాగరికతను వృద్ధి చేయడానికి తోడ్పడుతుందని భావించాడు. మనిషి వ్యక్తిత్వాన్ని, మానవుల సమానత్వాన్ని, స్త్రీల హక్కులను, ప్రజాస్వామిక తరహా ప్రభుత్వాన్ని సమర్థించాడు. మత నమ్మకాలను రక్షించుకోవాల్సినప్పుడు తప్ప మిగిలిన సందర్భాల్లో యుద్ధాన్ని నిషేధించాడు. సహనాన్ని ఉద్బోధించాడు. బలప్రదర్శన ద్వారా మత వ్యాప్తిని నిరశించాడు.

షిబ్లీ ప్రజాస్వామ్యవాది, సామ్రాజ్యవాద వ్యతిరేకి. బ్రిటిష్ వారిపట్ల రాజ భక్తి, కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత ప్రదర్శించే సయ్యద్ అహ్మద్ ఖాన్ విధానాన్ని గర్హించాడు. కాంగ్రెస్ ఉన్నత ఆశయాలను, ఆ సంస్థ భారతీయుల అభివృద్ధి, సంక్షేమం విషయంలో కనబరుస్తున్న శ్రద్ధను కొనియాడాడు. ముస్లింలు భారతదేశ పౌరులనీ, వారు వారి మాతృదేశం పట్ల దేశ భక్తిని చూపాలన్నాడు. ముస్లింలు, హిందువులు కలసి సుఖసంతోషాలతో గౌరవప్రదంగా బతకవచ్చన్న నమ్మకం ఆయనకు కల్గింది.

### 14.10.5 సయ్యద్ అహ్మద్ ఖాన్

భారతదేశంలోని ఉన్నత వర్గాల ప్రజల ఆశలను 1857 తిరుగుబాటు గట్టిగా దెబ్బతీసింది. బ్రిటిష్‌వారు ముస్లింలను ద్వేషించడం ప్రారంభించారు. పర్యవసానంగా ముస్లింలు అష్టకష్టాలకు గురైనారు. చాలామంది ముస్లింలు తమ ఆస్తిపాస్తులను పోగొట్టుకున్నారు. ప్రభుత్వ సహాయం లేనందువల్ల ముస్లిం యువకుల భవిష్యత్తు అగమ్యంగా తయారైంది. 1857 తర్వాత సివిల్, మిలటరీ శాఖల్లోని అధీన (Subordinate) ఉద్యోగాల్లో వారి మెజారిటీ పోయింది.

ఈ క్లిష్ట పరిస్థితుల్లో సంప్రదాయ ఆశయాల పరిరక్షకులైన ఉలేమాలు సంఘ సంస్కరణను, రాజకీ స్వాతంత్ర్యాన్ని కోరుకున్నారు. ఈ ప్రధాన లక్ష్యాన్ని మతాచారాలను ప్రక్షాళన చేసే మూఢనమ్మకాలను నిర్మూలించి, ఖురాన్ నిర్దేశించినట్లు నడచుకోమని ముస్లింలకు నచ్చచెప్పి సాధించవచ్చనే నమ్మకం వారికి కలిగింది. ఇండియాలో విదేశీ పాలన కొనసాగినంత కాలం ఈ మార్పులు తేవడం దుస్సాధ్యంగా వారు భావించారు. భారతదేశానికి స్వతంత్ర్యం సిద్ధిస్తే, ముస్లింల మత, సాంస్కృతిక స్వేచ్ఛ క్షేమంగా ఉంటుందని నమ్మారు. అందువల్ల వారు పాశ్చాత్య విద్యా సంస్కృతులను, విదేశీ పాలనను వ్యతిరేకించారు.

కొంతమంది ముస్లిం నాయకులు పాశ్చాత్య కళలను, శాస్త్రాలను బోధించే పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ చేరి ఆధునిక విద్య నభ్యసించి ప్రభుత్వ సహాయ సహకారాలను సంపాదించడానికి తహతహలాడారు. వారు పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానార్జనను సమర్థించారు. 19వ శతాబ్దం పూర్వార్ధంలో కలకత్తానుండి ఢిల్లీవరకు గల

ప్రాంతాల్లో కొద్దిమంది ముస్లిం యువకులు మాత్రమే పాశ్చాత్య విద్యను అభ్యసించారు. కాని ముస్లిం సమాజం స్తబ్దతగా ఉండిపోయింది. ఇంగ్లీష్ విద్య, యువకులకు మతంలోగల విశ్వాసాన్ని నాశనం చేస్తుందనీ, ఈపరిణామం వల్ల క్రైస్తవ మత వ్యాప్తికి మార్గం సులువు అవుతుందనీ భయపడ్డారు. కాని సయ్యద్ అహ్మద్ ఖాన్ (1827 - 1898) నాయకత్వంలో ఆంగ్ల భాషాధ్యయనానికి ఆధునిక శాస్త్రీయ ఆలోచనా విధానానికి అనుకూలంగా బలవత్తరమైన ఉద్యమం నడిచింది. ఆంగ్ల విద్య నేర్చుకోమని, బ్రిటిష్ ప్రభుత్వంతో సహకరించమని ముస్లింలను అహ్మద్ ఖాన్ అర్థించాడు. క్రైస్తవ మిషనరీలు నిర్దాక్షిణ్యంగా విమర్శిస్తున్న ఇస్లాం మతాన్ని తిరిగి క్షుణ్ణంగా పరిశీలించి, దాన్ని గట్టి పునాదులపై నిలబెట్టాలని కోరాడు. తాను ఏ సిద్ధాంతాలు ప్రతిపాదించాడో అవి అన్నీ ఖురాన్ ప్రబోధించిన సూత్రాలకు అనుగుణంగా, హేతుబద్ధంగా, ప్రకృతి సిద్ధంగానే ఉన్నవని సయ్యద్ అహ్మద్ ఖాన్ నిరూపించడానికి ప్రయత్నించాడు.

అహ్మద్ ఖాన్ మత సిద్ధాంతాలు ఇవి : 1. ఖురాన్ ఒక్కటే ఇస్లాం మతానికి ఆధికారిక గ్రంథం. ఖురాన్ బోధనలు దైవ ప్రేరితాలు. అవి శాశ్వతమైనవి. కాబట్టి అవి దోషరహితమైనవి. మనసా, వాచా అందరూ వాటిని అనుసరించాలి. ఖురాన్ చెప్పిందే అంతిమ సత్యం. వాటిని ఉల్లంఘించడానికి అనుమతి లేదు. 2. రచయితలు (Narrators) రాసిన ప్రవక్తల ప్రవచనాలు హదిత్ (Hadith) లో ఇమిడి ఉన్నాయి. రచయితల ప్రవర్తనను పరిశీలించిన పిదప ఏది అనుమతియోగ్యమైందో, ఏది ఉత్తమమైందో పరీక్షలో తేలుతుంది. 3. హదిత్ అధికారం మత విషయాల్లో మాత్రం అనివార్యం. 4. మనిషి సంకల్పానికి స్వేచ్ఛ ఉండాలి.

ఈ నియమాల (Principles) వల్ల అహ్మద్ ఖాన్ ఇస్లాం మత సిద్ధాంతాల విప్లవాత్మక వ్యాఖ్యాతగా పేరు తెచ్చుకున్నాడు. భగవంతుని ఆవిర్భావం ప్రకృతిలో ఉన్న ప్రతి పదార్థం (వస్తువు) లోను అంతర్వాహినిగా దాగి ఉంది. భగవంతుని, ప్రకృతి రహస్యాలను పరిమితమైన జ్ఞానం ఉండటం తెలుసుకోలేకపోతున్నారని చెప్పాడు. అద్భుతాలు (miracles) సృష్టి సిద్ధాంతాలను విరుద్ధమైనవి గాబట్టి వాటిని ఖండించాడు. మనుష్యులు, జంతువులలాగే దేవతలు, సైతాను, సర్వ స్వతంత్రులైన ప్రాణులుగారని, అవి మనిషిలోని మంచి, చెడు శక్తులని అన్నాడు. మానవుని దృష్టిలో ఖురాన్ దేవుని మాట. అందువల్ల అది శాశ్వతమైంది. దేవునిపట్ల విశ్వాసంగల ఏవ్యక్తినైనా విశ్వాస ఘాతుకుడు (కాఫిర్) గా, అన్యమతావలంబిగా దూషించరాదన్నాడు.

సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ విషయాల్లో సమానమైన స్వాతంత్ర్యం ఉండాలన్నాడు అహ్మద్ ఖాన్. బానిసత్వాన్ని నిర్మూలించడానికి, బానిసల పరిస్థితిని చక్కదిద్దడానికి ఇస్లాం మతంలో ఉదార నియమాలు ఉన్నవని గుర్తు చేశాడు. అసాధారణ పరిస్థితుల్లో తప్ప బహుభార్యాత్వాన్ని అంగీకార యోగ్యం కాదన్నాడు. పవిత్ర యుద్ధాన్ని ముస్లిమేతరులపై ప్రకటించడం న్యాయ సమ్మతం కాదని, కాని ఇస్లాంపై దాడి జరిగినప్పుడే ఆ చర్య తీసుకోవాలనీ, యుద్ధ ఖైదీలను ఉరితీయరాదని చెప్పాడు.

బ్రిటిష్ పాలకులకు, ముస్లింలకు మధ్య ఉన్న అగాధాన్ని తగ్గించడానికి అహ్మద్ ఖాన్ కృషిచేశాడు. కాబట్టి అతడు క్రైస్తవులను విమర్శించలేదు. ముస్లింలు సాంఘిక సంస్కరణ చేపట్టాలనీ, ఇంగ్లీష్‌ను, పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రాలను అధ్యయనం చెయ్యాలన్నాడు. వాటి గురించి ముస్లింలలో ఉన్న వ్యతిరేక భావాలు పోవాలన్నాడు. సాంఘిక స్వేచ్ఛను సమర్థించాడు ముస్లింలు ఐరోపీయులతో కలసి భోజనం చేయరాదనే నియమం లేదన్నాడు. కాని నిషిద్ధ పదార్థాలు భోజనంచేసే బల్లమీద ఉండరాదన్నాడు. ఆంగ్లేయులను అతిథులుగా ఆహ్వానించి, వారితో కలసి యూరోపియన్ పద్ధతిలో భోజనాలు చేసి వారు కోరితే అతిథిగా వెళ్లి, అహ్మద్ ఖాన్ తన అభిప్రాయాలను ఆచరణలో పెట్టాడు.

ముస్లిం జాతిని రక్షించడానికి, ఆంగ్లేయ ప్రభుత్వంతో చేతులు కలిపి పనిచేయడానికి నీతి, నియమాలు గల ప్రజల సంక్షేమం కోరే నాయకులను తయారుచేయడానికి, పాశ్చాత్య విజ్ఞానశాస్త్ర, సంస్కృతుల వ్యాప్తికోసం

1875లో అలీఘర్‌లో మహమ్మదీయ ఆంగ్లో-ప్రాచ్య కళాశాలను స్థాపించడంలో, అహ్మద్ ఖాన్ ప్రముఖ పాత్ర వహించాడు. అదే అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందింది. ఈ కళాశాల పరిపాలన వ్యవహారాలు చూడ్డానికి ఎక్కువ సమయాన్ని ఖాన్ వినియోగించేవాడు. కళాశాల వెలుపల ముస్లింల స్థితిగతులను మెరుగు పర్చడానికి ఉద్యమాన్ని నడిపాడు. ఇస్లామిక్ విద్యా విధానాన్ని పటిష్టం చేయడానికి 1886లో మహమ్మదీయ ఆంగ్ల - ప్రాచ్య విద్యా సదస్సును (Muhammedan Anglo oriental Educational Conference) నిర్వహించాడు. రెండు సంవత్సరాల తర్వాత థియోడార్ బెక్ (Theodore Beck) తో కలిసి 'యునైటెడ్ ఇండియన్ పేట్రియాటిక్ అసోసియేషన్' (United Indian Patriotic Association) ఏర్పాటు చేశాడు.

### 14.10.6 బరెల్వి ఉలేమా

పాశ్చాత్య విద్యకు అనుకూల విధానాన్ని అంగీకరించనివారు సయ్యద్ అహ్మద్ ఖాన్‌ను వ్యతిరేకించారు. దానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారు. అట్టివారిలో రాజీపడని ఉలేమా మౌలానా అహ్మద్ రిజా ఖాన్ (1856-1921). ఇస్లామిక్ ఆచారాలను, విశ్వాసాలను, అలవాట్లను విమర్శించేవారిని వ్యతిరేకిస్తూ చాలాకాలం పోరాడాడు. ఆధ్యాత్మిక సత్యాన్ని సంపూర్ణంగా తెలిసిన మహాప్రవక్త (prophat) బోధనలను తన ఉపన్యాసాల్లో ప్రధానంగా ప్రస్తావించాడు. ప్రవక్త జన్మదిన ఉత్సవాలను నిర్వహించాడు. మహమ్మద్‌ను విమర్శించడాన్ని తీవ్రమైందిగా పరిగణించాడు. ఇస్లాం మతానికి చెందిన సన్యాసులు మరణానంతరం గూడ భౌతికంగా జీవించే ఉంటారని, వారు ప్రార్థనలు వినగలరని, స్మశానం నుండి కోర్కెలు నెరవేరుస్తారని ఆయన నమ్మకం. అందుకే ఉర్సులను జరుపుకోడానికి అంగీకరించాడు. సన్యాసులను, సమాధులను గౌరవించాడు. సనాతన ఉద్యమ నాయకుడుగా ఇస్లాం మతంపై మరల వ్యాఖ్యానించడాన్ని వ్యతిరేకించాడు. ఇతని ఉద్యమ కార్యక్రమాలకు కేంద్రం బరేలీ. అతని శిష్యుల్లో అధిక శాతం గ్రామీణ ప్రజలు, నిరక్షరాస్యులు. ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారు అతి స్వల్పం.

## 14.11 పార్సీల్లో మత సంస్కరణ

పశ్చిమ భారతదేశంలో ఉన్న పార్సీలు క్రైస్తవ మిషనరీలు ప్రత్యక్ష సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. 'పార్సీ మతం' (The Parsi Religion) అనే గ్రంథంలో క్రైస్తవ మిషనరీ జాన్ విల్సన్ (John Wilson) పార్సీల జొరాష్ట్రియన్ మతాన్ని విమర్శించాడు. ఇంతకంటే పెద్ద ప్రమాదం ఇంకొకటి ఏర్పడింది. 1839లో ముగ్గురు పార్సీ విద్యార్థులు క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. ఈ పరిణామం పార్సీలను భయ, భ్రాంతులకు గురిచేసింది. విల్సన్ దాడుల నుండి రక్షించుకోవడానికి వారు తీవ్రంగా ప్రయత్నించారు. జొరాష్ట్రియన్ మతాన్ని సమర్థిస్తూ నౌరోజీ ఫర్దోంజీ (Naoroji Fardungi) ఫామ్-ఇ-ఫమ్‌షిద్ (Fam-i-Famshid) అనే పత్రికను ప్రచురించాడు. 1851లో నౌరోజీ ఫర్దోంజీ, విద్యావంతులైన ఇతర పార్సీ ప్రముఖులు బొంబాయిలో "రెహ్నుమాయి మజ్‌దాయాన్ సభ" (Rahnumai Mazdayan Sabha) ను స్థాపించారు. ఇది పార్సీల తమ మత సంస్కరణ సభ. 1855లో మరణించేవారకు నౌరోజీ ఫర్దోంజీ దానికి అధ్యక్షుడుగా ఉన్నాడు. సొరాబ్జీ షహపూర్‌జి బెంగాలి (Sorabji Shapurji Bengali) దానికి కార్యదర్శిగా పనిచేశాడు. ఈ సభ తరపున 'రస్త్ గఫతర్' (Rast Goftar) పత్రికను తమ అధికార ఉద్యమ ప్రచార సాధనంగా ప్రచురించారు. షహపూర్‌జీ బెంగాలీ స్వయంగా 'జగత్ మిత్ర' (Jagat Mitra), 'జగత్ ప్రేమి' (Jagat Premi) అను పత్రికలను ప్రచురించాడు.

పార్సీసాంఘింకాచారాలఆధునీకరణకు 'రెహ్నుమాయి మజ్‌దయాన్' సభ కృషి చేసింది. దాని లక్ష్యాలు రెండు. అవి 1. పార్సీల సాంఘిక స్థితిని పునరుద్ధరించడం. 2. జొరాష్ట్రియన్ మత ప్రాచీన ఔన్నత్యాన్ని పునః ప్రతిష్ఠ చేయడం. ఈ లక్ష్యాల సాధనకై పార్సీ నాయకులు సనాతన వాదులను వ్యతిరేకించారు. వివాహ నిశ్చితార్థం

సమయంలోనూ, వివాహాల సందర్భంగాను, అంత్యక్రియల సందర్భంగాను పెద్ద ఎత్తున ఆచార కర్మలను జరిపించడాన్ని విమర్శించారు. బాల్య వివాహాలను, సనాతన సాంప్రదాయాలను, మూఢ నమ్మకాలను వ్యతిరేకించారు. సభ ఎక్కువగా పాశ్చాత్య విద్య, పాండిత్యంపై పూర్తిగా ఆధారపడి జొరాస్ట్రియన్ మతానికి సరికొత్త నిర్వచనం ఇవ్వడానికి కృషి చేసింది. పాశ్చాత్య పవిత్ర మత గ్రంథాలను, ఆచార కర్మకాండలను, సాంప్రదాయాల్ని, పార్సీ పండితులు అధ్యయనం చేశారు. వారి విజ్ఞానం మత సంస్కరణకు కొత్త తరం పార్సీ పురోహితులను తయారుచేయడానికి పునాది అయింది. క్రమంగా పార్సీ సమాజంపై పురోహితుల ప్రభావం పూర్తిగా నశించింది. బొంబాయి నగర సంపన్న పార్సీల్లో చాలామంది పశ్చిమ దేశీయులతో కలిసిమెలిసి ఉండటాన్ని కోరుకున్నారు. ఫలితంగా వారు ఆధునిక దుస్తులు ధరించడం, ఇంగ్లీష్ వారి సాంప్రదాయాల్ని, సాంఘిక అలవాట్లను అనుసరించడం ప్రారంభించారు. వారి కుమారుల వివాహ వయోపరిమితి, కుమార్తెల అక్షరాస్యత పెరిగింది. బొంబాయిలో సామాజిక మార్పుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. అయితే, గుజరాత్‌లోని చిన్న చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మతగురువుల పెత్తనం పార్సీలపై ఇంకా కొనసాగుతూనే ఉంది.

## 14.12 సిక్కుల్లో మత సంస్కరణోద్యమం

పంజాబ్‌లో క్రైస్తవ మిషనరీల ప్రాభవం వేగంగా పెరిగిపోయిన నేపథ్యంలో, దానికి వ్యతిరేకంగా సాంఘిక, మత ఉద్యమం ప్రారంభమైంది. లూథియానా ప్రధాన కేంద్రంగా 'అమెరికన్ ప్రెస్బిటేరియన్ మిషన్' (American Presbitarian Mission) స్థాపించబడింది. ఇతర మతాల్లోకి చేరవచ్చనే విషయాన్ని తీవ్రతరం చేయటానికి తమ మతంలోకి ఇతర మతస్థులను ఆకర్షించడానికి అమెరికన్ మిషనరీలు గట్టి ప్రయత్నాలు చేశాయి. 1857 తిరుగుబాటు వల్ల క్రైస్తవ మిషనరీల పెరుగుదలకు తాత్కాలికంగా కొద్దిపాటి విఘాతం ఏర్పడింది. కాని 1860లో పశ్చిమోత్తర ప్రాంతమంతా అనేక క్రైస్తవ మిషనరీలు వరసగా వ్యాపించాయి. క్రైస్తవులుగా మారిన సిక్కు మతస్థుల సంఖ్య 1881లో 3912 ఉండగా, ఈ సంఖ్య 1901 నాటికి 37,980 వరకూ పెరిగింది. ఈ పెరుగుదల సిక్కు మత నాయకుల్లో కలవరాన్ని సృష్టించి, వారు భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యల గూర్చి తీవ్రంగా ఆలోచించేట్లు చేసింది. సిక్కులకు సంబంధించని ఆచారాలతో భ్రష్టుపట్టిన సిక్కు సమాజాన్ని ప్రక్షాళన చేయాలని ఈ నాయకులు తమ కృషిని ప్రారంభించారు.

### 14.12.1 నిరంకారీలు

ప్రప్రథమంగా ఈ ఉద్యమానికి నాయకత్వం వహించింది పెషావర్‌కు చెందిన బాబా దయాళ్ (1783-1855). ఇతడు దేవుళ్లను, దేవతలను ఆరాధించడం, కర్మకాండలు చేయడం, బ్రాహ్మణ పుజారులను నియోగించటాన్ని వ్యతిరేకిస్తూ ప్రబోధించాడు. సనాతన వాదులు అతన్ని సామాజిక బహిష్కరణకు గురిచేశారు. అతని అనుచరులను నిరంకారీలందురు. అతని ఉద్యమానికి కూడ నిరంకారీ ఉద్యమం అని పేరు వచ్చింది. భగవంతుని నిరాకారుడుగా (ఆకారం లేనివానిగా) ఆరాధించమని నొక్కి చెప్పాడు. అందువల్ల ఇతని అనుచరులు 'నిరంకారులు'. గురునానక్ గొప్పతనాన్ని, అధికారాన్ని, 'ఆది గ్రంథ్' ప్రాముఖ్యాన్ని విపులంగా బాబా దయాళ్ వివరించాడు. తన శిష్యులు దురభ్యాసాలను విడిచిపెట్టాలని, కష్టపడి పనిచేయటం ద్వారా జీవన మార్గం చూచుకోవాలని ఉపదేశించాడు. మాంస భక్షణ, మద్యపానం, మోసగించటం, తప్పుడు తూకాలు తూచటం మొదలైనవి నిషేధింపబడ్డాయి.

బాబా దయాళ్ మరణం తర్వాత అతని కుమారుడు బాబా దర్బార్ సింగ్ (1814-70) నాయకత్వాన్ని చేపట్టాడు. అనేక ఇతర ఆచారాల సంస్కరణలతోపాటు తమ దృష్టిని ప్రజలందరికి నచ్చచెప్పడంలో వైదిక

బ్రాహ్మణ పురోహితులు నిర్వహించే వివాహ కర్మకు బదులు, ఆనంద వివాహ ఆచారానికి ప్రాముఖ్యం ఇచ్చాడు. దాని ప్రచారం కొరకు పశ్చిమ పంజాబ్ అంతా విస్తృతంగా పర్యటించాడు. 1861 ఏప్రిల్‌లో ఈయన సంస్కరించిన పద్ధతిలో వివాహాన్ని జరిపించి సఫలీకృతుడైనాడు. 1870లో ఇతని సోదరుడు రతన్‌చంద్ ఇతని స్థానాన్ని ఆక్రమించాడు. నాభా మహారాజు హర్‌సింగ్ కుమారుడు తిక్కారిపుదమాన్ కృషి ఫలితంగా 1909 అక్టోబర్‌లో 'ఆనంద వివాహ చట్టం' చేయబడింది. 1947లో దేశ విభజన తర్వాత నిరంకారుల ప్రధాన కార్యాలయం చండీఘర్‌కు మారింది.

### 14.12.2 నామ్‌ధారులు

బాబా రామ్‌సింగ్ (1816-85) నామ్‌ధారీ ఉద్యమాన్ని ప్రారంభించాడు. లూథియానా జిల్లాకు చెందిన భైనీ (Bhaini) గ్రామ నివాసి. అతనిని, అతని అనుచరులను నామధారులు (పేరు పెట్టుకున్నవారు) అని పిలిచేవారు. కొన్ని సమయాల్లో కొందరు అత్యుత్సాహంతో 'వహిగురు, వహిగురు' (భగవంతుని ఒక పేరు) అని బిగ్గరగా ఉచ్ఛరించేవారు. కాబట్టి వారిని 'కూకాలు' (Kukas) అని పిలిచేవారు.

బాబా రామ్‌సింగ్ సిక్కు సమాజంలో ఉన్న అన్ని కుల విభేదాలను నిషేధించాడు. అన్ని వర్గాల సిక్కు ప్రజలను కులాంతర వివాహాలు ప్రోత్సహించమని కోరాడు. పునర్వివాహం చేసుకోమని వితంతువుకు పిలుపు ఇచ్చాడు. మత్తు పదార్థాలు, మద్యపానం మానమని ఉద్బోధించాడు. కట్నాలు తీసుకొనే పద్ధతికి స్వస్తి చెప్పి, ఆనంద వివాహాలను ప్రోత్సహించాడు. తన అనుచరులను, దేవుళ్లను, దేవతలను, పాములను, చెట్లను, విగ్రహాలను పూజించ వద్దని, సమాధులవద్ద, స్తూపాల వద్ద ప్రార్థనలు చేయవద్దని కోరాడు. బ్రాహ్మణుల పౌరోహిత్యాన్ని, వంశపారంపర్యంగా గురుద్వారాల పరిపాలన పొందటాన్ని వ్యతిరేకించాడు. ఆకారంలేని దేవుని పూజించమని, గోవులను వధించవద్దని ఉపదేశించాడు.

### 14.12.3 సింగ్ సభ

పంజాబ్ సిక్కు సమాజంలో సమాంతర ఉద్యమాలు కొన్ని ప్రారంభమైనాయి. 1873లో కొంతమంది సిక్కు ప్రముఖులు అమృతసర్‌లో "సింగ్ సభ"ను స్థాపించారు. వారిలో ఖేమ్ సింగ్ బేడి (Kehm Singh Bedi), ఠాకూర్ సింగ్ సంధావాలియా (Thakur Singh Sandha Walia), కన్వర్ బిక్రమ్ సింగ్ (Kanwar Bikram Singh), గ్యానీ గియాన్ సింగ్ (Giani Giyan Singh) ప్రముఖులు. ఈ సింగ్ సభ సిక్కు మత పూర్వ వైభవ పునఃస్థాపనకై కృషి చేసింది. 1879లో లాహోర్‌లో ఏర్పడ్డ సింగ్ సభకు వేరుగా ప్రత్యేక శాఖలు ఏర్పడ్డాయి. కాని అవి లాహోర్ సభ కంటె మందకొడిగా అభివృద్ధి చెందాయి.

భారతదేశంలో ఎక్కడా కనిపించని విభిన్న మతాలవారు పంజాబ్‌లో ఉన్నారు. అందువల్ల ఇతర ప్రాంతాలకంటే పంజాబ్‌లోనే సాంఘిక, మత ఉద్యమాలు అనేకం ఆవిర్భవించాయి. ఈ ఉద్యమాలు ఏదో ఒక పట్టణంలో ప్రారంభమై, ఇతర పట్టణాలకు, అప్పుడప్పుడూ గ్రామాలకు వ్యాపించాయి. ఆర్య సమాజ్, అహమ్మదీయ వంటి ఉద్యమాలవల్ల ఏర్పడ్డ మత చైతన్యం పంజాబ్ నుండి ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందింది. బెంగాల్, గంగానదీ ప్రాంతాల మత ఉద్యమాలు కూడా పంజాబ్‌ను ప్రభావితం చేశాయి. అంతేగాక కొంత కాలానికి పంజాబే కొన్ని ఉద్యమాలను వ్యాప్తిచేసే స్థాయికి ఎదిగింది.

### 14.12.4 పంజాబ్ సనాతనులు

దేవ సమాజ తీవ్ర వాదం, బ్రహ్మ సమాజం, ఆర్య సమాజాల కార్యకలాపాలు, క్రైస్తవ మత ప్రచారకుల విమర్శలు సనాతన హిందువులు తమ మతాన్ని రక్షించుకోవాలి అన్న బాధ్యతను గుర్తుచేశాయి. 19వ శతాబ్దంలో

BRAOU

పంజాబ్‌లోని పూర్వాచార పరాయణులైన హిందువులకు జలంధర్ జిల్లాకు చెందిన పండిట్ శ్రద్ధారాం నాయకుడు. ఇతని కుటుంబీకుడైన మరుద్ జోషి బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. శ్రద్ధరాం సంస్కృతం, పంజాబీ, పారశీకం, ఉర్దూ భాషలు నేర్చాడు. వైష్ణవ హిందూ తత్వాన్ని ప్రబోధించి, మద్యాన్ని సేవించడం, దొంగతనం చేయడం, వంటి చెడు అలవాట్లను విడిచిపెట్టమని పిలుపునిచ్చాడు. సనాతన హిందూ మతాన్ని గట్టిగా సమర్ధించి, క్రైస్తవ మతాన్ని ఖండించాడు. ఇతని "ధర్మ రక్ష" సనాతన హిందూ ధర్మాన్ని కాపాడి, తర్వాత కాలంలో సనాతన ఉద్యమాలకు పునాది వేసింది.

19వ శతాబ్దంలో ఉద్భవించిన మత ఉద్యమాలు ప్రజల్లో ఆత్మ విశ్వాసం, దేశంపట్ల గర్వం అధికం కావడానికి దోహదపడ్డాయి. ఆ ఉద్యమాలవల్ల సాంఘిక సమానత్వం, మానవతాదర్శాలకు అధిక ప్రచారం లభించింది. సంస్కర్తలు సామాజిక అవసరాలకు అనుగుణంగా అవినీతికరం, హేతు రహితం అయిన మత విశ్వాసాలను, ఆచారాలను తీవ్ర చర్యల ద్వారా నిర్మూలించడానికి ప్రయత్నించారు. ఏకకాలంలో సాంఘిక సంస్కరణ కార్యక్రమం కూడా ఊపు అందుకుంది. జాతీయ భావ వెల్లువ వల్ల పాశ్చాత్య పద్ధతులు భౌతికమని, హీనమైనవని తీవ్ర విమర్శకులకు గురయ్యాయి. క్రమంగా ప్రజలు ధైర్యంతో ప్రాచీన ధర్మం పట్ల ఆకర్షితులయ్యారు. నిర్బంధ వైధవ్యం, వంశానుక్రమమైనకఠిన కుల వ్యవస్థ, బహు భార్యత్వం, జనాన పద్ధతి, అతి బాల్య వివాహాలు మొదలైన వాటికి మత ఆధారం లేదని వారు నమ్మారు. మత ఉద్యమాల స్ఫూర్తివల్ల వారసత్వ కుల వ్యవస్థపై నమ్మకం సడలింది. శతాబ్దాలుగా దోపిడీకి గురైన బడుగు వర్గాల దృక్పథంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఈ వర్గాలవారు తమ అభివృద్ధికై పోరాటాలు నిర్వహించారు. వారిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అయితే, మత ఉద్యమాలు ప్రజల మూఢ నమ్మకాలను కొంతవరకు మాత్రమే మార్చగలిగాయి; వ్యవస్థను పూర్తిగా మార్చడంలో విఫలమయ్యాయి.

మత ఉద్యమాల ప్రభావ కారణంగా సంస్కర్తల దృష్టిని మానవ సంక్షేమం అధికంగా ఆకర్షించింది. హిందూ మత నిర్మాణాత్మక కార్యక్రమానికి కొత్తగా సాంఘిక సేవ అంశం జతచేయబడింది. సంస్కర్తలు పాఠశాలలు, శరణాలయాలు స్థాపించారు. శాశ్వత సాంఘిక సేవ సంస్థను రామకృష్ణ మిషన్‌వారు ఏర్పాటు చేశారు. మిషన్ సాధువులు చికిత్సా కేంద్రాలను తెరచారు, పాఠశాలలను స్థాపించి బోధించారు. అనేక ఉపాధి కార్యక్రమాలను నిర్వహించారు. 20వ శతాబ్దంలో లౌకిక సంస్థలు కూడ రంగంలోకి ప్రవేశించాయి.

దేశంలో దినదినాభివృద్ధి చెందుతున్న జాతీయోద్యమంతో మత సంస్కరణోద్యమాలు బహిరంగంగా కలిసిపోలేదు. అవి మత సంస్థలు గానే కొనసాగాయి. రామకృష్ణ మిషన్ సాధువులు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే ఆర్య సమాజికులు హిందూ మతాన్ని సమర్ధిస్తూ క్రమంగా రాజకీయ చర్యలవైపు ఆకర్షితులయ్యారు. వారి శుద్ధి కార్యక్రమం, ముస్లిం వ్యతిరేక చర్యల వల్ల ఆర్య సమాజానికి భారత జాతీయ కాంగ్రెస్ సంస్థకు సమాంతరంగా స్థానం లభించింది. 20వ శతాబ్దంలో ప్రజాస్వామ్య విలువలతో ఏకీభవించని వర్గాల ప్రజలను ఆకర్షించడానికి మత, లౌకిక ఉద్యమాలు పోటీ పడ్డాయి.

హిందూ, ముస్లిం, సిక్కు, పార్సీ మతస్థుల సంస్కరణోద్యమాలు ఆయా మతాల వారిని వేర్వేరుగా సంఘటితపర్చడానికి కృషి చేశాయి. అవి ప్రధానంగా ప్రాచీన మత గ్రంథాల ప్రావీణ్యం మీద ఆధారపడ్డాయి. ఈ ప్రక్రియ 19వ శతాబ్దంలో ప్రారంభమైంది. మతానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటంచేత సంఘంలో వివిధ వర్గాల మధ్య చీలికలు ఏర్పడ్డాయి. ఉద్యమాల స్వభావం మతతత్వం ఆవిర్భవించడానికి దోహదం చేసింది. ఆవేశపూరితమైన మత తరంగాలు ఆయా మతస్థుల ఆలోచనలను వివిధ మార్గాల్లో పయనించేట్లు చేసి లౌకిక జాతీయ ఉద్యమ శక్తిని బలహీనపరచాయి.

BRAOU

## 14.13 సంగ్రహంగా

19వ శతాబ్దంలో హిందూ, ఇస్లాం, పార్సీ, సిక్కు మత సంస్కరణోద్యమాలు ఆవిర్భవించి మత, సాంఘిక సంస్కరణలకై కృషిచేశాయి.

హిందూ మత సంస్కరణోద్యమాల్లో మొదటిది బ్రహ్మ సమాజం. దాన్ని బెంగాల్‌లో రామ్‌మోహన్ రాయ్ స్థాపించాడు. దేవేంద్రనాథ టాగూర్, కేశవచంద్ర సేన్, శివనాథ శాస్త్రి మొదలైనవారు దాని ఆశయాల వ్యాప్తికి కృషి చేశారు. విగ్రహారాధన, కర్మకాండలు, బహుదేవతారాధన మొదలైన మత, సాంఘిక దురాచారాలను వ్యతిరేకించి బ్రహ్మ సమాజం ప్రజల్లో చైతన్యం రేకెత్తించింది. విశ్వ మానవ సౌభ్రాతృత్వం ప్రబోధించింది. దేశ ప్రగతికి పునాదుల వేసింది.

పశ్చిమ భారతదేశంలో ప్రార్థనా సమాజానికి ప్రజాదరణ లభించింది. అదికూడా ఆస్తిక మతాన్ని ప్రబోధించింది. కొన్ని సంస్కరణల విషయంలో సరళీకృత విధానాన్ని అవలంబించింది.

బ్రహ్మ సమాజ ఉద్యమం మద్రాస్‌కు ఆలస్యంగా వ్యాపించింది. హేతు వాదాన్ని ప్రచారం చేసింది.

పునరుద్ధరణోద్యమమైన ఆర్య సమాజానికి పంజాబ్ కేంద్రం. దయానందుడు దాన్ని స్థాపించాడు. అది ప్రాచీన వేద సంస్కృతిని ప్రచారం చేసింది. శుద్ధి, గోరక్షణ కార్యక్రమాల్ని కొత్తగా చేపట్టింది.

అనీబిసెంట్ నాయకత్వంలో దివ్యజ్ఞాన సమాజం, వివేకానందుని నాయకత్వంలో రామకృష్ణ మిషన్ ప్రాచీన హిందూ మత ఔన్నత్యాన్ని చాటి చెప్పాయి.

ఇస్లాం మత సంస్కరణకై ఉలేమాలు, సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ కృషిచేశారు.

పార్సీ మత సంస్కరణలకు రెహ్నుమాయిమజ్ దయాన్ సభ కృషిచేసింది.

సిక్కు మతస్థులైన నిరంకారీలు, నామధారులు, సిక్కు మతాన్ని సంస్కరించడానికి పాటుబడ్డారు.

## 14.14 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. 19వ శతాబ్దంలో వచ్చిన భారతీయ పునరుజ్జీవన వైఖరులను తెల్పండి.
2. బ్రహ్మ సమాజానికి రామ్‌మోహన్ రాయ్ చేసిన సేవలను వర్ణించండి.
3. బ్రహ్మ సమాజ సూత్రాలు, దాని అభివృద్ధి గూర్చి విమర్శనాత్మక వ్యాసం రాయండి.
4. హిందూ సమాజ సముద్ధరణకు దయానంద సరస్వతి చేసిన సేవలను వర్ణించండి.
5. ఇస్లాం మత సంస్కరణోద్యమంలో ఉలేమాల పాత్రను వివరించండి.
6. సయ్యద్ అహ్మద్ ఖాన్ ప్రచారం చేసిన మత సంస్కరణలు తెలుపండి.
7. స్వామి వివేకానంద బోధనలను వర్ణించండి.

B R A O U

II. కింది ప్రశ్నకు లఘు వాక్యాలు రాయండి.

1. బ్రహ్మ సమాజానికి దేవేంద్రనాధ టాగూర్ చేసిన సేవలను వివరించండి.

2. బ్రహ్మ సమాజంలో చీలికలు రావడానికి దారితీసిన పరిస్థితులు తెల్పండి.

3. ప్రార్థనా సమాజ్ ఆశయాలేమిటి?

4. దివ్యజ్ఞాన సమాజానికి అనీబిసెంట్ చేసిన సేవలు తెల్పండి.

5. రామకృష్ణ మిషన్ లక్ష్యాలను రాయండి.

6. నిరంకారీ, నామధారీ ఉద్యమాల గురించి క్లుప్తంగా రాయండి.

7. ఆలీగర్ ఉద్యమ లక్షణాలను వివరించండి.

## 14.15 ఉపయుక్త గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 12. | Sen, S.P. (ed) | : | **Social and Religious Reform Movements in the Nineteenth and Twentieth Centuries. 1979.** |
| 13. | Sasikumar Mitra | : | **Resurgent India, 1963** |
| 14. | Sumit Sarkar | : | **Modern India 1885-1947, 1983.** |
| 15. | Zacharis, H.C.E. | : | **Aspects of Social and Political Revolution in India 1985.** |
| 16. | చిరంతనానందస్వామి | : | **శ్రీ వివేకానంద జీవిత చరిత్ర 1981.** |
| 17. | చిరంతనానందస్వామి | : | **శ్రీ రామకృష్ణ జీవిత చరిత్ర** |


**రచయిత : ఆచార్య బి. కేశవనారాయణ**

BRAOU

# భాగం - 15 : ప్రాంతీయ భేదాలు : ఉద్యమాల సామాజిక పునాది

విషయక్రమం


15.0 లక్ష్యాలు

15.1 పరిచయం

15.2 బెంగాల్ బ్రహ్మ సమాజం

15.3 పశ్చిమ భారతదేశం

15.3.1 పరమహంస మండలి

15.3.2 మానవ ధర్మ సభ

15.3.3 ప్రార్థనా సమాజం

15.4 దక్షిణ భారతదేశం

15.5 ఆర్య సమాజం

15.6 దివ్యజ్ఞాన సమాజం

15.7 దేవ సమాజం

15.8 సింగ్ సభ

15.9 ఇస్లాం మత సంస్కరణోద్యమాలు

15.9.1 పంజాబ్ ముస్లింలు

15.9.2 బెంగాలీ ముస్లింలు

15.9.3 గంగానది మైదాన ప్రాంత ముస్లింలు

15.10 సంగ్రహంగా

15.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

15.12 ఉపయుక్త గ్రంథాలు


## 15.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల ఈ కింది విషయాలను తెలుసుకోగల్గాలి.

- మత సంస్కరణోద్యమాలకు సంబంధించిన ప్రాంతీయ విభేదాలు, వాటి నాయకత్వం వహించిన వారి సామాజిక నేపధ్యం, వారి ఉద్యమాలకు ప్రజల నుండి వచ్చిన స్పందన,
- బెంగాల్‌లో బ్రహ్మ సమాజం, బొంబాయిలో ప్రార్థనా సమాజం ఆకర్షించిన వర్గాల వివరణ

BRAOU

- లాహోర్ కేంద్రంగా ఆంగ్లం తెలియని దయానంద సరస్వతి ప్రారంభించిన ఆర్య సమాజోద్యమం, అతని తర్వాత విద్యాధికుల నాయకత్వంలో అది సాధించిన ప్రగతి,
- మద్రాస్ కేంద్రంగా దివ్యజ్ఞాన సమాజం, దాని వ్యాప్తి,
- ఉత్తర భారతదేశంలో ఆవిర్భవించిన ముస్లిం మత సంస్కరణలు, వాటిని సమర్థించిన వారి పాత్ర,
- పంజాబ్‌కు మాత్రమే పరిమితమైన సిక్కు మత సంస్కరణకు లభించిన ఆదరణ, వివరంగా తెలుస్తాయి.

## 15.1 పరిచయం

భారతదేశ పునరుజ్జీవన ఉద్యమానికి 19వ శతాబ్దంలో స్థాపించబడిన బ్రహ్మ సమాజం పునాదులు వేసింది. పరిశుద్ధాస్తికమతమైన బ్రహ్మ సమాజం హిందూ మత, సాంఘిక సంస్కరణలకు పూనుకొంది. మొదటి నుండి బ్రహ్మ సమాజానికి ఆంగ్ల భాషాధ్యయనం చేసిన భారతీయులు నాయకత్వం వహించారు. ఏకేశ్వరోపాసన, సత్యం, హేతు వాదం ఆధారంగా హిందూ మతాన్ని, సమాజాన్ని పునః నిర్మించాలని వారు ప్రయత్నించారు. సమస్యల పరిష్కారానికి వారు అనుసరించిన మార్గాలు అన్ని సమయాల్లోనూ దేశీయమైనవిగావు. అయినప్పటికీ అనేక రంగాల్లో భారతదేశ ప్రగతి సాధించడానికి ఉద్దేశించిన కార్యక్రమాలన్నీ బ్రహ్మ సమాజ ఆవిర్భావ వికాసాలకు ఉపయోగపడ్డాయి. బెంగాల్‌లోనేగాక బొంబాయి, మద్రాస్, పంజాబ్, ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రగతి కాముకులైన భారతీయులు బ్రహ్మ సమాజ సాంఘిక, మత లక్ష్యాలకు చక్కని రూపకల్పన చేయడానికి చిత్తశుద్ధితో పనిచేశారు. కలకత్తా కేంద్రంగా రాజా రామ్‌మోహన్ రాయ్, దేవేంద్రనాధ టాగూర్, కేశవ్‌చంద్ర సేన్, ఇతర ప్రముఖులు బ్రహ్మ సమాజ ఉద్యమానికి నాయకత్వం వహించారు. వారి కృషివల్ల బెంగాల్‌లో అతి శక్తివంతమైన ఉద్యమంగా బ్రహ్మ సమాజం రూపొందింది.

B R A O U

## 15.2 బెంగాల్ బ్రహ్మ సమాజం

'ఆత్మీయ సభ'ను 1815లో రామ్‌మోహన్ రాయ్ స్థాపించాడు. అతని గృహంలోనే ప్రతి వారాంత దినాల్లో సమావేశాలు జరిపి ప్రత్యేక సభగా అది గుర్తింపు పొందింది. 1819లో కొంత కాలంపాటు ఈ సభ మూతపడింది. తొమ్మిది సంవత్సరాల తర్వాత 1828 ఆగస్ట్ 20న రామ్‌మోహన్ రాయ్ తొలి బ్రహ్మ సమాజ సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. ప్రతి శనివారం సమాజ సభ్యులు సమావేశమయ్యేవారు. ఆసక్తి ఉన్న వారందరూ సభా కార్య క్రమాల్లో పాల్గొన్నారు. సభ సమావేశాలకు వచ్చిన వారిలో ఎక్కువ మంది బెంగాలీ బ్రాహ్మణులు. బ్రహ్మ సమాజానికి తొలి దినాల్లో సభ్యత్వం, నిర్దుష్టమైన మత విశ్వాసాలు, వ్యవస్థాపరమైన నిబంధనలు లేవు. సమాజ బోధనల్లో కొన్ని క్రైస్తవ మత సిద్ధాంతాలను పోలి ఉన్నాయి. రామ్‌మోహన్ రాయ్, అతని అనుచరులు ఒక కొత్త భవనాన్ని నిర్మించారు. 1830 నుండి సమాజం కొత్త భవనం నుండి పనిచేసింది. రామ్‌మోహన్ రాయ్ మరణానంతరం ఈ సమాజం కొంతకాలంపాటు చురుకుగా పనిచేయలేదు. సంపన్నుడైన ద్వారకనాథ్ టాగూర్ పోషణతో సమాజం నామమాత్రంగా కొనసాగింది.

రామ్‌మోహన్ రాయ్ స్థాపించిన సంస్థను దేవేంద్రనాథ్ పునరుద్ధరించాడు. వీరిరువురు బ్రాహ్మణులే. దేవేంద్రనాథ్ క్రియాశీల నాయకత్వంవల్ల బ్రహ్మ సమాజ ఉద్యమం కొత్తతరం బెంగాలీ యువకులను ఆకర్షించింది. వారి ప్రవేశంతో ఉద్యమం కలకత్తా నగర పరిధులు దాటి, తూర్పు బెంగాల్ నగరాలకు వ్యాపించింది.

1846లో ఢకాలో బ్రహ్మసమాజ శాఖ స్థాపించబడింది. తర్వాత రెండు దశాబ్దాల కాలంలో బ్రహ్మ సమాజం తూర్పు భారతదేశమంతా వ్యాపించింది. 1850-60 మధ్య కాలంలో బెంగాలీ యువకులు విశేషంగా బ్రహ్మ సమాజానికి ఆకర్షితులయ్యారు. వారు నిర్విరామంగా సమాజాభివృద్ధికి కృషి చేశారు. తమ తల్లిదండ్రుల సనాతన విలువల్ని వారు నిర్భయంగా ఎదిరించారు. తొలితరం బ్రహ్మ సమాజికులకు లేని సమరశీలత వీరిలో కనిపిస్తుంది. ఇటువంటి యువతరానికి చెందిన బ్రహ్మ సమాజ సభ్యుల్లో కేశబ్‌చంద్ర సేన్ ప్రముఖుడు. ఆదర్శ వైష్ణవ కుటుంబంలో జన్మించిన సేన్ (1834-'84) ఆంగ్ల విద్యాభ్యాసం చేశాడు. 1857 నాటికే బ్రహ్మ సమాజంలో ప్రవేశించి, 1859 నాటికి క్రియాశీల కార్యకర్తగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు.

1866లో కేశబ్ చంద్ర సేన్, టాగూర్ నుండి విడిపోయిన తర్వాత అఖిల భారత బ్రహ్మ సమాజానికి పోటీ లేని నాయకుడుగా ఆవిర్భవించి, బెంగాల్ హిందువులను ఆకర్షించాడు. వారు సమకాలీన హిందూ మతంపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. 1860-70 మధ్యకాలంలో వారంతా తమ స్వస్థలాలను వదలి సామాజిక బహిష్కరణను ఖాతరు చేయక, ప్రవాహంలాగా కలకత్తా నగరం చేరుకున్నారు. సేన్ ఆధ్వర్యంలో ముఖ్యంగా తూర్పు బెంగాల్ ప్రాంత గ్రామీణులు, నగరవాసులు బ్రహ్మ సమాజంలో చేరారు. ఈ పరిణామాలు బ్రహ్మ సమాజికులు, సనాతన హిందువుల మధ్య తరచుగా ఘర్షణలకు దారితీశాయి. 1868 నాటికే తూర్పు ప్రాంతంలో 65 బ్రహ్మ సమాజ శాఖలు పనిచేయటం ప్రారంభించాయి. దాదాపు ఈ శాఖలన్నిటికీ కేశబ్‌చంద్ర సేన్ ఉద్యమంతో సంబంధం ఉంది. అప్పటికి అఖిల భారత బ్రహ్మ సమాజానికి 24 మంది కార్యకర్తలు ఉన్నారు. వారు రెండు సంవత్సరాల తర్వాత ప్రచారకులుగాను, ఉపాధ్యాయులుగాను పనిచేయటం ప్రారంభించారు. ఆంగ్ల భాష వల్లగాని, నగర వెలుపల గాని ప్రభావితంగాని గ్రామీణులకు వీరియందు విశ్వాసం కలిగింది. బెంగాల్ గ్రామీణ వ్యవసాయదారుల జీవన పరిస్థితి మెరుగుపర్చాలనే ఉద్దేశంతో సేన్ "ఇండియా సంస్కరణ సంఘాన్ని"(Indian Reform Assosiation) నెలకొల్పాడు. బెంగాలీ భాషలో 'సులబ్ సమాచార్' పత్రికను ప్రచురించి, దాని ద్వారా తన సందేశాన్ని ప్రజలకు విన్పించాడు.

1872 నాటికి సేన్ ఉద్యమం భారత ఉపఖండంలో చాల భాగం వ్యాపించింది. బ్రహ్మ సమాజ శాఖలు బీహార్, సంయుక్త రాష్ట్రాల్లో వ్యాపించి పంజాబ్ వరకూ చేరాయి. ఈ సమాజం అస్సాం, ఒరిస్సా, మధ్యప్రదేశ్‌ల్లో కూడా చొచ్చుకుపోయింది. దక్షిణ, పశ్చిమ భారతదేశంలో పరిమిత ప్రభావాన్ని పొందింది. 1872 నాటికి ఉన్న 101 సమాజాల్లో బెంగాల్‌లోనే అధిక భాగం ఉన్నాయి. ఇతర ప్రాంతాల్లో స్థాపించబడిన సమాజాల్లో కొన్ని ఉద్యోగరీత్యా బెంగాల్ నుండి ఆ ప్రాంతాలకు వెళ్ళి నివసిస్తున్న బెంగాలీయుల కృషి ఫలితంగా ఆవిర్భవించాయి.

1884లో సేన్ మరణించిన కొద్దికాలానికే ఆ ఉద్యమం ముఠా తగాదాలవల్ల బలహీనపడింది. బ్రహ్మ సమాజ భవిష్యత్తు సాధారణ బ్రహ్మ సమాజంపై పడింది. బెంగాల్‌లోని చాల శాఖలు ఈ సమాజానికి సంక్రమించాయి. ఆంగ్ల విద్యాభ్యాసం చేసిన ప్రముఖ విద్యావేత్తలు, బ్రహ్మ సమాజానికి అండగా నిలిచి, దాని శాఖలను సమర్ధవంతంగా నిర్వహించడం మొదలుపెట్టారు.

1878లో బ్రహ్మ సమాజంలో వచ్చిన చీలిక అనంతరం దాని భవిష్యత్తు సాధారణ బ్రహ్మ సమాజంపై పూర్తిగా ఆధారపడింది. ఈ సమాజం రామ్‌మోహన్ రాయ్ ప్రచారం చేసిన సిద్ధాంతాను అనుసరించింది. బెంగాల్‌లోను, బెంగాల్ వెలుపల ఉన్న అనేక బ్రహ్మ సమాజ శాఖలు సాధారణ బ్రహ్మ సమాజంలో లీనమైనాయి. సాధారణ సమాజానికి ఆంధ్ర ప్రాంతంలో వీరేశలింగం ఉద్యమంతోను, బెంగుళూర్‌లో కొన్ని గ్రూపులతోను సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. సాధారణ బ్రహ్మ సమాజ నాయకుడైన ప్రతాప్ చంద్ర మజుందార్ సమాజ

సిద్ధాంతాల్ని, దాని ఆశయాల్ని ఇంగ్లండ్, అమెరికా దేశాల్లో ప్రచారం చేశాడు. 1874, 1884, 1893 సంవత్సరాల్లో పర్యటించి అక్కడ చికాగో నగరమందలి సర్వ మత సమ్మేళనానికి తీసుకొని వెళ్లాడు. ఇటువంటి మిషనరీ వ్యవస్థ గల సాధారణ సమాజం కొద్దిమంది మేధావులను ఆకట్టుకొని, అతి చిన్న ఉద్యమంగా మిగిలిపోయింది.

సాధారణ బ్రహ్మ సమాజాన్ని స్థాపించి దాన్ని అభివృద్ధి పరచిన ప్రముఖుల్లో ఆనందమోహన్ బసు ఒకరు. ఈ సమాజానికి మొదట ఆయనే నాయకత్వం వహించి సురక్షితమైన రాజ్యాంగ ప్రాతిపదిక కల్పించాడు. ఈ మేథావి అనేక గ్రంథాలు అధ్యయనం చేశాడు, ధర్మశాస్త్ర పండితుడు, ధార్మిక చింతన, చిత్తశుద్ధి ప్రబోధించిన వ్యక్తి. ఈయన వ్యక్తిత్వం, శీలసమగ్రత, ఆదర్శాలవల్ల అందరి మన్ననలకు పాత్రుడయ్యాడు. బెంగాల్ రాష్ట్రంలో ఇంగ్లీష్ చదువుకున్న మొదటి తరం విద్యార్థి, హిందూ కళాశాలలో డిరోజియోవల్ల ప్రభావితుడైన ప్రముఖ విద్యా వేత్త శిబచంద్ర దేబ్ సాధారణ బ్రహ్మ సమాజానికి మొదటి కార్యదర్శి, రెండో సంవత్సరం నుండి ఏడు సంవత్సరాలు దాని అధ్యక్షుడుగా కూడా పనిచేశాడు.

ప్రముఖ రచయిత, మేథావి అయిన ఉమేష్ చంద్ర దత్తా మొదటిసారిగా తన స్వగ్రామమైన మజిల్పూర్ (24 పరగణాలు)లో సాంఘిక సంస్కరణలను ప్రవేశపెట్టి, అనేక బాధలకు గురయ్యాడు. ఇతని పవిత్ర శీలసంపద అనేకులను ఉత్తేజపరచింది. ఆయన సంరక్షణలో సాధారణ బ్రహ్మ సమాజం వృద్ధిచెందింది.

సాధారణ బ్రహ్మ సమాజ ప్రముఖ నాయకుల్లో పండిత శివనాథ శాస్త్రి మరొకరు. ఇతడు గొప్ప విద్వాంసుడు, రచయిత, బ్రహ్మ సమాజ ఆశయాలకు ఆధికారిక వ్యాఖ్యాత. చాలాకాలం దాని అధ్యక్షుడుగా పని చేశాడు. నాటి దేశ రాజకీయ పరిస్థితులు ఆయనకు ఆందోళనను కలిగించాయి. ఆయన ఏర్పాటుచేసిన రాజకీయ పార్టీ దేశాన్ని పాలించడానికి స్వయం పాలన తప్ప మరియే ఇతర రకమైన ప్రభుత్వం నిరర్ధకమని ప్రకటించింది. బిపిన్ చంద్ర పాల్ ఆ పార్టీ క్రియాశీల సభ్యుడు. తన జీవితాన్ని పూర్తిగా భారత స్వాతంత్ర్య సముపార్జనకై అంకితం చేసిన త్యాగమూర్తి.

## 15.3 పశ్చిమ భారతదేశం

పశ్చిమ భారతదేశంలోని మత సంస్కరణ వాదులు హేతు వాదం, నూతన సంస్కరణ ప్రతిపాదనల ద్వారా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి ప్రయత్నం చేశారు. తాము బెంగాల్ బ్రహ్మ సమాజికులవలె, సమాజంలో వేరే వర్గమని భావించలేదు. భారత సాంప్రదాయాల్ని మార్చడానికి వారు పాశ్చాత్య భావాలను, సంస్థలను సూచించారు. ప్రచారం, సాంఘిక సంస్కరణ, విద్యావ్యాప్తి వారి సాధనాలు. వారి సంస్కరణ భావాలు వెంటనే ప్రజామోదం పొందాయి. బెంగాల్లో సంస్కరణ వాదులు మత సంస్కరణపై ఎక్కువ శ్రద్ధ చూపారు.

### 15.3.1 పరమహంస మండలి

బొంబాయి రాష్ట్రంలో ఆవిర్భవించి రికార్డుల్లోకి ఎక్కిన తొలి మత, సాంఘిక సంస్కరణ సంస్థ 'పరమహంస మండలి' (Paramahamsa Mandali). ఇది 1840లో స్థాపించబడింది. అప్పటినుండే దాని ప్రగతి దడోబా పాండురంగ్ (1814-82) నాయకత్వంలో ముడిపడింది. వైశ్యకులంలో జన్మించిన పాండురంగ్ బొంబాయి నగర స్వదేశీ పాఠశాలలో శిక్షణ పొందాడు. మండలి మౌలికమైన ఏడు సూత్రాల్ని ఆయన రూపొం దించాడు. అవి : 1. భగవంతుడు ఒక్కడే. అతడినే పూజించాలి 2. నిజమైన మతం ప్రేమ, నైతిక ప్రవర్తనలపై ఆధారపడి ఉంటుంది. 3. ఆధ్యాత్మిక మతం ఒక్కటే 4. ప్రతి వ్యక్తికీ స్వేచ్ఛగా ఆలోచించే వాక్కు ఉండాలి. 5. ప్రతిదినం చెప్పే మాటలు హేతుబద్ధంగా ఉండాలి. 6. మానవ జాతి అంతా ఒకే కులం. 7. సరైన విజ్ఞానాన్ని అందరికీ

అందివ్వాలి. మండలి సభ్యులు బహుదేవతారాధనను, కుల వ్యవస్థను, జ్ఞానం విషయంలో బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని వ్యతిరేకించారు. మండలి రహస్యంగా సమావేశమయ్యేది. దాని సభ్యులు నిమ్నకులస్తుడు తయారుచేసిన భోజనం తినేవారు. బొంబాయి నగరవాసులూ, ఉన్నత ఆంగ్ల విద్యాభ్యాసానికై ఆ నగరం చేరినవారూ అందులో సభ్యులుగా చేరారు. వారంతా బ్రాహ్మణ యువకులు. మండలి శాఖలు పూనా, అహ్మద్ నగర్, రత్నగిరిలలో నెలకొల్పబడ్డాయి. కొంతమంది సనాతన వాదుల ప్రోద్బలంతో 1860 తర్వాత మండలి రికార్డులు దొంగిలించబడ్డాయి. ఈ సంఘటన తర్వాత మండలి క్షీణించింది.

### 15.3.2 మానవధర్మ సభ

1844 జూన్‌లో సూరత్ నివాసి మెహతాజీ దుర్గారామ్ మంచారామ్ (1809-76), దడోబా పాండురంగ్, మరికొంతమంది మిత్రులు కలిసి 'మానవ ధర్మ సభ'ను ప్రారంభించారు. దుర్గారామ్ ఆంగ్లం తెలియని గుజరాతీ బ్రాహ్మణుడు. సూరత్ ఇంగ్లీష్ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు. దెయ్యాలు, భూతాల ఉనికిని, బాల్య వివాహ దురాచారాన్ని, హిందూ అగ్రవర్ణాల్లో వితంతువు పునర్వివాహంపై ఉన్న నిషేధాన్ని, విగ్రహారాధనను వ్యతిరేకించాడు. సభ ప్రతి ఆదివారం సమావేశాలు జరిపేది. దాని సభ్యత్వానికి అందరూ అర్హులే. మొదట అతి చురుకుగా పనిచేసే ఒక చిన్న ఉద్యమ సంస్థగా మాత్రమే అది గుర్తింపు పొందింది. 1846లో దడోబా పాండురంగ్ బొంబాయికి తిరిగి రావడంతో ఈ సంస్థ కార్యకలాపాలు నిలిచిపోయాయి. దుర్గారామ్ 1852లో రాజ్‌కోట్ వెళ్లిపోవడంతో, అది పూర్తిగా మూతబడింది. సూరత్‌లో చదువుకున్న వారిని మాత్రమే అది ఆకర్షించింది. క్రైస్తవ మిషనరీల మత మార్పిడి చర్యలను వ్యతిరేకిస్తూ పనిచేసింది.

### 15.3.3 ప్రార్థనా సమాజం

పరమహంస మండలి, మానవ ధర్మ సభల ఆశయాలు మరల ఒక కొత్త సాంఘిక, మత ఉద్యమమైన 'ప్రార్థనా సమాజ్' రూపంలో సాక్షాత్కరిస్తాయి.

బెంగాల్ బ్రహ్మ సమాజికులనేకులు ప్రచారకులుగా పనిచేశారు. పశ్చిమ భారతదేశంలోని ప్రార్థనా సమాజానికి మాత్రం ఒకరిద్దరు మించి ప్రచారకులు లేరు. ఈ కారణంగా ప్రార్థనా సమాజ ఉద్యమం ఎక్కువగా వ్యాప్తి చెందలేదు. అయితే, దానికి అనుబంధ సమాజాలు సూరత్, అహ్మదాబాద్, పూనా, కిర్కీ, కొల్హాపూర్, సతారాల్లో గలవు. ప్రార్థనా సమాజంతో మొదట సంబంధంగల అనేక సమాజాలు తర్వాత బ్రహ్మ సమాజాలుగా పిలువబడ్డాయి. సరళమైన నియమ నిబంధనలున్న ప్రార్థనా సమాజాన్ని తెలుగు ప్రాంతంలోను, దక్షిణాదిన చాల మంది శ్లాఘించారు. మద్రాస్ రాష్ట్రంలోని 29 సమాజాల్లో 18 సమాజాలు ప్రార్థనా సమాజాలని పేరు పెట్టుకున్నాయి. బెంగాల్‌లోలాగే మద్రాస్ రాష్ట్రంలో పేరు ప్రఖ్యాతులు, ప్రత్యేక సాంఘిక హోదాగల కుటుంబాలు అధిక సంఖ్యలో బ్రహ్మ సమాజ ఉద్యమంతో సంబంధాలు పెట్టుకోలేదు.

పశ్చిమ భారతదేశంలోని ఆస్తిక మతమైన ప్రార్థనా సమాజానికి ఒక ప్రత్యేకత ఉంది. దానికి తూర్పు ప్రాంతాల్లోని సమాజాలతో సుహృద్భావ సంబంధాలు ఉన్నప్పటికీ, స్థానికంగా ఆవిర్భవించి, అభివృద్ధిచెంది స్వతంత్ర విధానాలు అవలంబించింది. 1880 వరకూ బెంగాలీ సమాజాల్లాగా ప్రార్థనా సమాజం బ్రహ్మ సమాజానికి సంబంధించిన అంశాలను విడిచిపెట్టలేదు. హిందూ మతంలోని మత సాంప్రదాయాన్ని పాటించింది. సాంఘిక ఆచారాలను పాటించడంలోనూ, ఇంచుమించు పాత ఆదర్శాలనే అనుసరించింది. బెంగాల్ సమాజాలకంటే జాగరూకతతో ఉద్రేకం, తీవ్ర వాదంలేని ధోరణిని అవలంబించింది.

ప్రార్థనా సమాజం మహారాష్ట్రుల మత, సాంఘిక జీవన విధానాన్ని మార్చివేయడానికి కృషి చేసింది. పాండురంగ సోదరులు తప్పించి ఈ ఉద్యమంలోని సభ్యులందరూ ఇంగ్లీష్ అభ్యసించిన చిత్‌పవన్, సారస్వత్ బ్రాహ్మణులు. ఈ సమాజానికి గుజరాతీ వ్యాపారులు, పార్సీ కులస్తులు ఆర్థిక సహాయాన్ని అందించారు. కాని సభ్యత్వం తీసుకున్నవారు మాత్రం పూర్తిగా మహారాష్ట్రులే. పేరు ప్రఖ్యాతులున్న బ్రహ్మ సమాజ ప్రచారకుల్ని పంపి, బెంగాలీయులు ప్రార్థనా సమాజానికి సహాయపడ్డారు.

అన్ని వర్గాల ప్రజలకు విద్యను అందించటంలో ప్రార్థనా సమాజం విశేషమైన కృషి సల్పింది. హిందూ సమాజంతో తెగతెంపులు చేసుకోకుండా ఆ సమాజ సభ్యులు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టారు. కొంతమంది సమాజ సభ్యులు వితంతు వివాహాలను బహిరంగంగా సమర్థించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రార్థనా సమాజానికి మార్గదర్శకత్వం వహించిన ప్రముఖులిద్దరిలో రామకృష్ణ గోపాల్ బండార్‌కర్ (1837-1927) ఒకరు. ఈయన గొప్ప సంస్కృత విద్వాంసుడు. తుకారామ్ ఉపదేశించిన భక్తిమార్గాన్ని అనుసరించాడు. ఈయన మేధాశక్తికి ఈయన స్థాపించిన 'బండార్‌కర్ సంస్కృత పరిశోధనా విద్యాలయం' (Bhondarker Institute for oriental Research) నిదర్శనం.

బండార్‌కర్‌తో కలిసి ప్రార్థనా సమాజాభివృద్ధికి మహాదేవ్ గోవింద రనడే (1842-1901) పాటుబడ్డాడు. కొల్హాపూర్ రాష్ట్రంలో తండ్రి ప్రభుత్వోద్యోగి అయినందున ఇతని విద్యాభ్యాసం కొల్హాపూర్‌లోనే జరిగింది. 1856లో బొంబాయి ఎలిఫిన్‌స్టన్ కళాశాలలో చేరి విద్యాభ్యాసం చేశాడు. ఎమ్.ఎ. ఎల్.ఎల్.బి. పట్టాను తీసుకొని న్యాయవాదిగా ప్రజాసేవ చేశాడు. 1871లో పూనా సబ్ జడ్జీగా నియుక్తుడైనాడు. 1881లో బొంబాయి ప్రెసిడెన్సీ మేజిస్ట్రేట్ పదవిని అలంకరించాడు. న్యాయమూర్తి కాశీనాథ్ త్రింబక్ తెలాంగ్ (1851-1893) మరణానంతరం బొంబాయి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితుడై, ఎనిమిది సంవత్సరాలు పనిచేశాడు. పశ్చిమ భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవన పితగా ఆయన పేరు పొందాడు. 1869లో వితంతు వివాహంలో పాల్గొని, శంకరాచార్యుల వారిచే బహిష్కరణకు గురైనాడు. పూనాలో ఉండగా 1870లో గణేష్ వాసుదేవ జోషి స్థాపించిన 'సార్వజనిక్ సభ' కు ఆయన వెన్నెముక. భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాల సమయంలోనే సాంఘిక సమావేశాలకు హాజరై సాంఘిక సమస్యలపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.

## 15.4 దక్షిణ భారతదేశం

దక్షిణ భారతదేశంలో బ్రహ్మ సమాజ ఉద్యమం మెల్లగా అభివృద్ధి గాంచింది. బ్రహ్మ సమాజ మత సంస్కరణ కేశవచంద్ర సేన్ నాయకత్వంలో సంఘసంస్కరణోద్యమంగా మారి, మద్రాస్‌కు 1864లో వ్యాపించింది. తన ప్రచార యాత్ర కార్యక్రమంలో భాగంగా సేన్ మద్రాస్ సందర్శించి అక్కడ ఉపన్యసించాడు. అతని ఉపన్యాసాలు మేధావులను ఆకర్షించింది. న్యాయవాదులైన యం. రాజగోపాలాచార్యులు, సేలం సుబ్బరాయ శెట్టిల కృషి ఫలితంగా మద్రాస్ నగరంలో వేద సమాజ్ ఏర్పడింది. వేద సమాజ్ ప్రచురించిన 'తత్వబోధిని' పత్రిక, కలకత్తా నుండి ప్రచురింపబడ్డ కొన్ని కరపత్రాలు కడలూరు నివాసి చెంబేటి శ్రీధరులు నాయుడిని ఉత్తేజ పరచాయి. 1867లో మద్రాస్‌కు మకాం మార్చాడు. వేద సమాజ్ కార్యదర్శిగా కృషి చేశాడు. సంకీర్తన ఊరేగింపుల్లో పాల్గొన్నాడు. 'బ్రహ్మ ధర్మాన్ని' తెలుగులోకి అనువదించాడు. వేద సమాజ్‌లో కొన్ని మార్పులను ప్రవేశపెట్టి దక్షిణ భారతదేశ బ్రహ్మ 'సమాజం' అనే పేరు దానికి పెట్టాడు. శ్రీధరులు నాయుడు, దొరస్వామి అయ్యంగార్‌లు బెంగుళూర్, తంజావూర్, తిరుచునాపల్లి, మంగుళూర్‌లను సందర్శించి ప్రచారం చేశాడు. వారి కృషి ఫలితంగా కొన్నిచోట్ల సమాజాలు ఆవిర్భవించాయి. బ్రహ్మ సమాజ నాయకులు మన్నవ బుచ్చయ్య పంతులు, రఘుపతి

వెంకటరత్నం నాయుడు 1885లో సమాజ శాశ్వత ప్రధాన కార్యాలయాన్ని మద్రాస్ నగరంలో స్థాపించారు. అయితే, బెంగాల్‌వలె మద్రాస్ రాష్ట్రంలో పలుకుబడిగల కుటుంబాలు సమాజ్ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేయలేదు. ఫలితంగా బ్రహ్మ సమాజ ఉద్యమం వేగంగా వ్యాపించలేదు.

మద్రాస్ రాష్ట్రంలో బ్రహ్మ సమాజం కంటే ప్రార్థనా సమాజ ప్రభావమే ఎక్కువ. దక్షిణ భారతదేశంలోగల ఆస్తిక సంఘాల్లో మూడింట రెండువంతులు ప్రార్థనా సమాజాలుగా పిలువబడేవి. విద్యార్థులు అధిక సంఖ్యలో సమాజ్‌లో చేరారు. కాని బొంబాయిలో ఉన్నట్లు ఆ మద్రాస్‌లో సంస్కరణలను గట్టిగా సమర్థించిన సంస్కరణాభిలాషుల సంఖ్య తక్కువ. ఉద్యమం సమాజ సభ్యుల అభిప్రాయాలను మార్చగలిగిందే తప్ప, వారు పూర్తిగా సనాతన భావాలను విడిచి తమ అభిప్రాయాలను విప్లవాత్మకంగా మార్చుకునేట్లు చేయలేకపోయింది.

## 15.5 ఆర్య సమాజం

ఆర్య సమాజాన్ని స్థాపించిన దయానంద సరస్వతి పంజాబ్‌ను, దాని పరిసర ప్రాంతాల్ని పూర్తిగా మార్చివేశాడు. గుజరాత్ రాష్ట్రంలోని మోర్వీ స్వదేశీ సంస్థానమందలి ఆదిత్య కులానికి చెందిన సామవేద బ్రాహ్మణ వంశంలో దయానందుడు జన్మించాడు. సిరిసంపదలు, సంఘంలో గౌరవమర్యాదలు గల వంశం ఆయనది. స్థానిక గురువుల సన్నిధిలో మత గ్రంథాల్ని, సంస్కృత భాషను అధ్యయనం చేశాడు. స్వామి విరజానంద బోధనల వల్ల ప్రభావితుడై పతనావస్థలో ఉన్న సమకాలీన హిందూ సమాజాన్ని ఉద్ధరించడానికి తన జీవితాన్ని అంకితం చేశాడు.

1872లో దయానందుడు కలకత్తా సందర్శించి అక్కడ దేవేంద్రనాథ టాగూర్, ఇతర బ్రహ్మ సమాజ సభ్యులతో చర్చలు జరిపాడు. బెంగాల్ విడిచిపెట్టిన తర్వాత ప్రధానంగా విద్యావంతులైన మధ్యతరగతి హిందువులకు తన సిద్ధాంతాలను హిందీలో బోధించాడు. ఆయన సందేశ సారాన్ని ఆమోదించి, వారు ఆర్య సమాజంపట్ల అభిమానం పెంచుకున్నారు. 1874లో దయానందుడు గుజరాత్, బొంబాయి ప్రాంతాల్లో పర్యటించి మరుసటి సంవత్సరం బొంబాయిలో ఆర్య సమాజాన్ని స్థాపించాడు. అయితే, మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలు తన సందేశానికి అనుకూలంగా స్పందించలేదు. బొంబాయి ఆర్య సమాజం కొంతమంది స్థానికులను మాత్రమే ఆకర్షించ గలిగింది. దాని ప్రభావం బొంబాయి పరిధులు దాటలేదు. మద్రాస్ రాష్ట్రంలో హిందూ మతానికి ఇస్లాం వల్ల ఎటువంటి ప్రమాదం లేనందువల్ల దయానందుడు ఆ రాష్ట్రంలో పర్యటించ లేదు. బెంగాల్‌లో బ్రహ్మ సమాజానికి ఆదరణ లభించింది. అందువల్ల అక్కడ కూడా ఆర్య సమాజం విజయవంతం కాలేదు. పాట్నా, రాంచీ, కలకత్తాల్లో ఆర్య సమాజ శాఖలు ప్రారంభించబడ్డాయి. అయినప్పటికీ, గంగానది దిగువ ప్రాంతాల్లో ఆర్య సమాజానికి ప్రజాదరణ లభించలేదు.

1877 జనవరిలో సానుభూతిపరులైన హిందూ నాయకులు, ముఖ్యంగా బ్రహ్మ సమాజ సభ్యులు. లాహోర్ నగరానికి దయానందుని ఆహ్వానించారు. అనతి కాలంలోనే లాహోర్‌లో అంకిత భావంగల శిష్యులను ఆయన ఆకర్షించాడు. వారిలో అధిక శాతం లాహోర్ కళాశాలకు చెందిన విద్యార్థులు, పట్టభద్రులూను. అక్కడ సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలను వారితో దయానందుడు చర్చించాడు. అనేక బహిరంగ సభల్లో ఉపన్యసించాడు. 1877 జూన్‌లో లాహోర్‌లో ఆర్య సమాజ తొలి సమావేశం జరిగింది. ఆ వెనువెంటనే పంజాబ్‌లోని అమృతసర్, గురుదాస్‌పూర్, రావల్పిండి, ముల్తాన్ మొదలైన అనేక పట్టణాల్లో, ఆర్య సమాజాలు ఏర్పాటైనాయి. ఈ సమాజాల్లో పలుకుబడిగల జాట్‌లు అధికసంఖ్యలో సభ్యత్వం తీసుకున్నారు. దయానందుడు మరణించే

BRAOU

నాటికి పంజాబ్, పశ్చిమోత్తర రాష్ట్రం (North Western Province) రాజస్థాన్, మహారాష్ట్రలలో 132 ఆర్య సమాజాలు వెలశాయి. వాటి సంఖ్య 1885 నాటికి 200లకు, 1886కి 265కి పెరిగింది.

1886లో పంజాబ్ ఆర్య ప్రతినిధి సభ ఏర్పడింది. దయానందుని మరణానంతరం చెల్లాచెదురైన వారందరికీ అది కేంద్రబిందువుగా పనిచేసింది. ఆర్య సమాజం విస్తరించడంతో పశ్చిమోత్తర రాష్ట్రం (1886), రాజస్థాన్ (1888), బెంగాల్, బీహార్ (1889), మధ్యప్రదేశ్, విదర్భ (1889), బొంబాయి (1902) లో ఆర్య సమాజ రాష్ట్రస్థాయి సభలు ఏర్పాటైనాయి.

దయానందుని తర్వాత లాహోర్ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన లాలా హన్సరాజ్, పండిట్ గురుదత్తా, లాలా లజపతిరాయ్, లాలా మున్షీరామ్‌లు ఆర్య సమాజాన్ని పటిష్టంచేసే బాధ్యతను స్వీకరించారు. వారు దయానందుని స్మృతి చిహ్నంగా 'దయానంద ఆంగ్లో-వేదిక్ కళాశాల (Dayananda Anglo-Vedic College) ను స్థాపించారు. విశ్వవిద్యాలయ ఉద్యోగ జీవితాన్ని త్యజించి, ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా లాలా హన్స్‌రాజ్ అపారమైన సేవ చేశాడు. అతని నేతృత్వంలో ఆ కళాశాల ఒక ఉన్నత విద్యా సంస్థగా అభివృద్ధిచెంది పంజాబ్ ప్రజల్లో స్వేచ్ఛ, స్వాతంత్ర్య భావాలనూ, జాతీయ భావాలనూ పెంపొందించింది. కళాశాలలో విద్యా బోధన ఆంగ్లంలోనే జరిగేది. మున్షీరామ్ జలంధర్, అంతర్వేది, హరద్వార్, ఢిల్లీలో ఆర్య సమాజ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. జీలం జిల్లాలో సారస్వత్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన లేఖరామ్ 1880లో పెషావర్ ఆర్య సమాజంలో చేరి, దాని అభివృద్ధికి కృషిచేశాడు. 1879-90 మధ్య ఫిరోజ్‌పూర్ నుండి వెలువడే ఉర్దూ మాసపత్రిక "ఆర్యగజిట్"కు ఎడిటర్‌గా పనిచేశాడు.

పంజాబ్ ఆర్య సమాజంలో పంజాబీ హిందువులు అధికసంఖ్యలో చేరారు. 1911 ప్రభుత్వ లెక్కల ప్రకారం పంజాబ్ ఆర్య సమాజంలో చేరిన వారి కులాల వివరాలు ఇలా వున్నాయి :

| | |
|---|---|
| మేఘ్‌లు (Meghs) | 22,115 |
| ఖాత్రీలు (Khatris) | 17,237 |
| అరోరాలు (Aroras) | 10,547 |
| జాట్‌లు | 9,203 |
| బ్రాహ్మణులు | 7,240 |
| ఓడ్‌లు (odes) | 5,102 |
| రాజపుత్రులు | 2,403 |
| అగర్వాలాలు (Agarwal) | 1,983 |
| సునార్‌లు (Suner) | 1,009 |

ఈ కులాలవారి నిర్వహణలో అనేక పరిశ్రమలు ఉండేవి.

వైశ్యులు, బ్రాహ్మణులు ఆర్య సమాజంపై తొలి రోజుల్లో పెత్తనం చలాయించారు. కొంతకాలానికి బడుగు వర్గాలవారు సమాజ్‌లో అధిక సంఖ్యలో చేరడంవల్ల మొత్తం సభ్యుల్లో 34 శాతం ఆ కులాలవారే ఉన్నారు. వ్యాపారం, బ్యాంకింగ్, పరిశ్రమల నిర్వహణ రంగాల్లో కీలక పాత్ర వహించిన ఖాత్రీల స్థానాన్ని మేఘ్‌లు ఆక్రమించారు. శూద్రులు, బడుగువర్గాల వారు చేరడంతో సమాజ్ అభివృద్ధి చెందింది.



B R A O U

ఆర్య సమాజం ఇస్లాం మతం స్వీకరించినా, ముఖ్యంగా దళితులను, తిరిగి హిందువులుగా మార్చే శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం వల్ల కూడా ఆర్య సమాజం ప్రజాదరణ పొందింది. 1921 ప్రభుత్వ జనాభా లెక్కల ప్రకారం 4,68,000 మంది ఆర్య సమాజ సభ్యులుగా నమోదయ్యారు. వారిలో 4,51,000 మంది ఉత్తర భారతదేశంలో పంజాబ్, కాశ్మీర్, అవద్, ఆగ్రాలకు చెందినవారే. ఇతరచోట్ల వారి శాతం అతి స్వల్పం.

20వ శతాబ్దంలో ఆర్య సమాజం అసాధారణమైన అభివృద్ధిని సాధించింది. ఆర్య సమాజ శాఖలు మారిషస్ దీవుల్లో స్థాపించబడ్డాయి. భారతీయ సంతతికి చెంది స్థిరపడ్డ వారి ప్రదేశాల్లో ఈ శాఖలు వెలిశాయి. 1937 నాటికి విదేశాల్లో ఆర్య సమాజికులు తమ ప్రాతినిధ్య సమావేశాలను నిర్వహించారు. 1922లో బ్రిటిష్ తూర్పు ఆఫ్రికాలోను, 1927లో దక్షిణాఫ్రికాలోను, 1928లో ఫీజీలోను, 1030లో మారిషస్‌లోను, 1937లో డచ్ గయానాలోను ఈ సమావేశాలు జరిగాయి. భారతదేశంలో ప్రాతినిధ్య సభలు హైదరాబాద్ సంస్థానం, బీహారుల్లో జరిగాయి. ఆర్య సమాజం క్రమక్రమంగా అభివృద్ధి చెందింది. 1931 నాటికే 9,90,233 మందిని ఆకర్షించింది. దేశంలో 1941 నాటికి ఆర్య సమాజాల సంఖ్య 2000లకు చేరింది. విద్యా సంబంధమైన కార్యక్రమాలు మహారాష్ట్రలోని షోలాపూర్‌కు, దక్కన్‌లోని హైదరాబాద్‌కు వ్యాపించాయి. అప్పటికే 179 పాఠశాలలు, 10 కళాశాలలు, భారతదేశంలోను, బర్మాలోను వెలశాయి. ఆర్య సమాజం అసంఖ్యాకంగా విద్యా సంస్థలను, అనాధ శరణాలయాలను, విద్యార్థుల వసతి గృహాలను, వితంతు శరణాలయాలను, పఠన మందిరాలను, గ్రంథాలయాలను స్థాపించింది.

## 15.6 దివ్యజ్ఞాన సమాజం

దివ్యజ్ఞాన సమాజికులు భారత ఉప ఖండం అంతటా వ్యాపించారు. ఒక ప్రాంతం తర్వాత ఇంకొక ప్రాంతానికి క్రమంగా వారి ఉద్యమ సందేశం చేరింది. బొంబాయి ప్రధాన కేంద్రంగా ఉన్నపుడు దివ్యజ్ఞాన సమాజ సభ్యులు గుజరాతీ హిందువులను తమ వలయంలోకి ఆకర్షించారు. అట్టివారిలో మణిలాల్ నభూభాయ్ ద్వివేది (Manilal Nabhubhai Dwivedi, 1858-1898) ప్రముఖుడు. అద్వైత వాద తత్వశాస్త్రాన్ని ఆయన క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. కథియవార్‌లోని బిల్కాకు చెందిన నృసింహాచార్యజీ (1848-1898) బరోడాలో 'శ్రీ శ్రేయ సదక్ అధికార వర్గ' (Sri Shreya Sadhak Adhikari Varg) అనే సంస్థను స్థాపించిన శ్రీమాన్ నట్టూరాం శర్మ (1858-1930) కూడా దివ్యజ్ఞాన సమాజ సభ్యులుగా చేరినవారిలో ఉన్నారు. 1893లో అనీబిసెంట్ సూరత్, బరోడాలు సందర్శించి వాటి పాలకుడైన సర్ శయాజీ రావును కలిసి స్త్రీల హక్కులు, విద్య, ప్రజల సంక్షేమం మొదలైన విషయాలపై చర్చలు జరిపింది.

బొంబాయి దివ్యజ్ఞాన సమాజం హిందువులను, పార్సీలను సభ్యులుగా చేర్చుకొంది. పార్సీలు లెక్కలేనన్ని చిన్న గ్రంథాలను ప్రచురించి, వాటిలో జొరాస్టర్‌ను దివ్యజ్ఞానానికి చెందిన మహాత్ములు (masters) కంటే గొప్పవాడని వాదించారు. తాము ఆచరించే ఆచారాలు, సాంప్రదాయాలు, కర్మకాండలు కల్నల్ ఓల్కాట్ సూచించిన సూత్రాలను అనుసరించి శాస్త్రీయమైనవని పార్సీలు వివరించారు. అందువల్ల పార్సీలపై దివ్యజ్ఞాన బోధనల ప్రభావాన్ని తగ్గించడానికి 1911లో 'ఇరానియన్ ఎసోసియేషన్' (Iranian Association) ఏర్పడింది. విద్యాధికులైన హిందువులు కూడా దివ్యజ్ఞాన సమాజంలో చేరారు. అట్టివారిలో గోపాలకృష్ణ గోఖలే ఒకరు. 1890 నుండి 1905 వరకు సభ్యుడుగా కొనసాగాడు.

మద్రాస్‌లో దివ్యజ్ఞాన సమాజ ప్రభావం ప్రధానంగా విద్యాధికులైన హిందువులపై పడింది. వారిలో ఎక్కువ మంది బ్రాహ్మణులు. వారు తమ సొంత సంస్థల ద్వారానూ, ఇతర సంఘాలతో అనుబంధం ఏర్పరచుకొని పనిచేశారు. ఓల్కాట్ అభిప్రాయాలతో ఏకీభవించి హిందూ మతానికి చెందిన విజ్ఞానాన్ని పునరుద్ధరించడానికి

రఘునాథరావు 1886లో 'అసోసియేషన్ ఫర్ ది ప్రాపగేషన్ ఆఫ్ ట్రూ రెలిజియన్' ('Association for the propagation of true religion') అనే సంస్థను ఏర్పాటు చేశాడు. ప్రాచీన శాస్త్రాల్లో చెప్పబడ్డ సిద్ధాంతాల ప్రకారం హిందూ సమాజాన్ని తిరిగి స్థాపించాలని ఆయన ఆశించాడు. గుజరాతీ బ్రాహ్మణుడైన శివశంకర పాండయ్య (Sivasankara Pandiah) దివ్యజ్ఞాన సమాజంలోచేరి 1887లో హిందూ ధర్మశాస్త్ర సంఘాన్ని (Hindu Tract Society) స్థాపించి, హిందూ మతాన్ని ఇతర మతస్థుల నుండి కాపాడాలని నిశ్చయించాడు. 1887-'89 మధ్య ఆ సంఘం శాఖలను చిన్న పట్టణాల్లో స్థాపించి ధర్మశాస్త్ర గ్రంథాలను ప్రచురించాడు. హిందూ ధర్మబోధకులను దక్షిణదేశమంతా పర్యటించమని పంపించాడు. విద్యావంతులైన బ్రాహ్మణుల సహకారంతోను, సంపన్నుడైన వజ్రాల వ్యాపారి రామకృష్ణపంతుల ఆర్థిక సహాయంతోను 'దివ్యజ్ఞాన కళాశాలనిధి'ని పాండయ్య ఏర్పాటు చేశాడు. వారు 1889లో హిందూ దివ్యజ్ఞాన ఉన్నత పాఠశాలను స్థాపించారు.

దివ్యజ్ఞాన విశ్రాంతి గృహాలు (Theosophical Lodges) మచిలీపట్నం, గుంటూర్, నెల్లూర్, మదనపల్లిలో ప్రముఖులను ఆకర్షించాయి. ప్రభుత్వ ఉద్యోగులు, మధ్యతరగతి విద్యావంతులు, ధనికులు మొదలైన వర్గాల వారిని అవి ప్రధానంగా ఆకర్షించాయి. మదనపల్లిలో బిసెంట్ దివ్యజ్ఞాన కళాశాలతోపాటు రాత్రి పాఠశాలలు కూడా నెలకొల్పబడ్డాయి. ఈ ప్రాంతం దివ్యజ్ఞాన సభ్యులకు తమ పథకాలను అమలుచేయటానికి ప్రధాన కేంద్రంగా మారింది. కేవలం భారతదేశంలోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాలకే గాక దివ్యజ్ఞాన సమాజ ప్రభావం దూర ప్రాంతమైన ఉత్తర పంజాబ్ వరకూ వ్యాపించింది. 1880-90 మధ్యకాలంలో దివ్యజ్ఞాన సమాజికులు పంజాబ్‌లో ఉపన్యాసాల ద్వారా తమ సమాజ సిద్ధాంతాలను ప్రచారం చేశారు. 1895లో అనీబిసెంట్ లాహోర్‌లో 'ఇండియా పునరుద్ధ్భవం' (The Means of Indias Regeneration) పై ఇచ్చిన ఉపన్యాసం విద్యావంతులైన పంజాబీ యువకులను అమితంగా ఆకర్షించింది. దివ్యజ్ఞాన సమాజాలు ఉత్తర భారతంలో అలహాబాద్, మీరట్, బెనారస్, కాన్పూర్‌ల్లో కూడా స్థాపించబడ్డాయి.

విదేశీ భావజాలం గల దివ్యజ్ఞాన సమాజ ఉద్యమాన్ని భారతదేశంలోని పలుప్రాంతాల విద్యావంతులు సమర్థించారు. క్రైస్తవ మతాన్ని, పాశ్చాత్య నాగరికతను విమర్శించి, దేశీయమైన హిందూ మతాన్ని, దాని ప్రాచీన సంస్కృతిని కొనియాడిన దివ్యజ్ఞాన సమాజ ఉద్యమానికి హిందువులే అధికంగా స్పందించారు. ఈ పరిణామం హిందూ సనాతనులు సనాతన ధర్మాన్ని పునరుద్ధరించడానికి చేసిన ప్రయత్నాలకు బలాన్ని ఇచ్చింది.

## 15.7 దేవ సమాజం

కాన్పూర్ జిల్లాలో ధనిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన పండిట్ శివశంకర్ అగ్నిహోత్రి (1850-1893) రూర్కీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యాభ్యాసం చేశాడు. 1887లో దేవ సమాజంను స్థాపించాడు. బ్రహ్మ సమాజ హేతు వాదాన్ని వ్యతిరేకించాడు. గురువు ఒక్కడే మోక్షమార్గాన్ని ప్రసాదించగలడని ప్రబోధించాడు. దేవ సమాజం ప్రచారం చేసిన నైతిక విలువలు అనుసరించిన సామాజిక తీవ్ర వాద ధోరణి పంజాబీ హిందువులను, పట్టభద్రులను మేజిస్ట్రేటులను, డాక్టర్లను, న్యాయవాదులను, వడ్డీ వ్యాపారులను, భూస్వాములను, ప్రభుత్వ ఉద్యోగులను ఆకర్షించింది. వారు స్వచ్ఛందంగా దేవ సమాజంలో చేరి, ఉద్యమానికి అండగా నిలిచారు. ఆ సమాజ సభ్యులందరూ అక్షరాస్యులే. పురుషులేగాక స్త్రీల శాతంకూడా గణనీయంగా ఉంది. ఆ సమాజం ఎల్లప్పుడూ ఉన్నత వర్గాల ప్రయోజనాలు కాపాడే సంస్థగా పనిచేసింది. పంజాబ్‌కు చెందిన విద్యావంతులైన అగ్రవర్గాలవారు దానిలో సభ్యులుగా చేరారు.

## 15.8 సింగ్ సభ

పంజాబ్‌లో బ్రిటిష్‌వారి పాలన 1849 నుండి ప్రారంభమైంది. అప్పటినుండి లాహోర్, అమృత్‌సర్‌లు క్రైస్తవ మిషనరీల ప్రచారానికి ప్రధాన కేంద్రాలయ్యాయి. మిషనరీ పాఠశాలలో చదువుతున్న సిక్కు విద్యార్థులు తమ మతాన్ని విడిచి క్రైస్తవ మతాన్ని 1873 ఆరంభంలో స్వీకరించారు. క్రైస్తవ మతాన్ని సిక్కులు స్వీకరించడాన్ని నిరోధించడానికి సిక్కు నాయకులు సింగ్ సభను అమృత్‌సర్‌లో ఏర్పాటు చేశారు.

సింగ్ సభ వేగంగా సిక్కుల ఆదరణ పొందింది. అక్షరాస్యులైన సిక్కు వర్గాల అండదండలు దానికి లభించాయి. సిక్కు విద్వాంసులు (Scholers) అనేకులు స్వచ్ఛందంగా సింగ్ సభలో చేరారు. సిక్కు మతం గుర్తించని (un-sikh) ఆచారాలను, సాంఘిక దురాచారాలను సభ ఖండించింది. ప్రగతి, పునరుద్ధరణ దాని లక్ష్యాలు దాని సంస్కరణ భావ జాలం సిక్కురైతులకు సైన్యంతో సంబంధంగల వారి ద్వారా వ్యాపించింది. పంజాబ్ అంతా సింగ్ సభ ఉద్యమం విస్తరించడంతో భూస్వాములు, కులీనులు, వ్యాపారులు, దేవాలయ ఉద్యోగులైన పూజారులు, మహంత్‌లు, గ్రంథులు దానిలో చేరారు. దాని నాయకులందరూ సిక్కు మతస్థులు.

## 15.9 ఇస్లాం మత సంస్కరణోద్యమాలు

భారతదేశంలో హిందువులకంటె ఆలస్యంగా ముస్లిం నాయకులు తమ మత సంస్కరణల ప్రయత్నాలను ప్రారంభించారు. ఆ రంగంలో కృషి ప్రధానంగా ఉత్తర భారతదేశంలో జరిగింది. ఉలేమాలు నాయకత్వం వహించిన ఉద్యమాలు ప్రాచీన ఇస్లాం మత పునరుద్ధరణకు కృషి చేశాయి. సయ్యద్ అహ్మద్ ఖాన్ నాయకత్వంలోని ఉద్యమం ముస్లింలు బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయత ప్రకటించాలని, పాశ్చాత్య జీవన విధానాన్ని పాటించాలని ప్రబోధించింది.

### 15.9.1 పంజాబ్ ముస్లింలు

గంగానదీ అంతర్వేది ప్రాంత ఉద్యమాలు పంజాబీ ముస్లింలను ప్రభావితం చేశాయి. అహ్మదీయ ఉద్యమ ప్రముఖ నాయకుల్లో మీర్జా గులాం అహ్మద్ (Mirza Ghulam Ahmed) ఒకరు. అహ్మదీయ సిద్ధాంతాలు మొదట అక్షరజ్ఞానంగల మధ్య తరగతి ముస్లింలను విశేషంగా ఆకర్షించింది. తర్వాతి కాలంలో అక్షరాస్యత తక్కువగా గల అట్టడుగు వర్గాలకు చెందిన గ్రామీణ నిరుపేదలు అధిక సంఖ్యలో ఆ ఉద్యమంలో చేరారు. విద్యావంతుల్లో డాక్టర్లు, న్యాయవాదులు, భూస్వాములు, వ్యాపారులు ఉన్నారు. వీరంతా జిల్లా కేంద్రాలైన పట్టణాలకు చెందినవారు. అహ్మదీయ ఉద్యమానికి గురుదాస్‌పూర్ (పంజాబ్) జిల్లాలోని కాడియన్ (Qadian) కేంద్రం.

### 15.9.2 బెంగాలీ ముస్లింలు

ఢిల్లీ, మక్కా, మదీనాలు ముస్లిం కేంద్రాలు. అవి బెంగాలీ ముస్లింలకు మతపరంగా స్ఫూర్తినిచ్చాయి. షావల్లీ ఉల్లా ప్రబోధాలు, ఢిల్లీ విద్యాపీఠం ప్రచారం చేసిన మతతత్వం, సౌదీ అరేబియా అల్ వహాబ్ సిద్ధాంతాల ఆధారంగా బెంగాల్ ముస్లింలో సాంఘిక, మత ఉద్యమాలు ఆవిర్భవించాయి.

ఫరజజిన్‌ను నెలకొల్పిన షహరత్ ఉల్లా తూర్పు బెంగాల్‌లో జన్మించాడు. మతాన్ని శుద్ధి చేయాలనేది ఇతని సందేశ సారాంశం. తూర్పు బెంగాల్ ప్రాంతానికి చెందిన వ్యవసాయదారులు ఇతని మార్గాన్ని అనుసరించారు. ఫరజజిన్‌లో ఎక్కువమంది నిరక్షరాస్యులైన వ్యవసాయదారులు, చేతి వృత్తులవారు. సమైక్యంగా వారు అతి వాద మార్గాన్ని అనుసరించారు. వారి ఉద్యమం తూర్పు బెంగాల్‌లోని ఢక్కా, ఫరీద్‌పూర్, జెస్సోర్, బద్‌కర గంజ్ జిల్లాల్లో విస్తరించినపుడు వారు హిందూ భూస్వాముల నుండి తీవ్రస్థాయిలో వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది.

### 15.9.3 గంగా నదీ మైదాన ప్రాంత ముస్లింలు

ముస్లిం మతతత్వ విజ్ఞానానికి, విద్యకు ఢిల్లీ కేంద్రంగా 1803 తర్వాత అభివృద్ధి చెందింది. ఇక్కడే ఉలేమాల్లో ఎక్కువ మంది విద్యాభ్యాసం చేశారు. ఢిల్లీ సంస్కృతిని వారు ఇతర మైదాన ప్రాంతాలకు తీసుకు వెళ్ళారు. ఢిల్లీలోని 'మదరసా-ఇ-రహీమియా' (Madrassah-i-Rahimiyah) షావలీ ఉల్లా, అబ్దుల్ అజీజ్‌ల నాయకత్వంలో పనిచేసింది. వారి కార్యకలాపాలు ఢిల్లీకి మాత్రమే పరిమితమైనాయి.

ముస్లింల సాంఘిక, మత ఉద్యమాలకు మరో ప్రధాన కేంద్రం ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేల్లీ. 'తారిక్-ఇ-మహమ్మదీయ' (Tarih-i-Mahamadiya) అనే సంస్థను నెలకొల్పిన సయ్యద్ అహ్మద్ బరేల్వీ రాయ్ బరేల్లీలో జన్మించాడు. ఢిల్లీకి మకాం మార్చిన తర్వాత అతనికి ఉలేమాల గుర్తింపు లభించింది. పునరుద్ధరించబడ్డ ఇస్లాం మతం తన దృష్టిలో ఎలా ఉంటుందో ప్రబోధించాడు. సయ్యద్ అహ్మద్ మరణంతో ఈ ఉద్యమం ఆగిపోయింది. అందువల్ల ఉద్యమ కేంద్రాన్ని మొదట ఢిల్లీకి, తర్వాత బీహార్‌లోని పాట్నాకు మార్చారు. పాట్నాకి చెందిన విలయత్ ఆలీ, ఇమాయత్ అలీ సోదరులు దానికి నాయకత్వం వహించారు.

తారిక్-ఇ-మహమ్మదీయ ఉద్యమ నిర్వాహకులు భూస్వాములను వ్యతిరేకించారు. అందువల్ల వారికి సామాన్య రైతునుండి మద్దతు లభించింది.

దియోబంద్ విద్యాలయాన్ని స్థాపించిన వారిలో మహమ్మద్ ఖాసిమ్ ననౌతవి (Muhammed Qasim Nanutauri 1833-77) రషీద్ అహమ్మద్ గంగోహి (Rahid Ahmed Gangohi) లు ముఖ్యులు. ఢిల్లీ మేథావుల ప్రభావానికి వారు లోనైయ్యారు. గంగా నది అంతర్వేది ప్రాంత నివాసులైన వారు ఉలేమా కుటుంబాలకు చెందారు. 1867లో దియోబంద్‌లో స్థిరపడి అక్కడ మదరసాను నెలకొల్పారు. ఈ సంస్థ ప్రజల విరాళాలపై పూర్తిగా ఆధారపడింది. 1880 నాటికి దియోబంద్ విద్యాలయం లాంటివి అంతర్వేది ఉత్తర భాగంలోను, రోహిల్‌ఖండ్‌లోను నెలకొల్పబడ్డాయి. దియోబంద్ సిద్ధాంతాలు పశ్చిమాన పెషావర్ నుండి తూర్పున చిటకాంగ్ వరకు, దక్షిణాన మద్రాస్ వరకూ వ్యాపించాయి. ప్రధానంగా విద్యార్థులు పంజాబ్ పశ్చిమోత్తర ప్రాంతాలు, బెంగాల్ నుండి వచ్చి ఈ విద్యాలయంలో చేరారు. సంస్థానాధీశులు, ప్రభుత్వ ఉద్యోగులు, మత నాయకులు, వాణిజ్యవేత్తలు, భూస్వాములు ఉదారంగా విరాళాలు ఇచ్చారు. ఆర్థిక సహాయం పొందడంలో సాధించిన విజయంవల్ల దియోబంద్ విద్యాలయం క్రమాభివృద్ధికి అడ్డంకులు లేకుండా పోయాయి. దియోబంద్ ప్రచారం ముస్లిం ప్రజలందరికీ చేరింది. అక్కడ విద్యాభ్యాసం చేసినవారికి ఉత్తరాదిన మంచి గౌరవం, ప్రజాదరణ లభించాయి. వారందరిలోనూ హిందూ-ముస్లిం అలవాట్లు, ఆలోచనా విధానం లోతుగా పాతుకుపోయాయి.

అలీగర్ ఉద్యమానికి కేంద్రం అలీగర్. దాన్ని ఉన్నత వర్గాల ప్రభుత్వోద్యోగులు, మేధావులు నడిపారు. వారు తమ స్వప్రయోజనాల పరిరక్షణ శ్రద్ధాశక్తులు కనబరచారు. ఉద్యమ ఆవిర్భావానికి కారణభూతుడైన సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఉన్నత వంశం (noble family) లో జన్మించాడు. ఈస్ట్ ఇండియా కంపెనీలో షరిష్టదార్‌గా కొంతకాలం పనిచేశాడు. లెజిస్లేటివ్ కౌన్సిల్స్ ప్రతినిధులుగా సామాన్య ప్రజలు అనర్హులని, భూస్వాములే అందుకు తగినవారని వాదించాడు. ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమ్యే అర్హతలు గల ముస్లింలను తయారు చేయటానికి కృషిచేశాడు.

అహ్మద్ ఖాన్ మరణానంతరం అలీగర్ ఉద్యమానికి నాయకత్వం వహించిన ఆయన అనుచరులు కూడా ఉన్నత వంశాలకు చెందిన ఆయన అనుచరులు కూడా ఉన్నత వంశాలకు చెందినవారే. మొహసినుల్ ముల్క్ (Mohsinul Mulk 1837-1907) కులీనుడు. కంపెనీలో చేరి అనేక ప్రభుత్వ పదవులు నిర్వహించాడు. ఖ్వాజా అల్తఫ్

హుస్సేన్ హాలి (Khwaja Altaf Husain Hali 1837-1914) ఉర్దూ కవి, ఉన్నత వంశీయుడు. ఢిల్లీ ఆయన కార్యకలాపాలకు కేంద్రం. మౌల్వీ నజీర్ అహ్మద్ (1831-1912) ఢిల్లీ కేంద్రంగా పాశ్చాత్య విద్యను ప్రోత్సహించాడు. ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి, తహసిల్‌దారుగా, డిప్యూటీ కలెక్టరుగా పనిచేశాడు. పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌లలో ఉర్దూ కవిగా ప్రశంసలందుకున్నాడు. మౌల్వీ జక ఉల్లా (Moulvi Zka Ullah 1832-1910) పర్షియన్ అరబిక్ భాషాచార్యుడుగా అలహాబాద్‌లో పనిచేశాడు. మౌలానా షిబ్లీ నోమానీ (Moulana Shibli Noemani) మహమ్మదీయ ఆంగ్ల ప్రాచ్య కళాశాల్లో పర్షియన్ భాషాచార్యుడు. ఉపాధ్యాయుడుగా విద్యార్థుల అభిమానాన్ని చూరగొన్నాడు. ఆ కలాశాల స్థాపనలో కీలక పాత్ర వహించిన మహ్మద్ సమియుల్లా ఖాన్ (Muhammed Samiullah Khan 1834-1908) జిల్లా జడ్జి. అలహాబాద్‌లో ముస్లింలకు ప్రత్యేకంగా ఒక వసతి గృహాన్ని ప్రారంభించి, నిర్వహించాడు.

అలీగర్ ఉద్యమ ప్రభావం ఒక్క ఢిల్లీకి మాత్రమే పరిమితం కాలేదు. ఉత్తర భారతదేశంలో ప్రతి పట్టణానికి ఆ ఉద్యమం వ్యాపించింది. అక్కడ పాఠశాలలను స్థాపించి, ప్రాంతీయ భాషలతో పాటు, పాశ్చాత్య విద్యా బోధనకు ఏర్పాట్లు జరిగాయి.

## 15.10 సంగ్రహంగా

1. 19వ శతాబ్దంలో వివిధ ప్రాంతాల్లో వేర్వేరు మత సంస్కరణోద్యమాలు ప్రారంభమయ్యాయి.
2. బెంగాల్‌లో విద్యాధికులైన అగ్రవర్ణాలవారు బ్రహ్మ సమాజాన్ని పెంచి పోషించారు. శక్తిమంతమైన ఉద్యమంగా బెంగాల్ అభివృద్ధి చెందినప్పటికీ, అది ప్రజా ఉద్యమం కాలేదు.
3. సరళీకృత మత సంస్కరణ విధానాన్ని ప్రచారం చేసిన ప్రార్థనా సమాజం బొంబాయి రాష్ట్రంలోను, మద్రాస్ రాష్ట్రంలో కొన్ని చోట్ల సంస్కరణ కార్యక్రమాన్ని చేపట్టింది. దానికి మధ్య తరగతి వర్గాల అండదండలు లభించాయి.
4. ఆర్య సమాజ ఉద్యమం ప్రత్యేకించి ఉత్తర భారతదేశంలో వ్యాపించింది. అది ప్రచారం చేసిన సిద్ధాంతాలు పట్టణవాసులకు, గ్రామీణ ప్రాంతాలవారిని ఆకర్షించాయి.
5. దివ్యజ్ఞాన సమాజం మధ్యతరగతి విద్యాధికులను బాగా ఆకర్షించింది.
6. సిక్కు మత సంస్కరణ ఉద్యమం పంజాబ్ పరిధులు దాటలేదు.
7. ఇస్లాం మత సంస్కరణకు ఉలేమాలు, పాశ్చాత్య విద్యాభ్యాసం చేసిన వారు కృషి చేశారు. అహ్మదీయ ఉద్యమం పంజాబ్‌లోను, పరఇజిస్ బెంగాల్‌లోను, తారిక్-ఇ-మహ్మదీయ ఉద్యమం ఉత్తరప్రదేశ్, బీహార్‌ల్లోను, దియోబంద్, అలీగర్ ఉద్యమాలు ఉత్తరప్రదేశ్‌లోను అభివృద్ధి చెందాయి.
8. పరివర్తన ఉద్యమాలకు ముఖ్యంగా బ్రాహ్మణులు, ఉలేమాలు నాయకత్వం వహించారు.

## 15.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

   1. బెంగాల్ బ్రహ్మ సమాజం, బొంబాయి ప్రార్థనా సమాజాల మధ్యగల భేదాలను తెల్పండి.
   2. ఆర్య సమాజ ప్రత్యేక లక్షణాలను వివరించండి.

3. బొంబాయి, మద్రాస్ ప్రాంతాల్లో దివ్యజ్ఞాన సమాజాభివృద్ధికి అనుకూలించిన పరిస్థితులెవ్వి?

4. ముస్లిం మత సంస్కరణ ఉద్యమాలు ఏఏ ప్రాంతాల్లో ఆవిర్భవించాయి? ఏ వర్గాల ప్రజలు వాటిని సమర్థించారు.

II. ఈ క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలు రాయండి

1. అలీగర్ ఉద్యమ లక్షణాలెవ్వి.

2. దేవ సమాజానికి ఏ ఏ వర్గాలు సమర్థించాయి.

3. బెంగాల్‌లో బ్రహ్మ సమాజాభివృద్ధిని గురించి రాయండి.

4. దివ్యజ్ఞాన సిద్ధాంతాలు ఏ ఏ తరగతుల వారిని ఆకర్షించాయి ?

## 15.12 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Farquhar, J. | : | **Modern Religious Movements in India** |
| Heimsath, Charles H | : | **Indian Nationalism and Hindu Social Reform** |
| Jones, Kenneth W | : | **Arya Dharm** |
| " | : | **The Caombridge Histroy of India Vol. III, Socio-religous reform movements in British India** |
| Sen, S.P. (ed.) | : | **Social and Religious Reform Movemtuts in Nineteenth and Twentieth centuries.** |
| Sisikumar Mitre | : | **Resurgent India** |
| Vyas, K.C. | : | **The Social Rennaisance in India 1957** |
| Zakaira, Rafiq | : | **Rise of Muslims in Indian Policies 1970.** |



**రచయిత : ఆచార్య బి. కేశవనారాయణ**


BRAOU

# భాగం - 16 సామాజిక ఇబ్బందులు, పునరుద్ధరణ, లౌకికత్వం

విషయక్రమం

16.0 లక్ష్యాలు
16.1 పరిచయం
16.2 బ్రహ్మ సమాజం
16.3 ఆర్య సమాజం
16.3.1 ఆర్య సమాజం : సనాతనులు
16.3.2 ఆర్య సమాజం : క్రైస్తవ మిషనరీలు
16.3.3 ఆర్య సమాజం : ఇస్లాం
16.3.4 ఆర్య సమాజ శుద్ధి కార్యక్రమం
16.3.5 ఆర్య సమాజం : బ్రిటిష్ ప్రభుత్వం
16.4 దేవ సమాజం – ఆర్య సమాజం
16.5 పండిట్ శ్రద్ధారామ్
16.6 సింగ్ సభ
16.7 గోరక్షణ
16.8 హిందీ - ఉర్దూ వివాదం
16.9 ఇస్లాం మత సంస్కరణలు : ఇబ్బందికర పరిణామాలు
16.10 సయ్యద్ అహ్మద్ ఖాన్ – ముస్లిం సాంప్రదాయ వాదులు
16.11 సంగ్రహంగా
16.12 పరీక్ష నమూనా ప్రశ్నలు
16.13 ఉపయుక్త గ్రంథాలు

## 16.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడం వల్ల మీరు కింది విషయాలను గురించి తెలుసుకోగలగాలి.

- సనాతనుల వ్యతిరేకతవల్ల సంఘ సంస్కరణలను ప్రోత్సహించిన బ్రహ్మ సమాజికులు ఎదుర్కొన్న ఇబ్బందులు.
- తీవ్ర వాద ఆర్య సమాజికులకు హిందూ సనాతనులు, క్రైస్తవ మిషనరీలు, ముస్లింలు మొదలైన వారితో ఏర్పడ్డ విరోధం.
- హిందూ-ముస్లిం విభేదాలను తీవ్రతరం చేసిన గోరక్షణ ఉద్యమం, హిందీ - ఉర్దూ వివాదం.

BRAOU

- గోరక్షణ విషయంలో బ్రిటిష్ ప్రభుత్వానికి నామ్‌ధారుల నుండి ఎదురైన సవాలు.
- అహ్మదీయ ఉద్యమ నాయకుడైన మీర్జా గులాం అహమ్మద్ కలహ ధోరణి.
- సాంప్రదాయవాదుల కోపానికి గురైన సయ్యద్ అహ్మద్ ఖాన్ బోధనలు.

## 16.1 పరిచయం

బ్రహ్మ సమాజ్, ప్రార్థనా సమాజ్, ఆర్య సమాజ్‌ల నాయకులు మత, సాంఘిక సంస్కరణలకు అనుకూల విధానాన్ని అనుసరించారు. వారి కార్యకలాపాలను సహించక హిందూ సాంప్రదాయ వాదులు తీవ్రంగా ప్రతిస్పందించారు. శుద్ధి, గోరక్షణ మొదలైన ఆర్య సమాజ కార్యక్రమాలు క్రైస్తవ మిషనరీల, ముస్లింల ఆవేశకావేశాలకు దారితీశాయి. ఇస్లాం మత సంస్కరణను కోరిన సయ్యద్ అహ్మద్ ఖాన్ కూడా ఎన్నో బాధలను ఎదుర్కోవలసి వచ్చింది. హిందూ - ముస్లిం మతాల మధ్య వైషమ్యాలు చాలాకాలం పాటు కొనసాగి, సమాజంలో అశాంతి వాతావరణాన్ని సృష్టించాయి.

## 16.2 బ్రహ్మ సమాజం

రామ్‌మోహన్ రాయ్ తన కొత్త సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి బ్రహ్మ సమాజ్‌ను స్థాపించాడు. అది సంఘ సంస్కరణ సంస్థకాదు. కాని దాని సభ్యులు సంఘ సంస్కరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. సాంఘిక దురాచారాల నిర్మూలనకై ప్రభుత్వ సహాయం పొందటానికి ఉద్యమాన్ని నడిపారు. మూఢ నమ్మకాలపై ఆధారపడ్డ ఆచారాలకు దూరంగా ఉండటానికి సంసిద్ధులయ్యారు. మత, సాంఘిక సంస్కర్తలకు కొంతవరకు మిగిలిన సమాజంతో, ముఖ్యంగా తమ కులస్థులతో సంబంధాలు లేకుండాపోయాయి. బ్రాహ్మోలు వాస్తవంగా ఒక ప్రత్యేక కొత్త కులానికి చెందినవారుగా మారారు.

రామ్‌మోహన్ రాయ్ బ్రహ్మదేవతారాధనను వ్యతిరేకించి, ఏకేశ్వరోపాసనకు ప్రచారం చేశాడు. విగ్రహారాధనను ఖండించాడు. పూజారి వృత్తిని, అధికంగా ఆచార విధులు నిర్వహించడాన్ని తీవ్రంగా విమర్శించాడు. సమాజంపైనా, ప్రజల నైతిక ప్రవర్తన పైనా వాటి దుష్ట ప్రభావాన్ని ఎత్తిచూపెట్టాడు. రాయ్ సంస్కరణ ధోరణిని హిందూ సనాతనులు సవాలు చేశారు. అతనికి ప్రాణహాని కూడా తలపెట్టారు. ప్రముఖ సంస్కృత పండితులైన సుబ్రహ్మణ్యా శాస్త్రి, శంకర శాస్త్రి, మృత్యుంజయ విద్యాలంకార్‌లు రాయ్‌తో మత సంబంధమైన వాగ్వివాదాలు పెట్టుకున్నారు. బెంగాల్‌లోనేగాక సర్వ సామాన్యంగా ఇతర ప్రాంతాల్లో కూడా సంస్కరణలను ప్రోత్సహించిన బ్రహ్మ సమాజికులు నిందలకు, బెదిరింపులకు, సంఘ బహిష్కరణకు బలి అయ్యారు. అయితే, సనాతనుల కక్ష సాధింపు చర్యలు హింసాత్మక సంఘటనలకు దారితీయలేదు.

నిర్బంధ సతీ సహగమనంపై సంస్కరణ వాదుల దాడి 1818లోనే ప్రారంభమైంది. ఆ సంవత్సరం కలకత్తా పౌరులు కొంతమంది ప్రభుత్వానికి సమర్పించిన వినతి పత్రంలో సతి నిర్మూలనకై అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సిందని అర్థించారు. రామ్‌మోహన్ రాయ్ నాయకత్వంలో సంస్కరణ వాదులు సతీ సహగమన ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఈ ఉద్యమం మెజారిటీ సనాతన వర్గాల నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్ 'సతి' ఆచారాన్ని శాస్త్రాలు సమ్మతించవని, ఆ ఆచారం మధ్య యుగానికి చెందిందని, దాన్ని నిషేధించ అభాగ్యులైన స్త్రీలకు న్యాయం చేకూర్చమని రాయ్ వర్గీయులు 'సంబంధ కౌముది', 'సమాచార దర్పణ్' పత్రికల ద్వారా సతీ సహగమన వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రతరం చేశారు. అనేక రచనల ద్వారా కూడా సతి నిర్మూలనకై ఉద్యమం కొనసాగింది.

BR AOU

సతీ సహగమన ఆచారంపై ప్రారంభమైన దాడిని త్రిప్పికొట్టడానికి సనాతనులు 'సమాచార చంద్రిక'ను 1822 మార్చి నెలలో ప్రారంభించారు. ఆ పత్రిక సనాతనుల అభిప్రాయాలను ప్రతిబింబించింది. 'సతి' ఆచారాన్ని నిర్ద్వంద్వంగా సమర్థించింది. "సహగమనం ద్వారా హిందూ స్త్రీ తన భర్తయందు పూర్తి విశ్వాసాన్ని, విధేయతను ప్రకటించింది, అట్టి ఆచారం సమకాలీన ఇతర సంస్కృతుల్లో కన్పించదు" అని 'చంద్రిక' వ్యాసాలు ప్రచురించింది. అయితే, విద్యా సంస్కరణలను, భారతీయ పునరుజ్జీవనాన్ని బలపరచింది. కౌముది, చంద్రికల మధ్య కొనసాగిన ప్రచ్ఛన్న యుద్ధం సాంస్కృతిక విలువలకు సంబంధించిందిగా భావించవచ్చు. సతిని సమర్థించిన రాధాకాంత్ దేబ్, భబనిచరన్ బెనర్జీలు హిందూ సనాతన సంప్రదాయాల రక్షకులుగా, అభివృద్ధి నిరోధకులుగా గుర్తింపు పొందారు.

## 16.3 ఆర్య సమాజం

దయానందుడు స్థాపించిన ఆర్య సమాజం సమర్థవంతమైన, సంస్కరింపబడ్డ హిందూ సంస్థగా మారింది. భారతదేశంలో రాజకీయ, సాంఘిక, మత సమైక్యత సాధించడానికి కృషి చేసింది. దేశంలో నెలకొన్న మతపరమైన అనైక్యతను తొలగించి, వర్ణ, వర్గ విభేదాలు నిర్మూలించి పటిష్టవంతమైన సమాజ నిర్మాణానికి దయానందుడు ప్రయత్నించాడు. ఇతర మతాల స్థానంలో ఆర్య మతాన్ని నిలబెట్టటానికీ, జాతీయ ఐక్యత సాధించటానికి, విదేశీ పాలననుండి దేశానికి విముక్తి ప్రసాదించటానికి కృషి చేశాడు. దయానందుని ప్రబోధనల వల్లనే భావ సారూప్యం గల హిందువులందరిలో సంఘటితం కావాలనే ఆలోచన కలిగింది. ఆర్య సమాజ సిద్ధాంతాలు వ్యాపించడం వల్ల కూడా దేశ ప్రజల్లో తెల్ల జాతి ఆధిక్యతలో నమ్మకం సన్నగిల్లిందని చెప్పవచ్చు.

ఆర్య సమాజ జాతీయ దృక్పథం లాలాలజపతి రాయ్ వల్ల మరింత బలపడింది. 1904 అక్టోబర్‌లో 'పంజాబీ' (Pangabee) వార్తాపత్రికను లజపతి రాయ్ ప్రారంభించాడు. స్వదేశీ ఉద్యమాన్ని, సమ్మెలను, హర్తాళ్లను సమర్థిస్తూ ఆ పత్రిక రాసింది. స్వతంత్ర భావాలను, ఆత్మ విశ్వాసాన్ని ఆర్య సమాజికులు ప్రజల్లో ప్రచారం చేయడాన్ని బ్రిటిష్ పాలకులు వ్యతిరేకించారు. ఆర్య సమాజ జాతీయ కార్యక్రమాలు బ్రిటిష్‌వారి విరోధాన్ని తెచ్చిపెట్టాయి.

ఆర్య సమాజ్‌లో వచ్చిన చీలిక ఆ ఉద్యమానికి కొత్త ఊపిరిని ఇచ్చింది. అతి వాద ఆర్య సమాజికులకు ఆర్య ప్రతినిధి సభ, కొత్తగా ఆవిర్భవించిన ఇతర సమాజాలపై పూర్తి నియంత్రణ లభించింది. వారికి మత లక్ష్యాల్లో గల నమ్మకం, వారికిగల అంకిత భావం వల్ల సంఘంలో నాటుకుపోయిన సంప్రదాయాలపైనా, ఆచారాల పైనా దాడులను తీవ్రతరం చేయడానికి అవసరమైన శక్తి లభించింది. 1895లో ఆర్య ప్రతినిధి సభ మొదటి సమావేశంలో కొత్త నిబంధనలకు ఆమోదం లభించింది. అప్పటినుండి అతివాదుల నాయకత్వానికి దీటైన పోటీ లేకుండా పోయింది. 1897 నాటికి ప్రతినిధి సభలో 83 ఆర్య సమాజ ఉపశాఖలు సభ్యత్వం పొందాయి.

ఆర్య ప్రతినిధి సభ తీవ్ర వాదుల నాయకత్వంలో తన లక్ష్యాలను రూపొందించింది. సభ కార్యక్రమాల్లో అతి ముఖ్యమైంది వేద ప్రచారం. దయానంద ఆంగ్లో - వేదిక్ పాఠశాలతో అధికారికంగా తెగతెంపులు చేసుకొని, ఆర్య సమాజ ఆశయాలను దేశవ్యాప్తం చేయడానికి తీవ్ర వాదులు విస్తృతమైన మిషరీ వ్యవస్థను సృష్టించారు. పంజాబ్, సింధు, బలూచిస్తాన్‌లను మండలాలుగా విభజించి ఒక్కొక్క మండలానికి ఒక ఇన్‌చార్జి అధికారిని, ఉపదేశక్‌లను నియమించారు. వారు వివిధ మండలాల్లో ప్రచారం నిమిత్తం పర్యటించాల్సి ఉంది. ఉపదేశక్‌ల విధులు ఇవి : 1. ఆర్య సమాజ సిద్ధాంతాలను ఉపన్యాసాల ద్వారా ప్రచారం చేయడం, 2. శుద్ధి కార్యక్రమాన్ని సమర్థించడం, 3. వితంతు వివాహాలు మొదలైన సాంఘిక సంస్కరణలకు మద్దతు ప్రకటించడం, 4. స్థానిక ఉపశాఖలకు, ముఖ్యంగా కొత్తగా ఏర్పడ్డ వాటిని ప్రోత్సహించడం. ఈ మండలి వ్యవస్థ కొంతవరకు విజయవంతమైందని చెప్పవచ్చు. 1895-'96 సంవత్సరంలో స్వచ్ఛంద సేవకులు, అధికారులు కలిసి 1175 ఉపన్యాసాలిచ్చి, ఆర్య

సమాజ సందేశాన్ని 4 లక్షల మందికి వినిపించారు. ఈ ఉపదేశకులు ఆర్య సమాజానికి వెన్నెముకలా నిలిచి, మత మార్పిడి కార్యక్రమంలో కీలక పాత్ర వహించారు.

వేద ప్రచారం అంచలంచలుగా కొనసాగింది. డి.ఎ.వి. కళాశాలకు చెందిన ఆర్య సమాజికులు కూడా వేరే ప్రచారకులను నియమించారు. మతం మార్పిడులను సమర్థిస్తూ కరపత్రాలను అచ్చువేసి పంచిపెట్టారు. కాని ప్రజల్లో తీవ్ర వాదులే నిజమైన మత రక్షకులుగా, మార్గదర్శకులుగా గుర్తింపు పొందారు. మతం మార్పిడి కార్యక్రమంలో వారు కనబరచిన శ్రద్ధాసక్తులు, పట్టుదల కారణంగా ఆర్య సమాజానికీ, దాని ప్రత్యర్థి వర్గాల మధ్య విరోధం అనివార్యమైంది. ఏదో ఒక సమయంలో ఆర్య సమాజికులు, సనాతనులతో క్రైస్తవ మిషనరీలతో, ముస్లింలతో, సిక్కులతో, బ్రహ్మ సమాజికులతో, దేవ సమాజికులతో పోటీపడ్డారు. ఒక్కొక్క సంఘటన వారి మధ్య విభేదాలను తీవ్రం చేసి, ఘర్షణలకు దారితీసింది.

### 16.3.1 ఆర్య సమాజం : సనాతనులు

ఆర్య సమాజ్ విధానాలను కొన్ని సందర్భాల్లో సనాతనులు వ్యతిరేకించారు. దయానందుడు తన ఉపన్యాసాల్లో విగ్రహారాధనను, బాల్య వివాహాలను మనిషి మరణించినపుడు నిర్వహించే కర్మకాండలను ఖండించాడు. అది వివాదానికి దారితీసింది. కొత్తగా ఆర్య సమాజంలో చేరినవారు విగ్రహాలను రావి నదిలో పారవేశారు. లేదా వాటిని బజార్లలో పగలగొట్టారు. బహిరంగంగా విగ్రహాలకు జరిగే అవమానాన్ని సనాతనులు సహించలేక, వారంతా ఏకమై ఆర్య సమాజ వ్యతిరేక ప్రచారాన్ని ప్రారంభించారు. పండిట్ శ్రద్ధారాం "సనాతన ధర్మ రక్షిణ సభ"ను స్థాపించి దయానందుని సవాలు చేశాడు. రెండు వర్గాల మధ్య వివాదానికి లాహోర్ కేంద్రంగా మారింది. దయానందుడు వెళ్ళిన ప్రతిచోట వ్యతిరేకత ఎదురైంది. గుజరాత్ జిల్లాలో సనాతనుల నాయకత్వంలో ప్రజా సమూహం దయానందునిపై రాళ్ళు, ఇటుకలను విసిరారు. బహిరంగ సభలను చెడగొట్టడానికి ప్రయత్నించారు. ముల్తాన్‌లో అల్లరిమూకలు దయానందుని బహిరంగ సభను చెడగొట్టారు. క్రమంగా చాలమంది సంస్కరణ సంఘాలను వదిలి లాహోర్ సమాజంలో చేరిపోయారు. హిందూ సభలు అంతరించాయి.

దయానందుని తర్వాత కూడా ఆర్య సమాజ్‌కు ఎదురైన వ్యతిరేకత కొనసాగింది. 1887 నాటికి "భారత్ ధర్మ మహా మండలి" (Bharat Dharm Maha Mandal)ని స్థాపించి, ఆర్య సమాజానికి వ్యతిరేకంగా సనాతనులు తమ పోరాటాన్ని సాగించారు. పండిత దీన్ దయాళ్ నాయకత్వంలో మండలి పూర్వాచార పరాయణులను సమర్థిస్తూ బహిరంగ చర్చలు, గోష్ఠులు ఉపన్యాసాలను నిర్వహించింది. ఆర్య సమాజ్ - మండలి పోరాటం దీన్‌దయాళ్, పండిట్ గోకుల్‌చంద్‌లపై వ్యక్తిగత విమర్శలకు దారితీసింది. దయానందుని వ్యక్తిత్వాన్ని, అతని బోధనలను సనాతనులు తీవ్రంగా విమర్శించారు. పంజాబ్ అంతా స్థానికంగా సనాతన ధర్మ సభలు ఆవిర్భవించినప్పటికీ, అవి చురుకుగా పనిచేయలేదు.

1894-1904 మధ్య కాలంలో ఆర్య సమాజికులు, మత ఛాందస వాదుల మధ్య ఏదో ఒక సమస్యపై విరోధం ఏర్పడి, అది పతాక స్థాయికి చేరింది. 1898లో దుర్గా మాత అవతారమని చెప్పుకుంటూ ఒక బాలిక పంజాబ్‌లో పర్యటించింది. ఆమె సందర్శించిన పట్టణాల్లో ఆమె అనుచరులైన దేవి ఆరాధకుల్లో మతాభిమానం వెల్లువికింది. సమాజంలో మూఢ విశ్వాసాలు, మాయలు, నిర్హేతుకమైన కర్మకాండలు కొనసాగుతున్నాయని ఆర్య సమాజికులు విమర్శించారు. అదే సంవత్సరం మధ్యలో అనేక మంది దేవి అవతారమని చెప్పుకుంటూ, పంజాబ్‌లో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫలితంగా మతాభిమానం పంజాబ్ రాష్ట్రాన్నంతటినీ కుదిపివేసింది. మత పునరుజ్జీవనాన్ని, అద్భుతాలను సనాతనులు ప్రశంసించారు. కోపోద్రిక్తులైన ఆర్య సమాజికులు ధన సంపాదనకు

BRAOU

సుఖంగా బతకటానికి జాదగాళ్లు, గూండాలు తదితరులు కొత్త పథకాన్ని వేసుకున్నారనీ, అమాయకులైన ప్రజలు వారి మోసాలకు గురవుతున్నారనీ ప్రచారం చేశారు. కొద్ది నెలల్లో ఈ ఉద్రేకం చప్పబడింది. దాంతో వారి మధ్య వివాదం కూడా సద్దుమణిగింది.

1900లో సంస్కృత పండితుడు, ప్రముఖ ఆర్య సమాజికుడైన పండిట్ భీమ సేన్ (Bhim Sain) ఆర్య సమాజాన్ని వదలిపెట్టినపుడు ఆర్య సమాజికులు, సనాతనుల మధ్య విరోధం మరల ఏర్పడింది. భీమ్ సేన్ ఛాందస వాదులతో చేతులు కలిపి, స్వచ్ఛమైన వైదిక మతాన్ని హిందువులకు ప్రసాదించటానికై పంజాబ్‌లో విస్తృతంగా పర్యటించాడు. అతని ఫిరాయింపు ఆర్య సమాజికుల్లో కలవరాన్ని రేపింది. సనాతనులు అతని చర్యను సమర్థిస్తూ తమ హర్షాన్ని తెల్పారు. ఫలితంగా వారి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. లాలా మున్షీరామ్, సనాతన వర్గానికి చెందిన పండిట్ గోపీనాథ్ మధ్య వివాదం వికృత రూపం దాల్చింది. ఎవరికివారు తమ సిద్ధాంతాలను సమర్థించుకుంటూ వాదప్రతివాదనలు చేసుకున్నారు. చివరికి న్యాయస్థానంలో తీర్పు పండిట్ గోపీనాథ్‌కు వ్యతిరేకంగా వచ్చింది. ఈ అనూహ్య పరిణామానికి సనాతనులు కలత చెంది, ఆర్య సమాజికులపై విమర్శలు గుప్పించారు. 1901, 1902లో కూడా వారి మధ్య స్పర్థలు తలెత్తాయి.

### 16.3.2 ఆర్య సమాజికులు – క్రైస్తవ మిషనరీలు

ఆర్య సమాజికులకు క్రైస్తవ మిషనరీలతో కూడా సత్సంబంధాలు లేవు. వారు ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకున్నారు. అద్భుతాలను (miracles) గుడ్డిగా నమ్ముతున్న మిషనరీలను ఆర్య సమాజికులు దూషించారు. సమాజికులు పాఠశాలలను స్థాపించినప్పటికీ విద్యార్థులను క్రైస్తవ మతంలోకి చేర్చుకోడం కొనసాగుతూనే ఉంది. ఇటువంటి సంఘటనలు యువకులను హిందూ మతానికి దూరం చేస్తున్నాయని శిష్టజనులు (elites) భయపడ్డారు. బాలురను మాయమాటలతో ఆకర్షిస్తున్నారని, క్రైస్తవ మతంలో చేరాలన్న కోరికగలవారిని బలవంతాన ఎత్తుకు పోతున్నారని, బాలికలను వారి తలిదండ్రుల నుండి దూరం చేస్తున్నారని మిషనరీలను విమర్శించారు. 1894-95లో జనానా మిషన్లు అనుసరించిన వ్యూహానికి స్పందన వచ్చింది. బాలికలను తమ మతంలో చేర్చుకున్నారు. మిషనరీ కార్యకలాపాలను విమర్శించే వారు పాశ్చాత్య సంస్కృతిని, దాని ఆధిక్యతను దూషించారు. మిషనరీలు అవినీతి విధానాల ద్వారా మత మార్పిడులకు పాల్పడుతున్నారని, వారి నాగరికత నీతి బాహ్యమైందని, పతనావస్థలో ఉందని అన్నారు. క్రైస్తవ మత ప్రచారకులు హిందూ సాధువుల వేషంలో మోసం చేస్తున్నారని, వారి ముసుగును తొలగించాలన్నారు. తమ మాతృదేశంలో కంటే, భారతదేశంలో సుఖంగా బతకవచ్చుననే తలంపుతో మిషనరీలు వచ్చాయని కూడా ప్రచారం చేశారు.

అనాథలకు ఆశ్రయం, కరువు నివారణ విషయాల్లో క్రైస్తవ మిషనరీలతో ఆర్య సమాజికులు పోటీపడ్డారు. 1877కు పూర్వం ఫిరోజ్‌పూర్‌లో రాయ్ మథుర్‌దాస్ ఒక అనాథ శరణాలయాన్ని స్థాపించాడు. అది క్రమంగా అభివృద్ధిచెంది, 19వ శతాబ్దాంతంలో వచ్చిన కరువుల వరకు కొనసాగింది. కరువుల వల్ల బాధలకు గురై తిండి లేక బాధపడే పిల్లలకు హిందువులు ఆశ్రయమిచ్చారు. ఏ అనాథను పంపించినా తన సమాజం నీడనిచ్చి ఆదరిస్తుందని లాలాలజపతి రాయ్ ప్రకటించాడు. అనాథుల సహాయానికై నిధుల సేకరణలోను, అనాథ పిల్లలను గుర్తించడంలోను దయానంద ఆంగ్లో - వేదిక కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

### 16.3.3 ఆర్య సమాజం : ఇస్లాం

దయానందుడు తన ఇస్లాం మత వ్యతిరేక వాదనలను 'సత్యార్థ ప్రకాష్'లో పొందుపర్చాడు. మనుషులను, జంతువులను మతంగా ఇస్లాంను అందులో చిత్రీకరించాడు. అప్పటినుండి ఆర్య సమాజికులు ఇస్లాం మత వ్యతిరేక పోరాటాలు సాగించారు. పెషావర్ ఆర్య సమాజ సభ్యుడైన పండిట్ లేఖరామ్ (1858-1897) నడిపిన

ఉద్యమ ఫలితంగా ఆర్య సమాజికులు, ముస్లింలు పరస్పరం ద్వేషించుకోవడం మొదలు పెట్టారు. వారి మధ్య మతావేశాలు తీవ్ర రూపాన్ని దాల్చాయి. పశ్చిమోత్తర ప్రాంత ముస్లింలు లేఖ్‌రామ్‌ను పునరుజ్జీవ హిందూ మత సంకేతంగా భావించారు, అతడు మతోన్మాది అనీ, ఇస్లాం మతాన్ని సర్వనాశనం చేయడానికి కంకణం కట్టుకున్నాడని ప్రచారం చేశారు. ఇస్లాం మతాన్ని విమర్శిస్తూ లేఖరామ్ చేసిన ఉపన్యాసాలను, రాసిన వ్యాసాలను ముస్లిం పత్రికలు తీవ్రంగా విమర్శించాయి. ఆయన రచించి ప్రచురించిన "తక్‌జిబ్-ఇ-బురాహిని అహ్మదియ' (Tazib-i-Burahini Ahmadiya) ఇస్లాం మతాన్ని, ముస్లింను, మతాచార్యులను (prophets) దుర్భాషలాడిందని, ముస్లిం పత్రిక "పైసా అక్బర్" (Paisa Akhbar) రాసింది. దాన్ని నిషేధించమని ప్రభుత్వానికి విజ్ఞప్తి కూడా చేసింది. ఢిల్లీకి చెందిన ముస్లింలు న్యాయస్థానంలో లేఖరామ్‌పై దావా వేశారు. న్యాయస్థానం వారికి వ్యతిరేకంగా తీర్పునివ్వడంతో ముస్లింల నిరాశ అధికమైంది. 1896 చివరి రోజుల్లో, 1897 ప్రారంభంలోను ముస్లింలు, ఆర్య సమాజికులు ఒకరిపై ఇంకొకరు నేరాలు మోపుకున్నారు, పరస్పరం అవమానించుకున్నారు. వారి చర్యలు హింస. దౌర్జన్యాలకు దారితీశాయి.

1897 మార్చి నెల్లో ఒక ముస్లిం మతోన్మాది పెషావర్ ఆర్య సమాజ ప్రముఖ నాయకుడైన లాలారల్లారాంపై దాడి చేశాడు. ఈ సంఘటన పెషావర్‌లో రెండు మతస్థుల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొనడానికి కారణమైంది. మూడు రోజుల తర్వాత ఒక ముస్లిం ఉన్మాది చేతులో లేఖరామ్ హత్యకు గురయ్యాడు. హన్స్‌రాజ్, లాలాలాల్‌చంద్, ఇతర పంజాబ్ నాయకులను కూడా హత్యచేయడానికి కుట్ర జరుగుతుందని పుకార్లు నిర్వహించాయి. ఇటువంటి పుకార్లకు "పంజాబ్ సమాచార్" (Punjab Samachar) పత్రిక అధిక ప్రాధాన్యత నిచ్చింది.

లేఖరామ్ హత్య ఆర్య సమాజికులందరినీ కదిలించి వేసింది. హిందూ మతంపై జరుగుతున్న దాడులను హిందువులందరూ సమైక్యంగా తిప్పికొట్టాలని లాలాలజపతి రాయ్ పిలుపునిచ్చాడు. ఆయన కృషివల్ల నాయకు లందరూ తమ మధ్యగల విభేదాలను విస్మరించి, వైదిక ధర్మరక్షణకై శ్రమించాలని నిర్ణయం గైకొన్నారు. పుకార్ల వల్ల పంజాబ్‌లోని పలు పట్టణాల్లో హింసాత్మక సంఘటనలు జరిగాయి; మత వైషమ్యాలు పెరిగిపోయాయి. ఆర్య సమాజికులకు హిందువులు, సిక్కులు అండగా నిలిచారు.

ఏప్రిల్ నాటికి మత విద్వేషం ప్రబలడంతో కరపత్రాలు, ప్రకటన పత్రాలు (posters) కీలక పాత్ర వహించాయి. ఒక కరపత్రంలో మీర్జా గులాం అహ్మద్ ఇస్లాం మత శత్రువు లేఖరామ్ మరణించినందుకు దేవునికి ధన్యవాదాలు తెల్పాడు. కొంతమంది హిందువులకు బెదిరింపు ఉత్తరాలు అందాయి. హిందువులందరూ ఇస్లాం మతాచార్యులకు విధేయత ప్రకటించాలనీ, లేనట్లయితే వారంతా సామూహిక హత్యకు గురికాగలరనీ హెచ్చరికలు వెళ్లాయి. ముస్లింలు నడిపిన "అక్బర్-ఇ-ఆమ్" (Akhbar-i-Am), "సాదహ్-ఇ-హింద్" (Sadah-i-Hind), పైసా అక్బార్ (Paisa Akhbar) పత్రికలు ముస్లింలో హిందూ వ్యతిరేక భావాన్ని రెచ్చగొట్టే వార్తలు ప్రచురించాయి. ముస్లిం నాయకులను హత్య చేయమని హిందూ మత నాయకులు తమ మతస్థులను పురిగొల్పారని ఈ పత్రికలు ప్రకటించాయి. ఇటువంటి ప్రకటనలే అవాంఛనీయ సంఘటనలకు దారితీశాయి. డిసెంబర్ నాటి మామూలు పరిస్థితులు తిరిగి నెలకొన్నాయి.

**16.3.4 ఆర్య సమాజ శుద్ధి కార్యక్రమం**

హిందూ మతాన్ని వదలిపెట్టి ఇతర మతాలను స్వీకరించిన హిందువులను తిరిగి హిందూ మతంలోకి మార్చడానికి ఎన్నుకున్న కార్యక్రమం శుద్ధి. క్రైస్తవ, ఇస్లాం, సిక్కు మతస్థులు హిందువులను తమ వైపు ఆకర్షించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. 19వ శతాబ్దం చివరి రోజుల్లో అంటరానివారు (out castes) హిందు

సమాజంలో విశ్వాసం సడలటంవల్ల దాన్ని విడిచిపెట్టి ఇతర మతాల్లో చేరడం ప్రారంభించారు. క్రైస్తవ మిషనరీలు పంజాబ్‌లోని అంటరానివారిని తమవైపు ఆకర్షించడంలో ఊహించని విధంగా విజయవంతమయ్యారని 1891 ప్రభుత్వ లెక్కలవల్ల విశదమైంది. 1890-1900 మధ్య క్రైస్తవుల జనాభా పెరిగింది. హిందూ సమాజానికి ఎదురైన ఈ ప్రమాదాన్ని గుర్తించి ప్రధానంగా అతి వాద ఆర్య సమాజికులు మత మార్పిడి నుండి తమ మతస్తులను రక్షించడంపై దృష్టిని కేంద్రీకరించారు. ఆర్య సమాజికులు, సింగ్ సభ సిక్కులు ఏకమై, శుద్ధి కార్యక్రమాన్ని, దాని ఉపయోగాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. శుద్ధి కార్యక్రమం సర్వసామాన్యమై, మత సామరస్యానికి గొడ్డలిపెట్టుగా పరిణమించింది.

శుద్ధి కార్యక్రమం చేపట్టిన తొలి దినాల్లో ఆర్య సమాజం, సింగ్ సభ పూర్తి అవగాహనతో కలిసి పనిచేశాయి. లాహోర్ ఆర్య సమాజ కార్యదర్శిగా పనిచేసిన భాయి జవహర్ సింగ్, దయానందునితో పాటు పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించాడు. భాయి దిత్‌సింగ్‌గ్యాని, భాయి మాయా సింగ్, భగత్ లక్ష్మణ్ సింగ్ మొదలైన సిక్కు ప్రముఖులు ఆర్య సమాజ ఉద్యమంలో చేరారు. తర్వాతి కాలంలో ఆర్య సమాజికులు సిక్కు మతాన్ని విమర్శించడంవల్ల వారి మధ్య సదవగాహన బెడిసింది. సింగ్ సభ స్వయంగా ఇస్లాం, క్రైస్తవ మతాలు స్వీకరించిన సిక్కులను తిరిగి తమ మతంలోకి ఆకర్షించడానికి శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టాయి.

శుద్ధి కార్యక్రమం ప్రారంభమైన మొదటి రోజుల్లో వ్యక్తులు స్వచ్ఛందంగా హిందూ మతంలో తిరిగి చేరారు. తర్వాత బృందాలవారీగా శుద్ధి ప్రక్రియ ద్వారా హిందూ మతస్థులయ్యారు. శుద్ధి సభ 1896 మార్చి 31న 5గురిని, ఏప్రిల్ 5న 6గురిని హిందూ మతంలోకి మార్చడంలో విజయవంతమైంది. అప్పటినుండి నాయకులు సామూహిక శుద్ధి కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆగస్ట్ నెల్లో లాహోర్ శుద్ధి సభ, సిక్కు మత ఆచార ప్రకారం 200 మంది అంటరాని వారి కులాలకు చెందిన సిక్కులను శుద్ధి చేసింది. వారంతా ఒకే గ్రామవాసులు. ఈ ప్రయత్నం శుద్ధి ఉద్యమ నూతన లక్ష్యాన్ని తెలియజేస్తుంది. అంటరానివారు సవర్ణ హిందువులుగా మారారు. ఈ పరిణామాల వల్ల హిందూ - సిక్కు సంబంధాలు కొంతవరకు దెబ్బతిన్నాయి. ఈ రెండు మతస్థుల మధ్య శుద్ధి కారణంగా విభేదాలు తీవ్రరూపాన్ని దాల్చాయి. ఆర్య సమాజంపై భ్రమ తొలగిన తర్వాత విద్యాభ్యాసం చేసిన సిక్కులు ప్రత్యేక గర్తింపుకై ప్రయత్నించారు. దీని విషయంలో సిక్కులు, ఆర్య సమాజికుల మధ్య వివాదం చెలరేగింది. అతి వాద ఆర్య సమాజికులు గురునానక్‌ను, సిక్కు మతాన్ని విమర్శించారు. సిక్కులు హిందువులా, లేక వేరే మతస్థులా అన్న విషయంపై వాగ్వివాదాలు జరిగాయి. ఈ విషయంపై బహిరంగ సభల్లో, పత్రికల్లో, కరపత్రాల్లో చర్చ జరిగింది. భాయి జగత్ సింగ్, లాలాఠాకర్ దాస్ (Lala Thakar Das), బావ నారాయణ్ సింగ్ (Bawa Narain Singh) లు సిక్కులు హిందువులన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సర్దార్ కహన్ సింగ్ (Sardar Kahan Singh) "హమ్ హిందూ నహీ" (Ham Hindu Nahin) అనే పుస్తకంలో సిక్కులు, హిందువులు కాదని చెప్పాడు. ఈ తర్క వితర్కాలు కొనసాగి సిక్కు సమాజంలో గందరగోళాన్ని సృష్టించాయి.

జలంధర్ అంతర్వేదికి చెందిన రహతియాలు (Rohtias) వెలివేయబడ్డ (outcaste) ఒక సిక్కు వర్గం. వారిలో చదువుకున్నవారు తమ కుల సాంఘిక స్థాయిని పెంచాలన్న కోరికతో, ముందుగా సిక్కు మత నాయకుల సహాయాన్ని అర్థించారు. వారి నుండి ప్రోత్సాహం లభించనందున వారు ఆర్య సమాజికుల ఆశ్రయం పొంది, శుద్ధి తంతు పూర్తిచేసి వారిలో 200 మంది హిందూ మతంలో చేరారు. ఫలితంగా లాహోర్ సిక్కుల్లో కోపోద్రేకాలు పెల్లుబికాయి. వారు నిరసన సభలు నిర్వహించారు. ఆర్య సమాజికులను, రహతియాలను నిందిస్తూ తీర్మానాలు చేశారు. నిరాశచెందిన సిక్కులు ఆర్య సమాజికులతో ముఖాముఖి తలపడ్డానికే నిర్ణయించుకున్నారు.

హిందూ - సిక్కు సఖ్యత వేరొక పరిణామం వల్ల కూడా దెబ్బతింది. 1905లో విగ్రహారాధనను మత సిద్ధాంతాల నుండి తుడిచివేయాలని సిక్కు సంస్కరణ వాదులు ప్రయత్నించారు. ఈ ప్రయత్నాలను హిందువులు వ్యతిరేకించారు. అమృతసర్‌లోని స్వర్ణ దేవాలయం (Golden Temple) లో ఆచారంగా వస్తున్న హిందూ సంస్కారాలు నిర్వహించడం సిక్కు సంస్కరణ వాదులు అవమానంగా భావించారు, అవి సిక్కు మత విశ్వాసాలకు వ్యతిరేకమన్నారు. దేవాలయ నిర్వహణాధికారి (Manager) దేవాలయంలో విగ్రహాలు ఉండరాదని ఉత్తర్వులు జారీ చేశాడు. బ్రాహ్మణ పుజారులు దేవాలయ ప్రాంగణం నుండి తరిమివేయబడ్డారు. విగ్రహాలు తొలగించ బడ్డాయి. ఈ పరిణామాలవల్ల హిందువులు, సిక్కుల మధ్యగల పరిమిత సహకారం పూర్తిగా అంతరించింది.

రహతియాల విషయంలో ఎదురైన ఇబ్బందులు ఆర్య సమాజికులను నిర్వీర్యం చేయలేదు. వెలివేయబడ్డ వర్గాలవారిని క్రైస్తవ మత మార్పిడి నుండి రక్షించడానికే వారు దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. ముల్తాన్, ముజ జిల్లాల ఓడె (Ode) కులానికి చెందిన నాయకుల కోరిక మేరకు కొన్నివే ఓడె కుటుంబాలకు చెందిన వారిని బహిరంగ శుద్ధి కార్యక్రమం ద్వారా ఆర్య సమాజికులు సంస్కరించారు. ఒక దశాబ్ది కాలంలో 23,000 మంది ఓడెలు హిందూ మతంలో తిరిగి చేరారు 1903-1909 మధ్య సియాల్‌కోట్ ఆర్య సమాజం 36,000 మేఘులు (Meghs), తర్వాత హిమాలయ పర్వతాల దిగువ భాగాల్లో నివసించే 1,400 దొమ్మ (Domme) కులస్థులు శుద్ధిచేయబడి, హిందూ సమాజ సభ్యులుగా చేరారు. 1905లో సింధ్ ఆర్య సమాజం లార్ఖానా షేక్‌లను శుద్ధిచేసే కార్యక్రమాన్ని చేపట్టింది. వారంతా తక్కువ కులాలకు చెందిన ముస్లింలు. శుద్ధి కార్యక్రమం ద్వారా వారంతా హిందూ మతంలో చేరారు. 1907-1910 మధ్యకాలంలో సంయుక్త రాష్ట్రాలు (United Provinces), బరోడా, మధ్య పరగణా (Central provinces) లకు చెందిన రాజపుత్రులను శుద్ధి చేశారు. రాజపుట్ శుద్ధి సభ 1910 నాటికి 1,052 మంది ఇస్లాం మతం స్వీకరించిన రాజపుత్రులను హిందూ మతంలో తిరిగి చేర్చుకుంది.

అంటరానివారిని హిందూ మతంలో చేర్చుకునే కార్యక్రమానికి ఉన్నత కులాలకు చెందిన సనాతనుల నుండి గట్టి వ్యతిరేకత వచ్చింది. వారు శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్న ఆర్య సామాజికులను భయపెట్టారు. దౌర్జన్యం చేశారు. వారిపై న్యాయస్థానాల్లో దావాలు వేశారు. సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. కొంతకాలానికి సంఘీభావం అవసరం అన్న సత్యాన్ని గుర్తించిన సనాతనులు తమ విధానాన్ని మార్చుకున్నారు.

మత కారణాలవల్ల హిందూ, ఇస్లాం మతస్థుల మధ్య ఉద్రిక్తతలు, హింసాకాండ 1926, 1927లలో బాగా పెరిగాయి. స్వామి శ్రద్ధానంద 1926లో హత్యకు గురయ్యాడు. దీనికితోడు మొహరం ఉత్సవ సందర్భంగా 1927లో బరెల్లీ పరిసరాల్లో మతపరమైన సంఘర్షణలు జరిగాయి. ఆర్య సమాజ సభ్యులపై అల్లరిమూకలు దాడి చేసి, వారి ఆస్తులకు అపార నష్టం కల్గించాయి. ఈ నేపథ్యంలో అల్లరిమూకలను తిప్పికొట్టడానికి ఆర్య రక్షా సంఘం (Aryan Defence Committee), ఆర్య వీరదళ్ (Aryan Army) అను రెండు కొత్త సంస్థలను ఆర్య సమాజికులు ఏర్పాటు చేశారు. వీరదళ్ శాఖలు చాలచోట్ల వెలశాయి. ఈ దళం సామాన్య ప్రజలకు అనేక విధాల సహాయపడింది. అనేక సందర్భాల్లో ముఖ్యంగా హైదరాబాద్‌లో సత్యాగ్రహ పోరాటం ఆరంభమైన నాటి నుండి దేశ విభజన తర్వాత పంజాబ్‌లో చెలరేగిన అల్లర్ల వరకు సహాయపడ్డారు. 1930 నాటికి ఆర్య సమాజ కార్యక్రమాలపై ముస్లిం రాష్ట్రాలైన హైదరాబాద్, భోపాల్, భహవల్‌పూర్, రాంపూర్‌లలో ఆంక్షలు విధించాయి. 1938లో హైదరాబాద్‌లో ఆర్య సమాజం నిర్వహించిన సత్యాగ్రహ ఉద్యమం మరుసటి సంవత్సరం నైజాం ప్రవేశపెట్టిన సంస్కరణలతో ముగిసింది. వింధ్య పర్వతాలకు దక్షిణాన కేవలం కొన్ని ప్రాంతాల్లో మత సంఘర్షణలు జరిగినపుడు మాత్రమే, ఆర్య సమాజ భావజాలానికి, వ్యూహానికి ప్రజల ఆమోదముద్ర లభించింది.

### 16.3.5 ఆర్య సమాజం : బ్రిటిష్ ప్రభుత్వం

ఆర్య సామాజికుల బ్రిటిష్ వ్యతిరేక రాజకీయ కార్యకలాపాలకు దయానంద ఆంగ్లో - వేదిక్ పాఠశాలలు, కళాశాల కేంద్రాలు విద్యార్థులు, అధ్యాపకులు రాజకీయ ఆందోళనలకు నాయకత్వం వహించారు. రాజకీయ చైతన్యంగల నాయకులంతా లాలాలజపతి రాయ్‌తో కలిసి పనిచేశారు. 1907లో బ్రిటిష్ ప్రభుత్వం లజపతి రాయ్‌ను దేశం నుండి బహిష్కరించి బర్మాకు పంపివేసింది. 1908 అక్టోబర్‌లో పాటియాలాకు చెందిన 84 ఆర్య సమాజ సభ్యులను అరెస్ట్ చేసి, వారిపై రాజద్రోహ నేరం మోపింది. పాటియాలాకు చెందిన ప్రముఖ ఆర్య సమాజ నాయకులందరూ ప్రభుత్వ చర్యకు గురయ్యారు. వారి కార్యాలయాలను, ఇళ్లను ప్రభుత్వం సోదా చేయించింది. సాహిత్యాన్ని స్వాధీన పరచుకుంది. ప్రభుత్వ అణచివేత చర్యలు ఆర్య సామాజికులను భయభ్రాంతులను చేసింది.

## 16.4 దేవ సమాజం - ఆర్య సమాజం

సంస్కరణోద్యమ నాయకత్వానికై కొత్తగా రంగప్రవేశం చేసిన పండిట్ అగ్నిహోత్రి ఆర్య సమాజ్‌తో పోటీ పడ్డాడు. 1887లో అగ్నిహోత్రి దేవ సమాజాన్ని స్థాపించాడు. తిరుగులేని మత గురువుగా ఎదిగిన తర్వాత ఆర్య సమాజ్‌పై సమరం ప్రారంభించాడు. 1877-78లో వ్యక్తిగతంగా దయానందునితో ఘర్షణకు దిగాడు. అప్పటి నుండి దయానందుని, ఆర్య సమాజాన్ని తన శాశ్వత శత్రువులుగా భావించాడు. ఉపన్యాసాల ద్వారా, కర పత్రాల ద్వారా, 'బిరాదర్-ఇ-హింద్' (Biradar-i-Hind) మాసపత్రిక ద్వారా తన వ్యతిరేకతను స్పష్టపరచాడు.

దేవ సమాజ స్థాపనలో అగ్నిహోత్రి, దయానందుని అనుచరుల మధ్య వైరం మరింత పెరిగింది. 1888-1892 మధ్య కాలంలో ఆ రెండు వర్గాల మధ్య కరపత్రాల యుద్ధం చెలరేగింది. ఆర్య సమాజాన్నీ, దయానందునీ దూషిస్తూ 18 చిన్ని గ్రంథాలను (tracts), వార్తాపత్రికల్లో అనేక వ్యాసాలను రాశాడు. దయానందుడు అవినీతి పరుడనీ, మోసగాడని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశాడని, వేదాలను తప్పుగా ఎరుకపరిచాడని నిందించాడు. లాలారాధ్‌కిషన్ మెహతా, దుర్గాప్రసాద్, లాలా మురళీధర్ మొదలైన ఆర్య సమాజ్ సభ్యులు తిరిగి దాడులను నిర్వహించారు. 1892 తర్వాత వారి మధ్య వాగ్వివాదాలు తగ్గి, క్రమంగా వైరం సమసిపోయింది.

## 16.5 పండిట్ శ్రద్ధారామ్

పంజాబ్‌లో హిందూ సనాతనుల మొట్టమొదటి నాయకుడు పండిట్ శ్రద్ధారామ్. సనాతన హిందూ మత రక్షకుడుగా వ్యవహరించాడు. క్రైస్తవ మతం నిస్సారమైందని, అశ్లీలమైందని వర్ణించాడు. క్రైస్తవ మతంలో మద్యం, మాంసం సులభంగా లభిస్తాయని అవహేళన చేశాడు. 1872-73లో శ్రద్ధారామ్ అమృతసర్ సందర్శించి, అక్కడ ఆనంద సంస్కరణ వివాహాల పద్ధతికి వ్యతిరేకంగా ఉపన్యసించాడు. ఇస్లాం మతానికి చెందిన కసాయి వారిని చంపమని ప్రజలను రెచ్చగొట్టాడు. కలత చెందిన ఒక సిక్కు సభ్యుడు సిక్కు గురువుల పవిత్రతను భంగం చేస్తున్నాడని కేకలువేస్తూ శ్రద్ధారామ్‌పై దాడికి ఉపక్రమించగా, 2రక్షకభటుల సహాయంతో బయటపడ్డాడు. హిందూ మత పునర్నిర్మాణానికి దయానందుడు ఇచ్చిన పిలుపుకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు.

## 16.6 సింగ్ సభ

1873లో అమృతసర్‌లో సింగ్ సభ ఏర్పడింది. సిక్కు మతానికి చెందిన యువకులు క్రైస్తవులుగా మారి పోవడంవల్ల భయపడి, ఒక సిక్కు వర్గం ఈ సభను ఏర్పాటు చేసింది. సిక్కు మత పూర్వ పవిత్రతను తిరిగి పునరుద్ధరించడం ఆ సభ ముఖ్యోద్దేశం.



BRAOU

అమృతసర్ సింగ్ సభకు నాయకత్వం వహించడానికి 1879లో సిక్కు జాతీయుల నుండి పోటీ వచ్చింది. గురుముఖ్ సింగ్ (1849-98), భాయిదిత్ సింగ్ (1853-1901)ల నాయకత్వంలోగల లాహోర్ సింగ్ సభ పోటీ పడింది. అమృత్‌సర్, లాహోర్ సభల ప్రధాన లక్ష్యాలు ఒక్కటే. అయితే లాహోర్ సభకు తీవ్ర వాద భావాలు ఉన్నాయి. సాంఘిక, మత సంస్కరణల విషయాల్లో సొంత 'కలశా దివాన్' (సిక్కు కౌన్సిల్)ను ఏర్పాటు చేసింది. తొలిరోజుల్లో లాహోర్ సభ, ఆర్య సమాజంతో సత్సంబంధాలు పెట్టుకుంది. సిక్కు యువకులు కొందరు ఆర్య సమాజ సభ్యులయ్యారు. సింగ్ సభకున్న లక్ష్యాలన్నీ ఆర్య సమాజంలో ఉన్నందున, దయానందుడు సిక్కు మతాన్ని విమర్శించాడు. 1888న నవంబర్‌లో లాహోర్ ఆర్య సమాజ వార్షిక ఉత్సవాల సందర్భంలో పండిట్ గురుదత్ సిక్కు మతాన్ని ఆక్షేపించి, గురునానక్ గొప్ప వంచకుడని ముద్ర వేశాడు. లేఖరామ్, లాలామురలీధర్‌లు కూడా సిక్కు మతాన్ని దూషించ నారంభించారు. పర్యవసానంగా ముగ్గురు విద్యావంతులైన సిక్కు యువకులు భాయ్ జవహర్‌సింగ్, భాయ్ దిత్‌సింగ్ గ్యాని, భాయ్ మాయా సింగ్ - ఆర్య సమాజాన్ని విడిచిపెట్టి, లాహోర్ సభలో చేరారు. ఈ ముగ్గురూ సిక్కు మతానికి గొప్ప అండగా నిలిచి, ఆర్య సమాజం నుండి విమర్శలు రాకుండా అడ్డుకోగలిగారు. కాని ఆర్య సమాజ - సిక్కు సంబంధాలు శుద్ధి కార్యక్రమం విషయంలో కరపత్రాల యుద్ధాన్ని వదలి, సహకరించు కొనే మార్గంలో నడిచాయి. ఈ అవగాహన ఎంతో కాలం కొనసాగలేదు.

## 16.7 గో రక్షణ

హిందూ మత పునరుజ్జీవనోద్యమం పాత సిద్ధాంతాలు; ఆచారాల అవసరాన్ని ఉద్ఘాటించి విదేశీ అంశాలు లేని కొత్త భారత సంస్కృతి పట్ల అభిమానం పెంచింది. అటువంటి క్రియాశీల కార్యక్రమంలో గో సంరక్షణ, హిందీ - ఉర్దూ వివాదం ముఖ్యమైనవి. అవి హిందూ - ముస్లిం విభేదాలను తీవ్రతరం చేశాయి.

హిందూ - ముస్లింల మధ్య సంబంధాలు క్షీణించడానికి గో రక్షణ సమస్య అత్యధికంగా దోహదపడింది. గో సంరక్షణ సమస్య మొదట పంజాబ్‌లో రంజిత్ సింగ్ కాలంలో ప్రారంభమైంది. అక్కడ గోవులను వధించిన వారిని నేరస్థులుగా పరిగణించి, వారికి మరణ దండన విధింపబడుతుందని సింగ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంజాబ్‌ను విలీనం చేసినపుడు బ్రిటిష్ ప్రభుత్వం ఈ నిషేధాన్ని తొలగించింది. ఈ చర్యవల్ల హిందువులు, సిక్కులు కోపోద్రిక్తులయ్యారు. ముస్లింలు మాత్రం తమ హక్కుకు గుర్తింపు లభించిందని సంతోషించారు. ఆర్య సమాజ స్థాపన జరిగిన తర్వాత దయానందుడు అనేక ప్రాంతాల్లో గో రక్షణ సభలు ఏర్పాటు చేశాడు. జీవ కారుణ్యం గురించి ప్రచారం చేశాడు. అతని మార్గాన్ని ఆర్య సమాజికులనేకులు అనధికారికంగా అనుసరించారు. వారు గో రక్షణ నిధిని ఏర్పరచారు. గో రక్షణ శాలలను నెలకొల్పి, గోవధ నిషేధానికై ఉద్యమాన్ని 1887 తర్వాత ఉధృతం చేశారు. మాంసభక్షణ అవినీతికరమైందని దుర్గాప్రసాద్, లాలా ఆత్మారాం, లాలా మున్షీరాంలు కరపత్రాల ద్వారా ఖండించారు. పెషావర్, జలంధర్ మొదలైన గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్య సమాజికులు మాంసాహారులకు సమాజ్‌లో సభ్యత్వం నిరాకరించారు. అనేక రాజవంశీయులు, జమీందారులు ఈ ఉద్యమానికి తమ మద్దతు అందించారు. సిక్కుల్లో ఖైనీ (లూధియానా) కు చెందిన నామధారులు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు.

దురదృష్టవశాత్తు అమితోత్సాహంతో కూడిన ఉద్యమం ఒక ప్రక్క, దానివల్ల ఏర్పడ్డ ఉద్రిక్త వాతావరణం మరొక ప్రక్క, హిందూ - ముస్లింల మధ్య ప్రదర్శనలకు, సంఘర్షణలకు దారితీశాయి. 1881లో ముల్తాన్‌లో కొట్లాట జరిగింది. ఆ సంఘటన తర్వాత చాలా సంవత్సరాలు దేశంలోని పలు ప్రాంతాల్లో శాంతికి భంగం వాటిల్లింది. సర్వత్రా అశాంతి తాండవించింది. 1893లో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, బొంబాయిల్లో మత కలహాలు చెలరేగాయి.

BRAOU

నామధారీ ఉద్యమ నిర్మాత బాబా రామ్‌సింగ్ కుల విభేదాలను నిషేధించాడు. ప్రధానంగా కర్షకులు, అస్పృశ్య కులాలకు చెందిన వారిని ఆకర్షించి, వారిని క్రమశిక్షణగల మంచి జాతిగా మలచాడు. 1871 నాటికి నామధారుల సంఖ్య లక్షకు పెరిగింది. పంజాబ్ ప్రభుత్వం రామ్‌సింగ్ దృక్పథాన్ని అనుమానించి, 1863 జూన్‌లో తన స్వగ్రామంలోనే నిర్బంధించి 1866 చివరి వరకు నిర్బంధంలోనే ఉంచింది. ఫలితంగా ఊహకందని విధంగా నామధారీల ఉద్యమం ఉధృత రూపం దాల్చింది. సమరశీల అతి వాద కార్యక్రమాల పంజాబ్ ప్రభుత్వం వారిపై నిఘా ఏర్పాటు చేసింది. బ్రిటిష్ ఇండియా సైన్యంలోని సిక్కు సైనికులకు నామధారీల బోధనలు చేరకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంది.

గో రక్షణ విషయంలో నామధారులకు, బ్రిటిష్ ప్రభుత్వానికి మధ్య ఘర్షణ అనివార్యమైంది. పశువుల మాంసం బ్రిటిష్‌వారికి, పంజాబీ ముస్లింలకు ప్రధాన ఆహారం. ముస్లింల 'ఈద్' ఉత్సవాల సందర్భంగా పశువులను బహిరంగంగా చంపడం, బలిగా ఇవ్వడం చేశారు. ఈ దురాచారాన్ని హిందువులు, సిక్కులు తీవ్రంగా వ్యతిరేకించారు. పశు వధశాలలు, మాంస విక్రయశాలలు ఎక్కడ ఉన్నా, అవి అక్రమమని ప్రకటించారు. కూకాలు (Kukas)పశు వధను మాన్పించెదమని, గోవులను రక్షించెదమని శపథం చేశారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని అమృత్‌సర్, రాజ్‌కోట్‌లలో 1871 జూన్, జులై నెలల్లో గోవులను వధించిన నేరస్తులను పట్టుకొని చాలమందిని చంపివేశారు. ఈ పరిణామాలకు విభ్రాంతి చెందిన బ్రిటిష్ ప్రభుత్వం 8 మంది కూకాలను పట్టుకొని ఉరితీసింది, 5 గురికి జీవిత ఖైదు శిక్ష విధించింది. అయినా ఈ సమస్య చల్లారలేదు. 1872 జనవరిలో సుమారు 125 మంది మెలార్ - కోట్లాలోగల ముస్లిం కసాయివాళ్లపై దాడి చేశారు. ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మెలార్ కొట్కాకు చెందిన 8 మంది పురుషులు మరణించారు. 15 మంది క్షతగాత్రులయ్యారు. బ్రిటిష్ ప్రభుత్వ యంత్రాంగం వెంటనే లూధియానా డిప్యూటీ కమీషనర్ యల్. కొవన్ (Cowan) ను పంపి నామధారులను నిర్బంధించింది. వారిని తిరుగుబాటుదారులుగా ప్రకటించి, 65 మందిని ఉరితీసింది. రామ్‌సింగ్, అతని 11 ఉప నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లి బర్మా చేరుకున్నారు. మరో 50 సంవత్సరాల వరకు బ్రిటిష్ ప్రభుత్వం నామధారులను, వారి చర్యలను జాగ్రత్తగా కనిపెడుతూనే ఉంది. వారిపై నిషేధం 1922లో తొలగిపోయింది. బ్రిటిష్ రాజకీయ అధికారాన్ని సవాలుచేసిన నామధారులు అణచివేతకు గురయ్యారు.

## 16.8 హిందీ - ఉర్దూ వివాదం

మత సామరస్యానికి, జాతి ఐక్యతకు హిందీ - ఉర్దూ వివాదం వల్ల కూడా గట్టి దెబ్బ తగిలింది. 1867 నాటికే ఉర్దూ భాషను తొలగించి, దాని స్థానంలో హిందీని పాలన భాషగా ప్రవేశపెట్టాలని హిందువులు వత్తిడి చేయడం ప్రారంభించారు. బెనారస్‌కు చెందిన బాబూ శివప్రసాద్ ఒక ముద్రణాయంత్రాన్ని సంపాదించి హిందీని వాడుక భాషగా చేయాలనే ఉద్యమాన్ని నిర్వహించాడు. 19వ శతాబ్దం రెండో అర్థభాగంలో ఉర్దూ స్థానంలో హిందీని ప్రవేశపెట్టాలనే వత్తిడి పెరిగింది. ఈ ఉద్యమంవల్ల తమ ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ముస్లింలు భావించారు. న్యాయస్థానాల్లోను, పోలీస్ స్టేషన్లలోను, జమీందారులవద్ద పనిచేసే నౌకర్లలోను, వ్యవసాయమే జీవనోపాధిగా గల ముస్లింల్లోను ఈ భయభ్రాంతులు ఏర్పడ్డాయి. కారణం వారికి ఉర్దూ మాత్రమే తెలుసు, జీవనాధారం పోతుందనే భయం వారికి కల్గింది.

బ్రిటిష్ ప్రభుత్వాధికారులనేకులు హిందీని అభివృద్ధి చేయాలనే ఆశయంతో పనిచేశారు. 1872లో మధ్య పరగణాలకు చెందిన 9 జిల్లాలలో గల న్యాయస్థానాల్లో అధికార భాషగా హిందీని ప్రవేశపెట్టారు. ఆ తర్వాత సంవత్సరమే బీహార్‌లోని దిగువ న్యాయస్థానాల్లో హిందీ అధికార భాషగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1881 నాటికి మధ్యప్రదేశ్ అంతటా ఉర్దూతో సమాన హోదా హిందీకి అధికారులు కల్పించారు.

ఈ ఏర్పాట్ల ఫలితంగా హిందూ - ముస్లిం మతస్థుల మధ్య అగాధం మరింత పెరిగింది.

## 16.9 ఇస్లాం మత సంస్కరణలు : ఇబ్బందికర పరిణామాలు

అహ్మదీయ ఉద్యమ నాయకుడైన మీర్జా గులాం అహమ్మద్ ఇస్లాం మూల సిద్ధాంతాలను వివరిస్తూ, ఆ మతాన్ని పటిష్టపరచడానికి కృషిచేశాడు. ఇస్లాం, ఇస్లామేతర మత నాయకుల మత సిద్ధాంతాలను పూర్తిగా తిరస్కరించాడు. కాడియాన్‌లో గల ఆర్య సమాజ సభ్యులతో ప్రత్యక్షంగా ఘర్షణకు దిగాడు. హిందూ మత ఔన్నత్యం గూర్చి బహిరంగ చర్చల్లో పాల్గొనమని దయానందుని సవాలు చేశాడు. 1908లో మరణించే వరకూ ఆర్య సమాజ్‌తో ఇతని ఘర్షణ కొనసాగింది. ముఖ్యంగా దయానందుని 'నియోగ్' సిద్ధాంతాన్ని 1895లో ప్రచురించిన 'రాడ్-ఇ-నియోగ్' (నియోగ్‌ను తిరస్కరించుట) అనే గ్రంథంలో ఖండించాడు.

ఇతర మతస్థులతో పెట్టుకున్న గొడవలతో మీర్జా గులాం అహమ్మద్ కాలం వెళ్లబుచ్చాడు. ముఖ్యంగా కొత్తగా క్రైస్తవ మతం స్వీకరించిన పంజాబీ క్రైస్తవుకు అబ్దుల్లా అసీమ్‌లకు మధ్య 1893 మే, జూన్ నెల్లో జంధియాలా గ్రామం వద్ద జరిగిన బహిరంగ వివాదం 15 రోజులు కొనసాగింది. క్రీస్తు శిలువపై మరణించలేదని, 120 సంవత్సరాలు బ్రతికాడని వాదించాడు. క్రీస్తు మానవ మాత్రుడనీ, ఒక ప్రవక్త మాత్రమేనని, భగవంతుని కుమారుడు మాత్రం కాదనీ వెల్లడించాడు. అహమ్మద్ అభిప్రాయాలకు క్రైస్తవ మత నాయకులు అనేక గ్రంథాల నుండి ఉదాహరిస్తూ ఉపన్యాసాల ద్వారా తిరస్కరించాడు. దుందుడుకు స్వభావంగల అహమ్మదీయ ఉద్యమం హిందువులు, సిక్కులు, క్రైస్తవులతో ప్రత్యక్షంగా విరోధం తెచ్చుకొంది. దాని ప్రధాన లక్ష్యం మత మార్పిడిని ప్రోత్సహించడం.

## 16.10 సయ్యద్ అహ్మద్ ఖాన్ – ముస్లిం సాంప్రదాయ వాదులు

ముస్లిం జాతిని సమర్థించి దాన్ని మరింత శక్తిమంతం చేయడానికి సంకల్పించిన అహ్మద్ ఖాన్ ప్రయత్నాలకు మధ్య మధ్య ఆటంకాలు ఎదురయ్యాయి. పరిపాలనా బాధ్యతలు స్వీకరించడానికి బ్రిటిష్‌వారి సహాయ సహకారాలతో పాలించగలిగే యోగ్యం గల ముస్లిం శిష్టజన (elite) వర్గాన్ని తయారుచేయాలని సయ్యద్ అహ్మద్ ఖాన్ కృషిచేశాడు. ఆ వర్గం ఉలేమాల సహాయాన్ని స్వీకరించడం ఆయనకు ఇష్టం లేదు. మత ప్రాతిపదికపై నిర్వచించబడ్డ ముస్లింల పరిస్థితి గురించే ఆయన ఆందోళన చెందాడు. సమాజంలో ముస్లింలను ఒక ప్రత్యేక వర్గంగా భావించడంవల్ల, సయ్యద్ అహ్మద్ ఖాన్ భారత జాతీయ కాంగ్రెస్ (Indian National Congress) ను తిరస్కరించాడు. తీవ్రవాద హిందూ మత తత్వాన్ని వ్యతిరేకించాడు. అందువల్ల మతపరమైన జాతీయ భావాన్ని రూపకల్పన చేయడానికి పునాదులు వేయాల్సి వచ్చింది. ముస్లింలు పాశ్చాత్య విద్యాభ్యాసం చేయాలని ఆయన చేసిన సూచనను సనాతన ముస్లిం ఉద్యమ నాయకులు వ్యతిరేకించారు. మౌలానా అహ్మద్ రిజా ఖాన్ నాయకత్వం వహించిన ఉలేమాలు రాజీలేని విధానాన్ని అవలంబించారు.

సయ్యద్ అహ్మద్ ఖాన్ సాంప్రదాయ వాదుల కోపానికి గురయ్యాడు. అనేక ఫత్వాను సాంప్రదాయవాదులు జారీ చేశారు. సాంప్రదాయాలకు సయ్యద్ అహ్మద్ ఖాన్ వ్యతిరేకి అని ప్రకటిస్తూ వార్తాపత్రికలు, కరపత్రాలు పంచి పెట్టారు. ఉపన్యాసాల ద్వారా అనేక విధాల అహ్మద్ ఖాన్‌ను నిందించారు. చివరకు చంపుతామని కూడా బెదరించారు.

మత, రాజకీయ విషయాల్లో ముస్లింలు ముఠాలుగా చీలిపోయారు. కలకత్తాకు చెందిన నవాబ్ రసూల్‌యార్ ఖాన్, పశ్చిమోత్తర ప్రాంతానికి చెందిన నవాబ్ ఇమదత్ ఆలీ మొదలైన పండితులు సయ్యద్ అహ్మద్ ఖాన్ తీవ్ర



BRAOU

వాద ధోరణులను, వ్యాఖ్యానాలను తోసిపుచ్చారు. అహ్మద్ ఖాన్‌ను సమర్థించిన వారిలో సయ్యద్ అమీర్ ఆలీ, సయ్యద్ మెహిద్ ఆలీ, మౌల్వీ చిరాగ్ ఆలీలు ఉన్నారు. వీరందరికీ ఉదార భావాలున్నాయి. అయినా వారికి ముస్లిం జన సామాన్యంలో ఉలేమాలకు ఉన్న పలుకుబడి లేదు.

మత సంస్కరణోద్యమాల వల్ల లౌకికత్వం తాత్కాలికంగా దెబ్బతింది. ప్రజల్లో ఐక్యత, సోదర భావం నశించి మత వైషమ్యాలు పెరిగి హత్యలకు, దమనకాండకు దారితీశాయి. వివిధ వర్గాల మధ్య అవగాహన, సహకారం లోపించాయి. సంస్కరణోద్యమాలు ప్రచారం చేసిన భావాలు మరుగున పడ్డాయి. అందువల్ల మత సంస్కరణోద్యమ ప్రగతి ఆశించినంత వేగంగా ముందుకు సాగలేదు. ముఖ్యంగా రాజకీయ అవసరాల కారణంగా, లౌకికత్వ భావాల ప్రచారం ఊపు అందుకొంది.

## 16.11 సంగ్రహంగా

1. సాంఘిక, మత సంస్కరణలకు కృషిచేసిన బ్రహ్మ సమాజం సనాతన వర్గాల నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంది. సంస్కర్తలు అనేక కష్టాలకు గురయ్యారు.
2. ఆర్య సమాజ ప్రచార సరళికి సనాతనుల నుండి, క్రైస్తవ మిషనరీల నుండి, ముస్లిం నుండి ప్రతిఘటన ఎదురైంది. ముఖ్యంగా ఆర్య సమాజ కార్యకర్తల శుద్ధి కార్యక్రమం వివాదాలకు, హింసాత్మక సంఘటనలకు దారితీసింది. మతోన్మాద ముస్లిం లేఖరామ్‌ను హత్యచేశాడు.
3. దేవ సమాజ నాయకుడైన అగ్నిహోత్రి ఆర్య సమాజాన్ని, దయానందుని దూషించాడు.
4. పంజాబ్‌కు చెందిన హిందూ సనాతనుల నాయకుడు పండిట్ శ్రద్ధారామ్ శిక్కుమత గురువును అవహేళన చేయడం వల్ల రక్షకభటుల సహాయం కోరాల్సి వచ్చింది.
5. గో సంరక్షణ కార్యక్రమం సందర్భంగా బ్రిటిష్ రాజకీయ అధికారాన్ని సవాలుచేసి, ముస్లిం కసాయి వాళ్లపై దౌర్జన్యానికి దిగిన నామధారులు కఠినంగా అణచివేయబడ్డారు.
6. ముస్లిం మత సాంప్రదాయ వాదులు కూడా సయ్యద్ అహ్మద్ ఖాన్ సంస్కరణ కార్యక్రమాన్ని వ్యతిరేకించారు. ఖాన్‌కు వ్యతిరేకంగా ఫత్వాలు కూడా జారీ అయ్యాయి.

## 16.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. మత సంస్కరణ కార్యక్రమంవల్ల ఉత్పన్నమైన చిక్కులను గురించి సంక్షిప్తంగా రాయండి.
2. శుద్ధి కార్యక్రమం ఏ అవాంఛనీయ పరిణామాలకు దారితీసిందో వివరించండి.
3. ఆర్య సమాజ కార్యక్రమాల పర్యవసానాలు ఏమిటి?
4. ఇస్లాం మత సంస్కరణకు ఎదురైన వ్యతిరేకతను తెల్పండి?

**II. క్రింది ప్రశ్నలకు లఘు వాఖ్యలను రాయండి.**

1. ఆర్య సమాజ మతమార్పిడి విధానాన్ని చర్చించండి.
2. నామధారుల కార్యకలాపాలను తెల్పండి.

## 16.13 ఉపయుక్త గ్రంథాలు


David Kopf : **British Orientalism and the Bengal Renaissance.**

Farquhar, J.N. : **Modern Religions Movements in India**

Heimsath, Charles H. : **Indian Nationalism and Hindu Social Reform.**

Jones, Kenneth W. : **Arya Dharm : Hindu Consciousness in 19th century.**

**The Combridge History of India** Vol. III-1,

**Socio-religious reform movements in British India**

Joshi, V.C. : **Rammohan Roy and the process of Modernisation in India.**

Majumdar& Bimanbehari : **History of Indian Social and political Ideas from Rammohan to Dayananda.**

Narain, V.A. : **Social History of Modern India.**

Natarajan, S. : **A Century of Social Reform in India.**


**రచయిత : ఆచార్య బి. కేశవనారాయణ**

BRAOU

# ఖండం : V

# సంఘ సంస్కరణలు

మత సంస్కరణల కార్యక్రమంలో సాంఘిక సంస్కరణ ఒక అంశం. మహిళల విమోచనకై సంస్కర్తలు, సాంఘిక సేవకులు, ప్రభుత్వం చేసిన కృషి బొంబాయి, మద్రాస్, కేరళలో ఆవిర్భవించిన కుల ఉద్యమాలు, అస్పృశ్యతకు వ్యతిరేకంగా జరిగిన పోరాట విషయాలను గురించిన వివరాలు ఈ ఖండంలో తెలుసుకోగలరు. ఉద్యమాలను నిర్వహించిన నాయకుల సాంఘిక దృష్టిని గురించి కూడా ఇందులో ఉన్నాయి.

BRAOU

BRAOU

# భాగం - 17 : మహిళా విమోచన

విషయక్రమం


17.0 లక్ష్యాలు

17.1 పరిచయం

17.2 మహిళల స్థితిగతులు

17.3 బ్రిటిష్ పాలన - మారిన సామాజిక స్వరూపం

17.4 అఖిల భారత మహిళా మహాసభ (All India Women's Conference)

17.5 స్త్రీ విద్యా వ్యాప్తి

17.6 సతీ సహగమన నిషేధం

  17.6.1 రాజా రామ్‌మోహన్ రాయ్ కృషి

  17.6.2 క్రైస్తవ మిషనరీలు

  17.6.3 1829 పూర్వం ప్రభుత్వ చర్యలు

  17.6.4 బెంటింక్ శాసనం

17.7 శిశు హత్యలు (Infanticide)

17.8 బానిసత్వ నిర్మూలన

17.9 నరబలులు (Human Sacrifices)

17.10 వారసత్వ హక్కు

17.11 వితంతు పునర్వివాహ చట్టం, 1856

17.12 వివాహ వయోపరిమితి చట్టం, 1891

17.13 శారదా చట్టం

17.14 దేవదాసీల విమోచనా చట్టం, 1925

17.15 విడాకులు

17.16 దేశ విభజన తర్వాత కేంద్ర శాసనాలు

17.17 సంగ్రహంగా

17.18 పరీక్ష నమూనా ప్రశ్నలు

17.19 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 17.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల కింది విషయాలను గూర్చి తెలుసుకోగలగాలి.

- సమాజంలో స్త్రీల స్థితిగతులు, వారి సమస్యలు
- 19, 20 వ శతాబ్దాల్లో మహిళల విమోచనకై మత సంస్థలు, సంస్కరణ సంఘాలు, సంఘ సేవకులు చేసిన ప్రయత్నాలు
- ప్రభుత్వ పరంగా శాసనాల ద్వారా సతీ సహగమనం, నిర్బంధ వైధవ్యం, అతి బాల్య వివాహాలు మొదలైన సాంఘిక దురాచారాల నిర్మూలనకు జరిగిన కృషి

## 17.1 పరిచయం

ఆధునిక యుగంలో నూతనంగా ఏర్పడ్డ ఆర్థిక వాతావరణం, కొత్తగా స్థాపించబడ్డ ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ, ప్రజల్లో వ్యాపించిన విద్య, జాతీయతా భావం ప్రజలను చైతన్యవంతం చేశాయి. ఈ సంచలనాత్మక మార్పువల్ల అనేక శతాబ్దాలుగా సాంఘికంగా పురుషునికంటే తక్కువ హోదా కల్గి, అణచివేతకు గురై, అధోగతి పాలైన స్త్రీలను ఉద్ధరించడానికి, వారు స్వేచ్ఛగా జీవనం గడపటానికీ ఉద్యమం ప్రారంభమైంది.

## 17.2 మహిళల దుస్థితి

బ్రిటిష్ పాలనకు పూర్వం భారతీయ సమాజంలో స్త్రీలకు పురుషులతో సమానమైన స్థానం లేదు. చట్టపరంగా గాని, మతపరంగాకాని స్త్రీలకు సమాన హక్కులు, హోదా కల్పించబడలేదు. సమాజంలో వారికి న్యాయమైన గుర్తింపు, స్వేచ్ఛ లేనేలేదు. ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. అనేక రకాలుగా హింసలకు గురైనారు. సతీ సహగమనం, శిశుహత్యలు వంటి అనాగరిక ఆచారాలు ఉండటం వల్ల మానసికంగా, దైహికంగా భారత స్త్రీలు అనేక బాధలను అనుభవించారు. భర్త మరణిస్తే జీవించి ఉన్న వితంతు స్త్రీని భర్త చితిపై బలవంతంగా తోసి, సజీవ దహనం చేసేవారు. ఉన్నత కులాల్లో ఆడపిల్లల వివాహం చాల వ్యయ ప్రయాసలతో కూడిందని భావించి, వారి తల్లిదండ్రులు తమకు జన్మించిన బాలికలను జన్మించిన వెంటనే చంపేసేవారు. వితంతువులకు పునర్వివాహం నిషేధింపబడింది. జీవితాంతం వారు కఠిన బ్రహ్మచర్యం పాటించాల్సిందే. ఇవేగాక అతి బాల్య వివాహాలు, పరదా పద్ధతి, బహుభార్యాత్వం, దేవాలయాల్లో దేవదాసీ పద్ధతివంటి దురాచారాలు ఉండేవి. మహమ్మదీయులేగాక, హిందువుల్లో ఒక వర్గం వారు పర్దా పద్ధతిని పాటించేవారు. అవిద్య, అమాయకత్వం వారిలో సర్వసామాన్యంగా కనిపించేవి. బాలికల విద్యాభ్యాసాన్ని నిరుత్సాహపరచేవారు. తాము స్త్రీలుగా జన్మించడమే తమ కష్టాలకు, అనర్థాలకు కారణం అనే భావం అధిక సంఖ్యాకుల్లో ఏర్పడింది. ఇటువంటి హీన స్థితికి దిగజారిన స్త్రీ హోదా సమాజంలో మత సంబంధమైన ఆదేశాల కారణంగా పవిత్రత సంతరించుకుంది.

## 17.3 బ్రిటిష్ పాలన - మారిన సామాజిక స్వరూపం

భారతదేశంలో బ్రిటిష్‌వారి పాలన ప్రారంభమైన తర్వాత సాంఘిక వ్యవస్థలో ముఖ్యమైన మార్పు వచ్చింది. ఈ మార్పు కొత్తగా అభ్యుదయ పవనాలు వీచడానికి కారణమైంది. ప్రజల్లో ప్రజాస్వామిక విలువల అవసరాన్ని ప్రేరేపించింది. దేశంలో సుస్థిర రాజకీయ పాలన, వ్యక్తుల సమానత్వం, స్వేచ్ఛల ఆధారంగా న్యాయ వ్యవస్థ ఏర్పడింది. ఈ మారిన పరిస్థితులవల్ల పుట్టుకవల్ల వచ్చిన అన్ని అసమానతలకు, లింగ బేధాలకు, కులం, వర్గం

ఆధారంగా ఏర్పడ్డ అసమానతలకు తెరపడింది. చట్టం ముందు అందరూ సమానం అన్న సూత్రం అమల్లోకి వచ్చింది.

అయినప్పటికీ, భారత స్త్రీలు ఎదుర్కొంటున్న అన్యాయాలను, అసమానతలను, వారు అనుభవిస్తున్న బాధలను తొలగించడం ఒక సుదీర్ఘమైన ప్రక్రియ. సమాజంలో స్త్రీలకు పురుషులతో సమాన స్థాయి, గుర్తింపు సాధించాలంటే, అభివృద్ధి నిరోధకులైన సనాతనుల ప్రతిఘటనను వ్యతిరేకతను, పురాతన సాంఘిక కట్టుబాట్లను అభ్యుదయ భావాలుగల ప్రజలు ఎదిరించాల్సి ఉంది. బ్రిటిష్ ప్రభుత్వం తన తటస్థ విధానాన్ని విడిచిపెట్టి, పౌర హక్కుల విషయంలో స్త్రీకి పురుషునితో సమాన హక్కులను కలిగిస్తూ చట్టాలను చేసింది. ప్రభుత్వ విధానంలో మార్పుతేవటానికి సంప్రదాయ శృంఖలాబద్ధులైన స్త్రీలను చైతన్యవంతం చేయడానికి ఉద్యమాలు నిర్వహించాల్సి వచ్చింది.

విద్యావంతులైన పురుషులు కొందరు స్త్రీలను అణగద్రొక్కడానికి వీలు కల్పించే చట్టాన్ని, ఆచారాల్ని నిషేధించడానికి కృషి చేశారు. 20వ శతాబ్దంలో జాతీయోద్యమ ప్రభావం వల్ల స్త్రీలు ఉత్తేజం పొందారు. వారు స్త్రీ విమోచనోద్యమానికి శ్రీకారం చుట్టి, జాతీయ స్థాయిలో అఖిల భారత మహిళా మహాసభ, రాష్ట్రాల్లో ప్రాంతీయ మహిళా మహాసభలు నిర్వహించి, వాటిద్వారా ఉద్యమాన్ని ముమ్మరం చేశారు. ఈ ఉద్యమం చాల విజయాలను సాధించింది.

## 17.4 అఖిల భారత మహిళా సభ (All India Women's Conference)

1910-20 మధ్య కాలంలో మహిళాభ్యుదయానికై ఏర్పడ్డ సాంఘిక సంస్థల సంఖ్య పట్టణాల్లో గణనీయంగా పెరిగింది. మహిళా సమితులు, మహిళల క్లబ్బులు, స్త్రీ సమాజాలు అని వివిధ పేర్లతో అవి పిలువబడ్డాయి. మద్రాస్‌లో "భారత మహిళా సంఘం (Women's Indian Association) 1917లో స్థాపించబడింది. ప్రాంతీయ సంఘాలన్నీ దాని అనుబంధ సంస్థలుగా పనిచేశాయి. పదిసంవత్సరాల తర్వాత "అఖిల భారత మహిళా మహాసభ" (All India Women's Coference) ను మహిళలే ఏర్పాటు చేశారు. మహిళల్లో పెరుగుతున్న చైతన్యానికి ఇది నిదర్శనం. ఈమహాసభ స్త్రీల నైతిక, సాంఘిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేసింది.

అఖిల భారత మహిళా మహాసభ ప్రథమ సమావేశం పూనాలో 1927 సంవత్సరం జనవరి 5 నుండి 18 వరకు బరోడా మహారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో స్త్రీ విద్యా కార్యక్రమంపై సుదీర్ఘ చర్చ జరిగింది. సమావేశం ఏకగ్రీవంగా అనేక తీర్మానాలను ఆమోదించింది. బాలికలకు ప్రాథమిక విద్య నిర్బంధం చేయమనీ, వారికి ఉచితరీతిలో వ్యాయామ శిక్షణకు ఏర్పాట్లు చేయమనీ, 16 ఏండ్లలోపు బాలికల వివాహాలు నేరంగా పరిగణిస్తూ శాసనం చేయమని ప్రభుత్వాన్ని సమావేశం అభ్యర్థించింది.

అప్పటినుండి మహాసభ వార్షిక సమావేశాలు ఉన్నత, మధ్య తరగతి వర్గాలకు చెందిన స్త్రీలు ఏదో ఒక పట్టణంలో నిర్వహించారు. ఈ సమావేశాలకు ఒక ప్రత్యేకత ఉంది. స్త్రీలు మాత్రమే సమావేశాలకు అధ్యక్షతను వహించారు. వారి ప్రసంగాలు ఎందరినో ఉత్సాహపరిచాయి. మహాసభ వార్షిక సమావేశాలు మహిళల్లో చైతన్యం మరింతగా రేకెత్తించి, వారి జాగృతికి మూల కారణమయ్యాయి. హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ మతాలకు చెందిన స్త్రీలు కుల, మత వర్గ, జాతి విచక్షణ లేకుండా ఈ సభలకు హాజరయ్యారు. మార్గరెట్ ఇ. కజిన్స్ (Margeret E. Cousins) సరోజినీ నాయుడు, యస్. ముత్తు లక్ష్మిరెడ్డి, తిరువాన్కూరు మహారాణి సేతు పార్వతి బాయి, రాజకుమారి అమృత కౌర్, అరుణ అసఫాలీ, మండిమహారాణి లలితకుమారి సాహెబా, శారదా బెన్ మెహతా, లేడీ

మీర్జా యం. ఇస్మాయిల్, విజయలక్ష్మి పండిట్, కమలాదేవి ఛటోపాధ్యాయ, బేగమ్ సరిఫా హమీద్ ఆలీ (Sariffa Hamid Ali) దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌లు సమావేశాల్లో పాల్గొని, తమ లక్ష్య సాధన దశలో ఉద్యమాన్ని నడిపారు.

అఖిల భారత మహాసభ ప్రజల అభిప్రాయాలను సాంఘిక సంస్కరణకు అనుకూలంగా మలచడానికి ప్రయత్నించింది. బాల్య వివాహాలు, బహుభార్యత్వం, పరదా, వేశ్యావృత్తి, నిర్బంధ వైధవ్యం, వరకట్నం తదితర దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడింది. వితంతు వివాహాలు, స్త్రీలకు ఉచిత నిర్బంధ విద్య, స్త్రీల ఆస్తి హక్కును సమర్థించింది. స్త్రీలకు పారిశ్రామిక కేంద్రాలను స్థాపించి నిధులు సమకూర్చమని ప్రభుత్వాన్ని అర్థించింది. బాలికలకు 16 ఏండ్లు, బాలురకు 21 ఏండ్లు వివాహ వయస్సుగా నిర్ణయించాలని అంటరానితనాన్ని, మద్యపానాన్ని నిషేధించాలని, శాస్త్రీయ గర్భ నిరోధక పద్ధతులను ప్రచారం చేయమని, మహిళా డాక్టర్లను నియమించమని, స్త్రీ శిశు సంక్షేమ కేంద్రాలు స్థాపించమని, శారదా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయమని, కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో స్త్రీ వ్యతిరేక చట్టాలను అడ్డుకోడానికి స్త్రీలకు ప్రాతినిధ్యం ఉండాలని ఆందోళన జరిపింది. 1937లో నాగపూర్‌లో జరిగిన మహాసభ సామాజిక ప్రాముఖ్యతగల సంస్కరణలను ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాలను అభినందించింది. ఖాదీని ప్రచారం చెయ్యడానికి, పార్టీ రాజకీయాలతో సంబంధం లేకుండా, రాజకీయ కార్యకలాపాలు చేపట్టడానికి స్త్రీలను అనుమతించింది. దేశానికి కార్యక్రమాన్ని విడనాడి, నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టింది. స్త్రీల సమస్యలను పరిష్కరించడానికి శాసనాలు చేయమని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. పర్యవసానంగా మహిళాభ్యున్నతికి అనేక శాసనాలు చేయబడ్డాయి.

## 17.5 స్త్రీ విద్యావ్యాప్తి

బ్రిటిష్ వారికి పూర్వం స్త్రీలకు విద్యావకాశాలు లేవు. స్త్రీ విద్యకు చాలా గట్టి వ్యతిరేకత ఉండేది. వారికి కేవలం గృహసంబంధమైన బాధ్యతలే అప్పగించేవారు. బాలురకు గ్రామాల్లోనూ, పట్టణాల్లోను పాఠశాలలు ఉండేవి. కాని బాలికలకు మాత్రం విద్యాభ్యాసానికి తగిన సౌకర్యాలు ఉండేవి కావు. స్త్రీ విద్యకు హిందూ శాస్త్రాల అనుమతి లేదనే భావం సర్వత్రా వ్యాపించి ఉండేది. రాచరికపు కుటుంబ బాలికలకు మాత్రమే ప్రాథమిక విద్యావకాశాలు ఉండేవి.

19వ శతాబ్దంలో పునరుజ్జీవనోద్యమం స్త్రీ విద్యకు ప్రేరణ నిచ్చింది. ప్రభుత్వం శ్రద్ధ చూపని రోజుల్లో బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం, ఆర్య సామజం, రామకృష్ణ మిషన్, క్రైస్తవ మిషనరీలు, పార్సీ సంఘం మొదలైన మత సంస్కరణ సంస్థలు స్త్రీ విద్యావ్యాప్తికి ప్రయత్నం చేశాయి. జాతీయ సాంఘిక సమావేశం (Indian Social Conference) ప్రతి సంవత్సరం స్త్రీ విద్య ప్రాముఖ్యత, దాని అవసరం గురించి తీర్మానాలు చేసేది.

బాలికలకు విద్య అవసరం అన్న సత్యాన్ని ముందుగా పార్సీలు గుర్తించారు. కర్‌సెట్‌జీ నస్సర్‌వాన్‌జీ కామా (Curset Jee Nusser Wamjee Comma) మూడు బాలికల పాఠశాలలను నెలకొల్పడానికి సహాయపడ్డాడు. సర్‌జమ్ సెట్‌జీ జీజీభాయ్ మరో నాలుగు బాలికల పాఠశాలలు ప్రారంభించడంలో కీలక పాత్ర వహించాడు. పండిట్ ఈశ్వరచంద్ర విద్యాసాగర్, అనేక బాలికల పాఠశాలలను నెలకొల్పి, వాటి ఖర్చును తానే భరించాడు. 1865, 1871 లలో శశిపాద బెనర్జీ బాలికల పాఠశాలలను స్థాపించాడు. జనానా తరగతులను కూడా నిర్వహించాడు. ప్రత్యేకంగా స్త్రీలకై 1873లో కలకత్తా సమీపంలో స్థాపించబడ్డ ఉన్నత విద్యాసంస్థతో దగ్గర సంబంధం పెట్టుకున్నాడు. 1876లో దుర్గామోహన్ దాస్, ఆనందమోహన బోసులు వంగ మహిళా విద్యాలయాన్ని స్థాపించారు. 1890 నాటికి బెంగాల్‌లో బాలికల విద్యకు గల వ్యతిరేకత అంతరించింది.

స్త్రీ విద్యావ్యాప్తికి మరికొన్ని ఇతర సంస్కరణ సంఘాలు కూడా గట్టి ప్రయత్నాలు చేసాయి. 1876లో స్థాపించబడ్డ సెల్హిట్ సంఘం (Sylhet Union) అస్సాంలో ప్రయోగాత్మకంగా కొంత పనిచేసింది. ఆ సంఘం సాంవత్సరిక పరీక్షలను బాలికలకు, జనానా యువతులకు నిర్వహించింది. 1893కు పూర్వ సిల్హెట్ పరిసర ప్రాంతాల్లో వివాహితులైన యువతులు చదువు కొనసాగించడానికి అనుమతించేవారు కాదు. కాని క్రమేపీ పాఠశాలలకు వెళ్లే వివాహితల సంఖ్య పెరిగింది. 1890 - 91 మధ్య కాలంలో పూనాలో 'మహారాష్ట్ర మహిళా విద్యా సంఘం' (Maharashtra Female Educaion Society) నిర్వహణలో నాలుగు విద్యాలయాలు ఉండేవి. ఆ సంఘ పర్యవేక్షణలో స్థానిక బాలికలకు ఒక ఉన్నత పాఠశాల, మహిళా శిక్షణ కళాశాల, ప్రాథమిక పాఠశాల ఉండేది. బెంగాల్‌లో నెలకొల్పబడ్డ హితైషిణీ సభ ప్రధానంగా మహిళా విద్యావ్యాప్తికి కృషి చేసింది.

ఇవేగాక, 19వ శతాబ్దాంతానికి కలకత్తాలోని జె.ఇ.డి బెతూనె హిందూ బాలికా విద్యాలయం (Bethume Hindu Balika Vidyalam), అహ్మదాబాద్, పూనాల్లోగల బాలికోన్నత పాఠశాలలు, జలంధర్‌లోని ఆర్య సమాజ కన్యా మహావిద్యాలయం, లాహోర్‌లోని సింగ్ సభ వారి బాలికల పాఠశాల మైసూర్‌లోని మహారాణి బాలికల పాఠశాల తమవంతు స్త్రీ విద్యావ్యాప్తికి పనిచేస్తూండేవి. కాని స్త్రీ విద్య అప్పటికి చాల వెనుకబడి ఉంది. అయితే, స్త్రీలలో నైతిక విలువలను, మేధాసంపత్తిని పెంపొందించాల్సిన అవసరాన్ని దేశమంతా గుర్తించింది.

బ్రిటిష్ ప్రభుత్వం కంటే ముందుగా మహిళా విద్యావ్యాప్తికి స్వదేశీ సంస్థానాలు కృషిచేశాయి. ఈ సందర్భంగా ఆ ఖ్యాతి ముందుగా బరోడా సంస్థానానికి దక్కింది. బరోడా మహారాణి 1900 సంవత్సంలో విద్యాభ్యాసం చేస్తున్న 1600 మంది బాలికలకు బహుమతులను ప్రదానం చేసింది. బాలికల విద్యావ్యాప్తిలో బరోడా సంతృప్తికరమైన అభివృద్ధి సాధించిందనే సత్యం ఈ కింది పట్టిక తెల్పుతుంది.

| సంవత్సరం | బాలికల విద్యాలయాల సంఖ్య | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|
| 1875 | 2 | 22 |
| 1885 | 18 | 1408 |
| 1895 | 89 | 7,544 |
| 1900 | 108 | 9,151 |

(మూలం : (Sita Ram Singh : Nationalism and Social Reform in India 1968)

వీరేగాక 5880 మంది బాలికలు బాలుర పాఠశాలలకు హాజరయ్యేవారు జనానా తరగతుల్లో 368 ఉన్నారు. పరదా ఆచారం కారణంగా, ముస్లిం స్త్రీలు విద్యలో వెనుకబడి ఉన్నారు. కాని మిస్ లింబాయ్ ఫ్రాన్‌జీ (Miss Limbai Franjee), అబ్బాస్ త్యాబ్జీ, ఆయన సతీమణి చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలను ఇచ్చాయి. 1886 నుండి ప్రారంభమైన జనానా తరగతులవల్ల తీరిక సమయాల్లో వివాహితులైన యువతులు చదువుకోడానికి అవకాశం కలిగింది. కళాశాలలో చేరిన యువతులకు బరోడా మహారాజు ఉపకార వేతనాలిచ్చి ప్రోత్సహించారు.

బెనారస్‌లో 'భారతీయ మహిళా విద్యా సంస్థ' (Indian Women's Education Society) ను మిస్ ఫ్రాన్సిస్కా అరుండలే (Miss Francesca Arundale) నిర్వహించారు. తన శక్తి మేరకు భారత మహిళల్లో విద్యా వ్యాప్తికి కృషిచేయడమే దాని లక్ష్యం జాతీయ స్థాయిలో మహిళా విద్యావ్యాప్తి ప్రోత్సహించే వారి ప్రయత్నాల ఫలితమే. జూన్ 1916లో పూనాలో స్థాపించబడ్డ మహిళా విశ్వవిద్యాలయం దాని స్థాపన లో డి. కె. కార్వే పండితుడు కీలక పాత్రను వహించారు. దేశంలోనే మహిళా విద్యా కేంద్రాల్లో ఒకటిగా పూనా గుర్తింపు పొంది, స్త్రీలకు ఆశాదీపంగా వెలుగొందింది.

BRAOU

19వ శతాబ్దాంతంనుండి సయ్యద్ అహ్మద్ ఖాన్, ఇతర ముస్లిం నాయకులూ సమర్థించినప్పటికీ, ముస్లిం స్త్రీలలో విద్యా వ్యాప్తి మందకొడిగా సాగింది. ఈ పరిస్థితి క్రమంగా మారి, ముస్లింలలో చదువుకొనేవారికి సంఖ్య పెరిగింది.

20 వ శతాబ్దంలో ప్రభుత్వం విద్యా రంగానికి ఉదారంగానే ఆర్థిక సహాయాన్ని అందించింది. ఫలితంగా 1901-1912 మధ్య కాలంలో చదువుకొంటున్న బాలికల సంఖ్య 4,46,282 నుండి 9,54,616 కు పెరిగింది. 1917లో విద్యనభ్యసిస్తున్న బాలికల సంఖ్య 12,30,000. అది 1937 నాటికి 28,90,000 కి చేరింది. ఈవివరాలు స్త్రీ విద్యావ్యాప్తి క్రమంగా పెరిగిందనే నిజాన్ని రుజువు చేస్తాయి. భారతదేశంలో వ్యాపించిన పేదరికం వల్ల మహిళా విద్యావ్యాప్తి శీఘ్రగతిన సాగటానికి ప్రధాన ఆటంకమైంది. పేదరికం కారణంగా చమటోడ్చి పనిచేసే ప్రజలు ప్రధానంగా కార్మికులు, కర్షకులు విద్యా సౌకర్యాలను సక్రమంగా వినియోగించుకోలేకపోయారు. పేదరికమే వారిని విద్యకు దూరంగా ఉంచింది. రాజకీయ స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత సార్వజనిక విద్యకు ప్రత్యేక గుర్తింపు, ప్రోత్సాహం లభించింది. స్త్రీలలో విద్యా వ్యాప్తి కారణంగా వారు కఠోరమైన కట్టుబాట్లను ఛాందస వాదాన్ని, కుహనా సంప్రదాయాలను నిర్భీతిగా ఎదిరించారు.

## 17.6 సతీ సహగమన నిషేధం

క్రైస్తవ మత మానవతా సిద్ధాంతాలు జీర్ణించుకోడం వల్ల పాశ్చాత్య భావాలైన సామాజిక న్యాయం, సమానత్వంల ప్రభావం వల్లా మహిళల సంక్షేమానికి, అభివృద్ధికి సాంఘిక వ్యవస్థను సంస్కరించాలనే ఆలోచన విశాల దృక్పథం గల వారిలో కల్గింది. కొన్ని సందర్భాల్లో ఈ సంస్కరణ మత ఉద్యమాలైన బెంగాల్ బ్రహ్మ సమాజం, బొంబాయి ప్రార్థనా సమాజం, ఉత్తర భారతదేశంలోని ఆర్య సమాజాలతో ముడిపెట్టబడింది. ఘత సంస్కరణ ప్రయత్నాలు కఠోరమైన, కాలం చెల్లిన ఆచారాలను, అలవాట్లను పూర్తిగా నిర్మూలించాలని పోరాడుతూ, ఒక ప్రత్యేక సాంఘిక సంస్కరణోద్యమంగా అవతరించింది.

B R A O U

భారత సామాజిక పునర్నిర్మాణ కార్యక్రమంలో సతీ సహగమన నిషేధం ఒక ముఖ్యమైన అంశం. రాజా రామ్‌మోహన్ రాయ్ నాయకత్వంలో జాగృతమైన భారతీయులు అనుకూలంగా స్పందించడం, క్రైస్తవ మిషనరీల ప్రయత్నాలు, బ్రిటిష్ ప్రభుత్వం తీసుకున్న చట్టబద్ధమైన చర్యలవల్ల సతీ సహగమన నిర్మూలన సాధ్య పడింది.

### 17.6.1 రామ్‌మోహన్ రాయ్ కృషి

బ్రహ్మ సమాజ స్థాపనకు పది సంవత్సరాలకు ముందే రామ్‌మోహన్ రాయ్ సతీ సహగమన దురాచారాన్ని అంతమొందించేందుకు సంస్కరణ ఉద్యమాన్ని ఆరంభించాడు. 1811 నుండి 1829 వరకు అతి సామర్థ్యంతో వ్యక్తిగతంగా ఉద్యమాన్ని నడిపాడు. 1811లో తన జ్యేష్ఠ సోదరుడు జగన్మోహన్ మరణించినపుడు అతని భార్య బలవంతంగా సహగమనం చేయాల్సి వచ్చింది. ఈ దృశ్యాన్ని చూచిన రామ్‌మోహన్ రాయ్ చాలా గాఢంగా చలించాడు. ఈ సంఘటన అనంతరం ఆ దుష్ట సంప్రదాయాన్ని నిరోధించడానికి తీసుకున్న నిర్ణయానికి అప్పుడే బీజాలు పడ్డాయి.

1817లో హిందూ పూర్వాచార పరాయణులు కలకత్తాలో సతీ సహగమన ఆచారంపై ప్రభుత్వం విధించిన నిర్బంధాలను రద్దుచేయమని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రామ్‌మోహన్, కలకత్తా పురవాసులు కొంతమందితో కలసి సమర్పించిన ప్రతి విజ్ఞాపన పత్రంలో సతీ సహగమన సంప్రదాయాన్ని, శాస్త్రాలు ఆమోదించలేదని మత ధర్మశాస్త్రాల నుండి ఎత్తిచూపారు. సహగమనం అనే అంశంపై రామ్‌మోహన్ మొదట రాసిన "జీవించియున్న

వితంతువులను చితిపై కాల్చివేసే ఆచారానికి అనుకూల, ప్రతికూల వాదుల మధ్య సమావేశం. (A Conference between an Advocate for and an opponent of the Practice of Burning Widows Alive) అనే చిన్న గ్రంథాన్ని 1818 లో ప్రచురించాడు. 1822లో తన సంబంద్ కౌముది పత్రికలో 'మహిళల పురాతన హక్కులపై ఆధునికంగా అతిక్రమణ గురించి సంక్షిప్త సూచనలు' (Brief Remarks regarding Modern Encroachments on the Ancient Rights of Females) అను గ్రంథాన్ని ప్రచురించాడు. ఇంకో పుస్తకాన్ని 8132లో ప్రచురించి, వేదాలుగాని, మను ధర్మశాస్త్రం గాని, యాజ్ఞవల్క్యం గాని సతీ సహగమనాన్ని సమర్థించలేదని చాటాడు. తన రచనల్లో దురాచారాలను ఖండిస్తూ, వాటిని గూర్చి వివరంగా వర్ణించాడు. వితంతువులకు వంశపారంపర్యంగా వచ్చిన ఆస్తిని అనుభవించే హక్కు కలదని ప్రకటించాడు. ఈచర్యలన్నీ ధర్మసభ జరుపుతున్న ప్రచారాన్ని ప్రతిఘటించడానికి తీసుకున్నాడు.

సతీ సహగమన వ్యతిరేక పోరాటంలో రామ్‌మోహన్ ప్రధాన పాత్ర నిర్వహించాడు. ప్రభుత్వమే శాసనం ప్రజల్లో భయాందోళనలు కల్గించే అవకాశం ఉందనీ, పోలీసుల సహకారంతో సహగమన ఆచారాన్ని పరోక్షంగా అణచివేయవచ్చునీ రాయ్ అభిప్రాయపడ్డాడు. అయితే, సహగమనాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జారీచేసిన చారిత్రాత్మకమైన శాసనాన్నీ, ప్రభుత్వ నిర్ణయాన్ని రాయ్ బహిరంగంగా సమర్థించాడు. తాను ఇంగ్లాండు వెళ్ళి అక్కడ సహగమన నిషేధానికి వ్యతిరేకంగా సనాతనులు సమర్పించిన విజ్ఞాపన పత్రాన్ని ప్రివీ కౌన్సిల్ తిరస్కరించేలా చేశాడు కూడా.

### 17.6.2 క్రైస్తవ మిషనరీలు

శేరంపూర్‌లో డేనిష్ దేశస్తులు, చిన్‌చూరలో డచ్‌వారు, చందరనాగూర్‌లో ఫ్రెంచివారు తమతమ అధీనంలో గల ప్రాంతాల్లో సతీ సహగమనాన్ని నిషేధించారు. 1804లో శేరంపూర్ మిషనరీలు కలకత్తా పరిసర ప్రాంతంలో సహగమనానికి పాల్పడ్డవారి వివరాలను సేకరించి, 6నెలల వ్యవధిలో 300 మంది సహగమనం చేసినట్లు నమోదు చేశారు. శేరంపూర్ మిషనరీ విలియం కారే (Willian Carey) హిందూ పండితులను సంప్రదించాడు. ఈరకమైన సంప్రదాయాన్ని కొంతమంది స్వలాభపరులు ప్రోత్సహిస్తున్నారనే అభిప్రాయాన్ని పండితులు ఆయనకు తెలియజేశారు. తన దర్యాప్తు ఫలితాలను గవర్నర్ జనరల్ లార్డ్ వెల్లస్లీ కౌన్సిల్ సభ్యుడైన ఉడ్నీ (Udny) దృష్టికి తెచ్చాడు. ప్రభుత్వం చర్య తీసుకోడంలో ఆలస్యం చేసింది. కాని అతని కృషి కంపెనీ ఉద్యోగుల్లోను ఇంగ్లాండ్‌లోని బ్రిటిష్ వారిలోను ఈసమస్య విషయంలో కొంత అవగాహన, ఆసక్తి కల్గేటట్లు తోడ్పడింది. ప్రప్రథమంగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని సాంఘిక చట్టం చేయడానికి పురికొల్పిన ఘనత కారేకి దక్కుతుంది.

### 17.6.3 1829 పూర్వం ప్రభుత్వ చర్యలు

ఆంగ్ల పాలన ప్రారంభమైన కొన్ని దశాబ్దాల పాటు కంపెనీ ప్రభుత్వం భారతదేశానికి సంబంధించిన సాంఘిక, విద్య విషయాల్లో జోక్యం కలుగజేసుకోలేదు. 1789 నుండి బ్రిటిష్ ప్రభుత్వ దృష్టికి సతీ సహగమన విషయం వచ్చింది. ఈ సంవత్సరంలో షహబాద్ (Shahabad) కలక్టర్ యం. హెచ్ బ్రూక్ (M. H. Brooke) తాను ఒక సతీ సహగమనాన్ని బల ప్రయోగం ద్వారా నివారించినట్లు కారన్ వాలీస్‌కు తెల్పాడు. ఆ ఆచారాన్ని నిరోధించడానికి బలప్రయోగం కాని, ప్రభుత్వాధికారం కాని ఉపయోగించవద్దని, నచ్చచెప్పే మార్గం అనుసరించమని ప్రభుత్వం సూచించింది. సర్ జాన్ షోర్ ప్రభుత్వం ఈవిధానాన్నే అనుసరించింది.

సతీ సహగమనాన్ని అణచివేయడానికి లార్డ్ వెలస్లీ ప్రభుత్వం మొట్టమొదటి అతిముఖ్యమైన చర్య తీసుకుంది. ఈ ఆచారం హిందువుల మతాభిప్రాయాలకు అనుగుణంగా ఎంతవరకు ఉందో విచారించమని, ఎప్పటి నుండి ఆ ఆచారం అమల్లో ఉందో సమాచారాన్ని సేకరించమని వెలస్లీ ప్రభుత్వం నిజామత్ అదాలత్

(Nizamat Adalat)న్యాయ స్థానాన్ని 1805లో కోరింది. హిందూ శిక్షాస్మృతిని అనుసరించకపోతే, సతీ సహగమనాన్ని నివారించవచ్చునని గవర్నర్ జనరల్ అభిప్రాయపడ్డాడు. సతీ సహగమన నిషేధం హిందూ మత అభిప్రాయాలకు విరుద్ధంగా ఉన్నట్లయితే, దాన్ని అంతమొందించడానికి ఇతర మార్గాలను సూచించవలసిందని కూడా ఆ న్యాయస్థానాన్ని అర్థించాడు. నిజామత్ అదాలత్ న్యాయమూర్తులు పండితులను సంప్రదించగా, వారు నాలుగు వర్ణాలకు చెందిన ప్రతి స్త్రీ తాను స్వచ్ఛందంగా సహగమనం చేయవచ్చునీ, కాని గర్భం ధరించిన స్త్రీలకు, రజస్వలకాని వారికి, శిశువులు గల యువతులకు ఆ నియమం వర్తించదని సమాధానమిచ్చారు. తక్షణ నిషేధం అవాంఛనీయమని, కాలపరిమితి లేకుండా క్రమంగా నిషేధాన్ని అమలు చేయవచ్చని న్యాయమూర్తులు సమాధానం ఇచ్చారు. వెల్లస్లీ సతీ సహగమనాన్ని నిషేధించాడు. కాని ఆ ఆచారాన్ని పూర్తిగా నిర్మూలించలేకపోయాడు.

1813 వరకూ సతీ సహగమన సందర్భంగా జరుగుతున్న అక్రమాలను తొలగించడానికి ప్రభుత్వపరంగా ఎట్టి చర్యలు తీసుకోలేదు. ఆ సంవత్సరం లార్డ్ హేస్టింగ్స్ ప్రభుత్వం సహగమనం చేయడానికి ముందుగా దగ్గరలోనున్న మేజిస్ట్రేట్‌కు గాని, ప్రధాన పోలీస్ అధికారికి గాని తెలియపర్చాలనే నిబంధనను విధించింది. సహగమనం చేసే స్త్రీ గర్భిణి కాదని వయస్సు 16 సంవత్సరాలకు మించదని, ఆమెకు మతి భ్రమించలేదని సంతృప్తి చెందినప్పుడు వారి అనుమతి లభిస్తుంది.

ప్రభుత్వం ఆదేశాలు సతి ఆచారాన్ని అదుపు చేయలేకపోయాయి. ఈ దురాచారం క్రమక్రమంగా పెరిగిపోయిందని బెంగాల్ రాష్ట్రానికి సంబంధించి లభించిన ఈ కింది వివరాలు ధృవీకరిస్తాయి.

| | | | |
|---|---|---|---|
| 1815 | 378 | 1822 | 583 |
| 1816 | 442 | 1823 | 576 |
| 1817 | 707 | 1824 | 572 |
| 1818 | 839 | 1825 | 639 |
| 1819 | 650 | 1826 | 511 |
| 1920 | 598 | 1827 | 517 |
| 1921 | 653 | 1828 | 463 |

(మూలం : S. Natarajan : Century of Social Reform in India, 1959).

1818 తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో సతీ సహగమన దురాచారాన్ని నిర్మూలించడంలో అత్యంత ఆసక్తిని కనబరచింది. కంపెనీ ఉద్యోగులు కొందరు ఈ ఆచార కర్మను దేశంలో పూర్తిగా కాని, లేక తమతమ ప్రాంతాల్లో కాని నిషేధించాలని వత్తిడి తెచ్చారు. మద్రాస్ మేజిస్ట్రేటు లూషింగ్‌టన్ (Lushington) నిజామత్ అదాలత్ రెండో న్యాయమూర్తి కోర్టనే స్మిత్ (Courtney Smith) సదర్ కోర్టు న్యాయమూర్తి జె. హెచ్. హారింగ్‌టన్ (J. H. Harrimgton) వారిలో ఉన్నారు. చివరకు 1823లో లార్డ్ ఆమ్‌హెర్స్ట్ (Lord Ansherst) మరణించిన భర్త భౌతిక కాయంతోపాటు అతని భార్య కూడా చితిలో పడి కాలిపోవటం చట్టవ్యతిరేకమని నిర్ణయించాడు. సహగమనం చేయటానికి నిర్ణయించుకున్న వితంతువు స్వయంగా మేజిస్ట్రేట్ అనుమతిపొందాలని, సహగమనం చేసిన స్త్రీ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం పొందే అర్హత పోతుందని, సహగమనం చేసిన స్త్రీకి చెందిన యావదాస్తి ప్రభుత్వానికి చెందుతుందని కూడా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

### 17.6.4 బెంటింక్ శాసనం

1828లో విలియం బెంటింక్ భారతదేశం వచ్చిన తర్వాత సతీ సహగమనం విషయంలో ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకుంది. సహగమనాన్ని తక్షణమే నిషేధించే ఉద్దేశంతో సైనిక శాఖకు చెందిన 49 అధికారులకు వారి అభిప్రాయాలను తెల్పమని రహస్య లేఖలు పంపాడు. వారి సమాధానాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనాయి. అవాంఛనీయమైన సహగమన కర్మకాండను నిషేధించే విషయంలో వారిమధ్య భేదాభిప్రాయాలు లేవు. కాని ఇబ్బందులు లేకుండా జయప్రదంగా సహగమనాన్ని నివారించగలమా అన్న సందేహం వారికి కలిగింది. సహగమనాన్ని బలవంతంగా అణచి వేయటం స్థానిక సంక్షోభానికి దారి తీస్తుందని, ప్రజల్లో వ్యతిరేకత, భయాందోళనలు కల్గుతాయని, చివరికి భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్య మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని వారిలో కొందరు తెలియజేశారు. హిందూ మతానికి చెందిన అగ్రకులాల సైనికులు తిరుగుబాటుచేసే అవకాశం ఉందని వారు అన్నారు.

సతీ సహగమనం హిందూ మతానికి ముఖ్యం కాదని, మనధర్మశాస్త్ర కర్త దాన్ని గూర్చి ప్రస్తావించలేదని, అందువల్ల దాన్ని నిషేధిస్తే హిందూ మత విషయాల్లో జోక్యం కల్గజేసికొన్నట్లు కాదని కొందరు సలహా ఇచ్చారు. స్త్రీ సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం తెలివిగా వ్యవహరిస్తే హిందూ సిపాయిలనుండి ప్రతికూలత ఉండదని వారు అన్నారు. తక్షణమే సహగమన ఆచారాన్ని నిషేధించడాన్ని 24మంది అధికారులు సమర్థించారు. పరోక్షంగా అణచి వేయాలని 8మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 5గురు మాత్రమే ప్రభుత్వ జోక్యాన్ని వ్యతిరేకించారు.

ఉదార భావాలుగల విలియం బెంటింక్ సతీ సహగమనాన్ని నిషేధించి, హిందువులకు మేలు చేయాలని నిశ్చయించుకున్నాడు బెంటింక్ కృషి ఫలితంగా గవర్నర్ జనరల్ కౌన్సిల్ 1929 డిసెంబర్ 4న సతీ సహగమనాన్ని నిషేధిస్తూ శాసనం (Regulation) చేసింది. హిందూ వితంతువు సహగమనం చేయడం శిక్షార్హమైన నేరమని శాసనం నిర్ధారించింది. సహగమనానికి ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని సహకరించిన వారికి కఠిన శిక్షను నిర్దేశించింది. అట్టివారికి జరిమానా కాని, కఠిన కారాగార వాసంగా కాని విధింపబడుతుందని ప్రకటించింది.

ఈ సంస్కరణను మొదట బెంగాల్ ప్రభుత్వం అమలు చేసింది. తర్వాత బొంబాయి, మద్రాస్ రాష్ట్రాలు తమతమ ప్రాంతాల్లో సహగమనాన్ని నిషేధిస్తూ శాసనాలు ఆమోదించాయి.

సతి నిషేధానికి కొద్దిపాటి ప్రతిఘటన వచ్చింది. బెంగాల్ రాష్ట్రంలో 25 సార్లు సహగమనం చేయటానికి ప్రయత్నాలు జరిగాయి. వాటిని పోలీసులు నివారించారు. కాని హిందూ ఛాందస వాదులు నిషేధాన్ని వ్యతిరేకిస్తూ తీవ్రస్థాయిలో ఉద్యమాన్ని ప్రారంభించారు. రాధాకాంత దేబ్ గోకుల్‌నాథ మాలిక్, రామగోపాల మాలిక్‌లు ఈ ఉద్యమాన్ని నిర్వహించిన వారిలో ఉన్నారు. సనాతనుల పత్రిక సమాచార చంద్రిక ప్రజలను రెచ్చగొట్టే వ్యాసాలను రాసింది. 800 మంది కలకత్తా పౌరులు ఒక వినతి పత్రాన్ని బెంటింక్‌కు సమర్పించి, నిషేధాన్ని ఎత్తివేయమని ప్రార్థించారు. వారి విన్నపాన్ని బెంటింక్ తిరస్కరించాడు. ప్రివీ కౌన్సిల్‌లో కూడా సనాతనుల ప్రయత్నాలు ఫలించలేదు.

స్వదేశీ సంస్థానాల్లో కూడా సతీ సహగమన ఆచారం నిషేధించబడింది. బరోడా సంస్థానాధీశులు సతారా మహారాజా తమ పరిధిలోని ప్రాంతాల్లో సతిని నిషేధిస్తూ ఉత్తర్వులు ప్రకటించారు. హరిరావ్ హోల్కార్ (1837-43) ఇండోర్‌లో ఈ ఆచారాన్ని నిషేధించాడు. ఇటువంటి ఉత్తర్వులే రాజపుత్ర స్థానంలో 1846లో జారీ అయ్యాయి. అయినప్పటికీ, మేవార్, బికనీర్, ఆళ్వార్‌ల్లో సతీ దురాచారం తగ్గుముఖం పట్టలేదు. 1861 నాటికి ప్రభుత్వ నిషేధ పుటుత్తర్వుల వల్లా, ప్రజలు తిరస్కరించడం వల్లా సతి దురాచారం క్రమంగా అంతరించిపోయింది.

## 17.7 శిశు హత్యలు (Infanticide)

ఆడపిల్లల్ని పురిటిలోనే చంపివేసే దురాచారం కొన్ని ప్రాంతాల్లో కొన్ని కులాల్లో మాత్రమే ఉండేది. కథియవార్ రాజపుత్రులు, రాజపుత్రస్థానం మేర్వార్‌లకు చెందిన మేర్‌లు (Mers), పంజాబ్ ప్రాంత బేడీలు, ఖత్రీలు, జాట్‌లు మాత్రమే ఈ ఆచారాన్ని పాటించేవారు. ఆడపిల్లల వివాహాలు మితిమీరిన ఖర్చుతో కూడుకొన్నాయి. ఈసమస్య వల్ల తండ్రులు తమకు జన్మించిన ఆడపిల్లల్ని వెంటనే చంపివేసేవారు. 308 గ్రామాలుగల వారణాసి జిల్లాలోని 62గ్రామాల్లో ఆరు సంవత్సరాల వయస్సు ఆడపిల్లలు లేరని విచారణవల్ల తెలిసింది. ఇదే డివిజన్‌లో వేరే తెగకు చెందిన రాజపుత్ర కులస్థుల గృహాల్లో ఒక్క ఆడపిల్ల కూడా లేదు. 200 సంవత్సరాల కాలంలో ఒక్క ఆడపిల్ల పెండ్లి జరిగినట్లు దాఖలాలు లేవని, 1911 జనాభా లెక్కలవల్ల తెలుస్తుంది.

శిశు హత్యలను నిర్మూలించడం తన నైతిక బాధ్యతగా బ్రిటిష్ ప్రభుత్వం భావించింది. బ్రిటిష్ అధికారులు కొంతమంది వ్యక్తిగతంగా శిశు హత్యలను అణచివేయడానికి ప్రయత్నించారు. కాని వారి ప్రయత్నాలు ఫలించలేదు. అందువల్ల శిశుహత్యలకు వ్యతిరేకంగా శాసనాలు చేయబడ్డాయి. బెంగాల్ ప్రభుత్వం 1795, 1802 లలో శిశు హత్య నేరమని ప్రకటించింది. అయితే, నేరాలను గుర్తించడంలో గల ఇబ్బందులవల్ల శాసనాలు అమలు కాలేదు. బ్రిటిష్ అధికారులైన విల్కిన్‌సన్ (Wilkinson) విల్‌ల్‌గ్లే (Willonghley) ఎర్స్‌కైన్ (Erskine), జాకబ్ (Jacob) పిట్టింగర్ (Pittinger) మొదలైనవారు కూడా శిశు హత్యలను నివారించడానికి తమ శాయశక్తులా కృషిచేశారు. 1870లో ప్రత్యేక చట్టం చేయబడ్డ తర్వాత శిశు హత్యలు తగ్గుముఖం పట్టాయి. మార్వార్, జైపూర్‌లు ఈ చట్టాన్ని సమర్థించాయి. చట్టాన్ని అమలు చేయడం, ప్రజాభిప్రాయం తెచ్చిన వత్తిడి, సంస్కరణల ప్రభావం మొదలైన కారణాల వల్ల శిశు హత్యలను ప్రజలు విడిచివేశారు.

## 17.8 బానిసత్వ నిర్మూలన

సామాజిక రంగంలో వచ్చిన ప్రధానమైన మార్పుల్లో బానిసత్వ నిర్మూలన ఒకటి. 19వ శతాబ్దంలో ఇంగ్లాండులో వ్యాపించిన మానవతా సిద్ధాంతాల ప్రభావం కారణంగా ఈ మార్పు జరిగింది. బానిసల్లో అధిక శాతం హిందూ సమాజానికి చెందిన వారు, యుద్ధ కాలంలో బందీలుగా చిక్కనవారే. ముస్లింలలో కొంతమంది ప్రత్యక్షంగా తిరుగుబాటుల్లో పాల్గొన్నవారే. వీరేగాక భూమిపన్ను కట్టలేని వ్యవసాయదారులు అప్పులు తీర్చడానికై బానిసలుగా అమ్మివేయబడ్డవారూ ఉన్నారు. పేదవారు, తమంతతామే అమ్ముడు పోయేవారు, దారిదోపిడిదార్లు, ఆఫ్రికా, పర్షియా, అబిసీనియా దేశాలనుండి దిగుమతి చేసుకున్నవారు కూడా బానిసల్లో ఉన్నారు. వీరిని సుసంపన్నులు మాత్రమే పోషించేవారు.

1841 అధికార అంచనాల ప్రకారం బ్రిటిష్ ఇండియాలో 9 మిలియన్ల మంది బానిసలున్నారు. బెంగాల్, మద్రాస్ రాష్ట్రాలు, అస్సాం, బొంబాయి దక్షిణ ప్రాంతాల్లో బానిసత్వం బాగా వ్యాపించింది.

బానిసత్వం క్రమంగా నిర్మూలించబడింది. వారన్ హేస్టింగ్స్ బానిసత్వం ఒక సామాజిక వ్యవస్థగా కొనసాగటాన్ని వ్యతిరేకించాడు. చిన్నపిల్లల్ని అపహరించి అమ్మివేయడాన్ని 1774లో నిషేధిస్తూ, హేస్టింగ్స్ ఉత్తర్వులను జారీచేశాడు. అయితే, ఈ చట్టాన్ని ఎవరూ గట్టిగా అమలు చేయలేదు. బానిసలను విదేశాలకు ఎగుమతి చేయడాన్ని 1811లో నిషేధించారు. చార్లెస్ మెట్‌కాఫ్ (Cherles Metcalfe 1811-1814) ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో బానిసలను అమ్మటం నేరమని ప్రకటించాడు. బానిసత్వాన్ని పూర్తిగా అణచివేసే ఉద్దేశంతో 1843 చట్టం చేయబడింది. చివరికి 1860లో ఇండియన్ పీనల్ కోడ్ (Indian Penal Code) బానిసత్వ వ్యాపారాన్ని పూర్తిగా

నిషేదించింది. ఈచర్యవల్ల నష్టపోయిన వర్గాలు ఎటువంటి ఆందోళనకు దిగలేదు. ప్రజల నుండి ఎటువంటి ఒత్తిడి లేకపోయినా బానిసలకు విమోచన లభించింది.

## 17.9 నరబలులు (Human sacrifices)

మనవతా దృక్పథంతో తీసుకున్న చర్యల్లో నరబలుల నిషేధం ఒకటి. ఈ సంప్రదాయం ఒరిస్సాలోని ఖోండ్ ప్రజల్లోను, మద్రాస్ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లోను ఉండేది. ప్రప్రథమంగా 1836లో రస్సెల్ తన నివేదికలో ఈ ఆచారాన్ని గురించి మద్రాస్ ప్రభుత్వ దృష్టికి తెచ్చాడు. అతని సూచనల ప్రకారం నరబలులను క్రమంగా నిర్మూలించాలని ప్రభుత్వం భావించింది. విశాఖపట్నం కలెక్టర్ ఆర్‌బత్‌నట్, గంజాం జిల్లా మేజిస్ట్రేట్ బానర్‌మాన్, కెప్టెన్ మిల్లర్, కెప్టెన్ కాంబల్, సర్వే శాఖ అధికారి లెఫ్టినెంట్ హిల్ రాజీ మార్గాల ద్వారా స్థానిక ప్రజల ఆమోదంతో నరబలులను నిరోధించడానికి కృషి చేశారు. ఒరిస్సా ప్రభుత్వాధికారులైన రికెట్స్ (Ricketts), మిల్స్, లెఫ్టినెంట్ హిక్స్ కూడా నరబలుల అణచివేతకు కృషి చేశారు. చివరకు హార్డింజ్ ప్రభుత్వం నరబలిని పూర్తిగా నిషేధించింది.

## 17.10వారసత్వం హక్కు

1850 కుల అనర్హతల రద్దు చట్టం ప్రత్యక్షంగా కుల వ్యవస్థకు సంబంధించింది. మత మార్పిడి కారణంగా చట్టంవల్లగాని, ఆచారంవల్లగాని ఎవరైనా ఆస్తిహక్కు కోల్పోయినా, లేకవారి వారసత్వ హక్కుకు భంగం వాటిల్లినా, వారికి సంబంధించిన కేసులను బ్రిటిష్ ఇండియాలో గల న్యాయస్థానాలు అమలు చేయవని చట్టం పేర్కొంది. క్రైస్తవ మతాన్ని గాని, ఇస్లాం మతాన్నిగాని స్వీకరించిన వారి ఆస్తి హక్కులను కాపాడటం కోసం ఈ చట్టాన్ని చేయాల్సిన అవసరం ఏర్పడింది. మతం మార్పిడివల్ల కులాన్ని పోగొట్టుకున్న వారికి న్యాయం చేకూర్చటమే దాని లక్ష్యం. ఈ చట్టం వర్ణ భేదాలను గుర్తించకుండా, పౌర హక్కులకు రక్షణ కల్పించింది.

## 17.11వితంతు పునర్వివాహ చట్టం, 1856

భారతదేశ సాంఘిక సంస్కరణ చరిత్రలో హిందూ వితంతు పునర్వివాహ ఉద్యమం చాల ప్రధానమైన ఘట్టం. కులం, జాతితో సంబంధం లేకుండా, ప్రధానంగా వ్యక్తి సామర్థ్యం మీద, మానవత్వ సిద్ధాంతం మీద ఉద్యమం కేంద్రీకరించింది. దీనికి పరిమితమైన ఉద్దేశ్యాలు ఉన్నాయి. వితంతువులను వివాహం చేసుకున్న వారికి గుర్తింపు ఇవ్వడం, వారిపట్ల తోటి సమాజం సానుభూతి, సహనం ప్రదర్శించేట్లు చేయడం వితంతు వివాహోద్యమ ముఖ్య ఆశయం. యుక్త వయస్సుల్లో యువతులు బలవంత వైధవ్యం అనుభవిస్తూ, జీవితాంతం బ్రహ్మచారిణులుగా బాధలు అనుభవిస్తున్న వారికి సంబంధించిన సమస్య ఇది.

వితంతు పునర్వివాహ ఉద్యమానికి నాయకత్వం వహించిన మొదటి భారతీయుడు ఈశ్వరచంద్ర విద్యాసాగర్ (1820-1891). ఇతని కృషికి పూర్వమే బాల వితంతువుల పునర్వివాహ ఉద్యమం ప్రారంభమైంది. 1839లో మరాఠీ భాషలో బాల వితంతువుల వివాహంపై ఒక పుస్తకం వెలువడింది. రామ్‌మోహన్ రాయ్ ఆత్మీయ సభలో ఈ సమస్య చర్చకు వచ్చింది. 'బెంగాల్ స్పెక్టేటర్' పత్రిక అనేక ఉత్తరాలను ప్రచురించింది. కాని పూర్వాచార పరాయణుల తీవ్ర ప్రతిఘటన వల్ల ఉద్యమం విజయవంతం కాలేదు.

విద్యాసాగర్ బెంగాల్ బ్రహ్మ సమాజ సభ్యుడు కాదు. అయినప్పటికీ, బ్రహ్మ సమాజ సభ్యులతో, తత్వబోధినీ సభ సభ్యులతో కలిసి పనిచేశాడు. 1851లో సంస్కృత కళాశాలకు ప్రధానోపాధ్యాయుడుగా పదవి

బాధ్యతలను స్వీకరించిన తర్వాత ముఖ్యంగా స్త్రీ పునర్వివాహాలను జరుపమని, బహుభార్యాత్వాన్ని నిర్మూలించమని ప్రజలకు విజ్ఞప్తులు చేశాడు. వితంతు వివాహాల నిషేధానికి శాస్త్రాల సమ్మతి లేదని నిరూపించడానికి హిందూ శాస్త్రాన్ని పరిశోధించాడు. 'పరాశర సంహిత'లో ఉన్న శ్లోకం ఆధారంగా, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వితంతువులు పునర్వివాహం చేసుకోవడానికి శాస్త్రాలు అనుమతించాయని వాదించాడు. భర్త సన్యాసిగా మారినపుడు గాని, వైవాహిక జీవితానికి పనికిరాడని స్పష్టంగా తేలినపుడుగాని, భ్రష్టుడైనపుడుగాని స్త్రీ పునర్వివాహం చేసుకోవచ్చని పరాశర సంహిత తెలిపింది.

వితంతు వివాహాలను సమర్థిస్తూ విద్యాసాగర్ తయారుచేసిన వ్యాసాన్ని మొదట తత్వబోధిని పత్రిక ప్రచురించింది. 1858 లో అది ఒక చిన్న గ్రంథంగా తిరిగి ప్రచురితమైంది. శాస్త్ర జ్ఞానం లేకపోవడం, సంప్రదాయాన్ని గుడ్డిగా ఆచరించడం, దేశంలో పాప ప్రవాహానికి కారణమని అందులో వాదించాడు. ఈ గ్రంథ ప్రచురణ దేశంలో గొప్ప సంచలనాన్ని సృష్టించింది. పూర్వాచార పరాయణులు కోపంతో కంపించిపోయారు. వారిపెత్తనానికి ముప్పు వాటిల్లిందని గగ్గోలు పెట్టారు. తీవ్ర పదజాలంతో ప్రతివిమర్శ చేస్తూ విద్యాసాగరుని వల్ల వచ్చిన సవాలును ఎదుర్కోటానికి వారు ప్రయత్నించారు. రాజా రాధాకాంత దేబ్ వారి నాయకుడు. సంప్రదాయ వాదులంతా విద్యాసాగరుని విషయంలో కఠిన వైఖరిని అవలంబించారు. అతని చర్యలు హిందూ మత పవిత్రతను నాశనం చేసే విధంగా ఉన్నాయని వాదించారు. వితంతు పునర్వివాహాలను ధర్మశాస్త్రాలు అంగీకరించవని పుస్తకాలు, కరపత్రాలు రాసి పంచిపెట్టారు.

అయితే, విద్యాసాగర్ నిరుత్సాహ పడలేదు. బెంగాల్ బ్రహ్మ సమాజ నాయకులు, యువకులు ఆయనకు అండగా నిలిచారు. అతని గ్రంథం ప్రజల్లో గొప్ప ఆసక్తి కలిగించి, వారు సమస్యను బాగా అవగాహన చేసుకోడానికి దోహదపడింది. వారం రోజుల్లో ఆ పుస్తకం ప్రతులు 2000 అమ్ముడయ్యాయి. తర్వాత 10,000 ప్రతులకు పైగా ముద్రింపబడ్డాయి. వీటి ప్రభావం అన్ని తరగతుల ప్రజలమీద, చివరకు మారుమూల గ్రామల్లో ఉన్న ప్రజలమీద కూడా పడింది. వితంతు పునర్వివాహం గురించి జనాదరణ పొందిన పాటలు రాయబడ్డాయి.

వితంతు పునర్వివాహాన్ని బలపరుస్తూ విద్యాసాగర్ రాసిన రెండో గ్రంథం 1855 అక్టోబర్‌లో వెలువడింది. ఈ పుస్తకంలో దేశాచారాన్ని నిర్దాక్షిణ్యంగా విద్యాసాగరుడు దుయ్యబట్టాడు. పవిత్ర భారతదేశంలో ఈదుష్ట సంప్రదాయంవల్ల వ్యభిచారం, గర్భస్రావం విపరీతంగా వ్యాపించాయని వాదించాడు.

విద్యాసాగరునితోపాటు కొందరు సంఘసంస్కర్తలు వ్యక్తి సామాజిక స్వేచ్ఛ పట్ల, వితంతువుల పట్ల హిందూ సమాజం ప్రదర్శిస్తున్న అమానుష వైఖరిని ఖండించారు. ప్రతివ్యక్తికీ స్వేచ్ఛగా బ్రతికే హక్కు ఉందనీ, దానిని ప్రతివారూ గుర్తించాలనీ, వితంతువుల కష్టాలు వారు కోరి తెచ్చుకొన్నవి కావనీ, తోటి సమాజమూ, వారి కుటుంబ సభ్యులు వారిపై బలవంతాన రుద్దారనీ పేర్కొన్నారు.

తన ఉద్యమానికి ప్రజాదరణ లభించడంతో వితంతు వివాహాలకు చట్టపరంగా గల అడ్డంకులను తొలగించడానికి విద్యాసాగర్ అడుగు ముందుకు వేశాడు. ఈ విషయమై 5191 మంది బెంగాలీ ప్రముఖుల సంతకాలతో ఒక విజ్ఞాపన పత్రాన్ని ఇండియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు సమర్పించాడు. చట్టపరంగా హిందూ వితంతువుల వివాహాలకు ఉన్న అడ్డంకులను తొలగించి, వారి పునర్వివాహాలను చట్టబద్ధం చేయమని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. స్త్రీ పునర్వివాహ నిషేధం అతిక్రూరమైందని, నైతికంగా ప్రతికూలమైందని, దానివల్ల సమాజానికి తీరని నష్టం కల్గుతున్నదని. పునర్వివాహ నిషేధం శాస్త్రాలకూ, హిందూ న్యాయ సూత్రాలకూ విరుద్ధమని విజ్ఞాపనలో పేర్కొన్నారు. వారి అభిప్రాయాలతో ఏకీభవించిన ఇండియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు జె. పి. గ్రాంట్ (J. P. Grant) వితంతు వివాహాలకు గల అడ్డంకులను తొలగించే లక్ష్యంతో ఒక బిల్లును కౌన్సిల్‌లో

BRAOU

ప్రవేశపెట్టాడు. బిల్లుకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయినప్పటికీ, జె. పి. గ్రాంట్ బిల్లును గట్టిగా సమర్థించాడు. ఫలితంగా హిందూ వితంతు పునర్వివాహ చట్టాన్ని (Hindu Widows Remerrige Act) కౌన్సిల్ ఆమోదించింది. 1856 జూలై 26న గవర్నర్ జనరల్ దానికి తన ఆమోదం తెల్పాడు. దేశ సాంఘిక చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలు రాయి. వితంతువుకు విముక్తిని ప్రసాదించిందని చెప్పవచ్చు.

వితంతువుల వివాహాలకున్న అడ్డంకులను తొలగించడంలో స్వదేశీ సంస్థానాలు ఆలస్యంగా చర్యలు తీసుకొన్నాయి. 1938 నాటికి బరోడా, మైసూర్, హైదరాబాద్, తిరువాన్కూర్ సంస్థానాలు వితంతు వివాహాలకు అనుమతి మంజూరు చేస్తూ శాసనాలు చేశాయి.

ఈ శాసనాలు ఉన్నత కులాల స్త్రీలకు బాగా ఉపయోగపడ్డాయి. హిందూ ఆచారం అనేక ఇతర క్రింది కులాలవారిలో వితంతు వివాహాలను అనుమతించింది. ఉత్తరప్రదేశ్‌లో వితంతు వివాహాలు ఒక ఆచారంగా ఉండేది.

ముస్లిం సమాజం వితంతు వివాహాలను అనుమతించింది.

వితంతువుల సంక్షేమాన్ని కోరి పండిత రమాబాయి శారదా సదన్‌ను పూనాలో 1890 లో స్థాపించి, అగ్రవర్ణాల వితంతువులకు ఆశ్రమం కల్పించింది. దొండుకేషవ్ కార్వే అనాధ బాలికాశ్రమాన్ని 1896లో స్థాపించాడు. వితంతు వివాహ సంఘాన్ని ఏర్పర్చిన వీరేశలింగం రాజమండ్రి, మద్రాసులలో వితంతు గృహాలను ప్రారంభించాడు. 1906-1912 మధ్య దేశంలో అనేకచోట్ల వితంతు గృహాలు వెలిశాయి. వాటిలో మైసూర్‌లోని వితంతు గృహం (1907), కలకత్తాలోని మహిళా శిల్పాశ్రమం (1907), బెంగుళూరులోని వితంతు గృహం (1910), మద్రాస్‌లోని బ్రాహ్మణ వితంతువుల వసతి గృహం (1912), ఫిరోజ్‌పూర్, భటిండాల్లో దేవ సమాజం, జలంధర్‌లో ఆర్య సమాజం, బొంబాయిలో దిగంబర జైనులు నడిపిన వితంతు గృహాలు ముఖ్యమైనవి.

వితంతు వివాహాలను బొంబాయి వితంతు పునర్వివాహ సంఘం (Widow Marriage Association 1866) అహ్మదాబాద్ పునర్వివాహ సంఘం (Remarriage Association 1884), మద్రాస్ హిందూ స్త్రీ పునర్వివాహ సంఘం (Hindu Women's Remarriage Association) ప్రచారం చేశాయి. 1856 - 1900 మధ్య బెంగాల్‌లో 117, బొంబాయిలో 100, మద్రాస్‌లో 30, పంజాబ్, పశ్చిమోత్తర రాష్ట్రంలో 30 వితంతు వివాహాలు జరిగాయి. 20వ శతాబ్దంలో ఉద్యమం వేగంగా వ్యాప్తి చెందింది. వితంతు వివాహాలకు కళంకం పోయింది. అట్టి వివాహాలు క్రమంగా సర్వసామాన్యమైనాయి.

## 17.12 వివాహ వయో పరిమితి చట్టం, 1891

హిందూ బాలికల వివాహ వయో పరిమితి క్రమబద్ధీకరణకై చట్టం చేయాల్సిన అవసరం ఉందని ప్రప్రథమంగా పార్సీ కులానికి చెందిన బొంబాయి నివాసి బెహరాంజీ మలబారీ (1853 - 1912) వెలుగులోకి తెచ్చాడు. 1884 లో హిందూ బాల్య వివాహం, బలవంత వైధవ్యానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించాడు. అతని ఉద్యమం హిందూ సమాజంలో కల్లోలం సృష్టించింది. చట్టం సంస్కరణకు సాధనంగా ఉపకరిస్తుందని మలబారీ గాఢంగా నమ్మాడు.

సాంఘిక సంస్కరణోద్యమ ప్రచారానికి ధైర్యంతో మలబారీ తన అమూల్యమైన సేవలను అందించాడు. రెండు ముఖ్య వాస్తవాలను ఆయన గుర్తించాడు. సాంఘిక ఆచారాల్లో జోక్యం చేసుకోడానికి ప్రభుత్వం సందేహిస్తుందనేది మొదటిది. వితంతు పునర్వివాహ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఆ ఉద్యమం ఆశించినంత

BRAOU

ప్రగతిని సాధించలేదన్నది రెండోది. అందుచేత మలబారీ ప్రత్యేకమైన రీతిలో ఉద్యమాన్ని నిర్వహించాడు. పండితులు, మత నాయకులను ఉపేక్షించి మిగిలిన అక్షరాస్యులకు అతడు చేసిన విజ్ఞప్తులు సత్ఫలితాలనిచ్చాయి. సాంఘిక, మత అలవాట్లు, ఆచారాల పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని సవివరంగా భారతీయుల ముందుంచాడు. తన వాదనలకు మద్దతుగా సాంఘిక దురాచారాలను వ్యంగ్యంగా చిత్రీకరిస్తూ కరపత్రాలు పంచిపెట్టాడు. వివాహ సంస్కరణ ప్రచారాన్ని వ్యతిరేకించేవారినీ, తనకు పూర్తిగా సహకరించని కుహనా సంస్కర్తలను అపహాస్యం చేసాడు. నిత్యం వితంతువులు అనుభవిస్తున్న బాధలను కళ్ళకు కట్టినట్లు వర్ణించి, తన ఉద్యమాన్ని సమర్థించమని ప్రజలను కోరాడు. జీవితాంతం నిర్బంధ వైధవ్యం వల్ల కల్గిన దుస్థితి మానవత్వంగల వారిని కలచి వేసింది. బాల్య వివాహాలు, నిర్బంధ వైధవ్యంవల్ల కల్గిన విషాదాన్ని అక్షరాస్యులు నిరక్షరాస్యులు అన్న భేదం లేకుండా భారతీయులందరికి తన వాదాన్ని నివేదించాడు.

మలబారీ ఉద్యమానికి సుప్రసిద్ధ బొంబాయి పత్రిక "ఇండియన్ స్పెక్టేటర్ (Indian Spectator 1880) సహాయపడింది. 1901లో "ఈస్ట్ అండ్ వెస్ట్" (East and West) పత్రికను మలబారీ స్థాపించాడు. 1884 ఆగస్ట్ నెలలో మలబారి వ్యాసం "బాల్య వివాహాలు - నిర్బంధ వైధవ్యం" ప్రచురించబడింది. అధికార, అనధికారులందరికీ దాని ప్రతులు పంచబడ్డాయి.

బాల్య వివాహాలను నియంత్రించడానికి మలబారీ కొన్ని సూచనలు చేశాడు. అవి చిన్న వయస్సులోనే పెండ్లి అయిన విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలు రాయటానికి అనుమతి నిరాకరించటం, ప్రభుత్వం సంస్థల్లో ఉద్యోగాలకు నియామకాలు చేసేటపుడు పెండ్లికాని వారికే ప్రాధాన్యత ఇవ్వటం, విద్యా సంస్థలు పిల్లలకు పాఠ్య పుస్తకాల్లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గూర్చి వివరించే అంశాలు చేర్చటం, వితంతువుల జీవన పరిస్థితులను మెరుగు పర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవటం, వితంతువులు తమ హక్కులను తెలుసుకోడానికి వీలుగా, 1856 వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రచారం చేయటం.

మలబారీ రాసి పంపిన వ్యాసానికి విస్తృత ప్రాచుర్యం లభించింది. సాంఘిక సంస్కర్తలు, వైద్యులు, న్యాయవాదులు, ప్రభుత్వోద్యోగులు, మేధావులు, ప్రైవేట్ సంస్థలనుండి వ్యాసానికి సమాధానాలు అందాయి. తన అభిప్రాయాలను స్వయంగా ప్రజల ముందు ఉంచడానికి మలబారీ దేశంలో విస్తృతంగా పర్యటించాడు. సాంఘిక సంస్కరణ సంఘాలను ఉద్దేశించి ప్రసంగించాడు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆగ్రా, అలీఘర్, లక్నో, బరేల్లీ, అలహాబాద్, బెనారస్, మధురల్లోని బహిరంగ సభల్లో తన వాదనలను ప్రజలకు విన్పించాడు. సమస్యల తీవ్రతను ప్రజలు నమ్మేటట్లు చేయటానికి 1881 జనాభా వివరాలను ఉపయోగించాడు.

మలబారీ భావాలకు సమాధానాలు పంపిన భారతీయుల్లో ఎక్కువమంది బాల్య వివాహాలను నిషేధిస్తూ శాసనం చేయాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అతి తక్కువమంది స్వచ్ఛంద చర్య ద్వారా ఆశించిన ఫలితాలను సాధించవచ్చని భావించారు. వితంతువుల శిరోముండనానికి బాధ్యులైన వారిని విచారించి, శిక్షించడానికి చట్టాలు చేయాలని, వితంతువులకు జన్మించిన పిల్లలకు వైద్యశాలలు ప్రారంభించాలని, బాలికలకు విద్యగరపాలని, వితంతు శరణాలయాలు స్థాపించాలని వారంతా భావించారు. 1887లో స్థాపించబడ్డ 'భారత సాంఘిక సభ' (India Social Conference) సింధ్, అహ్మదాబాద్‌ల్లో కొత్తగా ఏర్పడ్డ సంస్కరణ వాదుల సంఘాలు మలబారీ ఉద్యమాన్ని బలపర్చాయి. అహ్మదాబాద్‌లో అసిస్టెంట్ జడ్జీ దయారామ్ గిడుమల్ కొత్త సంఘాలు ఏర్పాటుచేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాడు. సూరత్, నవ్‌సారీలకు చెందిన వితంతువులు తమ పరిస్థితిని మెరుగుపర్చమని నాయకులకు విజ్ఞప్తులు చేశారు. ప్రప్రథమంగా సంఘ సంస్కరణ ఉద్యమం దేశ ప్రజల దృష్టిని ఆకర్షించి అఖిల భారత సంస్కరణ ఉద్యమంగా రూపుదిద్దుకుంది.

మలబారీ తన ఉద్యమాన్ని ఇంగ్లాండ్‌లో కూడా నిర్వహించాడు. అక్కడ ఉపన్యాసాల ద్వారా, రచనల ద్వారా తన ఆందోళనను ఉధృతం చేశాడు. సామాజికాభివృద్ధికి, స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి 1871లో మేరీ కార్పెంటర్ స్థాపించిన 'నేషనల్ ఇండియన్ అసోసియేషన్' (National Indian Association) మలబారీ బహిరంగ సభలను ఏర్పాటుచేసింది. దాని పత్రిక "ఇండియన్ మేగజైన్ అండ్ రివ్యూ" (Inidan Magazine and Review) సమావేశాల్లో జరిగిన చర్చల సారాంశాన్ని ప్రచురించింది. ఇండియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన శాశ్వత సంఘం ఇంగ్లాండ్ ప్రజల అభిప్రాయాన్ని మలచడంలోనూ, ప్రభుత్వ విధానాన్ని ప్రభావితం చేయడంలోనూ సహాయ సహకారాలను అందించింది.

పైన వివరించిన మలబారీ ప్రయత్నాల ఫలితంగా, 1889 నాటికి భారత ప్రభుత్వ విధానంలో మార్పు వచ్చింది. బాలికల వివాహ వయస్సు పెంచడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. కాని సనాతనుల నుండి వ్యతిరేకత వచ్చింది. వారు మలబారీ అనుచరులపై వ్యక్తిగత దాడులను నిర్వహించారు. హిందూ మతానికి ప్రమాదం ఏర్పడిందని నినాదాలు చేశారు. మద్రాస్‌లో టి. మాధవరావు వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించి, నిరసన ప్రదర్శనలు నిర్వహించాడు. భారత సాంఘిక సమావేశం జనరల్ సెక్రటరీ టి. మాధవరావు బిల్లుకు మద్దతు నిచ్చేవారికి నాయకత్వం వహించాడు. 1890లో స్థాపించబడ్డ 'ఇండియన్ సోషల్ రిఫార్మర్' (Indian Social Reformer) బిల్లుకు మద్దతు ప్రకటించింది. పశ్చిమ భారతదేశంలో వివాహ వయో పరిమితి విషయాన్ని మతపరమైన సమస్యగా భావించి, ప్రభుత్వ ప్రతిపాదనలకు తిలక్ అభ్యంతరం తెల్పాడు. విదేశీ పాలనను వ్యతిరేకించేవారు సాంఘిక సమస్యలను పరిష్కరించడానికి విదేశీ పాలకుల సహాయాన్ని అర్థించడంలో ఔచిత్యం లేదన్నాడు. బెంగాల్‌లో బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన అంతకుముందెన్నడూ లేనంత ఉధృతంగా పెల్లుబికింది. ఉద్రేకంతో హిందూ సమూహాలు నగర వీధుల్లో హిందూ మతం ప్రమాదంలో పడిందని అరుస్తూ తిరిగారు. అయితే, బ్రహ్మ సమాజం, ఇండియన్ అసోసియేషన్, బెంగాల్ కేంద్ర ముస్లింల సంఘం బిల్లును సమర్థించాయి.

సనాతనుల నుండి వచ్చిన వత్తిడులను తట్టుకొని, భారత ప్రభుత్వం 1891లో బాలికల వివాహ వయో పరిమితి చట్టం (Age of Consent Act) ఆమోదించింది. ఈ చట్టం బాలికల వివాహ వయో పరిమితిని 10 నుండి 12 సంవత్సరాలకు పెంచింది. 1891 చట్టం అతి బాల్య వివాహాలను నివారించలేకపోయింది.

## 17.13 శారదా చట్టం

1891 చట్టంలోని అంశాలను గురించి సామాన్య ప్రజలకు సరైన అవగాహన లేదు. న్యాయవాదులకు, కొద్దిమంది విద్యావంతులకు మాత్రమే చట్టం గురించి తెలుసు. అందువల్ల బాల్య వివాహాలు, యుక్తవయస్సురాని బాలికలు గర్భం ధరించటం మొదలైన దుష్ఫలితాలు కొనసాగాయి. ఈ సత్యాన్ని గుర్తించిన గర్భాదాన సంఘం (Age of Consent Committee) భారతదేశంలో సగం మంది బాలికలు 15 సంవత్సరాల లోపునే వివాహాలు చేసుకున్నారని నిర్ధారించింది. ఈ సంఘం నివేదికలోని సిఫారసుల ఆధారంగా శ్రీహరి బిలాస్ శారద ప్రవేశపెట్టిన బిల్లును కేంద్ర శాసనసభ ఆమోదించి, 1929 అక్టోబర్‌లో బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని (Child Marriage Restraint Act) చేసింది. దీన్ని శారదా చట్టం అనికూడా పిలుస్తారు. దేశ వ్యాప్తంగా మహిళలు ఈ చట్టాన్ని గట్టిగా సమర్థించారు. బాలికల వివాహ వయస్సు 14 ఏండ్లకు, బాలుర వివాహ వయస్సు 18 ఏండ్లకు ఈ చట్టం పెంచింది. చట్టాన్ని ఉల్లంఘించి వివాహాలను జరిపించే పురోహితులు, ప్రోత్సహించే ఇతరులు కూడా శిక్షార్హులు. నిబంధనలను ఉల్లంఘించిన వారికి గరిష్ఠ శిక్ష 15రోజుల సామాన్య కారాగార వాసం; పెండ్లికుమారునికి 1000 రూపాయల జరిమానా. మహిళలకు శిక్ష లేదు. ఈనిబంధనలు 1930 ఏప్రిల్ నుండి అమల్లోకి వచ్చాయి. అయితే, అంతకు ముందే అధిక సంఖ్యలో బాల్య వివాహాలు జరిగాయి. 1931 జనాభా లెక్కల ప్రకారం 12 మిలియన్ల బాలికలకు

BRAOU

13 ఏండ్లలోపునే వివాహం జరిగింది. చట్టాన్ని కఠినంగా అమలు చేయడానికి తగినంత సిబ్బంది లేకపోవటంవల్లా, చట్టానికి భయపడి తప్పించుకొని ఫ్రెంచ్ అధీన ప్రాంతాలకు వెళ్లి అక్కడ తమ పిల్లలకు వివాహాలు జరిపించడం వల్లా శారదా చట్టం సత్ఫలితాలను అందివ్వలేకపోయింది.

భారత ప్రభుత్వం అనుసరించిన మార్గాన్ని స్వదేశీ సంస్థానాలు ఆలస్యంగా అనుసరించాయి. 1894లోనే మైసూర్ ప్రభుత్వం 50 ఏండ్ల పురుషులు 14 సంవత్సరాలలోపు బాలికలను వివాహం చేసుకోడాన్ని నిషేధించింది. 1904లో బరోడా కనిష్ఠ వివాహ వయస్సు బాలికలకు 14, బాలురకు 16 సంవత్సరాలుగా నిర్ణయించింది. ఈ శాసనం అమల్లో ఉన్నప్పటికీ, 1930 వరకు బాల్య వివాహాలు కొనసాగాయి. చట్టం ప్రజల ప్రవర్తనను మార్చలేకపోయింది. అనేక ఇతర స్వదేశీ సంస్థానాల్లో ప్రజాభిప్రాయం ప్రభుత్వం జోక్యానికి అనుకూలంగా లేదు.

## 17.14 దేవదాసీల విమోచనా చట్టం 1925

దేవదాసీలు దేవుని సేవకు అంకితమైన కన్యలు.దేవుని విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొని వెళ్లే సమయంలో వారు పాటపాడేవారు, నృత్యం చేసేవారు. సర్వ సామాన్యంగా ప్రతిచోట నర్తకీమణులు అనే పదం వాడుకలో ఉంది. వారు పాడేపాటలు అశ్లీలంగా ఉండేవి. వివాహాలు, ఇతర శుభకార్యాలు జరిగేటప్పుడు హిందువులు వారి నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు. సభ్య సమాజం వారిని వేశ్యలుగా భావించింది.

ఈ సంప్రదాయం విషయంలో మొదట బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు గైకొన్నది. 1907లో ఒక తీర్మానాన్ని ఆమోదించి దేవుని సేవలకు దేవదాసీలను నియోగించటం శిక్షార్హమని శాసనం చేసి, ఆ పనిచేసే దేవస్థానం అధికారులను విచారణ జరిపి శిక్షిస్తామని తెలియజేసింది. 1909లో మైసూర్ ప్రభుత్వం ఒక ఉత్తర్వు జారీ చేసి దేవదాసీ వృత్తిని ప్రోత్సహించే వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని ప్రకటించింది. మైసూర్ ప్రభుత్వాధీనంలోగల అన్నిదేవాలయాల్లోను ఈ నిషేధపుటుత్తర్వులు అమలు చేశారు. తిరువాన్కూర్ ప్రభుత్వం కూడ ఈ విషయమై తగిన చర్యలు తీసుకుంది. డాక్టర్ ముత్తు లక్ష్మి రెడ్డి, మరికొందరు నడిపిన ఉద్యమం వల్ల 1925లో ఒక శాసనం చేయబడింది. వయస్సురాని ఆడపిల్లలతో వ్యాపారం చేయడాన్ని నేరమని అది ప్రకటించింది.

ఇవేగాక 1929 నాయక్ ఉత్తర ప్రదేశ్ బాలికల రక్షణ చట్టం (The Uttar Pradesh Naik girls protection Act), 1934 బొంబాయి దేవదాసీ నిషేధ చట్టం (The Bombay Devadasi Prevention Act), 1947 మద్రాస్ దేవదాసి చట్టం (The Madras Devadesi Act) వ్యభిచారాన్ని నిషేధిస్తూ అమలుచేయబడ్డాయి. కన్యలను కాపాడటం వాటి ఉద్దేశం. ఈ చట్టాలు దేవదాసీ కన్యలకు వివాహార్హత కల్పించాయి.

## 17.15 విడాకులు

భారతదేశంలో విడాకులు పురుషుని ప్రత్యేక హక్కు. కిందికులాల్లో విడాకులు అతి సులువుగా జరిగేవి. ముస్లిం చట్టం కూడా విడాకుల విషయంలో పురుషాధిక్యాన్ని గుర్తించింది. స్త్రీలకు విడాకులు ఇచ్చే హక్కులేదు. పార్సీ స్త్రీల విమోచనకు 1865 పార్సీ వివాహ, విడాకుల చట్టం (Parsi Marriage and Divorce Act) ఎంతగానో దోహదపడింది. ఈచట్టం వల్ల విడాకులు ఇచ్చే హక్కు స్త్రీలకు కూడా లభించింది. 1937లో బరోడా విడాకుల చట్టాన్ని ఆమోదించి అమలుచేసింది. ఇతర రాష్ట్రాలు మాత్రం వెంటనే ఈ అభ్యుదయ మార్గాన్ని అనుసరించలేదు.

## 17.16 దేశ విభజన తర్వాత కేంద్ర శాసనాలు

1938 - 41 మధ్య కాలంలో హిందూ స్త్రీల వారసత్వ హక్కును ప్రభుత్వం సమంగా పరిష్కరించలేకపోయింది. అందువల్ల బ్రిటిష్ ప్రభుత్వం సర్. బి. యన్. రావ్ అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించింది. రావ్ సంఘం (1)

వారసత్వ చట్టం, (2) వివాహ చట్టాలను సిఫారసు చేసింది. రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా కేంద్ర శాసన సభ సాంఘిక శాసనాలను చేయలేదు. దేశ విభజన తర్వాత ప్రభుత్వం అభివృద్ధిదాయకమైన విధానాలను చేపట్టింది. ఆచరణ పథకాన్ని రూపొందించుకొని సంస్కరణలను చేపట్టింది. రావ్ కమిటీ న్యాయసూత్రాల క్రోడీకరణ 1947 - 1952 మధ్య కాలంలో పార్లమెంట్ ఉభయ సభల్లోను చర్చకు వచ్చింది. 1952 ఎన్నికల తర్వాత ఏర్పడ్డ పార్లమెంట్ హిందూ వివాహ చట్టాన్ని సంస్కరించే బాధ్యత చేపట్టింది. 1954లో పార్లమెంట్ ఆమోదించిన ప్రత్యేక వివాహ చట్టం బాలికలకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు వివాహ అర్హత వయస్సుగా నిర్ణయించింది. 1956 హిందూ వివాహ చట్టం బహుభార్యత్వ పద్ధతిని నిషేధించి, ఏకపత్ని పద్ధతిని నిర్బంధం చేసింది. విడాకులను అంగీకరించింది. 1956 స్త్రీల ఆస్తిహక్కు చట్టం హిందూ స్త్రీలకు పురుషులతో సమానంగా వారసత్వ హక్కులను కల్గించింది. వేరొక చట్టం హిందూ స్త్రీకి దత్తత చేసుకొనే హక్కును ప్రసాదించింది. వీటితో స్త్రీలకు సంబంధించిన శాసనాల ప్రహసనం పూర్తి అయింది. ప్రస్తుత పటిష్టమైన మహిళల పరిస్థితి ఈ సంస్కరణలు విజయవంతం అయిన విషయాన్ని తెలియజేస్తాయి.

## 17.17 సంగ్రహంగా

1. బ్రిటిష్ పాలన ప్రారంభమయ్యే నాటికి భారతదేశంలో మహిళలకు పురుషులతో సమానమైన స్థానంలేదు.
2. మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటూ దుర్భరమైన జీవితాలను గడుపుతూన్నారు.
3. మహిళల సమస్యలన్నింటికీ ప్రధాన కారణం వారికి విద్య లేకపోవడం ఈ సమస్యను పరిష్కరించడానికి విశేష కృషి జరిగింది.
4. సాంఘిక దురాచారాల్లో ఒకటైన నిర్బంధ సతీ సహగమనాన్ని నిర్మూలించడానికి జరిపిన పోరాటానికి రామ్‌మోహన్ రాయ్ నాయకత్వం వహించాడు. ఆ ఉద్యమం సతీ సహగమన నిషేధానికి దారితీసింది.
5. వితంతు వివాహ ఉద్యమాన్ని ఈశ్వర చంద్ర విద్యాసాగర్ నిర్వహించాడు. అట్టి వివాహాలకు చట్టపరమైన అడ్డంకులు 1856లో తొలగించబడ్డాయి.
6. అతి బాల్య వివాహాలను రద్దుచేయడానికి మలబారీ తీవ్రంగా ప్రయత్నించాడు. అతని కృషి ఫలించి, బాలికల వివాహ వయో పరిమితి చట్టరీత్యా నిర్ణయించబడింది. శారదా చట్టం కూడా బాల్య వివాహాలను నిరోధించడానికే ఉద్దేశించబడింది.
7. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత ప్రభుత్వం అనేక చట్టాలు చేసి మహిళలకు సమాన ప్రతిపత్తి కల్పించింది.

## 17.18 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. సతీ సహగమన నిషేధానికి దారితీసిన పరిస్థితులను సమీక్షించండి
2. వితంతు వివాహోద్యమంలో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ పాత్రను వివరించండి.

3. 19వ శతాబ్దంలో మహిళాభ్యున్నతికి ప్రభుత్వ పరంగా జరిగిన కృషి గురించి రాయండి.

4. 20వ శతాబ్దంలో స్త్రీల సమస్యలను పరిష్కరించడానికి తీసుకోబడ్డ చట్టపరమైన చర్యలు తెలపండి.

II. కింది ప్రశ్నలకు లఘు వాఖ్యలను రాయండి.

1. బ్రిటిష్ పాలనకు పూర్వం స్త్రీల స్థితిని వర్ణించండి.

2. భారతదేశంలో బానిసత్వం ఏకారణాలవల్ల అభివృద్ధి చెందింది ?

3. శిశు హత్యలను, నరబలులను నిరోధించడానికి జరిగిన కృషిని వివరించండి.

4. 1891 బాలికల వివాహ వయోపరిమితి చట్టానికి సనాతన వర్గాల నుండి ఎదురైన వ్యతిరేకతను గూర్చి రాయండి.

5. సాంఘిక దురాచారాల నిర్మూలనకై స్వదేశీ సంస్థానాలు తీసుకున్న చర్యలను పరిశీలించండి.

## 17.19 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Bose Pramatha Nath | : | **A History of Hindu civilization During British Rule Vols. 1-4 1894.** |
| Datta K. K. | : | **A Social History of Modern India, 1975.** |
| Desai, A. R. | : | **Social Background of Indian Nationalism 1987.** |
| Farquhar, J. N. | : | **Modern Religious Movements in India 1977.** |
| Heimsath, Charles H. | : | **Indian Nationalism and Hindu Social Reform 1964.** |
| Jones, Kenneth W | : | **The Cambridge History of India, III - 1, Socio - religious reform** |
| Kesavanerayana, B. | : | **Political and Social Factors in Andhra 1900 - 1956, 1976.** |
| Majumdar, Bimanbehari | : | **History of Indian Social and Political Ideas from Ram Mohan to Dayananda, 1967.** |
| Narain, V.A | : | **Social History of Modern India.** |
| Natarajan, S | : | **A century of Social Reform in India, 1959.** |
| O Malley. L. S. S | : | **Modern India and the West, 1941** |
| Ramakrishna, V | : | **Social Reform in Andhra (1848 - 1919) 1983** |
| Sita Rama Singh | : | **Nationalism and social Reform in India, 1968.** |


B R A O U

రచయిత : ఆచార్య బి. కేశవనారాయణ

# భాగం - 18 కుల ఉద్యమాలు

విషయక్రమం

18.0 లక్ష్యాలు
18.1 పరిచయం
18.2 మధ్య యుగాల్లో భక్తి ఉద్యమం
18.3 కుల వ్యవస్థ
18.4 బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన మార్పుల ప్రభావం
18.5 మత, సాంఘిక సంస్కరణోద్యమాలు : కుల వ్యతిరేక పోరాటం
18.6 జ్యోతిరావ్ గోవిందరావ్ ఫూలే ఉద్యమం
18.7 శ్రీనారాయణగురు
18.8 జస్టిస్ పార్టీ
18.9 ఆత్మగౌరవ ఉద్యమం
18.10 డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ (1891 - 1956)
18.11 కాయస్థులు
18.12 సంగ్రహంగా
18.13 పరీక్ష నమూనా ప్రశ్నలు
18.14 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 18.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల కింది విషయాలను గురించి తెలుసుకోగలగాలి.

- మధ్య యుగంలో కుల వ్యతిరేక భక్తి ఉద్యమాలు.
- బ్రిటిష్ పాలన వల్ల వివిధ రంగాల్లో వచ్చిన మార్పులు. కుల వ్యవస్థపై వాటి ప్రభావం.
- పశ్చిమ భారతదేశంలో కుల వ్యవస్థపై ఫూలే నాయకత్వంలో జరిగిన దాడి.
- మద్రాస్ రాష్ట్రంలో బ్రాహ్మణాధిపత్యాన్ని గర్హిస్తూ జస్టిస్ పార్టీ, శ్రీ నారాయణగురు, రామస్వామి నాయకర్‌లు నాయకత్వంలో బ్రాహ్మణేతర కులాల అభివృద్ధికై జరిగిన ప్రయత్నాలు.
- ఉత్తర భారతదేశంలో కాయస్థ కుల ఉద్యమం, జాత్యంతర వివాహాలకై జరిగిన విఫల ప్రయత్నం.
- దళిత జనోద్ధరణకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషి.

## 18.1 పరిచయం

కుల వ్యవస్థ అతి ప్రాచీనమైంది. దానివల్ల సంఘంలో అసమానతలు ఏర్పడి, కొన్ని వర్గాలవారు అణచివేతకు గురయ్యారు. అట్టి వ్యవస్థకు వ్యతిరేకంగా మధ్య యుగంలో భక్తి ఉద్యమ నాయకులు ప్రచారం చేశారు. ఆధునిక యుగంలో మత, సాంఘిక సంస్కర్తలు కుల వ్యత్యాసాలను తీవ్రంగా ఖండించారు. సమానత్వం కోసం కృషి చేశారు. వారేగాక నిమ్న కులాలకు చెందిన పూలే, అంబేద్కర్‌లు మహారాష్ట్ర ప్రాంతంలో, శ్రీనారాయణ గురు కేరళలో ఉద్యమాలను నడిపారు. తమిళనాడులో రామస్వామి నాయకర్ నాయకత్వాన ఆత్మగౌరవ ఉద్యమం కూడా కుల వ్యవస్థపై దాడిచేసింది.

## 18.2 మధ్య యుగాల్లో భక్తి ఉద్యమం

మధ్య యుగాల్లో కుల వ్యతిరేక ఉద్యమం భక్తి ఉద్యమంగా సాగింది. భక్తి ఉద్యమాలు భారతదేశంలో 13వ శతాబ్దంలోనే ప్రారంభమయ్యాయి. మధ్య భారతంలోను, ఉత్తర భారతదేశంలోనూ పదమూడు, పద్దెనిమిది శతాబ్దాల మధ్య కాశ్మీర్ నుండి అస్సాం, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటకలకు పాకి, ఒక వెల్లువలా పతాక ఘట్టానికి చేరుకున్నాయి. భగవంతునిపై ప్రేమతో అహాన్ని విసర్జించడం, మానవ నిర్మితమైన సాంఘిక నియమాల్ని తిరస్కరించడం భక్తి ఉద్యమ ప్రధాన లక్షణాలు. భక్తి కవుల్లో మొట్టమొదట చెప్పుకోదగిన వాడు, శ్రీవైష్ణవ మత నాయకుడైన రామానంద (1360-1470). ఉత్తర భారతదేశంలో ఆయన బోధనలు వ్యాపించాయి. అన్ని కులాల నుండి శిష్యుల్ని స్వీకరించాడు. ఆయన శిష్యుల్లో ముఖ్యుడు గురునానక్. ఇతడు పదిహేను, పదహారు శతాబ్దాల్లో చురుగ్గా పనిచేశాడు. నానక్ సిక్కు మత వ్యవస్థాపకుడు. ఏకేశ్వరోపాసకుడు, కుల విద్వేషాలను తీవ్రంగా విమర్శించాడు. సమానత్వాన్ని బోధించాడు. నిర్గుణ భక్తి మార్గానికి కబీర్ ఆద్యుడు. ఇతడు ముస్లిం. కాని ఇస్లాం మతాన్ని విడిచిపెట్టి, భగవంతుడికీ, మానవుడికీ మధ్య మానవ నిర్మితమైన బంధాలేవీ లేని విశాల ప్రాతిపదికపై ఒక మత విశ్వాసాన్ని ప్రారంభించాడు. కుల వ్యవస్థను, కర్మకాండలను తిరస్కరించాడు. సార్వజనీన సౌభ్రాతృత్వంలో కబీర్‌కు ప్రగాఢ విశ్వాసం.

మహారాష్ట్రకు చెందిన తుకారాం కుల మర్యాదలను పాటించడం, పవిత్ర గ్రంథాల పారాయణం మొదలైనవి చేసి, మోక్షం సాధించాలనడాన్ని తిరస్కరించమని తన అనుయాయులకు బోధించాడు. వీటన్నిటి కంటే భగవంతునిపై ప్రేమ చాల ముఖ్యం అని చెప్పాడు. ఒక మనిషి ఔన్నత్యానికి అతని కులం కారణం కాదు; భగవంతునిపై ప్రేమ కారణం అన్నాడు. కృష్ణ భక్తుడైన చైతన్య బెంగాల్‌కు చెందినవాడు. ఆయన బ్రాహ్మణ కర్మకాండల వ్యవస్థను, కులాన్ని వ్యతిరేకించాడు. కన్నడ ప్రాంత వీరశైవులు నిరాకారుడైన దేవుని విశ్వసించే వారు. కులాన్ని తిరస్కరించారు. పుట్టుక ప్రాతిపదికగా వ్యత్యాసాలను వారు గుర్తించ లేదు.

భక్తి ఉద్యమకారులు సాంస్కృతిక విలువలను ప్రచారం చేశారు. కుల వ్యతిరేక ఉద్యమంలో చారిత్రక పాత్రను వారు నిర్వహించారు. పాతుకుపోయిన సనాతన వాదం, కులదొంతరలు, సామాజిక విభజన, కర్మకాండలను వ్యతిరేకించారు. వారు బోధించిన దాన్ని ఆచరించారు. అందువల్ల వారు మంచి పేరు, ప్రఖ్యాతలు గడించారు. భక్తి ఉద్యమకారుల్లో ఎక్కువ మంది అట్టడుగు కులాలవారే. దేవుని ముందు అందరూ సమానులే అన్న సత్యాన్ని ప్రచారం చేసిన ఈ భక్తి ఉద్యమాలు కూడా సాంఘిక వ్యవస్థలో మౌలికమైన మార్పులను తెచ్చి, కులాన్ని నిర్మూలించలేక పోయారు.

BRAOU

## 18.3 కుల వ్యవస్థ

భారతీయ సమాజంలో కులం, దాని ప్రాముఖ్య ప్రాభవాల గూర్చి, అది సమాజంలో లేవనెత్తిన సమస్యల గూర్చి, ప్రథమ ఖండంలో మీరు చదివే వున్నారు.

హిందూ మతానికి కుల వ్యవస్థ ఒక ఉక్కు చట్రంలాంటిది. అది ఒక ప్రాచీన సామాజిక వ్యవస్థ. కులాలన్నీ అంతస్తుల దొంతరగా పేర్చబడ్డాయి. క్రమానుగణ శ్రేణి (hierarchical order) విధానంలో ప్రతి మనిషి అంతస్తు, హోదా అతను పుట్టిన కుల వర్గీకరణబట్టి ఉండేది. ఆ విధంగా అతని హోదా ముందే నిర్ణయింపబడేది. పుట్టుక ప్రాతిపదికగా నిర్ణయింపబడ్డ వ్యక్తి హోదా ఎట్టి పరిస్థితులలోను తెలివితేటల ఆధారంగా కాని, సంపాదించిన ఆస్తిపాస్తుల ఆధారంగాకాని మార్చడానికి ఎవరికీ సాధ్యపడేది కాదు. ఏ కులంలో పుట్టిన వ్యక్తి ఆ కులానికి నిర్దేశించిన వృత్తిని మాత్రమే ఆచరించాల్సిన నియమం ఉండేది. అతనికి వేరొక వృత్తిని ఎంచుకొనే అర్హత లేదు. ఏ కులంలో పుట్టిన వ్యక్తి ఆ కులానికి చెందిన స్త్రీని వివాహమాడే పద్ధతి ప్రతికులంలోనూ ఉంది. కుల ధర్మాలు పటిష్టంగా, క్రూరంగా అమలు జరిగాయి.

కుల వ్యవస్థ వల్ల సాంఘిక, న్యాయపరమైన అసమానతలు ఏర్పడ్డాయి. కుల నిచ్చెన అట్టడుగున అంటరాని వారు (untouchables) ఉన్నారు. వారు అణచివేతకు గురయ్యారు. అతి నిమ్నమైన వృత్తులు వారికి కేటాయించబడ్డాయి. పాకీపని, తోళ్ల పరిశ్రమ, గ్రామీణ వ్యవసాయ కార్మిక వృత్తి వారి జీవన విధానం సవర్ణ కులాలకు దూరంగా, ప్రత్యేక ప్రాంతాల్లోవారు నివసించేవారు. దేశంలో ముఖ్యంగా దక్షిణాదిన వారి పరిస్థితి దుర్భరంగా ఉండేది.

కుల నియమాలను ఉల్లఘించిన వారు సంఘ బహిష్కరణ, జరిమానా, శారీరక హింస మొదలైన శిక్షలకు గురయ్యారు. ఒక కులానికి చెందిన వ్యక్తి తాను పుట్టిన కులానికి, తర్వాత సంఘానికి విశ్వాసపాత్రుడై ప్రవర్తించు కునేవాడు. ఈ విధమైన పద్ధతి అతనిలో సంఘీభావం బలపడటానికి దోహదపడలేదు. కులమే అన్నింటికి ప్రధాన మనే భావం వృద్ధిచెందింది. ప్రతి కులం దానికి సంబంధించినంత వరకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళిని ఆ కుల సభ్యులపై రుద్దింది. వారు కొన్ని నియమాలు, కట్టుబాట్లను కచ్చితంగా ఆచరించాలి. వర్ణ వ్యవస్థను మతం గుర్తించడం వల్ల దానికి పవిత్రత చేకూరింది. కులానికి వ్యతిరేకంగా చేసిన నేరాన్ని మతానికి వ్యతిరేకంగా చేసిన పాపంగా పరిగణింపబడేది.

## 18.4 బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన మార్పుల ప్రభావం

భారతదేశంలో బ్రిటిష్‌వారి పరిపాలన ఆరంభమైన తర్వాత సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వచ్చిన మార్పుల పర్యవసానంగా కుల వ్యవస్థకు పూర్వం గల ప్రాముఖ్యత కొంత వరకు తగ్గింది. పాతకాలపు ఛాందస విలువలు క్రమంగా బలహీనపడ్డాయి. క్రైస్తవ మిషనరీల నిర్వహణలోని విద్యాలయాల్లోను, ప్రభుత్వ విద్యాసంస్థల్లోను విద్యాభ్యాసం చేసిన వారందరికీ సమాన అవకాశాలు లభించాయి. వివిధ వర్గాలవారు ఒక దగ్గర కలిసిమెలిసి చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం, అభివృద్ధిచెందిన ప్రయాణ సౌకర్యాలు, పారిశ్రామిక విప్లవం, పట్టణ వాతావరణం ఫలితంగా కుల నియమాలను పాటించడం సాధ్యపడలేదు. పాశ్చాత్య దేశాల ఉదార వాద తత్వాన్నీ, ప్రజాస్వామిక సంస్థల స్వరూప స్వభావాలనూ జీర్ణించుకొన్న మధ్య తరగతి హిందూ మేధావుల్లో కొందరు అప్రజాస్వామిక సంస్థ అయిన కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహించారు

BRAOU

## 18.5 మత, సాంఘిక సంస్కరణోద్యమాలు, కుల వ్యతిరేక పోరాటం

సాంఘిక వ్యవస్థలోగల అసమానతలను రూపుమాపి, సమసమాజ నిర్మాణానికి ఆ మేధావి వర్గం పూనుకుంది. రాజా రామ్‌మోహన్ రాయ్, దేవేంద్రనాథ టాగూర్, కేశవచంద్ర సేన్‌ల వంటి మేధావుల కార్యక్రమాల్లో కుల సంస్కరణ ప్రధాన అంశమైంది. వారు కుల వ్యవస్థను తిరస్కరించి, కుల వ్యత్యాసాలకు మూలం అయిన వారసత్వం, వర్ణ వ్యవస్థలను సమర్థించిన కర్మ సిద్ధాంతాన్ని విమర్శించారు. దేశ సమైక్యతకు, సంఘీభావానికి వర్ణ వ్యవస్థ శక్తిమంతమైన ప్రతిబంధకమని ప్రచారం చేశారు. కరడుగట్టిన కుల విభేధాలను హేతు వాదం, మానవతా వాదం అనే సిద్ధాంతాల మీద ఆధారపడ్డ బ్రహ్మ సమాజం వ్యతిరేకించింది. రామ్‌మోహన్ రాయ్ కంటే తీవ్ర స్వరంతో దేవేంద్రనాథ టాగూర్, కేశవచంద్ర సేన్‌లు హిందూ శాస్త్రాలను విమర్శించారు. శాస్త్రాలను ఉటంకించ కుండా, కేశవ చంద్రసేన్ మాత్రమే కుల వ్యవస్థను నిర్ద్వంద్వంగా నిరాకరించాడు. బ్రహ్మ సమాజ ప్రభావానికి లోనైనవారు సంస్కరణోద్యమాన్ని ప్రభావితం చేశారు. నూతన శకానికి నాంది పలికారు.

బ్రహ్మ సమాజం ప్రారంభించిన కుల వ్యతిరేక భావాల్నీ, ప్రయత్నాలను దేశంలో ఆవిర్భవించిన ఇతర సమాజాలు కొనసాగించాయి. బొంబాయి ప్రార్థనా సమాజం వర్ణ వ్యవస్థ నిర్మూలనోద్యమాన్ని నడిపింది. బ్రహ్మ సమాజం బాటలోనే ప్రార్థనా సమాజికులు కుల విభేదాలను వ్యతిరేకిస్తూ ప్రచారం చేశారు. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం వల్ల బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజాలు కుల వ్యవస్థను నిరసించాయి. అయితే ఆర్య సమాజం కుల వ్యవస్థను నేరుగా నిరాకరించకుండా, వేద కాలంలోవున్న చాతుర్వర్ణ్యాల ఆధారంగా హిందూ మత పునరుజ్జీవనం జరగాలని ప్రబోధించింది. హిందూ సమాజాన్ని ముక్కలు ముక్కలుగా చేయడాన్ని వ్యతిరేకించి, ప్రాచీన కాలం నాటి చాతుర్వర్ణ్యాల క్రమం ప్రకారం సాంఘిక వ్యవస్థను సంస్కరించాలని ఆశించింది. శూద్రులకు కూడా శాస్త్రాధ్యయనం చేసే హక్కు కల్పించాలని నాదించింది.

భారతీయ తాత్విక శ్రేణిలో ప్రథముడుగా వివేకానంద కుల వ్యవస్థనీ, అందులోని వైషమ్యాలనూ ప్రతిఘటించాడు. గాంధీ మతాతీత, కులాతీత జాతీయోద్యమాన్ని నడిపాడు. హరిజనోద్ధరణ ఉద్యమం ద్వారా జాతిని మేల్కొలిపి, మూఢ విశ్వాసాలను సడలించాడు. గాంధేయ వాదులు కుల కట్టుబాట్లను ధిక్కరించి, హరిజనులతో సహపంక్తి భోజనాలు చేశారు. వర్ణాంతర వివాహాలను చేసుకున్నారు.

ఈ సమాజాలూ, నాయకులే కాకుండా, శతాబ్దాల నుండి వర్ణ వ్యవస్థవల్ల సామాజికంగా అనేక నిషక్షతలకు గురైన కులాల్లో పుట్టిన జ్యోతిరావ్ పూలే, డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్,శ్రీ నారాయణ గురు, రామస్వామి నాయకర్, వంటి ప్రముఖులు వర్ణ వ్యవస్థపై పోరాటం సల్పి, గొప్ప సమాజ సంస్కరణవాదులుగా ప్రసిద్ధి చెందారు. వారందరి అంతిమ లక్ష్యం అట్టడుగు వర్ణాల అభ్యున్నతి.

## 18.6 జ్యోతిరావ్ గోవిందరావ్ పూలే ఉద్యమం

పశ్చిమ భారతదేశంలో పూలేకు పూర్వం కుల వ్యవస్థకు వ్యతిరేకంగా కొంత కృషి జరిగింది. ఎల్ఫిన్‌స్టోన్ కళాశాలకు చెందిన విద్యార్థులు, సంస్కర్తలు కలిసి మరాఠీ జ్ఞాన ప్రసారక సభను స్థాపించారు. దడోబా పాండురంగ్ ఆ సంస్థ మొదటి అధ్యక్షుడు. జ్ఞానాన్ని ఉపయోగించి సాంఘిక, మత వ్యవస్థల్ని మలచుకోవాలని ఈ సంఘం విజ్ఞప్తి చేసింది. దడోబా పాండురంగ్ బొంబాయిలో పరమహంస మండలిని స్థాపించడంలోనూ ప్రధాన పాత్ర నిర్వహించాడు. లౌకిక భావాల్ని ప్రచారం చేసి, పరమేశ్వరుని సృష్టిలోని మానవులంతా ఒకటేనని ఆ మండలి

బోధించింది. దాని భావాలు 1. భగవంతుడొక్కడే, అతన్నే పూజించాలి. 2. మానవులందరి మతం ఒక్కటే. 3. మానవులంతా ఒకే కులం 4. ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ ఉంది. మండలి సభ్యులు కులాన్ని విశ్వసించలేదు. దదోబా పాండురంగ్ సూరత్‌లో స్థాపించిన మానవ ధర్మ సభ కూడా ఈ భావాలనే ప్రచారం చేసింది.

మహారాష్ట్ర ప్రాంతంలో అంటరాని వారి కోసం కృషిచేసిన వారిలో అగ్రశ్రేణి నాయకుడు పూలే. కులాల వరసలో సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడ్డ సాదా కుంబీ (kumbi) లు ఉన్నారు. వ్యవసాయమే వృత్తిగా సాంప్రదాయ వాతావరణంలో వారు పెరిగారు. పరస్పర వివాహ సంబంధాలుగల విస్తృత కులాల సమూహం కుంబీ.

1875 పూర్వం కుల వ్యవస్థను వ్యతిరేకించమని బ్రాహ్మణేతరులు కొందరు కుంబీ కులం వారిని ప్రోత్సహించారు. వారి ప్రయోజనాలేమిటో వారు గ్రహించేట్లు చేశారు. అట్టి నాయకుల్లో జ్యోతిబా పూలే అనే తోటమాలి ప్రముఖుడు. 1827లో కుంబీల ఉపకులమైన మాలి (mali) కుటుంబంలో జన్మించాడు. దళిత జాతుల కోసం ఉద్యమాలను నడిపి బొంబాయి రాష్ట్రంలోనే గొప్ప రాజకీయ ఉద్యమాన్ని నిర్వహించి, దళితుల్లో చైతన్యం ఏర్పడేటట్లు చేయగలిగాడు. ప్రాచీన సాంఘిక, మత విలువలకు వ్యతిరేకంగా విప్లవాన్ని నిర్మించడంలో పూలే తన శక్తిని కేంద్రీకరించాడు. ఆయన ఉద్యమం సాంఘిక వ్యవస్థలోని కుల వ్యతిరేకతను పెంచాయి.

పూలే స్కాటిష్ మిషనరీ పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. మిషనరీలతో తనకు ఉన్న సహవాసం బ్రాహ్మణుల విషయంలో తన దృక్పథాన్ని ప్రభావితం చేసి, బ్రాహ్మణేతరుల నైతిక, భౌతిక పరిస్థితులను మెరుగు పర్చాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. ఈ లక్ష్యం సాధించడానికి మొదట నిమ్న కులాల పిల్లలకు పాఠశాలలు నెలకొల్పాడు. విద్యారంగంలో తాను ఆశించిన మేరకు ప్రగతి సాధించలేక, క్రియాశీల రాజకీయ కార్యక్రమాన్ని చేపట్టాడు. 1848లో పూలే ఆలోచనా విధానంలో ఒక కీలకమైన మార్పు వచ్చింది. ఆ సంవత్సరంలో థామస్ పెయిన్ (Thomas Paine) రచనలు మొదటిసారి చదివాడు. ఆ సంవత్సరంలోనే నిమ్న కులాల బాలికలకు పూణేలో పాఠశాల స్థాపించాడు. స్త్రీలకు విద్య లేకపోవడమే హిందూ దేశ క్షీణ పరిస్థితికి కారణం అన్నాడు పూలే.

BRAOU

1855లో 'తృతీయ రత్న' అనే నాటకాన్ని పూలే రాశాడు. 125 సంవత్సరాల తర్వాత (1979)లో అది అచ్చయింది. అందులో దళితుల సమస్యల్ని అస్పృశ్యుల బాధల్నీ వివరించాడు. హిందూ మతం దళితుల్ని నిరుపేదలుగా చేసిందని ఈ నాటకం విశదపరచింది. దళితులపై హిందూ మత ప్రభావం, వారిని అణచివేస్తున్న సాంఘిక నియమాలు పూలే నాటకంలోని ముఖ్యాంశాలు. దళితుల విముక్తికి పాశ్చాత్య విద్యను ఒక బలమైన ఆయుధంగా ఉపయోగించుకోవాలనీ, దళితులంతా ఏకం కావాలనీ బోధించాడు. బ్రాహ్మణులు ఎలా దళితుల్ని అణుస్తున్నారో, వర్ణ వ్యవస్థలో వారిని శూద్రులుగా చిత్రిస్తున్నారో ఈ నాటకం ద్వారా స్పష్టంగా చెప్పాడు. వివిధ కులాలుగా విభజించబడ్డ వారందరికీ సమానమైన జీవన విధానం ఉంటుందనీ, సమస్యలు అందరికీ సమానమేననీ చెప్పాడు. ఇందులోని వర్ణనల్లో సాంఘిక, నైతిక దురాచారాలన్నిటికీ బ్రాహ్మణుడు కారణం అనే భావాన్ని పాఠకుల్లో కల్గజేయటానికి ప్రయత్నించినట్లు స్పష్టంగా కన్పిస్తుంది.

పూలే 1869-1873 మధ్య కాలంలో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమానికి రూపురేఖలను దిద్దాడు. ఈ కాలంలో మూడు ప్రధాన రచనలు చేశాడు. అవి 1. రాజా ఛత్రపతి శివాజీ భోంస్లే చరిత్ర (1869), 2. పురోహితుల బండారం బట్టబయలు (1869), 3. గులాంగిరి (1873).

పూలే రచనల్లో 'గులాంగిరి' తలమానికం లాంటిది. ఇది వచన గ్రంథం. దళితులపై బ్రాహ్మణులు చేసిన అత్యాచారాల్ని, అణచివేతల్ని కనపడనివ్వకుండా ఉండడం కోసం నిజమైన ప్రాచీన భారతదేశ చరిత్రను

బ్రాహ్మణులు ఎన్నో మార్పులు చేసి పురాణ గాథలు మలిచారని పూలే వాదన. పరిపాలనా రంగంలో బ్రాహ్మణాధిపత్యాన్ని ఎదుర్కొని, దళిత కులాలవారు చదువుకొని ఉద్యోగాలు చెయ్యాలని అన్నాడు. విజ్ఞానం కొద్దిమంది గుప్పిట్లో దాగి ఉండటాన్ని వ్యతిరేకించాడు. పూర్వం బ్రాహ్మణులు స్థానికంగా నివసించిన వారనీ, వారందరూ ఆర్య జాతికి చెందినవారనీ, ఆ స్థానికులను తర్వాత శూద్రులుగా కొత్తగా వచ్చినవారు పరిగణించారని వాదించాడు. 'గులాంగిరి'కి రాసిన పీఠికలో బ్రిటిష్ ప్రభుత్వం, తమ పాలనలో బ్రాహ్మణుల ప్రమేయాన్ని తగ్గించి, శూద్రుల్ని మానసిక దాస్యం నుండి విముక్తి చెయ్యాలనీ ప్రార్థించాడు.

పరశురాముడు విష్ణుమూర్తి అవతారం అని చెప్పడాన్ని విమర్శించాడు పూలే. పరశురాముడు వేలకొలది క్షత్రియుల్ని హత్య చేశాడనీ, స్త్రీలను, చిన్నపిల్లల్ని దుర్భర పరిస్థితికి గురిచేశాడనీ వివరించాడు. మానవులందరికీ కొన్ని సహజ సిద్ధమైన హక్కులు ఉన్నాయని, ఆ హక్కుల్ని పూర్తిగా ఉల్లంఘించింది గనుక హిందూ మతాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బలపరచలేమనే సంగతిని గులాంగిరి పొడవునా నొక్కి వక్కాణించాడు పూలే.

ప్రజాతంత్ర విలువల వల్ల ప్రభావితమైన నూతన రాష్ట్ర ప్రభుత్వ పాలకులు సమసమాజాన్ని స్థాపించాలనే ధ్యేయంతో ఛాందస బ్రాహ్మణుని, శూద్రుని 'సమానంగా చూచారు' ఈ విధానాన్ని ప్రత్యేకంగా పూలే మెచ్చుకున్నాడు. అజ్ఞానంతో బ్రిటిష్‌వారు అనుసరించిన విధానాలు ఇతర కులాలవారిపై బ్రాహ్మణుల అధికారం బలపడడానికి దోహదపడిందని పూలే వాదించాడు. నూతన విద్యా విధానం బ్రాహ్మణులకే అధికంగా ఉపయోగపడింది. సివిల్ సర్వీసులను, వృత్తులను వారు పూర్తిగా వశపరచుకున్నారు. అందువల్ల బ్రిటిష్ వారి కాలంలో శూద్రుల స్థితిగతులు మరింత దిగజారాయి. పట్టణాల్లోలాగే ప్రాముఖ్యత లేని గ్రామాల్లో బ్రాహ్మణుని మాటే చెల్లుబాటు అయింది.

బ్రిటిష్‌వారు నెలకొల్పిన పాఠశాలలు, కళాశాలలు బ్రాహ్మణాధిపత్యం మరింతగా బలపడటానికి ఉపయోగపడ్డాయని పూలే అభిప్రాయం. ఈ విషయాన్ని 1884లో కేంద్ర ప్రభుత్వ విద్యా కమీషన్ ముందుంచాడు. అందువల్ల బ్రాహ్మణేతరులైన కుంబీల విద్యావకాశాలు విస్తృతం చేయవలసిన నైతిక బాధ్యత ప్రభుత్వానికి ఉందని పలికాడు. దేశానికి ప్రాణం, ప్రధాన భాగం శూద్రులని, వారు సంతోషంగా ఉంటే భవిష్యత్తులో ప్రభుత్వానికి విశ్వసపాత్రులుగా ఉంటారన్న విషయం నిస్సందేహం అని పూలే కమీషన్ దృష్టికి తెచ్చాడు.

మత స్వేచ్ఛపట్ల గల ప్రగాఢ వాంఛ 'సత్యశోధక సమాజ్' (Satya Sodhak Samaj) స్థాపనకు దారితీసింది. పూలే ఇతర ఆదర్శ భావాలుగల నిమ్న జాతుల మేధావులు కలిసి దీనిని 1873లో స్థాపించారు. ఈ సంస్థ నిమ్న కులాల్లో ఒక భావ జాల స్పృహ కలిగించాలనే లక్ష్యంతో పనిచేసింది. విగ్రహారాధననూ, కుల భేదాన్నీ వ్యతిరేకించింది. శూద్రులకు తగిన సలహాలు ఇచ్చేందుకూ, వారిలో విద్యావ్యాప్తి చేసేందుకూ, వారు తమ హక్కులను తాము తెలుసుకొనేలా చేసేందుకూ ఈ సమాజం కృషి చేసింది. 1. సమాజ సభ్యులు సత్యాన్నీ, సక్రమమైన ఆలోచనా విధానాన్నీ ప్రజల్లో ప్రచారం చెయ్యాలి 2. సభ్యులు ప్రజలకు ఉపన్యాసాల ద్వారా, వార్తాపత్రికల ద్వారా వారి హక్కులను గూర్చి తెలియపరచాలి. 3. పిల్లలకూ, స్త్రీలకూ విద్య ఆవశ్యకతను తెలియపరచి ప్రోత్సహించాలి. 4. సాంఘిక దురాచారాన్నీ, వ్యక్తిగత దురలవాట్లనూ పారద్రోలే ప్రయత్నం చెయ్యాలి.

సత్యశోధక మండలి పూణే పరిసర గ్రామాల్లో ఉన్న నిమ్న జాతుల ఉద్ధరణకు తన శక్తికొద్దీ కృషిచేసింది. పూలే రచించిన పుస్తకాలను ఉచితంగా పంచిపెట్టింది. సమాజ సభ్యులు బ్రాహ్మణ పురోహితులను బహిష్కరించి ఎవరికి సంబంధించిన కర్మకాండలను వారే నిర్వహించుకున్నారు. 1882 నుండి సమాజ కార్యకలాపాలు పూణే, అహ్మద్ నగర్, థానా పరిసర ప్రాంతాల్లోని గ్రామాలకు విస్తరించాయి.

BRAOU

ఫూలే బ్రాహ్మణ వ్యతిరేక పోరాటం తక్షణం ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు. కాని ఆయన కుల వ్యవస్థకు, బ్రాహ్మణాధిక్యతకు వ్యతిరేకంగా ప్రారంభించిన సాంఘిక విప్లవం బ్రాహ్మణుల అధికారానికి ప్రమాదం ఏర్పడే పరిస్థితులను కల్పించింది. కుంబీల పురోభివృద్ధిని కాంక్షించి, సత్యశోధక్ సమాజం ద్వారా ఫూలే మిత్రులు కూడా పనిచేశారు. అట్టి వారిలో మాలీ కులస్తుడైన కృష్ణారావ్ పాండురంగ్ బాలేకర్ ఒకరు. బీదవారంటే ఆయనకున్న ప్రగాఢ సానుభూతి కారణంగా, బ్రాహ్మణేతరుల నాయకుడైనాడు. పేరు ప్రఖ్యాతులున్న సర్జన్ వి.ఆర్. గోలే (V.R. Gholay) కూడా ఫూలే అనుచరులలో ఒకడు. ఫూలే మరణానంతరం 'సత్యశోధక్ సమాజ్' కార్యకలాపాలు 'నారాయణ్ పెన్సె' (Pensai) నాయకత్వంలో కొనసాగాయి. వీరి ఉద్యమం ఫలితంగా కుంబీలలో ఆత్మ విశ్వాసం పెరిగింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో తమను నియమించాలని పట్టుబట్టారు.

1889 తర్వాత కాలంలో గయక్వాడ్ మహారాజా శియోజీరావు గైక్వాడ్, కొల్హాపూర్ మహారాజు అయిన సాహు మహారాజ్‌లు ఈ ఉద్యమం అభివృద్ధి చెందటానికి తోడ్పడ్డారు. ఆర్థిక సహాయాన్ని అందించారు. 'దీన బంధు', 'దినమిత్రా' పత్రికలు సత్యశోధక ఆధ్వర్యంలో నడిచాయి.

## 18.7 శ్రీనారాయణగురు

19వ శతాబ్దం ఉత్తరార్థంలో కేరళలో నిమ్న కులాలు, క్రైస్తవ మతం స్వీకరించినవారి నిరసన ధ్వనులు అధికంగా విన్పించాయి. అన్ని కులాలవారు తమ కులస్తులు సాంఘికంగా అభివృద్ధి చెందడానికి సంస్కరణోద్యమాలను నిర్వహించారు. తరంగాల్లాగా కొనసాగి, ఐచ్ఛికంగా వచ్చిన ఈ ఉద్యమాలకు ఆయా కులాలకు చెందినవారే నాయకత్వం వహించారు. హిందూ సమాజంలో తగిన గుర్తింపు, సౌకర్యాలు లేని అన్ని కులాలవారు పాశ్చాత్య స్వేచ్ఛాయుత భావాలకు, మిషనరీల ప్రభావానికిలోనై, ప్రాథమిక పౌరహక్కులను పొందటానికి పోరాటాన్ని సాగించారు. 1829-1859 మధ్యకాలంలో షానర్ తెగవారు తిరుగుబాటు చేశారు. ఆ తెగకు చెందిన స్త్రీలు రొమ్ము పర్యంతం వస్త్రధారణ చేయకూడదనే నియమాన్ని విధిస్తూ, అతి దారుణమైన ఆంక్షలు అమలులో ఉన్నాయి. వీటిని నిరసిస్తూ షానర్ కులస్తులు చేసిన తిరుగుబాటును సవర్ణులు నిరసించారు. దక్షిణ తిరువాన్కూర్ ప్రాంతంలో సాయుధులై, ఆ రెండు వర్గాల వారు సంఘర్షణకు దిగారు. ఈ పరిస్థితుల్లో మద్రాస్ రాష్ట్ర గవర్నర్ లార్డ్ హారిస్ (Lord Harris) జోక్యం చేసుకున్నాడు. తిరువాన్కూర్ మహారాజు నిమ్న కులస్తుల హక్కులను గుర్తిస్తూ ఒక ప్రకటన చేయడంతో ఈ సమస్య పరిసమాప్తమైంది.

1896లో 13,176 మంది 'ఎజవ' (Ezhva) కులస్తులు తాము నిత్యం ఎదుర్కొంటున్న సాంఘిక అనర్థాలను తొలగించమని డాక్టర్ పి. పాల్పు (Dr. P. Palpu) నాయకత్వంలో ఒక విజ్ఞాపన పత్రాన్ని ప్రభుత్వానికి సమర్పించారు. నాటినుండే రాజ్యాంగబద్ధమైన వారి ఆందోళన ప్రారంభమైంది. వీరు కల్లుతీయటం, చాపలు అల్లటం, కొబ్బరినార తీయటం వంటి వృత్తులు చేపట్టేవారు. నిమ్న కులంలో పుట్టటంవల్ల సాంఘికంగా వీరిని దాసులుగా పరిగణిస్తూ, ప్రాథమిక హక్కులైన ఉద్యోగాలు చేయటం, పదిమంది నడిపించే దారిలో నడవటం, పాఠశాలలకు వెళ్ళి చదువుకోటం మొదలైన సౌకర్యాల తోటి సమాజం నిరాకరించింది. 19వ శతాబ్దిలో వారి నిరసనోద్యమం స్వల్పంగా ఉంది. కాని 20వ శతాబ్దం తొలి దశాబ్దాల్లో ఆధ్యాత్మిక నాయకుడైన శ్రీ నారాయణగురు, సుప్రసిద్ధ కవి కుమారన్ ఆసన్ (Kumaran Asan) నాయకత్వంలో వీరు గొప్ప ఉద్యమాన్ని నిర్వహించారు.

కేరళలో హిందూ సవర్ణుల జనాభాకంటే, వెలివేయబడ్డ 'ఎజవా' కులంవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఆ కులంలో శ్రీనారాయణగురు జన్మించాడు. కేరళ ఆధునిక సమాజంపై అత్యధిక ప్రభావం చూపిన విప్లవాన్ని ఆయన ప్రారంభించాడు. ఈ విప్లవం ఎజవ కులంపై విధించిన నిరర్థకమైన ఆచారాలను, సాంప్రదాయబద్ధమైన

దురాచారాలను తొలగించడానికి ఒక ఉద్యమంగా ప్రారంభమైంది. ఆ ఉద్యమం సత్ఫలితాలనిచ్చింది. కేరళ ప్రజా జీవనాన్ని విశేషంగా మార్చివేసింది. బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం, మిగిలిన సాంఘిక సంస్కరణోద్యమాలు ఉన్నత వర్గాల నాయకత్వంలో నడిచాయి. పై స్థాయి నుండి సంస్కరించడానికి కృషిచేశాయి. కాని శ్రీనారాయణ గురు ఉద్యమాన్ని తక్కువ కులం నిర్వహించింది. తన ప్రభావాన్ని కింది కులాలనుండి పైకులాలకు వ్యాపించేట్లు చేసింది.

కేరళలో ప్రత్యేకించి తిరువాన్కూర్, కొచ్చిన్‌లు ప్రాచీన సాంప్రదాయాలకు, కుల ఆచారాలకు పెట్టని కోటలు. ప్రభుత్వం వాటిని సమర్థించింది. సమాజం గుర్తించిన ఆచారాలను సంస్కరించడానికి పాత భావాలుగల పాలకులు సుతారమూ అంగీకరించలేదు. ఈ ఆచారాల్లో కొన్నింటికి శాస్త్ర సమ్మతి ఉంది; కొన్నింటిని నంబూద్రీలు సృష్టించారు. ఈ ఆచారాలకు, కట్టుబాట్లకు ఉన్నత కులాల సుఖసంతోషాలే మూలం. ప్రధాన రహదారుల ద్వారా వెలివేయబడ్డ కులాలవారు నడిచి వెళ్ళడానికి వీలులేదు. వారు రొమ్ము వరకు దుస్తులు ధరించ కూడదు. కాళ్లకు జోళ్లు వేసుకోరాదు. గొడుగు ధరించి వెళ్లరాదు. శాస్త్రాలు చదవరాదు. ఈ ఆంక్షల్లో ఏ ఒక్క దానికి శాస్త్ర సమ్మతి లేదు. కాని అవి పవిత్ర ఆచారాలుగా చలామణి అయ్యాయి. వాటిని రక్షించాల్సిన బాధ్యత తనదేనని పాలకులు భావించారు. కాని పాలకుల నుండి, అగ్రవర్ణాల నుండి సాంఘిక సంస్కరణకు అనుకూలంగా సానుభూతి, స్పందన లేవు.

ఈ నేపథ్యంలో శ్రీ నారాయణగురు ఉద్యమించాడు. అంటరాని వారు అభివృద్ధి చెందాలంటే, మొదట వారి దృక్పథంలో మార్పు తేవాలని భావించాడు. సాంఘికంగా అభివృద్ధి చెందాలంటే, వారిలో అంతర్గత మార్పు రావాలని అభిప్రాయపడ్డాడు. సంస్కరణలు ప్రవేశపెట్టడానికి నిష్పక్షపాతంగా, హేతుబద్ధంగా ఆలోచించాలని వారికి విజ్ఞప్తి చేయడం ఒక్కటే మార్గంగా, కన్పించింది. 'శ్రీ నారాయణ ధర్మపరిపాలన యోగం' (SNDP) అనే సంస్థను 1903లో స్థాపించి, దాని ద్వారా ఎజవ కులస్థుల్లో అద్భుతమైన మార్పును తీసుకొనివచ్చాడు. వారు సంస్కరణల వల్ల కలిగే లాభాలను స్వీకరించడానికి రంగాన్ని సిద్ధం చేశాడు. యస్.యన్.డి.పి. యోగం నిదర్శనాన్ని ఉన్నత కులాల సంస్థలైన 'నంబూద్రి యోగక్షేమ సభ' (Nambudiri Yogakshema Sabha), 'నాయర్ సేవా సమితి' (Nayar Service Society) హరిజనుల 'సాధుజన పరిపాలనా సభ', ఇతర నిమ్న కులాల సంస్థలు అనుసరించాయి. శ్రీ నారాయణగురు, కుమారన్ ఆసన్, డాక్టర్ పాల్పు, టి.కె. మాధవన్‌లు ప్రచారం చేసిన ఉద్యమం అనతి కాలంలోనే వ్యాప్తి చెందింది. ఈ ఉద్యమంవల్ల బలహీన వర్గాలు ప్రభావితులై, కొత్త ఆశలతో జీవితాలను ప్రారంభించారు. ఆధునిక కేరళలో వచ్చిన ఆధ్యాత్మిక, మత పునరుజ్జీవనం శ్రీనారాయణగురు కృషి ఫలితమే.

దక్షిణ భారతదేశంలో రెండు మిలియన్ల ప్రజలకు శ్రీ నారాయణగురు ఆధ్యాత్మిక గురువు. వారికి ఆయన మాట వేదవాక్కు. ఒక దశాబ్ది కాలంలో శ్రీ నారాయణగురు శివగిరి, పాల్ఘాట్, కొచ్చిన్, మలబార్, కంచి, మధురై, సింహళం వంటి ప్రదేశాల్లో నూటికి పైగా ఆరాధన మందిరాలను స్థాపించాడు. విద్య, ఆర్థిక, దాతృత్వ కార్యక్రమాలకు కేంద్రాలుగా అవి రూపుదిద్దుకున్నాయి. అతని ఆశయాల వ్యాప్తికి దక్షిణదేశమంతటా అనేక సంఘాలు ఏర్పడి, ఎజవల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేశాయి.

తాపే నిర్మించిన దేవాలయాల్లో ఆర్య దేవతలైన శివ, సుబ్రహ్మణ్యం వంటి దేవుళ్ల విగ్రహాలను నారాయణగురు ప్రతిష్ఠించాడు. తక్కువ కులాలవారు శాస్త్రాల్లో ప్రావీణ్యతను సంపాదించడానికి అవసరమైన శిక్షణ ఇచ్చాడు. వేద విజ్ఞానాన్ని వారికి బోధించాడు. నారాయణగురు అంటరాని వారికి కొత్త జీవితాలను ప్రసాదించాడు. వారు సవర్ణుల (బ్రాహ్మణుల) ఆలయాలకు వెళ్లటం మానివేశారు. ఫలితంగా సవర్ణుల

దేవాలయాల ఆదాయం గణనీయంగా పడిపోయింది. ఇటువంటి విప్లవాత్మకమైన మార్పు దక్షిణ భారతంలో ప్రప్రథమంగా వచ్చింది.

శ్రీ నారాయణ గురు ప్రారంభించిన సామాజిక, మత ఉద్యమం కేరళలో రాజకీయ చైతన్యాన్ని మేల్కొల్పింది. అన్ని కులాలవారిని రాజకీయంగా ఏకం చేయడానికి నారాయణగురు సమానత్వం, సహోదర భావాలను ఉపదేశించాడు. దానితో కులాల విషయంలో ఉన్న దురభిమానం, వైషమ్యం సమాజంలో తొలగిపోయాయి. విద్యావ్యాప్తికి, పారిశ్రామికాభివృద్ధికి నారాయణగురు చేసిన కృషి ఫలితంగా కేరళలో ఆధునిక సమాజం ఆవిర్భవించింది. నిమ్న కులాలవారు తమ పిల్లలను అమిత ఉత్సాహంతో చదివించారు. విద్య నభ్యసించినవారు ప్రభుత్వోద్యోగాల్లో చేరారు.

20వ శతాబ్దపు తొలిదినాల్లో నారాయణగురు తన విశాల దృక్పథంతో కుల వ్యవస్థను గుర్తించిన హిందూ సమాజాన్ని విమర్శించాడు. మనుషుల్లో ఉన్న కుల, మత, భాషా భేదాలు, వ్యత్యాసాలు మానవ కల్పితాలనీ, పుట్టుకచే అందరూ సమానమేనని ఆయన బోధనల సారాంశం. మనిషికి, మనిషికి మధ్య వ్యత్యాసాలు జన్మతః గానీ, వంశపారంపర్యంగా గానీ సంక్రమించవని, స్వార్థపరులు వాటిని సృష్టించారనీ, కుల భేదాలు విశ్వమానవ సౌభ్రాతృత్వానికి విఘాతం కల్గిస్తున్నావనీ, కులం వల్ల సమాజానికి ఎటువంటి ఉపయోగం లేదనే తన అభిప్రాయాలను నారాయణగురు ప్రజల్లో వ్యాపించజేశాడు.

కుల వ్యవస్థకు, అస్పృశ్యతకు వ్యతిరేకంగా నారాయణగురు సల్పిన పోరాటం అభ్యుదయ సమాజ ఆవిర్భావానికి నాంది పలికింది. కుల బేధాలు తప్పు, వాటిని తక్షణమే నిర్మూలించాలనీ చెప్పాడు. తన అనుచరులను కుల భేదాలు పాటించవద్దని కట్టడిచేశాడు. ప్రసంగాల్లో కుల ప్రస్తావనను గర్హించాడు. కులం మనిషిని అధోగతిపాలు జేస్తుంది గనుక కులం ఉండగూడదని నాదించాడు. ఒకే దేవుడు, ఒకే మతం, ఒకే కులం అన్న నినాదాన్ని ప్రచారం జేశాడు. తన అభిప్రాయాలను, ఆశయాలను మళయాళం, తమిళం, సంస్కృత భాషల్లో తాను రచించిన గ్రంథాల్లో, లఘు వ్యాసాల్లో విశదీకరించాడు.

బలహీన వర్గాలు ఆర్థికంగా బలపడటానికి పరిశ్రమలు, వాణిజ్యం, వ్యాపారం, వ్యవసాయం చేపట్టాలని సూచించాడు నారాయణగురు.

1919లో యువకుడైన ఎజవ నాయకుడు పి.కె. మహాదేవన్ నాయకత్వంలో అస్పృశ్యులు తమకు పౌరహక్కులు కావాలని డిమాండ్ చేశారు. వారి ప్రయత్నాలు పూర్తిగా విజయవంతం కాలేదు. అందువల్ల అంటరానితనం నుండి విముక్తి చెందటానికి అన్యమతాల్లోకి చేరాలన్న ఆలోచన ఎజవాలకు కల్గింది. కాని నారాయణగురు, మాధవన్‌లు మత మార్పిడిని వ్యతిరేకించారు. వైకం సత్యాగ్రహ ఉద్యమం ఫలితంగా, అంటరాని వారిపై విధించిన ఆంక్షలు తొలగిపోయాయి. వారు ప్రధాన రహదారులు స్వేచ్ఛగా ఉపయోగించటానికి, హిందూ దేవాలయాల్లో ప్రవేశించటానికి, అర్హత లభించింది. అందువల్ల ఎజవాలు మతం మారాలన్న ఆలోచనను వదలి వేసి, హిందూ మతంలోనే ఉండటానికి నిర్ణయించుకున్నారు. క్రమంగా వారికి విద్యాలయాల్లో ప్రవేశం లభించింది. కొన్ని ప్రభుత్వోద్యోగాలు వారికి కేటాయించబడ్డాయి.

యస్.యన్.డి.పి (SNDP) యోగం రాజకీయాలవైపు మొగ్గుచూపడం శ్రీ నారాయణగురుకు నచ్చలేదు. అందువల్ల 'యోగం'తో సంబంధాలు తెగతెంపులు చేసుకొని, 1928లో "నారాయణ ధర్మ సంఘ ట్రస్ట్" అను మత సంస్థను స్థాపించాడు. తాను ప్రారంభించిన దేవాలయాలు, స్థాపించిన మఠాలు, పాఠశాలలు, కర్మాగారాలు,

BRAOU

యావదాస్తిని ఆ ట్రస్ట్‌కు చెందాలని వీలునామా రాశాడు. ఆయన మరణానంతరం 'యోగం' సభ్యులను ప్రజాస్వామిక, లౌకిక భావాలు, మార్క్స్ సిద్ధాంతాలు ప్రబలంగా ఆకర్షించాయి.

'నారాయణ ధర్మ సంఘం' శ్రీ నారాయణగురు సందేశాలను ప్రచారం చేసింది. ఆయన సందేశాన్ని ప్రజలకు తెల్పడానికి సాహిత్యాన్ని ప్రచురించింది. ఆయన రాసిన గ్రంథాలను పునర్ముద్రించింది. పతిత స్త్రీలకై వైద్యశాలలు, శరణాలయాలను స్థాపించింది.

## 18.8 జస్టిస్ పార్టీ

దక్షిణ భారతదేశంలో ఏర్పడిన కుల సంఘాలు సాంఘిక, రాజకీయ ప్రాముఖ్యతను సంపాదించుకొన్నాయి. వాటిలో అతి ముఖ్యమైంది జస్టిస్ ఉద్యమం. ఈ ఉద్యమాన్ని 1915-16 సంవత్సరంలో సి.యన్. ముదలియార్, టి.ఎమ్. నాయర్, పి. త్యాగరాయశెట్టి ప్రారంభించారు. 'జస్టిస్', 'ద్రావిడన్', 'ఆంధ్ర ప్రకాశిని' అను ప్రాంతీయ పత్రికలు ఉద్యమ లక్ష్యాలను ప్రచారం చేశాయి. ఈ పత్రికలు బ్రాహ్మణేతర కులాల సమస్యలను ప్రముఖంగా ప్రచురించాయి. జస్టిస్ ఉద్యమాన్ని మధ్యతరగతి కులాలైన తమిళ ప్రాంతానికి చెందిన వెల్లాలాలు, ముదలియార్‌లు, శెట్టియార్‌లకు, తెలుగు ప్రాంతానికి చెందిన రెడ్డి, వెలమ, కమ్మ, బలిజనాయుడు కులాలవారికి, మలబార్ ప్రాంతానికి చెందిన నాయర్‌లకు ప్రాతినిధ్యం వహించింది. జస్టిస్ పక్షానికి నాయకత్వం వహించిన వారిలో భూస్వామ్య, వర్తక, వాణిజ్య వర్గాలకు చెందినవారు ఉన్నారు.

జస్టిస్ పార్టీ ప్రభుత్వ శాఖల్లో అధిక సంఖ్యలో బ్రాహ్మణుల నియామకాన్ని వ్యతిరేకించింది. బ్రాహ్మణేతర కులాలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, వారికి ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు, శాసనసభలో రాజకీయ ప్రాతినిధ్యం లేదన్నది జస్టిస్ పార్టీ నాయకుల వాదన. వారు బ్రాహ్మణేతరులకు శాసనసభలో ప్రత్యేక ప్రాతినిధ్యం, ప్రభుత్వ శాఖల్లో అధిక సంఖ్యలో ఉద్యోగాలను డిమాండ్ చేశారు. బ్రాహ్మణేతర కులాల విద్య, భౌతిక, నైతికాభివృద్ధిని సాధించడానికి కూడా వారు విశేషంగా కృషిచేశారు.

1916 డిసెంబర్ 20న బ్రాహ్మణేతర ప్రకటన పత్రం (Non-Brahmin Manifesto)ను విడుదలచేసి, జస్టిస్ పార్టీ బ్రిటిష్ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసాన్ని ప్రకటించింది. జస్టిస్ నాయకులు, బ్రిటిష్ ప్రభుత్వం మధ్య మైత్రీ సంబంధాలు అభివృద్ధి చెందాయి. ఫలితంగా మద్రాస్ రాష్ట్రంలో జస్టిస్ పార్టీ 1921-26 మధ్య అధికారంలో కొనసాగింది. జస్టిస్ పార్టీ కృషి ఫలితంగా మద్రాస్ ప్రభుత్వం మొదటి కమ్యూనల్ ఉత్తర్వు (communal order)ను జారీచేసింది. దాని ప్రకారం ప్రభుత్వ శాఖాధిపతులు తమ శాఖల్లో ఖాళీలను భర్తీ చేసేటపుడు బ్రాహ్మణ, బ్రాహ్మణేతర హిందువు, క్రైస్తవుడు, ముస్లిం, యూరోపియన్, ఆంగ్లో-ఇండియన్, ఇతరులకు వరుసక్రమంలో ఉద్యోగాలు ఇవ్వాలి. ఇది జస్టిస్ పార్టీ సాధించిన విజయాల్లో మొదటిది. అయితే 1922లోనే దళిత నాయకుడైన ఎమ్. సి. రాజా పార్టీని విడిచి పెట్టాడు. ఇతర దళితులు ఆయన మార్గాన్నే అనుసరించారు. జస్టిస్ పార్టీ దళితుల యోగక్షేమాలను విస్మరించిందనే అసంతృప్తి వారికి కల్గింది. అనైక్యత, అంతర్గత విభేదాల వల్ల కూడా జస్టిస్ పార్టీ క్రమేణా బలహీనపడింది.

## 18.9 ఆత్మగౌరవ ఉద్యమం

ఆత్మ గౌరవ ఉద్యమం తమిళుల స్థితిని మెరుగుపరచడానికి ఆవిర్భవించిన సాంఘిక, సంస్కరణోద్యమం. పెరియార్‌గా ప్రసిద్ధిచెందిన రామస్వామి నాయకర్ (1879-1973) కాంగ్రెస్‌ను విడచిపెట్టిన తర్వాత 1926లో ప్రారంభించాడు. ఆయన ప్రముఖ సామాజిక విప్లవవాది. అణచివేతకు గురైన వర్గాల అభ్యుదయానికి నిరంతరం

BRAOU

కృషి చేశాడు. హేతు వాదం, ఆత్మగౌరవం కుల విభేదాల నిర్మూలన ఆయన జీవిత ఆశయాలు. సాంఘిక సంస్కరణ ఉద్యమంగా ప్రారంభమైనప్పటికీ, చివరకు రాజకీయ ఉద్యమంగా మారింది. ఈ ఉద్యమం సామాజిక వ్యవస్థను తలకిందులు చేసి కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రజల్లో స్వాభిమానం, సంఘీభావం నెలకొల్పడానికి ప్రయత్నించింది.

ఇ.వి. రామస్వామి నాయకర్ ఈరోడ్‌కు చెందిన బలిజ కులస్తుడు. పది సంవత్సరాల తర్వాత పాఠశాలకు వెళ్లిన నాయకర్ కన్నడం, తమిళం, తెలుగు భాషలను అనర్గళంగా మాట్లాడేవాడు. 25వ ఏట బెనారస్ సందర్శించి, అది ఏ ఇతర పట్టణాలకంటే పవిత్రంగా లేదని గ్రహించాడు. పురోహితులు మాంసాహారాన్ని తినడం, కల్లు తాగడం, నైతిక విలువలు లేక వ్యభిచార కార్యకలాపాలను సాగించడం గమనించాడు. అప్పుడే అతనిలో బ్రాహ్మణులపై వ్యతిరేక బీజాలు పడ్డాయి. 1919లో కాంగ్రెస్‌లో చేరి, ఆ సంస్థ కోసం 1925 వరకు కృషిచేశాడు. 1925లో తమిళనాడు కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. తిరునల్వేలి జిల్లాలో స్థాపించబడ్డ గురుకుల పాఠశాల్లో కుల భేదాలను పాటించడాన్ని వ్యతిరేకించాడు.

1924లో కేరళలో వైక్కమ్ గ్రామంలో అంటరానితనంపై నిరసన వ్యక్తం చేస్తూ ఉద్యమం ఆరంభమైంది. వైక్కమ్‌లో ఒక దేవాలయం ఉన్న వీధిలో దళితులు నడవరాదని అగ్ర వర్ణాలు నిషేధించాయి. దీనికి నిరసనగా జార్జి థామస్, కె.పి. కేశవ మీనన్‌లాంటి కాంగ్రెస్ వాదులు నాయకత్వం వహించారు. ఉద్యమాన్ని పెరియార్ బహిరంగంగా సమర్థించి, దాన్ని ఏప్రిల్ 12 నుండి ఆయన ఉత్తేజకరమైన ప్రసంగాలు, సూటివాదనలూ వైక్కమ్, దాని చుట్టు గ్రామాల్లో జనాన్ని చైతన్యవంతం చేశాయి. ప్రజలు అధిక సంఖ్యలో ఉద్యమంలో చేరారు. ఏప్రిల్‌లో ఒకసారి, సెప్టెంబర్‌లో మరోసారి జైలు శిక్షకు గురయ్యాడు. కొంత కాలానికి వైక్కమ్ సత్యాగ్రహం విజయవంతమైంది.

కాంగ్రెస్ వాదిగా నాయకర్ ఖద్దరు వస్త్రధారణను బలపర్చాడు. అస్పృశ్యతను నిర్మూలించాలని సలహాలు ఇచ్చాడు. కాంగ్రెస్ సభల్లో రామాయణం, భారతం, పురాణాలు, శాస్త్రాలను తీవ్రంగా విమర్శించాడు. కాంగ్రెస్ పార్టీతో సంబంధాలు బెడిసిన తర్వాత జస్టిస్ పార్టీ సమావేశాలకు హాజరై, ఆత్మగౌరవం, సాంఘిక సమానత్వంపై తన అభిప్రాయాలను వెల్లడించేవాడు. చాలా సందర్భాల్లో సాంఘిక సమానత్వం సాధించడానికి కృషిచేయలేదని జస్టిస్ పార్టీని దుయ్యబట్టాడు.

రామస్వామి నాయకర్ తర్వాత ఆత్మగౌరవ ఉద్యమ నాయకుల్లో సుప్రసిద్ధుడు యస్. రామనాథన్ తమిళ వెల్లాల కులంలో జన్మించాడు. కళాశాల విద్యాభ్యాసం చేసిన రామనాథన్ గాంధేయ కార్యక్రమాలకు ఆకర్షితుడై, కళాశాల వదలి ఖద్దరు ప్రచారం చేశాడు. 1926లో తమిళనాడు ఖద్దరు ప్రచార ఉద్యమ ఆధిపత్యాన్ని ఆయనకు అప్పగించారు. కాని తమిళనాడు కాంగ్రెస్ కమిటీలోని తమిళ బ్రాహ్మణుల తలబిరుసుతనాన్ని, వారి విలక్షణమైన ప్రవర్తనకు విసుగుచెందాడు. ఆత్మగౌరవ ఉద్యమ సిద్ధాంతాలు ఆయనను ఆకర్షించాయి. సాంఘిక అసమానతలు తొలగించే గొప్ప ఉద్యమంలో రామస్వామి నాయకర్, రామనాథన్‌లు సుశిక్షితులైన కార్యకర్తలుగా, ఎంతో అవగాహనగల ఉద్యమమూర్తులుగా వెలుగొందారు.

ఆత్మగౌరవ ఉద్యమం తమిళ జిల్లాలకు మాత్రమే పరిమితమైంది. ఆ ఉద్యమ నాయకులు అంటరాని వారితో సహా అట్టడుగు వర్గాల వారిపై దృష్టి కేంద్రీకరించారు. ఈ వర్గాలవారు ఉన్న గ్రామాల్లో యువకులను, స్త్రీలను ఆకర్షించడానికి ప్రత్యేక కృషిసల్పారు. నిరాడంబరమైన ఆత్మగౌరవ ఉద్యమ నాయకుల ప్రచార పద్ధతి ముఖ్యంగా కొద్దిపాటి చదువుకున్న గ్రామప్రాంతాల ప్రజలనూ, ప్రత్యేక నైపుణ్యంలేని పట్టణవాసులనూ ఆకర్షించింది. ఈ వర్గాలవారి పట్ల ఆత్మగౌరవ ఉద్యమం గొప్ప శ్రద్ధ కనబర్చింది.

తమిళ వారపత్రిక "కుడి అరసు" (Kudi Arasu) ఆత్మగౌరవ ఉద్యమానికి ప్రచార సాధనం. దీన్ని రామస్వామి నాయకర్ 1925 మే నెలలో ప్రారంభించాడు. బ్రాహ్మణేతరుల సంక్షేమమే అంతిమ లక్ష్యంగా ఆ పత్రిక పనిచేసింది. తన సందేశాన్ని ఈ పత్రికలో ప్రచురించిన సంపాదకీయాలు, వ్యాసాలు, ప్రసంగ పాఠాల ద్వారా ప్రజలకు రామస్వామి తెలియజేశాడు. కొన్ని శీర్షికలు రాజద్రోహాన్ని రెచ్చగొట్టేవిగా ఉన్నాయి. ప్రభుత్వాన్ని తీవ్ర పదజాలంతో విమర్శించినందుకు ఒకసారి కారాగారవాస శిక్షను అనుభవించాడు. తన రచనల్లో ప్రధానంగా బ్రాహ్మణులను, మహాభారతాన్ని, పురాణాలను, రామాయణాన్ని నిశితంగా విమర్శించాడు. మానవులందరూ సమానులే అన్న సత్యాన్ని గుర్తించని బ్రాహ్మణులు స్వార్థ ప్రయోజనాలకై రాసిన పౌరాణిక సాహిత్యాన్ని విమర్శించాడు. ఈ సాహిత్యం బ్రాహ్మణులు కల్పించిందని, దాన్ని నమ్మరాదని తెలిపాడు. నాయకర్ ఉపదేశాలు ముఖ్యంగా నిరక్షరాస్యులను చైతన్యవంతులుగా చేసింది.

ఆంగ్లం మాట్లాడే ప్రజలకు ఆత్మగౌరవ ఉద్యమ సందేశాన్ని చేరవేయాలనే ఉద్దేశంతో యస్. రామనాధన్, యస్. గురుస్వామి కలసి "రివోల్ట్" (Revolt) అను పత్రికను 1928 నవంబర్‌లో ప్రారంభించారు. 1931లో అది మూతపడింది. దాని తర్వాత కొంతకాలానికి రామస్వామి నాయకర్ తమిళ దినపత్రిక "విడుతలై" (viduthalai) ను, 1935లో తమిళ మాసపత్రిక "పగు తరివు" (Pahutharivu) ప్రారంభించాడు. ఈ పత్రికల్లో తన ఉపన్యాసాలు, వ్యాసాలు వెలువడ్డాయి. మూఢాచారాల్నీ, పురాణేతిహాసాల్నీ విమర్శిస్తూ, ఆ భావాలకు, ఆశయాలకు విస్తృత ప్రచారం వాటి ద్వారా లభించింది.

సాంప్రదాయంగా ఆచార కర్మలను నిర్వహించే బ్రాహ్మణులను తొలగించి, వారి స్థానంలో సుశిక్షితులైన బ్రాహ్మణేతరులను మాత్రమే. పౌరోహిత్యానికి నియమించాలని నాయకర్ వాదించాడు. తంజావూర్ జిల్లాలోని మాయవరంలో జరిగిన సభలో నాయకర్ స్వయంగా ఒక తీర్మానంలో పుట్టుక ఆధారంగా ప్రజలను వేర్వేరు కులాలుగా విభజించడం జాతీయ జీవనాన్ని పతనం చేస్తుంది. కాబట్టి బ్రాహ్మణేతరులను విద్యావంతులుగాజేసి, వారికి శిక్షణ నిప్పించి, వారినే వివాహాది కార్యాలను వహించడానికి నియోగించాలి, దేవాలయాల్లో పూజలు చేయడానికి, ప్రధాన రహదారులను వాడటానికి, చెరువులు, నూతులనుండి నీరు తీసుకుంటానికి అందరికీ సమానమైన స్వేచ్ఛ ఉండాలనీ ప్రతిపాదించాడు.

వర్ణాశ్రమ ధర్మాన్ని అనుసరించడం పవిత్రమైన బాధ్యత అన్న గాంధీ అభిప్రాయం నాయకర్‌ను కదిలించి వేసింది. 'గాంధీ' తన అభిప్రాయాలను మార్చుకోనందున, రామస్వామి నాయకర్ గాంధీతో తెగతెంపులు చేసుకొన్నాడు. 1927 ఆగస్ట్‌లో కాంగ్రెస్‌ను, హిందూ మతాన్ని, బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని నాశనం చేయాలని "కుడి అరసు"లో ఒక వ్యాసం రాశాడు.

1927 గాంధీ తమిళనాడు పర్యటన అనంతరం ఆత్మగౌరవ ఉద్యమం తీవ్ర మలుపు తిరిగింది. అనేక సందర్భాల్లో మనస్మృతి కాల్చివేయబడింది. రామ-రావణ వివాదం తిరిగి లేవనెత్తబడింది. రావణుడు ద్రావిడ నాయకుడుగా చిత్రీకరించడం జరిగింది. రాముడు కుత్సితుడు, అధర్మపరుడు అయిన ఆర్యుడుగా చెప్పబడ్డాడు. నల్లస్వామి కుమారుడు జె.యన్. రామనాధన్, జె.యస్. కన్నప్పార్‌లు మధురై, తిరుచూర్, మద్రాస్‌ల్లో గల దేవాలయాల్లో ప్రవేశించి, ప్రార్థనలు చేయడానికి ప్రయత్నించారు. హింసాత్మక సంఘటనలను నివారించడానికి రక్షకభటుల సహాయాన్ని ప్రభుత్వం తీసుకుంది. రామనాధన్ గాని, కన్నప్పార్‌గాని దేవాలయాల్లోనికి వెళ్ళరాదని ప్రభుత్వం నిషేధపు ఉత్తర్వులను జారీచేసింది. అయినప్పటికీ, ఆత్మగౌరవ ఉద్యమ ప్రచారం కొనసాగింది. ఉద్యమ నాయకులకు ప్రస్తుతిస్తూ పాటలను రాసి ప్రచురించారు. ఉద్యమ లక్ష్యాన్ని తెలియజేస్తూ కరపత్రాలు వెలువడ్డాయి. మతం, మూఢ నమ్మకాలమయంగా చిత్రీకరించబడింది.

BRAOU

1935 చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత మద్రాస్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సి. రాజగోపాల చారి ముఖ్యమంత్రిగా ఏర్పడింది. అన్ని పాఠశాలల్లో హిందీని నిర్బంధంగా బోధించాలనే బిల్లును ప్రభుత్వం మద్రాస్ లెజిస్లేచర్‌లో ప్రవేశపెట్టింది. హిందీని తమిళులపై రుద్దటం అన్యాయమని తీవ్ర వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ రామస్వామి నాయకర్ ఇతర ఆత్మగౌరవ సభ్యులు స్పందించారు. మద్రాస్‌లో వేలాది ప్రజలు నిరసన ప్రదర్శనలను నిర్వహించి, ప్రభుత్వ చర్యను ఖండించారు. సుమారు 1000 ప్రదర్శకులను ప్రభుత్వం అరెస్ట్ చేసింది. కారాగారంలో ఉండగా, నాయకర్ జస్టిస్ పార్టీకి 1938 డిసెంబర్‌లో అధ్యక్షుడైనాడు. ఈ పార్టీ నాయకుడుగా తమిళనాడు తమిళ ప్రజలదే అని ప్రచారం చేశాడు నాయకర్. ద్రవిడస్తాన్ కొరకు పోరాటం సల్పుతున్న నాయకర్ 'ముస్లిం లీగ్' ప్రత్యేక పాకిస్తాన్ డిమాండ్‌ను సమర్థించాడు. 1944 ఆగస్ట్‌లో జస్టిస్ పార్టీ ద్రవిడ కజగమ్ (DK)గా మారింది. బ్రాహ్మణేతరులకు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడం దాని లక్ష్యం. ఐదు సంవత్సరాల తర్వాత నాయకర్ నియంతృత్వ విధానాలు నచ్చని అన్నాదురై 1949 సెప్టెంబర్‌లో "ద్రవిడ మున్నేట్ర కజగం" (DMK) అనే కొత్త పార్టీని ఏర్పాటు చేశాడు. ఇది ప్రత్యేక తమిళనాడుకై కృషిచేసిన మొదటి రాజకీయ సంస్థ.

సామాజిక అన్యాయం, అసమానతలను వ్యతిరేకించి, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించి కులం, వర్గంలేని సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేశాడు రామస్వామి. బడుగు వర్గాలకు ఆయన గొప్ప విమోచనకారుడు. స్త్రీలకు, మగవారితో సమానంగా హక్కులు కల్పించాలని కోరాడు. దేవదాసీ వ్యవస్థ నిర్మూలనకే కృషి చేశాడు. ఆయన ఉద్యమ లక్ష్యాన్ని పరిశీలించినపుడు ఆయన రాజకీయ విప్లవంకన్నా సాంస్కృతిక విప్లవానికే ప్రాధాన్యత నిచ్చాడనేది స్పష్టపడుతుంది.

అగ్ర వర్ణ దురహంకారానికి నిరసనగా, 1956 ఆగస్ట్ 1న శ్రీరాముడి బొమ్మను బహిరంగ సభల్లో తగలబెట్టమని తన అనుచరులకు పిలుపు నిచ్చాడు. ముందు జాగ్రత్త చర్యగా పెరియార్‌ని, నాయకుల్ని మద్రాస్ పోలీస్ కమీషనర్ అరెస్టు చేశాడు. తమిళనాడులో మరో 800 మందిని అదుపులోకి తీసుకున్నారు. తగులబెట్టు కార్యక్రమం విఫలమైంది. కాని 1965, 1966ల్లో పట్టణాలుగా, పల్లెల్లో 'కంబ రామాయణా'న్ని ప్రజలు తగులబెట్టారు.

పురోహితుడు, మంత్రాలు, లగ్నాలు లేని స్వాభిమాన పెళ్లిళ్లను పెరియార్ జరిపించాడు. దేవుడు, కులం, మతం ప్రసక్తి లేకుండా, కులరహిత వివాహాలను దేశంలో మొదటిసారిగా పరిచయం చేశాడు. సి.యన్. అన్నాదురై ముఖ్యమంత్రి అయిన తర్వాత స్వాభిమాన పెళ్లిళ్లను చట్టబద్ధం చేశాడు.

## 18.10 డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ (1891-1956)

బి.ఆర్. అంబేద్కర్ గొప్ప మానవతావాది. దళితవర్గాల అభ్యున్నతికై పాటుపడిన నాయకుడు. భారత రాజ్యాంగాన్ని రాసి, రాజ్యాంగ నిర్మాతగా గుర్తింపు పొందాడు. సాంఘిక సంస్కర్తగా, న్యాయవాదిగా, హిందూ మతాన్ని సంస్కరించటానికి ప్రయత్నించిన వ్యక్తిగా దళితులకు స్వేచ్ఛ, సమానత్వం, రాజ్యాంగపరమైన రక్షణలు సాధించటానికి విశేషమైన వ్యక్తిగా కృషిచేసి, చరిత్రలో ప్రసిద్ధికెక్కాడు.

'మహర్' అనే అస్పృశ్య కులానికి చెందిన అట్టడుగు కుటుంబంలో రాంజీ మాలాజీ సక్పాల్, భీమాబాయి దంపతులకు మాల్ పట్టణంలో భీమారావ్ జన్మించాడు. బొంబాయిలోని ఎల్ఫిన్‌స్టన్ ప్రభుత్వ పాఠశాలలో మెట్రిక్యులేషన్ వరకు, ఎల్ఫిన్‌స్టన్ కళాశాల్లో ఇంటర్, బి.ఎ. వరకు చదివి పరీక్షల్లో కృతార్థుడైనాడు. బరోడా మహారాజా శాయాజీరావ్ గైక్వాడ్ ఉపకార వేతనంతో అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయం నుండి 1915 ఎం.ఎ పట్టం పుచ్చుకున్నాడు. అదే విశ్వవిద్యాలయానికి 'భారతదేశ జాతీయ పాదం - చారిత్రక విశ్లేషణాత్మక



BRAOU

అధ్యయనం' (National Dividents of India : A Historical and Analytical Study) అనే సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి, డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (Ph.D) పట్టాన్ని పొందాడు. 1917లో భారతదేశానికి తిరిగి వచ్చి బరోడా సంస్థానంలో నవంబర్ వరకూ సైనిక శాఖ కార్యదర్శిగా పనిచేశాడు. తర్వాత లండన్ యూనివర్సిటీ నుండి సైన్సులో డాక్టరేట్‌ను, జర్మనీలోని బాన్ యూనివర్శిటీలో చదివిన అనుభవంకూడా గడించాడు.

1924 మార్చి నెల్లో బొంబాయిలోని దామోదర్ హాలులో దీన జనోద్ధరణకు ప్రత్యేతించి ఒక కేంద్ర సంస్థను ఏర్పరచడానికై అంబేద్కర్ ఒక సమావేశం ఏర్పాటు చేశాడు. ఆనాటి చర్చల ఫలితంగా, 1924 జులై 20న బహిష్కృత హితకారిణీ సభ ఏర్పాటైంది. ఈ సభ ఆశయాలు 1. దళిత జాతుల్లో విద్యావ్యాప్తి, అందుకు అవసరమైన వసతి గృహాల నిర్మాణం; 2. దళిత జాతుల సంస్కరణకై గ్రంథాలయాలు, సామాజిక కేంద్రాలు, అధ్యయన తరగతులు నిర్వహించడం; 3. పారిశ్రామిక, వ్యవసాయిక శిక్షణ కేంద్రాలు నెలకొల్పటం ద్వారా వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచటం; 4. వారి బాధలను, సమస్యలను ప్రభుత్వానికి నివేదించటం. ఈ సభకు చిమన్‌లాల్ హరిలాల్ సెతల్వాడ్ అధ్యక్షుడు, బి.జి. ఖేర్, ఆర్.పి. పరంజపే, వి.పి. చవాన్ తదితరులు ఉపాధ్యక్షులుగా పనిచేశారు. ఈ సంస్థ నిర్వాహక సమితికి అంబేద్కర్ అధ్యక్షుడు; ఎస్.ఎన్. శివటర్కర్ కార్యదర్శి. కులతత్వ నిర్మూలన సమానత్వం ప్రాతిపదికపై సమాజ పునర్నిర్మాణానికి ఈ సంస్థ కృషిచేసింది. నిమ్న జాతుల్లో మనోవికాసాన్ని, చైతన్యాన్ని కల్గింపజేసేందుకై మహాసభలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది.

1927 మార్చిలో కొలాబా జిల్లాలో దళిత మహాసభ మహద్ పట్టణంలో జరిగింది. బొంబాయి శాసనసభ 1923 ఆగస్ట్ 4న ఎస్.కె. బోలే ప్రతిపాదించిన తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానం ప్రకారం మహద్‌లోని చౌదర్ చెరువును కూడా అస్పృశ్యులకు అందుబాటులోకి తెచ్చినట్లు మహద్ పురపాలక సంఘం 1926లో ప్రకటించింది. కాని వెంటనే అది అమల్లోకి రాలేదు. సుమారు 10వేల మంది ఈ సభకు వచ్చారు. అంబేద్కర్ అధ్యక్షతన ఈ సభ కొన్ని తీర్మానాలు చేసింది. అస్పృశ్యులు పౌరహక్కులను పొందటంలో సవర్ణ హిందువులు సహాయపడాలని, వారికి ఉద్యోగావకాశాలను కల్పించాలని, బోలే తీర్మానం అమలు జరిగేటట్లుగా చూడాలన్న తీర్మానాలను సభ ఆమోదించింది. మరునాటి ఉదయమే అంబేద్కర్ నాయకత్వంలో 10 వేల మంది ఊరేగింపుగా వెళ్లి, చౌదర్ చెరువునీటిని సేవించారు.

అయితే ఆ సంవత్సరం ఆగస్ట్ 4వ తేదీనే మహద్ పురపాలక సంఘం తీర్మానం ద్వారా చౌదర్ చెరువును దళితులకు అందుబాటులో ఉంచుతున్నట్లు గతంలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకుంది. 'బహిష్కృత హితకారిణి సభ' సత్యాగ్రహం నిర్వహించాలని నిర్ణయించింది. కాని జిల్లా కలెక్టర్ సలహా మేరకు సత్యాగ్రహం వాయిదాపడింది. చౌదర్ చెరువుకు సంబంధించిన తర్వాతి పోరాటంలో కోర్టులోనే నడిచింది. చివరికి 1937 మార్చిలో బొంబాయి హైకోర్టు దళితులకు అనుకూలంగా తీర్పునిచ్చింది.

శూద్రుల అభివృద్ధికి అడ్డుపడి, వారి ఆత్మాభిమానాన్ని మందగింపజేసి, సాంఘిక, ఆర్థిక, ధార్మిక, రాజకీయ దాస్యాన్ని కొనసాగింపజేసిన మనుస్మృతి బహిరంగంగా దళితులు అంబేద్కర్ నాయకత్వంలో 1927 డిసెంబర్ 25న తగులబెట్టారు. సవర్ణ హిందువుల దృష్టిని ఆకర్షించడానికి చేసిన పనియిది.

దేవుణ్ణి దర్శించుకునే హక్కు మానవులందరకూ ఉన్నప్పుడు అంటరాని వారికి దేవాలయాల్లోకి ప్రవేశార్హత ఎందుకు ఉండకూడదని 1930 మార్చిలో అంబేద్కర్ నాసిక్‌లో దళిత ప్రజల దేవాలయ ప్రవేశ ఉద్యమం నడిపాడు. ప్రసిద్ధ కాలారాం ఆలయంలోకి ప్రవేశం కొరకు సత్యాగ్రహం నిర్వహించాడు. అది అహింసాత్మక ఉద్యమం. సుమారు పదివేల మంది స్త్రీ, పురుషులు రోజుల తరబడి దేవాలయం ముందు బైఠాయించారు. దేవాలయం

BRAOU

తలుపులను మూసివేశారు. సత్యాగ్రహం పర్యవసానంగా ఒక ఏడాది అంతా దేవాలయం మూతబడి ఉంది. ఉద్యమం 1935 అక్టోబర్ వరకు కొనసాగింది.

1930 నవంబర్‌లో మొదటి రౌండ్ టేబుల్ సమావేశం లండన్‌లో జరిగింది. ఈ సమావేశానికి దళిత ప్రజల ప్రతినిధులుగా డాక్టర్ అంబేద్కర్, రావు బహదూర్ శ్రీనివాసన్‌లను బ్రిటిష్ ప్రభుత్వం ఆహ్వానించింది. భారత రాజ్యాంగం రూపురేఖల గూర్చి మొదటి చర్చలు ఈ సమావేశంలో జరిగాయి. ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులను, ఇతర ప్రముఖులను కలసి అస్పృశ్య ప్రజల స్థితిగతులను వారికి తెలియపరిచాడు. మొదటి రౌండ్ టేబుల్ సమావేశం ముస్లిం కోరికలకు రాజకీయమైన పరిగణన నిచ్చింది. దళిత జాతులకు రాజకీయ హక్కులు లభించాయి. వారి ప్రత్యేక నియోజక వర్గాలు కల్పించి, వారి ప్రతినిధులను వారే ఎన్నుకొనే పద్ధతికి ప్రభుత్వం అంగీకరించింది. అస్పృశ్యులను హిందువుల నుండి రాజకీయంగా వేరుచేయడానికి గాంధీ వ్యతిరేకి.

రెండో రౌండ్ టేబుల్ సమావేశం 1931 సెప్టెంబర్ 7న ప్రారంభమైంది. హరిజనుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే శ్రమను అంబేద్కర్‌తో పాటు, కాంగ్రెస్ కూడా పంచుకొంటోంది కాబట్టి, ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించటాన్ని ప్రతిఘటిస్తూ గాంధీ ప్రసంగించాడు. కాంగ్రెస్ నిర్ణయాలకు దళితులు కట్టుబడి ఉండరని, వారి వాటా నుండి ఎవరికి ఇవ్వటానికి మాత్రం వీల్లేదని అంబేద్కర్ ప్రకటించాడు. ముస్లింలు, సిక్కుల మధ్య అంగీకారం కుదరక మంతనాలు విఫలమైనాయి. సమావేశం నిరవధికంగా వాయిదా పడింది.

1932 ఆగస్ట్ 14న కమ్యూనల్ అవార్డుగా ప్రసిద్ధికెక్కిన బ్రిటిష్ ప్రధాని రామ్సే మేక్డొనాల్డ్ ప్రకటన వెలువడింది. దాని ప్రకారం ప్రాంతీయ శాసనసభల్లో దళిత వర్గాలకు ప్రత్యేకంగా సీట్లను కేటాయించటం జరిగింది. తమ ప్రతినిధిని ఎన్నుకొనేందుకు ఒక ఓటు, సాధారణ నియోజక వర్గ ప్రతినిధిని ఎన్నుకోడానికి మరో ఓటువేసే అవకాశం దళితులకు లభించింది.

BRAOU

కమ్యూనల్ అవార్డు భారతీయుల మధ్య విభేదాలను పెంచింది. ఎరవాడ జైలులో ఉన్న గాంధీజీ హరిజనులకు ప్రత్యేక స్థానాలు రద్దుచేయకపోతే, ఆమరణ దీక్ష పాటిస్తానని ప్రకటించి, దీక్షకు ఉపక్రమించాడు. గాంధీ, జయకర్, రాజాజీ, చునీలాల్ మెహతా, అంబేద్కర్‌ల మధ్య సంప్రదింపులు జరిగాయి. చివరికి అంబేద్కర్, పండిత మాలవ్యా, రాజాజీ, రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసన్, ఎం.సి. రాజా, పి. బాలూ, రాజాభోజ్, ఠక్కర్ బాపా తదితరులు ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇదే పూనా ఒడంబడిక (Poon Pact) అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. ప్రత్యేక ప్రాతినిధ్యం కనీసం పదేళ్ల వరకైనా ఉండి తీరాలని అంగీకరించారు.

పూలే కృషి నుండి స్ఫూర్తిని పొంది అంబేద్కర్ కుల వ్యవస్థకు, హిందూ మతానికి వ్యతిరేకంగా పోరాటం జరిపాడు. పెద్ద సంచలనాన్ని రేపిన 'కుల నిర్మూలన' (Annihilation of Caste, 1944) అనే పుస్తకంలో హిందూ సమాజం మొదట నాలుగు వర్ణాలుగా విభజించబడిందని, ఒకే జాతికి చెందిన ప్రజలను సాంఘికంగా విడదీయటమే కుల వ్యవస్థ అనీ, కులం హిందూ జాతి చైతన్యాన్ని హరించి సర్వనాశనం చేసిందనీ, రక్త సంయోగం ద్వారా మాత్రమే కుల భావన బలపడుతుందని, అది జరిగితే తప్ప కులం వల్ల ఏర్పడ్డ వేర్పాటు భావాలు నమసి పోవని అన్నాడు. అంటరానితనానికి మూలం కుల వ్యవస్థ, అది పోవాలంటే కుల వ్యవస్థ కూలిపోవాలి అని అన్నాడు అంబేద్కర్. పంచములను నిర్బంధ దాస్యవృత్తికి గురిచేసిన మనువును హిందూ సమాజ విధ్వంసకునిగా వర్ణించాడు.

డాక్టర్ అంబేద్కర్ 1936 ఆగస్ట్‌లో 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ' (Independent Labour party) అనే రాజకీయ పార్టీని స్థాపించాడు. ఈ పార్టీ ఎన్నికల ప్రణాళిక శ్రామిక శక్తుల ప్రగతికి వెలుగుబాటగా తయారైంది. 1937 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో బొంబాయి శాసనసభకు బొంబాయి నుండి అంబేద్కర్ ఎన్నికైనాడు. అతని పార్టీ తరపున పోటీచేసిన 17 మందిలో 15 మంది విజయం సాధించారు. 1934-40 కాలంలో ఆనాటి బొంబాయి రాష్ట్రంలోని కొంకణ్ ప్రాంతంలో అణగారిన కులాలకు చెందిన మహర్ రైతులను, మధ్య కులాలకు చెందిన కుంచి రైతులను సమైఖ్యపరచి, 'ఖోటీ జమీందారీ' విధానానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాన్ని నిర్వహించాడు.

1942లో యావద్భారత నిమ్న జాతీయులంతా ఒకే జెండా కింద నిలబడి, ఒకే పార్టీ ఆధ్వర్యాన పోరాటాన్ని సాగించాలని అఖిల భారత నిమ్న జాతుల సమాఖ్య (All India Scheduled Castes Federation) అనే పార్టీని స్థాపించాడు. ఈ పార్టీ 1952 ఎన్నికల్లో ఓడిపోయింది. కొద్ది కాలానికి అంబేద్కర్ బొంబాయి శాసనసభ నుండి రాజ్యసభకు ఎన్నికైనాడు.

అంబేద్కర్ రాజ్యాంగ నిర్ణయ సభ సభ్యుడు. రాజ్యాంగ రచనా సంఘానికి అధ్యక్షత వహించి, రాజ్యాంగాన్ని రచించడంలో ప్రముఖ పాత్ర వహించాడు. ఈ సభ 1947 ఏప్రిల్‌లో అంటరానితనం నిర్మూలింపబడిందని ప్రకటించింది. స్వతంత్ర భారత ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా అంబేద్కర్ ప్రమాణ స్వీకారం చేశాడు. భారతదేశానికి ఒక రాజ్యాంగాన్ని రూపకల్పన చేశాడు. న్యాయ శాఖా మంత్రిగా 1951 ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో హిందూ కోడ్ బిల్లు (Hindu Code Bill) ను ప్రవేశపెట్టాడు. దానికి సెప్టెంబర్‌లో ఆమోదం లభించింది.

1947కు పూర్వం హిందూ పరిధిని విడిచిపెట్టి, సమానత్వాన్ని, సముచిత స్థానాన్ని ఇచ్చే మరో మతంలోకి వెళ్లటం మంచిదనే భావం అంబేద్కర్‌కు కలిగింది. 1956లో బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. అదే సంవత్సరం డిసెంబర్‌లో మరణించాడు.

దేశ జనాభాలో ఐదో వంతుగల అస్పృశ్యులను సంఘటితపరచి, వారిలో రాజకీయ చైతన్యాన్ని రగిల్చి, వారి దాస్య విముక్తికై పోరాటం నడిపిన అత్యుత్తమ నాయకుడు అంబేద్కర్.

BRAOU

## 18.11 కాయస్థులు

కొత్తగా ఆవిర్భవించిన కుల సంఘాలకు "కాయస్థ సభ" (Kayasta Conference) ఆదర్శంగా పనిచేసింది. వాడుకలో కొన్ని కులాల సమ్మేళనాన్ని 'కాయస్థ'గా సర్వ సామాన్యంగా పిలచేవారు. కాయస్థ కులంవారు ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా బీహార్, బెంగాల్, బొంబాయి ప్రాంతాల్లో అధికసంఖ్యలో ఉన్నారు. వీరు కొన్ని ప్రాంతాల్లో శూద్రులుగా, మరికొన్ని ప్రాంతాల్లో వైశ్యులుగా, ఇంకొన్ని ప్రాంతాల్లో క్షత్రియులుగా పరిగణించబడ్డారు. వారి ముఖ్య వృత్తి దస్తూరి (writer).

కాయస్థుల అభ్యున్నతికి పాటుబడటానికి ప్రథమ కాయస్థ సభ లక్నోలో నవంబర్ 1887లో సమావేశమైంది. ఈ సభ నిధులకై ప్రాంతీయ కాయస్థ సభలపై పూర్తిగా ఆధారపడింది. 1890 నాటికి కొన్ని వందల ప్రాంతీయ కాయస్థ సభలు ఏర్పడ్డాయి. కాయస్థ సభ ముఖ్య ఉద్దేశాలు. 1. కాయస్థ కులస్తుల్లో ఆధునిక విద్యావ్యాప్తి కొరకు నిధులను సమకూర్చుకొనటం, 2. వివిధ కాయస్థ ఉపకులాల మధ్య ఐక్యత సాధించటం. 3. సాంఘిక సంస్కరణలను వ్యాప్తి చేయటం 4. పారిశ్రామిక, వాణిజ్య వృత్తుల్లో కాయస్థుల ప్రయోజనాలను పెంపొందించటం 5. కాయస్థులను ద్విజులు (twice-bron) గా గుర్తించేట్లు చేయటం, కాయస్థ సభ కులాంతర వివాహాలను, సహ పంక్తి భోజనాలను ప్రోత్సహించింది. దాని కృషి ఆశించిన మేరకు విజయవంతం కాలేదు.

అనేక ఇతర కుల సభలవలె కాయస్త సభలలో చీలిక ఏర్పడింది. సనాతన వాదులు, ఉదార వాదులుగా రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఫలితంగా ఆర్థిక, విద్య వ్యవహారాలతో పాటు, సాంఘిక సంస్కరణల్లో కూడా కాయస్త సభ జోక్యం ప్రశ్నార్థకమైంది. ఉదార వాదులు వివాహ వయస్సు, వితంతు వివాహం, మితపానం సీమయానం, వివిధ కాయస్త ఉపకులాల మధ్య వర్ణాంతర వివాహాలు మొదలైన విషయాలను సమర్థించారు. దానికి కాయస్త సభ ఆమోదముద్ర లభించింది. అయితే, సనాతన వాదుల ప్రతినిధులు ఆ ప్రయత్నాలను విజయవంతంగా ప్రతిఘటించారు. అందుచేత ఉదార వాదులు ప్రాంతీయ కాయస్త సభల ద్వారా ఇంగ్లీష్, ప్రాంతీయ భాషల్లో ప్రచురింపబడ్డ అనేక కాయస్త పత్రికల ద్వారా ప్రచారం కొనసాగించారు. అలహాబాద్ నుండి ఇంగ్లీష్‌లో ప్రచురించబడ్డ హిందూస్తాన్ రివ్యూ (Hindutan Review) ఉదార వాదుల సాంఘిక సంస్కరణ విధానాన్ని గట్టిగా బలపరచింది.

1907 జనవరిలో కాయస్త సంఘ సంస్కార వాదులు 6 కాయస్త ఉపకులాలవారికి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్, మధ్యప్రదేశ్, బీహార్, పంజాబుల నుండి 160 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారంతా సహపంక్తి భోజనాలనే సమర్థించారు. దీన్ని సహించని సనాతనులు తిరుగుబాటు చేసి, కాయస్త సభను చేజిక్కించుకున్నారు. కాయస్త సభ పేరును కాయస్త విద్యా సభ (Kaystha Educational Conference) గా మార్చారు. 1907 చివరి రోజుల్లో ఉదార వాదులు కాయస్త జాత్యాంతర వివాహ సమాజాన్ని (Kayastha Inter-marriage Society) ఏర్పరచారు. ఈ విధమైన చీలిక కాయస్త ఉపకులాల మధ్య ఐక్యత సాధించడానికి దోహదపడ లేదు. కాయస్తుల అనైక్యత అలాగే కొనసాగింది.

## 18.12 సంగ్రహంగా

1. కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ సమానత్వం ప్రాతిపదికగా, మధ్య యుగంలో భక్తి ఉద్యమ నాయకులు ప్రచారం చేశారు.

2. బ్రిటిష్ పాలన ప్రారంభమైన తర్వాత దేశంలో వివిధ రంగాల్లో వచ్చిన మార్పులవల్ల నియమాలను తు.చ. తప్పకుండా పాటించడం దుస్సాధ్యమైంది.

3. బొంబాయి రాష్ట్రంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమం 19వ శతాబ్దంలోనే ప్రారంభమైంది. పరమహంస మండలి సభ్యులు కుల విభేదాలను తోసిపుచ్చారు. జ్యోతిబా పూలే బ్రాహ్మణాధిక్యతపై ధ్వజమెత్తి, కుంబి కులస్థుల అభివృద్ధికై కృషిచేశాడు.

4. కేరళలో 'ఎజవ' కులంవారి అభివృద్ధికై శ్రీ నారాయణగురు నిరంతర కృషి సాగించాడు. సామాజిక అసమానతలను వ్యతిరేకించాడు.

5. మద్రాస్ రాష్ట్రంలో బ్రాహ్మణేతరోద్యమ నాయకులు సమాజంలో బ్రాహ్మణుల ఆధిక్యతను నిరసించి, బ్రాహ్మణేతర వర్గాల వారి అభ్యున్నతికై కృషిచేశారు. వారి రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నపుడు ప్రభుత్వపరంగా బ్రాహ్మణేతరులకు ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించింది.

6. ఆత్మగౌరవ ఉద్యమాన్ని రామస్వామి నాయకర్ ప్రారంభించాడు. బ్రాహ్మణేతరులు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని బోధించాడు. కుల నిర్మూలనకై పాటుబడ్డాడు.

7. కుల వ్యత్యాసాలను ఖండించి, దళిత వర్గాల సంక్షేమం కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కృషి చేశాడు.

B R A O U

## 18.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. పశ్చిమ భారతదేశంలో కుల వ్యతిరేక ఉద్యమాల ప్రగతిని సమీక్షించండి.
2. కేరళలో శ్రీ నారాయణగురు బడుగు వర్గాల సంక్షేమంకోరి చేసిన ప్రయత్నాలు తెల్పండి.
3. ఆత్మగౌరవ ఉద్యమ ఆశయాలేమిటి? దాన్ని ప్రచారం చేయడంలో రామస్వామి నాయకర్ కృషిని వర్ణించండి.
4. దళిత వర్గాలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలను చర్చించండి.

**II. కింది ప్రశ్నలకు లఘు వాఖ్యలను రాయండి.**

1. సత్యశోధక్ మండలి లక్ష్యాలను, కార్యక్రమాలను వివరించండి.
2. కాయస్థుల కుల ఉద్యమం గూర్చి క్లుప్తంగా తెల్పండి.
3. శ్రీ నారాయణగురు స్థాపించిన 'శ్రీ నారాయణ ధర్మ పరిపాలన యోగం' గురించి రాయండి.
4. కుల వ్యతిరేక ఉద్యమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పాత్రను గుర్తించండి.

## 18.14 ఉపయుక్త గ్రంథాలు


Chandra Bharill : **Social and Political Ideas of B.R. Ambedkar, 1977.**

Heimsath, Charles H : **Indian Nationlism and Hindu Social Reform, 1964.**

Irschik, Eugene F : **Politics and Social Conflict in South India 1969.**

Jones, Kenneth W. : **The Combridge History of India, Vol. III-1, Socio-religious reform movements in British India, 1989.**

Kumaran, M. : **Life History of Sri Narayana Guru Swami, 1971.**

Lokhande, G.S. : **Bhimarao Ramji Ambedkar (A study in Social Democracy) 1977.**

Ravinder Kumar : **Western India in the Nineteenth Century, 1968.**

Ravindran, Chopra and Subrahmanyam
**History of South India, Vol. III, 1979.**

Sumit Sarkar : **Modern India, 1885-1947, 1983.**

Veeramani, K. : **Religion and Society (selections from Periyar's speeches and writings, 1994.**

మానేపల్లి జోతిరావ్ పూలే : **(19వ శతాబ్దిలో మహారాష్ట్ర ప్రాంతంలో కింది కులాలవారి ప్రతిఘటన) 1993.**

యెండ్లూరి : **బాబా సాహెబ్ డా॥ అంబేద్కర్ జీవిత చరిత్ర 1988.**



**రచయిత : ఆచార్య బి. కేశవనారాయణ**



BRAOU

# భాగం - 19 : అస్పృశ్యత

విషయక్రమం


19.0 లక్ష్యాలు

19.1 పరిచయం

19.2 అస్పృశ్యుల స్థితిగతులు

19.3 బ్రిటిష్‌వారు రాక పూర్వం అంటరానితనానికి వ్యతిరేకంగా జరిగిన కృషి

19.4 బ్రిటిష్ ప్రభుత్వ విధానం

19.5 దళితుల అభ్యున్నతికి కృషిచేసిన సంస్థలు, వ్యక్తులు

- 19.5.1 క్రైస్తవ మిషనరీలు
- 19.5.2 బ్రహ్మ, ప్రార్థనా సమాజాలు - అస్పృశ్యతా నివారణ
- 19.5.3 జాతీయ సాంఘిక సభ (National Social Conference)
- 19.5.4 దివ్యజ్ఞాన సమాజికులు
- 19.5.5 వివేకానందుడు
- 19.5.6 శశిపాద బెనర్జీ
- 19.5.7 దళిత వర్గాల సంఘం (Depressed Classes Mission)

19.6 ప్రభుత్వ ఉత్తర్వులు

19.7 అస్పృశ్యతకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఉద్యమం

19.8 గాంధీ చారిత్రాత్మక నిరాహార దీక్ష, హరిజన యాత్ర (1932)

19.9 రాష్ట్రాల్లో కాంగ్రెస్ మంత్రుల కృషి

19.10 సంగ్రహంగా

19.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

19.12 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 19.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు ఈ కింది విషయాలను గురించి తెలుసుకోగలగాలి.

- అంటరాని వారి ఆర్థిక, సాంఘిక పరిస్థితి.
- దళిత జనోద్ధరకు సంస్కర్తలు, స్వచ్ఛంద సంస్థలు చేసిన కృషి.
- జాతీయ కాంగ్రెస్ అస్పృశ్యతా వ్యతిరేక పోరాటం. గాంధీజీ హరిజనోద్యమం
- అంటరానివారు ఎదుర్కొంటున్న పౌర అసమానతలను తొలగించడానికై చేయబడిన శాసనాలు.

## 19.1 పరిచయం

అస్పృశ్యులు హిందూ కులాల నిచ్చెనలో అట్టడుగు వర్గాలకు చెందినవారు. వారి జనాభా ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్, ఐర్లాండ్, వేల్స్ దేశాల్లోని ప్రజలందరి కంటె ఎక్కువ. వారిని వెలివేయబడ్డ వారని, అంటరాని వారని, పంచములని, దళితులని, హరిజనులు, అంత్యజులు అనే రకరకాల పేర్లతో పిలిచెడివారు. భారతదేశంలో ప్రతి ప్రాంతంలో వారు ఉన్నారు. ఆర్థికంగా నిరుపేదలు. మత సాంఘిక అసమానతలు వారిపై రుద్దబడ్డాయి. కాని హిందూ సమాజం ఈ నిమ్నజాతుల వారిపై నిత్యం అధికంగా ఆధారపడింది. చాలా కాలం వరకు వారు అజ్ఞానంలో మునిగి ఇతరులపై పూర్తిగా ఆధారపడ్డారు.

## 19.2 అస్పృశ్యుల స్థితిగతులు

బ్రిటిష్‌వారు రాకపూర్వం అస్పృశ్యులపై పలురకాల కఠినమైన ఆంక్షలు ఉండేవి. వారికి హిందూ దేవాలయాల్లోకి ప్రవేశించే హక్కులేదు. వేదాలను చదువరాదు, వినరాదు. ప్రభుత్వ బావులు, చెరువులు, స్నాన వాటికలు, ఉద్యానవనాలు, ఫలహారశాలలు ఉపయోగించే ప్రాథమిక హక్కు వారికి లేదు. వీరి భౌతిక స్పర్శ వల్ల అపవిత్రమైపోతామనే భావం మలబార్, తిరువాన్కూర్ ప్రాంతాల సవర్ణ హిందువులకు ఉండేది. గ్రామ ప్రాంతాల్లోను, పట్టణాల్లోను, ప్రత్యేకంగా నిర్దేశించబడ్డ ప్రదేశాల్లోనే వీరు నివసించేవారు. వారు ముఖ్యంగా వ్యవసాయ కూలీలుగా జీవితం గడిపారు. హిందూ సమాజం ఈ అస్పృశ్యులను పాకీపని, పారిశుధ్యం, పశువుల మృత కళేబరాలను తొలగించటం మొదలైన పనులకు నియోగించింది. అర్థబలం, పలుకుబడిలేక సాంఘికంగా అట్టడుగున ఉండటంచేత ఆర్థిక దోపిడీకి గురైనారు. పేదరికం వల్ల సమంజసమైన గుర్తింపు లభించక అణచివేతకు గురై, వారు దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది.

అస్పృశ్యుల దుస్థితికి మతపరమైన అనుమతి లభించింది. అందువల్ల వారి బాధల తీవ్రత మరింత ఎక్కువైంది. అస్పృశ్యత తదితర అనర్థాలు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కోరకంగా ఉన్నప్పటికీ, వారు అనుభవించే బాధలు అన్ని ప్రాంతాల్లోను ఒకే రకంగా ఉన్నాయి. బరోడా, మైసూర్, బొంబాయి, మద్రాస్ ప్రాంతాల్లో వారి పరిస్థితి దారుణంగా ఉండేది.

1931 ప్రభుత్వ గణాంక వివరాల ప్రకారం భారతదేశం మొత్తం మీద దళిత వర్గాల వారు సుమారు 50,192,000 మంది ఉన్నారు. సంయుక్త రాష్ట్రాల (United Provinces) మొత్తం జనాభాలో 23 శాతం దళితులు. మొత్తం దేశ జనాభాలో ఆ వర్గాల వారు ఐదో వంతు ఉన్నారు. వారి సంఖ్యాబలం వల్లనే వారి విముక్తి సమస్య భారతదేశ స్వాతంత్ర్యం, సామాజిక పునర్నిర్మాణ కార్యక్రమంలో ప్రధానాంశమైంది.

అస్పృశ్యత వంటి అతి పాశవిక సాంఘిక దురాచార నిర్మూలన దేశ సాంఘిక సంస్కరణ ఉద్యమాల భూమికలో ప్రధాన అంశం అయింది. వారు అనుభవిస్తున్న దారుణమైన జీవితాలను చూసి చలించి వివిధ ప్రయోజనాలు, ఆలోచనలు పురిగొల్పగా అభ్యుదయ భావాలుగల సంఘ సంస్కర్తలు అస్పృశ్యతకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. దళితుల పౌర అనర్హతల్ని, అంటరానితనాన్ని తొలగించడానికి వారు చేసిన ప్రయత్నాలకు అధిక సంఖ్యలో గల సనాతన వాదుల నుండి గట్టి వ్యతిరేకత ఎదురైంది. అయితే, ప్రజల ధోరణి మాత్రం అంటరాని తనాన్ని నిర్మూలించడానికి అనుకూలంగా ఉంది.

## 19.3 బ్రిటిష్ వారి రాకపూర్వం అంటరానితనానికి వ్యతిరేకంగా జరిగిన కృషి

బౌద్ధ మత సంస్కరణోద్యమంతో అంటరానితనం నిర్మూలనకై జరిగిన పోరాట చరిత్రలో మొదటి ఘట్టం ప్రారంభమైంది. బుద్ధుడు హిందూ కర్మకాండలను గట్టిగా వ్యతిరేకించి, వర్ణ వ్యవస్థ ఉనికికి గట్టి దెబ్బకొట్టాడు. తన ప్రచారంలో సమానత్వం, సహనాన్ని బోధించాడు. అశోకుడు మానవులందరూ సమానమేనని తెలియజేశాడు. అంటరాని వారికి పాఠశాలలు, మఠాలు, ఆశ్రమాలు నిర్మించాడు. కాని బౌద్ధ మతం చివరికి బ్రాహ్మణ మతానికి లొంగిపోయి, అస్పృశ్యతా పునాదుల్ని సమూలంగా పెకిలించలేకపోయింది.

తర్వాత, కొన్ని సంవత్సరాలకు అస్పృశ్యతా వ్యతిరేకోద్యమంలో ద్వితీయ ఘట్టం ప్రారంభమైంది. అట్టడుగు కులంలో పుట్టిన కబీర్, రోహిదాసు, నానక్ వంటి మేథావులు సమానత్వాన్ని, సామాజిక న్యాయసూత్రాల్ని బోధించారు. మత, సామాజిక, నిరంకుశత్వానికి బలైన దళితులకు న్యాయం జరగాలని సూచించారు. ఈ విషయంలో ముందుగా శిక్కు మతం తర్వాత వైష్ణవ మతం, విశిష్టాద్వైతం, క్రైస్తవ మిషనరీలు రంగంలోకి దిగాయి.

క్రైస్తవ మిషనరీలు ప్రవేశంతో అస్పృశ్యతపై పోరాటం తృతీయ ఘట్టానికి చేరుకుంది. క్రీస్తు సందేశ ప్రచారం, అట్టడుగు వర్గాలవారికి ఆర్థిక సహాయం అందించటం వంటి కార్యక్రమాల వల్ల అస్పృశ్యులు ఏసుక్రీస్తును తమ పాలిటి రక్షకుడిగా భావించారు. క్రీస్తు ప్రబోధించిన సమానత్వం, జీవిత పరమార్థం, వారిని అధికంగా ఆకట్టుకున్నాయి. ఫలితంగా ఆరు మిలియన్ల భారతీయులు క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. వారిలో తొంభై శాతం అంటరాని వర్గాల వారే.

బ్రిటిష్ పరిపాలన ప్రారంభమైన తర్వాత అస్పృశ్యత వ్యతిరేక ఉద్యమ ప్రగతికి కొన్ని పరిస్థితులు అనుకూలించాయి. అంటరానితనం చాలావరకూ తగ్గింది. రైల్వేలు, మోటారు వాహనాలు ప్రవేశించిన తర్వాత సవర్ణులు, అస్పృశ్యులు భౌతికంగా దగ్గరయ్యారు. భారతదేశంలో కొత్తగా స్థాపించబడ్డ ఆధునిక పరిశ్రమల్లో సవర్ణులను, అంటరాని వర్గాల వారిని ఉద్యోగులుగా నియమించడంవల్ల, వీరంతా యంత్రాల దగ్గర కలిసి మెలసి పనిచేసే అవకాశం కల్గింది. కార్మిక నిరసన ఉద్యమాల్లో వారంతా తమ కోర్కెల సాధనకై కలిసి పోరాటం సల్పారు. ఆ విధంగా ఒక కొత్త వర్గం ఆవిర్భవించి, కుల వ్యవస్థను నిర్మూలింప చేయసాగింది. కుల దురభిమానాన్ని నాశనం చేసే అతి శక్తివంతమైన సాధనాలుగా పట్టణాల్లో ఫలహారశాలలు సహాయపడ్డాయి.

దళిత వర్గాల్లో క్రమ క్రమంగా ఆధునిక విద్యావ్యాప్తి వల్ల చదువుకున్న వారి సంఖ్య పెరిగింది. పూర్వం అగ్రవర్ణాల వారు నిర్వహించే వృత్తులను వారు చేపట్టడం ప్రారంభించారు. భౌతిక ప్రయోజనాలు అందరికీ ఒకటే కావడం వల్ల వారి మధ్య సదవగాహన పెరిగింది. కాలక్రమేణ వారి మధ్యగల విభేదాలు సమసిపోయి వారు దగ్గరయ్యారు. అగ్రవర్ణాలు, దళితులు అన్న భేదం లేకుండా సామరస్యంలో వారి సాధారణ ప్రయోజనాల సాధనకై కృషి చేశారు.

ఆధునిక విద్య ప్రవేశపెట్టడంతో పాశ్చాత్యుల స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య భావాలకు భారతీయులు స్పందించారు. ఫలితంగా అగ్రవర్ణాలకు చెందిన విశాల హృదయంగల మానవతా వాదులు హిందూ సమాజంలో పాతుకుపోయిన అన్యాయాలకు తీవ్రంగా కలతచెంది వారు ఆలోచించేటట్లు చేసింది. పాశ్చాత్య విద్య, విజ్ఞానార్జన చేసిన దళితుల్లో కూడా తిరుగుబాటు ధోరణి వృద్ధిచెందటానికి దోహదపడింది. వీరు దళితులకు నాయకత్వం వహించి, వారి బాధలను, అసమానతలను తొలగించి విముక్తికి తమపై విధించిన సంకెళ్లను తెంపి వేయడానికి పూనుకున్నారు. తమ ఆర్థిక స్థితిని మరింత మెరుగుపర్చుకోడానికి అవసరమైన విద్యను అభ్యసించారు. వర్గ

BRAOU

ప్రాతిపదికగా వివిధ వృత్తులను అనుసరించేవారు అదే వృత్తులు అనుసరించే ఇతర కులాల వారితో కలసి పోయారు. ఆ విధంగా కుల ప్రాతిపదికగాక వృత్తి ఆధారంగా నూతన సంబంధాలు వారి మధ్య ఏర్పడ్డాయి. ఈ మార్పు అంటరానితనం విషయంలో గల ప్రతికూల అభిప్రాయాన్ని బలహీనపర్చింది. ఈ విధమైన పరిస్థితి ముఖ్యంగా పారిశ్రామికవాడల్లో స్పష్టంగా కనిపించింది. వారిరువురు వారికి సంబంధించిన వృత్తులు; ఉద్యోగాల విషయాలల్లో ఐక్య పోరాటానికి సిద్ధపడటం, అందరికీ సంబంధించిన వేతనాల కొరకు వత్తిడి తేవడం, కార్మిక సంఘాల హక్కులు (trade union rights) పరిరక్షించుకోవడంలో సవర్ణ, అస్పృశ్య కార్మికుల మధ్య సన్నిహితత్వం క్రమక్రమంగా పెరిగింది. పూర్వం గల దురభిమానం పోయి, దానిస్థానే కొత్త వర్గ సామరస్యం ఏర్పడింది.

అస్పృశ్యతా వ్యతిరేకోద్యమానికి వాతావరణాన్ని అనుకూలంగా మార్చడానికి మరొక అంశం కూడా పనిచేసింది. అది కుల, వర్ణ ప్రమేయం లేని రాజకీయ స్వాతంత్ర్యం సాధించడానికి భారతీయులను ఏకం చేసిన జాతీయోద్యమం. స్వరాజ్యం సాధించటానికి అన్ని కులాలు, వర్గాల మధ్య ప్రజాస్వామిక ఐక్యత అవసరమైంది. రాజకీయ స్వాతంత్ర్య పోరాటాల్లో ముఖ్యంగా ఐక్యత ఏర్పడింది. ఆ విధంగా జాతీయోద్యమం పూర్వ సామాజిక వ్యత్యాసాల్ని ఛేదించే దిశకు క్రమంగా చేరుకుంది. మరోవైపు సాంఘిక సంస్కరణోద్యమం, అంటరానితనం వంటి సాంఘిక దురాచారాలను నిర్మూలించే దిశలో ప్రజాస్వామిక పద్ధతి ద్వారా భారతీయుల్లో జాతీయ సమైక్యత సాధించడానికి దోహదపడింది. సాంఘిక సంస్కర్తలు, మానవతా వాదం, జాతీయ ప్రయోజనాల వల్ల ప్రభావితులై సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడారు.

## 19.4 బ్రిటిష్ ప్రభుత్వ విధానం

దళిత వర్గాల ప్రాథమిక హక్కులను పునరుద్ధరించడంలో బ్రిటిష్ ప్రభుత్వం శ్రద్ధ కనబర్చలేదని భారతీయుల అభిప్రాయం. నాటి విదేశీ ప్రభుత్వం భారతదేశంలో సాంఘిక, మత సంబంధమైన విషయాల్లో తటస్థ విధానం అవలంబించింది. ఈ విధానం భరించరాని సాంఘిక దురాచారాలు శాశ్వతంగా కొనసాగటానికి అనుకూలించింది. సతీ సహగమన నిషేధం, సమ న్యాయపాలన (Rule of Law) మొదలైన సామాజిక ప్రాముఖ్యత గల సంస్కరణలు కొంచం ముందకోడిగా అమలు పరచబడినవి. ప్రభుత్వ విధానం హిందూ పూర్వాచార పరాయణుల భావాలకు అనుగుణంగా ఉందనేది రుజువైంది.

## 19.5 దళితుల అభ్యున్నతికి కృషిచేసిన సంస్థలు, వ్యక్తులు

క్రైస్తవ మత సంఘాలు, బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం, ఆర్య సమాజం, దివ్యజ్ఞాన సమాజికుల అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషిచేశాయి. ఈ విషయంలో దేశం ఆయా సంస్థలకు ఎంతో ఋణపడి ఉంది. అవి మానవతా దృష్టితో సమస్యను విశ్లేషించి, ఆ సమస్యను పరిష్కరించాలన్న పట్టుదలతో పనిచేశాయి.

### 19.5.1 క్రైస్తవ మిషనరీలు

క్రైస్తవ మిషనరీలు కొన్ని అట్టడుగు వర్గాలను ఆకర్షించడానికి ప్రయత్నాలు చేశాయి. వీటి ప్రయత్నాలు ఆరంభంలో కొన్ని సత్ఫలితాలను ఇచ్చాయి. 1880కి ముందు ఏ విధమైన అద్భుత విజయాలను సాధించలేదు. అయితే, 1876-1879 మధ్య కాలంలో కరువు సృష్టించిన బీభత్సం వల్ల ప్రజలు బాధలకు గురైనారు. ఆంధ్ర, తమిళ ప్రాంతాల్లో అత్యంత విషాదకరమైన జన నష్టం కూడ సంభవించింది. దీనితో క్రైస్తవ మిషనరీలు కరువుకు గురైన పేద ప్రజల పునరావాసానికి పనిని కల్పించడం కోసం, భవన నిర్మాణం, మృణ్మయ పాత్రల తయారీ మొదలైన కార్యక్రమాల్లో ప్రభుత్వంతో సహకరించాయి. దాని ఫలితంగా కరువు ప్రభావం తగ్గిన తర్వాత మత మార్పిడికి వారు క్రైస్తవ మిషనరీలను ఆశ్రయించారు.

BRAOU

క్రైస్తవ మతం స్వీకరించని అంటరానివారిలో కొందరు మత మార్పిడివల్ల తమ సమస్యలు పరిష్కారం కావని భావించారు. ఇట్టి భావం భారతదేశంలో కొన్ని ప్రాంతాల్లో కనిపించింది. మలబారులో 'తియాలు' (Tiyas), మైసూర్‌లో వక్కలిగలు (Vakkaligas), తర్వాత కొంతకాలానికి మహారాష్ట్రలోని 'మహర్'లు (Mahars) ముందుకు వచ్చారు. 1910 నవంబర్‌లో పూనావద్ద సమావేశమై, మహర్‌లు సైన్యంలో తమ తండ్రులు పనిచేసిన ఉద్యోగాలకు తిరిగి తమను నియమించమని భారత కార్యదర్శి (Secretary of State)కు వినతిపత్రాన్ని సమర్పించారు. బెంగాల్‌కు చెందిన నామశూద్రులు (Namsudras) 1910లో సమావేశమై, తమకు తామే స్వయంగా అభివృద్ధి చెందటానికి ఒక ప్రణాళికలను రూపొందించుకున్నారు. జలంధర్‌కు చెందిన వీధులు తుడిచే వారు తమ ప్రయోజనాన్ని పరిరక్షించుకోవటానికి 'వాల్మీక సమాజ్' (Valmika Samaj) ను ప్రారంభించారు. దూర దృష్టిగల కొందరు ఇతర భావాలను వ్యక్తపరిచారు. 1903 ధార్వార్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో జి.కె. గోఖలే అణగారిన ప్రజలు బానిసలుగా జీవితం గడుపుతూ మానసికంగా, నైతికంగా పతనమై పోవడం న్యాయ వ్యవస్థకే విరుద్ధమైందని చెప్పారు. ప్రపంచంలోని ఇతర నాగరిక జాతులతో సమానంగా చూడమని వారు గట్టిగా కోరుతున్నారని వేరొక సందర్భంలో ఆయన అన్నారు.

## 19.5.2 బ్రహ్మ, ప్రార్థనా సమాజాలు – అస్పృశ్యతా నివారణ

బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం గాని, దళితుల పట్ల శ్రద్ధ చూపించిన క్రైస్తవేతర సంస్థల కృషిగానీ ఆశించినంత ప్రాముఖ్యతను సంతరించుకోలేదు. బ్రహ్మ సమాజం, కుల వ్యవస్థను, విగ్రహారాధనను వ్యతిరేకించింది. క్రైస్తవ మత ప్రభావం కేశవచంద్ర సేన్‌ను అతని అనుచరులను వర్ణవ్యవస్థ నిర్మూలనకు, దేశ నైతిక అభివృద్ధికి సంపూర్ణ హిందూ సమాజ సంస్కరణ అవసరమని గుర్తించేట్లు చేసింది.

ప్రార్థనా సమాజం కూడ బడుగువర్గాల అభ్యున్నతికి ఉద్యమించింది. ఉదాహరణకు కష్టపడి పనిచేసే వర్గాల వారికి 8 రాత్రి పాఠశాలల ప్రారంభించి, వాటికి ఆర్థిక సహాయాన్ని అందించారు. వాటిలో రెండు పాఠశాలలు అస్పృశ్యులకు ప్రత్యేకించబడ్డాయి. 1891లో దామోదర్‌హర్ సుకద్‌వాల్లా తన సొంత ఖర్చుతో బొంబాయిలో బైకుల్లా ప్రాంతంలో మహర్‌లకు మూడు పాఠశాలలను ప్రారంభించాడు.

19వ శతాబ్దం చివరి దశకంలోను, 20వ శతాబ్ద మొదటి రెండు దశాబ్దాల్లోను చురుకుగా కొనసాగిన సంస్కరణ కృషికి బాధ్యులు ప్రార్థనా సమాజ సభ్యులే.

ఆర్య సమాజికులు అణగారిన ప్రజల సముద్ధరణకు సాధ్యమైనంత ఎక్కువ కృషి చేశారు. సర్వ మానవ సహోదరత్వం, స్త్రీ, పురుషుల సమానత్వం, కర్మ ప్రజ్ఞల ప్రాతిపదికగా అందరికీ సమాన అవకాశాలు కల్పించడం అనేవి ఆర్య సమాజ సాంఘిక లక్ష్యాలు. వాటికి అనుగుణంగా ఆర్య సమాజం నిమ్నకులాల ఉద్ధరణలో గొప్ప శ్రద్ధాసక్తులను ప్రదర్శించింది. పవిత్రమైన యజ్ఞోపవీతాలను ధరించే హక్కులేని కొన్ని కులాల వారికి ఆ హక్కు కల్పిస్తూ సమాజంలో వారి హోదాను పెంచింది. ఆర్య సమాజం దళితులకు ద్విజాలకున్న హక్కులు కల్పించింది. గాయత్రి మంత్రాన్ని నేర్చుకోడానికి, పౌరోహిత్యం నిర్వహించడానికి, సహపంక్తి భోజనాల్లో పాల్గొనటానికి, దళితులకు వీలు కల్పించింది. జమ్ము-కాశ్మీర్, సియాల్‌కోట (Sialkot) ల్లో వేలసంఖ్యలో అట్టడుగు వర్గాలవారు ఆర్య సమాజంలో చేరారు. అనాధ శిశు సంరక్షణ శాలలను, వితంతు శరణాలయాలను ఏర్పాటుచేసిన స్వదేశీ సంస్థ ఆర్య సమాజమే. ఉత్తర భారతంలో అనేక ప్రాథమిక పాఠశాలలను కూడా ప్రారంభించి, నిర్వహించింది. పంజాబ్‌లో ప్రతి జిల్లాలో ఆర్య సమాజ సభ్యులు అణగారిన వర్గాల అభివృద్ధికి సేవచేశారు. లాహోర్, మరికొన్ని ఇతర ప్రదేశాల్లో హిందూ అగ్రవర్ణాలు తమ పిల్లలను దళితుల కొరకు స్థాపించిన విద్యా సంస్థల్లో చేర్పించారు.

BRAOU

### 19.5.3 జాతీయ సాంఘిక సభ (National Social Conference)

సాంఘిక సంస్కరణ సంఘాలన్నీ అణగారిన ప్రజల అభ్యున్నతి ప్రాధాన్యతను గుర్తించాయి. దళిత వర్గాల వారిని నిరంతర దాస్యానికి గురి చేయడం వల్ల, హిందూ సమాజ ఐక్యతకు కలిగే నష్టాన్ని గూర్చి కూడా ఆ సంఘాలు తీవ్రంగా ఆలోచించసాగాయి. ఈ సంస్థల సభ్యులు ఇతర సాంఘిక సమస్యలతో పాటు, దళిత వర్గాల దారిద్ర్యం సమస్యను కూడా జాతీయ సాంఘిక సమావేశం దృష్టికి తెచ్చిరు. 1900లో జరిగిన తొమ్మిదవ జాతీయ సమావేశంలో వెలివేయబడ్డ వారి అభివృద్ధి, వారి విద్యావకాశాలు మెరుగుపరచే బాధ్యత దేశ క్షేమాన్ని మనఃస్ఫూర్తిగా కోరే వారి తక్షణ కర్తవ్యమని, ఆర్థిక, పారిశ్రామిక, విద్యారంగాల్లో అవకాశాలు కల్పించి వారి స్థితిని మెరుగు పర్చడానికి ప్రయత్నం చేయాలని తీర్మానించారు. 1901లో జరిగిన సమావేశం దళితులకు శిశు సంరక్షణ శాలలు (orphanages) ఏర్పాటు చేయాలనీ, వాటి నిర్వహణకు నిధులు సేకరించాలని సిఫారసు చేసింది. ఈ వర్గాల వారు అభివృద్ధి చెందటానికి తక్షణమే తీసుకునే కట్టుదిట్టమైన చర్యలపైనే దేశ శ్రేయస్సు, దేశ ఔన్నత్యం ఆధారపడి ఉంటుందని 1902 అలహాబాద్ సమావేశం తీర్మానించింది. సమాజంలో బడుగు వర్గాల వారి అభ్యున్నతి పట్ల ఉపేక్షించరాదని 1903 మద్రాస్ సమావేశం పునరుద్ఘాటించింది.

### 19.5.4 దివ్యజ్ఞాన సమాజికులు

అనీబిసెంట్ సూచన ప్రకారం దివ్యజ్ఞాన సమాజికులు (Theosophists) జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బడుగు వర్గాల్లో విద్యావ్యాప్తికి పూనుకున్నారు. అడయార్‌లో దివ్యజ్ఞాన సమాజ కేంద్రాలయం వద్ద కల్నల్ ఓల్కాట్ పరయాలకు పాఠశాలలు నెలకొల్పాడు. 1894లో దివ్యజ్ఞాన పాఠశాలను పంచములకై ఓల్కాట్ ప్రారంభించారు. నాటినుండి పరయాలను విద్యావంతులుగా చేయడానికి ఉద్యమం ప్రారంభమైంది. 1898లో హెచ్.బి. బ్లావిట్స్కీ జ్ఞాపక చిహ్నంగా రెండవ పాఠశాలనూ, 1899లో మూడవ దాన్ని, ఆ తర్వాత సంవత్సరంలో తిరువల్లువార్‌లో నాల్గో పాఠశాల ఆవిర్భవించాయి. 1898 అమెరికా దేశస్థురాలు యస్.ఇ. పామర్ (Miss S.E. Palmer) పంచముల పాఠశాలలకు ముఖ్య కార్యదర్శిగా పనిచేసింది. ఆమె నిర్వహణలో ఆ పాఠశాలలన్నీ సంతృప్తికరంగా పనిచేశాయి.

### 19.6.5 వివేకానందుడు

భారతదేశాన్ని ఆధ్యాత్మికంగా మేల్కొల్పిన ప్రవక్త వివేకానందుడు. దళిత ప్రజల పట్ల సానుభూతిని వ్యక్త పరచి, వారి సముద్ధరణ గూర్చి పదే పదే గుర్తుచేశాడు. లభ్యమయ్యే ధనమంతా దళితుల విద్యావ్యాప్తికి వినియోగించాలని సూచించాడు. ఈ వర్గాల వారు ఆర్థికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందాలని వివేకానందుడు కోరాడు. భారతదేశంలో వర్ణ భేదాలు సమసిపోవాలని, బడుగు వర్గాలను ఉద్ధరించడం ద్వారా అది సాధ్యపడగలదని వివేకానందుడు అభిప్రాయపడ్డాడు. నిమ్న కులస్థులను అలక్ష్యం చేయరాదని, నిరక్షరాస్యుడు, పేదవాడు, వీధులు ఊడ్చేవాడు మొదలైన వారందరూ తమ సహోదరులేనని ఉద్బోధించాడు. పేదరికం వల్ల తిండికి నోచుకోక, పౌరోహితుల స్వప్రయోజనాలకు బలైపోయిన లక్షలాది నిరుపేద వర్గాల అభ్యున్నతి కొరకు పగలు, రాత్రులు ప్రార్థనలు జరపమని తన అనుచరులను ఆదేశించారు. బలహీన వర్గాలు న్యాయమైన హక్కులు పొందటానికి వారికి సంపన్న అగ్రవర్ణాల సహాయ, సహకారాలు తప్పకుండా ఉండాలని ఆయన భావించాడు.

### 19.5.6 శశిపాద బెనర్జీ

అనేక సాంఘిక సంస్కరణ కార్యకలాపాల్లో మార్గదర్శియైన శశిపాద బెనర్జీ కార్మికుల సంక్షేమాన్ని కాంక్షించి బారానగర్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించాడు. 1870 ఆగస్టులో బారానగర్‌లో ప్రారంభించిన పురుష కార్మిక

సంఘం (Working Mens Club) ఆయన నిర్వహించిన వివిధ సాంఘిక సంస్కరణ సంస్థల్లో ఒకటి. అది బారానగర్‌లో కూలిపని చేసుకొని బతికేవారికి అపారమైన సేవ చేసింది. వారు మత్తు పానీయాలను తాగడం పూర్తిగా మాన్పించింది. మూఢ విశ్వాసాలను, దుర్నీతితో కూడిన ఆచార కర్మకాండలను ఆచరించడాన్ని ఈ సంఘం పూర్తిగా నిరుత్సాహపరిచింది. సామాన్య జనుల నైతిక ఔన్నత్యం కోసం పాటుపడింది.

'మహారాష్ట్ర గ్రామీణ విద్యా సంఘం' (Maharashtra village Education Society) బారామతిలోను, 'ప్రార్థనా సమాజం' సతారాలోని వెనుకబడ్డ కులాల వారిని విద్యావంతులుగా చేయటానికి తీవ్రంగా ప్రయత్నించాయి. 19వ శతాబ్ది చివరి నాటికి మహారాష్ట్ర గ్రామీణ విద్యా సంఘం ఆధ్వర్యంలో బారామతిలోగల విద్యా సంస్థలు : 1. బారామతి బోర్డింగ్ ఇంగ్లీష్ పాఠశాల, 2. బారామతి సాంకేతిక పాఠశాల 3. బారామతి నిమ్న కులాల పాఠశాల 4. కలాన్ నిమ్నకులాల పాఠశాల 5. మేఖలి నిమ్న కులాల పాఠశాల 6. కజద్ మరాఠి పాఠశాల 7. అకోలా నిమ్న కులాల పాఠశాల 8. కట్‌ఫల్ నిమ్నకులాల పాఠశాల.

పంచముల కొరకు మంగుళూర్ సాంఘిక సంస్కరణ సంఘం ఒక పాఠశాలను నెలకొల్పింది. 1904లో తిరువాన్కూర్ సంస్థానం వెనుకబడ్డ కులాల వారికి ఉచితంగా విద్య గరపాలని తీర్మానించింది. పూనాలో ప్రార్థనా సమాజం దళితులకై రెండు రాత్రి పాఠశాలలు నిర్వహించింది. అందులో ఒకటి మహర్‌లు, మాంగ్‌లు, చంబర్లు, పోలార్లు మొదలైన నిమ్న కులాలకు ప్రత్యేకించబడ్డాయి. ధర్మం, నైతిక విలువలు, మత సంబంధమైన విద్య ఆ పాఠశాలలో బోధించేవారు.

**19.5.7 దళిత జాతుల సంఘం (Depressed Classes Mission)**

దళిత జాతులకు చెందిన మేధావులు కూడా వారి సముద్ధరణకై విశేషంగా కృషి చేశారు. బొంబాయి ప్రార్థనా సమాజం ఆధ్వర్యంలో విఠల్ రాంజీ షిండే (Vittal Ramji Shinde) 'దళిత జాతుల సంఘాన్ని' (Depressed Classes Mission) 1906లో స్థాపించారు. ఈ సంఘం అణగారిన ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ప్రశంసనీయమైన కృషి చేసింది. యావత్ భారతదేశం సంఘ కార్యక్రమాల్లో ఆసక్తి చూపింది. దళిత వర్గాల వారి సామాజిక, ఆధ్యాత్మిక అభివృద్ధిని సాధించడమే ఈ సంఘం ప్రధాన లక్ష్యం. మహర్‌లు, చమర్‌లు, పరియాలు, నామశూద్రులు తదితర నిర్లక్ష్యం చేయబడిన వర్గాల వారికి విద్య నేర్పడం, పని కల్పించి సాంఘిక అయోగ్యతల్ని తొలగించడం, మతానికి సంబంధించి స్వేచ్ఛాయుత భావాలను ప్రబోధించటం, సత్ప్రవర్తన నేర్పడం, మంచి పౌరులుగా వారిని తీర్చిదిద్దటం ద్వారా దళిత కులాల వారి హోదాను మెరుగుపరచడం ఈ సంఘం చేపట్టిన ప్రధాన కార్యక్రమాలు. 1913 జూలై నాటికి ఈ సంస్థ తానా, హుబ్లీ, నాగపూర్, సతారా, అకోలా, మహాబలేశ్వర్, మద్రాస్ మొదలైన 15 కేంద్రాల్లో దాని ఆధ్వర్యంలో 30 విద్యా సంస్థలను నడిపింది. 1914 సంవత్సరానికల్లా బొంబాయి ప్రధాన కేంద్రంగా అఖిల భారత దళిత వర్గాల సంస్థగా ఎదిగి, దాని కార్యక్రమాన్ని విస్తృతపరచింది. దీని అనుబంధ శాఖలు బొంబాయి రాష్ట్రమందే గాక, మద్రాస్, మధ్య పరగణాలు, బీరార్‌లోను ఉన్నాయి. బెంగాల్, అస్సాంలలో కొంతకాలం స్వతంత్రంగా తన పనిని నిర్వహించింది. తర్వాత కలకత్తాలోని బ్రహ్మ సమాజ సాధనాశ్రమంలో విలీనమైంది. ఈ విధంగా విలీనమైన సంఘం వెనుకబడ్డ తరగతుల సంస్థ (Backward Classes Mission) గా ప్రసిద్ధి చెందింది. ఆర్య సమాజం, దేవ సమాజం, దివ్య జ్ఞాన సమాజం, సిక్కు సంఘాలు అంటరాని వారి అభివృద్ధికి కృషి చేసేట్లు పురికొల్పింది.

1916 నాటికి అఖిల భారత దళిత జాతుల సంస్థ బాగా అభివృద్ధి చెందింది. అందువల్ల సనాతన ఛాందసులు ఈ సంస్థ పట్ల తమకున్న వ్యతిరేక వైఖరిని మార్చుకొన్నారు. విద్యాధికులందరూ ఈ సంస్థకు అండగా

BRAOU

నిలిచి, పనిచేసి దాని కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలను అందించారు. ప్రగతి పథంవైపున నడిపించారు. అంతేగాక ఈ సంస్థ ఆధీనంలో అనేక విద్యా సంస్థలు పనిచేస్తుండేవి.

ప్రాంతీయ సంస్కరణ సంఘాలు (Associations) జాతీయ పునర్నిర్మాణంలో దళితుల ప్రాముఖ్యతను గుర్తించాయి. 1907 మధ్య పరగణాల సాంఘిక సంస్కరణ సమావేశం నిమ్న కులాలు తదితర వెనుకబడ్డ తరగతులు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ఒక తీర్మానంలో చేర్చింది. 1903 ధార్వర్‌లో సమావేశమైన బొంబాయి రాష్ట్ర సాంఘిక సంస్కరణ సంఘం నిమ్న జాతుల పరిస్థితి దయనీయంగా ఉందని, దేశ క్షేమం కోరే ప్రతి వ్యక్తి ఆ వర్గాల వారు సాంఘికంగా, నైతికంగా అభివృద్ధి చెందటానికి కృషిచేయటం తమ ప్రథమ కర్తవ్యంగా భావించాలని, విద్య, ఉపాధి మున్నగు సదుపాయాలు కల్పించివారిలో ఆత్మగౌరవం పెంపొందేట్లు కృషి చేయాలని కోరింది. ఇటువంటి సమావేశాలు 1909లో జరపమని జిల్లా స్థాయి సంఘాలకు లేఖలు రాసింది. బడుగు వర్గాల అభివృద్ధిని సమర్థిస్తూ రత్నగిరి, బీజపూర్, పూనా, గదగ్, తానా ప్రదేశాల్లో సమావేశాలు జరిగాయి. అనీబిసెంట్ నాయకత్వంలో మద్రాస్ రాష్ట్ర సాంఘిక సంస్కరణ సభ దళితులకు విద్యావకాశాలను కల్పించాలని కోరింది.

ప్రత్యేకంగా దళితులకు పంజాబ్ జిల్లా కేంద్రాల్లో దేవ సమాజం మూడు పాఠశాలలను నిర్వహించింది. సింగ్ సభలు వెలివేయబడ్డ వారిని శిక్కు మతం స్వీకరించమని ప్రోత్సహించింది. మైసూర్‌లో అంటరాని వారి పిల్లలకు సహాయం అందించటానికి 'హిందూ ఎడ్యుకేషన్ మిషన్' (Hindu Education Mission) మూడు పాఠశాలలు, రెండు రాత్రి పాఠశాలలను నడిపింది.

## 19.6 ప్రభుత్వ ఉత్తర్వులు

అంటరానితనాన్ని పరిష్కరించడం సులువైందికాదు. ప్రభుత్వాలు దళితులకు బావులు, చెరువులు మొదలైన వాటిని వాడుకోటానికి ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, అగ్రవర్ణాల ప్రతిఘటన కారణంగా అవి పూర్తిగా అమలు కాలేదు. 1923లో చెరువులను, బావులను, విద్యా సంస్థలను, ధర్మశాలలను దళితులు ఉపయోగించు కోవచ్చని బొంబాయి శాసనసభ తీర్మానించింది. తీర్మానాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. అయితే కొన్ని స్థానిక సంస్థలు ఉత్తర్వులను అమలు చేయటానికి నిరాకరించాయి. గ్రామ నూతుల్లోని నీటిని దళితులు వాడుకోవచ్చని బరోడా ప్రభుత్వం చట్టం చేసింది. ఈ నియమాన్ని ఉల్లంఘించిన గ్రామం ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని కోల్పోతుంది. ఆ సంస్థానమే నిర్బంధ విద్యా చట్టం (Compulsory Education Act) ద్వారా దళితులతో సహా అన్ని వర్గాలవారు తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని నిర్బంధం చేసింది. బరోడాలో దళితులకై స్థాపించిన ప్రత్యేక పాఠశాలలు 1931 తర్వాత మూతబడ్డాయి. అయితే, మామూలు పాఠశాలల్లో ప్రవేశార్హత అందరికీ లభించింది. మైసూర్ మహారాజా దళితులకు ప్రత్యేకంగా పాఠశాలలను స్థాపించాడు. దళిత విద్యార్థులకు ఉపకార వేతనాలను ఏర్పాటు చేశాడు. 1929-30 సమావేశంలో మద్రాస్ శాసన మండలి (Legislative Council) కుల, వర్గ, భేదాలు లేకుండా అన్ని బహిరంగ ప్రదేశాల్ని, మార్కెట్లను, రహదారి మార్గాలను ఉపయోగించవచ్చని శాసనం చేసింది. ఇటువంటి శాసనాన్నే మధ్య పరగణాల శాసనమండలి (Council) కూడా ఆమోదించింది.

## 19.7 అస్పృశ్యతకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఉద్యమం

భారత జాతీయ కాంగ్రెస్ గాంధీ మార్గ దర్శకత్వంలో అస్పృశ్యతకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపింది. అస్పృశ్యతా నిర్మూలన కేవలం సాంఘిక ప్రాధాన్యతగల సమస్యగా గుర్తించడమే గాక, జాతీయ విమోచనోద్యమంలో అంతర్భాగంగా నిర్వహించబడింది.

అంటరానితనం నిర్మూలనలో గాంధీజీ ప్రత్యేక పాత్ర వహించాడు. దక్షిణాఫ్రికాలో భారతీయుల సమానత్వం కొరకు పోరాటం, భారతదేశంలో కొందరు తోటి పౌరులపై విధించిన అసమానతల్ని తీవ్రంగా వ్యతిరేకించడం అనేది గాంధీ పోరాటంలో ముఖ్యమైన అంశాలు. సామాన్య జనంపై దృష్టి కేంద్రీకరించి సమస్యను వినూత్న పద్ధతిలో పరిష్కరించడానికి గాంధీ ప్రయత్నించాడు. చాతుర్వర్ణ వ్యవస్థ అంతర్గత మౌలిక సూత్రాలను సవాల్ చేయకుండా ఉద్యమాన్ని ఆరంభించాడు. సంస్కరణ వాదులలాగే ఒక హిందూ మతస్తునిగా సనాతన వాదులను ఎదుర్కొన్నాడు. అనేకసార్లు తాను సనాతన హిందువునని పేర్కొన్నాడు. హిందూ మతపరంగా ఏ వ్యక్తినీ అంటరానివానిగా పరిగణించటానికి అవకాశం లేదన్నాడు. అస్పృశ్యత, తదితర సాంఘిక దురాచారాలను సమర్థించే శ్లోకాలను బహిరంగంగా విమర్శించాడు. గాంధీ సాగించిన పోరాటం సాంఘిక న్యాయం ఏమిటో వివిధ కులాల విద్యుక్త ధర్మాలు ఏమిటో సవర్ణులు తెలుసుకొనేట్లు చేసింది. జన బాహుళ్యం గాంధీని మహాపురుషుడిగా భావించి, అతని పిలుపునకు ముక్త కంఠంతో స్పందించారు. తన సమాజ పునః నిర్మాణ కార్యక్రమంలో గాంధీ అంటరానితనం నిర్మూలనాంశానికి గౌరవ స్థానం కల్గించాడు. తాను చేపట్టిన మూడు ముఖ్యాంశాల్లో అస్పృశ్యతా నివారణ ఒక కార్యక్రమంగా మాత్రమే గాక, దేశ స్వాతంత్ర్యం కోసం జరిగే పోరాటంలో ఒక ప్రధాన భాగంగా రూపొందించారు. హిందూ ముస్లింల ఐక్యత, ఖాదీ ఉద్యమం అనేవి మిగిలిన రెండు అంశాలు. దళిత సోదరుల స్పర్శ పాపంగా ఎంతకాలం భావిస్తారో అంతవరకు స్వరాజ్యాన్ని సాధించడం అసంభవమని గాంధీ నమ్మాడు. అస్పృశ్యతకు వ్యతిరేకంగా తాను ఉపదేశించింది ఆచరణలో చేసి చూపాడు. సవర్ణుల్లో ఒక్కరు కూడా అస్పృశ్యులతో కలిసి భోజనం చేయడానికి ప్రయత్నించలేదు. కాని గాంధీ ఒక అస్పృశ్యుని కుటుంబానికి తన ఆశ్రమ ప్రవేశానికి అనుమతించి, వారి పిల్లను తన కుమార్తెగా దత్తత తీసుకున్నాడు. ఈ చర్య దేశ ప్రజలపై గొప్ప ప్రభావాన్ని చూపింది. అప్పటి నుండి గాంధీ అనుచరులు అస్పృశ్యుల్ని తమ గృహాల్లో పనులకు నియోగించడం ఆరంభించారు.

గాంధీకి పూర్వం 1917లో భారత జాతీయ కాంగ్రెస్ కలకత్తా సమావేశంలో అణగారిన ప్రజలపై తోటి సోదరులు విధించిన అన్ని అనర్హతల్ని తొలగించడం భారత పౌరుని తక్షణ కర్తవ్యం. న్యాయం, ధర్మం అని పేర్కొంది. కాని తీర్మానాన్ని అమలుచేయటంలో ఎవరూ ఆసక్తి చూపలేదు. గాంధీ రాజకీయ రంగంలోకి ప్రవేశించిన తర్వాత పరిస్థితిలో గణీయమైన మార్పు వచ్చింది. అస్పృశ్యతను సమూలంగా నిర్మూలించవల్సిన ఆవశ్యకత అందరికీ అర్థమైంది. 1921లో జరిగిన అహమదాబాద్ కాంగ్రెస్ సమావేశం బడుగు వర్గాల వారికి సేవ చేయటానికి పాటుపడాలని నిర్ణయించింది. అస్పృశ్యతా నివారణ కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఒక ప్రధాన భాగంగా 1922 ఫిబ్రవరి 22న బార్డోలీలో సమావేశమైన వర్కింగ్ కమిటీ ప్రకటించింది. 1924-1931 మధ్య కాంగ్రెస్ అనేక పర్యాయాలు అస్పృశ్యత అనే వృక్షాన్ని సమూలంగా నాశనం చేయాలని తీర్మానాలు చేసింది. 1929 జనవరి 3న కలకత్తాలో సమావేశమైన కాంగ్రెస్ కార్యవర్గం అంటరానితనానికి వ్యతిరేకంగా జరపదలచిన పోరాటానికి సనాతనుల ప్రతినిధి అయిన మదన్‌మోహన్ మాలవ్య, సేఠ్ జమన్‌లాల్ బజాజ్ సభ్యులుగా ఒక ఉపసంఘాన్ని నియమించింది. ఈ సంఘం కృషి ఫలితంగా అస్పృశ్యుల స్థితి బాగుపడింది. వారు బావులను వాడుకోవటానికి, ఆలయాల్లో ప్రవేశించడానికి, పాఠశాలల్లో చేరడానికి మార్గం సుగమమైంది.

## 19.8 గాంధీ చారిత్రాత్మక నిరాహార దీక్ష : హరిజన యాత్ర (1932)

1931 గాంధీ - ఇర్విన్ ఒడంబడిక ప్రకారం ఏకైక ప్రతినిధిగా గాంధీ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నాడు. ఆ సమావేశంలో అట్టడుగు వర్గాల ప్రజలకు జనాభా ప్రాతిపదికపై ప్రత్యేక ప్రాతినిధ్యం ఉండాలని డిమాండ్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌తో గాంధీ విభేదించాడు. ప్రత్యేక ప్రాతినిధ్యం వల్ల వారి దాస్యం

శాశ్వతంగా కొనసాగే అవకాశం ఉందని గాంధీ నమ్మాడు. కాని 1932 కమ్యూనల్ అవార్డు దళితులకు ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని కల్పించింది. ఆ అవార్డుకు వ్యతిరేకంగా గాంధీ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించాడు.

గాంధీ వీరోచితమైన నిరాహార దీక్షతో అస్పృశ్యతా నివారణోద్యమం కొత్త మలుపు తిరిగింది. అది పూనా ఒడంబడికకు దారితీసింది. ఈ ఒడంబడిక స్పష్టంగా దళితులకు అనుకూలంగా ఉంది. శాసనసభల్లో వారి సీట్ల సంఖ్య 71 నుండి 148కి పెరిగింది. అస్పృశ్యతకు ప్రజల ఆమోదం పోయింది. పండిట్ మదన్ మోహన్ మాలవ్యా అధ్యక్షతన హిందూ నాయకులు 1932 సెప్టెంబర్‌లో బొంబాయిలో సమావేశమై, హిందువుల్లో ఏ వ్యక్తినీ అతని పుట్టుక కారణంగా అంటరానివాడు అని అనరాదని, అంటరాని వారిపై విధించిన సాంఘిక అనర్హతల్ని తొలగించాలనీ, వారు హిందూ ఆలయాల్లో ప్రవేశించకూడదనే నియమాన్ని హిందూ నాయకులు తక్షణమే పరిష్కరించాలని కోరింది.

దళితులు దేవుని పిల్లలని భావించి గాంధీ వారికి హరిజనులని పేరుపెట్టాడు. అస్పృశ్యతకు వ్యతిరేకంగా తన పోరాటాన్ని తీవ్రతరం చేశాడు. గాంధేయ వాదులు హరిజనులను దేవాలయాల్లోకి తీసుకెళ్ళారు. వారితో కలిసి విందుల్లో పాల్గొన్నారు. ఈ చర్యలు సవర్ణ హిందువులకు వణుకు పుట్టించాయి. 1932లో గాంధీ 'హరిజన సేవక్ సంఘం' అను సంస్థను, ఘనశ్యాందాస్ బిర్లా అధ్యక్షుడుగా, అమృతలాల్ ఠక్కర్ కార్యదర్శిగా స్థాపించాడు. ఈ సంస్థ హరిజనులకు అనేక పాఠశాలలను స్థాపించింది. పారిశుధ్య పనివాళ్ల సంఘం, సహకార పరపతి సంఘాలు, గృహ నిర్మాణ సంఘాలను కూడా ఏర్పాటు చేసింది. హరిజనులను ఆర్థికంగా ఆదుకోవడం, వారికి విద్యావకాశాలను కల్గించడం, అంటరానితనం చట్టవ్యతిరేకమైందిగా చేయడం ఈ సంస్థ చేపట్టిన మూడు ప్రధాన కార్యక్రమాలు. 1933-34 హరిజన సేవా సంఘ సాంవత్సరిక నివేదిక ప్రకారం సేవా సంఘం ఆధ్వర్యంలో బాలబాలికలకు 909 పాఠశాలలు, 1118 వసతిగృహాలు (hostels) ఉన్నాయి. కొత్తగా 170 బావులను తవ్వించింది, 80 బావులకు మరమ్మత్తులు చేసింది. 177 దేవాలయాల్లోకి హరిజనులకు ప్రవేశం లభించింది. కొత్తగా 13 ఆలయాలను నిర్మించింది. హరిజన సేవా సంఘం తిరోగాముల వ్యతిరేకత వల్ల ఆశించిన ఫలితాలను అందివ్వలేకపోయింది. సంఘం విద్యా కార్యక్రమాల్లో అత్యంత శ్రద్ధ చూపింది.

B R A O U

రెండు సంవత్సరాల పాటు (1932-34) గాంధీ తన పూర్తి సమయాన్ని అస్పృశ్యత నిర్మూలనకై వినియోగించాడు. 1933-34 మధ్య కాలంలో విస్తృతంగా భారతదేశ పర్యటన గావించి, అనేక చోట్ల ప్రజల నుద్దేశించి ప్రసంగాలను చేశాడు. హరిజనోద్యమం కోసం ప్రజల నుండి హరిజన నిధికి సహాయాన్ని అర్థించాడు. హరిజన యాత్ర సందర్భంగా గాంధీ ఉపదేశాల సారాంశం క్లుప్తంగా ఇది : "ఈ పవిత్రీకరణోద్యమంలో హరిజనులు ప్రయోజనకరం, గౌరవప్రదమైన పాత్ర వహించాలి. ఆరోగ్య రక్షణకు, పరిశుభ్రతకు ఏర్పడ్డ నియమాలను పాటించాలి. తాగుడు అలవాటు మానాలి. సవర్ణ హిందువులు ఒకరు అధికులు, ఒక అధములు అన్న భేదాలను విస్మరించాలి. అస్పృశ్యులకు విముక్తి కలిగించకపోతే హిందూ జాతి నశించి పోతుంది. అస్పృశ్యతా దోషాన్ని నిర్మూలించడానికి తాను చేసే ప్రయత్నంలో ప్రజలు కూడ కలిసిరావాలి. సవర్ణులు ఆచరిస్తున్న అస్పృశ్యతను హిందూ మతం అంగీకరించదు. ఒక మనిషి అస్పృశ్యుడుగా పుట్టినట్లు భావించడం చాలా నీచమైన విషయం. అస్పృశ్యత అనే ఈ మహా పాపభారం కింద హిందూ మతం విచ్ఛిన్నమయ్యే సూచనలు త్వరలోనే చూడగలం. అస్పృశ్యత నిర్మూలనం కాకుంటే, హిందూ మతం నశిస్తుంది. దేశాభ్యుదయానికి, హిందూ మత ప్రయోజనం కోసం అస్పృశ్యత నివారణ అత్యవసరం. ప్రకృతికి మానవులందరూ సమానమే. కాని మానవుడు అహంకారంతోనూ, అసూయాద్వేషాలతోనూ సమాజంలో హెచ్చుతగ్గులను సృష్టించుకున్నాడు. దేవుడు ఈ వ్యత్యాసాలను ఎంత మాత్రం గుర్తించడు. ప్రకృతిలో మనుషులు సృష్టించుకొన్న అసమానత్వం వంటిదెక్కడా

కూడా కనిపించదు. అస్పృశ్యతా దోషాన్ని నిర్మూలించి, ప్రకృతి సిద్ధమైన సమానత్వం స్థాపించండి". గాంధీ నాయకత్వంలో అస్పృశ్యతకు వ్యతిరేకంగా సాగిన పోరాటం ఏకకాలంలో ఉన్నత కులాల వారిని శతాబ్దాలుగా అనుభవిస్తున్న సౌకర్యాలను పూర్తిగా కాని, పాక్షికంగా కాని విడిచిపెట్టమని కోరింది. హరిజనులు తమ హక్కులకై డిమాండ్ చేసేట్లు చేయగలిగింది. ఆయన ప్రసంగాలు కొందరికి బాగానే స్ఫూర్తినిచ్చాయి. మొట్టమొదటిసారిగా అనేక దేవాలయాల్లోకి హరిజనులను వెళ్లనిచ్చారు. బరోడా మహారాజు దళితులకు 1931లో విందు ఏర్పాటు చేసి, ప్రభుత్వ అధికారులతో కలసి పాల్గొన్నాడు.

గాంధేయ వాదుల ఉద్యమం వల్ల వచ్చిన మార్పులతో సంతృప్తి చెందని దళిత మేధావి డాక్టర్ అంబేద్కర్ అఖిల భారత దళిత జాతుల సమాఖ్య (All India Depressed Classes Federation) ను స్థాపించి, దానికి నాయకత్వం వహించాడు. అంబేద్కర్ నాయకత్వంలో కొంతమంది ఇతర మతాల్లోకి మారిపోతామనే నినాదాలతో పోరాటానికి సిద్ధపడ్డారు. అస్పృశ్యత వ్యతిరేకోద్యమం విజృంభించింది. కొంతకాలానికి క్రైస్తవులు, ముస్లింలు, శిక్కులు, బౌద్ధులు మొదలైన మతాలవారు కూడ అంబేద్కర్‌కు విధేయత ప్రకటించారు. అయితే, ఉవ్వెత్తున లేచిన ఉద్యమం చివరికి తెరమరుగైంది.

## 19.9 రాష్ట్రాల్లో కాంగ్రెస్ మంత్రుల కృషి

1937లో కాంగ్రెస్ ప్రభుత్వాలు కొన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత అస్పృశ్యత వ్యతిరేకోద్యమ ప్రచారం గొప్ప ఊపందుకుంది. ఆ ప్రభుత్వాలు దళిత జాతుల సముద్ధరణ కోసం ప్రయోజనకరమైన పనులు చేశాయి. ప్రప్రథమంగా హరిజనులు మంత్రులుగా, పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమితులయ్యారు. దేశ ప్రగతి పురోగమన మార్గంలో మళ్లించడంలో హరిజనులు భాగస్వాములయ్యారు. ఇంచుమించు అన్ని కాంగ్రెస్ రాష్ట్రాల్లోనూ చట్టప్రకారం అంటరాని వారిపై విధించిన ఆంక్షలను తొలగిస్తూ శాసనాలు చేయబడ్డాయి. సవర్ణులు అనుభవిస్తున్న అన్ని సదుపాయాలు, ఆలయాల్లోకి ప్రవేశించే అర్హత హరిజనులకు కూడా లభించాయి. 1938లో మద్రాస్ రాష్ట్రంలో పౌర అనర్హతల రద్దు చట్టం (Civil Disabilities Removal Act), మలబార్ ఆలయ ప్రవేశ చట్టం (Malabar Temple Entry Act), ఆలయ ప్రవేశ ధృవీకరణ నష్టపరిహార చట్టం అనే మూడు చట్టాలు ఆచరణలోకి వచ్చాయి. హరిజనుల విద్యాభివృద్ధికై ప్రత్యేక నిధులు కేటాయించబడ్డాయి. వారికి ప్రత్యేక పాఠశాలలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. బీహార్, ఒరిస్సా, మద్రాస్‌ల్లోని పాఠశాలల్లో అగ్రవర్గాల విద్యార్థులకు లభించే సదుపాయాలు హరిజన విద్యార్థులకు కూడా ఉండాలని అధికార నిర్ణయాలు జరిగాయి. బీహార్, మధ్య పరగణాల్లో ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఉచిత విద్య ప్రవేశపెట్టబడింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఇతర ప్రాంతాల్లో కూడా ఇటువంటి చర్యలు తీసుకోబడ్డాయి. తిరువాన్కూరు, ఇండోర్, అయోధ్య స్వదేశ సంస్థానాల్లో కూడా దేవాలయాల్లోకి ప్రవేశించే హక్కు అందరికీ కల్పించబడింది.

నేడు అంటరానితనం ఒక నేరం. నగర ప్రాంతాల్లో అస్పృశ్యత పూర్తిగా పోయింది. గ్రామ ప్రాంతాల్లో మారుమూల అక్కడక్కడా దీని చిహ్నాలు కనిపిస్తున్నా చాలావరకూ ఆ దురాచారం భూస్థాపితమైంది. హిందూ సమాజంలో అధికులు, అధములు అన్న తరతమ భేదాలు పోయి, అందరూ సమాన స్థాయికి తేబడ్డారు. భారత ప్రజల జాతీయ, ప్రజాతంత్ర ఉద్యమాల్లో అంతర్భాగంగా ఈ ఉద్యమం ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత రాజ్యాంగం సమాజంలో అసమానతలను నిషేధించింది. అస్పృశ్యత నిర్మూలించబడింది. ఏరూపంలో దాన్ని ఆచరించినా, అది భారత రాజ్యాంగంలోని 17వ అధికరణం ప్రకారం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతున్నది.

BRAOU

## 19.10 సంగ్రహంగా

1. అంటరానివారు అనేక అశక్తతలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

2. వారి ఉద్ధరణకు బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, మొదలైన మత సంస్థలు పాఠశాలలు స్థాపించడం ద్వారా కృషిచేశాయి.

3. షిండే నాయకత్వంలోని దళిత వర్గాల సంఘం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలోని అఖిల భారత దళిత జాతులు సమాఖ్య వారి సర్వతోముఖాభివృద్ధికి పనిచేశాయి.

4. భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమంలో అంటరానితనం నిర్మూలన ఒక ప్రధాన అంశం. కాంగ్రెస్ వాదులు అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపారు. హరిజన యాత్ర సందర్భంగా గాంధీ చేసిన ప్రసంగాలు ప్రజలను చైతన్యవంతులను చేసాయి.

5. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ అంటరానివారు ఎదుర్కొంటున్న పౌర అసక్తతలను నిషేధించింది. భారత రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించి, సమ సమాజ నిర్మాణానికి మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

## 19.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. గాంధీకి పూర్వం అస్పృశ్యుల అభ్యున్నతికి జరిగిన కృషిని వివరించండి.

2. అంటరానితనం నిర్మూలనలో జాతీయ కాంగ్రెస్ పాత్ర పరిశీలించండి.

**II. కింది ప్రశ్నలకు లఘు వాఖ్యలు రాయుండి.**

1. దళిత వర్గాల విద్యాభివృద్ధికై మత సంస్కర్తల నాయకత్వంలో జరిగిన కృషిని వివరించండి.

2. దళిత వర్గాల సంఘం గూర్చి తెల్పండి.

3. హరిజన సేవక్ సమాజ కార్యక్రమాలను పరిశీలించండి.

4. అంటరాని వారి అభివృద్ధికి స్వదేశీ సంస్థానాలు చేసిన ప్రయత్నాలను వర్ణించండి.

## 19.12 ఉపయుక్త గ్రంథాలు

Ambedkar, B.R. : **Who were the Shudras? How they came to be the fourth Varna in the Indo - Aryan Society, 1970.**

Ambedkar, B.R. : **Emancipation of the Untouchables 1972.**

Desai, A.R. : **Social Background of Indian Nationalism 1987.**

BRAOU

Farquhar, J.N. : **Modern Religious Movements in India 1977.**

Harijan **1933-1939.**

Jones, Kenneth W. : **The Cambridge Histrory of India 111-1, Socio-religious reform movements in British India 1989.**

Kaushik, P.D. : **The Congress Ideology and Programme, 1920-1985, 1986.**

Natarajan, S. : **A century of Social Reform in India.**

O' Malley, L.S.S. : **India's Social Heritage, 1976.**

Sharma, Satish Kumar : **Social Movements and Social Change, 1985.**

Shinde, J.R. : **Dynamics of Cultural Revolution : 19th century Maharashtra 1985.**

**రచయిత : ఆచార్య బి. కేశవనారాయణ**

BRAOU

# భాగం - 20 సామాజిక దృష్టి (Social Vision)

**విషయక్రమం**


20.0 లక్ష్యాలు

20.1 పరిచయం

20.2 బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలు

20.3 మేథావి వర్గ ఆవిర్భావం

20.3.1 సంప్రదాయ వాదులు

20.3.2 అతి వాదులు

20.3.3 ఉదార వాదులు

20.4 సంస్కరణోద్యమ లక్ష్యాలు

20.5 సంస్కర్తల సామాజిక దృష్టి

20.6 సంస్కరణ కార్యక్రమంలోని ప్రధాన అంశాలు

20.6.1 కుల వ్యవస్థ

20.6.2 అంటరానితనం

20.6.3 మహిళలు

20.6.4 మతం

20.6.5 సీమయానం (Foreign Voyage)

20.7 సంస్కరణలకు అవరోధాలు

20.8 సంగ్రహంగా

20.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

20.10 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 20.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

- బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన విధానాలు. వాటి ప్రభావం వల్ల ఆవిర్భవించిన కొత్త మేథావి వర్గం.
- సంప్రదాయ వాదుల, అతి వాదుల,సంస్కరణ వాదుల దృక్పథం.
- మత, సాంఘిక సంస్కరణోద్యమాల లక్ష్యాలు, సంస్కర్తల సామాజిక దృష్టి
- సంస్కర్తల సామాజిక పునర్నిర్మాణ కార్యక్రమంలోని ప్రధాన అంశాలు, సాధించిన ప్రగతి.
- సంస్కరణోద్యమాల ప్రగతికి అవరోధాలు.

## 20.1 పరిచయం

భారతదేశ చరిత్రలో క్రీ.శ 19వ శతాబ్దానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఈకాలాన్ని మధ్య యుగం నుండి ఆధునిక యుగానికి పరివర్తన చెందుతున్న సంధి యుగంగా పేర్కొనవచ్చు. ఈశతాబ్దంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో దీర్ఘకాలిక ప్రాధాన్యతగల సంస్కరణల వెల్లువ ఉప్పొంగింది. ఆధునిక పాశ్చాత్య భావజాలం వల్లా, భారతీయ సామాజిక చట్రంలో వచ్చిన మౌలిక మార్పులవల్లా ఆధునిక భారతదేశంలో భౌతిక, వైజ్ఞానిక పునాదులు ఏర్పడ్డాయి.

## 20.2 బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంస్కరణలు

బ్రిటిష్ పాలన ప్రారంభమైన తర్వాత బ్రిటిష్‌వారు రాజకీయ ఆర్థిక, సాంఘిక, మత, పరిపాలన, విద్యారంగాల్లో అనుసరించిన విధానాల ఫలితంగా, సమాజంలో వ్యవస్థాపరమైన మార్పులు వచ్చాయి. సుస్థిర బ్రిటిష్ పాలన వర్తక, వాణిజ్యాభివృద్ధి, ఆధునిక విద్యావ్యాప్తి ఫలితంగా నూతన విద్యాధిక మధ్య తరగతి వర్గం ఆవిర్భవించింది.

1857 తిరుగుబాటు కారణంగా భారతదేశ పరిపాలన తూర్పు ఇండియా వర్తక సంఘం (East India Company) నుండి నేరుగా బ్రిటిష్‌ప్రభుత్వానికి మార్పుచేయడంతో, దేశమంతటికీ ఒకేరకమైన పరిపాలనావిధానాన్ని ప్రవేశపెట్టడానికి అవకాశం ఏర్పడింది. సమన్యాయ పాలన (Rule of Law) దేశంలో అమల్లోకి వచ్చింది. న్యాయచట్టాన్ని క్రోడీకరించి దేశమంతటా ఒకేవిధమైన న్యాయ వ్యవస్థను బ్రిటిష్‌వారు నెలకొల్పారు. చట్టం దృష్టిలో సమానత్వం అనే సిద్ధాంతంమీద ఈ కొత్త వ్యవస్థ ఆధారపడింది. కుల, మత, వర్గ, లింగ విచక్షణ లేకుండా అందరి విషయంలో ఒకేవిధంగా చట్టం అమలుచేయబడింది. వీటితోపాటుగా 1835లో మెకాలే సూచనలననుసరించి ఆంగ్ల విద్యా విధానాన్ని విలియం బెంటింక్ దేశంలో ప్రవేశపెట్టాడు. ఉడ్స్ నివేదిక (Woods Despatch) ఆధారంగా 1857లో కలకత్తా, బొంబాయి, మద్రాసుల్లో విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. క్రమంగా ఆంగ్ల భాష దేశమంతటా వ్యాపించింది. ప్రజలు ఇంగ్లీష్ భాషాధ్యయనానికి అలవాటు పడ్డారు. వ్యక్తిగత పరిచయం ద్వారా ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల ద్వారా ఆంగ్ల విద్య నేర్పబడింది. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజల్లో పాశ్చాత్య శాస్త్రీయ విజ్ఞానం బాగా వ్యాప్తి చెందింది. ఈ వర్గాలనుండి న్యాయవాదులు, ఉపాధ్యాయులు, పాత్రికేయులు, డాక్టర్లు మొదలైన మేధావి వర్గాలవారు ఆవిర్భవించారు. దేశవ్యాప్తంగా జరిగిన ఈ ఆంగ్ల భాషా వాఙ్మయ వికాసం, పాశ్చాత్య నాగరికతల ప్రభావం భారతీయులను అనేక రంగాల్లో ప్రభావితం గావించింది. భాషా వికాసానికి మాత్రమే పరిమితం కాక, సాంఘిక, మత తదితర సంస్కరణోద్యమాలకూ, కార్యక్రమాలకూ ప్రజలను ఉత్తేజ పరిచింది. తత్ఫలితంగా ప్రజల ఆలోచనా సరళి మారింది. సనాతన దృష్టితో గాక నూతన దృక్పథంతో, నూతన విజ్ఞానంతో, తార్కిక దృష్టితో ప్రతివిషయాన్ని చూడ్డం ప్రజలు అలవాటుచేసుకున్నారు. ఫలితంగా ఏర్పడ్డ ఆధునిక అభ్యుదయ భావాల పరంపర దేశంలో భావ సమైక్యతకు తద్వారా రాజకీయ చైతన్యాభివృద్ధికి దోహదపడ్డాయి.

బ్రిటిష్ పాలన కొనసాగినంత కాలం సామ్రాజ్య వాద ప్రయోజనాల పరిరక్షణ ప్రధాన బాధ్యతగా బ్రిటిష్ వారు భావించారు. మొట్టమొదట వ్యాపారం కోసం భారతదేశం వచ్చిన బ్రిటిష్ వారు క్రమక్రమంగా యావద్భారత దేశాన్ని ఆక్రమించుకొన్నారు. సొంత లాభార్జనమూ, మాతృదేశ ఆర్థికాభివృద్ధినీ లక్ష్యంగా పెట్టుకొని భారతదేశాన్ని దోచుకున్నారు. పర్యవసానంగా వలస వాద స్వభావంలో ప్రధాన మార్పు వచ్చింది.

BRAOU

18వ శతాబ్దం మధ్యలో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం పర్యవసానంగా భారతదేశంలో పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థను బ్రిటిష్‌వారు ప్రోత్సహించారు. తమదేశంలో ఉత్పత్తిచేయబడ్డ సరుకులకోసం భారత దేశాన్ని మార్కెట్టుగా తయారుచేయాల్సిన అవసరం ఏర్పడింది. భారతదేశం ముడిపదార్థాలను ఎగుమతి చేసే దేశంగాను, ఇంగ్లండ్‌లోని పారిశ్రామిక ఉత్పత్తులకు మార్కెట్‌ను సమకూర్చే దేశంగాను మార్చడానికి ప్రయత్నాలు జరిగాయి. అందువల్ల కంపెనీ గుత్తాధిపత్యం స్థానంలో స్వేచ్ఛా వ్యాపార (Free Trade) విధానాన్ని ప్రభుత్వం అనుసరించింది.

1813 వలస వాద విధానంలో మార్పు వచ్చింది. భారతదేశంలో వర్తక, వాణిజ్యాలపై పూర్వంగల ఆంక్షలు తగ్గాయి. ఈమారిన పరిస్థితులు దేశంలోని పెట్టుబడిదారీ వర్గాలకు విశేషంగా అనుకూలించాయి. వారు వాణిజ్యవేత్తలుగా వ్యాపారస్తులుగా మారి ఐరోపీయులకు వర్తక సంబంధమైన ఏజెంట్లుగా పనిచేశారు. వారంతా కొత్తగా ఆవిర్భవిస్తున్న మధ్యతరగతి వర్గానికి చెందినవారు. వర్తకాభివృద్ధి భారతదేశంలో నవీన మధ్యతరగతి అభివృద్ధి చెందటానికి మార్గాన్ని సుగమం చేసింది. ఈతరగతి వారు కలకత్తా, మద్రాస్, బొంబాయిల్లో గలరు. ఈపట్టణాల అభివృద్ధి ఫలితంగా సనాతన సంప్రదాయ సమాజాన్ని మార్చాలనే కొత్త ఆలోచనాధోరణి ఏర్పడింది.

శాశ్వత భూమి శిస్తు విధానం పర్యవసానంగా పాత భూస్వాములకు, పేదవారికి మధ్య ఒక కొత్త తంత్ర జమీందారీ వర్గం ఏర్పడింది. ఈవర్గం వారు పెట్టుబడి పెట్టి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయగలరనే నమ్మకంతో బ్రిటిష్‌వారు సృష్టించారు. ఈ విధానంవల్ల గ్రామాల్లో భూస్వాములు, వడ్డీవ్యాపారుల సంఖ్య అధికమైంది. ఈ వర్గానికి చెందినవారు ఆంగ్ల విద్యలో శ్రద్ధ కనబరచారు. వ్యాపారస్థులు భూములపైన మిగులు ధనాన్ని ఖర్చుచేశారు. వడ్డీవ్యాపారానికి ఉపక్రమించారు. బ్రిటిష్ కాలంలో దేశం మొత్తానికి ఒకేవిధమైన చట్టాలు చేయబడ్డాయి. భూమికి రక్షణ ఏర్పడింది. పెట్టుబడిదారీ భూస్వామ్యం వర్గాలకు చెందినవారు విద్యావ్యాప్తి విషయంలో పురోగామి దృక్పథాన్ని అవలంబించారు. విద్యాలయాలు స్థాపించారు. కొంతమంది ఆధునీకరణ ఉద్యమాలకు నాయకత్వం వహించారు.

## 20.3 మేధావి వర్గ ఆవిర్భావం

బ్రిటిష్ విధానాల పర్యవసానంగా కొత్త సామాజిక వర్గాలు ఏర్పడ్డాయి. ఆంగ్ల విద్యను అభ్యసించిన మధ్యతరగతి మేధావులు సామాజిక పరివర్తన ప్రక్రియకు మార్గదర్శకులయ్యారు. పాశ్చాత్య సంస్కృతికి చెందిన మానవతా వాదం, హేతు వాదం, విశ్వమానవతా వాదం (Universalism) మొదలైన భావన వల్ల ప్రభావితులయ్యారు. వారు సామాజిక, మత విషయాల్లో ఒక ప్రత్యేక దృక్పథాన్ని అలవరచుకొన్నారు. వారిలో సంప్రదాయ వాదులు, అతి వాదులు, ఉదార వాదులు ఉన్నారు.

### 20.3.1 సాంప్రదాయ వాదులు

పాశ్చాత్య విజ్ఞానం వ్యాప్తి చెందడం వల్ల భారతీయులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తారని భావించి, దేశంలోని పలుప్రాంతాల్లో ఆధునిక విద్యాలయాలను మిషనరీలు ప్రారంభించారు. క్రైస్తవ మత ప్రచారం కృషి నిరాటకంగా జరగాలంటే, బ్రిటిష్ ఆధిపత్యం అవసరమని గుర్తించి మిషనరీల నిస్సంకోచంగా బ్రిటిష్ సామ్రాజ్య వాద విధానాన్ని బలపర్చారు. క్రైస్తవ మతం స్వీకరించిన భారతీయులు బ్రిటిష్ వస్తు వినిమయదార్లుగా మారుతారని బ్రిటిష్ వర్తకులు, పారిశ్రామిక పెట్టుబడిదార్లుగా ఆశించారు. చార్లెస్ గ్రాంట్ (Charles Grant) విల్బర్ ఫోర్స్ (Wilberforce) అలెగ్జాండర్ డఫ్ (Alexander Duff) మొదలైన క్రైస్తవ మత బోధకులు మత ప్రచారం చేస్తూ హిందూ సమాజంలో సర్వత్రా కనిపించే విగ్రహారాధనను, కర్మకాండలను, మూఢనమ్మకాలను, కుల వ్యవస్థను,

స్త్రీల దుస్థితిని ఖండించారు. భారతీయులు అనాగరికులనీ, వారి సంస్కృతి, వారి మతం దేశాభివృద్ధికి ఏవిధంగానూ దోహదపడదనీ, వారి మతం క్రైస్తవ మతంలాగే పవిత్రమైందీ, పరిపూర్ణమైందీ కాదని మిషనరీలు సనాతన సంప్రదాయ హిందూ మతాన్ని విమర్శించారు. వారు ముఖ్యంగా భారతదేశాన్ని ఆధునికం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు.

హిందూ మతాన్ని విమర్శించడాన్ని, క్రైస్తవ మతాన్ని దేశంలో ప్రవేశపెట్టడాన్ని సంప్రదాయ వాదులు తీవ్రంగా నిరసించారు. హిందూ మతాన్నీ, ఆచారాలను సంస్కరించడానికి అభ్యుదయ వాదులు చేసిన ప్రయత్నాలను కూడా వారు వ్యతిరేకించారు. సనాతన మత ఆచారాలను ప్రాచీన పవిత్ర గ్రంథాలు ఆమోదించాయని, ప్రాచీన మత సంప్రదాయాలే పరిశుద్ధమైనవని భావించి, వాటిని సంప్రదాయ వాదులు సమర్థించారు. నాటికి ఎటువంటి ప్రమాదం ఏర్పడకుండా రక్షించాలని భావించారు. మత ఆచారాలకు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉందని, వాటికి దైవాజ్ఞ కలదని వాదించారు. అందువల్ల అమల్లో ఉన్న ఆచారాల్లో జోక్యం కలుగజేసుకోవడం వల్ల, మత విశ్వాసానికే ప్రమాదం ఏర్పడినట్లేనని వాదించారు. అందుచేత సంప్రదాయ వాదులు క్రైస్తవ మిషనరీల విమర్శలను, సంస్కరణ వాదుల ప్రయత్నాలను గట్టిగా ప్రతిఘటించారు. వారికి సమాజంలో అశేషమైన పలుకుబడి ఉంది.

మత విషయాల్లో సంస్కరణ వ్యతిరేకించినప్పటికీ, రాజకీయ ఆర్థిక, విద్యా విషయాల్లో సనాతన వర్గానికి చెంది, ఆధునిక విద్యను అభ్యసించిన నాయకుల్లో ఎక్కువమంది భారతీయుల అభివృద్ధిని కాంక్షించి అభ్యుదయ దృక్పథాన్ని అవలంబించారు. వారిలో రాధాకాంత్ దేబ్ ప్రముఖుడు హిందూ మతాన్ని కాపాడటం, భారతీయుల సంక్షేమానికి తోడ్పడటం అతని లక్ష్యాలు. హిందూ మతాన్ని వదలి క్రైస్తవమతం స్వీకరించడం హిందూ ధర్మానికి గొడ్డలి పెట్టుగా భావించి, హిందువులు క్రైస్తవ మతం స్వీకరించడాన్ని నిరోధించడానికి కృషిచేశాడు. సనాతనులకు నాయకత్వం వహించి, మత సాంఘిక రంగాల్లో యథాతథ స్థితికి అనుకూలంగా పోరాడాడు. అందుకే రాధాకాంత్ దేబ్ సాంప్రదాయ భారత సంస్కృతి సంరక్షకుడుగా చరిత్రలో నిలచాడు. సాంప్రదాయ వాదిగా ముద్రపడినప్పటికీ, దేబ్ ఉదార వాది. అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో కీలక పాత్ర వహించాడు. విద్య, విజ్ఞానాన్ని వ్యాప్తిచేయడానికి "గౌడియా సమాజం (Gaudiya Society) స్థాపించాడు. కలకత్తా హిందూ కళాశాల (Hindu College) వ్యవస్థాపకుల్లో ఒకడు. 1817 నుండి 1850 వరకు ఆ కళాశాల వ్యవహారాలను స్వయంగా పర్యవేక్షించాడు. పాఠశాలలను స్థాపించాడు. సాంకేతిక విద్యను, స్త్రీ విద్యను, ప్రోత్సహించాడు. పాశ్చాత్య విద్యను సమర్థించాడు. కాని పాశ్చాత్య భావాలను వ్యతిరేకించాడు. 1830లో 'ధర్మసభ' (Dharma Sabha) ను స్థాపించాడు. రాధాకాంత్ దేబ్ వర్గానికి చెందిన ఇతర ప్రముఖులు తరిణిచరణ్ మిత్రా, రుస్సామయ్ దత్తా, బబనిచరణ్ బెనర్జీ, మృత్యుంజయ విద్యాలంకార్.

రాధాకాంత్ దేబ్ వర్గీయులు హిందూ సంస్కృతిలో పాతుకుపోయిన దురాచారాలను బహిరంగంగా నిరసించారు. హిందూ సంస్కృతికి కొత్త చైతన్యాన్ని ప్రసాదించడానికి కార్యక్రమాల్ని రూపొందించారు. భారత సాంస్కృతికి, సంప్రదాయాలకు ఆధునిక ప్రయోజనాలను జతచేయడం ద్వారా ఆధునీకరణ సాధించవచ్చని వారు గాఢంగా విశ్వసించారు. స్వదేశీ సంప్రదాయాలు కాలానుగుణంగా మార్పుచెందాయి. కాబట్టి హిందూ సాంప్రదాయాల స్థానంలో విదేశీ సాంప్రదాయాలను ప్రవేశపెట్టడం అవసరమని భావించారు. బెంటిక్ పాశ్చాత్యీకరణ విధానాలవల్ల ప్రమాదాన్ని భవిష్యత్తులో ఎదుర్కోవాల్సి వస్తుందని అనుమానించి, వాటిని వ్యతిరేకించారు. వారి ఆధ్వర్యంలో 'ధర్మ సభ', హిందూ జీవన విధానాన్ని, సంస్కృతిని సమర్థించింది. ఆ సభ శాశ్వత శిస్తు విధానాన్ని సమర్థించింది. వలస విధానాల వల్ల కలిగే దుష్ఫలితాలను గురించి హెచ్చరించింది. సతి ఆచారాన్ని సమర్థించింది.

BRAOU

గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు సహాయం చేయడానికి ఒక ప్రణాళికను తయారుచేసింది. డెరోజియో, క్రైస్తవ మిషనరీలకు వ్యతిరేకంగా పోరాడింది.

### 20.3.2 అతి వాదులు

ఆంగ్ల విద్యను అభ్యసించిన యువకుల్లో కొందరు అతి వాద మార్గాన్ని అనుసరించారు. వారిలో ఎక్కువమంది కలకత్తాలోని హిందూ కళాశాల విద్యార్థులు. మానవతా వాదాన్ని, పాశ్చాత్య హేతు వాద కళాశాల విద్యార్థులు. మానవతా వాదాన్ని, పాశ్చాత్య హేతు వాద ఆలోచనా విధానాన్ని వారు స్వీకరించారు. గ్రంథాలద్వారా నేర్చుకున్నదే గాక, వారి మనోభావాలపై వారి అధ్యాపకుడైన హెన్రీ విలియన్ డెరోజియో (Henry Vilian Derozio) చెరగని ముద్రవేశాడు. హేతు వాద ప్రభావం వల్ల వారిలో స్వేచ్ఛగా ఆలోచించే శక్తి అధికమైంది. బెంటింగ్ పాశ్చాత్యీకరణను డెరోజియో వర్గీయులు ప్రప్రథమంగా బలపర్చారు. వీరిలో కొందరు ఛాందసుల ప్రవర్తనను నిరసించారు. కుల వ్యవస్థను, విగ్రహారాధనను, సతీ సహగమనం దురాచారాన్ని ఖండించారు. స్త్రీలపట్ల సమాజం అవలంబించుకున్న పాక్షిక పక్షపాత వైఖరిని విమర్శించారు. మతంపై వారుచేసిన విమర్శల దాడి ఫలితంగా, సనాతనుల్లో అంతర్విమర్శ ప్రారంభమైంది. మత విశ్వాసాలను, వాటికి ఆధారమైన సిద్ధాంతాలను విమర్శనా దృష్టితో పరిశీలించడం ఆరంభమైంది. వారికి అతి వాదులు (Radicals) అనే ముద్ర పడింది.

### 20.3.3 ఉదార వాదులు

హేతు వాదం, మానవతా ధర్మాలు ఉదార వాదులను ఉత్తేజపరచాయి. పాశ్చాత్య విద్య, అభ్యుదయ భావాలు దేశ నైతిక పునరుజ్జీవనానికి సహాయపడతాయని వారు విశ్వసించారు. పత్రికా స్వాతంత్ర్యాన్ని సమర్థించారు. నిర్హేతుకమైన సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి ఉద్యమాలను ముందుండి నడిపించారు. మొట్టమొదట అగ్రవర్ణాలకే పరిమితమైన వారి సంస్కరణ కృషి 20వ శతాబ్దంలో నిరుపేద వర్గాల ఆర్థిక, రాజకీయ, సాంఘిక అభ్యున్నతిని కూడా లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు చురుకుగా పాల్గొన్నాయి.

మత, సాంఘిక సంస్కర్తలకు రామ్‌మోహన్ రాయ్ మార్గదర్శకుడు. ఆయనను అభిమానులు 'ఆధునిక భారతదేశ పిత' గా ప్రశంసించారు. రాయ్ కలకత్తాలో స్థిర నివాసం ఏర్పరచుకున్న తర్వాత, భారతదేశ పునరుజ్జీవనం ప్రారంభమైంది.

## 20.4 సంస్కరణోద్యమాల లక్ష్యాలు

భారతదేశంలో మౌఢ్యం వ్యాపించి ఉన్న రోజుల్లో ఆధునిక భారతదేశం గురించి కలలు గన్న మొదటి వ్యక్తి రామ్‌మోహన్ రాయ్. సంస్కరణకు శాస్త్రాధారంగా వేదోపనిషత్తులను ఎన్నుకున్నాడు. అన్ని మతాల్లోని మంచిని గ్రహించి, బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. ఈసంస్థ హిందూ మతానికి విరుద్ధమైన కొత్త మతం కాదు. హిందూ మతానికి సంస్కరణ మాత్రమే. హిందూ సమాజం కుల వ్యవస్థ, బహుభార్యాత్వం, సతీ సహగమనం, అతిబాల్య వివాహాలు, శిశుహత్యలు మొదలైన మూఢాచారాలవల్ల భ్రష్టుపట్టిందని గుర్తించాడు. నైతికంగా సమాజం పూర్తిగా పతనమైందని, అ విద్య, అజ్ఞానం, దారిద్ర్యం, బానిసత్వం, మూఢనమ్మకాలు రాజ్యమేలుతున్నట్లు గమనించాడు. అతని కార్యక్రమాలు సంఘంలో గొప్ప అలజడిని సృష్టించాయి. అవి మధ్య తరగతి వర్గాల్లో ముఖ్యంగా చదువుకున్నవారి దృక్పథంలో మార్పు తెచ్చాయి. రామ్‌మోహన్ రాయ్ నిర్వహించిన ఉద్యమం వల్ల మధ్య యుగ చలనంలేని సాంప్రదాయాల స్థానంలో, నూతన ఆలోచనా సరళి, క్రియాశీలత క్రమంగా ఉద్భవించి, వృద్ధిచెందాయి.

రామ్‌మోహన్ విగ్రహారాధనను, బహుదేవతారాధనను, కర్మకాండలను, మూఢ విశ్వాసాలను ఖండించాడు. ఏకేశ్వరోపాసనను, సాంఘిక సమానత్వ సిద్ధాంతాన్ని సమర్థించాడు. జాతి, వర్గ, వర్ణ భేదాలను విస్మరించి మానవ జాతిని ప్రేమించమని, భగవంతుని దృష్టిలో మానవులంతా సమానులేనని, సర్వ మతాల సారాంశం ఒక్కటేనని, భగవంతుని నిర్మలమైన మనస్సుతో ధ్యానం చేయమని, మోక్షానికి మార్గం మానవుని సత్ప్రవర్తన, భగవత్ ధ్యానమని రాయ్ ప్రచారం చేశాడు. ఏనాడైతే హిందువులు విగ్రహారాధనను విరమించి, వర్ణ విభేదాలు విడనాడి, ఏకేశ్వరోపాసకు పూనుకుంటారో ఆనాడు వారు స్వచ్ఛమైన హైందవ మతాన్ని అనుసరించిన వాళ్లమవుతారని పేర్కొన్నాడు. స్వచ్ఛమైన హిందూ మత పునరుద్ధరణే అతని అంతిమ లక్ష్యం, హిందూ మతాన్ని సవరించడమే కాని దాన్ని అంతం చేయడం అతని ఉద్దేశం కాదు. మహారాష్ట్రలో ప్రార్థనా సమాజంకూడా అదే మార్గాన్ని అనుసరించింది.

సమాజంలో పేరుకుపోయిన నిర్హేతుకమైన కట్టుబాట్లనుండి, మూఢాచారాలనుండి హిందూ సమాజాన్ని ప్రక్షాళన చేయడానికి రామ్‌మోహన్ రాయ్ గట్టిగా కృషిచేశాడు. స్త్రీకి స్వేచ్ఛ కావాలని, వారికి ఆస్తిహక్కు ఉండాలని వాదించాడు. స్త్రీ విద్యను, వితంతు వివాహాలను, సతీ సహగమన నిషేధాన్ని సమర్థించాడు. బహు భార్యాత్వ దురాచారాన్ని నిషేధించాలని కోరాడు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంగల ప్రజాస్వామ్య సిద్ధాంతం ప్రాతిపదికగా, భారత సమాజ పునర్నిర్మాణానికై కృషిచేశాడు.

రామ్‌మోహన్ రాయ్ ప్రజాస్వామ్య వాది, మానవతా వాది. అతని మత, సాంఘిక దృక్పథంపై ఇస్లాం మత ఏకేశ్వర తత్వం, క్రైస్తవ మత నీతిబోధనలు, పాశ్చాత్య ఉదార, హేతు వాద సిద్ధాంతాల ప్రభావం ఎంతో ఉంది. మత విషయాల్లో రామమోహన్ హేతుబద్ధమైన విధానాన్ని అవలంబించాడు. ఆధునిక పాశ్చాత్య నాగరికతకు విలువనిచ్చిన బ్రహ్మ సమాజాన్ని స్థాపించి మత సమన్వయ దృష్టిని ప్రదర్శించాడు. ప్రజల్లో మానవతా ధర్మాలను, ఆస్తిక భావాలను, నిర్మల భక్తితత్వాన్ని పెంపొందింపజేయడానికి కృషిచేశాడు. రాయ్ మత సంస్కరణోద్యమం లౌకిక సంఘసంస్కరణోద్యమాలకు పునాదులు వేసింది. బ్రహ్మ సమాజ మార్గాన్ని కొద్ది మార్పులతో ప్రాంతీయ పరిస్థితుల కనుగుణంగా ప్రార్థనా సమాజం కూడా అనుసరించింది. ఈ ఉద్యమాలు ప్రజల్లో విశాల దృక్పథం, విశుద్ధ వాతావరణం, మూఢాచార వైముఖ్యం, సౌభ్రాతృత్వం అభివృద్ధి చెందటానికి ఎంతగానో సహాయపడ్డాడు.

1870 నాటికి బెంగాల్‌లో బ్రహ్మ సమాజం, 1880 నాటికి మహారాష్ట్రలో ప్రార్థనా సమాజం ప్రజాదరణను కోల్పోయాయి. వాటి స్థానాన్ని పునరద్ధురణ ఉద్యమం ఆక్రమించింది. దేశంలో సుమారు 40సంవత్సరాలు మారుమోగిన హేతువాదం తగ్గింది. దాని స్థానంలో నవీన హిందూ మతం వ్యాప్తిచెందనారంభించింది.

ఈపరిణామానికి అనేక పరిస్థితులు దోహదపడ్డాయి. బెంగాల్‌లో రాధాకాంత దేబ్ నాయకత్వంలో ఏర్పడ్డ 'ధర్మ సభ' ద్వారకానాథ్, దేవేంద్రనాథ్ టాగూర్‌ల సంస్కరణ కార్యక్రమాల ఫలితంగా, ఆశించిన ప్రగతిని సాధించడంలో విఫలమైంది. సుమారు ఒక అర్థ శతాబ్దం వారిద్దరూ సంస్కరణ వాదులుగా ప్రజలను అమితంగా ఆకర్షించారు, వారి కృషి బ్రహ్మ సమాజ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడిపంజేసింది.

1857 తర్వాతి దశాబ్దాల్లో రాజకీయ వాతావరణంలో గొప్ప మార్పు వచ్చింది. కొత్త పరిస్థితులు సామాజిక దృక్పథం మారేట్లు చేశాయి. బెంగాల్ బ్రహ్మ సమాజంలో వచ్చిన చీలికల పర్యవసానంగా, బ్రహ్మసమాజ్ ఉద్యమం బలహీనపడింది. ఆ ఉద్యం అన్నివర్గాల ప్రజలను ఆకర్షించలేకపోయింది. ఒక్క విద్యాధికులు మాత్రమే దాని సానుభూతిపరులుగా మిగిలారు. చిత్తశుద్ధి అంకిత భావం లేని నాయకుల చర్యలవల్ల బ్రహ్మ సమాజానికి పూర్వం ఉన్న పలుకుబడి, ఆకర్షణ తగ్గాయి. దేశ ప్రాచీన ఔన్నత్యం గుర్తుచేసుకొని గర్వపడేట్లు మత ఉద్యమాలు ప్రేరేపించాయి. చారిత్రక పరిశోధనలు ఆభావాన్ని మరింత బలపడేట్లు చేశాయి. ఈనేపథ్యంలో పునరు

ద్ధరణోద్యమాలు ఆవిర్భవించాయి. మత, సాంఘిక విషయాల్లో సాంప్రదాయ ధోరణులు తలెత్తాయి. ముఖ్యంగా 1870వ దశకంలో ఈమార్పు సుస్పష్టంగా కనిపిస్తుంది. ఈ కాలంలో సంస్కరణ భావాలు వ్యాప్తి చెందటానికి కృషి చేసిన సంస్థల్లో మొదటిది ఆర్య సమాజ్. 1875లో స్వామి దయానంద సరస్వతి స్థాపించిన ఆర్య సమాజ్ ఉద్యమానికి ప్రాచీన హైందవ మత పునరుద్ధరణ స్వభావం ఎక్కువ.హిందూ మత సిద్ధాంతానికి మూలాధారం వేదాలు అనీ, అవి తిరుగులేనివని ప్రకటించి 'వేద యుగానికి తరలిపొండి'. (Back to the Vedas) అనే నినాదాన్ని దయానందుడు వ్యాప్తి చేశాడు. వేద వాక్యమే దైవ వాక్యమని, తుది నిర్ణయమని, కాని వ్యక్తి తీరు తుది నిర్ణయం కాదన్నాడు. వేదాలు భ్రాంతి రహితం (Infallibility of Vedas) అన్న విషయంలో పూర్తి విశ్వాసం ఉండాలన్నది అతని వాదం. దయానందుని దృష్టిలో భారతదేశంలో మూఢనమ్మకాలు నిర్మూలింపబడాలి, ఏకేశ్వరోపాసన, స్వయం పాలన ఉండాలి, ప్రాచీన ఔన్నత్యం పునరుద్ధరింపబడాలి. మూఢనమ్మకాలను, మంత్ర తంత్రాలను, విగ్రహారాధనను, బ్రాహ్మణ అధికారాన్ని, అస్పృశ్యతను, కుల వ్యవస్థను ఆర్యసమాజ్ వ్యతిరేకించింది. స్త్రీల సముద్ధరణకై కృషి చేసింది. సాంఘిక సమానత్వ సూత్రాలను ప్రకటించింది.

రామకృష్ణ మిషన్ పాశ్చాత్య భౌతిక వాద ప్రభావం నుండి భారతదేశాన్ని రక్షించడానికి, సమాజ సేవకు అంకితమై పనిచేసింది. పునరుద్ధరించబడ్డ హిందూ మతంకోసం ప్రపంచాన్ని ఆధ్యాత్మికంగా జయించాలన్న లక్ష్యం ఆ మిషన్‌కు ఉంది. రామకృష్ణ పరమహంస, వివేకానందుడు మానవతా వాదులు. నిరుపేదలైన అట్టడుగు వర్గాల సంక్షేమం లేనిదే సామాజిక పునరుజ్జీవనం, దేశాభివృద్ధి అసాధ్యమని వివేకానందుడు గుర్తుచేశాడు.

దివ్యజ్ఞాన సమాజం (Thesophical Society) ప్రాచీన హిందూ మత ఆధ్యాత్మిక తత్వంలో విశ్వాసాన్ని ప్రకటించింది. ఆ సమాజ సభ్యులు కుల, మత, జాతి భేదం లేకుండా, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రబోధించారు.

పునరుద్ధరణోద్యమాలు మతంలోని లోపాలను సరిదిద్దడానికి, భారత జాతి, సంస్కృతుల ఔన్నత్యాన్ని చాటి చెప్పడానికి, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి బాగా దోహదం చేశాయి. ఆ ఉద్యమాలు ప్రచారం చేసిన భావాల ప్రభావం వల్ల ప్రజల్లో పాశ్చాత్య సంస్కృతిపట్ల విముఖత బలపడి తెల్లజాతి ఔన్నత్యాన్ని గుర్తించ నిరాకరించారు. నాయకుల్లో అభ్యుదయ దృక్పథం బాగా బలపడింది.

19వ శతాబ్దానికి చెందిన సంస్కర్తలు భారతదేశ నవీన సంస్కృతికి మొట్టమొదటి ప్రతినిధులు. వారు అనుసరించిన పాశ్చాత్య ప్రచార పద్ధతుల వల్ల, పాశ్చాత్య భావనల ప్రభావం వల్ల వారి ఉద్యమం ఆ శతాబ్దాంతానికి పరిపక్వ దశకు చేరింది. హేతు వాదం, మానవతా వాదం, సమానత్వం, వ్యక్తి వాదం (individualism), ప్రకృతి సిద్ధమైన మానవ హక్కులు, మానవ ప్రగతి అనే సూత్రాలపై ఆధారపడి, వారి ఉద్యమం కొనసాగింది. ఇవి ఆధునికీకరణకు గీటురాళ్లుగా పనిచేశాయి.

గాంధీ జాతీయోద్యమంలో ప్రవేశించడంతో, సంస్కరణోద్యమం రాజకీయోద్యమంలో విలీనమై, ప్రజా ఉద్యమంగా మారింది. గాంధీ నిర్మాణ కార్యక్రమంలోని ముఖ్యంగా ఖద్దరు ప్రచారం, అంటరానితనం నిర్మూలన, మద్యపాన వ్యతిరేకత మొదలైన అంశాల కారణంగా, అన్ని వర్గాల ప్రజలు చైతన్యవంతులయ్యారు. ప్రథమ ప్రపంచ సంగ్రామం తర్వాత సమాజ సేవకై కృషి జరిగింది. దేశంలో మహిళా సంఘాలు ఏర్పడి, అవి అభాగ్యులైన మహిళల స్థితిగతులందు ప్రత్యేక శ్రద్ధ ప్రదర్శించాయి. గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ సమావేశాలు సాంఘిక సంస్కరణల గురించి తీర్మానాలు చేసింది. చాతుర్వర్ణ్య సిద్ధాంతాన్ని సమర్థించింది, వర్ణ వ్యవస్థలో అంటరానితనానికి చోటులేదని గాంధీ వాదించాడు. లౌకిక, సంక్షేమ రాజ్యం అభ్యుదయ కాంగ్రెస్ వాదుల ఆదర్శమైంది. వారంతా మతంతో నిమిత్తం లేకుండా, ప్రభుత్వం సమాజాభివృద్ధికై కృషిచేయాలన్నారు.

BRAOU

1947లో స్వాతంత్ర్యం పొందిన తర్వాత సంస్కరణ బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించింది. హిందూ సాంఘిక జీవనాన్ని నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం శ్రద్ధ చూపింది. సాంఘిక సంక్షేమానికి భారత ప్రభుత్వమే విస్తృత యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. దీంతో సంఘ సంస్కర్తల అవసరం పోయింది.

## 20.5 సంస్కర్తల సామాజిక దృష్టి

బ్రిటిష్ పాలనలో ఆవిర్భవించిన సాంఘిక, మత సంస్కరణోద్యమాలు ప్రజల్లో పెంపొందుతున్న చైతన్యానికి, ఉదారవాద సిద్ధాంతాల వ్యాప్తికి నిదర్శనాలు. మారిన సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సంస్కరణ వాదులు సామాజిక, మత రంగాల్లో దేశ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని, దాని అంతిమ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని కృషిచేశారు.

సాంఘిక రంగంలో కుల వ్యవస్థను నిర్మూలించాలని, మహిళలకు సమాన హక్కులు కల్పించాలని, బాల్య వివాహాలను నిర్మూలించాలని, వితంతు వివాహాలపైగల నిషేధాన్ని ఎత్తివేయాలని, స్త్రీ విద్యను ప్రోత్సహించాలని ఉద్యమాలు ప్రారంభమైనాయి. మత మూఢ విశ్వాసాలను, విగ్రహారాధనను, బహుదేవతారాధనను, అర్థంలేని కర్మకాండలను, వంశపారంపర్యంగా సంక్రమించే పురోహిత వ్యవస్థని మత సంస్కరణోద్యమాలు ఖండించాయి.

బ్రిటిష్ పాలన ప్రారంభమైన తర్వాత వేగంగా మారుతున్న నూతన సమాజానికి ప్రత్యేక అవసరాలు ఏర్పడ్డాయి. ఇవి పాత సమాజ అవసరాలకు భిన్నంగా ఉన్నాయి. కొత్తగా ఆవిర్భవించిన మేధావి వర్గం పాశ్చాత్య ఉదార వాద సంస్కృతి వల్ల ప్రభావితులై, ఈ అవసరాలను గుర్తించి ప్రాచీన సంప్రదాయాలనుండి సంక్రమించిన సాంఘిక సంస్థలు, మతైక దృక్పథం, నైతిక విలువలు దేశ పురోగతికి అవరోధాలని భావించి, వాటిని సంస్కరించడానికి ఉద్యమాలను నిర్వహించారు. పెట్టుబడిదారీ ప్రజాతంత్ర సమాజం వారి లక్ష్యం. సమాజం అన్ని రంగాల్లోను అభివృద్ధి చెందాలంటే స్వేచ్ఛ, సమానత్వం మొదలైన ఉదార వాద సిద్ధాంతాల ప్రాతిపదికపై మాత్రమే సాధ్య పడుతుందని వారు విశ్వసించారు. కుల, మత, వర్ణ, లింగ భేదం లేకుండా, అందరికీ సమాన హక్కులు ఉండాలని వారు కోరారు.

బ్రిటిష్ ఆక్రమణ ఫలితంగా భారతదేశంలో ఆధునిక సమాజ స్థాపన జరిగింది. ఇది పెట్టుబడిదారీ సమాజం. వ్యక్తి స్వేచ్ఛ పోటీ, సొంత ఆస్తి హక్కు, దాన్ని అనుభవించడానికిగల స్వేచ్ఛ పెట్టుబడిదారీ సమాజానికి మూలస్తంభాలైన సిద్ధాంతాలు. ఈ నూతన సామాజిక వ్యవస్థ మధ్య యుగంనాటి నిరంకుశ సమాజంకంటే భిన్నంగా ఉంది.

సాంఘిక, మత సంస్కరణోద్యమాల ప్రధాన లక్ష్యం జాతి అభ్యుదయం. కులక్రమాలనుగతి శ్రేణి (hierarchy), అసమానత్వం, అంటరానితనం, సాంఘిక నిషేధాలు మత ఆమోదంతో కొనసాగాయి. దేశంలో మనిషి సామాజిక జీవన విధానాన్ని, ఆర్థిక కార్యక్రమాల్ని, వివాహం, పుట్టుక, మరణం మొదలైన వాటిని మతం శాసించింది. అందువల్లనే ఉద్యమాలు సమగ్ర కార్యాచరణ క్రమాన్ని రూపొందించాయి. కుల వ్యవస్థను, విదేశీయానం పైగల నిషేధాన్ని, బహుదేవతారాధనను, విగ్రహారాధనను వ్యతిరేకించాయి. మత విషయాల్లో బ్రాహ్మణుని ప్రత్యేక హక్కులపై దాడి జరిగింది. దేశ ప్రగతికి అడ్డంకులను క్రమంగా తొలగిస్తూ ఉదార వాదం ప్రబలింది. ఈ ఉదార వాదానికి రెండు ప్రధాన సూత్రాలు ఉన్నాయి. అవి జాతీయ వాదం, ప్రజాస్వామ్యం.

ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా సమానత్వంతో సహజీవనం కొనసాగించగల సమసమాజ స్థాపనకై సంస్కర్తలు కృషిచేశారు. ఇది వారి గొప్ప సామాజిక దృష్టిని తెలియజేస్తుంది. జాతీయ నాయకులు జాతి

BRAOU

నైతిక విలువలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, వాటి పునరుద్ధరణకు అంకిత భావంతో రాజకీయ స్వతంత్రం సిద్ధించిన తర్వాత కూడా పనిచేశారు. వారు సంస్కరణ బాధ్యత ప్రభుత్వానిదే అని భావించి, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేశారు.

## 20.6 సంస్కరణ కార్యక్రమంలోని ప్రధాన అంశాలు

సంస్కర్తలు కొన్ని లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని, వాటిని సాధించడానికి చిత్తశుద్ధితో కృషి చేశారు. వాటిలో కుల వ్యవస్థ, అంటరానితనం, మహిళాభ్యుదయం మొదలైనవి అతి ప్రధానమైన అంశాలు

### 20.6.1 కుల వ్యవస్థ

కుల వ్యవస్థ ఎప్పుడు, ఎట్లా ఆవిర్భవించిందో ఇదమిద్ధంగా చెప్పడం కష్టం. రంగును (వర్ణం) బట్టి ఈకుల వ్యవస్థ వర్ణ వ్యవస్థగా ఆవిర్భవించిందని కొంతమంది అభిప్రాయపడ్డారు. అయితే, వర్ణ వ్యవస్థను గూర్చి ప్రప్రథమంగా ప్రస్తావన రుగ్వేదంలోగల పురుష సూక్తం 10వ మండలంలో ఉంది. రుగ్వేద కాలంనాటి చివరి రోజుల్లో వర్ణ వ్యవస్థకు బీజం పడింది. కాని మలి వేద కాలంనుండి కుల వ్యవస్థలో కాఠిన్యత పెరిగి, ఐక్యతకు అడ్డుగోడగా నిల్చి, భారత సమాజ సంస్కృతిని బలహీనపరచింది.

ఆంగ్లేయుల పాలనా కాలంలో అనేక శక్తుల ప్రభావం ఫలితంగా, కుల వ్యవస్థ క్రమ క్రమంగా బలహీన పడింది. ఆధునిక పరిశ్రమలు, ప్రయాణ సౌకర్యాలైన రైళ్ళు, బస్సులు, రవాణా వసతులు, పట్టణాల అభివృద్ధి. సమ న్యాయ పాలన, లౌకిక భావాలను నాటి ఆధునిక విద్యా విధానం మొదలగు అంశాలు కుల వ్యవస్థను ప్రజల మనసుల నుండి రూపుమాపుటకు ఎంతో దోహదపడ్డాయి. హేతు వాదం, ప్రజాస్వామ్య భావాలు వ్యాప్తిచెందటం వల్ల మేథావి వర్గం కఠిన నియమ నిబంధనలతో కూడిన కుల వ్యవస్థపై విప్లవ శంఖం పూరించారు. బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం, ఆర్య సమాజం మొదలగు సాంఘిక, మత ఉద్యమాలు కుల వ్యవస్థను నిరసించాయి. 20వ శతాబ్దంలో బలం పుంజుకున్న స్వాతంత్ర సమరం అన్ని కులాల వారిని, మతాలవారిని దగ్గరకు చేర్చి, కుల వ్యవస్థ ఫలితమైన అంటరానితనాన్ని నిర్మూలించటంలో గణనీయమైన పాత్ర వహించింది. దేశంలో రాజకీయ, సాంఘిక చైతన్యం వ్యాప్తి చెందడంతో అట్టడుగు వర్గాలవారు ముందుకు వచ్చి, ప్రాథమిక హక్కులకోసం పోరాటం సాగించారు. ముఖ్యంగా జ్యోతిబా ఫూలే 19వ శతాబ్దపు సంస్కర్తల్లో భిన్నమైనవాడు. కుల వ్యవస్థను తీవ్రంగా విమర్శిస్తూ రచనలు చేశాడు. ప్రప్రథమంగా బ్రాహ్మణేతర వర్గాల గూర్చి గట్టిగా చెప్పినవాడు. తర్వాతి కాలంలో బి. ఆర్. అంబేద్కర్, రామస్వామి నాయకర్, నారాయణ గురులు కఠిన కుల నిబంధనలకు, అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమాలను సాగించారు. ఈ ఉద్యమాల ప్రభావం ఫలితంగా, విద్యాధికులు వ్యక్తిగత స్వేచ్ఛపై విధించిన ఆంక్షలను సహించే స్థితిలో లేరు. ఈ పరిస్థితి ప్రస్ఫుటంగా పట్టణ ప్రాంతాల్లో గోచరిస్తుంది. పట్టణ ప్రాంతాల్లో గల ప్రజలు సహజీవనం, సహవాసంతో కలసిమెలసి ఉండటం వల్ల వారిపై కుల వ్యవస్థ నిబంధనలందు ప్రభావం కనిపించదు. కాని పల్లె ప్రాంతాల్లో సనాతన సాంప్రదాయాలు, మూఢాచారాలు బాగా పాతుకుపోవడంచేత కుల కట్టుబాట్లు, నిబంధనలు పూర్తిగా అంతర్ధానం కాలేదు.

దేశంలో ప్రభవించిన సామాజిక, ఆర్థిక శక్తుల ప్రభంజనంవల్ల వృత్తి ప్రాతిపదికగా ఏర్పడ్డ కుల వ్యవస్థ బలహీనపడింది. అగ్రకులాలకు సాంఘిక విషయాల్లోగల ప్రత్యేక హక్కులు కొంతవరకు అంతరించిపోయాయి. కులం, మతం మారినంత మాత్రాన వ్యక్తిగత హక్కులను భంగం వాటిల్లకుండా అవసరమైన ఏర్పాట్లను "కుల అసమానతల నిషేధ చట్టం (Caste Disabilities Act 1850) చేసింది. బ్రిటిష్ ప్రభుత్వ చట్టబద్ధ పాలన అట్టడుగు వర్గాలవారి పరిస్థితి మెరుగు పడటానికి దోహదపడింది. అగ్రవర్ణాలకు గల ప్రత్యేక హక్కులు పోయాయి. వారికి

BRAOU

న్యాయస్థానాల్లో కూడా ఎటువంటి మినహాయింపు లేదు.అందరికీ సమాన న్యాయం అనే సూత్రం అగ్రకులాలవారికి అసంతృప్తి కల్గించింది. చట్టపరంగా అసమానతలు పోయినప్పటికీ, సాంఘిక అసమానతలు ఏదో ఒక రూపంలో కొనసాగుతున్నట్లు కనిపిస్తుంది.

మత సంస్కరణోద్యమ సంస్కర్తలంతా పురోహిత వర్గంపై దాడిచేశారు. ఈ పరిణామం వారి మానవతా వైఖరిని వెల్లడి చేసింది. మత, సాంఘిక విషయాల్లో బ్రాహ్మణుల గుత్తాధిపత్యం దెబ్బతింది. దేవుళ్ళకు, ప్రజలకు మధ్య మధ్యవర్తులుగా వ్యవహరించే పూజారుల ప్రమేయం అనవసరం అన్న భావం ప్రజల్లో క్రమక్రమంగా బలపడింది. బొంబాయి, మద్రాస్ రాష్ట్రాల్లో బ్రాహ్మణాధిక్యతకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించబడ్డాయి.

కుల నియమాలను అతిక్రమించినందుకు ఛాందస హిందువులు ఉపయోగించిన ఆయుధం సంఘ బహిష్కరణ, దానికి కాలం చెల్లింది. కులాంతర వివాహాలకు ఎటువంటి అవరోధాలు లేవు. కులాంతర విందులు, సహపంక్తి భోజనాలు సర్వసామాన్యమైనాయి.

**20.6.2 అంటరానితనం**

హిందూ సమాజంలో అస్పృశ్యత అనే సాంఘిక దురాచారం కుల వ్యవస్థ పర్యవసానంగా ఉత్పన్నమైంది. దేశ జనాభాలో 20 శాతం అస్పృశ్యులు ఉన్నారు. వారు అనేక కఠిన నిర్బంధాలకు, అనర్హతలకు గురయ్యారు. విదేశీ పాలనలో అస్పృశ్యతా వ్యతిరేక పోరాటం పూర్తి విజయాన్ని సాధించలేదు. అస్పృశ్యతను నిర్మూలించాలన్న ఆసక్తి, పట్టుదల బ్రిటిష్ పాలకులకు ఉన్నట్లు దాఖలాలు లేవు. అయితే, బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, దివ్యజ్ఞాన సమాజం మొదలైన సంస్కరణోద్యమాలు, సంస్కర్తలు పంచములకు ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పి, వారిలో విద్యావ్యాప్తికి కృషి చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ నిర్మాణ కార్యక్రమంలో అంటరానితనం నిర్మూలన ఒక ప్రధాన అంశం ఈ సమస్య విషయంలో గాంధీ, కాంగ్రెస్ వాదులు నిర్వహించిన హరిజనోద్యమం ప్రజలను చైతన్యవంతులుగా చేసింది.

స్వతంత్ర భారత ప్రభుత్వం సమాజంలో పరివర్తన తెచ్చే కార్యక్రమాన్ని చేపట్టింది. దళిత కులాల సాంఘిక అంతస్థును పెంచడానికి విద్యా వ్యాప్తి, ఆర్థిక ఉన్నతి, రాజకీయ హక్కులు అవసరం అన్న సత్యాన్ని భారత రాజకీయ నాయకులు గుర్తించారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడానికి, విద్యను ప్రోత్సహించడానికి అవసరమైన అన్ని చర్యలు గైకొనబడ్డాయి. 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం సాంఘిక అసమానతలనుండి విమోచన కల్పించడం ప్రధాన బాధ్యతగా గుర్తించింది. రాజ్యాంగంలోని 17వ అధికరణ అస్పృశ్యతను నిషేధించింది. ఏరాష్ట్ర ప్రభుత్వం గాని, వ్యక్తులు గాని అంటరానితనం ఏరూపంలోనూ ఆచరించడానికి వీల్లేదు. ఏవిధమైన అనర్హతల్ని బలవంతంగా అస్పృశ్యులతనూ రుద్దటం చట్టరీత్యా శిక్షార్హమైన నేరం.

రాజ్యాంగం 15 (2) అధికరణ ప్రకారం ఏపౌరుడూ జాతి, మత, కుల, జన్మస్థల ప్రాతిపదికపై విచక్షణకు గురికారాదు. అస్పృశ్యుల అభివృద్ధిని కాంక్షించి ప్రత్యేక రక్షణలు రాజ్యాంగం కల్పించింది. దేవాలయాలు, పాఠశాలలు, బావులు, చెరువులు, దుకాణాలు, భోజనశాలలు, రహదారులు మొదలైన వాటిని అన్ని కులాలవారూ ఉపయోగించటానికి వీలు కలిగింది. ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా సాంఘిక, మత సంబంధమైన ఆచారాలను, కర్మలను పాటించవచ్చు. ప్రతివ్యక్తి బహిరంగ ప్రార్థనా స్థలాల్లోకి ప్రవేశించవచ్చు, అక్కడ పూజలు, ప్రార్థనలు చేయవచ్చు. 29 (2) నిబంధన ప్రకారం ప్రభుత్వ ధన సహాయంతో నిర్వహించబడుతున్న విద్యాసంస్థల్లో ఏ అభ్యర్థికైనా జాతి, మత, కుల, భాష విచక్షణ లేకుండా ప్రవేశించడానికి అనుమతి నిరాకరించరాదు. సాంఘిక సంక్షేమం, సంస్కరణ

BRAOU

దృష్ట్యా 25వ అధికరణ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు హిందువులందరినీ మత సంస్థల్లో ప్రవేశం కొరకు ఏ చట్టాన్నైనా తయారుచేసి అమలు చేయడానికి అధికారం లభించింది.

1955లో భారత పార్లమెంట్ తన ప్రత్యేక అధికారాన్ని వినియోగించి, అస్పృశ్యతా (నేరాల) చట్టం చేసింది. ఈ చట్టం భారతదేశమంతా వర్తించింది. సాంఘిక, మతపరమైన అనర్హతలకు శిక్షలను నిర్దేశించింది. 1976లో ఆ చట్టం సవరింపబడింది. అంటరానితనాన్ని సమర్థించే వారిని శిక్షించడమే ఈ చట్ట ప్రధాన ఆశయం. అస్పృశ్యతను ఏరూపంలో పాటించినా అట్టి వ్యక్తికి 6 నెలల వరకు జైలుశిక్ష, 500రూపాయల వరకూ జరిమానా గాని, రెండూ గాని విధించవచ్చు.

బడుగువర్గాల సామాజిక న్యాయంకోసం సాగించిన పోరాటం ఫలితంగా రాజ్యాంగపరంగా వారికి హక్కులు లభించాయి. ఈ అధికరణలవల్ల కొంత ప్రయోజనం లేకపోలేదు. ఎవరి అభివృద్ధి కొరకు ఈచట్టాలు నిర్దేశించబడ్డాయో వారిలో కూడా తదనుగుణమైన మార్పు వచ్చింది. అస్పృశ్యతను పాటించడం నేరమని అందరూ గుర్తించారు. అయితే, గ్రామప్రాంతాల్లో అస్పృశ్యత పూర్తిగా నశించిందా అన్నది ప్రశ్నార్థకమే.

### 20.6.3 మహిళలు

బ్రిటిష్ పాలనకు పూర్వం దోపిడీకి, అవమానానికి గురైనవారిలో మహిళలు ఉన్నారు. 19వ శతాబ్దంలోనే సాంఘిక న్యాయం, సమానత్వం, మానవతాధర్మాల ప్రేరణవల్ల శక్తివంతమైన మహిళా విమోచనోద్యమం ప్రారంభమైంది. ఈవిషయంలో ముందుగా క్రైస్తవ మిషనరీలు, బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం కృషిచేశాయి. స్త్రీ విద్య, వితంతు వివాహాలు, బాల్య వివాహాల నిషేధం, ఏకపత్నీవ్రతం మొదలైన సమస్యలపై సంస్కరణోద్యమ నాయకులు తమ దృష్టిని కేంద్రీకరించారు. 20వ శతాబ్దంలో జాతీయోద్యమం స్త్రీ విముక్తి ఉద్యమానికి గొప్ప ఉత్తేజాన్ని ఇచ్చింది. స్వాతంత్ర్య పోరాటంలో చేరమని గాంధీ ఇచ్చిన పిలుపు సత్ఫలితాలను ఇచ్చింది. కులకట్టుబాట్లను, పరదాను విసర్జించి స్వేచ్ఛగా ఇతరులతో కలసి మహిళలు విదేశీ పాలననుండి దేశ విముక్తికై పోరాడారు. వారి చర్యలు మహిళల విమోచనోద్యమానికి విశేషంగా దోహదం చేశాయి. 1921 తర్వాత ఇతర దేశాల్లోలాగానే భారత మహిళలను రాజకీయ సమానత్వం కావాలని ఉద్యమం ఆవిర్భవించింది. ఈవిషయంలో ఊహించలేని విజయం సాధించారు. అగ్రవర్ణాలకు చెందిన హిందూ మహిళలు ప్రత్యేక సమావేశాలు జరిపి తమ సమస్యలను చర్చించుకున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తెచ్చారు. క్రమంగా మహిళలకు పురుషులతో సమానంగా ఓటింగ్ హక్కు లభించింది.

విద్యాభ్యాసం చేయడానికి స్త్రీలకు హక్కు కలదని ప్రజలు గుర్తించారు. బాలికలకు విద్య అనవసరం అనే సనాతన సాంప్రదాయ దృక్పథం పూర్తిగా మారింది. సాంఘిక సంస్కర్తల కృషి ఫలించింది. జాతి అభ్యున్నతికి స్త్రీకి విద్య అవసరమని సర్వత్రా గుర్తించబడింది. నేడు మహిళల విద్యను వ్యతిరేకించేవారు లేరనే చెప్పవచ్చు. విద్యాభ్యాసం చేసిన మహిళల సంఖ్య క్రమంగా పెరిగింది.

స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చట్టాలు చేసింది. ఈచట్టాలు స్త్రీల దుస్థితికి కారణమైన సనాతన ఆచారాలను చట్టపరంగా నిషేధించాయి. ప్రగతికాముకులైన భారతీయ సంస్కర్తలు సాంఘిక సంస్కరణ ప్రగతికి చట్టపరమైన చర్యలు అధికంగా ఉపయోగపడతాయని భావించారు. అయితే, ఈ విషయంలో బ్రిటిష్ ప్రభుత్వం తాత్సారం చేసింది. మతంపై ఆధారపడ్డ ఆచారాల్లో జోక్యం కలగజేసుకోడానికి విదేశీ ప్రభుత్వం 1829కు పూర్వం, 1857 తర్వాత వెనుకంజ వేసింది. సాంఘిక శాసనాలు పాలితుల అంగీకారంతో జరగాలనీ, వాటిని బలవంతాన ఇష్టంలేని వారిపై రుద్దరాదనే విధానం విదేశీ ప్రభుత్వం అవలంబించింది. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రభుత్వ విధానం మారింది.

BRAOU

బ్రిటిష్ ప్రభుత్వ తటస్థ విధానం ప్రథమంగా బెంటింక్ కాలంలో మారింది. ఉదార భావాలుగల బెంటింగ్ ప్రజా సంక్షేమం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాడు. సతీ సహగమనం పవిత్ర కార్యంగా జన సామాన్యం ఆరోజుల్లో నమ్మింది. తీవ్ర వ్యతిరేకత ఎదురైనప్పటికీ 'సతి' ఆచారం అమానుషమైందిగా భావించి, బెంటింగ్ ప్రభుత్వం దాన్ని 1829లో నిషేధించింది. వితంతు వివాహాలను చట్టబద్ధం చేసిన శాసనం అనుజ్ఞాత్మక (Permissive) శాసనం మాత్రమే అగ్రవర్ణాలు అనుమతించని ఆచారాన్ని 1856 చట్టం సమర్థించింది. అట్టడుగు వర్గాల్లో వితంతు వివాహాలపై నిషేధం ఉండేదికాదు. అయితే, శాసన నిబంధనలవల్ల వెంటనే లాభం పొందినవారు అతిస్వల్పం. అట్టి వివాహాలకు వ్యతిరేకత 20వ శతాబ్దంలో మాత్రమే పూర్తిగా అదృశ్యమైంది.

సంస్కర్తలు చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా సామాజిక సేవ ఒక పవిత్ర కార్యం అనే భావం ప్రజల్లో వ్యాపించింది. సాంఘిక సమస్యల విషయంలో వారి దృక్పథం క్రమంగా మారింది. బాల్య వివాహాల విషయంలో ప్రజలు అనుసరించిన విధానంలో కాలక్రమేణా మార్పు వచ్చింది. 1890లో వివాహ వయోపరిమితి బిల్లు (Age of consent Bill) కేంద్ర శాసన సభలో ప్రవేశపెట్టినపుడు ఆ బిల్లు గొప్ప కల్లోలాన్ని సృష్టించింది. హిందూ మతం ప్రమాదంలో పండిందని విమర్శలు వచ్చాయి. 1929లో శారదా చట్టం ఆమోదింపబడ్డపుడు శాంతియుత వాతావరణం నెలకొన్నది. ఈపరిణామం అగ్ర వర్ణాల్లో వచ్చిన పరివర్తనను స్పష్టంచేస్తుంది.

స్వాతంత్ర్యానంతరం సమానత్వంకోసం మహిళా పోరాటం గొప్ప ముందంజ వేసింది. స్త్రీ, పురుషునికి బానిసగా ఉండే పరిస్థితి పూర్తిగా మారింది. ప్రభుత్వ తటస్థ విధానం పోయింది. భారత రాజ్యాంగం సాంఘిక విషయాల్లో కూడా జోక్యం కల్గజేసుకొనే అధికారం పొందింది. సాంఘిక సంక్షేమం కోసం ప్రభుత్వం విస్తృత యంత్రాంగాన్ని సృష్టించింది. లౌకిక హిందూ న్యాయ చట్టాన్ని ప్రభుత్వం తయారుచేసింది. పార్లమెంట్‌కు గల అధికారాలు గుర్తించబడ్డాయి. పూర్వంలాగా ధర్మశాస్త్రాల అధికారంపోయి, పార్లమెంట్ అధికారాన్ని ఆమోదించడం జరిగింది.

భారత లౌకిక రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు (Directive Principles) వ్యక్తి మనుగడకు ప్రాథమిక హక్కులు అవసరమని స్పష్టపరచాయి. మనుషులందరూ సమానమే, అందరికీ సమాన హక్కులు ఉండాలి, చట్టం ముందు అందరూ సమానమేనని రాజ్యాంగం పేర్కొంటున్నది. జన్మ, లింగ విభేదం, కుల, మత ప్రాతిపదికపై ఏర్పడ్డ అసమానతలు పోయాయి. స్త్రీకి సమాజంలో పురుషునితో సమానమైన స్థాయి లభించింది. జాతి, మత భేదాలు, స్త్రీ పురుష భేదం లేకుండా మగవాళ్లతో స్త్రీలకు సమాన హోదాను, సమాన హక్కుల్ని భారత రాజ్యాంగం కల్పించింది. 14వ అధికరణలో చట్టం ముందు అందరూ సమానులేనని, భారతీయులందరికి ఏవిధమైన వివక్షత లేకుండా చట్టపరమైన రక్షణ కల్పించే ప్రాథమిక హక్కును భారత రాజ్యాంగ నిర్మాతలు కల్పించారు. 15వ అధికరణలో క్లాజు 3 ద్వారా స్త్రీ విద్య జాతీయ బాధ్యతగా గుర్తించబడింది. విద్య, ఉద్యోగం, ఉపాధి రంగాలకు జరిగే ఎంపికలో స్త్రీలకు రిజర్వేషన్ కల్పించే అధికారం ప్రభుత్వానికి లభించింది. రాజ్యాంగం స్త్రీ, పురుషులిరువురికీ సమానంగా ఓటువేసే రాజకీయ హక్కుని, కొన్ని రంగాల్లో మహిళలకు ప్రాముఖ్యతను కల్పించే లక్ష్యంతో విశేష చట్టాలను రూపొందించే అధికారం ప్రభుత్వానికి కల్పించింది.

స్వతంత్రం వచ్చిన సుమారు 10 సంవత్సరాలకు ప్రభుత్వ లౌకిక హిందూ న్యాయ చట్టాన్ని తయారుచేసింది. ఫలితంగా మహిళలకు సమాన హక్కులు, స్వేచ్ఛ చట్టపరంగా లభించాయి. సంగీతం, నృత్యం వల్ల కల్గిన దుష్ఫలితాల నుండి వాటిపై ఆధారపడ్డ కులాలకు పూర్తిగా విముక్తి లభించింది. దేవదాసీ వృత్తి రద్దుఅయింది. విప్లవాత్మకమైన హిందూ వారసత్వ చట్టం హిందూ స్త్రీలకు, పురుషులతో సమానంగా తరతరాలుగా వస్తున్న

ఆస్తిలో వాటాను పొందేందుకు వారసత్వపరంగా హక్కు లభించింది. 1956 చట్టం విడాకుల హక్కు స్త్రీలకు కల్పించింది. ఈచర్యల ఫలితంగా సమాజంలో మహిళల హోదా పురుషులతో సమానంగా పెరిగింది. వరకట్న దురాచారాన్ని కూడా ప్రభుత్వం నిషేధించింది. అయినప్పటికీ, ఈ ఆచారం ధనాశాపరుల స్వార్థంవల్ల వెర్రితలలు వేస్తూ కొనసాగుతూనే ఉంది.

### 20.6.4 మతం

సాంఘిక సంస్థలకు, మతానికి సన్నిహిత సంబంధం ఒకప్పుడు ఉండేది. మతం సామాజిక జీవన విధానాన్ని శాసించింది. సంఘంలో నెలకొన్న ఎన్నో మూఢవిశ్వాసాలు, సాంఘిక ఆచారాలు మత ఆమోద ముద్ర పొందాయి. మతం ముసుగులో అనేక దుష్ట ఆచారాలు కొనసాగాయి. అధిక సంఖ్యలో గల సనాతనులు మత సంరక్షకులుగా, వ్యాఖ్యాతలుగా సంఘంలో చలామణి అయ్యారు. వారు యధాతథ పరిస్థితి కొనసాగాలని కోరుకునేవారు. సామాజిక పరివర్తన వల్ల వారి పెత్తనానికి ముప్పు వాటిల్లుతుందనే భావం కల్గడంచేత సంస్కరణలకు వారు అనుమతి నిరాకరించారు; సంస్కరణ ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించారు.

ఈ పరిస్థితి 19, 20వ శతాబ్దాలలో మార్పుచెందింది. ఈకాలంలో ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులను ప్రతిఘటించి సనాతనులు ఎంతోకాలం నిలబడలేకపోయారు. వారి అధికారం మత, సాంఘిక రంగాల్లో క్రమంగా బలహీనపడింది. సంస్కరణోద్యమ నాయకులు హేతు వాదం, శాస్త్రీయ దృక్పథం, ఉదార వాద సిద్ధాంతాలను ప్రచారం చేశారు. వాటివల్ల ప్రభావితులైనవారు మత గ్రంథాల ఆధిపత్యాన్ని తోసిపుచ్చారు. ఫలితంగా సామాజిక జీవన విధానానికి మత గ్రంథాల సంకెళ్ళనుండి విముక్తి లభించింది. ఏదో ఒక వర్గం గుత్తాధిపత్యం అనుభవించే రోజులు గతించాయి. వేదాలను అందరూ అభ్యసించవచ్చనే భావం ప్రబలంగా వ్యాపించింది.

మత సంస్కరణోద్యమ నాయకులు మత ప్రాధాన్యతగల కర్మకాండలను, బహుదేవతారాధనను, విగ్రహారాధనను, పూజారి వ్యవస్థను వ్యతిరేకించారు. పరిశుద్ధాస్తిక మతాన్ని ప్రచారం చేశారు. కాని ప్రజల మత దృక్పథంలో పెద్ద మార్పు వచ్చిన సూచనలు కన్పించవు. సామాన్య ప్రజలకు మత సిద్ధాంతాల్లో, ఆచారాల్లో విశ్వాసం పూర్తిగా పోలేదు. బహిరంగంగా సాంప్రదాయ ఆచారాలను పాటించే ధోరణి సామాన్యంగా చదువుకున్న వారిలోకూడ నేడు చూడవచ్చు. సనాతన హిందువుల్లో చాల తక్కువ మంది పాత ఆచారాలను సిద్ధాంతపరంగా పాటిస్తున్నారు. మిగిలినవారు సాంఘిక ప్రతిష్ఠ, హోదాల కోసం వాటిని అనుసరిస్తున్నారు.

### 20.6.5 సీమయానం (Foreign Voyage)

మత సిద్ధాంతాలకు విరుద్ధమని సీమయానాన్ని మత ఛాందస వాదులు నిషేధించారు. ఆ నియమాన్ని ఉల్లంఘించిన వారిని సంఘ బహిష్కరణకు గురిచేశారు. అయితే, కొత్త భావాల వ్యాప్తి, భౌతిక లాభాలు పాత కాలం నాటి నిషేధాలను ప్రజలు ఉపేక్ష చేసేట్లు పురిగొల్పాయి. కుల, మత కట్టుబాట్లను ధిక్కరించి, విదేశీయానం చేసిన కొంతమందిపై ఎటువంటి శిక్ష విధించబడలేదు. కొంత మందిపై తేలికపాటి ప్రాయశ్చిత్తం మాత్రమే శిక్షగా విధించబడింది. ఈ సమస్యపై హిందూ సమాజం రెండుగా చీలింది. సాంప్రదాయ వాదులు సనాతన ప్రమాణాలు కొనసాగాలని పట్టుబట్టారు. ఉన్నత విద్యకు, ఉద్యోగాలకు విదేశీ యాత్రలు వాంఛనీయమని అభ్యుదయ వాదులు వాదించారు. ఇప్పుడు విదేశీ యానం సర్వసామాన్యమైంది. దానికి మతపరమైన ప్రతికూలాభిప్రాయం అంతరించింది.

BRAOU

## 20.7 సంస్కరణలకు అవరోధాలు

సాంఘిక సంస్కరణ పురోగమనం మందకొడిగా నడచింది. బ్రిటిష్ ప్రభుత్వం ఉదాసీనత అందుకు తోడ్పడ్డ కారణాల్లో అతిముఖ్యమైంది. అధిక సంఖ్యలోగల సనాతనులనుండి ఎదురైన సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొనటానికి సంస్కర్తలు చేసిన ప్రయత్నాలకు విదేశీ ప్రభుత్వం తన సహాయ, సహకారాలను అందించడంలో జాప్యం చేసింది. సాంఘిక శాసనాలను ఆమోదించడంలో ప్రభుత్వం తాత్సారం చేసింది. ప్రజాభిప్రాయం తెచ్చిన గట్టి వత్తిడివల్లనే ప్రభుత్వ విధానంలో మార్పు వచ్చి, సాంఘిక ప్రాధాన్యతగల చట్టాలు చేయబడ్డాయి. 19వ శతాబ్దం ప్రథమార్థంలో శాసనాల ద్వారా సతీ సహగమనం, శిశుహత్యలు, బానిసత్వం నిషేధించబడ్డాయి. కాని **1857** తిరుగుబాటు తర్వాత ప్రభుత్వ దృక్పథంలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. **1891**లో మాత్రమే బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని ప్రజాభిప్రాయానికి లొంగి ప్రభుత్వం ఆమోదించింది. ఈ పరిస్థితులు సాంఘిక, మత సంస్కరణలను శీఘ్రంగా సాధించాలంటే రాజకీయ అధికారం అవసరమన్న భావం జాతీయోద్యమ నాయకుల్లో బలపడటానికి దోహదపడ్డాయి. బాలగంగాధర్ తిలక్ నాయకత్వంలో బలమైన ఒక వర్గం సాంఘిక సమస్యల పరిష్కారానికి విదేశీ ప్రభుత్వ సహాయం అర్థించటానికి సుముఖంగా లేదు.

మహారాష్ట్రకు చెందిన తిలక్, విష్ణుశాస్త్రి చిప్లూంకర్ **(Vishnu Sastri Chiplunikar)** మొదలైన సంస్కరణాభిమానులు భారతదేశ పతనానికి బ్రిటిష్ ఆక్రమణ కారణమనీ, మత, సాంఘిక ఆచారాలు కారణంకాదని ప్రకటించారు. దేశంలో ప్రబలిన అన్ని రకాల చెడులకు విదేశీ పాలన కారణం అన్న అభిప్రాయం వారిలో గాఢంగా నాటుకుంది. సాంఘిక సమస్యల పరిష్కారానికి విదేశీ ప్రభుత్వ సహాయాన్ని అర్థించరాదనే అభిప్రాయాన్ని తిలక్ వ్యక్తం చేశాడు. అందువల్ల విదేశీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటిత పరచడం తక్షణ కర్తవ్యమనీ, మత సాంఘిక పునర్నిర్మాణం కాదని తిలక్ వివరించాడు.

బ్రిటిష్ ప్రభుత్వ విధానాలు ముఖ్యంగా పట్టణాల్లో నివసించే మేధావుల దృక్పథాన్ని మార్చగలిగాయి. కాని గ్రామీణ ప్రజల ఆర్థిక పరిస్థితుల్లో స్తబ్దత కొనసాగింది. గ్రామాల పరిస్థితిని మార్చిన పరిపాలనా సంస్కరణలు కొత్త ఆర్థిక వ్యవస్థ ఏర్పడటానికి దారితీయలేదు. వ్యవసాయం, పెట్టుబడిదారీ వ్యవస్థ, పారిశ్రామికీకరణ అభివృద్ధి చెందలేదు. అందువల్ల గ్రామీణ ప్రజల అలవాట్లు, ఆచారాలు చాలవరకు సంప్రదాయ బద్ధంగా కొనసాగుతున్నాయి.

సంస్కర్తలు వివరించిన సామాజిక కర్తవ్యాలు, సామాజిక లక్ష్యాలు కొంతవరకే విజయాలను సాధించాయి. మత రంగంలో సంస్కర్తల ఆశయాలు నెరవేరలేదు. ప్రజల్లో దేవుడు ఒక్కడే అన్న భావం మరుగున పడింది. వారిలో బహుదేవతారాధనే అధికంగా కనిపిస్తుంది. పూజా పద్ధతులు, మత విశ్వాసాలు, మూఢనమ్మకాలు విశేషంగా మారినట్లు కనిపించదు. మహిళలకు సంబంధించిన బాల్య వివాహాలు, సతి, నిర్బంధ వైధవ్యం, శిశుహత్యలు, బహుభార్యత్వం మొదలైన అమానుష ఆచారాలు అంతరించాయి. చట్టపరంగా స్త్రీకి, పురుషునితో సమాన హోదా లభించింది. కాని సమాజంలో పురుషాధిపత్యం, మహిళలను రెండో తరగతి పౌరులుగా చూచే పాత సామాజిక దృక్పథం పూర్తిగా పోలేదు. ఈపరిస్థితులు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కుల వ్యవస్థను చట్టపరంగా రద్దుచేయాలని సంస్కరణోద్యమాలనుండి ఏవిధమైన వత్తిడి లేదు. ఆ వ్యవస్థవల్ల ఏర్పడ్డ అసమానతలను తొలగించాలని మాత్రమే వారు కోరింది. కుల తత్వాన్ని బహిరంగంగా ఖండిస్తున్న రాజకీయ పార్టీలు చాలవరకు కులం మద్దతుపై ఇంకా ఆధారపడి ఉండటం వల్ల కుల వ్యవస్థ నిషేధానికి అనుకూల ధోరణి వాటిలో కనిపించదు. ప్రభుత్వం నిషేధించిన వరకట్న దురాచారం కొనసాగుతున్నది. బడుగు వర్గాల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని మద్యపానంపై విధించిన నిషేధం కొన్ని రాష్ట్రాల్లో అమల్లో ఉంది. నిషేధం అమలు చేయడం దుస్సాధ్యమని భావించి మిగిలిన రాష్ట్రాలు దాన్ని ఎత్తివేశాయి.

BRAOU

## 20.8 సంగ్రహంగా

1. భారతదేశంలో బ్రిటిష్ పాలకులు ప్రవేశపెట్టిన మార్పులు కొత్త మేథావి వర్గం ఆవిర్భవించడానికి దారితీశాయి.

2. మేథావుల్లో కొందరు మత సాంఘిక రంగాల్లో సనాతన ఆచారాలను సమర్ధించారు. కాని రాజకీయ, ఆర్థిక, విద్య విషయాల్లో అభ్యుదయ విధానాన్ని అవలంబించారు. కలకత్తా హిందూ కళాశాల విద్యార్థుల్లో కొందరు అతి వాద మార్గాన్ని అనుసరించారు. రామ్‌మోహన్ రాయ్, అతని అనుచరులు ఉదార వాదాన్ని ప్రచారం చేశారు.

3. రామ్‌మోహన్ స్థాపించిన బ్రహ్మ సమాజం హేతు వాద భావాల ప్రాతిపదికగా సమాజాన్ని సంస్కరించడానికి కృషిచేసింది. దయానందుని ఆర్య సమాజం, రామకృష్ణ మిషన్, దివ్యజ్ఞాన సమాజం మొదలైనవి ప్రాచీన హిందూ మత ఔన్నత్యాన్ని పునరుద్ధరించడానికి పాటుపడ్డాయి.

4. మానవులు సృష్టించిన అసమానతలు లేని లౌకిక ప్రజాస్వామ్య సమాజ స్థాపన ఈ సంస్కరణోద్యమాల లక్ష్యం. మహిళాభ్యుదయం, అంటరానితనం నిర్మూలించటం కుల వ్యత్యాసాలను రూపుమాపటం మొదలైనవి సంస్కర్తల ఆశయాలు.

5. బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన ఉదాసీన వైఖరి, సాంప్రదాయ వాదుల ప్రతికూల ప్రయత్నాలు, గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం లేకపోవడం సంస్కరణోద్యమం నెమ్మదిగా కొనసాగటానికి ప్రధాన కారణాలు. అయితే, మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కరించబడ్డాయి. అస్పృశ్యత పాటించడం శిక్షార్హమైన నేరంగా ప్రకటించబడింది. కాని నేటికీ కులాభిమానం, వరకట్న దురాచారం సమసిపోలేదు.

## 20.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. ఈ కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.**

1. రామ్‌మోహన్ రాయ్ సామాజిక దృక్పథం వివరించండి.
2. స్త్రీలకు పురుషులతో సమాన హోదా కల్పించడానికి జరిగిన కృషిని తెలపండి.
3. 1947 తర్వాత సమ సమాజ స్థాపనకు తీసుకున్న చట్టపరమైన చర్యలను గురించి క్లుప్తంగా రాయండి.
4. సంస్కరణ కృషి శీఘ్రంగా పురోగమించకపోవడానికి గల కారణాలెవ్వి ?

**II. కింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. బ్రహ్మ సమాజ నాయకుల సామాజిక దృష్టిని తెలిపి వారు సాధించిన విజయాలను రాయండి.
2. 19, 20 శతాబ్దాల్లో మహిళాభ్యుదయానికై ప్రభుత్వం తీసుకున్న చట్టపరమైన చర్యలను సమీక్షించండి.

## 20.10 ఉపయుక్త గ్రంథాలు


Andrews, C. F : **Renaissance in India. It Is Missionery Aspect 1912.**

Bose N. S. : **The Indian Awakening and Bengal 1960**

Datta, K. K. : **Renaissance, Nationalism and Social Changes in Modern India 1965**

David Kopf : **British Orientalism and the Bengal Renaissance.**

Desai, A. R. : **Social Background of Indian Nationalism**

Farquhar J. N. : **J. N. Modern Religious Movements in India**

Heimsath, Charles H : **Indian Nationalism and Hindu Social Reform.**

Jones, Kenneth W : **The Cambridge History of India Vol. III-I, Socio-religious reform Movements in British India.**

Joshi, V. C (ed) : **Rammohan Roy and the Process of Modernisation in India.**

Narain, V. A. : **Social History of Modern India**

Natarajan, S : **A century of Social Reform in India.**

Raghuvamshi, V. P. : **Indian Society in the Eighteenth century 1969.**

Ramakrishna , V. : **Social Reform in Andhra (1848 - 1919)**


రచయిత : ఆచార్య బి. కేశవనారాయణ

BRAOU

BRAOU

# ఖండం : VI సామాజిక మార్పు

ఈ ఖండంలో 21, 22, 23 భాగాలున్నాయి. దీనిలో బ్రిటిష్ పాలనలో భారతదేశ సాంప్రదాయక సమాజ వ్యవస్థలో వచ్చిన మార్పులు చర్చించబడ్డాయి. 21వ భాగంలో సుమారు వ్యవస్థకు మూలమైన కుటుంబం, గ్రామ జీవనంలో వచ్చిన మార్పులు విశ్లేషించబడ్డాయి. 22వ భాగంలో కుటుంబం, వివాహ వ్యవస్థ, కుల వ్యవస్థ, మత వ్యవస్థల్లో వచ్చిన మార్పులు వివరించడమైంది. 23వ భాగంలో పాశ్చాత్య సంపర్కం వల్ల భారతీయ సమాజంలో నూతన భావ జాల వ్యాప్తి, నూతన దృక్పథాలు విశ్లేషించబడ్డాయి.

B R A O U

BRAOU

# భాగం - 21 : వ్యవస్థాగత మార్పులు

విషయక్రమం


21.0 లక్ష్యాలు

21.1 పరిచయం

21.2 గ్రామ జీవనంలోని మార్పులు

21.3 స్త్రీల పరిస్థితి మెరుగుదల

21.3.1 స్త్రీ విద్య

21.3.2 ఆధునికత వైపు ముందంజ వేసిన స్త్రీలు

21.3.3 స్త్రీల ఉద్యమం

21.4 నూతన సామాజిక వర్గాలు

21.4.1 జమీందార్లు

21.4.2 కౌలుదార్లు

21.4.3 యాజమాన్య రైతులు

21.4.4 వడ్డీ వ్యాపారులు, షాహుకార్లు

21.4.5 పెట్టుబడిదారులు

21.4.6 కార్మిక వర్గం

21.4.7 విద్యాధిక మధ్య తరగతి వర్గం

21.5 సంస్కృతీకరణ

21.6 సంగ్రహంగా

21.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

21.8 ఉపయుక్త గ్రంథాలు


## 21.0 లక్ష్యాలు

ఈ భాగం చదవడం వల్ల మీరు కింది విషయాలు తెలుసుకోగలగాలి.

- గ్రామ జీవనంలోని మార్పులు
- జనాభాలో సగభాగమైన స్త్రీల పరిస్థితి మెరుగుదల
- నూతన సామాజిక వర్గాల ఉద్భవం
- సాంప్రదాయక వర్గాల్లో సైతం వచ్చిన మార్పులు

## 21.1 పరిచయం

బ్రిటిష్ పాలనలో భారతదేశ సమాజంలో అనేక మార్పులు ప్రవేశించాయి. సాంప్రదాయక సమాజ వ్యవస్థను ఇవి కుదిలించి, మార్పు చెందేట్లు చేశాయి. సమాజ వ్యవస్థకు మూలమైన కుటుంబమూ, గ్రామ జీవనమూ విప్లవాత్మక మార్పులకు గురి అయ్యాయి. బ్రిటిష్‌ల రాకకు పూర్వం సమష్టి కుటుంబాలు, స్వయం సమృద్ధి గ్రామాలు ఉండేవి. అయితే, బ్రిటిష్ పాలనలో విద్యకొరకు గాని, ఉపాధి కొరకు గాని, మెరుగైన అవకాశాల

BRAOU

కోసంగాని పట్టణాలకు తరలివెళ్లడం వల్ల వ్యష్టి కుటుంబాలు అధికమవసాగాయి. బ్రిటిష్ వారు అనుసరించిన ఆర్థిక విధానాల వల్లా చేతి వృత్తులు క్షీణించడం వల్లా, తరచుగా సంభవించే కరువుల వల్లా గ్రామాల్లోని స్వయం సమృద్ధి లోపించసాగింది. అనుభవ నిమిత్తమేగాక వ్యవసాయం మార్కెట్ల కొరకై సాగి, వాణిజ్య వస్తువుగా మారింది. పారిశ్రామిక విప్లవ ఫలితంగా భారతదేశం నుండి ఎగుమతి అయిన ముడి సరుకులతో బ్రిటన్‌లో తయారైన వస్తువులకు, తిరిగి భారతదేశమే మార్కెట్టుగా మారింది. ఈమార్పులతోబాటు ఆంగ్ల విద్య ప్రవేశించడం, పట్టణీకరణం తోడై కుటుంబ జీవనం, గ్రామ జీవనం, స్త్రీల స్థితిగతుల్లోనూ మార్పులు సంభవించాయి. ఈమార్పుల వల్ల నూతన సామాజిక వర్గాలు ఏర్పడ్డాయి; పాత వర్గాలు కూడా మార్పులకు లోనయ్యాయి. వీనివల్లనే సామాజిక వ్యవస్థ మార్పు చెందింది.

## 21.2 గ్రామ జీవనంలోని మార్పులు

బ్రిటిష్ పాలనలో గ్రామాల స్థితిగతుల్లో మార్పులు సంభవించాయి. పూర్వ స్వయం సమృద్ధి పోవడం, ప్రధానమైన మార్పు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన అనేక ఆర్థిక ప్రయోగాలు, విధానాలు దీనికి కారణం మొదట ఏడాదికి, రెండేళ్ళకి, మూడేళ్లకి పన్ను నిర్ణయించిన బ్రిటిష్ ప్రభుత్వం త్వరలోనే వివిధ ప్రాంతాల్లో శాశ్వత శిస్తు విధానాన్ని, మహల్వారీ విధానాన్ని, రైత్వారీ విధానాలను అనుసరించ సాగింది. విధానాలేమైనా వీటిలో పన్ను అధికంగా ఉండడంతో రైతులు ఇబ్బందికి గురి అయ్యారు. ఈవిధానాల వల్ల గ్రామజనులకుండే ఉమ్మడి హక్కులు తగ్గాయి; యాజమాన్య హక్కులు స్థిరపడ్డాయి. ఇదివరలో ప్రభుత్వ భూములుగా ఉన్నవి కూడా ఇప్పుడు యాజమాన్య భూములయ్యాయి.

పన్ను విధించే విధానంలో కూడా మార్పు వచ్చింది. బ్రిటిష్ రాకకు పూర్వం పండిన పంటలో ఒక భాగాన్ని ప్రభుత్వం తీసుకునేది. కరువు కాటకాలప్పుడు పన్ను వసూలు మరింత తేలికగా ఉండేది. కాని బ్రిటిష్ వారు కొన్ని మార్పులు చేశారు : (1) పండిన పంటను బట్టిగాక, ఆధీనంలో ఉన్న ఎకరాల సంఖ్యపై పన్ను విధించేవారు. దీనివల్ల ఆశించిన పంట పండినా, పండకపోయినా ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను కట్టవల్సి వచ్చేది. (2) పన్ను వసూలు చేసేటప్పుడు బ్రిటిష్ వారు ముందు పాత బకాయీలను చెల్లింపు చేసుకొనేవారు. దీనివల్ల, రైతులు పూర్తి చెల్లింపు ముగించలేక, బకాయీలు ఉంటూనే ఉండేవి. (3) పన్ను చెల్లింపు నగదు రూపంలోనే ఉండాలని బ్రిటిష్ ప్రభుత్వం కోరడం వల్ల, రైతు పంటను అమ్మి, ధనరూపాన ప్రభుత్వానికి చెల్లించవల్సి వచ్చేది. దీనివల్ల, తక్కువ ధరకైనా అతడు పంటను అమ్మాల్సివచ్చేది. పంటలు అందరికీ ఇంటికి వచ్చే సమయం కాబట్టి, రైతుకి ఎక్కువ రాబడి వచ్చేదికాదు. పంటపై ఎక్కువ ధర పొందడానికి రైతు దగ్గరలో గల పట్టణానికి వెళ్లేవాడు (4) వ్యవసాయ పనులు ఉన్నప్పుడు ఆదాయాన్ని పెంచుకునే నిమిత్తమూ, ఆపనులు లేనప్పుడు జీవనోపాధి నిమిత్తం పూర్తిగానూ గ్రామీణులు కుటీర పరిశ్రమలపై ఆధారపడేవారు. అధికపన్నుల వల్లా, ముడివస్తువులను తరలించడం వల్లా, ఈవృత్తులు క్షీణించి, వ్యవసాయంపై ఆధారపడేవారి సంఖ్య నానాటికి పెరిగింది.

వ్యవసాయదారుడు తరచుగా పంట అమ్మకాలకై పట్టణ ప్రాంతాలకు రావడం వల్ల, అతడు అక్కడ సిద్ధంగా ఉన్న వస్తువులను, పంట అమ్మిన డబ్బుతో కొనడం ప్రారంభించాడు. దీనివల్ల గ్రామాల్లోని వృత్తి పనివారలకు పని తగ్గింది. ఇదివరలో కొంత ధనాన్ని గాని, ముడివస్తువులనుగాని, కొనుగోలుదారుడు ఇచ్చి, కొంతకాలమాగిన తర్వాత వస్తువును, వృత్తిపనివాడు నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసేవాడు. కాని, ఇప్పుడు ఎదురుచూచే సమయం తగ్గడంతో గ్రామాల్లోని చేతివృత్తుల వారు ఉపాధి కోల్పోడం ఆరంభమైంది. దీనివల్ల మొదట నేతపనివారు ఉపాధిని కోల్పోయి, పట్టణాలకు వలస వెళ్లడం ఆరంభించారు. పట్టణ ప్రాంతాల్లో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునే అవకాశాలు ఎక్కువ కనుక ఇతర వృత్తుల వారు కూడా వారిని అనుసరించారు.

BRAOU

సాధారణమైన వృత్తి పనివారు గ్రామాల్లోనే ఉన్నా, వారు దీనికి కొద్ది సమయాన్నే కేటాయిస్తూ, వ్యవసాయానికే మొగ్గు చూపారు. ఈ విధంగా పొలంపై పనిచేసేవారి సంఖ్య పెరగసాగింది.

బ్రిటిష్ పరిపాలనా పద్ధతి గ్రామాల్లోకి ప్రవేశించడంతో ఇదివరలో గల స్వయం ప్రతిపత్తి తగ్గి, ప్రభుత్వ అదుపు అధికమైంది. ముఖ్యంగా ఒకే విధమైన న్యాయ వ్యవస్థ, రక్షణ వ్యవస్థ ప్రవేశించాయి. ఆర్థిక రంగాన పన్నుల ఆధిక్యతకు, పేదరిక వ్యాప్తికి, కరువు తీవ్రతలకు దేశంలోని అన్నిగ్రామాల వారు ఒకే విధంగా స్పందించారు. అలాగే సాంఘిక సంస్కరణలకు, స్వాతంత్ర్య పోరాటానికి ఒకే విధమైన స్పందన దేశమంతటా వచ్చింది. సాంకేతిక వస్తు సముదాయంలో, నూతన రంగాల్లో ఆసక్తి అధికమైంది.

గ్రామాలు అంతర్వివాహ సముదాయాలుగానే ఉన్నా, పై అంశాల వల్ల గ్రామాలు మార్పుకు అనుకూలంగా మారసాగాయి.

## 21.3 స్త్రీల పరిస్థితి మెరుగుదల

బ్రిటిష్ పాలనలో భారతీయ స్త్రీల పరిస్థితి మెరుగైంది. భారతీయ సమాజంలో పాశ్చాత్య విద్యనభ్యసించిన మధ్యతరగతి వర్గం తమ కుటుంబ స్త్రీ సభ్యులను చదివించే ప్రయత్నం చేయడం దీని ముఖ్య కారణం. పాశ్చాత్య విద్యనేర్చిన పురుషులు తమ ఉద్దేశాలకు, కుటుంబంలోని వాతావరణానికి గల అంతరాన్ని గమనించి, ఆ దూరాన్ని తగ్గించే నిమిత్తం తమ స్త్రీలను విద్యావంతులను చేసే ప్రయత్నం చేశారు. దీనివల్ల తల్లీకొడుకుకు, భార్యాభర్తకు గల దూరం తగ్గసాగింది. పందొమ్మిదో శతాబ్దిలోని సంస్కర్తలందరూ తమ భార్యలను విద్యావంతులనుచేసిన వారే. వీరిలో మహాత్మా పూలే, కార్వే, వీరేశలింగం, రెనడే ప్రముఖులు. సంస్కర్తలందరూ, తమ భార్యల సహాయ సహకారాలతోనే సంస్కరణను చురుకుగా సాగించారు.

ఆచారాల వల్లా, బాల్య వివాహాల వల్లా, విద్యకు దూరమై, స్త్రీలు గృహ కుటుంబ బాధ్యతలకే పరిమితమయ్యారు. అటువంటి పరిస్థితుల్లో సతీ సహగమన నిషేధం వంటి చట్టపరమైన అదుపులు ఒకవైపు, సంఘ సంస్కర్తల కృషి మరోవైపూ, స్త్రీలకు తమ సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశాన్ని కల్పించాయి.

తూర్పున బ్రహ్మ సమాజం, పశ్చిమాన ప్రార్థనా సమాజం, ఉత్తరాన ఆర్య సమాజం, దక్షిణాన థియోసాఫికల్ సొసైటీ స్త్రీలను నియమానుసారం జరిగే ప్రార్థనల కోసం, విద్య నేర్చుకోడానికి బాహ్య ప్రపంచంలోకి తీసుకొని వచ్చాయి. గృహానికి వెలుపల తరచూ సమావేశమయ్యే అవకాశాన్ని, కుటుంబేతర సభ్యులతో స్నేహపూర్వకంగా మెలగగలిగే నేర్పును వారికి ఇచ్చాయి. ఈ స్ఫూర్తితో విద్యనభ్యసించిన స్త్రీలు స్త్రీల సంఘాలను ఏర్పాటు చేయడం, పత్రికలు నడపడం, జాతీయోద్యమంలో పాల్గొనడం, స్త్రీల హక్కుల పోరాటాన్ని నిర్వహించడం చేశారు. ఉద్యమాల్లో పాల్గొనడం, ధైర్యంగా అధికారాన్ని ఎదిరించగలగడం, నిర్మాణ కార్యకాలాపాల్లో పాల్గొనడం స్త్రీలు నేర్చి, సమాజ కార్యక్రమాల్లో సహభాగినులు అయ్యారు.

### 21.3.1 స్త్రీ విద్య

స్త్రీ విద్యను గూర్చిన సమగ్ర సమాచారం మీరు ఇంతకు ముందు పాఠ్యాంశాల్లో తెలుసుకొని ఉన్నారు. అయినా క్లుప్తంగా చెప్పాలంటే;

క్రైస్తవ మిషనరీలు, అందులోనూ ముఖ్యంగా, మిస్. కుక్, స్త్రీ విద్యకు అమితంగా కృషి చేశారు. బెథూన్ కాలేజీ స్కూల్ సొసైటీ, (Bethune College School Society) (1817) ఫిమేల్ జువనైల్ సొసైటీ. (1820), (Female Juvenille Society) "లేడీస్ సొసైటీ ఫర్ నేటివ్ ఫిమేల్ ఎడ్యుకేషన్" (Ladies Society for Native Female

educations)(1824) మొదలైన సంస్థలు కలకత్తాలో స్త్రీ విద్యావ్యాప్తికి కృషిచేశాయి. సాంఘిక సంస్కరణోద్యమాలన్నీ స్త్రీ విద్యావ్యాప్తికి కృషిచేశాయి. మహిళల కోసం తొలిసారిగా విశ్వవిద్యాలయాన్ని ధోండో కేశవ్ కార్వే 1915లో స్థాపించాడు. శ్రీమతి నాథిబాయి దామోదర్ థాకర్స్ వుమెన్ యూనివర్సిటీ (ఎస్. ఎన్. డి. టి) ఆరుగురు విద్యార్థినులతో ప్రారంభించారు. దీనికి కార్వే మొదటి ప్రిన్స్‌పాల్.

**21.3.2 ఆధునికత వైపు ముందంజ వేసిన స్త్రీలు**

పాశ్చాత్య విద్యనేర్చిన తొలితరం స్త్రీలు ఆధునిక భావాల వ్యాప్తికై కృషి చేసారు. వీరిలో కొందరు క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వారు కూడా ఉన్నారు.

భారతీయ ఆధునికతకు ఏవిధంగా రాజా రామ్‌మోహన్ రాయ్ నాంది పలికాడో, ఆవిధంగానే పండిత రమాబాయి (1858 - 1922) స్త్రీలలో జాగృతిని కలుగజేసిన మొదటి మహిళ. మహారాష్ట్రకు చెందిన చిత్‌పవన్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఈమె సంస్కృతాన్ని నేర్చి, మొదటి స్త్రీ పౌరాణికురాలిగా ప్రసిద్ది చెందింది. వితంతువుల బాధలను గురించి, బాల్య వివాహాల వల్ల వచ్చే నష్టాలను గురించి ఈమె ఉపన్యసించేది. బెంగాల్ కాయస్థ పండితుడగు బిపిన్ బిహారీ మేధావి వివాహమాడింది. బ్రహ్మ సమాజకురాలైన ఈమె ఇంగ్లాండుకు వెళ్లిన తర్వాత క్రైస్తవ మతంలోకి మారింది. ఇంగ్లాండ్, అమెరికాల సందర్శన తర్వాత భారతదేశానికి వచ్చిన ఈమె స్త్రీల కొరకై 'శారదా సదన్' 'ముక్తి సదన్' 'కృపా సదన్' అనే సంస్థలను ప్రారంభించింది. పశ్చిమ భారత ప్రాంతాన ప్లేగు వ్యాపించినప్పుడు, వందల కొద్దీ అమ్మాయిలను దాని బారినుండి రక్షించింది. హీబ్రూ నుండి బైబిల్‌ను మరాఠీలోకి అనువదించిన రమాబాయి కన్నడ, బెంగాలీ, హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, మరాఠీ భాషల్లో పండితురాలు.

బెంగాలీ క్రైస్తవుడైన గోవిందచందర్ దత్, ముగ్గురు పిల్లల్లో చిన్నదైన తోరుదత్ పశ్చిమ దేశాలు పర్యటించి ఆంగ్ల కవితలను అనేకం రచించి, చిన్న వయస్సులోనే మంచి రచయిత్రిగా ఖ్యాతి పొందింది.

కమలారత్నం సత్యనాథన్ ఆంధ్రాలోని మచిలీపట్టణానికి చెందిన స్త్రీ. క్రైస్తవాన్ని స్వీకరించిన ఓరుగంటి శివరామకృష్ణమ్మగారి కుమార్తె. నోబుల్ కాలేజీలో కమలా రత్నం 1898లో బి. ఎ. ని, 1901లో ఎమ్. ఏ. పట్టాలను పొందింది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి పట్టభద్రురాలు ఆమె. "ది ఇండియన్ లేడీస్ మాగజైన్" T(The Indian ladies magazine) ని ఆరంభించి, దాని ద్వారా స్త్రీల ఇబ్బందులను, కోర్కెలను, హక్కులను తెలియజేస్తూ వారి సాంఘిక ఉన్నతికి ఆమె కృషి చేసింది. సరోజిని నాయుడు తొలుతగా రాసిన పద్యాలు "ది ఇండియన్ లేడీస్ మేగజైన్"లోనే అచ్చు అయ్యాయి.

క్రైస్తవ మతాన్ని స్వీకరించకుండా స్త్రీల అభివృద్ధికి కృషి చేసిన వారిలో మహదేవ గోవింద రెనడే భార్య అయిన రమాబాయి రెనడే ఒకరు మరాఠీ, ఇంగ్లీషు నేర్చిన ఈమె "పూనా సేవా సదన్" ని ప్రారంభించి, దాని శాఖలను త్వరలోనే బొంబాయి రాష్ట్రమంతటా వ్యాపింపజేసింది. స్త్రీ విద్యకు, స్త్రీలు బాహ్య ప్రపంచంలో తమ వంతు బాధ్యతలను నెరవేర్చేందుకు ఆమె కృషి చేసింది. "హిందూ లేడీస్ సోషల్ అండ్ లిటరరీ క్లబ్" (Hindu Ladies Social And Litarary Club) ని ఆమె 1902లో స్థాపించింది. "సేవా సదన్ 'నర్సింగ్ అండ్ మెడికల్ అసోసియేషన్' (Nursing And Medical Association) ని ప్రారంభించి, నర్సులను తయారు చేసింది.

దేవేంద్రనాథ్ టాగూర్ కుమార్తె అయిన స్వర్ణకుమారి దేవి కలకత్తాలో 1882లో "లేడీస్ థియోసాఫికల్ సొసైటీ" (Ladies Theosophical Society) ని 1886లో "సఖీ సమితి" ని ఏర్పాటు చేసింది. రెండో సంస్థ ద్వారా ఆమె స్త్రీలు తయారుచేసిన కళాత్మకమైన చేతి వస్తువులను ప్రతి యేటా ప్రదర్శించేది. స్వర్ణకుమారిదేవి కుమార్తెలైన సరళాదేవి చౌధురాణి హిరణ్మయీదేవి కూడా స్త్రీల సంఘాలను ఏర్పాటుచేసి, వారి పురోభివృద్ధికి కృషి చేసినవారే. సరోజ్‌నళినీ దత్, లేడీ అబలా బోస్ కూడా అనేక సంస్థలను స్థాపించారు.

BRAOU

ఆనందబాయి జోషి, డాక్టరీ విద్య చదివిన మొదటి భారతీయ స్త్రీ, ఈమె అమెరికాలో విద్యనభ్యసించింది. కార్నీలియా సొరాబ్జీ మొట్టమొదటి న్యాయవాది వృత్తి చేపట్టిన భారతీయ స్త్రీ. మొట్టమొదటి గృహ విజ్ఞానశాస్త్ర విద్యాలయాన్ని (లేడీ ఇర్విన్ కాలేజీ) స్థాపించడంలో రాజకుమారి అమృతకౌర్ విశేష కృషి చేశారు.

లేడీ దోరాబ్ తాతా, 1905లో బొంబాయిలలో పారిశ్రామిక ప్రదర్శన జరిగినప్పుడు, స్త్రీల ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయగలిగారు. ఈమె జంషెడ్జీ తాతాకోడలు. ఈమె స్త్రీ విద్యతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపింది. టెన్నీసు, స్కేటింగ్ ఆడ్డమేగాక, ఈమె కారుని, విమానాన్ని సైతం నడపగలిగేది. ఈమె 1998లో ఏరోప్లేను, 1904లో ఈజిప్ట్ని సందర్శించింది. బ్రిటిష్ వలసల్లో జరుగుతున్న బానిసత్వంతో కూడిన కూలీ ఒప్పందాలను రద్దు చేయాలని ఈమె స్త్రీల రాయబారాన్ని 1917లో వైస్రాయి వద్దకు పంపింది.

నెహ్రూ కుటుంబ సభ్యులైన విజయలక్ష్మి పండిట్, స్వరూప రాణి, కమలా నెహ్రూలతో బాటు సరోజినీ నాయుడు, డాక్టర్ ముత్తు లక్ష్మి రెడ్డి, దుర్గాబాయ్ దేశ్ముఖ్లు రాజకీయ రంగంలో అగ్రస్థానాన్ని ఆక్రమించారు. తమ సేవలతో ఇతరులకు మార్గదర్శకులయ్యారు.

### 21.3.3 స్త్రీల ఉద్యమం

స్త్రీలలో వచ్చిన చైతన్యం సంఘటితమై ఉద్యమ రూపం దాల్చింది. పురుష సంస్కర్తల వల్ల విద్యను, ధైర్యాన్ని సంపాదించుకొన్న స్త్రీలు ఐక్యతతో తమ కోర్కెలను వెల్లడించి, వాటికై కృషి చేయనారంభించారు.

మొట్టమొదట స్త్రీల జాతీయ సంస్థ అయిన "వుమెన్స్ ఇండియన్ అసోసియేషన్" (Women's Indian Assoiciation)ని మార్గరేట్ కజిన్స్ 1917లో స్థాపించింది. శ్రీమతి అనిబిసెంట్ ఆ సంస్థకు మొదటి అధ్యక్షురాలు; మార్గరేట్ కజిన్స్ మొదటి కార్యదర్శి. సరోజినీ నాయుడు నాయకత్వాన, పద్నాలుగు మంది స్త్రీలను ఈ సంస్థ మాంటెగ్ వద్దకు 1917లో రాయబారం పంపింది. పురుషులతో సమానంగా రాజకీయ సేవకు అవకాశాలు కావలనీ, సార్వత్రిక ఓటింగ్ హక్కు కావాలని ఈ రాయబారం కోరింది. జాతీయ కాంగ్రెస్ మద్దతుతో ఈ హక్కులను పొందడానికి స్త్రీలు కృషి చేశారు. మద్రాస్ ప్రభుత్వం మొట్టమొదటిసారిగా 1929లో డాక్టర్ ముత్తు లక్ష్మి రెడ్డిని శాసనసభ సభ్యురాలిగా నియమించింది. ఆమెను సభవారు ఏకగ్రీవంగా డిప్యూటీ స్పీకర్గా ఎన్నుకున్నారు.

ఉన్నత స్థాయికి చెందిన స్త్రీలు 1927లో పూనాలో సమావేశమై "ఆల్ ఇండియా విమెన్ కాన్ఫరెన్స్" (All India Women's Conference A I W C)ఎ.ఐ. డబ్ల్యు. సి. ని స్థాపించారు. 'బరోడా రాణి చిమ్నబాయి గైక్వార్ దీనికి అధ్యక్షురాలు. మార్గరేట్ కజిన్ దీనికి కార్యదర్శి. సరోజినీనాయుడు, కమలాదేవి చటోపాధ్యాయ, రాజకుమారి అమృతకౌర్, బేగం హమీద్ ఆలీ, డాక్టర్ ముత్తు లక్ష్మి రెడ్డి ఈ సంస్థలోని ఇతర సభ్యులు. యుక్తవయస్క వివాహాలను, విద్యావ్యాప్తిని, ఇతర సంస్కరణలను ఈ సంస్థ బలపరిచింది. చట్టపరమైన రక్షణలను కోరింది.

సామాన్య స్త్రీలకై పాటుపడ్డ ఇతర సంస్థల్లో పేర్కొన్నాల్సినవి బెంగాల్లోని "మహిళా ఆత్మరక్షణ సమితి" (MARS) "ఆంధ్ర మహిళా సంఘం" మొదలైనవి.

చట్టబద్ధమైన జాతీయోద్యమంలోనూ, భయంకరమైన ఉగ్ర ఉద్యమాల్లోనూ, వామపక్ష విభాగాల్లోనూ స్త్రీలు చేసిన కృషిని నాయకులు గుర్తించారు. అందుకని స్వాతంత్ర్యం సిద్ధించేటప్పటికి స్త్రీల సహకారంపై ఎటువంటి భిన్నాభిప్రాయమూ వ్యక్తం కాలేదు.

## 21.4 నూతన సామాజిక వర్గాలు

భారతీయ సమాజంలో వలస పాలన కారణంగా, నూతన ఆర్థిక విధానాల కారణంగా ప్రభవించిన ఈ వర్గాలు సమాజంపై ప్రభావాన్ని చూపాయి. ఈ కొత్త వర్గాలు దేశంలోని అన్ని ప్రదేశాలలోనూ, అనేక కులాల నుంచి వచ్చాయి.

బ్రిటిష్ వలస ఆర్థిక విధానం మూడు స్థాయిల్లో సాగింది. అవి : (1) రాజకీయ అధికారాన్ని మరిన్ని వర్తక, వాణిజ్య రాయితీలను పొందడానికి వినియోగించిన విధానాన్ని 'వర్తక సంస్థ విధానము'ని (Merchantil Economy) అంటారు. ఈ విధానాన్ని 1757 నుండి 1813 వరకూ అనుసరించారు. దీనికి ముందు ప్రత్యక్ష దోపిడి విధానమే కొనసాగింది. ముఖ్యంగా బెంగాల్ ప్రాంతంలో కంపెనీ ఈవిధానాన్ని అనుసరించింది. (2) "స్వేచ్ఛా వర్తకం" విధానం 1813 నుండి కొనసాగింది. తూర్పు ఇండియా వర్తక సంస్థ వారి గుత్తాధిపత్యాన్ని బ్రిటిష్ ప్రభుత్వం తొలగించి, బ్రిటన్‌లోని అన్ని కంపెనీలకు భారతదేశంలో వర్తకం చేసే హక్కును 1813 లో ఇచ్చారు. భారతదేశ ద్వారాలను బ్రిటన్‌లోని అన్ని కంపెనీలకు తెరవడంతో, నలుమూలలనుండి ముడివస్తువులు తరలించబడ్డం ఆరంభమైంది. దీనివల్ల భారతదేశపు వృత్తి పనివారు ఉపాధిని కోల్పోయారు. ఈ తరలింపు వల్ల బ్రిటన్‌లోని యంత్రాలకు, పరిశ్రమలకు పూర్తి పని ఏర్పడింది. ఆ ముడిసరుకులతో తయారైన వస్తువులకు తిరిగి భారతదేశమే మార్కెట్టుగా మారి, ఎక్కువ ధరకు వాటిని కొనుగోలు చేసేది. ఈ విధంగా ఎగుమతిదారుగానూ, దిగుమతిదారుగానూ కూడా భారతదేశమే నష్టపోయింది. అస్వతంత్ర దేశం కనక పరిశ్రమలకు, వృత్తి పనివారలకు రక్షణలు కల్పించలేకపోయింది. (3) మూడో స్థాయిలో 1857 నుండి 1947 వరకు 'ద్రవ్య సామ్రాజ్యత్వమే' అధికారం చేసింది. భారతదేశంలోగల ద్రవ్యంపై పూర్తి అధికారం కోసం చేసే యత్నం రైల్వేల నిర్వహణలోనూ. పౌను రూపాయల మార్పిడి రేటులో తేడా ద్వారానూ. మేనేజింగ్ ఏజెన్సీల ద్వారానూ వ్యక్తమైంది. ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్లా కొత్త ఉపాధి అవకాశాలు లభించడం వల్లా, నూతన సామాజిక వర్గాలు భారతీయ సమాజంలో మొదలయ్యాయి.

**21.4.1 జమీందార్లు**

ప్రభుత్వానికి ప్రజలు చెల్లించాల్సిన భూమి పన్నును వసూలు చేసే హక్కును వంశపారంపర్యంగా గల అధికార్లకు, బ్రిటిష్ ప్రభుత్వం, భూమిపై యాజమాన్య హక్కును కూడా కల్పించి, నూతన జమీందారీ వరంగా మార్చింది. యజమానులు లేని ప్రభుత్వ భూములను సైతం వేలంలో అమ్మి యజమానులను సృజించారు. ఈవర్గాన్నే జమీందారులనేవారు.

గవర్నర్ జనరల్ అయిన లార్డ్ కారన్‌వాలీస్‌కు, ఆర్థిక విధాన రూపకల్పనలో, సర్ జాన్ షోర్, జేమ్స్ గ్రాంట్, జోనాథన్ డంకన్ సహాయంచేసేవారు. కారన్ వాలీస్ రాకకు పూర్వం కంపెనీ వారు భూములను సంవత్సరానికి వేలం వేసి, ఎక్కువ పాట పాడినవారికి, పన్ను వసూలుకై ఇచ్చేవారు. ఈవిధానంలో భూమిపై వచ్చే ఆదాయం ఎంతో ముందుగా ప్రభుత్వానికి తెలిసేదికాదు. దీనివల్ల వచ్చే ఇబ్బందులను గమనించి, లార్డ్ కారన్‌వాలీస్, 1790లో పది సంవత్సరాలకు శిస్తు నిర్ణయం చేశాడు. అయితే, 1793లోనే అందరూ ఆమోదించిన శాశ్వత శిస్తు విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈవిధానంలో భూమి శిస్తు వసూలు చేసే రెవెన్యూ అధికారులకు భూమిపై యాజమాన్య హక్కు లభించింది, ప్రభుత్వానికి నిర్ణయించిన సమయంలో శిస్తు చెల్లిస్తున్నంత కాలం ఈ హక్కుకు భంగం వాటిల్లదు. రైతులతో వారికి గల సంబంధాల్లో సైతం ప్రభుత్వం జోక్యం చేసుకోదు. శిస్తు చెల్లించలేకపోయినప్పుడు, మాత్రం భూమిలో కొంత భాగాన్ని అమ్మి, శిస్తును ప్రభుత్వం వసూలు చేసుకుంటుంది. కంపెనీకి ఏటా వచ్చే ఆదాయం స్థిరమైందే కనుక, ప్రభుత్వ ఖర్చును అంచనా వేసుకోవచ్చు. నిర్ణీత శిస్తును మాత్రమే చెల్లిస్తారు కనుక జమీందార్లకు ఆదాయ వనరులను పెంచుకునే శ్రద్ధ ఉంటుందని, ఆవిధంగా వారికి లాభం ఎక్కువ ఉంటుందని బ్రిటిష్ వారు భావించారు.

అయితే, బ్రిటిష్ ఊహకు భిన్నంగా, వీరు కలకత్తాలోనే నివాసం ఉంటూ, భూమిపై కన్నా, దానిపై వచ్చే ఆదాయంపై మాత్రమే శ్రద్ధ వహించసాగారు. అధిక ఆదాయం కోసం మెలకువలు పాటించడమే గాక, రైతుల నుంచి, కౌలుదార్లనుంచి ఎక్కువ శిస్తును వసూలు చేయసాగారు. ఈసొమ్మును భూమిపై పెట్టుబడిగా పెట్టక, విలాసాలకు ఖర్చు చేయసాగారు.

ఈ జమీందారీ వర్గాన్ని సృష్టించిందే బ్రిటిష్ ప్రభుత్వం కనక, వీరంతా సమష్టిగా, ఎల్లప్పుడూ బ్రిటిష్ ప్రభుత్వాన్నే సమర్థించేవారు. వారి జమీందారీ హక్కులకు, హోదాలకు భంగం కలిగినప్పుడు మాత్రమే ప్రభుత్వాన్ని ఎదిరించేవారు. వీరు రాజులను, వారి జీవిత విధానాన్ని అనుకరించేవారు.

సాంప్రదాయకులకు ఈవర్గం తమ ప్రయోజనాల పరిరక్షణకై 1851లో "బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్ (British Indian Association) ను స్థాపించుకుంది. ఈసంస్థ సభ్యులు తమ బ్రిటిష్ సంబంధాన్ని తప్పనిసరి సంబంధంగా గాక, వారికి అది ఆనందాన్ని, గర్వాన్ని కల్గించే సంబంధమని మాంటేగ్ తన "ఇండియన్ డైరీ" (Indian Dairy) లో తెల్పాడు.

వ్యవసాయంపై శ్రద్ధ చూపకపోయినప్పటికీ, దాని ద్వారా వచ్చే ఆదాయంలో అధిక భాగాన్ని వీరే పొందేవారు. ఆర్థిక స్థితిని అభివృద్ధి చేసే ఏ ప్రయత్నాన్ని జమీందారులు చేపట్టలేదని జాతీయ వాదులు భావించేవారు.

భారతీయ జమీందార్ల సంఘం సంస్కరణను పురోగతిని వ్యతిరేకించారు. కుల వ్యవస్థ బలపడాలనీ, దాని వల్ల మాత్రమే నాగరికత కొనసాగుతుందని దర్పంగా రాజా చేసిన ప్రకటన ఈ సందర్భంగా గమనార్హం.

బ్రిటిష్ ప్రభుత్వానికి వీరు ఆంతరంగిక వర్గంగా ఉండేవారు. అందుచేతనే 1857 తిరుగుబాటును అణచటంలో జమీందార్ల కృషి ఎక్కువగా ఉంది. అదే విధంగా, భారత జాతీయ కాంగ్రెస్ ప్రజాస్వామ్య హక్కులకోసం, పరిపాలన సంస్కరణల కోసం నిరంతరంగా ఆందోళన జరుపుతున్నా, ఈవర్గం మాత్రం మార్పులను వ్యతిరేకించేది; తమ ప్రయోజనాల కోసం బ్రిటిష్ పాలననే సమర్థించేది. కలకత్తాలోని పౌరులంతా "ఇండియన్ అసోసియేషన్" (Indian Association) ఆధ్వర్యంలో లిట్టన్ ప్రవేశపెట్టిన పత్రికా బిల్లును వ్యతిరేకించగా బెంగాల్ జమీందార్లు ప్రతినిధులుగా గల బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్ వ్యతిరేకించింది. స్థూలంగా రైతులు, కౌలుదార్లు జాతీయోద్యమాన్ని బలపర్చగా, జమీందార్లు మాత్రం వ్యతిరేకించారు. బ్రిటిష్ వారికి మద్దతునిచ్చే ఈ విధానం వల్ల వీరు గవర్నర్ జనరల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కి నియామకాలను పొందేవారు.

### 21.4.2 కౌలుదార్లు

జమీందారీ వర్గం కౌలుదార్ల వర్గాన్ని నిర్మించింది. జమీందార్లకు, రైతులకు నడుమగల ఈవర్గం జమీందారీ హింసకు గురై వారికి ఎక్కువ కౌలు ఇచ్చుకుంటూ, తొందరలోనే పేదలుగా మారారు. బెంగాల్ టెనెన్సీ చట్టాలు 1859లోనూ, 1885లోనూ వచ్చినప్పటికీ, వీరి పరిస్థితుల్లో మార్పు రాలేదు.

ఇరవైయ్యో శతాబ్దంలో దేశంలోని అనేక భాగాల్లో రైతు సంఘాలు ప్రారంభమయ్యాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్‌ల్లో ప్రత్యేక కౌలుదార్ల సంఘాలు గాని లేక కౌలుదార్లతో కూడిన కిసాన్ సభలుగాని స్థాపించబడ్డాయి. ఈ సంఘాలు వీరి ప్రత్యేక సమస్యలపై ఆందోళనలు చేశాయి. వీటి నిర్మాతలు దేశభక్తులు కావడంతో, కౌలుదార్లు, త్వరలోనే, ఇతర రైతుల వలెనే స్వాతంత్ర్యోద్యమంలోకి వచ్చారు. వీరు అధికమైన పన్నులను, జమీందార్లు విధించే వివిధ వసూళ్లను వ్యతిరేకించేవారు. జమీందారీ వ్యవస్థనే వీరు "అనవసరమైన, అసమర్థమైన,

జాతీయ ప్రయోజనాలకు విరుద్ధమైన సంస్థగా" విమర్శించారు. బ్రిటిష్ విధానాలతో బాటు వీరు జాతీయ కాంగ్రెస్ అనుసరించే విధానాలను కూడా విమర్శించేవారు. వీరి ప్రత్యేక కోర్కెలను గణించక, జాతీయ కాంగ్రెస్ జాతీయ ప్రయోజనాల దృష్ట్యా, వీరిని, జమీందారులను కలుపుకొనిపోయే విధానాన్ని ప్రతిపాదించేది. కిసాన్ నాయకులైన స్వామి సహజానంద, ప్రొఫెసర్ రంగా, ఇందులాల్ యాగ్నిక్ కాంగ్రెస్ అనుసరించే ఈ విధానాన్ని విమర్శించేవారు.

### 21.4.3 యాజమాన్య రైతులు

స్వయంగా సాగుచేసుకొనే రైతులకు రైత్వారీ విధానం అమల్లోగల యాజమాన్య హక్కుగల రైతులు తోడయ్యారు. రైత్వారీ విధానాన్ని మొదటిసారిగా కేప్టన్ రీడ్ బారా మహల్‌లో ప్రవేశపెట్టాడు. అప్పుడు ఈవిధానం అంత జనరంజకం కాలేదు. రీడ్ సహాయకుడైన సర్ థామస్ మన్రో తిరిగి రైత్వారీ విధానాన్ని 1800 సంవత్సరంలో దత్తమండల జిల్లాల్లో ప్రవేశపెట్టి, ఈవిధానాన్ని వెలుగులోకి తెచ్చాడు. భూమిని పూర్తిగా సర్వే చేయించి, రైతులకు గల యాజమాన్య హక్కును స్థిరీకరించి, ప్రభుత్వం పట్టాలను ఇచ్చింది. రైతులతోనే, ప్రభుత్వం స్వయంగా ఒప్పందం చేసుకొని, భూమి శిస్తును నిర్ణయించుకొంది. దత్తమండల జిల్లాలనుండి ఈవిధానం తంజావూరు కోయంబత్తూరు, ఆర్కాట్, మలబార్ ప్రాంతాలకు విస్తరించింది.

అధికమైన భూమి పన్ను, చిన్న విస్తీర్ణత ఉన్న ఒకేచోట ఉండని పొలాలు, పెరుగుతున్న అప్పులు, కరువుకాటకాలవల్ల ఈవర్గం పేదరికానికి దగ్గరలోనే ఉండేది. అతికొద్దిమంది మాత్రమే, నూతన నీటి పారుదల అభివృద్ధి వల్ల మధ్యతరగతి శ్రేణిలో కొనసాగగలిగారు.

యాజమాన్య రైతులకు గల లక్షణాల్లో ముఖ్యమైనవి : (1) ఎంత చిన్న భూమికి అధిపతి అయినా, అతనికి ఉన్న యాజమాన్య హక్కువల్ల, మిత వాద ధోరణినే ప్రదర్శిస్తాడు తప్ప, కార్మికుల్లాగా అతి వాద ధోరణిని ప్రదర్శించలేడు. (2) రైతులకు గల భూమి రీతులను బట్టి, పండించే పంటలను బట్టి, ఆశించే ప్రయోజనాలను బట్టి, వారిని సంఘటిత పరచడం కష్టం. ఫ్యాక్టరీలోని కార్మికులంతా తాము ఒకటేనని, తమ కోర్కెలూ ఒకటేనని భావించగా, రైతులు మాత్రం తాము ప్రత్యేకమని, తమ కోర్కెలు వేరువేరని భావిస్తారు. (3) రైతులు ఫలసాయం చేతికి రావడానికి తమ శ్రమకు తోడుగా ప్రకృతి తోడ్పాటును కోరుతారు. గ్రామాల్లోని రైతులు సాంప్రదాయక జీవన రీతిని సాగి త్వరితగతిని మార్పులను అంగీకరించలేరు. కాని పట్టణాల్లో జీవన రీతి త్వరితంగానూ, చైతన్యవంతంగానూ ఉండడంతో, మార్పులకు అనుగుణంగా స్పందిస్తుంది. నగరాల్లో నివసించే అట్టడుగు వర్గాలకంటే గ్రామాల్లోని వారిని ఉత్తేజపరచడం కష్టమని, సంస్కర్తలు, జాతీయవాదులు పేర్కొనేవారు.

అతినెమ్మదిగా రైతు వర్గం తమ్ముతాము సంఘటిత పరచుకొని, తమ కోర్కెలను నిర్ణయించుకొని, రైతు పోరాటాల్లో పాల్గొనడం ప్రారంభించింది. కౌలుదార్లకంటే యాజమాన్యరైతులే ముందుగా జాతీయ ప్రవాహంలోకి రాగలిగారు. దీనికి కారణం కౌలుదార్లకు ప్రభుత్వంతో ప్రత్యక్ష సంబంధం లేదు. జమీందార్లతో శిస్తు విషయంలో ఘర్షణలు పడ్డారు తప్ప ప్రభుత్వంతో వారికి శత్రుత్వం లేదు. యాజమాన్య రైతులు నేరుగా ప్రభుత్వానికి పన్ను చెల్లించే వారు కనుక అధిక పన్నుకై వారు ప్రభుత్వంతో వివాదపడేవారు. రైతుల సంఖ్యాబలం అధికం కనుక వీరి సమస్యలపై కాంగ్రెస్‌వారు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు దృష్టి సారించడం ప్రారంభించారు.

సహాయ నిరాకరణోద్యమం (1920) నుంచి రైతులు రాజకీయ చైతన్యంతో కూడిన ఉద్యమాలను చేపట్టారు. రైతు సంఘాలు, ఆంధ్రాలో 1923లో ప్రారంభమవగా, కిసాన్ సభలు 1926-27 మధ్య పంజాబ్, బెంగాల్, ఉత్తర ప్రదేశ్‌ల్లో ప్రారంభమయ్యాయి. ఆంధ్రా ప్రావిన్షియల్ రైతు సంఘం 1928లో మొదలైంది. మొదటి

భారతీయ రైతు పాఠశాల 1938లో నిడుబ్రోలులో ప్రారంభమైంది.

ఇరవైయ్యో శతాబ్దం రెండోభాగం నుండి భారతీయ రైతులు ఆంధ్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్నాటక, బెంగాల్, బీహార్, పంజాబుల్లో ఉద్యమాలను జరుపుతూనే వచ్చారు. వీటిలో కొన్నిటిని మాత్రమే కాంగ్రెస్ అంగీకరించింది.

మొట్టమొదటిసారిగా అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ 1935లో లక్నోలో సమావేశమైంది. రైతుల కోర్కెలను 1937లో కాంగ్రెస్ మానిఫెస్టోలో ప్రకటించినా, కాంగ్రెస్ పనితీరుకు రైతు సంఘాలు అంగీకరించక, ప్రత్యేక పోరాటాలను ప్రారంభించాయి.

యాజమాన్య రైతులు బ్రిటిష్ పాలనకు పూర్వం కూడా ఉన్నప్పటికీ, బ్రిటిష్ పాలనలో ఈ వర్గం రాజకీయ చైతన్యాన్ని పొంది, కోర్కెల సాధనకై, సంస్థల ద్వారా కృషి చేయసాగారు.

### 21.4.4 వడ్డీ వ్యాపారులు, షాహుకార్లు

ఈ రెండు వర్గాలు బ్రిటిష్ పాలనకు ముందునుండి ఉన్నప్పటికీ, వారి స్థితిగతుల్లోనూ, అధికారాల్లోనూ మార్పు వచ్చింది. వీరి అధికారాలు పెరిగాయి.

బ్రిటిష్ రాకకు పూర్వం, వడ్డీవ్యాపారి వ్యవసాయదారుడికి గాని, చేతివృత్తి పనివారికి గాని, గ్రామ పంచాయితీ నిర్ణయించిన వడ్డీకి డబ్బు అందించేవాడు. కాని అప్పు చెల్లించలేని వాని జీవనాధారమైన పొలాన్నిగాని, పశుసంపదను గాని, జప్తు చేసికొనే వీలుండేది కాదు. పొలమనేది గ్రామానికంతటికీ చెందిన వస్తువు అవడమే దీనికి కారణం. కాని బ్రిటిష్ పాలనలో వడ్డీవ్యాపారస్థులు, చట్టపరంగా, పన్ను చెల్లించని వారి ఆస్తులను జప్తుచేసేవారు. పత్తి వ్యవసాయదారుల భూములను వడ్డీ వ్యాపారులు వల్లనే దక్కన్ వ్యవసాయదారుల విముక్తి చట్టం 1897లో వచ్చింది. పందొమ్మిదో శతాబ్దం ఆఖరి దశాబ్దంలో పంజాబులోని భూములను వడ్డీ వ్యాపారులు ఆక్రమించుకోగా, రైతులు వారిపై తిరగబడి. అప్పు పత్రాలను నాశనం చేయడమేగాక, కొన్ని సందర్భాల్లో వ్యాపారులను చంపడం కూడా జరిగింది. అందుకనే 1900 సంవత్సరంలో పంజాబ్ భూమి విడుదల చట్టాన్ని లార్డ్ కర్జన్ ప్రవేశపెట్టాడు.

వడ్డీవ్యాపారస్థుని వలెనే షాహుకారు అధికార పరిధి పెరిగింది. పల్లెల్లో లభించని వస్తువులను షాహుకారు అందజేసేవాడు. పొలం సొంత ఆస్తిగానూ, వ్యవసాయ పంటలు వస్తువులుగానూ మారగానే, షాహుకారు అధికారాలు కూడా పెరిగాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో పంట మార్కెట్టుకి వెళ్లడానికి షాహుకారు మధ్యవర్తి అయ్యాడు.

### 21.4.5 పెట్టుబడిదారులు

బ్రిటిష్ వలస పాలనలో వచ్చిన మార్పులలో ఆధునిక పెట్టుబడిదారీ వర్గంకూడా ఒకటి స్వయం వాడకానికి మాత్రమేగాక, మార్కెట్లలో అమ్మకానికి సైతం వ్యవసాయ ఉత్పత్తులను పంపిణీ చేయడంతో వ్యవసాయం కూడా వాణిజ్య స్వభావాన్ని పొందింది. ఆధునిక పరిశ్రమలు బ్యాంకులు అభివృద్ధి పొందడం వల్లా, వర్తక వాణిజ్యాలు విస్తరిల్లడం వల్లా ఆధునిక - పారిశ్రామిక - వాణిజ్య - పెట్టుబడిదారీ వర్గం తలెత్తింది.

విదేశీ పెట్టుబడి ఎక్కువగా తోటల పెంపకంలోనూ, రైల్వేల్లోనూ, మేనేజింగ్ ఏజెన్సీల్లోనూ ఉండగా, స్వదేశీ పెట్టుబడి అధికంగా వస్త్ర, నార, ఉక్కు, ఇనుము, చక్కెర మొదలైన పరిశ్రమల్లో ఉండేది. విదేశీ పెట్టుబడులకు, భారతదేశ పెట్టుబడులకు వలస ప్రభుత్వం విచక్షణ చూపేది. ఈ విధానాన్ని భారతీయులు విమర్శించే వారు.

భారతీయ పెట్టుబడిదారులు తమ పరిశ్రమలకు రక్షణను. అనుకూల నాణ్య మార్పిడిని, సబ్సిడీలను కోరేవారు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ప్రభుత్వం యుద్ధావసరాల నిమిత్తమై, భారతీయ పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వడం ఆరంభించింది.

తమ ప్రయోజనాల పరిరక్షణకై భారతీయ పెట్టుబడిదారులు "బెంగాల్ నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్" (Bengal National Chamber of Commerce) ని 1887లో స్థాపించుకున్నారు. దీనికి ముందే, విదేశీయులు, బెంగాల్, బొంబాయి, మద్రాసుల్లో "ఐరోపా చాంబర్ ఆఫ్ కామర్స్" (Europe Chamber of Commerce) సంస్థలను స్థాపించుకున్నారు. ఇతర భారతీయ ప్రాంతీయ సంస్థల్లో "ఇండియన్ మర్చెంట్స్ చాంబర్", (Indian Merchants Chamber) ను బొంబాయిలో 1907లోనూ, "సౌత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్" (South Indian Chamber of Commerce) ని, మద్రాసులో 1909లోనూ, ప్రారంభించారు.

విదేశీ వస్త్ర బహిష్కరణ, స్వదేశీ ఉద్యమం ఇచ్చిన ఉత్తేజంతో పారిశ్రామిక వేత్తలు స్వాతంత్రోద్యమానికి బలాన్ని చేకూర్చి, తామూ బలపడ్డారు. అందులో ముఖ్యంగా వస్త్ర పరిశ్రమకు దేశమంతా ఆదరణ లభించింది. ఆధునిక పరిశ్రమలకు, యంత్రాలకు గాంధీజీ అనిష్టత చూపినప్పటికీ, స్వదేశానికి ఆయనిచ్చిన బలం వారికి ఉత్తేజాన్ని ఇచ్చింది. గాంధీ పట్ల, ఆయన జీవన విధానం పట్ల గౌరవం చూపిన పెట్టుబడిదారీ వర్గం సామాన్య జీవితాన్ని గాక, విలాస జీవితాన్ని గడిపారు. ఆస్తిపై కోరికను లాభాలపై ఆశలను వారు వీడలేదు. వ్యవస్థా రంగంలో తీవ్ర మార్పులను కూడా వీరు కోరలేదు. చాలామంది జమీందారులే పారిశ్రామిక వేత్తలుగానూ, బ్యాంకర్లుగానూ మారడమే దీనికి కారణం. ధనిక పారిశ్రామిక వేత్తలగు బిర్లా, బజాజ్, అంబాలాల్ శరభాయి, కస్తూరిభాయి లాలాభాయ్ గాంధీ నాయకత్వాన గల కాంగ్రెస్‌ను సమర్థించి, వారి కార్యక్రమాలకు ఆర్థిక సాయం చేసేవారు. వీరికి జాతీయ కాంగ్రెస్‌లో ప్రముఖస్థానం ఉంది.

### 21.4.6 కార్మిక వర్గం

పెట్టుబడిదారుల వర్గం వలెనే నూతనంగా కార్మిక వర్గం బయలుదేరింది. వీరు తోటల్లోనూ, ఫ్యాక్టరీల్లోనూ, రైల్వేల్లోనూ, గనుల్లోనూ, నౌకాశ్రయాల్లోనూ పనిచేసేవారు బీద వ్యవసాయదారులు, వృత్తికళాకారులు కార్మికులుగానూ, కూలీలుగానూ మారారు.

వస్తు ఉత్పత్తి అనేక దశలుగా జరగడం బ్రిటిష్ పాలనలో వచ్చిన ప్రధానమైన మార్పు. ఒక వస్తువు పూర్తి అవడానికి పట్టే వివిధ దశలను, వివిధ శాఖలుగా విభజించి, నైపుణ్యతననుసరించి పనిని కేటాయించి, పెట్టబడిదారుడు లాభాలు మిగిలేలా ధరను నిర్ణయిస్తాడు. బ్రిటిష్ రాకకు పూర్వం నైపుణ్యత గల్గిన చేతివృత్తికారుడు అన్ని దశల పనులను తన కుటుంబ సభ్యుల సహాయంతో ముగించి ధరను నిర్ణయించేవాడు. బయానాగా తీసుకొన్న సొమ్ముతోనూ, తన వద్దనున్న ధనంతో తయారుచేసిన ఆ వస్తువుపై అతనికి యాజమాన్య హక్కు ఉండేది. కాని బ్రిటిష్ పాలనలో అతడు స్వతంత్రతను యాజమాన్య హక్కులను కోల్పోయి పనిచేసిన సమయాన్ని బట్టి డబ్బు తీసుకొనే కూలీగా మారాడు. పెట్టబడికి అవసరమైన ధనం అతని వద్ద లేకపోవడమే దీనికి కారణం ఐరోపావాసుల తోటల్లో పనిచేసే కూలీలు అందరికంటే అట్టడుగు స్థాయిలో ఉండేవారు.

ఇరవైయ్యో శతాబ్ది మొదటి దశాబ్దంలోనే "కలకత్తా ప్రింటర్స్ యూనియన్", (Calcutta Printers Union) "బొంబాయి పోస్టల్ యూనియన్" (Bombay Postal Union) ల స్థాపన జరిగింది. ఎన్.ఎమ్. జోషి, లాలా లజపతిరాయ్ జోసెఫ్ బాప్టిస్టాల కృషి ఫలితంగా 1920లో "ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్" (All India Trade Union Congress) మొదలైంది. మితవాద నాయకులైన ఎన్. ఎమ్. జోషి, వి. వి. గిరి, చిత్తరంజనదాస్‌ల

ఆధిపత్యాన ఈ సంస్థ పది సంవత్సరాలు ఉంది. కాని 1927 తర్వాత వచ్చిన నాయకుల్లో సోషలిస్టు, కమ్యూనిస్టు భావాలు స్పష్టమై, వర్గ పోరాట ధ్యేయంగా కార్మికులను సమీకరించడం మొదలైంది. ట్రేడ్ యూనియన్ స్పృహలేని సమ్మెలు 1918లో కొన్ని జరిగాయి. "ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్" 1938లో ఏర్పడింది. దేశ స్వాతంత్ర్యం సిద్ధించడానికి రెండు, మూడు సంవత్సరాల ముందు దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సమ్మెలు జరిగాయి.

కార్మికులకు అనారోగ్యం, ఉద్యోగ తొలగింపు, ముసలితనం లేవని, మరణం నుండి ఎటువంటి రక్షణ పనిచేసే కార్మికుల కూలి వారి కనీస అవసరాలకు చాలదని 1938లో అంతర్జాతీయ లేబర్ సమావేశంలో యస్వీ. పరులేకర్ చెప్పడం వల్ల వారి స్థితిలో మార్పు లేదని తెలుస్తోంది.

**21.4.7 విద్యాధిక మధ్య తరగతి వర్గం**

చాలాకాలం సాగిన బ్రిటిష్ పాలనలో భారతీయ సమాజం విప్లవాత్మకమైన మార్పులకు లోనైంది. పాశ్చాత్య విద్యా విధానం ఈ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఆధునిక సమాజ నిర్మాణానికి అవసరమైన కొత్త దృక్పథాలను భావజాలాన్ని, నూతన భావ వ్యక్తీకరణ పద్ధతులను భారతీయ సమాజం పెంపొందించుకుంది.

విద్య నేర్చిన వారినుంచే సంస్కర్తలు బయలుదేరారు. వీరు సమాజంలోని విషయాలనన్నిటినీ హేతు వాదంనుండి, మానవతా వాదం నుండి పరిశీలించి అన్యాయమైన విషయాలను సాహసంతో ఖండించి, సమస్యలకు పరిష్కారాలను చూపి మార్గదర్శకులయ్యారు. ఇతర పాశ్చాత్య దేశాల్లో గల మేధావి వర్గానికి దీటైన వర్గమే ఇక్కడా వచ్చింది. ఈ మేధావి వర్గాన్ని "మధ్య తరగతి" వర్గం అని చాలామంది పేర్కొంటారు. కాని ఎమ్. ఎన్. శ్రీనివాస్ వీరిని "నూతన శిష్టజనులు" అని పేర్కోవడం గమనించదగింది. కేవలం మధ్యతరగతి మాత్రమే గాక సంస్కరణల్లో ధనిక వర్గం వారైన రాజా రామ్‌మోహన్ రాయ్, టాగూరులు పాల్గొనడంతో శ్రీనివాస్ ఆవిధంగా వాడారు.

పాశ్చాత్య దృక్పథంతో సంస్కరణను చేపట్టిన రాజా రామ్‌మోహన్ రాయ్, అతని అనుయాయులు తొలితరం వారు ఈ ఆచార సంస్కారాలను హేతు వాదంతో విశ్లేషించి, దురాచారాలను ఖండించి, సాంఘిక - మత సంస్కరణను ప్రోత్సహించారు. సంస్కరణల దశలో సంస్కర్తలు తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చేది. కార్వే రచించిన " ది న్యూ బ్రాహ్మిన్స్" (The New Brahmins) అనే గ్రంథంలో ఆ సమస్యలు విపులీకరించబడ్డాయి. కుల బహిష్కరణ అతి తీవ్రమైన శిక్ష. సాంప్రదాయ వాదులను ఎదుర్కోడానికి వారు శాస్త్రాలనే ఆధారంగా చూపేవారు. సతీ సహగమన నిషేధానికి వితంతు వివాహాలకు, సముద్ర ప్రయాణాలకు, యుక్తవయస్క వివాహాలకు అనుకూల, ప్రతికూల వాదాలు శాస్త్రాలనుంచే వచ్చాయి. ఆచారాల నిర్ణయంలో శాస్త్రం కంటే కులమే ప్రాధాన్యత వహించిందని తెలుసుకొని నూతన విద్యావంతులు హేతు వాదాన్ని, మానవతా వాదాన్ని ఆశ్రయించారు.

విద్యార్హతలు కల మధ్య తరగతి వర్గం అధికమవడంతో ఉన్నత ఉద్యోగాల్లో భారతీయులను నియమించాలనే కోరికను, తమ సంస్థల ద్వారా, కోరడం ప్రారంభించారు. సురేంద్రనాథ్ బెనర్జీ ఈ కోరికను తీవ్రస్థాయిలో తెల్పేవాడు. నూతన వృత్తి విద్యలకు వైద్య, న్యాయవాద, పత్రికారంగాల్లో భారతీయులు గుర్తింపు పొందసాగారు. న్యాయ వాదులు, ఉపాధ్యాయులు, వైద్యులు, సంపాదకులు, గుమాస్తాలు, అధికారులు గల మధ్యతరగతి వర్గమే జాతీయ స్వాతంత్రోద్యమంలో పాల్గొంది. రాజ్యాంగ పద్ధతిన సాగిన ఉద్యమంలో అనేకమంది పాల్గొనగా, కొందరు ఉగ్ర వాద ధోరణిని అనుసరించారు.

విద్యాధిక మధ్య తరగతి వర్గం ద్వంద్వ భావాలని బ్రిటిష్ వారిపట్ల, భారతీయ సమాజం పట్ల చూపారు. ఒకవైపు భారతీయ సమాజంలోని దురాచారాలను ఎదిరిస్తూ, సంస్కరణలకై పాటుపడ్తూ మరోవైపు, తమ ప్రాచీన

సంస్కృతిని చూసి గర్వించేవారు. అనేక సాహిత్య ఆధారాలు, పురావస్తు ఆధారాలు బయటపడ్డంతో, భారతదేశం, సాంస్కృతికంగా హీనం కాదనే భావం వారికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. బ్రిటిష్ నాగరికతను మించిన ప్రాచీన నాగరికత, భారతదేశానికి ఉందనే నమ్మకం, వారికి ఆత్మధైర్యాన్నిచ్చి, స్వతంత్ర జాతిగా మెలగమని ఉద్బోధించింది. భారతీయ సాంప్రదాయాలను, వ్యవస్థలను, సంస్కృతిని, చరిత్రను వారు పునర్వ్యాఖ్యానించసాగారు. పాశ్చాత్య వస్తువును, భావజాలాన్ని, సంస్థలను గ్రహించి ఆనమూనాలో స్వదేశీ విషయాలను వీక్షించారు. ఆత్మ విమర్శ, సహనం, సమన్వయ వాదం అధికమయ్యాయి.

ఇక బ్రిటిష్ వారిపట్ల కూడా భారతీయులు ద్వంద్వ స్వభావాన్ని ప్రదర్శించారు. వారి క్రమశిక్షణను, వ్యవస్థా పద్ధతులను రాజకీయ శక్తిని, ఆర్థిక ఉన్నతిని, సేవా దృక్పథంతో పనిచేసే మిషనరీల విద్యా, వైద్య కార్యకలాపాలను మెచ్చుకుంటూనే, బ్రిటిష్ వారు పాటించే జాతి విచక్షణను, మిషనరీల క్రైస్తవీకరణను విమర్శించేవారు.

ఈవిధంగా భారతీయ విద్యాధిక మధ్యతరగతి పాశ్చాత్యులకు భారతీయుల గూర్చి, భారతీయులకు పాశ్చాత్యుల గూర్చి తెలిపి వారధిగా ఉండేవారు. పశ్చిమ భావ వ్యాప్తికి దోహదపడి, వీరు పాశ్చాత్యీకరణకు, లౌకికీరణకు దోహదం చేశారు.

## 21.5 సంస్కృతీకరణ

బ్రిటిష్ పాలనలో అనేక వృత్తుల వారు, అనేక కులాలవారు వ్యవసాయ రంగంపై మొగ్గు చూపారు. ఆర్థిక స్థితిననుసరించి యాజమాన్య రైతులుగా గాని లేదా వ్యవసాయ కూలీలుగాగాని జీవనాన్ని గడపసాగారు. సంఖ్యా పరంగా అధికంగా ఉన్న వ్యవసాయ వర్గాలు, తమ సాంఘిక హోదాను పెంచుకునే యత్నాలను చేశాయి. ఆర్థిక అంతస్థుతోబాటు, సాంఘిక హోదాను పెంచుకునే ఈ దశలో సంస్కృతీకరణ ప్రధాన మార్గమైంది.

సంస్కృతీకరణ అంటే సామాజికంగా తమ కంటె ఉన్న హోదా ఉన్న కులాచారాలను, సాంప్రదాయాలను అనుకరించటం. సంస్కృతీకరణకు నమూనాను స్థానికంగా ప్రాబల్యంగల బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాల్లోని ఏదో ఒక దాన్నుంచి గ్రహించేవారు. సంస్కృతీకరణ దిశలో పయనించడం అంత తేలికకాదు. ఆహార పానీయాల్లో నిషిద్ధాలను వదిలివేయడం, ద్విజ కులాల్లో మాదిరిగా పండుగలు, పంతాపాలు సాంప్రదాయ పద్ధతిలో సంస్కారయుతంగా జరుపుకోడం. శుచి, అశుచిలను పాటించడం హీనమని భావించే వృత్తులను వదిలివేయడం దీనిలోని ప్రధాన అంశాలు.

ఎమ్. ఎన్. శ్రీనివాస్ అభిప్రాయంలో సంస్కృతీకరణ ఈ విధంగా జరుగుతుంది. సంఖ్యా బలం వల్లగాని, ఎక్కువ భూమిపై యాజమాన్య హక్కును ఉండడం వల్లగాని గ్రామ జీవనంలో ఒక కులం ప్రబలమైన కులంగా రూపొందుతుంది. పశ్చిమ బెంగాల్‌లోని సద్గోప్‌లు; గుజరాత్‌లోని పాటిదార్లు, రాజపుత్రులు; మహారాష్ట్రలోని మరాఠీలు, ఆంధ్రాలో కమ్మ, రెడ్డి కులాలు; మైసూర్‌లో ఒక్కలిగలు, లింగాయత్‌లు మద్రాస్‌లో వెల్లాల, పదైయాచి, కల్లర్‌లు, కేరళలో నాయర్‌లు ప్రబల కులాలుగా రూపొందిన వాటిలో ప్రముఖమైనవి. సాంప్రదాయకంగా, సంస్కారపరంగా కింది హోదాలో ఉన్న కులం, అది నూతనంగా ఆర్జించిన ఆర్థిక స్తోమతకు మధ్య ఉన్న అంతరాన్ని, ఆ కులం సంస్కృతీకరణం చెందడం ద్వారా పరిష్కరించుకోగలిగేది.

సంస్కృతీకరణ ద్వారా ఉన్నత హోదాను పొందే ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు కొన్ని చోట్ల ఆ కులం హింసకు గురి అయ్యేది. ఉత్తర బీహార్‌లోని ఆవుల కాపర్లగు అహీర్లు యజ్ఞోపవీతాన్ని ధరించి, క్షత్రియులమని ప్రకటించుకొనగానే, అక్కడి రాజపుత్రులు, భూమిహార్ బ్రాహ్మణులు వారిపై హింసకు పాల్పడ్డారు. కటక్, బాలసోర్‌ల్లోని గౌరలు తమ వృత్తి అయిన మేనాని మోయడం మాని, క్షత్రియులమని ప్రకటించుకొన్నారు.

స్థానికులగు ఖండాయత్‌లు కరన్‌ల కోపానికి వారు గురి అయ్యారు.

అవరోధాలను దాటి కులాలు సంస్కృతీకరణాన్ని చెందాయంటే దీనికి కొన్ని కారణాలున్నాయి. ఎక్కువ సాంఘిక హోదాని పొందాలని, పైకులాలవారు తమపై చూపే గాంభీర్యాన్ని, ఆధిక్యాన్ని తిరిగి చూపాలనే కోరిక దీనికి కారణం. జనాభా లెక్కల సేకరణలో కులాలు మారిన తీరు తెన్నులు స్పష్టంగా కన్పిస్తాయి. పాశ్చాత్యీకరణం ద్వారా అధిక హోదాను పొందాలంటే, అధిక సమయాన్ని, ధనాన్ని, యత్నాన్ని, బ్రిటిష్ అధికారులతో మెరుగైన సంబంధాలు ఆవశ్యకంగా కావాలి. ఆంగ్ల విద్య నేర్చుకోవాలి. కాని సంస్కృతీకరణానికి అంత ప్రయత్నం అవసరం లేదు. ధనిక వర్గానికి చెందిన వారు, క్రైస్తవ మతం స్వీకరించిన వారు పాశ్చాత్యీకరణను అనుకరించగా, మధ్యతరగతి వర్గాలు సంస్కృతీకరణనే ఎంచుకున్నారు.

నిశ్శబ్దంగా సాగే ఈ చలనాల వల్ల సామాజిక వ్యవస్థలో గల హోదాల్లో తేడాలు వచ్చాయి తప్ప, సామాజిక వ్యవస్థలో మార్పు రాలేదు. అయితే, సామాజికంగా వెనుకబడ్డ వర్గాలు సాగించిన బ్రాహ్మణేతర ఉద్యమం, హరిజనుల ఉద్యమం సాంఘిక నిర్మాణాన్ని తీవ్రంగా ప్రశ్నించినా, తిరిగి సర్దుబాటు ధోరణినే చూపాయి.

## 21.6 సంగ్రహంగా

సంఘ వ్యవస్థలోని ముఖ్య అంగాలైన గ్రామం, కులం, కుటుంబాల్లో మార్పులు వచ్చాయి. ప్రజల్లో సగభాగమైన స్త్రీలు అభివృద్ధివైపుగా పయనించనారంభించారు. నూతన సామాజిక వర్గాలు ఉదయించాయి. పాత వర్గాలు కూడా మార్పులకు లోనైనాయి. సామాజిక హోదాల్లో తేడాలు వచ్చాయి.

BRAOU

## 21.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. భారతీయ సామాజిక వ్యవస్థలో కల్గిన మార్పులను తెలియజేయండి.
2. బ్రిటిష్ పాలనలోని నూతన సామాజిక వర్గాలను గూర్చి రాయండి.
3. బ్రిటిష్ పాలనలో ఆధునికత వైపుగా ముందంజ వేసిన స్త్రీలను గూర్చి తెలియజేయండి.

II ఈ క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

4. జమీందారీ వ్యవస్థ
5. స్త్రీల ఉద్యమం
6. విద్యాధిక, మధ్య తరగతి వర్గం
7. సంస్కృతీకరణం

## 21.8 ఉపయుక్త గ్రంథాలు


Bipin Chandra : **Nationalism and colonialism in Modern India**

Desai, A. R. : **Social Background of Indian Nationalism**

Kauak Mukurjee : **Women's Emancipation Movement in India**

Kuppuswamy, B. : **Social Change in India**

Padmini Sengupta : **The story of Women of India**

Srinivas, M. N. : **Social Change in Modern India**

శ్రీనివాస్ ఎమ్. ఎన్. : **ఆధునిక భారతదేశంలో సామాజిక పరివర్తన**


- రచయిత్రి : ఆచార్య పి. రామలక్ష్మి

# బాగం - 22 : సామాజిక సంస్థల మార్పులు

విషయక్రమం


22.0 లక్ష్యాలు

22.1 పరిచయం

22.2 కుటుంబ వ్యవస్థలోని మార్పులు

22.3 వివాహ వ్యవస్థలోని మార్పులు

 22.3.1 సతీ సహగమనం

 22.3.2 వితంతు వివాహాలు

 22.3.3 యుక్త వివాహాలు

22.4 కుల వ్యవస్థ

 22.4.1 గతిశీలత

 22.4.2 కుల సంఘాలు

 22.4.3 బ్రాహ్మణేతర ఉద్యమం

 22.4.4 అస్పృశ్యులు

22.5 మతం

 22.5.1 కారణాలు

 22.5.2 ఇస్లాం మతతత్త్వం

 22.5.3 హిందూ మతతత్త్వం

22.6 సంగ్రహంగా

22.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

22.8 ఉపయుక్త గ్రంథాలు


## 22.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు కింది విషయాలు తెలుసుకో గలగాలి.

- మారిన కుటుంబ వ్యవస్థ
- వివాహ వ్యవస్థలోని మార్పులు
- కుల వ్యవస్థలోని మార్పులు
- మతతత్త్వం

BRAOU

## 22.1 పరిచయం

సామాజిక సంస్థలైన కుటుంబం, వివాహం, కులం, మతం బ్రిటిష్ పాలనలో మార్పులకు లోనయ్యాయి. సమాజ సాంప్రదాయాలను ఎదిరించి సంస్కర్తలు మార్పులు తెచ్చారు. పటిష్టంగా అవి స్థిరపడడానికి ప్రభుత్వ చట్టాలను కూడా తెచ్చారు. ఆర్థిక వ్యవస్థలోని మార్పులవల్ల కూడా కొన్ని మార్పులు కుటుంబ వ్యవస్థలో ప్రవేశించాయి.

## 22.2 కుటుంబ వ్యవస్థలోని మార్పులు

సామాజిక సంస్థలైన కుటుంబం సాంప్రదాయాలను, సాంఘిక విలువలను తర్వాత తరానికి అందిస్తూ ఉంటుంది. ఈ సంస్థ తన సభ్యులకు ఆర్థిక, మానసిక శక్తిని ఇవ్వడమేగాక, సంఘంలోని ఇతర సభ్యులతో మెలగాల్సిన పద్ధతిని నేర్పుతుంది. భారతీయ కుటుంబ వ్యవస్థ రాకపూర్వం సమిష్టి కుటుంబంగా ఉండేది. వ్యక్తి, అతని భార్యా పిల్లలతో బాటు, అతని తల్లిదండ్రులు, ఇతర అన్నదమ్ముల కుటుంబాలు, ఇంకా ఆధారపడ్డ ఇతర బంధువులతో నుండిన కుటుంబాన్ని సమిష్టి కుటుంబమని వ్యవహరిస్తారు. భారతీయ దృక్పథంలో ఇల్లు అనేది అన్ని తరాలకు చెందిన సంస్థ. పూర్వతరమైన పితరులకు, రాబోయే పుత్రుల తరానికి నడుమతరం ట్రస్టీలుగా వ్యవహరిస్తారు. ఈ కుటుంబం వారు కొలిచే దేవతలు, ఉపయోగించే వంటగది, వాడే భోజనశాల, జీవనాధారమైన ఆస్తి - అన్నీ ఉమ్మడిగానే ఉంటాయి. కుటుంబ సభ్యులందరిలో పెద్ద వయసుగల పురుషుడుగాని, లేక అతని పెద్ద కుమారుడుగాని కుటుంబ యజమానిగా బాధ్యత వహిస్తారు. ఆ ఇంటి సాంఘిక హోదాను, సాంప్రదాయాలను పరిరక్షించడం పితృస్వామ్య వ్యవస్థలో అతని విధి. వివాహాలు అంతర్వర్ణ వివాహాలుగానే కొనసాగేవి. చిన్న వయస్సులోనే వివాహాలు జరిగేవి. సాంప్రదాయకమైన వృత్తులను అనుసరిస్తూ జీవనం సాగించేవారు. భోజన పద్ధతిపై నియమ నిబంధనలుండేవి. అంతర్వర్ణ భోజనాలు, అంతర్వర్ణ వివాహాలు సాగేవి. కుటుంబాలు సాధారణంగా స్వగ్రామం వీడడానికి అంగీకరించేవి కావు.

బ్రిటిష్ పాలనలో సమిష్టి కుటుంబాలు త్వరలోనే వ్యష్టి కుటుంబాలుగా మారసాగాయి. పాశ్చాత్యీకరణ వల్ల, నగర జీవనం వల్ల కుటుంబాల్లో మార్పులు అధికమయ్యాయి. పాశ్చాత్యీకరణ చెందిన మధ్యతరగతి విద్యాధిక వర్గ కుటుంబాలు ఎక్కువ మార్పులకు లోనయ్యాయి. క్రమబద్ధంగా లభించే ఆదాయం వల్లా నేర్చిన విద్యవల్ల లౌకికీకరణ, ఆధునీకరణ జీవన శైలిలో అధికమైంది. ఆచార సాంప్రదాయ పద్ధతులు, పూజలు పండుగల నిర్వహణలు గ్రామాల్లో పాటించినట్లుగా పట్టణ కుటుంబాలు పాటించలేవు. ఇతర కుల, భాషా, మత వర్గాలతో కలిసి మెలగడం అనివార్యం కనక ఆ సంబంధాలు సరళంగానూ, స్నేహంగానూ ఉంటాయే తప్ప కాఠిన్యం ఉండదు. సమష్టి కుటుంబాల్లో తండ్రి నిర్ణయాధికారం చేయగా, వ్యష్టి కుటుంబాల్లో ఇల్లు నడిపే వ్యక్తిగా భార్యకు విలువ ఉంటుంది.

విద్య కోసం, ఉపాధి కోసం పట్టణాలు చేరిన కుటుంబాలు దురాచారాలను ఎదిరించి, సంఘ బహిష్కరణను సహితం భరించి, సంస్కరణలను ఆరంభించారు. వ్యష్టి కుటుంబాల నుండి వచ్చిన స్త్రీలే అధిక సంఖ్యలో సంఘ సంస్కరణోద్యమంలోనూ, జాతీయోద్యమంలోనూ స్త్రీ ఉద్యమ నిర్మాణంలోనూ పాల్గొన్నారు. నూతన ఉపాధులకై పట్టణాలకు, నగరాలకు వెళ్లడం ద్వారా సాంప్రదాయాలను గ్రామాల్లో మాదిరిగా పాటించలేదు. సాంకేతిక రంగాలైన రైల్వేల్లోనూ, పరిశ్రమల్లోనూ, ఫ్యాక్టరీలలోనూ కలసి పనిచేయడం వల్ల సాంఘిక వర్గాల మధ్య అంతరాలు

కొంత తగ్గడానికి అవకాశమేర్పడింది. ఇక జాతీయోద్యమం వల్ల ఎక్కువ కుటుంబాలు ప్రభావితమయ్యాయి. ప్రదర్శనలు ఊరేగింపుల్లో పాల్గొనడం, జైళ్లలో కలసి ఉండడం వల్ల పరస్పర స్నేహభావం ఏర్పడి, సాంఘిక సంబంధాల్లో సరళత ఏర్పడింది.

విదేశాలకు వెళ్లి పాశ్చాత్య విద్య నభ్యసించిన వారిలో కొందరు మాత్రమే ప్రాయశ్చిత్త విధులు చేసికోగా, కొందరు ఆ సాంప్రదాయాన్ని ఎదిరించి నిలిచారు. నూతన ఉపాధి అవకాశాలు, పరిశ్రమల ద్వారానూ, రైల్వేల ద్వారాను రావడంవల్ల కుల వృత్తులను మాత్రమే అవలంబించాల్సిన అవసరం తొలగింది. ప్రభుత్వ చట్టాల వల్ల కూడా సంస్కరణలకు బలం చేకూరింది.

ప్రభుత్వ చట్టాలు కూడా కుటుంబంలో జరిగే మార్పులను ప్రోత్సహించాయి. సతీ సహగమన నిషేధ చట్టం, బాల్య వివాహ నిషేధం, మొదలైనవి సంస్కరణలకు అండగా నిలిచాయి.

ఈ విధంగా బ్రిటిష్ పాలనలో పాశ్చాత్య విద్య, సంస్కరణలు, ప్రభుత్వ చట్టాలు, పట్టణీకరణం, నూతన సాంకేతిక ఉపాధి కల్పనలు, జాతీయోద్యమం కలసి వ్యష్టి కుటుంబాలను అధికం చేసాయి. ఆధునిక మార్పులకు కుటుంబ వ్యవస్థను గురి చేశాయి.

## 22.3 వివాహ వ్యవస్థలోని మార్పులు

సమాజం నిరంతరంగా కొనసాగడానికి మానవులు ఏర్పరచుకొన్న సాంఘిక వ్యవస్థే వివాహం. భారతీయ సమాజంలో కుల వ్యవస్థకు గల ప్రాధాన్యతను బట్టి వివాహాలు సాధారణంగా సవర్ణ లేక అంతర్వర్ణ వివాహాలే జరుగుతాయి. దక్షిణ భారతదేశంలో రక్తసంబంధీకుల వివాహాలు ఆమోదించబడ్డాయి. కాని ఉత్తర భారతదేశంలో ఇవి నిషిద్ధాలు. దేశమంతా కూడా సగోత్ర వివాహాలు నిషేధం.

వివాహ విధి, శాస్త్ర ప్రకారంగాని, ప్రత్యేక సాంప్రదాయ రీతులను అనుసరించి గాని సాగేది. బ్రిటిష్ పాలనలో కూడా అధిక సంఖ్యలో ఈ వివాహ పద్ధతులే కొనసాగాయి. అయితే, బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం తమవైన వివాహ విధి నిర్వహణ పద్ధతులను ఏర్పాటు చేసికొన్నాయి.

అయితే వివాహ వ్యవస్థలోని వివాదాస్పద అంశాలైన సతీ సహగమనం, వితంతు వివాహాలు, యుక్త వివాహాలు, వివాహ విచ్ఛేదంలాటి విషయాల్లో బ్రిటిష్ ప్రభుత్వం, సంఘ సంస్కర్తల సహకారంతో చట్ట రూపేణా మార్పులను ప్రవేశపెట్టింది.

### 22.3.1 సతీ సహగమనం

వివాహ వ్యవస్థలోని క్రూరమైన ఆచారమైన దీన్ని విజ్ఞానవంతులైన భారతీయ సంస్కర్తలు వ్యక్తీకరించిన ప్రజాభిప్రాయం ద్వారానూ, ప్రభుత్వ చట్టాల ద్వారానూ బ్రిటిష్ ప్రభుత్వం నిరోధించ గలిగింది.

బెంగాల్ ప్రాంతంలో తీవ్రంగానూ, మద్రాస్ ప్రాంతంలో తరచుగానూ, బొంబాయి రాష్ట్రంలో అరుదుగానూ సహగమనాలు జరుగుతూ ఉండేవి. అన్ని కులాల వారు ఈ ఆచారాన్ని పాటించేవారు. భర్తను కోల్పోయిన స్త్రీ దగ్గర బంధువులను, సాంప్రదాయాన్ని ఎదిరించలేకపోవడంతో, ఈ సాంప్రదాయం కొనసాగింది. ఆమెను పోషించే బాధ్యత ఆమె బంధువులకు తీరడమేగాక ఆమె ఆస్తి వారికి చెందేది. లార్డ్ బెంటింక్ ఈ ఆచారాన్ని డిసెంబర్ 4, 1829న రద్దు చేశాడు. ఇటువంటిదే మద్రాస్ రాష్ట్రంలో ఫిబ్రవరి 2, 1830న అమలు చేశారు.

చట్టపరంగా నిషేధం జరిగినా అచ్చటచ్చట 'సతి' కొనసాగింది. విద్యా, వైజ్ఞానిక ప్రగతి వల్ల, సంస్కర్తల కృషివల్ల 1870 తర్వాత ఈ ఆచారం అరుదైంది.

### 22.3.2 వితంతు వివాహాలు

రాజా రామ్‌మోహన్ రాయ్ స్త్రీలను సతీ సహగమన సాంప్రదాయం నుండి రక్షణ కల్పించాడు. ఆ స్త్రీకి తిరిగి వైవాహిక జీవితాన్ని ఇచ్చే ప్రయత్నాన్ని పందొమ్మిదో శతాబ్దంలో అనేకమంది చేపట్టారు. తూర్పున ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు, పశ్చిమాన రెనడే, కార్వేలు, దక్షిణాన కందుకూరి వీరేశలింగం వితంతు వివాహ ఉద్యమాన్ని అనేక శ్రమలకోర్చి నడిపారు. వితంతు శరణాలయాలను స్థాపించడం, వితంతువులకు విద్య నేర్పించడం, ఉద్యోగాల్లో ప్రవేశించమని ప్రోత్సహించడం, సంస్కరణ వివాహాలు చేసుకున్న వారికి కావాల్సిన ఆర్థిక, మానసిక సహాయాన్ని అందివ్వడం, వితంతు వివాహాలను సాంప్రదాయకులు చేసే విధంగా ఆడంబరంగా చేయడం సంస్కర్తలన్ని ప్రాంతాల్లో చేశారు. ఈ ఉద్యమం నిర్వహణకై అన్ని ప్రాంతాల్లోనూ "వితంతు వివాహ సంస్థలు" ఏర్పడ్డాయి.

### 22.3.3 యుక్త వివాహాలు

బాల్య వివాహాలు వివాహ వ్యవస్థలోని మరో సాంఘిక దురాచారం. బాల్య వివాహాల కారణంగా బాల పత్నులు, బాల వితంతువులు, బాల మాతలు పందొమ్మిదో శతాబ్దంలో ఎక్కువగా ఉండేవారు.

ఈ అంశంపై ప్రజల దృష్టిని భారతీయ సంస్కరణ సంఘం అధ్యక్షుడైన కేశవచంద్ర సేన్ మరల్చాడు. ఇతడు కలకత్తాలోని వైద్యులను సంప్రదించి బాలికకు కనీస వివాహ వయస్సు 14 సంవత్సరాలైనా ఉండాలని చెప్పాడు. కేశవ్‌చంద్ర సేన్ తర్వాత బెహ్రాంజీ మలబారీ ఈ ఉద్యమాన్ని బలపర్చాడు. సామాజిక మార్పు రావడమే ఈ ఆచార రద్దుకు కారణమవుతుందని భావించిన ఇతడు ప్రభుత్వ జోక్యాన్ని గాక, ప్రభుత్వ మద్దతును మాత్రమే కోరాడు. అనేక ప్రాంతాల్లో ఉపన్యాసాలను ఇచ్చి, బాల్య వివాహ రద్దును కోరుతూ తీర్మానాలు చేయించేవాడు. మలబారి ఉద్యమాన్ని బలపరచిన వారిలో ఎమ్.జి. రెనడే, కె.టి. తెలాంగ్, ఆర్.జి. భండార్కర్, నారాయణ చంద్రావార్కర్, దివాన్ బహదూర్ రఘునాథరావు, మహేంద్రలాల్ సర్కార్ ముఖ్యులు.

బాల్య వివాహ నిషేధానికి స్త్రీలు, స్త్రీ సంఘాలు చురుకైన పాత్ర పోషించాయి. వైద్య వృత్తిలో ఉన్న ఏభై ఐదు మంది స్త్రీ వైద్యులు వివాహ వయస్సు కనీసం పదునాల్గు సంవత్సరాలైన బాలికకు ఉండాలని వైశ్రాయికి విజ్ఞప్తి చేయడం, రెండు వేల మంది స్త్రీలు విక్టోరియా రాణికి విజ్ఞప్తి చేయడం దీనికి ఉదాహరణలు. శ్రీమతి డోరతీ జినరాజదాస, శ్రీమతి సరళాదేవి చౌదురాణి, డాక్టర్ ముత్తు లక్ష్మి రెడ్డి వివాహ వయస్సు పెంపుకై కృషిచేశారు.

శ్రీ హరవిలాస్ శారదా కృషివల్ల 1929లో శారదా చట్టం వచ్చింది. దీనివల్ల బాలికకు కనీస వివాహ వయస్సు పదనాల్గు సంవత్సరాలుగా నిర్ణయించబడింది. ఈ శాసనం 1930 నుండి అమల్లోకి వస్తుందనగానే వేల సంఖ్యలో కనీసం వయసులేని బాలికలకు వివాహాలు జరిగాయంటే సాంప్రదాయకుల వ్యతిరేకతా తీవ్రతను గమనించ వచ్చు. కాలక్రమేణా ఈ శాసనానికి గౌరవం పెరిగి, ప్రభావం అధికమైంది.

సాంఘిక దురాచారాలైన సతీ సహగమనం, వితంతువుల దుస్థితి, బాల్య వివాహాలను గమనిస్తే, ఒక అంశం కంటే మరో అంశానికి ప్రజా చైతన్యం అధికమవడం దురాచార నిర్మూలనకు కృషి అధికం కావడం కనిపిస్తుంది. అదే విధంగా దురాచార నిర్మూలన వల్ల లభించే వారి సంఖ్య అధికమౌతూ వచ్చింది. వివాహ వ్యవస్థలోని మార్పులు

BRAOU

ప్రధానంగా ప్రజాభిప్రాయ వ్యక్తీకరణ ద్వారా వచ్చాయి. సంస్కర్తల అభిప్రాయాన్ని అనుసరించి, ప్రభుత్వ శాసనాలు వచ్చాయి. కాలం గడిచే కొద్దీ, శాసనాలు శిరోధార్యమౌతూ వచ్చాయి, బహు భార్యాత్వానికి వ్యతిరేకత కూడా ప్రజాభిప్రాయం ద్వారానే వ్యక్తమై, శాసనం ద్వారా నిషేధించబడింది.

## 22.4 కుల వ్యవస్థ

భారతీయ సాంఘిక వ్యవస్థల్లో కుల వ్యవస్థ అత్యంత ప్రముఖమైంది. పుట్టుకను బట్టి ఆ వ్యక్తి చేయబోయే వృత్తిని, చేసికోవాల్సిన వివాహ ఎంపికను సమాజం నిర్ణయిస్తుంది. అంతస్తుల వారిగా ఉండే శిఖరాన్ని పోలిన ఈ కుల వ్యవస్థలో వివిధ కులాలకు, ఉపకులాలకు వారి వారి ప్రత్యేక హక్కులు ఉండేవి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అనబడే చాతుర్వర్ణ వ్యవస్థ, అనేక ఉపకులాలతో అదే వరసక్రమాన సాంఘిక హోదా ఉంటుంది. వివాహాలు, సహపంక్తి భోజనాలు సవర్ణాల వారికే పరిమితమై ఉండేవి. 'హిందూ మతానికి ఉక్కు కవచం' వంటి ఈ వ్యవస్థ కూడా మార్పులకు లోనైంది. సంఘ సంస్కర్తలందరూ దీన్ని వ్యతిరేకించారు.

### 22.4.1 గతిశీలత

భారతీయ సంస్కర్తలందరూ ఆశించినట్లుగా కుల వ్యవస్థ నిర్మూలించబడకపోయినా, "కుల చలనాలు" సంఘంలో ఉన్న కుల హోదాలో మార్పులు జరిగాయి. అతి నిశ్శబ్దంగానూ, విప్లవాత్మకంగానూ జరిగిన ఈ మార్పులు సంస్కృతీకరణ ద్వారాగాని అధునీకరణ ద్వారాగాని వ్యక్తమయ్యేవి. ఆర్థికపరమైన ఉన్నతిని పొందిన కొన్ని దిగువ కులాలు, ముఖ్యంగా రైతు కుటుంబాలు సంస్కృతీకరణ ద్వారాగాని, ఆధునికీకరణ ద్వారా గాని సాంఘిక హోదాను పెంచుకునే యత్నాలు చేశాయి.

సంఖ్యాబలం వల్లగాని, అధికమైన భూమి తమ ఆక్రమణలో ఉండడం వల్ల గాని గ్రామంలో ఒక కులం ప్రాబల్య కులంగా మారుతుంది. ఒక్క లింగ, లింగాయతులు మైసూర్‌లోనూ, రెడ్డి, కమ్మలు ఆంధ్రాలోనూ, వెల్లలాలు, కల్లర్‌లు మద్రాస్‌లోనూ, పాటిదార్లు గుజరాత్‌లోనూ, నాయర్లు కేరళలోనూ, సద్గోప్‌లు పశ్చిమ బెంగాల్లోనూ ముఖ్యులు.

ఉన్నత సామాజిక హోదాను కోరే ప్రయత్నం సాధారణంగా సంస్కృతీకరణ విధానాన్ని అనుసరించేవారు. సంస్కృతీకరణ నమూనాగా ఆ కులం అనుసరిస్తున్న జీవన విధానానికి దగ్గరగా గల నమూనాను బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాల నుండి ఎంచుకునేవారు. యజ్ఞోపవీతాన్ని ధరించడం, నిషేధ ఆహార పానీయాలను వదిలివేయడం, ద్విజ కులాలు జరుపుకునే విధంగా పండుగలను, సంతాపాలను సాంప్రదాయ పద్ధతిలో సంస్కారయుతంగా జరుపుకోవడం, శుచి అశుచులను పాటించడం హీనమని భావించే వృత్తులను వదిలివేయడం చేసేవారు. వెట్టి చాకిరి, మేనా మోయడం, ఉత్సవాలప్పుడు డప్పుకొట్టడం మొదలైనవి హీనమని భావించే వృత్తుల్లో కొన్ని. ఒరిస్సాలో గౌరలు మేనా మోయడం మానినప్పుడు స్థానికుల హింసకు గురి అయ్యారు.

ఒక కులం సాంఘికమైన ఉన్నత హోదాను ప్రకటించుకున్నప్పుడు స్థానికుల అంగీకారం అవసరమవుతుంది. వారంతా ఒకే ప్రాంతంలో నివసించడం వల్లా, ఒకే భాష మాట్లాడడం వల్లా, ఒకే దేవతలను కొలవడం వల్లా, ఒకే రకమైన నమ్మకాలు, సాంప్రదాయాలు ఉండడం వల్ల, ఒకే పద్ధతిలో పండుగలు జరుపుకోడం వల్లా వారందరిలో విషమస్తరీయ దృఢత్వం లేక లంబ దృఢత్వం (Vertical solidarity) ఉంటుంది. లంబ దృఢత్వం సమతల దృఢత్వం (Horizontal solidarity) కంటే ఎక్కువ శక్తిమంతమైంది. సమస్తరీయ దృఢత్వం అంటే ఒక కులానికి చెందిన వారంతా వివిధ ప్రదేశాల్లో నివసించినప్పటికీ, వారిలో ఉండే ఐక్యత. కాని భిన్న భాషలు, భిన్న

BRAOU

సాంప్రదాయాలు, భిన్న సాంఘిక హోదాలు కుల పటిష్టతకు భంగం తెస్తాయి. దీనికి ఉదాహరణంగా చెప్పాలంటే, దేశమంతా బ్రాహ్మణులు అత్యున్నత సాంఘిక హోదాలో ఉన్నప్పటికీ, కర్నాటకలోని మార్క బ్రాహ్మణులు, గుజరాత్‌లోని తపోధన్ బ్రాహ్మణులు, పంజాబ్‌లోని బ్రాహ్మణులకు గల సామాజిక హోదా తక్కువే. సామాజిక హోదాలో తేడా మాత్రమే గాక, భోజన విషయంలో కూడా, ఇతర ప్రాంతాల్లోని బ్రాహ్మణుల ఆచారానికి విరుద్ధంగా, బెంగాల్ కాశ్మీరుల్లోని బ్రాహ్మణులు మాంసాహారులు.

స్థానికంగా ఎదిగిన ప్రాబల్య కులం ఆర్థిక శక్తిని పొంది, గ్రామస్థాయిలోనైనా రాజకీయ శక్తిని సంపాదించుకొని, తాము అనుకరించే వృత్తికి దగ్గరగా ఉండే అగ్ర కులాన్ని నమూనాగా ఎంచుకొని సంస్కృతీకరణం చెందేది.

పద్దెనిమిదో శతాబ్దంలో గుజరాత్‌లో పాటిదార్‌లనే రైతు కులం ప్రాబల్యంలోకి వచ్చింది. కున్బీ వంశీకులు గ్రామం అంతా కలిపి ప్రభుత్వానికి చెల్లించే పన్ను విషయంలో బాధ్యత వహించడంతో, వీరిని స్థానికులు గౌరవంతో పాటిదార్ అని పిలిచేవారు. కొంత కాలానికి అదే కులం పేరుగా స్థిరపడింది. వీరు క్షత్రియ కుల హోదాకు పెరిగి, రాజరిక ఆచారాలను పాటిస్తున్నారు. కేరళలోని నాయర్లు కొందరు క్షత్రియులుగా పరిణితి చెంది, కాలికట్, పాల్ఘాట్, కొచ్చిన్‌లలో రాజవంశాలు స్థాపించుకున్నారు. క్షత్రియులుగా చాలా కాలం కొనసాగిన పాటిదార్లు వైశ్య అంతస్థును కోరుకోగా, గుజరాత్‌లోని కైరా జిల్లాకు చెందిన బారియాలు పూర్వ పాటిదార్ల శైలిని అనుకరిస్తూ ఎర్ర తలపాగాని, కత్తిని ధరిస్తున్నారు.

ప్రతి పది సంవత్సరాలకు జరిగే జనాభా లెక్కల్లో, సామాజిక హోదాల్లో మార్పులు వచ్చిన అనేక కులాలు కనిపిస్తాయి. కమ్మరి వృత్తి ననుసరించే కమార్‌లు 1921లో క్షత్రియులుగానూ, 1931లో బ్రాహ్మణులుగానూ నమోదయ్యారు. కంసాలి వృత్తిచేసే సోనార్ వర్గాల్లో 1911, 1921 క్షత్రియులుగానూ, 1931లో బ్రాహ్మణులుగానూ మార్పుచెందారు. 'సూత్రదార్', అనే వడ్రంగి వృత్తివారు 1911, 1921లలో వైశ్యులుగానూ, 1931లో బ్రాహ్మణులుగానూ మార్పు చెందారు. నీళ్లు మోయడం, మేనా మోయడం చేసే రావనికహార్ వృత్తి వర్గం 1921లో వైశ్యులుగానూ, 1931లో క్షత్రియులుగానూ మారారు. చెప్పులు కుట్టే వృత్తి ననుసరించే మోచిలు, తోళ్లు శుభ్రపరచే చమార్‌లు 1921 లెక్కల్లో బైద్యరిషిగా నమోదై, 1931 లెక్కల నాటికి క్షత్రియులయ్యారు. వర్తక వృత్తి నవలంబించిన ఖత్రీలు 1921లో క్షత్రియులుగానూ, 1931 లెక్కల్లో వైశ్యులుగానూ నమోదయ్యారు. తెలిక వృత్తి నవలంబించిన తేలీలు 1911లో రాథోర్ - తేలీగా నమోదైనా, 1931 నాటికి రాథోర్ వైశ్యులుగా మారారు.

BRAOU

### 22.4.2 కుల సంఘాలు

బ్రిటిష్ పాలనలో భావ ప్రసార సాధనాల అభివృద్ధి వల్ల కులాల్లో దారుఢ్యం పెరిగి, కుల సంఘాల ఏర్పాటుకు దోహదపడింది. అహిర్లు పంజాబ్ నుండి బెంగాల్ వరకు గల గోవుల కాపర్లను ఐక్యం చేశారు. ఇరవై శతాబ్దం నుండి బలపడ్డ కుల సంఘాలు కులాల సామాజిక, ఆర్థిక అంతస్థును పెంచడానికి కృషి చేశాయి. సంఘ సంస్కరణలను అమలుచేయటం, పత్రికలను నడపడం, పాశ్చాత్య విద్యను ప్రోత్సహించడం, పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలివ్వడం, వసతి గృహాలను నిర్మించడం ఈ సంఘాలు చేశాయి.

జనాభా లెక్కల సేకరణలో, 1901 నుంచి కులాల స్థాయిలను, వివిధ కులాల సంబంధాలను కచ్చితంగా నమోదు చేసే ప్రయత్నం చేయమని, జనాభా లెక్కల కమీషనర్‌గా ఉన్న సర్ హర్బర్ట్ రిస్లే ఆదేశించారు. కులాల ఆధిక్యతలను కూడా జనాభా లెక్కల్లో పరిగణిస్తారని తెలియడంతో, కుల సంఘాలు అర్జీలను పంపడం ఆరంభించాయి. తమ హోదాను పెంచమని ఈ అర్జీలు తెలిపేవి. బ్రిటిష్‌వారు దేశ ప్రజల దృష్టిలో ఉన్నత సాంఘిక హోదాని కలుగజేసేవారుగా వ్యవహరించారు. కుల సభలు 1911 నుండి అధికమై, 1919 నాటి జనాభా లెక్కల

సేకరణ నాటికి అవి దేశమంతటా వ్యాపించాయి. ఉన్నత హోదా కావాలనే ధోరణి నానాటికి ఎక్కువ అవుతుండడంతో, 1941 నాటి కమీషనర్ కులానికి సంబంధించిన అంశాన్ని తీసివేశారు. కుల సంఘాల వల్ల సంస్కరణ విస్తరించినప్పటికీ, కులాల అంతరాయం పెరిగింది.

### 22.4.3 బ్రాహ్మణేతర ఉద్యమం

దక్షిణ భారతదేశాన ఉన్నత సాంఘిక హోదాకై 'ఆత్మగౌరవ పోరాటం' సాగింది. దక్షిణ మహారాష్ట్రలోనూ, తమిళ ప్రాంతాల్లోనూ, ఆంధ్ర ప్రాంతంలోనూ ఈ ఉద్యమం వచ్చింది. ఆర్యులు ఉత్తర భారత ప్రాంతం వారిని దక్షిణ ప్రాంతమంతా ద్రావిడులకు చెందిందని తమిళ ప్రాంతంలోని నాయకులు భావించారు. అందుకని వారు ఉత్తర భారతాన్ని, సంస్కృత భాషను వ్యతిరేకించారు. మత, మతేతర రంగాల్లో బ్రాహ్మణులకు గల ఆధిక్యతను కూడా ఈ ఉద్యమం ప్రశ్నించింది. క్రతువులపైనా, వేద సాహిత్యం పైనా, పౌరోహిత్యం పైన వారికి గల ప్రత్యేక హక్కును ఎదిరించడంతో పాటు, సమకాలీన సమాజంలోని రాజకీయాల్లోనూ, ఉన్నత విద్యలోనూ, ఉద్యోగాల్లోనూ, వృత్తుల్లోనూ కనిపిస్తున్న ఆధిక్యతను ప్రశ్నించింది. ఈ విధంగా ఈ ఉద్యమం బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమంగానూ, కాంగ్రెస్ వ్యతిరేక ఉద్యమంగానూ ఉంది. ఈ ఉద్యమాన్ని ఉచ్ఛస్థితికి పెరియార్ రామస్వామి నాయకర్ నాయకత్వంలో ద్రవిడ కజగం తీసుకొని వెళ్లింది. అయితే, ఆంధ్రాలో ఈ ఉద్యమం పూర్తిగా ద్రావిడ జాతి సిద్ధాంతంలో ముడిపడక, ఒకే భాష మాట్లాడే ప్రజలు ఏకమవ్వాలని ఉద్బోధించారు. అందుచేత ఆంధ్రాలో వచ్చిన బ్రాహ్మణేతర ఉద్యమంలో బ్రాహ్మణ వ్యతిరేకతగాని, కాంగ్రెస్ వ్యతిరేకతగాని, సంస్కృత వ్యతిరేకతగాని తమిళ ప్రాంతంలో ఉన్నంత తీవ్ర స్థాయికి పోలేదు. పైగా ఆంధ్రాలోని ఉద్యమ నాయకులకు బ్రాహ్మణ కుటుంబాలతో వ్యక్తిగత స్నేహాలు, కాంగ్రెస్‌తో పటిష్టమైన సంబంధం, సంస్కృత విద్య పట్ల ఆదరం ఉన్నాయి. అందుచేత ఆంధ్రాలో ఇది బ్రాహ్మణ వ్యతిరేకతగా కాక, బ్రాహ్మణ సిద్ధాంతాలపై వచ్చిన తిరస్కారం మాత్రమే.

బ్రాహ్మణేతరులు నవంబర్ 20, 1916న మద్రాస్‌లో సమావేశమై, తమ అభివృద్ధికై కృషి చేయ నిశ్చయించుకుని, "సౌత్ ఇండియన్ పీపుల్స్ అసోసియేషన్" (South Indian Peoples Association) గా ఏర్పడ్డారు. ఇంగ్లీష్, తమిళ, తెలుగు భాషల్లో పత్రికను నడపాలని నిశ్చయించుకున్నారు. "జస్టిస్" (Justice) అనే పత్రికను నడుపుతూ, 'జస్టిస్ పార్టీ'ని (Justice Party) ఏర్పాటు చేసికొన్నారు.

ఉన్నత సాంఘిక హోదాకై సాగిన ఈ ఆత్మగౌరవ పోరాటంలో పానగల్లు రాజుల, రాజా రామారాయణిం గారు, రావు బహద్దూర్ పి. త్యాగరాజ చెట్టియార్ ప్రముఖ పాత్రను వహించారు. మాంటెంగు ఛెమ్స్ ఫర్డ్ సంస్కరణలకు అనుగుణంగా జరిగిన ఎన్నికలను కాంగ్రెస్ బహిష్కరించింది. అప్పుడు జస్టిస్ పార్టీ తన అభ్యర్థులను నిలిపి, మద్రాస్ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని సైతం నడిపింది. రాజా రామారాయణింగారు మద్రాస్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఉన్నత ఉద్యోగాల్లో బ్రాహ్మణేతరులు "రిజర్వేషన్" (Reservation) పొందగలిగారు.

అయితే, ఈ పార్టీ ఎక్కువ కాలం మనలేదు. 'వర్గా'నికి ఆధిక్యతనిచ్చే వామపక్షాలు ఆదరణ పొందడం వల్ల, బ్రాహ్మణేతరులు చాలామంది కాంగ్రెస్‌లో జాతీయ వాదులుగా ఉండడంవల్ల ఈ ఉద్యమంలో జస్టిస్ పార్టీ కొనసాగలేదు. కాని బ్రాహ్మణాధిక్యతపైనా, వారి సాంఘిక హోదాపైనా నిర్మాణాత్మకంగా జరిగిన తొలి పోరాటంగా ప్రఖ్యాతి చెందింది. వీరు కుల వ్యవస్థలోని అసమానతను ప్రశ్నించారు తప్ప, కుల నిర్మూలనను ప్రతిపాదించలేదు. ఈ ఉద్యమాన్ని సాంప్రదాయ వాదులైన రాజులు, జమీందార్లు, భూస్వాములు నడపడంతో, వారు బ్రాహ్మణ ఆధిక్యతను ప్రశ్నించడంలో అతి వాదాన్ని చూపినా, తమకంటే దిగువనగల కులాలతో తిరిగి అదే

BRAOU

సాంప్రదాయాన్ని, అదే ఆధిక్యతను ప్రదర్శించారు.

### 22.4.4 అస్పృశ్యులు

కుల వ్యవస్థలో అట్టడుగున గల ఈ వర్గం అగ్రవర్ణాల వారి సాంఘిక వెలికి గురి అయ్యారు. విద్య ద్వారా వారిని అభివృద్ధిపరచే పనిని సంస్కర్తలు చేపట్టారు. సంఘ సంస్కరణోద్యమాలు, జాతీయ కాంగ్రెస్, 'ఆల్ ఇండియా హరిజన్ సంఘ్' (All India harijan Sangh) సమాన అవకాశాలు కలగజేయడానికి ప్రయత్నం చేశారు. అనేక శాఖలు ఉపశాఖలు గల ఈ వర్గాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ (1891-1956) సంఘటితపరచి, వారి సమస్యలపై ప్రజాదృష్టి కేంద్రీకృతమయ్యే ప్రయత్నం చేశాడు. "ఆల్ ఇండియా డిప్రెస్ క్లాసెస్ ఫెడరేషన్" (All India depressed Classes Federation) ని స్థాపించి, నడిపించాడు. నీటి కోసం సాగించిన మహద్ సత్యాగ్రహం, దేవాలయ ప్రవేశం కోసం, నాసిక్‌లో 1930లో సాగించిన కాలారామా ఆలయ ప్రవేశ ఉద్యమం, 1920 నుంచి నడిపిన "మూక్ నాయక్" (Moke Naik) పత్రిక దళితుల అభివృద్ధి కోసం సాగినవే. సాంఘిక అసమానతలకు వ్యతిరేక పోరాటానికి వారిని ఉన్ముఖులను చేశాడు.

ఈ విధంగా కుల వ్యవస్థలోని కాఠిన్యత సంస్కర్తల వల్ల, ఉద్యమాల వల్ల సడలింది. వ్యవస్థ కొనసాగిన ప్రజలపై పూర్వ ఆధిపత్యం తగ్గింది.

## 22.5 మతం

భారతదేశంలోని పటిష్టమైన వ్యవస్థల్లో మత వ్యవస్థ ఒకటి. హిందువులు అధిక సంఖ్యాకులు. ముస్లింలు, సిక్కులు, పార్సీలు, క్రైస్తవులు, ఇతర మతస్థులు ఒకే మతానికి చెందిన హిందువుల్లో సాంఘిక వైరుధ్యాలు, సామాజిక దురాచారాలు మత ముసుగులో కొనసాగాయి. సంస్కర్తలు వాటిని ప్రశ్నించి, ధిక్కరించారు. మతం పేరుతో సాగే దురాచారాలను తొలగించడం, జీవన విధానాన్ని ఆధునికరించే ప్రయత్నాలు ప్రతి మతంలోనూ జరిగాయి. ఆధునిక యుగాన ఆధునిక భారతదేశాన ఇస్లాం, హిందూ మతాల్లో లౌకిక ప్రయోజనాల నాశించి, మతతత్త్వాలు ప్రబలాయి.

### 22.5.1 కారణాలు

ఆధునిక యుగాన మతతత్త్వ భావాలు హిందూ, ఇస్లాం మతాల్లో ప్రబలడానికి అనేక కారణాలు దోహదం చేశాయి. సంస్కరణోద్యమాల్లో ఆర్య సమాజం, రామకృష్ణా మిషన్, థియోసాఫికల్ సొసైటీ హిందూ మత ఆధిక్యతను కీర్తిస్తూ, పునరుద్ధరణ వాదాన్ని ప్రతిపాదించాయి. దయానందుని బోధనలు, వివేకానందుని ఉపన్యాసాలు, శ్రీమతి అనీబిసెంట్ భావాలు - ఇవన్నీ హిందూ మతాన్ని మించింది ఏదీ లేదనే భావాన్ని పెంచాయి. ఇవి మత మౌఢ్యాన్ని బోధించకపోయినప్పటికీ, మత మౌఢ్య ప్రబలతకు కారణమయ్యాయి.

గతంలో తొంగిచూసి, స్వర్ణ యుగాలను వెదకడం జాతీయోద్యమ కాలంలో ఆరంభమైంది. విదేశీ ఆక్రమణ వల్ల ఏర్పడ్డ నైరాశ్యాన్ని, పరాభవాన్ని ఈ భావం మరపించింది. దీనివల్ల హిందువులు, ముస్లిం తమ పాలనలోని స్వర్ణ యుగాలను వెదికే యత్నాలు ఆరంభించారు. మధ్య యుగాన్ని హిందువులు క్షీణ యుగంగా భావించడంతో, ముస్లింలు తమ సంస్కృతీ పునాదికై పశ్చిమాసియా చరిత్రను స్వీకరించారు.

హిందూ, ముస్లిం రాజకీయ నాయకులు మతతత్త్వాన్ని దృఢంచేస్తూ వచ్చారు. 'భారత మాత' భావం, అతి

BRAOU

వాద నాయకుల ప్రబోధాలు ప్రభావాన్నిచూపి, ప్రత్యక్షంగాగాని, పరోక్షంగా గాని మత మౌఢ్యానికి కారణమయ్యాయి.

మత మౌఢ్యం అంటే లౌకిక ప్రయోజనాల సాధనకు మతాన్ని, మత చిహ్నాలను వాడ్డం, మతం పేరుతో జనవాన్ని సమీకరించడం, మతం పేరుతో మూఢ విశ్వాసాలను, ఆచారాలను పునరుద్ధరించడం మొదలైనవి. మతతత్త్వం మూడు స్థాయిల్లో విజృంభిస్తుంది.

1. ఒకే మతాన్ని పాటించే వారికి ఒకే రకమైన మత ప్రయోజనాలతో బాటు, ఒకే రకమైన లౌకిక ప్రయోజనాలు ఉంటాయని అనుకోటం మొదటి స్థాయి.

2. ఒక మత అనుయాయుల లౌకిక ప్రయోజనాలు మరో మత అనుయాయుల లౌకిక ప్రయోజనాల కంటె భిన్నమైనవని భావించటం రెండో స్థాయి.

3. వివిధ మతాల వారి ప్రయోజనాలు పరస్పర భిన్నమైనవేగాక పరస్పర స్పర్థ కలవని భావించి, ఇరు పక్షాలు హింసకు పాల్పడడం మూడో స్థాయి.

ఇస్లాం, హిందూ మతాల్లో ఈ మతతత్త్వం విజృంభించింది.

### 22.5.2 ఇస్లాం మతతత్త్వం

వలస పాలనకు ముందు హిందూ - ముస్లిం లిరువురూ పాలక - పాలిత జాతులుగా ఉండేవారు. పూర్తిగా విలసిల్లిన రెండు సంస్కృతులను వీరిరువురు ప్రతిబింబిస్తూ, జీవన విధానంలో సమ్మిశ్రిత సంస్కృతిని ప్రవేశపెట్టారు. బ్రిటిష్ పాలన ఆరంభమవగానే ముస్లింలు పదవీచ్యుతులై, రాజకీయాధికారాన్ని కోల్పోయి, నూతన ప్రభుత్వంతో ఎటువంటి సంబంధమూ పెట్టుకోక, కొంత కాలం కనుమరుగయ్యారు. హిందువులతో కలసి 1857 తిరుగుబాటులో ముస్లింలు పాల్గొని, రాజకీయాధికారాన్ని తిరిగిపొందే ప్రయత్నం చేసి, విఫలులయ్యారు. తిరుగుబాటు అనంతరం బ్రిటిష్‌వారు ముస్లింలను అనుమానించి, ప్రతీకార వైఖరిని ప్రదర్శించడంతో, తిరిగి ముస్లింలు బ్రిటిష్ పాలనకు దూరమయ్యారు.

సయ్యద్ అహ్మద్ ఖాన్ (1817-1898) ముస్లింలను ఆధునీకరించే పద్ధతిని ఆరంభించాడు. ముస్లిం సమాజాన్ని పాశ్చాత్య విద్య నేర్వమని ఉద్బోధించాడు. తన భావాలను తన పత్రిక 'తేజిబ్-ఉల్-అఖ్‌లక్' (Tehjib-Ul-Akhlaq) ద్వారా ప్రబోధించాడు. ఇతడు 1902లో మహమ్మదన్ ఆంగ్లో - ఓరియంటల్ కాలేజీని (M.A.O. College) అలీఘర్‌లో ప్రారంభించాడు. ఇతడు 1884లో హిందూ ముస్లిం ఐక్యత గూర్చి ఉపన్యాసాలిచ్చి, ఈ ఇరువురు వేర్వేరు మతాలకు చెందినా, ఉభయులు ఒకే జాతి అని ఉద్ఘాటించాడు. అయితే, ఇతడు త్వరలోనే తన అభిప్రాయాలను మార్చుకుని, హిందూ - ముస్లింల రాజకీయ ప్రయోజనాలు ఒకటి కావనీ, అవి పూర్తిగా వేరైనవి మాత్రమేగాక పరస్పర విరుద్ధమైనవని వాదించాడు. బ్రిటిష్ వారికి విధేయులుగా మెలగడం వల్లే ముస్లిం ప్రయోజనాలు రక్షింపబడతాయని పేర్కొనేవాడు. హిందువులు సంఖ్యాపరంగా అధికులు కనుక, వారి ఆధిపత్యం సాగుతుందని, అంతకంటే బ్రిటిష్ పాలనే మెరుగని చాటుతూ, ముస్లింలు కాంగ్రెస్‌లో చేరడాన్ని వ్యతిరేకించాడు.*

---

*సయ్యద్ అహ్మద్ ఖాన్ "లాయ్ ముసల్మాన్" అనే పత్రికను నడపడమే గాక, జాతీయ కాంగ్రెస్‌లో ముస్లింలు పాల్గొనే సమయానికే ముస్లిం ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్‌లు నడిపాడు.

ఆలీఘర్ కాలేజీ ప్రిన్సిపాల్ అయిన బెక్ ఈ అభిప్రాయం బలపడేలా కృషిచేశాడు. ముస్లింలలో ఆధునిక విద్య విస్తరించాలని నవాబ్ అబ్దుల్ లతీఫ్, బద్రుద్దీన్ త్యాబ్జీలు కృషిచేశారు.

ఉద్యోగాల్లో, వృత్తుల్లో, పరిశ్రమల్లో, విద్యలో - అన్నిటా వెనకబడ్డంతో సంఖ్యాపరమైన హిందూ ఆధిపత్యానికి భయపడ్డంతోనూ, ముస్లింలు బ్రిటిష్ విధానాలనే పూర్తిగా సమర్థించ సాగారు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా వందేమాతరం ఉద్యమాన్ని కాంగ్రెస్ చేపట్టినప్పటికి, ముస్లింలు బ్రిటిష్ విభజనను సమర్థించారు. ప్రభుత్వం నుండి పధ్నాలుగు లక్షల రూపాయల రుణం తీసుకొన్న ఢక్కా నవాబు విభజనను బలపరచాడు.

అఖిల భారత ముస్లిం లీగ్ 1906లో స్థాపించబడ్డంతో మతతత్త్వం పూర్తిగా నెలకొంది. ఢక్కా నవాబ్, ఆగాఖాన్, నబావ్ మొహసిన్-ఉల్-ముల్క్‌లు దీని స్థాపనకు నాయకత్వం వహించారు. బెంగాల్ విభజనను లీగ్ సమర్థించింది.

బ్రిటిష్ ప్రభుత్వం హిందువులను, ముస్లింలను ఏమాత్రం సారూప్యతలేని వర్గాలుగా చిత్రించి, విభజించి పాలించే విధానాన్ని అనుసరించింది. ముస్లింలను లోబరిచే ప్రయత్నంలో బ్రిటిష్ ప్రభుత్వం 1909లో రాజ్యాంగ పరమైన రాయితీలనిచ్చింది. అల్ప సంఖ్యాకులైన ముస్లింలను పరిరక్షించే సాకు చెప్పి, ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పరచింది. జాతీయ కాంగ్రెస్‌ను ముస్లింలీగ్ తీవ్రస్థాయిలో విమర్శించింది. మహమ్మద్ ఆలీ జిన్నా 1938లో లీగ్ సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేస్తూ, "కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం దేశంలోని మిగిలిన అన్ని మతాలను, సంస్కృతులను అణచివేయాలనీ, హిందూ రాజ్యాన్ని స్థాపించాలని దృఢంగా నిర్ణయించుకుందని" తెలిపారు.

జిన్నా కోర్కెల్లో ప్రధానమైన వాటిని 1928 నెహ్రూ నివేదికపై చర్చల నాటికి కాంగ్రెస్ అంగీకరించింది. అయితే, ఇతర తీవ్ర మతమౌఢ్యులకు ఆటపట్టైన ఆగాఖాన్, మొహమ్మద్ షఫీల ఆందోళనతో భయపడ్డ జిన్నా తన కోర్కెలను నాలుగు నుంచి వెంటనే పధ్నాలుగుకు పెంచాడు.

బ్రిటిష్ ప్రభుత్వం 1932లో "కమ్యూనల్ అవార్డ్" (Communal Award) ను ఇచ్చి, ముస్లిం మతతత్త్వ వాదులకు వత్తాసు నిచ్చింది. నాటి వారి కోర్కెలన్నిటికి ప్రభుత్వం అంగీకరించింది. బెంగాల్, పంజాబుల్లో ముస్లిం ఆధిక్యతను "రిజర్వేషన్ల" ద్వారా అంగీకరించింది. కేంద్ర శాసనసభలో 33$^{1}/_{3}$% సీట్లు ముస్లింలకేనని వారిని ఉత్సాహపరచింది. బొంబాయి రాష్ట్రం నుండి సింధుని విడదీయడానికి అంగీకరించింది. ప్రత్యేక నియోజక వర్గాలను కొనసాగించడానికి అంగీకరించింది.

ఈ విధంగా 1935లో కొత్త చట్టం వచ్చే సమయానికి ముస్లిం మతతత్త్వ కోర్కెలను అంగీకరించడం ద్వారా రెండు ఫలితాలు జరిగాయి. అవి : 1. ఉన్నత స్థాయిలో జాతీయ నాయకుల కోర్కెలను అడ్డగించడానికి వలస ప్రభుత్వం ముస్లిం మతతత్త్వ నాయకులను వాడుకుంది. కాంగ్రెస్ అంగీకరించే విషయాలను లీగ్ అడ్డగించేది. కాంగ్రెస్‌తో చేయి కలిపిన ముస్లిం జాతీయ వాదులను, ముస్లిం మతతత్త్వ నాయకులు నిరసించేవారు. వారిని "హిందూ పక్షపాతి" అనీ, ఇస్లాం వ్యతిరేకులకు ప్రచారం చేసేవారు. అబ్ కలాం ఆజాద్, అబ్దుల్ గఫార్ ఖాన్, ఖ్వాజీ జలీల్ అబ్బాసీ ఇలాటి విమర్శలను, కుల బహిష్కరణను ఎదుర్కొన్నవారే. 2. ఎప్పుడైతే ఉద్యోగాల్లోనూ శాసనసభల్లోనూ ముస్లింల రిజర్వేషన్ అంగీకరించబడిందో, అప్పటినుంచి మతతత్త్వ వాదులు తీవ్రస్థాయిలో వేర్పాటు వాదాన్ని ప్రబోధిస్తూ వచ్చారు. అణచివేత ప్రబలటం, చంపివేయటం వంటి పదాలను 1937 నుండి స్వేచ్ఛగా వాడారు. లీగ్ తృప్తిపరచే ప్రయత్నాలను కాంగ్రెస్ చేపట్టినా అవి ఫలించలేదు. కొత్త కోర్కెలేవీ లేని జిన్నా ఏప్రిల్ 1941లో కాంగ్రెస్ కనక తాను హిందూ పార్టీనని, హిందువులకు మాత్రమే ప్రాధాన్యత వహిస్తానని అంగీకరిస్తే, తాను చర్చలకు సిద్ధపడతానని అన్నాడు. దీనికి కాంగ్రెస్ అంగీకరించలేదు.

BRAOU

ఉర్దూ కవి అయిన ఇక్బాల్ ఆరంభించిన పాకిస్తాన్ భావాన్ని, మార్చి 23, 1940న లాహోర్ సమావేశంలో ముస్లిం లీగ్ తీర్మానం ద్వారా అంగీకరించింది.'ఇస్లాం ఆపదలో ఉంది' అనే నినాదాన్ని లీగ్ ఆరంభించింది. రెండో ప్రపంచ యుద్ధంలో భారతదేశాన్ని తమని సంప్రదించకుండా చేర్చినపుడు, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీనామా చేశాయి. అప్పుడు లీగ్ "విముక్తి దినం" (Day of Deliverance)గా పాటించింది. బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలోకి రాగానే రాజ్యాంగ పరిషత్తుకై ఎన్నికలను 1946లో జరిపినప్పుడు కాంగ్రెస్‌కు పూర్తి ఆధిక్యత వచ్చింది. అయితే, లీగ్ ఈ సభను గుర్తించక, పాకిస్తాన్ కొరకై ప్రత్యక్ష చర్య (Direct Action) కు ఆగస్ట్ 16, 1946న ఆదేశించింది. దేశంలో చాలా ప్రదేశాల్లో హిందూ - ముస్లిం పోట్లాటకు ఇది దారితీసి, అనేక వందల మంది మృతికి కారణమైంది.

ఈ విధంగా సంఘ సంస్కరణోద్యమాల్లోని హిందూ ఔన్నత్యాన్ని అధికంగా చాటడం వల్లా, రాజకీయ నాయకుల లౌకిక ప్రయోజనాల వల్లా, వలస ప్రభుత్వ అండవల్లా, భారతదేశ విభజన అనివార్యమైంది.

### 22.5.3 హిందూ మతతత్త్వం

అధిక సంఖ్యాకులు అవలంబించే హిందూ మతంలో కూడా మతతత్త్వం ప్రబలింది. పునరుద్ధరణ సంస్కరణ వాదం పరోక్షంగా కారణమైంది. హిందువులు భౌతిక వాదులు కారని, శాంతి కాముకులని, మత వేదాంతానురక్తులని ప్రచారం సాగింది. హిందూ మతాన్ని మించింది ఏదీలేదనే భావానికి దయానందుని బోధనలు, వివేకానందుని ఉపన్యాసాలు, హిందూ మతాన్ని అనుసరించిన విదేశీ స్త్రీ పురుషులు కారణమయ్యారు.

జాతీయోద్యమ కాలంలో, స్వర్ణ యుగాల అన్వేషణలో, మధ్య యుగాన్ని క్షీణ యుగంగా భావించడం కూడా రెండు భిన్న జాతుల సిద్ధాంతానికి కారణమైంది. చరిత్ర జాతికంతా ఉత్తేజాన్ని ఇచ్చే సాధనంగా గాక, కొద్ది మందికి మాత్రమే గర్వకారణంగా మారసాగింది.

వందేమాతరం ఉద్యమ కాలం నుండి మత చిహ్నాలను వాడటం అధికమైంది. జాతీయతా భావాన్ని ఉద్దీపించడానికి 'భారతమాత' భావాన్ని ప్రజారంజకం చేశారు. గంగానదిలో స్నానాలు చేసి, రక్షాబంధనం ఉత్సవాన్ని జరుపుకొని, ఆ తర్వాత వందేమాతర ఉద్యమాన్ని ఆరంభించారు. శివాజీ ఉత్సవాలను, గణేష్ ఉత్సవాలను అమిత ఉత్సాహంతో బాలగంగాధర తిలక్ నిర్వహించసాగాడు. ఈ ఉత్సవాలు ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాయి. గాంధీజీ ఉపయోగించిన 'రాజరాజ్యం' కూడా మతపరమైన ప్రయోగమే.

మత మౌఢ్య ధోరణులు 1937 నుండి, ముస్లిం లీగ్‌లో వలెనే, హిందూ సంస్థలైన హిందూ మహాసభలోనూ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోనూ ప్రతిఫలించాయి. హిందూ మహాసభ కూడా, లీగ్‌వలెనే 1937 ఎన్నికల్లో పోటీచేసినా, కాంగ్రెస్ ప్రభంజనానికి ఆగలేకపోయాయి. హిందూ మహాసభ, ముఖ్యంగా వి.డి. సావార్కర్ ఆధ్వర్యాన, సామాన్య జనులను సమీకరించసాగింది. ఆర్.ఎస్.ఎస్. 1937 నుండి మహారాష్ట్ర ఎల్లలను దాటే ప్రయత్నాలను అధికం చేసింది. హిందువులు, హిందూ సంస్కృతి, హిందూ రాజ్యం లక్ష్యాలుగా హిందూ మహాసభ తెల్పుతూ "విదేశీయులందరూ హిందువులకు లోబడడమో లేక దేశాన్ని వీడడమో చేయాలని" తెలిపింది. "హిందూత్వ", "ఉ య్" అనే రెండు కరపత్రాలు వీరి అభిప్రాయాలను తెలియజేస్తాయి.

ఈ రెండు మత సంస్థలు, హిందూ మహాసభ, ముస్లిం లీగ్ పరస్పర ద్వేషాన్ని, భయాన్ని పెంచాయి. వి.డి. సావార్కర్ 1937లో ఒక సభలో మాట్లాడుతూ "హిందూ రాజ్య నొసటిపై హిందూ అణచివేతనూ, ముస్లిం ప్రాబల్యాన్ని ముద్రించాలనీ, హిందువులను వారి దేశంలోనే వారిని దాసుల స్థాయికి దిగజార్చాలనీ వారు (ముస్లింలు) ఆశిస్తున్నారని అన్నాడు. ఆర్.ఎస్.ఎస్. అధ్యక్షుడు ఎం.ఎస్. గోల్వాల్కర్ 1939లో జాతీయ వాదులను ఖండిస్తూ, "హిందూ-ముస్లిం ఐక్యత లేని స్వరాజ్యం వద్దని ప్రకటించేవారంతా సంఘానికి దారుణమైన ద్రోహం చేశారనీ, గొప్ప ప్రాచీన సంస్కృతి కల ప్రజల జీవితాత్మను చంపడమనే నీచమైన పాపాన్ని చేశారని" ఆగ్రహించాడు. ఇదే స్థాయిలో జిన్నా 1946లో ఓటర్ల నుద్దేశించి "నేడు మన బాధ్యతను గుర్తించడంలో గనుక

మీరు విఫలమైనట్లైతే, రేపు మీరు శూద్రుల స్థాయికి దిగజార్చబడతారు; భారతదేశంలో ఇస్లాం ఓడిపోతుంది" అన్నాడు.

ఈ విధమైన మత మౌఢ్యం, దాని ప్రచారం తన విష ఫలితాలను ఇచ్చింది. అగస్ట్ 1946 నాటి కలకత్తా కొట్లాటల్లో, కేవలం మూడు రోజుల్లో 5000కి పైగా చనిపోయారు. నౌఖాళీలో హిందువులపై దౌర్జన్యాలు, బీహార్‌లో ముస్లింలపై కసాయితనం, దేశ విభజన, ఆ సందర్భంలో జరిగిన మత హత్యలు, చివరగా జనవరి 30, 1948న గాంధీజీ హత్య ఇవన్నీ మత మౌఢ్య ఫలితాలే, సామ్రాజ్య తత్త్వానికి, వలస తత్త్వానికి ఫలితంగా, ఇరు వర్గాల్లోనూ ప్రబలిన మత మౌఢ్య ఫలితాలే.

## 22.6 సంగ్రహంగా

బ్రిటిష్ పాలనలో భారతీయ సామాజిక సంస్థలైన కుటుంబం, వివాహం, కులం, మతం అన్నీ మార్పులకు లోనయ్యాయి. సమిష్టి కుటుంబాలు వ్యష్టి కుటుంబాలుగా మారాయి. వివాహ వ్యవస్థలోని దురాచారాలు తొలగి, బాల్య వివాహాలు నిషేధించబడ్డాయి. కుల వ్యవస్థలోని కాఠిన్యత తగ్గి, గతిశీలత వల్ల అనేక కులాల హోదాలు మారాయి. అతి నెమ్మదిగా ప్రవేశించిన ఈ మార్పుతో పాటు, నిర్మాణాత్మకంగా సాగిన బ్రాహ్మణేతర ఉద్యమం, హరిజనోద్యమం అగ్రవర్ణ ఆధిక్యాన్ని ఎదిరించాయి. మత వ్యవస్థలో హిందూ - ముస్లిం అంతరాలు అధికమవడంతో పాటు, మతతత్త్వం ప్రవేశించి, దేశ విభజనకు దారితీసింది.

## 22.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ఆధునిక భారతదేశంలో కుటుంబ, వివాహ వ్యవస్థల్లో వచ్చిన మార్పులను వివరించండి.
2. ఆధునిక భారతదేశంలో కుల వ్యవస్థలో వచ్చిన మార్పులను తెల్పండి.
3. ఆధునిక భారతదేశంలో మతతత్త్వ పెరుగుదలను వివరించండి.

**II. కింది ప్రశ్నలకు లఘు వాఖ్యలను రాయండి.**

4. కుటుంబ వ్యవస్థలోని మార్పులు
5. వివాహ వ్యవస్థ మార్పు చెందటంలో ప్రజా పాత్ర
6. గతిశీలత
7. బ్రాహ్మణేతర ఉద్యమం

## 22.8 ఉపయుక్త గ్రంథాలు


Srinivas, M.N. : **Social Change in Modern India.**

Kuppu Swamy, B. : **Social change in India.**

Desai, A.R. : **Social Background of Indian Nationalism**

Bipan Chandra : **Communalism in Modern India**

Bipan Chandra : **Epic Struggle**

ఎమ్.ఎన్. శ్రీనివాస్ : ఆధునిక భారతదేశంలో సామాజిక పరివర్తన


రచయిత్రి : ఆచార్య పి. రామలక్ష్మి

BRAOU

# భాగం - 23 : భావ జాలంలోని మార్పులు

విషయక్రమం


23.0 లక్ష్యాలు

23.1 పరిచయం

23.2 పాశ్చాత్య విద్య

23.3 చట్ట సమానత్వం

23.4 లౌకిక దృక్పథం

23.5 జాతీయతా భావం

23.5.1 భారతదేశంలో

23..5.2 భారతదేశం వెలుపల

23.6 అంతర్జాతీయ దృక్పథం

23.7 విదేశీ విధానం

23.8 ఆర్థిక భావ జాలం

23.9 పాశ్చాత్యీకరణ

23.10 సంగ్రహంగా

23.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

23.12 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 23.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల మీరు కింది విషయాలు తెలుసుకోగలగాలి.

- నూతనంగా పెంపొందించుకొన్న భావాలు
- జాతీయతా భావాన్ని పటిష్టం చేసికోవడం
- అంతర్జాతీయ దృక్పథాన్ని పెంచుకోవడం
- స్వతంత్ర భారతావనిలో అనుసరించబోయే విధానాలను రూపొందించుకోవడం

## 23.1 పరిచయం

భారతీయ సంఘంలో మార్పు రావడానికి నూతన భావజాల వ్యాప్తియే కారణం. బ్రిటిష్ పాలనలో కలిగిన పాశ్చాత్య సంపర్కం వల్ల కొత్త దృక్పథాల నుండి సమాజాన్ని నూతన విద్యాధికులు పరీక్షించి, అవసరమైన సంస్కరణలను చేపట్టారు. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలపట్ల ఆకర్షితులై జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమ సమయంలోనే భారతదేశం అనుసరించాల్సిన విదేశీ విధానం, ఆర్థిక విధానం నిర్ధారించుకున్నారు.

## 23.2 పాశ్చాత్య విద్య

విద్య కోరిన వారందరూ విద్యావంతులు కావాలనే ఆలోచన మొట్టమొదటగా వచ్చిన విప్లవాత్మకమైన భావం. బ్రిటిష్ రాకకు పూర్వం విద్య ప్రధానంగా మతపరమైందిగా ఉండి, అందరికీ అందుబాటులో ఉండేది కాదు. క్రైస్తవ మిషనరీల కృషి ఫలితంగా విద్య అన్ని కులాలకు, స్త్రీలకు అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ విధానం కూడా, లార్డ్ మెకాలే మినిట్ ప్రకారం, పాశ్చాత్య విద్యను ప్రోత్సహించసాగింది. అందుచేత మతేతర పాఠ్యాంశాలతో చదువు కొనసాగి, లౌకికతను పొందింది. కాలక్రమేణా ఆర్థికంగా స్థిరపడుతున్న అనేక వ్యవసాయ కుటుంబాలు, వృత్తుల్లో కొనసాగుతున్న కుటుంబాలు విద్యపై ఆసక్తి చూపసాగాయి. స్థానికులు అనేకులు పాఠశాలలను, కళాశాలలను స్థాపించారు. విద్యాలయాల సంఖ్యతో పాటు, విద్యావంతుల సంఖ్య కూడా పెరగనారంభించింది. ఉన్నత ఉద్యోగాలకు, ఆధునికతకు విద్య సాధనమైంది. ఆర్థిక స్థితి మెరుగుదల ద్వారా ఉన్నత సాంఘిక స్థాయిని పొందడానికి కారణమైంది.

పాశ్చాత్య విద్య నభ్యసించిన తొలితరం భారతీయులు తమ స్వదేశీ సంస్కృతిని ఈసడించి, విదేశీ సంస్కృతిపై పూర్తి మోజును చూపారు. కలకత్తాలో జనవరి 20, 1817న ప్రారంభించిన హిందూ కాలేజీలోని విద్యార్థులు త్వరలోనే తమ ఆంగ్ల భాషా పాండిత్యాన్ని ప్రకటించడం ఆరంభించారు. కాశీ ప్రసాద ఘోష్ తొలుతగా ఆంగ్లంలో కవితలు రాశాడు. కలకత్తాలో ఆంగ్లాన్ని సొంత భాషలాగా మాట్లాడే వారి సంఖ్య వంద నుండి రెండు రెండు వందల దాకా పెరిగినట్లు ఫిబ్రవరి 27, 1830 నాటి 'సమాచార దర్పణ్' తెలియజేస్తోంది. లార్డ్ మెకాలే ఆశించినట్లు ఈ తరంవారు పుట్టుకతో భారతీయులైనా, ఆలోచనారీతిలో పాశ్చాత్యులలాగే ఉండి,తమ మతంపై, సాంప్రదాయాలపై విమర్శల వర్షాన్ని కురిపించారు. పాశ్చాత్య విద్య ద్వారా వారు నేర్చిన ఆదర్శాలకు, నాటి భారత సంప్రదాయాలకు గల వైరుధ్యం దానికి కారణం. డిరోజియో శిష్యుల్లో ఒకడైన మాధవ చంద్ర మల్లిక్ ఒక పత్రికలో ఈ విధంగా రాశాడు : "హృదయపు లోతుల నుండి మేము ద్వేషించేదంటూ ఏమైనా ఉంటే అది హిందూ మతం మాత్రమే" అని అన్నాడు. "కలకత్తా రివ్యూ" (Calcutta Review) (1852) సంచికలో పాశ్చాత్య విద్య నేర్చిన నాటి తరం పరిస్థితి విపులీకరించబడింది. ఒకప్పుడు నమ్మకం, గౌరవంగల వాటినన్నిటిని కోప ద్వేషాలతో పరికిస్తున్నారని, హేతుబద్ధంగా లేని, రుచించని అంశాలను దూరం చేస్తున్నారని" తెలుపుతూ మతం, పురోహితుడు నిందార్హులుగా పరిగణిస్తున్నారని, సామాజిక సంబంధాలు కల్లోలితమయ్యాని వివరించింది. అనుశ్రుతంగా అంగీకరించే ప్రతీ అంశం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

విద్యాధికుల ఈ ప్రవర్తన సాంప్రదాయక వర్గానికి అనిష్టతను కల్గించింది. దీని తీవ్రరూపం విద్యాధికుల గురువైన డిరోజియోపై మరలి, అతడిని ఉద్యోగం నుండి తొలగించారు. అయితే ఈ దృక్పథం మొదటి తరం విద్యార్థుల వరకే ఉంది. తర్వాత తరం విద్యార్థులు తాము చదివిన వాటికి, భారతీయ సమాజంలో ఉన్నవాటికి గల వైరుధ్యాన్ని విశ్లేషించుకొని, నూతన విధానాలను అనుసరించారు. దుష్ట సాంప్రదాయాలను సమాజం నుండి తొలగించడానికి, నూతన సాంప్రదాయాలను నెలకొల్పడానికి కృషి చేశారు. ఒక వంక సమాజ ఆధునికీకరణను చేపట్టి, రెండో వంక వలస పాలనలోని వైరుధ్యాన్ని చాటారు. పాశ్చాత్య విద్య నేర్పే ఉదారత, విముక్తి పోరాటాలు, స్వేచ్ఛ సమానత్వాలు భారతదేశంలో ఏ విధంగా లేవో తెలిసిన ఈ వర్గం వలస పాలనను వారి ఆర్థిక దోపిడిని ప్రజలకు తేటతెల్లం చేశారు. ఈ విధంగా ప్రజలను స్వాతంత్ర్యోద్యమానికి నడిపారు.

సామాజిక స్థితికి, ఇతర అంశాలతో ఉన్న సంబంధాలను చాలామంది భారతీయ విద్యావేత్తలు గుర్తించారు. ఉదాహరణకు, జస్టిస్ రెనడే మొదటి బొంబాయి రాష్ట్ర సాంఘిక సమావేశాన్ని మే నెల 1900ల్లో సతారాలో ప్రారంభిస్తూ ఈ విధంగా అన్నాడు. "మధ్య మార్గంలో గల కష్టాలను అధిగమించి రాజకీయ, సాంఘిక, మత,

వాణిజ్య, ఉత్పత్తి, లలిత కళారంగాల్లో వ్యక్తి, సంఘం కూడా అభివృద్ధి గాంచాలి. రాజకీయ హక్కులు లేనప్పుడు మంచి సామాజిక వ్యవస్థ ఉండదు. సామాజిక స్థితి న్యాయ, తర్కాలపై ఆధారపడని నాడు రాజకీయ హక్కులను, అధికారాలను అనుభవించే స్థితి ఉండదు. సామాజిక స్థితిగతులు బాగుండనప్పుడు మంచి ఆర్థిక వ్యవస్థ ఉండదు. మతానికి సంబంధించిన ఆదర్శాలు తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు, సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో విజయం సాధించలేదు. ఈ రకమైన పరస్పర ఆధారం ప్రకృతిలోని అంశమే తప్ప హఠాత్తుగా జరిగే విషయం గాదు".

సంఘ సంస్కరణ, జాతీయోద్యమాల్లో దేనికి ప్రాధాన్యమీయాలనే అంశం కూడా మిత వాదులు, అతి వాదులుగా కాంగ్రెస్ చీలిపోడానికి కారణమైంది. సామాజిక సమస్యలకు ప్రాధాన్యమీయాలనే వర్గానికి ఎమ్.జి.రెనడే, జి.కె. గోఖలే నాయకత్వం వహించగా, తిలక్ నాయకత్వాన మరో వర్గం జాతీయ పోరాటానికి ప్రాధాన్యత నిచ్చి, సాంఘిక సంస్కరణలను స్వతంత్ర భారతదేశంలో కూడా ప్రవేశపెట్టవచ్చని భావించారు. ఈ రెండు లక్ష్యాలను సమన్వయించే ప్రయత్నాన్ని గాంధీ చేశాడు. ఒకవైపు స్వరాజ్యం కోసం పోరాడుతూ, రెండోవైపు సమాజాన్ని సంస్కరించుకోవచ్చని భారతీయులను నడిపించాడు.

## 23.3 చట్ట సమానత్వం

చట్టం ముందు అందరూ సమానులే అనే దృఢ నమ్మకం బ్రిటిష్ పాలనలో ప్రబలిన మరో నూతన భావం. నేరస్థులెవరైనా శిక్షార్హులే. ఒకే నేరానికి ఒకే శిక్ష అనీ నిరాకరించారు. సివిల్ ప్రొసీజర్ కోడ్ (Civil Proceedur Code) ని 1859 లోనూ, ఇండియన్ పీనల్ కోడ (Indian Penal Code) ని 1860 లోనూ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (Criminal Proceedure Code) ని 1861 లోనూ గ్రంథస్థం చేశారు. క్రోడీకరణ 1872 నాటికి ముగిసి, పరిపాలనపరమైన సమైక్యత సాధించడానికి కారణమైంది.

## 23.4 లౌకిక దృక్పథం

బ్రిటిష్ పాలన భారతీయుల్లో లౌకికీకరణకు దోహదం చేసింది. ప్రథమంగా లౌకికీకరణ చెందింది విద్య. విద్య మత పరిధి నుంచి విడివడ్డంతో అందరికీ నేర్చే అవకాశం కలిగింది.

తర్వాత విడిపడింది ప్రభుత్వం పట్ల ప్రజలకుండే భావన. బ్రిటిష్ రాక పరకూ ప్రజలు రాజ్యాన్ని, రాజకీయ అధికారం గల వారిని భగవదేచ్ఛగానూ, భగవద్రూపాలుగానూ భావించేవారు. అయితే, నూతన భావాలైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల ఆకర్షితులై, ఇతర దేశాల్లో సాగిన జాతీయోద్యమాలచే ఉత్తేజితులై, వలస పాలన నుండి విముక్తి కొరకై జాతీయోద్యమాన్ని ఆరంభించారు. ప్రభుత్వం, రాజ్యం లౌకిక సంస్థలు మాత్రమేనని, వాటి మనుగడకు ప్రజాభీష్టం తప్ప, మత మద్దతు కాదని వారికి తెలిసింది. ప్రజలను అణచే ఏ ప్రభుత్వం మనజాలదని తెలుసుకొని, వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయోద్యమాన్ని ఉధృతం చేశారు.

భారతీయ ఐక్యతను తగ్గించడానికి, జాతీయోద్యమాన్ని బలహీన పరచడానికి వలస ప్రభుత్వం హిందూ - ముస్లిం వైరుధ్యాలను పెంచే ప్రయత్నం చేసింది. అనేక ప్రయోజనాలను ఎరచూపి, మతతత్వాన్ని పెంచింది. మతాన్ని, మత చిహ్నాలను వ్యక్తిగత పరిధిని దాటించి, రాజకీయ ప్రయోజనాల నాశించి ఉద్రేకపూరితంగా ప్రజలను సంఘటిత పరచడాన్ని మత తత్వమని స్థూలంగా చెప్పవచ్చు. మతమౌఢ్యానికి వ్యతిరేకంగా జాతీయతా వాదులు రాజకీయ జాతీయోద్యమాన్ని, లౌకిక భారతదేశాని కనుగుణంగా నిర్మించే కృషి చేశారు. మతమనేది

వ్యక్తిగతం, రాజకీయ సంస్థలు లౌకిక ప్రయోజనాలకు ఉద్దేశించబడ్డవని భావిస్తూ, జాతీయోద్యమం సాగుతున్నప్పుడే నాయకులు స్వేచ్ఛా భారతదేశం లౌకిక రాజ్యంగా ఉండాలని ఆశించారు. "మతాన్ని గౌరవించే గాంధీ లౌకిక రాజ్యాన్ని అభిలషించగా, మతాన్ని పాటించని జిన్నా మత ప్రసక్తి గల రాజ్యాన్ని కోరాడని" ఫిషర్ అన్నాడు.

జీవన విధానంలో కూడా లౌకికీకరణ ప్రవేశించింది. విద్య, అధిక ఆదాయం పట్టణీకరణలు లౌకిక జీవన విధానానికి దోహదం చేశాయి. విద్యవల్ల, ఉద్యోగాలవల్ల, పట్టణ జీవన విధానం వల్ల పల్లెల్లో ఉండే సాంప్రదాయ జీవన రీతికి దూరమయ్యారు. అందుచేత సాంప్రదాయాల కట్టుబాట్ల బిగువు తగ్గింది.

## 23.5 జాతీయతా భావం

తొలుతగా బ్రిటిష్ రాజ్యాన్ని "భగవదత్తంగా" భావించిన భారతీయులు జాతీయతా భావాన్ని పందొమ్మిదవ శతాబ్దంలో పెంపొందించుకున్నారు. పాశ్చాత్య విద్య నేర్చిన మధ్య తరగతి వర్గం స్వతంత్ర బ్రిటిష్ ప్రజల స్థితితో తమను పోల్చుకొని, అసంతృప్తి చెంది, జాతీయోద్యమంలో ప్రవేశించారు. పరిపాలనా ఏకీకరణ, రవాణా సదుపాయాల మెరుగుదల, పత్రికలు, జాతీయ సంస్థల ఆవిర్భావం, సాంఘిక సంస్కరణోద్యమాలు, జాతి విచక్షణా విధానం, వలస పాలనలో జరిగిన అపార ఆర్థిక దోపిడి మొదలైన ఇవన్నీ జాతీయోద్యమాన్ని పెంచి పోషించాయి. ఐరోపా చరిత్ర, ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో సాగిన జాతీయోద్యమాలు, ఆంగ్ల సాహిత్యం, ఉదార వాదం భారతీయులను ప్రభావితం చేశాయి. భారతదేశంలో జాతీయ భావాలను ప్రచారం చేయడంలో పూనాలో 1870లో స్థాపించబడ్డ జాతీయ "సార్వజనిక్ సభ" (Sarvajanik Sabha) సురేంద్రనాథ్ బెనర్జీ 1876లో స్థాపించిన "ఇండియన్ అసోసియేషన్" (Indian Association) ప్రముఖమైనవి. స్థానికంగా వస్తున్న బ్రిటిష్ వ్యతిరేక భావాన్ని జాతీయ భావంగా దేశం నలుమూలలా వ్యాప్తి చేసిన మొదటి భారతీయుడు సురేంద్రనాథ్ బెనర్జీ. భారత జాతీయ కాంగ్రెస్ 1885లో స్థాపించ బడ్డప్పటి నుండి, అది ఒక జాతీయ వేదికగా మారి, భారతీయుల ఆకాంక్షలను వ్యక్తం చేస్తూ ఉండేది. జాతీయ వాదం ప్రబలడానికి అవసరమైన సాంస్కృతిక పునాదిని, భయరహిత శౌర్యాన్ని వివేకానందుడు ఇచ్చి, ఉత్సాహపరచాడు. దేశానికి అవసరమైనవి "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, మహత్తర సంకల్పం" మాత్రమేనని, ఆత్మ విశ్వాసంతో లక్ష్యం చేరేవరకు ఆగక సాగిపొమ్మని" అతడు ఉద్బోధించాడు.

BRAOU

### 23.5.1 భారతదేశంలో

భారతదేశ ఎల్లలలో ప్రజ్వరిల్లిన జాతీయ భావం అనేకులను ఆకర్షించి, రాజ్యాంగబద్ధమైన ఆందోళనలో భాగస్వాములను చేసింది. జాతీయతా వాదులు, 1885 నుండి 1905 వరకు, తమ కోర్కెలను మిత వాద ధోరణిలో ప్రార్థిస్తూ, అర్జీలను పంపేవారు. బెంగాల్ విభజనతో చెలరేగిన వందేమాతరం ఉద్యమం అతి వాద పద్ధతిలో సాగింది. బాలగంగాధర్ తిలక్, లాలాలజపతి రాయ్, అరవింద ఘోష్, బిపిన్‌చంద్ర పాల్ నాయకత్వం వహించిన ఈ ఉద్యమంలో స్వదేశీ, స్వరాజ్ ఆదర్శాలు దేశమంతటా ప్రతిధ్వనించాయి. హోంరూల్ ఉద్యమంలో స్వపరిపాలనకై ఆందోళన అధికమైంది. గాంధీ నాయకత్వాన సహాయ నిరాకరణోద్యమం, శాసనోల్లంఘనోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం పెద్ద ఎత్తున సాగాయి. పత్రికాధిపతులు, విద్యార్థులు, రైతులు, స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొనసాగారు. లేబర్ పార్టీ అధికారంలోకి రావడంతో, రెండు ప్రపంచ యుద్ధాలతో అలసిన బ్రిటన్ భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది.

రాజ్యాంగబద్ధమైన పై ఉద్యమాలతోపాటు, సాయుధ సంఘటనల ద్వారా కూడా భారత జాతీయత వ్యక్తమైంది. అహింసా ధోరణిని వ్యతిరేకించిన కొందరు సాయుధ తిరుగుబాటు మాత్రమే అవలంబించాల్సిన

విధానమని చాటారు. ముఖ్యంగా బెంగాల్, మహారాష్ట్రల్లో ఉగ్ర వాద సంఘటనలు అనేకం జరిగాయి. సంధ్య, యుగాంతర్, వందేమాతరం పత్రికలు ఈ భావాలను వ్యాప్తి చేశాయి. ఆలీపూర్ బాంబు కేసులో అరవిందుడు అతని సోదరుడైన వీరేంద్ర నిందులయ్యారు. నాసిక్ కుట్ర కేసులో 'అభినవ భారత్' సంస్థకు చెందిన అనేకులు, సావర్కర్‌తో సహా శిక్ష అనుభవించారు. రాజకీయ బానిసత్వం నుండి దేశాన్ని విముక్తిచేసే కృషిలో "యవ్వనాన్ని, సంతోష కార్యక్రమాలను, గృహానందాన్ని, ధనాన్ని, సోదరుని, సోదరిని అర్పించి, ఇప్పుడు తన శరీరాన్ని సహితం అర్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు "సావర్కర్ తన వదినకు' రాసిన లేఖలో పేర్కొన్నాడు. పంజాబ్‌లోని ఉగ్రవాద రూపం గదర్ ఉద్యమంలో కనిపిస్తుంది. ఛిటగాంగ్‌పై సూర్యసేన్ దాడులు, ఆంధ్రాలో అల్లూరి సీతారామరాజు ఉద్యమం జాతీయతా భావంతో సాగిన ఉద్యమాలే. భగత్ సింగ్, చంద్రశేఖర ఆజాద్ అటువంటి ధైర్యాన్నే ప్రదర్శించి, దేశీయుల్లోని జాతీయతా భావాన్ని ప్రజ్వలింప జేశారు. వీరిని ఉగ్ర వాదులుగా భావించినప్పటికీ, వారు ప్రజలకు ఏ విధంగా ధైర్యం చేయాలో, అవసరమైతే ఏ విధంగా మరణించాలో ప్రజలకు చాటారు.

**23.5.2 భారతదేశం వెలుపల**

జాతీయత భారతదేశంలో గల భారతీయులకు మాత్రమే పరిమితం కాలేదు. విదేశాల్లో స్థిర నివాసం ఏర్పరచుకొన్న భారతీయులు సైతం భారతదేశ స్వాతంత్ర్యానికి కృషిచేశారు.

మహారాష్ట్రకు చెందిన శ్యాంజీ కృష్ణవర్మ ఇంగ్లండ్‌కి వెళ్లి, వ్యాపారం ద్వారా విశేష సంపదను ఆర్జించాడు. జాతీయ భావంచే ఉత్తేజితుడై, ప్రతిభ గల భారతీయ విద్యార్థులకు ఉపకార వేతనాల నిచ్చి, ఇంగ్లండ్‌కి రప్పించి, విప్లవ భావాలతో ప్రభావితం చేశాడు. "ఇండియా హౌస్" (India House) కు రూపకల్పన చేసిన వారిలో శ్యాంజీ కృష్ణవర్మ ప్రముఖుడు. లండన్‌లోని విప్లవకారులు సమావేశ స్థలమైన ఇండియా హౌస్‌లోనే వీరసావర్కర్, మదన్‌లాల్ థింగ్రా, సర్దార్‌సింగ్ రాణా మొదలైనవారు ప్రణాళికలను వేసుకొనేవారు. ఇతడు తన భావాలను "సోషియాలజిస్ట్", (Sociologist) "వందేమాతరం" (Vandemataram) పత్రికల ద్వారా ప్రచారం చేశాడు. ఆంగ్లేయుల దృష్టి ఇతనిపైన మరలినప్పుడు, ఇతడు ఇండియా హౌస్‌ని, వందేమాతరం పత్రిక బాధ్యతను సావర్కర్‌కి అప్పగించి, పారిస్‌కి, అక్కడి నుండి జెనివాకు వెళ్లి, 1930లో మరణించాడు.

శివాజీ ఉపకార వేతనాన్ని పొంది, న్యాయ విద్య నేర్పడానికి ఇంగ్లాండ్ వెళ్లిన వీర సావర్కర్ ఇండియా హౌస్‌ని విప్లవ కేంద్రంగా మార్చాడు. శత్రువును అతని దేశంలో ఎదిరిస్తానని దేశం వదలివెళ్లే ముందు చెప్పిన ప్రకారం లండన్‌లోని వీధులను వందేమాతరం నినాదంతో నింపాడు. ఇతడు "జోసెఫ్ మాజిని - జీవితం రాజకీయాలు' (Joseph Majjini Life Politics) అనే పుస్తకాన్ని 1906 చివరలో ప్రచురించి, జాతీయతా భావాన్ని ఉద్దీపింపజేశాడు. బ్రిటిష్ ప్రభుత్వం 1857 తిరుగుబాటు అణచివేత స్వర్ణోత్సవాలను 1907లో నిర్వహించడానికి నిర్ణయించగా, దీన్ని వ్యతిరేకిస్తూ సావర్కర్ ఇండియా హౌస్ వద్ద మొదటి స్వాతంత్ర్య సంగ్రామ స్వర్ణోత్సవాలను మే 8, 1908న నిర్వహించాలని సంకల్పించాడు. ఈ సందర్భంగానే ఇంతవరకు సిపాయిల తిరుగుబాటుగా బ్రిటిష్ వారు వ్యవహరించిన 1857 తిరుగుబాటు స్వభావం "ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం" (The First Independence Struggle) అని వర్ణిస్తూ సావర్కర్ పుస్తకాన్ని రచించాడు. ఇంగ్లండ్‌లో నిషేధించబడ్డ ఆ పుస్తకం హాలెండ్‌లో ముద్రించబడింది.

విప్లవ సాహిత్య వ్యాప్తిలో శ్యాంజీ కృష్ణవర్మకు సర్దార్‌సింగ్ రాణా సహాయంగా ఉండేవాడు. ఇతడు విప్లవ పత్రికలైన "వందేమాతరం", (Vandamataram) "తల్వార్" (Talwaar) "ఇండియన్ ఫ్రీడం" (Indian Freedom) లకు సంపాదకత్వం వహించేవాడు. బాంబుల తయారీ నేర్చుకోడానికి హేమచంద్రను రష్యా పంపినప్పుడు రాణా ధనసహాయం చేశాడు. పిస్తోళ్లు, బుల్లెట్లు భారతదేశానికి పంపిణీ చేయడంలో ఇతడు ప్రముఖ పాత్ర వహించాడు.

భారతీయ పార్సీ యువతి అయిన మేడం కామా పేరు స్వాతంత్రోద్యమంలోనే శ్లాఘనీయమైంది. ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాల్లో విప్లవ సందేశాన్ని భారతీయులకు అందించింది. జర్మనీలో 1907లో జరిగిన 'ఇంటర్నేషనల్ సోషలిస్ట్ కాన్ఫరెన్స్' (International Sociologist Conference)కి మేడం కామా, సర్దార్ సింగ్ రాణా భారతీయ ప్రతినిధులుగా హాజరయ్యారు. అంతర్జాతీయ సమావేశంలో మొదటిసారిగా భారతీయ జండాను ఎగరవేసిన ఖ్యాతి కామాకే దక్కింది. బ్రిటిష్ పాలన భారతీయ ప్రయోజనాలకు హానికరమని, స్వేచ్ఛా ప్రియులైన ప్రపంచ దేశాలన్నీ భారతదేశానికి సహాయపడాలని ఆమె కోరింది. లండన్‌లోని కాక్స్టన్ హాల్‌లో డిసెంబరు 20, 1908న జరిగిన భారతీయ జాతీయ వాదుల సభలో ఆమె విదేశీ వస్తు బహిష్కరణ తీర్మానాన్ని ప్రతిపాదించింది. ఈ సమావేశంలో బిపిన్‌చంద్ర పాల్ లాలా లజపతి రాయ్ పాల్గొన్నారు. విప్లవ సాహిత్య ప్రచారంలో శ్యాంజీ కృష్ణవర్మకు ఈమె సహాయకారిణి.

అమెరికాలోని కాలిఫోర్నియాలోగల విప్లవ వీరులందరిని మే 10, 1913న సమావేశపరచి, వారిలో నూతనోత్సాహాన్ని కలుగజేసిన ఘనత లాలా హరదయాళ్‌కి చెందుతుంది. ఇతడు 'గదర్' పత్రికను ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, బెంగాలీ, మరాఠీ, గుర్ముఖి భాషల్లో ప్రచురించి, ఉగ్రభావ జాతీయతను ప్రబోధించాడు. భారతీయులు నివసించే అన్ని దేశాలకు ఈ పత్రిక చేరేది.

బ్రిటిష్ శత్రువులతో చేతులు కలపి, బ్రిటిష్ వారిని భారతదేశం నుంచే తరిమివేసే యత్నాన్ని ఒకసారి గదర్ పార్టీ, మరోసారి సుభాష్‌చంద్ర బోస్ చేశారు. ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ తలమునకలైన పరిస్థితిని అవకాశంగా స్వాతంత్రోద్యమానికి అనుగుణంగా మలచుకోడానికి లాలా హరదయాళ్, నేతాజి జర్మనీ స్నేహాన్ని కోరారు. కాని ఈ ప్రణాళికలు విజయవంతం కాలేకపోయాయి.

భారత స్వాతంత్ర్యానికి సరిహద్దు లోపల, వెలుపల తీవ్రమైన జాతీయతా భావంతో కూడిన యత్నాలు సాగాయి. రాజ్యాంగబద్ధమైన ఉద్యమం, ఉగ్రవాద ఉద్యమం - రెండూ కూడా పాశ్చాత్య దేశాల నుండి గ్రహించిన విధానాలే.

## 23.6 అంతర్జాతీయ దృక్పథం

భారతదేశంలోని మేధో వర్గం పందొమ్మిదో శతాబ్దం నుండి అంతర్జాతీయ దృక్పథాన్ని అలవరచుకుని, ప్రపంచ విషయాలపై స్పందిస్తూ వచ్చింది. రాజా రామ్‌మోహన్ రాయ్ ఐరోపా, ఆసియా దేశాలపైనా అక్కడ జరుగుతున్న సంఘటనలపైనా తన, అభిప్రాయాలను తెలుపుతూనే వచ్చాడు. సమకాలీనులైన రామ్‌మోహన్ రాయ్ (1772-1833) రంజిత్ సింగ్ (1780-1839) లలో మొదటి వ్యక్తి ఆధునిక భారత నిర్మాతగా కీర్తింపబడగా, రెండో వ్యక్తి మధ్య యుగ సంస్కృతికి ప్రతీక అయ్యాడు.

ఐరోపా దేశాల సామ్రాజ్య వాదాన్ని ఆధ్యాత్మిక అధిక్యతా వాదంతో తిప్పికొట్టిన స్వామి వివేకానందుడు సామాజిక యదార్థ వాది కూడా. భారతదేశానికి మత సందేశం అవసరంలేదని, పేదరికంలో ఉన్న తన దేశానికి ద్రవ్య సహకారమే అవసరమని చాటాడు.

దూరదృష్టి, సునిశితత్వం, ఆర్థిక స్థితిని అంచనా వేయగల నేర్పుగల దాదాభాయి నౌరోజి ప్రముఖ అంతర్జాతీయ వాది. భారతీయ అవసరాలను బ్రిటిష్ పార్లమెంట్‌లో ఇతడు తెలియజేశాడు. భారతదేశంలో విదేశీ ప్రాబల్యాన్ని హేతుబద్ధ స్థాయికి తగ్గించేంతవరకు అక్కడ ఆరోగ్యవంతమైన ఆర్థిక వ్యవస్థ ప్రబలదని బ్రిటిష్ కామన్స్ సభలో నౌరోజీ ప్రకటించాడు. భారతదేశానికి ఇంగ్లండ్ శాంతిభద్రతల నిచ్చిందనే వాదాన్ని పదే పదే తెల్పే బదులు, స్వపరిపాలనకు అనుమతించి, బ్రిటిష్ పాలనను ఉపయోగకారిగా చేయమని కోరాడు.

ఇరవైయ్యో శతాబ్దంలోని మొదటి దశాబ్దంలో మేడం కామా, నౌరోజీ, ఎమ్.ఎన్.రాయ్‌లు అంతర్జాతీయ సోషలిస్ట్ కాంగ్రెస్‌లకు హాజరయ్యారు.

జాతి విద్వేషానికి అతీతంగా ఉండడం వల్ల జాతీయోద్యమం అందరి మన్ననలను పొందగలిగింది. బ్రిటిష్ సామ్రాజ్యతత్వాన్నే తప్ప బ్రిటిష్ వారిని ద్వేషించరాదని నౌరోజీ గోఖలేల నుండి గాంధీ, నెహ్రూల వరకు గల జాతీయ నాయకులు పదేపదే తెలిపేవారు.

ప్రత్యేక వ్యక్తులు విశాల భావాలు ఉండడం మాత్రమేగాక భారతదేశ విదేశాంగ విధాన రూపకల్పన కూడా స్వాతంత్ర్య పోరాట కాలంలోనే జరిగింది.

## 23.7 విదేశీ విధానం

జాతీయ కాంగ్రెస్ బ్రిటిష్ సామ్రాజ్యతత్వాన్ని వ్యతిరేకించింది. ఆసియా, ఆఫ్రికాల్లో విస్తరణకై బ్రిటన్ చేసే యుద్ధాలను, వానిలో భారతదేశాన్ని భాగస్వామిగా చేయడాన్ని జాతీయ వాదులు వ్యతిరేకించేవారు. రెండో ఆఫన్ యుద్ధాన్ని (1878-80), ఈజిప్ట్‌లో విప్లవాన్ని అణచడానికి భారతీయ సైన్యాన్ని పంపడాన్ని, బర్మా ఆక్రమణను భారతీయుల వ్యతిరేకించారు. గాంధీ 1922లో బర్మా ఆక్రమణపై తన అభిప్రాయాన్ని ఈ విధంగా తెలియజేశాడు. "బ్రిటిష్ ఇండియాలో బర్మా భాగమనే విషయం నాకు ఏమంత గర్వకారణం కాదు. ఎందుకంటే బర్మా వారికి ప్రత్యేకమైన నాగరికత ఉంది. ఇదివరకెప్పుడు అది మనలో భాగంకాదు. కాబట్టి ఇప్పుడూ కాకూడదు". కాంగ్రెస్ 1924లో బర్మాలో స్థిరపడ్డ భారతీయులనుద్దేశించి "బర్మా ప్రజలను నొప్పించే ప్రత్యేక హక్కులను ఏమీ కోరుకోవద్దని" సలహా ఇచ్చింది.

అలాగే చైనాలోని జాతీయ వాదులను అణచేందుకు భారతీయ సేనలను 1925లో పంపడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించి, 1927 నాటి మద్రాస్ కాంగ్రెస్ సదస్సులో అటువంటి పనికి వెళ్లవద్దని భారతీయులను కోరింది.

సామ్రాజ్యతత్వ వ్యతిరేకతను 1927లో మద్రాస్‌లో జరిగిన కాంగ్రెస్ సదస్సులో అధ్యక్షుడైన డాక్టర్ ఏ.ఏ. అన్సారీ ఈ విధంగా తెలిపారు. "కనికరం ముసుగులో ఐరోపావారు చేసిన దోపిడి చరిత్ర రక్తం, బాధలతో మిళితమై, కాంగో నుండి కాంటన్ వరకు లిఖించబడింది. భారతదేశం కనక స్వాతంత్ర్యాన్ని పొందితే, బ్రిటిష్ సామ్రాజ్యతత్వ సౌధం కుప్పకూలిపోతుంది. ఎందుకంటే ఆ సౌధం పునాదిరాయి ఈ దేశమే కాబట్టి", ఈ విధంగా సామ్రాజ్యతత్వాన్ని జాతీయ వాదులు వ్యతిరేకిస్తూ వచ్చారు.

జాతీయ కాంగ్రెస్ ఐర్లాండ్, టర్కీ, ఈజిప్ట్ ప్రజలు సాగించిన స్వాతంత్ర్య పోరాటాలకు మద్దతు నిచ్చింది.

జవహర్‌లాల్ నెహ్రూ 1926-27లలో ఐరోపా పర్యటించినప్పుడు వామపక్ష సభ్యులతోనూ, మేధావులతోనూ పరిచయాలేర్పడ్డాయి. "వలస అణచివేత సామ్రాజ్యతత్వం" అనే అంశంపై బ్రస్సెల్స్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో నెహ్రూ పాల్గొనడమేగాక, ఆయన సదస్సు గౌరవాధ్యక్షుల్లో ఒకరుగా ఎన్నుకోబడ్డారు.

అంతర్జాతీయ వాదంతో భారత జాతీయ వాదం ముడిపడి ఉందని ప్రకటించడమే గాక జవహర్‌లాల్ "సమీప భవిష్యత్తులో పెద్ద సమస్య బ్రిటిష్ సామ్రాజ్యతత్వం గాక అంతకంటే అధికమైన అమెరికా సామ్రాజ్య తత్వమని"పేర్కొన్నారు. నెహ్రూ మాత్రమే గాక గాంధీ కూడా ఈ విధానాన్ని అంగీకరించారు. నెహ్రూ సెప్టెంబర్ 1933లో రాసిన లేఖలో "అభ్యుదయకరమైన అంతర్జాతీయ తత్వానికి మన జాతీయతత్వం విరుద్ధం కాదనే విషయాన్ని మనం గుర్తించాలి. అందుచేత మీతోపాటు నేను కూడా చివర వరకూ ఉంటాను. మనం తప్పకుండా ప్రపంచంలోని అభ్యుదయ శక్తులు, వర్గాలతో కలిసి పనిచేద్దాం" అన్నారు.



BRAOU

సామ్రాజ్యతత్వ, జాత్యహంకార తత్వాల శిఖర భాగంగా ఫాసిజాన్ని జాతీయ కాంగ్రెస్ విమర్శించింది. లక్నోలో 1933లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో జవహర్‌లాల్ తన అధ్యక్షోపన్యాసంలో ప్రపంచం రెండు పెద్ద వర్గాలుగా చీలిందని, ఒకవైపు ఫాసిస్ట్ - సామ్రాజ్య వాద శక్తులు, మరోవైపు జాతీయోద్యమ సోషలిస్ట్ శక్తులు ఉన్నాయనీ, తప్పనిసరిగా భారతదేశం అభ్యుదయ శక్తులతోనే ఉండాలని ఉద్బోధించాడు. ఈ ప్రకటనకు కట్టుబడి జవహర్‌లాల్ 1937లో ఊరోపా పర్యటనలో ఇటలీ నియంత అయిన బెనిటో ముస్సోలినీ పంపిన అనేక ఆహ్వానాలను తిరస్కరించాడు. హిట్లర్ చర్యలను గాంధీ ఖండించాడు. "మానవత్వం పేరుతోగాని, మానవత్వం కోసంగాని, సమర్థించగలిగిన యుద్ధమంటూ ఉంటే, అది జర్మనీకి వ్యతిరేకంగా చేసే యుద్ధం మాత్రమే. ఎందుకంటే ఒక మొత్తం జాతిని అకారణంగా బాధించే దుస్థితి నుండి అది కాపాడుతుంది కాబట్టి" అని గాంధీ రాశారు.

ప్రజల అంగీకారం లేకుండా ప్రపంచ యుద్ధంలోకి భారతదేశాన్ని నెట్టవద్దని, బానిసత్వంలో ఉన్న భారతదేశం ఇతర దేశాల స్వాతంత్ర్యం కోసం పోరాడలేదని, కాబట్టి భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని ఇచ్చినట్లైతే ఈ దేశం కూడా ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే యుద్ధంతో తప్పనిసరిగా పాల్గొంటుందని జాతీయ నాయకులు తెలిపారు. కాని బ్రిటిష్ ప్రభుత్వం ఏకపక్షంగా భారతదేశం కూడా పాల్గొంటుందని ప్రకటించింది. అయినప్పటికీ, ప్రజా ఉద్యమం చేపట్టడానికి కాంగ్రెస్ సముఖంగా లేదు. ఎందుకంటే జాతీయ విషయాల్లో బ్రిటన్‌ని వ్యతిరేకించినా, అంతర్జాతీయ దృక్పథంలో ఫాసిస్ట్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్న బ్రిటిష్ వారిని భారతీయులు అభిమానించారు. అందుచేత ఇవ్వగల్గిన ప్రతి అవకాశాన్నీ బ్రిటిష్ ప్రభుత్వానికి ఇచ్చి, మూడు సంవత్సరాలు నిరీక్షించిన తర్వాత కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఆగ్నేయాసియాని బ్రిటిష్‌వారు రక్షించ లేకపోయినట్లే, భారతదేశాన్ని రక్షించలేరని భావించి, స్వేచ్ఛా భారతదేశమే జపాన్ దాడులను ప్రతిఘటించగలదని విశ్వసించింది. క్విట్ ఇండియా తీర్మానంలో నాయకులీవిధంగా పేర్కొన్నారు. "విదేశీ ఆక్రమణలో మగ్గుతున్న ఇతర ఆసియా దేశాలకు భారతదేశ స్వాతంత్ర్యం ఒక ఆశాకిరణం కావాలి. బర్మా, మలయా ఇండో - చైనా, డచ్, ఈస్ట్- ఇండీస్, ఇరాన్, ఇరాక్‌లు సంపూర్ణ స్వేచ్ఛను పొందాలి".

జపాన్ దేశం పట్ల భారత జాతీయ వాదులందరూ ఆసియా సౌభ్రాతృత్వాన్ని ప్రదర్శించారు. పాశ్చాత్య దేశాలకు ధీటుగా ఎదిగిన జపాన్ అభివృద్ధిని జాతీయ నాయకులు ప్రశంసించారు. రష్యాపై 1905లో జపాన్ సాధించిన విజయాన్ని ఘనంగా కీర్తించారు. రష్యన్ జార్‌ను ఓడించగల్గిన జపాన్ నుండి భారత జాతీయ వాదులు ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని పొందారు. జాతీయ పోరాట సమయాన సాంకేతిక నైపుణ్యం కొరకు అనేకులు జపాన్ దేశానికి వెళ్లి, విజ్ఞానాన్ని పొంది వచ్చేవారు.

జాతీయతా వాదులు, ముఖ్యంగా యువకులు రష్యా విప్లవం పట్ల ఆదరణను, ఆరాధనా భావాన్ని చూపారు. ప్రజాదరణలేని బలమైన రాజ్యాన్ని ప్రజాశక్తి ఎలా తోసివేయగలదో వారు ఈ విప్లవంలో చూశారు. నెహ్రూతో సహా 1920-30 మధ్య, అప్పుడప్పుడే ఆవిర్భవిస్తున్న సోషలిస్ట్, కమ్యూనిస్ట్ వర్గాలు, కిసాన్ సభలు, కార్మిక సంఘాలు, యువ మేథావులు రష్యాపట్ల ఆకర్షితులయ్యారు. సామ్రాజ్య వ్యతిరేకత, సామ్య వాద ఆదర్శాలు, ఫాసిస్ట్ వ్యతిరేకత, పంచవర్ష ప్రణాళికలు వారిని ఆకర్షించాయి.

ఈ విధంగా జాతీయోద్యమం నాటి విలువైన స్నేహం, స్వాతంత్ర్య పోరాటాలకు మద్దతు, సామ్రాజ్య తత్వ వ్యతిరేకత, నియంతృత్వ వ్యతిరేకత, ఆఫ్రికా - ఆసియా సౌభ్రాతృత్వం విదేశీ విధాన రూపకల్పనలో చేరి కొనసాగుతున్నాయి.

## 23.8 ఆర్థిక భావ జాలం

జాతీయ నాయకులు జాతీయోద్యమ పోరాట కాలంలోనే ఆర్థిక స్థితి విశ్లేషణచేసి ఏ దశలో ఉందో అంచనా వేశారు. పందొమ్మిదో శతాబ్దం చివర భాగంలో వలస విధానానికి గురైన ఆర్థిక వ్యవస్థను విశ్లేషణ చేసిన అనేకుల్లో నలుగురు ప్రముఖులు ఉన్నారు. వారు దాదాభాయి నౌరోజీ, మహాదేవ గోవింద రెనడే, రమేష్ చంద్ర దత్, జి.వి. జోషి. భారతీయ వనరుల సంపద ప్రవాహంలాగా బ్రిటన్‌కి తరలడాన్ని వీరు వివరించారు. ఆర్.సి. దత్ బ్రిటిష్ విధానాన్ని ఈ రకంగా వివరించాడు. "రాజు వసూలు చేసే పన్నులు సూర్యుడు భూమి నుండి తీసుకొనే ఆవిరి వంటివి. సూర్యుడు దాన్ని వర్షరూపంలో తిరిగి భూమికి ఇచ్చేసి, దాన్ని సారవంతం చేస్తాడు. కాని విశేషమేమంటే భారత భూమి నుండి తీసుకొనిపోయే ఆవిరి ఇప్పుడు భారత భూమిపై గాక, ఇతర దేశాల నేలలపై వర్షించి, వాటిని సారవంతం చేస్తోంది". ఈ విధంగానే నౌరోజీ ఆనాటి పరిస్థితులను స్పష్టంగా తెలిపారు. "కొడితే దయచేసి వీపు మీద కొట్టండిగాని, కడుపు మీద కొట్టకండి" అనే భారతీయ సామెత ఉంది. స్థానిక నియంత రాజుల పాలనలో ఒక్కొక్కప్పుడు వీపు మీద దెబ్బలు పడ్డా వారు ఉత్పత్తి చేసినదాన్ని వారు తినగలిగేవారు, అనుభవించగలిగేవారు. కాని బ్రిటిష్ నియంతృత్వ పాలనలో మాత్రం మనిషి శాంతంగానే జీవిస్తున్నాడు, ఎక్కడా హింసలేదు. కాని అతని బతుకు తెరువు మాత్రం సమూలంగా కబళించబడుతోంది. ఈ పని పైకి కనబడకుండా సున్నితంగా, శాంతి యుతంగా, నేర్పుగా జరుగుతోంది. ప్రశాంత వాతావరణంలో, శాంతి భద్రతల పరిరక్షణలో అతడు పస్తులుంటు న్నాడు. చివరకు ప్రశాంతంగానే శాశ్వత నిద్రలోకి జారుకుంటున్నాడు".

పారిశ్రామిక అభివృద్ధి గురించి, ప్రభుత్వరంగ పాత్ర గురించి కాంగ్రెస్ చర్చింప నారంభించింది. సుభాష్ చంద్ర బోస్ అధ్యక్షులుగా ఉన్నప్పుడే, 1938లోనే కాంగ్రెస్ జాతీయ ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేసింది. జవహర్‌లాల్ దీని అధ్యక్షుడు.

బాంబే ప్రణాళికను భారతీయ పెట్టుబడిదారులగు జె.ఆర్.డి. టాటా, ఘనశ్యాందాస్ బిర్లా, శ్రీరాంలు రూపొందించారు. దీనిలో భూసంస్కరణలు, విస్తృత ప్రభుత్వరంగ భారీ పరిశ్రమలు ఉన్నాయి.

కిసాన్ సభలు, కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీవారు, కమ్యూనిస్టులు, జవహర్‌లాల్ వంటి నాయకులు పేదలపట్ల మక్కువ చూపి, సామ్య వాదాన్ని ఆదరణీయం చేశారు. స్వదేశీ ఉద్యమం జాతీయ పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడింది. అనేక తృతీయ దేశాలకు పట్టిన రుణబాధ భారతదేశానికి లేకుండా జాతీయ వాదులు జాగ్రత్త వహించారు. పూర్తిగా స్వదేశీ వనరులపై ఆధారపడి, ఆర్థిక ప్రగతి సాధించడానికి ప్రయత్నం జరిగింది. జాతీయో ద్యమంతోపాటు, స్వదేశీ పెట్టుబడులు పెరిగాయి. భూ సంస్కరణలపట్ల ఆదర భావం పెరిగింది.

ఈ విధంగా జాతీయోద్యమ సమయంలో వ్యవసాయ సంస్కరణలు, పరిశ్రమల అభివృద్ధి, దేశీయ పెట్టుబడుల పెరుగుదల జరిగి, ప్రణాళికాబద్ధమైన ప్రగతికి బాట వేశాయి.

## 23.9 పాశ్చాత్యీకరణ

భారతదేశం బ్రిటిష్ పాలనలో పాశ్చాత్యీకరణ ద్వారా ఆధునికత వైపు పయనించసాగింది. బ్రిటిష్ వారు నూతన శాసనాలను, పరిపాలనా వ్యవస్థను, న్యాయస్థానాలను, విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, పాశ్చాత్యీకరణను ఆరంభించారు. పుస్తక ప్రచురణ, విద్యాధికుల సంఖ్య పెరగడం వల్ల ఆధునిక విజ్ఞానం భారతీయులకు అవగతం అయింది.

BRAOU

బ్రిటిష్ పాలనతో ప్రత్యక్ష సంబంధం స్థానికుల కుండే ప్రదేశాల్లో పాశ్చాత్యీకరణ త్వరలోనే ఆరంభమైంది. తోటలు పెంచే ప్రాంతాల్లోనూ, వాణిజ్య పంటలు పెంచే ప్రాంతాల్లోనూ, భారతీయ సైన్యాన్ని భర్తీ చేసే ప్రాంతాల్లోనూ మొదటిగా పాశ్చాత్యీకరణ ప్రవేశించింది. బ్రిటిష్ ఉన్నతాధికారుల ప్రభావం సమాజంలోని ఉన్నత వర్గాలపైనా, క్రైస్తవ మిషనరీల ప్రభావం మధ్య తరగతి పేద వర్గాల మీద అధికంగా ఉండేది.

పాశ్చాత్యీకరణ చెందడంలో ముందంజ వేసిన కులాల్లో ఈ కిందివి పేర్కొనదగినవి : చాలా ప్రాంతాల్లోని బ్రాహ్మణులు; ఉత్తర భారతదేశంలోని కాయస్తులు; బెంగాల్ లోని వైద్యులు; పశ్చిమ భారతదేశంలోని బనియాలు, పార్సీలు; కేరళలోని నాయర్లు, సిరియన్ క్రిష్టియన్లు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ భారతదేశంలోని కొన్ని ముస్లిం సమూహాలు; పంజాబ్‌లోని ఖత్రీ, అరోరాలు; మద్రాస్‌లోని చెట్టియార్లు; కేరళలోని ముస్లిం మాప్లాలు మొదలైనవారు. వీరంతా బ్రిటిష్ పరిపాలనా వ్యవస్థ వల్ల, వర్తక వ్యాపారాల వల్ల ప్రయోజనం పొందినవారు.

పాశ్చాత్యీకరణ వల్ల పారిశ్రామికీకరణ నగరీకరణలు ప్రవేశించి, భారతీయ సమాజాన్ని ఆధునికం చేయసాగాయి. విద్య, అధిక ఆదాయం నగరీకకణలు లౌకీకరణకు దోహదం చేసి కుల కాఠిన్యాన్ని తగ్గించ సాగాయి. భారతీయ సమాజంలోని అనేక కులాలు పాశ్చాత్యీకరణనుగాని, సంస్కృతీకరణను గాని అనుకరించి, కుల హోదాను పెంచుకునే యత్నాలు చేశాయి.

పునరుద్ధరణ వాదాన్ని ప్రబోధించిన ఆర్య సమాజ్, రామకృష్ణ మిషన్ కూడా ఆధునిక విద్యాసంస్థలను, వసతి గృహాలను నిర్మించడం ద్వారా పాశ్చాత్య విజ్ఞానాన్ని అభివృద్ధి చేశాయి.

పాశ్చాత్యీకరణ విద్యపైనా, నూతన విద్యావర్గం ఏర్పాటుపైనా, దైనందన జీవన రీతిపైనా, సంఘటితంగా తమ కోర్కెలను తెల్పుకోడం ద్వారానూ వ్యక్తమైంది.

## 23.10 సంగ్రహంగా

భారతీయులు నూతన భావాలను గ్రహించడంతోబాటు, విధాన రచనకు రూపకల్పన చేసుకున్నారు. వలస పాలన నుండి జాతీయత వరకూ, సాంప్రదాయం నుండి ఆధునికత వరకు భారతీయులు మార్పు చెందారు.

## 23.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. బ్రిటిష్ పాలనలో భారతీయులు పొందిన నూతన ఆలోచనా ధోరణులేవి?
2. భారత జాతీయ వాద పెరుగుదలను తెల్పండి.
3. అంతర్జాతీయ దృక్పథాన్ని భారతీయులు ఏ విధంగా అలవరచుకున్నారో తెల్పండి.

**II. కింది ప్రశ్నలకు వాటిపై వాఖ్యలను రాయండి.**

4. రష్యా ప్రభావం
5. లౌకికతత్వం
6. పాశ్చాత్యీకరణ

## 23.12 ఉపయుక్త గ్రంథాలు


Datta, K.K. : **Social History of Modern India.**

Bipin Chandra : **Epic Struggle**

శ్రీనివాస్, ఎమ్.ఎన్. : ఆధునిక భారతదేశంలో సామాజిక పరివర్తన

సీతారామశర్మ ఎన్.హెచ్. : ఆధునిక భారత రాజకీయ సామాజికతత్వ విచారణ



రచయిత్రి : ఆచార్య పి. రామలక్ష్మి



BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

## సామాజిక శాస్త్రాల విభాగం

## రెండవ సంవత్సరం

## పాఠ్య ప్రణాళిక

## కోర్స్ - 2 ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర


**ఖండం - I : 18వ శతాబ్దంలో భారతదేశ సామాజిక చరిత్ర**

భాగం - 1 : సామాజిక వ్యవస్థ

భాగం - 2 : మత వ్యవస్థ

భాగం - 3 : విద్యా వ్యవస్థ

**ఖండం - II : సైద్ధాంతిక ప్రభావం**

భాగం - 4 : ప్రాచ్య వాదం (Orientalism) ఇవాంజిలిజం (Evangelism) ఉపయోగితా వాదం (Utilitarianism)

భాగం - 5 : సామాజిక చట్టాలు

భాగం - 6 : విద్యాభివృద్ధి

భాగం - 7 : పత్రికా రంగ ప్రగతి

భాగం - 8 : సాంస్కృతిక, వైజ్ఞానిక అంతర్లీనతలు

**ఖండం - III : నూతన భావజాలం**

భాగం - 9 : హేతు వాదం (Rationalism)

భాగం - 10 : మానవతా వాదం (Humanism)

భాగం - 11 : ఉదార వాదం (Liberalism)

భాగం - 12 : ప్రత్యక్ష జ్ఞాన వాదం (Positivism)

భాగం - 13 : సార్వత్రిక వాదం (Universalism)

**ఖండం - IV : మత సంస్కరణలు**

భాగం - 14 : కార్యక్రమం, ప్రభావం, భావాలు

భాగం - 15 : ప్రాంతీయ భేదాలు, ఉద్యమాల సామాజిక పునాది

భాగం - 16 : సామాజిక ఇబ్బందులు, పునరుద్ధరణ, లౌకికత్వం

**ఖండం - V : సంఘ సంస్కరణలు**

భాగం - 17 : మహిళా విమోచన

భాగం - 18 : కుల ఉద్యమాలు

భాగం - 19 : అస్పృశ్యత

భాగం - 20 : సామాజిక దృష్టి

**ఖండం - VI : సామాజిక మార్పు**

భాగం - 21 : వ్యవస్థాగత మార్పులు

భాగం - 22 : సామాజిక సంస్థల మార్పులు

భాగం - 23 : భావజాలంలోని మార్పులు


BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కార్యక్రమం

### మాదిరి పరీక్షా పత్రం

### కోర్స్ - 2 ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర

సమయం : 3 గంటలు　　　　　　　　　　　　　　　　　　మార్కులు : 100

**భాగం - ఎ ( మార్కులు 4 × 15 = 60)**

**ఈ క్రింది ఎనిమిది ప్రశ్నల్లో ఏ నాలిగింటికైనా వ్యాసరూప సమాధానాలు రాయండి.　　ప్రతి ప్రశ్నకు 15 మార్కులు**

1. 18వ శతాబ్దంనాటి భారతదేశ మత పరిస్థితులను తెల్పి, భిన్న మతాల మధ్య నెలకొన్న సహనశీలతను పరిశీలించండి.
2. ప్రాచ్య వాదాన్ని వివరించి, భారతదేశ పునర్నిర్మాణంలో దాని ప్రభావాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించండి.
3. భారతదేశంలో దేశీయ పత్రికల ఆవిర్భావాన్ని తెల్పి, పత్రికా రంగంలో ఏర్పడిన వివిధ సంఘాల సిఫారసులను క్లుప్తంగా వివరించండి.
4. హేతు వాదం అంటే ఏమిటో పేర్కొని, ఆ భావ విస్తరణకు పాశ్చాత్య తత్వవేత్తల కృషిని అంచనా వేయండి.
5. ఉదార వాదం అంటే ఏమిటి ? దాన్ని ప్రభోదించిన ప్రముఖులు, వారి సిద్ధాంతాలను గూర్చి కూలంకషంగా చర్చించండి.
6. 19వ శతాబ్దంలో వివిధ మతాల్లో వచ్చిన సంఘ సంస్కరణ కార్యక్రమాలను పేర్కొన్ని, దాని పర్యవసానంగా కలిగిన ఇబ్బందులను విమర్శనాత్మకంగా విశ్లేషించండి.
7. బ్రిటిష్ పాలన ఫలితంగా భారతదేశంలో ఏర్పడ్డ నూతన సామాజిక వర్గాలను గూర్చి తెలియచేయండి.
8. ఆధునిక భారతదేశ సమాజంలో కుటుంబ, వివాహ వ్యవస్థల్లో వచ్చిన మార్పులను విమర్శనాత్మకంగా పరిశీలించండి.

BRAOU

**భాగం - బి (మార్కులు 5 × 8 40)**

**ఈ క్రింది ప్రశ్నల్లో ఏ ఐదింటికైనా లఘువ్యాఖ్యలను రాయండి.　　ప్రతి ప్రశ్నకు 8 మార్కులు**

9. భారతదేశంలో 18వ శతాబ్దం నాటి విద్యా వ్యవస్థ రూపురేఖలను వర్ణించండి.
10. 18వ శతాబ్దంలో మహిళోద్ధరణను ఉద్దేశించి చేసిన సామాజిక శాసనాలేవి ?
11. సామాజిక భాషా ప్రయుక్త చట్టం (Vernacular Press Act)
12. ఆగస్ట్ కాంట్ సామాజిక శాస్త్రాల అభివృద్ధికై ఏవిధంగా కృషి చేశాడు?
13. సాంస్కృతిక పునరుజ్జీవనం ఫలితంగా 19వ శతాబ్దపు భారత మేధావుల్లో కలిన సాంఘిక ఆలోచనలను పరిశీలించండి.
14. 'రాజా రామ్‌మోహన్ రాయ్ సార్వత్రిక విశ్వ భావనకు ప్రతీక'– వివరించండి.
15. నిరంకారీ, నామ్‌ధారీ ఉద్యమాలను గూర్చి మీకు తెలిసిందేమిటి ?
16. సత్యశోధక మండలి లక్ష్యాలు, కార్యక్రమాలను గూర్చి రాయండి.
17. ఆధునిక యుగంలో స్త్రీలలో వచ్చిన చైతన్యం, స్త్రీల ఉద్యమాలను సంగ్రహంగా సమీక్షించండి.
18. ఆధునిక భారతదేశంలో పాశ్చాత్యీకరణ గూర్చి చర్చించండి.

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కార్యక్రమం

## కోర్స్ - 2 ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర

### అభ్యాసం - 1

గమనికలు :
- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబునకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

### భాగం - ఎ

**I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. 18వ శతాబ్దం నాటి భారతదేశ సామాజిక వ్యవస్థలో కుల వ్యవస్థ పరిణామ క్రమాన్ని తెల్పి, సామాజిక వ్యవస్థపై దాని ప్రభావాన్ని అంచనా వేయండి.
2. ఆంగ్లేయ పాలన ప్రభావంగా భారతదేశ విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులెట్టివి ? ఈ మార్పులకై ఆంగ్లేయులు నియమించిన ప్రముఖ సంఘాలను, వాటి సిఫారసులను సంగ్రహంగా సమీక్షించండి.

### భాగం - బి

**II క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ఉపయోగితా వాదం అంటే ఏమిటి ? భారతదేశ చరిత్రపై దాని ప్రభావాన్ని చర్చించండి.
2. 18వ శతాబ్దంలో మహిళోద్ధరణనుద్దేశించి చేయబడిన సామాజిక శాసనాలను పరిశీలించండి.

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కార్యక్రమం

## కోర్స్ - 2 ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర

### అభ్యాసం - 2

గమనికలు :
- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబునకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

### భాగం - ఎ

I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. 19వ శతాబ్దంలో వచ్చిన భారతీయ పునరుజ్జీవన వైఖరులను పేర్కొని, సంస్కర్తలు చేసిన సేవలెట్టివో తెల్పండి.
2. ప్రత్యక్ష జ్ఞాన వాదమంటే ఏమిటి ? దీని అభివృద్ధి క్రమంలో ఆగస్ట్ కాంట్ చేసిన కృషిని అంచనా వేయండి.

B R A O U

### భాగం - బి

II క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. హేతు వాదం అంటే ఏమిటో తెల్పి, దీనిపై పాశ్చాత్య తత్వవేత్తలు చేసిన వివరణలను క్లుప్తంగా విశ్లేషించండి.
2. 19వ శతాబ్దంలో వచ్చిన భారతీయ పునరుజ్జీవన వైఖరులను సమీక్షించండి.

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కార్యక్రమం

## కోర్స్ - 2 ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర

### అభ్యాసం - 3

*గమనికలు :*
- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబునకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

### భాగం - ఎ

**I క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. దక్షిణ భారతదేశంలో కుల వ్యతిరేక ఉద్యమాల ప్రగతి, పరిణామ క్రమాన్ని సమీక్షించండి.
2. బ్రిటిష్ పాలనలో భారతదేశ సామాజిక వ్యవస్థలో నూతన సామాజిక వర్గాల ఆవిర్భావాన్ని, మార్పులను విశ్లేషించండి.

### భాగం - బి

**II క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. దళిత వర్గాలకు డా. బి. ఆర్. అంబేద్కర్ చేసిన సేవలను వర్ణించండి.
2. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారతీయుల్లో ప్రబలిన జాతీయ భావాల పెంపుదలను పరిశీలించండి.

BRAOU

BRAOU

BRAOU

BRAOU